H5333

కావ్యాలంకారసంగ్రహము

(నరసభూపాలీయము)

166

గ్రంథకర్త :

రామరాజభూషణుఁడు

వివరణకర్త :

శిరోమణి సన్నిధానము సూర్యనారాయణశాస్త్రి P. O. L.

Retired Sanskrit Lecturer

యం. శేషాచలం అండ్ కంపెనీ

మచిలీపట్టణం :: మద్రాసు :: సికింద్రాబాదు

1471

Rs. 22-50

ప్రథమముద్రణ ౧౯౫౮
Second Edition, Feb., 59
Third Edition, Nov., 65
Fourth Edition, Sept, 69
Fifth Edition, July, 76
ఆరవముద్రణ ౧౯౮౨

C-6310

AC 37467

All Rights Reserved

PRINTED AT
Murali Printers
Kanchar Bazar
SECUNDERABAD.

తొలిపలుకు

వైయాకరణాలంకారికశిరోమణి యగు శ్రీ సన్నిధానము సూర్యనారాయణశాస్త్రిలవారు సుప్రసిద్ధ కవిశిరోమణియుఁ బండితాలంకారమునని యాంధ్రభాషాలోకమునవెల్ల వెల్లడియయిన విషయమేగాని వేఱుగాదు. అనేకకవిపుంగవులచే నాస్వాదింపఁ బడి, వారి శిరఃకంపమునకు హేతువయిన వీరి కవితాస్రవంతి వివిధ ఘట్టములలో వివిధ సదస్సులలో వినుతికెక్కినది. ఆంధ్రభాషా పండితుల కసులభమును, సంస్కృత వైయాకరణులచేతను సాధ్యమని తలంపఁబడనిదియును నగు కౌముదీస్థసంస్కృత భాషా పద్ధతినంతను, తన్నామ చంద్రికారూపమున వెలయించి యాంధ్రభాషకు గొప్ప కొఱంతనుదీర్చి యాంధ్రదేశమున శ్రీ శాస్త్రిలవారు శాశ్వతమగు కీర్తిని గడించిరి ఇట్టి వీరినిఁ గవిపండిత శిరోమణిగానే దేశ మెఱుఁగును గాని యాలంకారిక రత్నమని యెఱుంగదు. నేటి శ్రీ శాస్త్రిలవారి యుద్యమమున నయ్యదియు సిద్ధమయ్యెను.

శ్రీ శాస్త్రిలవారు తమ యసాధారణ పరిశ్రమకును, అపూర్వ వివరణశక్తికని విశేషరంగముగా గ్రహించిన యాధారము కావ్యాలంకార సంగ్రహము ఇది యాంధ్రలోకమునఁ బ్రబంధ శిరోమణియగు వసుచరిత్రము రచించి కీర్తిగాంచిన రామరాజ భూషణునితో నభిన్నుఁడనఁబడిన భట్టుమూర్తిచే వ్రాయఁబడి పఠన పాఠనముల నపార ప్రచారము నందినది. వివరణకర్తయగు శ్రీ శాస్త్రిలవారు సుప్రసిద్ధులగు పండిత కవులని ముందే తెలిపితిని. ఇట్టి వీరి వివరణమునకు నా తొలిపలుకుగాని, పరిచయవాక్యము గాని యెట్టిదనఁగా స్వతఃప్రకాశమునకు దివ్వెవంటిది. అయినను మిత్ర కార్యమని యెంచి, నేను వ్రాయఁబోవునది యెల్లరకుగతార్థమే యైనను సార్థకముకాక తప్పదని భావించి, యిక్కార్యమున కంగీకరించితిని.

ప్రకృతవిషయమయిన శ్రీ శాస్త్రిలవారి వివరణమునకును దర్పణమయిన కావ్యాలంకార సంగ్రహమునకును

తెనుఁగున నెట్టి ప్రసక్తి గలదో ముందు వివరించి, యా పనిని వాని సంబంధమును, సార్థకతను గూర్చి విశదపఱచెదను. తెనుఁగునఁ బదునొకండవ శతాబ్దమువఱకును, నుత్తమగ్రంథ రచనయే లేదు. అంతకుఁ బూర్వమొక వేయేండ్లు, ఆర్య నాగరకతా ప్రవాహము సంస్కృత విజ్ఞానామృత రూపమునఁ దెనుఁగునాటఁ బ్రవహించి, తెనుఁగు నేలలో నింకి, యాంధ్ర సారస్వతరూపమున నన్నయ నోట వెలువడినది భారతము తెనుంగునఁ రచింపఁ బడిననాటినుండియు గవులకు, విమర్శకులకు, శాస్త్రజ్ఞులకు సంస్కృతభాషాఖనినిఁ ద్రవ్వి రత్నములఁ దెచ్చి, తెనుఁగువారి కర్పించుటయే కార్యమయినది. అట్టి రత్నజాతులలో నొకజాతిని వెదకి తెచ్చుటలోఁ బరిశ్రమచేసి పేరెన్నికగన్నవాడు బట్టుమూర్తి. సంస్కృతము నందలి యలంకార శాస్త్రము విశేష విమర్శయు, అపార విచారణయుఁ గలది. అందనేక ప్రతిభావంతు లనంతమయిన తమ శక్తి నుపయోగించి, మార్గముల నేర్పఱచిరి. అందు ముఖ్యముగాఁ బ్రతాపరుద్రీయ కారుఁడయిన విద్యానాథునిఁ జాలవఱకును బట్టుమూర్తి యనుసరించినట్లు స్పష్టము. భామహ, దండి, వామనాదుల స్వతంత్ర ప్రయత్నములచేఁ గ్రమక్రమ వికాసమును బొందిన యలంకార విమర్శావృతమును స్వప్రతిభా దోహదముచే ఫలింపఁ జేసినవాడు ఆనందవర్ధనుఁడు. అభినవగుప్తుని 'లోచన' సాహాయ్యమున సహృదయుల యాలోచనలకు సుగమమయిన యీ మార్గముననే రసగంగాధర కారుఁడయిన పండితరాయలు తన ప్రతిభా వ్యుత్పత్త్యభ్యాసములచే నిరంతరాయముగ విపశ్చిద్వర్యు లాశ్చర్యము గనునట్లనల్పకల్పనలఁ జూపించి మెప్పువడసెను. ఈ ప్రయత్నములను దెనుగునఁ దేటపఱచు పరిశ్రమయే యల్పముగా నున్నది.

ఇది యిట్లుండ, సుమారొక శతాబ్దమునుండి, యఖిల భారతావనినిఁ బాశ్చాత్యవిజ్ఞాన ప్రవాహము వెల్లివిరిసి ప్రవహించుచున్నది గంగా యమునా ప్రవాహములవలె నేఁ డేకీభూతమయిన సంస్కృతాంగ్ల విజ్ఞానముల కలయికవలన బయలుదేరిన పి. వి. కాణె ఎస్. కె. డే, మొదలయిన సంస్కృతాలంకారిక సిద్ధాంత విమర్శనా

ధురంధరుల గ్రంథరాజములును దద్జ్ఞులకుఁ బరిచితములయియున్నవి. ఇందలి విశేషములను దెలుఁగునకు సూఁచముట్టుగాఁ దెచ్చినవారు లేరు.

ఇట్టి సందర్భమున శ్రీ శాస్త్రిలవారు నయి రెండు విజ్ఞాన ప్రవాహములను దమలో నేకీభవింపఁజేసికొని, జహ్నుమహర్షివలె నీ వివరణ గంగాప్రవాహమును వెడలించి యాంధ్రుల కృతజ్ఞతకుఁ బాత్రులయిరి. ఇది యాలంకారిక విజ్ఞాన పిపాసువుల కమృతము. విమర్శ మార్గపరామర్శులకు జీవనము. పాఠక పాంథులకు నిరాఘాటమయిన సిద్ధాంత యాన శృంగాటకము. ఇట్టి సర్వంకషమయిన గ్రంథ మాంధ్రమున నింతకుమున్ను వెలువడియుండలేదు.

మూలగ్రంథము పద్యబంధమగుటఁ గొన్ని కొఱఁతలకు హేతువైనది. అవసరములేని పదములు, గణ యతి ప్రాసాది నిర్బంధమున రాకతప్పవు. అది శాస్త్రగ్రంథములకు నిగళమే గాని యలంకారముగాదు. ఆపయిని లక్షణములు అతివ్యాప్తి, యవ్యాప్తి మొదలగు దోషముల కాకరము లగుటకు హేతువొకటి కలదు. తనకుముందున్న యాలంకారికుల సిద్ధాంతము లన్నియును, తరువాతివారి విచారణలును దత్కర్తకు గతార్థము కాకుండుటయే యయ్యెది, తనతరువాతివారి రచనలను దాను చూచుట యసంభవము. తన పూర్వుల రచనలు తాను బరిశీలించుట సాధ్యమేయయ్యెను, నాఁటికిఁ బఠన పాఠనాదికమునను, గ్రంథప్రచారమునను గలిగిన సదుపాయ రాహిత్యమున, నతనివలన జరిగినట్లు తోఁపదు. మొత్తము మీఁద గ్రంథమునందు మాత్ర మీ రెండును సంభవములు కాలేదని స్పష్టపడక తప్పదు. అట్టి లోపములను బూరించుటకు శ్రీ శాస్త్రిలవారి రచన యుపకరించునని నా విశ్వాసము. అనేక స్థలములయందు మూలములోని దోషమును శ్రీ శాస్త్రిలవారు నిరూపించి యున్నారు. అంతమాత్రమున మూలమున వివరణకారునకు నిరాదరణ మని పాఠకులు తలంపరాదు. ఆ గ్రంథమునకు వివరణము వ్రాయఁబూనుటయే యిందలి శాస్త్రిలవారి యాదరణమును నిరూపించుచున్నది.

రసవిచారమునను, శబ్దశక్తి విషయమునను, ధ్వనిస్థాపనమునను నాయకస్వరూప నిరూపణమునను నొకచేల? ఎల్లప్రకరణములను శాస్త్రిగారి వివరణము సర్వవిషయ సంభరితము, సంపూర్ణము ఇట్టి వివరణమును వ్రాసి ప్రచురించినందుల కాంధ్రలోకము శ్రీ శాస్త్రిల వారిపట్ల నెంతయు ఋణపడినదనుట విశేషోక్తి కాదు.

ఇట్లు

గుంటూరు,
6-10-45

విద్వాన్ గంటి జోగిసోమయాజి, ఎం. ఏ. ఎల్. టి.
సంస్కృతాంధ్రభాషాధ్యాపకుఁడు (రీడరు)
ఆంధ్ర విశ్వకళాపరిషత్ కళాశాల

మఱి ప లు కు

శ్లో॥ (వ్యాసతు సతు గౌతమతు, వ్యాకేంద్రతు యస్యనాస్తి సాహిత్యం
తంప్రతి సంప్రతి కంప్రతి, శిరో మమ తిరశ్చ న పురశ్చ)

(జగన్నాథుఁడు)

ఈగ్రంథమునకు గ్రంథకర్త సేసిన నామకరణము 'కావ్యాలంకారసంగ్రహము' అని. నరసభూపాలునకంకితమగుటచే నరసభూపాలీయ మనియు లోక వ్యవహారము.

కావ్యమునందలి నాయికానాయకాదులు, రసభావాదులు, అలంకారాదులు మొదలగు విషయములను జర్చించుశాస్త్రమునకు 'అలంకారశాస్త్రము' అని సామాన్యవ్యవహారము, "శబ్దార్థయోర్యథావత్సహభావేన విద్యాసాహిత్య విద్యా" అని రాజశేఖరుఁడు పెక్కండ్రు పండితులు తమ గ్రంథమును "సాహిత్యపదాంకితము" గానే వ్యవహరించిరి (సాహిత్యదర్పణము, సాహిత్య రత్నాకరము సాహిత్యచింతామణి సాహిత్యసారము మొ). కొందఱలంకార శబ్దమునే యుపయోగించిరి. (భామహాలంకారము, రుద్రటాలంకారము, వాగ్భటాలంకారము మొ.) మఱికొందఱు "కావ్య" శబ్దమునే వాడిరి. (కావ్యప్రకాశము, కావ్యాదర్శము, కావ్యమీమాంస, కావ్యానుశాసనము, కావ్యాలోకము మొ.)

భాషకు ముఖ్యాంగములు రెండు. ముఖ్యాంగములనుటకన్న ముఖ్య ప్రాణములనుటయే లెస్స ఒకటి బహిఃప్రాణము; రెండవది యంతఃప్రాణము. అవి యేవన ౧ వ్యాకరణము ౨ సాహిత్యశాస్త్రము. మొదటిది శబ్దశుద్ధిని, రెండవది శబ్దార్థ రామణీయకమును బోధించును అసలిసాహిత్యశాస్త్రము వ్యాకరణశాస్త్రముయొక్క పుచ్ఛభూతమని సిద్ధాంతము మన కిచట రెండవదగు సాహిత్యశాస్త్రమును గుఱించియే ప్రసంగము.

సంస్కృతమున నీ సాహిత్యశాస్త్రముననున్న ముద్రితాముద్రితగ్రంథముల సంఖ్య ౮౬౨, అని 'కాణే' పండితుఁడు తన History of Sanskrit Poetics అను గ్రంథమునఁ దెలిపెను. ఇన్ని గ్రంథములు ప్రపంచములో నేభాషయందును సాహిత్యశాస్త్రమునఁ గానరావనుట సత్యదూరముగాదు.

మిగిలిన శాస్త్రములవలెనే సంస్కృతమున నీ సాహిత్యశాస్త్రముగూడఁ దర్కయుక్తిపరిష్కృతమై తదుపబృంహితమై యున్నది యథార్థమునకు హేతుబద్ధముగాని సిద్ధాంతమేదియు సికతాకూపమువలె నిలువదుగదా! కావునఁ బూర్వాచార్యులు తమ సిద్ధాంతస్థాపనకుఁ దర్కశాస్త్ర సాహాయ్య మపేక్షించిరి.

కావుననే మన భారతీయశాస్త్రము లన్నియు దర్క న్యాయములనునిమపపునాదుల మీఁద నిర్మింపఁబడిన వజ్రపుకోటలు. ప్రత్యల్ప విషయముగూడ హేతువాద బద్ధమై సామాన్యబుద్ధులకు గహనమై దుర్భేదమై యుండును దేనికేని లక్షణము సెప్పవలెనన్నచో నవ్యాప్తి అతివ్యాప్తి, అసంభవాదిదోషరహితముగా నుండ వలెను అట్టి నిర్వచనము తార్కికునకే సాధ్యమగును. తర్కవాసన గిట్టని వారికిని, నది లేనివారికిని నీ శాస్త్రము తలదిమ్ము గలిగించును. కావుననే డాక్టరు కట్టమంచి రామలింగారెడ్డిగారీ యలంకారశాస్త్రపరనమువలనఁ జమురుసష్టియ్యే కాని కవితసఁ బుష్టిలే' దని కవిత్వతత్త్వవిచారమునఁ బరిహసించిరి ఏదానినైన నామూలాగ్రముగా నభ్యసింపక యపహసించుట హాస్యాస్పదముగాదా! అలంకార శాస్త్రమును నపహసింపఁగల పాండిత్యము వారికున్నదేమో! నాకుఁ దెలియదు.

ఈ సాహిత్యశాస్త్రమునకుఁ బ్రమేయమేమి? ప్రమేయమనఁ బర్ణనీయ మగు విషయము. [The subject which is to be discussed]. విద్యానాథుఁడు స్థూలముగా నీ విధముగాఁ దెలిపియున్నాఁడు.

శ్లో॥ రసప్రధానా శ్శబ్దార్థాః గుణాలంకారవృత్తయః
రీతయశ్చేతి శాస్త్రప్రమేయం కావ్యపద్ధతిః.

రామరాజభూషణుఁడీ శ్లోకము నీ క్రింది విధమున ననువదించి యున్నాఁడు.

గీ అసదృశ రసప్రధాన శబ్దార్థములును,
రీతులును, వృత్తులును, నలంకృతులు, గుణము,
లాదియగు లక్షణంబుల నలరుఁగావ్య
సరణి యందురలంకారసారవిదులు.

(కావ్యాలంకారసంగ్రహము. ప్ర. ఆ ౨౦ పద్యము)

రసము, శబ్దార్థములు, రీతులు వృత్తులు అలంకారములు, గుణములు, అనునవి యీ సాహిత్యశాస్త్రప్రమేయము. అనఁగా నీ శాస్త్రమునఁ బర్ణనీయ ములగు విషయములివ్వి.

సూక్ష్మముగా విచారింప నిందలి యొక్కొక్క విషయము గూడ సముద్రమువలె నగాధమైనది ఎట్లన, రసమన నేమి? తదాశ్రయమేమి? సామాజికులు దాని నెట్లాస్వాదింతురు? కావ్యమున నది యెట్లు వ్యక్తమగును? రసము లెన్ని? అవి యెట్లు పుష్టములగును? శాంతము రసమా? భక్తిరసమా? భావమా? రసభావములకు భేదమేమి? వత్సలరస మనునది కలదు; శృంగార మొక్కటే రసము, శాంతమే రసము, కరుణమే రసము; రసాలంబనములగు నాయికా నాయక భేదప్రవిభేదములు.

శబ్దము లెన్ని విధములు ? వాని శక్తులగు అభిధా, లక్షణా, వ్యంజనా ప్రస్తావము; వ్యంజన యంగీకార్యమా ? కాదా ? అర్థభేదములెన్ని ? రీతి యన నేమి ? ఈరీతులకును రసములకునుగల సంబంధ బాంధవ్యములేమి ? అవి యెన్ని ? వృత్తులననేమి ? అవి యెన్ని ? అలంకారములన నేమి? అవియెన్ని ? వీని కన్నింటికిని బరస్పర భేదమేమి ?

కావ్యమన నేమి ? దానిలోఁ బై సుదాహృతవిషయములలో దేనికిఁ బ్రాధాన్యముండవలెను ? కావ్యశరీరమేమి ? కావ్యాత్మ యేది ? కావ్యభేదము లెవ్వి ? కావ్య ప్రయోజనము లెవ్వి ? కావ్యశాస్త్రములకుగల వైలక్షణ్యమేమి ? కవి యన నెవఁడు ? అతని సామగ్రియేమి ? కావ్యసౌందర్యము దేనివలనఁ గలుగును ? కావ్యరసాస్వాద మెట్లు గలుగును ? ఎట్టి కావ్య ముత్తమము ?

ఈ విషయములును వీనికి సంబంధించి బయలువెడలుచున్న యితరకావ్య సమస్యలను గూలంకషముగా హేతుబద్ధముగా, బూర్వపక్ష సిద్ధాంతపూర్వకముగా జల్లెడపట్టినట్లు సాహిత్యశాస్త్రము చర్చించును. అనఁగా నుత్తమ కావ్యత్వసిద్ధికి వలసిన విషయమునెల్ల మథించును. కవిత్వతత్త్వవిచారమన నిదియే. డాక్టరు రెడ్డిగారు దలంచినట్లీ శాస్త్రమున్మత్త ప్రలాపమువంటిది గాదు.

అయితే యొక ప్రశ్న యుత్థితమగుచున్నది ఈ విషయములను జర్చించుటకిన్ని గ్రంథములేల కావలయును? అని. నిజమే, లోకమున నేశాస్త్రము గాని యొక్కనాఁడే పెరిగి పెద్దదిగాదు. ఒకరొక సిద్ధాంతమును లేవదీయఁగా నది లోకమునఁ గొంతకాలము నలుగును దాని నవగాహనము సేసికొనుటకుఁ గొంతకాలము పట్టును అప్పుడు దాని కనుకూలముగానో ప్రతికూలముగానో వాదములు చెలరేఁగును. ఈ విధముగాఁ గ్రమక్రమముగా శాస్త్రము పెరుగును ఈ క్రమమున మన సాహిత్యగ్రంథములలోఁ గొన్ని కొన్ని క్రొత్త సిద్ధాంతములను స్థాపించినవి గలవు భరతుని నాట్యశాస్త్రము, భామహాలంకారము, కావ్యాదర్శము, వామనకావ్యాలంకారసంగ్రహము, ధ్వన్యాలోకము (దీనివ్యాఖ్య - లోచనము) వక్రోక్తిజీవితము, వ్యక్తివివేకము, ఔచిత్యవిచారచర్చ అనునవి నూతనసిద్ధాంత స్థాపకగ్రంథములు అనఁగా నివి వాదగ్రంథములు. మిగిలినవానిలో బెక్కు గ్రంథము లీ వాదగ్రంథబృందముయొక్క సంగ్రహములే (Text Books); వీనికి మఱలఁబెక్కు వ్యాఖ్యానములు. (ఒక కావ్యప్రకాశమునకే ౭౦ వ్యాఖ్యలు గలవు) కొన్ని రూపకముల గుఱించియు గొన్ని రసముల గుఱించియుఁ, గొన్ని శబ్దవృత్తులను గూర్చియుఁ గొన్ని నాయికానాయకాదులను గూర్చియుఁ గొన్ని యలంకారముల గూర్చియు జర్చించెను. మొత్తముమీఁద సంగ్రహ గ్రంథములే పెక్కుగలవు అటనటఁబూర్వసిద్ధాంతఖండనరూపమగు కొంత

క్రొత్తదనము సిద్ధాంతములలో, విషయవిభాగాదులలోఁ గానవచ్చుచున్నను నన్నియుఁ గోడీకరణములే. ఒక దానికొకటి ప్రతిబింబములే. పిష్టపేషణ ప్రాయములే

ఈ పరంపరలోఁ బ్రథమశతాబ్దినుండి తొమ్మిదవ శతాబ్దివఱకు ననఁగా భరతుఁడు దొట్టి యానందవర్ధనునిదాక బయలువెడలిన రస అలంకార గుణ, రీతి ధ్వనిసిద్ధాంతములను గ్రోడీకరించి ప్రకరణవిభాగముసేసి తొలుదొల్త సంగ్రహరూపమున రచించినవాఁడు మమ్మటుఁడు (క్రీ శ. ౧౧౦౦) అదియే కావ్యప్రకాశము. రమారమి యీతని సమకాలికుఁడగు హేమచంద్రుఁడు (క్రీ.శ. ౧౦౮౮-౧౧౭౨) కూడ నిదే పద్ధతిగాఁ గావ్యానుశాసనమను మఱొక సంగ్రహ గ్రంథమును విరచించెను తరువాత నంతకన్న విపులముగా మఱికొన్ని కావ్య విషయములను గూడఁ దేర్చి విశ్వనాథపంచాననుఁడు (౧౪ శతాబ్ది) సాహిత్య దర్పణమును రచించెను. దృశ్య శ్రవ్యవిషయములను నాకాలమునఁగలవానిని జాల సమగ్రముగానే యాతఁడు సంగ్రహించెను ఈతని సమకాలికుఁడే యనఁదగిన విద్యానాథుఁడు ప్రతాపరుద్రీయమును విరచించెను. ప్రతాపరుద్రీయము సంగ్రహములలో సమ్మగహము ఈ కావ్యాలంకారసంగ్రహ మా *ప్రతాప రుద్రీయమునకు సంగ్రహరూపమగు ననువాదమని చెప్పవచ్చును ఏలన, నందలి నాటకప్రకరణమిందు లేదు శృంగారేతర రసప్రసంగములేదు. మిగిలిన ప్రకరణములందుఁ గూడఁ గొంత కొంత విషయమును గ్రంథకర్త వదిలివేసెను.

ఈ సంగ్రహగ్రంథములలో వాగ్భటకావ్యానుశాసనము (౧౨వ శతాబ్ది) హేమచంద్ర కావ్యానుశాసన వ్యాఖ్య, కేశవమిశ్రుని (౧౬వ శతాబ్ది) అలంకార శేఖరము మొదలగు గ్రంథములలో సాహిత్యదర్పణమునఁ జేరని, చేర్పఁదగిన, చేర్చినచో సమగ్రతను గలిగించు కావ్యవిషయములు గొన్ని సేకరింపఁబడి యున్నవి. సాహిత్యదర్పణమునకుఁ బిమ్మట వెలువడిన యే యితర సంగ్రహ

---

* కొందఱిది ప్రతాపరుద్రీయమునకుఁ బ్రతిబింబము కాదనియు స్వతంత్ర గ్రంథమే యనియును జెప్పుదురు దీనికిఁ గారణము వారు చెప్పునదేమనఁగా బిట్టుమూర్తి కంతో కితో నా విధముగాఁ దెలుపలేదని. ఇదిపెద్ద కారణము కాదు గదా సంస్కృతమున సుముకృష్ణయజ్వ రచితమగు నరసభూపాలీయము గలదని శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు 1939 ఫిబ్రవరి భారతిలో వ్రాసిరి. అందు సంస్కృతనరసభూపాలీయమున నేత్రోల్లాసములు గలవఁట. అందాఁకే లభించె నఁట ఆంధ్రనరసభూపాలీయముకన్న సంస్కృత నరసభూపాలీయము ముందు రచింపఁబడెనని శ్రీకవిగారు లిఖించిరి. అయిన నాంధ్రనరసభూపాలీయము దాని కనువాదముగాక రెండును ప్రతాపరుద్రీయమునకుఁ బ్రతిబింబములే యనియు వ్రాసిరి.

గ్రంథమునను నవి చేర్పఁబడలేదు. కావున సంస్కృతమునఁ గూడ సాహిత్య దర్పణముకన్న సర్వకావ్య విషయసంపూర్ణమగు సంగ్రహగ్రంథము లేదనియే చెప్పవచ్చును

ఉన్నవానిలో సాహిత్యదర్పణమే మేలైనది ప్రతాపరుద్రీయము నాంధ్రుఁడు రచించినాఁడనియు ఆంధ్రప్రభువునకంకితమనియు నాతని సంస్కృతకవిత్వము రసవంతమైనదనియు హర్షింపవలసినదే కాని విషయపుష్టి లేక నిదాఘనదీపూరముపలె సన్నగిల్లియున్నది అది సంగ్రహములలో సంగ్రహమని తెలిపితినిగదా ! అందు నాయికాభేదములగు ధీరా, అధీరాది భేదములును, రసదోషములును అర్థనిర్ణాయక సామగ్రియుఁ గవిసమయములును ముఖ్యములయిన కావ్యభేదములును సంగ్రహింపఁబడవయ్యెను ఈ విధముగా నిది యసమగ్రతమమగు గ్రంథము

సంస్కృతముననే యిట్లుండ నాంధ్రాలంకార గ్రంథములను గూర్చి వ్రాయనేల ? ఆంధ్రమునఁ గల యలంకారగ్రంథములు ప్రాచీనార్వాచీనములు 31. ఇందొక్కదానియందును సర్వాలంకారవిషయసామగ్రి లేదు సరిగదా ! మీఁదు మిక్కిలి కొన్ని ప్రాచీనగ్రంథములు దోషభూయిష్ఠములు లక్ష్యములకును లక్షణములకును పొత్తులేదు లక్షణములన్నియు నవ్యాప్త్యాది దోషజుష్టములే. వీనికిఁ దోడుగా నపపాఠములు ఈ యున్న గ్రంథములలోఁ గావ్యాలంకార చూడామణి, నరసభూపాలీయములు విశ్వవిద్యాలయపరీక్షలకుఁ బాఠ్యములు. ఈ గ్రంథకర్తల కలంకారశాస్త్రమునఁ గూలంకషమగు ప్రజ్ఞ లేదన్నట్లు వారి గ్రంథములే సాక్ష్యమిచ్చుచున్నవి అట్టి గ్రంథములవలన విద్యార్థుల కెంత యలంకారశాస్త్రజ్ఞానము లభించును ?

కావునఁ నాంధ్రభాషలోఁ దుదికి సాహిత్యదర్పణమువంటి నిర్దుష్టమగు సాహిత్యశాస్త్ర గ్రంథమని చెప్పఁదగిన దేదియులేదు అట్టి గ్రంథ మొకటి యవశ్యమైయున్నది శ్రీ వేదము వేంకటరాయశాస్త్రిగారి యాంధ్ర సాహిత్య దర్పణముకన్న సంస్కృత సాహిత్యదర్పణమే విద్యార్థులకు సుబోధమని నా తలంపు.

ఆంధ్రీకృతగ్రంథములు స్వతంత్రగ్రంథములవలె కడుంగడు సులభములై యుండవలెను లోకమున సంస్కృత గ్రంథములను బాఠముసెప్పు పండితులును వానిని గురుముఖమునఁ జదువుకొను విద్యార్థులును నుందురు గురుముఖమున సర్వసంశయములు నివారింపఁబడుచుండును. ఈ యాంధ్రీకృత గ్రంథములను పాఠము జెప్పువారును వారికడఁ జదువుకొనువారును నరుదే కాన విద్యార్థులకు గుర్వపేక్షలేకయే తెలిసికొనఁదగిన విధమున సంస్కృతశాస్త్రగ్రంథముల ననువదింపవలెను. అంతేకాని యవి వివరణాంతరాపేక్షములై యుండరాదు.

నవరసగంగాధరము, ఆంధ్రధ్వన్యాలోకము అనునవి గొప్ప శాస్త్రవాద గ్రంథములు వాని నాంగ్రీకరించిన వారును నుద్దండులగు పండితులు కాని యవి ప్రారంభకుల కుద్దిష్టములు గావు వానిని మొదలనే చదువఁ బూనినచో వ్యాకరణశాస్త్రమున సిద్ధాంతకౌముదిఁ జదువక మహాభాష్యము నారంభించి నట్లుండును

ఈ విధముగా నే గ్రంథముగూడ సుబోధముగాఁగానీ సంపూర్ణముగాఁ గానీ లేదు కావున నిర్దుష్టములయిన లక్ష్యలక్షణములతో సాహిత్యదర్పణము కన్నను విషయసమృద్ధితో సర్వసాహిత్యవిషయము ను గ్రోడీకరించి యాంగ్ల సిద్ధాంతములనుగూడ జతపఱచి విద్యార్థులు స్వతంత్రముగాఁ దెలిసికొనఁదగినంత సులభముగా నొక సంగ్రహగ్రంథమును వ్రాసినచో భాషకుఁ జాల మేలబ్బును. అట్టిది మిక్కిలి యవశ్యమై యున్నది.

కాని యీ పనినిఁ గావించువారెవరు ? కావించినను హర్షించు వారెవరు ? దానిని లోకమెంత యుపయోగించుకొనును ? శ్రమించి యట్టిగ్రంథమును వ్రాసి యెట్లో కష్టించి ముద్రించుకొని " విద్వానేవ విజానాతి విద్వజ్జన పరిశ్రమం " అనుకొని తమ కృషికి హర్షింతురని తపాలావ్యయమునుభరించి యభిప్రాయార్థ మంపఁగాఁ గొందఱు దాము మహనీయులయినట్లు బంపినవారల్పులయినట్లును భావించుకొని, యందినట్లైనను దమ గౌరవమునకు భంగము వచ్చుననికాఁబోలు వ్రాయరు. తపాలాబిళ్ళలుపెట్టి జాబులు వ్రాసినను వానిని మ్రింగుదురు కాని ప్రత్యుత్తరింపరు. పదవీ వేతనాదులవలన లభించిన పండితమ్మన్యత్వమును నిర్లక్ష్యభావమును వారిలో వేఱుదన్ని యున్నవి పండితులు గ్రంథములను బంపి తమ్ము గౌరవించినందులకుఁ బ్రత్యుత్తరపూర్వకముగా వారిని గౌరవింప వలయుననితలంపరు చిలుక తన ముద్దునే కోరును కాని యెదుటివారిముద్దును గోరదఁట వారు సకలకగ్రాసనాధిపత్యమును వహించి బల్లగ్రుద్దుచు శాస్త్ర గ్రంథములు మన భాషకుఁ గావలె నని ఘోషింతురు తాము వ్రాయరు సోదరవిద్వాంసులు వ్రాసిన వానినిఁ జూడరు వారిని గౌరవింపరు ఈ విషయ మంతయును నా యనుభవము

నూతనముగా లక్ష్యలక్షణములను సృష్టించి వ్రాయుటకన్న దోష భూయిష్ఠమైయున్నను <u>గ్రావ్యాలంకారసంగ్రహము</u> నందలి దోషములు చూపుచు, సంస్కృత గ్రంథములనుండి నిర్దుష్టములయిన లక్ష్యలక్షణముల నుదాహరించుచు సంస్కృత సాహిత్యగ్రంథములలో నున్న సర్వవిషయములను సంగ్రహముగా నాయాస్థలములందుఁ జేర్చుచు వివరణము ను వ్రాసినచో లెస్సయని తోఁచినది దీనివలన నిందలి దోషములును నిర్దుష్ట లక్ష్య లక్షణములును గ్రొత్తవిషయములును దెలియును కేవలము నూతనగ్రంథమే

యగుచో నరసభూపాలీయదోషము లట్లేమిగిలియుండును. లోకమున కవి-తెలియకయే యుండును మఱొకరైనను దానికి వివరణమో టీకయో వ్రాయవలసియే యున్నది ఉదాహరణప్రత్యుదాహరణములచే సూత్రార్థము సుస్పష్టమగు విధమున నీ గ్రంథ దోషముల నెఱిఁగి సాధువులయిన లక్ష్యలక్షణములను దెలిసి కొన్నచో విద్యార్థుల కెంతేని మేలగును గదా మఱియు మన భారతీయసిద్ధాంతములతోపాటు పాశ్చాత్యసాహిత్య సిద్ధాంతములను గూడఁ జేర్చినచో సముచితమని యెంచి, నా కుపలబ్ధములయినవాని నిందుఁ జేర్చుకొంటిని.

నేనును నిందు నాటక ప్రకరణమును వ్రాయలేదు. ఏలన సాహిత్య దర్పణ ప్రతాపరుద్రీయములందలి నాటక ప్రకరణములు చిన్నవి ఇప్పుడు పాశ్చాత్యనాటకములు గూడ వచ్చినవి కావునఁ పాశ్చాత్య భారతీయ నాటక లక్షణములను జర్చించుచుఁ బ్రత్యేకముగా 'రూపక మీమాంస' అను పేర నొక గ్రంథమును వ్రాయవలెనని యభిలాష గలదు కాని యారోగ్యము సరిగాలేదు అనారోగ్య స్థితిలో నుండియే దీని నెట్లో ముగించితిని. భగవంతుఁడు నా కాయువును ఆరోగ్యమును బ్రసాదించినచో దానినిఁ గూడ రచించి వాగ్దేవి నారాధింతును.

పాశ్చాత్యసాహిత్యకారు లెవ్వరును మన సాహిత్యకారులవలె సాహిత్య దర్పణాదులవంటి యా యావిషయవిభాగములుగల సంగ్రహగ్రంథములను వ్రాయలేదు కొందఱే కవికావ్యమును గుఱించియో విమర్శించుచు నడుమనడుమ శైలినిఁగూర్చియో నాయకునిఁ గూర్చియో లేక రసమును గుఱించియో యలఁతిగాఁ దడవుచుఁబోవుదురు అంతేకాని యింత కూలంకషముగా హేతువాద పురస్సరముగా శాస్త్రీయపద్ధతితోఁ (Scientific treatment) బ్రతివిషయమును జర్చించుచు నెల్ల విషయములను సంగ్రహముగా నొకచో విద్యార్థుల కందుబాటుగా నుండు సాహిత్యగ్రంథములను విరచింపరైరి. కావున పాశ్చాత్యుల సిద్ధాంతము లన్నియు మనము సంగ్రహముగా నొక్కచోఁ దెలిసి కొనఁజాలము నేను బెద్దలవలన విన్నదానినిఁబట్టి పాశ్చాత్యసాహిత్య గ్రంథములలో శబ్దశక్తివిచారము, నాయికానాయకచర్చలు రసభావాదివిచారము గుణదోషవివేకము మొదలగునవి కానరావు వారి సాహిత్య విమర్శనము ఫ్రాఁత మెఱుఁగే

ఈ గ్రంథమును వ్రాయుపట్ల నాకుఁగలిగిన పెక్కు సంశయములను దీర్చి నాకుఁ దీఱరాని సాహాయ్య మొనర్చిన, నా సాహిత్యశాస్త్ర గురువులగు శ్రీమాన్ శిరోమణి వేదాల తిరువేంగళాచార్యులవారికినిఁ దాము సేకరించిన గేయవాఙ్మయము నందలి కావ్యభేదములను దయతో నాకొసఁగిన శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారికిని ఉదాహరణ కావ్యమును గుఱించి వ్రాయుపట్ల నాకు

సంగీతశాస్త్ర విషయమును దెలిపిన శ్రీ పుద్గా సుబ్రహ్మణ్య శాస్త్రిగారికిని, నీ గ్రంథము యొక్క వ్రాతప్రతిని నామూలాగ్రముగాఁ జూచి యామోదమును వెల్లడించి నాకుఁ బ్రోత్సాహ మొసంగిన మిత్రులు కిరి శేషులు బిదురు వేంకట శేషయ్య గారికిని నా కృతజ్ఞతాపూర్వక వందనములు మఱియుఁ బెక్కు సంస్కృత ఆంగ్ల గ్రంథములను నే నీ గ్రంథరచన కుపయోగించుకొంటిని ఆ గ్రంథకర్తలకును గృతజ్ఞుఁడను

వివరణ పద్ధతి

ఇందుఁ బ్రతిపదార్థమును వ్రాయఁదలంపలేదు పద్యములకుఁదాత్పర్యమును వ్రాసితిని ప్రతిపదార్థమును వ్రాసినచో నింక నిమ్మడియో ముమ్మడియో గ్రంథము పెరిగెడిది నాందీప్రభృతివంశచరిత్రాంతము గల పద్యములకును ఆశ్వాసాంత పద్యములకును బంధ గర్భ పద్యములకును దాత్పర్యములు గూడ వ్రాయలేదు. ఏలన వాని యుపయోగము శూన్యము. కాని యచట వలసిన శాస్త్ర సమన్వయ రూపమగు వివరణమును వ్రాసితిని

ఈ కావ్యాలంకార సంగ్రహమునకు మూఁడు మాతృకలు గలవు అవి కాకినాడలో ఆంధ్రసాహిత్య పరిషత్కార్యాలయమునఁ గలవు అందలి పాఠాంతరములను దెప్పించుకొని తదనుసారముగా మాతృకను సంస్కరించుకొంటిని

దీనియందలి నాయక రసప్రకరణములకు మాత్రమే శ్రీ. శే వెల్లాల సదాశివశాస్త్రి గారు (జటప్రోలు సంస్థానమున పండితులు) పూర్వమొక వ్యాఖ్యను రచించిరి వారు గ్రంథకర్త సేసిన దోషములనే విశేషించి చూపిరి అందుఁ జేర్పదగిన విషయములు చేర్పలేదు వింజమూరి కృష్ణమాచార్యులవారు శబ్దరత్నాకరకర్త బహుజనపల్లి సీతారామాచార్యుల వారును గలిసి ప్రచురించిన యొక టిప్పిక గలదు ఇవి రెండును నాకు విశేషించి యుపయోగపడలేదు. పాఠభేదములను సవరించుకొనుటకు మాత్రమే యలఁతిగాఁ దోడ్పడినవి. వారికినిఁ గృతజ్ఞుఁడను

'దృష్టం కిమపి లోకేఽస్మిన్ న నిర్దోషం న నిర్గుణం' అనెకథా యభియుక్తోక్తి కావున నుదారహృదయులగు విద్వాంసులు దీనియందలి దోషములను సుహృద్భావముతోఁ దెలిపినచో సంస్కరించుకొందునని సప్రశ్రయముగా మనవి సేయుచున్నాను

గ్రంథకర్తృచరిత్ర

ఈ గ్రంథకర్తయగు బట్టుమూర్తి బాలకవిగానుండియే శ్రీకృష్ణదేవరాయల వారి యష్టదిగ్గజములలో నొకఁడై క్రమక్రమముగా నతని యల్లుఁడగు

అళియరామరాజునకు మేనల్లుఁడగు * నరసరాజు నాశ్రయించి యాతని కీ కావ్యాలంకార సంగ్రహమును గృతియిచ్చి, యతని యాశ్రయమువలననే సభ కెక్కి రామరాజభూషణ బిరుదమునొంది తల్లికోట యుద్ధములో రామరాజు కీర్తిశేషుఁడుకాఁగా నాతని తమ్ముఁడగు తిరుమల దేవరాయల నాశ్రయించి వసుచరిత్ర మాతనికిఁ గృతియిచ్చి; పిమ్మట శ్రీరామచంద్రుని కంకితముగా హరిశ్చంద్ర నలోపాఖ్యానమునుగూడ రచించెననియు క్రీ శ ౧౫౧౦ మొదలు ౧౫౮౦ వఱకాతఁడు జీవించెననియు నీతఁడల్లసాని పెద్దన్నకుశిష్యుఁడనియును సంగీతశాస్త్ర పండితుఁడును అవధానతంత్రాది చతుర్విధ కవితాధురంధరుఁడు ననియు భట్టుమూర్తియు రామరాజభూషణుఁడు భిన్నులా ? ఒక్కరా ? అను వాదమును ఖండించి యొక్కరే యనియును నీ మొదలగు విషయములను శ్రీవజ్ఝల చినసీతారామశాస్త్రిగారు వసుచరిత్రవిమర్శన హరిశ్చంద్ర నలోపాఖ్యాన పీఠికలలోను, తంజనగరము తేవప్పెరుమాళ్ళయ్యగారు వసుచరిత్ర పీఠికలలోను రావుబహద్దరు కందుకూరి వీరేశలింగము పంతులుగారు ఆంధ్ర కవుల చరిత్రలోను లిఖించిరి. అంతకన్న విస్తరించి యిట వ్రాయనక్కఱ పట్టదు.

కృతిపతి చరిత్రము

ఈ నరసరాజు కౌశిక గోత్ర సంభవుఁడు (గీ వసుధఁ గౌశికగోత్ర పావనుఁడ వైన నీక తగుఁగాక. ౪ ఆ ౬౫ ప) ఇంటిపేరు తొరగంటి వారు (తొరగంటి నరసభూప!) ఇతని వంశపురుషుఁడు పోచిరాజు (పోచిరాజు నరసేంద్రుఁడు) విష్ణుభక్తుఁడు (నారాయణ చరణార్చన). తండ్రి ఓబుళుఁడు; తల్లి లక్కాంబ

సామాన్యముగాఁ గృతికర్తలు కృతిభర్తల శౌర్య ధైర్య, సాహసౌదార్యములను మిన్నుముట్టునట్లు వర్ణింతురు. అట్లే యీతఁడును వర్ణించెను. కాని యీతని చరిత్రలో రెండంశములు విచిత్రములయినవి గలవు అవి ఇవి --

౧ నరసభూపాలుఁడు మత్స్యయంత్రమును గొట్టినాఁడు

గీ. నరసభూభర్త మత్స్యయంత్రంబు నేయ (ద్వి ఆ ౧౧౬ ప)

---

* సంస్కృత నరసభూపాలీయ కృతిపతి గొబ్బూరి నరసరాజు ఇతఁడు అయ్యలరాజు రామభద్రునిచే రామాభ్యుదయము నంకితము గొనెను. ఆంధ్ర నరసభూపాలీయ కృతిపతియగు నరసరాజును గొబ్బూరి నరసరాజును పిన తండ్రి కుమారులని చెప్పుదురు.

మ సలిలంబ్యాయగుణించి యంత్రకృత మత్స్యంబీ నృసింహ క్షమా
తలనాథాగ్రణి యేయ ... (ద్వి. ఆ. ౧౨౭ ప)

గీ యంత్రమీనంబుఁ దునుమాడినట్లు దునుము. (ద్వి. ఆ. ౧౨౪ ప)

సీ శరవేగములు లేవె ? చలయంత్రపాఠీన
శాసనప్రౌఢికిఁ జనవుగాక. (౪ ఆ. ౬౪ ప)

౨. నదీప్రవాహమును ద్రిప్పినాఁడు

సీ వన్నెకెక్కిన దేవవాహిని సాటిగా
నిలయెల్ల యేఱుల నిరవుకొల్పి.

సీ అల యనాది ప్రవాహములైన యేర్ల వం
కలఁదిద్దునే వివేకంబు కలిమి ?

సీ. సామర్థ్యములులేవె సరిదన్యపథయాన
శాసన ప్రౌఢికిఁ జనవుగాక.

ఈతనికి ధీరోత్తమగండ ఉభయరగండ గండభేరుండ బిరుదములు గలవు (౫ఆ. ౧౬౭ ప.)

౩ ఈతడుఁ దురుష్కుల నోడించి హిందూరాజ్యము నిలిపెను.

సీ అలిబూతఖానమల్కావిష్కృతాయశో
ధ్వాంతసంతతికాత్మ సంతసిల్లి (౨ఆ. ౨౦ ప)

చ. అదెయిదె వచ్చెవచ్చె నరసాధిపు దాడి యటంచుఁ బాశెమూల్
బెదరి బరీదుఁడేగునెడ... (౨ఆ. ౧౨ ప)

శా. మక్షామండువ భయదదోర్మాహాత్మ్య (౫ఆ. ౨౪౩ ప.)

శా. .. హిందూరాజ్య సంస్థాపనా ! (౫ఆ ౨౪౩ ప)

౪. మఱియుఁ గటక దేశాధిపతియగు అశ్వపతికితఁడన్న భయము

కం కటకాధిరాజహయపతి సేనాభీకర, (౪ఆ. ౧ప.)

౫. ఇతనికి భారవికవిత్వమునఁ బ్రీతిగలదు.

భారవికవి ప్రౌఢోక్తి సంచార (౨ఆ. ౧౭౪ ప.)

మొదటినుండియు నాంధ్రభాష కత్యవశ్యములును పూర్వవిద్వాంసులు స్పృశింపనిదియు నగు గ్రంథములను వ్రాసి భాషలోని కొఱఁతను యథాశక్తిఁ దీర్పవలెనని నా యభిలాష "ఆఁకలి ఆకాశమంత ; నోరు సూదిబెజ్జమంత" అన్నట్లు నాకా ? యాశ పెద్దది పాండిత్యము అవకాశమును దక్కువ ఇచ్చటి సారస్వత వాతావరణమా ? ప్రతికూలము. ఏలన నిచ్చటి పత్రికలేమి ? పండితులేమి? నవగ్రహములును నాయెడ వక్రించి యున్నవి ఇచ్చటి నా సారస్వతజీవిత మేటికెదురీఁదుచున్నది. అట్లయ్యు సంస్కృతవ్యాకరణశృంఖలల నుండి యాంధ్రభారతినిఁ దప్పింపఁ బడుతభక్తితోఁ దత్సుమచంద్రికను వ్రాసి యాంధ్రవాణికూడిగము సేసితిని మఱియు జాతక కథాగుచ్ఛము (౩ భాగములు) కీరసందేశము ద్వంద్వయుద్ధము ఖడ్గతిక్కన గోవర్ధనాచార్య సప్తశతిసారము వాసవదత్త, రేణుక విజయము అమృత కణములు కావ్యాలంకారసంగ్రహ వివరణము మొదలగువానిని రచించియా దేవి కర్పించితిని ఈ గ్రంథమునకు బీజము నా హృదయమున ౨౦ ఏండ్ల క్రిందనే పడెను దీనిని సాధింపఁగల మహావిద్వాంసు లెందరోయుండ నేను సాహసించుట తగదని మిన్నకుంటిని. కాని పెద్దలెవ్వరు దీనికిఁబూనకుంటచే వ్రాయఁగడఁగితిని వ్రాసిన పిమ్మట నితరులు వ్రాసిరని తెలిసియు వ్రాసిన దానినిఁ బ్రకటింప కేల యూరకుందు ? రని నామిత్రులు ప్రోత్సహింప ముద్రింపఁ గడంగితిని

గ్రంథమును వ్రాయుట యొకయెత్తు ముద్రణమగుట యొకయెత్తు గదా! అందును కాగితముల కాటకపుదినములలో మఱింత కష్టమని చెప్పఁబని లేమ దీనిని ముద్రింపఁదలచి సికింద్రాబాదా వణిక్పుంగవులలోఁ జిన్న యయ్యును గుణములచేఁ బెద్దయు, దేవబ్రాహ్మణ భక్తిసంపన్నుఁడును బండితాభిమానియు నాకు మిత్రుఁడును నగు మ. రా శ్రీ మరిపల్లి శంకరయ్య శేష్టిగారితోఁ బ్రసంగింపఁగాఁ బ్రథమమున ౫౦ రూ చందావేసి మార్గముఁ జూపిరి వారు చందావేసిన ముహూర్తబలమే యీ గ్రంథ ముద్రణమును నిర్విఘ్నముగాఁ గొనసాఁగించినది పిమ్మట నీ విషయమును నివేదింపఁగా దీని భారమును దమ మీఁదికిఁ ద్రోసికొని స్వహస్తముచేతను బరహస్తముచేతను దోడ్పాటు గావించిన పరోపకారపారీణులగు శ్రీ బెళ్లె జగదీశ్వరయ్యశ్రేష్టిగారికిని, నా యీ గ్రంథమునుగుఱించి విని దీని నెత్తైన నుద్ధరింపఁ బ్రతిజ్ఞను బూని బళ్ళారిజిల్లా ఆదవాని పట్టణమునఁ బౌరపక్షమున సభాముఖమున ౧౨౫౧ రూ సమర్పించి సమ్మానించిన భాషాభిమాని, సరళస్వభావుఁడును, పరోపకార ధురంధరుఁడును నగు శ్రీ శ్లోకనంది శంకరనారాయణరావు ఎం. ఏ., యస్. యస్. బి. గారికిని నేనెంతయుఁ గృతజ్ఞుఁడను ముఖ్యముగావీరి యా పెద్ద సాహాయ్యము లేనిచో నీ గ్రంథము వెలుఁగు చూచెడిది గాదు. వీరికి నే నెంతయును ఋణపడియున్నాను. వీరికిని, నితరదాతలకును నా కృతజ్ఞతను జూపుచు వీరి

కాయురారోగ్యైశ్వర్యములను ప్రసాదించి భగవంతుఁడు మనుచుఁ గాతమని కోరుచున్నాను.

మఱియు దయతో నీగ్రంథమునకు 'తొలిపలుకు' వ్రాసిన శ్రీగంటి జోగి సోమయాజులు ఎం ఏ యల్ టి విద్వాన్ Telugu Professor, Andhra University వారికి నా కృతజ్ఞతాపూర్వక వందనము లర్పించుచున్నాను.

సికింద్రాబాదు
26-11-45

బుధవిధేయుఁడు
సన్నిధానము సూర్యనారాయణశాస్త్రి

మేలిపలుకు

శిరోమణి శ్రీ సన్నిధానము సూర్యనారాయణశాస్త్రిగారు సమకూర్చి రచించిన 'కావ్యాలంకార సంగ్రహ వివరణము'ను 'నిజాంరాష్ట్ర-ఆంధ్ర సారస్వత పరిషత్తు' పక్షమునఁ బండిత సారస్వత శాఖక్రింద ప్రకటించి, సాహిత్యరసికులగు నాంధ్రులకందఁ జేయఁ గల్గినందులకు మే మెంతయు గర్వించుచున్నాము శ్రీ శాస్త్రిగారు కవులు; సంస్కృతాంధ్రములయందుఁ బండితులు. కవులై 'జాతక కథాగుచ్ఛము' మొ॥ కావ్యములచేతను, పండితులై 'తత్సమచంద్రిక' 'కావ్యాలంకార సంగ్రహ వివరణము' అను సద్గ్రంథములచేతను నింతవరకు నాంధ్ర సరస్వతిని నారాధించి యున్నారు. వారి యితర గ్రంథము లిదివఱకే యాంధ్రలోకమునకు సమర్పితములయి యుండుటచే, శాస్త్రిగారినిఁగూర్చి పరిచయవాక్యములు వ్రాయుట దినకరుని దివ్వెతో చూపించుటవంటిదే యగును.

ఈ కావ్యాలంకార సంగ్రహ వివరణము పేరికి వివరణగ్రంథమైనను, ఒక విధముగా దీనిని 'సాహిత్య సర్వస్వ' మనవచ్చును. ఆంధ్రదేశమున నిప్పటికిఁ బెక్కలంకార గ్రంథములు పుట్టకపోలేదు; కాని యవి యన్నియు నేయనువాదగ్రంథములోయై సాహిత్యవిషయముల నామూలాగ్రముగఁ దెలిసికొనుట కవకాశ మిచ్చునట్టివి కావు. శ్రీ శాస్త్రిగారు సంస్కృత సాహిత్యశాస్త్రమునందలి సర్వ విషయములను సంగ్రహించి, కావ్యాలంకార సంగ్రహమునఁ బొందించి, యిటు సాధారణముగాఁ గొఱుకుడువడని కావ్యాలంకార సంగ్రహము యొక్క యుపయోగమును వృద్ధిచేయుటయేగాక, అట్టి సర్వ సాహిత్య సామగ్రినిఁగూడ నొసఁగి, తత్పాఠకుఁడు స్వయంపఠనముచేతనే పండితుఁ డగుటకు వీలు కల్పించినారు ఈనాఁడిట్టి ఘన కార్యము మఱొక రెవ్వరు చేయకుండుటచేఁ దత్ప్రథమ గౌరవము శాస్త్రిగారికే లభించినదనవచ్చును. ఇది సాహిత్య శాస్త్రముమీఁద విమర్శగ్రంథము గాకపోయినను విషయము తెలిసినఁగాని విమర్శకుఁ దావు లభింపదు గావున, నిట్టి విషయ సమగ్రమైన గ్రంథము నిరా-

ఆంధ్రసారస్వత పరిషత్తువారు మొట్టమొదటఁ బ్రకటించి, సాహిత్య జిజ్ఞాసువుల కెంతయో యుపకృతి చేసినా రనఁదగును. ఇట్లే, తర్వాత - ఒక సాహిత్యశాస్త్ర విమర్శగ్రంథమును గూడ కావ్యకళాతత్త్వము - అనుదానిని బ్రకటించి, రెండవ లోపమును బూరించుటకుఁ బూనియున్నారు. శ్రీ శాస్త్రిగారి వివరణ పద్ధతు లటు ప్రాచీనులకును నిటు ఆధునికులకును దృప్తిని గల్పింపఁ జాలినవై యున్నవి.

ఈ గ్రంథమును నల్లగొండలో జరుగుచున్న పరిషత్తు తృతీయ వార్షికోత్సవ సందర్భమున సమ్మాన పూర్వకముగా బహిరంగపఱచు గౌరవము పరిషత్తున కొదవుట యెంతయుఁ బ్రశంసనీయము. ఇఁక ముందీ యుద్గ్రంథము విశ్వవిద్యాలయములలోఁ గూడఁ బాఠ్యగ్రంథమై ప్రభుత్వ విద్యావిధానమునందును దన కర్హస్థానమును గల్పించుకొని పరిషత్తు కలంకారప్రాయము కాఁగలదనియు, నీ గ్రంథమును లోఁతుగాఁ బరిశీలించినవారు మా యభిప్రాయముతో నేకీభవింపఁగలరనియు, నమ్ముచున్నాను.

హైదరాబాదు
౪౧-౨౧-౩౪

విధేయుఁడు,
బిదురు వేంకట శేషయ్య
గౌరవ కార్యదర్శి
నిజాంరాష్ట్ర-ఆంధ్ర సారస్వత పరిషత్తు.

పంచమ ముద్రణ పీఠిక

ఈ గ్రంథము నే ననుకొన్నంతకన్న నత్యధికముగనే యాంధ్రలోకమున మన్ననఁ బొందినది. ఇది యైదవ ముద్రణము. ఆంధ్ర, వేంకటేశ్వర, ఉస్మానియా విశ్వవిద్యాలయాధికారులు నా యీ గ్రంథమును M. A., B. O. L., విద్వాన్, మున్నగు పరీక్షలకుఁ బాఠ్యముగా నిర్ణయించి, నా కృషిని సఫలముఁ గావించిరి. అందులకు వారికి నా కృతజ్ఞతను దెలుపుచున్నాను వీరేకాక పెక్కండ్రీ గ్రంథమును బ్రశంసించుచు జాబులను వ్రాసిరి. వాని నన్నింటిని ముద్రించినచోఁ బెద్దపుస్తకమేయగును. పురోభాగితతో విమర్శించిన వారును గలరు. వారినిఁ దృప్తిపఱచుట పండితులకు సాధ్యముగాని పని. వారికి నా యీ వివరణము నచ్చనప్పుడు తామే బృహద్వ్యాఖ్యను విరచించి భాషాసేవ సేయుట యుచితమని మనవి.

ఈ నా గ్రంథ పీఠికలో "దృష్టం కిమపి లోకేఽస్మిన్ న నిర్ద్దోషం వ నిర్గుణం" అనికదా యభియుక్తి. కావున నుదార హృదయులగు విద్వాంసులు దీనియందలి దోషములను సుహృద్భావముతోఁ దెలిపినచో సంస్కరించుకొందునని సప్రశ్రయముగా మనవి సేయుచున్నాను, అని వ్రాసికొన్నను నాకుఁ దెలుపక పత్రికలలో వ్రాయుట వట్టి దుండగము.

శ్రీ శేషాచలం అండ్ కో వారీ గ్రంథమును బునః పునర్ముద్రణములు గావించుటకుఁ బూని, భాషకుపకారము గావించుచున్నందులకు వారి నభినందించుచున్నాను.

వివరణకర్త.

విషయసంగ్రహము

ప్రథమాశ్వాసము

నాంది, సుకవిప్రశంస, కుకవినింద 1
కృత్యవతరణిక గ్రంథప్రస్తావిక, అలంకారశాస్త్రప్రమేయము 4
కృతిపతి వంశావతారిక 9
నాయకగుణములు 28
నాయకస్వరూపము 40

ద్వితీయాశ్వాసము

నాయికానాయకలక్షణములు - ధీరోదాత్తాదులు-దక్షిణాదులు-విటాదులు- స్వీయాదులు - ముగ్ధాదులు - అష్టవిధనాయికలు - ప్రవత్స్యత్పతికా చర్చ 44
నాయికాంగముల యుపమానవస్తుసామగ్రి-దూతికలు 85
కావ్యస్వరూపము - కవి - కవిభేదములు - కావ్యశబ్ద వ్యుత్పత్తులు కావ్యలక్షణము - భామహ, దండి వామన, ఆనందవర్ధన, అభినవగుప్త, మహిమభట్ట కుంతక, క్షేమేంద్రమతముల చర్చ ... 88
కావ్యలక్షణ విమర్శ - మమ్మటాదుల కావ్యలక్షణ విమర్శ-ఆంగ్ల కావ్యలక్షణములు - కావ్యప్రయోజనము - కావ్యానందము కావ్యసామగ్రి - కావ్యసంవాదములు 110
వాచకాదిశబ్దములు - వాచ్యాద్యర్థములు-అభిధాదివృత్తులు - అర్థనిర్ణాయక సామగ్రి - వాచ్యలక్ష్యములకన్న వ్యంగ్యము భిన్నము - స్ఫోటవాదము. 127
కైశిక్యాదివృత్తులు; రీతులు 167
పాకములు-శయ్య-వృత్తి-పాకశయ్యాదుల చర్చ 175
కావ్యవిశేషములు — కావ్యముల యుత్తమత్వాది భేదములు లక్షణామూలధ్వనులు - శబ్దశక్తి, అర్థశక్తి మూలధ్వనులు రసధ్వని, శుద్ధధ్వని భేదములు 185
కావ్యభేదములు — మహాకావ్యలక్షణములమతభేదములు - నాయకుని వర్ణ్యసామగ్రి - కావ్యవస్తువు - కావ్యమునకును శాస్త్రమునకును గల భేదము - కావ్యముయొక్క ప్రఖ్యాతత్వాది భేదములు 288

క్షుద్రప్రబంధములు -పద్యకావ్యభేదములు-గద్యకావ్యభేదములు కావ్యస్థభాగ పవిభాగవాచక నిర్వచనము - సూత్ర వృత్తి భాష్యాది శబ్దముల నిర్వచనము	....	....	244

[తృతీయాశ్వాసము]

రసలక్షణము — రసచర్చ - భట్టలోల్లటాదుల మతములు		....	278
నవరసములు - శాంతరసచర్చ	...	....	291
ప్రేయోరసము-వత్సలరసము - భక్తిరసము - మాయారసము శృంగారరసము - అద్భుతరసము - కరుణరసము — రససమీకరణవాదము	....	....	304
కావ్యమున శృంగారవీరము లేల ప్రధానములు	....	....	318
స్థాయిభావములు	....	....	319
విభావములు	....	....	329
సాత్త్వికభావములు	....	....	335
సంచారిభావములు	...	....	341
శృంగారచేష్టలు	....	....	372
దశావస్థలు	...	....	393
విప్రలంభ శృంగారభేదములు	....	....	402
శృంగారాది నవరసములయు రసాభాసాదులు	....	....	413

చతుర్థాశ్వాసము

దోషప్రకరణము.— పదదోషములు - పదాంశదోషములు వాక్యదోషములు - అర్థదోషములు	....	....	445
కవిసమయములు	....	....	490
రసదోషములు	....	...	507
పరస్పరవిరుద్ధరసములు	....	....	520
గుణప్రకరణము	....	....	527
శబ్దాలంకార ప్రకరణము	....	....	547

పంచమాశ్వాసము

అలంకారములు-తద్దోషములు-గుణాలంకార భేదము	....	....	563
అర్థాలంకారములు	....	...	709

శ్రీరస్తు

కావ్యాలంకారసంగ్రహము

(నాంది)

శ్రీలీలావతి దా నురోమణిసభాసింహాసనత్కౌస్తుభా
వేలాభాప్రతిబింబితాంగి యయిన న్వేఱొక్కతెం దాల్చినాఁ
"డాలే" యంచుఁ దలంచునో యన నమందానందుఁడై లక్ష్మినే
వేళం గౌఁగిటఁ జేర్చు శౌరి నరసోర్వీనాథునిం బ్రోవుతన్, ౧

సీ. ఏలేమ కదలిరాచూలి యౌ నెఱిఁగించుఁ
గలితవళీతరంగముల రంగు
ఏమానినీరత్న మిందుసోదరి యౌటఁ
బ్రకటించు మొగముపోలిక తెఱంగు
ఏతన్వి కందర్పుమాత యౌ నెఱిఁగించుఁ
గరగృహీతాంభోజకాండకలన
ఏసాధ్వి దనుజారియిల్లాలవుటఁ దెల్పు
నలివనీలాబ్జభిన్న యనగరిమ
తే. యట్టి శ్రీదేవి సుకవివాగమృతరసము
నఖిలభువనోన్నతము నైన యౌబళేంద్ర
నరసవిభుమందిరం బాత్మశరణ మనుచు
నుండి యేకాలమును బాయకుండుఁ గాత. ౨

చ. పలుకులకొమ్మ నెమ్మొగముఁ బార్వణచంద్రుసిగాఁ దలంచి యు
జ్జ్వలనిజభద్రపీఠజలజంబు నిమీలిత మౌనొ యంచు నే
ర్పలవడ భారతీవనిత నాత్మముఖంబులలోనె తాల్చుచుం
జెలఁగువిధాత యోబయనృసింహునకిచ్చుఁ జిరాయురున్నతుల్.

సీ. ఒకటి యతురవిలాసోల్లాసమున మించ
నొకటి తాళప్రౌఢి నుల్లసిల్ల
నొక్కటి నారికేళోన్నతిఁ దాల్ప నొ
క్కటి గోస్తనీగుచ్ఛకలనఁ దనర

వొకటి మనువృత్తతావోన్మేష మొంద నొ
 క్కటి వల్లకీతుంబికలనఁ జెలఁగ
వొకటి తారవిశేషయుక్తిఁ జెం పొంద నొ
 క్కటి గిరీశమతానుకారి గాఁగ

తే. సమముసాహిత్యసంగీతరసము లనెడు
గుబ్బపాలిండ్లు గల్గు పల్కుల వెలంది
వరనగుణహారు నోబయనరసధీరు
నవ్యకృతినాయకునిఁ గా నొనర్పుఁ గాత. ౪

శా. "గంగం దాల్చితి వుత్తమాంగమున నన్ గైకోలు గావించి త
ర్ధాంగీకార" మనం "బురంధ్రి నిను వామాంగంబునం దాల్చనే?
శృంగారోన్నతిఁ జూడు" మంచు గిరిజన్ శీర్షాపగాలింబిత
స్వాంగానందితఁ జేయు శంభుఁడు నృసింహాధీశ్వరుం బ్రోవుతన్. ౫

చ. అరుదుగ వామభాగలలనాకలనాచలనాత్ముఁడైన యా
హరు గురుఁ గాంచి తాను దదాకృతి యాగతి నేకదంతుఁడై
కరికరిణీగుణంబులు మొగంబునఁ దాల్చి జగంబు లేలు నాం
తరకరుణాసనాథు గణనాథు మరుద్గణనాథుఁ గొల్చెదన్, ౬

సీ. తన యాస్యగహ్వరంబునకు ఖద్యోతజృం
 భణము ఖద్యోతజృంభణము గాఁగఁ
దనకరాంభోజాతమునఁగల గంధమా
 దన మొకగంధమాదనము గాఁగఁ
దనశౌర్యహార్యతమునకు మైరావణ
 స్ఫురణ మైరావణస్ఫురణ గాఁగఁ
దనవాలదంభోళి కెనయు కర్బురగోత్ర
 గరిమ కర్బురగోత్రగరిమ గాఁగఁ

తే. వరలు రామానుజన్మజీవప్రదాన
ధుర్యపర్యాయధాత మేదురవిరోధి
బలపయోధివిలంఘనప్రబలశక్తి
వోబయనృసింహభూభర్త కొసఁగుఁగాత

సుకవిప్రశంస

సీ. ఎవ్వాఁడు మొదలఁ దా నిలకు భారతి డించెఁ
దగ భగీరథుఁ డభ్రతటినిఁ బోలె
భ్రమరకీటన్యాయభాతి నేకవిరాజు
వాగ్దేవి దానైయె వన్నెకెక్కఁ
బరవృత్తములు మాని వాణి యెవ్వానికై
వలచి నానాశ్లేషములకుఁ జిక్కె
నెవ్వానివాఙ్మంత్ర మినుని ధాత్రికిఁ దెచ్చి
పేర్మితోఁ గరము లర్పించుకొనియె
తే. నట్టి మహిమాధికులఁ గొల్చి యఖిలమునివ
చోఽనుపమశక్తిభృతపురాణార్థవితతు
లనుఁగుఁదెనుఁగను భవ్యదివ్యాంజనమునఁ
గనుఁగొనఁగఁ జేయు నంధ్రసత్కవులఁ దలఁతు.

కుకవినింద

సీ. ఏ మహాత్ములు గల్గ భూమీశసభలలోఁ
గవులకు నధికవిఖ్యాతి గల్గె
నే కృతార్థులు గల్గ నెల్లపామరులకు
గణన మీఱు ప్రబంధకములు గల్గె
నే వాఙ్నిధులు గల్గ నిరవొందు రసికుల
కమితలీలావినోదములు గల్గె
నే ప్రవీణులు గల్గ నిల నలంకృతికృతో
ద్యములకు దోషలక్ష్యములు గల్గె
తే. నే దయాళులు బుధవచోహేతిచకిత
విసరదపశబ్దభరణలాలసముఖాబ్జు
లట్టి నిఖిలోపకారధీరాత్ములయిన
సకలకవిధూర్వహులకు నంజలి యొనర్తు.

(కృత్యవతరణిక)

వ. ఇవ్విధంబునఁ బ్రారిప్సితగ్రంథనిర్విఘ్నపరిసమాప్తిసంప్రదాయావిచ్ఛేదలక్షణనిబంధనంబుగా నిఖిలాభీష్టదేవతానమస్కరణంబును, సుకవిబహూకరణంబును, కుకవినిరాకరణంబును గావించి, యుదంచితవిరించిసంచితప్రపంచచరదభంగబుధపుంగవహృదయంగమంబును, విగంభీరరసముజ్జృంభితకవితాంభోధితరణకరణప్రగుణోపకరణపరిణతతరణిప్రకాండంబు, నశేషగుణదోషవిశేషదుర్వారనీరక్షీరవివేచనోచితప్రశంసితహంసాయమానప్రతిభానుబంధంబు నగు నొక్క ప్రబంధంబు నిర్వర్తింపఁ బూనియున్న సమయంబున.- ౧౦

సీ. లలితాకలంకకలాకలాపంబున
నేరాజు రేరాజు నేవగించు
భూభారభరణలీలాభిముఖ్యంబున
నేమేటి తామేటి నెగ్గులాడుఁ
జతురభాషామనీషావిశేషావాప్తి
నేభోగి యాభోగి నీసడించు
శరణాగతగణాభిభరణాధికగుణాప్తి
నేశౌరి యాశౌరి నేపు నూపు

తే. నతఁడు రిపురాడఖర్వగర్వాంధకార
గంధనిర్గంధనాంభోజబంధుబంధు
బంధురాచార్యశౌర్యధురంధరుండు
సరసగుణహారుఁ డోబయనరసఘనుఁడు. ౧౧

వ. వెండియుం బ్రచండభుజాదండకాండవితమండలాగ్రఖండితారాతిమండలుండును, నఖండనవఖండపృథ్వీమండలధురాభరణపరాభూతఖండపరశుకుండలుండును, నజాండకరండపిచండిలయశఃపూరకర్పూరహారుండును, సరస్వతీమనోభండారచౌర్యకారుండును, సమరసమయసముజ్జృంభితజంభారిదోస్స్తంభసముత్తంభితదంభోళిధారావిదారితమహాకీలశైలాళివిశాలారవకోలాహల లీలా

పాళహాళికాపమారంభసుభగంభావుకగంభీరవిజయభేరీభయంకరభాం కారసంకరసముట్టంకితదిగ్విటంకుండును, నతుద్రతరసురక్షోభకర మదోన్మత్తదక్షోన్నతరక్షోవక్షో ఒవక్షోదవిచక్షణాతీక్ష్ణనృహార్యత రూతవీణోద్భవదాశుశుక్షణిక్షణసముత్థి ప్తకీలాకరాళావిచ్ఛిన్నాచ్ఛ చ్ఛాయాచ్ఛటాపటిమఘటనచటులప్రతాపవైభవుండును నుభయర గండ. గండభేరుండాదిబిరుదామందసందీపితప్రాభవుండును, నసాధారణమేధావధీరితవేధోమేధోప్రబోధ నిర్నిరోధ మధుర మధురసావధీరణ సమగ్రవాగ్గ్రథనసుధీజనగృహద్వార నిర్నిద్ర భద్రవారణఘటావికటకటకటావాతటపతదనూనదానాం భోఝరీ పరిమళపరిలబ్ధిలుబ్ధలబ్ధామోద మేదురభృంగీతరంగితభంగీప్ర సంగత ప్రసంగాంగీకృతనిరంతరదిగంతరవిశ్రాంతవిశ్రాణనజయానకుం డును, గుళికసుతకులజలధికైవాతృకుండును, నానావిధభానాధిక సేనాంబునిధానానుపమానాహవమానానుపమితామోఘ వైభరీ పరీతబరీదసపాదసప్తాంగ హారణుండును, భోజరాజవంశసంభవుం డును, లక్కాంబాగర్భపావనుండును, బరమభాగవతసంభావ నుండును, నోబభూపాలపుత్త్రవరుండును, గడిదుర్గస్థాపనా ర్యుండును, సత్యభాషాహరిశ్చంద్రుండును నగు నృసింహక్షితీంద్రుం డొకనాఁడురుచిరరుచిశుచితావిశేషదూషితోషర్బుధులుబుధులు, సరస్వతీప్రవాహాసంతతవిహారమహాకవులుకవు, లజిహ్మజిహ్వారంగ నృత్యదుత్తుంగ గైర్వాణవాణీ ప్రాకృతశౌర్యసేన్యపభ్రంశ పైశాచికామాగధులు మాగధులు, నటనజితమహానటులు నటులు, వరయౌవనసౌందర్యవసతులు సతులు, సయవినయసౌజన్యులు రాజన్యులు, అవధీరితసురరాజమంత్రులుమంత్రులు, ప్రబలబలో ద్భటులు భటులు, పురోహితులు, హితులు, పౌరాణికులు, వైణి కులు, గాయకులు గణకులు నాదిగాఁ గల నిఖలనియోగిజనంబులు

బలసికొలువ, మణిమయాస్థానమధ్యభద్రాసనంబున సుధర్మాస్థ
సీమండగు శునాసీరు చందంబున నందంబుగాఁ గొలువుండి
యప్పుడు-

సీ. శతలేఖనీపద్యసంధానధారేయు
ఘటికాశతగ్రంథకరణధుర్యు
నాశుప్రబంధబంధాభిజ్ఞు నోష్ఠ్యని
రోష్ఠ్యజ్ఞు నచలజిహ్వోక్తినిపుణుఁ
దత్సమభాషావితానజ్ఞు బహుపద్య
సాధిత వ్యస్తాక్షరీధురీణు
నేకసంధోదితశ్లోకభాషాకృత్య
చతురు నోష్ఠ్యనిరోష్ఠ్యసంకరజ్ఞు
తే. నమితయమకాశునిధిఁ బ్రబంధాంకసింగ
రాజసుతతిమ్మరాజపుత్త్రప్రసిద్ధ-
నరసవేంకటరాయభూషణసుపుత్త్రు
నను బుధవిధేయు, శుభమూర్తినామధేయు ౧౩

క. కనుగొని దయామరందము
కనుదమ్ముల వెడల నుచితగౌరవలీలా
ఘనతరగభీరభాషల
ననియె న్నరసింహుఁ డభినవానందముతోన్. ౧౪

సీ. బాణువేగంబును భవభూతిసుకుమార
తయు, మాఘుచైత్యంబు, దండిసమత,
యల మయూరుసువర్ణకలన, చోరునియర్థ
సంగ్రహమ్ము, మురారిశయ్యనేర్పు,
సోముప్రసాదంబు, సోమయాజుల నియ
మంబు, భాస్కరుని సన్మార్గఘటన,
శ్రీనాథునిపదప్రసిద్ధధారాశుద్ధి
యమరేశ్వరుని సహ సముఖదృష్టి,

తే. నీకుఁ గల దటుగాన ననేకవదన-
సదనసంచారఖేదంబు సడలుపఱిచి
భారతీదేవి నీ జిహ్వఁ బాదుకొనియె
మూర్తికవిచంద్ర! విఖ్యాతకీర్తిసాంద్ర! ౧౫

ఉ. కావున నీ యుదగ్రమతిగౌరవయోగ్యనిరూపణంబుగా
నీ వొనరింపఁబూనిన యనేకమహాకవివాఙ్మయోపకా
రావహమైన కావ్యము మదంకితమై వెలయంగఁ జేయు ము
ర్వీవలయప్రసిద్ధబుధవిస్మయదానధురంధరంబుగన్. ౧౬

వ. అని సబహుమానంబుగాఁ గర్పూరతాంబూలజాంబూనదాంబ
రాభరణచ్ఛత్రచామరాందోళికా చతురంతయానాగ్రహారాది
ప్రదానంబుల బహూకరించుటయు, నేను నానందకందళిత
తరంగితాంతరంగుండనై- ౧౭

గ్రంథప్రస్తావిక

సీ. నిజరూపమునకు వన్నియఁ దెచ్చు వేఱొక్క
బెళుకొందు ధ్వనిహారకళిక లమర
ఛాయాంతరాలక్ష్యసహజతేజములైన
లక్షణావైదూర్యలక్ష అలర
రతులతోఁ దులఁ దూఁగు రసవిశేషము లనఁ
దనరిన గారుత్మతములు బెఱయ
గురుసువర్ణగుణైకగుంభితస్థితిఁ దాల్చు
నాయకనాయకోన్నతులు నెఱఁగ

తే. నిల నలంకారనికరంబు లిరవుకొలిపి
కమలభవగేహినీపరిష్కరణకరణ
యోగ్యములుగా నొనర్చిన భాగ్యనిధుల
భామహాదుల ననిశంబుఁ బ్రస్తుతించి. ౧౮

క. వారి ప్రసాదమున నలం
కారము, ధ్వని, లక్షణాధికారరసాలం-

కారము నొసఁగుత నాంధ్రభా-
షారచనఁ జమత్క్రియాభిశోభితవతినై, ౧౯

అలంకారశాస్త్రప్రమేయము

తే. అసదృశరసప్రధానశబ్దార్థములును,
రీతులును, వృత్తులును, నలంకృతులు, గుణము
లాది యగు లక్షణంబుల నలరుఁ గావ్య
సరణి యందు రలంకారసారవిదులు. ౨౦

క. ఈ కావ్యలక్షణంబు ల
నేకులు దొల్లింటిపెద్ద లేర్పఱిచిన సు
శ్లోకనృపచరితవతి దీ
ప్తాకలనయు నభినవాంధ్రకవితయు నగుటన్ ౨౧

వ. ఏతత్ప్రబంధ బంధురావ్యాజ కావ్యాలాప లక్షణకృతక్షణ ప్రసంగ సంగ్రహణ నిర్వహణకృత్యంబున నిత్యంబు నత్యంత కృతా వసరుండ నై- ౨౨

క. బంధురతరప్రబంధల
బంధము లనంతకీర్తిభాగ్యప్రదధౌ
రంధర్యగ్రంథిలము ల
సుంధర ననవద్యరమణసుగుణ స్తవముల్. ౨౩

సీ. రామాయణాదికగ్రంథంబు లనవద్య
నేతృవర్ణనల వన్నియకు నెక్కె
వైశేషికాదినానాశాస్త్రములు శివ
ప్రతిపాదనమున సన్నుతి వహించె
పంచాద్యాదిమంత్రముల్ శశ్వదీశ్వరనామ
జపసాధనత ననశ్వరము లయ్యెఁ
బలుకు లొండొంటిఁ బ్రామిన్కులును బర
బ్రహ్మగోచరములై ప్రణుతిఁ గాంచె

తే. నవివఁ గావ్యంబ మేయనాయకవికస్వ
రస్వరూపనిరూపణభ్రాజి యగుట

వేల వివరింప నేల ? బంగారమునకుఁ
జటుల సౌరభ్యలహరి యబ్బుటయ కాదె ! ౨౪

శా. వేదంబుల్ నృపశాసనంబులు, సుహృద్విజ్ఞాపనంబు ల్పురా
ణాదిగ్రంథము; లంగనాజనవిలాసాలాపలీలాసమ
ప్రాదుర్భావము లౌర కావ్యములు కర్తవ్యోపదేశక్రియా
వాదప్రక్రియ నెన్నఁ; గావ్యమహిమన్ వర్ణింపఁగా శక్యమే !

మ. పరమజ్ఞానలతాలవాలము, జగత్ప్రఖ్యాతివిఖ్యాతసా
గరచంద్రోదయ; మిష్టసంఘటనరేఖాదివ్యధేనూత్తమం,
బురుకార్పణ్యదశానిశాదినముఖం; బుద్వేలనిర్వాణభ
వ్యరసాస్వాదరసాయనం బనినఁ గావ్యం బెన్న సామాన్యమే !

క. కావున నేవంవిధసుగు-
ణావాసం బైన కావ్య మలరును నవర-
త్నావేలహారవల్లిక
కై వడి ననవద్యనాయకభ్రాజితమై. ౨౮

మ. అని యూహించి మదీయసంఘటితకావ్యాలంక్రియాసంగ్రహం
బనఘం బై వెలుఁగొందఁ గున్నె రవివంశాధీశ్వరుం డౌ నృసిం
హనృపాలాగ్రణికిన్ద్రివర్ణనముచే నాశాంతవిశ్రాంతపా
వన మౌఁ గావున నందు నాయకమహావంశంబు వర్ణించెదన్.

కృతిపతివంశావతారిక

సీ. శ్రీమించు పద్మినీభామామణి కినుండు
నిరతసంసారవార్ధికిఁ దరణి
త్రిజగతీసజ్జనశ్రేణికిఁ మిత్త్రుండు
బహుతమోవనికి విభావసుండు
సమదమందేహదేహములకుఁ దపనుండు
చతురాగమార్థసంతతికి సవిత
సకలచోరపరంపరకు సహస్రకరుండు
వినతలోకవితానమునకు ద్యుమణి

తే. హరిహరవిరించిముఖదేవతానుభావ
ఘనతరస్వర్ణరాసు లొక్కకోటియ కాఁగఁ
గరఁగి కూర్చిన యపరంజికడ్డి యనఁగ
సూర్యుఁ డిరవొందుఁ దేజోఽనివార్యుఁ డగుచు ౨౯

క. అతనికి వైవస్వతమను
వతనికి నిక్ష్వాకునృపతి యతనికిఁ గుక్షి
క్షితిపతి, యతఁడు వికుక్షిం
బ్రతాపఘనిఁ గనియె, నతఁడు బాణునిఁ గనియెన్, ౩౦

సీ. అనరణ్యుఁ డతని కా యనఘుఁడు పృథుఁ గాంచెఁ;
బృథుఁడు త్రిశంకుధాత్రీంద్రుఁ గనియె;
నతనికి దుందుమారాభిఖ్యుఁ డతనికి
మాంధాత; యతఁడు సుసంధిఁ గాంచె;
నతనికి ధ్రువసంధి; యతనికి భరతుఁ; డా
ధన్యున కసితుఁ, డాతనికి సగరుఁ;
డతనికి నసమంజుఁ, డతఁ డంశుమంతునిఁ
గనియె దిలీపుఁ డాతని సుపుత్త్రుఁ;

తే. డతఁడు గాంచె భగీరథు నాత్మవంశ
పావనుని, నాతనికిఁ గకుత్స్థావనీశుఁ;
డతఁడు రఘుఁ గాంచెఁ, గనియె నా క్షితితలైక
పతి సునాభాగు, నతఁడు నాభాగుఁ గాంచె ౩౧

చ. అతనికి నంబరీషుఁ, డయుతాయువు తత్సుతుఁ, డవ్వసుంధరా
పతి గనియె న్మహోత్ము ఋతుపర్ణు, నతండును సత్యకాము; నా
తతబలుఁ గాంచె; నాతఁడు సుదాసునిఁ గాంచెఁ; దదీయుఁ డస్తికుం;
డతనికి; మూలకుం, డతని కా శతసంఖ్యరథుండు వెండియున్.

క. ఘనుఁ డతఁ డైలబిలేంద్రుని
గనియెం; బృథుధర్మవిభునిఁ గనియె నతఁ; డతం
డును విశ్వమహునిఁ గనియెం;
గనియెన్ ఖట్వాంగు నతఁడు గాంభీర్యనిధిన్ ౩౨

సీ. భవ్యుఁ డాతఁడు దీర్ఘబాహునిఁ గనియె; నా
తఁడు గాంచె రఘువు ; నాతనికిఁ గలిగెఁ
బురుపాదుఁ ; డతనికిఁ బొడమెఁ గల్మాషపా
దుఁడు ; తత్సుతుఁడు శంఖనుఁడు ; సుదర్శ
నుఁడు దత్తనూజుఁ ; డాతఁడు గాంచె నగ్ని వ
ర్ణమహీశు ; నతఁడు శీఘ్రుగునిఁ బడసె ;
నతనికి మరుద్ధుఁ ; డదాత్మజుఁడు శుకుఁ ; డా
తని కంబరీషుఁ ; డాతనికి నహుషుఁ
తే. డతనికి యయాతి ; నాభాగుఁ డతని ; కతని
కజుఁడు , దశరథుఁ డతనికి ; నతని కొదవె
రామభద్రుఁడు ; దద్వంశరత్న మయ్యె
సొరిది గలివేళఁ గరికాలచోళవిభుఁడు. ౭౪

సీ. ఏరాజు వివిధపుష్పారాధనమున గం
గాధరు తలమీఁదికొఁచు మానె
నేరాజు దివ్యాన్నసారార్పణంబున
శితికంఠు మెడ నున్న చేఁదు మానె
నేరాజు రత్నోపహారానుభవభూతి
రుద్రు నెమ్ములదండరోఁత మానె
నేరాజు కాంచనాగారరచనకేళి
భవునకు గిరు లెక్కుపాటు మానె
తే. జలధిదేవేరిఁ గావేరి జనులు నూడ
కుండ నాచ్ఛాదన మొనర్చు నొఱపు మెఱయ
నుభయతటములఁ దరుపఙ్క్తు లునిచె నే నృ
పాలుఁ డతఁ డొప్పుఁ గరికాలచోళవిభుఁడు. ౭౫

చ. అతఁడు మహాదిగంతవిజయంబొనరించి సురాద్రియాల ను
న్నతనిజమీనలాంఛనమొనర్చుటకై గిరిరాజుఁ ద్రిప్ప న
ప్రతిమతదీయదోర్యుగభరభ్రమితాచలశృంగసంగతా
మితజవరూఢి నేఁడును భ్రమించుఁ దదగ్రగతగ్రహావళుల్.

తే. శ్రీలఁ జెలువొందు నా కరికాలచోళ
కుంభినీనాథకులమున సంభవించె
ఘనఖనిక్షోణి రత్నంబు గలుగురీతి
భోగసౌభాగ్యసురరాజు పోచిరాజు. ౩౨

సీ. తనకీర్తి కజరవాహిని యీడుగామికి
నమ్మహానదితోడి యమున సాక్షి
తనప్రతాపస్ఫూర్తి కినువేఁడి సరిగామి
కతనిబింబము దూఱునరులు సాక్షి
తనధైర్యమహిమకుఁ గనకాద్రి ప్రతిగామి
కచటఁ గాఁపున్న గోత్రారి సాక్షి
తనకాంతికి మృగాంకుఁ డెనగామి కతనితో
సరిపొత్తు మను కర్మసాక్షి సాక్షి

తే. గాఁగ విలసిల్లు ననుపమక్షాత్త్రధర్మ
పరత నృపచక్రి కితఁ డొజ్జబంతి యనఁగ
రాజమృగరాజు వైభవరాజరాజు
భూరిసౌందర్యరతిరాజు పోచిరాజు, ౩౩

క. ఆ పోచిరాజు వంశసు
ధాపారావారమునకుఁ దారాపతి యై
యేపొందుఁ దిరుమలక్షో
ణీపాలుఁ డనంతకీర్తినిత్యోజ్జ్వలుఁడై, ౩౪

సీ. రక్షించినాఁడు హిరణ్యధారావృష్టిఁ
జతురార్థిసంఘాతచాతకముల
శిక్షించినాఁ డుగ్రకౌక్షేయపవిధారఁ
బ్రతిపక్షగిరిలక్షపక్షగరిమ
వీక్షించినాఁడు సద్విభవావహావివాహ
సదనంబు గదనంబు సరియగాఁగఁ
బ్రోక్షించినాఁడు సంపూర్ణదయాధార
వితతాపదాతపావృతులమీఁద

తే. నతఁడు రాజన్యమాత్రుఁడె యవధిశిఖరి
చరమగహ్వరబంహిష్ఠజరఠతిమిర
పటలపాటనపటుమహోభాస్వరుండు
రాజకులహేళి తిరుమలరాయమౌళి. ౪౦

క. ఆ రాజశిఖామణికిన్
ధీరాత్ములు తనయులైరి తిప్పవిభుఁడు గం
భీరరణాంభోరాశి య
పారకృపామూర్తి వల్లభక్షితిపతియున్. ౪౧

వ. అందగ్రజుండు- ౪౨

సీ. తన జయధ్వజమారుతములు వైరికిరీట
ఖచితమణీదీపకళల మలుపఁ
దన శిలీముఖము లుద్ధతవిరోధిశిరోధి
జలజశోణితరసాసవములానఁ
దన తేజములరాతిధరణీశమదనతీ
కబరికానిబిడాంధకారమడఁపఁ
దన వాహినీప్రౌఢి దర్పితప్రతికూల
భూమిభృన్మదభేదమునఁ దలిర్ప
తే. రాజమాంధాతయనఁ బొల్చు రసికలోక
సతతసంరక్షణాస్తోకజాగరూక
నవనవానందహృల్లగ్ననందగోప
బాలకుండైన తిప్పభూపాలకుండు ౪౩

తే అతఁడు రామప్రభుని బానెమాంబయందు
నౌబళేంద్రుని లక్కాంబయందుఁ గనియె
జలజనయనుండు రుక్మిణీజాంబవతుల
యందుఁ బ్రద్యుమ్నసాంబుల నందినట్లు. ౪౪

క. వారలలోన ధురంధరుఁ
డై రామనృపాలుఁ డమరు నమరపురంధ్రీ

చారుకరగ్రహాలీలా
కారణధారాగ్రకుటిలకౌక్షేయకుఁడై. ౪౫

చ. హరిభజనప్రవీణుఁ డగు నాధరణీంద్రుఁడు పైచమాంబికం
బరిణయమై తనూభవులఁ బ్రాజ్ఞులఁ దిమ్మనృపాలు, నోబభూ
వరు, వరదేంద్రుఁ, దిప్పమహివల్లభు, బానెమరాజు, వేంకటే
శ్వరు, నిలఁ జక్రవర్తిఁదృశప్రథితాత్ములఁ గాంచెనార్యులన్.

చ. అరయఁగ నమ్మహీవరుల కగ్రజుఁడై తగు తిమ్మరాజు ని
ర్భరతరధాటికాతురగపాటనమూర్ఛితయౌ ధరాతలో
దరికి నిరామయౌషధవిధానము నిర్జరవైద్యు వేఁడఁగా
నరిగెడులీల నద్భుతసమగ్రరజోవ్రజ మేఁగు నింగికిన్ ౪౬

క. ధర నతఁడు రామనృపసో
దరి యగు కొండాంబయందుఁ దనయునిఁ గాంచెన్
నరనుతు నెఱవేంకటవిభు
హరి సిరియం దతనుఁ గన్న యాకృతి దోఁపన్ ౪౭

క. ఆ వేంకటభూపాలు మ
హావితరణ మెన్నఁ జిత్ర మర్థులకు నతం
డేవేళ నొసఁగ నేర్చియు
నావల యాచకులలేమి యాపాదించెన్. ౪౮

సీ. మిత్త్రిగేహముల నమిత్త్రిగేహమ్ములఁ
గనకసంఘాతమే ఘనుఁడు నిల్పె
ధర్మాగమమున సద్ధర్మాగమమున ని
ర్భరగుణారోపమే రాజొనర్చె
విగ్రహంబున భీమవిగ్రహంబున మహా
విషమాంబకత్వ మే విభుఁడు దాల్చెఁ
గృతుల యందును బలాకృతుల యందును రాగ
భరితవీక్షణ మే నృపాలుఁ డునిచె

తే. జగతి నే రాజు కువలయోత్సవమొనర్చు
రాజుగావున నదసీయరక్షచేతఁ

గౌరి యన్వర్థ మగుఁ జంద్రగుప్తిదుర్గ
మతఁడు విలసిల్లు వేంకటక్షితివరుండు. ౫౦

తే. అతఁడు తిమ్మాంబయందుఁ దిమ్మావనీశుఁ
జిన్నతిమ్మప్రభునిఁ గాంచె సీత యందు
రవికులోద్ధారకుండైన రాఘవుండు
గరిమఁ గుశలవవీరులఁ గన్నకరణి. ౫౧

క. ఈ సంతతిఁ దగు తిమ్మ
క్ష్మాసుత్రామునకుఁ గూర్చి సహజన్మఁ డనన్
భాసిల్లు నోబన్నృపతి శు
నాసీరమహీజవితరణగుణాస్పదుఁడై. ౫౨

చ. సరసనఖప్రసూనభుజశాఖలఁ జెంది వచోమరందమా
ధురిఁ జెలువొంది కీర్తియను తోరపువాసనఁ బొంది సొంపునం
బరఁగు దళంబులం బ్రబలి పండితకీరపరంపరాఫల
స్ఫురణ మొసంగునోబన్నృపపుంగవుఁ డాశ్రితపారిజాతమై. ౫౩

ఉ. భూనుతశౌర్యుఁ డోబన్నృపపుంగవుఁ డుగ్రరణోర్వి భీమబా
హానిశితాసిధార ననతాహితకోటియుదస్తహస్తము
ల్పూని హరింపఁ దద్గళితభూరిసముద్గతఖడ్గము ల్వర
స్థానము చేసినట్లమరు సారెకు వారికి నూర్ధ్వయాత్రకున్. ౫౪

క. అతఁ డోబలాంబయం ద
ప్రతిముని నోబళనృపాలు రామమహీశున్
క్షితిఁ గాంచె విద్యయం ద
ద్భుతధీనిధి వినయబోధములఁ గాంచుగతిన్. ౫౫

క. తదనుజుఁడు వరదభూపతి
సుదతీమకరాంకుఁడమరు సురపురవనితా
విదితవరదానచాతురి
గదిసిన యాత్మీయనామకము సార్థముగన్. ౫౬

వ. తత్క్రమంబున—

సీ అవనీనభోంతరం బాస్యరంధ్రము గాఁగ
ఘనపంక్తి మోముపై కప్పుగాఁగ
హిమశైలవింధ్య శైలములు కొమ్ములు గాఁగఁ
బూర్ణచంద్రుండు మూఁపురము గాఁగ
శరధులు నాలుగు గొరిజెపట్టులు గాఁగ
శైలింపనది గంగడోలు గాఁగ
వాసుకి యాభీలవాలదండము గాంగఁ
దారకల్ కింకిణీతతులు గాఁగ

తే. గరిమఁ జె న్నొందు బసవశంకరమహాంక
మాజి నేరాజశేఖరుం డావహించె
నతఁడు నిలువెల్ల మగఁటిమి యనఁగఁ బరఁగు
రామవిభుతిప్పశౌరి నిర్వారిశారి. ౫౭

సీ. బలధూతధూళిచేఁ బందిళ్ళు సమకట్టి
యహితరక్తము కలయంపి చల్లి
నవయశోరుచివితానవితానములు గట్టి
వివిధవాద్యధ్వనుల్వేలయఁ జేసి
విమతాస్థిపటలచూర్ణముల ముగ్గులు వెట్టి
ద్విజపరంపరలకు విందొనర్చి
దళితారికుంభిముక్తాఫలంబుల సేస
చల్లి ప్రతాపాగ్నిసాక్షిగాఁగ
తే మెఱయు నేరాజు విజయలక్ష్మివివాహ
విదితసన్నాహుఁడై యతఁ డదురుగుండె
పిఱికితండయు లేని గభీరఘోర
రణజయోత్సాహి పాపెమరామవిభుఁడు. ౫౮

చ అతనిసహోదరుండు చతురంబుధివేష్టితభూధురంధరుం
డతులితశౌర్యభీకరభుజాగ్రుఁడు వేంకటరాజు వొల్చు నా
క్షితిపతిదానవాసనల ఖేచరశాఖఁ దిరస్కరింపఁగా
వితతతదీయదుర్యశము విస్ఫుటమౌ నలిమండలాకృతిన్. ౫౯

క. ఈ వంశకర్త యగు తి
ప్పావనిపాలునకుఁ గూర్మియనుజన్ముఁడు దా
నై వెలయున్ వల్లభధా
త్రీవల్లభుఁ డఖిలరాజతేజోనిధియై. ౮౯

సీ. కమలాప్తకమలాప్తకమలాప్తసన్నిభుం
డేవిభుండు రుచిప్రభావదయల
గోరాజగోరాజగోరాజసంకాశుఁ
డేరాజు మతిభోగగౌరవముల
హరిపుత్త్రహరిపుత్త్రహరిపుత్త్రసదృశుఁ డే
ధన్యుఁడు జయరూపదానవిధుల
నాగారినాగారినాగారికల్పుఁ డే
మేటి ప్రాభవవేగపాటవముల
తే. నతఁడు సువిచారుఁ డవికారుఁ డనఘుఁ డలఘుఁ
డప్రమేయుఁ డజయ్యుఁ డతిప్రతాపుఁ
డప్రతిపుఁ డనేకలోకాభినంద్య
చరితుఁ డిం పొందు వల్లభక్ష్మావరుండు ౯౦

ఉ. వల్లభరాజశౌర్యగుణవైభవ మెన్న విచిత్ర మమ్మహీ
వల్లభువైరిరాజి వనవాటిక నుండి నిజాంబుజాస్య త
న్వల్లభ యంచుఁ బిల్వఁగ నవార్యతదుజ్జ్వలనామసంస్మృతిం
బెల్లు వడంకుఁ గాంతపయిఁ బ్రేమము గొంత నెపంబు సేయుచున్.

క. అతులప్రతాపుఁ డా భూ
పతి సోమల్దేవియందుఁ బ్రబలునిఁ దిమ్మ
క్షితిపాలునిఁ గాంచెం బశు
పతి పార్వతియందు గుహునిఁ బడసినభంగిన్. ౯౨

సీ. భోగి మట్టినవానిఁ భోగిఁ జుట్టినవాని
భోగిఁ బట్టినవానిఁ బోలఁ జేర్చుఁ
దమ్మిఁ దాల్చినవానిఁ దమ్మి దొల్చినవానిఁ
దమ్మి మొల్చినవానిఁ దారసించు

మృగము నుంచినవాని మృగముఁ ద్రుంచినవాని
మృగముఁ బెంచినవాని మీఱఁజాలుఁ
గొండ నెక్కినవానిఁ గొండఁ జెక్కినవానిఁ
గొండ గ్రుక్కినవానిఁ గొదవసేయు

తే. ధరణభూతిజవప్రభాదానశక్తి
మతికళాశౌర్యసత్యశుంభత్ప్రభావ
భోగగాంభీర్యగుణములఁ బుడమి నే నృ
పాలకులు సాటి యా తిమ్మపార్థివునకు ? ౬౪

తే. అతఁడు గంగాంబయం దౌబళావనీంద్రు,
మూర్తిఘను, సింగవిభుఁ, గాంచెఁ గీర్తినిధుల
నత్రి యనసూయయందు మున్నబ్జగర్భ
కమలనాథకపర్దులఁ గన్నయట్లు. ౬౫

ఉ. వారలలో గభీరగుణవారిధి వారిధిపంక్తిలో సుధా
వారిధి వోలె భూమిధరవర్గములోఁ గనకాద్రివోలె, దో
స్సారము ధీరముం దెగువ, సత్యము శౌచము, సద్విచార, మా
చారము గల్గి పొల్చె బుధసన్నుతుఁ డౌబళరాజు ధన్యుఁడై.

సీ. అప్పుపాలైన శుభ్రాబ్జంబు రుచి యెంత ?
మాటమోచిన యంచతేట యెంత ?
నీళ్లు మోచిన భవానీభర్తకలి మెంత ?
బిలము దూఱిన శేషుబలిమి యెంత ?
తమ్ములతోఁ బోరు తారేశుకళ యెంత ?
తృణమైన శరపుంజదీప్తి యెంత ?
వండ్లిగిలించుకల్పకశాఖదళ మెంత ?
విరిసినమల్లెలవీఁక యెంత ?

తే. యనుచుఁ దనకీర్తి ధవళాబ్జహంసచందన
మతనవరభోగివిధుశరామర్త్యవిటపి
వికచవిచికిలమాలికావితతిఁ దెగడ
వసుధఁ బాలించు నౌబళభూవల్లభుండు. ౬౭

సీ. ఇతనివైరులు వనప్రతతిలోఁ గాఁపుండ
నన్వర్థ మై ధాత్రి యవని యయ్యె
నితఁ డంతరీపంబు లేల ముద్రాసము
న్నిద్రుఁడై జలధి సముద్రుఁ డయ్యె
నితనియాలము సూఁచి యెల్ల వేల్పులు నిమే
షము మాన ననిమేషసంజ్ఞఁ గనిరి
యితనిసేనాధూళి హిమసేతువులు గప్ప
గారికుఁ డపు దండకారి యయ్యె
తే. నితని కరుణాంబురాశిసంభృతతరంగ
సంగతం బై నమనమున సంచరింప
శౌరి నారాయణుం డయ్యె జగతి ననుచు
సుకవులు నుతింతు రౌబళక్షోణివిభుని. ౧౮

వ. తత్క్రమంబున- ౧౯

సీ. చతురాననాధికశ్రుతిహితశీలుఁడై
విబుధాన్నదానప్రవీణుఁ డగుచు
వసుమతీభారధూర్వహుఁడై నృసింహాత్మ
భాజి యై బలిశిరోరత్న మగుచు
నర్జునకరగర్వహరణసత్కీర్తియై
యతనుశాత్రవధర్మహారి యగుచుఁ
గామపాలాఖ్యుఁడై గరిమ సర్వజ్ఞుఁడై
నరవరోచిత మైననడత యెఱిఁగి
తే. శౌరి బహురూపవిహరణశ్రమముఁ జెంద
లేక యన్ని గుణంబులు నేకమూర్తి
యందు నిరవొందఁ జేసినయట్లు వొల్చు
మూర్తినిర్జితరతిరాజు మూర్తిరాజు. ౨౦

చ. చిరతరకీర్తి మూర్తినృపశేఖరుఁ డాహవదుర్మదారిభూ
వరులఁ గరాగ్రలోలకరవాలముఖమ్మున గ్రుచ్చి యెత్తుఁ ద

ద్వరవరణాభిలాషయుతవాసవలోకవిలాసినీపరం
పరలకు వీరు వల్లభులు పట్టుఁడఁటంచు నొసంగుకైవడిన్. ౨౧

సీ. గురువనీపకుల కాదర మొప్పఁ గొం డని
యొసఁగియుఁ గొం డని యొసఁగకుండు
నమితలావణ్యలీలావ్యాప్తి వేమారుఁ
గినిసియు వేమారు గినియకుండు
వరకీర్తిచే సుధాకరదేవసరసుల
నాడియు సరసుల నాడకుండు
నరులపై నిశితసాయకపంక్తి చేపట్టి
విడిచియుఁ జేపట్టి విడువకుండు
తే. ఫణిపతికి నైన భారతీపతికి నైనఁ
బళుపతికి నైన నలబృహస్పతికి నైన
నవని నవలీలఁ బొగడంగ నలవిగాని
చరితములఁ బొల్చు నా సింగజనవిభుండు ౨౨

చ. చకచకమించు సింగనృపచంద్రుని శాతకృపాణవల్లిలోఁ
బ్రకటవిరోధియూధరథభద్రగజాశ్వవరూథినీకదం
బకములు గానవచ్చు సులభప్రతిబింబితమూర్తులై మహా
జికలితసాధ్వసోదయముచే నసిగర్భముఁజొచ్చెనో యనన్. ౨౩

తే. ఇట్లు సుగుణాభిరాములై యెనయు మూర్తి
ఘనుఁడు, సింగక్షితీంద్రుఁడుఁ దను భజింప
నెలమి భీమార్జునులు గొల్వ నింపుమీఱు
ధర్మసుతుమాడ్కిఁ దగు నోబధరణివిభుఁడు. ౨౪

సీ. ఘనభుజాశౌర్యరాఘవుఁడు రాఘవదేవ
ధరణీశుఁ డేరాజు తాతతాత
నరసుతుఁ డైన పిన్నమరాజు సౌజన్య
ధన్యుఁ డే రాజన్యుతాతతండ్రి

యమితవైభవుఁ డైన యార్వీటిబుక్కభూ
తలనాథుఁ డే రాజు తండ్రి తండ్రి
యసమానదానవిద్యాధురంధరుఁ డగు
రామరాజేంద్రుఁ డే రాజుతండ్రి

తే. యట్టి సోమాన్వయాబ్ధిశీతాంశుఁ డనఁగ
నమరు శ్రీరంగవిభుపుత్త్రి యై చెలంగు
లక్కమాంబను వరియించె లలితశీల
నమ్మహాసాధ్విసోదరు లధికయశులు. ౨౫

క. కోనక్షితిపతి, తిమ్మమ
హీనాథుఁడు, రామనృపతి, యెఱతిమ్మధరా
జానియును, వేంకటేంద్రుఁడు
భూనాయకతిలకు లగుచుఁ బొల్తురు ఘనులై ౨౬

వ. అం దగ్రజుండు— ౨౭

సీ. లాటీకుచాభోగపాటీరపంకంబు
కోటీముఖాబ్జకర్పూరకలన
గౌళీనవీనాంకపాళీదుకూలంబు
చోళీకుచాళీప్రసూనరాజి
యంగీముఖాభంగసంగీతవాణి క
ళింగీవిలాసకేళీమరాళి
భోటీకరస్వచ్ఛ రాజీవకాంతి కాం
భోజీమహాహీరముకురరేఖ

తే. కుంతలీకర్ణమౌక్తికకుండలప్ర
కాశ మెవ్వాని యభినవాకాశదేశ
చంద్రికాయితసత్కీర్తిజాల మతఁడు
ప్రజలు శ్రీరంగవిభుకోనపార్థివుండు ౨౮

వ. తదనుజుండు— ౨౯

AC No 37467

శా. శ్రీరంగప్రభుతిమ్మశౌరి భుజకౌక్షేయంబుచే నాజులన్
వీరారాతులఁ ద్రుంప నా తిరిపతు ల్వేవేగ మార్తాండునిం
దూఱందూఱఁ దదీయమండలసముద్భూతవ్రణశ్రేణికిన్
నీరంధ్రౌషధమార్గభాతిఁ దగు నెంతేఁ దచ్చమూరేణువుల్. ౮౧

వ. తత్క్రమంబున—

సీ. ఖలు నతిద్రోహి సల్కయతిమ్మని హరించి
సకలకర్నాటదేశంబు నిలిపె
నతుని వర్ధితునిఁ దత్సుతునిఁ బట్టముఁ గట్టి
కుతుపనమల్కన క్షోణి నిలిపెఁ
బదిలుఁ డై రాచూరుముదిగల్లు గప్పఁబు
సేయఁ గాంచి సపాదసీమ నిలిపె
శరణన్నమల్కనిజాముని కభయంబొ
సంగి తదీయరాజ్యంబు నిలిపె
తే. నవని యంతయు రామరాజ్యంబు సేసెఁ
దనగుణంబులు కవికల్పితములు గాఁగ
నలవియె రచింప సత్కావ్యములను వెలయ
భూమి నొకరాజమాత్రుఁడే రామవిభుఁడు. ౮౨

సీ. ఖరదూషణాఖర్వగర్వనిర్వాపణం
బాజి నెవ్వానిసాయకనికాయ
మధికతారావరాహంకారవారణో
ద్వేల మెవ్వనియశోవిమలశోభ
వివిధారికామినీవిఘటనాటోప మే
యవనీశు రోషారుణాక్షిరేఖ
పౌలస్త్యనిరసనప్రౌఢిమాఢౌకితం
బేరాజుచారిత్రచారుభూతి
తే. యతఁడు కలియుగనవ్యరామావతార
చారుతాసార్థనామప్రచారుఁ డగుచు

వెలయు బ్రహ్మాండపేటికావితతకీర్తి
ధనుఁడు శ్రీరంగవిభురామధరణిధవుఁడు. ౭౩

సీ. తనభుజాదండకోదండమఖండమై
యనువేలశరవృష్టి నాచరింపఁ
దనహేతిశతకోటిఘనధాళధళ్యమై
ప్రతిపక్షగిరిభిదాపటిమ నెఱపఁ
దనవిగ్రహంబు సజ్జనమనోహారియై
మంజుఘోషాశ్లేషమహిమఁ జెలఁగఁ
దనవైభవంబు సంతానసమగ్రమై
సురభిసంభృతగుణస్ఫురణఁ జెంద
తే. రాజదేవేంద్రుఁ డితఁ డనఁ దేజరిల్లు
ననఘచాళుక్యనారాయణాంకవివిధ
బిరుద, మన్నెవిభాళాదిబిరుదశాలి
ప్రాభవోపేంద్రుఁ డెఱతిమ్మపార్థివుండు. ౭౪

సీ. అసురారిరాణి నే నధివసించుట యెట్లు
బహువిధాసురవంశభవులయందు
సురలోకధేనుసోదరి నేను నిలుచు టె
ట్లకట! గోఘాతపాతకుల యందుఁ
ద్రైలోక్యమాత నేఁ దగిలియుండుట యెట్లు
త్రైలోక్యకంటకోద్ధతుల యందు
దేవతారాధ్య నేఁ జిరముగాఁ దగు టెట్లు
కడుదేవతాద్రోహకరుల యందు
తే. ననుచు యవనులఁ దెగడి తన్నాశ్రయింప
వచ్చు సామ్రాజ్యలక్ష్మి నెవ్వాఁడు గొనియె
నాహవోగ్రబరీదసప్తాంగహారణుఁ
డతఁడు విలసిల్లు శ్రీవేంకటాద్రివిభుఁడు. ౭౫

మ. ప్రతికూలావనిభృద్విభేదనకళాపారీణమై సంగర
క్షితిలో వేంకటరాజశేఖరుని కౌక్షేయంబు కృష్ణాధిక

ద్యుతిఁ జెన్నొందఁ దదీయధారఁ బడి కా! దోషాకరుల్ యావ
న్నతిపుల్గాంచిరి నాకలోకవనితాశృంగారసాంగత్యముల్. ౮౬

మ. బలధుర్యుం డగు వేంకటేంద్రునిమహాబాహాబలాటోపవి
హ్వాలుఁడై ము న్నతిధావనక్రియ సహాదాళిఖ్యుఁడై నట్టి యే
దులఖానుం డిదె నేఁడు గ్రమ్మఱ సహాదుం డయ్యెనా! నర్మిలిం
దలఁ దత్పాదముఁ దాల్చె భీమరథిపొంతం గావ నిత్యోన్నతిన్ ౮౭

మ. స్థిరసంగ్రామజయాభిరాముఁడగు నా శ్రీ వేంకటక్ష్మావరుం
డరయన్ రాజశిఖావతంసుఁడగుఁ దథ్యం బర్విఁ; గాకున్న నీ
ధరణీపాలకు లెల్ల మెచ్చఁగ సహాదక్షోణిభృత్ప్రాప్తధా
సురదుర్గాధిపతిత్వమై భవభవస్ఫూర్తి న్విజృంభించునే? ౮౮

క. ఈ రాజమణులసోదరి
యై రాజిలు లక్ష్మమాంబ యమృతాశనధా
త్రీరుహముల కై దింటికి
నారయఁ దోఁబుట్టు వగు రమాంగనపగిదిన్. ౮౯

సీ. ప్రతివచ్చు నన్నపూర్ణాదేవి కై తాన్న
మిడక సంయమి నలయింపకున్నఁ
దాటి సేయఁగ వచ్చు భాగీరథి నతంబు
పుట్టి పెన్ డాఁగ నై మొరయకున్న
సరి వచ్చు భూకాంత సకలప్రజాభార
పూర్ణసహత్వంబుఁ బూన కున్న
రూపింపవచ్చు నరుంధతి నే ప్రొద్దుఁ
దన యల్పభావంబుఁ దాల్ప కున్న
తే. నిమ్మహాసాధ్వి కని జను లెల్లఁ బొగడ
నలరు నోబళశౌరి కర్ధాంగలక్ష్మి
బాంధవావనధుర్యయై భవకదంబ
లలితసద్గుణనికురుంబ లక్ష్మమాంబ. ౯౦

కం. పౌలోమికి నింద్రునకు మ
హాలలితాకృతి జయంతుఁ డాత్మజుఁ డైన
ట్లా లక్కమాంబ కోబన్న
పాలునకు నృసింహధరణిపతి జనియించెన్. ౯౧

సీ. కాశ్యపి తా నౌటఁ గశ్యపోద్భవుఁ డైన
కాకోదరస్వామిఁ గలయు టెట్టు?
ధాత్రి యౌ తనపయోధారచేఁ బెరిగిన
కమఠకులాధీశుఁ గవయు టెట్టు?
తగ ధేను వగువేళఁ దర్ణకం బగు ధరా
ధరశిరోమణిఁ గూడఁ దలఁచు టెట్టు?
తనక యావిర్భవించిన వంచనామహా
క్రోడంబుతోఁ గూడి యాడు టెట్టు?
తే. తగవుగా దంచు ఫణికూర్మధరణిధరవ
రాదిభూధారముల మాని యవనికాంత
తనభుజాదండమున నుండఁ దనరు చుండు
సరసగుణహారి యోబయనరసశౌరి. ౯౨

కం. అతఁ డిల రామయతిమ్మ
క్షితిపతిసత్పుత్త్రిఁ దగుచుఁ జెలువొందు గుణా
న్వితుఁ దగు తిరుమలధాత్రీ
పతితనయం దిరుమలాంబఁ బరిణయ మయ్యెన్ ౯౩

సీ. పొలువగు నే సాధ్వి భుజవల్లి రుక్మిణి;
సత్య యే గరిత వాచావిశుద్ధి;
జనకనందిని యే విశాలాక్షిమతిరేఖ;
భద్ర యే మగువ శోభనవినీతి;
యనసూయ యే కుటుంబిని దృష్టి; సర్వమం
గళ యే శుభాంగన లలితరీతి
ధృతి సుదక్షిణ యే పతివ్రత; కరుణ సు
పతాకాంత యే యింతి భవ్యమూర్తి

తే. యట్టి గుణధన్య యై తనయాత్మ యెల్ల
నఖిలపతిదేవతాసంగ్రహం బనంగ
నలరు నలవీరవల్లి తిమ్మార్యసీంద్ర
శరధిమందారవల్లి యై తిరుమలాంబ. ౯౪

తే. ఆ మగువయందు నరసింహభూమివిభుఁడు
రసికసారంగరాజు శ్రీరంగరాజుఁ
గనియె ననఘుని దేవకీకాంతయందు
ఘనుఁడు వసుదేవుఁ డచ్యుతుఁ గన్న పగిది. ౯౫

క. అతఁ డుభయవంశపావనుఁ
డితఁ డన బాలార్కవిజయహేవాకవిభా
వీతతియు నమందమంద
స్మితచంద్రాతపముఁ దాల్చు శ్రీరంజితుఁడై. ౯౬

సీ. ఘనతఁ జే సాఁపనేర్చిననాఁట నుండియు
శత్రులమీఁదఁ జేఁ జాఁప నేర్చె
ననయంబు నడుగువెట్టిననాఁట నుండియు
నరిశిరంబులమీఁద నడుగువెట్టె
నవనీతము గ్రసించునాఁట నుండియు వైరి
కులయశోనవనీతములు గ్రసించె
నవపాంసుగతిఁ జెందునాఁట నుండియు ఖిలా
ఖిలధాటీపాంసుకేళిఁ జెందె
తే. నిలువ నేర్చిననాఁటనుండియు విరోధి
నృపతిసేనాపతుల గెల్చి నిలువ నేర్చె
నరసవిభునిసిరంగ భూనాథవిభుఁడు
ప్రబలెఁ బ్రబలుచు నున్నాఁడు ప్రబలఁగలఁడు. ౯౭

వ. ఈ కుమారనారాయణుం గాంచిన రాజన్యపుంగవునకు - ౯౮

క. ఏతాదృశగుణమణికి ధ
రాతలపరిపూర్ణ కీర్తిగమణికి, జలధి

వ్రాతవృతధరణీభరణస
మాతతనిజభుజభుజంగమగ్రామణికిన్; ౯౯

క. ధన్యునకుఁ, దరణికులమూ
ర్ధన్యునకు, నిజప్రధానిరత్నవదాన్య
మ్మన్యున, కరాతినృపప
ర్జన్యనిబంధనవిశేషశతమన్యునకున్; ౧౦౦

క. అజరగజరజతరజనీకృ
దజతనుజద్యుకుజపురజిదజభుజగజరు
గ్ధ్వజవిజయనిజయశోమయ
సుజనసుతధ్వజున, కధికశోభానిధికిన్; ౧౦౧

క. గండరగండని, కభినవ
మండలికాఖండమన్నెమార్తాండునకున్
జండప్రతాపపిహితా
ఖండునకున్ లోభిమన్నియరగండనికిన్, ౧౦౨

క లక్కాంతానందనునకు,
దిక్కాంతాచికురనికరదీపితకుసుమ
స్రక్కాంతదంతురయశో
ధక్కానిధి, కహితకరిఘటాభీమునకున్, ౧౦౩

క. గాధేయగోత్రసవనధు
రాధేయున, కఖిలసుకవిరాజకళాధా
రాధేయదానవిద్యా
రాధేయునకును, ధరామరవిధేయునకున్; ౧౦౪

క. గర్వితబరీదసేనా
సర్వస్వహరానివార్యశౌర్యునకు, సమి
ద్దూర్వహపాదభయదా
ఖర్వమహావిజయభేరికాభాంకృతికిన్; ౧౦౫

క. పీనసమలాక్స్థాపన
మానితకరుణాప్రసంగమాంగళ్యునకున్,

ధీనిధికి, నృహరిచరణ
ధ్యానవిధానావధానధౌరేయునకున్, ౧౦౬

క. తోరగంటి దుర్గరాజ్య
స్థిరసింహాసననివాసదీక్షానిధికిన్
వరయంత్రమత్స్యభేదన
బిరుదోద్దండునకు గండభేరుండునకున్, ౧౦౭

క. ప్రతిదినకనకవసంతా
ర్జితకృతికాంతునకుఁ దురగరేవంతునకున్
గ్రతుపురనారాయణగృహ
వితతప్రాకారఘటనవిఖ్యాతునకున్; ౧౦౮

క అరుణారుణకరుణారస
పరిణామసమగ్రనయనపద్మాక్షునకున్,
శరణాగతభరణాపర
నరసింహున, కోబళారినరసింహునకున్ ౧౦౯

వ. అభ్యుదయపరంపరాభివృద్ధిగా నా యొనర్పం బూనిన యిమ్మహాలంకారప్రబంధంబునకు నాదికారణం బగు నాయకగుణవ్రాతంబభివర్ణించెద. ౧౧౦

ప్రథమాశ్వాసము

నాయకగుణములు

క. కులము, మహాభాగ్యము ను
జ్జ్వలత, యుదారత, మహావిశాలత, ధర్మా
కలనయు వైదగ్ధియు నన
నిలనాయకగుణము లమరు నివి యేర్పఱతున్. ౧౧౧

ప్రతాపరుద్రీయకర్తయగు విద్యానాథునివలెనే రామరాజభూషణుఁడును మొట్టమొదట నాయకగుణములనుగూర్చి వచించెను విద్యానాథుఁడు "పూర్వుల యలంకారగ్రంథములు పెక్కున్నను ఈ నా గ్రంథమును వ్రాయుటకుఁ

గారణ మిట్లు తెలిపెను "పూర్వాలంకారగ్రంథము లందు దేనియందును నామూలాగ్రముగా నొకే నాయకుఁడు వర్ణింపఁబడలేదు. కావ్యమహత్త్వము నాయకునిఁ బట్టి యుండును, కావున లోకోత్తరనాయకుఁ డగు ప్రతాపరుద్రుని నాయకునిగా పరిగణించి యీ గ్రంథమును వ్రాయుచున్నాను" రామరాజభూషణుఁడును నిందలి ౨౩ ౨౪ పద్యములచే నీ యాశయమునే తెలిపెను వానిని మఱల నిట నుదాహరింతును

"కం. బంధురతరప్రబంధ్ధల బంధముల కనంతకీర్తి భాగ్యప్రదధౌ
రంధర్యగ్రంథిలము వ సుంధర ననవద్యరమణసుగుణ స్తవముల్.

అనవద్యుఁ డగు రమణుని (నాయకుని) సద్గుణ స్తవము (వర్ణనము) బంధురతరమైన (మిక్కిలి సుందరములైన) ప్రబంధ్ధల (ప్రబంధకర్తల యొక్క) బంధములకు (కావ్యబంధములకు)ఁ గీర్తిభాగ్యము నిచ్చుటయందు సమర్థము అనఁగా నాయకునిఁబట్టి కావ్యబంధములకుఁ గీర్తివచ్చును.

సీ. రామాయణాదిక గంథంబు లనవద్యనేతృవర్ణనల వన్నియకు నెక్కె,
వైశేషికాదినానాశాస్త్రములు శివ ప్రతిపాదనమున సన్నుతివహించె;
సంధ్యాదిమంత్రముల్ శర్వాదీశ్వరనామ జపసాధనత సనశ్వరము లయ్యెఁ
బలుకులొండొంటికిఁ బ్రామిన్నులును బర బ్రహ్మగోచరములై ప్రణుతిఁగాంచె
గీ ననినఁ గావ్యం బమేయనాయకవికస్వ రస్వరూపనిరూపణభాజియగుట
వేఱవివరింపనేల? బంగారమునకుఁ జటులసౌరభ్యలహరి యబ్బుటయకాదె?"

రామాయణాదిగ్రంథములు నాయకునిఁబట్టియే ప్రసిద్ధి వహించినవి వైశేషికాది శాస్త్రములు శివప్రతిపాదన మూలముననే వన్నె వహించెను, సంధ్యాది మంత్రములుగూడ నీశ్వరనామజపమునకు సాధనము లగుటచేతనే సువిఖ్యాతములయ్యెను. వేదములుగూడఁ బరబ్రహ్మవర్ణనాత్మకము లగుటచేతనే నిత్యములైనవి ఈ విధమున వేదశాస్త్రాదులకును మహాపురుషవర్ణనముననే గణ్యత సంభవించుచున్నది. ఇఁకఁ గావ్యమునుగూర్చి చెప్పనేల? కావ్యమునకు నుత్తమ నాయకుఁడు దొరకుట బంగారమునకుఁ బరిమళ మబ్బుటకదా?

మఱియుఁ గావ్యమహిమ నీ క్రింది విధమున దెలిపి యున్నాఁడు-

"శా. వేదంబుల్ నృపశాసనంబులు, సుహృద్విజ్ఞాపనంబుల్ పురా
ణాదిగ్రంథము· లంగనాజనవిలాసాలాప లీలాసమ
ప్రాదుర్భావము లౌర? కావ్యములు కర్తవ్యోపదేశ క్రియా
వాదప్రక్రియ నెన్నఁ, గావ్యమహిమల్ వర్ణింపఁగా శక్యమే"

లోకమునకుఁ గర్తవ్యోపదేశమున వేదములు ప్రభుసమ్మితములు, పురాణములు సుహృత్సమ్మితములు కావ్యములు కాంతాసమ్మితములు కావునఁ గావ్యమహిమ వర్ణింప సాధ్యము గాదు మఱియు,

"మ. పరమజ్ఞానలతాలవాలము జగత్ప్రఖ్యాత సా
గరచంద్రోదయ మిష్టసంఘటనరేఖాదివ్య ధేనూత్తమం
బురుకార్పణ్యదశాదిశాదినముఖం బుద్వేలనిర్వాణభ
వ్యరసాస్వాదరసాయనం బనినఁ గావ్యం బెన్న సామాన్యమే ।

శ్లో. కావ్యం యశసేఽర్థకృతే । వ్యవహారవిదే శివేతరక్షతయే
సద్యఃపరనిర్వృతయే కాంతాసమ్మితతయోపదేశయుజే."

అను శ్లోకమున కిది యనువాదరూపము కావ్యము జ్ఞానలతల కాలవాలము (వ్యవహారవిదే) ప్రఖ్యాతి యను సాగరమునకుఁ జంద్రోదయము (యశసే) ఇష్ట సంఘటనమునఁ గామధేనువు (అర్థకృతే) కార్పణ్యదశాదిశాదినముఖము (శివేతరక్షతయే) ఉద్వేలనిర్వాణభవ్యరసాస్వాదరసాయనము (సద్యఃపర నిర్వృతయే) కానఁ గావ్యమహిమ యసామాన్యము.

కం. కావున నేవంవిధసుగు ణావాసంబైన కావ్య మలరును నవర
త్నావేలహారవల్లిక క్రైవడి ననవద్యనాయకభ్రాజితమై

ఇట్టి సుగుణముల కావాసమైన కావ్యము మహనీయుఁడగు నాయకునిఁ బట్టి నాయకమణిచే విరాజిల్లు నవరత్నహారమువలె జగజ్జేగీయ్యమానమై వెలయును.

మ. అని యూహించి మదీయసంఘటిత కావ్యాలంక్రియాసంగ్రహం
బనఘం బై వెలుఁగొంద కున్నె రఘువంశాధీశ్వరుం డౌ నృసిం
హనృపాలాగ్రణికీర్తివర్ణనముచే? నాకాంతవిక్రాంతపా
వనమౌఁ గావున నందు నాయకమహావంశంబు వర్ణించెదన్

కావున నా కావ్యాలంకారసంగ్రహము సూర్యవంశ్యుఁడగు నరసభూపాలుని కీర్తివర్ణనముచే వెలుఁగొందకుండునే? కానఁ బవిత్రమగు నాతని వంశమును వర్ణించెద."

ఈ గ్రంథమునకుఁ గావ్యాలంకారసంగ్రహ మనిపేరు ఇది ప్రతాపరుద్రీయమున కనువాదము గాదు కాని ప్రతిబింబరూపము అందుఁ బ్రతాపరుద్రుఁడు నాయకుఁడు ఇందు నరసభూపాలుఁడు నాయకుఁడు రామరాజభూషణుఁడు ప్రతాపరుద్రీయమునే యొజ్జబంతిగా నిడుకొని కావ్యాలంకారసంగ్రహమును విరచించెను ఇందలి లక్షణములు ప్రతాపరుద్రీయము నుండియే గ్రహింపఁబడినవి. లక్ష్యములు మాత్రము స్వతంత్రములు కొన్ని యనువాద రూపములే కలవు.

కావ్యలక్షణములను గూర్చి తెలుపు శాస్త్రమున కలంకారశాస్త్రమనియు సాహిత్యశాస్త్రమనియు సంస్కృతమున నామములు గలవు ప్రాచీనులగు భామహాదిపండితులు కావ్యమున కలంకారములే ప్రధానమనితలఁచితమ గ్రంథము

లలో నధికభాగమలంకారములను గూర్చియే చర్చించుటంబట్టియు, భామహాలంకారము రుద్రటాలంకారము కావ్యాలంకారసంగ్రహము (వామనకర్తృకము) అని పేళ్ళు పెట్టుకొని యుండుటంబట్టియు నీశాస్త్రమున కలంకారశాస్త్ర మని పేరు వచ్చినది లెస్సగా విచారింప సాహిత్యశాస్త్ర మను పేరే తగినది. ఏలన సాహిత్య మన "శబ్దార్థయోర్యథావత్సహభావేన విద్యా సాహిత్యవిద్యా" (శబ్దార్థములను అన్యూనానతిరిక్తముగా సహభావముతోఁ బవర్తిల్లఁజేయు విద్య) యని రాజశేఖరుఁడు భామహాదులు "శబ్దార్థౌసహితౌ కావ్యం" (సహితములగు శబ్దార్థములు కావ్యము) అని చెప్పిరి వ్యక్తివివేకటీకాకారుఁడు ("సాహిత్యం తుల్యకక్షత్వేన అన్యూనానతిరిక్తత్వం" (సాహిత్య మన శబ్దార్థములకు సమానమగు హక్కుగలిగి యొకటి హెచ్చుగాఁ గాని యొకటి తచ్చుగాఁగాని లేకుండుట) అని *వ్యాఖ్యానించెను. కాన సాహిత్యవిద్య యన శబ్దార్థరూపమగు కావ్యవిద్య యని తేలినది. ప్రాచీన గ్రంథములలో సాహిత్య విద్య యనియే పెక్కండ్రు వ్యవహరించిరి ఈ సాహిత్య విమర్శలకు నాలంకారికులనియే వ్యవహారము.

ఈ సాహిత్యశాస్త్ర మను పద మలంకారశాస్త్రపర్యాయముగా క్రీ. శ ౯౦౦ సంవత్సరములకుఁ బూర్వమే స్థిరపడియున్నట్లు కనఁబడుచున్నది. మిగిలిన శాస్త్రములకన్న సాహిత్యశాస్త్ర మవశ్యపఠనీయ మనియు దానినిఁ జదువనివాఁ డెట్టి దిగ్దంతివంటి పండితుఁడైనను వానినిఁ దాను గౌరవింపననియు బండిత రాయలవారీ క్రింది శ్లోకమును రచించిరి.

"వ్యాసతు సతు గౌతమతు వ్యాళేంద్రతు యస్య నాస్తి సాహిత్యం
తం ప్రతి సం ప్రతి కం ప్రతి శిరోమమ తిరశ్చన పురశ్చ"

తా వ్యాసుఁడుగానిమ్ము గౌతముఁడు గానిమ్ము, పతంజలిగానిమ్ము; సాహిత్యశాస్త్రము రానివాఁ డెవ్వఁడయినను సరియే, వానిని నా శిరస్సు తిరస్కరింపదు పురస్కరింపదు. అనఁగా వాని కీఁదగిన గౌరవమీయదు.

మఱియు నీ సాహిత్యశాస్త్రము వ్యాకరణశాస్త్రమునకుఁ బరిశిష్ట మనియుఁ బుచ్ఛభూతమనియుఁ గొందఱనిరి ఏలన వైయాకరణులయొక్కయు నాలంకారికుల యొక్కయు సిద్ధాంతము తొక్కటే ఈ విషయము విపులముగా వామనాచార్య ఝలకీకర్ పండితుఁడు కావ్య ప్రకాశప్రస్తావనలో వ్రాసెను.

---

* "సహితంరససంయుక్తంతదేవసాహిత్యం" (రసయుక్తమైనదే సాహిత్యము) "హితేన నిరతిశయప్రేమాస్పదేన రసేనసహితం తదేవసాహిత్యం" (నిరతిశయప్రేమాస్పదమైన రసముతోఁ గూడినదే సాహిత్యము) అనియును నాధునికులు వ్యుత్పత్తినిఁ జెప్పుదురు.

అట్టి సాహిత్యశాస్త్రము నాంధ్రభాషలో రచించిన రామరాజభూషణుఁ డిటనంద నీయుఁడు గదా

మొదటి 'కులము మహాభాగ్యము' అను పద్యమున నాయక గుణము లేడు నిరూపింపఁబడినవి. నాయకుఁడన 'నయతి వృత్తం ఫలం ప్రాప్నోతి చ' (ఇతివృత్తము నాశ్రయించుచు లేక నడిపించుచు ఫలమును బొందువాఁడు) అను వ్యుత్పత్త్యర్థముచేఁ బ్రబంధవ్యాపి యగు ఫలమును బొందువాఁడు. ప్రతాపరుద్రీయమునఁగూడ నీ యేడుగుణములే చెప్పఁబడినవి కాని తుదివి "ధార్మికత్వాదయోగుణాః" అని చెప్పఁబడుటచే నాదిపదముచే మహామహిమత్వము పాండిత్యము మొదలగు గుణములుగూడ నీ జాబితాలోఁ జేర్పఁబడు చున్నవి ఇట్టుమూర్తి 'ఆది' పదమును బ్రయోగింపమి నీ యేడే గుణములు చెప్పినట్లయినది. సాహిత్యదర్పణమున-

త్యాగీ కృతీ కులీనః సుశ్రీకో రూపయౌవనోత్సాహీ
దక్షోఽనురక్తలోకస్తేజోవైదగ్ధ్య శీలవాన్ నేతా

తా. "త్యాగము కృతజ్ఞత కులీనత్వము సుశ్రీకత్వము (మహాభాగ్యము) రూపవత్త్వము యౌవనము ఉత్సాహము (కార్యనిర్వహణ సామర్థ్యము), సర్వజనానురాగము తేజము వైదగ్ధ్యము శీలము అను గుణములు గలవాఁడు నాయకుఁడు" అని చెప్పఁబడియున్నది. ఇందుఁ బండ్రెండు గుణము లున్నవి.

దశరూపకమున నాయకలక్షణ మిటు చెప్పఁబడియున్నది :

నేతా వినీతో మధురస్త్యాగీ దక్షః ప్రియంవదః
రక్తలోకశ్శుచిర్వాగ్మీ రూఢవంశః స్థిరోయువా
బుద్ధ్యుత్సాహస్మృతిప్రజ్ఞాకళామానసమన్వితః
శూరో దృఢశ్చతేజస్వీ శాస్త్రచక్షుశ్చ ధార్మికః

వినీతత్వము, మధురత్వము (ప్రియదర్శనత్వము) త్యాగము దక్షత, ప్రియంవదత్వము జనానురాగము శుచిత్వము వాక్కౌశల్యము, ప్రసిద్ధవంశ్యత్వము (కులీనత్వము) స్థిరత్వము (ధీరత్వము), యౌవనము బుద్ధిమత్త్వము, ఉత్సాహము, స్మృతిమత్త్వము, ప్రజ్ఞావత్త్వము. కళావత్త్వము మానము, శౌర్యము దృఢత్వము (పట్టుదల) తేజము శాస్త్రచక్షుష్ట్వము, ధార్మికత్వము అను గుణములుగలవాఁడు నాయకుఁడు

కావ్యముపదేశాత్మకముగా నుండవలయును కానఁ గావ్యనాయకుఁడు త్తమ పకృతికుఁడై యుండవలయును. కావ నుపరినిరూపిత గుణములు నాయకున కుండవలయునని పెద్దలు నుడివిరి ఇన్నిగుణములు సరిగా నొక్కచో సంఘటిల్లవు. కొన్ని తక్కువగా నున్నను నాయకునియందు దోషారోపణము సేయరాదు

కం. వీనికి లక్ష్యములెల్లను
శ్రీనరసింహేంద్రు పేరఁ జెప్పెద నెలమిన్
నానావిధ క్తిసూచిత
నానావిధపద్యగుంభనసముగ్రమ్ముగాన్. ౧౧౨

ఈ గ్రంథకర్త నరసభూపాలునిఁ గృతినాయకునిగా వరించి యాతని నామాంకితముగా లక్ష్యములను రచించెను.

౧. కులీనత

లక్షణపద్యమున (౧౧౧) కులము అని కలదు కులీనత యనఁగా సత్కులమునఁ బుట్టుట యని యర్థము 'మహాకులీనతా నామ కులే మహతి సంభవః' (గొప్పకులమున జన్మించుట మహాకులీనత) అని ప్రతాపరుద్రీయ లక్షణము అనఁగాఁ బ్రబంధనాయకుఁడుత్తమకులజాతుఁడై యుండవలెను. కావ్యముపదేశాత్మకముగా నుండవలె నని యాలంకారికుల యభిప్రాయమగుటచే నుత్తమనాయకచరిత్రమే యుపదేశార్హము. కావున నిటఁ గులీనత నాయకుని ప్రథమగుణముగాఁ జేర్కొనఁ బడినది

సీ. ఏ వంశమునఁ బుట్టెఁ బావన *శ్రుతిధర్మ
మర్మకర్మఠుఁడైన మనునృపాలుఁ
డే వంశమునఁ బుట్టె నింద్రాదు లరుదంద
సత్యమాడిన హరిశ్చంద్రనృపతి
యే వంశమునఁ బుట్టె నిలఁ జతుర్దశలోక
రక్షణక్షముఁడైన రావణారి
ఏ వంశమునఁ బుట్టె నిహపరాద్భుతపుణ్య
చరితధుర్యుఁడు చోళచక్రవర్తి
గీ. అట్టి యిందుగ్రహాదిసేనాధిపత్య
సత్యయశుఁడైన భానువంశమునఁ బుట్టి
పరగు భూపాలసింహు నోబయనృసింహుఁ
దలఁపఁ గలికాలకలుషంబు దొలఁగు టరుదె! ౧౧౩

* శ్రుతిధర్మ (పాఠాంతరము) స్మృతిధర్మ

తా. మనువు హరిశ్చంద్రుఁడు శ్రీరాముఁడు చోళుఁడు మొదలగు మహారాజులు జన్మించిన సూర్యవంశమున నరసభూపాలుఁడును జన్మించెను ఈ పద్యమున నాయకుని 'కులీనత' పేర్కొనఁబడినది.

౨. మహాభాగ్యము

"విశ్వంభరాధిపత్యం యత్తన్మహాభాగ్యముచ్యతే" (భూమండలాధిపత్యమే మహాభాగ్యము) అని ప్రతాపరుద్రీయము

మ. ప్రకటాఖిలవిరోధిసైన్యములఁ ద్రుంపంజాలు నొక్కొక్కసే
వకుఁడే, వారణవాజిశాలలు *నమద్వైరిక్షితీంద్రార్పితా
ధిక వేదండహయాన్వితంబులు; భుజాదీప్తాంగదం బుర్వి; భా
గ్యకళావైభవ మెన్న శక్యమె నృసింహక్ష్మాతలస్వామికిన్ !

తా. ఒక్కొక్క సేవకుఁడే భయంకరశత్రుసైన్యములఁ ద్రుంచును. గజాశ్వశాలలు లొంగిపోయిన శత్రురాజు లిచ్చిన గజాశ్వములతో నిండియున్నవి. భూమి భుజమున నంగద ప్రాయముగా నుండెను నరసభూపాలుని భాగ్యమే భాగ్యము

౩. ఉజ్జ్వలత (ఔజ్జ్వల్యము)

"రూపసంపన్నదేహత్వ మౌజ్జ్వల్యం పరికీర్త్యతే (స్ఫురద్రూపము గలిగి యుండుట యౌజ్జ్వల్యము) ప్ర. రు. లక్షణము.

మ. స్థిరసోమాన్వయదుగ్ధవార్ధి జనియించెన్ వేంకటాద్రీంద్రభూ
వరచంద్రుండు, తదీయసోదరి రమావామాక్షి లక్కాంబ యై
పరగెం; దద్వనితాశిరోమణికి *నోబక్షోణిపాలేంద్రు శ్రీ
నరసింహాధిపుఁడై జనించె మరుఁ డౌన్నత్యంబు దీపింపఁగన్.

తా. చంద్రవంశమను పాలసముద్రమున వేంకటాద్రిరాజను చంద్రుఁడును లక్కాంబ యను లక్ష్మియు నన్నయుఁ జెల్లెలునై జన్మించిరి. ఆలక్కాంబకును నోబక్షోణిపాలునకు నరసభూపాలుఁ డను మన్మథుఁ డుదయించెను.

ఈ పద్యమున లక్కాంబ యను లక్ష్మియందు నోబక్ష్మాపాలుఁ డను విష్ణుమూర్తివలన నరసభూపాలుఁడను మరుఁ డుదయించె నని చెప్పుటవలన నరసభూపాలుఁడు మదనమోహనమూర్తి య) సారాంశము. ఇదియే యౌజ్జ్వల్యము. కేవలము మరుఁ డని చెప్పక యాతని సౌందర్యవిశేషము వర్ణింపవలయును ఇట నరసరాజు సౌందర్యము వర్ణింపఁబడలేదు.

*నమద్వైరి (పా) మహావైరి

*ఓబక్షోణిపాలేంద్రు శ్రీ (పా) ఓబక్షోణిపోపేంద్రకున్.

४. ఔదార్యము (ఉదారత)

"యద్విశ్రాణనశాలిత్వ మౌదార్యం తన్నిగద్యతే" (దానశీలము గలిగి యుండుటయే యౌదార్యము) అని ప్ర. రు. లక్షణము.

సీ. అల బలీంద్రునిచేత నడుగు పెట్టఁగ నేర్చి
ధారాధరముచేత నీరువోసి
కానీనుచేఁ గంచుకముఁ బూనఁగా నేర్చి
యెలమి దధీచిచే నెముక బలిసి
క్షీరాంబురాశి *దెచ్చిన వెన్న నీడేరి
నై లింపగవిచన్నుఁ బాలఁ బెరిగి
కల్పపాదపఫలోత్కరముల చవిఁ గాంచి
వనజారినెమ్మేన నవఁగి పెనఁగి

గీ. ధరణిఁ బ్రోదివహించిన దానకన్య
సకలయాచకబాంధవుల్ సన్నుతింప
నీ కరగ్రహణావాప్తి నెఱసె నౌర!
పరసగుణహార! టెంకయనరసధీర! ౧౧౬

తా. బలిచక్రవర్తివలన జనించి మేఘుఁడు స్నాన మాడింపఁగాఁ, గర్ణుఁడు కంచుకముఁ (చొక్కా) దొడుగఁగా దధీచివలన నెముకబలియఁగా, క్షీరసముద్రుఁ డొసఁగిన యమృతముచే వర్ధిల్లి కామధేనువుచనుబాలఁ బెరిగి కల్పవృక్షము పండ్లరసమును గ్రోలి చంద్రుని శరీరమున నవఁగి పెనఁగి (చంద్రునిచే నెత్తుకొనఁబడి) లోకమున వర్ధిల్లిన దానకన్య నీ పాణిగ్రహణము సేసెను.

ఇందుఁ బెద్దదాత లగు బలి (వామనునికి మూఁ డడుగులు దాన మొనర్చి సర్వస్వమును గోలుపోయినవాఁడు) మేఘుఁడు (అయాచితముగా వర్షోదకము లిచ్చువాఁడు) కర్ణుఁడు (సహజకవచకుండలములను దానమొనర్చిన వాఁడు), దధీచి (ప్రాణత్యాగము సేసి వెన్నెముక నింద్రునికి దానముసేసిన వాఁడు), సముద్రుఁడు (తన యమృతమును దేవతల కొసఁగినవాఁడు) కామ ధేనువు కల్పవృక్షము చంద్రుఁడు (తన కళలను దేవతల కాహారముగా నిచ్చినవాఁడు) అనువారలచే దానకన్య క్రమక్రమాభివృద్ధిని బొంది తుదికి నీ కేలు పట్టినది—అని చెప్పుటచే నీవు మహోదారుఁడ వని స్ఫుట మగుచున్నది

*దెచ్చిన (పా) దెచ్చిన

కానీ దానకన్య నీ పాణిగ్రహము సేసినదనుటకన్న నరసభూపాలుఁడు సేసిన దానములను గవి వర్ణింపవలయును ప్రతాపరుద్రీయమున —

"సమంతా దుద్భూతై ర్ద్విరదమదగంధై స్సురభయః
క్రియంతే యద్విద్వజ్జనమణిగృహప్రాంగణభువః"

తా "ప్రతాపరుద్రమహారాజుచే మొదట విద్వాంసుల గృహములు మణిగృహములుగాఁ జేయఁబడినవి పిమ్మట వారి ముంగిళ్ళు కరిమదముచేఁ బరిమళవంతములుగా నొనర్పఁబడినవి అని చెప్పఁబడినది ఇచటఁ బ్రతాపరుద్రుని దాతృత్వము వ్యంగ్యముగా గోచరించునట్లు నరసభూపాలీయపద్యమున గోచరించుట లేదు.

౫. మహోవిశాలత (తేజస్విత)

"జగత్ప్రకాశకత్వం య త్తేజస్విత్వం తదుచ్యతే (జగత్తును బ్రకాశింపఁ జేయుట) తేజస్విత్వము అని ప్ర రు లక్షణము.

సీ. బహుతరాశాక్రాంతి బయలు ప్రాఁకకయున్నఁ
గువలయద్వేషంబుఁ గోరకున్న
మీటితమ్ముల *విరిపోటుసేయక యున్న
వారుణీసక్తికిఁ బాఱకున్న
జగతి నందఱికిని బగలొనర్పక యున్న
దోషాభిభూతుఁడై తొలఁగకున్న
ద్విజరాజపరిభవోద్వృత్తి సేకొనకున్న
పరసుల నింకింపఁ జాలకున్న

గీ. సాటి యగు విశ్వవినుతశశ్వత్ప్రతాప
వైభవధ్వస్త దుర్వార వైరివీరుఁ
డైన యోబయనరసింహు నమితభువన
భవనభృతతేజమున కబ్జబాంధవుండు. ౧౧౪

తా సూర్యుఁడు ఆశాక్రాంతిచే (దిక్సంచారము అను దురాశచే) బయలు ప్రాఁకకున్నచోఁ గువలయద్వేషము (కలువలతోడిపగ యను భూమండల ద్వేషము) వహింపకున్నచో విజృంభించి తమ్ములను (పద్మములను సోదరులను) భేదింపకున్నచో, వారుణి (పడమటిదిక్కనుకల్లు) సక్తుఁడై పరువిడకున్నచో,

*విరిపోటు (రూ.) విరివాటు, వారుణీసక్తికి (పా.) వారుణాసక్తికి.

జగతిలోని యెల్లరికిని దాను బగలొనర్పకున్నచో (పగలు సేయుట యను పగ (వైరము) సేయకున్నచో - ననఁగా నెల్లరితో వైరము వహింపనిచో) దోషాభిభూతుఁడై (రాత్రి గోచరింపనివాఁడను దోషముచే నింద్యుఁడై) తొలఁగనిచో, ద్విజరాజునకు (చంద్రునకును బ్రాహ్మణునకు) నధిక పరాభవముఁ గూర్పనిచో, సరసులను (చెఱువులను, రసికులను) నింకింపజాలనిచో (పీడింపఁజాలనిచో) జగత్ప్రసిద్ధమగు స్థిరమైన ప్రతాపవైభవముచే శత్రువీరుల ధ్వంసముగావించిన నరసభూపాలునియమితమైన భువనభవనమున నిండిన తేజమునకు సాటివచ్చును. అనఁగా సూర్యుఁడును నరసభూపాలుని తేజమునకు సాటిరాఁడని సారాంశము. ఏలన సూర్యతేజమాశాక్రాంతిచే బయలు ప్రాఁకును నరసభూపాలుని తేజము దిక్కులకుఁ బ్రాకును దానికిఁ గువలయ ద్వేషముగలదు. దీనికిఁ గువలయానురాగము గలదు అది తమ్ముల భేదించును ఇది భేదింపదు అది వారుణీసక్తము; ఇది యట్లుగాదు. అది యెల్లరికినిఁ బగలు సేయును; ఇది హితము సేయును. అది దోషాభిభూతము; ఇది గుణభూయిష్ఠము అది ద్విజరాజపరాభవము సేయును· ఇది ద్విజరాజహితము సేయును అది సరసుల నింకించును; ఇది రంజించును ఈ విధముగా సూర్యతేజము నందున్న యవగుణములు లేనిదై తేజము వెలుఁగుచున్నది. (ఈ పద్యము వ్యతిరేకాలంకార దృష్టాంతముగాఁ గూడ నీయఁబడినది

౭. ధర్మాకలనము (ధార్మికత్వము)

"ధర్మైకాయత్తచిత్తత్వం ధార్మికత్వ ముదీర్యతే" (ధర్మాభినివేశము గల మనస్సు గలిగియుండుట ధార్మికత్వము) అని ప్ర 1రు. లక్షణము.

చ. పలుకుట సత్యవాసన, కపారవిరోధిజయోత్సవంబు తా
నలఘుయశోధనంబుకొఱ, కంబుధివేష్టితభూపరిగ్రహం
బలరు నగణ్యపుణ్యచరితాచరణంబున కాత్మజీవనం,
బలసుజనావనంబుకొఱ కౌర ! నృసింహనృపాలమౌళికిన్.

తా. నరసభూపాలుఁడు సత్యమునకై భాషించును యశోధనమునకై శత్రుజయము సేయును బ్రాహ్మణులకగ్రహారాదులిచ్చి పుణ్యమార్జించుటకై యా సముద్రపరివేష్టితమగు భూమినిఁ బరిగ్రహించును. సుజనరక్షణార్థమై యాత్మజీవనములనుపయోగించును. మనోవాక్కాయకర్మల నరసభూపాలుఁడు ధార్మికుఁడని సారాంశము ఇట్లెల్లపుడు ధర్మము నాచరించువాఁడే ధార్మికుఁడనఁబడును. కాని సకృత్కృతధర్మో న ధార్మికః' (ఎప్పుడో యొకప్పుడు ధర్మమాచరించినవాఁడు ధార్మికుఁడుగాఁడు) అను నిర్వచనానుసారమితరులు ధార్మికులుగారు.

ఈ పద్యము కాళిదాసమహాకవి యొక్క "త్యాగాయ సంభృతార్థానాం సత్యాయ మితభాషిణాం। యశసే విజిగీషూణాం ప్రజాయై గృహమేధినాం' అనుదానికి ఛాయారూపము.

౭. వైదగ్ధ్యము

"కృత్యవస్తుషు చాతుర్యం వైదగ్ధ్యం తన్నిగద్యతే" (చేయవలసిన కార్యములందు నేర్పుఁ జూపుట వైదగ్ధ్యము)

సీ. వనజారి కళలచేఁ దనివి నొందించిన
నిల ఖేచరుఁడు ప్రాణమిత్తు ననిన
వనదంబు తనదుజీవనమెల్ల నొసఁగిన
నెమ్మేను శిబి కోసికొమ్మఁటన్న
సీఁగి బ్రమానేసొమ్ము లిచ్చిన సురమణి
మిన్నంది తలఁపులో మెలఁగుచున్నఁ
శేరిపాదము బలి శిరసావహించినఁ
కాథోధి కానెంత భంగపడిన

గీ. వారి నెవ్వారిఁ గాదని వసుధ నౌర!
నిక్కముగఁ గీర్తికామిని నీకె దక్కె
నీదు వైదగ్ధ్యగుణము వర్ణింపఁ దరమె.
నరసుకాటోప! ఓబయనరసభూప ౧౧౯

తా. కీర్తికన్య - చంద్రుడు తన్ను దనకళలచేఁ దృప్తినొందించెద నన్నను వాయుదేవుఁడు తన ప్రాణమిచ్చెద నన్నను (వాయువు జగత్ప్రాణుఁడు) మేఘుఁడు తన జీవనము (జలము) ధారవోయుదు నన్నను, శిబి తన మేనుగోసి యిచ్చెద నన్నను గల్పవృక్షము వలసిన సొమ్ము లిచ్చెదనన్నను, చింతామణి తన చింత కనుకూలముగా మెలఁగెద నన్నను బలి తనపాదమును శిరసావహించెద నన్నను, సముద్రుఁడు దానెంత భంగపడినను (అలలు గలది) వారి నొల్లక నిన్ను వరించెను నీ వైదగ్ధ్యము వర్ణింప నెవ్వరి తరము।

ఇట నింతమంది యిన్ని విధములఁ బ్రాధేయపడి ప్రార్థించినను వారి నొల్లక కీర్తికన్య నిన్నే వరించినదని చెప్పఁబడుటవలన నామె నిన్ను వరించు నట్లు సేసికొన్న నీ నేర్పు వర్ణనీయమని భావము కాని వెనుకటి పద్యమున

నౌదార్యమువలెనే యిచ్చటను వైదగ్ధ్యము గోచరింపకున్నది వైదగ్ధ్యము వ్యక్తముగావలెను ప్రతాపరుద్రీయమున నున్న యుదాహరణమును గనుఁడు.

శ్లో. చాతుర్యం కిమువర్ణ్యతే గుణనిధేః శ్రీ వీరరుద్రప్రభో
ర్యత్రాన్యోన్య విరుద్ధయో రపి మహద్వాణీశ్రియోరార్జవం
కించాభ్యాం సదృశోపచారలలితాం తత్తాదృశై రుత్సవైః
నిస్సాపత్న్య మిమాంభువం స నృపతి ర్ధత్తే దిశాం జిత్వరః

తా ప్రతాపరుద్రుని చాతుర్య మేమని వర్ణింతును ? ఏమనఁ బరస్పర విరుద్ధస్వభావముగల లక్ష్మీసరస్వతు లాతనియొద్ద సౌహార్దముతో నున్నారు. మఱియు వారితోపాటు భూదేవి నిఁ గూడ సదృశోపచారములచే సుముఖురాలినిఁగా జేసికొని సవతిపోరులు లేకుండ సంసారమును జక్కపెట్టుకొనుచున్నాడు

ఇట "నన్యోన్యవిరుద్ధయోః సదృశోపచారలలితాం, నిస్సాపత్న్యం" మొదలగు పదములు చాతుర్యమును వ్యక్తము సేయుచున్నవి పై పద్యమున నిట్లు వ్యక్తముసేయు పదములు లేవు కావున నీ పద్యము లెస్సగాదు.

పతాపరుద్రీయమున మహామహిమత్వము పాండిత్యము అను మఱి రెండు గుణములు వచింపబడినవి వాని లక్షణలక్ష్యముల నిటఁజూపుదును.

"తన్మహామహిమత్వం స్యాద్యాపునర్దేవతాత్మతా" దేవతాస్వరూపము గలిగి యుండుటయే మహామహిమత్వము) అని లక్షణము.

కౌసల్యాసీ త్ప్రథమజననీ దేవకీచ ద్వితీయా
విష్ణోర్మాతా తదను మహితా ముమ్మడాంబా తృతీయా
యస్త్రేతాయాం రఘుపతిరభూత్ ద్వాపరే శౌరిరాసీత్
త్రాతుంక్షోణీం స జయతి కలౌ వీరరుద్రావతారః

తా శ్రీ మహావిష్ణువు త్రేతాయుగమునఁ గౌసల్యయందు శ్రీరాముఁడై పుట్టెను ద్వాపరమున దేవకియందు శౌరియై పుట్టెను. కలియుగమున జగత్పాలనమునకై ముమ్మడాంబయందు వీరరుద్రుఁడై జనించెను.

ఇటఁ ప్రతాపరుద్రునకు దేవతాత్మకత్వము చెప్పఁబడినది.

"సర్వవిద్యాధికత్వం యత్పాండిత్యం తదుదాహృతం" (ఎల్ల విద్యల యందును నాధిక్యము వహించియుండుట పాండిత్యము) అని లక్షణము.

గోష్ఠీభిః పరితోషయన్ బుధగణాన్ షడ్దర్శనీసీమభిః
సత్సారస్వతమార్గదర్శనచణైస్సూక్తైః కవీన్ ప్రీణయన్
సంగీతోపనిషద్రహస్యవిశదైరాతోద్యయోగ్యక్రమై
ర్థిన్వన్ సంసది వైణికాన్ విహరతే శ్రీకాకతీంద్రో నృపః.

తా. షడ్దర్శనీవేత్తంగు పండితులను శాస్త్రప్రసంగములచే సంతోష పఱచుచుఁ గవులను సత్కావ్యమార్గమును సూచించు సూక్తులచేఁ దనుపుచు (సూక్తులే కావ్యమార్గము ననుసరించునని భావము), సంగీతోపనిషద్రహస్యమును సూచించు వివిధ వాద్య పరిచయముచే వైణికులకుఁ బ్రీతిగొలుపుచు బ్రతాపరుద్రుఁడు విహరించును

ఇచటఁ బ్రభువునకు సర్వవిద్యావిశేషపూర్ణత్వము వ్యక్తమగుచున్నది.

కం అనయము నాయకసుగుణము
లనేకములు గలవు, వాని నతివిస్తరభీ
తి నిరూపింపఁగ తే, నిఁక
ననుపమ నేతృస్వరూపమభివర్ణింతున్. ౧౨౦

నాయకగుణములు పెక్కులున్నవి. (వానిని దశరూపకసాహిత్య దర్పణకారులు నిరూపించిరి) అతివిస్తరభీతిచే వానిని నిరూపింపఁజాలను. ఇంక నాయకస్వరూపము నభివర్ణింతును

నాయకస్వరూపము

కం. కీర్తిప్రతాపసుభగుం,
డార్తావనుఁ డఖిలగుణగణాఢ్యుఁడు బాహా
వర్తితభూభరుఁడై, పరి
కీర్తితుఁ డగు భర్త కావ్యగీతప్రియుఁడై, ౧౨౧

సుభగుఁడన- శ్లో॥ సపత్నీనఖదంతాదిచిహ్నం యస్య న దృశ్యతే
విస్మార్యమాణమానేర్ష్యః సుభగస్సోఽభిధీయతే

"సవతుల నఖక్షతదంతక్షతాదిచిహ్నములు లేనివాఁడును ఈర్ష్యామానమును మఱపింపఁజేయఁజాలినవాఁడును నగునతఁడు సుభగుఁడు" అని భావప్రకాశమునఁ గలదు. ఇట నా యర్థము సరిపడదు 'సుందరుఁడు' అను నౌపచారికార్థమును గ్రహింపవలెను కీర్తిప్రతాపములచే సుందరుఁడు సుభగశబ్దభవమే సౌభాగ్యశబ్దము లేక భగమన నైశ్వర్యము, గొప్ప యైశ్వర్యముగలవాఁడు సుభగుడు (భగవంతుఁడు) అని యైనను జెప్పుకొనవచ్చును.

తా కీర్తిప్రతాపరూపమగు మహైశ్వర్యము గలవాఁడు, ఆర్తులను రక్షించువాఁడు, అఖిలగుణములు గలవాఁడు, బాహువుపై భూభారమువహించువాఁడు, కావ్యగీతప్రియుడు నగువాఁడు నాయకుఁడు

ఇందుఁ దెలుపఁబడిన ప్రతాపము భూభారవహనము ఆర్తావనము కావ్య గీతప్రియత్వము మొదలగునవి పూర్వోక్త తేజస్విత్వ మహాభాగ్య ధార్మికత్వ, పాండిత్యాది గుణములలోనే యంతర్భవించును మఱల నిచట నేల చెప్పెననఁ బ్రబంధనాయకున కీ గుణము లత్యవశ్యము అని తెలుపుటకే.

కీర్తిప్రతాప సుభగత్వము

మ. అరినిర్భేదనధుర్య ! యోబయనృసింహా ! సింహాసనాధ్యాసీ
వరసత్కీర్తిమరాళబాలిక భవద్వర్ణిష్ణుశౌర్యప్రభా
భరితారుణ్యముఖాగ్రయై పరగుచుం బాల్నీరు నేకంబుగా
ధరఁ గావించు సమస్తవిస్మయకళాదానప్రవీణోన్నతిన్. ౧౨౨

తా. ఓ నరసభూపాలా ! నీ కీర్తియనురాజహంసి నీ ప్రతాపమను నెఱ్ఱని ముక్కుగలదై యాశ్చర్యకరముగా నీరక్షీరములేకము సేయును లోకములోని హంసలు నీరక్షీరములను వేఱుపఱచును ఈ రాజహంసి నీరక్షీరముల నేకము సేయుట చిత్రము అనఁగా నీ కీర్తి నల్లనినీళ్ళనుగూడఁ దెల్లని పాలుగా గోచరింపఁజేయుచున్నదని భావము ఇందుఁ గీర్తిప్రతాపములు రెండును వర్ణితములు

యథార్థముగా నిందుఁ గీర్తియే వర్ణింపఁబడినది. కాని ప్రతాపవర్ణనము లేదు. ఏ లనఁ బాల్నీరుల నేకముసేయు కార్యము కీర్తిహంసిది కాని ప్రతాప కార్యము గాదుకదా!

ఆర్తావనత్వము

మ. ఒకప్రహ్లాదుని నార్తుఁ గాచితి ; మదీయోత్సేకమేకావన
ప్రకటంబౌనె ? యటంచుఁదా బహుతరార్తత్రాణపారాయణో
త్సుకతన్ శ్రీనరసింహుఁ డుర్వి నరసక్షోణీశుఁడై పుట్టెఁగా ;
కొకభూపాలున కిట్టియార్తభరణోద్యోగంబు వాటిల్లునే? ౧౨౩

తా. మున్నార్తుఁడగు నొక ప్రహ్లాదునిఁ గాచితిని ఒక యార్తునిఁ గాచుటకేనా నాశక్తి ? యని నృసింహమూర్తి పెక్కండ్రార్తులను గాపాడ నరసభూపాలుఁడై యవతరించెడు కాకున్న నొక సామాన్యప్రభువున కింత మందిని గాపాడ నెట్లు శక్య మగును ?

ఇం దార్తావనత్వము చెప్పఁబడినది. కాని యిందును గార్యరూపమున నార్తావనము వర్ణింపఁబడవలయును.

గుణాఢ్యత్వము

చ. అరయఁ బయోధిఁ బాత్రమును నంజనశైలముఁ గజ్జలంబు, ద
త్సురతరుశాఖ లేఖిని వసుంధరఁ బత్త్రముఁ జేసి వేడ్కతోఁ
గెరలి విరించిగేహిని లిఖించినఁ బారము నొందదౌర. మా
నరసనృపాలమౌళి సుస్తుతసద్గుణసంప్రదాయముల్. ౧౨౪

తా. సముద్రమును సిరాబుడ్డిగాను కాటుకకొండను సిరాగాను, కల్ప వృక్షశాఖను కలముగాను భూమిని కాగితముగాను జేసి సరస్వతీదేవియు వ్రాసినను మా నరసభూపాలుని గుణములు ముగియవు.

ఇందు గుణాఢ్యత్వము నిరూపింపఁబడినది. ఇందునుఁ గార్యరూపమున గుణములు వర్ణింపఁబడవలయును.

భూభరణము

చ. విపులఫణాసహస్రమున వీఁక భరింపఁగలేని మేదినిన్
నిపుణత బాహుపీఠమున నిల్పె నృసింహుఁ డఁటంచుఁ బన్నగా
ధిపతి నిరంతరాద్భుతమతిం దల లూఁప జరావిపాండురుం
డెపుడుపురాణభోగి యని యెన్నుదురా భుజగేంద్రునందఱున్.

తా. తన వేయిపడగలతో భరింపలేని భూమిని నరసభూపాలుఁడు బాహుపీఠమున భరించెనని యాదిశేషుఁ డాశ్చర్యమునఁ దలలూపఁగా లోకు లాశ్చర్యమునఁ దల లూఁచినట్లు గ్రహింపఁజాలక యాతనిమేను తెల్లఁదనమును గాంచి ముదుసలితనమునఁ దాలిపోయినట్లు గ్రహించి యాతఁడు పురాతనుఁడైన భోగి యగుటను ముసలితనమునఁ దల యూఁచినట్లు గ్రహింతురు

ఇందాదిశేషుఁడు మోయలేని భూభారమును నరసభూపాలుఁడు వహించెనని చెప్పుటచే భూభరణము పేర్కొనఁబడినది

కావ్యగీతప్రియత్వము

మ. నరసింహుం డతిధీరవీరరససన్నాహుండు వాటించియుం
గరుణాకోమలుఁడై రమావిమలశృంగారార్ద్రుఁడై పొల్పుచా
తురి సాహిత్యమర్మకర్మకఠినోద్యోగాత్మకుం డయ్యు నీ
నరసింహేంద్రుఁ డనూనగానరససంధానప్రియుం డెంతయున్.

తా నరసింహమూర్తి మిక్కిలి వీరరసముగలవాఁ డయ్యుఁ గృపాళువును, లక్ష్మీదేవితోడి శృంగారరసమున మునిఁగి తేలువాఁడును నయినట్లే నరసభూపాలుఁడు కావ్యసాహిత్యరహస్యములను దెలిసికొను కరిణకార్యమున వ్యాపృతుఁ డయ్యును గీతరసకుతూహలుఁ డై శోభిల్లును.

ఇందుఁ గావ్యప్రియత్వమును గీత ప్రియత్వమును బేర్కొనఁబడినవి

ఇటఁ గూడ నీ గుణములు కార్యరూపమున వర్ణింపఁబడవలయును

నరసభూపాలీయ సాహిత్యదర్పణ దశరూపకాది గ్రంథము లందలి యకలక్షణములను బరిశీలింపఁగా మహారాజే నాయకుఁడుగా నుండవలెనన్న నియమము కానరాదు సామాన్యుఁడైన మానవుఁడుగూడ నా యా గుణములు గలిగి ప్రబంధనాయకుఁడు గావచ్చును మొత్తముమీఁద నాయకచరిత ముప దేశాత్మకముగా నుండవలెను కానఁ దత్తద్గుణములు గలిగి యుండవలెను

ఆశ్వాసాంతము

మ. అమరక్ష్మాధరధీర ధీరచితకార్యారంభ ! రంభాసమ
ప్రమదాభవ్యమనోనురాగఘటనాపాంచాల పాంచాలగో
శముఖోర్వీనుతశౌర్య ! శౌర్యవనలీలాలోల లోలాభవ
ద్రమణీయాగమధర్మ ధర్మతనయప్రఖ్యాతసత్యవ్రతా! ౧౨౮

పాంచాలుఁడు – కామశాస్త్రమునందలి దత్త భద్ర కూచిమార పాంచాల నాయకులలో నొకఁడు. లోల+అభవత్ = లోలముగాని, యనఁగా చంచలము గాని లేక స్థిరమైన.

లోలాభవత్ అను రూపము దుష్టము 'లోల' శబ్దమునకు చ్విప్రత్యయమును జేర్పఁగా 'లోలీభవత్ అగును లోలముగాని యనునర్థమున అలోలీభవత్ అని రూప ముండును. ఇది ముక్తపదగ్రస్త మగుటచేఁ గవి "లోలాభవత్" అనియే ప్రయోగించెను

కం. కుటిలారిభయదధాటీ
పటుపటహాధమన్నినాద పరిపాటితది
క్తటపటల ! చటులమేధా
పటిమపరాభూతభూతపతిమణిహారా ! ౧౨౯

మాలిని అలఘునయవిహారా హారనీహారతారా !
హాలధరరుచిధారా హారకీర్తిప్రచారా !

జలధివరగభీరా! జైత్రకౌక్షేయధారా!
లలితగుణవిచారా లక్కమాంబాకుమారా! ౧౮౯

గద్యము

ఇది శ్రీ హనుమత్ప్రసాదలబ్ధకవితాసార సారస్వతాలంకార, నిరంకుశ ప్రతిభాబంధుర ప్రబంధపఠనరచనాధురంధర ప్రబంధాంక వేంకట రాయభూషణసుపుత్త్రి తిమ్మరాజపౌత్త్ర సకల భాషావిశేష నిరుపమావధాన శారదామూర్తి మూర్తిప్రణీతం బైన కావ్యాలంకారసంగ్రహం బనుమహాప్రబంధంబు నందు నుపోద్ఘాత ప్రకరణంబును నాయకగుణ వర్ణనంబును నాయక స్వరూపకథనంబు నన్నది ప్రథమాశ్వాసము

కావ్యాలంకార సంగ్రహము

ద్వితీయాశ్వాసము

క. శ్రీరాజితసదన కళా
ధార తతనిరంతరార్థిదారిద్ర్యహరా!
నారాయణచరణార్చన!
నారీజనతారతీశ! నరసాధీశా! ౧

గీ. అవధరింపుము లక్ష్మలక్ష్యముల నెల్ల
ననఘ! భవదీయనామధేయాంకితముగ
బహువిభక్తుల నొనరింతుఁ బద్యవితతి
నిచట నాయకభేదంబు లెట్టు లనిన. ౨

క. ధీరోదాత్తప్రముఖులు
ధీరోద్ధత, ధీరశాంత, ధీరలలితు లీ
ధారుణి నలువురునాయకు
లారయఁ దల్లక్షణంబు లభివర్ణింతున్. ౩

తా. ధీరోదాత్తుడు ధీరోద్ధతుఁడు ధీరశాంతుఁడు ధీరలలితుఁడు అని నాయకులు నలుతెఱఁగులుగా నుందురు వారి లక్షణములు ముందు తెలియును.

శా. ధీరాత్ముం, డవికత్థనుండు, కరుణోద్వేలుండు సత్త్వాఢ్యుఁడౌ
ధీరోదాత్తుఁడు, *శౌర్యదర్పకుహనాధీనుండు ధీరోద్ధతుం;
డారూఢిన్ సమధీప్రసన్నుఁడు ద్విజుండౌ ధీరశాంతుండు; వృ
త్తారింబోలినభోగి ధీరలలితుం డై పొల్చు నిశ్చింతతన్. ౪

ధీరోదాత్త లక్షణము

ధీరశ్చఅసౌ ఉదాత్తః ధీరోదాత్తః అని విగ్రహము ధీరత్వమును, నుదాత్తత్వమును గలవాఁడు ధీరోదాత్తుఁడు ధీరుఁ డనఁగ్లేశమును సహించువాఁడు ఉదాత్తుఁ డన నాత్మశ్లాఘలేనివాఁడు కృపాళువు హర్షశోకాదులచే నభిభూతుఁడు కానివాఁడును.

సాహిత్యదర్పణము నందలి లక్షణ మింతకన్న సమగ్రముగా నున్నది.

శ్లో. అవికత్థనః క్షమావా నతిగంభీరో మహాసత్త్వః
స్థేయా న్నిగూఢమానో ధీరోదాత్తో దృఢవ్రతః కథితః

తా. ఆత్మశ్లాఘ లేనివాఁడు (అవికత్థనుఁడు) సహనము గలవాడు (క్లేశసహిష్ణువు) గంభీరుఁడు, మహాసత్త్వుఁడు గూఢమానము (కోపము) గలవాఁడు, దృఢవ్రతుఁడు నగువాఁడు ధీరోదాత్తుఁడు.

ధీరోదాత్తుఁడు శృంగార వీర శాంత రసములందు నాయకుఁడు.

ధీరోద్ధత లక్షణము

ధీరశ్చ అసౌఉద్ధతః అని విగ్రహము. ధీరత్వము నుద్ధతత్వమును గలవాఁడు. ఉద్ధతుఁ డనఁ గౌర్య దర్పములును, మాయలమారితనమును గలవాఁడు.

సాహిత్యదర్పణ లక్షణమున గనుఁడు :

మాయాపరః ప్రచండశ్చపలోఽహంకారదర్పభూయిష్ఠః
ఆత్మశ్లాఘానిరతో ధీరై ర్ధీరోద్ధతః కథితః

తా. మాయలమారితనము, ప్రచండత చాపల్యము అహంకారము, ఆత్మశ్లాఘయును గలవాఁడు ధీరోద్ధతుఁడు,

ఇతఁడు వీరరౌద్రరసము లందు నాయకుఁడు

*శౌర్య (పా) క్రౌర్య, సమధీ (పా) శమధీ

ధీరశాంత (ధీరప్రశాంత) లక్షణము

ధీరశ్చ అసౌ శాంతః అని విగ్రహము. సమధీప్రసన్నుఁ డగు ద్విజుఁడు ధీరశాంతుఁడు సమధీప్రసన్నుఁ డను పదమునకు నిష్కృష్టార్థము గోచరిం కున్నది బహుశః ధీరత్వమును శాంతత్వమును సమానముగాఁ గలవాఁ డని కవి యభిప్రేతార్థమై యుండును లేక శమధీ పసన్నుఁడు అనుపాఠమై యుండును. అట్లేని శమముతోఁ లేక శాంతగుణముతోఁ గూడిన బుద్ధిచేఁ బ్రసన్నుఁ డగునవాఁడు అనఁగా ధీరత్వమును శాంతగుణముచేఁ గలిగిన మనః ప్రసన్నతయుఁ గలవాఁ డని యర్థ మగును ఇదియే యుక్తమగు పాఠము.

సాహిత్యదర్పణలక్షణమును గనుఁడు

"సామాన్యగుణైర్భూయాన్ ద్విజేషు ధీరప్రశాంత ఇత్యుక్తః"

నాయకసామాన్యగుణములు గల (కులము మహాభాగ్యము, మొ) ద్విజుఁడు (బ్రాహ్మణక్షత్రియ వైశ్యులలో నొకఁడు) ధీరశాంతుఁడు దశరూపకమున ద్విజాదికః ఇతి విప్రవణిక్సచివాదీనాం ప్రకరణనేతౄణా ముపలక్షణం —ద్విజాదిక మనఁగాఁ బ్రకరణనాయకు లగు విప్రవణిక్సచివులు అని వ్యాఖ్యానము చేయఁబడినది. అమాత్య విప్ర వణిజామేకం కుర్యాచ్చ నాయకం" అమాత్య విప్ర వణిజులలో నొకరిని నాయకునిఁ జేయవలెను అని భరతనాట్యశాస్త్రమునను గలదు ఈ రెండు గ్రంథములందును ద్విజ' శబ్దమునకు వ్యాఖ్యలో క్షత్రియశబ్దముగాక అమాత్య సచివ శబ్దములే వాడఁబడియున్నవి అనఁగా మంత్రియైన క్షత్రియుఁడే నాయకుఁడై యుండవలెనని తెలుచున్నది అంతేకాని రాజైన క్షత్రియుఁడు నాయకుఁడుగా నుండరాదు.

మృచ్ఛకటిక మను ప్రకరణమున బ్రాహ్మణుఁడును, మాలతీమాధవ ప్రకరణమున మంత్రిపుత్రుఁడును పుష్పభూషితప్రకరణమున వణిజుఁడును నాయకుఁడుగా గ్రహింపఁబడిరి. వీరు ధీరశాంతులు. లక్షణవాక్యమున అమాత్య, సచివ పదములే యున్నను లక్ష్యమగు మాలతీమాధవాదులలో మంత్రిపుత్రుఁడే నాయకుఁడుగా నున్నాఁడు

ధీరలలిత లక్షణము

ధీరశ్చ అసౌ లలితః అని విగ్రహము. నిశ్చింతుఁడును, ఇంద్రునిఁ బోలిన భోగశాలియు నగువాఁడు ధీరలలితుఁడు.

సాహిత్యదర్పణ లక్షణమును గనుఁడు

నిశ్చింతో మృదు రనిశం కలాపరో ధీరలలితః స్యాత్.

నిశ్చింతుఁ దన శత్రువులను జయించి రాజ్యభారమును సమర్థు లగు మంత్రులమీఁద నుండుటచే నెట్టి విచారమును లేనివాఁడు. కళ లనఁగా లలిత కళలు; నృత్యము గానము చిత్రకళ, ద్యూతము మొదలగునవి వీనియందు నిరతుఁడును మృదుస్వభావము గలవాఁడును నగువాఁడు ధీరలలితుఁడు. ధీర స్వభావమును లలితస్వభావమును గలవాఁడు ధీరలలితుఁడు. అనఁగాఁ బౌరు షము విడిచి స్త్రీలోలుఁడై యుండువాఁడుగాఁడని భావము. ప్రతాపశాలియు, భోగపరాయణుఁడును నగువాఁడే ధీరలలితుఁడు వత్సరాజాదులట్టివారు

ఈ పద్యము నందలి లక్షణ మేదియు సమగ్రముగా లేదు నాలుగు లక్షణములు నొకే పద్యములో బిగించుటచే నీ యనర్థము వచ్చినది. సాహిత్య దర్పణ లక్షణములు సమగ్రములు

ధీరోదాత్తుఁడు

సీ. చలిచీమ నేనియుఁ *జాఁ ద్రొక్కఁగాఁ జాలఁ
డేరీతి గెల్చెనో వైరిపరులఁ!
గలవైన నిజవర్ణనలుసేయ వినఁజాలఁ
డె ట్లందుకొనియెనో కృతిచయంబుఁ.
*జెలువొందు నాకారచేష్టఁ దెయ్యడ గానఁ
డెట్లు *నవ్వనో యాత్మహితులతోడఁ.
బరుషాక్షరంబులు వలుకఁడెక్కాలంబు
నెట్లు భర్జించెనో హీనమతులఁ.

గీ. బరులఁ జేపట్టఁ; డెలిమిఁ జేపట్టివిడువఁ;
డలయఁ, డేమఱఁ, డరి నైన నపగుణంబు
లెన్నఁ డోబయనరసధాత్రీశతిలక
మరయ నరలోకభాగ ధేయంబుగాదె? x

ఇందలి ప్రథమపాదముచే నరసభూపాలుఁడు కరుణాళు వనియు, ద్వితీయ పాదముచే నవికత్థనుఁ డనియుఁ (ఆత్మశ్లాఘలేనివాఁడు), దృతీయపాదముచే

* దాఁద్రొక్కఁగాఁ జాలఁడు (పా) దావఁద్రొక్కంగజాలఁడు;
* చెలువొందు (పా) చెలువొంద, నవ్వునొ (పా) నవ్వెనొ.

గాంభీర్యముగలవాఁ డనియుఁ జతుర్థపాదముచే సత్త్వగుణసంపన్నుఁ డనియు వ్యక్తమగుచున్నది కాఁబట్టి నరసభూపాలుఁడు ధీరోదాత్తుఁడు.

ధీరోద్ధతుఁడు

మ. బలవద్వైరిబిడాలమదాళిరతమై, భవ్యప్రతాపోజ్జ్వల
జ్జ్వలనజ్వాలజటాలమై, రణభయవ్యాపక్త తత్సన్మనో
జలజాంధంకరణప్రగల్భకుహనాసంపాదియై పొల్చుఁ దా
నిల ధీరోద్ధతవృత్తిమై నరసధాత్రీశోగ్రఖడ్గం బనిన్.

ఇట నరసభూపాలుని ఖడ్గము ధీరోద్ధతము అది శత్రుబలములను భేదించు మదము గలిగి ప్రతాపాగ్నికి జ్వాలారూపమై యుద్ధభీతు లగువారి మానసములకుఁ జీఁకట్లు గ్రమ్మించు మాయలమారితనము గలిగి వర్తించును

ఇట ఖడ్గమునకు దర్పము శౌర్యము మాయలమారితనమును జెప్పఁబడి నవి అచేతనమగు ఖడ్గము ధీరోద్ధత మనుటకన్న నరసభూపాలుని భటులు ధీరోద్ధతులుగా వర్ణింపఁబడుటయే యుక్తము ఏలన శౌర్యాదులగు గుణములు చేతనధర్మములు గదా ఇఁక నిట నచేతనమగు ఖడ్గమునఁ జేతనత్వ మారో సింప వలెను అనఁగా ఖడ్గమునందు శౌర్యాదిగుణములు స్వభావసిద్ధములుగాక కల్పితములగును. ప్రతాపరుద్రీయోదాహరణమును గనుఁడు :

శ్లో॥ రే రే ఘూర్జర జర్జరోఽసి సమరే, లంపాక! కిం కంపసే?
వంగ త్వంగసి కిం ముధా బలరజఃకాణోఽసి కిం కోంకణ
హూణ! ప్రాణపరాయణోభవ మహారాష్ట్రపరాష్ట్రోఽస్యమీ
యోద్ధారో వయమిత్యరీనభిభవంత్యాంధ్రక్షమాభృద్భటాః.

తా॥ ఓరీ ఘూర్జరా నీవు యుద్ధమున నలిగితివి లంపాకుఁడా వణఁకు చుంటి వేమి? వంగదేశీయుఁడా పరుగిడుచుంటివి కోంకణా సైన్యధూళిచే గ్రుడ్డివాఁడతివి · హూణ నీ ప్రాణములు గాపాడుకొమ్ము మహారాష్ట్ర! నీ రాష్ట్ర మూఁడినది లెమ్ము, మే మాంధ్రభూపతియొక్క యుద్ధభటులము.

ఈ పద్యమునఁ బ్రతాపరుద్రునిభటులు ధీరోద్ధతులుగా వర్ణింపఁబడిరి వీరియందాత్మశ్లాఘాదర్పములు గనఁబడుచున్నవి. ఇవి యారోపితములుగాక స్వభావసిద్ధములు. కాన నిదియే యుదాహరణార్హము.

ధీరశాంతుఁడు

చ. ఇనకులధుర్యుఁ డైన *నరసేంద్రునిచేతఁ బ్రతిష్ఠితంబు లౌ
ననఘమహాగ్రహారములయందలి భూసురకోటి మేటి యై
ఘనతరశాఖలం *జెలఁగి కాంతశుకక్రమ మై మెలంగు న
య్యనిమిషభూజవాటిక్రియ నాత్తశుచిప్రసవాభిరామమై. 8

తా. నరసభూపాలునిచేతఁ బ్రతిష్ఠింపఁబడిన యగ్రహారములందలి బ్రాహ్మణకోటి కల్పవృక్షవాటివలె గొప్ప గొప్ప శాఖలు గలిగి (ఋగ్యజుశ్శాఖాదులు) శుక సంచారముగలిగి (శుకమహర్షి ప్రోక్తమగు భాగవతకథా పరాయణతగలిగి) శుచిప్రసవముతో నభిరామమై (శుద్ధసంతానము గలిగి) యొప్పుచున్నది. కల్పవృక్షపరముగా నర్థము సుగమము

ఇందుఁ బ్రశాంతు లగు బ్రాహ్మణులు వర్ణింపఁబడిరి. బ్రాహ్మణులు ధీర శాంతనాయకులు.

మృచ్ఛకటికమునందు బ్రాహ్మణుఁ డగు చారుదత్తుఁడు ధీరశాంతుఁడు. ఒక పద్యమున ధీరశాంతలక్షణమును జూపుట కష్టము బ్రాహ్మణులు వర్ణింపబడిన మాత్రమున ధీరశాంతు లని భ్రమింపరాదు వారిలో ధీరత్వ శాంతత్వములు రెండును గనఁబడవలెను. చారుదత్తాదులందు ధీరత్వ శాంతత్వములు గలవు కావునఁ బ్రబంధములం దాయా ప్రకరణానుసారముగా ధీరత్వ శాంతత్వములను బ్రదర్శించు బ్రాహ్మణాదులు ధీరశాంతులు. ఈ పద్యమున శాంతత్వమే కాని ధీరత్వము మృగ్యము

ధీరలలితుఁడు

ఉ. కుంతలగౌళచోళకురుఘూర్జరహూణశకాదిమేదినీ
కాంతులు సంతతంబు నిజగాఢబలశ్రుతిమాత్రభీతులై
యింతుల, రత్నహారముల, నెల్లధనంబుల నిచ్చి కొల్వ ని
శ్చింతతఁ దాల్చు నోబయనృసింహుఁడు భోగకళాప్రవీణుఁడై.

తా. కుంతలాది నానాదేశరాజులు తన బలప్రతాపాదుల విని భీతులై కొలువఁగా నరసభూపాలుఁడు భోగములనుభవించుచుఁ గళాప్రవీణుఁడై నిశ్చింతతో నుండెను ఇందు ధీరత్వ మున్నది. కాని లలితత్వము వ్యక్తము గాకున్నది. ఈ క్రిందిపద్యమును గనుఁడు :

*నరసేంద్రునిచేత (పా) నరసేంద్రునిచెంత, కాంతశుక (పా) కాంతిశుక ;
*చెలఁగి (పా) చెలఁగు ; క్రియనాత్తశుచి (పా) క్రియనాప్తశుచి.

సీ. ఒకసారి పీయూష మోఁకిలింపఁగఁజేయు, గానంబు గావించు వీణె ముట్టి
యొక తేపఁ గనువిందులకు విందు లొనరించుఁ జిత్తర్వులకుఁ బోసిజీవకళలు
ఒక తేప నొజ్జల కొజ్జయై వర్తిల్లు, ద్యూతప్రసంగ వైదుష్యమందు
ఒకసారి మదపుటేనికల గొజ్జెల నట్లు వెంటఁ ద్రిప్పుచునుండు వేఁటలందు
గీ ఒక్కపరి నృత్యకళయందు నొక్కతడవ
సరససల్లాపములయందుఁ జదురుసూపు
మోపి యౌగంధరాయణు మూపురమున
రాజ్యభారంబు నావత్సరాజవరుఁడు.

ఈ పద్యమునఁ గళాపరత్వము మాత్రమే కలదు ఒక్క పద్యమున ధీరత్వ లలితత్వములు ప్రదర్శించుట సులభము గాదు కావున వత్సరాజాదులనే యుదాహరింపవలెను వారికిఁ దత్తన్నాటకములందుఁ దత్తత్ప్రదేశములలో ధీరత్వ లలితత్వాదులు గోచరించును. నా వాస్తవదత్త లో వత్సరాజు యొక్క ధీరత్వ లలితత్వములు లెస్సగాఁ బుష్టములై యున్నవి.

ధీరోదాత్త, ధీరోద్ధత, ధీరశాంత, ధీరలలిత పదముల నాల్గింటను 'ధీర' పదమున్నది. ఈ నల్వురికిని ధీరత్వము సాధారణగుణము. ఉదాత్తత్వాదులసాధారణగుణములు. ధీరత్వ మన ధైర్యము. ఇది వీరుని ధర్మము. కాఁబట్టి యుదాత్తాదులు నలువురును వీరులుగాఁగూడ నుండవలయును హేమచంద్రుఁడు కావ్యానుశాసనమున నీ యభిప్రాయమునే తెలిపెను. ఏమన "ధర్మ యుద్ధ వీర ప్రధానః ధీరోదాత్తః వీరరౌద్రప్రధానః ధీరోద్ధతః; వీర శృంగార ప్రధానః ధీరలలితః; దానధర్మవీరప్రధానః ధీరశాంతః' అని యెల్లరకును వీరత్వము సాధారణముగాఁ దెలిపినాఁడు కొందఱు ధీరుఁ డన సామాన్యమైన నాయక గుణములు (కులము, మహాభాగ్యము మొ) గలవాఁ డని యర్థము చెప్పుదురు ఆ పక్షమున నాయకసామాన్యగుణము లుదాత్తాదులందఱకును ముఖ్యముగా నుండవలయును వానితోపాటు విశేషగుణము లగు నుదాత్తత్వాదులుండవలయు ననియు నందురు. కాని, దీనికన్నఁ బై యర్థమే లెస్స.

భారతాదిపురాణగ్రంథములందు సుప్రసిద్ధముగా ధీరోదాత్తాదులుగా నున్న వారిని ధీరలలితాదులుగా మార్చరాదు. అనగా వీరరసనాయకు లగు శ్రీరామ యుధిష్ఠిరాదులను ధీరోద్ధతులుగానో, ధీరలలితులుగానో చేయరాదు శృంగార రసాశ్రయులుగాఁ బ్రసిద్ధు లగు ధీరలలితులు వత్సరాజాదులను వీరరసాశ్రయు లగు ధీరోదాత్తులుగా మార్చరాదు. ఇట్టిదాన రసభంగ మగును.

అవస్థాభేదమును బట్టి వత్స వృషభ మహోక్షాదిభేదము లేర్పడినట్లే ధీరోదాత్తాదిభేదములును నొక్కనాయకునికే చెప్పవచ్చును. అంతేకాని ధీరో

దాత్తాదిభేదములు జాతిగతభేదములు గావు. అనఁగా జాతిచే బ్రాహ్మణత్వాది ధర్మములు నియతము లయినట్లు ధీరోదాత్తత్వాదులును నవస్థాభేదములు గావి నియతధర్మములు గావు. ఒకేనాయకుఁ డొకప్పుడు ధీరోదాత్తుఁడుగా, నొక ప్పుడు ధీరోద్ధతుఁడుగా మఱొకప్పుడు ధీరశాంతుఁడుగాఁగూడ నుండవచ్చును. కాని యీ యవస్థాభేదమును ప్రబంధమున నంగినాయకునిలోఁ జూపరాదు. అంగనాయకునిలోఁ జూపవచ్చును ఎట్లన మహావీరచరిత్రమున నంగినాయ కుఁడు శ్రీరాముఁడు. అతఁడు ధీరోదాత్తుఁడు గ్రంథసమాప్తిపర్యంత మాతఁడు ధీరోదాత్తుఁడుగానే యున్నాఁడు. అంగనాయకుఁ డగు పరశురాముఁ డవస్థా భేదముతోవర్ణింపఁబడి యున్నాఁడు ఎట్లన మహావీరచరిత్రమున నతఁడు రావ ణునిఁ గూర్చి—

శ్లో॥ బ్రాహ్మణాతిక్రమత్యాగో భవతామేవ భూతయే
జామదగ్న్యశ్చ వో మిత్ర మన్యథా దుర్మనాయతే.

"బ్రాహ్మణులయెడల నపచారమును వదలివేయుట మీకే మంచిది. అట్లయినయెడలఁ బరశురాముఁడు మీకు మిత్త్రుఁడుగా నుండఁగలఁడు' అని సందేశ మంపినపుడు ధీరోదాత్తుఁడుగా

శివధనుర్భంగమును గూర్చి విని రోషించి దృప్తుఁడై రామునిఁగూర్చి వెదకుచు వచ్చి

శ్లో॥ కైలాసోద్ధారసారత్రిభువనవిజయోర్జిత్యనిష్ఠాతదోష్ణః
పౌలస్త్యస్యాపి హేలాపహృతరణమదో దుర్దమః కార్తవీర్యః
యస్య క్రోధా త్కుఠారప్రవిఘటితమహాస్కంధబంధః స్థవీయో
దోశ్శాఖాదండషండ స్తరురివ రహితః కుల్యకందైః పురాఽభూత్.

"కైలాసపర్వతమును బెల్లగించిన బలముచే ముల్లోకములను జయించిన రావణుని మద మలవోక హరించిన కార్తవీర్యార్జునుఁ డెవనికోపముచే గొడ్డట నఱకఁ బడిన బహుశాఖలుగల వృక్షమువలె నయ్యెనో'

సోఽయం త్రిస్సప్తవారా నవికలవిహితక్షత్త్రతంత్రప్రమారో
వీరః క్రౌంచస్య భేదాత్ కృతధరణితలాపూర్వహంసావతారః
జేతా హేరంబభృంగిప్రముఖగణచమూచక్రిణస్తారకారేః
స్త్వాంపృచ్ఛన్ జామదగ్న్యస్స్వగురుహరధనుర్భంగరోషాదుపైతి

"ఆ జామదగ్న్యుఁ డిఱువదొక్కమారు సకలక్షత్రియమారణహోమ మును జేసినవాఁడు, క్రౌంచపర్వతమును భేదించి మానససరస్సునుండి భూమండ లమునకు వచ్చుటకు హంసలకొక క్రొత్తమార్గమును రచించినవాఁడు హేరంబ భృంగి ప్రముఖ లగు గణసైన్యములతోఁగూడిన కుమారస్వామిని జయించిన

C A C No 37467

వాఁడు తన గురుఁడైన శివునిధనుస్సును విఱిచితి వని విని రోషించి నిన్ను వెదకుచు వచ్చుచున్నాఁడు" అని పలుకునపుడు ధీరోద్ధతుఁడు గా

శ్రీరామునితో యుద్ధముసేసి విజితుఁడై ప్రశాంతదర్పుఁడై

శ్లో॥ పుణ్యా బ్రాహ్మణజాతి రన్వయగుణ శ్లాఘ్యం చరిత్రంచ మే
యేనై కేన హృతాన్యమూని హరతా చైతన్యమాత్రా మపి
ఏకస్సన్నపి భూరిదోషగహన స్సోఽయం త్వయా ప్రేయసా
వత్స బ్రాహ్మణవత్సలేన శమితః క్షేమాయ దర్పామయః

"నా సమ్యగ్జ్ఞానలేశమును బుణ్యవంతమగు నా బ్రాహ్మణవంశమును, నావంశమర్యాదను శ్లాఘ్యమగుచరిత్రమును నిర్మూలించిన బహుదోషయుక్త మగు నా దర్పరూప మగు రోగమును బ్రాహ్మణవత్సలుఁడవును నా ప్రియుఁడవును నగు నీవు శమింపఁజేసితివి" అని వచించినపుడు ధీరశాంతుఁడుగాను వర్ణింపఁబడెను. అంగిభూతనాయకుని కిట్టి యవస్థాభేదముఁ జూపరాదు ఏలన, దానిచేఁ బ్రధానరసమునకు భంగము గలుగును

గీ. మఱియు శృంగారలీలానమగ్రయోగ్య
కాని విచక్షణులు దక్షిణానుకూల
ధృష్టశఠు లనఁ గాంతు లభీష్టమతులు
గలరు, తల్లక్షణంబులు దెలిపెదఱు

దక్షిణుఁడు, అనుకూలుఁడు, ధృష్టుఁడు, శఠుఁడు అను పేరుల శృంగార నాయకులు నలుతెఱఁగులుగా నుందురు.

దక్షిణాదుల లక్షణములు

చ. చెలఁగు బహుప్రియాసదృశశీలుఁడు దక్షిణుఁ; డొక్కకాంతనే
వలచి గుణాభిరాముఁ డగు వాఁడనుకూలుఁడు; సాపరాధుఁడై
యళుకనివాఁడు ధృష్టుఁడు, ప్రియాశయమాత్రనివేద్యవిప్రియుం
డల శఠుఁ డంద్రు; వీరల కుదాహరణంబులు నిర్ణయించెదన్.

తా. పెక్కంద్రునాయికలయందు సమానప్రీతిగలవాఁడు దక్షిణుఁడు. ఒకతెయందే ప్రీతిగలవాఁ డనుకూలుఁడు. అపరాధ మొనర్చియు భయపడని వాఁడు ధృష్టుడు. ప్రియురాలికిమాత్రము దెలియఁదగిన యప్రియము సేయు వాఁడు శఠుఁడు. అనఁగా నతఁడు సేయు నప్రియము ప్రియురాలికే కాని పరులకుఁ దెలియదు. పరుల కాతఁడనురక్తుఁడుగానే గోచరించును.

ఈ పై లక్షణములలో ధృష్టనాయకలక్షణ మసమగ్రముగా నున్నది. సాహిత్యదర్పణ లక్షణ మింతకన్న మేలైనది.

కృతాగాఅపి నిశ్శంక స్తర్జితోఽపి న లజ్జితః
దృష్టదోషోఽపి మిథ్యావాక్కథితో ధృష్టనాయకః.

తా. అపరాధియయ్యు జంకుగొంకులు లేనివాఁడు, తర్జింపఁబడినను లజ్జింపనివాఁడు, దోష మగపడుచున్నను గల్లలాడువాఁడు - అట్టివాఁడు ధృష్టుఁడు.

దక్షిణుడు

ఉ. సాగరమేఖలాసతికిఁ జారుభుజాపరిరంభ మిచ్చె; వా
ణీగగనావలగ్నకును నేర్పుమెయిన్ మొగమిచ్చె; వీరల
క్ష్మీగజరాజగామినికమేయభుజాంతరమిచ్చె; సంతత
త్యాగి నృసింహభూవిభుఁడె దక్షిణ *నాయకుఁ డెన్నిఖంగులన్.

తా. భూదేవిని, సరస్వతిని వీరలక్ష్మిని నరసభూపాలుఁడు సమానముగా గౌరవించెనని చెప్పుటచేఁ బెక్కండ్రు నాయికలందు సమానముగా వర్తిల్లెను, కావున దక్షిణనాయకుఁడు.

అనుకూలుఁడు

చ. కనకము, లంబరంబులును, గ్రామము, లుజ్జ్వలదివ్యరత్నమం
డనములు, వాజివారణఘటల్, ఘనసారసుగంధసారముల్
దనివి దలిర్ప వేఁడినకొలంది నొసంగుచు నోబభూపనం
దనుఁడగునారసింహుఁడిలదానరమాప్రియుఁడయ్యె నెంతయున్.

తా నరసభూపాలుఁ డడిగిన వెల్లఁ దెచ్చియిచ్చుచు దానలక్ష్మిప్రియుఁ డయ్యె ననుటచే నతఁడు దానలక్ష్మి కనుకూలుఁడని వ్యక్తమగుచున్నది

ధృష్టుఁడు

చ. ఉరమున నున్న కుంకుమ మదుజ్జ్వలరోపకషాయవీక్షణ
స్ఫురదరుణాంశుపుంజ మని బొంకితి, కన్గవకెంపు భాగ్య బం
ధుర సహజారుణత్వ మని నూల్కొన నాడితి, వెట్లు *దాఁచెదీ
పరిమళ వసనాలహారి పర్వెడుమేను; నృసింహభూవరా! ౧౩

*పా. నాయకుఁ డెంచిచూడఁగన్.
*దాఁచెదు (పా) బొంకెదు

తా॥ ఓ నరసభూపాలా పరస్త్రీ సంభోగమున నంటిన నీ యురమునఁ గల కుంకుమ మే మని యడుగఁగా నా రోషారుణ నేత్రకాంతులని బొంకితివి నిద్రలేమిచే నేర్పడిన నీ కంటి కెంపేమని యడుగఁగా భాగ్యరేఖలని కల్లలాడితివి; కానీ పరిమళించు నీ శరీరము నెట్లు దాఁచెదవు?

ఇట నరసభూపాలుఁడు సేసిన యన్యాంగనాభోగరూప మగు నపరాధము గోచరించుచున్నది అపరాధము గప్పిపుచ్చుట కతఁడు గల్లలాడినాఁడు. ఇతఁడు ధృష్టుఁడు ఈ లక్ష్యమున నరసభూపాలీయ లక్షణము పట్టదు. సాహిత్యదర్పణలక్షణము "దృష్టదోషోఽపి మిథ్యావాక్" అనునది సరి పోవుచున్నది.

శఠుఁడు

చ. కనుఁగవఁ జాలఁ జూచెదవు కాని మనంబునఁజూడ ; వుక్తులం
దనిపెదు కాని భావమునఁ దన్పఁ గప్పుదు , నీ ప్రవీణతల్
పనువడ వింక; నీ నటలు బచ్చెన చేఁతలుఁ జాలుఁజాలు ; నన్
జెనకకు, కీర్తికాంతయె నృసింహ ప్రియాంగననీ కెఱుంగుదున్.

తా. ఓ నరసభూపాలా నీవు నన్నుఁ గన్నులతోఁ జూతువు కాని మనస్సుతోఁ జూడవు. మాటలతోఁ దృప్తిపఱతువు కాని క్రియలతోఁగాదు నీ కపటములును ఇచ్చకపుమాటలును జాలును నీకుఁ గీర్తికాంతయే ప్రియురాలు

ఇట నరసభూపాలుఁడు శఠనాయకుఁడు అతఁడు కనుగవచేఁ జాలఁ జూచుటచే నుక్తులచేఁదనుపుటచే, లోకు లితఁ డీమెను ప్రేమించియున్నాఁ డనియే తలంతురు కాని యీ రహస్య మామెకే తెలియును కావునఁ బ్రియురాలికిమాత్రమే తెలియు నప్రియము సేయువాఁడను లక్షణము పట్టినది.

రత్నావళ్యాదులందు వత్సరాజాదులేశృంగారనాయకులు ? మొదట వత్సరాజాదులు పరకాంతానురక్తులు గానంతవఱకు ననుకూలనాయకులు. పరకాంతానురాగము గలిగిన పిమ్మట దక్షిణనాయకులు కాని యచ్చటచ్చట గూఢవిప్రియత్వము సాపరాధత్వము మొదలగునవి కానవచ్చుటచే ధృష్టత్వశఠత్వములుగూడ గోచరించుచున్నవి కదా అని ప్రశ్న నిజమే. అట నట నట్లు కానఁబడినను దత్తద్రూపక సమాప్తివఱకును జ్యేష్ఠరాలియందనురాగమే వారు జూపుచుంటచే దక్షిణనాయకులే యగుదురు. కాన దక్షిణునియందుఁ గొలఁదిగా గూఢవిప్రియకారిత్వాదులు గావచ్చుచున్నను బ్రధానముగా దాక్షిణ్యమే కానఁబడును శఠాదు లందది వ్యంగ్యమే

వెనుకటి ధీరోదాత్త ధీరోద్ధత ధీరశాంత ధీరలలితు లొక్కొక్కరును దక్షిణానుకూలధృష్టశఠభేదములచే నలుఁదెఱంగులై మొత్తము పదునాలు తెఱఁగులగుదురు ఎట్లన "దక్షిణధీరోదాత్తుఁడు దక్షిణ ధీరోద్ధతుడు, దక్షిణ ధీరశాంతుఁడు; దక్షిణ ధీరలలితుఁడు; అనుకూల ధీరోదాత్తుఁడు, అనుకూల ధీరోద్ధతుఁడు, అనుకూల ధీరశాంతుడు అనుకూల ధీరలలితుఁడు, ధృష్టధీరోధాత్తుఁడు ధృష్టధీరోద్ధతుఁడు ధృష్టధీరశాంతుఁడు ధృష్టధీరలలితుఁడు; శఠ ధీరోదాత్తుఁడు శఠధీరోద్ధతుఁడు శఠధీరశాంతుఁడు శఠధీరలలితుఁడు' అని మఱియు నీ పదునాలుగు రగు నాయకులను నుత్తమమధ్యమాధమభేదములచే నలువది యెనిమిది విధముల నాయకులగుదురు మఱియుఁ గామశాస్త్రమున నీ క్రింది విధమునఁ జెప్పఁబడినది

శ్లో॥ పునశ్చతుర్ధా కథితః కామశాస్త్రేషు జాతితః
దత్తో భద్రః కూచిమారః పాంచాల ఇతి సూరిభిః
పద్మినీవల్లభో దత్తో భద్రః స్యాచ్చిత్రిణీ ప్రియః
పాంచాలకూచిమారౌతు హస్తినీశంఖినీ ప్రియౌ

వెనుక నవస్థాభేదమును బట్టి ధీరోదాత్తాదిభేదములును దక్షిణాదిభేదములును వచింపఁబడినవి ఇఁక జాతిభేదముఁబట్టియుఁ గొన్ని భేదములు గలవు. దత్తుఁడు భద్రుఁడు కూచిమారుఁడు, పాంచాలుఁడు అని కామశాస్త్రమున నాలుగుజాతుల నాయకులు గలరు దత్తుఁడు పద్మినీజాతి స్త్రీ ప్రియుఁడు, (పాంచాలుఁడని వాత్స్యాయన కామసూత్రము) భద్రుఁడు చిత్రిణీప్రియుఁడు; పాంచాలుఁడు హస్తినీప్రియుఁడు; కూచిమారుఁడు శంఖినీ ప్రియుఁడు.

మరియు దివ్యులు అదివ్యులు, దివ్యాదివ్యులు అనియు జాతినిఁబట్టి నాయకులు గలరు శంకరాదులు దివ్యులు; అర్జునాదులు అదివ్యులు; శ్రీకృష్ణాదులు దివ్యాదివ్యులు

కావ్యములందు రాజైన యీ నాయకు నెట్లు వర్ణింపవలెనో తెలుపుదుము.

గాత్రము—అత్యంతపీనత్వము ఉచ్ఛ్రిత దీర్ఘబాహుత్వముగలదిగా నుండవలెను.

బాహువులు— యుగ అర్గళ సర్ప దంశ స్తంభ గజకరములతో నుపమింపఁబడవలెను

వక్షము— కవాట శిలాపట్టములతో నుపమింపఁబడవలెను.

అంసము— విపులముగా నున్నట్లు వర్ణింపఁబడవలెను.

మధ్యము— కర్కశముగా ,,

హృదయము— స్వచ్ఛముగా ,,

ప్రతాపము— అర్క, అగ్ని వజ్రములతో నుపమింపఁబడవలెను

కీర్తి— చంద్రాది శుభ్రపదార్థములతో ,,

కరము— పద్మ ఊర్ధ్వరేఖాదులు గలదిగా వర్ణింపఁబడవలెను

పదములు— ఛత్రచామరాదిరేఖలు ,, ,,

గమనము— హస్తి సింహముల గమనములతో నుపమింపఁబడవలెను.

కార్కశ్యము— భుజాదులలో నున్నట్లు వర్ణింపఁబడవలెను.

క. ప్రకటీకృతు లగు నీ నా
యకులకు విట పీఠమర్దు లనఁ జేట విదూ
షకు లనఁ గలరు ప్రియాశ్లే
షకళాసంఘటనపటిమలీలాచార్యుల్, ౧౫

తా. పై నుదాహృతులగు నాయకులకుఁ బ్రియురాలితోడి పొత్తుఁగూర్చు నేర్పరులు విట పీఠమర్ద చేట విదూషకులు అను నలువురు సహాయులు గలరు విటాదుల కిది సామాన్యలక్షణములు. విశేషలక్షణములు క్రిందఁ జెప్పఁబడు చున్నవి.

విటాదుల లక్షణములు

చ. వసుమతి నేకవిద్యగలవాఁడు విటుం డనఁబొల్చు; నాయకో
ల్లసనముకన్నఁ గొంత గుణలక్షణహీనుఁడు పీఠమర్దకుం;
డసదృశశాలికాసుఘటనాదిరహస్యవిదుండు చేటకుం,
డెనఁగు నజస్రహాస్యరసహేతువువాఁడు విదూషకుం డనన్. ౧౬

తా విటుఁడన నేకవిద్యగలవాఁడు. "ఏకవిద్యో విటః స్మృతః" అను ప్ర రు లక్షణమున కిది యనువాదము ఏకవిద్య యనఁగా నేమో యస్పష్టముగా నున్నది "వేశ్యానాగరకయోః పరస్పరం సందేశం విటతి కథయతీతి విటః విట శబ్దే ఇతి యశోధరః" (వేశ్యానాగరకులకుఁ బరస్పరము సందేశమును జెప్పువాఁడు) అని నిర్వచనము గలదు సాహిత్యదర్పణమున విటలక్షణ మిట్లు గలదు

"సంభోగహీనసంపద్విటస్తు ధూర్తః కలైకదేశజ్ఞః ।
వేశోపచారకుశలో వాగ్మీ మధురో బహుమతో గోష్ఠ్యాం "
సంభోగహీనసంపత్=క్షీణ ఇత్యర్థః అని రుచిరవ్యాఖ్య

సంభోగమునకుఁ జాలిని సంపదగలవాఁడు. అనఁగా వట్టి యసమర్థుఁడును, జూదరియు నృత్యాది కళలలో నేకదేశ మెఱిఁగినవాఁడును, వేశకరణమున (వేశ్యానాగరకుల సమకూర్చు కార్యమున) నిపుణుఁడును, మాటకారియు, గోష్ఠియందు (వయస్యసమాజమందు) బహుమానితుఁడును నగువాఁడు విటుఁడు. ఈ కాలమున నిట్టి వానినిఁ దార్పుకాఁ డందురు.

పీఠమర్దుఁడు.—స్వార్థమున వికల్పముగా 'క' ప్రత్యయము వచ్చినచోఁ బీఠమర్దకుఁడు అను రూపమును నుండును. సాహిత్యదర్పణమున నీ లక్షణ-మిట్లు గలదు

"దూరానువర్తిని స్యాత్తస్య ప్రాసంగికేతివృత్తే తు
కించిత్తద్గుణహీనః సహాయ ఏవాస్య పీఠమర్దాఖ్యః"

అధికారికేతివృత్తమునందలి ప్రాసంగికేతివృత్తమునకు నాయకుడును, ప్రధాన నాయకునికన్నఁ గొంచెము దక్కువవాఁడునునగువాఁడు పీఠమర్దుఁడు. ప్రతాపరుద్రీయమునందువలెనే నరసభూపాలీయమున పీఠమర్దునికి మిగిలిన ముగ్వురితో సమానముగాఁ బ్రియాసంఘటకత్వము చెప్పఁబడినది. ఇది దోషము. సాహిత్యదర్పణమున పీఠమర్దలక్షణము "దూరానువర్తిని" ఇత్యాదికముగాఁ బ్రత్యేకముగా నిర్వచించి 'అథ శృంగారసహాయాః

శృంగారేఽస్య సహాయా విటచేటవిదూషకాద్యాస్స్యుః
భక్తా నర్మసు నిపుణాః కుపితవధూమానభంజనాశ్శుద్ధాః.

అని శృంగారరససహాయులుగా విట చేట, విదూషకాదులనే గ్రంథకర్త పేర్కొనెను. మఱియు 'శృంగారామృతలహరి'లో నిట్లు కలదు.

"యద్యప్యేతేన పీఠమర్దశ్శృంగారే సచివః కుపితవధూప్రసాదకశ్చేత్యుక్తం కైశ్చిత్ తత్ప్రరాస్తం" (పీఠమర్దుఁడు శృంగారసచివుఁ డనియుఁ గుపితవధూమానభంజకుఁ డనియుఁ గొందఱు నుడివిరి. అది తప్పు)

రామాయణమునందలి సుగ్రీవుఁడు పీఠమర్దుఁడు ఇతఁడు వీరరసనాయకుఁడగు శ్రీరామునికి సహాయుఁడు ప్రియాసంఘటకుఁడు గాఁడు. ఇట్టివానిని విటాదులతోఁ జేర్పరాదు ప్రధాననాయకుని కన్నఁ గొంచెము తక్కువ గుణములు గలవాఁడని చెప్పఁబడుటచే నితఁడును గొంతవఱకు వీరరసాశ్రయుఁడే యగును మఱియు నితఁడు ప్రాసంగికేతివృత్తమునకు నాయకుఁడగుటచే నితనికిఁ బ్రత్యేక ప్రయోజనము గూడఁ గలదు సుగ్రీవునికి భార్యా రాజ్యప్రాప్తులు ప్రయోజనము. మాలతీమాధవమున మకరందుఁడు పీఠమర్దుఁడు. అతనికి మదయంతీలాభము గలదు, మిగిలిన విటాదుల కిట్టి ప్రయోజనములు గానరావు ఒకానొకచో శృంగారరసమునఁ బీఠమర్దుఁడు విదూషకాదులతోపాటు నాయకాను

కార్యమున సహాయుఁడుగా వచ్చును వీరరసమున నట్లు గాదు. కానఁ బీఠమర్ద లక్షణముఁ బ్రత్యేకముగనే చెప్పవలెను

చేటుఁడు —కాముకులను సమకూర్చు రహస్య మెఱిఁగినవాఁడు

విదూషకుఁడు— ఇతఁడు హాస్యగాఁడు. ఇతఁడు గంహాసక్తుఁడుగాఁ గూడ వర్ణింపఁబడును ఇతఁడు సంస్కృతనాటకములలో స్వనామముతోడనే (మైత్రేయుఁడు-వసంతకుడు) వ్యవహరింపఁబడుటయుఁగలదు. కొన్ని యెడలఁ గేవల విదూషక పదముచేతనే వ్యవహరింపఁబడును ఇతఁడు సామాన్యముగా వేషభాషలచే హాస్యముఁ బుట్టించుచున్నను రూపకములలోఁ దిండిపోతుగా జగడాలమారిగా వ్యవహరింపఁబడును

సాహిత్యదర్పణమునందలి శృంగారేఽస్య సహాయాః' అను లక్షణశ్లోక మున 'భక్తా నర్మసు నిపుణాః కుపితవధూమానభంజనాశ్శుద్ధాః అని కలదు. ఇందు వీరు ముప్వురును శుద్ధులని చెప్పఁబడినది శుద్ధులనఁ బరదారసాంగత్యము లేనివారని యర్థము వీరు నాయికలను నాయకులకుఁ గూర్చువారే కాని యా నాయికాసాంగత్యము లేనివారని యరము. కావుననే వీరిని నాయకులు విశ్వ సింతురు

సంస్కృతనాటకములలోఁ బీఠమర్దునకును విటునకును బ్రాయికముగా సంస్కృతభాష యుపయోగింపబడుటయుఁ (నాగానందమున విటుడు ప్రాకృ తము మాటలాడును భావప్రకాశమునఁ బ్రాకృతభాషియని చెప్పఁబడినది.) చేట విదూషకులకుఁ బ్రాకృతముపయోగింపబడుటయుఁ జూడఁ బీఠమర్ద విటు లుత్తమపాత్రలనియుఁ జేటవిదూషకులు నీచపాత్రలనియుఁ దెలియుచున్నది చేటవిదూషకులలో విదూషకుఁడు బ్రాహ్మణుఁడును రాజావలంబము గలవాఁడును నగుటచేఁ గొంచెము మిన్న చేటుఁడధముఁడు సాహిత్యదర్పణమున—

> ఉత్తమాః పీఠమర్దాద్యా (ఆద్యశబ్దాత్ మంత్రి పురోహితాదయః)
> మధ్యౌ విటవిదూషకౌ తథా శకారచేటాద్యా అధమాః పరికీర్తితాః
> (ఆద్యశబ్దాత్ తాంబూలికగాంధికాదయః)

పీఠమర్ద మంత్రిపురోహితాదులుత్తములు విటవిదూషకులు మధ్యములు శకార చేట తాంబూలిక గాంధికాదు లధములు. దీనినిఁ బట్టియుఁ బీఠ మర్దునిఁ దక్కినవారితోఁ గలుపుట యయుక్తము వీరు గాక మాలాకార, రజక, తాంబూలిక గాంధిక ప్రభృతులును నటనట శృంగార సహాయులుగా నుందురు మఱియు నంతఃపురమునఁ బరిచారకులు వామన షండ, కిరాత, మ్లేచ్ఛ ఆభీర, శకార, కుబ్జాదులును గలరు వామనాదులు రత్నావళిలో గానవత్తురు శకారుఁ డున్మత్తుఁడును మూర్ఖుఁడును గా నుండును. ఇతఁడు

తేని యుంపుడుకత్తె తమ్ముఁడు కాన రాజు బావమఱఁది. ఇతఁడు మృచ్ఛకటిక మునఁ జక్కఁగాఁ బ్రదర్శింపఁబడి యున్నాఁడు

మఱియు రాజగు నాయకునకు నర్థ (కార్య) చింతనమున మంత్రియు దండమున (దుష్టనిగ్రహ కార్యము) సుహృత్ కుమార, ఆటవిక, సామంత, సైనికాదులును ధర్మకార్యాచరణమున ఋత్విక్కులు, పురోహితులు బ్రహ్మ వేత్తలు, తాపసులును సహాయులు.

మఱియు రాజు స్వాయత్తసిద్ధి సచివాయత్తసిద్ధి ఉభయాయత్తసిద్ధియు నని ముత్తెఱఁగులుగా నుండును స్వాయత్తసిద్ధి యనఁ దన యాయత్తమైన కార్యసిద్ధిగలవాఁడు. అనఁగా గార్యసిద్ధిపట్లఁ బరసాహాయ్య మపేక్షింపక తానే వ్యవహరించువాఁడు శ్రీరాముఁడు మొదలగువారు స్వాయత్తసిద్ధులు సచివా యత్తసిద్ధి యనఁ గార్యభార మంతయు మంత్రులపై మోఁపియుంచినవాడు. ఇతఁడు నిశ్చింతుఁడు చంద్రగుప్త (ముద్రారాక్షసమున) వత్సరాజాదులు సచివాయత్తసిద్ధులు ఉభయాయత్తసిద్ధి యనఁగా రాజమంత్రు లిరువురిమీఁదను గార్యసిద్ధి యాధారపడి యుండును యుధిష్ఠిరాదు లుభయాయత్తసిద్ధులు

స్వీయాదుల లక్షణములు

కం. ఈ మతమున స్వీయాన్యా
సామాన్య లనంగఁ గలరు సతు ; లందుఁ ద్రపా
సామగ్రీ శీలార్జవ
కోమలకమనీయ స్వీయ గుణములఁ జెలఁగున్. ౧౬

తా. లజ్జాసామగ్రియు ఋజుశీలము అనఁగాఁ బాతివ్రత్యమును గలిగి కోమలత్వముఁ గమనీయత్వమును గలది స్వీయా నాయిక. అగ్నిసాక్షిగ వివాహమాడిన యుత్తమురాలగు భార్య స్వీయ

కం. అన్య యనఁగ నన్యోఢయుఁ
గన్యయు , సామాన్య యనఁగ గణికామణి, యీ
మాన్యల కుదాహరణముల
నన్యాదృశవిశదఫణితి నాపాదింతున్ ౧౭

తా కన్యయు అన్యోఢయు నని యన్యస్త్రీ లేక పరకీయ యిరుదెఱఁ గులు. కన్య యన వివాహముగాని పడుచు. అన్యోఢ యనఁ బరుని వివాహ మాడిన స్త్రీ సామాన్య యనఁగా వేశ్య. ఇది సర్వసాధారణస్త్రీ వీరి కుదాహరణములు తెలుపుదును

స్వీయ

చ. అమృతమువంటి సద్గుణము, నంచితచంద్రకళావిలాసభా
వము శివగోత్రభూతియు నవారణఁదాల్చియశఃపురంధ్రి తాఁ
గమలవనీహితాన్వయశిఖామణి యైన నృసింహమేదినీ
రమణున కేకపత్నియన రంజిలు లోకములెల్ల మెచ్చఁగన్. ౧౯

తా. అమృతమువలెఁ బరిశుద్ధ మగు గుణమును చంద్రకళవలె స్వచ్ఛమైన భావమును (ఈ రెంటివలన నాభ్యంతర మగు శుద్ధి గోచరించును) శివగోత్ర భూతియును (కైలాసముయొక్క యైశ్వర్యమువంటి యైశ్వర్యము) అనఁగాఁ దెల్లఁదనమును- శుభ్ర వంశక్రమమును (దీనివలన బాహ్యశుద్ధి గోచరించును) వహించిన కీర్తికాంత సూర్యవంశశ్రేష్ఠుఁ డగు నరసింహభూపాలున కేకపత్ని యయి రాజిలు చున్నది.

ఇటఁ గీర్తికాంత బాహ్యాభ్యంతరములయందు మిక్కిలి పరిశుద్ధురాలై యుండుటవలన స్వీయ.

అనూఢ (పరకీయ)

సీ. పారసీక క్షమాపతుల చొప్పడఁగించి
నేర్పుమీఱఁగ మోహనిద్ర పుచ్చి
యవనసేనాధినాయకుల దోః స్తంభసం
భరితప్రతాపదీపంబు లడఁచి
యభిభూతఖానమల్కా విష్కృతాయశో
ధ్వాంతసంతతి కాత్మ సంతసిల్లి
సమరముష్కర తురుష్క ప్రాంతసీమల
నడుగు మోపఁగ నీక యరుగు దెంచి
గీ. ప్రాజ్యసామ్రాజ్య యగు వారి రాజ్యలక్ష్మి
కదనసంకేతమున జారకాంత యగుచు
సంచితస్ఫూర్తి నిన్ను వరించె నౌర!
వైరిగజసింహ! ఓబయ నారసింహ! ౨౦

తా. పారసీకరాజుల రాజ్యలక్ష్మి యా ప్రభువులను నిద్రపుచ్చి, యవనుల రాజ్యలక్ష్మి వారి సేనానాయకుల ప్రతాపదీపము లార్చి, మల్కాఖానుని

యొక్క రాజ్యలక్ష్మి వానికి వచ్చిన యపయశస్సును చీకట్లకు సంతసించి తురుష్క రాజ్యలక్ష్మి వారున్న ప్రదేశమున నడుగుమోపక వచ్చి యుద్ధరంగ మను సంకేతస్థలమున నిన్ను వరించుచున్నవి ఇటఁ బారసీకాదుల రాజ్యలక్ష్ములు అన్యోఢలు. "ఒకే రాజ్యలక్ష్మి పారసీక యవన మల్కాఖాన తురుష్కాదులను వంచించి నిన్ను వరింపవచ్చెను" అనియును జెప్పవచ్చును.

సాహిత్యదర్పణమున "యాత్రాది నిరతాన్యోఢా కులటా గళితత్రపా" అని యన్యోఢకు లక్షణము వచింపబడినది యాత్ర యనఁగా నేదో నెపముతో నటు నిటు తిరుగుట; ఆదిశబ్దముచేఁ దలవాకిట నిలుచుట, కిటికీలోనుండి తొంగి చూచుట మొదలగు పనులు, వీనియం దాసక్తురాలును, సిగ్గును వదలినదియు నగు బంకుటాలు.

మ. మగఁడా ? ఊర్చినఁ బ్రేవులెంచు సవతుల్ మచ్చిత్తముంద్రవ్వి చూ;
త్రగు నా యత్త గయాళి, పట్టుఁ బసి, యేరాంధ్రా? దృగంతంబులం
దగ ఛేదింతురు నిష్ఫలంబు శ్రమ కన్నన్నల్ వృథా ! పొమ్మిటన్
వగలాఁడా! యిదె దౌలనుండియె నమోవాకంబు నర్పించెదన్.

ఇట నతఁడు నా మగఁడనియు, నీవు నా వగలాఁడ వనియుఁ దెలుపుటచే నీవు నా ప్రియుఁడ వని వ్యంగ్యము. దీనివలన నీ యువతికిఁ బరనాయక విషయకమగు రతి గోచరించుచున్నది.

కన్య

శా. ఆజానేయము నెక్కి యోబయనృసింహస్వామి వాహ్యాళి రా
నోజం గాంచనసౌధవీధికఁ దదీయోల్లాసముం జూచి యా
తేజోవిభ్రమధన్యకన్య మదనార్తిం జెంది ప్రాసాదపా
ళీజాగ్రన్మణిపుత్త్రికానియతిఁ దాల్చెం దద్గతస్వాంతయై.

తా. నరసభూపాలుఁడు గుఱ్ఱ మెక్కి స్వారిరాఁగా బంగారుమిద్దెపైనిఁ గూర్చుండి యతని యందముఁ గాంచి యొక కన్య మదనపరవశయై ప్రాసాదము నందున్న మణిపుత్త్రికవలెనే నిశ్చేష్టురాలై నిలిచెను.

ఇట నొక కన్య నరసభూపాలుని మోహించినది. ఇట్లు పరకీయ ద్వివిధ. కాని యీ పద్యమునఁ గన్యాలక్షణము లెవ్వియుఁ గానవచ్చుటలేదు. సాహిత్య దర్పణమున "కన్యాత్వజాతోపయమా సలజ్జాయౌవనా" (వివాహము కానట్టియు, లజ్జాయౌవనములు గలిగినదియు నగునది కన్య) అని లక్షణము చెప్పఁబడినది. ఈపె తండ్రి మొదలగువారి స్వాధీనమున నుంటచే బరకీయ లేక అన్య

సామాన్య

కం. ఏ రీతివారు బొందిన
వా రీతిఁ దదీయరాగ మందెడు నౌరా!
వారాంగన; యది సాక్షా
త్కారపుఁబటికంపు బొమ్మకాఁబోలుఁ జుమీ! ౨౨

తా ఈ వారాంగన సాక్షాత్కరించిన స్ఫటికపుబొమ్మయై యుండును. స్ఫటికము తన సమీపమున నున్న వస్తువులను దనలోఁ బ్రతిబింబించుకొనఁ జేయును. అనఁగా వానిని లోఁగొనును అట్లే తన్నుఁడాసినవారి నెల్లరను దాను లోఁగొనును. సాహిత్యదర్పణమున సామాన్యలక్షణ మిట్లున్నది.

ధీరా కళాప్రగల్భా వేశ్యా సామాన్యనాయికా'

తా ధీరురాలనఁ జతురురాలు. కళలనఁ బరప్రతారణము సేయుటకై నేర్చిన నృత్యగీతాదులు వీనియందు నేర్పుగలది, వేశ్యయనఁ బక్కని వేష మును ధరించునది మఱియు,

"నిర్గుణానపి నద్వేష్టి నరజ్యతి గుణిష్వపి
విత్తమాత్రం సమాలోక్య సా రాగం దర్శయే ద్బహిః
కామ మంగీకృత మపి పరిక్షీణధనం నరం
మాత్రా నిష్కాసయే దేషా పునస్సంధానకాంక్షయా
తస్కరాః పండకా మూర్ఖాః సుఖప్రాప్తధనా స్తథా
లింగినశ్ఛన్నకామాద్యా అస్యాః ప్రాయేణవల్లభాః
ఏషాపి మదనాయత్తా క్వాపి సత్యానురాగిణీ
రక్తాయాం వా విరక్తాయాం రత మస్యాం సుదుర్లభం "

తా గుణహీనులను ద్వేషింపదు గుణవంతులను బ్రేమింపదు. కేవలము ధనమునుజూచి పైకనురాగముఁ జూపును అట్లుప్రేమతోఁ జూచియును నతఁడు ధనహీనుడు కాఁగానే తనమీఁది ప్రేమతో నెచ్చటనేనిఁ దిరిగి మఱల ధనమును గొనివచ్చునని తన మాతచే నిల్లు వెడలించును. దొంగలు, పండకులు (వాయ్వగ్నిదోషమువలన నెవని వృషణములు నశించునో వాఁడు పండకుఁడు), మూర్ఖులు సుఖప్రాప్తధనులు, బ్రహ్మచారులు ఛన్నకాములను (రహస్యముగాఁ గామించువారు) నీ సామాన్యకుఁ బ్రియులు ఈ వేశ్యయు మదనాయత్తురాలై యొకానొకచో సత్యానురాగము బ్రకటించును. ఈపె రక్తురాలైనను, అపరక్త

రాలైనను దీని రతము సుదుర్లభము (ఏలన బహుపురుషగామిని యగుటచే రోగాలపుట్టయై యుండు నీపె సురతము ప్రతిబంధకభూయిష్ఠము).

మఱియు "రక్తైవ త్వప్రహసనే, నైషా దివ్య నృపాశ్రయే"— ప్రహసన వర్జితమైన ప్రకరణాదులలో నీ వేశ్య యనురక్తురాలుగానే యుండును. ప్రహసనమున నపరక్తగానే యుండును. అపరక్తగా నున్ననే హాస్యహేతు వగును. దివ్యనృపాశ్రయ మగు నాటకమున దీనిని నాయికగాఁ జేయరాదు.

మృచ్ఛకటికమున వసంతసేన యను సామాన్యనాయిక అనురక్తురాలు. లటకమేలక ప్రహసనమున మదనమంజరి యపరక్తురాలు.

ఈ స్వీయా, పరకీయా సామాన్యనాయిక లొక్కొక్కటెయు అన్య సంభోగదుఃఖిత వక్రోక్తి గర్వితమానవతి యని ముప్విధము లగును. ఏతల్ల క్షణలక్ష్యములకు రసమంజరినిఁ జూడుఁడు. గ్రంథవిస్తరభీతిచే నిందుదాహరింపఁ బడలేదు.

కం. ఈ మగువల కాద్యకు, ము
గ్ధా, మధ్యా, ప్రౌఢ లనఁగఁ దగు నవ్యవయో
వ్యామిశ్రిత యోగ్యములగు
నామములు; తదీయలక్షణము లేర్పఱతున్. 22

తా. పైనుదాహృతలగు మువ్వురిలో స్వీయ ముగ్ధా మధ్యా ప్రౌఢా భేదములఁ బరగును. వీరి నామములు నూతనవయస్సంబంధమువలన నేర్పడి నవి ప్రౌఢకుఁ బ్రగల్భ యనియు నామాంతరము.

చ. నవనవ కామయౌవనసనాథయు, నల్పరతంబు గల్గు న
య్యువతియె ముగ్ధ, మధ్య సదృశోదితయౌవనకామయై రతాం
తవివశయౌ లతాంగి, సతతప్రథితోల్బణకానుయౌవనో
త్సవ, సురతాదిమోహమునుదాల్చు తలోదరి *ప్రౌఢనానగున్.

తా. నూతనమగు కామము (సంభోగేచ్ఛ) యౌవనమునుగలదియు, నల్ప రతము గలిగినదియు నగునది ముగ్ధ యౌవనమును గామమును, సమానముగాఁ గలదియు, రతాంతమున వివశురాలును నగునది మధ్య మిక్కిలి కామమును యౌవనమును గలిగి రతియొక్క యారంభమందే పారవశ్యము గలది ప్రౌఢ ఇందలి లక్షణ మెయ్యదియు నిస్సందిగ్ధముగా లేదు. ప్రతాపరుద్రీయము నందలి

ఉదయద్యౌవనా ముగ్ధా లజ్జావిజితమన్మథా
లజ్జామన్మథమధ్యస్థా మధ్యమోదితయౌవనా
స్మరమందీకృతవ్రీడా ప్రౌఢా సంపూర్ణయౌవనా.

*పా. ప్రౌఢయై తగున్

(ఉదయించుచున్న యౌవనముగలదియు, మదనాభిలాషను (సంభోగే చ్ఛను, జయించిన సిగ్గుగలదియు నగు స్త్రీ ముగ్ధ, ఉదయించిన యౌవనము గల దియు లజ్జయును మదనాభిలాషమును సమానముగాఁగల స్త్రీ మధ్య, సంపూర్ణ ముగా వికసించిన యౌవనము కలదియు లజ్జను త్రోఁద్రోలిన మదనాభిలాషము గలదియు నగు స్త్రీ ప్రౌఢ) అను లక్షణము నరసభూపాలీయ లక్షణముకన్నఁ గొంత బాగుగానేయున్నది. ఏలన నీ లక్షణములలోఁ ఉదయద్యౌవనా ఉదిత యౌవనా, సంపూర్ణయౌవనా పదములు సార్థకములు. చాలా ముఖ్యములయినవి. న భూ లక్షణములలో నిట్టి యర్థములు స్పష్టముగాలేవు. కాని సాహి దర్ప లక్షణము సమగ్రముగా నున్నది.

ప్రథమావతీర్ణయౌవనమదనవికారా రతౌ వామా
కథితా మృదుశ్చమానే సమధికలజ్జావతీ ముగ్ధా

క్రొత్తగా దిగిన యనఁగాఁ నంకురించిన యౌవనమును మదనవికార మును గలదియు రతియందుఁగొంచెము ప్రతికూలతఁ జూపునదియు, మృదు వైన ప్రణయ కోపము గలదియు మిక్కిలి లజ్జగలదియు నగు స్త్రీ ముగ్ధ. ఇందు 'రతౌవామా 'మృదుశ్చమానే'అను లక్షణవిశేషము ప్ర॥రు॥ లక్షణమున లేదు.

ముగ్ధ

శా. ఆలాపంబున కుత్తరం బొసఁగ దాయాసంబునంగాని; తా
నాలోకింపదు; పాటలాధరమరందాస్వాదసమ్మర్దముం
దాళంజాలదు, కౌఁగిలీయదు *తనూతాపంబు చల్లాఱఁగా
నే లజ్జావతి; తద్రతంబు దయితాభీష్టంబు గాకుండునే? ౨౫

నరసభూపాలీయలక్షణమగు 'నవనవకామ యౌవనసనాథయు' నను నది యీ లక్ష్యమున సమన్వయింపదు. 'అల్పరతంబుగలది యనుటకన్న 'రతౌవామా' (రతియందుఁబ్రతికూలతఁజూపునది) అనుటయే మంచి లక్ష ణము. 'రతౌ వామా' అను లక్షణమున కీ పద్యము లక్ష్యము గాఁగలదు. సాహిత్యదర్పణమున "౧. ప్రథమావతీర్ణ యౌవనము గలది, ౨ ప్రథమావ తీర్ణమదనవికారము గలది, ౩ రతివామ, ౪. మానమృదువు. ౫, లజ్జా వతి యనువాని కన్నింటికిని ప్రత్యేకోదాహరణము తీయఁబడినవి ఎట్లన —

*తనూతాపంబు (పా) మనస్తాపంబు.

౧. ప్రథమావతీర్ణయౌవనము గల స్త్రీ

చ నెంతనితంబముల్ నడిమినింకుతనంబు హరించె, తొమ్ములం
గల కృశిమంబు లాఁగుకొనెఁ గౌను గ్రహించెను రోమవల్లి క
న్నుల ఋజువర్తనంబును; మనోజుఁడు గద్దెకురాఁగఁ గ్రొత్తగా
బలిమిచె దోఁచుకొన్నటుల వర్తిలె నొండొరులం దదంగముల్

౨. ప్రథమావతీర్ణ మదనవికారముగల స్త్రీ

చ అడుగిడు మెల్ల మెల్ల భువి నంతిపురంబును వీడదా దెటుల్;
దుడుకున నవ్వఁబోదు మదిలో నిముసంబునఁ గొన్న సిగ్గునం
గరబిడఁబొందుఁ బల్కు నొక్క కాన్తగభీరిమ కొద్ది వక్రిమం
బదర; నిజప్రియుం గుఱిఁచి యాడు చెలింగను నెత్తి భ్రూకుటిన్.

౩ రతివామ యగు స్త్రీ

శా. ఆలాపంబున కుత్తరం బొసగఁదు..... (పై పద్యము)

౪. మానమృదు వగు స్త్రీ

సా పత్యుః ప్రథమాపరాధసమయే సఖ్యోపదేశం వినా
నో జానాతి సవిభ్రమాంగవలనావక్రోక్తిసంసూచనం
స్వచ్ఛైరచ్ఛకపోలమూలగళితైః పర్యస్తనేత్రోత్పలా
బాలా కేవల మేవ రోదితి లురల్లోలాలకై రశ్రుభిః.

తొలిసారి ప్రియుఁ దపరాధ మొనర్చినను సఖియొక్క యుపదేశము లేక యంగములను ముడుచుకొని వెనుదిరిగి పరుండుట వక్రోక్తులు వలుకుట మొదలగు పను లెఱుఁగదు కేవలము బాష్పములు విడుచుచు విలపింతును.

౫ సమధికలజ్జావతి యగు స్త్రీ

చ. అడుగిడు మెల్ల మెల్ల భువి... .. (పై పద్యము)

సమధికలజ్జావతి యనుటచేతనే రతియందుఁ బ్రతికూలురా లని చెప్పఁబడియే యున్నది మఱల రతివామత్వ మేల చెప్పవలసివచ్చె నని శంకించు కొని విచ్ఛిత్తి విశేషమునకై (సౌందర్య విశేషము) చెప్పితి మని సమాధానించెను.

ఈ ముగ్ధ అజ్ఞాత యౌవన జ్ఞాత యౌవన, నవోఢ, విస్రబ్ధనవోఢ అనియు భేదములు గలది (చూ రసమంజరి)

మధ్య

ఉ. మానితవైఖరిన్ మణితమంత్రములం, గళసీవినిర్గళ
త్స్వానములం బసూనశరశూరునిఁ బూజలొనర్చి తా రతిన్
మానిని యొప్పె నప్పు డపమానమనోంబుజవీధి నాతనిన్
ధ్యానముసేయుకైవడి రతాంతనితాంతనిమీలితాక్షియై ౨౮

తా మణితమంత్రములచేతను గళరినుండి జాఱుచున్న పూంతోడను నా యువతి మన్మథపూజ సేసి వివశురాలై యాతనిని ధ్యానముసేయుచున్న గతి నుండెను.

ఇందు రతాంత వివశురా లగు మధ్య వర్ణింపఁబడినది. సాహిత్య దర్పణమున మధ్యాలక్షణ మిట్లు గలదు—

మధ్యా విచిత్రసురతా ప్రరూఢస్మరయౌవనా
ఈషత్ప్రగల్భవచనా మధ్యమవ్రీడితా మతా.

తా విచిత్ర మగు సురతముగలదియుఁ, బ్రరూఢ మైన మదనవికారమును ప్రరూఢమైన యౌవనమును గలదియుఁ గొలఁదిగాఁ బ్రగల్భ మగు (ప్రౌఢమగు) వాక్కులు గలదియు, మధ్యమలజ్జ యనఁగా నన్యూనానధిక మగు లజ్జ గలదియు నగు స్త్రీ మధ్య.

'విచిత్రసురత' యనుట కీ క్రింది దుదాహరణము—

తే. చియ్యఁబట్టియుంటఁ దొయ్యలి ప్రియుతోడి
రతుల నాడెఁ వింత చతురిమంబు
శిష్యవృత్తిసంతఁ జెప్పించుకొన్నట్లు
పావురాలు మణితఫణితిఁ గఱచె.

లక్షణమున మధ్యమవ్రీడితా' (లజ్జామన్మథమధ్యస్థా) అను పదము ముఖ్యము. నరసభూపాలీయలక్షణమున నిది స్ఫుటముగా లేదు. రతాంత వివశత్వ మను లక్షణము దశరూపకమున మాత్రమే (మోహాంతసురతక్షమా) కన్పడుచున్నది. ప్రౌఢ రతాదియందే వివశత్వము గొనును. మధ్య రతాంతమున వివశత్వము గొనును. ముగ్ధ రతియందుఁ బ్రాతికూల్యము వహించునది గాన రతియందు వివశత్వము గొనదు

ప్రౌ ఢ

మ. నటదుత్తుంగపయోధరంబు, జితమందాతక్రియోదార, మ
స్ఫుటవాగంకుర, మతికోణనివసత్పుష్పేషుదర్పంబు, సం
ఘటితాలింగనవామనీకృతకుచాగ్రప్రౌఢరోమాంచమై
విటుఁ జొక్కించెఁ బ్రఫుల్ల పద్మనయనాపీ రాయితం బెంతయున్.

తా. నాట్యమాడుచున్న యెత్తైన కుచములుగలదియు, సిగ్గును జయించి నఱియు నస్ఫుటమగు వాక్కులు గలదియు, నతికోణమున వసించు చున్న మదనదర్పము గలదియు నాలింగనముచే నొత్తఁబడిన కుచములపైన రోమాంచము గలదియు నగు నా తరుణి పురుషాయితమున విటునిఁ జొక్కించెను

ఇందు 'విటుఁ జొక్కించె' ననుట దోషము ఏలన ముగ్ధా, మధ్యా ప్రౌఢాభేదములు స్వీయకుఁగదా! స్వీయ శీలార్జవకోమల యని పేర్కొనఁ బడినది. అనఁగాఁ బతివ్రత యని భావముగదా అట్టి పతివ్రత విటుఁ జొక్కించె ననుట దోషముగదా ఇఁక నీ పద్యమున స్మరాంధురాలయి లజ్జనుఁ బోఁద్రోలి పురుషాయిత మొనర్చుచున్న స్త్రీ వర్ణింపఁబడినది. 'రతాదిమోహ మును దాల్చు తలోదరి ప్రౌఢ అను నరసభూపాలీయలక్షణమున కిది లక్ష్యముగా లేదు

సాహిత్యదర్పణలక్షణ ముత్తమ మయినది
"స్మరాంధా గాఢదారుణ్యా సమస్తరతికోవిదా
భావోన్నతా దరవ్రీడా ప్రగల్భాక్రాంతనాయకా."

స్మరాంధురాలును సంపూర్ణ యౌవనము గలదియు నెల్ల యనులోమ విలోమాది సురతబంధభేదములయందుఁ బ్రవీణురాలును, ఉన్నతములయిన శృంగారచేష్టలు గలదియు, నల్ప లజ్జగలదియు,నాయకుని వశీకరించుకొన్నదియు నగు స్త్రీ ప్రగల్భ లేక ప్రౌఢ

౧ స్మరాంధ యనఁగాఁ గామముచే యుక్తాయుక్త సమయాసమయ వివేకము లేనిది.

కం సతి యెంతధన్యురాలవె
రతినడుమం బ్రియునితోడ రమణీయకథా
శతము వచింతువు నాకో
స్మృతిపోవుఁ బియుండు నీవి స్పృశియింపఁగరాన్.

ఒక యువతి మఱియొక యువతితోఁ దాను సురతసమయమునందే ప్రియునితో ముచ్చటలాడుచు నుందునని చెప్పినది అప్పుడా రెండవ యువతి

"ఓసీ! నీ వెంత ధన్యురాలవే రతిసమయముననే ముచ్చటలాడుదువు నా ప్రియుఁడు నా నీవి స్పృశియింప రాగానే నాకు స్మృతియేపోవును" అన్నది మొదటిది మధ్యానాయిక. దానికి రతాంతమున వివశత్వము గలుగును. రతి మొదలఁగాని నడుమఁగాని వివశత్వములేదు. ఇది ప్రౌఢ రత్యాదియందే వివశత్వమును గొన్నది 'ఎంత ధన్యురాలవు ? అనునది పరిహాసోక్తి నీకు రతి నడుమఁగూడ వివశత్వము గలుగలేదు నాకు రత్యాదియందే కలిగినది కావున రతియందు నాకుఁ గలిగినంత యానందము నీకులేదు 'నీ వధన్యురాలవు. నేనే ధన్యురాలను అని నిష్కృష్టార్థము. రత్యారంభముననే యంధురాలయినది (వివశురాలు) కాన స్మరాంధ

౨ సంపూర్ణ యౌవన

అత్యున్నత స్తన మురో, నయనే సుదీర్ఘే
వక్రే భ్రువా వతితరాం వచనం తతోఽపి,
మధ్యోఽధికం తను ః రనూనగురు ర్నితంబో,
మందా గతిః, కిమపి చాద్భుతయౌవనాయాః

తా పూర్ణ యౌవనము గల యువతిరొమ్మెత్తైన స్తనములు గలది; నేత్రము లతివిశాలములు; కనుబొమ్మలు వంకరలు దిరిగియున్నవి; వాక్కులంత కన్నను వంకరలై యున్నవి నడుము మిక్కిలియు సన్నగిల్లినది, పిఱుఁదులు మఱింత పెద్దవిగా నున్నవి నడక మందగించినది. ఇందు యౌవన ధర్మములు కానఁబడుచున్నవి.

౩ సమస్త రతకోవిద

క్వచిత్తాంబూలాక్తః క్వచిదగురుపంకాంకమలినః
క్వచిచ్చూర్ణోద్గారీ క్వచిదపిచ సాలక్తకపదః
వలీభంగాభోగై రలకపతితైః శీర్ణకుసుమైః
స్త్రియాస్సర్వావస్థం కథయతి రతం ప్రచ్ఛదపటః.

పరుపుదుప్పట మొకచోఁ దాంబూలరాగరంజితమై, యొకచోఁ గాలాగరుపంకమలినమై యొకచోఁ జూర్ణముగలిగినదై, యొకచో లత్తుకతోఁ గూడిన పాదముద్రలు గలదై, యొకచో వళులచిహ్నములు గలదై, యొకచో ముంగురులనుండి రాలిన పువ్వులుగలదై తరుణియొక్క నానాసురతావస్థలను జాటుచున్నది; క్రమముగా మార్జారబంధము ధేనుబంధము, స్వాభావిక సురతము ఉత్తానబంధము సురతవిశేషము, పురుషాయితము అను సురతములను బరుపుదుప్పటము తెలుపుచున్నది. ఇందు సమస్తరతకోవిదత్వము నాయికకు స్పష్టము

౪. భావోన్నత

మధురవచనైస్సభ్రూభంగైః కృతాంగుళితర్జనైః
రభసరచితై రంగన్యాసైర్మహోత్సవబంధుభిః
అసకృదసకృత్స్ఫారస్ఫారై రపాంగవిలోకితై
స్త్రిభువనజయే సా పంచేషోః కరోతి సహాయతాం

మధురాలాపములచే, భ్రూభంగములచే అంగుళితర్జనముంచే రభసా చరితములను, మహోత్సవము కలిగించుననియు నగు నంగన్యాసములచేఁ బునః పునర్విరచితము లగు కటాక్షములచే నా తరుణి మన్మథునికిఁ ద్రిభువన విజయమున సాయపడుచున్నది ఇందు నాయికకు శృంగారచేష్టలయొక్క సమున్నతి స్పష్టము

౫ స్వల్పవ్రీడ

కం. సఖి యెంత ధన్యురాలవె!....

సమధికలజ్జావతి ముగ్ధానాయిక; మధ్యమ లజ్జావతి మధ్యానాయిక; అల్ప లజ్జావతి ప్రౌఢానాయిక అట్లే రతాదియందే వివశత్వమును గొనునది ప్రౌఢ; రతాంతమున వివశత్వమును గొనునది మధ్యానాయిక రతియందు వివశత్వము లేనిది ముగ్ధ.

౬ ఆక్రాంతనాయిక

చ "చెదిరిన ముంగురుల్ సరిగఁ జేర్పుము చెల్వుఁడ! బొట్టు దిద్దుమీ
నుదుట విలాసి! కూర్పుము చనుంగవఁ ద్రెస్సిన ముత్తెపున్ సరుల్
హృదయసఖుండ!" యంచు వచియించి రతాంతమునందు వాని తాఁ
కుదల కొదల్ గగుర్పొడువఁ గోమలి క్రమ్మఱఁ బొందె మోహమున్.

ఇట నాయిక రతివివశురాలై తన ప్రియుని వశీకరించుకొని వానిచే యాయా పనులు చేయించుకొనుచున్నది.

అనంతామాత్యుఁడు తన రసాభరణమునఁ బ్రౌఢను రెండు విధములుగా విభజించెను.

౧ ప్రగల్భ, ౨. ప్రౌఢ

౧ ప్రగల్భయనఁ బూర్ణయౌవనము గలది.

మ. పొదుపై వృత్తనితంబ మొప్పఁగ, గుచంబుల్ క్రొవ్వి యొండొంటితో
గదియం, గుంకుమపంకరేఖ నొసలం గన్పట్టఁ బద్యమ్ము ను
న్మదభద్రేభముభంగి బింకమునఁ దన్మందస్మితాలోకనం
బొదవం గృష్ణునిఁజూచె నిందుముఖి ప్రేమోత్సాహ మొప్పంగఁగన్.

౨ ప్రౌఢయనఁ బురుషాయిత ప్రవీణతగలది

మ. దరనమ్రస్తనభారమున్ విమలవక్త్రశ్రీస్ఫూర్తియున్ రంజితా
ధరబింబమును భ్రూలతానటనసౌందర్యంబు నుత్సంగ గా
ధరతాసక్తియు నూర్ధ్వసంగమనిరూఢత్వంబునుం గల్గు నం
బురుహామోదిని చూచెఁ గృష్ణ నసితాంభోభృత్సమశ్యామునిన్.

ఈ రెం డుదాహరణములలో మొదటిదానిలోఁ బూర్ణయౌవనము గల యువతియు రెండవదానిలోఁ బురుషాయిత మొనర్చునట్టి యువతియుఁ జేర్కొనఁ బడిరి మఱియు లోల' అను మఱియొక నాయికను గూడ నతఁ డుదాహరించెను అది సుందరము గాకున్నను జూపుదును

కం. ప్రియములు పలికినఁ జాలును నయమున నొక్కింత చూచినం జాలును స
న్నయచాలుఁ గరాంబుజముల రయమునమిన్నందు లోల' రతిసౌఖ్యమునన్.

'లోల' యన నొకింతవయస్సు మళ్ళినది. అనఁగా యౌవనము సడలి వార్ధకమున నడుగిడుచున్న స్త్రీ అట్టిదానికి రతిక్రీడలందుఁ బూర్తిగా నభిలాష దొలఁగదు పూర్వమునందున్నంతగా నుండదు కాన దానిని ప్రియుఁడు పలుకరించినను గటాక్షవీక్షణముల నలరించినను చేసన్నలఁ జేసి పిలిచినను దానికి రత్యానందము గలుగును.

లోలాస్వరూపము

మ. అలఘుశ్రోణియు లంబమానపృథుఘోరాకారమున్, నాభిదే
శలుఠద్దీర్ఘకుచంబులున్ ఘటసదృక్షస్థూలతుందంబు నై
పలుమాఱు న్నిడుదీఁగెనవ్వు నగుచున్ బాహాగ్రముల్ సాఁచి చి
ట్టిలువెట్టున్ విటుమోముపై నరర కష్టం బిద్దియున్ వేశ్యయే?

చ. కనుఁగొని నవ్వు నాదరము గల్గినయట్టుల నంతికస్థలం
బున వసియింప వామకరపుష్కరసంజ్ఞ యొనర్చు; మిన్నకై
నను దలపెట్టు హాస్యవచనంబులు; యాదవరాజుపాలి కే
మని చను లోల? ప్రీతియగునా కడివోయినపుష్ప? మెయ్యెడన్.

కం. ధీర, యధీరయు, ధీరా
ధీరయు నగు నందు మధ్య, ధీరాఽధీరా
ధీరాధీరాహ్వయముల
ధారుణిఁ బ్రౌఢయుఁ జెలఁగుఁ దల్లక్షణముల్.

తా. స్వీయా, మధ్యా ప్రౌఢానాయికలలో మధ్యయుఁ బ్రౌఢయు ధీర, అధీర, ధీరాధీర అను భేదములు వహింతురు. స్వీయాభేదములు లేవు. వాని లక్షణము లీ క్రిందఁ జూపఁబడును.

ధీర యనఁగా ధీరత్వము గలది. దేని విషయమున ధీరత్వమనినచో మానవిషయమున. అనఁగా భర్త సాపరాధుఁడైనపుడు ప్రియురాలాతని పైనిఁ బ్రణయకోపము వహించును ఆ ప్రణయకోపమును ధీరురా లొకవిధము గను, అధీరురా లొకవిధముగను ధీరాధీరురా లొకవిధముగను గనఁబఱచును. "ఈ ప్రణయకోపముకూడ లఘువు మధ్యమము గురువు అని మువ్విధములు. అన్యస్త్రీదర్శనాదులవలనఁ బుట్టినది లఘుకోపము గోత్రస్ఖలనాదులవలనఁ గలిగినది మధ్యమకోపము పరస్త్రీసంగమమువలనఁ గలిగినది గురుకోపము. మఱియు స్వల్పప్రయత్నముచేఁ దొలఁగింపఁ దగినది లఘుకోపము కష్టప్రయత్నముచేఁ దొలఁగింపఁదగినది మధ్యమకోపము కష్టతరప్రయత్నముచేఁ దొలఁగింపఁదగినది గురుకోపము. అనఁగాఁ గుతూహలాదులచేఁ దొలఁగింపఁదగినది లఘుకోపము శపథాదులచేఁ దొలఁగింపఁదగినది మధ్యమకోపము. చరణపాత భూషణసమర్పణాదులచేఁ దొలఁగింపఁదగినది గురుకోపము " అని శృంగారామృతలహరిలోఁ గలదు.

మధ్యాధీరా-మధ్యా-అధీరా, మధ్యా-ధీరాధీరా లక్షణములు

గీ॥ తప్పుగల భర్తమ్రోల సోత్ప్రాసఫణితి
గేరడము లాడుసతి మధ్యధీర ; సాస్రు
పరుషవచన యధీర ; బాష్పకుటిల
హారివచన ధీరాధీర యనగఁ దెలఁగు. ౨౯

తా భర్త యపరాధ మొనరింపఁగా నెత్తిపొడుపుమాటలతోఁ బరిహసించునది మధ్యాధీర ; కన్నీటితోఁ బరుషవచనము లాడునది మధ్యా-అధీర; కన్నీటితోఁ గుటిలవచనము లాడునది మధ్యాధీరాధీర

ఇందు మధ్యా-అధీర 'సాస్రుపరుషవచన' యనియు, మధ్యాధీరాధీర 'బాష్పకుటిలహారివచన' యనియు లక్షణము నిర్వచింపఁబడినది ఈ రెంటికిని నర్థభేదము గానరాదు కాన సీలక్షణములు సరిపడవు సాహిత్యదర్పణమున-

శ్లో॥ ప్రియం సోత్ప్రాసవక్రోక్త్యా మధ్యాధీరా దహేద్రుషా
ధీరాధీరా తు రుదితై రధీరా పరుషోక్తిభిః

అని లక్షణము గలదు మధ్యాధీరాధీర రుదితప్రధానము లగు పరుషోక్తులచేతను మధ్యా-అధీర పరుషోక్తులచేతను భర్తయెడలఁ గోపమును జూపును.

అను లక్షణభేదము యుక్తమైనది సాహిత్యదర్పణ వ్యాఖ్యాన మగు 'రుచిర' యం దీ శ్లోకమునకీ క్రింది వ్యాఖ్య వ్రాయఁబడియున్నది

"అత్ర మధ్యధీరా ఉపహాసేన వక్రోక్త్యావా కోపం వ్యనక్తి అతఏవ అస్యాః న పరుషోక్తి ర్నవా రుదితత్వం అధీరామధ్యా రుష్టాసతీ పరుషోక్త్యా కోపంవ్యనక్తి, అత ఏవ అస్యాః అధీరత్వం ధీరాధీరాతు మధ్యా రుష్టా సతీ రుదితప్రధానైర్వచోభిః కోపంవ్యనక్తి అత ఏవ అస్యాః తదుభయాంతరాళా వస్థాత్వం" ఇట మధ్యధీర వక్రోక్తిచేఁగాని పరిహాసముచేఁగాని కోపమును జూపును ఈమెకుఁ బరుషోక్తులుగాని రుదితములుగాని యుండవు. మధ్యా-అధీర పరుషవచనములచేతఁ గోపముఁజూపును కావుననే యామె యధీర మధ్యాధీరాధీర రుదితప్రధానము అగు వచనములతోఁ గోపమును వెల్లడించును కావుననే ఈమె తదుభయాంతరాళావస్థ

ఇందు మధ్యా-అధీరకుఁ బరుషోక్తియే కాని రుదితము చెప్పఁబడలేదు కాన నరసభూపాలీయ 'సాశ్రుపరుషవచన లక్షణము దుష్టము

'న శబ్దముతో సమాసముచేసి "నాశ్రుపరుషవచన" అన "అశ్రువులు లేని పరుషవచనములు గలది" అని యర్థము చేసికొన్నచో సరిపడవచ్చును కాని నాశ్రు పాఠము గాఁరాదు

గీ. కాంతుఁ డపరాధి యైన నాకారగుప్తిఁ
బరఁగి రతివేళ నలయించుఁ బ్రౌఢ ధీర ;
తాడనోగ్ర యధీర, యదగ్రకుటిల
ఫణితి యుభయాఖ్య ; వీరి నేర్పఱతు వరుస. 30

తా. ప్రియుఁ డపరాధము సేసినపు డాకారగోపనము నేసి రతివేళ వలయించునది ప్రౌఢాధీర, ప్రౌఢా--అధీర తన్నులు తన్నును ప్రౌఢాధీరాధీర మిక్కిలి వంకరమాటలచేత ఖేదపఱచును.

ఇందలి ప్రౌఢాధీరాలక్షణములో 'రతివేళనలయించు ననఁగా రతివేళ భర్తకు నలసట గలిగించునది అని యర్థ మగుచున్నది. సాహిత్య దర్పణమున-

ప్రగల్భా యదిధీరాస్యాత్ ఛన్నకోపాకృతి స్తదా
ఉదాస్తే సురతే తత్ర దర్శయంత్యాదరాన్ బహి

ప్రౌఢాధీర కోపాకారమును కనఁబఱపక పైకాదరమును జూపుచు సురతమున నుదాసీనురాలై యుండును అనఁగా రతి నొసఁగక యలయించు నని యర్థము ప్రియుఁడు రతికొరకుఁ దహతహ లాడును ఆమె రతి నొసఁగదు.

మధ్యా ప్రౌఢానాయికలకు ధీరాదిభేదములును వాని లక్షణములును మాత్రమే చెప్పఁబడినవి. ఇటుఁ గ్రమముగా లక్ష్యములు చూపఁబడుచున్నవి.

మధ్యా - ధీర

ఉ. మోమున ఘర్మశీకరసమూహము గానఁగ నయ్యె, నిప్పు డా
రామవిహారకేళిని శ్రమంపడినాఁడవొ? నన్నుఁ బాసి యీ
రే మదనాస్త్రఘాతముల *వేఁగితొ? నీ యుర మెల్లఁ దద్వ్రణ
స్తోమమునోఁకియున్నయదిచొప్పడఁగాంత యెఱుంగఁజెప్పుమా

రాత్రి పరకాంతతో భోగించి వచ్చిన ప్రియునిపైఁ గ్రోధించి మధ్యా - ధీరానాయిక వలుకుచున్నది "నీ మొగము చెమ్మటలు గ్రక్కుచున్నది తోఁటలో విహరించి యలసితివో ? నన్నుఁబాసి మదనబాణముల వేఁగితివో? ఏమో నీ యురమంతయు గాయపడియున్నది.

ఇట సోత్ప్రాసభణితి (ఎత్తిపొడుపుమాటలు) గోచరించుచున్నది

మధ్యా - అధీర

శా. చాలుంజాలుఁ బిసాళిచేఁతలు, పదాబ్జాతంబుపై మాటికిన్
వ్రాలంబోకు, భవత్ప్రియానఖవిమిశ్రంబైన నీ వక్ష మీ
నీలస్థాపితకుట్టిమంబొరసినన్ వేధించు లే లెమ్మికన్, నీ
*బాలాసంగమసౌఖ్యవైభవము నూపన్ వచ్చితే యిచ్చటన్ !

తా అన్యకాంతాసంభోగ మొనర్చి సాపరాధుఁడైన ప్రియునితో మధ్యా - అధీర యనుచున్నది. "నీ విడంబనలు చాలు లెమ్ము ; నా యడుగులపై వ్రాలకుము. నీ ప్రియురాలి గోరొత్తులచే గాయపడిన నీ వక్ష మీ రాతినేలకుఁ దాఁకినచో వేధించను నీ బాలాసంగమసౌఖ్యము నాకుఁ జూప వచ్చితివా ?

ఇటుఁ బరుషవచనములు గాననగును లక్షణమున 'సాశ్రుపరుషవచన' అని నొడివియుఁ గవి సాశ్రుత్వము లక్ష్యమునఁ జూపలేదు సాశ్రుత్వము దుష్ట మనియును జెప్పితిమి

మధ్యా - ధీరాధీర

చ. పలుకవేటంచు నేమిటికిఁ బాములఁ బెట్టెదు? కాంత! నీవుయిం
దెలియఁగఁ దప్పులేమికిని ని న్ననఁజాలక యూరకుండినన్

*వేఁగితొ (పా) వ్రేఁగితొ ?
*బాలాసంగమ (పా) బాలాసంగత

బలుమఱు సాపరాధుగతిఁ బల్కెద, వెన్నఁడుఁ దప్పునీయెడం
గలుగునె? యంచునించెఁ దెలిగన్నుబనీరు లతాంగియంతటన్.

తా॥ ఒక యువతి సాపరాధుఁడగు ప్రియునితోఁ బలుకుచున్నది "నన్ను మాటలాడ వేమని తప్పులు పట్టుచున్నావు నీపయిఁ దప్పులేదని నిన్నేమియు ననఁజాలక యూరకుంటిని అయినను నీవే సాపరాధునివలెఁ బలుకుచుంటివి. తప్పులు మాయందుండును కాని నీ యెడఁ దప్పులుండునే?" అని యాపె తెలిగన్నుల నీరు నించెను ఇట వాక్కుటిల వచనములు గలవు

ప్రౌఢా ధీర

చ. హితమతి ధూర్తభర్త కెదురేఁగెడు నేర్పున నేకపీఠసం
గతి హరియించి, పల్కుటయుఁ గ్రక్కున నెచ్చెలికూడిగంబులం
జతురత నేర్పుచందమున జాలఁగఁ ద్రోచి యతిప్రగల్భయౌ
సతి యుపచారగౌరవము సల్పెదునట్లువహించుఁ గోపమున్ ౩౪

తా॥ సాపరాధుఁడై ధూర్తుఁడైన పతి వచ్చుటను గాంచి యాతఁడు వచ్చి తన కూర్చుండిన పీఠముననే కూర్చుండు నని తలంచి వాని కెదురేఁగు నెపమున లేచి దానినిఁ దప్పించెను అతఁడు పలుకరింపఁగా నెచ్చెలి కూడిగములు గలుపుచున్న చందమున సమాధానము నీయక తప్పించెను ఈ విధముగాఁ బ్రౌఢాధీర తన కోపమును నిర్వహించెను

ఇటఁ బ్రియురాలు తన కోపమును గోపనము సేసి, రతి నొసఁగక ప్రియుని నలయించుచున్నది

ప్రౌఢా - అధీర

చ. వరునిఁ గృతాపరాధుని నవారణ వారణయాన యాసునం
గెరలి భుజాగుణంబున బిగించి వతంసితసారసంబునన్
గరము దమింపఁగా దొడఁగెఁ; గాంతునిసాంత్వనశీతలోక్తులాం
తరనిజకోపతప్తఘృతధారకవారణవారిధారగాన్. ౩౫

తా॥ సాపరాధుఁడగు ప్రియునిఁ బ్రియురా లీసుచేఁ దన కరపాశముచే బిగించి కట్టి యాతని సాంత్వనశీతలోక్తులు దన కోపాగ్ని కాజ్యధారలుగాఁగాఁ గర్ణావతంసముగాఁ గొన్న తామరపువ్వుచేఁ గొట్టుచుండెను

ఇటఁ బ్రియురాలు ప్రియునిఁ దాడనము సేయుచున్నది కానఁ బ్రౌఢా-అధీర.

ప్రౌఢా ధీరాధీరా

చ. బొమముడిపాటు, జంకెనయుఁబూని పురంధ్రులు సాపరాధులౌ
రమణులు వేఁడుకొన్న ననురాగము దాల్చుదు రట్లుగాదు మ
*త్క్రమ, మపరాధలేశమును దాల్పని నీ విపుడెంత మ్రొక్కినం
దెమలదు, శాంతిబొందదుమదీయమనంబిఁక చాలుఁ బ్రార్థనల్.

తా. సాపరాధుఁ డగు ప్రియుని ప్రియురాండ్రు బొమముడిపాటు జంకెనయు వహించియుఁ దమ్మ వేఁడుకొనఁగా క్షమించి యనురాగము వహింతురు. నా క్రమ మిదిగాదు నిరపరాధి వగు నీ వెంత మ్రొక్కినను నాకు శాంతి గలుగదు. నీ ప్రార్థనలు చాలును।

ఇటుఁ బ్రియురాలు కుటిలవచనములచే దూషించుచున్నది.

కం ధారుణి మధ్యయుఁ బ్రౌఢయు
*ధీరాధీరాదిభేదదీపిత లై వే
ర్వేరను జ్యేష్ఠ కనిష్ఠయు
నై రంజిలిద్వాదశాఖ్య లగుదురు వరుసన్. ౩౭

తా మధ్యా ప్రౌఢలు ధీరా, అధీరా, ధీరాధీరాదిభేదములచే నిట్లాఱు విధము లగుదురు ఆ యార్వురును జ్యేష్ఠా కనిష్ఠాభేదములచే మొత్తము పండ్రెండుగు రగుదురు

కం. కావున స్వీయ త్రయోదశ
భావంబు వహించు, నన్య పరగు ద్వివిధ యై;
యీ వారాంగన యేకవి
ధావహ; యట్లైన్నఁగాఁ బదార్వురు సుదతుల్. ౩౮

తా. స్వీయానాయిక యీ పైవిధమునఁ బదుమూఁడువిధములనుండును. ఇఁక నన్య లేక పరకీయ అన్యోఢా కన్యాభేదములచే ద్వివిధ. సామాన్య యేకవిధయే ఇట్లు పదార్వురు నాయికలు

*మత్క్రమము(పా) కృపార్థితన్ మదినిఁ దాల్పని
*ధీరాధీరాదిభేద (పా) ధీరాధీరాదినామ

ఒక్కొక్కచో నొకే నాయికయందు ధీరత్వ - అధీరత్వాదులయు, ముగ్ధాత్వ ప్రగల్భాత్వాదులయు సాంకర్యము గానవచ్చుచున్నది

"నఖలు వయమముష్య దానయోగ్యాః పిబతి చ పాతి చ యాఽసకౌరహస్త్వాం
విట విటపమముం దదస్వ తస్యై భవతి యతస్సదృశో శ్చిరాయ యోగః
తవ కితవ కిమాహితైర్వృథా నః క్షితిరుహపల్లవపుష్పకర్ణపూరైః
నను జనవిదితైర్భవద్వ్యలీకై శ్చిరపరిపూరిత మేవ కర్ణయుగ్మం
ముహురుపహసితా మివాళినాదై ర్వితరసి నః కలికాం కిమర్థమేనాం
వసతి ముపగతేన ధామ్నితస్యాః శఠ కలిరేషమహాంస్త్వయాఽద్యదత్తః
ఇతి గదితవతీ రుషా జఘాన స్ఫురితమనోరమపక్ష్మకేసరేణ
శ్రవణనియమితేన కాంత మన్యా సమమసితాంబురుహేణ చక్షుషాచ."

పరనాయికారతుఁ డగు నాయకునితో నాయిక యనుచున్నది

"ఓ విటుఁడా ఈ విటపము (చిగురాకు)నకు మేము యోగ్యలము గాము ఎవతె నిన్ను రహస్యముగాఁ ద్రాగునో రక్షించునో దానికే యిమ్ము. నీవు విటుఁడవు అది విటప (విటం పిబతి పాతివా) విటపము విటపకే తగును. దానిచే సదృశవస్తుసంయోగము సిద్ధించును"

"ఓ ధూర్తుఁడా వృథగా మాకు నీ చెట్ల చిగుళ్ళను బువ్వులను గర్ణపూరముగా నేల పెట్టెదవు? జగద్విదితములైన నీ యప్రియవచనములచే నా చెవులు నిండియే యున్నవి మఱలఁ గర్ణపూరము లేల? అళినాదములచే నుపహసించుచున్నట్లున్న యీ కలికను (మొగ్గను) నాకేల యిత్తువు? ఓ శఠుఁడా దానియింటికి వెళ్ళిన నీవు నాకుఁ బెద్ద కలిని (జగడమును) దెచ్చిపెట్టితివి"

అని పలికి యలుకతోఁ దన చెవియందున్న స్ఫురితమనోహర పక్ష్మకేసరమగు నీలోత్పలములతోడను జూపుతోడను గొట్టెను.

ఈ నాయిక వక్రోక్తులనుబట్టి మధ్యాధీరయుఁ బరుషవచనములను బట్టి మధ్యా-అధీరయుఁ గర్ణోత్పలతాడనముచే ప్రౌఢా-అధీరయు నగుచున్నది ఈ విధమున నటనట సాంకర్యమును గలదు

గీ. మఱియు శృంగారశంభుసంభావితాష్ట
తనువు లన నీ మృగాక్షులు వినుతిఁ గాంతు
రష్టవిధభేదముల, వీరి యాహ్వాయములు
లక్షణములేర్పఱించెద లలితఫణితి ౩౯

తా శృంగారరసమను శంభుని యష్టమూర్తుల ట్లీనాయిక లవస్థాభేదముచే నెనిమిది భేదములు వహింతురు

సీ. వరుఁడు కైవస మైన వనిత స్వాధీనభ
ర్తృక, ప్రియాగమవేళ గృహముఁ, దనువు
సవరించు నింతి వాసకసజ్జ, పతిరాక
తడవుండ నుత్కంఠఁ దాల్చునింతి
విరహోత్క, సంకేత మరసి నాథుఁడు లేమి
వెస నార్తయౌకాంత విప్రలబ్ధ;
విభుఁ డన్యసతిఁబొంది వేకువ రాఁ గుందు
నబల ఖండిత, యల్క నధిపుఁ దెగడి
గీ. అనుశయముఁ జెందు సతి కలహాంతరిత, ని
జేశుఁడు విదేశగతుఁడైనఁ గృశతఁ దాల్చు
నతివ ప్రోషితపతిక, కాంతాభిసరణ
శీల యభిసారికాఖ్య యై చెలువు మెఱయు. ౭౦

తా. భర్త తన యధీనుఁడై యున్న యువతి స్వాధీన భర్తృక, లేక స్వాధీనపతిక (స్వాధీనః భర్తా పతిర్వా యస్యాః సా స్వాధీనభర్తృకా పతికావా) పరస్త్రీలను గాంక్షింపక తనయందే యనురక్తుడైన పతిగలది

భర్తవచ్చు సమయమునకుఁ దన్ను గృహమును నలంకరించుకొని సిద్ధముగానున్నది వాసకసజ్జ లేక వాసకసజ్జిక వాసకం వాసస్థానం సజ్జయతీతి వాసకసజ్జా' అనియు, వాసకే సజ్జా కృతమండనా అనియు స్త్రీణాం వారస్తు వాసకః అను నుక్తినిఁబట్టి వాసకో వాసరః, అద్య మే ప్రియవాసర ఇతి నిశ్చిత్య యా సురతసామగ్రీం సజ్జీకరోతి సా వాసకసజ్జా, అనియును వ్యుత్పత్త్యర్థములు గలవు

పతి చెప్పినవేళకు రాక యాలస్యము సేయఁగా మిక్కిలి తహతహపాటు గానునది విరహోత్కంఠిత లేక విరహోత్క

సంకేత స్థలమునఁ దన ప్రియుఁడు రాకుంటను గాంచి స్మరార్తి వహించునది విప్రలబ్ధ

ప్రియుఁడు పరకాంతతో రేయి గడపి సంభోగచిహ్నములతో నుదయమున నింటికిరాఁగాఁ గుందునది ఖండిత.

కోపగించి భర్తను దూషించి వెడలఁగొట్టి, యాతడు చన్నపిదపఁ బశ్చాత్తాపపడునది కలహాంతరిత. (కలహేన అంతరితా వ్యవహితా అర్థాత్ ప్రాణనాథతః)

తన ప్రియుఁడు పరదేశగతుఁడైనప్పుడు కృశించునది ప్రోషిత భర్తృక లేక ప్రోషితపతిక (ప్రోషితః భర్తా పతిర్వా) ప్ర + ఉషితుఁడు = ప్రోషితుఁడు = ప్రవాసస్థుఁడు అట్టివాఁడు పతిగాఁ గలది

ప్రియునివద్దకుఁ దానే స్వయముఁగా బోవునదియుఁ బ్రియునిఁ దన యొద్దకు రప్పించుకొనునదియు నగు యువతి యభిసారిక (అభిసరతి అభిసారయతి త్యభిసారికా)

కం. ఈ రీతిఁ దెలుఁగు నతిశ్రీం
గారకళాకలితనాయకామణులకు వే
ర్వేర నుదాహరణంబులు
భూరిమధురవచనరచనముల నేర్పఱతున్. ౪౧

స్వాధీనపతిక

ఉ. శ్రీనిధి యోబభూవరునృసింహుఁడు గైవస మై చెలంగఁగా
భూనుతవైభవస్ఫురణఁ బొల్చు యశోజలజాక్షి నిత్యస
మ్మానితశీల యై ధవునిమన్నన నౌదల యెక్కి నట్టి, వై
మానిక వాహినిన్ నగునమందనిజాతిశయంబు పేర్మినిన్. ౪౨

తా యశస్కాంత తనపతి యగు నరసభూపాలుఁడు దన కధీనుఁడై వర్తింపఁగా మహావైభవముతో నొప్పుచుఁ దన భర్తృ సమ్మానముఁ బొంది యాతని నెక్కి కూర్చున్న గంగానదిని నవ్వుచున్నది

ఇటఁ గీర్తికాంత స్వాధీనపతిక.

వాసకసజ్జిక

చ. యవనచమూసమూహముల నాజి జయించి యుదగ్రదిగ్జయో
త్సవవిభవాభిరాముఁడయి సారెకు నోబయనారసింహభూ
ధవుఁ *డరుదెంచులగ్నమునఁ దత్పురలక్ష్మి విభూషితోల్లస
ద్భవనవిశేష యైమృగమదద్రవవాసనఁదాల్చునిచ్చలున్. ౪౩

తా నరసభూపాలుఁడు యవనసేనల జయించి రాఁగాఁ బురలక్ష్మి గృహమలంకరించుకొని కస్తూరివాసనలు వహించి యుండెను. పురలక్ష్మి వాసకసజ్జిక.

*అరుదెంచు లగ్నమున (పా) అరుదేర మోదమున

విరహోత్కంఠిత

ఉ. నెచ్చెలి శ్రీ నృసింహధరణీవరుఁ దెచ్చెదమంచుఁ బోయి రా
రిచ్చటి ; కీవునుం గరుణయించుక లేక లరంపగుంపులం
గ్రుచ్చెద వేల ? మత్ప్రియునిఁగూర్పుము మన్మథ నీకు మద్విభుం
దెచ్చుటకై యొసంగెద మదీయకటాక్షములన్ జయాస్త్రముల్ .

తా. నరసభూపాలునిఁ గొనివచ్చెదమని నా చెలికత్తె లరిగి యింతను రారైరి. ఓ మన్మథా! నీవును నిర్దయుఁడవై పుష్పబాణములతో నన్ను బాధించు చున్నావు. నా కటాక్షము లను జయాస్త్రములు నీ కొసఁగెదను నా ప్రియుని జయించుకొని వచ్చి నాకుఁ గూర్పుము

ఈ నాయిక విరహోత్కంఠిత.

వి ప్ర ల బ్ధ

చ ఎనయఁగ నీ నివాసమున కే నరుదెంచెద నంచు నావయిం
*గనుఁగొన నిక్కపుంబ్రియము గల్గినవాఁడునుబోలెఁ బల్కియా
మనికికి రాక తక్కెనను మానెదుగాక ; మదీయదృష్టికిం
*బనుపడి మ్రోల నున్నగతి మాయలు సేయఁగ నేల భర్తకున్.

తా. నా ప్రియుఁడగు నరసభూపాలుఁడు "నీ నివాసమునకు (సంకేత మునకు) నేనే వచ్చెదనని నామీఁద నిజమైన ప్రేమయున్నట్లు పలికి రాక మానెను. మానిన మానుఁగాక. ఎదుటనున్నట్లుగా నా దృష్టి కగపడుచు మాయలు పన్న నేల ?

ఇట నాయిక సంకేతస్థానమునకు వచ్చి భర్తనరసి లేకుంటచే వంచిత యైనది.

ఖ ం డి త

చ నృపులకు నెల్లవారల భరించుట యోగ్యముగాన నేఁటి రే
యపరమితోత్సవంబునఁ బ్రియాసదనంబుల కేఁగి యేఁగి యా

*కనుఁగొని నిక్కపున్ (పా) మనముగ నెంతయున్

*పనుపడి మ్రోలనున్న గతి మాయలు సేయ (పా) బొనుపడి మోలనున్న గతి బూమెలు సేయు—

నెపమున మద్గృహంబునకు నీ వరుదేరఁ బ్రభాతమయ్యెఁగా ;*
కిపుడు నృసింహ *నీపయి నొకించుక వంచనలే దెఱుంగుదున్.

ఓ నరసభూపాలుఁడా రాజు లందఱిని సమానముగా భరింపవలెను కాన నేఁటిరాత్రి ప్రియురాండ్ర గృహము లన్నియుఁ జుట్టివెట్టుచుఁ దెల్లవాఱు సరికి నా గృహమునకు వచ్చితివి. అంతియేగాని నీ వెట్టివంచనయు నెఱుఁగవు

ఇటఁ బ్రియుఁ డన్యకాంతతోఁ గ్రీడించిరాఁగా నది కనిపెట్టి సోత్ప్రాసముగా నాయిక పలుకుచున్నది

కలహాంతరిత

ఉ. అనఁగ రాని కోపమున *నప్పుడు కాంతుని ధిక్కరించుచో
మానదురాగ్రహాగ్రహము మానుపలేకపు డెందుఁ బోయెనో
యా ననవింటిదంట యిపు డేఁపఁదొడంగె, భవిష్యదర్థముల్
గానని నా మనంబునకుఁ గావలె నిట్టి విషాదవేదనల్. ౪౨

తా. పట్టరాని కోపమునఁ బ్రియుని ధిక్కరించినపు డా మన్మథుఁ డెందుఁ బోయెనో? ఇప్పుడు వాఁడు నన్ను బాధింపఁ దొడఁగెను. భవిష్యదర్థములు గ్రహింపక వర్తించిన నా కిట్టి ప్రాయశ్చిత్తము గావలసినదే

ఇట నాయిక కలహించి ప్రియుని ధిక్కరించి వెడ్లనడఁచి పశ్చాత్తాపపడుచున్నది కానఁ గలహాంతరిత.

ప్రోషితభర్తృక

చ. చిరయశ ఓబభూవరు నృసింహ భవద్రిపుభామ కాననాం
తరమున *కేఁగియందు నిజనాథునిఁ గానక మన్మథార్తయై
వరుని సరోజపత్త్రమున వ్రాయ నెడం గరముల్ చెమర్పఁగా
నరయనిజాంగకంబె పగయయ్యె నటంచుఁ దలంచు దైవమున్.

తా. ఓ నరసభూపాలా నీ శత్రునిభార్య భర్తతో నడవికిఁ బోయి యటఁ దటనుండి యామెకుఁ దెలుపక పారిపోఁగాఁ దన భర్తనుగానక మదనార్తయై ప్రియునిఁ బద్మపత్త్రమున వ్రాయునపుడు సేతులు సెమర్పఁగాఁ దన యవయవములే తనకు శత్రువు లయ్యెనని దైవమును దలంచున్న యిట శత్రుకాంత ప్రోషితభర్తృక

*కా కిపుడు (పా) నేఁ డిపుడు, *నీపయి (పా) నాపయి.
*నప్పుడు కాంతుని (పా) నానతుఁగాంతుని
*ఏగియందు (పా) ఏగియుండు.

'ఏగియుండు' అను పాఠమున శత్రుభార్య భర్తతో నడవికిఁ బోలేదనియు నాతఁడే యడవికిఁబోఁగా నామె మన్మథార్తయైనదనియు నభిప్రాయము

అభిసారిక

ఉ. నాఁటి మఱిం బ్రియాభిసరణంబొనరింపఁ దలంచె దీవు, చం
ద్రాతపసాంద్రదీధితు లజాండకటాహము *నిండఁబర్వఁగా
నీ తలఁపెట్లు గూడు, రమణీ? *వలతే నొకవన్నె కాఁగ ము
క్తాతతులుం బ్రసూనములు దాల్పు; మలందుము గంధసారమున్.

ఓ రమణీ వెన్నెల బ్రహ్మాండమంతయును గాయుచుండఁగా నీవు ప్రియుని నభిసరింపఁబోవుచున్నావు నీ తలంపెట్లు సిద్ధించు? నీ కోర్కి సిద్ధింపవలె నన్న ముక్తాహారములు పూలు మంచిగంధమును ధరింపుము వీని ధరించుటవలన నా వెన్నెలలో నీవు గనఁబడ కుందువని నిష్కృష్టార్థము.

ఇట నాయిక ప్రియునిఁగూర్చి యభిసరించుచున్నది కాన నభిసారిక

ఈ యభిసారిక జ్యోత్స్నాభిసారిక తమోఽభిసారిక, దివసాభిసారిక యని ముత్తెఱఁగుల నుండును.

జ్యోత్స్నాభిసారిక తెల్లని దువ్వలువలు; తెల్లని పువ్వులు గంధమును, తెల్లని ముత్యాల హారములును ధరించి యభిసరించును ఏలనఁ దెల్లని వెన్నెలలో నీ తెల్లని వస్తువుల కాంతులు గలిసిపోయి యీ నాయిక పరులకు గోచరింపదు. తమోఽభిసారిక చీఁకటిలోఁ బరులకుఁ దాను గనరాకుండుటకై నల్లని దువ్వలువలు నల్లని కలువలు మొదలగునవి ధరించి యభిసరించును దివసాభిసారికయనఁగా బగటిపూట నింటివా రెల్లరును గార్యాంతరమున నెందే వరుగఁగా గపటముగా నింట నుండి ప్రియునిఁ దనకడకు రప్పించుకొనునది.

జ్యోత్స్నాభిసారిక

గీ. మల్లెదండలు గైసేసి మలయజంబుఁ
బూసి యొదలికిఁ దొడి పట్టుపుట్టములను,
బండువెన్నెల నడిరేలఁ బరువు లిడుచుఁ
గానఁబడ దయ్యె నభిసారికాజనంబు.

తమోఽభిసారిక లేక తమిస్రాభిసారిక

శ్లో. నాంబుజై ర్నకుముదై రుపమేయం స్వైరిణీజనవిలోచనయుగ్మం
నోదయే దినకరస్య నవేందోః కేవలే తమసి తస్య వికాసః

*నిండఁబర్వఁగా (పా) నిండవెల్వఁగా *వలతే నొక (పా) వలెనే నొక

తా. అంకుటాంధ్ర కనుదోయి తామరరేకులతోఁగాని కలువరేకులతోఁగాని పోల్పరాదు. ఏలన నవి సూర్యోదయముచేఁగాని, చంద్రోదయముచేఁగాని వికసింపవు. కేవలము చీఁకటిలోనే వికసించును.

దివసాభిసారిక

పల్లీనామధిపస్య పంకజదృశాం పర్వోత్సవామంత్రణే
జాతే సద్మజనా మిథఃకృతమహోత్సాహం పురః ప్రస్థితాః
సవ్యాజం స్థితయోర్విహస్య గతయో శ్శుద్ధాంతమధ్యాంతరే
యూనోస్స్విన్నకపోలయో ర్విజయతే కోఽప్యేష కంఠగ్రహః

తా. ఒకానొక పల్లెదొర భార్యలు పున్నమపండుగకై యూరివారినెల్లరను పిలిపింపఁగా నింటివారందఱును మహోత్సాహముతో ముందు తరలిరి ఈ లోపల నేదో మిష పెట్టుకొని నవ్వుచు నాఁగి యంతఃపురమును జొచ్చి చెమర్చు చెక్కిళ్ళుగల యువతీయువకుల కంఠాలింగనము సర్వోత్కర్షముగ వర్తిల్లుచున్నది

ఇట నభిసారికానాయిక స్వీయయేనిఁ బరకీయయేనిఁ గావచ్చును. వేశ్య (సామాన్య) యభిసారిక యగుచో నెట్టివేషము ధరించునన్నచో నీ క్రింది లక్షణము సాహిత్యదర్పణమునఁ గలదు.

విచిత్రోజ్జ్వలవేషాతు రణన్నూపుర మేఖలా
ప్రమోదస్మేరవదనా స్యాద్వేశ్యాభిసరేద్యది.

తా. విచిత్రమైన యుజ్జ్వలమైనవేషముగలదియు ఝళంఝళ మ్రోఁగుచున్న యొడ్డాణము గలదియుఁ బ్రమోదస్మేర వదనయు నయి వేశ్య యభిసరించును.

ఈ సామాన్యనాయిక యభిసారిక యైనపు డుజ్జ్వలాభిసారిక యనియుఁ జెప్పఁబడును అనగా దీనివేష ముజ్జ్వలము. పరులు చూతురన్న జంకుగొంకు లా యువతి కుండవు. చారుదత్తు నభిసరింపఁబోవు వసంతసేన యుజ్జ్వలాభిసారిక.

లోలచ్చేలచమత్కృతి ప్రవిలసత్కాంచీలతాఝుంకృతి,
న్యంచత్కంచుకబంధబంధురవలద్వక్షోజకుంభోన్నతి,
స్ఫూర్జద్దీధితి విస్ఫురద్గతి, చలచ్చామీకరాలంకృతి
క్రీడాకుంజగృహం ప్రయాతి కృతినః కస్యాఽపి వారాంగనా

తా. చీర హొయలుగాఁ గదులుచుండఁగా మొలనూలు ఝళంఝళమని ధ్వనించు చుండఁగా, అవికచేతఁగూడ నందముగా స్తనముల యున్నతి గోచరించుచుండఁగా మేనికాంతి వ్యాపించు చుండఁగాఁ జక్కని నడకలతో

బంగారు నగలు ధరించి యొక వారాంగన యొకానొక ధన్యునియొక్క క్రీడా కుంజమునకుఁ జనుచున్నది.

వెనుకటి స్వీయా, పరకీయాభిసారికాదుల యభిసరణము గుప్తము ఇది బహిరంగము కావున నిది యుజ్జ్వలాభిసారిక

ఈ పై నుదాహరింపఁబడిన యష్టవిధనాయికలు గాక 'ప్రవత్స్యత్పతికా' అను తొమ్మిదవ నాయికయుఁ గల దని రసమంజరీకర్త తెలుపుచున్నాఁడు. "అగ్రిమక్షణమున భర్త దేశాంతరగమనమునకు సన్నద్ధుఁడై యుండఁగా నాయువతి ప్రవత్స్యత్పతిక" ఈ ప్రవత్స్యత్పతిక ప్రోషితభర్తృకా, విప్రలబ్ధా విరహోత్కంఠలం దంతర్భావమును వహింపదు ఏలన నీమె భర్త సన్నిధియందే యున్నాఁడు వారి భర్త దూరస్థుఁడై యుండును. కలహాంతరితయందును నంతర్భవింపదు ఈపెకుఁ బ్రియునితోఁ గలహములేదు మఱియు నీపె పతి నవమానపఱపదు కలహాంతరిత ప్రియునితోఁ గలహించి యిల్లు వెడలించును ఖండితయందుఁ గూడ నంతర్భావమును వహింపదు అన్యస్త్రీ సంభోగచిహ్నితుఁడై పతి యాపెకడకు రాఁడు వాసక సజ్జికయందుఁ గూడ నంతర్భవింపదు ఈపెకు వారనియమముగానీ, సామాగ్రీసజ్జీకరణము గాని లేదు ఈమె స్వాధీనపతికయందును నంతర్భవింపదు అగ్రిమక్షణముననే యీపెకు విరహము సంభవించుచున్నది. స్వాధీనపతికకు విరహము సంభవింపనే సంభవింపదు సంభవించినచో నామె స్వాధీనపతిక యెట్లగును? అభిసారికలోఁ జేరదు. ఏలన నభిసరణము లేదు కావునఁ బ్రవత్స్యత్పతిక యను తొమ్మిదవ నాయికను బ్రత్యేకముగా నంగీకరింపవలయును దీనిలక్షణ మిది, "ఎవతె భర్త యగ్రిమక్షణమున దేశాంతరమునకుఁ బోవునో యామె ప్రవత్స్యత్పతిక." ఈపెచేష్టలు కాకువచనము కాతర ప్రేక్షణములు (బెదరుచూపులు) గమనవిఘ్నప్రదర్శనము నిర్వేదము సంతాపము, సమ్మోహము, నిశ్వాసము, బాష్పము మొదలగునవి.

ప్రస్థానం వలయైః కృతం, ప్రియసఖై రస్రై రజస్రం గతం
ధృత్యా న క్షణమాసితం వ్యవసితం చిత్తేన గంతుం పురః
యాతుం నిశ్చితచేతసి ప్రియతమే సర్వే స్సమం ప్రస్థితం
గంతవ్యే సతి జీవిత ప్రియసుహృత్సార్థః కిముత్సృజ్యతే ?

ప్రియుఁడు ప్రయాణాభిముఖుఁడు కాఁగానే నా కంకణములు పయిన మొనర్చినవి నా నెచ్చెలు లగు బాష్పములు నిరంతరముగాఁ బోయినవి ధృతి నిముసమేనియు నాఁగ దాయెను మనస్సు ముందుగాఁ బోవఁ దలపెట్టెను ఇట్లన్నియుఁ బ్రియునితో సమానముగా బయలుదేరినవి. ఓ జీవితమా! నీవును నవశ్యముగా వెడలవలసియుండఁగా నీ సుహృత్సంఘాతమును (వలయాదులను)

నేం వదలెదవు? అనగా వారిని వెంబడించి నీవును బొమ్ము, వెనుకఁ బడకుము

ఇందలి నాయికయొక్క పతి యగ్రిమక్షణమున దేశాంతరగమనమును జేయుచున్నాడు కాన నాయిక ప్రవత్స్యత్పతిక.

కానీ శృంగారమృతలహరీకారుఁడీ మతము నిట్లు విమర్శించెను

"ప్రస్థానం వలయైః కృతం" ఇత్యాది మహాకవిప్రయోగానుసారేణ "ప్రవత్స్యత్పతికా నవమీ నాయికా భవితుమర్హతీతిచేన్నైవం యోజనశతం యోజనాదికమివ అల్ప ముత్ప్రేక్షితం విప్రలంభజనకత్వేన సజాతీయభేద మవగణయ్యాస్వతంత్రేచ్ఛేన మహర్షిణా ఐక్యవివక్షణాత్ తదుక్తం 'ప్రవత్స్యత్పతికాప్యత్రైవాంతర్భవతి తత్త్వతః" కించ ప్రవాసో నామ స్వావచ్ఛిన్న దేశవిభాగోత్తరదేశ సంయోగానుకూలం కర్మ నతూత్తరదేశసంయోగ ఏవ మార్గం గచ్ఛతః ఉత్తరదేశసంయోగాభావేఽపి ప్రవాసత్వానాకల్పనాపత్తేః తథాచ తాదృశకర్మణః ప్రవత్స్యత్యపి సత్త్వాదుక్త ఏవ ప్రోషితేఽంతర్భావః" (ప్రస్థానం వలయైః కృతం) అను మహాకవివాక్యము ననుసరించి ప్రవత్స్యత్పతిక యను తొమ్మిదవ నాయికయున్నదని చెప్పవచ్చునందు మేని నట్లుకాదు విప్రలంభమున యోజనశతమునకును యోజనమునకును భేదము గానరాదు. అనఁగా విరహావస్థాకాలమున యోజనశతమెంత సంతాపజనకమో యోజనముగూడ నంతే సంతాపజనకము కాన మహర్షి యీ స్వల్ప భేదమును (ప్రోషితుఁడు = ప్రవాసమునకు వెళ్ళినవాడు· ప్రవత్స్యత్-ప్రవాసమునకుఁబోవుచున్నాడు ప్రోషితభర్తృకకును ప్రవత్స్యత్పతికకును విప్రలంభము సమానమే. ప్రవాసము దటస్థించుటయే సంతాపజనకము. అది భూత మైనను భావియైనను నొక్కటే బరిగణింపక ప్రవత్స్యత్పతికయు నిందే (ప్రోషితభర్తృక) యంతర్భవించు నని చెప్పెను ప్రవాసమున దూరదేశమున నుంటయేకాదు దూరదేశమునకుఁ బ్రయాణసన్నాహమొనర్చుటయుఁ బ్రవాసమే ప్రవాసానుకూల మగు వ్యాపారముకూడఁ బ్రవాసమే కానిచో దూరదేశమును జేరకముందు మార్గమునఁ బ్రయాణము చేయుచున్న కాలమునఁ బ్రవాసము లేకపోవలసి వచ్చునుగదా కావున దూరదేశమునకుఁ జేయుచున్న ప్రయాణసన్నాహము గూడఁ బ్రవాసమే యగును. కాన నిది ప్రోషితభర్తృకయందే యంతర్భవించును.

కం. ఈ రెనిమిది భేదంబులఁ
  బ్రేయసులు పదార్వురును బ్రభిన్నాత్మికలై
  యాయతగతి నిల నూటిరు
  వై యెనిమిది భేదములను వరలుదురు దగన్. ౫౧

కం. ఇల నీ సంఖ్యలఁ దగు నతు
లల యుత్తమ మధ్యమాధమాభిఖ్యలఁ జె
న్నలరఁగ *మున్నూ ఱెనుబది
నలువురు నాయిక లటంద్రు నవరసరసికుల్. ౫౧

తా. వెనుక ముప్పది యెనిమిదవ పద్యమున గణింపఁబడిన ప్రధాన నాయికలలో నొక్కొక్కతెయు స్వాధీనపతికా ద్యష్టభేదములచే ౧౨౮ మంది నాయిక లగుదురు.

ఎట్లన ముగ్ధాస్వాధీనపతికా, మధ్యాస్వాధీనపతికా (ధీరా, అధీరా, ధీరాధీరా జ్యేష్ఠా కనిష్ఠా) ప్రౌఢాస్వాధీనపతికా ధీరా అధీరా, ధీరాధీరా, జ్యేష్ఠా కనిష్ఠా) పరకీయాస్వాధీనపతికా, సామాన్యాస్వాధీనపతికా మొ ఇట్లే ముగ్ధాప్రోషితభర్తృకా మొదలగు భేదము లూహింపవలెను

ముగ్ధకుఁ బ్రజ్ఞాసామగ్రి లేమిచే ధీరా అధీరా ధీరాధీరాది భేదములు లేని విధమున నష్టవిధత్వముగూడ యుక్తము గాదు అయినను బ్రాచీనుల లేఖనము ననుసరించి యీ భేదములు చూపఁబడినవి.

ఇటఁ దెలుపఁబడిన నాయికాభేద మవస్థాభేదమునుబట్టియేకాని, జాతి భేదములచే నేర్పడినదికాదు జాతిభేదమును గ్రహించినచో నానంత్యము సంభవించును అందుఁ బద్మినీ చిత్రిణీ, శంఖినీ హస్తినీ భేదములు ముఖ్యములు. వీని లక్షణ లక్ష్యములు గామశాస్త్రమువలనఁ దెలియవలెను.

పరకీయలగు కన్యకా అన్యోఢలు ప్రియసంకేతమునకుఁ బోవుటకుఁ బూర్వము విరహోత్కంఠిత లగుదురు పిమ్మట విదూషకాదులచేఁ బ్రియుని నభిసరించుచు నభిసారికలగుదురు సంకేతస్థానమును బొంది నాయకుడు కానరామిచే విప్రలబ్ధలగుదురు కాన విరహోత్కంఠిత అభిసారిక, విప్రలబ్ధయుఁ బరకీయ యొక్క యవస్థాంతరములే యని యొక రనిరి ఇది పొరపాటు స్వీయా విరహోత్కంఠిత, స్వీయాభిసారికా స్వీయా విప్రలబ్ధాదిభేదములను బ్రాచీను లంగీకరించిరి

నాయికను దశవయవములను నే యే వస్తువులతోఁ బోల్పఁదగునో యిటఁ దెలుపుదుము.

స్త్రీని—చంద్రకళా సరోజమాలా శిరీష విద్యుత్, తారా, కనకలతా, రత్నశలాకా, దమనకయష్టి (దవనపుకొమ్మ) కాంచనయష్టులతో నుపమింపవచ్చును.

*మున్నూ ఱెనుబది (పా) మున్నూ ఱెనబది

తనుద్యుతిని—గోరోచనా, స్వర్ణ విద్యుత్ చంపక కనక కేతకీ ప్రభృతులతో.

కచములను—తమస్సు శైవాలము మేఘము బర్హిపింఛము, భ్రమరములు, చామరములు యమునాతరంగములు నీలరత్నములు, నీలాబ్జములు ధూపము ధూమము, మొ వానితో

వేణిని—సర్ప భృంగావళి, దండము (వేణీదండము) మొ వానితో

ధమ్మిల్లమును—రాహువు మొ వానితో

సీమంతమును—మార్గము దండము మొ॥ వానితో.

లలాటమును—అర్ధచంద్ర, హేమపట్టికలు మొ॥ వానితో.

కనుబొమ్మలను—వల్లి స్మరచాప తరంగ భృంగాళీ సర్పి, కృపాణిక పల్లవములు మొ వానితో,

కపోలమును—చంద్ర ఆదర్శములు మొ॥ వానితో

ముఖమును—చంద్ర, పద్మ, దర్పణములతో.

నాసికను—తిలప్రసూనము, సంపెంగ మొగ్గ మన్మథ తూణీరములు వంశము (నాసావంశము) పాటలీపుష్పము మొ॥ వానితో

కంఠమును—శంఖము మొ వానితో

*నేత్రములను—మృగనేత్ర పద్మ కుముద ఝషము (చేప), ఖంజన చకోర నేత్ర, కేతకాళీ మన్మథ బాణములు మొ వానితో

అధరమును—ప్రవాళము బింబము బంధూకము (మంకెనపువ్వు), జపా పుష్పము. పల్లవము మొ వానితో.

దంతములను—ముక్తా మాణిక్య నారంగబీజ, దాడిమబీజ కుందకోరకములు మొ వానితో.

వాక్కులను—మధురములైన హంస, శుక పిక శారికా, వేణు, వీణావాదములు మొ వానితో.

బాహువులను—విద్యుల్లతలు మృణాళములు వల్లరులు మొ వానితో.

కరములను—పద్మము పల్లవము విద్రుమము మొ॥ వానితో

నఖములను—చంద్రకళలు కుందకోరకములు, తారలు మొ వానితో.

---

*ఈకాలమున "దానికళ్లు చక్రాలవలె నున్నవి" అని నేత్రములకుఁ జక్రముల తోడను సాటిని జేయుచున్నారు.

స్తనములను—పూగములు (పోఁకలు) తమ్మిమొగ్గలు బిల్వఫలములు తాటి కాయలు పూగుత్తులు కరికుంభములు, కొండలు కుండలు, చక్రములు, దబ్బపండ్లు, దానిమ్మపండ్లు మొ॥ వానితో

నాభిని—పాతాళము ఆవర్తము హ్రదము కూపము, నదము మొ వానితో.

వళులను—పాశములు తరంగములు సోపానములు నిచ్చెన మొ॥ వానితో.

పృష్ఠములను—కాంచనపట్టము మొ వానితో.

నడుమును—ముష్టిగ్రాహ్యముగా సూదిమొన, శూన్యము, అణువు, వేది, సింహపునడుము మొ॥ వానితో.

జఘనమును—పులినము మొ వానితో.

నితంబమును—పీఠము, తపనీయశిల, చక్రము భూమి మొ॥ వానితో.

ఊరువును—కరిహస్తము కదళీకాండము కరభము (మణికట్టు మొదలుకొని చిటికెనవ్రేలు వఱకు నుండు చేతి వెనుకటిభాగము) మొ వానితో.

చరణమును—పల్లవ పద్మ, స్థలపద్మ, ప్రవాళములు మొ వానితో

అంగుష్ఠనఖమును—పూర్ణచంద్రుఁడు మొ వానితో.

గమనమును—గజగమనము హంసగమనము మొ వానితో.

కటాక్షములను—యమునాతరంగములు, భృంగావళి విషము, అమృతము మొ॥ వానితో

హాసమును—వెన్నెల, చందురుఁడు, పుష్పము, పీయూషము ఫేనము, కైరవము మొ వానితో

శ్వాసమును—పరిమళముతో

నూపురధ్వనిని—హంస, సారస, ధ్వనులతోను నుపమింపవచ్చును.

శరీర తదవయవ గుణ విశేషములను దెలుపుదుము!

శరీరమునకు—సౌందర్యము మార్దవము అతికోమలత, కాంతి, ఔజ్జ్వల్యము, అబలత్వము మొదలగునవి వర్ణ్యములు

కపోలమునకు—స్వచ్ఛత వర్ణ్యము.

కంఠమునకు—దీర్ఘత్వము త్రిరేఖత్వము వర్ణ్యములు.

నేత్రములకు—స్నిగ్ధత, విశాలత, లోలత, అపాంగదీర్ఘత, నీలత, ప్రాంత లౌహిత్యము శ్వేతత్వము నిబిడపక్ష్మతయు వర్ణ్యములు.

అధరమునకు—అత్యంతమాధుర్యము, రక్తిమయు వర్ణ్యములు.
దంతములకు—తెలుపు, ఎఱుపు ౩౨ సంఖ్య గలిగియుండుట అతిదీప్తత వర్ణ్యములు.
వాక్కునకు—మాధుర్యము స్పష్టత మృదుత్వము వర్ణ్యములు
భుజములకు—సమత్వము వర్ణ్యము
కరములకు—అతిమృదుత్వము శీతత్వము శోణత్వము వర్ణ్యములు
స్తనములకు—శ్యామాగ్రత్వము ఔన్నత్యము, పీనత్వము (బలుపు) కఠినత, పాండుత్వము వర్ణ్యములు
రోమావళికి— మార్దవము సౌక్ష్మ్యము శ్యామలత, నాభిప్రవేశము వర్ణ్యములు.
జంఘలకు—వృత్తానుపూర్వత్వము (గోపుచ్ఛాకారము కలిగియుండుట), కాంతి, అనతిదీర్ఘతయు వర్ణ్యములు
నిశ్వాసమునకు—అత్యంతమందత, శైత్యము, అతిసుగంధిత్వమును వర్ణ్యములు.

దూతికలు

దూత్యస్సఖీ నటీ దాసీ, ధాత్రేయీ ప్రతివేశినీ
బాలా ప్రవ్రజితా కారూః శిల్పిన్యాద్యా స్స్వయం తథా

సఖురాలు నటి దాసి దాది పొరుగుననున్నది ఇంటిలోని చిన్నపిల్ల యోగిని చాకలి మొదలైనవారు. చిత్రకర్మ సేయునది వీరు దూతికలుగా నుందురు ఆది శబ్దముచేఁ దాంబూలిక స్త్రీ (తాంబూలము అమ్ము స్త్రీ) గాంధిక స్త్రీ (పరిమళద్రవ్యముల నమ్ము స్త్రీ) పాచక స్త్రీ (వంటకత్తె) గాయక స్త్రీ (గానమునేర్పు స్త్రీ) మొదలగువారుగూడ దూతికలు మఱియు స్వయముగానే నాయిక దూతిగా వ్యవహరించుటయుఁ గలదు. ఎట్లన—

గీ కల్కికరాలుదక్కఁ గనరావు కంటె నీ
పల్లెకొంపలందు బాటసారి!
ఘనపయోధరములు గనుఁగొని నిలువంగఁ
దలఁచి తేని, నేఁడు నిలిచిపొమ్ము

ఇట నాయికయే బాటసారితో స్వయముగా దౌత్యము సేయుచున్నది మిగిలినవాని కుదాహరణ లూహ్యములు

కావ్యస్వరూపము

౧. ఇంకఁ గావ్యస్వరూపంబు నేర్పఱింతు
విగతదోషంబులును, గుణాన్వితము, లధిక

లసదలంకారభావోపలక్షితము లు
నైన శబ్దార్థముల కావ్య మనఁ దెలంగు. ౫౭

తా॥ కావ్యస్వరూప మనఁ గావ్యశరీరలక్షణము. దోషరహితములును గుణసహితములును అలంకారయుక్తములును నగు శబ్దార్థములు కావ్యశరీరము కావ్యలక్షణము చెప్పఁబడినది ఈ లక్షణవివేచనము విపులముగా ముందుఁ జేయుదుము ఇట ముందు 'కవి యన నెవఁడు? కావ్యమన నేమి?' అను విషయము లంతిగాఁ దడవుదము

ప్రప్రథమమున "కవిర్మనీషీ పరిభూః స్వయంభూః" అని కవిశబ్దము పరమాత్మపరముగా నీశావాస్యోపనిషత్తునందుఁ గానవచ్చుచున్నది క్రమముగా నాపదము పరమాత్మయొక్క సాక్షాత్కారమును బొందిన ఋషి పరముగా వ్యవహారమునకు వచ్చినది సాక్షాద్ద్రష్ట లయిన వైదికఋషులు కవులు వారి కావ్యము లుపనిషత్తులు. ఆద్యులగు వైదికకవులును లౌకికులగు వాల్మీకి వ్యాసాదులును ఋషు లగుటచేతను వారు దివ్యదృష్టితో లోకరహస్య మెఱిఁగినవా రగుటచేతను వారికావ్యములు లోకోత్తరవర్ణనాత్మకము అగుటచేతను (నానృషిః కురుతే కావ్యం) (ఋషి గానివాఁడు కావ్యమును రచింపఁజాలఁడు) (కవయః క్రాంతదర్శినః) (కవులు దివ్యదృష్టిగలవారు) అనులోకోక్తులుగలిగినవి కావుననే యప్పకవి —

కం. ఇమ్మహిని మునులచే వెల సెమ్మను కావ్యములు "నానృషిః కురుతే కా
వ్య" మ్మను వచనార్థంపున్ సమ్మతిఁ గలివేళ సుకవిజనులే మౌనుల్

అని వచించెను కాని కేవలము ఋషి కావ్యమును రచింపఁజాలఁడు హేమచంద్రుఁడు భట్టతౌతుని శ్లోకమ్ములను మూఁడింటి నీ విషయమున సంగ్రహించెను.

"నానృషిః కవి రిత్యుక్తమృషిశ్చ కిలదర్శనాత్
విచిత్రభావధర్మాంశ తత్త్వప్రఖ్యా చ దర్శనం
స తత్త్వదర్శనాదేవ శాస్త్రేషు పఠితః కవిః,
దర్శనాద్వర్ణనాచ్చాథ రూఢా లోకే కవిశ్రుతిః
తథాహి దర్శనే స్వచ్ఛే నిత్యేప్యాదికవేర్మునేః
నోదితా కవితా లోకే యావజ్జాతా న వర్ణనా"

ఋషిగానివాఁడు కవిగాఁ డని చెప్పుదురు. ఋషి యనగా ద్రష్ట దర్శనమన విచిత్రమయిన వస్తువులయొక్క ధర్మాంశముల తత్త్వము నెఱుంగుట (దీనికే ప్రతిభయని పేరు) అట్టి తత్త్వదర్శనము కలిగినవానినే శాస్త్రములు కవి యని పేర్కొనుచున్నవి కాన లోకమున దర్శనము (ప్రతిభాగుణములు),

వర్ణనము నను నీ రెంటివలనను గవి యని ప్రసిద్ధివహించును వాల్మీకి మొదట ద్రష్టయైనను వర్ణనము(రామాయణరచనము) చేయువఱకుఁ గవిగా గణింపఁ బడఁ డయ్యెను దీనివలన ద్రష్టయై వర్ణనానిపుణుఁడు గావలయును ఈ యభిప్రాయమునే భామహుఁ డిట్లు తెలిపెను

ప్రజ్ఞా నవనవోన్మేషశాలినీ ప్రతిభామతా
తదనుప్రాణనాజ్జీవే ద్వర్ణనానిపుణః కవిః

తా. నవనవోన్మేషశాలిని యగు ప్రజ్ఞ ప్రతిభ యనఁబడును దాని కాశ్రితుఁడై వర్ణనము సేయువాఁడు కవి

ఆనందవర్ధనుఁడు

అపారే కావ్యసంసారే కవి రేవ ప్రజాపతిః
యథాస్మై రోచతే విశ్వం తథేదం పరివర్తతే
శృంగారీచేత్కవిః కావ్యే జాతం రసమయం జగత్
స ఏవ వీతరాగశ్చేత్ నీరసం జాతమేవ తత్
భావానచేతనానపి చేతనవచ్చేతనానప్యచేతనవత్
వ్యవహారయతి యథేష్టం సుకవిఃకావ్యే స్వతంత్రతయా

తా. అపార మైన కావ్యప్రపంచమునకుఁ గవియే బ్రహ్మ అనఁగా సృష్టికర్త. అతఁడు తన యిచ్ఛానుసారముగా లోకమును మార్చును. అతఁడు శృంగారియగుచో లోకమును శృంగారమయ మొనర్చును అతఁడు విరాగి యగుచో నీరసముఁ గావించును. అచేతనవస్తువులను జేతనవస్తువులుగాఁ జేతన వస్తువుల నచేతన వస్తువులనుగా స్వతంత్రతతోఁగవి వ్యవహరించును" అనియును గవినిఁ గూర్చి దెలిపెను. భామహానందవర్ధనుల యుక్తులు ఏకవాక్యతను గల్పించి నచోఁ 'ప్రతిభావంతుఁ డైన కవి కావ్యప్రపంచమును సృజించు బ్రహ్మ" అని తెలును. ప్రతిభావంతుఁడేకదా లోకమును రసమయముగాఁ గానీ నీరసముగా గానీ చేయఁగల దిట్ట ః కావుననే 'కావ్యంతు జాతు జాయేత కస్యచిత్ప్రతి భావతః" (ఒకానొకప్పుడు ప్రతిభావంతునివలననే యట్టి కావ్య ముదయించును) అను వాచోయుక్తియు నేర్పడినది. కావునఁ గవి యనఁ గ్రాంతదర్శియై, ప్రతిభావంతుఁడై వర్ణనానిపుణుఁ డగువాఁడు.

"కవనీయం కావ్యం" (వర్ణింపఁదగినది) అని లోచన కారుఁడు, "కవయ తీతి కవిః తస్యకర్మ కావ్యం (వర్ణించువాఁడు కవి అతని కర్మకావ్యము) అని విద్యాధరుఁడు "కౌతి శబ్దాయతే విమృశతి రసభావాన్ ఇతి కవిః తస్య కర్మ కావ్యం ' (రసభావములను విమర్శించువాఁడు కవి వాని కర్మ కావ్యము) అని భట్టగోపాలుఁడు, లోకోత్తరవర్ణనానిపుణకవికర్మ కావ్యం' (లోకోత్తర

వర్ణనానిపుణుఁడగు కవియొక్క కర్మ కావ్యము) అని మమ్మటుఁడు ఇవన్నియుఁ గవికర్మను దెలుపుచున్నను ని-దుఁ గవిలక్షణ మిమిడియే యున్నది. వీనిలోని "లోకో త్తరవర్ణనా నిపుణ కవి కర్మ కావ్యం" అను దానినిఁ బట్టి లోకోత్తరవర్ణనా నిపుణుఁడే కవియని సారాంశము. మిగిలిన యుత్పత్తులకుఁ గూడ నిదియే యభిప్రాయమైనను నింత విస్పష్టముగా లేవు కావున నట్టి లోకోత్తర వర్ణనా నిపుణత్వము ప్రతిభాలభ్యము, ప్రతిభ దేవతానుగ్రహ సంపాద్యము దేవతానుగ్రహము తపస్సంపాద్యము. తపస్సు ఋషికర్మ కావుననే "నా నృషిః కురుతే కావ్యం ' "కవయః క్రాంతదర్శినః' అను లోకోక్తు లేర్పడినవి అట్టి ఋషికల్పుఁడే మహాకవి మహాకవి యన నెట్టివాఁడో యింకను ముందు వివేచింతుము. ఇఁక నప్పకవీయమునఁ బేర్కొనఁబడిన సప్తవిధకవులను జూపుదుము.

అ. వె. వినుతిఁ గాంతు రిల వివేకి, వాచక, రౌచి
కార్థ, శిల్పి, భూషణార్థు లనఁగ
మార్దవానుగత సమాహ్వయుఁడును నాఁగఁ
గవులు సప్తనామకములతోడ.

తా. వివేకి వాచకుఁడు రౌచికుఁడు ఆర్థికుఁడు శిల్పి భూషణార్థి మార్దవకవి అని కవులు సప్తవిధములుగా నుందురు.

సీ. గణవర్ణశబ్దార్థగుణదోషనికరంబు బరికించి కూర్పుఁ గబ్బము వివేకి
బహుతరానుప్రాసపదబంధనియమంబు వదలక కృతిసేయు వాచకుండు
మృదుమధురోక్తుల వెదకి కావ్యం బెల్ల రచియించుఁ బదపడి రౌచికుండు
మితశబ్దములలోన నతివిపులార్థంబు నిమిడించు నర్థాఖ్య నెసఁగు నతడు

గీ. సెప్పు యమకంబు నెప్పట్ల శిల్పికుండు
పొందుపఱచు నలంకృతుల్ భూషణార్థి
సరళపదవిరళార్థ విస్ఫురణముగను
జూపు రసమెందు మార్దవస్ఫుటకరుండు.

అని వివేకి ప్రభృతులకు లక్షణము చెప్పఁబడినది ఇందు రౌచిక ఆర్థిక, మార్దకవులు మాత్రమే కవులు. మిగిలినవారు కవిబ్రువులే పూర్వకవులలో నన్నయభట్టు రౌచికుఁడు తిక్కన ఆర్థికుఁడు, ఎఱ్ఱాప్రగడ మార్దవకవి.

బట్టుమూర్తి నరసభూపాలీయములో సంస్కృతాంధ్ర కవులలోఁ బూర్వుల కే యే గుణములు పత్యేకించి కలవో వానినిఁ బేర్కొని యున్నాఁడు. చూడుఁడు

సీ. బాణు వేగంబును భవభూతి సుకుమార తయు మాఘు శైత్యంబు దండిసమత
అలమయూరు సువర్ణకలన చోరుని యర్థ సంగ్రహమ్ము మురారిశయ్య నేర్పు
సోము ప్రసాదంబు సోమయాజుల నియ మంబు భాస్కరుని సన్మార్గఘటన
శ్రీనాథుని పద ప్రసిద్ధ ధారాశుద్ధి, యమరేశ్వరుని సహస్రముఖసృష్టి

గీ. నీక కల దటుగాన ననేకవదన
సదనసంచార ఖేదంబు సడలు వఱచి
భారతీదేవి నీ జిహ్వఁ బాదుకొనియె
మూర్తి కవిచంద్ర ! విఖ్యాతకీర్తిసాంద్ర

ఈ వేగ సుకుమారతాదిగుణములు బాణభవభూత్యాది శబ్దముల కర్థాంతమున సరిపడునట్లు కవి గూర్చెను ఇది ప్రాయోవాదము

మఱియు "ఉపమా కాళిదాసస్య భారవే రర్థ గౌరవం ।
దండినః పదలాలిత్యం మాఘే సంతి త్రయోగుణాః అనియుఁగలదు
ఇఁక గావ్యమీమాంసలో నీ కింతి విభాగము చేయఁబడియున్నది.

"శాస్త్రకవి, కావ్యకవి ఉభయకవి వారిలో నుత్తరోత్తరుఁడు శ్రేష్ఠుడు" ఉభయకవినే విద్వత్కవియందురు విద్వత్కవయః కవయః కేవలకవయస్తు కేవలం కపయః" అను వాచోయుక్తియుఁ గలదు అనఁగాఁ బ్రతిభావ్యుత్పత్తులు రెండును గలవాఁడే విద్వత్కవి అట్టివాఁడే లోకోత్తర వర్ణనానిపుణుఁడు కావుననే—

ఆ వె గురువులఘువుఁజేసి కుంచించి కుంచించి లఘువుగురువుఁజేసి లాఁగిలాఁగి
కవితఁజెప్పునట్టి కవిగులామునబట్టి ముక్కుఁగోయవలయుఁద్రొక్కిపట్టి
ఇట్టివారు కవులుగారు మఱియు—

న స శబ్దో న స న్యాయో న సా విద్యా న సా కళా
జాయతే య న్న కావ్యాంగమహో భారో మహాన్కవేః

కా కావ్యాంగము గాని శబ్దముగాని న్యాయముగాని విద్యగాని, కళ గాని లేదు కవిపైఁ జాల భారము గలదు అనియు నుంటవలనఁ గవి సాధించవలసిన విద్యాసామగ్రి యనఁగా వ్యుత్పత్తి చాలఁ గలదు కావున విద్వత్కవులే కవులు మిగిలినవారు కపులే

"నాకవిత్వ మధర్మాయ మృతయే దండనాయ చ
కుకవిత్వం పునస్సాక్షా న్మృతిమాహు ర్మనీషిణః"

కవి కాకపోవుటవలన నెట్టియధర్మము లేక పాపము సంభవింపదు కవి కాకపోవుటవలన మనుష్యుడు చచ్చిపోఁడు. రాజాదులవలన దండనము

రాదు. కాని కుకవియగుట కేవలము మరణమే — అను శాచోయుక్తివలనను వ్యుత్పన్నుఁడై విద్వత్కవికావలెనని యూహింపఁబడుచున్నది అట్టి ప్రతిభా వ్యుత్పత్తులు రెండును గలఁవాడే లోకోత్తరవర్ణనానిపుణుడు ఇఁక నా ప్రతిభ కారయిత్రి భావయిత్రి—యని యిరుదెఱఁగులుగా నుండునని కావ్య మీమాంసాకర్త తెలుపుచున్నాఁడు కవిచేఁ గావ్యమును వ్రాయించుశక్తి కారయిత్రి పాఠకునిచేఁ గావ్యార్థమును భావింపఁజేయుశక్తి భావయిత్రి. కాఁబట్టి కవికివలెనే పాఠకునికిని బ్రతిభ యుండవలెను లేకున్నచోఁ గవిభావమును గ్రహింపలేకపోవును. ప్రతిభాతారతమ్యమును బట్టియే కవులలో నప్పకవి తెలిపిన భేదములేర్పడును

ఇఁకఁ గావ్యలక్షణమును వివేచింతము కావ్యలక్షణమును దెలిసికొనుటకు ముందు "సంస్కృతభాషలో నలంకారగ్రంథము లసంఖ్యాకములుగా నున్నవి కదా ఎందులకిన్ని పుట్టినవి? మతభేదములుగలవా? — ఈ మొదలగు విషయములను జరిత్రస్వరూపదృష్టితోఁ దెలిసికొనవలయును—అట్లయినయెడలనే ముఖ్యముగా నది యవగతము కాఁగలదు

భ ర త మ త ము

రమారమి రెండువేల సంవత్సరములనాఁడే భరతుఁడను మహర్షి నాట్య శాస్త్రమను గ్రంథమును రచించెను. అదియే సాహిత్యశాస్త్రమునఁ బ్రప్రథమ గ్రంథము ఆ గ్రంథము కేవలము రూపకమును గుఱించియుఁ దద్విభేదములను గుఱించియు సమగ్రముగాఁ జర్చించును భరతుని దృష్టిలోఁ గావ్య మన నాటకాదులే నాటకములకు రూపకములనియు నామాంతరము రామాదిరూపములను ధరించి నటులు నటింతురు కాన రూపకములు 'తద్రూపారోపాత్తు రూపకం" అని సాహిత్యదర్పణము భరతుఁడు రూపకమునకు రసము ప్రధానమనెను కావ్యసౌందర్యము ముఖ్యముగ దేనివలనఁ గలుగునో యదికావ్యమునఁ బ్రధానము భరతుఁడు రూపకమున రసమువలననే యా సౌందర్యము గలుగునని తలంచెను. ఆ రస మెట్లు పోషింపఁబడ వలయునో యా గ్రంథము సమగ్రముగా జర్చించెను. భరతుఁడు గూడ రూపకములందు రసము ప్రధానముగా నుండవలయు నన్న సిద్ధాంతమును స్వోపజ్ఞముగాఁదెలుప లేదు. అతనికిఁ బూర్వుఁడగు నందికేశ్వరుఁడీ సిద్ధాంతమును లేవదీయఁగా భరతుఁ డా సిద్ధాంతము ననుసరించి తాను జెప్పినట్లు భరతుఁ డుదాహరించిన రెండు శ్లోకములఁబట్టి తెలియఁ గలదు కాన భరతుఁడు రసప్రాధాన్యవాది ఈతని మతమునఁ గావ్యశరీర మితివృత్తమే 'ఇతివృత్తంతు కావ్యస్య శరీరం పరికీర్తితం' కావ్యశరీర మితివృత్తము దీని సౌందర్య హేతువు రసము

భామహమతము

భరతునికిఁ బిమ్మట నైదవశతాబ్దిలో భామహుఁ డను నాలంకారికుఁడు శ్రవ్యకావ్యచర్చను సాఁగించి శబ్దార్థౌ సహితౌ కావ్యం కావ్యమునకు శబ్దార్థములు శరీరమనియు స్త్రీ పురుషాదుల శరీరసౌందర్యమును నలంకారములు (నగలు) పెంపొందించు విధమునఁ గావ్యశరీరమునుగూడ వక్రోక్త్యాద్యలంకారములు పెంపొందించుననియుఁ గావునఁ గావ్యమునకు నలంకారములు ప్రధానమనియు నిరూపించెను అనఁగా నలంకారమువలనఁ గావ్య సౌందర్యము గలుగునని నిర్ణయించెను

ఇతరాలంకారికులెల్లరును సమ్మతించిన స్వభావోక్తి నీతఁ డంగీకరింపలేదు స్వభావవిరుద్ధముగా ననఁగా వికటముగాఁ బలికినపుడే యానందము గలుగుననియు నా వికటోక్తియే వక్రోక్తి యనియు, నలంకారము లెల్ల వక్రోక్తులే యనియు నాతని సిద్ధాంతము ఈ యుద్దేశముతోడనే క్రమ సూక్ష్మ, లేశ ద్యలంకారముల నాతఁడంగీకరింపడయ్యె ఈతఁడు దండి వామను లంగీకరించినరీతి నంగీకరింపలేదు. కావ్యసౌందర్యాధాయకమైన వక్రోక్తి యున్నచో నేరీతియైన నుపాదేయమే యనియుఁ నది లేనిచో నేరీతియైన ననుపాదేయమేయనియుఁ గాన వైదర్భీ, గౌడీ, భేదము లనవసర మనియు నాతని యభిప్రాయము

భరతుఁడు దృశ్యకావ్యమునకు రసము ప్రధానమని యంగీకరించుటచే భామహుఁడు శ్రవ్యకావ్యమునకు నలంకారమే ప్రధానమని తలఁచెను మఱియు రసమునుగూడ రసవదలంకార మను పేరుతో నలంకారముగానే పరిగణించెను. ఈతఁడలంకార ప్రాధాన్యవాది ఈతని గ్రంథము భామహాలంకారము.

దండిమతము

ఆఱవశతాబ్దివాఁడగు దండి కావ్యసిద్ధాంతము నిట్లు ప్రతిపాదించెను శరీరం తావదిష్టార్థవ్యవచ్ఛిన్నా పదావళీ (రమణీయార్థభూషిత మగు పదసంఘాతము కావ్యశరీరము) శరీరముయొక్క బాహ్యసౌందర్యమును బెంచునవి యలంకారములైనను, అంతస్సౌందర్యమును బెంచి ప్రాధాన్యమును వహింపఁజేయునవి శౌర్యాదిగుణములే స్త్రీపురుషులకు లోకమునఁ బ్రాధాన్యమును లేక సౌందర్యమును గూర్చునవి గుణములే కదా! కావున నట్లే కావ్యశరీరమునకును గుణములే ప్రధానములు గుణముల తరువాత నలంకారములు (ఈ గుణములలోఁ గొన్నింటితో వైదర్భీరీతియుఁ గొన్నింటితో గౌడీరీతియు నేర్పడునని యాతఁడుఁ వచించెను) కొందఱు దండి భామహమతానుసారియై యలంకారమార్గమునకుఁ జెందినవాఁడనియుఁ గొందఱు గుణమార్గస్థాపకుఁడనియు వచింతురు గుణమతస్థాపకుఁ డనుటయే యుక్తిసహముగా నున్నది. ఈతఁడు

గుణప్రాధాన్యవాది గుణములవలనఁ గావ్యసౌందర్యము గలుగునని యితఁడు నిరూపించెను ఈతని గ్రంథము కావ్యాదర్శము*

ఈతఁడును గావ్యమున రసప్రాధాన్యము నంగీకరింపలేదు ఈతఁడు గూడ రసమును రసవదలంకారముగానే పరిగణించెను ఈ యిరువురాలంకారికులును వరుసగా గావ్యశరీరముయొక్క బాహ్య సౌందర్యమును అంతస్సౌందర్యమును గుఱించియే చర్చించిరి కానిశరీరమునకాత్మవలెఁగావ్యశరీరమునకాత్మగలదా ? యని లోఁతుగా విచారింపలేరి. వారికిఁ గావ్యాత్మను గుఱించి తట్టనేలేదు. భామహుని మతమున శబ్దార్థములు రెండును గలిసియే కావ్యము. దండిమతమున రమణీయార్థ భూషితమగు శబ్దమే కావ్యము.

వామనమతము

తరువాత తొమ్మిదవ శతాబ్దివాఁడగు వామనుడు గావ్యాత్మను గూర్చి విచారణ సాగించి 'రీతిరాత్మా కావ్యస్య' అను సిద్ధాంతమును వచించెను శరీరమునకాత్మవలెనే కావ్యశరీరమునకును నాత్మయుండుననియు నది రీతియనియు నాతని సిద్ధాంతము రీతి కావ్యాత్మ యని చెప్పి భామహుని యలంకారసిద్ధాంతమును దండి గుణసిద్ధాంతమును దనరీతితో సమన్వయించెను ఎట్లనఁగాఁ గావ్యాత్మరీతి, రీతి గుణములచే నేర్పడును అలంకారములు కావ్యసౌందర్య

*Dandin's Kavyadarsa is to some extent an exponent of the *Riti School* of Poetics and partly of the *Alankara School*. (P V Kane)

The next important name after Bhamaha is that of Dandin He is exponent of the *Guna School* which holds that the beautiful collection of words and ideas is the chief feauture of the poetry The ten gunas are the life of the best poetic style called the Vaidarbhi, and the Alankaras which Bhamaha regarded as the soul of the poetry are treated by Dandin as mere embellishments of poetic language.

—Dr Sankaran.

If, on the basis of Dandin's formulation of Gunas, one says that he belongs to The Guna School one can as well say that Dandin belongs to the Riti School. Really Dandin belongs to The Alankar School, much more than Bhamaha

—Dr. V Raghavan

మను వృద్ధిసేయును " ఈతని మతమునఁ గావ్యశరీరము శబ్దార్థోభయమే అనఁగా నితఁడు దండిమతమును స్వీకరింపక, భామహమతానుసారముగాఁ గావ్యశరీరమును నిర్ణయించెను ఈతఁడు రీతిప్రాధాన్యవాది. ఇతఁడు కావ్య సౌందర్యము రీతి వలన సిద్ధించునని నిశ్చయించెను శరీరమున కాత్మవలెనే కావ్యశరీరమున కాత్మయున్నఁగాని యలంకారాదులు శోభాహేతువులు కావు. కాన నాత్మ ప్రధానము అది రీతి ఈ రీతియే యలంకారాదులకును శోభా హేతువు కాన రీతియే యాత్మ యని యితనివాదము ఇతని గ్రంథము కావ్యా లంకారసంగ్రహము.

ఆనందవర్ధన మతము

వామనుని యనంతరమునఁ గొలఁదికాలములోనే యానందవర్ధనుఁ డను నాలంకారికుడు సాహిత్యక్షేత్రమునకు వచ్చెను ఆయనే ధ్వన్యాలోకమను గ్రంథమును రచించెను ఆయన యొక క్రొత్త సిద్ధాంతమును లేవఁదీసెను ఆయన సిద్ధాంత మిది కావ్యశరీరమున కాత్మ ధ్వని అది వస్త్వలంకార రసరూపము అనఁగా వస్తుధ్వని అలంకారధ్వని రసధ్వని అని మువ్విధములు ఈ మూటిలో వస్త్వలంకారధ్వనులకన్న రసధ్వని సర్వశ్రేష్ఠము అయినను వస్త్వలంకారధ్వనులధమములుగావు కావ్యమునకలంకారములు ముఖ్యాంగ ములుగావు ఏలన శరీరమునందాత్మ యున్నచో నలంకారములు శోభా హేతువులగును, అట్లే కావ్యశరీరమున కాత్మయగు ధ్వనియున్నచో నలంకార ములు గూడా శోభాహేతువులగును ఆ ధ్వని లేకున్నచో నా యలంకారములు శోభాహేతువులు కాఁజాలవు కాన నట్టియలంకారములే గ్రాహ్యములు అనఁగా ధ్వన్యుపస్కారకములగు నలంకారములే యలంకారములు అప్పుడే యలంకార శబ్దము సార్థక మగును. గుణములు రసధర్మములు అనఁగా గుణములకును రసమునకును నవినాభావసంబంధము గలదు. అలంకారములు లేకున్నను రస ము దవచ్చును. కాని గుణములు లేకున్నచో రసముండదు గుణములాత్మ ధర్మములందునట్లే కావ్యమునను గుణములాత్మభూత మగు రసధర్మములే అల కారములాత్మధర్మములుగాక శరీరధర్మములగును కాఁబట్టి యలంకార ము వలెనే గుణములు గావ్యాత్మ యగు ధ్వనికంగములే మఱియు వామ నుఁడు నుడివినట్లు రీతి కావ్యాత్మగాదు రీతియన గుణసంకలనరూపమేకదా ఈ రీతియుఁ దత్తద్రసధ్వన్యుపస్కారకముగా నసమాస అల్పసమాస దీర్ఘ సమాసముగానుండును ఇదియు నంగభూతమే ధ్వనియే యంగి ఈవిధముగా నలంకారములు గుణములు రీతులును ధ్వన్యుపస్కారములుగా ననగాఁ ధ్వనికిఁ దోడ్పడునవిగానే యుండవలయును అప్పుడే యా నామములును సార్థకములగును.

భామహ, దండి వామన ఆనందవర్ధనులు క్రమముగా నొకరికన్న నొకరు కావ్యమార్గమును (కావ్యాత్మను) నిర్ణయించుటలో నొక్కొక్క మెట్టు ముందునకు సాఁగిరి ఆనందవర్ధనుఁడు ముఖ్యముగా రెండు విషయములను దన గ్రంథమున స్పష్టపరచెను అతఁడు క్రొత్తగా ధ్వని సిద్ధాంతమును స్థాపించెను ప్రాచీనుల అలంకార గుణ రీతి సిద్ధాంతములను హేతువాదపురస్సరముగాఁ దన ధ్వని సిద్ధాంతమున కంగములుగా సమన్వయించెను మఱియు భరతుని రూపకసిద్ధాంతమునే గ్రహించి దానిని శ్రవ్యకావ్యమునఁ బ్రతిష్ఠించెను దాని నున్న దున్నట్లుగాఁ బ్రతిష్ఠింపక యిందలి దోషములను బరిహరించి సముచిత విధమున బ్రతిష్ఠించెను కావున ధ్వనిసంప్రదాయము రససంప్రదాయము యొక్క పెంపుదలయే (Extention) అనఁగా రసముతోపాటు వస్త్వలంకారములకుఁ గూడఁ బ్రాధాన్యమిచ్చుచున్నది కాన దాని పెంపుమాత్రమేయగును

ఆనందవర్ధనుఁడు గుణరీతివాదులగు దండి వామనులఁ గూర్చి వారికిఁ గావ్యతత్త్వ మస్ఫుటస్ఫురితమై లేక స్ఫురితప్రసుప్తకల్పమై యున్నదనియు దానిని వ్యాఖ్యానించి నిర్వచింపఁజాలక రీతిని బ్రవర్తిల్లఁజేసి రనియుఁ జెప్పెను

'అస్ఫుటస్ఫురితం కావ్యతత్త్వ మేతద్యథోదితం
అశక్నువద్భిర్వ్యాకర్తుం రీతయ స్సంప్రవర్తితాః.'

అనఁగాఁ గావ్యతత్త్వము భామహునికి బొత్తుగాఁ దెలియనేలేదు దండి వామనులకు నస్ఫుటముగా స్ఫురించినది (Vague) అనఁగా గొంతతెలిసియుఁ గొంత తెలియకయు నున్నదని యభిప్రాయము

ఆనందవర్ధనుఁడు ధ్వని ప్రాధాన్యవాది. లోకమున శరీరమునకు జీవిత మున్నయెడలనే యలంకారాదులు సౌందర్య హేతువులగును. కాన నలంకారాదులకన్న జీవితము ప్రధానము అట్లే కావ్యశరీరమునకుఁ ద్రివిధమగు ధ్వనియు జీవితము. అనగా నాత్మ అదియే ప్రధానమని యితని మతము. పూర్వాలంకారికులు కావ్యసౌందర్యహేతువులను మాత్రమే నిరూపించిరి. ఇతఁడు మఱికొంత లోఁతునకుఁ బోయి కావ్యజీవితమును నిరూపించెను. ఈ భేదమును గమనింపవలెను

ఆనందవర్ధనుని మతమునఁ గావ్యశరీరమేమి ? అను ప్రశ్న గలదు. ధ్వన్యాలోకమునఁ గావ్యశరీరమును గూర్చి యెచ్చటను దెలుపఁబడలేదు. వామన కావ్యాలంకార సంగ్రహ వ్యాఖ్యాత యగు గోపేంద్రతిప్పభూపాలుఁడు తన కామధేనువ్యాఖ్యలో "రీతిధ్వనివాదయోస్తు ఇయాన్ భేదః తత్ర ప్రథమే రీతి రాత్మా కావ్యస్య తద్వ్యవహారప్రయోజకా గుణాః చరమేతు ధ్వనిరాత్మా స ఏవ తద్వ్యవహారప్రయోజక ఇత్యుభయత్రాప్యాత్మనిష్ఠా ఏవ గుణాః

శబ్దార్థయుగళం శరీరం తన్నిష్ఠా అలంకారా ఇతిచ సర్వమవిశిష్టం " అని వాసిన వ్రాఁతనుబట్టి భామహవామనులవలెనే యీతఁడును శబ్దార్థోభయమే కావ్యశరీర మని గ్రహించినట్లు మన మూహింపఁగలము

కొందఱు ధ్వన్యాలోకకర్త కావ్యలక్షణమును నన్వయముఖమునఁ (సూటిగా) దెల్పలేదనియు వ్యతిరేకముఖమునఁ దెలిపె ననియు నీ క్రింది పంక్తులను జూపుదురు

ఎట్లన 'తత్ర హి చారుత్వాతిశయవిశిష్టార్థప్రకాశనలక్షణే ప్రయోజనే కర్తవ్యే యదిశబ్దస్య అముఖ్యతా తదా తస్యప్రయోగే దుష్టతైవస్యాత్; నచైవం '

దీనినిఁ బట్టి యానందవర్ధనుని మతమున శబ్దార్థోభయము కావ్యశరీరము గాక చారుత్వాతిశయవిశిష్టార్థప్రకాశక మగు శబ్దవిశేషమే కావ్యమనియు దీని యభిప్రాయమునే జగన్నాథుఁడు 'రమణీయార్థ ప్రతిపాదకశబ్దః కావ్యం" అని తేల్చి ప్రతిపాదించెననియుఁ జెప్పుదురు అట్లేని నానందవర్ధన జగన్నాథులిరువురును దండిమతమునే పునః ప్రతిష్ఠఁ జేసిరని యూహింప వచ్చును ప్రాచీనాలంకారికులలో దండ్యానందవర్ధనజగన్నాథులు శబ్దవిశేషమే కావ్యశరీర మని నిర్ణయించిరి. మిగిలిన యెల్లరును శబ్దార్థయుగళము కావ్యశరీర మని నిర్ణయించిరి.

ఆనందవర్ధనుని ధ్వనిసిద్ధాంతమునే తరువాతివారెల్లరును శిరసావహించి స్వీకరించిరి భరతుని రససిద్ధాంతమును రూపకమునకు మాత్రమే సమన్వయించి శ్రవ్యకావ్యమునకు దానినిఁ బూర్వాలంకారికులు వెలివెట్టిరి ఆనందవర్ధనుఁడా రససిద్ధాంతమును దృశ్యశ్రవ్యోభయసాధారణ మని నిర్వచించి రూపకమునకు వలెనే శ్రవ్యకావ్యమునకును రసమే ప్రధాన మని యుద్ఘోషించెను. మఱియు నా భరతుని రససిద్ధాంతమును గొంతఁదిగా నీ క్రిందివిధమున సవరించెను. "రసము వాచ్యరూపముగాఁగాక వ్యంగ్యరూపముగా నుండవలయును. మఱియు రసభంజకము లయిన దోషములను విడనాడవలయును (రసదోషములు ముందుఁ దెలియును). రసవ్యంగ్యమువలెనే వస్త్వలంకారవ్యంగ్యములు గూడ గ్రాహ్యములే పూర్వాలంకారికులుదాహరించినట్లు రసమలంకారములోఁ (రసవదలంకారము) జేరదు. రసము కావ్యజీవితము. ఆత్మగా నుండఁదగినదాని నలంకారముగాఁ బరిగణించుట యనుచితము "

ఆనందవర్ధనునికిఁ బ్రాచీనులగు నాలంకారికులెవ్వరును నింత లెస్సగా విచారింపలేరి ఇన్నాళ్ళకు మఱల భరతుని రససిద్ధాంతము నిర్దుష్టముగా సహేతుకముగా నానందవర్ధనునిచేఁ బునరుద్ధరింపఁబడెను. ఈ సిద్ధాంతమునే అభినవగుప్త, మమ్మట జగన్నాథాదులగు సర్వాలంకారికులును గ్రహించిరి.

అభినవగుప్తమతము

ఆనందవర్ధనుని పిమ్మట నభినవగుప్తుఁడను నొక యాలంకారికుఁడు సాహిత్యరంగమునకు వచ్చెను. ఆయన యానందుని ధ్వనిసిద్ధాంతమునంగీకరించి, యాతని ధ్వన్యాలోకమునకు 'లోచనము' అను వ్యాఖ్యానమును వ్రాసెను ఎల్లవిషయముల యందును నభినవగుప్తుఁడానందవర్ధనుని సిద్ధాంతమును సమ్మతించెను కాని యొక విశేషముగలదు ఆనందవర్ధనుఁడు వస్త్వలంకారరస ధ్వనులు మూఁటిని సమానముగానే పరిగణించెను కొన్నియెడల రసధ్వనిపై నాతఁడును నూఁతము సూపెను చూపినను వస్త్వలంకార ధ్వనులకుఁగూడఁ బత్యేకత్వమునంగీకరించెను అభినవగుప్తు డట్లుగాక వస్త్వలంకారధ్వనుల మీఁదకన్న రసధ్వనిమీఁదనే యధికాభిమానమును ప్రకటించెను అతని వాక్యములివి

"రసేనైవ సర్వం జీవతి కావ్యం నహి రసశూన్యం కావ్యం కించిదస్తి రసఏవ వస్తుతః ఆత్మా వస్త్వలంకారధ్వనీ తు సర్వధా రసం ప్రతి పర్యవస్యేతే (రసముచేతనే కావ్యము జీవించును రసశూన్యమగు కావ్యముండదు ఉండరాదు) ముచ్విధము లగు ధ్వనులలో రసధ్వనియే కావ్యాత్మ వస్త్వలంకారధ్వనులు గూడ రసపర్యవసాయులు గావలయును"

ఈ సిద్ధాంతమే విశ్వనాథునిచే వాక్యం రసాత్మకం కావ్యం అను కావ్యలక్షణమును లేవదీయించినది విశ్వనాథుని మతము ముందు విపరింపఁబడును అభినవగుప్తునివలెనే యాతఁడును రసస్పర్శలేని వస్త్వలంకార ధ్వనులు లేవనియే యభిప్రాయపడెను. ఇతని మతమునఁ గావ్యశరీరము ధ్వనికారగృహీతమగు శబ్దమే.

మహిమభట్టమతము

అభినవగుప్తుని పిమ్మట నీ ధ్వనిసిద్ధాంతమును మహిమభట్టను పండితుఁడు ఖండించెను. అతఁడు ధ్వన్యాలోకమునకు ఖండనముగా వ్యక్తివివేకమను గ్రంథమును విరచించెను అతఁడు తన ప్రతిజ్ఞ నిట్లు మొదటనే చెప్పికొనెను.

శ్లో. అనుమానేఽన్తర్భావం సర్వస్యాఽపి ధ్వనేః ప్రకాశయితుం
వ్యక్తివివేకం కురుతే ప్రణమ్య మహిమా పరాం వాచం

తా ఎల్లవిధము లగు ధ్వనులను ననుమానప్రమాణము నందే యంతర్భవింపఁజేయుటకై మహిమభట్టు వాగ్దేవికి నమస్కరించి, వ్యక్తివివేకగ్రంథమును రచించుచున్నాఁడు

మహిమభట్టు తన గ్రంథమున నానందవర్ధనుని 'వ్యంజనావృత్తి' యక్కఱ లేదనియు నాతని ధ్వను లన్నియు ననుమానములోనే యంతర్భ

వించు ననియు సిద్ధాంత మొనర్చెను అభిధా, లక్షణావృత్తులే తక్క వ్యంజనావృత్తి యక్కఱలేదనియుఁ దత్కల్పనమనవసర మనియు నాతని వాదము లక్షణావృత్తి నీతఁ డనుమానములోనే గణించెను కావున నానందవర్ధనుఁడిచ్చిన ధ్వన్యుదాహరణముల నన్నింటిని ననుమానములోనే యంతర్భవింపఁజేసెను ఈ యనుమానము ధూమాగ్న్యనుమానమువంటిది గాదనియు, నిది విలక్షణమనియు *దీనిని గావ్యానుమితి యందురనియు నిర్వచించెను కాని యీతఁడు కావ్యమున రసప్రాధాన్యమునంగీకరించెను 'కావ్యస్యాత్మని సంజ్ఞిని రసాదిరూపే న కస్యచిద్విమతిః" (కావ్యమున కాత్మ రసాదిరూపము అనుటలో విప్రతిపత్తి లేదు) అని వచించెను కేవలము వ్యంజనావృత్తికల్పన మనవసర మని యీతని వాదము ఈతని మతమునఁ గావ్యశరీరము శబ్దార్థోభయమే

---

*ధ్వన్యాలోకకర్త—

'అర్థస్సహృదయశ్లాఘ్యః కావ్యాత్మా యో వ్యవస్థితః
వాచ్యప్రతీయమానాఖ్యౌ తస్య భేదావుభౌ స్మృతౌ"

అని యర్థము - వాచ్యము వ్యంగ్యము నని చెప్పఁగా మహిమభట్టు—

అర్థోఽపి ద్వివిధో వాచ్యోనుమేయశ్చ తత శబ్దవ్యాపారవిషయో వాచ్యః సఏవ ముఖ్య ఉచ్యతే తత ఏవ తదనుమితాద్వా లింగభూతా ద్యదర్థాంతర మనుమీయతే సోఽనుమేయః స చ త్రివిధః వస్తుమాత్ర మలంకారా రసాద యశ్చేతి తత్ర ఆద్యౌ వాచ్యావపిసంభవతః అన్యస్త్వనుమేయ ఏవేతివక్ష్యతే

(అర్థము - వాచ్యము, అనుమేయము నని ద్వివిధము శబ్దవ్యాపార విషయము వాచ్యము అదియే ముఖ్యార్థము దాని నుండియే లేక లింగభూత మగు దాని యనుమానమునుండి యేయర్థాంతరమనుమానింపఁబడునో యది యనుమేయము. ఆ యనుమేయము వస్త్వలంకారరసములు లని మూఁడు విధములు అందు వస్త్వలంకారములు వాచ్యములు గూడ నగును రసాదులుమాత్ర మనుమేయమే) అని తెలిపెను

ఈ మతము క్రొత్తదికాదు ధ్వన్యాలోకకర్త "అస్త్యభిసంధానావసరే వ్యంజకత్వం శబ్దానాం గమకత్వం తచ్చలింగత్వం అతశ్చ వ్యంగ్య ప్రతీతిర్లింగిప్రతీతిరేవేతి లింగలింగి భావ ఏవ తేషాం వ్యంగ్యవ్యంజకభావో నాపరఃకశ్చిత్" అని యుద్ఘాటించి దానికి 'న పునరయం పరమార్థః యత్ వ్యంజకత్వం లింగత్వమేవ సర్వత్ర వ్యంగ్యప్రతీతిశ్చ లింగి ప్రతీతిరేవేతి...తస్మాత్ లింగిప్రతీతిరేవ సర్వత్ర వ్యంగ్యప్రతీతిరితినశక్యతే వక్తుం" అని సమాధానము చెప్పియే యున్నాఁడు మహిమభట్టువాదమునే మిక్కిలియుఁ బెంచి వ్యంజనావృత్తి ననుమానములోనే యంతర్భవింపఁజేసెను.

కానీ యీతనివాదమునిలువలేదు. మమ్మట, విశ్వనాథ జగన్నాథాదులగు మహాపండితు లెల్లరును నీ వాదమును దుత్తునియలుగా ఖండించి యానంద వర్ధనుని సిద్ధాంతమునే యనఁగాఁ బత్యేకముగా వ్యంజనావృత్తి నంగీకరింపవలసియే యున్నదని నిర్ణయించిరి జగన్నాథుని రసగంగాధరము సూక్ష్మముగా విచారింప ధ్వన్యాలోకమునకు వ్యాఖ్యారూప మగు గ్రంథమే యనవచ్చును.

కుంతకమతము

అభినవగుప్తుని కాలమందే కుంతకుఁడను నొక యలంకారికుఁ డుండెను అతఁడు ధ్వనిమతమునకుఁ బ్రతికూలముగా నొక క్రొత్త సిద్ధాంతమును బ్రతిష్ఠించెను అతని సిద్ధాంతములివ్వి - 'వక్రోక్తిః కావ్యజీవితం (వక్రోక్తియే కావ్యమునకు జీవితము) ఆనందవర్ధనుఁడు ధ్వని కావ్యాత్మ యనెను ఇతఁడు వక్రోక్తియే కావ్యజీవితమనెను భామహుని వక్రోక్తినే యీతఁడు విశేషముగాఁ బెంచెను. భామహుఁడు స్వభావోక్తికిఁ బ్రతిద్వంద్విగా వక్రోక్తియను నలంకారమును గ్రహించెను వక్రోక్తి యనఁగా స్వభావవిరుద్ధమగు లోకోత్తర వైచిత్ర్యముగల యలంకారము. కుంతకుఁ డీ భామహుని వక్రోక్తినే మతికొంత సాఁగించి "కవివ్యాపారవక్రత"యే వక్రోక్తి యనెను ఈ కవి వ్యాపారవక్రత నాతఁడారువిధములుగా విభాగించెను ఆ ప్రకారములివి -

శ్లో॥ కవివ్యాపారవక్రత్వ ప్రకారా స్సంభవంతి షట్
ప్రత్యేకం బహవో భేదాస్తేషాం విచ్ఛిత్తిశోభినః
వర్ణవిన్యాసవక్రత్వం పదపూర్వార్ధవక్రతా
వక్రతాయాః పరోఽప్యస్తి ప్రకారః ప్రత్యయాశ్రయః,
వాక్యస్య వక్రభావోఽన్యో భిద్యతే యస్సహస్రధా
యత్రాలంకార వర్గోఽసౌ సర్వోఽప్యంతర్భవిష్యతి
వక్రభావః ప్రకరణే ప్రబంధేఽప్యస్తి యాదృశః
ఉచ్యతే సహజాహార్య సౌకుమార్య మనోహరః "

౧ వర్ణవిన్యాసవక్రతా (శబ్దాలంకార విచారము)

౨ పదపూర్వార్ధ వక్రతా (పదపూర్వార్ధ మన సుబంతతిఙంతరూపక మగు పదముయొక్క పూర్వభాగము. అదియే ప్రాతిపదికగాని ధాతువుకాని యగును. ఇది బహు భేదములు గలిగియున్నది. రూఢివైచిత్ర్యవక్రతా పర్యాయవక్రతా, ఉపచారవక్రతా, విశేషణవక్రతా, సంవృతివక్రతా వృత్తివైచిత్ర్యవక్రతా, (కృత్తద్ధిత సమాసైకశేష ... స్సన్నంతవృత్తులు) ...భావవైచిత్ర్య వక్రతా, లింగవైచిత్ర్య వక్రతా, ... ప్రత్యయాంతరవైచిత్ర్యవక్రతా, క్రియావైచిత్ర్యవక్రతా.

AC No. 37467

కాలవైచిత్ర్యవక్రతా కారకవైచిత్ర్యవక్రతా సంఖ్యావైచిత్ర్యవక్రతా పురుష వైచిత్ర్యవక్రతా ఉపగ్రహవైచిత్ర్యవక్రతా అనునవి దీని భేదములు వీని వివరణమును వక్రోక్తిజీవితమునందే చూడవలెను ఇందుపచార వక్రతలో సమస్తధ్వనిభేదములును గ్రహింపబడినవి (ఉపచారవక్రతాదిభిస్సమస్తోధ్వని ప్రపంచః స్వీకృతః

౩ ప్రత్యయవక్రతా (కృత్తద్ధితప్రత్యయ సంయోగముచేఁ గలిగిన చారుత్వము).

౪ వాక్యవక్రతా (అర్థాలంకార విచారము)

౫ ప్రకరణవక్రతా (రసాననుకూలముగానున్న కథావస్తువును రసో చితముగా మార్చుట, శాకుంతలమున దుర్వాసుని ప్రవేశాదులు)

౬ ప్రబంధవక్రతా (ఒక రసములో నున్న కథాభాగమును మఱొకరస ప్రధానముగా మార్చుట (శాంతరసప్రధానమగు భారతకథను వీరరస ప్రధానముగు నాటకముగా మార్పఁబడినది.- వేణీసంహారము)

కానీ యీ మతము గూడా నిలువలేదు ఈ మతముగూడ నలంకార శాఖయే. మహిమభట్టు కావ్యానుమితి సిద్ధాంతమును గుంతకుని వక్రోక్తిసిద్ధాంతమును వారి తరువాత నాసిద్ధాంతములను బోషించువారు లేమి నశించి నామ మాత్రముగా నిలిచిపోయినవి. కుంతకుని మతమున శబ్దార్థోభయయే కావ్యశరీరము,

క్షేమేంద్ర మతము

కుంతకుని యనంతరమున క్షేమేంద్రుఁడను నొక పండితుఁ డొక నూతన సిద్ధాంతమును లేవఁదీసెను 'ఔచిత్యవిచారచర్చ' దీనిని విఖ్యాత పండితులు శ్రీ జమ్మలమడక మాధవరామశర్మగారు రాంధ్రీకరించిరి

> ఔచిత్యస్య చమత్కారకారిణశ్చారుచర్వణే
> రసజీవితభూతస్య విచారం కురుతేఽధునా
> కావ్యస్యాఽలమలంకారైః కిం మిథ్యాగుణితైర్గుణైః
> యస్య జీవితమౌచిత్యం విచింత్యాఽపి న దృశ్యతే
> అలంకారాస్త్వలంకారా గుణా ఏవ గుణాస్సదా
> ఔచిత్యం రససిద్ధస్య స్థిరం కావ్యస్య జీవితం

రసమునకు జీవితభూతమును జమత్కారకారియు నగు నౌచిత్యమును గూర్చి విచారణ సేయుదుము కావ్యమునకు జీవితభూతమైన యౌచిత్యము లేకున్నచో నలంకారములేల? గుణములేల? అలంకారములు లలంకారములే.

అనఁగా బాహ్యశోభాహేతువులు కాని జీవితముగాదు. అట్లే గుణములను శ్రుత తపస్సత్యశీలాదులవలెనే గుణములే అనఁగా నవియు జీవితముగావు కాన రసమంత మగు కావ్యమునకు జీవితభూత మౌచిత్యమే.)

మరియు నుచితస్థానమున నుంచినపుడే యలంకారము లలంకారము లగును. ఔచిత్యము వీడనపుడే గుణములు గుణములగును. దేని కేది తగునో యది యుచితము ఉచితముయొక్క భావమే యౌచిత్యము. ఈ యౌచిత్యము పదమున, వాక్యమునఁ బ్రబంధమున గుణమున, అలంకారమున, రసమునఁ, క్రియయందుఁ గారకమున లింగమున వచనమున విశేషణమున ఉపసర్గమునఁ, నిపాతమునఁ గాలమున దేశమునఁ గులమున వ్రతమునఁ దత్త్వమున సత్త్వమున, అభిప్రాయమున స్వభావమున, సారసంగ్రహమునఁ, బ్రతిభయందు, అవస్థయందు, విచారమున నామమున ఆశీస్సున నుండునని సిద్ధాంతించెను. అతఁడు వీటికన్నింటికి ఉదాహరణములను గూడఁ జూపెను

ఆంగ్లసాహిత్యమునఁ గూడ నీ యౌచిత్యచర్చ గలదు ఔచిత్యమున కాంగ్లమున Decorum అందురు అది పదములు వృత్తములు మొదలగు వానిలో నుండునని క్షేమేంద్రునివలెనే తదలంకారికులును వచించిరి.

ఈతఁడు ధ్వనికారుని

> అనౌచిత్యాదృతేనాన్యద్రసభంగస్య కారణం
> ప్రసిద్ధౌచిత్యబంధస్తు రసస్యోపనిషత్పరా ।

అనౌచిత్యముకన్న రసభంగమునకన్యకారణము లేదు. చక్కని యౌచిత్యముగల కావ్యము రసోపనిషత్తే అను కారికార్థమును గ్రహించి దానినిఁ బెంచి యీ సిద్ధాంతమును బ్రతిష్ఠించెను.

ధ్వనికారుఁడు గూడ నీ "అనౌచిత్యాదృతే" అను నభిప్రాయమును దండియొద్దనుండి గ్రహించినట్లున్నది దండి—

> 'కామం సర్వోఽప్యలంకారో రసమర్థే నిషంచతి
> తథాప్యగ్రామ్యతైవైనం భారం వహతి భూయసా

సర్వవిధము లగు ననఁగా శబ్దగత అర్థగత ఉభయగత అలంకారము లును రసస్ఫోరకము లగును అందు సందేహము లేదు అయినను నగ్రామ్యత్వమే యనఁగా ననౌచిత్యరాహిత్యమే (ఔచిత్యవత్త్వము) యీ భారము నంతను వహించుచున్నది, అని నుడివెను అనౌచిత్యరాహిత్యమే రసస్ఫోరక మనుటచే ననౌచిత్యవత్త్వము రసభంజక మని తెలుచున్నది

ధ్వనికారుఁడు కావ్యాత్మ ధ్వని యనఁగా నీతఁడౌచిత్య మని నిర్వ చించెను. ఈతఁడు ధ్వనిమతమును ఖండింపనులేదు, పోషింపను లేదు. కాని, ధ్వనిమతమున కిది విరుద్ధము మాత్రము కాదు

భరత భామహ దండి వామన ఆనందవర్ధన అభినవగుప్త మహిమ భట్ట కుంతక క్షేమేంద్రు లలంకారశాస్త్రమున స్వతంత్రసిద్ధాంతములను స్థాపించిరి ఆనందవర్ధనునితోడనే కావ్యమార్గము నిర్ణీతమైనది దీనినే యీష ద్భేదముతో నభినవగుప్తుఁడంగీకరించెను. మహిమభట్టాదుల సిద్ధాంతము లెవ్వియును నిలువలేదు మమ్మట, విశ్వనాథ జగన్నాథ విద్యాధర, విద్యా నాథాదు లీ యానందవర్ధనుని సిద్ధాంతమునే పోషించిరి కాని రుద్రటాదులగు కొందఱలంకారమార్గమునే పట్టుకొని వ్రేలాడుచు గ్రంథములను వ్రాయుచు వచ్చిరి కాని వీనికి మమ్మట విశ్వనాథ జగన్నాథాదుల గ్రంథములకుఁగల ప్రశస్తి లేదు. కావున నానందవర్ధనుని ధ్వని సిద్ధాంతమే సర్వశ్రేష్ఠమగు సిద్ధాంతము.

ఇన్ని విధములగు సిద్ధాంతము లేల బయలుదేరిన వని ప్రశ్న వచ్చుచున్నది వీరి కందఱకును గావ్యమునాస్వాదించునపుడు రుచిభేదముగోచరించినదా? అన్నచోఁ గాదు కావ్యాస్వాదనమున భేదము లేదు ఎల్లరకును జక్కెర మధురముగా నుండునట్లెల్లరకును గావ్యాస్వాదమున మతభేదము లేదు. కానిఁ దామనుభవించిన యాస్వాదమును వాక్కులతోఁ బ్రకటింపవలసినపుడు మతభేద ములు బయలుదేరినవి. ఒకరు తమకుఁ గలిగిన కావ్యరుచి యలంకారములవలన ననిరి మఱొకరు గుణములవలన ననిరి. వేఱొకరు రీతివలన ననిరి ఇంకొకరు ధ్వనివలన ననిరి ఇట్లే యంతకారణములను వచించిరి ఈ కారణమువలననే మతభేదములు వెలువడినవి.

ఈ క్రింది కావ్యలక్షణములను దెలిసికొనుటకు ముందీతెలిపిన విషయ మును లెస్సగాఁ దెలిసికొనవలసియున్నది. ఇటఁ గావ్యలక్షణ మనఁ గావ్యశరీర లక్షణమనియుఁ గావ్యాత్మను గురించిన విచారముగాదనియు గ్రహింప వలెను కావ్యాత్మను గురించిన విచారము ముందుగఁ జేయఁబడియున్నది.

౧. ఇష్టార్థవ్యవచ్ఛిన్నా పదావళీ కావ్యం (దండి)

౨. తదదోషౌ శబ్దార్థౌ సగుణావనలంకృతీ పునః క్వాఽపి (మమ్మటుఁడు).

౩ వాక్యం రసాత్మకం కావ్యం (విశ్వనాథుఁడు).

౪ రమణీయార్థ ప్రతిపాదకశబ్దః కావ్యం (జగన్నాథుఁడు.)

కావ్యలక్షణములు *పెక్కులు గలవు అందు సుప్రసిద్ధము లయిన నాలుగు లక్షణములమాత్ర మిచ్చుటఁ జూపుచున్నాను ఇందు మొదటి లక్షణమున కర్థ మిది

౧ 'ఇష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావళీ కావ్యం" అనఁగా మనోహర మగు నర్థముతో నలంకృతమైన పదసముదాయము కావ్యము అని యర్థము. ఈ కావ్యశరీరమునకు శోభాహేతువులు గుణము లనియు,

తదల్పమపి నోపేక్ష్యం కావ్యే దుష్టం కథంచన
స్యాద్వపుస్సుందరమపి శ్విత్రేణైకేన దుర్భగం "

(కావ్యమున నల్పమగు దోషమునఁగూడ నుపేక్షింపరాదు శరీరమెంత యందముగా నున్నను నొక్కచో బొల్లి (శ్వేతకుష్ఠము) యున్నచో నెంతో యసహ్యముగాఁ గనబడును) అని యల్పదోషము గూడఁ గావ్యమున నుండ రాదనియు వచించెను విశ్వనాథ జగన్నాథాదులయొక్క లక్షణములను బట్టి రసాపకర్షకములుగాని దోషములు దోషములు గావనియు సర్వథా దోష స్పర్శలేని కావ్య ముండదనియు మనము తెలిసికొనఁగలము కావున దండి కావ్యదోషములఁగూర్చి చేసిన సిద్ధాంతము దారుణమనక తప్పదు

౨ తదదోషౌ శబ్దార్థౌ సగుణావనలంకృతీ పునః క్వాఽపి —దోషరహిత ములును, గుణసహితములను అలంకారయుక్తములు నగు శబ్దార్థయుగళము కావ్యశరీరము '–నలంకృతి పునః క్వాఽపి అనుదానికి వ్యాఖ్యాత 'య త్సర్వత్ర సాలంకారౌ క్వచిత్తు స్ఫుటాలంకారవిరహేఽపి న కావ్యత్వహానిః" (ఎల్లెడలను శబ్దార్థములు సాలంకారములుగానే యుండవలెను. ఒకానొకచో నలంకారములు స్ఫుటముగా లేకున్నను గావ్యము గాకపోదు) అని వ్యాఖ్యా

---

* 'శబ్దార్థౌ సహితౌ కావ్యం" అని భామహుఁడు 'గుణాలంకార యుక్తార్థౌ కావ్య" మని వామన మతము 'అదోషౌ సగుణావనలంకృతీ పునః క్వాఽపి" అని మమ్మట మతము ప్రభాకరమతముగూడ నిదియే. "నిర్దోషం గుణాలంకార రసవత్ వాక్యం కావ్యం" అని భోజమతము "గుణాలంకార రీతి రసోపేతః సాధుశబ్దార్థ సందర్భః కావ్యం" అని వాగ్భటమతము "నిర్దోష గుణాలంకార రీతివృత్తిమత్ వాక్యం కావ్యం" అని పీయూషవర్ష మతము "రసాదిమద్వాక్యం కావ్యం" అని శౌద్ధోదనిమతము. వాక్యం రసాత్మకం కావ్యం" అని విశ్వనాథమతము. "ఇష్టార్థవ్యవచ్ఛిన్నా పదావళీ కావ్యం" అని దండి మతము, 'రమణీయార్థ ప్రతిపాదకశబ్దః కావ్యం" అని జగన్నాథ మతము 'రసాలంకారయుక్తం సుఖవిశేషసాధనం కావ్యం" అని కేశవమిశ్రమతము (వీనిని వామనాచార్య ఝలకీకర్ పండితుఁడు కావ్య ప్రకాశప్రస్తావనలోఁజూపెను)

వించెను ఈ కావ్యశరీరమునకు ధ్వనిలేక వ్యంగ్యమే యాత్మ వ్యంగ్య ప్రాధాన్యము నుబట్టి కావ్యముత్తమ మనియు వ్యంగ్యాప్రాధాన్యమును బట్టి మధ్యమ మనియు, నవ్యంగ్య మగునది యధమ మనియు దెలిపెను ఈతఁ డానందవర్ధనుని ధ్వనిసిద్ధాంతమును బోషించినవాఁడే ఈ కావ్యలక్షణమునే ప్రతాపరుద్రీయకారుఁడును స్వీకరించెను. ప్రతాపరుద్రీయమునకు సర్వథా నకలుగా నున్న నరసభూపాలీయమునందును నీ లక్షణమే స్వీకరింపఁబడినది.

3 వాక్యం రసాత్మకం కావ్యం అనఁగా రసస్వరూపము గల వాక్యము (మహావాక్యము లేక వాక్యసమూహము) కావ్యము అని యర్థము. విశ్వనాథుఁ డీ లక్షణమును వచించి మమ్మటలక్షణము నీ విధముగా విమర్శించెను. "లక్షణవాక్యమున అదోషౌ అని యుండరాదు. ఏలన దోషరహితము లగు శబ్దార్థములు కావ్యమన్నచో లోకములో నే కావ్యముగూడ యత్కించిద్దోష స్పర్శ లేక యుండనే యుండదు చూడుఁడు

శ్లో॥ న్యక్కారో హ్యయ మేవ మే యదరయస్తత్రాప్యసౌ తాపస
సోఽప్యత్రైవ నిహంతి రాక్షసకులం జీవత్యహో రావణః
ధిక్ ధిక్ శక్రజితం ప్రబోధితవతా కిం కుంభకర్ణేన వా
స్వర్గగ్రామటికావిలుంఠన వృథోచ్ఛూనైః కిమేభిర్భుజైః

ఇవి రావణుని పలుకులు — నాకు శత్రువులుగలరని చెప్పుటయే పెద్ద యవమానము అందును నా శత్రువు తాపసుఁడఁట అతఁడును మా రాక్షస కులము నిచ్చటనే యనఁగా నా యెదుటనే తుంచునఁట అక్కటా! రావణుఁ డింకను బ్రతికియే యున్నాఁడు. చావలేదే ఇదియే సంభవించినచో నింద్రజిత్పరాక్రమ మేలఁ నిద్ర మేల్కొన్న కుంభకర్ణుని పతాపము కాల్పనే? స్వర్గమను పల్లెను గొల్లఁబెట్టి వృథగా బలిసిన నా బాహువు లేల?

ఈ శ్లోకమున అవిమృష్ట విధేయాంశ మను దోషము రెండుతావులందుఁ గలదు అవిమృష్టవిధేయాంశమన న్యాయముగా ననువాద్యాంశము (కర్తృ భూతము ముందు జెప్పి విధేయాంశమును (క్రియాభూతము-విధేయ విశేషణము) పిమ్మటఁ జెప్పవలసి యుండఁగా నట్లు చెప్పక విధేయాంశమును ముందుఁ జెప్పి యనువాద్యాంశమును పిమ్మటఁజెప్పుట అనువాద్యమనుక్త్వైవ నవిధేయ ముదీరయేత్" (అనువాదమును జెప్పక విధేయమును జెప్పరాదు) అని న్యాయము అవిమృష్టః ప్రాధాన్యేన అనిర్దిష్టః విధేయాంశః" అనఁగా విధేయవిశేషణము వాక్యమునఁ బ్రాధాన్యమున వహింపవలసి యుండఁగా దాని నట్లు వ్యవహరింపకుండుట పట్లన వాఁడు పండితుఁడు అను వాక్యములో "పండితుఁడు" అను పదము విధేయవిశేషణము. వాక్యమున దానికిఁ బ్రాధాన్యముండును 'పండితుఁడు వాఁడు' అన్నచో నవిమృష్ట

విధేయాంశదోష మగును. అట్లే 'న్యక్కారోహ్యయమేవ' అనుచోట నీ దోషము గలదు "అయమేవ న్యక్కారః" (ఇదియే యవమానము) అనుచోట 'అయమేవ' అనునది యనువాద్యాంశము 'న్యక్కారః' అనునది విధేయాంశము, శ్లోకమున న్యక్కార పదము మొదటఁ బ్రయోగింపఁబడినది కాన నవిమృష్ట విధేయాంశదోషదూషితమైన దీ శ్లోకము మఱియు "వృథోచ్ఛూనైః" అను చోటఁ గూడ నీ దోషమే కలదు 'ఉచ్ఛూనత వ్యర్థమని యర్థము ఇటఁ ననువాద్యాంశమైన యుచ్ఛూనతయు విధేయాంశమైన వైయర్థ్యము శ్లోకమున మొదటి పాదమునందు వలెనే వెనుక ముందులఁ బడినవి మొదటిది వాక్య దోషము రెండవది పదదోషము. "వృథాన్యార్థభంగముఁ గావించెదు వార లెవ్వరో యెఱుంగన్ శక్యమే యేరికిన్" అనుచోఁ గూడ నీ దోషమే కలదు. ఈ శ్లోకము దోషదూషితమైనది. కావునఁ గావ్యము కాకపోవలసి వచ్చును ఈ శ్లోకము ధ్వని ప్రాధాన్యమునుబట్టి యుత్తమకావ్యముగా ధ్వనికారుఁ డంగీకరించెను ఇందలి ధ్వని యిది :— 'మే యదరయః" అనునెడ "అరయః" అను బహువచనము వలన "నాకు నొక శత్రువున్నాఁడనుటయే యవమానము పెక్కండ్రు గూడ నున్నారన్నచో నా యవమానమునకు మేర యుండునా ?" అను నర్థము వ్యజ్యమాన మగుచున్నది 'తాపస' పదము వలన "ఆ శత్రువు పౌరుషకథాహీనుఁడైన తపస్వి" యన్నచో "నా యవమాన మింతింతని నొడువరాదు' అను నర్థము వ్యక్తమగును 'తత్రాఽపి' యందలి 'అపి' శబ్దముచే మిక్కిలి యసంభవ మను నర్థము వ్యక్తమగును 'అత్రైవ' అనుచో 'ఏవ' శబ్దమువలన "ఇచ్చటనే నా కన్నుల యెదుటనే" అను నర్థము వ్యక్తమగును రాక్షసకులం అను పదమువలన ఒక్క రాక్షసునిఁ గాదు సర్వకులమును నిర్మూలించును అను నర్థము వ్యక్తమగును నిహన్తి పదము వలన "వధియించుటగాదు నిశ్శేషముగా వధించును" అను నర్థము వ్యక్తమగును "జీవత్యహో రావణః" అనుచో 'రావణ' పదమువలన "విశ్వవిజయము సేసిన వాఁ డను నర్థాంతర సంక్రమిత వాచ్య ధ్వని వ్యక్తమగును 'ధిక్ ధిక్' అను నిపాతనము లింద్రుని జయించిన యింద్రజిత్తుయొక్క పరాక్రమును గూర్చి నిందనువ్యక్తముసేయును "స్వర్గగ్రామటికా' పదమునందలి 'క' వర్ణముచే స్వర్గమునందలి నిర్లక్ష్యభావము వ్యక్తమగును 'భుజైః' అను బహువచనముచే నిరువది చేతులును భారమాత్రమే' అని వ్యక్తమగును ఈ విధముగా సాధారణముగా నిందలి పదములన్నియు రావణుని యవమానమును వ్యక్తీకరించుచున్నవి అనఁగా వాచ్యముగాఁగాక వ్యంగ్యముగాఁ దోఁపఁజేయుచున్నవి కాన నీ శ్లోకము ముత్తమకావ్యము కావున 'అదోషౌ' పదమువలనఁ గావ్యలక్షణ మవ్యాప్తిదోషదుష్టమైనది.

(అవ్యాప్తియనఁగా లక్షణము గొన్నిచోట్లఁ బట్టకుండుట ;. అతివ్యాప్తి యనఁగా బట్టరానిచోట్ల లక్షణము పట్టుట అసంభవ మనఁగా బొత్తుగా నా లక్షణము దేనియందును బట్టకుండుట. (లక్షణమవ్యాప్త్యతివ్యాప్త్యసంభవాది దోషవర్జితమై యుండవలయును) మఱియు రసాపకర్షకా దోషాః (రసమును దగ్గించునవి దోషములు) అనుటచే రసమును దగ్గింపకున్నచో దోషములు కాఁజాలవు 'న్యక్కారో౽హ్యయ మేవ' అను శ్లోకమందలి యవిమృష్టవిధేయాంశదోషము లందలి రసమును దగ్గించుటలేదు. కావున నీ దోషము దోషమే గాదు దోషరహితములగు శబ్దార్థములే కావ్యమని చెప్పినచో ధ్వనిప్రాధాన్యమునుబట్టి యుత్తమకావ్యము కాఁదగిన కావ్యము కావ్యమే కాకపోవును కావున "అదోషౌ" పదము కావ్యలక్షణమున నుండరాదు మఱియు సగుణౌ' అను పదము గూడా వ్యర్థమే ఏలనఁ గావ్యమునకు రసమాత్మభూతమని చెప్పఁబడియున్నది గుణములు లేకున్న రసముండదు రసమున్నచో గుణము లుండును గుణములు రసధర్మములు అట్టిచో గుణములకును రసమునకును నవినాభావసంబంధము గలదు కావున సగుణౌ పదము కావ్యలక్షణమున ననవశ్యము మఱియు సాలంకారౌ' పదమును వ్యర్థమే. అలంకారములు లేకున్నను గావ్యము రసవంతముగా నుండవచ్చును గుణములు రసధర్మము లయిన ట్లలంకారములు రసధర్మములు గావు కావున నలంకారములు గావ్యమునకు ముఖ్యాంగములు గావు అద్దాన సాలంకారౌ పదము గూడ వ్యర్థమే.

ఇట్లు మమ్మటుని కావ్యలక్షణమును ఖండించి విశ్వనాథుడు "వాక్యం రసాత్మకం కావ్యం" అను లక్షణమును వచించెను రసస్వరూపము గల వాక్యము (మహావాక్యము) కావ్యమని దీని యర్థము అభినవ గుప్తుని సిద్ధాంతమే విశ్వనాథునిఁ బ్రేరేపించి యీ లక్షణమును జెప్పించినది. అభినవగుప్తుడు దన లోచనమున "రసేనైవ సర్వం జీవతి కావ్యం నహి రసశూన్యం కావ్యం కించిదస్తి రసఏవ వస్తుతః ఆత్మా వస్త్వలంకారధ్వనీతు సర్వథా రసం ప్రతి పర్యవస్యేతే" (రసముచేతనే కావ్యము జీవించును రసశూన్యమగు కావ్యముండదు ముద్విధములగు ధ్వనులలో రసధ్వనియే కావ్యాత్మ వస్త్వలంకారధ్వనులు కూడ రసపర్యవసాయులు గావలయును) అని నిర్వచించెను ఈరసధ్వనియే కావ్యాత్మ యను అభినవగుప్తుల సిద్ధాంతమును సర్వథా విశ్వనాథుని 'వాక్యం రసాత్మకం కావ్యం' అను సిద్ధాంతము పోలియున్నది పోలియుంటయే కాదు. అదియే యిదియని నిరాటంకముగాఁ జెప్పవచ్చును. దీనిని జూడుఁడు

శ్లో॥ శ్వశ్రూరత్ర నిమజ్జతి అత్రా౽హం దివసకం ప్రలోకయ
మాపథిక రాత్ర్యంధ ! శయ్యాయా మావయోర్మాంక్షీః॥

గీ. ఇవట మా యత్తపండు ; నే నిటఁ బరుండుఁ
బగటనే లెస్స కని గుర్తుపట్టుకొనుము ;
ఓ నిశాంధుఁడ పాంథుఁడా యొప్పుదప్పి
పడకుమీ మాదు మంచాలపైని రేయి

ఇట 'మాయత్తప్రక్కలోఁ బడకుము నా ప్రక్కలోఁ బడుము" అను వస్తువ్యంగ్యము గలదు విశ్వనాథుఁడు వస్త్వలంకార ధ్వనులకుఁ బ్రత్యేకత్వము నంగీకరింపనివాఁడగుట నిట్టి వస్తువ్యంగ్యముగల పద్యము లందును రసాభాసాది మూలముననే కావ్యత్వము స్థాపించెను ఉపనాయకరతి రసాభాసమని ముందుఁ దెలియును) అనఁగా నా వాక్యమున వస్తువ్యంగ్యముచేఁ గాక రసాభాసముంటచే నుత్తమకావ్యమైనది" అని సిద్ధాంతించెను కాన నభినవగుప్తుని వలెనే యీతఁడును వస్త్వలంకారధ్వనులను రసపర్యవసాయులుగానే యుండవలె నని విశ్వసించెను రసాభాసము రసమగునా? యని శంకించుకొని "రస్యతే అస్వాద్యతే ఇతి రసః" అను రసశబ్ద వ్యుత్పత్తినిఁబట్టి భావము, భావాభాసము రసము, రసాభాసము మొదలయినవన్నియు రసశబ్దవాచ్యములే యని వచించెను పిమ్మటఁ దన "వాక్యం రసాత్మకం కావ్యం" అను సిద్ధాంతమును సమర్థించుటకై కొన్ని గ్రంథములనుండి కావ్యలక్షణములను జూపెను. అవి యివి —

"వాగ్వైదగ్ధ్యప్రధానేఽపి రస ఏవాత్రజీవితం" (అగ్నిపురాణము)

ఎంత వాక్చమత్కార మున్నను (అలంకారచమత్కారమున్నను) గావ్యమునకు రసమే జీవితము

"కావ్యస్యాత్మని సంజ్ఞిని రసాదిరూపే న కస్యచిద్విమతిః"(మహిమభట్టు)

రసాదులే కావ్యమున కాత్మయనుటలో నెవరికిని భిన్నాభిప్రాయములేదు.

"నహి కవే రితివృత్తమాత్రనిర్వాహేణ ఆత్మపదలాభః ఇతిహాసాదేవ తత్సిద్ధేః" (ధ్వన్యాలోకము)

కేవల మితివృత్తమును నిర్వహించిన మాత్రమునఁ గవి కానేరఁడు. ఆపని నితిహాసాదులే చేయుచున్నవి కావ్యమున రసనిర్వాహముచేతనే కవియగును.

ఇట్లు స్వసిద్ధాంతానుకూలము లయిన యితరవిద్వాంసుల సిద్ధాంతముల నుదాహరించి 'వాక్యం రసాత్మకం కావ్యం' అనుటచేఁ బ్రబంధములోని కొన్ని నీరసపద్యములకుఁ గావ్యత్వము లేకపోవలసివచ్చును అట్టియెడ రసవత్పద్యములను బట్టి కావ్యత్వమును నీరసపద్యములనుబట్టి యకావ్యత్వమును నొక కావ్యమందే సంభవించి యది కావ్యముగాని, యకావ్యముగాని, కాకపోవలసి వచ్చునని యాశంకించుకొని రసవత్పద్యములలో నున్న కొన్ని నీరసపదములకును, బద్యరసముచే రసవత్త్వము గలుగువిధమునఁ బ్రబంధరసముచే నీరస

పద్యములకును రసవత్త్వము కలుగునని సమాధానించెను ఇట్లు విషయ విచారణచేసి 'వాక్యం రసాత్మకం కావ్యం' అను సిద్ధాంతమును ధ్రువపఱచెను

౪ "రమణీయార్థప్రతిపాదకశబ్దః కావ్యం" అనఁగా రమణీయమగు నర్థమును దెలుపు శబ్దము కావ్యము అని యర్థము రమణీయార్థ మనఁగానే యర్థమును విని తిరిగి భావించుటచే లోకోత్తరాహ్లాదము గలుగునో యది రమణీయార్థము. ౫ లోకోత్తరాహ్లాదమునకే చమత్కార మనియు నామాంతరము కావున రమణీయార్థ మనఁగాఁ జమత్కారము గలిగించు నర్థమని సారాంశము "నీకుఁ బుత్త్రుఁ డుదయించినాఁడు" అను వాక్యములోఁ జమత్కారము గానరాదు.

చమత్కారము లేకున్నచో నది కావ్యమే కాఁజాలదు ఎట్లన -

కిం కవేస్తేన కావ్యేన కిం కాండేన ధనుష్మతః
పరస్య హృదయే లగ్నం న ఘూనయతి యచ్ఛిరః

తా పరహృదయమున నెయ్యది లగ్నమై తలను గంపింపఁజేయదో కవియొక్క యా కావ్య మేల ? ఆ ధానుష్కుని బాణ మేల? అన్నారు పెద్దలు కావునఁ గావ్యమునఁ జమత్కార మున్ననే సహృదయుఁడు తల నాడించును

కనుక "చమత్కారవత్త్వం కావ్యత్వాత్" అనఁగాఁ జమత్కారము గలిగియుండుటయే కావ్యమని నిష్కృష్టార్థము ఈ చమత్కార మెట్లు గలుగునన్న వస్త్వలంకారరసాదిధ్వనులవలన నేర్పడు నని యభిప్రాయము.

ఇట్లు తన లక్షణమును నిర్వచించి మమ్మట మమ్మట విశ్వనాథుల లక్షణములను ఖండించెను మమ్మట లక్షణఖండన మిది -

"మమ్మటుఁడు శబ్దార్థములు రెండును గావ్యశరీరమని నిర్వచించెను ఇట్లనరాదు లోకమునఁ గావ్యము పఠింపఁబడినది కావ్యమువలన నర్థము తెలియుచున్నది కావ్యము వింటిమి కాని యర్థము గాలేదు. అని వ్యవహారము గలదు. దీనినిఁబట్టి గావ్యశరీరమనఁగా శబ్దవిశేషమే కాని శబ్దార్థయుగళముగాదు మఱియు శబ్దార్థములు రెండును గలిసి కావ్యశరీర మనుటలో లోకవ్యవహారముగాని, శాస్త్రప్రమాణముగాని లేదు. కావున నీ మతముపాదేయము గాదు. మఱియు "అదోషౌ" అను విశేషణము వ్యర్థమే. లోకములో "నీ కావ్యము దుష్టము" అను వ్యవహారముగలదు దుష్ట మనఁగా దోషయుక్తమని యర్థము ఈ కావ్యము దుష్ట మన దోషసహితమని తెలినది ఈ వ్యవహారమునుబట్టి దోషమున్నను గావ్యత్వమునకు హానిరాదు సర్వథా దోషస్పర్శలేని కావ్యముండదు "సగుణౌ సాలంకారౌ" పదములను

వ్యర్థములే. ఏలన "ఉదితం మండలం విధోః" అను వాక్యము గలదు. ప్రకరణాదివశమున నీ వాక్యమున ననేకవ్యంగ్యార్థములు గోచరించుచున్నవి. ఈ వాక్యమున నెట్టి గుణాలంకారములును లేవుగదా. కావున గుణాలంకారములు లేకున్నను గావ్యత్వమునకు లోపము రాదు. లోకములో శూరతా వీరత్వాదులాత్మధర్మములు కాని శరీర ధర్మములు గావు. అట్లే కావ్యమున గుణములు గూడ గావ్యాత్మయగు రసముయొక్క ధర్మము లగును. ఇఁక హారాద్యలంకారములు శరీరమునలంకరించునట్లుపమాద్యలంకారములు కావ్యశరీరము నలంకరించును. శరీరమన నేమి? అని యడిగినపు డాత్మవిశిష్టము శరీర మని లక్షణమును జెప్పుదురు కాని శూరత్వాదిగుణములకును హారాద్యలంకారములకును లక్షణమునఁ బ్రవేశ ముండదుగదా. అట్లే కావ్యలక్షణమున గుణములకును, నలంకారములకును బ్రవేశముండరాదు. "రమణీయార్థ ప్రతిపాదకశబ్దము కావ్య" మను లక్షణమున శబ్దము కావ్యశరీరము రమణీయార్థము కావ్యాత్మ యగును. ఆత్మ విశిష్ట మగునదియే శరీరమైనట్లు రమణీయార్థవిశిష్టమగు శబ్దమే కావ్యశరీరమని సారాంశము. మఱియు 'రమణీయ' పదముచేతనే నిర్దోషత్వ సగుణత్వ సాలంకారత్వములు గూడ భాసిల్లును. కావున నెల్లవిధముల మమ్మట లక్షణమయుక్తము.

ఇమ్మట విశ్వనాథలక్షణమును నిట్లు ఖండించెను: 'రసాత్మకమైన వాక్యమే కావ్యమన్నచో వస్త్వలంకార వ్యంగ్య ప్రధానములగు కావ్యములకుఁ గావ్యత్వము లేకపోవలసివచ్చును. అట్టివి కావ్యములే కావనుట చెల్లదు. ప్రాచీనులగు మహాకవులు జలపాత వేగ, భ్రమణ కపి బాలాది విలాసములను (రసస్పర్శలేని కేవల వస్త్వలంకారప్రధానములగు కావ్యములను) రచించిరి. వానికిఁ గావ్యత్వమును దొలఁగింపఁగాదు. అట్టి తావులతోఁ గూడ రసస్పర్శ గలదని చెప్పితిమేని "గౌశ్చలతి" గోవు కదలుచున్నది అను వాక్యమునఁ గూడ నేదోవిధముగా రస మున్నదని చెప్పవచ్చును. ఇది యుక్తము గాదు. కావున విశ్వనాథుని లక్షణ మయుక్తము."

మమ్మట, విశ్వనాథ, జగన్నాథులు మువ్వురును ధ్వనిసిద్ధాంతానుకూలవాదులే. మువ్వురును గావ్యాత్మ ధ్వనియే యని చెప్పుదురు. కావ్యశరీరనిర్వచనమున మాత్రమే భేదించిరి.

జగన్నాథలక్షణ మగు 'రమణీయార్థప్రతిపాదకః శబ్దః కావ్యం' అనునది దండిలక్షణ మగు "ఇష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావళీ కావ్యం" అనుదానికి రూపాంతరమే. ఇష్టార్థ మన రమణీయార్థమే. వ్యవచ్ఛిన్న మన భూషిత మని యర్థము. మనోహరార్థముతో భూషిత మైన పదసంఘాతము కావ్యమని దండి

యర్థము రమణీయార్థమును దెలుపు శబ్దము (శబ్దసంఘాతము) కావ్యమని జగన్నాథుని యాశయము కావున నిరువురి లక్షణమును సమానమే.*

ప్రాయికముగాఁ బూర్వాలంకారికు లెల్లరును శబ్దార్థయుగళమే కావ్య శరీరమని సిద్ధాంతించిరి. దండి జగన్నాథులు మాత్రమే శబ్దవిశేషము కావ్య శరీరమని నిర్వచించిరి ఈ మతమే యుత్తమోత్తమ మైనది ఈ లక్షణమే ధ్వన్యాలోక కర్తకును సమ్మతమనియు నాతఁడు సూటిగాఁ గావ్యలక్షణమును జెప్పకున్నను వ్యతిరేకముఖముగఁ జెప్పిన ట్లతని ధ్వన్యాలోక పంక్తిని వెనుకఁ జూపి దానిని జగన్నాథలక్షణమునకును సమన్వయమును గుదిరించి చూపి యుంటిమి మఱలనావిషయమగుట నిటఁ జెప్పుట చర్విత చర్వణ మగును

ఇఁక నిట నాంగ్లకావ్యలక్షణములఁ జూపుదుము D T Tatacharya, M O L. తమ Definition of Poetry అను వ్యాసమున నుదాహరించిన పంక్తులనే యిచ్చటఁ జూపుదను

1. The expression of the imagination
తన భావనను (ప్రతిభను) వాగ్రూపముగాఁ బ్రకటించుటయే కవిత్వము.
2 The language of the imagination
తన భావనను (ప్రతిభను) ప్రకటించు భాషయే కవిత్వము
3 The art of employing words in a manner as to produce an illusion on the imagination
ప్రతిభకు నొక మిథ్యారూపమును గల్పించు విధమునఁ బదములను గూర్చు కళ కవిత్వము
4. The rhythmic creation of beauty
సౌందర్యమును గణబద్ధముగా సృజించుటయే కవిత్వము

---

*కావ్యాదర్శమునకు వ్యాఖ్యాత యగు తరుణవాచస్పతి "ఇష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావళీ" అనఁగా వివక్షితార్థ వ్యవచ్ఛిన్నః శబ్దసందర్భః (చెప్పఁ దలఁచిన యర్థముతో నలంకృతమగు శబ్దము) అని యర్థమును వ్రాసెను మఱియు హృదయంగమ మను వ్యాఖ్యానమున "వివక్షితార్థస్య అన్యూనానతిరేకతాస్వరూపేణ ప్రతిపాదన సమర్థా పదావళీ చెప్పఁదలఁచిన యర్థములను హెచ్చు తగ్గులు లేనివిధమునఁ జెప్పఁజాలు పదసముదాయము అను నర్థము వ్రాయఁబడి యున్నది. ఈ యర్థమును బట్టి చూచినచో దండిలక్షణమును జగన్నాథుని లక్షణమును సమానార్థకములు గావు నేఁటివఱకుఁ బెక్కండ్రీ రెండు లక్షణములను సమానార్థకములుగానే తలంచుచుండిరి. కానీ D T తాతాచార్య M O L. గారు . Definition of Poetry లో నీ యర్థము ను జూపిరి పండితులింకను దీనినిఁగూర్చి చర్చింపవలెను.

5. The most delightful and perfect form of utterance that human words can reach.
మానవవాక్కులు కందగినంత యానందకరమైనదియు రసస్ఫోరకమైనదియు నిర్దుష్టమైనదియు రచనారూపము కవిత్వము
6. The art of uniting pleasure with truth by calling imagination to the help of reason.
ప్రతిభోత్థాపితమైన కారణములతో సత్యమును నానందముతో సమ్మేళనము జేయు కళయే కవిత్వము.

We may assume that the authors of these definitions are indirectly referring to the essence of the Poetry which resides in words and thoughts and which owes itself to tropes and figures I am inclined therefore to think that though the above and like definitions require a verbal change before they can be strictly called definitions yet they are in substance the same as the definitions of our old Alankarikas of the Alankara School which will be considered in the third chapter.

Of a quite different nature and value in John Stuart Mill s definition which is contained in his question "What is poetry" but *the thought words in which emotion spontaneously embodies itself.* Perhaps we have our Rasa Theory of poetry poorly expressed In a more developed form we find the Rasa principle in Wordsworth s observation which also refers to the question of origin and philosophy of poetry.

"*Poetry is the spontaneous overflow of powerful feelings*" This observation of Wordsworth as well as that of John Keble that '*Poetry is a vent for overcharged feelings*" bring for our memory Ananda Vardhana's Sloka,

కావ్యస్యాత్మా సఏవార్థ స్తథా చాదికవేః పురా
క్రౌంచద్వంద్వవియోగోత్థశ్శోకః శ్లోకత్వమాగతః

and Abhinavagupta's comment upon it. It would be wrong, however to think that these critics had ever conceived with any vividness the Rasa or its relation to poetry. All we can safely say is that as Goldsmith and Leigh Hunt represent the old Alankara school so, William Wordsworth and John Keble represent the very incipient stage of the Rasa School though of course unconsciously.

ఈ పై లక్షణకర్తలు సాక్షాత్తుగాఁగాదు; కాని పరంపరగాఁ గావ్యతత్త్వమును నిరూపించుచున్నారు. వారి యుద్దేశానుసారముగా నా కావ్యతత్త్వ మలంకారరహిత మగు శబ్దార్థస్వరూపము కావున నీ లక్షణములను, నింకను నిట్టివియు "లక్షణములు" అని చెప్పవలసినచో మఱికొంత మార్పఁబడవలయును. అప్పటికిని నవి మనఁయలంకార సిద్ధాంతమువంటిసిద్ధాంతములేయగును

జాన్‌స్టూవర్టుమిల్ అను లాక్షణికుఁడు 'కావ్యమన నేమి? అని ప్రశ్నించుకొని, పైలక్షణములకన్న భిన్నమగు దృక్పథముతో "మూర్తీభవించిన యావేశము గల పదములను అర్థములను కావ్యము" అనెను ఇట మన రససిద్ధాంతమత్యల్పముగా బీజభూతముగాఁ దెలుపఁబడెను

వర్డ్సువర్తు ఇంతకన్న విశేషముగా 'కావ్యమనఁ బరిపూర్ణమైన యావేశముతో హృదయమునుండి వెలువడు వాక్ప్రవాహము" అని తెలిపెను

అట్లే జాన్ కేబెలు అను నాతఁడు కావ్యమన హృదయమ్ముయొక్క యొద్దు లొరసి ప్రవహించు భావప్రవాహమునకుఁ బరీవాహము" అని వచించెను ఈ వచనములు

'కావ్యాత్మ రసధ్వనియే ఆదికవియొక్క క్రౌంచద్వంద్వ వియోగోత్థమైన శోకమే శ్లోకమయ్యెను" అను నర్థముగల యానందవర్ధనునిశ్లోకమును దానిపై యభినవగుప్తుని వ్యాఖ్యను దలఁపించుచున్నవి ఆంగ్ల లాక్షణికులు మన రససిద్ధాంతము నూహించినారని చెప్పలేము. కాని గోల్డుస్మిత్తు, లేహంటు ప్రభృతులు అలంకారమార్గానుయాయులు వర్డ్సువరు ప్రభృతులు రసమార్గానుయాయులు అని మాత్రము చెప్పఁగలము" (స్వేచ్ఛానువాదము)

ఇంతవఱకుఁ గావ్యశరీరమును గూర్చియుఁ గావ్యాత్మను గుఱించియు విచారణ సేసితిమిగదా! ఇట నిఁకఁ గావ్యప్రయోజనమేమో తెలిసికొనవలయును.

మన వాఙ్మయము (వైదిక లౌకికము) ప్రభుసమ్మితము మిత్రసమ్మితము, కాంతాసమ్మితము నని ముత్తెఱఁగులుగా నభినవగుప్తపాదులు ప్రప్రథమమున వ్యవహరించిరి. తరువాతి యాలంకారికు లెల్లరు నీ విషయము నిట్లే స్వీకరించిరి

వేదవాఙ్మయము (వేదశాస్త్రస్మృతులు) ప్రభుసమ్మితము; పురాణవాఙ్మయము మిత్రసమ్మితము కావ్యవాఙ్మయము కాంతాసమ్మితము అని విభజించిరి ప్రభుసమ్మిత మనఁ బ్రభువువలె నిరంకుశముగా శాసించునది. వేదము "సత్యంవద, ధర్మంచర" ఇత్యాదికమగు కర్తవ్యధర్మమును శాసనరూపమున బోధించును ప్రభుశాసనముల్లంఘింపరాని విధమున వేదశాసనము గూడ నుల్లంఘింపరానిది. ప్రభుశాసనమెట్లెదురాడఁగరాదో వేదశాసనము గూడ నెదురాడఁగరాదు. మనకిష్టము లేకున్నను ప్రభుశాసనమును విధిగాఁ బాలింపవలసిన విధమున వేదశాసనమును బాలింపవలయును. ఇట హేతువాదము పనికిరాదు. ఈ వాఙ్మయమున శబ్దమునకే ప్రాధాన్యము కావున వేదములు శబ్దప్రధానములు ఏలన "ఈషత్స్వరాన్యథా పాఠే ప్రత్యవాయ పదర్శనాత్" "ఈషత్స్వరమువలనను అన్యథాపాఠమువలనను గూడఁ బ్రత్యవాయము గలుగును అని కలదు ఇఁక మిత్రసమ్మిత మన మిత్రునివలె నుపదేశించునది లోకములో-

> మాతా మిత్రం పితాచేతి స్వభావా త్త్రితయం హితం
> కార్యకారణతశ్చాన్యే భవంతి హితబుద్ధయః

అన్నవిధమున మన మేలుగోరువారు తలిదండ్రులును, మిత్రుఁడును నను మువ్వురే. అట్టి మిత్రునివంటి పురాణవాఙ్మయము వైదికమగు "సత్యంవద, ధర్మంచర" అను శాసనమునే సహేతుకముగా సోదాహరణముగాఁ గథారూపమునఁ దదాచరణమువలన గలుగు లాభములను అనాచరణమువలనఁ గలుగు నలాభములను నుపదేశించి కర్తవ్యధర్మాచరణమునఁ బ్రవిష్టునిఁ జేయును కాన నీ వాఙ్మయ మర్థప్రధానము ఇఁకఁ గాంతాసమ్మిత మనఁగా నుత్తమురాలగు భార్య తన శైలీ (ప్రవర్తన) గుణాలంకారాదులచే భర్తృమనోరంజనమును జేయుచు దున్మార్గమున నున్నవానిని సన్మార్గమునకుఁ ద్రిప్పును ఆ యుత్తమయువతి తన భర్తకు వాచ్యరూపముగా నుపదేశింపక తన గుణప్రవర్తనలచే వ్యంగ్యరూపమున నుపదేశము సేయును ఆమెయే స్వాధీనపతిక యనఁబడును కర్తవ్యధర్మాచరణమునకు భర్తను స్వాధీనునిఁ జేసికొనునది అంతేకాని కేవలము తన కామసంతృప్తి కొఱకని స్వాధీనునిఁ జేసికొన్నది కాదు అట్టియెడఁ బ్రియుఁడు కాంతావాసుఁ డగుటలో దోసఁగు లేమి కావునఁ గావ్యవాఙ్మయము కాంతాసమ్మిత మనఁబడును వేద పురాణ వాఙ్మయముల కన్న వైలక్షణ్య మేర్పడినది ఇందు దాపియుండు లేని చిత్తరంజనమును వ్యంగ్యరూపమగు నుపదేశమును గలవు ఇవియే వైలక్షణ్యము ఈ వాఙ్మయము ధ్వని ప్రధానము ఇది నొక విషయమును స్మృతియందుంచుకొన వలయును. వైదికవాఙ్మయమే కర్తవ్యధర్మమును నిరంకుశముగా శాసనరూపముగా బోధించుచున్నదో యా కర్తవ్యధర్మమునే పురాణవాఙ్మయము సహేతుకముగా,

సోదాహరణముగా బోధించుచున్నది ఆ కర్తవ్యధర్మమునే కావ్య వాఙ్మయము శైలీగుణాలంకారములచే జనచిత్తము నాకర్షించుచు హృద్యముగా బోధించుచున్నది. వేదము సత్యంవద అని శాసించెను పురాణము సత్యహరిశ్చంద్ర కథను దెలిపెను ఆ కథయే దృశ్యశ్రవ్య కావ్యములం దంతకన్న మనోరంజకముగాఁ బ్రదర్శింపఁబడి యా ధర్మమును మఱింత లెస్సగా నాటుకొనునట్లు బోధించుచున్నది ఈ క్రమమునుబట్టి చూడఁగా గావ్యము తప్పక ధర్మోపదేశకమై యుండవలెను దీనినే భామహుఁడు —

"ధర్మార్థకామమోక్షేషు వైచక్షణ్యం కళాసు చ ।
కరోతి కీర్తిం ప్రీతిం చ సాధుకావ్యనిషేవణం"

అని చతుర్వర్గవ్యుత్పత్తియె కావ్యప్రయోజనముగాఁ బేర్కొనెను మఱియుఁ గావ్యప్రకాశకర్త—

కావ్యం యశసేఽర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే
సద్యఃపరనిర్వృతయే కాంతాసమ్మితతయోపదేశయుజే

అని సద్యఃపరనిర్వృతిని (ఆనందమును) నుపదేశమును ఫలములనుగాఁ బేర్కొనెను ధ్వన్యాలోకకర్తయు "సదాచారోపదేశరూప నిబంధనా హి నాటకాదిగోష్ఠీ వినేయజనహితార్థ మేవ మునిభిరవతారితా (పామరజనహితార్థము నకై సదాచారోపదేశమును జేయుటకే భరతాదులు నాటకాదులను నిర్ణయించిరి.) అని నుడివెను కావున భరతాదులు ఆనందము, ధర్మోపదేశము" అను రెండును కావ్యప్రయోజనములుగాఁ బేర్కొనిరి.

The poets are unacknowledged legislators of the world

అను నాంగ్లోక్తికిఁ గూడ నదియే యభిప్రాయము. మఱియు నాంగ్ల లక్షణకర్తలు—

The purpose of the poem is to teach and delight

అని తెలిపిరి ఇంతేకాక వెనుకఁ గవిభేదపరిగణనములో శాస్త్రకావ్యోభయకవి శ్రేష్ఠుఁ డని చెప్పఁబడినపు డాతని కర్మ యగు శాస్త్రకావ్యము శ్రేష్ఠమై యుండవలయును శాస్త్రకావ్యమన శాస్త్రమునందువలెఁ బురుషార్థనిరూపణమును గావ్యమునందువలె రసనిరూపణమునుఁ గలది కానఁ గేవల కావ్యములకన్న శాస్త్రకావ్యము లుత్తమములు ఈ శాస్త్రకావ్యాదిభేదము కావ్యవిభాగమునఁ జూచుకొనవలయును ఈ ధర్మోపదేశము ఆనందము అను ప్రయోజనద్వయములో నేది ప్రధానము? అనఁగా "నేది కావ్యశ్రవణ సమనంతరమునఁ గలుగును?" అని ప్రశ్నించుకొని యభినవగుప్తుఁ డీ క్రింది విధమునఁ దెలిపెను "శ్రోతౄణాం వ్యుత్పత్తిర్యద్యప్యస్తి యథోక్తం ధర్మార్థ

కామమోక్షేషు తథాపి ప్రీతిరేవప్రధానం అన్యథా ప్రభుసమ్మితేభ్యో వేదాదిభ్యః మిత్రసమ్మితేభ్యశ్చ ఇతిహాసాదిభ్యః కోఽస్యకావ్యరూపస్య వ్యుత్పత్తిహేతో ర్జాయాసమ్మితత్వలక్షణోవిశేషః ఇతి ప్రాధాన్యేన ఆనంద ఏవోక్తః చతుర్వర్గ వ్యుత్పత్తేరపిచ ఆనంద ఏవ పార్యంతికం ఫలం'' (శ్రోతలకు వ్యుత్పత్తి కలుగుచునేయున్నది అయినను ఆనందమే ప్రధానము కానిచోఁ బ్రభుసమ్మితము లగు వేదాదులకన్న మిత్రసమ్మితము లగు నితిహాసాదుల కన్నఁ గావ్యము కాంతాసమ్మిత మని చెప్పిన లక్షణమునకు విశేష మే ముండును? కావున నీ లక్షణముచేతనే ప్రధానముగాఁ గావ్య ప్రయోజన మానంద మనియే సారాంశము చతుర్వర వ్యుత్పత్తికంటెను నానందమే ముఖ్యఫలము దీనివలనఁ బ్రధానఫలమానంద మనియు నానుషంగికఫలము చతుర్వర్గవ్యుత్పత్తియనియుఁ దేలినది

'కావ్యాలాపాంశ్చ వర్జయేత్ కావ్యాలాపమును విడువవలెను అనగాఁ జదువరాదని యొక విధివాక్యమువంటి వాక్యము గలదు కావ్యములు ప్రాయిక ముగా శృంగారమయములుగానుండ ను అవి భోగలాఁ సతను బెంచును ఐహిక భోగతత్పరుఁడు జీవితలక్ష్యమైన మోక్షమునకు దూరస్థుఁ డగును కావున వేద శాస్త్రపురాణములు మాత్రమే పఠనీయములు అవి మోక్షసాధనములు అని తాత్పర్యము ధర్మోపదేశనిబంధనము లేని పచ్చి శృంగారకావ్యములు పఠనీయ ములు కావు కాని ధర్మోపదేశనిబంధనము గల కావ్యములు తప్పక పఠనీయ ములే యగును కావున "కావ్యాలాపాంశ్చ వర్జయేత్ అను వాక్యము సర్వకావ్యసాధారణము కాదు అది క్షుద్రకావ్యపరము విద్యానాథుఁడు ప్రతాపరుద్రీయమున—

"యత్ర పునరుత్తమపురుషచరితం న నిబధ్యతే తత్కావ్యం పరిత్యాజ్యమేవ;
తద్విషయా చ స్మృతిః "కావ్యాలాపాంశ్చ వర్జయేత్ '

ఏ కావ్యమున నుత్తమపురుష చరిత్రము నిబద్ధముగాదో యా కావ్యము పరిత్యాజ్యమే. కావ్యాలాపములను విడువవలె నను స్మృతివచనము దాని విషయమే యని వచించెను ఉత్తమపురుషచరిత్రముపదేశకముగా నుండును. కాన నుపదేశక మైన కావ్య ముపాదేయ మగు నని పైయభిప్రాయమునే దృఢ పఱచుచున్నది

కావ్యవాఙ్మయ మానందమును ధర్మోపదేశమును జేయునని చెప్పి యుంటిమి ఆ యానంద మెట్టిది? అని విచారణ సేయవలయును. కావ్యా నందము బ్రహ్మానందసహోదర మని యాలంకారికు లెల్లరు నిర్వచించిరి. మొదట బ్రహ్మానంద మననేమో తెలిసికొనవలసి యున్నది తైత్తిరీయోపనిషత్తు నందలి యానందవల్లిలో ఆనంద మీమాంస యిట్లు చేయఁబడినది—

"సైషానన్దస్య మీమాంసా భవతి యువా స్యాత్ సాధు యువా స్యాత్ ఆశిష్ఠో ద్రఢిష్ఠో బలిష్ఠః తస్యేయం పృథివీ సర్వా విత్తస్య పూర్ణా స్యాత్ స ఏకో మానుష ఆనందః శ్రోత్రియస్య చాఽకామహతస్య తే యే శతం మానుషా ఆనందాః స ఏకో మనుష్యగంధర్వాణామానందః శ్రోత్రియస్యచాఽకామహతస్య తే యే శతం మనుష్యగంధర్వాణామానందాః స ఏకో దేవగంధర్వాణామానందః శ్రోత్రియస్యచాఽకామహతస్య తే యే శతం దేవగంధర్వాణామానందాః స ఏకః పితౄణాం పరలోకలోకానామానందః శ్రోత్రియస్యచాఽ కామహతస్య తే యే శతం పితౄణాం పరలోకలోకానామానందాః స ఏక ఆజానజానాం దేవానామానందాః శ్రోత్రియస్యచాఽ కామహతస్య తే యే శత మాజానజానాం దేవానా మానందః స ఏకః కర్మదేవానాం దేవానా మానందః యే కర్మణా దేవానపి యంతి శ్రోత్రియస్యచాఽ కామహతస్య తే యే శతం కర్మదేవానాం ఆనందాః స ఏకో దేవానామానందః శ్రోత్రియస్యచాకామహతస్య తే యే శతం దేవానామానందాః స ఏక ఇంద్రస్యానందః శ్రోత్రియస్య చాఽ కామహతస్య తే యే శత మింద్రస్యానందాః స ఏకో బృహస్పతే రానందః శ్రోత్రియస్య చాఽ కామహతస్య తే యే శతం బృహస్పతే రానందాః స ఏకః ప్రజాపతే రానందః శ్రోత్రియస్య చాఽ కామహతస్య తే యే శతం ప్రజాపతే రానందాః స ఏకో బ్రహ్మణ ఆనందః."

దీని వివరణ మిది:—

౧౦౦ మానుషానందములు = ౧ మనుష్యగంధర్వానందము
౧౦౦ మనుష్య గంధర్వానందములు = ౧ దేవగంధర్వానందము
౧౦౦ దేవ గంధర్వానందములు = ౧ పితృదేవతానందము
౧౦౦ పితృదేవతానందములు = ౧ ఆజానదేవతానందము.
౧౦౦ ఆజానదేవతానందములు = ౧ కర్మదేవతానందము
౧౦౦ కర్మదేవతానందములు = ౧ దేవానందము
౧౦౦ దేవానందములు = ఇంద్రానందము
౧౦౦ ఇంద్రానందములు = ౧ బృహస్పత్యానందము
౧౦౦ బృహస్పత్యానందములు = ౧ ప్రజాపత్యానందము
౧౦౦ ప్రజాపత్యానందములు = ౧ బ్రహ్మానందము

మానుషానంద మన యువకుఁడును, సాధువును ద్రఢిష్ఠుఁడును, బలిష్ఠుఁడును నగు నొక మహారాజు పొందునట్టి యానందము పైనిఁ జూపిన లెక్కను బట్టి చూడఁగా ౧౦౦ ౦౦ ౦౦ ౦౦ ౦౦ ౦౦ ౦౦ ౦౦ ౦౦ ౦౦ (ఒక లక్షకోటి కోట్లు) మానుషానందములయినచో నొక్క బ్రహ్మానంద మగు నని సాక్షా

ద్రష్టలును బ్రహ్మిష్ఠులును నగు మహర్షులు వాకొనిరి. కాఁబట్టి కావ్యానందమిట్టి బ్రహ్మానందముతోఁ దుల్యమైనది బ్రహ్మానందసహోదర మగు రసానందము గలిగించు కావ్యముగూడ చాల గొప్పదిగానే యనఁగా రామాయణమహాభార తాదులవలెఁ బెద్దదిగానే యుండవలెననియే ప్రప్రథమమున విద్వాంసులూహించిరి కావున వారు మహాకావ్యముల నాదరించిరి ముక్తకాదులను నిరసింపలేదు కాని మహాకావ్యమునకుఁ జూపినంత గౌరవమును జూపలేదు ఇట్టియానందమును గలి గించు కావ్యమునకుఁ గర్తయగు కవి యెట్టివాఁడో తెలిసికొనవలయును కవి యనఁగా నెట్టివాఁ డను విషయ మలఁతిగాఁ దడవితిమి ఇట మఱికొంత విషయ మును విచారింతము నానృషిః కురుతే కావ్యం" "కవయః క్రాంతదర్శినః" అనులోకోక్తులను జూపితిమి. ఋషిపంటివాఁ డయినయెడలనే కవి బ్రహ్మానంద సహోదరమగు కావ్యానందము గలిగింపఁ గలుగును ఇట్టి కవియే మహాకవి ఇట్టి కవులు చాలా తక్కువగా నుందురు కావుననే ధ్వన్యాలోకమున "అస్మి న్నతివిచిత్రకవిపరంపరావాహిని సంసారే ద్విత్రాః పంచషా వా మహాకవయ ఇతి గణ్యంతే" అని నుడవఁబడియున్నది కావునఁ గాళిదాసాది కవులే కవులు మిగిలినవారు కవిబ్రువులు అనఁగా గావ్యశాస్త్రీయకవులే లేక విద్వ త్కవులే కవులు.

"కవయః కాళిదాసాద్యాః కవయో వయ మప్యమీ
పర్వతే పరమాణౌ చ పదార్థత్వం ప్రతిష్ఠితం"

కాళిదాసాదులును గవులె మేమును గవులమే అన్నారఁట యొకరు మఱొకరు పర్వతమునందును బరమాణువునందును బదార్థత్వమను ధర్మమున్నది అని పరిహసించిరఁట చెప్పవచ్చినదేమన మహాకవులు కొలఁదిమందిమాత్రమే కలరు. సరియే ఆ కాళిదాసాది మహాకవులకు మహత్త్వమును గలిగించిన హేతువులను గూర్చి విచారింతము

కావ్యప్రకాశకర్త కావ్యప్రయోజనములను బేర్కొన్న పిమ్మటఁ గావ్య హేతువుల నిట్లు పేర్కొనెను

"శక్తిర్నిపుణతా లోకశాస్త్రకావ్యాద్యవేక్షణాత్
కావ్యజ్ఞశిక్షయాభ్యాస ఇతిహేతు స్తదుద్భవే

శక్తి లోకశాస్త్ర కావ్యాద్యవేక్షణమువలనఁ గలిగిన నైపుణ్యము; పెద్దల శిక్షనుబొంది తదనుకూలముగా నభ్యాస మొనర్చుట-అను మూఁడును గలిసి కావ్యహేతువు, కాని యివి ప్రత్యేక హేతువులు గావు ఈ శక్తినే యభినవ గుప్తపాదులు 'ప్రతిభ' యనిరి దీని నాతఁడు ప్రజ్ఞా అపూర్వ వస్తునిర్మాణ క్షమా'' (క్రొత్త క్రొత్త వస్తువును నిర్మించు నేర్పు) అనెను భామహుఁడు "ప్రజ్ఞానవనవోన్మేషశాలినీ ప్రతిభా మతా' (క్రొత్త క్రొత్త వెలుఁగుఁ గలిగించు

ప్రజ్ఞయే ప్రతిభ) అని నిర్వచించెను. ఈ ప్రతిభవలన లోకోత్తర చమత్కారము గలిగించు కావ్యమును రచింపఁగలుగును ఈ లోకోత్తర చమత్కారమునే వైచిత్ర్యము విచ్ఛిత్తి చారుత్వము సౌందర్యము హృద్యత్వము రమణీయత్వము అని పెక్కు పదములతో వ్యవహరించిరి. కావున నీ ప్రతిభ కవికి ముఖ్య సామగ్రి ఈ ప్రతిభనే యాధునికులు భావనాశక్తి యనియు నాంగ్లమున Power of imag nation అనియు వ్యవహరింతురు. ప్రతిభ యను పదమును "కాణే పండితుఁడు imagination అనియు Thomas పండితుఁడు Faculty లేక Fancy అనియు భాషాంతరీకరించిరి ప్రతిభ, శక్తి, ప్రతిభానము అను పదముల నాలంకారికులు పర్యాయపదములుగా వ్యవహరించిరి.

"కావ్యంతు జాయతే జాతు కస్యచిత్ప్రతిభావతః" (ఒకానొక ప్రతిభావంతునివలన నొకానొకప్పుడే కావ్యము వెలువడును) అని భామహుఁడు చెప్పెను ఈ ప్రతిభలేని కవిత్వము "భోజనం దేహి రాజేంద్ర ! ఘృతసూప సమన్వితం" వంటి కవిత్వము ఈ ప్రతిభ కావ్యహేతువులో నొక భాగము తరువాతిది నిపుణత. అనఁగా వ్యుత్పత్తి పాండిత్యమనున్నమాట. బాలుఁడెంత బుద్ధిశాలి యయినను విద్యాభ్యాసము లేకున్నచోఁ బండితుఁడు కాఁజాలన ట్లెంత ప్రతిభావంతుఁడైనను పాండిత్యము లేనిచోఁ గవి కావ్యనిర్మాణదక్షుఁడు గాఁజాలఁడు ప్రతిభావ్యుత్పత్తులు రెండును దుల్యప్రమాణము గలిగి యుండవలెను ఈ వ్యుత్పత్తి కావ్యహేతువులో రెండవభాగము. మూడవభాగ మభ్యాసము పై రెండును సమగ్రముగా నున్నను నభ్యాసము లేకున్నచోఁ గవి కబ్బము లల్లఁజాలఁడు చక్కని శైలి యలవడదు వ్రాయఁగా వ్రాయఁగా గాని దస్తూరి కుదరనిపిధమున వ్రాయఁగా వ్రాయఁగా గానీ మంచి శైలి యలవడదు ఈ మూఁడు భాగములును గలిసియే గావ్యహేతువు మఱియుఁ గావ్యమీమాంసలో (పం అ నా శా. గారి యనువాదము ౬౯ పుటలో నిట్లున్నది) ప్రతిభా వ్యుత్పత్తు లొకదానితో నొకటి చేరియున్నవని యాయావరీయుఁడు లావణ్యము లేని రూపసంపదగానీ, రూపసంపదలేని లావణ్యముగానీ సౌందర్యాధిక్యమును వెల్లడింపఁజాలవుకదా! కావునఁ బ్రతిభావ్యుత్పత్తిమంతుఁడే కవి కానఁ బ్రతిభా వ్యుత్పత్తులు (రెండును) అభ్యాసము(మూఁడును) ను గలిసియే కావ్యమునకుఁ గారణము కారణములు గావు' కావుననే 'విద్వత్కవయః కవయః కేవలకవయస్తు కేవలం కపయః" అను వాచోయుక్తి వెలిసినది కాళిదాసాది మహాకవులకుఁ బ్రతిభావ్యుత్పత్త్యభ్యాసములు మూఁడును సమాన ప్రమాణమున గలవు కావుననే వారు మహాకవులయిరి ఈ మూఁడును గరిష్ఠ ప్రమాణమున ధరియించుండుటచే వారు మహాకవులు గాఁజాలిరి ఈ మూఁడు భాగములలో

నొక్కొక్కరికొక్కొక్క భాగము హెచ్చుగను మఱొక్కటి తచ్చుగను నుండ వచ్చును. అట్టివారు మహాకవులు కాఁజాలరు ఒక్కొక్క మెట్టు దగ్గుదరు. అట్టివారే యప్పకవిచే నుడువఁబడిన సప్తవిధకవులు మూఁడు భాగములును సమానముగాఁ గలవారే మహాకవులు అట్టి మహాకవిని గూర్చియే ధ్వన్యాలోక కర్త "అపారే కావ్యసంసారే అని చెప్పెను ఇందుఁ "గవి శృంగారి యగుచో లోకమంతయు రసమయము సేయును" విరాగి యగుచో నీరసము సేయును' అనికదా యున్నది. దీనికొక యుదాహరణ మిత్తును భర్తృహరి వ్రాసిన శృంగార శతకమును జదువుచున్నప్పుడు సన్న్యాసియు శృంగారియగును వైరాగ్యశతకమును జదువుచున్నపుడు శృంగారియు సన్న్యాసియగును కాననట్టివాఁడే మహాకవి

> ఇఁకఁ గావ్య పకాశకర్త కవిసృష్టి బ్రహ్మసృష్టినిమించునని వ్రాసినాఁడు
> "నియతికృతనియమరహితాం హ్లాదైకమయీమనన్యపరతంత్రాం
> నవరసరుచిరాం నిర్మితిమాదధతీ భారతీ కవేర్జయతి

ఆ బ్రహ్మసృష్టిలో వలె గవిసృష్టిలో నియతధర్మము లేదు అనఁగా బ్రహ్మసృష్టిలో ముఖము ముఖమే కవిసృష్టిలో ముఖముచంద్రుఁడో పద్మమో యగుచున్నది. కాన నిట నియతధర్మములేదు బ్రహ్మసృష్టి సుఖదుఃఖాత్మకము కవిసృష్టి కేవలసుఖాత్మకము బ్రహ్మసృష్టి పరమాణ్వాద్యుపాదాన కారణపరతంత్రము అనఁగా బ్రహ్మయైనను బరమాణ్వాదులులేక వస్తుసృష్టిని జేయఁజాలఁడు దానికి సహకారులు గావలయును కవిసృష్టి కట్టి యుపాదానకారణము లక్కఱలేదు బ్రహ్మసృష్టిలో నాఱే రసములు కవిసృష్టిలోఁ దొమ్మిది రసములు.

పై యుల్లేఖనమును బట్టి ప్రతిభావ్యుత్పత్త్యభ్యాసములు మూఁడును గలిసియే హేతువుగాని, ప్రత్యేక మొక్కొక్కటియు హేతువు కాఁజాలదు ఇదంతయు మమ్మటాది ప్రాచీనాలంకారికుల మతము ఆనందవర్ధనాచార్యుల వారు స్థిరపఱచిన కావ్యసిద్ధాంతమును ప్రకరణవ్యవచ్ఛేదపూర్వకముగా విభజించి రచించినవాఁ డగుటచేత మమ్మటుఁ డితరాలంకారికులఁ బరమప్రామాణికుఁడుగా నయ్యెను.

నవ్యుఁ డగు పండితరాయలవారి మతము దీనికి భిన్నమైనది, మమ్మటుఁడు ప్రతిభకుఁ గారణమును నిరూపింపలేదు ఈ ప్రతిభకు నొక్కొక్కచో దేవతానుగ్రహమును ఒక్కొక్కచో వ్యుత్పత్త్యభ్యాసములును హేతువు లగును ఎట్లన నొక్కొక్కనికి వ్యుత్పత్త్యభ్యాసములు లేకున్నను గేవలము దేవతానుగ్రహమువల్లనే ప్రతిభ గలుగుట ప్రసిద్ధముగా నున్నది ఒక్కొక్కఁడు గొంతకాలముదనుకఁ గావ్యరచన మొనర్ప రానివాఁడు వ్యుత్పత్త్యభ్యాసములు గలుగఁగానే ప్రతిభావంతుఁడై కావ్యరచనము సాఁగించుచున్నాఁడనుటయుఁ

ప్రసిద్ధమే కావున నెల్లరివిషయమును పతిభకు దేవతానుగ్రహమునే కార ణముగాఁ దెలుపరాదు కావునఁ బ్రతిభకు రెండు కారణములని తేలినవి. కార ణములు రెండైనపుడు కార్యములు రెండగును అట్టియెడఁ బ్రతిభయు రెండు విధములయినది దేవతానుగ్రహరూపకారణమువలనఁ బుట్టిన ప్రతిభచే రచింపఁ బడిన కావ్య మొకవిధముగను వ్యుత్పత్త్యభ్యాసరూపకారణమువలన రచింపఁబడిన కావ్య మొకవిధముగను నుండును కారణవైలక్షణ్యమును బట్టి కార్యవైలక్షణ్య ముండునుగదా ! కావునఁ బ్రతిభయే (రెండువిధములు) కావ్యహేతువని జగన్నాథ మతము రాజశేఖరుఁడు కావ్యమీమాంసలో "ప్రతిభావ్యుత్పత్త్యోః ప్రతిభా శ్రేయసీ" 'ఇత్యానందః' (ప్రతిభావ్యుత్పత్తులలోఁ బ్రతిభయే శ్రేష్ఠతరము) అని యానంద వర్ధనుఁడు చెప్పినట్లు తెలిపెను. అనఁగా నా దేవతానుగ్రహమువలన లభించిన ప్రతిభ శ్రేష్ఠతరము. 'సా హి కవేరవ్యుత్పత్తి కృతం దోషమశేషమాచ్ఛాదయతి. తత్రాహ

"అవ్యుత్పత్తికృతోదోషః శక్త్యా సం వియతే కవేః
యస్త్వశక్తికృత స్తస్య ఝుగిత్యేవావభాసతే"

తా శక్తి (ప్రతిభ) గల కవి తన శక్తిచే వ్యుత్పత్తి లేమివలనఁగలిగిన దోషమెల్లను గప్పివేయును ప్రతిభలేమివలన గలిగిన దోషము వెంటనే కనఁ బడును అనియును నొడివెను దీనిచేఁ బ్రతిభావంతుని రచనలో నటనట నలఁతిదోషము లగపడినను గుణాధిక్యముచే నవి కానరావు దీనిచే దేవతాను గ్రహలబ్ధ మగు ప్రతిభ వ్యుత్పత్త్యభ్యాసమువలనఁ గలిగిన ప్రతిభకన్నను శ్రేష్ఠతర మని సారాంశము. ఈ ప్రతిభాగుణమునుబట్టియే కావ్యము క్రొం గ్రొత్తగా భాసించును ఎట్లన—

దృష్టపూర్వా అపిహ్యర్థాః కావ్యే రసపరిగ్రహాత్.
సర్వే నవా ఇవాఽభాంతి మధుమాస ఇవ ద్రుమాః

కావ్యార్థములు దృష్టపూర్వములయినను రసపరిగ్రహమువలన వసంత కాలమున వృక్షములవలెనే నూతనముగా భాసిల్లును

పెక్కండ్రు కవు లీ విధముగా గ్రంథములు వ్రాయుచున్నచోఁ గొంత కాలమునకు వస్తుసామగ్రి క్షయింపదా ? అని యొక ప్రశ్న వచ్చుచున్నది. అట్లుగాదు

వాచస్పతి సహస్రాణాం సహస్రైరపి యత్నతః,
నిబద్ధాఽపి క్షయంనైతి ప్రకృతి ర్జగతామివ

పెక్కు వేలమంది బృహస్పతులు ప్రయత్నించినను జగత్ప్రకృతి (సత్త్వ రజస్తమోరూపము) వలెఁ గావ్యసామగ్రి నశింపదు

ఒకప్పుడు రచనలలోఁ గొన్ని పోలిక లగపడవచ్చును. పోలికలున్న

మాత్రమున గ్రంథచౌర్య మాపాదింపరాదు ఏలన—

"సంవాదిన్యో మేధావినాం బుద్ధయః" (ప్రతిభావంతుల బుద్ధు లొక దానితో నొకటి పోలును) ఇది నైజము ఈ పోలికలు మూఁడువిధములు

౧ ప్రతిబింబాకారసంవాదము ౨ ఆలేఖ్యాకారసంవాదము,
౩ దేహాంతరతుల్యసంవాదము

౧. ప్రతిబింబాకారసంవాదము

బింబమునువలెఁ బ్రతిబింబమును సిద్ధము సేయుట ఎట్లన—

కం. తరుణం దగు శీతలకరు మరిగి వియల్లక్ష్మి తన్ను మాని మదుకఁడున్
ఖరకరుఁడు న్నని ద్రొబ్బిన కరణిన్ రవి పశ్చిమాద్రికడఁ గ్రుంకెన్నృపా

ఈ బింబమునకు

కం తరుణం దగు శీతలకరు మరిగి వియల్లక్ష్మి తన్నుమాని ముదుకఁడున్
ఖరకరుఁడు న్నని ద్రొబ్బిన కరణిన్ రవిపశ్చిమాద్రితడఁ గ్రుంకెన్నృపా

ఇది ప్రతిబింబము ఈ ప్రతిబింబాకారసంవాదము గల కావ్యవస్తువు సర్వథా పరిత్యాజ్యము ఏలన దీనికి శరీరము భిన్నముగాలేదు దాని కిది నకలు ఇదే గ్రంథచౌర్యము

౨. ఆలేఖ్యాకారసంవాదము

ఒక చిత్తరువును వేరొక చిత్తరువు పోలియున్న విధమున నితరుల కావ్యవస్తువును బోలియుండుట ఎట్లన—

సీ మే లేర్చి నందుండు పూలుగోసియొసంగ సరము లందముగ సుందరి రచించు
మెలఁతవర్ణమ్ములు మేళవించియిడంగ హరువుమైనతఁడు చిత్తరువు వ్రాయుఁ
బతి యనురూపభావము వచించిన నను, రూపపద్యమునఁ గూర్చును లతాంగి
అతివ చక్కనిరాగమాలపించిన వీణఁ, బలికించు నతఁడు మై పులకరింప

గీ నెఱ్ఱిసెరల నందునిమాపు లింతియాన నేందునకుఁ గెంపులనివాళులెత్త నతివ
కజ్జలపుఁజూడ్కి ప్రియుని వక్షఃకవాటిఁ గట్టుఁ దోరణములు నల్లకల్వపూల.

ఈ పద్యమునకు నీ క్రింది పద్యము మెఱుఁగువెట్టినట్లున్నది

సీ వీనులవిందుగా వీణెమీటఁగఁ బతి లలన ముద్దుగను దాళములు వేయు
హృద్యంబుగా వ్రాయఁ బ్రియుఁడు చిత్తర్వును గోమలి తగినరంగులనుదిద్దుఁ
గౌళలంబున మృదంగముభర్త వాయింప నా వన్నెలాఁడి లాస్యంబొనర్చుఁ
బాడుచుం బాడు దా పా టాఁపననుఁగుకాఁ డామనోహరి దాని నంది పాడు

గీ చదువ శృంగారకావ్యంబు సరసుఁ డెలమి
యువతి విరచించును దదర్థవివరణంబుఁ
దై నుదాహృతకార్యముల్ వ్యత్యయముగ
వారు గావించుకొం ద్రొక్కతూరి ప్రీతి

సీ. వీఁ డఁటే! రక్కసి విగతజీవగఁ జన్నుఁ బాలు ద్రావినమేటి బాలకుఁడు
వీఁ డఁటే! నందుని వెలఁదికి జగ మెల్ల ముఖమందుఁ జూపిన ముద్దులాఁడు
వీఁ డఁటే! మఁదలో వెన్నలు దొంగిలి దర్పించి బొక్కఁదాఁపరీఁడు
వీఁ డఁటే యలయించి వ్రేఁతల మానంబు సూఱలాడినలోకసుందరుండు
గీ. వీఁడు లేకున్న పురమటవీస్థలంబు వీనిఁ బొందని జన్మంబు విగతఫలము
వీనిఁ బలుకనివచనంబు విహగరుతము వీనిఁ జూడనిచూడ్కులు వృథలు వృథలు

ఈ పద్యమున కీ క్రిందిపద్యము ఛాయారూపముగా నున్నది

సీ. అతఁ డఁటే! సుకృతాత్మయైన మాయాదేవి కడుపారఁ గన్న బంగారుతండ్రి
ఆలుబిడ్డలను రాజ్యముఁ దృణమ్ముగఁ గాన కేగినట్టి విరక్తుఁ డీతఁ డఁటవె
వీఁడెయౌనే! కన్నబిడ్డలవలె మమ్ము రక్షించు ననుకొన్న రాసుతుండు
మనకోటిపాపులకును మోక్షమునొసఁగ నరుదెంచుపుణ్యాత్ముఁ డఁటవె యితఁడు
గీ. ఎంతభాగ్యమొ ? యెన్నాళ్లకే లభించె
సౌమ్యగంభీరమైన యీ చక్కనయ్య
నెమ్మొగముఁ గాంచు పుణ్యాత్మ నిఖిలజగము
లేలఁ గలవాఁడు కాఁదగఁడే ? యితండు

ఆలేఖ్యమును చిత్రకారుఁడు వ్రాయునపు డొక్కొకచో మొదటి రూపమునకు వన్నెదెచ్చు విధమునను వ్రాయవచ్చును "యద్యత్సాధు న చిత్రే స్యాత్క్రియతే తత్తదన్యథా" (ఏది సహజముగా లెస్సగా నుండదో యది చిత్తరువున వేఱువిధముగా ననఁగా సుందరముగా వ్రాయఁబడును.) అని కాళిదాస కవియు నన్నాఁడు ఒకప్పుడు మొదటిదాని రూపముకన్న నసుందరముగాఁ గూడ వ్రాయవచ్చును పై పద్యమునకన్న (వీఁడఁటే) రెండవపద్య (అతఁడఁటే) మసుందరము దీనికి శరీరాంతర మున్నను నాత్మ తుచ్ఛముగా నున్నది. అనఁగా నసుందరముగా నున్నది.

౩. దేహాంతరతుల్య సంవాదము

దేహాంతరమును దేహాంతరము పోలియున్న విధమున భావమునందుఁగాని, ప్రకరణమునందుఁగాని విషయమునందుఁగాని పోలిక కనఁబడినను స్వాతంత్ర్యమును గోల్పోక సహజసుందర మగు జీవముతో నాస్వాద్యమానమైయున్న కావ్యవస్తువు దీని కాత్మయు శరీరమును వేఱుగాఁ గలవు. ఒక మనుష్యుని వే ఱొకమనుష్యుఁడు పోలియున్నమాత్రమున నిరువురును నొక్కఁడే యని చెప్పఁజాలముగదా! మేఘసందేశము ననుసరించి హంససందేశము వ్రాయఁబడియున్నది. ఇది దేహాంతరతుల్య సంవాదరూపమే ఏలన దీనికి నాత్మయు, శరీరమును భిన్నములుగానే యున్నవి ఈ సంవాదము స్వీకార్యమే యగును. మొదటిది తొత్తుగా వర్జనీయము, రెండవది మధ్యమము; మూఁడవది యుపాదే

యము. ప్రతిభావంతుఁ డగు కవి యీ యనుకరణములకుఁ బోక స్వతంత్రమార్గ ముననే కావ్యరచనము సేయును కాళిదాస మహాకవి మేఘసందేశ మిట్టి ప్రతిభావిలాసమే

కవి కావ్యము నెట్లారంభించును ?

ప్రతివాఁడును జగత్తును జూచుచునేయున్నాఁడు కాని, కవిచూపు వేఱు. ఒక నదినిఁజూచి సామాన్యుఁడు దానిని నదియే యని చెప్పును కాని, కవి దానిని 'పరమేశ్వరుని కరుణాప్రవాహము' అని వర్ణించును సామాన్యునకు దీఁగ తీఁగయే కవి కది యువతి. దాని పువ్వులు కవిదృష్టిలో నా యువతి యొక్క స్తనములు దాని చిగురాకు కెమ్మోవి కావున లోకమున నెల్లరును జూచు సామాన్యవస్తువులే కవికిఁ బ్రతిభచే విలక్షణముగా విశిష్టముగా లోకోత్తరముగా గోచరించును ఇదియే లోకోత్తరవర్ణనము ఇట్లే మనము మార్గమునఁ బోవుచున్నప్పుడు ప్రక్కలం దే బిచ్చగానినో చూతుము వెళ్ళిపోవుదుము మఱచిపోవుదుము కాని కవి వానిఁ జూచి వాని దీనస్థితినిఁ జూచి హృదయము ద్రవింప వానిని మనస్సునఁ జిత్రించుకొని పదేపదే యా చిత్రువు వంకనే తదేకదృష్టితోఁ జూచుచు దాను వానిలో లీనుఁడై వాని దైన్యమును దనదిగానే భావించుకొని వానిని గావ్యమునఁ జిత్రించును సామాన్యముగాఁ దాను గండ్లారఁ జూచిన దృశ్యమునే కవి చిత్రింపఁగలుగును చూచిన యా క్షణముననే సామాన్యముగా నెవ్వఁడును వ్రాయఁజాలఁడు. చూచిన దృశ్యమును మనస్సులో జిత్రించుకొనుటకును నా దృశ్యముయొక్క స్వరూపమునఁ దాదాత్మ్యము బొందుటకును గొంత వ్యవధి కావలయును ఆ దృశ్యనమెంత హృద్గతమైన నంత యుద్వేగముతో నా కావ్యము వెడలును. శ్రీమద్రామాయణమున వాల్మీకి క్రౌంచద్వంద్వవియోగమును గాంచి యా క్షణముననే పారవశ్యమున—

"మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమశ్శాశ్వతీస్సమాః
యత్క్రౌంచమిథునాదేకమవధీః కామమోహితం"

అని శ్లోకరూపమునఁ బలికెనని కలదు దీని కవష్టంభకముగా "క్రౌంచద్వంద్వవియోగోత్థశ్శోకః శ్లోకత్వమాగతః" అని ధ్వన్యాలోకకర్తయు "శ్లోకత్వమాపద్యత యస్య శోకః" అని కాళిదాసకవియు వచించిరి వాల్మీకి మహాముని ప్రతిభావంతుఁడును నంతర్ముఖుఁడును అట్టివానికిఁ జూచిన క్రౌంచద్వంద్వ చిత్రమును హృదయమునఁ జిత్రించుకొనుటకును, దానియందు లీనుఁడగుటకును నితరులకుఁ గావలసినంత వ్యవధి యక్కఱలేకపోవలసివచ్చును ఆరూఢుఁ డగు యోగి తనకు వలసిన క్షణముననే బాహ్య ప్రపంచమును మఱచి సమాధిలోఁ బ్రవేశించి, బ్రహ్మానందము ననుభవించునట్లు మహాకవియుఁ దలఁచుకొన్న క్షణ

మునసే విషయమునఁ బ్రవేశించి లీనుఁడై కావ్యమును వ్రాయఁగలుగును. అప్పు డాతఁడు పొంగివచ్చు నా కవితాప్రవాహమును నాఁపుకొనఁ జాలఁడు. అప్పు డాతనికి భాష చెప్పినట్లు వచ్చును శబ్దార్థములు మేము మేమని వరుగిడి వచ్చును వాల్మీకి యట్టివాఁడు కనుకనే క్రౌంచ ద్వంద్వ వియోగమును గాంచఁ గానే యా విధముగా శ్లోకమును రచింపఁగలిగెను కాన శోకమే శ్లోక మయ్యె నని చెప్పఁబడినది

కాని సామాన్యులకుఁ గొంత వ్యవధి కావలయును కొందఱు కవి కావే శము ఉత్సాహము ఉద్రేకము అనునవి కావలెనని చెప్పుదురు మన భారతీ యాలంకారికు లీ పదములను వాడలేదు వారు కావ్యహేతువుగాఁ జెప్పినది ప్రతిభ ఈ యావేశాదు లా ప్రతిభలోనే యంతర్గత మగును అల్లసాని పెద్దన కృష్ణదేవరాయలవారు త న్నేదేని గావ్యము రచింపు మన—

చ నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చియిచ్చుక
   ప్పురవిడె మాత్మకింపయిన భోజన ముయ్యెలమంచ మొప్పుత
   ప్పరయు రసజ్ఞు లూహ తెలియంగలలేఖకపాఠకోత్తముల్
   దొరకినఁగాక యూరక కృతుల్ రచియింపుమనంగ శక్యమే ?

అని యివ్వన్నియు నున్నఁగాని కావ్యము వ్రాయు సాధ్యముగాదని పలికె నఁట ఇది హాస్యోక్తియై యుండును ఇది కావ్యకారణసామగ్రి గాదు. ప్రతిభ గలవానికి దీనితోఁ బనిలేదు ఇంటఁ దిండిలేక శుష్కోపవాసములు సేయుచు పోతనగారు భాగవతమును రచించిరి

ప్రతిభావంతుఁడయిన కవి యే వస్తువును గ్రహించినను దానిని సుందర ముగాఁ జేయును వస్తుగౌరవమునుబట్టి కావ్యగౌరవ మేర్పడును. వస్తుగౌరవ మును బట్టియే "ఉత్తరే రామచరితే భవభూతిర్విశిష్యతే" అను ప్రతిష్ఠవచ్చినది. ఒకప్పుడు వస్తువు లోకోత్తరము గాకపోవచ్చును కాని కవి తన పనిని జక్కఁగా సమర్థించును అచేతనవస్తువులకును బ్రతిభావంతుఁడు చైతన్యముఁ బోయును. రోఁత గొలుపు పెంటకుప్పలును బంగారుబొమ్మలయిన పడఁతులను గవికావ్య మున సమానముగా సుందరమూర్తులుగానే భాసింతురు

నవ్యకవులు సుందరవస్తువులను గూర్చియే కవి వ్రాయువలె నందురు. సుందరవస్తువెప్పుడును సుందరమే అసుందరమును గూడ సుందరముగాఁజేయుట లోనే కవికిఁ బ్రత్యేకశక్తిగలదు "తృణేన కార్యం భవతీశ్వరాణాం" అన్నట్లు కవి కనుపాదేయ మగు వస్తువేదియు లేదు. ఆ వస్తువును గ్రహించు కవియొక్క ప్రతిభామహత్త్వమును బట్టి కావ్యగౌరవమేర్పడును కవిత్వము కళ గావున గళ ప్రకృత్యనుకరణమే కావునఁ గళయొక్క ప్రయోజన మానందమే కావునను imitation begets pleasure (అనుకరణ మానందమును గొలుపును) అన్న విధమున లోకమునందువలెఁ గాక కావ్యమునందలి యసుందరవస్తువుల వలనను

నానందమే కలుగును ఈ క్రింది దశరూపక శ్లోకమును గనుఁడు

శ్లో [రమ్యం జుగుప్సిత ముదార మథాఽపి నీచం
ఉగ్రం ప్రసాది గహనం వికృతంచ వస్తు
యద్వాఽప్యవస్తు కవిభావకభావ్యమానం
తన్నాస్తి యన్న రసభావముపైతి లోకే]

(రమ్యము గానిండు రోఁతగొలుపునది కానిండు, ఉదారముగానిండు, అధమముగానిండు భయంకరముగానిండు ప్రసన్నముగానిండు గంభీరముగానిండు వికృతముగానిండు వస్తువుగానిండు అవస్తువుగానిండు లోకమునఁ గవిచే భావ్యమానమై రసభావమును గలిగింపనిది లేదు) దీనినిఁబట్టి కవి సుందరవస్తువులను గూర్చియే వ్రాయవలె ననుట యసుచితము ఆంగ్లమునఁగూడ నిదే యభిప్రాయము గలదు

"Poetry turns all things to loveliness" "It exalts the beauty of that which is most beautiful and it adds beauty to that which is deformed" —Shelly

(కావ్యమెల్ల వస్తువులను సుందరముగా మార్చును అది సుందరవస్తువులను సుందరతమములను జేయును అసుందరవస్తువులను సుందరములుగాఁ జేయును)

క०. తను వగు శబ్దార్థంబులు;
ధ్వని జీవ; మలంక్రియావితానము సొమ్ముల్;
తనరు గుణంబులు గుణములు
ఘనవృత్తులు వృత్తు లౌర కావ్యేందిరకున్. ౫౩

కా కావ్యలక్ష్మికి శరీరము శబ్దార్థములు జీవము (ఆత్మ) ధ్వని అలంకారములలంకారములు గుణములు గుణములు, వృత్తులు వృత్తులు.

కావ్యశరీరమునుగూర్చి యింతకుమున్నే విపులముగాఁ జర్చించితిమి ధ్వనతీతి ధ్వనిః (కావ్యం) ధ్వన్యతే ఇతి ధ్వనిః (వ్యంగ్యార్థము) ధ్వననంధ్వనిః (వ్యంజనా) అని యభినవగుప్తుఁడు ధ్వనిశబ్దమునకు ముత్తెఱఁగులగు వ్యుత్పత్తులనంగీకరించి కావ్యపరముగా వ్యంగ్యార్థపరముగా వ్యంజనావృత్తిపరముగా వ్యాఖ్యానించెను. ధ్వని జీవ మనుచోట ధ్వనిశబ్దమునకు వ్యంగ్యార్థ మనియే యర్థము

ఇటఁ గావ్యేందిర అని కావ్యమును నిందిరనుగా రూపించుటవలనఁ బ్రయోజనమేమియు లేదు కావ్యము కాంతాసమ్మిత మగుటచే సామాన్యముగాఁ గాంతగా రూపించినఁ జాలును కావ్యరమణికిన్ అన్నదో సరిపోవును గ్రంథకర్త యిచ్చటఁ దా నిచ్చిన కావ్యసామగ్రిలోని రీతి పాకములను వదలెను

గీ. అందు వాచక లక్షక వ్యంజకంబు
లనఁగ శబ్దప్రపంచంబు వినుతి కెక్కుఁ
ద్రివిధ మై యర్థజాతంబు తేజరిల్లు
నవని వాచ్యంబు, లక్ష్యంబు వ్యంగ్యమనఁగ. ౫౪

గీ. శబ్దవృత్తులు నభిధ లక్షణ యనంగ
వ్యంజన యనంగఁ బెనుపొందు నందు నభిధ
సతతసంకేతితార్థగోచరసుశబ్ద
ధామ మై, యోగరూఢి భేదములఁ దెలఁగు. ౫౫

ఆ పదములకు లేక శబ్దములకు నర్థమును బోధించు నొకశక్తి గలదు "పదపదార్థసంబంధశ్శక్తిః" (పదమునకును దానియర్థమునకును గలసంబంధమే శక్తి) అని తార్కికవచనము ఆ శక్తికిఁ గొందఱాలంకారికులు 'వృత్తి' యనియును, గొందఱు 'శక్తి' యనియును గొందఱు 'వ్యాపార' మనియును పేరిడిరి ఆశక్తి అభిధా లక్షణా వ్యంజనా యని ముప్విధములు. అభిధా శక్తిచేఁ జెప్పఁబడు నర్థము వాచ్యము లేక అభిధేయము లేక శక్యము అనియు, లక్షణాశక్తిచేఁ బోధింపఁబడు నర్థము లక్ష్యమనియు వ్యంజనాశక్తిచే బోధింపఁబడు నర్థము వ్యంగ్య మనియుఁ జెప్పఁబడును ఆ వాచ్యార్థమును బోధించు శబ్దము వాచక మనియు లేక శక్తమనియు లక్ష్యార్థమును బోధించు శబ్దము లక్షక మనియు వ్యంగ్యార్థమును బోధించు శబ్దము వ్యంజక మనియు వ్యవహరింపఁబడును అనఁగా నిట్లు

శక్తి	అర్థ	శబ్దము
అభిధా	వాచ్యము లేక అభిధేయము లేక శక్యము	వాచకము లేక శక్తము
లక్షణా	లక్ష్యము	లక్షకము
వ్యంజనా	వ్యంగ్యము	వ్యంజకము

గ్రంథకర్త ప్రప్రథమమున నభిధాదిశక్తులను దిమ్మట వాచ్యాద్యర్థము లను దమపరి వాచకాదిశబ్దములను గుఱించియుఁజెప్పినయెడల లెస్సగానుండెడిది. అట్లు చెప్పఁబడమి నీ రెండుపద్యములకును గలిపియే వివరణము వ్రాయఁబడినది.

ఈ మూఁడుశక్తులును గాక మీమాంసకులలో నొక తెగవారగు నభి హితాన్వయవాదులు 'తాత్పర్యశక్తి' యను వేఱొకశక్తి నంగీకరించిరి. (తాత్పర్యార్థోఽపి కేషుచిత్) అభిధా లక్షణా వ్యంజనాశక్తులు శబ్దశక్తులు అనఁగా శబ్దముయొక్క యర్థమును బోధించుశక్తులు. తాత్పర్యశక్తి వాక్యశక్తి వారియాశయ మిది .—

శబ్దములు వాని సంకేతితార్థమునుమాత్రమే బోధించును. అన్వయమును బోధింపవు ఎట్లన, 'గామానయ (గోవును దెమ్ము) అన్నపుడు 'గాం' పదము 'గోవును అనియు 'ఆనయ' పదము తెమ్ము అనియు నర్థమును దెలుపును. కాని యీ రెండర్థములను గలియు టెట్లు? ఏలన, నభిధ పదములయొక్కయ్యమును మాత్రమే బోధించును. కాని యన్వయమును బోధింపదు. కాన వాక్యము నందలి పదముల కన్వయమును గలిపి యఖండార్థమును బోధించుటకు వేఱొకశక్తి నంగీకరింపవలయును దానికే తాత్పర్యశక్తి యని పేరు అది లేకున్నచోఁ బదములు పరస్పరాన్వయమును బొందవు మనకఖండార్థ మేర్పడదు తీర్థమునకుఁ దీర్థము ప్రసాదమునకుఁ బ్రసాదము నన్నవిధమున నర్థములు ఖండఖండములుగానే యుండును వీరభిహితాన్వయవాదులు అనఁగాఁ బదముల మూలమున వాక్యార్థ మేర్పడునని చెప్పువారు

ఈ మీమాంసకులలో నన్వితాభిధానవాదు లను వేఱొక తెగవారుగలరు వారీతాత్పర్యశక్తి నంగీకరింపరు వారి సిద్ధాంత మిది—

"గామానయ (గోవును దెమ్ము) అని యుత్తమవృద్ధుఁడు (పెద్దవాఁడు) మధ్యమవృద్ధునితో (యువకుఁడు) చెప్పఁగా మధ్యమవృద్ధుఁడద్దానినిఁదెచ్చుచుంటను జూచుచున్న బాలుఁడు ఆ వాక్యమునకు "ఒకానొక సాస్నాది (గంగడోలు) మంతమగు పిండమును గొనివచ్చుట" యని సాముదాయికముగా గ్రహించును. కాని ప్రత్యేకముగా "నీ పదమునకిది యర్థము" అని గ్రహింపఁజాలఁడు. పిమ్మట 'గాం బధాన' (గోవును గట్టుము) అశ్వమానయ' (గుఱ్ఱమును దెమ్ము) అను వాక్యములను విని వెనుకటి 'గోవును దెమ్ము' వాక్యములోని గోవువంటి వ్యక్తినే కట్టివేయుటను జూచి గోవు అనఁగా ఇది' యని యర్థమును గ్రహించును గుఱ్ఱమును దెమ్ము అను వాక్యమును విని గుఱ్ఱమును దెచ్చుటను జూచి ఆనయ (తెమ్ము) పదము వెనుక 'గామానయ' వాక్యములోని ఆనయ (తెమ్ము) పదము వంటిదే యనుకొని దాని యర్థమును గ్రహించును ఈ విధముగా వాక్యార్థము వలననే ప్రత్యేక పదముల యర్థము గోచరించును. వీరి మతమునఁ బదముల యర్థమును గలుపుటకుఁ దాత్పర్యశక్తి యక్కఱలేదు ఏలన నన్వితార్థమే యనఁగా వాక్యార్థమే ముందు గోచరించుచున్నది

అభిహితాన్వయవాదులు "మొదటఁ బదములవలన నర్థబోధ, పిమ్మట వాక్యార్థబోధ" యందురు అన్వితాభిధానవాదులు "మొదట వాక్యార్థబోధ పిమ్మటఁ బదార్థబోధ" యందురు.

ప్రతాపరుద్రీయములో "తాత్పర్యార్థోఽపి వ్యంగ్యార్థ ఏవ న పునః పృథగ్భూతః (తాత్పర్యార్థము కూడ వ్యంగ్యార్థమే కాని భిన్నముగాదు) అని వ్రాయఁబడియున్నది. అట్టిచో "గోవును దెమ్ము" అను వాక్యములోని తాత్ప

ర్యార్థమే వ్యంగ్యార్థమా? వ్యంగ్యార్థము రమణీయముగా నుండవలెను గదా ? అని శంక గలుగుచున్నది ప్రతాపరుద్రీయకారుని మతమునఁ దాత్పర్యార్థమన మీమాంసకుల పదముల విశిష్టార్థమును మాత్రమే బోధించుశక్తి గాదు ఆలంకారికుల తాత్పర్యమిది .—

"తస్మిన్ పరః తత్పరా తేషాంభావః తాత్పర్యం" అని వ్యుత్పత్తి ఇటఁ దచ్ఛబ్దమునకు వక్త తన బుద్ధిచే సహృదయహృదయానుభవమునకుఁ దెచ్చిన రసాదులు 'తత్పరాః' అనఁగా నా రసాసక్తములగు విషయములు వాని భావము తాత్పర్యము కేవల పదార్థాన్వయమును మాత్రమే తెల్పుట కవి యొక్క పనిగాదు ఆ వాక్యార్థముకంటె రమణీయమగు వాక్యార్థమును దెలుపుట యతని పని అదియే యాలంకారికుల తాత్పర్యము. భావప్రకాశములో—

"అతో ధ్వన్యాఖ్య తాత్పర్యగమ్యమానత్వతః స్వతః
కావ్యే రసాలంక్రియాది ర్వాక్యార్థో భవతి స్ఫుటం"

తా॥ "ధ్వని యను పేరు గలిగి తాత్పర్య రూపముగా గమ్యమానమగునది కానఁ గావ్యమున రసాలంక్రియాదులే వాక్యార్థము" అని తాత్పర్యము ధ్వనియు నేకముగాఁ దెలుపఁబడినది.

ఈ తాత్పర్యమునకు భావము అభిప్రాయము ఉద్దేశము మొదలయ నామాంతరములు. ఈ తాత్పర్యమును వ్యంగ్యార్థమును భిన్నములు గావు

అభిధావృత్తి

"సతతసంకేతితార్థగోచరసుశబ్దధామము" అని దీని లక్షణము సంకేతితమగు నర్థమును బోధించు శబ్దమున కాశ్రయమై యుండునది" అని దీని భావము. ఇందు గోచర సుశబ్దధామము అనఁగా నిష్కృష్టమగు నభిప్రాయము తేలకున్నది మఱియుఁ బైఁజెప్పఁబడిన లక్షణము గూడ డొంకతిరుగుడుగానున్నది "సంకేతితమగు నర్థమును బోధించు శబ్దశక్తి యభిధ" అనినచో సూటిగా నుండును సంకేతితార్థమనఁగా వాచకము యొక్క ముఖ్యార్థము లేక వాచ్యార్థము. దానిని బోధించు శక్తి యభిధ సంకేతమన శబ్దమునకును, దాని యర్థమునకును గల పరస్పరసంబంధమును నిర్ణయించుట (సంకేతశ్శబ్దార్థయోః సంబంధావధారణం) అనఁగా నీ శబ్దము వలన నీ యర్థము బోధపడవలెనను నీశ్వరేచ్ఛయే సంకేతమని ప్రాచీనులును, లోకేచ్ఛయే సంకేతమని నవ్యులును జెప్పుదురు

ఈ సంకేత మీ క్రిందివానిచే గ్రాహ్యమగును

వ్యాకరణము, ఉపమానము ఆప్తవాక్యము, వ్యవహారము, వివరణము

అన్యపదముల యొక్క సాన్నిధ్యము వీనివలన నా సంకేతము గ్రాహ్యమగును ఎట్లన 'కర్త అను పదమున కర్థమేమన్నచో వ్యాకరణమిచ్చుటఁ బ్రకృతి ప్రత్యయవిభాగము చేసి యే యర్థమున నే ధాతువున కే ప్రత్యయము వచ్చెనో తెలుపును. దాననర్థము తేటపడును 'గవయము (ఒక జంతువు) గోవు వలె నుండును' అనునెడ నీ యుపమానముచే గవయశబ్దము యొక్క సంకేతము గ్రాహ్యమగును. ఆప్తులనఁ బెద్దలు. వా "రీ శబ్దమున కిది సంకేతము" అని చెప్పుటవలనను గ్రాహ్యమగును వ్యవహారమన మీమాంసక మతమున నన్వితాభిధానవాదులు తెలిపిన మతము. దానినిఁబట్టియు సంకేతమేర్పడును వివరణమన "ఘటమనఁ గలశము" అననది. దీనివలనను సంకేతము గ్రాహ్యమగును అన్యపదసన్నిధి వలన సంకేతము గ్రాహ్యమెట్లగునో ముందు బోధింపఁబడును. (చూ. పురారాతి యగు దేవరకు)

అట్టి సంకేతము గల యర్థమును బోధించు శక్తియే యభిధ అభిధా శక్తితోఁగూడిన శబ్దములు వాచకములని తెలుపఁబడెను.

ఈ సంకేతము స్వరూపస్వభావమును బట్టి నాల్గు విధములు. ౧ జాతి సంకేతము, ౨. గుణసంకేతము ౩ క్రియాసంకేతము ౪. ద్రవ్యసంకేతము

జాతి సంకేతమును దెలుపు పదములు జాతివాచకములు ఉదా గోవు 'గోవు' అని చెప్పఁగానే యీ పద మొకానొక గోవును దెలుపునా? అన్ని గోవులను చలుపునా? ఒకే గోవును దెలుపునన్నచో నితరగోవులను దెలుపుటకు నొక్కొక్క పదమును వాడవలసి యుండును అనఁగా నిది గోవు; ఇది గోవు; ఇది గోవు అని యనంతముగా గోపదములను జెప్పవలసి యుండును ఇది గౌరవము గదా; కాన నన్ని గోవులను బోధించునని చెప్పవలెను అనఁగా గోజాతినంతను బోధించును గోజాతి యనఁగా నేమి? గోవునందు 'గోత్వము' అనునది ధర్మము అనేక వ్యక్తులయందనుగతముగా నుండు ధర్మము జాతి "గోత్వమనునది యనేక వ్యక్తులయందనుగతమగు ధర్మము గదా ఇట్లే ఘటత్వము, పటత్వము మొదలగునవన్నియు జాతులే గోత్వ ఘటత్వ పటత్వాదులు గల గోవు ఘటము, పటము మొదలగు శబ్దములన్నియు జాతివాచకములు (వీనినే యాంగ్లమున Common nouns అందురు). జాతినిఁ దెలుపునది జాతివాచకము గోశబ్దాదులు జాతివాచకమన గోత్వాదులను దెలుపునని భావము అనఁగా మనము "గోవును దెమ్ము" అని ప్రయోగింపఁగానే 'గోత్వమును దెమ్ము' యని యర్థము వచ్చును. గోత్వమును దెచ్చుట యెట్లు? కాన గోత్వమను జాతి కార్యకారి కాదు. కాన ననఁగా గోత్వమును దెచ్చుట సాధ్యము గాదు. కాన గోత్వరూప జాతిచే గోవే ఆక్షేపింపఁబడును. కాన గోవు ఘటము పటము మొదలగు పదములు జాతివాచకములు.

గుణసంకేతము గల పదములు గుణవాచకములు. ఉదా॥ శుక్ల నీల పీతాది పదములు గుణసంకేతము గలవి.

క్రియాసంకేతము గల పదములు క్రియావాచకములు. ఉదా: వండుచున్నది ఇట వంటయనఁ బొయిమీఁదఁబెట్టి యుడికినపిమ్మటఁ గ్రిందికి దించుటవఱకుఁ గల వ్యాపారము ఇట్టి వ్యాపారమును బోధించు పదములు క్రియావాచకములు

ద్రవ్యసంకేతము గల పదములు ద్రవ్యవాచకములు ఉ॥ రాముఁడు. ఇట ద్రవ్యమన నామము. రామపద మొకరికి సంకేతము. ఇట్టివి ద్రవ్యవాచకములు.

కొందఱు గోశబ్దము గోత్వమను జాతిని బోధించునట్లే శుక్ల నీలాది గుణవాచకములును శుక్లత్వ, నీలత్వాది జాతులనే బోధించునుగదా! అట్లే 'వండుచున్నది మొదలగు క్రియలు గూడ వంటల జాతినే బోధించును అట్లే రామాది ద్రవ్యవాచకములు గూడ రామత్వాది జాతులను బోధించును రామాదులేకవ్యక్తులు అనేక వ్యక్తులున్నఁగాని జాతి యేర్పడదు. రామత్వాదులు జాతులెట్లగు? నన్నచో బౌద్ధులు ప్రతిక్షణమును ద్రవ్యము భేదించునని చెప్పుదుఁ అనఁగా రామాదిద్రవ్యము లేకవిధముగా సర్వకాలమును నుండవనియుఁ, ప్రతిక్షణమునందును మార్పులు గలుగుచుండుననియుఁ గావున క్షణముక్రిందఁటి రామాదులే యీ క్షణమునఁజూచిన రామాదులు గారనియు వారి సిద్ధాంతము కావునఁ బ్రతిక్షణమున భేదించు రామాదిద్రవ్యముల యందు రామత్వరూపజాతి యుండవచ్చును. ఈ విధముగా నన్నియును జాతివాచకములే యనియు నొక మతము గలదు.

ఈ విధముగా సంకేతస్వభావమును బట్టి శబ్దములు నాలుగువిధములని మహాభాష్యకారుఁడు చెప్పెను. (గౌశ్శుక్లశ్చలోడిత్థః ఇతిశబ్దానాం ప్రవృత్తిః) కొన్ని శబ్దములకు నొక్కయర్థమే సంకేతితము మఱికొన్ని శబ్దములకుఁ బెక్కర్థములు సంకేతితములై యున్నవి అట్టిచోఁ బెక్కర్థములను బోధించు శబ్దములలోఁ బెక్కభిధాశక్తులుండునా? అన్నచోఁ బెక్కుశక్తు లుండవు. ఒకే యభిధాశక్తి యుండును అట్టిచో నా శక్తి యన్నియర్థముల నొకతడవ బోధింపదా? అట్లు పెక్కర్థములుపస్థితములయ్యేనేని వాక్యార్థమెట్లు బోధపడును? అని మఱల శంకగలుగును దీనికి సమాధానమిది అభిధాశక్తిని నియమించి యర్థనిర్ణయము సేయు సాధనములు గలవు.

'సంయోగో విప్రయోగశ్చ సాహచర్యం విరోధితా
అర్థః ప్రకరణం లింగం శబ్దస్యాఽన్యస్య సన్నిధిః
సామర్థ్య మౌచితీ దేశః కాలో వ్యక్తిస్స్వరాదయః
శబ్దార్థస్యానవచ్ఛేదే విశేషస్మృతిహేతవః'

తా॥ సంయోగము, విప్రయోగము సాహచర్యము విరోధము అర్థము ప్రకరణము, లింగము (చిహ్నము) అన్యశబ్దసన్నిధి సామర్థ్యము ఔచిత్యము, దేశము, కాలము, లింగము స్వరము మొదలగునవి శబ్దము యొక్క అర్థము నిర్ణీతము కానపుడు నిర్ణయించు సాధనములు

సంయోగము — హరి సశంఖచక్రుఁడు' అనుచో 'హరి' యననెవరు? హరిశబ్దమునకుఁ బెక్కర్థములు గలవు. ఇట నేమర్థము? అన్నచో నిచ్చటి హరి శంఖచక్రసంయోగము గలవాఁడని యర్థమగుటచే శంఖచక్రసంయోగము విష్ణువునకు మాత్రమే కలదు కాన 'హరి యన విష్ణువే యని యర్థముతేలును. ఇట శంఖచక్రసంయోగము హరి' పదమునకు 'విష్ణువే యను నర్థమును బోధింప నభిధను నియమించును

విప్రయోగము —"అశంఖచక్రుఁడగు హరి" (శంఖచక్రములు లేని హరి) ఇట 'హరి పదమున కేయర్థమన్నచో శంఖచక్రవియోగము హరి' పదమునకు 'విష్ణువే' యను నర్థమును బోధింప నభిధను నియమించును

సాహచర్యము — రామలక్ష్మణులు' అన్నచో రామశబ్దమునకు నర్థమేమి? లోకమున రామశబ్దమునకు దశరథరాముఁడు పరశురాముఁడు బల రాముఁడు నని మూఁడర్థములుగలవు. ఇందేయర్థమన్నచో లక్ష్మణసాహచర్యము దశరథరామునకే కలదు గాన నిట నా సాహచర్యము 'రామ పదమునకు దశరథరాముఁ డని యని యర్థమును బోధింప నభిధను నియమించును.

విరోధము — రామార్జునులు అను పదమున రామార్జునులెవరు? రామ శబ్దమునకుఁబైని మూఁడర్థములను జూపితిమికదా అర్జునపదమునకుఁ బాండవార్జునుఁడు కార్తవీర్యార్జునుఁడు నను రెండర్థములు గలవు. ఇట నేమర్థమన్నచో లోకమున భార్గవరామ, కార్తవీర్యార్జునులకుఁ గల విరోధమునుబట్టి రామశబ్దమునకుఁ బరశురాముఁడనియు నర్జునశబ్దమునకుఁ గార్తవీర్యార్జునుఁడనియు నర్థమును బోధింప నా విరోధ మభిధను నియమించును.

అర్థము (ప్రయోజనము) —"సంసారచ్ఛేదమునకై స్థాణువునుభజింపుము" అన్నచో స్థాణువన నేమి? ఈ పదమునకు మొద్దు శివుఁడు నను రెండర్థములు గలవు ఇట నేమర్థమన్నచో సంసారచ్ఛేదనరూపమగు ప్రయోజనమునకై భజింపఁదగినవాఁడు శివుఁడు గాని వట్టి మొద్దు గాదు. కావున నిట నర్థము (ప్రయోజనము) స్థాణుశబ్దమునకు శివుఁడను నర్థమును బోధింప నభిధను నియమించును.

ప్రకరణము —"దేవరకు సర్వము దెలియును" (సర్వంజానాతి దేవః) ఇట దేవర (దేవ) పదమునకు మీరు అనునర్థమును బోధింపఁ బ్రకరణమభిధను నియమించును.

లింగము (చిహ్నము) -- మకరధ్వజుఁడు కోపించును మకరధ్వజ శబ్దమునకు మన్మథుఁడు సముద్రుఁడు నని యర్థద్వయము గలదు. ఇట నేమర్థ మన్నచోఁ గోపరూపమగు చిహ్నము చేతనుఁడగు మన్మథునికిఁగలదు. కాని సముద్రునకుండదు గదా! కానఁ గోపరూపచిహ్నము మకరధ్వజశబ్దమునకు మన్మథుఁడను నర్థమును బోధింప నభిధను నియమించును

అన్యశబ్దసన్నిధి — "పురారాతి యగు దేవరకు" ఇటఁ బురారాతియను న్యర్థశబ్దసన్నిధి 'దేవర పదమునకు మీరు అను నర్థముగాక శంభుఁడను నర్థమను బోధింప నభిధను నియమించును

సామర్థ్యము .— మధువుచేఁ గోకిల మదించినది' మధు పదమునకు మద్యము వసంతము అను రెండర్థములు గలవు ఇట నేమర్థమన్నచోఁ గోకిలకు మదమును గలిగించు సామర్థ్యము వసంతునికిఁగలదు కాన నిటఁ గోకిలకు మదకారణసామర్థ్యము 'మధు' పదమునకు వసంతుఁడను నర్థమును బోధింప నభిధను నియమించును

ఔచిత్యము .—'ప్రియురాలి ముఖము మిమ్ము రక్షించుఁగాత' ముఖ శబ్దమునకు సమ్ముఖము వదనము అను రెండర్థములు గలవు ఇట నేమన మన్నచోఁ బ్రియురాలి సమ్ముఖము రక్షించునన్నచో నుచితముగానుండును కాన నిట నౌచిత్యము ముఖశబ్దమునకు సమ్ముఖమనునర్థమును బోధింప నభిధను నియమించును

దేశము —"పరమేశ్వరుఁడిట వెలయుచున్నాఁడు" పరమేశ్వరశబ్ద మునకు లోకమున రాజు, దేవుఁడు నను రెండర్థములు గలవు 'ఇట' అన రాజధానీరూపమగు దేశము అని యర్థము దేశవాచకమగు 'ఇట అనునది పరమేశ్వర శబ్దమునకు 'రాజు అనునర్థమును బోధింప నభిధను నియమించును.

కాలము —"చిత్రభానువు ప్రకాశించుచున్నాఁడు" చిత్రభానువనఁగా నగ్నియు సూర్యుఁడు నని యర్థము ఈ పదమును బగటఁ బ్రయోగించినచో 'సూర్యుఁడు అనియు రాత్రి ప్రయోగించినచో 'నగ్ని యనియు నర్థమగును. ఇటఁ గాలము (పగలు-రాత్రి) ఆ యా యర్థములను బోధింప నభిధను నియమించును

వ్యక్తి (లింగము) ·— "మిత్ర మొప్పుచుండెను" మిత్ర శబ్దమునకు సఖుఁడు' సూర్యుఁడు నని యర్థద్వయము గలదు ఇట నపుంసకలింగముగా మిత్రశబ్దముపయోగింపఁబడినది కాన స్నేహితుఁడనియేయర్థము ఇట నపుంసక లింగము స్నేహితుఁడను నర్థమును బోధింప నభిధను నియమించును.

స్వరము --స్వరము వేదమునందే యర్థవిశేషమును బోధింప నభిధను నియమించును (స్వరమన ఉదాత్త అనుదాత్త, స్వరితములు) ఎట్లన

వృ త్రాసురుఁడు దానింద్రుని జయింపఁగోరి "ఇంద్రశత్రుర్వర్ధస్వ" (ఇంద్రుఁడు శత్రువుగాఁగల ఓ వృత్రాసురుఁడా! వర్థిల్లుము) అని తన్నుగుఱించి తాను మంత్రోచ్చారణమును జేయుచుండెను ఇంద్రశత్రుపద మిట బహువ్రీహి సమాసము "ఇంద్రశత్రు" పదమునకు "ఇంద్రశ్చఅసౌశత్రుః" అని కర్మధారయసమాసమును జెప్పవచ్చును అప్పుడు "ఓ శత్రువైన ఇంద్రుఁడా! వర్థిల్లుము" అని యర్థము వచ్చును

ఇంద్రశత్రు పదమునకు బహువ్రీహి సమాసములో నొక స్వరము, కర్మధారయములో నొక స్వరమును వచ్చును వృత్రాసురుఁడు బహువ్రీహి పరముగానే తలఁచియు ననగా "ఇంద్రుఁడు శత్రువుగాఁగల ఓ వృత్రాసురుఁడా! వర్థిల్లుము" అనునర్థమునేకోరియుఁ బొరపాటునఁ గర్మధారయసమాస స్వరముతో నుచ్చరించెనఁట. దానివలన 'శత్రువైన ఇంద్రుఁడా! వర్థిల్లుము" అను నర్థము వచ్చినది. ఇంద్రుఁడు వర్థిల్లినాఁడు. వృత్రాసురుఁడు యుద్ధమున మరణించెను

మరొకవిధము .— శత్రుశబ్దమునకు 'శాతయితా' చంపువాఁడు అని అర్థము 'ఇంద్రశత్రు' పదము బహువ్రీహి సమాసమగుచో ఇంద్రః శత్రుః యస్యసః ఇంద్రుఁడు శత్రువుగాఁగలవాఁడు. అనగా ఇంద్రుఁడు (తన్ను) చంపువాఁడుగాఁ గలవాఁడు అని యర్థము వచ్చును ఇంద్రశత్రు పదము షష్ఠీ తత్పురుష సమాసమగుచో ఇం ద్రస్య శత్రుః అనఁగా 'ఇంద్రునిఁ జంపువాఁడు; అని యర్థము వచ్చును. బహువ్రీహిలో చంపు క్రియకు ఇంద్రుఁడు కర్త' షష్ఠీతత్పురుషములో చంపు క్రియకు ఇంద్రుఁడు కర్మ వృత్రాసురుఁడు షష్ఠీతత్పురుషార్థమునే తలఁచియుఁ దత్పురుష స్వరముతో నుచ్చరించక బహువ్రీహి స్వరముతో నుచ్చరించెనఁట. దానిచే నింద్రునిచే వృత్రాసురుఁడు చంపఁబడెను ఏ విధముగా జెప్పినను ఇంద్రశత్రు పదమునకు స్వరభేదముచే నర్థభేదము గలిగినది. దీని కాకర మిది

మంత్రో హీనః స్వరతో వర్ణతో వా
మిథ్యాప్రయుక్తో న తదర్థమాహ
స వాగ్వజ్రో యజమానం హినస్తి
యథేంద్రశత్రుః స్వరతోఽపరాధాత్ ॥

తా॥ స్వరవర్ణహీనమైన మంత్రము తన స్వాభావికార్థమును బోధింపక భిన్నార్థమును బోధించును దాన నదివిడుగై యజమానుని మొత్తును స్వరకృత మైన యపరాధమున వృత్రాసురుఁడు నశించెను.

'స్వరాదులు' అనుచోట నున్న 'ఆది' పదముచే నభినయాదులు గూడఁ దత్తదర్థమును బోధింప నభిధను నియమించును

"ఏతావన్మాత్రస్తనికా ఏతావన్మాత్రాభ్యా మక్షిపత్రాభ్యాం
ఏతావన్మాత్రావస్థా ఏతావన్మాత్రై ర్దివసైః ।

(ప్రాకృత శ్లోకమునకు ఛాయ)

తా ఇంతింత (ఔన్నత్యవర్తులములు గల) స్తనములు గల యువతి యింతింత (వైశాల్యము) కన్నులతో, ఇన్ని (సంఖ్య) దినములలో ఇట్టి (కార్శ్యము) యవస్థకు బాల్పడినది.

ఇట నభినయము "ఏతావన్మాత్ర" పదము యొక్క యాయా యర్థము లను బోధింప నభిధను నియమించును

ఈ విధముగా సంయోగాదులు వాచకమునకనేకార్థములు సంకేతము లైనపు డొక్క యర్థమును మాత్రమే బోధింప నభిధను నియమించును.

వాచకభేదములు

ఈ వాచకపదమర్థబోధకస్వభావమును బట్టి యౌగికము, రూఢము, యోగరూఢము యౌగికరూఢము అని నాలుగువిధములు వెనుక స్వరూప స్వభావమును బట్టియు నిట నర్థబోధక స్వభావమును బట్టియు భేదములు

౧ అవయవార్థమును (వ్యుత్పత్త్యర్థమును) మాత్రము బోధించు శబ్దము యౌగికము. ఉదా పాచకుఁడు పచతీతిపాచకః = వంటను జేయువాఁడు అను వ్యుత్పత్త్యర్థము మాత్రమే బోధింపఁబడును సామాన్యముగా 'వంటలవాఁడు' అనునర్థమేకానీ ఫలానా జాతివాఁడని యర్థమురాదు

౨. అవయవార్థముతోఁ బనిలేక సముదాయార్థమునే బోధించు పదము రూఢము. ఉదా॥ ఆకాశము బల్ల పుస్తకము మొ॥ ఈ పదముల కవయవార్థము లేదు. అనంతకాలమునుండి యివి రూఢిగా నొక యర్థమును బోధించుచున్నది

౩ అవయవార్థమును బోధించుచున్నను విశేషించి సముదాయార్థమునే బోధించు పదము యోగరూఢము ఉదా పంకజము ఇది పంకమువలనఁ బుట్టునది" అను నవయవార్థము బోధించుచున్నను 'పద్మము' అను నర్థమునందే రూఢమైయున్నది మిగిలిన 'నత్తగుల్ల' మొదలగు నర్థములను బోధింపదు. యౌగికార్థమును రూఢ్యర్థమును గలది యోగరూఢము

౪ యౌగికార్థమును, రూఢ్యర్థమును నీ రెండును నే శబ్దము వలన బోధింపఁబడునో యది యౌగికరూఢము, ఉదా ఉద్భిత్ (ఉద్భిదము) "ఉద్భేదించునది" అను నవయవార్థమునుబట్టి తరుగుల్మాది యనియు రూఢ్యర్థ మును బట్టి యాగవిశేషమనియు నర్థద్వితయమును నీ శబ్దము స్వతంత్రముగా

బోధించును ("ఉద్భిదా యజేత పశుకామః" అనుచోట 'ఉద్భిత్' అనఁగా యాగవిశేషము).

ఈ యౌగికరూఢమును ముక్తావళీకారుఁడు దెలిపెను. రసగంగాధరమున దీని ప్రశంస లేదు.

మఱియుఁ బదములు విచిత్రస్వభావములు గలవి. కొన్ని పదములలో నేకదేశమే యర్థమును బోధించును. ఎట్లన, భీమసేన, బలదేవ ప్రకృతిపదము లలో నాద్య మగు భీమ, బల అను నేకదేశమే యర్థమును బోధించును మతంగజ, వసుంధరా, ధరాధర ప్రకృతిపదములలోఁ జరమభాగ మగు గజ ధరా, ధర ప్రకృతిపదములే యర్థమును బోధించును ఇట నేకదేశశ్రవణముచేతనే యర్థస్ఫూర్తి గలుగుచున్నది మఱియు అపాంసుల (పాంసులగానిది) అనింది తుఁడు (నిందితుడు గానివాఁడు) మొదలగు పదములందలి 'ప్రతిషేధ' ముత్కృష్ట మగు నితరార్థమును సంపాదించును పాంసుల = కులట అపాంసుల = పతి వ్రత; నిందితుఁడు = దూషితుఁడు; అనిందితుఁడు = పూజితుఁడు మొ॥ అనుష్ణ, శీతేతరప్రకృతి పదములు ప్రతిద్వంద్వి యగు నర్థమును బోధించును అనుష్ణము = శీతము శీతేతరము = ఉష్ణము మొ, ఒకానొకపదము రూఢ్యర్థము నపేక్షింపదు. అనఁగా నా పదము రూఢమైనను రూఢ్యర్థము నపేక్షింపక యౌగి కార్థమును నపేక్షించును "సింహాదవాపద్విపదం నృసింహః" నృసింహుఁడను రాజు సింహము (క్రూరజంతువు) వలన విపత్తినిఁ బొందెను. సింహ' శబ్దమునకు "హీన స్త్రీతి సింహః" అని యౌగికార్థము. కాని యిది హర్యక్షము నందు రూఢమై యున్నది కాని, యిట రూఢ్యర్థముగాక, యౌగికార్థమగు చంపునది (హీనస్తీసింహః) అనునర్థమే (యనఁగాఁ గ్రూరజంతువనునర్థము) యపేక్షితమై యున్నది. కొన్ని పదములకు యోగికార్థ మనపేక్షితమైయున్నది. 'క్షీరాంబోధి క్షీరాబ్ధి ఇట అంబోధి' అబ్ధిపదములకు యౌగికార్థము నపేక్షింప రాదు 'వామ' శబ్దమును వామనయనా, వామోరూ అనునెడలనే ప్రయోగింప వలెను కాని వామవదనా వామపాణి మొదలగు విధమునఁ బ్రయోగింపరాదు.

నరసభూపాలీయకర్త ప్రతాపరుద్రీయము ననుసరించి యోగమూలాభిధ రూఢిమూలాభిధ అను రెంటినే యనఁగా యౌగికములు రూఢములు అను రెండు భేదములనే చూపెను కాని యీ నాలుగుభేదములును దెలియఁదగినని, కానఁ దెలిపితిమి.

౧. యోగమూలాభిధ కుదాహరణము —

చ. అలఘుబలాభిరాముఁ డగు నౌబళరాజనృసింహమేదినీ
తలబల వైరి దానజలధారల నిచ్చుటఁ దేలి తేలి త

ద్గళితవిరోధిశోణితనదమ్ముల నిమ్ములఁ గూడి కూడి యా
జలధులు వాహినీశులనఁ జాలఁ జెలంగుఁ బయోనిధానముల్.

ఇందలి బలవైరి వాహినీశులు అనువానికిఁ గేవలవ్యుత్పత్త్యర్థములను బట్టి ఇంద్రుఁడు సముద్రుఁడునని యర్థము ఇవి యౌగికములు.

ఈ యోగమూలాభిధకు యోగపూర్వాభిధ యనియు నామాంతరము. అనఁగా యౌగికార్థమును బోధించు శబ్దశక్తి యని భావము ఇట్లనుటకన్న యౌగికవాచకమున కుదాహరణమన్నచో విస్పష్టముగా నుండును

౨ రూఢిమూలాభిధ కుదాహరణము

కం. కులమణియై బలవద్రిపు
కులగిరికులిశంబు నై యకుంఠితధర్మా
కలనకలాలాలసుఁ డయి
వెలయు న్నరసింహవిభుఁడు విశ్వోన్నతుఁడై. ౫౬

ఇటఁ గుల మణి, రిపు గిరి కులిశాదిపదము లన్నియు రూఢములే. వీని శక్తి రూఢిమూలాభిధ ఈ పదములు రూఢములు.

పై పద్యమునందలి జలధిపదము యోగరూఢము దానపదము ఈవి-ఖండనము అను నర్థద్వయమునందును ప్రసిద్ధముగాన యౌగికరూఢము

లక్షణావృత్తి

గీ. ఇంక లక్షణ వివరింతు; నిదియు గౌణ
వృత్తియు నభిన్నమై పొల్పు, నెట్లఁటన్న
'శోణిసురుఁడగ్ని' యనునెడ శుచిగుణంబు
వాచ్యవిభవాభిభావి యై వరలు కతన. ౫౭

ఇఁక లక్షణను వివరింతును గౌణవృత్తియు లక్షణయు నొక్కటే· భేదము లేదు. 'గౌణవృత్తి రపి లక్షణాప్రభేద ఏవ" అని ప్రతాపరుద్రీయము· (కాని ప్రాభాకరు లను నొక పూర్వమీమాంసకశాఖీయులు గౌణవృత్తియును లక్షణయును భిన్నమే యని చెప్పుదురు) ఎట్లన "బ్రాహ్మణుఁడగ్ని" అన్నపుడు "గంగాయాంఘోషః" (గంగలో గొల్లపల్లె) అనుచోట గొల్లపల్లె యందు శీతత్వ పావనత్వాదు లెట్లు వాచ్యముగాఁ గాక వ్యంగ్యముగా శోభిల్లునో యట్లే యగ్నిగతశుచిగుణము (పరిశుద్ధత యను గుణము) బ్రాహ్మణునియందు వాచ్యముగాఁగాక (వాచ్యమును దిరస్కరించి) వ్యంగ్యరూపమున శోభిలుచున్నది

ఇట "గౌణవృత్తి లక్షణాప్రభేదమే" యని చెప్పుటకు గ్రంథకర్త యిచ్చిన 'శుచిగుణంబు వాచ్యవిభవాభిభావి యై వరలుకతన అను కారణము సూటిగా లేదు. క్లిష్టముగా నున్నది ప్రతాపరుద్రీయములో 'గౌణవృత్తిరపి లక్షణాప్రభేదఏ సంబంధానుపపత్తి మూలకత్వాత్ యథాగ్నిర్మాణవక ఇత్యత్ర అగ్నిసాదృశ్యవిశిష్టమాణవకప్రతిపత్తిర్వివక్షితా తథైవ గంగాయాం ఘోషః ఇత్యత్ర గంగాసంబంధవిశిష్టతీరప్రతిపత్తిర్వివక్షితా" (గౌణవృత్తి లక్షణలో నొకభాగమే 'గంగాయాం ఘోషః అనుచోట ముఖ్యార్థానుపపత్తి గలిగినట్లే "అగ్నిర్మాణవకః" అనుచోటఁగూడ ముఖ్యార్థానుపపత్తిగలుగుచున్నది. కాన సంబంధానుపపత్తి రెంటను సమానము. మఱియు గంగాయాం ఘోషః అనుచోట గంగాసంబంధమగు తీరమను నర్థము వివక్షితమైనట్లే "యగ్ని సదృశమాణవకుఁడు అనునర్థము వివక్షితము" అని కలదు. కాన గౌణవృత్తి, లక్షణలకభేదమును బ్రస్తావించునపుడు 'సంబంధానుపపత్తిని గారణముగాఁ దెలుపవలెను "శుచి గణంబు.. వరలుకతన" ఇత్యాదికమగు వచనముచే గౌణవృత్తిలక్షణలెట్లభిన్నములో నిస్సందిగ్ధముగా గోచరింపవు.

ఇట మొదట లక్షణ' యననేమో తెలుపక 'గౌణవృత్తి లక్షణాప్రభేదమే' అని చెప్పుట యుక్తముగాదు.

కం. బంధుర యగు లక్షణ, సం
బంధానుపపత్తి మూలభావన, నది సం
బంధ నిబంధన, సామ్యని
బంధన యని రెండుగతులఁ బరగుచునుండున్. ౫౯

ఆ సంబంధానుపపత్తి వలన లక్షణ యేర్పడును అది సంబంధ నిబంధన సామ్యనిబంధన యని ద్వివిధము నిబంధనమనఁగా మూలము. సంబంధమూలకమగు లక్షణ యనియు సామ్యమూలకమగు లక్షణ యనియు నని భావము. "సంబంధానుపపత్తి వలన లక్షణ యేర్పడును" అను లక్షణ మసమగ్రము కావ్యప్రకాశమున—

"ముఖ్యార్థబాధే తద్యోగే రూఢితోఽథ ప్రయోజనాత్"

అని లక్షణము చెప్పఁబడినది దీని వివరణ మిది.—

ముఖ్యార్థమునకు బాధ కలుగఁగా రూఢినిఁబట్టి కాని ప్రయోజనమును బట్టి కాని ముఖ్యార్థముతో సంబంధముగల వేఱొకయర్థమును లోకమునందలి రూఢినిఁబట్టి కాని లేక యొకానొక ప్రయోజనమునుబట్టి కాని స్ఫురింపఁజేయు శబ్దశక్తి లక్షణ వాచ్యార్థసంబంధము లేని లక్షణ యుండదు. అనఁగా వాచ్యార్థ

మునకు క్రొత్తగా నెట్టి సంబంధమును లేని లక్షణ యుదండు "గంగలో గొల్లపల్లె" అనుదానికి "కొండమీఁదికోఁతి" అనునది లక్ష్యార్థమై యుండదు. ఇందు గమనింపవలసిన ముఖ్యవిషయములు మూఁడు. ౧ ముఖ్యార్థమున కనుపపత్తి ౨. దాని సంబంధము ౩ వేఱొకయర్థమును జెప్పుకొనుటకు రూఢికానీ ప్రయోజనముకానీ యుండుట.

చూడుఁడు "గంగాయాం ఘోషః" అను నుదాహరణముఁ దీసికొందము. "గంగలో గొల్లపల్లె" (ఉన్నది) అనునర్థము పొసగదు ఏలన, గంగలో గొల్లపల్లె యుండదు కాన వాచ్యార్థమునకనుపపత్తి గలిగినది కాఁబట్టి దాని సంబంధముగల వేఱొకయర్థమును జెప్పుకొనవలెను. 'గంగాయాం' అనుదానికి 'గంగలో' అనునర్థము గాక గంగాతీరమున అనునర్థమును జెప్పుకొందుమేని నర్థము సరిపడును అయితే యీ యర్థమును జెప్పుకొనుటకు లోకమున గంగాయాం' అనఁగా గంగాతీరమున అని రూఢ్యర్థమైన నుండవలెను. లేదా? ఏదేనిఁ బ్రయోజనమైన నుండవలెను ఇట లోకరూఢి లేదు ఇఁకఁ బ్రయోజన ముండవలయును "గంగాతీరమున" అని జెప్పుటవలన గంగలోని శీతత్వ పావనత్వాదులు గొల్లపల్లెలోఁగూడఁ గలవు అనునర్థము స్ఫురించుటయే ప్రయోజనము ఈ ప్రయోజనము "గంగాయాం ఘోషః" అని వాచ్యార్థా నుపపత్తితోఁజెప్పుటవలన భాసిల్లునట్లు "గంగాతీరే ఘోషః" అని చెప్పినను భాసిల్లదు కాన నిటఁ బ్రయోజనమునుబట్టి గంగాశబ్దమునకు 'గంగాతీరము' అని నర్థమును జెప్పుకొనవలెను ఈ యర్థమును బోధించుశక్తియే లక్షణ.

ఇట్టివే సామాన్యముగా వ్యవహారములోఁ బెక్కుప్రయోగములు గనఁబడు చున్నవి. 'మా యిల్లు రోడ్డుమీఁదనే యున్నది' అందుము ఇట నిల్లు రోడ్డుమీఁద లేదు కావున ముఖ్యార్థానుపపత్తి యేర్పడినది. 'రోడ్డుప్రక్కనే యున్నది' అని వాచ్యార్థసంబంధము గల వేఱొకయర్థమును జెప్పుకొనుచున్నాము ఇట "మా యిల్లు విస్పష్టముగా నెల్లరకును గోచరించును" అనునది ప్రయోజనము. మా యిల్లు రోడ్డుమీఁదనే యున్నదని చెప్పుటవలన నీ ప్రయోజనము భాసిల్లునట్లు 'మా యిల్లు రోడ్డుప్రక్కనే యున్నది అని చెప్పినను భాసిల్లదు ఇదియే సంబంధనిబంధన. అనఁగా వాచ్యార్థసంబంధము గల లక్షణ

'బ్రాహ్మణుఁడగ్ని' అను వాక్యముగలదు బ్రాహ్మణుఁడగ్నియగునా? కాదు వాచ్యార్థానుపపత్తి యేర్పడినది కాన దానిసంబంధము గల వేఱొక యర్థమును జెప్పుకొనవలెను అగ్నియందుఁగల శుచిగుణము' బ్రాహ్మణుని యందుఁగూడ నుండుటచే 'అగ్నిసదృశుఁడు బ్రాహ్మణుఁడు అను నర్థమును జెప్పుదుము దీనికిఁ బ్రయోజనముగాని రూఢిగాని యుండవలెను. 'బ్రాహ్మణుఁ డగ్ని యను రూఢి లేదు అగ్నియందున్న శుచిత్వపవిత్రత్వాదులు బ్రాహ్మణుని

యందు గోచరించుటయే ప్రయోజనము 'అగ్నిసదృశుఁడు బ్రాహ్మణుఁడు' అని చెప్పినను 'బ్రాహ్మణుఁడగ్ని అని చెప్పుటవలన నా ప్రయోజనము గోచరించినట్లు గోచరింపదు ఇట్టిదే 'ఆమె రంభ', 'అతఁడు హరిశ్చంద్రుఁడు' మొదలగునవియు సామ్యనిబంధనాలక్షణలు

సంబంధనిబంధనా సామ్యనిబంధనాలక్షణములలోఁ బ్రయోజనమున కుదాహరణములు చూపితిమి. రూఢికుదాహరణములిటఁ జూపుచున్నాము

'వాఁడు పనిలోఁ గుశలుఁడు' లోకమునఁ 'గుశల' శబ్దమునకును గుశలను గ్రహించువాఁడు (కుశాన్ లాతీతి కుశలః) అని వ్యుత్పత్త్యర్థము అదియే ముఖ్యార్థము కుశలను గోయుట గ్రహించుట మొదలగు పనులు క్లేశావహములు. ఒకప్పుడు వ్రేళ్ళు చీల్చుకొనిపోవును కాన నట్లు చీల్చుకొనిపోకుండ నేర్పుగాఁ గుశలను గ్రహించువాఁడు కుశలుఁడు "వాఁడు పనిలోఁ గుశలుఁడు" అన్నపు డీ వాక్యార్థము పొసగదు. కాన లోకరూఢినిఁబట్టి కుశలపద మిచ్చట 'దక్షుఁడు లేక నేర్పరి అను నర్థమును బోధించుచున్నది. ఇది సంబంధనిబంధనా లక్షణారూఢి కుదాహరణము

'తైల పదమునకు "తిలలనుండి పుట్టిన చమురు" అనునర్థము ముఖ్యార్థము హేరండతైలము సర్షపతైలము అనియు నితర పదార్థములనుండి తీసిన చమురునకుఁగూడ సాదృశ్యమును బట్టి తైలశబ్దము లోకమున వ్యవహరింపఁబడుచున్నది కాన తైల' శబ్దము సామ్యనిబంధనాలక్షణారూఢికుదాహరణము.

రూఢినిఁబట్టి యేర్పడిన లక్షణ 'నిరూఢలక్షణ యందురు.

గీ. అందు జహదభిధేయము, నజహదర్థ
యనఁగ సంబంధలక్షణ యలరు, సామ్య
గుణనిబంధన కాను ద్వైగుణ్య మొందు
జగతి సారోప, సాధ్యవసాయ యనఁగ. ౬౦

ఈ సంబంధనిబంధనాలక్షణ జహదభిధేయ లేక జహద్వాచ్య లేక జహల్లక్షణ యనియు అజహదర్థ లేక అజహదభిధేయ లేక అజహద్వాచ్య లేక అజహల్లక్షణయనియును ద్వివిధము (వీని వివరణము ముందుచేయుదుము) సామ్యగుణనిబంధనాలక్షణ సారోప, సాధ్యవసాయ యనియు నిరుదెఱఁగులు.

(ఇట సామ్యగుణనిబంధన యనుటకన్న గుణసామ్యనిబంధనయనుట లెస్స).

సీ. అల 'గంగలోఘోష' మనునెడ 'గంగా' ప
దంబు సంబంధి యౌ తటముఁ దెల్పు

సంబంధలక్షణ జహదర్థ యగు, నట్లె
'మంచె మ్రోసె, నఁటన్న 'మంచగతులు'
దోఁచుఁ, "గోదండపంక్తులు వచ్చె" నన విండ్ల
నమరు యోధులు దోఁప నజహదర్థ
'యవనిపాలుఁడు సింహ' మనువేళ సదృశతా
గుణసిద్ధి సామ్యలక్షణ' చెలంగు

గీ. అందు నుపమాన, ముపమేయ మప్రభిన్న
మైన 'సారోప' యుపమానమగదితోప
మేయ మైయున్న 'సాధ్యవసాయ' యట్టి
లక్షణల కన్నిఁటి కొనర్తు లక్ష్యములను. ౬౧

తా॥ 'గంగలో గొల్లపల్లె' యనుచోట గంగాపదము స్వార్థమునుద్యజించి తన సంబంధియగు తీరమును దెలుపుచున్నది అనఁగా గంగాపదము తన 'ప్రవాహ' మను నర్థమును విడిచి తీరము' అను నర్థమును గ్రహించినది. (గంగాయాం అన గంగాతీరము అని యర్థము) కాన జహల్లక్షణ - (జహత్ = స్వార్థమును విడుచుచున్న లక్షణ) ఇట్లే మంచెలుమ్రోసె' (మంచాః క్రోశంతి) అనుచోట మ్రోయుట యను వ్యాపారము చేతనధర్మము అచేతనములగు మంచెలెట్లు మ్రోయును? కాన 'మంచెలు అను శబ్దము స్వార్థమగు మంచములు' అనునర్థమును విడిచి మంచగతులు అను నర్థమును గ్రహించినది అనఁగా "మంచముపైనున్నవారఱచిరి" అనునర్థము వచ్చును ఇటఁగూడ స్వార్థము విడువఁబడినది. ఇదియు జహల్లక్షణమే

మూలమున 'మంచెమ్రోసె' అని యున్నను "మంచాః క్రోశంతి" సంస్కృతవాక్యము నాంధ్రీకరించుపట్ల గ్రంథకర్త గణభంగమునకు వెఱచి యేకవచనప్రయోగము సేసెను కాని నేను బహువచన రూపమును గ్రహించి వివరించితిని

ఇఁకఁ "గోదండపంక్తులువచ్చె" నన్నచోటఁ గోదండపంక్తులచేతనములు గదా? అవి స్వయముగా నెట్లు వచ్చును? కానఁ "గోదండధరులు" అను నర్థమును జెప్పుకొనవలెను ఇటఁ గోదండధరులతోపాటు గోదండములుగూడ వచ్చినవి వెనుక 'మంచెలుమ్రోసె ననుచోట మంచగతులతోపాటు మంచము లఱవలేదు. కాని గోదండపంక్తులు ననుచోట స్వార్థము విడువఁబడలేదు, ఇది యజహల్లక్షణ (అజహత్ = స్వార్థమును విడువని లక్షణ) కుంతములు

ప్రవేశించుచున్నవి అనుచోటఁగూడ నిట్లే గ్రహింపవలయును

'గంగాయాంఘోషః' అనునెడ వాక్యతాత్పర్యములో 'గంగాయాం' అను ప్రవాహరూప వాచ్యార్థమునకుఁ బ్రవేశము లేదు లక్ష్యార్థమగు తీర పదమునకు మాత్రమే ప్రవేశము గలదు. మంచెలు మ్రోసె' ననుచోటఁగూడ వాక్యతాత్పర్యమున 'మంచగతులు అను లక్ష్యార్థమునకే ప్రవేశము గలదు. కాని 'మంచములు' అను వాచ్యార్థమునకుఁ బ్రవేశములేదు. కోదండపంక్తులు వచ్చె నన్నచోట వాక్యతాత్పర్యములోఁ గోదండధరులతోపాటు కోదండములకుఁగూడఁ బ్రవేశము గలదు. ఎట్లనఁ గోదండములు లేక కోదండధరు లెట్లు వత్తురు? అనఁగా నిట లక్ష్యార్థమగు కోదండధరులు అనుదానిలో వాచ్యార్థమగు "కోదండములు" అనుదానికిని వాక్యతాత్పర్యమునఁ బ్రవేశము గలదు. కావున, నే వాక్యతాత్పర్యమున వాచ్యార్థమునకు బొత్తుగాఁ బ్రవేశముండదో యది జహల్లక్షణ ఏ వాక్యతాత్పర్యమున లక్ష్యార్థముతోఁగూడ వాచ్యార్థమునకుఁ బ్రవేశముండునో యది యజహల్లక్షణ. జహల్లక్షణకు లక్షణలక్షణ యనియు, అజహల్లక్షణకు ఉపాదానలక్షణ యనియు నామాంతరములు ఇవి సంబంధ నిబంధనా లక్షణలు

"అవనిపాలుఁడు సింహము" అనుచోట సింహగతములగు శౌర్యాది గుణములు రాజునందుఁగూడ గోచరించుచున్నవి. ఇందుపమేయమగు నవనిపాలుడు అను పదమును ఉపమానమగు సింహపదమును వాక్యమునఁ బ్రత్యేకముగాఁ బ్రయోగింపఁబడి యున్నవి కాన నిది సారోపలక్షణ, ఉపమేయమును జెప్పక యుపమానమును మాత్రమే చెప్పినచో నది సాధ్యవసాయలక్షణ. ఒకరిని గూర్చి వర్ణించుచు "సింహము వచ్చె" నన్నచో నది సాధ్యవసాయలక్షణ. ఏలన సింహము వచ్చె నన్నచో నుపమానమగు సింహపదమేకానీ వర్ణ్యుఁడగు వానిని బోధించు పదము ప్రయోగింపఁబడలేదుగదా! ఇందు సింహమునకును వర్ణ్యుఁడగు రామునకును నభేదప్రతిపత్తి తోఁచును.

ఇవి రెండును సామ్యనిబంధనాలక్షణలు. (సదృశతాగుణసిద్ధి యనుటకన్న 'గుణసదృశతాసిద్ధి' అనుట లెస్స)

ఇచట గంగలో గొల్లపల్లె మంచెలు మ్రోసె, అవనిపాలుఁడు సింహము; సింహమువచ్చె' అను నుదాహరణములను జహదజహల్లక్షణా ప్రభేదముల కిచ్చియు, నందు నరసభూపాలప్రశంస లేదనికాఁబోలు నరసభూపాలప్రశంస గల పద్యముల నిచ్చుచున్నాఁడు

జహల్లక్షణ

చ అగణితశౌర్యధైర్యవిభవాన్విత. యోబయనారసింహా! నీ
గగనచరామరాగ, శిబి, కర్ణ, జగన్నోన్నతదానలక్ష్మికిన్

జగములు సంతసిల్లె; నతిసాంద్ర భవజ్జయ భేరిభాంకృతి
ద్విగుణితసైన్యఘోషముల వేవడఁకెన్ రిపుపట్టణావళుల్.

తా. ఓ నరసభూపాలా కల్పవృక్షమును కిటిని గర్జుని జయించిన నీ దానలక్ష్మికి లోకములు సంతసిల్లె మిక్కిలి దట్టమైన నీ జయభేరి యొక్క భాంకారములచే నిబ్బడిగా మ్రోయుచున్న సైన్యఘోషములచే శత్రుపట్టణములు వడఁకెను

ఇట 'జగములు సంతసిల్లె' అనుచోట నచేతనములగు జగము లెట్లు సంతసించును? కాన జగములు అను పదము స్వార్థమును విడిచి జనులు అను నర్థమును గ్రహించెను. ఇట్లే రిపుపట్టణావళులు వడఁకెను అనుచోటఁ గూడ నచేతనములయిన పట్టణములు వడఁకవు కాన నిటఁ 'పట్టణ పదము స్వార్థమగు 'నగర మను నర్థమును విడిచి 'పట్టణవాసులు అనునర్థమును గ్రహించెను అపుడర్థము సరిపడును ఇట స్వార్థమును విడచుటచే జహల్లక్షణ

అజహల్లక్షణ

కం. అసమరణరంగమున నీ
యసినటి నటియింపఁ గరుల, హరులన్, సిరులన్
పెస నొసఁగు నౌర! యెంతటి
రసికుఁడు నీ వైరి! యోబరాజనృసింహా! ౬౩

అసినటి నటియింప (పా) అసి నటియింపంగ.

ఓ నరసభూపాలా! రణరంగమున నీ యసిరూపయగు నటి నటింపఁగా నీ శత్రువు దాని నాట్యమునకు మెచ్చుకొన్నట్లు గజతురగములను సంపదలను సమర్పించుచున్నాఁడు (ఇదియే పద్యము వ్యాజస్తుత్యలంకారమున కుదాహరణముగాఁ గూడ నీయఁబడినది).

ఇట 'ఒసఁగు' అనఁగా 'సమర్పించుట అనునది వాచ్యార్థము ఈ యర్థమిటఁ బొసగదు ఏలన శత్రురాజు స్వయముగాఁ దన సంపదలను సమర్పింపఁడు. కాఁబట్టి "ఉపహారరూపమున సమర్పించుచున్నాఁడు" అను లక్ష్యార్థమును బోధించును ఇట వాచ్యార్థమగు 'సమర్పణము' అనునర్థము విడువఁబడకయే లక్ష్యార్థముతోపాటు వాక్యతాత్పర్యమునఁ బ్రవేశించినది కాన నజహల్లక్షణ.

వేదాంతులు జహదజహల్లక్షణ యను నొక లక్షణను స్వీకరించిరి. దీనికి సారస్వతమునఁ బ్రయోగములేదు.

సారోపలక్షణ

మ. అమరద్వీపవతీఝరాంతరములం దారూఢి నీలాంబుపూ
రము సూర్యాత్మజగాఁ దలంచదు రసారప్రౌఢి మైఁ గొందఱు
ద్యమతేజోఽధిక! నారసింహ. భవదుద్యత్కీర్తి నిర్ఘాతసం
భ్రమయౌగంగ యకీర్తిఁదాల్చెనని నే భావింతుఁ జిత్తంబునన్.

అసారప్రౌఢి (పా) అపార ప్రౌఢి

తా గంగానదిలో నున్న నల్లని ప్రవాహమును యమునగాఁ గొంద ఱసమర్థులు దలంతురు. ఓ నరసభూపాలా! నీ కీర్తిచేఁ దనగర్వమును గోలుపోయి గంగ యపకీర్తి ధరించెనని నేఁ దలంతును

ఇట "యమున యపకీర్తి" అనునెడ యమున యపకీర్తిగా నారోపింపఁబడెను. ఇట నుపమానోపమేయములు (యమున-అపకీర్తి) భిన్నభిన్నములుగాఁ గనఁబడుచుండుటచే ననఁగా బ్రయోగింపఁబడుటచే సారోపలక్షణ.

సాధ్యవసాయలక్షణ

కం. నిరతబుధ ప్రహ్లాదా
దరకరుఁడు, హిరణ్యకశిపుదావోన్నతుఁ డై
ధరఁ బోచిరాజవంశ
స్థిరరత్నస్తంభమున నృసింహుఁడు పుట్టెన్. ౬౫

ఇట నరసభూపాలుఁడను నృసింహుఁడు పుట్టెన్' అని చెప్పినచో నుపమానోపమేయములు రెండును బ్రత్యేకముగాఁ బ్రయుక్తములై కనఁబడుచుండెడివి. కాని నృసింహుఁడు పుట్టెన్' అని చెప్పుటవలన నుపమాన మొక్కటియే గ్రహింపఁబడుటచే సాధ్యవసాయలక్షణ.

ఇటఁ జెప్పఁబడిన లక్షణాప్రభేదములేకాక మఱి రెండు భేదములు గూడఁ గలవు. వాని నిట నుదాహరింతును

లక్షితలక్షణ

లక్షితలక్షణ యనఁగా వాచ్యార్థానుపపత్తి కలుగఁగా వాచ్యార్థమునకు సాక్షాత్తుగా సంబధించిన యర్థము గాక పరంపరగా సంబంధించిన వేఱొక యర్థమును దోఁపించు శబ్దశక్తి

'ద్విరేఫ' పదమునకు రెండు రేఫలు గలది (ద్వౌరేఫౌయస్యసః) యని వ్యుత్పత్త్యర్థము రేఫ మొక యక్షరము గాన లోకములో రెండు రేఫలు గలది యేదేని శబ్దమగును. అక్షరములు పదముల కవయవములుగాని తత్ప్రదబోధక వ్యక్తులకవయవములు గావుగదా ! కావున వాచ్యార్థానుపపత్తి యేర్పడినది. అపు డీ ద్విరేఫ పదము రూఢినిఁబట్టి రెండు రేఫాక్షరములు గల 'భ్రమర' పదమును బోధించును 'భ్రమర పదమునకు 'దుమ్మెద' యని యర్థము. ఇట 'ద్విరేఫ పదము భ్రమర పదమును బోధించును భ్రమర పదము తుమ్మెదను బోధించును కాన ద్విరేఫమనఁగాఁ 'దుమ్మెద యని యర్థము

'గంగాయాం ఘోషః' అన్నచోట గంగాపదము తనతో సాక్షాత్సంబంధము గల తీర' శబ్దమును బోధించుచున్నది ఇట ద్విరేఫ పదము పరంపరాసంబంధముచేఁ దుమ్మెదను బోధించుచున్నది

ఇట్లే 'రోదర' శబ్దము (రః ఉదరే యస్యసః రోదరః) చక్రశబ్దమును బోధించును చక్రశబ్దము చక్రవాకమును బోధించును కాఁబట్టి రోదర శబ్దమునకుఁ జక్రవాకమని యర్థము. ఇటఁగూడఁబై నివలెనే వాచ్యార్థమునకుఁ బరంపరా సంబంధము గలదుగదా !

ఇట్టి లక్షితలక్షణాశబ్దములు లోకములో నతిప్రయుక్తములుగా (సుప్రసిద్ధముగా నున్నవానినే ప్రయోగింపవలెను కాని యనతిప్రయుక్తములను బ్రయోగింపరాదు ఎట్లన 'ద్వికము (రెండు క' వర్ణములు గలది ద్వికము) కాకపదమున రెండు కవర్ణములు గలవు కాన 'ద్విక పదము 'కాక' పదమును, 'కాక' పదము కాకిని బోధించునని చెప్పరాదు. ఏలన ద్విరేఫ, రోదర శబ్దములవలె 'ద్విక' శబ్ద మతిప్రయుక్తము గాదు

విపరీతలక్షణ

వాచ్యార్థానుపపత్తి వలన నెచ్చట శబ్దమునకు విరుద్ధార్థము స్ఫురించునో యా శబ్దశక్తి విపరీతలక్షణ. "వీఁడు బృహస్పతి" (బృహస్పతి రయం) ఇది యొక పామరునిఁగూర్చి చేయఁబడిన ప్రయోగము ఇట వాచ్యార్థానుపపత్తి యేర్పడినది ఆ వాచ్యార్థమునకు విరుద్ధముగా 'మూర్ఖుఁడు' అను నర్థము స్ఫురించును కొందఱు దీనిని జహల్లక్షణ యందురు. ఏలన బృహస్పతి పదము స్వార్థమును ద్యజించినదికదా !

న్యాయముగా విచారింప లక్షణాశక్తి యర్థశక్తి గాని శబ్దశక్తి గాదు. ఏలన "స్వార్థమును బోధించి శబ్దము తన యభిధావ్యాపారమును ముగించిన పిమ్మట నా శబ్దమునకు మఱొక వ్యాపార మంటఁగట్టుట న్యాయముగాదు. ఇట నర్థము సరిపడకున్నది కాన మఱొకవిధముగా నా యర్థమును సరిపెట్టుకొనుచున్నాము. కాన లక్షణాశక్తి యర్థశక్తియే కాని శబ్దశక్తి గాదు" అని

యాక్షేపము గలదు కాను నిజమే; ఇట నర్థధర్మమును శబ్దమునందారోపించి శబ్దవృత్తి యని యౌపచారికముగా వ్యవహరించుచున్నారు.

ఈ లక్షణను అంగ్లమున Epithet అందురు సాదృశ్యసంబంధ లక్షణ Transferred epithet అనియు సంబంధలక్షణ Synecdoche అనియు, Metonomy అనియు నందు వ్యవహరింపఁబడును కాని, వారు వీని నలంకార ములుగా గణింతురు. మనవారు లక్షణ యను శబ్దశక్తిగా గణింతురు

వ్యంజనావృత్తి

కం. సంగతము లగు పదార్థము
లం గల వాక్యార్థమున కలంకారం బై
రం గగు నర్థాంతర మర
యం గావ్యము లందు వ్యంజనాఖ్య చెలంగున్. ౬౬

తా పదముల యొక్క యర్థమనుకూలముగాఁ బొసఁగినపిమ్మట నా వాక్యార్థమునకు శోభాహేతువగు నర్థాంతరము కావ్యములందు వ్యంజన యనఁ బడును

ఇట నర్థాంతరము వ్యంజన యనుట దోషము. అర్థాంతరమునుదోఁపించు శబ్దశక్తి వ్యంజన యని యుండవలయును.

కం. ప్రకృతోపపన్న కభిధకుఁ
బ్రకృతానుపపత్తిగోచరకు లక్షణకున్
బ్రకటితవిభేద వ్యంజన
ప్రకృతాప్రకృతోపపత్తిఁ బరగెడు శతనన్. ౬౭

తా॥ అభిధాశక్తి ప్రకృతార్థోపపత్తిని మాత్రమే కలిగించును అనఁగాఁ బ్రాకరణికార్థమును మాత్రము బోధించును. లక్షణాశక్తి ప్రకృతార్థమున కనుపపత్తి గలిగినపుడు వాచ్యార్థసంబంధముగల వేఱొక యర్థమును బోధించి ముగియును ప్రాకరణికార్థము ముగిసినపిమ్మట నప్రాకరణికార్థమును బోధించు శక్తి వ్యంజన కాన వ్యంజనాశక్తి అభిధాలక్షణా శక్తులకంటె విలక్షణమైనది ఇది వానిలోఁ జేరదు.

వ్యంజనావృత్తిని గుఱించి చాల విషయమును దెలిసికొనవలెను. ఏమన దీనినిఁ బ్రప్రథమున నానందవర్ధనాచార్యులవారు క్రొత్తగా సారస్వతరంగ మునకుఁ దెచ్చిరి. వారికిముందున్న వైయాకరణులు, తార్కికులు, మీమాంస

కులు మొదలగువారు శబ్దము యొక్క యర్థబోధక శక్తిని గుఱించి లెస్సగా విచారణలు సాఁగించి శబ్దమునకు అభిధా లక్షణాశక్తు లను రెండు శక్తులు మాత్రమే కలవని నిర్ణయించిరి. వ్యంజనావృత్తి నెవ్వరును దెలుపరైరి. శ్రీ శంకరాచార్యులవారు క్రొత్తగా జహదజహల్లక్షణను స్వీకరించిన విధమున నానందవర్ధనాచార్యులవారును గ్రొత్తగా దీనిని స్వీకరించి సాహిత్యక్షేత్రమునఁ బాఁతిరి దీనిని వారు సమర్థించుపట్ల చూపిన పాండిత్యమునకు మేరలు లేవు.

శబ్దమున నున్న యర్థాంతరమును బోధించు శక్తి వ్యంజన యనియు నా యర్థాంతరము వ్యంగ్య మనియు, శబ్దము వ్యంజక మనియు మున్నే తెలుపఁబడినది కదా!

ఆనందవర్ధనుఁడు ధ్వన్యాలోకము యొక్క యారంభమున,

శ్లో॥ "కావ్యస్యాత్మా ధ్వని రితి బుధైర్య స్సమామ్నాతపూర్వ
స్తస్యాభావం జగదురపరే భాక్తమాహు స్త మన్యే
కేచిద్వాచాం స్థితమవిషయే తత్త్వమూచు స్తదీయం
తేన బ్రూమ స్సహృదయమనఃప్రీతయే తత్స్వరూపమ్'.

తా పూర్వవిద్వాంసులు కావ్యాత్మ ధ్వని యనిరి కొందఱది లేదందురు. కొందఱది లక్షణాంతర్గతమే యందురు కొందఱది వాచామగోచర మందురు కాన సహృదయమనఃప్రీతికై దాని తత్త్వమును నిరూపింతుము" అని నుడివెను. దీనినిఁబట్టి యా ధ్వనిసిద్ధాంత మానందవర్ధనునికి ముందే యున్నదనియుఁ బండితులలోనే దీనినిఁగూర్చి వాగ్వాదములు జరుగుచున్నవనియుఁ దేలుచున్నది. ఆనందవర్ధనునికిముం దీ ధ్వని సిద్ధాంతము యొక్క స్వరూపస్వభావములను హేతువాదపురస్సరముగా నిర్ణయించి స్థిరపఱచినవారు లేరు. ఆ ప్రతిభాశాలి యానందవర్ధనుఁడే కావుననే—

ధ్వనినాఽతిగభీరేణ కావ్యతత్త్వనివేశినా
ఆనందవర్ధనః కస్య నాఽ సీ దానందవర్ధనః?

అతిగంభీరమై కావ్యతత్త్వనివిష్టమైన ధ్వనిచేత ననఁగా నట్టి ధ్వని యొక్క స్వరూపస్వభావములు నిరూపించుటచేత 'నానందవర్ధనుఁ డెవరి కానందవర్ధనుఁడు గాఁడు? అని శ్లాఘింపఁబడెను మఱియుఁ దానే

"సత్కావ్యతత్త్వవిషయం స్ఫురితప్రసుప్త
కల్పం మనస్సు పరిపక్వధియాం యదాసీత్
తద్వ్యాకరో త్సహృదయోదయలాభహేతో
రానందవర్ధన ఇతి ప్రథితాభిధానః".

పరిపక్వబుద్ధిగల పండితుల మనస్సులందు స్ఫురితప్రసుప్తకల్పముగా (vague) నున్న సత్కావ్యతత్త్వమును సహృదయానందమునకై యానందవర్ధనుఁడు వ్యాఖ్యానించి చెప్పెను—అనియును జెప్పుకొనెను.

అతని తరువాత వచ్చిన మమ్మట విశ్వనాథ, జగన్నాథాది మహామహా పండితులును నానందవర్ధనుని సిద్ధాంతమును శిరసావహించిరి పై శ్లోకమున ధ్వని లేనేలేదని కొందఱు నొడివిరని చెప్పితిమిగదా! ఆ యభావవాదులు ము త్తెఱఁగులుగా నున్నారు.

అందు మొదటి తెగవారు ధ్వని లేనేలేదందురు. వారి మతమును నానందవర్ధనుఁ డీ క్రిందివిధమున ఖండించెను

వాచ్యార్థము ముగిసినపిమ్మటఁ బ్రకరణాదివశమున నర్థాంతరము తోఁచు చున్నది. ఆ యర్థ మొకచో వస్తురూపముగా, నొకచో నలంకారరూపముగా నొకచో రసభావాదిరూపముగాఁదోఁచును అదియే ధ్వన్యర్థము ధ్వనిశబ్దమునకు మూఁడువిధములయిన వ్యుత్పత్త్యర్థములను దెలిపితిమి సహృదయహృదయ సంవేద్యమై వాచ్యార్థముకన్న రమణీయమై యర్థాంతరము దోఁచుచుండఁగా నది శశశృంగాయమాణ మని యపలపించుట యయుక్తముగదా!

ఇఁక రెండవ తెగవారు ధ్వన్యర్థముఁ బైవారివలె బొత్తుగా లేదనరు కాని దానిని బోధించుటకు 'వ్యఁజనాశక్తి యను క్రొత్తశక్తి నంగీకరింపఁ బనిలేదనియు, నా శక్తి యభిధాశక్తిలోనే యంతర్భవించుననియుఁ జెప్పుదురు. వారిమత మిది —

వాచ్యార్థము ముగిసినపిమ్మటఁ దోఁచు నర్థాంతరమును బోధించుటకు 'వ్యంజనాశక్తి యను క్రొత్తశక్తి యక్కఱలేదు అది యభిధావృత్తి వలననే తోఁచును ఎట్లన నభిధావృత్తి కేవల సంకేతితార్థమునే కాక సంకేతితార్థమును, దాత్పర్యమును వ్యంగ్యార్థమును గూడఁ గ్రమముగా బోధించును. ఎట్లన "సోఽయ మిషో రివ దీర్ఘదీర్ఘ తరో వ్యాపారః" (ఈ యభిధావ్యాపారము శరము యొక్క వ్యాపారము వలె దీర్ఘదీర్ఘతరము) అని చెప్పుదురు అనఁగా "సమర్థుఁడగు ధానుష్కుఁడు ప్రయోగించిన బాణము శత్రువు యొక్క కవచమును, శరీరమును ప్రాణమును గ్రమముగాఁ దాఁకునట్లే సమర్థుఁడగు కవి ప్రయోగించిన శబ్దముగూడఁ గ్రమముగా సంకేతితార్థమును దాత్పర్యార్థమును, వ్యంగ్యార్థమును బోధించును".

దీని నానందవర్ధనుఁ డిట్లు ఖండించెను. ప్రాచీన సంప్రదాయానుసారముగా నభిధాశక్తి సంకేతితార్థమును మాత్రమే బోధించును కాని వ్యంగ్యమగు వస్త్వలంకారరసాదులను బోధింపఁజాలదు. ఏలన నవి సంకేతితములు గావు.

అభిధాశక్తికి దీర్ఘదీర్ఘతర వ్యాపారమున్నదనుటకుఁ బ్రమాణమేమి? అభిధకు దీర్ఘదీర్ఘతర వ్యాపారము నంగీకరించినచో నభిధాశక్తి యొక్కటియే చాలును. లక్షణావృత్తి గూడఁ బనిలేదు. లక్షణావృత్తి పనినిఁగూడ నభిధయే నిర్వహించును గదా! లక్షణావృత్తి నంగీకరించుట వలన స్వవచనవ్యాఘాతము రాదా? మఱియు నభిధాశక్తిచే బోధింపఁబడు సంకేతార్థమెల్లరకు నొక్క రూపముననే భాసిల్లును కాని వ్యంగ్యార్థము ప్రకరణ, వక్తృ బోద్ధవ్యాది భేదమును బట్టి బహురూపముగా నుండును. ఎట్లన "గతోఽస్తమర్కః" (ప్రొద్దుగ్రుంకెను) అనువాక్యమున కభిధాశక్తిచే నొక్క సంకేతార్థమే యెల్లరికిని గోచరించును ఈ వాక్యము దూతినాయికతోఁ దెలుపఁగా "అభిసరింప సమయమైనది" అనునది వ్యంగ్యార్థము. ఒక కూలివాఁడు మఱొక కూలివానితోఁ జెప్పఁగాఁ "బని చాలింతము" అనునది వ్యంగ్యార్థము ఇట్లే యాయా ప్రకరణాదులను బట్టి "సాంధ్యకృత్యము నెఱవేర్పుము చీఁకటి పడుచున్నది దూరము పోవలదు· గోవుల నింటికిఁ దోలుకొనిరమ్ము ఎండవేఁడిమి చల్లాఱినది; ఇప్పటికిని బ్రియుఁడు రాలేదు" అను నానార్థములు వ్యంగ్యముగాఁ దోఁచును

మఱియు వాచ్యార్థ వ్యంగ్యార్థములు స్వరూపమును బట్టియు భిన్నములు ఎట్లన, వాచ్యార్థమొకచో విధిరూపముగానున్న వ్యంగ్యార్థము నిషేధరూపమున నుండును.

కం ఇఁకఁ దిరుగవచ్చు నిట న
మ్మకముగ నో పూజరి! పరిమార్చెనుసుమ్మీ!
వికటోద్ధతమగు గోదా
నికుంజగతసింహ మొకటి నేఁడా కుక్కన్

ఒక పూజారి పత్త్రపుష్పాదుల ననుదినము ను గోయుచుండుటచేఁ దన సంకేతనికుంజము పలచఁబడి బహిరంగపడుచున్నదని చింతించుచున్న కులటానాయిక యా పూజారితో ననుచన్నది ప్రథమమున నీ ప్రకరణమును దెలిసికొనవలెను ఏలనఁ బ్రకరణముచేతనే వ్యంగ్యము గోచరించును. ఇఁక దీని యర్థమిది —

"ఓ పూజారీ! ఇఁక నమ్మకముగఁ నీ విటఁ దిరుగుము. సమీపస్థ గోదావరీకుంజగతమగు సింహ మిచ్చటి కుక్కను జంపినదిలెమ్ము"

ఇటఁ దిరుగుము' అను వాచ్యార్థము విధిరూపమున నున్నది. "సింహము కుక్కను జంపినది కావున నిర్భయముగాఁ దిరుగుము" అని చెప్పుటచే "నీ వితివఱకు కుక్కకే భయపడుచుంటివి. ఇప్పుడది చచ్చినను సమీపముననే

సింహమున్నది అది నిన్నుఁ బరిమార్చును. కానఁ దిరుగకుము" అని నిషేధార్థము తోఁచుచున్నది. ఇదియే వ్యంగ్యార్థము కావునఁ వాచ్యార్థము విధిరూపమునను, వ్యంగ్యార్థము నిషేధరూపమున నున్నది.

ఒకచో వాచ్యార్థము నిషేధరూపమునను, వ్యంగ్యార్థము విధిరూపమునను నుండును.

గీ ఇచట మాయత్త పండు నే నిట బరుండుఁ
బగటనే లెస్స గని గుర్తుపట్టుకొనుము
ఓ నిశాంధుఁడ ! పాంథుఁడా. యెప్పుదప్పి
పడకుమీ ! మాదు మంచాలపైని రేయి

ఇటఁ ప్రోషితభర్తృక నాయిక. ఇంటికొక . పాంథుఁడు వచ్చినాఁడు. వానితోఁ బై విధమునఁ బల్కినది ఇచటఁ "బడకుమీ" అని వాచ్యార్థము. నిషేధరూపమున నున్నది "తిన్నఁగాఁ జూచి నా మంచము గుర్తుంచుకొని నా మంచముపైఁ బడుము" అనునది వ్యంగ్యార్థము ఇది విధిరూపమునను న్నది.

ఒకచో వాచ్యార్థము విధిరూపముగను వ్యంగ్యార్థమనుభయరూపముగను నుండును. (అనఁగా విధిరూపముగాఁగానీ నిషేధరూపముగాఁగానీ యుండదు).

గీ పొమ్ము! నాకొక్కతెకె కల్గనిమ్ము ప్రియుఁడ !
ఊర్పు లేడ్పులు: దాని వియోగకలన
నీకు నేటికిఁ ? గల దొకో నీకుఁ బ్రీతి ?
వచ్చితివి పూఁతమెఱుఁగుల వలపుతోడ

ఇది ఖండితనాయిక 'పొమ్ము' అను వాచ్యార్థము విధిరూపమునను న్నది. నాయకుని 'చిపొమ్ము' అనికాని 'ఉండుము అనికాని నాయికాభిప్రాయము గాదు ఖండితగావునఁ గృతాపరాధుఁడైన ప్రియుని నుపాలంభించుచున్నది ఇట వ్యంగ్యార్థ .నుభయరూపము

ఒక చో వాచ్యార్థము ప్రతిషేధరూపముగను వ్యంగ్యార్థమనుభయ రూపముగను ఁండును

గీ చాలు మ్రొక్కుదు! మఱలు మోము ... నీదు
మోముఁజాబిల్లిఁ జీఁకటి ముత్తమ ...
దారిఁ జరియించు నన్నభిసారికలకు
నద్భుతగులు చేకొంటి హతాశురాల !

(A C No ......

ఒక యభిసారిక యభిసరింపఁ బ్రియతముని గృహమునకుఁ జనుచున్నది. మధ్యేమార్గమున దాని ప్రియుఁడగపడి త న్నాలింగించుచు నిట్లు నర్మప్రసంగ మొనర్చెను.

ఇట 'మఱలుము' అనునది వాచ్యార్థము అది నిషేధరూపమున నున్నది. 'మఱలుము' అన వెడలవలదు' అనికదా యర్థము కాన నిషేధరూపము. నాయకుఁడు "మోముజాఁబిల్లి......అద్భుతగులుచునుంటివి" అని చెప్పుటచేఁ బ్రియురాలి ముఖబింబమును వర్ణించుచు "నీ గమనమున నీకును నిష్టార్థసిద్ధి గాదు నా యింటికైనను రమ్ము లేక నేనే నీ యింటికి వత్తును" 'పద' అనునది వ్యంగ్యము ఈ వ్యంగ్యము విధిరూపమునఁగాని, నిషేధరూపమునఁ గాని లేక ముఖబింబవర్ణనమునఁ బర్యవసించినది.

ఒక్కొకచో వాచ్యార్థముకన్న వ్యంగ్యార్థ మత్యంతభిన్నముగా నుండును.

కం. పలునొక్కులు గల తన కో
మలి మోవినిఁగాంచి యెవఁడు మండిపడఁడు ? నే
వలదన్న మూరుకొంటివి
వెలఁది! సభృంగాబ్జ - ననుభవింపుము దీనిన్.

ఉపపతిచే నుపభోగింపఁబడి దంతక్షతములు గలిగియున్న నాయికను గాంచి పతి శంకింపఁగా నాయికాసఖి యిట్లు పలుకుచున్నది.

"దీని ననుభవింపుము" అనునది నాయికను గూర్చి వాచ్యార్థము "భృంగము దీని మోవినిఁ గాటువేసినది ఇతరుఁడుగాఁడు. కావున నీమె నిరపరాధురాలు" అను వ్యంగ్యార్థము పతినిఁ గూర్చియు "ఇప్పుడు నేనెట్లో తప్పిచెడి సమర్థించితిని ఇఁక ముందెప్పుడును నీ విధముగాఁ గనపడునట్లు దంతక్షతాదులు సేయకుము" అను వ్యంగ్యార్థ ముపపతినిఁగూర్చియుఁ బ్రియురాలి సవ్రణాధరావలోకమున రోషము గలుగును అప్రియురాలగుచో త్యాగహేతు వయిన ప్రీతి గలుగును కాన మీ రానందపడకుఁడు, ఓహో! దీని సౌభాగ్య మేమి ?" అను వ్యంగ్యార్థము సవతులను గూర్చియు "ఇప్పుడిట్లు జరిగినది మీరెన్నడు నీమెను గూర్చి శంకింపకుఁడు" అను వ్యంగ్యార్థ మిరుగుపొరుగుల వారినిఁ గూర్చియు, "ఇపుడీవిధముగా గుట్టుదాఁచితిని. ఇఁకముందు మెలఁకువతోఁ వర్తిల్లుము" అను వ్యంగ్యార్థము నాయికను గూర్చియు "ఉపపతి వలనఁ జుంబనాదులనే గ్రహింపవలెను కాని దంతక్షతాదులను గ్రహింపరాదు" అను వ్యంగ్యార్థము కులటానాయికలను గూర్చియు నున్నవి.

వాచ్యార్థము శబ్దమాత్రము నాశ్రయించి యుండును వ్యంగ్యార్థము: ౧. శబ్దము, ౨. శబ్దైకదేశము, ౩ అర్థము ౪. వర్ణములు ౫. రీతి అనువాని నెల్లను నాశ్రయించి యుండును.

శబ్దములు సుబంతములనియుఁ దిఙంతములనియు ద్వివిధము. వీనికిఁ గ్రమముగా నుదాహరణము లిత్తును

౧. శబ్దము—సుబంత శబ్దము (౧)

కం. సిరిగలవానికిఁ జెల్లును
తరుణులఁ బదియాఱువేలఁ దగఁ బెండ్లాడన్
దిరిపెమున కిద్దఱాండ్రా?
పరమేశా! గంగ విడువు పార్వతి చాలున్.

ఇట 'సిరిగలవాఁడు' అను సుబంతశబ్దము సంపదగలవాఁడు అను వాచ్యార్థమును బోధించి పిమ్మట లక్ష్మీభర్త యనగాఁ 'గృష్ణుఁడు అను వ్యంగ్యార్థమును బోధించుచున్నది. అట్టే 'గంగ పదము 'గంగాదేవి అను వాచ్యార్థమును బోధించి పిమ్మట జలము' అను వ్యంగ్యార్థమును బోధించును.

తిఙంతశబ్దము (౨)

గీ ముసరఁగా నిమ్ము! ఝుమ్మని దెసలఁ దేంట్లు
మలయఁగా నిమ్ము! మెలమెల్ల మారుతంబు
పాడఁగా నిమ్ము! కోయిలల్ పంచమంబు
నరుగఁగా నిమ్ము! నా యయఃప్రాణములును.

ఇట ముసరఁగానిమ్ము మొదలగు క్రియాపదము లా విరహిణి యొక్క సంతాపాతిశయమును వ్యక్తపఱచుచున్నవి.

కొన్ని యెడల శబ్దములు తత్సజాతీయవర్ణములు గల శబ్దములను స్ఫురింపఁజేసియు నర్థాంతరమును వ్యక్తపఱచును. ఎట్లన

"అత్రాంతరే కుసుమసమయయుగ ముపసంహరన్ అజృంభత గ్రీష్మాభిధానః పుల్లమల్లికాధవళాట్టహాసో మహాకాలః" అనునెడ "కుసుమసమయయుగ ముపసంహరన్" అను పదములు మన్మథసంహర్త యను నర్థాంతరమును వ్యక్తము సేయుచున్నవి. ఇట 'కుసుమ' సంహరన్' అను శబ్దైకదేశములే వ్యంజకములగుచున్నవి. ఇట్లే "కొలఁతం బదుంగుకవి పృథ్వీభృత్సమీప క్షితిన్" అనుచోటి కొలఁత అను శబ్దము తత్సజాతీయ వర్ణములుగల 'కొలుత'

అను శబ్దమును స్ఫురింపఁజేసి చోరరూప వ్యంగ్యార్థమును స్ఫురింపజేయుచున్నది. "కొఱతంబడున్" అనుచో శ్లేష యని కొందఱు భ్రమింతురు. ఇది వ్యంగ్యస్థలమే

౨. శబ్దైకదేశము

శబ్దములో నొకభాగము శబ్దైకదేశము. అది ౧. ప్రకృతి, ౨ ప్రత్యయ, ౩. ఉపసర్గ ౪ నిపాత, ౫ వచన, ౬ సమాస, ౭ కారక—అదిభేదములచే బహువిధముగానుండును. ప్రకృతియనఁ బ్రత్యయముచేరని కేవలధాతురూపము గాని కేవలనామరూపముగానీ యగును. అట్టి ప్రకృతియు వ్యంగ్యార్థమును సూచించును ఎట్లన,

కం. తనచూపుతూపులను గ్రొ
న్ననఁబోఁడి కడిందితాఁకి నాలుగెయడుగుల్
చని చచ్చెనొ? లేదో? యని
వెనుదిరిగియుఁ దరుణుఁగాంచుఁ బెక్కులుతడవల్.

ఇట "ఎను" అను భూతకాలిక ప్రత్యయరహితమైన 'చచ్చు' అనునది ప్రకృతి 'చచ్చు' అనఁగా మరణించు అని వాచ్యార్థము. ఈ చచ్చు అను ధాతుప్రకృతి "మిక్కిలి సంతాపమును వహించు" అను వ్యంగ్యార్థమును బోధించుచున్నది.

చ.............. .. ..
....వాసవదత్త కటాక్షమాలికా
గురుతరశృంఖలాతతుల గుప్తముగా బిగియించి వత్సభూ
వరుఁ జెఱవెట్టియుంచె విరిపాన్పున బంగరుమేడలోపలన్.

కం. మనయేలిక నా ప్రద్యో
తుని చెఱఁ దప్పింపవచ్చుఁ దొయ్యలిచెఱ నే
యనువునఁ దప్పింపందగు
ఋనుఁ డెట్టులు కొమ్మవిడిచి ష్మాజముఁదెచ్చున్?

ఇట 'చెఱను అనునది ద్వితీయావిభక్త్యంతపదము 'చెఱ' అనునది ప్రాతిపదికము అనఁగాఁ బ్రత్యయరహితమైన కేవల నామము. ఇదియే నిర్బంధాతిశయము' అను నర్థమును వ్యక్తము సేయుచున్నది ఇట ద్వితీయావిభక్తి ప్రత్యయరహితమైన కేవల నామప్రకృతియే వ్యంగ్యార్థమును బోధించుచున్నది.

ప్రత్యయములు రెండువిధములు ౧ కృత్తులు, ౨ తద్ధితలు. ఇవియు వ్యంగ్యార్థమును సూచించును.

గీ. పండితమ్మన్యులైన వైతండికులను

పండితమ్మన్య పండితమానిన్, ప్రకృతిపదములయందలి ఖశ్, ణిని అను కృత్ప్రత్యయములు నిందావ్యంజకములు, అనఁగా నా ప్రత్యయములు "నింద్యుఁడైన పండితుఁడు" అనునర్థములు వ్యక్తము సేయుచున్నవి. నింద్యుఁడు = Condemned

మ. "వృః తకమున్ డాసియొకండు కోయఁదొడఁగంగా బుష్పముల్ కాంచితిన్"

ఇట 'వృతక పదములోని తద్ధితప్రత్యయమగు 'క' ప్రత్యయము 'చిన్న' అనునర్థమును వ్యక్తముసేయును ఇట్లే "క్వాబత హరిణకానాం జీవితం చాతిలోలం" అనునెడ 'హరిణక' శబ్దమునందలి 'క ప్రత్యయము (తద్ధిత) హరిణముల యొక్క అతికోమలత్వమును వ్యక్తపఱచును.

కం. ప్రవచించి ధర్మమార్గము.........

ఇట 'ప్రవచించి' అనుచోటి 'ప్ర అను నుపసర్గ వచనమునందలి ప్రకృష్టతను వ్యక్తపఱచును 'అనఁగా నూరకవచించుట గాదు ప్రకృష్టముగా వచించుట అను నర్థమును స్ఫురింపఁజేయును

ఉ. "అక్కట! వాఁడు నా తగుల మారడిసేసి దయావిహీనుఁడై"

ఇట 'అక్కట' అను నిపాతము వరూధిని యొక్క విరహతాపాతిశయమును వ్యక్తము సేయుచున్నది

సీ 'అవతంసకుసుమంబునందున్నయేలదేటి రుతి కించిదంచితశ్రుతుల నీన'

ఇట 'శ్రుతులు' అను బహువచనము సరస్వతి పెక్కు శ్రుతులతో వీణ వాయించుచున్నట్లును దేఁటి వాని కనుకూలముగా ధ్వనించుచు శ్రుతినిఁ బోషించుచున్నట్లును వ్యక్తము సేయుచున్నది

'అగస్త్యభ్రాత' ఇది సమస్తముగా నిందను వ్యక్తముసేయును. అనఁగాఁ బేరులేనివాఁడను వ్యంగ్యార్థమును నీ సమాసము బోధించును ఇది వ్యస్తముగా నున్నచో ('అగస్త్యని భ్రాత) బోధింపదు. ఏలన లోకమున సమాసముగానే ప్రయుక్తమై యున్నది

పశ్యతోహరుఁడు' (చూచువాని ననాదరించి హరించువాఁడు) అనఁగా జూచుచుండఁగానే హరించువాఁడు ఇచ్చటి 'పశ్యతః అను షష్ఠీవిభక్తి (కారకము) అనాదరార్థ వ్యంజకము. 'షష్ఠీచాఽనాదరే' అని పాణినీయ సూత్రము

౩. అర్థము

కం. పలునొక్కులు గల తన కో
మలిమోవినిఁ గాంచి యెవఁడు మండిపడఁడు ? నే
వలదన్న మూరుకొంటివి
వెలఁది! సభృంగాబ్జ! మనుభవించుము దీనిన్.

ఇచ్చట నీ వాచ్యార్థ మెన్నివిధములగు వ్యంగ్యార్థములను వ్యక్తము సేయుచున్నదో వెనుకఁ జూపితిమి

౪. వర్ణములు

"శషౌ సరేఫ సంయోగౌ ఢకారశ్చాపి భూయసా
విరోధినస్స్యుః శృంగారే తే న వర్ణా రసశ్చ్యుతః
తఏవతు నివేశ్యంతే బీభత్సాదౌ రసే యదా
తదా తం దీపయంత్యేవ తేన వర్ణా రసశ్చ్యుతః" (ధ్వన్యాలోకము)

శషవర్ణములను రేఫతో సంయుక్తములయిన క్ర, ప్ర మొదలగు వర్ణములను ఢకారమును శృంగారరసమునకు విరుద్ధములు. అనఁగా నా రసమును నీ వర్ణములు వ్యక్తపఱుపవు. అవియే వర్ణములు బీభత్సాదులందుఁ బ్రయుక్తములయినచో దాని నుద్దీపింపఁజేయును కాన వర్ణములుగూడ రసవ్యంజకములు

౫. రీతి

అల్పసమాస యగు రీతి శృంగారాది రసములను, దీర్ఘసమాస యగు రీతి రౌద్రాది రసములను వ్యక్తపఱచును.

మఱియు వాచ్యార్థము శబ్దశాస్త్రజ్ఞానముచేఁ దెలియును. వ్యంగ్యార్థము వక్తృ బోద్ధవ్య ప్రకరణ, దేశ కాలాదులను బట్టి తెలియును. వీని కుదాహరణములు "గతోఽస్తమర్కః" అనుచోట నీయబడినని. మఱియు వాచ్యార్థము పదార్థజ్ఞానము ను మాత్రమే కలిగించును. వ్యంగ్యార్థము రమణీయముగా నుండి యానందమును గలిగించును

ఇట్టి యెడల వాచ్యార్థవ్యంగ్యార్థముల నభిధాశక్తి యొక్కటియే బోధించుననుట యనుచితము

అభావవాదులలో మూఁడవ తెగవారు వ్యంజనావృత్తి తాత్పర్యవృత్తిలో నంతర్భవించుననిరి. అట్లుకాదు తాత్పర్యవృత్తి పదసమన్వయమును మాత్రము

బోధించును. పదసమన్వయము ముగిసినపిమ్మటఁ బ్రకరణాదులవలనఁ దోఁచు నర్థాంతరమును నది యెట్లు బోధించును ? అభిహితాన్వయవాదుల తాత్పర్యము నకును, నాలంకారికుల తాత్పర్యమునకును భేదమును జూపితిమి ఆలంకారికుల తాత్పర్యమును వ్యంజనావృత్తియు నొక్కటే

లక్షణాంతర్భావుల మత మిది : లక్ష్యార్థమే వ్యంగ్యార్థము కాన వ్యంజనావృత్తితోఁ బనిలేదు" అని అట్లుగాదు. లక్షణావ్యాపారమును వ్యంజనా వ్యాపారమును భిన్నములు ఎట్లన, వాచ్యార్థము పొసఁగనపుడు దానిని వదలి మఱొక యర్థమును బోధించు శబ్దశక్తి లక్షణ అనఁగా లక్ష్యార్థములో వాచ్యార్థము గొంత విడువఁబడును. వ్యంగ్యార్థము ఆ వాచ్యార్థముకన్న భిన్న మైనను, వాచ్యార్థము విడువఁబడదు ఆ వాచ్యార్థమునకే వ్యంగ్యార్థ ముపస్కార కముగా నుండును. మఱియు లక్షణావాక్యమగు "గంగాయాం ఘోషః" అను చోటఁ దీరము లక్ష్యార్థమును శీతత్వ పావనత్వాదులు ప్రయోజనమును నయి యున్నవి అట్లే గౌణవృత్తి యగు "బ్రాహ్మణుఁడగ్ని" అనుచోట "అగ్ని సదృశుఁడు" అనునది లక్ష్యార్థమును, శుచిత్వపవిత్రత్వములు ప్రయోజనములును నయియున్నవి ఈ ప్రయోజనము వాచ్యార్థము గాదు ఇది వ్యంగ్యమే దీనికై వ్యంజనాశక్తి యవశ్యమే.

"గంగాయాం ఘోషః" అనుచోట ముఖ్యార్థబాధాది హేతుత్రయమును బట్టి 'గంగాతీరము' అను లక్ష్యార్థమును బోధించినపిమ్మట మఱల శీతత్వ పావనత్వాదులను గూడ లక్ష్యార్థముగానే లక్షణ బోధించును "వ్యంజనావృత్తి యేల ?" అని మఱల వారు నొడువుదురేని నిట్లనరాదు. "గంగాతీరే ఘోషః" అనుచోట ముఖ్యార్థబాధాదిహేతుత్రయము గానరాదు ఎట్లన, నసలు 'గంగా తీరము' అనునది లక్ష్యార్థము గాని, ముఖ్యార్థము కాదు దానికి బాధయు (వాచ్యార్థానుపపత్తి) లేదు ప్రయోజనమగు శీతత్వ పావనత్వాదులకు గంగా తీరముతో సంబంధమును లేదు శీతత్వ పావనత్వాదులు గంగాగతధర్మములు గాని తీరమునకు సంబంధించినవి కావుకదా; మఱియు శీతత్వ పావనత్వాదులు లక్ష్యార్థమే యగుచో ముఖ్యార్థబాధాది హేతుత్రయములో నొకటియగు ప్రయోజన మేమిచెప్పుదురు ? అనఁగా "గంగాయాం" అనఁగా గంగాతీరము అను లక్ష్యార్థము చెప్పినపుడు శీతత్వ పావనత్వాదులు ప్రయోజనమని చెప్పితిమి. ఇప్పుడు గంగాతీరమునకు శీతత్వ పావనత్వాదులు లక్ష్యార్థమగుచో వేఱొక ప్రయోజన మేమిచెప్పుదురు? ఏమియును లేదు. కాన లక్షణాంతర్భావము పొసఁగదు.

మఱల వారు "ప్రయోజనమగు శీతత్వపావనత్వాదులతో సహితమగు లక్ష్యార్థమునే లక్షణాశక్తి బోధించు" నని యందురేని నట్లుగాదు ప్రయోజన సహితమైన లక్ష్యార్థముండదు (ప్రయోజనేన సహితం లక్షణీయం న విద్యతే) మఱియు లక్ష్యార్థము ప్రథమమున గోచరించును. పిమ్మటనే ప్రయోజనము గోచరించును. రెండును నేకకాలమున గోచరింపవు. ఈ ప్రయోజనము వ్యంజనాశక్తిచే భాసించునని చెప్పితిమి ప్రయోజనసహితముగా లక్ష్యార్థమేకకాలమున భాసింపదు కాన లక్ష్యార్థ వ్యంగ్యార్థము లొక్కటి కాదని తేలినది.

లక్షణాశక్తి "గంగాయాం ఘోషః" ఇత్యాది స్థలమునందు శబ్దమాత్రము నాశ్రయించియుండును. వ్యంజనాశక్తి శబ్ద శబ్దైకదేశ అర్థ వర్ణ రీత్యాదు లందుండను (వీని కుదాహరణముల నొసఁగియుంటిమి)

- కొందఱు "పలునొక్కులుగల తన కోమలి" ఇత్యాదులందు వ్యంగ్యార్థము లెట్లు నానావిధములుగా నున్నవో యట్లే "రామోఽస్మి సర్వం సహే" (నేను రాముఁడను; సర్వమును సహింతును) అనునెడ రామ శబ్దమునకు రాజ్యభ్రంశ ప్రవాస, పితృవియోగ సీతావియోగాది దుఃఖపాత్రత్వము లక్ష్యార్థము. "రామేణ ప్రియజీవితేన తు కృతం ప్రేమ్ణః ప్రియే నోచితం" (ప్రియురాలా! జీవితముమీఁది ప్రేమచే రాముఁడు నీ మీఁది ప్రేమకు దగినవిధమున వర్తింపలేదు) అనుచో 'రామ శబ్దమునకు "దుష్కార్యకారిత్వము లక్ష్యార్థము" "రామోఽసౌ భువనేషు విక్రమగుణైః ప్రాప్తః ప్రసిద్ధింపరాం" (ఈ రాముఁడు తన విక్రమగుణములచేఁ బరమ పసిద్ధిని వహించెను) అనుచోట రామశబ్దమునకు "సాహసైకపరత్వము లక్ష్యార్థము" ఇట్లు నానావిధములుగానే లక్ష్యార్థములును నున్నవి అచటి వ్యంగ్యార్థములవలె నిచటి లక్ష్యార్థములును శబ్దార్థాధీనములే రెండును ప్రకరణసాపేక్షములే కాన వ్యంగ్యార్థమును లక్ష్యార్థమును దుల్యములే. కాన వ్యంజనావృత్తితోఁబనిలేదు" అని చెప్పుదురు

లక్ష్యార్థము నానావిధములుగానున్నను ననేకార్థములు గల శబ్దమునకు సంయోగాదులేకార్థమును నియమించినట్లే లక్షణయు లక్ష్యార్థమును నియమించును అనఁగా ముఖ్యార్థసంబంధముగల యర్థమునే లక్షణ బోధింకును. కాని సంబంధములేని యర్థమును బోధింపదు ఇది నియమము కావుననే లక్షణను 'నభిధాపుచ్ఛభూత యందురు అనఁగా నభిధకుఁ దోఁక వంటిదని యర్థము ఇఁక వ్యంగ్యార్థము ప్రకరణాదివశమున నియతసంబంధము గలిగియు, అనియతసంబంధము గలిగియు సంబద్ధసంబంధము గలిగియు నుండును

గీ "ఇచట మా యత్త పంకు నే నిటఁ బరుండు" అనునెడ వాచ్యార్థ మగు 'పడకుమీ' అనుదానికి నియతముగా వ్యతిరేకార్థము వ్యంగ్యము. ఇది నియతసంబంధము గల వ్యంగ్యార్థము.

కం. "పలునొక్కులుగల తన కోమలి" అనుచోట వాచ్యార్థమునకును, వ్యంగ్యార్థమునకును నియతసంబంధము లేదు. ఏలన, నటఁ బెక్కు వ్యంగ్యార్థ ములు గలవు. ఇట నియతసంబంధముగల వ్యంగ్యార్థములు గలవు. ఇఁక,

* విపరీతరతే లక్ష్మీః బ్రహ్మాణం దృష్ట్వా నాభికమలస్థం
హరేర్దక్షిణనయనం రసాకులా ఝడితి స్థగయతి.

తా లక్ష్మి పురుషాయితసమయమున నాభికమలాసీనుఁడగు బ్రహ్మను గాంచి రసాకులురాలై హరియొక్క దక్షిణనయనమును మూయుచున్నది

ఇట 'హరి' పదము దక్షిణనయనమునకు సూర్యాత్మకత్వమును వ్యక్తము సేయుచున్నది ఆ సూర్యనిమీలనమున సూర్యాస్తమయము; దానిచేఁ బద్మ సంకోచము, దానిచే బ్రహ్మ మూఁతపడును అప్పుడు వానికి గోప్యాంగము గనరాకుండ నిరాటంకముగాఁ బురుషాయితము రేఁగును అనునది సంబద్ధసంబం ధము గల వ్యంగ్యార్థము. సంబద్ధసంబంధము గల వ్యంగ్యమని యర్థము. ఇట 'హరి' పదము దక్షిణనయనము. సూర్యుఁడను నర్థమును (వ్యంగ్యము) బోధించినది. ఆ వ్యంగ్యార్థము మిగిలిన వ్యంగ్యార్థమునంతను బోధించినది. అనఁగా వ్యంగ్యార్థమే యిట నర్థాంతరమునకు వ్యంజకమై యున్నది.

ఇట్టిదే మరొక శ్లోకమును గనుఁడు. చిలుకను ముద్దాడుచున్న నాయికతోఁ జెలి యనుచున్నది—

ఫలాని దేహి భవ్యాని నివేశ్య మణిబంధనే
బింబోష్ఠి చుంబనైరేవమాశి లాలయ మా శుకం.

"ఓ బింబోష్ఠి ఓ నెచ్చెలీ నీ ముంజేతఁగూర్చుండఁబెట్టుకొని చిలుకకుఁ బండ్లు పెట్టుము దాని ముద్దాడకుము" ఇది వాచ్యార్థము. దీనిచే "బింబ ఫలభ్రాంతిచేఁ (ఆమె బింబోష్ఠిగదా) జిలుక నీ యధరమును ఖండించును" అనునది వ్యంగ్యము. ఆ వ్యంగ్యముచేత "నీ పతి కన్యథా భ్రాంతికలుగును" అనునది వ్యంగ్యముగాఁ దోఁచును మొదటి వ్యంగ్యార్థము రెండవ వ్యంగ్యార్థ

---

* కుమారసంభవమునందలి జగత్పితరులగు పార్వతీపరమేశ్వరుల రతి స్వపితృశృంగారమువలె నత్యంత మనుచితమని చెప్పఁబడియున్నది. అట్లే లక్ష్మీశ్రీహరుల రతిక్రీడావర్ణనము గూడ నట్టిదే కాన నిదియు ననౌచిత్య దోషగ్రస్తమే.

మునకు వ్యంజకము. ఇదియు సంబద్ధసంబంధము గల వ్యంగ్యమే.

కావున లక్ష్యార్థ వ్యంగ్యార్థములు భిన్నములే కాన వ్యంగ్యార్థమును బోధింప వ్యంజనాశక్తి ప్రత్యేకముగా నుండవలసియేయున్నది

మఱికొందఱు విద్వాంసులు (తార్కికులు) వ్యంగ్యార్థమును బోధింప వ్యంజనావృత్తి యక్కఱ లేదనియు నా వ్యంగ్యార్థమనుమానప్రమాణగమ్యమగు "అనుమేయము" లోనే యంతర్భవించుననియు వక్కాణింతురు అనుమానప్రమాణమనఁగా "పర్వతమున నిప్పు గలదు, ఏలనఁ బొగయుంట వలన ఎచ్చటెచ్చటఁ బొగ యుండునో యచ్చట నెల్ల నిప్పుండును ఉదా॥ వంటయింటఁ బొగయున్నది నిప్పున్నది, నిప్పులేనిచోటఁ బొగ యుండదు.. హ్రదమున నిప్పులేదు, పొగలేదు కానఁ బర్వతమున నిప్పుగలదు" అనునది. ఇట పొగ' లింగము (హేతువు) నిప్పు లింగి (అనుమేయము - అనఁగా ననుమానింపఁదగినది) లింగమునుబట్టి లింగి యూహింపఁబడుచున్నది ఈ లింగి లింగములకు నియమితసంబంధము గలదు. ఇట్లే ప్రకరణాదులనుబట్టి శబ్దములు వ్యంగ్యార్థమును బోధించుచున్నవి కాన శబ్దములు లింగములు. వ్యంగ్యార్థము లింగి లేక యనుమేయము. కాఁబట్టి వేఱుగా వ్యంజనావృత్తి పనిలేదని వారి వాదము అట్లుగాదు అనుమేయమును వ్యంగ్యార్థమును నొక్కటిగాదు ఎట్లన శబ్దోచ్చారణానంతరమున గోచరించు నర్థము అనుమేయము ప్రతిపాద్యము అని యిఱుదెగలుగా నుండును అనుమేయార్థము ప్రయోక్త యొక్క శబ్దస్వరూప ప్రయోగేచ్ఛయు అర్థప్రతిపాదనేచ్ఛయు నని ద్వివిధము అనఁగాఁ బ్రయోక్త "రాముఁడు" అను శబ్దమును బ్రయోగించెననుకొందము శ్రోత దీనిని విని ప్రయుక్తమైన 'రాముఁడు' అను శబ్దమును బట్టి ప్రయోక్తకు 'రాముఁడు' అను నొక యానుపూర్విని (రకారోత్తరవర్తి - ఆకారవిశిష్ట మకారోత్తరవర్తి - ఉకారవిశిష్ట, డకారోత్తరవర్తి ఉకారవిశిష్టమగు శబ్దస్వరూపము) బ్రయోగించు నిచ్ఛ గలదనియో లేక యొక యర్థమును (అభిప్రాయమును) బోధించు నిచ్ఛ గలదనియో, యనుమానించును. ఇట నానుపూర్విని బ్రయోగించు నిచ్ఛయు నర్థముఁదెలుపు నిచ్ఛయు ననుమేయములు కేవల మీ యిచ్ఛలే యనుమేయములు. ఇట 'రాముఁడు అను ప్రయుక్తశబ్దము లింగము ఇచ్ఛాద్వయమును ననుమేయము లేక లింగి ఇక నా యర్థప్రతిపాదనేచ్ఛలోని 'యర్థము స్వరూపభేదమును బట్టి ప్రతిపాద్యము వ్యంగ్యము నని ద్వివిధము ప్రయోక్త చెప్పవలసిన యభిప్రాయమును సూటిమాటలతోఁ జెప్పును. అది వాచ్యార్థము ఒకప్పుడు రమణీయముగానుంటకై సూటి మాటలతోఁ జెప్పక వేఱుమాటలతోఁ జెప్పి యా యర్థమును సూచించును. ఇది వ్యంగ్యార్థము ఇట శబ్దోచ్చారణానంతరమున గోచరించు ద్వివిధమైన

యిచ్ఛారూపమగు నర్థము మాత్రమే యనుమేయము రెండవ యర్థమగు ప్రతిపాద్యమును, వ్యంగ్యమును ననుమేయములు గావు. మఱియు నీ వ్యంగ్యార్థమును బోధింప శబ్దములు లింగమనియు వ్యంగ్యార్థము లింగి యనియుఁ జెప్పరాదు లింగలింగి భావము నియతమని చెప్పితిమి. (ధూమమున్నచోట వహ్ని యుండుననునది లింగలింగి భావము) ఇట నట్టినియమము లేదు అనఁగా నీ శబ్ద మీ వ్యంగ్యమును బోధించునని నియమము లేదు ప్రకరణాదిభేదముచే నీ వ్యంగ్య మనేకవిధములుగా నుండునని "గతోఽస్తమర్కః" అనుచోటఁ దెలిపితిమి మఱియు నీ వ్యంగ్యము నియతసంబంధము, అనియత సంబంధము, సంబద్ధసంబంధము గలిగియుండుననియు నుదాహరించితిమి. కాన వ్యంగ్యార్థమును బోధింప ననుమానప్రమాణము చాలదు. వ్యంజనావృత్తి కావలసియే యున్నది

తొలుత నానందవర్ధనాచార్యులవారీ ధ్వని సిద్ధాంతమును దాము వైయాకరణుల వద్దనుండి గ్రహించినట్లు వ్రాకుచ్చిరని తెలిపియుంటిమి వైయాకరణుల సిద్ధాంతమిది —

'గౌః' అను మాట నుచ్చరింపఁగానే యది సాస్నాలాంగూలకకుద విషాణాదులు గల జంతువిశేషమను జ్ఞానమెట్లు గలుగును? 'గౌః అను పదమునందు 'గ్ ఔ ః' అను మూఁడు వర్ణములు గలవు ఇందొక్కటియే యీ యర్థమును బోధించునా? సముదాయము బోధించునా? ఒక వర్ణమే తెలుపుచున్నచో మిగిలిన వర్ణములు వ్యర్థములు సముదాయము బోధించుచున్నచో నొకబాధ వచ్చును నైయాయికులు వర్ణములు రెండు క్షణములు మాత్రమే యుండుననియు, మూఁడవ క్షణమున నశించుననియుఁ జెప్పుదురు దానినిఁబట్టి గ్ ఔ, ః అనునెడ మూఁడవ వర్ణమగు విసర్గ నుచ్చరింపఁగానే మొదటివర్ణమగు 'గ్' నశించును అప్పుడు సముదాయము లేదు కావున నర్థమును బోధించునదేది? ఇట వైయాకరణులిట్లు సిద్ధాంతము సేసిరి — "వర్ణాతిరిక్తః వర్ణాభివ్యంగ్యః అర్థప్రత్యాయకో నిత్యశ్శబ్దః స్ఫోటః" (వర్ణములకన్న భిన్నమై వర్ణముల వలన వ్యక్తము సేయఁబడి యర్థమును బోధించు శబ్దము స్ఫోటము) లోకములో గల శబ్దములన్నియు నాకాశమున నొక్కొక్కటియు నఖండరూపమున నుండుననియు నవి నిత్యములనియు మన ముచ్చరించు వర్ణధ్వనులా యఖండమగు శబ్దమును వ్యక్తపఱచుననియు నా వ్యక్తమగు శబ్దము వలననే శ్రోతలకర్థమవగతమగుననియుఁ జెప్పుదురు ఆ వ్యక్తమగు నిత్యశబ్దము స్ఫోట మనఁబడును. ఈ సిద్ధాంతమున వర్ణము లనిత్యములు ఏలనఁబైని వచింపఁబడినట్లు మూఁడవక్షణమున నశించుచున్నది. నశించునది యనిత్యమే కదా! ఇక స్ఫోటరూపశబ్దము నిత్యము. మూఁడవక్షణమున నశించుచున్నపుడు

వర్ణసముదాయము గానరాదుగదా! ఆ వర్ణములచే నా స్ఫోటమెట్లభివ్యక్తమగును? అర్థబోధ యెట్లగును? అన్నచో వినుఁడు. "పూర్వ పూర్వవర్ణానుభవాహిత సంస్కారసచివేన అంత్యవర్ణానుభవేన అభివ్యజ్యతే స్ఫోటః" (మూఁడవ వర్ణము నుచ్చరించునపుడు మొదటి వర్ణము నశించుచున్నను దాని సంస్కారము చిత్తమున నిలుచును ఆ సంస్కారసహితమగు నంత్యవర్ణానుభవముచే స్ఫోట మభివ్యక్తమగును) ఆ స్ఫోటమే శబ్దము 'స్ఫుటత్యర్థోఽస్మాదితిస్ఫోటః' (దీనివలన నర్థము స్ఫుటమగును కాన స్ఫోటము) అనియు స్ఫోటయత్యర్థం (అర్థమును వ్యక్తపఱచునది) యనియును వ్యుత్పత్తులు గలవు అప్పుడా శబ్దము వలన వర్ణము బోధ్యమగును ఈ సిద్ధాంతులకు స్ఫోట బ్రహ్మవాదులనియు, లేక శబ్ద బ్రహ్మవాదులనియుఁ బేర్లు

ఆనందవర్ధనాచార్యులవారీ సిద్ధాంతము నీ విధముగా గ్రహించిరి "పూర్వ పూర్వవర్ణముల యొక్క సంస్కారముతోఁగూడిన యంత్యవర్ణధ్వని స్ఫోటమును వ్యక్తపఱచువిధమునఁ బ్రకరణాదుల సాహాయ్యమున శబ్దమర్థాంతరమును, వ్యక్తపఱచును అట వర్ణధ్వని స్ఫోటవ్యంజకము ఇట శబ్దమర్థాంతర వ్యంజకము అచ్చట వ్యంగ్యము స్ఫోటము ఇచ్చట వస్త్వలంకార రసాదులు ఆ ధ్వని పదమునే వ్యంజకత్వ సాదృశ్యమును బట్టి యీతఁడును గ్రహించెను. వైయాకరణుల వ్యంగ్యము స్ఫోటము ఆనందవర్ధనుని వ్యంగ్యమర్థాంతరము ఇతర సిద్ధాంతులు "నీవు క్రొత్తగా ధ్వనిసిద్ధాంతమును లేవనెత్తితివి ఇది ప్రామాణికసమ్మతము" గాదని యానందవర్ధనుని నాక్షేపింపఁగా "నిది క్రొత్త సిద్ధాంతము" గాదనియు, "వైయాకరణులంగీకరించినదే" యనియు నామ సాదృశ్యమును జూపి వారించెను *

ఈ విధముగా నానందవర్ధనుఁడు వ్యంజనావృత్తిని సాధించెను ఈ వ్యంజనకు ధ్వననము గమనము ద్యోతనము ప్రత్యాయనము, ధ్వని మొదలగు నవి పర్యాయపదములు 'వ్యంజనా' శబ్దమును 'అ' కారాంతముగాఁ గూడ వ్యవహరించుచున్నారు (వ్యంజన వ్యాపారము)

ఈ వ్యంజనాశక్తి అభిధామూలమనియు లక్షణామూలమనియు ద్వివిధము. అందభిధామూలవ్యంగ్యము, లక్ష్యక్రమవ్యంగము, అలక్ష్యక్రమ

---

* భరతుడు ౭ వ అధ్యాయమున ౭౦ వ శ్లోకమునందలి "యదాన్యోన్యార్థ సంబూతై ర్విభావానుభావవ్యంజితై రేకోనపంచాశతాభావైః సామాన్యగుణయోగేన అభినిష్పద్యంతే రసాః తత్కథం స్థాయినఏవ భావా రసత్వ మాప్నువంతి ఉచ్యతే" అనుచో వ్యంజితైః అను శబ్దమును బట్టి వ్యంజనావృత్తి నానంద వర్ధనుఁడూహించినట్లున్నదని త్రివేది పండితుఁడు వ్రాయుచున్నాఁడు.

వ్యంగ్యము నని మఱల ద్వివిధము. లక్ష్యక్రమ వ్యంగ్యము శబ్దశక్తిమూలము, అర్థశక్తిమూలము ఉభయశక్తిమూలము అని మువ్విధములు ఈ విషయము మఱల ముందుఁదెలియును

ఆ.వె. జగతి నదియు శబ్దశక్తిమూలంబును,
అర్థశక్తి మూల మరయ, నుభయ
శక్తిమూల మనఁగ సన్నుతిఁ గాంచుఁ; ద,
దీయలక్ష్యములను దేటపఱతు. ౬౮

తా ఆ వ్యంజనావృత్తి శబ్దశక్తిమూలవ్యంజనావృత్తి యనియు అర్థశక్తిమూలవ్యంజనావృత్తి యనియు, ఉభయశక్తిమూలవ్యంజనావృత్తి యనియును ముత్తెఱఁగులు

శబ్దశక్తి మూల వ్యంజన

కం ఘనత నృసింహుని కరమునఁ
దనరెడు నసి నిజసమగ్రధారాగ్ర నిమ
జ్జన తత్పరులగు నరులకు
ననిమిషభావంబొనర్చు ననవరతంబున్. ౬౯

నరసభూపాలుని చేతికత్తి తన ధారకు గుఱికాఁదలఁచిన శత్రువులకు (తత్పరులగు+అరులకు) తెప్పపాటు లేమినిఁ గలిగించును అనఁగా వారాతని కత్తిఁగాంచి కొయ్యఁబాఱి తెప్పపాటుమాని చూచుచుందురు. (అని వాచ్యార్థము).

నృసింహావతారమును ధరించిన విష్ణుమూర్తి యొక్క చేతికత్తి తన ఖడ్గధారలో మునుఁగదలఁచిన నరులకు దేవత్వమునొసఁగును (అది వ్యంగ్యార్థము). (నృసింహావతారమును ధరించిన విష్ణుమూర్తి హిరణ్యకశిపుని మాత్రమే చంపెను నరుల నెవ్వరినిఁ జంపలేదు).

శబ్దశక్తిమూలవ్యంజన యనఁగా బ్రధానముగా శబ్దమునకుగల యర్థాంతర బోధకశక్తి కొన్ని శబ్దము లేకార్థమును, మఱికొన్ని శబ్దము లనేకార్థములను బోధించునుగదా! ఈ నానార్థబోధశక్తియే యిట శబ్దశక్తి యని పేర్కొనఁ బడినది ఇది కారణముగాఁగల వ్యంజనావృత్తి ఇట నరసభూపాలుని వర్ణనము ప్రస్తుతప్రకరణము. నృసింహ, తత్పరులగు నరులకు, అనిమిషభావము అను శబ్దములు నానార్థకములు. సంయోగ విప్రయోగాదులు నానార్థక శబ్దముల

యొక్క యర్థమును నియమించునని వెనుకఁ జెప్పియుంటిమిగదా వానిలో నొకటగు ప్రకరణ మిచ్చట నీ శబ్దముల కే యర్థమును జెప్పుకొనవలయునో నియమించును. ఆ నియమింపఁబడిన మొదటి యర్థము వాచ్యార్థము ఈ విధముగాఁ బ్రకరణ మా యా శబ్దములకు వాచ్యార్థమును నియమించును అది ముగిసిన పిమ్మట నా శబ్దశక్తిచె విష్ణుపరమగు మఱియొక యర్థ ముత్థిత మగుచున్నది అది వ్యంగ్యార్థము దీని నభిధాశక్తి బోధింపఁజాలదు దాని పని వాచ్యార్థమును మాత్రమే బోధించుట "సకృదుచ్చరితః శబ్దస్సకృదేవార్థం గమయతి నాసకృత్" (ఒకమాఱుచ్చరింపఁబడినశబ్ద మొకమాఱే యర్థబోధ గలిగించును. కాని పెక్కుమాఱులు బోధింపదు) అని న్యాయము

అయితే మీమాంసకులిట నొక దోషమును చూపుచున్నారు "ఒక శబ్దమునకు రెండు వ్యాపారములు లేక రెండు శక్తు లంగీకరించి రెండర్థములు చెప్పినచో రెండు భిన్నభిన్న వాక్యము లేర్పడునుగదా; అందొకటి విధిరూపముగా నుండవచ్చును వేఱొకటి నిషేధరూపముగాఁ గూడ నుండవచ్చును గదా ఇట్లు భిన్నముగానున్నను లేక యేకవిధముగానున్నను వాక్యభేదమను దోషము తటస్థించును ఒక వాక్యమునకొకే యర్థముండవలయును. "అర్థద్వయము గూడదు" అని వారి సిద్ధాంతము. ఈ దోషనివృత్తికై యాలంకారికు లీ వాచ్యార్థవ్యంగ్యార్థములు భిన్నవాక్యములు గావనియు నేకవాక్యమే యనియు రెండర్థములకును నేకవాక్యతఁ గల్పింపవలయుననియుఁ దెలిపి వాచ్యార్థ వ్యంగ్యార్థముల కుపమానోపమేయ భావమును గల్పింతురు ఎట్లన "నృసింహావతారమగు విష్ణుమూర్తి చేతికత్తి తన ఖడ్గధారలో మునుఁగఁ దలఁచిన నరులకు ననిమిషభావము (దేవత్వము) నొసఁగునట్లు నరసభూపాలుని చేతికత్తి తన ధారకు గుఱికాఁదలఁచిన శత్రువులకు ననిమిషభావమును (తెప్పపాటు లేమి) నొసఁగును

కాని విద్యానాథుఁడీవిధముగాఁ జెప్పక "ప్రయోక్తుర్వివక్షా పరతంత్రత్వాత్ లౌకికవాక్యానాం" (అపౌరుషేయమగు వేదవాక్యములలో వాక్యభేదము దోషము గావచ్చును కాని పౌరుషేయమగు లౌకికవాక్యములలో నీ దోషము రాదు ఏలన, నిట్టి యర్థద్వయమును బ్రయోక్త యుద్దేశించియే ప్రయోగించియున్నాఁడు) అని చెప్పెను ఈ సమాధానమును బురస్కరించుకొని యొక శంక బయలుదేరుచున్నది.

ఏమన - నీ యర్థద్వయమునకును నేకవాక్యత యేల ? భిన్నభిన్నముగా నుంచి స్వతంత్రముగా రెండర్థములను జెప్పి శ్లేష యని యేల చెప్పఁగూడదు ?

ఉపమానోపమేయభావ మేల కల్పింపవలెను ? అని కొందఱందురు ఎచ్చటఁ బ్రకరణాదులచే నొకే యర్థము ప్రకృతముగను మఱొకయర్థ మప్రకృతముగను దోఁచునో యట్టిచోట శబ్దశక్తి మూలవ్యంజన ఎచ్చట నర్థద్వయమును బ్రకృతమో యనఁగాఁ బ్రకరణనియమము లేదో యట శ్లేష యనియు (రాఘవపాండవీయాదులలోని పద్యములందు రెండర్థములును బ్రకృతములే; కాన నచ్చట శ్లేషయే). వసుచరిత్రమునందలి పద్యములలోని రెండర్థములలో నొకటి ప్రకృతమును మఱొకటి యప్రకృతమును గాననది శబ్దశక్తిమూలవ్యంజన యనియు సిద్ధాంతీకరించిరి.

ధ్వన్యాలోకమతానుసారముగా శబ్దశక్తి మూలాలంకారధ్వనియే కాని శబ్దశక్తిమూలవస్తుధ్వని లేదు కావున నానందవర్ధనాచార్యమతానుసారముగా వసుచరిత్రమునందు ధ్వని కాదు. అచ్చటఁగూడ శ్లేషయే అప్రకృతార్థమును గూడ నభిధయే బోధించును మమ్మటాదులే యీ శబ్దశక్తి మూలవస్తుధ్వనిని లేవఁదీసిరి

'శబ్దస్య పరివృత్త్యసహత్వే శబ్దవ్యంజనా' అని సిద్ధాంతము. అనగా నెచ్చట వ్యంజకమగు శబ్దమును మార్చి దాని పర్యాయపదము నుంచినచో నర్థాంతరము పొసగదో యట శబ్దశక్తిమూలవ్యంజన ఇట వ్యంజకములయిన నృసింహాదిపదములను దీసి వాని పర్యాయపదముల నుంచినచో వ్యంగ్యార్థ మ్మత్థితము గాదు. కాన నిట శబ్దశక్తిమూలవ్యంజన

అర్థశక్తి మూలవ్యంజన

చ. అలఘుపరాక్రమక్రమసమగ్రభుజాగ్ర ! నృసింహభూప ! నీ
విలసదనూనదానగుణవిభ్రమ మెంతయు నాలకించి తా
వెలవెలపాఱె మేఘు; వరవిందవిరోధియుఁ గందువాఱె; నా
కులపడెఁగల్పశాఖ; తృణకోటి; గ్రసించెనమర్త్యధేనువున్. ౪౧

మేఘము (పా) మేఘుఁడు

తా. ఓ నరసభూపాలా నీ దాతృత్వమును విని మేఘుఁడు వెలవెల పాఱెను తెల్లఁబోయెను - (శరదృతువున మేఘము తెల్లనగునుగదా) చంద్రుఁడు కందువాఱెను (సంతాపపడెను - నలుపు లేక మచ్చను వహించెను). కల్పవృక్ష మాకులపడెను (వ్యాకులపాటు వహించెను - ఆకులు రాల్చెను) కామధేనువు గడ్డికఱచెను (అవమానపడెను - గడ్డినిఁదినెను) ఇటఁ 'దృణకోటి గ్రసించెను' అనుటకన్న 'గడ్డికఱచెను అను పదమునే ప్రయోగింపవలెను.

శబ్దపరివృత్తిసహత్వే అర్థవ్యంజనా' అని సిద్ధాంతము అనఁగా వ్యంజక శబ్దములను మార్చి వానిస్థానమునఁ బర్యాయపదములుంచినను నర్థాంతరమునకు భంగమురానిచో నది యర్థశక్తిమూలవ్యంజన

పై పద్యమున మేఘ అరవిందవిరోధి కల్పశాఖి, అమర్త్యధేను పదము లను మార్చి వాని పర్యాయపదములుంచినను నర్థాంతరము పొసఁగును. కాన నిది యర్థశక్తి మూలవ్యంజన కుదాహరణమని గ్రంథకర్త యభిప్రాయము

ఈ యుదాహరణము సరియైనది కాదు ఇదియు శబ్దశక్తి మూల వ్యంజనయే. ఏలనఁ బైపద్యమున వ్యంజకములయిన నృసింహాది పదముల మార్పు సహింపని విధమున నిచ్చటను వ్యంజకములయిన వెలవెలపాటు, కందువాటు ఆకులపడు అనుననియు మార్పును సహింపవు "తృణకోటి గ్రసించు" అనునొక పదమే సహించును ఇట వ్యంజకములు మేఘాదిపదములు గావు 'వెలవెలపాటు మొదలయినవియే వ్యంజకములు. కాన నీ యుదాహర ణము సరిగాదు. ఈ క్రింది పద్య ముదాహరణార్హము.

గీ. ఇచట మా యత్త పండు, నే నిటఁబరుండుఁ
బగటనే లెస్సగని గుర్తుపట్టుకొనుము
ఓ సిశాంధుఁడ పాంథుఁడా యెప్పుడప్పి
వడకుమీ, మాదు మంచాలపైనిఁ రేయి

ఇచటఁ 'బడకుమీ ' అని వాచ్యార్థము 'నా మంచముపైఁ బడుము' అనునది వ్యంగ్యార్థము ఈ వ్యంగ్యార్థమును బోధించు (పడకుమీ) శబ్దమునుమార్చి వాని పర్యాయపదముంచినను (కూలకుమీ) వ్యంగ్యార్థమునకు భంగమురాదు.

ఉభయశక్తి మూలవ్యంజన

కం అరిదరకరుఁ డై సుమనో
వరభరణధురీణుఁ డై యవారితలక్ష్మీ
స్థిరవాసభాసురుం డై
నరసింహుఁడు వొల్చుఁ ద్రిభువనస్తుతమహిమన్ ౭౧

తా. నరసభూపాలుఁడు శత్రుభయంకరుఁడై (అరిదరకరుఁడు) పండిత భరణమున ధురీణుఁడై (సుమనోవరభరణధురీణుఁడు) అవారితమగు రాజ్యలక్ష్మి యొక్క స్థిరనివాసముచే వెలుఁగొందుచున్నవాఁడై త్రిభువనస్తుతమగు మహి మతో నొప్పుచున్నాఁడు. ఇది వాచ్యార్థము.

నరసింహావతారమును దాల్చిన విష్ణుమూర్తి శంఖచక్రహస్తుఁడై (అరి = చక్రము, దరము = శంఖము—అరిదరకరుఁడు) దేవతలను భరించుట యందు ధురీణుఁడై (సుమనోవరులు = దేవతలు — సుమనోవరభరణధురీణుఁడు) లక్ష్మీదేవి యొక్క స్థిరవాసముచే వెలుగొందుచున్నవాడై, త్రిభువనస్తుతమగు మహిమతో నొప్పుచున్నవాఁడు; ఇది వ్యంగ్యార్థము.

వ్యంజకములయిన శబ్దములు గొన్ని శబ్దపరివృత్తిని సహించియుఁ గొన్ని సహింపకయు నున్నచో నది యుభయశక్తి మూలవ్యంజన ఈ పద్యమున "అరిదరకరుఁడు సుమనోవరభరణధురీణుఁడు నరసింహుఁడు" అను పదములు పరివృత్త్యసహములు 'అవారిత లక్ష్మీస్థిరవాస భాసురుఁడు' 'త్రిభువనస్తుత మహిమన్' పదములు పరివృత్తిసహములు కాననిది యుభయశక్తిమూలవ్యంజన.

లక్షణామూలవ్యంజనకు 'గంగలో గొల్లపల్లె' 'బ్రాహ్మణుఁడగ్ని' ఇత్యాదు లుదాహరణములు. అభిధామూలవ్యంజనాశక్తి లక్షణామూలవ్యంజనాశక్తి యనియే కాని వ్యంజనామూలవ్యంజనాశక్తి యుండదు ఒకచో (విపరీతరతేలక్ష్మీః) వ్యంగ్యార్థము గూడ వ్యంజకమై మఱొక వ్యంగ్యార్థమును బోధించుచున్నను నది సంబద్ధసంబంధము గల వ్యంగ్యమని విశదపఱచియుంటిమి

వృ త్తు లు

గీ. మఱియు రచనాశ్రయంబులై మధురరసని
వేశయోగ్యత వృత్తులు కైశికియును,
నారభటియును సాత్త్వతి భారతియును,
నాఁగఁ బొగడొందుఁ దల్లక్షణములొనర్తు.

యోగ్యతవృత్తులు (పా) యోగ్యతావృత్తులు

తా. వృత్తులు - కైశికి, ఆరభటి సాత్త్వతి భారతి అని నాలుగు విధములు. 'రసనివేశయోగ్యములు అను పాఠముకన్న 'రసనిదేశయోగ్యములు' అనియుంట లెస్స నిదేశమన నిర్దేశము రసనిర్దేశమునకు = రసప్రకటనమునకు లేక రసవ్యక్తికి యోగ్యములు = తగినవి అనునర్థము లభించును. 'వృత్తులు సాక్షాద్రసోపస్కారకములు అని నిష్కృష్టార్థము ఇవి రచన నాశ్రయించి యుండునని చెప్పఁబడినది ఇట్లు రచనాశ్రయంబులనరాదు. నటనాశ్రయంబు లనవలెను. ఏలన రీతులను రచనాశ్రయములే యని ముందుఁజెప్పుచున్నాఁడు. వృత్తులు నాట్యాశ్రయములు రీతులు రచనాశ్రయములు నని వ్యవహారము. వృత్తులు నాట్యాశ్రయములు గాన సాక్షాద్రసోపస్కారకములు రీతులు రచనా శ్రయములుగానఁ బరంపరగా రసోపస్కారకములు మఱియు రీతులు కైశిక్యాది

వృత్తులను వ్యక్తముసేయును రీతులనఁగా గుణసమష్టిరూపములుగాన మాధుర్యాది తత్తద్గుణములు రచనానిష్ఠములుగాన నా రీతులు కైశిక్యాది వృత్తులను వ్యక్తము సేయును ఆ వృత్తులు రసోపస్కారములు చూడుఁడు

శ్లో॥ ముహురంగుళి సంవృతాధరోష్ఠం ప్రతిషేధాక్షర విక్లబాభిరామం
ముహురంసవివర్తి పక్ష్మలాక్ష్యాః కథమప్యున్నమితం న చుంబితంతు

దుష్యంతుఁడు ముద్దాడఁబోయినప్పటి శకుంతలానాట్యమును (action) గాళిదాసకవి యీ విధముగా వర్ణించుచున్నాఁడు శకుంతల దుష్యంతుఁడుదన్ను ముద్దాడరాఁగాఁ 'దనవ్రేళుల నధరోష్ఠమును మాటిమాటికిని మూసికొనుచున్నది వలదు వలదని ప్రతిషేధాక్షరముల నాడుచున్నది మొగము నటునిటు దిప్పుకొనుచున్నది అట్టి మొగము నెట్లో యతిప్రయత్నముచే ముద్దాడనెత్తితిని కాని అయ్యో ముద్దాడలేకపోయితిని' అని దీని యర్థము.

ఇచ్చటి శకుంతల యొక్క యప్పటి నాట్యము (action) కైశికీవృత్తి యనఁబడును. ఇట్టి వృత్తికి మృదుమధురమగు రచన లేక రీతి కావలయును అట్టి రీతికి వైదర్భి యని పేరు. అది ముందువచ్చును అట్టి రచనచేత నా వృత్తి చక్కగా వ్యక్తమగును ఏలన వృత్తి యాంగికాభినయరూపము "రసోచితశ్చేష్టా విశేషో వృత్తిః (అభినవగుప్తుఁడు) రీతి వాచికాభినయరూపము వాచికాభినయ ముతోఁ గూడిన యాంగికాభినయమే రసస్ఫూర్తినిఁ గలిగించునుగదా దాన సామాజికులకు రసమనుభవమునకు వచ్చును ఇట్లే యితర రీతులు గూడ నా యా వృత్తులను (actions) వ్యక్తము చేయును అప్పుడు రసానుభవము సహృదయులకుఁ గలుగును. కావుననే రీతులు వృత్తులను స్ఫుటీకరించునని (వ్యక్తము చేయునని) చెప్పితిమి ఇట్లగుట వృత్తులు సాక్షాద్రసోపస్కారము లనియు, రీతులు పరంపరగా రసోపస్కారములనియుఁ జెప్పితిమి.

మ॥ చెలఁగుం గైశికి కోమలార్థరచనా శ్రీ, నుద్ధతార్థక్రమా
చలితాడంబరమూర్తి యారభటి; యీషత్ప్రౌఢసందర్భ ని
శ్చలయౌ భారతిబోల్చు; సాత్త్వతియు నీషత్కోమలార్థక్రమం
బుల; నీవృత్తులకున్ యథోచితరసస్ఫూర్తుల్ నిరూపించెదన్.

క్రమాచలితాడంబరమూర్తి (పా) క్రమాస్ఖలితాడంబరమూర్తి

తా. కోమలమైన యర్థమును వర్ణించుట కైశికీవృత్తి మిక్కిలి యుద్ధతమైన యర్థమును వర్ణించుట యారభటి ఈషత్ప్రౌఢమైన యర్థమును వర్ణించుట భారతీవృత్తి ఈషత్కోమలమైన యర్థమును వర్ణించుట సాత్త్వతి (ఇట రచనా, సందర్భ పదములకు 'వర్ణనము' అని యర్థము మఱియు 'క్రమాచలితాడంబరమూర్తి అన్న సమాసము క్లిష్టముగానున్నది). ఈ వృత్తుల కే యే రసము లుచితములో నిరూపింతును

ఇటఁ గోమలార్థము, ఉద్ధతార్థము అనునెడల 'అర్థ మన నేమి? కావ్యము లేక యితివృత్తమునందలి రసఘట్టములు. అర్థమనఁగా 'రసము' అనియు నర్థమున్నట్లు ప్రతాపరుద్రీయ వాక్యములు తెలుపుచున్నవి చూడుఁడు :

"అత్యర్థసుకుమారార్థ సందర్భా కైశికీ మతా
అత్యుద్ధతార్థసందర్భా వృత్తిరారభటీ స్మృతా
ఈషన్మృద్వర్థసందర్భా భారతీవృత్తిరిష్యతే
ఈషత్ప్రౌఢార్థసందర్భా సాత్త్వతీవృత్తిరిష్యతే"

అని నొడివి "అత్యర్థ సుకుమారౌ ద్వౌ శృంగారకరుణౌ మతౌ
అత్యుద్ధతరసౌ రౌద్ర బీభత్సౌ పరికీర్తితౌ
హాస్యశాంతాద్భుతాః కించిత్సుకుమారాః ప్రకీర్తితాః
ఈషత్ప్రౌఢౌ సమాఖ్యాతౌ రసౌ వీరభయానకౌ"

శృంగారకరుణము లతిసుకుమారములు; రౌద్రబీభత్సములు మిక్కిలి యుద్ధతములు, హాస్యశాంతాద్భుతము లంఁతిసుకుమారములు వీరభయానకము లంఁతిగాఁ బ్రౌఢములు అని వచించెను. అత్యర్థసుకుమారార్థసందర్భమునకు వివరణముగా "అత్యర్థసుకుమారౌద్వౌ శృంగారకరుణౌ మతౌ" అని చెప్పుటచే 'అర్థ' మన రసమనియే యభిప్రాయము మఱియు నాతఁడే "యత్రశృంగార కరుణావతికోమలేన సందర్భేణ వర్ణ్యేతే తత్రకైశికీ" యని వృత్తిని గూర్చి వ్రాసికొనియున్నాఁడు దీనివలనను అర్థమన రసమనియే యభిప్రాయము. "యత్ర......సందర్భేణ వర్ణ్యేతే" అను లక్షణవివరణమునుబట్టి శృంగార కరుణరసములు కోమలసందర్భముచే (రచనచే) వర్ణింపఁబడవలెననియుఁ దేట పడుచున్నది ఈ యభిప్రాయమునే మేముగూడ వృత్తులను రీతులు స్ఫుటీక రించునని వెనుకఁ జెప్పియుంటిమి.

అభినవగుప్తుఁడు అర్థ శబ్దమునకు నొకానొకచో రసమనియే యర్థమును జెప్పెను "కావ్యేచ నాట్యాయమాన ఏవ రసః కావ్యార్థః కావ్యస్య అర్థః కావ్యార్థః (అర్థ్యతే ప్రాధాన్యేన ఇత్యర్థః నత్వర్థః అభిధేయవాచీ)" కాన అర్థ' మన రసమనియు రసవంతమైన యితివృత్తాదులనియు మనము గ్రహింపవచ్చును *

* దీని కవష్టంభకముగా Some concepts of Alankara Sastra అను గ్రంథమున నిట్లు గలదు

"They keep the concept of the four ancient Vrittis derived from Natya, Kaisiki etc " and hold them, as Anandavardhana did as the name of the development or delineation of such ideas Arthas are in consonance with Rasa".

కాన శృంగారమున కనుకూలమైన నాయికానాయకుల వ్యాపారములు (actions) మలయానిల, సాయంకాల.. పుష్పోద్యానాదులును కోమలార్థములు. వీని వర్ణనము కైశికీవృత్తి ఉద్ధతార్థమన హృదయోద్రేకమును లేక చిత్తదీప్తిని గలిగించు యుద్ధాదిఘట్టములు వీని వర్ణనమారభటీవృత్తి ఇఁక సాత్త్వతీ భారతులను గూర్చి యిచ్చిన నరసభూపాలీయ లక్షణము దుష్టము పై ప్రతాపరుద్రీయ లక్షణమున (ఈషన్మృద్వర్థసందర్భా భారతీవృత్తి రిష్యతే) అని యుండఁగా "ఈషత్ప్రౌఢసందర్భనిశ్చలయా భారతి" అనియు "ఈషత్ప్రౌఢార్థసందర్భా సాత్త్వతీవృత్తిరిష్యతే" అని యుండఁగా "ఈషత్కోమలార్థక్రమము" అనియు నొకదాని లక్షణమును మఱొకదాని కంటఁగట్టినాఁడు గ్రంథకర్త ఈషన్మృదువగు నర్థముల వర్ణనము భారతీవృత్తి. ఈషత్ప్రౌఢములు అనఁగా నీషదుద్ధతములగు నర్థముల వర్ణనము సాత్త్వతీవృత్తి.

ప్రతాపరుద్రీయనరసభూపాలీయ కర్తలిరువురును కైశిక్యాది వృత్తుల లక్షణములను జెప్పుచు, నందుఁగొంత రీతినిఁగూఁడ గలుపుచువచ్చిరి కైశిక్యాది వృత్తిలక్షణములను విపిత్రముగాఁ జెప్పరైరి.

భరతుని మతమునఁ గైశికీ ఆరభటీ, సాత్త్వతీ వృత్తులు మూఁడును అర్థవృత్తులు అర్థమన రసమని కానీ రసానుకూలములగు విషయములని కానీ చెప్పియుంటిమి ఇఁక భారతీవృత్తి శబ్దవృత్తి అనఁగా వాగ్వ్యవహారము (భారతీసంస్కృతప్రాయా వాగ్వ్యాపారో నటాశ్రయః) విద్యానాథుఁడు శబ్దవృత్తియగు భారతీవృత్తినిఁ గూడ నర్థవృత్తినిగా మార్చి (ఈషత్ప్రౌఢార్థసందర్భా భారతీవృత్తి రిష్యతే) అని లక్షణమును వ్రాసెను భరతుని మతమున మూఁడర్థవృత్తులని తెలిపితిమి, వృత్తులను రీతులు వ్యక్తీకరించునని చెప్పియుంటిమికదా కావున మూఁడు వృత్తులకు మూఁడు రీతులు గావలయును. రీతి యన శబ్దముల కూర్పు గదా అదియేకదా భారతీవృత్తి కావున నీ భారతీవృత్తియే మూఁడు రీతులయ్యెను భారతీవృత్తి యనఁ గావ్యమందలి వాగ్వ్యవహారము లేక వాగ్రచన లేక శబ్దరచన ఈ శబ్దరచన మువ్విధములు. ఈ ముత్తెఱఁగులగు రీతులును ముత్తెఱఁగులగు వృత్తులను స్ఫుటీకరించును భారతీవృత్తి నర్థవృత్తిగా మార్చినచో మూఁడేరీతులు వాని నాల్గింటి నెట్లు స్ఫుటపఱుపఁగలవు? అప్పుడు నాలుగు రీతులు గావలయును సాహిత్యదర్పణకారాదులు నాలుగు రీతులు స్వీకరించిరి. కానీ, న్యాయముగా విచారింపఁగా మూఁడు వృత్తులును మూఁడు రీతులును జాలునని నా యాశయము మూఁడు వృత్తులు మూఁడు రీతులు, మూఁడు గుణములు, మూఁడు పాకములు నున్నచోఁ బరస్పరసంబంధబాంధవ్యములు సముచితముగానుండును.

గీ. కైశికి చెలంగు శృంగారకరుణ లందు
నారభటి రౌద్రభీభత్సహారిణి యగు
నలరు భారతి హాస్యశాంతాద్భుతముల
నమరు సాత్త్వతి వీరభయానకముల. ౭౪

స్పష్టము (కరుణాపదము దుష్టము—కరుణములందు అనవలెను)

కైశికి

ఉ. తిన్నని మేను, గన్నగవ, తేటలుఁ దేనియలొల్కు మాటలున్
సన్నపుఁ గౌనుఁ గుందనపుఁ జాయలు దేలు మెఱుంగుఁ జెక్కులున్
గ్రొన్నెలవంటి నెన్నుదురు, గుబ్బచనుంగవ, తళ్కుచూపులున్
జెన్నెసలారఁ గన్య నరసింహునిఁ జూచె విలాసధన్యయై ౭౫

తళ్కుచూపులున్ (పా) తళ్కుచెక్కులున్

ఇట శృంగారరసానుకూలమగు వస్తువు కన్య. కాన దాని వర్ణనము కైశికీవృత్తి ఈ వృత్తిని (వైదర్భీ) రీతి స్ఫుటీకరించుచున్నది. అనఁగా నీ పద్యమున వైదర్భీ రీతిచే శృంగారరసము వ్యక్తమగుచున్నది. (అత్యర్థ సుకుమారార్థసందర్భా కైశికీ మతా)

ఆరభటి

ప్రతిపక్షక్ష్మాపవక్షః ఫలకవిదళన ప్రౌఢగాఢ ప్రతాప
ప్రతిభాసంరంభగుంభప్రబలసుబల శుంభన్నృసింహోగ్రరంహో
యుతమై కల్పాంతదృప్యద్ద్యుమణి ధగధగప్రోద్యతజ్వాలజాల
ప్రతికూలప్రక్రమంబై పరగు నరసభూపాలదోఃఖడ్గ మాజిన్. ౭౬

ఆ నరసరాజు చేతికత్తి శాత్రవుల గుండెలు చీల్చుటయందుఁ బ్రోదయై ప్రళయకాలార్కుని వలె మంటలు గురియుచున్నది.

ఇందు యుద్ధఘట్టమునందుఁ దాండవించు నరసభూపాలుని ఖడ్గము వర్ణింపఁబడినది. ఇది రౌద్రరసానుకూలమగు వస్తువు. దీనిని గౌడీ రీతి స్ఫుటీకరించును. అనఁగా నీ పద్యమున గౌడీ రీతిచే రౌద్రరసము వ్యక్తమగుచున్నది. (అత్యుద్ధతార్థసందర్భావృత్తి రారభటీ స్మృతా).

భా ర తి

సీ. నీ కీర్తి కెనయని నెగడిన సురదంతి
 శిరము మధ్యేభిన్నతరముగాదె!
నీ కీర్తితోఁ బ్రతి నెరసిన యిందుమం
 డలము పదాఱుఖండములు గాదె!
నీ కీర్తి నొరసిన కాకోదరస్వామి
 తల సహస్రచ్ఛిదాకులము గాదె!
నీ కీర్తిఁ బోలఁ బూనిన ధవళాంభోధి
 తతి శతధాదళితంబు గాదె!

గీ. అహాహ! నీ కీర్తి కవనిలో సమరకరియు
గిరియు నిందుండు గిందుఁడు నురగపతియు
గిరియుఁ దెలిద మరలచాలు గీలు నెనయె?
యాచకేంద్రుని నారసింహక్షితీంద్ర! ౭౮

ప్రతినెరసిన (పా) ప్రీతినెరసిన మధ్యేభిన్నతరము (పా) మధ్యము భిన్నతరము

'మధ్యేభిన్నతరము' అను పదమసాధువు 'పారే మధ్యే షష్ఠ్యావా' అను పాణిని సూత్రముచే షష్ఠ్యర్థమునందే పారే మధ్యే పదములు విపతితములు. ఇట షష్ఠ్యర్థము లేదు.

నీ కీర్తికి సాటివచ్చినవి యట్లుగాక యేమగును! అనునది యద్భుతము గదా!

ఇది యద్భుత రసానుకూలమగు వస్తువర్ణనము దీనిని వైదర్భీరీతి వ్యక్తము సేయుచున్నది (ఈషన్మృద్వర్థసందర్భా భారతీవృత్తి రిష్యతే).

సా త్త్వ తి

చ. ఉభయరగండ: తావకరణోగ్రజయానకముల్ ఘుభుల్ ఘుభుల్
ఘుభులని మ్రోయఁగా భవదకుంఠితవీరభటుల్ 'ప్రభుల్ ప్రభుల్
ప్రభు'లని శత్రుభూపతులపైఁ దొలఁకాలుఁ నెడన్ 'విభుల్ విభుల్
విభు'లని సంభ్రమింపుదురు వేడ్క నఖర్వసుపర్వభామినుల్.

ఇట వీరశృంగారానుకూలమగు వస్తువర్ణనము గలదు వీనినిఁ బాంచాలి రీతి వ్యక్తము సేయుచున్నది. (తత్రోద్భార్థసందర్భా సాత్వతీవృత్తిరిష్యతే)

గీ. ఇంక రీతులు వివరింతు వృత్తులట్లు
సముచితార్థపదన్యాస సౌష్ఠవములు
గాక సందర్భమాత్రసంగతములైన
కతన రీతులు వృత్తిభిన్నతఁ జెలంగు. ౩౯

తా వృత్తులవలె రీతులు సముచితార్థపదన్యాస సౌష్ఠవములు గాక, కేవలముగా సందర్భసంగతములు కావున వృత్తిరీతులు భిన్నములు.

'సముచితార్థపదన్యాససౌష్ఠవములు అన సముచితమైన అర్థము గల పదముల యొక్క న్యాససౌష్ఠవము గలవి అని యర్థము. న్యాససౌష్ఠవమనఁ గూర్పు యొక్క చక్కన యనఁగాఁ 'ఇక్కని కూర్పు అని భావము వచ్చును కానీ పదన్యాససౌష్ఠవ మనుదానికి 'వర్ణనము అనునర్థము చేసికొని, సముచితమైన యర్థము (రసానుకూల వస్తువు) యొక్క వర్ణనము గలవి 'వృత్తులు' అని చెప్పుకొనవలయును. లేనిచో నర్థము కుదరదు ఈ విషయమును వెనుకఁ బ్రస్తావించియుంటిమి. ఇక రీతులు సముచితార్థము నపేక్షింపక, కేవలము 'శబ్దములకూర్పు' రూపమున నుండును అని చెప్పబడినది. ఈ మాట పొసఁగదు. రీతులు సముచితార్థమును (రసానుకూలమగు వస్తువును) నపేక్షింపనిచో శృంగారమున గౌడీ రీతియు రౌద్రమున వైదర్భీ రీతియు వ్యవహరింపవచ్చునని యభిప్రాయము వచ్చును అట్లే యగుచో నట్టిరచన రసప్రతిబంధకమగును రీతులు గూడ రసవ్యక్తి హేతువులే.

తత్ర రసోపకారిణ్యస్తత్తద్దేశ సముద్భవాః
పద్యేషు రీతయో గౌడీవైదర్భీ మాగధీ తథా॥

ఆ యా దేశముల వలనఁ బుట్టిన గౌడీ వైదర్భీ, మాగధీ (పాంచాలీ) రీతులు రసోపకారిణులు అని యలంకారశేఖరమునను గలదు

రీతులెప్పుడును వృత్తులనాశ్రయించియే యుండును వృత్తుల యభివ్యక్తికి రీతుల సాహాయ్య మపేక్షితమైయున్నది. కావున నివి యన్యోన్యాశ్రయములై యున్నవి వృత్తులు రీతుల మూలమునసనే భాసించును గనుక రీతులను విడిచి వృత్తులుండవు. అట్లగుటచే సాహిత్యదర్పణకారాదులు తమ గ్రంథములలోఁ గైశిక్యాది వృత్తులను గూర్చి తడవక కేవలము రీతులనే చెప్పి వదలిరి కావున మనము వృత్తి రీతులకు భేదము నీ క్రిందివిధమునఁ దెలిసికొనవలయును వృత్తులర్థాశ్రయములు అనఁగా రసానుకూల నాయికానాయక వ్యాపారములు లేక

రసానుకూల వస్తువులు కాన సాక్షాద్రసోపస్కారములు. రీతు లీ వృత్తుల నుచితముగా వ్యక్తముసేయునవి కానఁ బరంపరగా రసోపస్కారములు

"స్త్రీతినామాఽపిమధురం" (స్త్రీ యను పేరు గూడ మధురము) అని యున్నది కావున శృంగారరసమున కాలంబనమైన స్త్రీ మధురపాత్రమైనపుడు దాని చేష్టలును దాని యుద్దీపనసామగ్రియు మధురములే కదా కావున వీనిని వినఁగానే యప్రయత్నముగానే శృంగారముబుకును అట్లే యుద్ధాదిఘట్టములను గూర్చి వినఁగానే మనకు రౌద్రరసముబుకును. కావుననే వృత్తులు సాక్షాద్రసోపస్కారములని చెప్పితిమి.

గీ పరగు రీతులు కోమలప్రౌఢపదవి
ధానవాసన; నందు వైదర్భియనఁగ
గౌడి పాంచాలి యనఁబొల్చుఁ; గ్రమముతోడ
వీనికిని లక్షణంబులు విస్తరింతు. ౮౦

టీ కోమలపదరచనను బట్టియుఁ బ్రౌఢపదరచనను బట్టియు నుభయ విధమగు రచనను బట్టియు వైదర్భి గౌడి పాంచాలి యని రీతి మూఁడువిధములు.

గీ. అతిమృదులబంధయుత, యనాయతసమాస
దనరు వైదర్భి; రూక్షబంధయును, ఖరస
మాసయగు గౌడి; యుభయాత్మమహిమ గలిగి
యలరుఁ బాంచాలి; వీని లక్ష్యములొనర్తు. ౮౧

టీ మిక్కిలి మృదుపదములును అల్పసమాసము గాని లేక యసమాసము గాని కల రచన వైదర్భి పరుషాక్షరములతోఁగూడిన పదములును, దీర్ఘసమాసములును గల రచన గౌడి. కొంత మృదుపదరచనయుఁ గొంత పరుషపదరచనయుఁ గలది పాంచాలి వీని లక్షణములను జూపుదును

వైదర్భి

శా. ఆ లావణ్య మగణ్య; మా గుణగణం బవ్యాజ; మా తేజము
ద్వేలం; బావినయంబమేయతర; మావీర్యంబనిర్వాచ్య; మా
యాలాపం బతిసత్య మావితరణం బాశాంతవిశ్రాంత; మా
శీలం బార్జవమూలమెన్నఁదరమే? శ్రీనారసింహేంద్రునిన్.

ఇందన్నియు మృదుపదములే సమాసము లేదు 'ఆశాంత విశ్రాంత' మనుచోట 'స్వల్ప'సమాసము గలదు ఇది వైదర్భి రీతి

గౌడి

శా. అంభోరాశిగభీర యోబయనృసింహా నీ రణోద స్త్రదోః
స్తంభోత్తంభితజృంభితాసిలతికాసంరంభసంభావనా
దంభానర్గళదుర్గ దుర్గమమదోద్యద్దుష్టధృష్టారి రా
ట్శుంభచ్చుంభనిశుంభసంభ్రమహరస్ఫూర్తిన్ విడంబించురా!

తా నీ దోఃస్తంభమున విజృంభించుచున్న ఖడ్గలత యను కాళికాదేవి శత్రురాజులను శుంభనిశుంభులను హరించుచున్నది

ఇందుఁ బరుషాక్షరములు గల పదములును దీర్ఘసమాసములును గలవు. కాన గౌడి,

పాంచాలి

శా. ఆరూఢిం దప మాచరించెదవు చంద్రా! యల్ల మందాకినీ
తీరక్షోణితటిన్ మహానటజటాదీర్ఘాటవీవాటిలోఁ
బ్రారబ్ధం బగు మేనియంకము హరింపన్ వేడి; యింతేల? నీ
కారాధింపఁగరాదె! యోబయనృసింహాధ్యక్షుసత్కీర్తులన్

తటిః మహానట (పా) నటన్మహానట రటన్మహానట.

ఇటఁ గొంత దీర్ఘసమాసమును గొంత మృదుపదబంధము గలదు కానఁ బాంచాలి

న్యాయముగా 'రీతి యన గుణసంకలనరూపమే కదా! కావున రీతులను గూర్చి చెప్పినపు డా రీతులు వేనివలన నేర్పడుచున్నవో యా గుణముల నటనే చెప్పవలసి యున్నది. కాని యీ విచారము ప్రత్యేకముగా వేఱొకచోటఁ జేయఁబడి యున్నది

పాకము

ఉ పాక మిదీరితార్థపరిపాక మనఁదగు; నందు గోస్తనీ
పాకము, నారికేళఫలపాక మనన్ ద్వివిధంబు గోస్తనీ
పాక మసంవృతార్థపరిపాకనివేద్యము; నారికేళ పా
కాకలనంబుగూఢనిబిడార్థవిచార్యము; వీనిలక్ష్యముల్. లా

అర్థము యొక్క పాకములు రెండు విధములు అర్థమనఁగా నిట భావము ద్రాక్షాపాకమనియు నారికేళపాకమనియు నిరుదెఱఁగులు ద్రాక్షాపాక మనఁగా నసంవృతమైన (అగూఢమైన) యర్థము యొక్క రుచి. నారికేళ

పాకమన గూఢమైన యర్థము యొక్క రుచి మఱియు నీ విశేషమును గ్రహింపవలెను. ద్రాక్షాఫలము యొక్క రుచిని జూచుట మిక్కిలి సుకరము. చెట్టునుండి కోయఁగానే యప్రయత్నముగా దాని రుచి ననుభవింపవచ్చును. అట్లే యెట్టి బుద్ధిప్రయత్నమును నక్కఱలేకయే గోచరించి యానందపఱచు నర్థభేదము ద్రాక్షాపాకము.

ఇఁక నారికేళము యొక్క రుచి చూచుట మిక్కిలి దుష్కరము పెద్ద పొడవైన యీ చెట్టెక్కి కోసి సిమెంటు చేసినట్లున్న దాని పైనున్న దట్టమైన బెరడును గునపముతోఁ దీసి, టెంకను బగులఁగొట్టి లోని కొబ్బెరను గట్టిగా నమలవలెను అప్పటికిఁగాని దాని రుచి తెలియదు కాన నధిక బుద్ధిప్రయత్నముచేఁ దెలియఁదగిన యర్థభేదము నారికేళపాకము. ఎంత యత్నించినను నారికేళ పాకము ద్రాక్షాపాకము వంటిది గాదు. ఇవిగాక కదళీపాకమనియు మఱియొకటి గలదు. కదళీఫలమును రుచి చూచుటకు ద్రాక్షాఫలమును రుచి చూచునంత సౌలభ్యము గానీ నారికేళము రుచి చూచునంత క్లేశము గానీ యుండదు కదళీఫలమును పైనున్న చర్మమును దీసి యలఁతిజతనముతో నమలుదుము. కాన నాతికఠినమును నాతిసులభమును గాని యర్థభేదము కదళీపాకము.

మఱియొక విశేషమును గమనింపవలెను ద్రాక్షాఫలమునఁ బరిత్యాజ్యమగునదేదియును లేదు. కదళీఫలమున నలఁతిగాఁ బరిత్యాజ్యము గలదు. నారికేళమునఁ బరిత్యాజ్యమధికము కాన సర్వాకారముగా మధురమును బ్రచురముగా మధురమును అల్పమధురమును నగు కావ్యము లాయాపాకముగాఁ బరిగణింపఁబడును కదళీపాకమును గూర్చి విద్యానాథుఁడును బట్టుమూర్తియును దెలుపరైరి కాని యిది యవసరమే ఏలన మూఁడర్థవృత్తులకును మూఁడు రీతులు వలయును మూఁడు రీతులకును మూఁడు గుణములు వలయును (వామనమతమున ౧౦ గుణము లున్నవి) ఆ వృత్తి రీతి గుణముల యొక్క కలయికవలనఁ గలిగిన (పానకరసన్యాయమునఁ గలిగిన) రుచిభేదమే పాకము కావున మూఁడు పాకము లుండవలయును.

ద్రాక్షాపాకము

కం. వాలికలై వెలిదమ్మిల
పోలికలై చందమామపులుఁగులకును దా
మేలికలైన నిరీక్షణ
మాలికల నృసింహుఁ జూచె మదవతి వేడ్కన్. ౭౬

ఇచ్చటఁ బద్యభావమయత్నముగా గోచరించుచున్నది కాన ద్రాక్షాపాకము. ఇట్లే—

ఉ. నిక్కము దాఁపనేల ధరణీసురనందన! నాకు నీ పయిం
జిక్కె మనంబు నింక ననుఁ జిత్తజుబారికి నప్పగించెదో?
చొక్కి మరందమద్యములచూఱలఁ బాటలుపాడు తేంట్ల సొం
పెక్కిన యట్టిపూవుఁబొదరిండ్లను గౌఁగిట గారవించెదో?

ఇందును ద్రాక్షాపాకము గలదు

నారికేళ పాకము

మ. వరభూపాదులపై మనం బిడక, దృగ్వ్యాపార మొంతేఁ బర
స్పరసందర్శననాతిభిన్న మయి చూపట్టంగఁ గార్యాంతర
స్మరణం బేమియు లేక నిశ్చలత నీ సాంగత్యముం గోరి మా
హరిణీలోచన యాత్మయందు నరసింహా! నిన్నె భావించెరా!

తా. మా చెలికత్తె తన మనస్సును ధనకనకవస్తువాహనాదులపైఁబోనీక (ఇతరులు దన కివి యిత్తునన్నను లెక్కింపక) దృగ్వ్యాపారమొకరినొకరు చూచుకొనుటకన్న భిన్నముగానిదికాఁగా ననఁగా నిన్నదియు దానిని నీవును జూచుచున్నట్లుగానే చూపట్టఁగా దేనినిగూడఁ దలంపక నీ సాంగత్యమును గోరి యాత్మయందు నిన్నే స్మరించుచున్నది

పరస్పరసందర్శన నాతిభిన్నము అర్థము విస్పష్టముగా గోచరింపక క్లేశముచే గోచరించుచున్నది కాన నారికేళపాకము. ఈ నారికేళపాకమునకు వెనుకటి అరభటీవృత్తికుదాహృతమగు (ప్రతిపక్షక్ష్మాప) పద్యముగూడఁదగినది. మఱియు ఆముక్తమాల్యద లోని పెక్కు పద్యముల నుదాహరింపవచ్చును

కదళీపాకము

ఉ. నిండుమనంబు నవ్యనవనీతసమానము పల్కుదారుణా
ఖండలశస్త్రతుల్యము జగన్నుత! విప్రులయందు; నుర్వి నీ
రెండును రాజులందు విపరీతము గావున విప్రుఁడోపు నో
పం డతిశాంతుఁడయ్యు నరపాలుఁడు శాపము గ్రమ్మఱింపఁగన్.

ఇందలి 'విపరీతము అనుపదము బ్రాహ్మణధర్మమునకు క్షత్రియధర్మము విరుద్ధమైనది (తలక్రిందు) అనునర్థమును బోధించును ఈ పద్యమును రెండు సారులు చదివినఁగాని యర్థము గోచరింపదు అలంకృతజతనము గావలయుగానఁ గదళీపాకము

ము త్తముమీఁద నీ క్రింది విషయమును గ్రహింపవలెను. కైశికీ వృత్తి వైదర్భీరీతి మాధుర్యగుణము ద్రాక్షాపాకమును; ఆరభటీవృత్తి, గౌడీ రీతి ఓజోగుణము నారికేళపాకమును; సాత్త్వతీవృత్తి, పాంచాలీ రీతి, ప్రసాదగుణము కదళీపాకమును, అన్యోన్యాశ్రయములుగానుండును ఇంకను వీని వివేచనము ముందు చేయుదుము.

శయ్య

కం. కదిసి పదంబులు ముందటి
పదములతోఁ బరమమైత్రిఁ బరగి పరపదా
స్పద మనకుండినగతులం
దది శయ్య, తదీయలక్ష్య మాపాదింతున్. ౮౮

తా "పదములయొద్దిక లేక పదములపొత్తు శయ్య" అనఁగా నే పదము వెంట నే పదము గూర్చిన సొబగో యది శయ్య. స్త్రీపురుషులు వేషముల ధరించునపుడే చీరకు నే రవిక యందమో యే కోటునకు నే షర్టు అందమో విచారించుకొందురు కదా అట్లే పదరచన యందును పొత్తుండవలెను పొత్తు పొసఁగని పదరచన కూడదు. ఈ శయ్యనే పరివృత్త్యసహిష్ణుత యందురు. (పరపదాస్పదము – పరివృత్తి సహిష్ణుత)

కం. (రతిపతివో చెలువున! భా
రతిపతివో? నుతగుణాభిరామత రామ
క్షితిపతివో! ధర నోబ
ళపతినరసింహా! శౌర్యజితనరసింహా!

ఇది యనుప్రాసభూయిష్ఠముగానున్నది కాఁబట్టి యిట్లనుప్రాసభూయిష్ఠము గానుంటయే శయ్య యని భ్రమింపరాదు. చూడుఁడు—

కం. (చెఱనుండి ముక్తి గాంచిన
నరుగతి నీ దేహబంధనము వీడి మహ
త్తరగతిఁ బొందెడి జీవుల
కొఱకై చింతింప బద్ధకోటికిఁ దగునే?)

ఇందును బదములయొద్దికగలదు. ఇదియుఁ బరివృత్త్యసహిష్ణువే. శయ్యకు శబ్దపాకమనియు ద్రాక్షాదిపాకములకర్థపాకమనియు నామాంతరము.

వెనుక రీతులు గుణసమూహరూపములని చెప్పితిమిగదా రీతులలోఁ బదములను మార్పవచ్చును పరివృత్త్యసహిష్ణువుగా గుణములను సంకలనము చేయుటయే శయ్య యగును కావున శయ్య రీతుల ధర్మమనవచ్చును. ఆ యా

రీతులకుఁ దగిన విధమునఁ బరివృత్యసహిష్ణువుగా గుణసంకలనము చేసినయెడల శయ్య యగును

ఈ శయ్యావిషయమునఁ గవులు జాగరూకత వహింపవలెను. వామనుఁడు—

మాలాకారో రచయితి యథా సాధు విజ్ఞాయ మాలాం
యోజ్యం కావ్యే ష్వవహితధియా తద్వదేవాభిధానం"

పూలమాలను గట్టువాఁ డేపువ్వు నేపువ్వుతో జోడించినచో బాగుగానుండునో యది లెస్సగా విచారించి కట్టునట్లు కవియు నవధానముచే నే పదముతో నే పదమును జోడించిన నందముగానుండునో తెలిసికొని రచింపవలెను" అని చెప్పెను

అంగ్లమునఁగూడ నీ శయ్య గలదు క్రిందఁ జూడుఁడు *

Wordsworth మహాకవియు నిట్టి యభిప్రాయమునే తెలిపెను "The choice of best words in best place"

మఱియు పింగళి సూరన—

"సీ. పొసఁగ ముత్తెపుసరుల్ పోహణించినరీతిఁ
దమలోన దొరయు శబ్దములు గూర్చి"

అని యీ యభిప్రాయమునే తెలిపెను

ఈ వృత్తి రీతి శయ్యా పాకములను గూర్చి మఱికొంత చర్చింతము.

వృత్తి

వృత్తిశబ్దమునకు సరస్వతీకంఠాభరణవ్యాఖ్యానమున రత్నేశ్వరుఁడీ క్రింది విధమున వ్యుత్పత్తినిఁ దెలిపెను .

"యా వికాసేఽథ విక్షేపే సంకోచే విస్తరే తథా
చేతసో వర్తయిత్రీ స్యా త్సా వృత్తిస్సాఽపి షడ్విధా

"వర్తతే అనయాచిత్తం వికాసాదిషు ఇతి కరణసాధనోఽయం వృత్తిశబ్దః"

(దేనిచే ననఁగా నే వ్యాపారముచేఁ జిత్తమునకు వికాస, విక్షేప సంకోచ, విస్తరములు గలుగునో యా వ్యాపారము (నాయికానాయకాదుల వ్యాపారము)

---

* Lord Macaulay in his essay on Milton expresses the same idea He speaks of the magical influence of Poetry The expression in general means nothing, but applied to the writings of Milton it is most appropriate His poetry acts like an incantation Change the structure of the sentenee substitute one synonym for another and the whole effect is destroyed This felicity of expression of words is what Sanskrit writers on poetics called మైత్రి శయ్యా or పాక

1 Bhandarkar Commemoration Volume 403 page
(Trivedi on Bhamaha)

వృత్తి యని వ్యవహరింపఁబడును అర్థవృత్తులన్న పుదర్థశబ్దమునకు రసమనియు, రసానుకూలమగు వస్తువనియుఁ దెలిపితిమి కావున నర్థవృత్తులన నట్టి రసాను కూలములగు వ్యాపారము (actions) అని యర్థము వీనివలనఁ జిత్తవికాసా దులు కలుగును కైశికీ ఆరభటీ సాత్వతీవృత్తులర్థవృత్తులని తెలుపఁబడినవి. లోచనకారుఁడు "వ్యవహారో హి వృత్తిరుచ్యతే' (వృత్తియనఁగా వ్యవహారము) అని చెప్పెను వ్యవహారమన వ్యాపారమే ఈ వ్యాపారము శబ్దాశ్రితము అర్థా శ్రితము నని ద్వివిధము. అనఁగా శబ్దవృత్తి అర్థవృత్తి అని ద్వివిధము. శబ్దవృత్తి మఱల రెండు విధములు ౧ అభిధాదివృత్తులు ౨. ఉపనాగరకాది వృత్తులు అభిధాదివృత్తులను గూర్చి యిదివఱకే వివరించితిమి. ఇట నుపనాగరి కాది వృత్తులను గూర్చియే వివరింతుము

ఈ వృత్తులు మొదటఁ బ్రధానముగా ననుప్రాసము నాశ్రయించియుండెను ఉద్భటుఁడనుప్రాసమును పరుషా ఉపనాగరికా గ్రామ్యా లేక కోమలా అని మూఁడుతెఱఁగులుగా విభాగించెను వృత్తి యన నిట నియతవర్ణగతమగు రసవిషయ వ్యాపారము అనఁగా 'కలకలకోకిలలలితే' ఇత్యాది స్థలముల 'ల' వర్ణము పెక్కుసారులు వచ్చుటచే శ్రావ్యత గలుగుచున్నది ఇట్టి శ్రావ్యతను లేక సౌందర్యమును గూర్చు వ్యాపారమే వృత్తి. ఇదియే రసవిషయ వ్యాపా రము ఇట రసపదమునకు సౌందర్యమనియే అభిప్రాయము

రుద్రటుఁడు మధురా పరుషా ప్రౌఢా లలితా, భద్రా అని యైదు విధములుగా విభజించెను. ధ్వనికారుఁడీవృత్తులను గూర్చి సూటిగా నిర్వచింప లేదు మమ్మటుఁడు "ఏతాస్తిస్రో వృత్తయః వామనాదీనాం మతే వైదర్భీ గౌఢీ పాంచాల్యాఖ్యారీతయోభవంతి" (ఈ మూడు వృత్తులను ననఁగా కోమలా, పరుషా ఉపనాగరికా వృత్తులు వామనాదుల మతమున వైదర్భీ గౌఢీ పాంచాలీ రీతులే) అని యుద్భటుని వృత్తిత్రయమును వామనుని రీతిత్రయములో నంతర్భవింపఁజేసెను జగన్నాథుఁడు రీతిని వృత్తి యని వ్యవహరించెను "తాం విబుధా వదంతి వృత్తిం గృహీత పరిపాకాం, అస్యాశ్చరీతేర్నిర్మాణే కవినా నితరామవహితేన భావ్యం" ఇఁక నభినవగుప్తుఁడు "రీతయస్తుగుణేష్వేవ పర్యవసితాః" (రీతులు గుణములలోనే పర్యవసించును) అనియు "నైవవృత్తి రీతీనాం తద్గుణ వ్యతిరిక్తత్వం సిద్ధం" (వృత్తిరీతులు గుణవ్యతిరిక్తములు గావు) అనియుఁ దెలిపి ధ్వనికారుఁడంగీకరించిన మాధుర్యౌజః ప్రసాదములను మూఁడుగుణములలోనే వృత్తిరీతుల నంతర్భవింపఁజేసెను. రత్నేశ్వరుడు "తస్యాః (రీతేః) గుణవత్పదరచనారూపత్వాత్; అత ఏవ పానకరసన్యా యేన సంభూయ చిత్రాస్వాదపర్యవసానక్షమం గుణసంకలన మేవ రీతి రితిలోచనకారః" (రీతి యనఁగా గుణములు గల పదరచనయే; కావునఁ

ఖానకరసము వలెనే యీ గుణములన్నియును గలిసి యాస్వాదమును గలిగించును. కాన గుణసంకలనమే రీతి) అని లోచనకారుఁడు దెలిపెనని తెలిపెను. కావున నీ రీతులును వృత్తులును శబ్దాశ్రితములే కాన నామభేదమే కాని యన్యభేదము లేదు కానఁ దత్తద్రసోచితముగాఁ గావ్యమున నిరూపితములగు మాధుర్యౌజః ప్రసాదములలోనే వృత్తిరీతులంతర్భవించును.

పైని నుడివిన శబ్దవృత్తులు గాక యర్థవృత్తులని మఱికొన్ని గలవు. అర్థమనగాఁ గావ్యవస్తువు అనఁగా నితివృత్తమనియుఁ రసములనియుఁ దెలిపితిమి వృత్తియన నభినవగుప్తుఁడు "రసోచిత ఏవ చేష్టావిశేషో వృత్తిః" (ఆ యితివృత్తరసానుకూలమగు చేష్టావిశేషమే వృత్తి) అని వచించెను. అనఁగా నా యా రసానుకూలముగా నాటకాదులందు నాయకాదులు సేయు నౌచిత్య యుక్తమగు వ్యాపారము. దీనినే యాంగ్లమున action అందురు. నాటకాదు లందు శృంగారరస మభినయించు నాయకాదుల వ్యాపారము కైశికి యనియు, రౌద్రరస మభినయించు నాయకాదుల వ్యాపారము 'ఆరభటి యనియు భీభత్స మభినయించు నాయకాదుల వ్యాపారము సాత్త్వతి యనియు నభిప్రాయము. దృశ్యకావ్యమున నీ మూఁడే యర్థవృత్తులు. భరతుఁడు భారతీవృత్తిని శబ్దవృత్తి గానే పరిగణించెను. అనఁగా నాటకమునందలి వాగ్వ్యవహారము. ఈ భారతి యొక్క ప్రభేదములే వైదర్భీ గౌఢీ, పాంచాలీ రీతులు అని తెలిపియుంటిమి

ఈ యర్థవృత్తులు మొదట దృశ్యకావ్యాశ్రయములుగానున్నను లాక్ష ణికులు వీనిని శ్రవ్యకావ్యమునగూడఁ బ్రవేశపెట్టిరి అత్తఱి శబ్దవృత్తి యగు భారతీవృత్తినిఁగూడ నర్థవృత్తిని జేసికి విద్యానాథుఁడు కైశిక్యాదులగు నాలుగు వృత్తులను నర్థవృత్తులనియే చెప్పెను (మూఁడే యర్థవృత్తులుండుట న్యాయమని చెప్పితిమి) అతని ననుసరించి బట్టుమూర్తియు నాలుగర్థవృత్తుల నుదాహరించెను. ఇంతేకాదు "కైశికి చెలంగు శృంగారకరుణలందు" అను పద్యమునఁ గైశిక్యాదు లను భరతప్రోక్తములగు రసములందే కాక, యితర రసములందును నుండు నని విద్యానాథుననుసరించి చెప్పెను ఈ యర్థవృత్తులను గోమల ప్రౌఢాది రచనలు (రీతులు) స్ఫుటము చేయును రీతులచేతనే యాయా వృత్తు లాస్వాద్య మానము లగును కావున వృత్తిరీతు లన్యోన్యాశ్రయములు.

రీ తి

తత్తద్దేశీయులాశ్రయించుటంబట్టి తత్తద్దేశనామముచేఁ, గావ్యమునఁ దత్తద్రీతు లేర్పడినవి. విదర్భదేశీయులాశ్రయించిన రీతి వైదర్భి యనియు, గౌడదేశీయులాశ్రయించిన రీతి గౌఢి యనియుఁ బాంచాలదేశీయులాశ్రయించిన రీతి పాంచాలి యనియు వ్యవహరింపబడును

భామహునికన్న ముందే వైదర్భీ, గౌఢీ రీతులను రెండు కావ్యరీతులు

శ్లోకమునఁ గలవు అందు వైదర్భి యుత్తమమనియు గౌడి యధమమనియు, నభిప్రాయము ప్రబలియుండెను కాని భామహుఁడాభేదమును బాటింపక నిరసించెను కావ్యమునకుఁ బ్రధానమైన వక్రోక్తి యున్నచో నే రీతి యైన నుపాదేయమే. కాని వైదర్భీ గౌడీ భేదములను బాటించి యది యుత్తమ మనియు నిది యధమమనియుఁ జెప్పరాదని భామహుని వాదము భామహుని తరువాతివాఁడగు దండి వైదర్భీ గౌడీ రీతుల రెంటిని నంగీకరించెను ఇతఁడు దన గ్రంథమగు కావ్యాదర్శమున 'రీతి అను పదమును వాడక 'మార్గము', 'వర్త్మము' (కావ్యమార్గము కావ్యవర్త్మము) అనుపదములు వాడెను. పిమ్మట వామనుఁడు వైదర్భీ గౌడీ పాంచాలీ రీతులను మూఁటిని మాత్రమే యంగీక రించెను తరువాత రుద్రటుఁడు పై రీతులకు 'లాటీయా' అను మఱొకటిఁ జేర్చి నాలుగు సేసెను భోజుఁడు తన సరస్వతీకంఠాభరణమున రుద్రటుని నాలుగు రీతులకు మాగధీ అవంతీ నామకములగు మఱి రెండు రీతులను జేర్చి మొత్త మాఱురీతు లుదాహరించెను శారదాతనయుఁడు తన భావప్రకాశములో :

శ్లో. "ప్రతివచనం ప్రతిపురుషం తదవాంతరజాతితః ప్రతిప్రీతి
అనంత్యాత్సంక్షిప్య ప్రోక్తా కవిభి శ్చతుర్విధేత్యేషా
తాసు పంచోత్తరశతం విధాః ప్రోక్తా మనీషిభిః
గ్రంథవిస్తరభీతేన మయా తాభ్యో విరమ్యతే
త ఏవాక్షరవిన్యాసా స్తాఏవ పదపంక్తయః
పుంసిపుంసి విశేషేణ కాఽపి కాఽపి సరస్వతీ
తస్మా చ్చతుర్ధా బోద్ధవ్యా రీతిభేద ప్రకల్పనా"

అనఁగాఁ బురుషులను బట్టి నూటయిదు రీతులు గలవనియు సంక్షేపించి నాలుగు రీతులు మాత్రమే యంగీకర్తవ్యములనియుఁదెలిపెను శారదాతనయుఁడు రీతులు గ్రంథకర్తలను బట్టి యేర్పడుచున్నట్లు తెలిపెను వాస్తవమేమన నాయా రసానుకూలముగా రీతు లుండవలయును కాని కవినిఁబట్టి కాదు ప్రతాప రుద్రీయకర్త వామనమతానుసారముగా మూఁడు రీతులనే గ్రహించెను ఈ రీతి త్రయ సిద్ధాంతమే ధ్వనికారసమ్మతము నరసభూపాలీయకర్తయు నా మూఁడు రీతులనే స్వీకరించెను.

ఈ రీతి సిద్ధాంతమును మొట్టమొదట దండి లేవనెత్తెను. అతఁడు దానిని విస్పష్టముగాఁ జూపఁజాలకపోయెను. కాని, వామనుఁడు దాని నెక్కువ హేతువాద బలముతో సిద్ధాంత మొనర్చెను రీతి కావ్యాత్మయనియు (రీతిరాత్మా కావ్యస్య విశిష్టపదరచనా రీతిః" విశేషమన గుణములే యనియు (మొత్తముమీఁద గుణవత్పదరచన రీతి) నిర్వచించెను. అనఁగా గుణములన రీతి యేర్పడునని యభిప్రాయము సన్నసన్న దారములచే వివిధములయిచే

తజ్ఞువు లేర్పడు విధమునఁ గొన్ని కొన్న గుణములచేఁ గొన్ని రీతు లేర్పడునవి నిష్కృష్టార్థము వామనమతమునఁ బదిగుణములు, అతని మతమున రసమునకుఁ బ్రాధాన్యముగాక రీతికే ప్రాధాన్యము కావున నాతఁడు రీతినే కావ్యాత్మగాఁ దలఁచెను కాని ధ్వనికారుఁడు రసాదులకుఁ బ్రాధాన్యమిచ్చి రసాదిధ్వనినే కావ్యాత్మగా నంగీకరించుటచే మానవునికి గుణములాత్మధర్మము లయినట్లు మాధుర్యాదిగుణములును గావ్యాత్మ యగు రసముయొక్క ధర్మములే యగును కావున గుణములును గుణములచే నేర్పడు రీతియు రసము ననుసరించి యుండ వలెను ధ్వనికారుఁ డీరీతిని రీతిపదముతో వ్యవహరింపక, 'సంఘటన' యను పేరుతో వ్యవహరించెను ఈ సంఘటన వక్తృ వాచ్య ప్రబంధౌ (విషయ) చిత్యములఁబట్టి అసమాస అల్పసమాస, దీర్ఘసమాస-అని ముివ్విధములుగా నుండునని చెప్పెను (ఈ విషయమును జతుర్థాశ్వానము నందలి గుణప్రక రణము తుదియందుఁజూడవలెను.)

* ఈవిధముగా రీతులు వక్తృ, వాచ్య ప్రబంధౌ (విషయ) చిత్యముల

---

* మన యాలంకారికులు రీతికి వక్తృవాచ్య ప్రబంధౌ (విషయ) చిత్యములే నియామకములని చెప్పిన విధమున నాంగ్లాలంకారికులుగా గొందఱు దెలిపిరి. ఎట్లన—

"Demitrius says that there are certain subjects with the quality of elevation to which the style is thence suited Such are subjects like scenes of batt e Surely these cannot be treated in the styles called "the plain and E egant" They must be rendered in the styles ca led The elevated and the Forcible".

Demitrius gives the Elegant as the style for elegant and graceful subjects like Sring ra He says The materials of the grace are the gardens and Nymphs etc One of the two deciding factors in the grand style M Murray says, is theme, the other factor being vocabu ary In connection with the theme, the nature of the plot or the Muthos he observes that the grand style s adopted if super human or majestic figures are involved. If the characters of the p ot are super human and majestic, it seems more or less necessary that the r manner of speech, should differ from that of ordinary dramat c poetry by being more dignified. The Poet he ghtens the speech of superhman characters in order that thev may appear tru y superhuman

This is clearly a case of theme be ng a Niyamaka of style- a case of standard style ' A techn cal poetic device for a part cular end ', as Murray says of the grand style

Thus the link ng of style to theme is not absent from Western Criticism '

(Some concepts of Alankara Sastra. Page 154-155)

ననుసరించి యుండవలె నను నియమమును ధ్వనికారుఁడే మొదట స్థాపించినవాడు కావుననే గుణములు రసధర్మనులు. గుణములచే నేర్పడు రీతులును రసధర్మములే యగునని చెప్పితిమి. కేశవమిశ్రుఁడు—

"తత్తద్రసోపకారిణ్య స్తత్తద్దేశ సముద్భవాః
పద్యేషు రీతయో గౌడీ వైదర్భీమాగధీ తథా"

రీతులు రసోపకారకము లనియే తెలిపెను ప్రతాపరుద్రీయ నరసభూపాలీయ కర్తలీ విషయమును దెలుపరైరి 'రీతులు సందర్భమాత్ర సంగతములు' అని నరసభూపాలీయమునఁ గలదు. ధ్వనికారుఁడు నుడివిన విధమున రసమును బట్టి రీతిభేదమును జెప్పకొననిచోఁ గోమలమైన శృంగారరసమునఁ బరుషాక్షరబంధ దీర్ఘసమాసము లుండవచ్చును హృదయోద్రేకమును గలిగించు రౌద్రాదులందుఁ గోమలాక్షరబంధము అసమాసములు నుండవచ్చును. ఇట్లయినచో నాయారసములు వ్యక్తములుగావు దండి వామనులు రసప్రాధాన్యవాదులుగారు గాన వారీ రీతులను రసములతో మేళవింపలేదు. కావుననే "రియతే పరంపరయాగచ్ఛంతి"అనయా కరణసాధనోఽయంరీతి శబ్దః మార్గపర్యాయః (రీతి యనఁగా మార్గము దీనిచేఁ గ్రమముగా రపపదవిని (బొందుదురు) అని రత్నేశ్వరుని వ్యుత్పత్తము నరిపడుచున్నది. పింగళి సూరనయు "రసభావములకు వర్ధంబుగ వైదర్భి మొదలైనరీతు లిమ్మగనమర్చి"అని యిదే యభిప్రాయమును దెలిపెను కామధేను వీ క్రింది వ్యుత్పత్తి నిచ్చుచున్నది "రిణంతి గచ్ఛంతి అస్యాం గుణాఃఇతి రీయతే క్షరతి అస్యాం వాఙ్మధుధారా ఇతి వా రీతిః అధికరణే క్తిః" దీనియందు గుణములు నడచును (ఎత్తిల్లును) అని కానీ దీనియందు మధుధార (రసము) స్రవించుచుండును అని కాని యర్థము.

పాకము

పాక మర్థధర్మము 'అర్థగంభీరిమా పాకః' అనిప్రతాపరుద్రీయలక్షణము కాని పాక మన నర్థాస్వాదభేదము. వృత్తి, రీతి గుణముల కలయిక వలనఁ బుట్టిన యాస్వాదమే పాకము. పాకమున నానావస్తు సంయోగమునఁ గ్రొత్తక్రొత్త రుచిభేదములు గలుగునట్లే వృత్తి, రీతి గుణసంయోగమువలన రుచిభేద మేర్పడును. ఇందు రెండు పాకములే చెప్పబడినవి. కాని మూఁడు పాకము లుండవలెనని చెప్పితిమి. రాజశేఖరుఁడు నవవిధపాకములను దెలిపెను

అవి యివి —పిచుమంద బదర మృద్వీకా, వార్తాక, తంత్రిణీ, సహకార, క్రముక, త్రాపుష నారికేళపాకములు.

శయ్య

శయ్య యనఁబదమైత్రి యని చెప్పితిమి. ఇది శబ్దధర్మము. దీనిని

గూర్చి విపులముగాఁ జెప్పియుంటిమి. ఈశయ్యను దండి, వామన ధ్వనికార, మమ్మట, విశ్వనాథ, జగన్నాథాదులు దెలుపలేదు ప్రతాపరుద్రీయకర్తయే తెలిపెను దీనికి మైత్రి ముద్ర యనియు నామాంతరములు అగ్నిపురాణమునఁ గనఁబడుచున్నవి ఈశయ్యను విశ్వనాథాదులు రీతులలోనే యంతర్భవింపఁజేసిరి.

కావ్యవిశేషములు

గీ. ఇట్లు కావ్యస్వరూపంబు నేర్పరించి
యింకఁ గావ్యవిశేషముల్ బొంకపఱతు
నటనపటుధూర్జటిజటాగ్రచటులసింధు
ఘుమఘుమారంభ గంభీర గుంభనముల. ౯౦

స్పష్టము.

గీ. వ్యంగ్యము ప్రధానమైనను, నప్రధాన
మైన, నస్ఫుటమైనఁ గావ్యము త్రిసంఖ్య
నమరు నుత్తమ మధ్యమాధమత ధ్వని, గు
ణీకృతవ్యంగ్యమును జిత్రమై కడంగి. ౯౧

తా. వ్యంగ్యార్థము లేక ధ్వన్యర్థము వస్తురూపము, అలంకారరూపము' రసరూపము అని మువ్విధములుగాఁ జెప్పితిమి వీనిలో వస్తురూపవ్యంగ్యమున కుదాహరణము ఈయఁబడినవి మిగిలిన వ్యంగ్యములుదాహరింపఁబడును. ఈ త్రివిధమగు వ్యంగార్థమును ప్రధానముగా ననఁగా వాచ్యార్థముకన్న సుందరముగా గోచరించినచో నుత్తమకావ్యము అప్రధానముగా ననఁగా వ్యంగార్థముకన్న వాచ్యార్థమే సుందరముగా భాసించినచో మధ్యమకావ్యము అస్ఫుటముగా ననఁగా గూఢముగా గోచరించినచో నధమకావ్యము అస్ఫుటముగా ననఁగా వ్యంగ్యరహితమనియే యర్థమును జెప్పుకొనవలయును. "అవ్యంగ్యమవరం స్మృతం" వ్యంగ్యరహితమైన కావ్యమధమమని కావ్యప్రకాశకారుఁడు చెప్పెను.

వ్యంగ్యప్రధానమగు కావ్యము ధ్వనికావ్య మనియు, వ్యంగ్యమప్రధానముగా నున్నకావ్యము గుణీభూతవ్యంగ్య మనియు, వ్యంగ్యస్పర్శలేని కావ్యము చిత్రమనియు వ్యవహారము.

మమ్మట విశ్వనాథాదులెల్లరును నీ విధమునఁ గావ్యము త్రివిధముగానే వ్యవహరించిరి. కాని జగన్నాథపండితుఁడు. ఉత్తమోత్తమము ఉత్తమము, మధ్యమము, అధమము అని నాలుగు విధములుగా విభజించెను. మమ్మటాదుల యుత్తమకావ్యము నీతఁడుత్తమోత్తమముగా గ్రహించెను. వ్యంగ్యార్థ మప్ర

ధానమైనను జమత్కారకారణమగునో నది యుత్తమకావ్యము (యత్ర వ్యంగ్య మప్రధాన మేవ సత్ చమత్కారకారణం తద్ద్వితీయం) అని చెప్పి యీ క్రింది శ్లోకము నుదాహరించెను

శ్లో॥ రాఘవవిరహజ్వాలా| సంతాపితసహ్యశైలశిఖరేషు
శిశిరే సుఖం శయానాః కపయః కుప్యంతి పవనతనయాయ.

కం॥ అలరామునిదగు విరహా
నలమునఁ గడుఁగ్రాఁగు సహ్యనగశిఖరములం
జలితటి సుఖముండిన కోఁ
తులు కని హనుమంతుఁ గినియఁ దొడఁగెఁ గడిఁదియున్

హనుమంతుఁడు సీతాకుశలవార్తను శ్రీరామునికి నివేదించెను. అది వినఁగానే రాముని విరహతాపము చల్లాఱినది అనఁగా రాముఁడు చల్లబడినాఁడు. "శిశిరర్తువులో రాముని విరహతాపముచేఁ గ్రాగుచున్న శైలశిఖరము లందుఁ సుఖముగాఁ బండుకొని యున్న కోఁతులు రాముఁడు చల్లఁబడఁగానే శైలశిఖరములు గూడఁ జల్లఁబడుటచే శీతార్తిమై హనుమంతునిపైఁగోపించినవి " అనియర్థము.

ఇది వాచ్యసిద్ధ్యంగ మను గుణీభూతవ్యంగ్య మని యాలంకారికుల మతము వాచ్యసిద్ధ్యంగ మనఁగా నెచ్చటఁ గావ్యమున వాచ్యార్థము సరిపడక పోయినపుడు వ్యంగ్యార్థమువలన నర్థము సరిపడునో యది వాచ్యసిద్ధ్యంగము. ఇటఁ "గోఁతులు హనుమంతునిపై గోపించినవి" అనునది వాచ్యార్థము. అకారణముగా నేల కోపించినచో తెలుపఁబడలేదు వాచ్యార్థము కనుపపత్తి వచ్చినది. "రాముఁడు చల్లఁబడినాఁడు" అను వ్యంగ్యార్థమును జెప్పుకొన్నచో వాచ్యార్థము సరిపడును ఇట్టియెడల నీవ్యంగ్యము వాచ్యసిద్ధికిఁ గారణమైనది కానఁ బ్రధానమగు వ్యంగ్యముగా లేదు ఈ వ్యంగ్యమిటఁ బ్రధానము గాకున్నను జమత్కారమును గూర్చుచునే యున్నది ఆ చమత్కారము సహృదయానుభవైకవేద్యము. దౌర్భాగ్యవశమున దాస్య మనుభవించుచున్నను రాజకళత్రము సౌందర్యమును గోలుపోదుగదా ؛ ఆమె ప్రధానమగు రాజ్ఞీత్వమును గోలుపోయినను సౌందర్యమును గోలుపోని విధమున నీ వ్యంగ్యమును నప్రధానమైనను, జమత్కారమును గోలుపోకున్నది కాన నిదే విధమున వాచ్యసిద్ధ్యంగము అపరాంగము అను వ్యంగములును. జగన్నాథునిమతమున నుత్తమకావ్యములుగా గణింపఁబడినది మమ్మటాదులు దీనిని గుణీభూతవ్యంగ్యమనిరి ప్రాచీనుల మధ్యమ అధమకావ్యములకును, జగన్నాథుని మధ్యమ కావ్యములకును భేదము గానరాదు. కానీ యధమకావ్యమును జగన్నాథుఁడు శబ్దచిత్రప్రధానము అర్థచిత్రప్రధానము నని మఱల రెండుగా విభజించెను ఈ విధముగా నర్థప్రాధాన్యమునుబట్టి జగన్నాథుని

మతమునఁ గావ్యము నాలుగు విధములు. ప్రతిపాద్యవిషయమును బట్టి మఱి కొన్ని భేదములు గలవు అవి ముందుఁదెలుపఁబడును.

ఆనందవర్ధనాచార్యులవారు ధ్వన్యాలోకమున నీ ధ్వన్యర్థమును సాధించుచు నీ విధముగాఁ దెలిపిరి :—

అర్థము వాచ్యము, వ్యంగ్యము లేక ప్రతీయమానమునని ద్వివిధము వాచ్యమనఁగా వాచకము యొక్క యర్థము. అది సుప్రసిద్ధముగా నెల్లరెఱిఁగినదే స్త్రీల కవయవములకన్న భిన్నముగా లావణ్యము భాసిల్లు విధమున మహాకవుల కావ్యములందు వాచ్యార్థములకన్న భిన్నముగా వ్యంగ్యార్థము భాసిల్లును. ఆ వ్యంగ్యార్థము వాచ్యసామర్థ్యము చేతనే యాక్షిప్తమగును. (ఆకర్షింపఁబడును) అది వస్త్వలంకార రసరూపము వస్తురూప వ్యంగ్యమునకు వ్యంజనావృత్తి ఘట్టములో "శం ఇఁకఁ దిరుగవచ్చునిట గీ ఇచట మా యత్త పండు నే నిటఁ బరుండు" మొదలగు పద్యము లుదాహరింపఁబడినవి అలంకారరసాది వ్యంగ్యములు ముందుఁదెలియును. ఈ వ్యంగ్యములన్నియు వాచ్యసామర్థ్యాక్షిప్తములే. వస్తువ్యంగ్య, అలంకార వ్యంగ్యములలో మనకుఁ గ్రమము గోచరించును అనఁగా ముందు వాచ్యార్థము ; తరువాత వ్యంగ్యార్థమును గ్రమముగా గోచరించును ఇచ్చటి క్రమము స్ఫుటముగా గోచరించును. కాని రసాది వ్యంగ్యముల నా క్రమము గోచరింపదు. ఆ వ్యంగ్యము వాచ్యముతోడనే భాసిల్లుచున్నట్లుండును ఆ త్రివిధమగు వ్యంగ్యార్థమే కావ్యాత్మ ఈ వ్యంగ్యార్థము శబ్దశాస్త్రమును బఠించుటవలనఁగానీ నిఘంట్వాదులను వల్లించుటవలనఁ గానీ తెలియరాదు అది సహృదయహృదయైకవేద్యము అన్ని శబ్దములును నా వ్యంగ్యార్థమును వ్యక్తపఱుపఁజాలఁబవు. కొన్నికొన్ని శబ్దములు మాత్రమే కలవు వానికై కవి యత్నింపవలెను. అట్టి పదప్రయోగము వలననే మహాకవి యగును. ఎట్లన :

గీ కలవు నా దగు హృదయరోగముఁ గుదుర్చు
మందు మాత్రలు పొరుగింటి సుందరికడ,
నాకు నధరామృతానుపానంబుతోడ
నాల్గుపూటలు సేవింప నయమగునది.

ఇట హృదయరోగపదమును దీసి, హృదయవ్యాధి యనియు, లేక హృదయామయమనియు మాత్రలు పదమును దీసి గుళికలనియు, అనుపాన పదమును దీసి 'కూడ చేర్చుమందు' అనియు, 'సేవింప' పదమును దీసి భక్షింప, అనియును నుంచినచోఁ బద్యములోని సౌందర్యమంతయును భ్రష్టమగునుగదా

పదార్థము వలన వాక్యార్థము బోధపడువిధమున వాచ్యార్థము గోచరించిన పిమ్మటనే వ్యంగ్యార్థము గోచరించును. వాక్యార్థము గోచరించినపిమ్మటఁ

బదార్థము పృథక్కుగా గోచరింపని విధమున సహృదయుల కా వాచ్యార్థ సామర్థ్యముచే వ్యంగ్యార్థము గోచరించిన పిమ్మటఁ బృథక్కుగా వాచ్యార్థము గోచరింపదు ఇఁక ధ్వనిలక్షణ మిది :—

"యత్రార్థశ్శబ్దో వా తమర్థ ముపసర్జనీకృతస్వార్థౌ
వ్యంక్తః కావ్యవిశేషః స ధ్వనిరితి సూరిభిః కథితః"

తా. ధ్వనియనఁగా నెచ్చట శబ్దము తన యర్థమును అర్థము దన్నును, అప్రధానముగాఁ జేసి యర్థాంతరమును బోధించునో యది ధ్వని ఎట్లన,

కం ఆ యందం బా చందం
బా యాలాపక్రమంబు నా సమయమునం
బీయూషధారయై యిదె
హాయిని నన్నిపు దలంచె నది పెనుజ్వర మై

ఇట అ ఆ అను వర్ణము స్వార్థమును నప్రధానముగాఁజేసి 'లోకోత్తరము' అను నర్థాంతరమును వ్యక్తము సేయుచున్నవి

గీ 'ఇచట మా యత్త పండు నే నిటఁ బరుండు'

అను పద్యమునందలి వాచ్యార్థము తన్నప్రధానముగాఁ జేసికొని "నా మంచముపైఁ బడుము" అను వ్యంగార్థము వ్యక్తము సేయుచున్నది

ఈ వ్యంగ్యార్థ ప్రాధాన్యాప్రాధాన్యములఁ బట్టియే ధ్వని గుణీభూత వ్యంగ్యాదిభేదములు చెప్పఁబడినవి సమాసోక్తి అక్షేపము దీపకము, అపహ్నుతి పర్యాయోక్తము అప్రస్తుత ప్రశంస—యీ యలంకారములలో వాచ్యమునకే ప్రాధాన్యము గాని వ్యంగ్యమునకుఁ బ్రాధాన్యము లేదు కాన, నివి గుణీభూతవ్యంగ్యకావ్యములే యగును

ధ్వని

సీ. తలయెత్తుకొనఁ గల్గెఁ గులమువారలలోనఁ
బదినూఱుశిరసుల పాపఁ జేని
కనుపమచ్ఛాయావిహారమందగఁ గల్గె
జిమ్మచీఁకటి మ్రింగు వెమ్మెకాని
కమృతాబ్ధిలో నిద్ర యవతరింపఁగఁ గల్గె
వెలిదమ్మిపొక్కిటివేల్పుసామి
కల మహానటజటావలళి నుండఁగఁ గల్గె
నెలకొన్న చల్లనివెలుఁగువాని

గీ. కవుర ! భువనాతిశాయి వైభవవిభూతిఁ
బూని జగదేకగేగీయ్యమానుఁ డైన
యోబభూపాలు నరసింహుఁ డుర్వియందు
నవతరించి శుభస్ఫూర్తి నతిశయిల్ల

కొనఁగల్గె (పా) కోగల్గె ; నతిశయిల్ల (పా) నమరుచుండ

తా. మొదటి పాదముచే నరసభూపాలుఁడు భూభారమును వహించెననియు ద్వితీయపాదముచేఁ బ్రతాపమును వహించెననియుఁ దృతీయపాదముచే నార్త రక్షణముఁ గావించుచుండె ననియుఁ జతుర్థపాదముచే లోకమునఁ గీర్తిని వ్యాపింపఁజేసె (శేషుఁడు, సూర్యుఁడు విష్ణువు చంద్రుఁడు, వీరు చేయు కార్యములు నరసరాజే చేయుచున్నాఁడు) ననియు ధ్వన్యర్థములు గోచరించు చున్నవి. ఆ యా పాదము లందలి శబ్దములు తమ స్వార్థముల నప్రధాన ముగాఁ జేసికొని భూభారమును వహించెను" మొదలగు నర్థాంతరములను దోఁపించుచున్నవి. 'నరసభూపాలుఁడు భూభారమును వహించె' నని వాచ్య రూపమునఁ దెలిపినచో రమణీయత్వము లేదు. ఆ యర్థమును నోటితోఁ దెలుప కుండఁ దోఁపింపఁజేసిననే యందముగా నుండును ఇట వాచ్యార్థ మప్రధానమై, వ్యంగ్యార్థము లేక ధ్వని ప్రధానముగా నున్నది. ఇది యుత్తమకావ్యము.

గీ ఇందుఁ దలయెత్తుకొనఁగల్గె దండశూక
పతికి నన నారసింహభూపాలుఁ డుర్విఁ
దాల్చె నను వ్యంగ్య మాది యా ధ్వనులు దోఁపఁ
దనరు నుత్తమ కావ్యమై ధ్వనియనంగ. ౯౩

పై వివరణముచేతనే గతార్థము

గుణీభూత వ్యంగ్యము

కం. కొలువాస నొసఁగి సురగవి
వెలికిలఁబడు ; గల్పతరువు వేడిన మఱి యా
కులపడి పండ్లిగిలించును ;
నలువుగ నినుఁబోలఁగలవె నరసింహనృపా ! ౯౪

వేఁడినమఱి (పా) వేఁడుకొనిన

తా. కామధేనువు తన్ను గొలుచువారి కాశఁ గొలిపి వెలికిలఁబడును. అనఁగాఁ జేతకాదని వెనుదీయును (పొదుగుఁ జూపును) తన్ను వేఁడఁగాఁ

గల్పవృక్షము వ్యాకులపడును (ఆకులురాల్చును) పండ్లిగిలించును. అనఁగా నోరు వెళ్ళబెట్టును (పండ్ల నొసఁగును). ఇవి నిన్నుఁబోలఁగలవే? అని కాకువు. (వెలికిలఁబడు, పండ్లిగిలించునను వాని యర్థముననే యీ కాలమున "మొండి చెయ్యి చూపెను" అని వ్యవహారము)

కం. నినుఁ బోలఁగలదె సురతరు
వనునెడ లేదనెడు వ్యంగ్య మరయఁగ వాచ్యం
బు నతిక్రమించి మించమిఁ
దనరున్ ధర నిది గుణీకృత వ్యంగ్యంబై. ౯౫

పై పద్యమున గుణీకృతవ్యంగ్యము 'పోలగలవె?' అను స్థలమందుఁ గలదు ఎట్లనఁ గల్పవృక్షము నినుఁబోలఁగలదే? అను వాచ్యార్థము 'పోలలేదు అను వ్యంగ్యార్థమును బోధించును ఇచ్చటి కాకువ్యంగము వాచ్యార్థముతోడనే భాసిల్లును కాని వాచ్యార్థానంతరమునఁగాదు ఇట వ్యంగ్యమునకుఁ బ్రత్యేకత్వములేదు. కాకువుచే నాక్షిప్తమగు వ్యంగ్యమెల్ల యెడల నీవిధముగానే వాచ్యార్థసంవలితముగానే భాసిల్లును వాచ్యార్థమున కావ్యంగ్యార్థము లేక విశ్రాంతియే లేదు. కాన నిచ్చటివ్యంగ్యము సుందరముగాదు. కావుననే గుణీభూతవ్యంగ్యము లేక గుణీకృతవ్యంగ్యము, గుణము = అప్రధానము, గుణీకృతము - అప్రధానముగాఁ జేయఁబడిన - వ్యంగ్యము - (గుణీభూత వ్యంగ్యప్రకరణము నందలి కాకువ్యంగ్యమును జూడుఁడు)

చిత్రము °

కం. చిత్రము శబ్దార్థోభయ
చిత్రములనఁ ద్రివిధగతులఁ జెలఁగు, నదియు సం
సూత్రిత మగు ముందఱ నా
చిత్రాలంకారతతులు చెప్పెడిచోటన్. ౯౬

టా. శబ్దచిత్రము, అర్థచిత్రము, శబ్దార్థోభయచిత్రము అని చిత్రకావ్యము త్రివిధము. దీనిని ముందుదాహరింతుము.

త్రివిధములగు చిత్రము లున్నవని యిచ్చటఁ జెప్పి చతుర్థాశ్వాసమున ౭౩ వ పద్యమున—

కం. ఇవియును శబ్దార్థంబుల
ద్వివిధములై క్రమముతోడ వెలయు నను ప్రా
సవిశేషంబుల నుపమా
ది విశేషమ్ములను గావ్యదీపితసరణిన్.

° "చిత్రకావ్యములు' – శ్రీ మార్క విశాల

అని ద్వివిధమునే చెప్పి ద్వివిధమునే యుదాహరించెను. శబ్దార్థోభయ చిత్రమును మేముదాహరించి తెలుపుదుము

కం. ద్వివిధం బగు ధ్వనికృతులం
దవిరళగతి లక్షణాభిధాయోజిత మై
యవివక్షితవాచ్యంబును
వివక్షితాన్యపరవాచ్యవృత్తియు ననఁగన్. ౯౭

తా లక్షణామూలధ్వని యనియు, నభిధామూలధ్వని యనియు ధ్వని రెండు విధములు లక్షణామూలధ్వని యవివక్షితవాచ్యము. అనఁగా నందలి వాచ్యార్థము వివక్షితము గాదు. అనఁగా వాచ్యార్థము పొసఁగనేపొసఁగదు అది స్వార్థమును గోలుపోయి పొసఁగుచున్న మఱొక యర్థమును దెలుపును

అభిధామూలధ్వని వివక్షితాన్యపరవాచ్యము అనఁగా వాచ్యార్థముపొసఁగి నను నన్యపరముగా (ధ్వనిపరముగా) వివక్షింపఁబడును.

లక్షణామూలధ్వనిలోఁ వాచ్యార్థము పొసఁగనేపొసఁగదు అభిధామూల ధ్వనిలో బొసఁగుచున్నను నా వాచ్యార్థము వ్యంగ్యపరముగా వివక్షింపఁబడును.

కం. చను నత్యంతతిరస్కృత
మన నర్థాంతరసమేత మన, ద్వివిధతఁ గై
కొని యవివక్షితవాచ్యం ;
బినుమడి యగు వాక్యపదము లెనసిన నదియున్. ౯౮

తా మఱల నా లక్షణామూలధ్వనియగు నవివక్షితవాచ్యము - అత్యంత తిరస్కృతవాచ్యము అర్థాంతరసంక్రమితవాచ్యము, (అర్థాంతరసమేతము) అనరాదు) నని ద్వివిధము ఆ ద్వివిధధ్వనియు వాక్యగతము, పదగతము అను భేదములచే నాలుగు విధములగును.

వాచ్యార్థము బొత్తుగా సరిపడక యత్యంత తిరస్కృతమై వాచ్యార్థము నకు సంబంధించిన మఱొక యర్థమును బోధించినచో నది "యత్యంతతిరస్కృత వాచ్యము" అనఁబడును ఇది వెనుకఁదెలుపబడిన జహల్లక్షణయే.

'రవిసంక్రాంతసౌభాగ్య స్తుషారావృతమండలః
నిశ్వాసాంధ ఇవాదర్శ శ్చంద్రమా న ప్రకాశతే"

తా సూర్యుని యందు సంక్రమించిన తన సౌభాగ్యము గలవాఁడును, మంచుగప్పిన బింబము గలవాఁడును నగు చంద్రుఁడు నిశ్వాసాంధమగు (నిట్టూర్పు గాలులచే గ్రుడ్డివాఱిన) నద్దమువలెఁ బ్రకాశింపకున్నాఁడు. ఇట

నంధత్వము చేతనధర్మము గదా అచేతనమగు నద్దమెట్లంధమగును ? కాన 'నంధ శబ్దము స్వార్థమును దిరస్కరించి, ప్రకాశహీనము' అనునర్థమును స్వీకరించినది ఇట 'అప్రకాశాతిశయము వ్యంగ్యము.

ఇట వెనుక(జెప్పిన 'మంచాః క్రోశంతి' అను స్థలమునవలెనే జహల్లక్షణ. 'అప్రకాశాతిశయ రూపవ్యంగ్యము లక్షణామూలము కాన నిది యత్యంత తిరస్కృత వాచ్యరూప ధ్వని

సీ. కమలాక్షు నర్చించు కరములుకరములు ; శ్రీనాథు వర్ణించు జిహ్వజిహ్వ" ఇట(గరములు కరములుగాక మతేమగును ? జిహ్వ జిహ్వగాక మతేమగును ? కాన రెండవ కర జిహ్వాది శబ్దము లుత్తమకరములు ఉత్తమ జిహ్వ ఇత్యాద్యర్థాంతరమును స్వీకరించును ఇందలి ద్వితీయ కరాదిశబ్దముల వాచ్యార్థములు పై విధమగు నర్థాంతరమున సంక్రమించినవికాన నిట నర్థాంతర సంక్రమిత వాచ్యధ్వని (అర్థాంతరమున సంక్రమింపజేయ(బడిన వాచ్యార్థము గల ధ్వనియని వ్యుత్పత్త్యర్థము) ఇదియే యజహల్లక్షణ ఎచ్చట వాక్యతాత్పర్య ములో స్వార్థముతో(గూడి యే లక్ష్యార్థము భాసిల్లునో యది యజహల్లక్షణ యని చెప్పితిమి "కుంతాః ప్రవిశంతి" "కోదండపంక్తులువచ్చె" అనుచోటులందువలె నిట ద్వితీయకరాది శబ్దముల యొక్క వాచ్యార్థము విడువబడకయే లక్ష్యార్థమగు నుత్తమకరత్వాదులు వాక్యతాత్పర్యములో(బ్రవేశించుచున్నవి ఈ యవివక్షిత వాచ్యధ్వని పదగతము "నిశ్వాసాంధ", "కరములుకరములు" అనుచోట్ల 'అంధ, కర ఇత్యాదికమగు నేకపదము వలననే యిచ్చట ధ్వనులు దో(చుచున్నవి

వాక్యగతాత్యంత తిరస్కృత వాచ్యము

ఉపకృతం బహు తత్ర కి ముచ్యతే సుజనతా ప్రథితా భవతా పరం
విదధదీదృశమేవ సదా సఖే సుఖితమాస్స్వ తత శ్శరదాం శతం.

కం సలిపితి కడు మే లే మన
వలె : నీ దగు పెద్దతనము(బ్రకటించితి వో
చెలికా(డ : యివ్విధముననె
సలుపుచు నూఱేండ్లు మనము : సౌఖ్యముతోడన్.

పెక్కుపకారములను దనకు(గావించిన మిత్రునితో నొక(డనుచున్నాడు. ఇట విపరీతలక్షణచే "నాకు(జాల(గీడు సేసితివి ఈ విధమున నీ ముక్కిడి తనమును దెలిపితివి. నన్నీ విధమున(జేసితివి కాన నీవు పెద్దకాలము బ్రదుకవు" అను నర్థాంతరము వాచ్యార్థమును దిరస్కరించి, యుత్థితమగు చున్నది ఇది వాక్యగతమగు నత్యంత తిరస్కృత వాచ్యధ్వని.

వాక్యగతార్థాంతర సంక్రమిత వాచ్యధ్వని

త్వా మస్మి వచ్మి; విదుషాం సమవాయోఽత్ర తిష్ఠతి
ఆత్మీయాం మతిమాస్థాయ స్థితిమత్ర విధేహి యత్

కం నినుఁగూర్చి నేను మాటొక
టనుచుంటిని; విబుధనివహ మదరు నిచటఁ దా
నిని సావధానమతి వై
వినుమీ! చెవియొగ్గి యోర్మి పేర్మి చెలంగన్.

విద్వత్సమాజములోనికి వచ్చుచున్న యొక బాలకునిఁగూర్చి యొక వృద్ధుఁడనుచున్నాఁడు. శిక్షణీయుఁడగు నా బాలుఁడెదుటఁ గూర్చున్నవాఁ డగుటచేతనే సిద్ధించుచుండ "నినుఁగూర్చి" చెప్పుట "ఇతరుల గుఱించి కాదు; నినుఁగూర్చియే సుమా" అను లక్ష్యార్థమును బోధించుచున్నది. 'అనుచుంటిని' అను నుత్తమపురుష క్రియాపదము చేతనే కర్త లభించుచుండఁగా నేను అని తిరిగి చెప్పుట "నీకుఁజెప్పునది యితరులుగాదు నీ యాప్తుఁడనగు నేను" అను లక్ష్యార్థమును బోధించుచున్నది విద్వాంసుల యెదుటనే తాను చెప్పుచు మరల "ఇచట విబుధనివహమదరు" అని చెప్పుటచే నా వచనము "పరమప్రమాణము" అను లక్ష్యార్థమును బోధించుచున్నది. ఈ లక్ష్యార్థములన్నియును వాని యతిశయమును ప్రయోజనముగా వ్యక్తము సేయుచున్నవి. దీనిచే "నా మాట నీకు హితమైనది కానఁ దప్పక చేయవలెను" అను నభిప్రాయము గోచరించును. ఇట నీ విధముగా వాక్యమంతయును నర్థాంతరమునఁ బరిణమించినది

చ. ననువుగ భీనిలతుణమొనర్తు, ధృతేందిరుఁడన్నఁ గృష్ణుఁడన్
ధ్వనియభిభూతవాచ్యముగఁ దత్ప్రథమంబు చెలంగు; "యావనుల్!
మనమునఁ గ్రొవ్వుమానుఁ"డనమత్తతురుష్కులఁద్రుంచునీ కఁడన్
ధ్వని యితరార్థసంక్రమితవాచ్యముగాఁగ ద్వితీయమింపగున్.

ఈ వెనుకటి వివరణమునందలి విషయమే యిందుఁగలదు "నరస భూపాలుఁడు ధృతేందిరుఁడు" అన్నచో నభిభూతవాచ్యము (అత్యంతతిరస్కృత వాచ్యము) దీనికి "నరసభూపాలుఁడు గృష్ణుఁడు" అనునది వ్యంగ్యార్థము "విష్ణుర్నారాయణః కృష్ణః" అను నమరకోశమును బట్టి కృష్ణుఁడన్నను విష్ణువన్నను నొక్కటియే "నా విష్ణుః పృథివీపతి" అనియు గలదు. కాన "నరస భూపాలుఁడు విష్ణువు" అని వ్యంగ్యార్థము.

ధృతేందిరుఁడన నిందిరను ధరించినవాఁడు నరసభూపాలుఁడు శ్రీమహావిష్ణువు యొక్క భార్య యగు లక్ష్మి నెట్లు ధరించును? కావున "నరసభూపాలుఁడు ధృతేందిరుఁడు" అనుచో వాచ్యార్థము పొసఁగదు. ఇది జహల్లక్షణ యని తెలిపితిమి కాన ధృతేందిర పద మత్యంత తిరస్కృతావాచ్యమై రాజ్యలక్ష్మిని ధరించినవాఁడు అను నర్థమును స్వీకరించినది ఇది లక్ష్యార్థము. 'నరసభూపాలుఁడు శ్రీవిష్ణువు అనునది ప్రయోజనము. ఇది యత్యంత తిరస్కృతవాచ్యధ్వని పదగతము

యావనుల్ మనమునఁ గ్రొవ్వుమానుఁడు' అనుచో "నీతఁడు మత్తతురుష్కులఁజంపు" అనునది వ్యంగ్యము

అర్థాంతరసంక్రమిత వాచ్యధ్వని యందు 'అజహల్లక్షణ యుండునని తెలిపితిమి "సీ కమలాక్షునర్చించు కరములుకరములు" అనుచోట లాటానుప్రాసమున దీని నుదాహరించియుంటిమి 'యావనుల్ మనమునఁ గ్రొవ్వుమానుఁడు అనుచో నా విధముగా లాటానుప్రాసము లేదే అని యనుకొనవచ్చును వినుఁడు. లాటానుప్రాసము గల చోటనే యర్థాంతరసంక్రమిత వాచ్యధ్వని యుండునని నియమము లేదు వాచ్యార్థమిచ్చటఁ బొసఁగదు ఎట్లన 'యావనుల్ మనమున గ్రొవ్వుమానుఁడు" అనునది వాచ్యార్థము "ఏల యావనులు క్రొవ్వు మానవలెను? మానకున్న నేమి?" అను ప్రశ్నలు లేచును? ఈ వాక్యము సంతృప్తికరముగా సమాధానమిచ్చుటలేదు ఆకాంక్ష పూర్తి కాలేదు ముఖ్యార్థబాధ యుండవలెఁగదా ఇట 'కరములుకరములు' అనుచోటి యందువలె ముఖ్యార్థబాధ యేమి గలదు? అన్నచో ముఖ్యార్థము పూర్తిగా నుండుటయు ముఖ్యార్థబాధయే యగును

ఇట ముఖ్యార్థము లేక వాచ్యారము పొనఁగకున్నది "ఈతఁడు యావనులను ద్రుంచు" నను నర్థాంతరమున నీ వాచ్యార్థము సంక్రమించినది కాన నర్థాంతరసంక్రమిత వాచ్యధ్వని. ఇది వాక్యగతము

గీ. అరయ మఱియు వివక్షితాన్యపరవాచ్య
మవని లక్ష్యక్రమవ్యంగ్య మన, నలక్షి
త కమవ్యంగ్య మన ద్వివిధంబు, వీని
లక్షణము లేర్పఱించెద లలితఫణితి. ౧౦౦

తా వివక్షితాన్యపరవాచ్యధ్వని సంలక్ష్యక్రమవ్యంగ్యమనియు నసంలక్ష్యక్రమ వ్యంగ్యమనియు ద్వివిధము సంలక్ష్యక్రమవ్యంగ్యమనఁగా వేనియందు వాచ్యార్థవ్యంగ్యారముల క్రమము స్ఫుటముగా గోచరించునో

యది సంలక్ష్యక్రమవ్యంగ్యము దీనికే యనురణనవ్యంగ్య మనియు నామాంతరము అనురణన మనగాఁ బ్రతిధ్వని ముందు ధ్వని పిమ్మటఁ బ్రతిధ్వనియుఁ గదా అట్లే వాచ్యార్థము గోచరించిన పిమ్మట వ్యంగ్యార్థము గోచరించినచో నది యనురణనవ్యంగ్యము వాచ్యార్థవ్యంగ్యార్థముల క్రమ మెచ్చట సూక్ష్మముగా నుండుటచేఁ దెలియరాదో యది యసంలక్ష్యక్రమ వ్యంగ్యము.

గీ. "ఇతఁడు నరసింహుఁ డను నెడ నిదియ వ్యంజ
కం బగుచుఁ గృష్ణుఁ' డనెడు వ్యంగ్యమును వరుసఁ
దెలుప లక్ష్యక్రమవ్యంగ్య; మిల నలక్షి
తక్రమవ్యంగ్య మిట్లవేద్యక్రమంబు. ౧౦౧

ఇతఁడు 'నరసింహుఁడు' అన్నచో నరసింహపదముచేఁ 'గృష్ణుఁడు' అనునది వ్యంగ్యార్థము వ్యక్తమగుచున్నది ఇది లక్ష్యక్రమవ్యంగ్యము
"ఇతఁడు నరసింహుఁడు" అను నెడ ముఖ్యార్థబాధ యేమియులేదు 'నరసింహ' పదముయొక్క శబ్దశక్తినిఁబట్టి 'విష్ణువు (కృష్ణుఁడు) అను నర్థాంతరము వ్యక్తమగుచున్నది మొదటికక్ష్యలో నరసింహపదముచే నరసభూపాలుఁ డనియు ద్వితీయకక్ష్యలో విష్ణు వనియు నర్థము తోఁచుచున్నది ఈ క్రమము స్ఫుటముగా గోచరించుచున్నది కాన సంలక్ష్యక్రమవ్యంగ్యము, అసంలక్షితక్రమవ్యంగ్యమున నీ వాచ్యార్థవ్యంగ్యార్థములకుఁ గ్రమము స్ఫుటముగా గోచరింపదు

గీ. అందు లక్ష్యక్రమవ్యంగ్య మమరు 'శబ్ద
శక్తిమూలం' బనఁగ నర్థశక్తిమూల'
మన "నుభయశక్తిమూలంబు" ననఁ ద్రిసంఖ్యఁ
దాల్చు; వేర్వేఱు వీనిభేదము లొనర్తు. ౧౦౨

స్పష్టము

కం. తనరారు వస్తురూపం
బనఁగ నలంకారరూప మనఁగ ద్వివిధమై
ఘనవాక్యపదగతత్వం
బున నాల్గగు శబ్దశక్తిమూలము ధరణిన్. ౧౦౩

తా. శబ్దశక్తిమూలధ్వని శబ్దశక్తిమూలవస్తుధ్వని, శబ్దశక్తిమూలాలంకారధ్వనియని ద్వివిధము. అదియుఁ బదవాక్యభేదములచే మొత్తము నాలుగు విధములు.

సీ. సమధికం బగు నర్థశక్తిమూలము స్వతః
ప్రతిపన్నమును, గవిప్రౌఢవచన
సిద్ధంబు, సుకవినిబద్ధోక్తి సిద్ధంబు,
ననఁ ద్రిరూపం బగు ; నవియు వస్తు
కలితవస్తుధ్వని ; యలవస్తుభవదలం
కృతిమయధ్వని , యలంకృతి నిరూఢ
వస్తుధ్వని , యలంకృతిస్తుతాలంకృతి
ధ్వని యన నాల్గుభేదములు వరుస

గీ. నొక్కొకటిఁ దాల్ప రవిసంఖ్య నొనరు ; నవియుఁ
దనరు ముప్పదియాఱై పదప్రబంధ
వాక్యగతభేదముల, నిట్లు వరలునుభయ
శక్తిమూలంబు నేకమై జగతియందు. ౧౦౪

తా. స్వతస్సిద్ధార్థశక్తిమూలవస్తుధ్వని స్వతస్సిద్ధార్థశక్తిమూలాలంకార ధ్వని స్వతస్సిద్ధార్థశక్తిమూల వస్తుకృతాలంకారధ్వని స్వతస్సిద్ధార్థశక్తి మూలాలంకారకృతాలంకారధ్వని యని నాలుగు విధములు, కవిప్రౌఢోక్తి సిద్ధార్థశక్తి మూలవస్తుధ్వని కవిప్రౌఢోక్తిసిద్ధార్థశక్తి మూలాలంకారధ్వని, కవి ప్రౌఢోక్తిసిద్ధార్థశక్తి మూలవస్తు కృతాలంకారధ్వని కవిప్రౌఢోక్తిసిద్ధార్థశక్తి మూలాలంకార కృతాలంకార ధ్వని యని నాలుగు విధములు కవినిబద్ధవక్తృ ప్రౌఢోక్తిసిద్ధార్థశక్తి మూలవస్తుధ్వని ; కవినిబద్ధవక్తృ ప్రౌఢోక్తి సిద్ధార్థశక్తి మూలాలంకారధ్వని , కవినిబద్ధవక్తృ ప్రౌఢోక్తిసిద్ధార్థశక్తి మూలవస్తుకృతాలం కారధ్వని కవినిబద్ధవక్తృప్రౌఢోక్తిసిద్ధార్థశక్తి మూలాలంకారకృతాలంకార ధ్వని అని నాలుగు విధములు ఈ విధముగ నర్థశక్తిమూలధ్వని పండ్రెండు భేదములు వీని వివరణము ముందుఁదెలియును. ఇదియుఁబదగత, వాక్యగత, ప్రబంధగత భేదములచే ముప్పదియాఱు భేదములు ప్రబంధమన సంఘటిత నానావాక్య కదంబరూపము ఇది గ్రంథరూపముగాఁగానీ తదవాంతరప్రకరణ రూపముగాఁగాని యుండవచ్చును ఉభయశక్తి మూలధ్వని యేకవిధమే అది కావ్యగతము మాత్రమే.

కం. నలువదియొకరూపంబుల
బొలుపగు నీ రీతిభేదముల కాస్పదమై

యిల సంలక్ష్యక్రమ మన
నలరెడు వ్యంగ్యంబు శేష మాపాదింతున్.

శబ్దశక్తి మూలధ్వని నాలుగు విధములు· అర్థశక్తి మూలధ్వని ముప్పది యాఱు భేదములు; ఉభయశక్తిమూల మేకవిధము; మొత్తము సంలక్ష్యక్రమ వ్యంగ్య ధ్వనికి నలువది యొక్క భేదములు వీని నుదాహరింతును

క౦. అసమవిభావాదులచే
రసధ్వని జనించువేళఁ గ్రమ మొదవమిఁ బెం
పొసఁగు నలక్ష్యక్రమ మై
యొసఁగిన వ్యంగ్యంబు దీని కిల భేదంబుల్. ౧౦౬

విభావ, అనుభావ వ్యభిచారుల సంయోగము వలన రసము నిష్పన్న మగును నిష్పన్నమగుననఁగా వ్యక్తమగునని యర్థము. రసపదముచే రస భావ, రసాభాస భావాభాస భావోదయ భావసంధి భావశాంతి భావశబలతాదులు గూడ గ్రాహ్యములే. రస్యమానతాసాధారణ్యముచే ననఁగా వీని యన్నిటియందును రస్యమానత్వము లేక యాస్వాద్యమానత్వము గలదు కాన రసములే (సర్వేఽపి రసనాద్రసాః) పూర్వసిద్ధమై యున్న ఘటాదిపదార్థములను బ్రదీపము బ్రకాశింపఁజేయునట్లు లేక వ్యక్తముసేయు విధమున విభావానుభావ సంచారి భావములు పూర్వసిద్ధమై సహృదయహృదయనిష్ఠమగు రసమును వ్యక్తము సేయును. ఇదవఱకచ్చట లేని వస్తువును గ్రొత్తగా దీపము వ్యక్తము సేయదు ఉన్న వస్తువునే వ్యక్తము సేయును అదేవిధమున సహృదయ హృదయమున వాసనారూపమున నున్న రసములను విభావాదులు వ్యక్తము సేయును ఇంకను దీని వివరణము ముందు విశేషముగాఁ గలదు. ఆ రసము వ్యక్తమగునపుడు వాచ్యార్థవ్యంగ్యార్థములకుఁ గ్రమమున్నను నది యతిసూక్ష్మ మగుటవలన గోచరింపదు ఎట్లన శతపత్త్రపత్త్రశతభేదనన్యాయానుసారముగా అనగా నూరు తామరరేకుల నొక సూదితోఁ బొడుచుచున్నపుడు క్రమముగా నొక్కొక్క రేకునకే యా సూది గ్రుచ్చుకొనుచుఁ బోయినను నొకేపర్యాయమే యన్ని రేకులకును గ్రుచ్చుకొన్నట్లు దోఁచును ఆ క్రమ మతిసూక్ష్మమగుటచే గోచరింపని విధమున రసాదివ్యంగ్యములలోఁ గూడ వాచ్యార్థవ్యంగ్యార్థముల క్రమము గోచరింపదు కావుననే ధ్వనికారుడు "వాచ్యసామర్థ్యాక్షిప్తమై వాచ్యముతోడనే భాసిల్లుచున్నట్లుండును" అని నుడివెను. కావున రసాదిధ్వని యసంలక్ష్యక్రమవ్యంగ్యమగును.

కాని కొన్నియెడల రసాదిధ్వని గూడ సంలక్ష్యక్రమవ్యంగ్యమగునని లోచనాకారుఁడీ క్రింది విధమునఁ దెలుపుచున్నాఁడు ,—

"యద్యపి రసభావాది రర్థో ధ్వన్యమాన ఏవ భవతి। నవాచ్యః కదాచి దపి తథాऽపి న సర్వోఽలక్ష్య క్రమస్యవిషయః యత్ర హి విభావానుభావేభ్యః స్థాయిగతేభ్యః వ్యభిచారిగతేభ్యశ్చ పూర్ణేభ్యో ఝుటిత్యేవ రసవ్యక్తిః తత్రాస్తు అలక్ష్యక్రమః యధా.

నిర్వాణభూయిష్ఠమధాస్యవీర్యం సంధుక్షయంతీవ వపుర్గుణేన
అనుప్రయాతా వనదేవతాభి రదృశ్యత స్థావరరాజకన్యా

ఇత్యాదౌ సంపూర్ణాలంబనోద్దీపన విభావయోగ్యస్వభావవర్ణనం,

ప్రతిగ్రహీతుం ప్రణయిప్రియత్వాత్ త్రిలోచనస్తాముపచక్రమే చ
సమ్మోహనంనామ చ పుష్పధన్వా ధనుష్యమోఘం సమధత్త బాణం.

ఇత్యనేన విభావతయా ఉపయోగ ఉక్తః।

హరస్తుకించి త్పరివృత్తధైర్య శ్చంద్రోదయారంభ ఇవాంబురాశిః
ఉమాముఖే బింబఫలాధరోష్ఠే వ్యాపారయామాస విలోచనాని

అత్రహి భగవత్యాః ప్రథమమేవ తత్ప్రణయిత్వాత్ తస్యచ ఇదానీం తదున్ముఖీభూతత్వాత్ ప్రణయిప్రియతయా చ పక్షపాతస్య సూచితస్య గాఢీభావాత్, రత్యాత్మనః స్థాయిభావస్య ఔత్సుక్యావేగచాపల్యహర్షాదేశ్చ వ్యభిచారిణః సాధారణీభూతః అనుభావవర్గః ప్రకాశితః ఇతి విభావానుభావ చర్వణైవ వ్యభిచారి చర్వణాయాం పర్యవస్యతి వ్యభిచారిణాం పారతంత్ర్యా దేవ స్రక్సూత్రకల్ప స్థాయి చర్వణావిశ్రాంతే రలక్ష్యక్రమత్వం। ఇహతు

ఏవం వాదిని దేవర్షౌ పార్శ్వే పితు రధోముఖీ
లీలాకమలపత్రాణి గణయామాస పార్వతీ

పద్మదళగణన మధోముఖత్వంచ అన్యథాऽపి కుమారీణాం సంభావ్యతే। ఇతి ఝుటితి న లజ్జాయాం విశ్రమయతి హృదయం అపితు ప్రాగ్వృత్త తపశ్చర్యాది వృత్తాంతానుసరణేన తత్ర ప్రతిపత్తిం కరోతీతి క్రమవ్యంగ్యతైవ। రస స్తత్వత్రాపి అదూర ఏవ వ్యభిచారిస్వరూపే పర్యాలోచ్యమానే భాతీతి తద పేక్షయా అలక్ష్యక్రమతైవ లజ్జాపేక్షయాతు తత్ర క్రమవ్యంగ్యత్వం

లెస్సగా విచారింపఁగా రసభావాద్యర్థము ధ్వన్యమానము గావలసినదే కాని యెన్నఁడును వాచ్యము గారాదు అయినను సర్వమగు నా రసాద్యర్థమును నసంలక్ష్యక్రమవ్యంగ్యమె కాదు ఎచ్చట స్థాయిగతములయినట్టియు వ్యభిచారి గతము లయినట్టియు సంపూర్ణవిభావానుభావ వర్ణనములచే వినఁగానే (ఝుటితి) రసోదయమగునో అచ్చట నసంలక్ష్యక్రమవ్యంగ్యము. ఎట్లనఁ, గుమార సంభవమునఁ దపస్సు సేయుచున్న శివుని కథాఘట్టమును గనుఁడు

"బాలవలకు నాటిపోయిన నా మన్మథుని వీర్యమును దన మేని యంద చందములచే రగులుకొలుపుచున్నట్లున్న పార్వతీదేవి వనదేవతలచే ననుసరింపఁబడుచు వచ్చి కానఁబడెను" ఇటఁ బార్వతి యాలంబన విభావము: మేని యందచందము లుద్దీపన విభావములు

"ఆ త్రిలోచనుఁడు ప్రణయిప్రియుఁడగుటవలనఁ ననఁగాఁ దన పరిచితు లందు ప్రీతిగలవాఁడగుటవలన నామె తెచ్చిన పూలదండను గ్రహింపఁబోయెను ఆ సందు చూచి పువ్విల్తుఁడును సమ్మోహనాస్త్రమును వింటఁ దొడిగెను" దీనిచే నా విభావముల యుపయోగము వర్ణింపఁబడినది

"చంద్రోదయారంభమునందలి సముద్రము వలె హరుఁడు ధైర్య మలఁతిగాఁ జలింప బింబఫలము వంటి యధరముగల యుమాముఖమునందుఁ దన చూపులు పఱపెను".

ఇట భగవతి యింతకుమున్నే యాతని వలచియుంటవలనను నాతఁడును నామెకున్మఖీభూతుఁ డగుటవలనను బరిచితులందుఁ బ్రీతిగలవాఁడగుటచేఁ గలిగిన పక్షపాతము గాఢముగా నగుటవలనను రతిరూపమగు స్థాయిభావము నకును ఔత్సుక్య ఆవేగ చాపల్య హర్ష ఆదికమగు వ్యభిచారులకును సామాన్యభూతమయిన ధైర్యపరివృత్తి విలోచనవ్యాపారము అను ననుభావవర్గము వ్యక్తమగుచున్నది.

కావున స్థాయియగు రతి యొక్క విభావానుభావచర్వణయే వ్యభిచారి చర్వణగాఁ బర్యవసించుచున్నది అనఁగా నిట వ్యభిచారిభావముల చర్వణము విభావానుభావచర్వణమునందే కలిసిపోయినది వ్యభిచారిచర్వణము ప్రత్యేక ముగాఁగానరాదు వ్యభిచారి భావములు స్థాయి పరతంత్రములు స్థాయి సూత్రము వ్యభిచారులు పూలదండ వ్యభిచారులు స్థాయిపరతంత్రములగుటచే స్థాయిచర్వణమందే విశ్రాంతిగొనును అనఁగా నట్టి తావులందు విభావానుభావ వ్యభిచారుల చర్వణము వివిక్తముగా గోచరింపదు ఇట్టిచో ఝడితి రసవ్యక్తి కలుగుచున్నది కాన నసంలక్ష్యక్రమవ్యంగ్యము ఇకఁ—

"ఈ విధముగా దేవర్షి పలుకుచుండఁగా దన తండ్రి ప్రక్క నే తలవంచు కొని యా పార్వతి లీలాకమల పత్రములను లెక్కించెను".

ఇటఁ దామరరేకులు లెక్కించుట తల వంచుకొనుటయు గన్యకలకు లజ్జవలననే కలుగునని చెప్ప వీలులేదు ఇతర కారణములవలనఁగూడ గలుగ వచ్చును ఆమె పూర్వమాతనికొఱకై తపస్సుచేసిన వృత్తాంతము దోఁచిననే లజ్జ వ్యక్తమగును లేకున్నచోఁ బై కార్యములచే లజ్జ వ్యక్తముగాదు కావుననే లక్ష్యక్రమము

కానీ లజ్జ వ్యక్తమయిన పిమ్మట వెంటనే రసము స్ఫురించును లజ్జ విలంబముగా వ్యక్తమగుచున్నది కాన లక్ష్యక్రమవ్యంగ్యమని చెప్పితిమి

దీనివలన నెచ్చట శీఘ్రముగాఁ బూర్ణముగా రసము స్ఫురించునో యట నసంలక్ష్య క్రమవ్యంగ్యము ఎచ్చటఁ బూర్వప్రకరణానుచింతనమున నాలస్య ముగా వ్యభిచారిభావము వ్యక్తమగునో యట సంలక్ష్యక్రమవ్యంగ్యము ఇది వెనుకటి సంలక్ష్యక్రమవ్యంగ్యము వంటిది గాదు అసంలక్ష్యక్రమవ్యంగ్యము లోని సంలక్ష్యక్రమవ్యంగ్య మిది

ఈ రసాదులు విభావాదులచే వ్యక్తములు గావలయును స్వశబ్దముచేతఁ (రసశబ్దముచేత) గానీ శృంగారాది శబ్దములచేతగాని యవి వాచ్యములు (వచన ముచే జెప్పఁదగినవి) కావు కాఁగూడదు

శూన్యం వాసగృహం విలోక్య శయనాదుత్థాయ కించిచ్ఛనై
ర్నిద్రావ్యాజ ముపాగతస్య సుచిరం నిర్వర్ణ్య పత్యుర్ముఖం
వి స్రబ్ధం పరిచుంబ్య జాతపులకా మాలోక్య గండస్థలీం
లజ్జానమ్రముఖీ ప్రియేణ హసతా బాలా చిరం చుంబితా

తా॥ ఒకానొక ముగ్ధానాయిక ప్రియుఁడు పాన్పుపై నిద్రావ్యాజముతో నుండగ గదిలో నెవ్వరును లేకుండుటఁ జూచి మెల్లగాఁ బాన్పునుండి లేచి యాతని మొగముపై మొగమును బెట్టి జూచి నిజముగా నిద్రించుచునేయున్నాఁ డని తలఁచి నమ్మికతో ముద్దాడెను అతఁడు కపటనిద్రలోనుంట నాతని గండస్థలి పులకరించెను దానినిఁ జూచి యా బాలిక సిగ్గుపడి మొగము వంచు కొనఁగా ప్రియుఁడు నవ్వుచు నా బాలికను జిరకాలము ముద్దాడెను

ఇందు నాయికానాయకు లాలంబనవిభావములు శూన్యమగు వాసగృహ ముద్దీపనవిభావము, శయనమునుండి మెల్లఁగా లేచుట పతిముఖముపై ముఖమును బెట్టి చూచుట, ముద్దాడుట మొదలగునవి యనుభావములు ; లజ్జాహాసములు వ్యభిచారి భావములు ఇవన్నియు గలిసి సంభోగశృంగారమును వ్యక్తము సేయుచున్నవి ఇట రసపదముగానీ శృంగారపదముగానీ లేదు లేకున్నను రసము గోచరించుచున్నది

"తామనంగ జయమంగళశ్రియం కించిదుచ్ఛ్రభుజమూలలోకితాం
నేత్రయోః కృతవతోఽన్యగోచరే కోఽప్యజాయత రసోనిరంతరః"

తా. అలఁతిగాఁ గనఁబడుచున్న కక్షమూలములు గల యామన్మథుని జయలక్ష్మి నేత్రములకు గోచరింపఁగా నతనికొకానొక రసము పుట్టెను

ఇట రసము పుట్టెను అని రసపదము సాక్షాత్తుగా బ్రయోగింపఁబడి యున్నది. అయినను బై శ్లోకమునందు వలె రసము వ్యక్తము గాకున్నది ఔషధనామోచ్చారణముచేతనే రోగికి రోగశాంతి కలుగనివిధమున 'రసముపుట్టె' అన్నమాత్రమున భావుకునకు సహృదయునకు) రసముపుట్టదు అది విభావాది సామగ్రిచేతనే వ్యక్తము గావలెను. రసాది పదప్రయోగముచే రసము పుట్టక పోఁగా స్వశబ్దవాచ్యత్వమను దోషముగూడఁ దటస్థించును వెనుక ధ్వనిలక్షణమున "శబ్దము తన యర్థమును అర్థము తన్నును నప్రధానముగాఁజేసికొని యేయర్థాంతరమును వ్యక్తపఱచునో యది ధ్వని" యని చెప్పితిమి "శూన్యం వాసగృహం" అను శ్లోకమున నీ లక్షణమును సమన్వయము చేసికొనవలెను ఎట్లనఁ గవి యిటఁ దరుణదంపతుల సంభోగశృంగారమును వర్ణింపఁదలఁచెను. అట్టియెడల "నీ తరుణదంపతులు సంభోగించిరి లేక సంభోగశృంగార మనుభవించిరి" అని చెప్పినచో నది యెట్టి యాస్వాద్యత్వమును కలిగింపదు. కావునఁ గవి వారి సమావేశస్థలము మలయానిల చంద్రికాదుల స్థితి, వారి చేష్టాదులను వర్ణించెను ఈ వర్ణనరూపమగు వాచ్యార్థము మనకుఁ బ్రధానము గాదు. సంభోగశృంగారమే ప్రధానము కావున నీ వాచ్యార్థమంతయు నప్రధానమై సంభోగశృంగారమును వ్యక్తము సేయుచున్నది ఈ వాచ్యార్థము తరువాతనే వ్యంగ్యార్థము గోచరించుచున్నను, వాచ్యార్థముతోడనే యా వ్యంగ్యము గోచరించుచున్నట్లుండును ఇట వాచ్యార్థవ్యంగ్యార్థములకుఁ గ్రమము గోచరింపదు కావున నిది యసంలక్ష్యక్రమ సంభోగశృంగార వ్యంగ్యము

కం. పద, వాక్య, వర్ణ రచనా
పదైక దేశములఁ గృతులఁ బరగుచు నౌరా!
యిది గూడ నలుపదేఁడగుఁ
బదిలముగ వివక్షితాన్య పరవాచ్యమిలన్. ౧౦౪

తా అసంలక్ష్యక్రమవ్యంగ్యము పదగత వాక్యగత, వర్ణగత రచనాగత పదైకదేశగత, కావ్య (ప్రబంధ) గత రూపమున నాఱువిధములుగా నుండును. వీని కుదాహరణములు వ్యంజనావృత్తి ఘట్టమున వ్రాయబడియున్నవి వెనుక సంలక్ష్యక్రమవ్యంగ్యమునకు నలువదియొక్క భేదములుండునని తెలిపితిమి. అసంలక్ష్యక్రమవ్యంగ్య మా[illegible] గ[illegible] [illegible]వక్షితాన్య పరవాచ్యధ్వని నలువదేఁడు బేదము[illegible] ప్రాప్తించును

ఏకపదముచే (పదగతము) నసంలక్ష్యక్రమవ్యంగ్య మెట్లు శోభిల్లును? ఏలన రసాద్యర్థము విభావాదులవలనఁ గాని వ్యక్తము గాదుగదా. అది పద సంఘాతరూపమున నుండవలెనుగదా అట్టిచో నేకపదమువలన నది యెట్లు శోభిల్లునని శంక గలుగుచున్నది సమాధానమిది.

కం ఆ యందం బా చందం బా యాలాపక్రమంబు నాసమయమునం
బీయూషధారమై యిదె హాయిని, నన్ని పుడలంచె నది పెనుజ్వరమై

ఇట "ఆ" 'ఆ ఆ'అనుపదములే లోకోత్తరమనునర్థమును స్ఫురింపఁజేయు చున్నవి. ఆ యందమనఁగా 'లోకోత్తరమైన యా సౌందర్యము' అనునర్థము స్ఫురించుచున్నద ఇట ఆ ఆ పదములే వ్యంజకములు మిగిలినవి వాని కుపకారములు కాఁబట్టి యేకపదముచేతను నసంలక్ష్యక్రమవ్యంగ్యము గోచరించును దీని కవష్టంభకముగా ధ్వనికారుఁడు ;

ఏకావయవ సంస్థేన భూషణేనేవ కామినీ
పదద్యోత్యేన సుకవేర్ధ్వనినా భాతి భారతీ.

తా ఏకావయవమున ధరించిన భూషణముచే సుందరి శోభిల్లునట్లు పదవ్యంగ్యముచేతను సత్కవి కావ్యము శోభిల్లు నని నుడివెను

కం. మును వివక్షితవాచ్యం
బునఁగలిగిన నాల్గుభేదములు నివిగూడం
దనరుఁ గృతి జీవశుద్ధ
ధ్వని యేకశతార్ధభేదవంతం బగుచున్. ౧౦౮

తా అవివక్షితవాచ్యధ్వని నాలుగువిధములని చెప్పితిమి. ఆ యవివక్షిత వాచ్యధ్వని భేదములను వివక్షితాన్యపరవాచ్యధ్వనిభేదములును వెరసి యేఁబది యొక్క భేదములగును ఇవి శుద్ధభేదములు అనఁగా నసంకీర్ణధ్వనులు.

కం ప్రకృతంబులైన యీధ్వను
లొకటొకటిం గూడ నేఁబదొక భేదములం
బ్రకటిత మగుఁ బ్రాగ్భేదం
బకట ద్వితీయంబు నేఁబదగు రీతిన్ ౧౦౯

కం. కృతి నన్నియు నేకైకో
నత సముచితసంఖ్యఁ గైకొనఁగ మిశ్రంబుల్
శతి షడ్వింశత్యుత్తర
శతత్రయాన్వితసహస్రసంఖ్య వెలంగున్ ౧౧౦

తా. శుద్ధభేదము లేఁబదియొకటి ఇందు మొదటిదియు రెండవదియుఁ గలసి యొక భేదమగును మొదటిదియు మూఁడవదియుఁ గలసి యొక భేదమగును మొదటిదియు నాలుగవదియుఁ గలసి యొక భేదమగును. ఇట్లు మొదటిదానితో మిగిలిన యొక్కొక్కటిని గలుపఁగా మొదటిది యేఁబది భేదములగును రెండవదియు మూఁడవదియుఁ గలిసిన నొక భేదము, రెండవదియు నాలుగవదియుఁ గలిసిన నొక భేదము రెండవదియు నైదవదియుఁ గలిసిన నొక భేదము ఇట్లు రెండవదానితో మిగిలిన యొక్కొక్కటిని గలుపఁగా నలువదితొమ్మిదగును. ఇట్లు మూఁడవ ధ్వని మిగిలిన యొక్కొక్కటినిఁ గలియఁగా నలువదియెనిమిదగును. ఈ విధమున నొక్కొక్కదాని సంఖ్య తగ్గును మొత్తము ౧౩౨౬ భేదములు గల మిశ్రధ్వనులేర్పడును

గీ. త్రివిధమగు సంకరమున సంసృష్టిచేత
నొకటొకటి నాలుగై యవి యొప్పుమీఱి
యవనిఁ జతురుత్తరశతత్రయాభిరామ
పంచదశశతభేద ప్రపంచగరిమ ౧౧౧

తా. ఈ ౧౩౨౬ ధ్వనులును త్రివిధమగు సంకరముచే, (సందేహ సంకరము అనుగ్రాహ్యానుగ్రాహక సంకరము లేక అంగాంగిభావ సంకరము ఏకవ్యంజకానుప్రవేశ సంకరము) ఏకవిధమగు సంసృష్టిచే నాలుగురెట్లై ౫౩౦౪ ధ్వనిభేదములగును.

ఏకవ్యంజకానుప్రవేశ సంకరోదాహరణము

గీ. బటువుగుబ్బలజంటయు వాలుఁజూపుఁ
బఱవ, ద్వారంబునన్ నిల్చి పచ్చుపతికి
సలిపెఁ బూర్ణఘటంబుల నలరుదండ
తోరణ, నయత్నమంగళాచార మింతి

ఇట 'గుబ్బలజంట అను 'పూర్ణఘటములు', 'వాలుఁజూపులు అను 'అలరుదండతోరణ' అను రూపకము ధ్వనించుచున్నది ఈ వ్యంగ్యరూపకాస్పదములగు గుబ్బలజంట వాలుఁజూపులే నాయకరతి కుద్దీపకములు కాన శృంగారరసము వ్యంగ్యము ఆ రూపకధ్వని రసధ్వనులు రెండును నొక్కే వ్యంజకపదమగు గుబ్బలజంట 'వాలుఁజూపు అనునెడఁ బ్రవేశించియున్నవి. కాన నేకవ్యంజకానుప్రవేశసంకరము తక్కినవి యూహ్యములు

ధ్వని పేర్లు	సజాతీయ మిశ్రితి	సంయోగములోన్	గుణిత ధ్వనులు	సంకరసంఖ్యలగ	గుణిగ విధములు	గుణిత భేదములు
౧. పదగతార్థాంతరసంక్రమితావివక్షితవాచ్యధ్వని			౫౧			౨౦౪
౨ వాక్యగతా			౫౦			౨౦౦
౩ పదగతాత్యంత తిరస్కృతావివక్షితవాచ్యధ్వని			౪౯			౧౯౬
౪ వాక్యగతాత్యంత			౪౮			౧౯౨
౫ పదగత శబ్దశక్తిమూల సంలక్ష్యక్రమ వస్తుధ్వని			౪౭			౧౮౮
౬. ,, అలంకార ధ్వని			౪౬			౧౮౪
౭ వాక్యగత ,, అలంకారకృత వస్తుధ్వని			౪౫			౧౮౦
౮. ,, ,, వస్తుకృతాలంకారధ్వని			౪౪			౧౭౬
౯. పదగత స్వతస్సిద్ధార్థశక్తిమూల వస్తుకృత వస్తుధ్వని			౪౩			౧౭౨
౧౦ ,, ,, వస్తుకృతాలంకారధ్వని			౪౨			౧౬౮
౧౧ ,, ,, అలంకార కృతాలంకారధ్వని			౪౧			౧౬౪
౧౨. ,, ,, అలంకారకృత వస్తుధ్వని			౪౦			౧౬౦
౧౩ వాక్యగత స్వతస్సిద్ధార్థశక్తిమూల వస్తుకృత వస్తుధ్వని			౩౯			౧౫౬
౧౪. ,, ,, వస్తుకృతాలంకారధ్వని			౩౮			౧౫౨
౧౫. ,, అలంకారకృత వస్తుధ్వని			౩౭			౧౪౮
౧౬ అలంకారకృతాలంకారధ్వని			౩౬			౧౪౪
౧౭ ప్రబంధగత స్వతస్సిద్ధార్థశక్తిమూల వస్తుకృతవస్తుధ్వని			౩౫			౧౪౦
౧౮ ,, ,, వస్తుకృతాలంకారధ్వని			౩౪			౧౩౬
౧౯ ,, అలంకారకృతవస్తుధ్వని			౩౩			౧౩౨
౨౦ ,, ,, అలంకారకృతాలంకారధ్వని			౩౨			౧౨౮
౨౧. పదగతకవిప్రౌఢోక్తిసిద్ధార్థశక్తిమూలవస్తుకృతవస్తుధ్వని			౩౧			౧౨౪
౨౨. ,, ,, వస్తుకృతాలంకారధ్వని			౩౦			౧౨౦
౨౩ ,, ,, అలంకారకృతవస్తుధ్వని			౨౯			౧౧౬
౨౪. ,, అలంకారకృతాలంకారధ్వని			౨౮			౧౧౨
౨౫ వాక్యగత కవిప్రౌఢోక్తిసిద్ధార్థశక్తిమూలవస్తు కృతవస్తుధ్వని			౨౭			౧౦౮
౨౬. ,, ,, వస్తుకృతాలంకారధ్వని			౨౬			౧౦౪

౨౭	,,	,,	అలంకారకృతవస్తుధ్వని	౨౫	౧౦౦
౨౮	,,	,,	అలంకారకృతాలంకారధ్వని	౨౪	౯౬
౨౯.	ప్రబంధగతకవిప్రౌఢోక్తిమూలవస్తుకృతవస్తుధ్వని			౨౩	౯౨
౩౦	,,	,,	వస్తుకృతాలంకారధ్వని	౨౨	౮౮
౩౧.		,,	అలంకార కృతవస్తుధ్వని	౨౧	౮౪
౩౨.			అలంకారకృతాలంకారధ్వని	౨౦	౮౦
౩౩	పదగత కవినిబద్ధ వక్తృప్రౌఢోక్తి సిద్ధార్థశక్తి		మూలవస్తుకృత వస్తుధ్వని	౧౯	౭౬
౩౪	,,	,,	,, వస్తుకృతాలంకారధ్వని	౧౮	౭౨
౩౫.	,,	,,	,, అలంకారకృతవస్తుధ్వని	౧౭	౬౮
౩౬.	,,	,,	అలంకారకృతాలంకారధ్వని	౧౬	౬౪
౩౭.	వాక్యగత	,,	వస్తుకృతవస్తుధ్వని	౧౫	౬౦
౩౮.	,,	,,	వస్తుకృతాలంకారధ్వని	౧౪	౫౬
౩౯.	,,	,,	అలంకార కృతవస్తుధ్వని	౧౩	౫౨
౪౦			అలంకార కృతాలంకారధ్వని	౧౨	౪౮
౪౧	ప్రబంధగత ,,		వస్తుకృతవస్తుధ్వని	౧౧	౪౪
౪౨	,,	,,	వస్తుకృతాలంకారధ్వని	౧౦	౪౦
౪౩.	,,	,,	అలంకార కృతవస్తుధ్వని	౯	౩౬
౪౪		,,	అలంకార కృతాలంకారధ్వని	౮	౩౨
౪౫	ప్రబంధగతాసంలక్ష్యక్రమవ్యంగ్యము			౭	౨౮
౪౬	వాక్యగతా	,,		౬	౨౪
౪౭	పదగతా	,,		౫	౨౦
౪౮	పదైకదేశగతాసంలక్ష్యక్రమవ్యంగ్యము			౪	౧౬
౪౯	రచనాగతా	,,	,,	౩	౧౨
౫౦	వర్ణగతా	,,	,,	౨	౮
౫౧	వాక్యగతోభయశక్తిమూలధ్వని			౧	౪
				౧౩౨౬	౫౩౦౪

క౦. ఎన్నిక వీనికి లక్ష్యము
లన్నిటికి నొనర్పఁజాల యగునని భీతిన్
గొన్నిటి కొనర్తు వినుఁడు ప్ర
సన్నులసన్నవవచోవిచారధురీణుల్ ! ౧౧౨

స్పష్టము.

అత్యంతతిరస్కృతావివక్షితవాచ్యధ్వని

కం॥ ఖరఖురకుట్టన ఘట్టిత
ధరణీరజఃస్థగితసద్పృశతామదవిచల
త్ఖరకరతురగోత్కర మై
కర మమరు నృసింహాధాటీకాహయ మవనిన్ ౧౧౩

తా॥ నరసభూపాలుని సమరాశ్వము తన గొరిజలతాఁకుళ్ళచే లేచిన ధూళిచేఁ "దాము తనకు సదృశములు" అను గర్వముచే విఱ్ఱవీఁగుచున్న సూర్యాశ్వములను గప్పుచున్నది

"నరసభూపాలుని సమరాశ్వము సూర్యాశ్వములను తన గొరిజల ధూళిచేఁ గప్పుచున్నది" అను వాచ్యార్థము పొసఁగదు ఏలన, భూసంచారియగు సమరాశ్వమాకాశసంచారియు బహుదూరమున నున్నట్టియు సూర్యాశ్వముల ఖురధూళిచే నెట్లు గప్పును ? కావున వాచ్యార్థమత్యంతమును దిరస్కృతమైనది (ముఖ్యార్థము ముగియకున్నను ముఖ్యార్థబాధయేకదా) ధూళి సూర్యమండలము వఱకు వ్యాపించియున్నది' అనునది లక్ష్యార్థము "సమరాశ్వ మతిసాహసముతో సమరాంగణమున సంచరించుచున్నది" అను నర్థము ప్రయోజనము వాచ్యార్థము తిరస్కృతమై "సమరాశ్వమతిసాహసముతో సమరాంగణమున సంచరించుచున్నది" అను వ్యంగార్థమును వ్యక్తమొనర్చుచున్నది

కం. ఖరఖురకుట్టన ఘట్టిత
ధరణీరజఃస్థగితసదృశతామదవిచల
త్ఖరకరతురగం బనునెడఁ
దిరస్కృతస్వార్థ మగునది బహువ్రీహిన్. ౧౧౪

దీనికి వివరణము పైపద్యము క్రింద నే వ్రాయఁబడినవి ఇంతకన్న "గంగలో గొల్లపల్లె" అనునదియే మంచి యుదాహరణము

అర్థాంతరసంక్రమితావివక్షితవాచ్యధ్వని

ఉ. ఇంద్రసుతుంజయించి నరసేంద్రుఁడొకమ్మున మత్స్యయంత్రమున్
సాంద్రనిరూఢి నేసెనని సంతతమున్ విని తత్తటించి మ
త్స్యేంద్రుఁడు యోగముద్ర ధరియించి చరింపఁదొడంగె,
నౌర ! ని
స్తంద్రజవంబునన్ విపినశైలగుహాగహనాంతరంబునన్. ౧౧౫

తా. అర్జునుఁడు మత్స్యయంత్రమును గొట్టినాఁడు ఇపుడు నరసభూపాలుఁడును మత్స్యయంత్రమును గొట్టఁగా మత్స్యదేశాధీశ్వరుఁడు యోగముద్రఁ బూని పర్వతారణ్యముల సంచరింపఁదొడఁగెను.

గీ. "నరసభూభర్త మత్స్యయంత్రంబు నేయ
నలుకు మత్స్యేంద్రు", డనునెడ "నాత్మమత్స్య
శబ్దసామ్యంబుచేఁ గల్గుశంకఁ" దనరు
వ్యంగ్య మర్థాంతరసమేతవాచ్య మగుచు. ౧౧౬

మత్స్యశబ్దమునకు మీనము మత్స్యదేశము నని రెండర్థములు గలవు. నరసభూపాలుఁడు మత్స్య (మీన) యంత్రమును గొట్టుటవలన మత్స్యదేశాధీశుఁడు మత్స్యశబ్దసామ్యమువే భయపడుచుండెను ఇట మత్స్యదేశరాజేల భయపడవలెను? "ప్రృష్ఠతాడనాద్దంతభంగః" అన్నట్లు నరసభూపాలుఁడు మత్స్యయంత్రమును గొట్టఁగా మత్స్యదేశాధీశ్వరుఁడేల భయపడును? ఇట నర్థము దిన్నఁగా బొసఁగుటలేదు. కావున నిట మత్స్యేంద్రశబ్దములోని మత్స్యశబ్దమునకు వాచ్యార్థమగు మత్స్యదేశము అనునదియును, 'మత్స్యేంద్రుఁడు' అను శబ్దమును మీనము మీనముల రాజు అను నర్థాంతరరూపమునఁ బరిణమించుచున్నవి ఇప్పుడు మీన యంత్రమును నరసభూపాలుఁడు గొట్టగా 'మీనమును మీనముల రాజును భయపడుట పొసఁగును తన్ను నరసభూపాలుఁడు గొట్టునేమో యని ముందుగానే యితఁడు భయపడెను.

శబ్దశక్తిమూలాలంకార ధ్వని

కం ఈ కోమలి బద్మిని యఁట
యేకాలముఁ బ్రోచు నినుఁడ వీవట ; సతి దా
నీకరసంస్పర్శసహాన
గాక చెలంగునె? నృసింహా! ఘనబలసింహా. ౧౧౭

తా ఈతరుణి పద్మినీజాతి స్త్రీ నీ వెల్లకాలమును బ్రోచు ప్రభువవు. నీ హస్తస్పర్శ లేకున్న నెట్లది బ్రదుకును? ఇది వాచ్యార్థము.

"ఇది తామరదీఁగ; నీవు సూర్యుఁడవు; నీ కిరణస్పర్శ లేకున్న నది ఎట్లు విలసిల్లును? ఇది వ్యంగ్యార్థము"

గీ. ఇందుఁ బ్రకృతంబులగు వధూనృపతి వాచ
కంబు లల పద్మినీవశబ్దంబు లెలమిఁ
గమలినీభాస్కరులఁ గలుగు నుపమ
వ్యంగ్యముగ నీ యలంకృతిధ్వని చెలంగు. ౧౧౭

తా ఇట పద్మినీ ఇన శబ్దములు వాచ్యార్థమును బోధించి పిమ్మటఁ దామరతీఁగ అను నర్థాంతరమును బోధించుచున్నవి ఇట్టియెడల వాచ్యార్థ వ్యంగ్యార్థముల కుపమానోపమేయ భావమును జెప్పుకొనవలయునని వ్యంజనా ఘట్టమునఁ దెలిపియుంటిమి అద్ది యీ విధముగాఁ దెలిసికొనవలయును (ఈ పద్యములో కోమలి నృసింహ ఘనబలసింహ అనుపదములు వ్యంగ్యార్థము నన్వయింపవు).

సూర్యుఁడు దామరదీఁగను గరస్పర్శనముచే నెఱయించువిధమున నీవును నీ కోమలిని నీ హస్తస్పర్శచే విలసిల్లఁజేయుము ఇట నుపమానము వ్యంగ్యము వెనుక "ఘనత నృసింహానికరమున" అనుచోఁగూడ నీ శబ్దశక్తి మూలవ్యంగ్యమును వ్రాసితిమి దానినిఁగూడఁ జూచుకొనవలెను.

ఈ శబ్దశక్తి మూలాలంకార ధ్వనిలో నొక్క యుపమాలంకారమే కాక యితరాలంకారములు గూడ వ్యక్తములు గావచ్చును. ఎట్లన

సర్వైకశరణ మక్షయ మధీశ మీశంధియాం హరిం కృష్ణం
చతురాత్మానం నిష్క్రియ మరిమథనం నమత చక్రధరం

తా ఎల్లరకును ముఖ్యరక్షకుఁడు (ఎల్ల ముఖ్యగృహములు గలవాడు), క్షయములేనివాఁడు (గృహములేనివాఁడు) అధీశుఁడు (ప్రభువు), ధీశుఁడు - ధీ+ఈశ (బుద్ధుల కీశుఁడు కానివాడు) హరి (కపిలవర్ణము గలవాడు), కృష్ణుడు (నల్లవాఁడు), చతురాత్మానం (పరాక్రమయుక్తుఁడు), నిష్క్రియుఁడు (ఏ పనిని జేయనివాఁడు), అరిమథనం-శత్రుమథనుఁడు (అరము-అంచు అది గలది అరి-చక్రము దానిని మథించువాఁడు) చక్రధరం (చక్రమును ధరించినవాఁడు) నగువానికి నమస్కరింపుఁడు

ఇట సర్వైకశరణం - అక్షయం · అధీశం - ధియామీశం; ఇత్యాద్యర్థములు పరస్పరవిరుద్ధములు. ఈ విరోధాలంకారము వాచ్యార్థము ముగిసినపిమ్మట లేచుచున్నది కాన నిట విరోధాలంకారము వ్యంగ్యము ఇట్లే వ్యతిరేకాలంకారము శ్లేషాలంకారము మొదలగు నితరాలంకారములును శబ్దశక్తి మూలధ్వనిలో వ్యంగ్యములుగా భాసింపవచ్చును.

శబ్దశక్తిమూలవస్తుకృత వస్తుధ్వని

కం. ఆపన్నులార! చెప్పెద
మీపాలిటికిహితంబు; మెఱయ నృసింహ
శ్రీపాదకమలసేవా
వ్యాపారము మరువకుండుఁడాత్మలలోనన్ ౧౧౯

తా. స్పష్టము

గీ. ఇచ్చట 'నృసింహపదసేవ నెనఁగుఁ' డనెడు
శబ్దశక్తినిఁ 'బ్రకృతుఁడౌ జనవరేంద్రుఁ
గొలువుఁ, డతఁ డాపదలు మాన్చుఁ గొలుచువాని'
కనెడువస్తువు వ్యంగ్యమై యతిశయిల్లు. ౧౨౦

"మీరు నరసింహపదసేవసేయుఁడు" అను వస్తువుచేత "నరసభూపాలునిఁ గొలిచినచో నాపదలు మాన్పును" అను వస్తువు వ్యంగ్యమై భాసిల్లుచున్నది

న్యాయముగా విచారించిన నిదియు వెనుకటి పద్యమునందు వలెనే యుపమాలంకారమునే వ్యంగ్యముగా భాసిల్లజేయుచున్నది ఎట్లన ఎట్లు నృసింహ (విష్ణువు) శ్రీపాదకమలసేవావ్యాపారము మఱవకుండురో యట్లే నృసింహ (నరసభూపాలుఁడు) శ్రీపాదకమలసేవావ్యాపారమున మఱవకుండుఁడు అనియే చెప్పుకొనవలెను. కాన నీ లక్ష్యము దగదు

కావున నిట సాహిత్యదర్పణమునందలి యుదాహరణశ్లోకమున కనువాదము నిచ్చెదను

ఆ వె కటికరాలుదక్కఁ గనరావు కంటి కీ పల్లెకొంపలందు బాటసారి!
ఘనపయోధరములు గనుఁగొని నిలువంగఁ దలఁచితేని నేఁడు
నిలిచిపొమ్ము

ఒక పరకీయనాయిక యింటికి వచ్చిన పాంథునితో ననుచున్నది "ఈ పల్లెకొంపలలోఁ బరుండుటకు రాళ్ళురప్పలేకాని చాపలుగూడ లేవు పైనున్న (వర్షింప సిద్ధముగానున్న) మేఘపటలమునుజూచి నిలువఁదలఁచినచో నిలువుము" అని వాచ్యార్థము. (వస్తువు)

ఇట నున్నవారందరును వట్టి బండలు అనఁగా మూర్ఖులు కాఁబట్టి నీ విట నివసించినను నిచ్చటివారెవ్వరును శంకింపఁజాలరు కాన నీవు నా స్తనములను జూచి యుపభోగింప సమర్థుఁడవగుచో నేఁడు నిలువుము" అనునది వ్యంగ్యార్థము (వస్తువు)

ఇట 'కటికరాలు' అను పదము మొదట 'మూర్ఖుడు' అనునర్థాంతరమును వ్యక్తము సేయుచున్నది ఆ యర్థాంతరము "నీ విట నివసించినను నిచ్చటివా రెవ్వరును శంకింపఁజాలరు" అను మఱొక యర్థాంతరమును వ్యక్తము సేయుచున్నది ఈ రెండు వ్యంగ్యములచేఁ దప్పక యుపభోగింప నిలువుము" అను మఱొక వ్యంగ్యమును ప్రతీతము సేయుచున్నది. ఈ వ్యంగ్యముల కన్నింటినిఁ 'కటికరాలు' పయోధరములు అను శబ్దములకుఁ గల శక్తియే యుత్థాపనము సేయుచున్నది 'కటకరాలు 'పయోధరములు' అను పదములఁ దీసివేసి యన్య పదములు వేసినచో నా వ్యంగ్యములు స్థితములు కాఁజాలవు కావున నిట శబ్దశక్తిమూలవస్తుకృత వస్తుధ్వని (ధ్వనికారుఁడు దీనిని శ్లేషాలంకారధ్వని యనెను) ఈ ధ్వనిభేదమున నీ విధముగా నొక వస్తువుచే మఱొకవస్తువు దానిచే మఱొక వస్తువును వ్యంగ్యముగా భాసిల్లును ఇట్లు వ్యంగ్యము బహుముఖముగా శోభిల్లును

ధ్వన్యాలోకమతమున శబ్దశక్తిమూలాలంకారధ్వనిభేద మొక్కటియే కాని శబ్దశక్తిమూలవస్తుకృతవస్తుధ్వనిభేదము లేదు

స్వతస్సిద్ధార్థశక్తిమూలవస్తుకృత వస్తుధ్వని

స్వతఃప్రతిపన్నము స్వతస్సంభవి స్వతస్సిద్ధము - ఈ మూఁడుపదములును సమానార్థకములే స్వతస్సిద్ధమనఁగా స్వభావసిద్ధమైన అని యర్థము. కవికల్పనలు లేక స్వభావముగా సిద్ధమగు నర్థము లోకమునఁగూడ యథార్థముగాఁ దోఁచు నర్థము స్వతఃసంభవి స్వతఃస్సంభవి కూడఁ గవిప్రౌఢోక్తిసిద్ధమే కాని యా యర్థము లోకమునఁగూడ సంభావ్యమానమై యుండును అట్టియర్థము మూలమనఁగా గారణముగాఁగల వస్తువుచేత వ్యక్తమగు వస్తువు

వెనుక శబ్దశక్తిమూలధ్వని యందు శబ్దమును బరివృత్తిసేసినచో ధ్వని యుండదనియుఁ గాన శబ్దపరివృత్తిని సహింపనియెడలనే శబ్దశక్తిమూలధ్వని యని చెప్పితిమి శబ్దపరివృత్తినిఁ జేసినను ధ్వన్యర్థమునకు భంగము రాకున్నచో నర్థశక్తిమూలధ్వని యగును

ఉ. చల్లనివాఁడు మానెలవుచందురమామ; కడంగి వేఁడుముల్
చల్లనివాఁడు మా యచటి చందనశైలసమీరుఁ; డంచుఁ ద
ద్భిల్లవధూమతల్లి కలఁ బేర్కొని పల్కు నృసింహ మేదినీ
వల్లభ! నీ విరోధినృపవల్లభ దుర్గనగైలవాసయై. ౧౨౧

ఓ నరసభూపాలా నీ విరోధి యొక్క భార్య యొక పర్వతమున వసించుచు "మా యూరనున్న చంద్రుఁడు చల్లనివాఁడు · మా యూరనున్న మారుతము చల్లనిది" అని అచ్చటి కిరాతస్త్రీలతోఁ బలుకుచుండెను.

ఉ. 'చల్లనివాఁడు మానెలవు చందురమామ' యటన్నఁదద్ద్విష
ద్వల్లభ మౌగ్ధ్యవైభవము వ్యంగ్యము; తద్ధ్వనిచేత నాయకా
యల్లక మగ్నయౌనఁనుట వ్యంగ్యము ; తద్ధ్వనిచేత వ్యంగ్యమౌ
నెల్ల విరోధిరాజుల జయించె విభుండనువస్తువెంతయున్. ౧౨౨

తా. శత్రుభార్య "మా యూరనున్న చంద్రుఁడు చల్లనివాఁడు" "మా యూరనున్న మలయమారుతము చల్లనిది" అని పలికినపలుకులామె మౌగ్ధ్యమను వస్తువును వ్యంగ్యమొనర్చుచున్నవి (అక్కడ నొక చంద్రుఁడును ఇక్కడ నొక చంద్రుఁడును ఇక్కడ నొక మలయమారుతమును, అక్కడ నొక మలయమారుతము గలదనుకొనుట మౌగ్ధ్యముచేతనేకదా।) ఆ వ్యంగ్యముచే నామె భర్తృవియోగముచే సంతాపము వహించుచున్నదని వస్తువు వ్యంగ్యమగుచున్నది ఆ వ్యంగ్యముచే 'నరసభూపాలుఁడెల్లరాజులను జయించె నను వస్తువు వ్యంగ్యమగుచున్నది ఇట్లు శబ్దశక్తిమూలవస్తుకృతవ్యంగ్యము వలెనే బహుముఖ్య వ్యంగ్యము -।

ఇట ఉ 'చల్లనివాఁడు...... ఇత్యాదికమగు నర్థము' స్వతస్సిద్ధమే కాని కల్పనాయుక్తముగాదుగదా। కావున స్వతస్సిద్ధార్థశక్తిమూలవస్తుకృత వస్తుధ్వని

స్వతస్సిద్ధార్థశక్తిమూలవస్తుకృతాలంకారధ్వని

మ. సలిలచ్ఛాయగుఱించి యంత్రకృతమత్స్యంబీ నృసింహక్షమా
తలనాథాగ్రణి యేసెనంచు విని తద్వంశాధిపుం బట్టినన్
సలిలచ్ఛాయగుఱించి యేయునని యంచద్భీతి మార్తాండునిన్
బలిమిం బట్టెఁడు వేగ రాహు విధునిం బైకొన్న చందంబునన్. ౧౨౩

తా. నీటిలోని నీడను జూచి గుఱివెట్టి యీ నరసభూపాలుఁడు మత్స్య యంత్రమును గొట్టినాఁడుగదా। ఈ రాజు యొక్క వంశాధిపుఁడగు సూర్యునిఁ బట్టుకొన్నచో నీటిలో నా నీడనుజూచి గుఱివెట్టి సూర్యునిఁబట్టు నన్నను నేయునని భయపడి రాహువు చంద్రునిఁ బట్టుకొన్నవిధమున సూర్యునిఁబట్టుఁడు

గీ 'యంతమీనంబుఁ దునుమాడినట్లు దునుము
ననియకాఁబోలు రాహు వర్కుని గ్రహింపఁ'
డనెడు నుత్ప్రేక్ష వాచకం బెనయలేమి
వ్యంగ్యమగు నిట్టివాక్యార్థ వైభవమున. ౧౨౪

తా. "యంత్రమీనమును గొట్టినట్టే నన్నును గొట్టునని యెంచిఁకాబోలు చంద్రునివలె రాహువు సూర్యునిఁబట్టఁడు" అనునది యుత్ప్రేక్ష ఈ పద్యములో నుత్ప్రేక్షావాచకమైన కాఁబోలు లేక 'వలె' పదము లేదు 'ఏఁయు నని యంచద్ధృతి అనియే యున్నది ఇట వస్తువుచే నుత్ప్రేక్ష వ్యంగ్యమగుచున్నది

చిత్రమీమాంసాకారుఁడిది "గమ్యోత్ప్రేక్ష యగును కాని వ్యంగ్యోత్ప్రేక్షగా"దని తెలిపెను ఆ గమ్యోత్ప్రేక్షావ్యంగ్యోత్ప్రేక్షల కీ భేదమును దెలుపుచున్నాఁడు విషయ (ఉపమేయము) విషయి (ఉపమానము) నిమిత్తము లెచ్చట గ్రహింపఁబడి కేవలము సంభావనావాచకముమాత్రము ప్రయోగింపఁబడదో యది వాచ్యముగాకున్నను వాచ్యాయమానమై గమ్యోత్ప్రేక్షయని వ్యవహరింపఁబడును ఎచ్చట నుత్ప్రేక్షింపఁదగిన యుపమానపదము (విషయి) గ్రహింపఁబడక నిబద్ధమగు వస్తువుచేఁగానీ, యలంకారముచేఁగానీ యా వస్తువు తోఁచునో యది వ్యంగ్యోత్ప్రేక్ష

వీరరుద్రభటాన్ దృష్ట్వా జయలక్ష్మ్యావృతాన్ రణే
కర్షంత్యరివధూకేశాన్ కాననే కంటకద్రుమాః

తా జయలక్ష్మీసమాలింగితులగు వీరరుద్రుని భటులను గాంచి కాననమునఁ గంటకవృక్షములు శత్రువధూకేశములను లాఁగుచున్నవి

"వృక్షములరివధూకేశముల నాకర్షించుచున్నవి" అనునది వస్తువు దీనిచే జయశ్రీసమాలింగితభటదర్శనముచే మన్మథోద్దీపనము గలవి వలె (వృక్షములు) లాగుచున్నవి" అను నుత్ప్రేక్ష వ్యంగ్యమగుచున్నది. ఇట "మన్మథోద్దీపనము గలవివలె" అను నుపమానము "వృక్షములరివధూకేశములనాకర్షించుచున్నవి" అను వస్తువుచే వ్యంగ్యమైనది

యంత్రమీన' పద్యమున గమ్యోత్ప్రేక్షయే.

స్వతస్సిద్ధార్థశక్తిమూలాలంకారకృతవస్తుధ్వని

ఉ. భూరిభుజాప్రతాపగుణభూషణ యోబయ నారసింహ! నీ
చారుయశోవధూమణికి సారసవైరి ముఖంబు ; తారకల్
సారనఖాంకురంబు ; లలశంకరశైలహిమాద్రు లాత్మవ
క్షోరుహముల్ ; సితాబ్జములుసొంపగులోచనపంకజాతముల్.

ఓ నరసభూపాలా ; నీ కీర్తికాంతకుఁ జంద్రుఁడు ముఖము; నక్షత్రములు గోళ్లు, కైలాసహిమవత్పర్వతములు స్తనములు; తెల్లతామరపూలు కన్నులు (పంకజాతపదము అనవసరము, అధికముగానున్నది).

గీ. తనరుసత్కీర్తికాంతకుఁ దారకాదు
అరయ నంగంబులై వేడ్కఁబరిణమింపఁ
గలుగు పరిణామమునఁ ద్రిలోకములు నిండు
నరసవిభుకీర్తి వ్యంగ్య మనం జెలంగు ౧౨౬

తా. "నీ కీర్తికాంతకుఁ జంద్రాదులు ముఖాదులుగాఁ బరిణమించిరి" అని చెప్పుటచే నిది పరిణామాలంకారము ఇది వాచ్యము దీనిచే "నరసభూపాలుని కీర్తి ముల్లోకముల నిండినది" అను వస్తువు వ్యంగ్యము. పరిణామాలంకారముచే నిట వస్తువు వ్యంగ్యమగుచున్నది.

ఇది పరిణామము గాదు. రూపకమే యగును రూపకము చేతనే వస్తువు వ్యంగ్యము.

స్వతస్సిద్ధార్థశక్తిమూలాలంకారకృతాలంకారధ్వని

చ. అరిపురభంజనోజ్జ్వలబలాధిక ! శ్రీనరసింహ రాజశే
ఖర . భవదీయకీర్తిరుచి గంగయనంగఁ జెలంగుఁబొంగుచున్
హరిపదసంగసంకలిత యై భువనత్రయపూర్ణయై నిరం
తరతరహంసజాంశుసముదాయసమన్వితయైవసుంధరన్ ౧౨౭

తా. ఓ నరసభూపాలా ! నీ కీర్తి గంగవలె హరిపదమును (విష్ణుపదము - ఆకాశము) ముట్టుచు ముల్లోకములను నిండి నిరంతరతరహంసజాంశు. సముదాయసమన్వితమై (హంసలకాంతివంటికాంతిగలదై - హంసజా - సూర్యుని బిడ్డయగు యమునాకాంతి సముదాయముతో గూడినదై (గంగ యమునతో సంగమించె ననుట ప్రసిద్ధమే కదా) యొప్పుచున్నది. హంస = సూర్యుఁడు "భానుర్హంసస్సహస్రాంశుః" అని యమరము.

గీ. రాజశేఖర ! భవదీయరమ్యకీర్తి
యొనరు నలగంగవలె నను నుపమచేతఁ
బరగుదు నృసింహ ! నీవు శంకరునికరణి
నను నుపమ వ్యంగ్యమౌ నిందు నరసిచూడ. ౧౨౮

తా. 'నీ కీర్తి గంగవలె నున్నది' అనునది వాచ్యమగు నుపమ దీనిచే "నీవు శంకరునివలె నుంటివి" అను నుపమ వ్యంగ్యముగా భాసిల్లుచున్నది. ఇట నలంకారముచే నలంకారము వ్యంగ్యముగా భాసిల్లినది.

కవిప్రౌఢోక్తిసిద్ధార్థశక్తిమూలవస్తుకృతవస్తుధ్వని

కవిప్రౌఢోక్తిసిద్ధార్థమన స్వతస్సంభవివలె లోకమునఁగూడ యథార్థముగా గోచరింపని యర్థము స్వతస్సంభవి యర్థము కేవలప్రౌఢోక్తిచేతనే నిష్పన్నము గాక లోకమునఁగూడ యథార్థముగా గోచరించునది అనఁగా నది (స్వతస్సంభవి) కవిప్రౌఢోక్తి నిష్పన్నమైనను లోకమునఁగూడ సంభావ్యమగును. కవిప్రౌఢోక్తి సిద్ధమగునర్థమట్లు లోకమున సంభావ్యము గాదు.

సీ. ఒంటిగా మడికాసుగుంటిపైఁ గూర్చుండి
సంజకెంజాయ పెంజడలు దాల్చి
పొరిఁబొరి నేకాలంబు సురనదీస్నాతుఁడై
నిద్దంపుబూది మైనిండ నలఁది
యచ్చుగాఁ బులితోలు కచ్చడంబు ఘటించి
యొడలఁ బాములు ప్రాఁక నోర్పు గలిగి
హాలాహలానలాభీలధూమముఁ గ్రోలి
యఁటచేత హవ్యవాహనముఁ బూని

గీ. నీ యశోలక్ష్మిఁ బూనుపూనికలఁ దపము
నేఁడు నొనరించుచున్నాఁడు నీలగళుఁడు
కానియెడ నేల యతని కీ గతిఁ దెలంగ ?
సరసగుణహార ! యోబయనరసధీర ! ౧౨౯

మడికాసు=వెండి గుంటిపై=గుండుమీద (కైలాసపర్వతముపై.)

ఓ నరసభూపాలా ఒంటరిగాఁ గైలాసమున సంజకెంజాయలను జడలు ధరించి గంగాస్నానము సేయుచు మేనికి బూడిదను బూసికొని, పులితోలు గుడ్డలుదాల్చి శరీరమునఁబాములు ప్రాఁకుచున్నను నోర్చుకొని యనఁగా నంతగా ద్వంద్వములను గెలిచి హాలాహలరూపమగు పొగను ద్రావి, యగ్నినిఁ జేతఁ బట్టుకొని శివుఁడు నీ యశోలక్ష్మినిఁ బోలుటకై తపము సేయుచున్నాఁడు కానిచో నతఁడీగతి నేల యుండును ?

కం నరపవిభుకీర్తిఁ బోలఁగ
హరుఁడు దపము సేయుచుండు ననువస్తువుచే
'సరిగాఁ డాతని కీర్తికి
హరుఁడును' ననువస్తువలరు వ్యంగ్యంబగుచున్. ౧౩౧

తా. పై పద్యమున "నరసభూపాలుని గీర్తినిఁ బోలుటకై శివుఁడు దపస్సును జేయుచున్నాఁడు" అను వస్తువుచే 'శివుఁడు గూడ నాతని కీర్తికిఁ బోలఁడు' అను వస్తువు వ్యంగ్యము నరసరాజు కీర్తినిఁ బోలుటకే శివుడు తపస్సు చేయుచున్నాడను మాట కవికల్పితము. శివుని స్వభావస్థితినిఁ గవి తపశ్చరణరూపమగు ప్రౌఢోక్తిచేఁ జెప్పినాఁడు ప్రౌఢోక్తియనఁ గవి కల్పితోక్తి వైచిత్ర్యము లేక కవి విచిత్రముగాఁ గల్పించిన యుక్తి లేక వక్రోక్తి. *

కవిప్రౌఢోక్తిసిద్ధార్థశక్తిమూలవస్తుకృతాలంకారధ్వని

కం. మేలిమి నృసింహధరణీ
పాలు ప్రతాపాగ్ని దిశలఁ బ్రబలినఁ గీలా
భీలదవానలమడవుల
పాలయ్యెన్ జలధిఁ బడియె బడబానలమున్ ౧౩౧

తా. నరసభూపాలుని ప్రతాపాగ్ని దిక్కుల విజృంభింపఁగా దావాగ్ని యడవులపాలయ్యెను బడబాగ్ని సముద్రమునఁ బడెను.

కం జనపతి ప్రతాప మహరఁగ
వనవాటికి నరిగె దావవహ్ని యనెడిచో
మనమునఁ గలఁగియునుంబలె
ననియెడుశ్లేష వ్యంగ్యమగు వస్తువుచేన్. ౧౩౨

తా పై పద్యమున "నరసభూపాలుని ప్రతాపాగ్ని దిక్కుల విజృంభింపఁగా దావాగ్ని యడవులపాలయ్యె" అను వస్తువుచే "దావాగ్ని మనస్సునఁ గలఁతపడినట్లు" అనును శ్లేష వ్యంగ్యముగుచున్నది ఈ శ్లేషావాచక మగు అట్లు మొదలయిన పదములులేమి నిది వ్యంగ్యోత్ప్రేక్ష.

ఇది గమ్యోత్ప్రేక్ష కాని వ్యంగ్యోత్ప్రేక్ష గాదు వీని భేద మిదివఱకుఁ జూపఁబడినది చూ ౧౨౪ పద్యవివరణము)

---

* "Hower Bhamaha s Vakrokti appeared in Kavyaprakas under the name of ప్రౌఢోక్తి" అని త్రివేది వ్రాసినాఁడు. దీనినిఁబట్టి భామహుని వక్రోక్తియే ప్రౌఢోక్తిరూపమున ధ్వనికారుఁడును వానినిఁ బట్టి కావ్యప్రకాశకారుఁడును గ్రహించియుందురు.

కవిప్రౌఢోక్తిసిద్ధార్థశక్తిమూలాలంకారకృతవస్తుధ్వని

ఉ. అంచితవిక్రమంబున, మహాసమరవ్రతదీక్షచే నుపో
షించిన కారణంబుననొ శ్రీ నరసింహకృపాణ మాజులం
దొంచి మదించి మించు నరిభూభృదకుంఠితకంఠపీఠముల్
ద్రుంచియు వాఁతనంటదలదుఃఖిలిపక్షతజప్రవాహముల్

తా. నరసభూపాలుని ఖడ్గము యుద్ధవ్రతదీక్షను బట్టి యుపోషించిన (ఉపవాసమున్న) కారణముచేతనో యుద్ధములలో శత్రురాజుల కంఠములను ద్రుంచియు వారి రక్తమును గ్రోలకున్నది

వ్రతదీక్షను గొన్నవారు వ్రతమధ్యమున జలాదులను గ్రోలరు. నరసరాజు కత్తి శత్రురాజుల కంఠములను ద్రుంచెను కానీ రక్తపానము చేయలేదు.

కం అలఘుగతినుపోషించియు
బలె నంటదు రక్త మతని పటుఖడ్గ మనం
గలిగిన యుత్ప్రేక్షవలన
నలఖండనవేగవస్తువలరున్ ధ్వనిచేయిన్ ధ్వనినై. ౧౩౪

తా. పై పద్యమున "మహాసమరవ్రతదీక్షను బట్టి యుపోషించిన కారణముననో కత్తి రక్తమునంటదు" అనుచోటనున్న హేతూత్ప్రేక్ష "వేగముగా నతఁడు శత్రువులను ఖండించెను" అను ఖండన వేగరూపమగు వస్తువును వ్యంగ్యమొనర్చుచున్నవి (కత్తికి రక్తమంటనంత వేగముగా శత్రువుల నఱికెను అని భావము).

కవిప్రౌఢోక్తిసిద్ధార్థశక్తిమూలాలంకారకృతాలంకారధ్వని

శా. ఆమోదంబున శ్రీనృసింహవిభు దానాంభోనదుల్ సాగర
స్వామిం జెంద యశంబు మేఘములఁ బర్వంగల్గు వర్షాశర
ద్భ్రమానాధికరణ్యశంక నచటన్ దామోదరుండొందు ని
ద్రాముద్రానుగతప్రబోధములఁ జిత్రంబేకకాలంబునన్.

తా. నరసభూపాలుని దానజలప్రవాహములు సముద్రమునఁబడెను. అత్తఱి విష్ణువు వర్షాకాలము వచ్చెనని శయనించెను నరసరాజు కీర్తికాంతి మేఘములపైఁబడెను అట్టితఱి నా సముద్రమున శయనించియున్న నారాయణు

నకు శరదాగమభ్రాంతి గలిగెను. కాన నతఁడు నిద్రాప్రబోధములు రెండును నేకకాలమున నొందెను, ఇది చిత్రము.

గీ. హరికి వర్షాశరద్భ్రాంతి యడరు ననెడి
భ్రాంతిమదలంక్రియారూఢిఁ బ్రబలు నిద్రఁ
దెలివి నున్నట్లు యోగనిద్రలు వహించు
ననెడి యుత్ప్రేక్ష వ్యంగ్యమై యతిశయిల్లు. ౧౩౬

తా. "హరికి వర్షాకాలభ్రాంతియు శరత్కాలభ్రాంతియు నేకకాలమునఁ గలిగె" ననుచోట భ్రాంతిమదలంకారము. దీనిచేఁ "దెలివితోఁగూడిన నిద్ర (యోగనిద్ర) భగవంతునికున్నట్లున్నది" అను నుత్ప్రేక్ష వ్యంగ్యముగా భాసిల్లుచున్నట్లున్నది

కవినిబద్ధవక్తృప్రౌఢోక్తిసిద్ధార్థశక్తిమూలవస్తుకృతవస్తుధ్వని

వెనుకటిది కవిప్రౌఢోక్తి ఇటఁ గవిచే నిబద్ధుఁడగు వక్త యొక్క ప్రౌఢోక్తి అనఁగాఁ గవి సాక్షాత్తుగాఁ దానే చెప్పక దూత్యాదులచేఁ జెప్పించినట్లు తెలుపు ప్రౌఢోక్తి ఈ క్రింది పద్యమున దూతి కవినిబద్ధవక్త్రి కవినిబద్ధవక్తృప్రౌఢోక్తి కవిప్రౌఢోక్తి గాదా? ఏల యీ యవాంతరవిభాగమన్నచో వృద్ధోక్తికన్న బాలోక్తి చమత్కారముగా నుండువిధమునఁ గేవలకవిప్రౌఢోక్తికన్నఁ గవినిబద్ధవక్తృప్రౌఢోక్తి యధిక చమత్కారమును గలిగించును

మ. అనురాగాంబుధి యుబ్బి వెల్వడిన యట్లాపూర్ణ ఘర్మాంబువుల్
తనువల్లిం దిగజాఱఁ, గన్నుఁగవ లేఁదళ్కుల్ పిసాళించుచున్
ననవిల్కానిపురప్రవేశకలనానాళీకదామంబు లై
తనరంగోమలి నిన్నుఁజూచె నరసేంద్రా! సాంద్రతేజోనిధీ!
స్పష్టము.

కం. ఈ వాక్యార్థముచేతను
భూవల్లభ! నిన్నుఁగోరి పొలఁతి విరహతా
పావృత్తి నున్న దిపు డను
నా వస్తువు వ్యంగ్యమగుచు నతిశయమొందున్. ౧౩౭

తా. పై పద్యమున నాకోమలి మేనెల్లఁ జెమర్పఁగాఁ నిన్నుఁగాంచె" నను వస్తువుచే "నామె విరహతాపతప్తురాలై యున్నది." అనువస్తువు వ్యంగ్యమగుచున్నది

ఇట దూతి కవినిబద్ధవక్త్రి. ఆమె తనచెలినిఁగూర్చి చెలికానితోఁ (నరసరాజుతో) దెలుపుచున్నది

కవినిబద్ధవక్తృప్రౌఢోక్తిసిద్ధార్థశక్తిమూలవస్తుకృతాలంకారధ్వని

చ. సురగిరిచుట్టునుం బవరిచుట్టుదు వేల దినేశ! రత్నసం
భరితము దేవతాధనముఁ బాయక కాచెదనంచు నేటికిన్;
సురతరులం గరాంగుళులఁ జొప్పడఁదాల్చి యశోఽభ్రగంగచేఁ
బరగి నృసింహుఁడే సుకవిపంక్తులఁ బ్రోవవిదేల యేరికిన్? ౧౭౯

ఓ సూర్యుఁడా! రత్నసమృద్ధమగు దేవతాధనమును గాపాడుదునని నేఁటికిఁ గూడ నేల మేరువుచుట్టును దిరిగెదవు? ఆ ధనమెవరికి గావలయును? ఏలన మా నరసభూపాలుఁడు కల్పవృక్షములను దనచేతి వ్రేళ్ళ ధరించెను కీర్తి గంగను వహించెను సుకవి పంక్తులను బోషించుచున్నాడు ఇంతకన్న నా మేరువు చేయఁగల పనియేమి? (ఇదియొక కవినిబద్ధుడగు యాచకుని వాక్యము)

'సుకవి పంక్తుల' ననుటకన్న 'విబుధపంక్తుల నన్నచో సముచితముగా నుండును. విబుధులు = దేవతలు పండితులు

కం. తనరెడు నీ వాక్యార్థం
బున శ్రీ నరసింహుఁ డఖలమును బ్రోవఁగ నా
యనిమిషగిరివలెఁ దగుటను
ననుపమ మగు నుపమ వ్యంగ్యమై పొగడొందున్. ౧౮౦

తా పైపద్యమున సూర్యునుద్దేశించి చెప్పినవస్తువుచే "నరసభూపాలుడు మేరువువలె నున్నాఁడు" అను నుపమానము వ్యంగ్యమగుచున్నది

కవినిబద్ధవక్తృప్రౌఢోక్తిసిద్ధార్థశక్తిమూలాలంకారకృతవస్తుధ్వని

చ. ధరణి ననంతకీర్తియుఁ బ్రతాపముగల్గిన రాజవౌట నిన్
దరుణి మనోఽరవిందమునఁ దాల్చిన చుట్టలికంబు పేర్మినో
కరివరయానకున్ విశదకాంతియుఁ గాఁకయునై కడంగి వి
స్తరమగు మేనఁగీర్తియు బ్రతాపమునిల్చె నృసింహభూవరా!

తా నరసభూపాలా! కీర్తిప్రతాపములు గల నిన్ను మనస్సునఁదలచు చుండుటచేతఁగాఁబోలు నా తరుణికిఁగూడఁ గీర్తిప్రతాపము లబ్బినట్లు దేహమునం దెల్లఁదనమును, వేఁడిమియుఁ (విరహతాపము) గలిగెను.

గీ. నెఱయు కీర్తిప్రతాపాఢ్య నిన్నుఁదలఁప
యశము, శౌర్యఁబు గలిగిన ట్లలరు వెలరుఁ
గాఁకయును నను నుత్ప్రేక్షఁ 'గాంతనేలు
విరహమున కోర్వ' దను వ్యంగ్యవిభవ మలరు ౧౪౨

ఇట 'ధరణీ...జుట్టలికంబు పేర్మినో కరివరయానకున్ విశదకాంతియుఁ గాఁకయుఁ గలిగె' నను నుత్ప్రేక్షచే కాంత నేలుకొనుము. ఆమె విరహతాప మున కోర్వఁజాలకున్నది అను వస్తువు వ్యంగ్యమగుచున్నది

కవినిబద్ధవక్తృప్రౌఢోక్తిసిద్ధార్థశక్తిమూలాలంకార కృతాలంకారధ్వని

చ. చెలువ! యిదేమి? యామగువ చిత్రమునందు నృసింహభూవరుం
గలయ లిఖించువేళఁ బులకంబులుఁ గ్రొంజెమరుం దలిర్పఁగా
నొలయ వడంకుచున్నది; సముజ్జ్వలమైన నృపాలరూపమున్
వలపులు రేఁపుచున్న రతివల్లభురూపని భీతిఁజెందెనో! ౧౪౩
స్పష్టము

కం. "వరుని లిఖించుచు వడఁకెడి
సరోజశరుఁ డనియొ." యనెడి సందేహమునన్
నరసింహుఁడు మరుకై వడిఁ
బరగునవెడి యుపమ వ్యంగ్యభావము నొందున్. ౧౪౪
సరోజశరుఁడు (పా) సరసన్మరుఁడు.

ఇట సందేహాలంకారముచే నుపమానము వ్యంగ్యము-అని కలదు. కానీ యిది సందేహాలంకారముకాదు భ్రాంతిమదలంకారము

కం ఈవరుసఁ బ్రబంధాదిగ
తావేలధ్వనులు బుద్ధి ననుమేయములౌ
నావల రసధ్వనులు రస
భావప్రకరణములం బ్రపంచితములగున్. ౧౪౫

ఈ విధముగనే ప్రబంధగతధ్వను లూహించుకొనవలెను. రసధ్వనులు రసప్రకరణమునఁ జూపుదుము.

ప్రబంధధ్వని నిట నుదాహరింతుము ప్రబంధమన సంఘటిత నానావాక్య సముదాయము. అది గ్రంథరూపముగఁగానీ తదవాంతరప్రకరణరూపముగాఁగానీ యుండవచ్చును మహాభారతమునందు శాంతిపర్వమున నీ క్రింది ఘట్టము గలదు దీనికి గృధ్రగోమాయు సంవాదమని పేరు *

*సీ గాంగేయుఁడిట్లనుఁ గౌంతేయపూర్వజు
నకు "విదిశాపట్టణమున నొక్క
బాలుండు మృతుఁడైన బంధులు ప్రేతభూ
మికిఁగొనిపోయి యమేయశోక
వివశాత్ములై పలవింపఁగా గ్రద్దయొ
క్కటివచ్చి "మీరలిక్కడ భయంబు
దక్కి యేడ్చుచునుండఁ దగ దిదె క్రుంకెడుఁ
బ్రొద్దు రాక్షసులును భూతములుఁ బి

గీ. శాచములు ప్రబ్బితిన నిపుడేచివచ్చు
జననమరణముల్ వింతలె ? చన్న శిశువు
తోన యందఱుఁ జనుటకుఁ బూనియుండు
వారలే ? పొండు పీనుంగువైచివేగ

కం తెగిపోయినవారేడ్చిన
మగుడుదురే ? వెఱ్ఱులార మానుఁడు మీరుం
దెగుదురు ; దడవిన" నావుడు
నగునట్టిద కర్జమనుచు నందఱుభీతిన్॥

వ శవంబు విడిచిపోవంజూచిన నొక నక్క బొక్కలోనుండి వెడలి వారలతోడ :

సీ. "గ్రద్దమాటలకేల గడుభీతిఁబొందితి ?
రక్కటా ? బాలునినబ్జవదను
నిటువైచిపోవఁగాఁ దెట్లాడె నేడ్వఁడు
శోకంబువోక నిచ్చోటఁగొంత
పొ్ౌ ; ద్దంతలోవిధి క్రూరుఁడుగాకున్నఁ
బ్రాణంబుగ్రమ్మఱరాక గల్గు
నో ? యెట్లుంగుదురే ? యినుండును నస్త్రాద్రిఁ
జేరఁడు , వెఱవక మీరు నిలువుఁ"

గ్రద్ధ పగటిపూటనే చూడఁగలదు. రాత్రిపూట దానికిఁ గనులు గానరావు నక్క రాత్రిపూటనే లెస్సగా విజృంభింపఁగలదు. ఇట్టి స్థితిలో మరణించిన బాలునిఁ గొని బంధుగులు శ్మశానమునకుఁ దెచ్చిరి. అది సాయంకాల సమయము ఆ మృతబాలుని విడిచిపోలేక బంధుగులు దుఃఖించుచుండిరి ఆ శ్మశానమున నీ గృధ్రగోమాయువులు రెండును గలవు ఆ మృతకళేబరము నా రెండును హరింపఁదలఁచుచున్నవి ఇంకను జీఁకటి పడలేదు ఆ బంధుగులిదేవిధముగాఁ జీకఁటిపడువఱకు నేడ్చుచున్నయెడలఁ తనకు గన్నులు గానఁబడమి నా నక్కయే వాని శరీరమును మ్రింగునని గృధ్రము భయపడుచున్నది. కాన నది యిట్లనుచున్నది

గీ. దనినవారును మనమున నాసపుట్టి
మగిడివచ్చిన గ్రద్ద "యమ్మందబుద్ధి
యైన నక్కమాటలు విననగునె ? వికృత
మయ్యెఁటినుంగు ; వచ్చునే యనువులింక ?

కం. కడుబెట్టిదుండు కాలుఁడు
మిడుకమిడుక నపహరించు మీరీయాసల్
విడువుఁడు బాలునికి సుగతిఁ
బడయుఁడు దానాదులైన బహుధర్మములన్."

వ. అని పలికిన నా గృధ్రంబు వచనంబు లాక్షేపించి యజ్జంబుకంబు వారల నుద్దేశించి,

కం. "క్రూరంబు గృధ్ర మిట్టి కు
మారకునింజూచిజూచి మసలకపోవన్
మీరెట్లోర్చెదరో ? క
న్నీరిటు ననుఁబోఁటులకును నిలువకాలికెడున్.

కం. దయమాలి పోవనేటికిఁ ?
బ్రయత్నమునఁ బొదువ దైవబలమున మీకుం
బ్రియమెసఁగ బ్రదుకు ; బ్రదుకం
దయినను మఱిపోవరాదె ?" యని చెప్పుటయున్
వ గ్రద్ద యిట్లనియె.

ఆ. వె. ఏనుబుట్టి వేయునిన్నూరు మున్నూరు
గలవువత్సరములు ; గాననెందు
బాలు యౌవనస్థుఁ బ్రౌఢుని వృద్ధునిఁ
జచ్చిపోయి మగిడి వచ్చువాని

"అలంస్థిత్వా శ్మశానేఽస్మిన్ గృధ్రగోమాయుసంకులే
కంకాళబహుళే ఘోరే సర్వప్రాణి భయంకరే
నచేహ జీవితః కశ్చిత్కాలధర్మ ముపాగతః
ప్రియో వా యదివా ద్వేష్యః ప్రాణినాంగతి రీదృశీ."

తా గృధగోమాయు సంకులమును నెముకలచే నెల్లప్రాణములకు భయంకరమునునైన యీ శ్మశానమున నుండవలదు, కాలధర్మమును బొందినవాఁడెవఁడును దిరిగి జీవింపఁడు ఈ గతి యెట్టివారికినిఁ దప్పదు.

ఈ వాక్యసమూహ మంతయుఁ బ్రబంధ మని వ్యవహరింపఁబడును. ఈ పబంధము "మీ రీ శవమును విడిచిపోయినచో నక్క కందకుండ నేనే భక్షింతును" అను వ్యంగ్యార్థమును వ్యక్తము సేయుచున్నది.

క. ఒకటిగలదు వత్తురు వే
ఱొక గర్భంబునకు మృతులు ; సుక్కివమౌ న
క్కకు నేటిబుద్ధి ? పీనుఁగు
నకు బ్రదుకుటె ? కలుగునిట్టి నవ్వులుగలవే ?

సీ అనవుడునెగవెక్కి యాబిడ్డవైచి పో
యెడు వారలకు నడ్డపడుచు నక్క
"వినుఁడు రాఘవుఁడు నేర్పున బ్రదికింపఁడె ?
మృతుఁడైన భూసురసుతుని మగుడ
సృంజయుకొడుకు సచ్చిన నారదుఁడు ప్రభా
వంబునఁ గ్రమ్మఱవానిఁదేఁడె ?
యట్టుల యొకసిద్ధుఁడమరుండు మీయేడు
లాలించి దయబాలునసువులొసఁగె

గీ నేని మేలకాదె ? యిదియేల పోయెద "
రనినవారు మగిడి యరుగుదెంచి
శిశువు శవముచుట్టుఁజేరి పెల్లేడ్చిరి
పనవిపనవియంత నినుఁడు గ్రుంకె.

వ. ఆ గృధ్రంబును జంబుకంబును నాఁకలిచే వందురుచుండి తానతాన బాలశవంబు నాహారంబుగొనుటకై యివ్విధంబునం దమతమ పల్కునేర్పున నజ్జనంబుఁ గ్రమ్మఱించె బ్రొద్దుగ్రుంకినం దా నచ్చోట నిలువనేరదు గావున గ్రద్దయటమున్న వారు వోవునట్టి తెఱంగు మాటలాడె రాత్రియైనం దమకు మేలు గావున నక్క వారలు దడయుటకుఁదగిన చందంబుఁజెప్పె. అది వాని తెఱంగు.

అప్పుడు నక్క యిట్లనుచున్నది —

"ఆదిత్యోఽయం స్థితో మూఢాః స్నేహం కురుత సాంప్రతం
బహువిఘ్నో ముహూర్తోఽయం జీవేదపి కదాచన
అముం కనకవర్ణాభం బాలమప్రాప్తయౌవనం
గృధ్రవాక్యాత్కథం మూఢాః స్త్యజధ్వ మవిశంకితాః"

తా. ఓ మూర్ఖులారా ! ఇంకను బ్రొద్దున్నది ఆ బాలునిపైఁ బ్రేమ సూపుఁడు. ఈ బాలుని మరణముహూర్తము బహువిఘ్నయుక్తము. ఒకవేళ మఱల జీవించినను జీవింపవచ్చును ఈ గృధ్రవాక్యమును విని బంగారము వంటి యీ పసిపాప నేల విడిచెదరు ?

ఈ పబంధ మంతయు "పీ రీ శవమును జీఁకటి పడువఱకు విడిచిపెట్టి పోక యున్నచోఁ బిమ్మట గృధ్రమున కందకుండ నేనే భక్షింతును" అను వ్యంగ్యార్థమును సూచించుచున్నది.

ఇదంతయు స్వతస్సిద్ధార్థశక్తిమూల ప్రబంధకృత వస్తుకృత వస్తుధ్వని ఇదే విధముగా స్వతస్సిద్ధ, కవిపౌఢోక్తిసిద్ధ, కవినిబద్ధవక్తృప్రౌఢోక్తి సిద్ధములగు వ్యంగ్యము లొక్కొక్కటియు నాలుగుచొప్పున ౧౨ విధములను బూపవచ్చును.

గీ. ఇచట మధ్యమకావ్య మై రుచిర మగు గు
ణీకృత వ్యంగ్యవిభవంబు నిశ్చయింతు;
నిదియు నెనిమిదిభేదంబు లెనయు, వీని
భవ్యనామంబు లెఱిఁగింతుఁ బ్రక్రమమున. ౧౪౨

తా. మధ్యమకావ్యమగు గుణీకృతవ్యంగ్య మెనిమిది విధములు వానినిఁ దెలుపుదును. గుణీభూతమనఁగా నప్రధానము వ్యంగ్యార్థ మప్రధానమై వాచ్యార్థమే ప్రధానముగాఁగల కావ్యము గుణీభూతవ్యంగ్య కావ్యము.

కం. అమరు నగూఢము, నపరాం
గము వాచ్యాంగంబు, నప్రకాశము, సంది
గ్ధము, నల తుల్య ప్రాధా
న్యము, గాక్వాక్షిప్త, మరుచిరాఖ్యము ననఁగన్. ౧౪౩

ఈ గుణీభూత వ్యంగ్యము-అగూఢము, అపరాంగము, వాచ్యాంగము, అస్ఫుటము (అప్రకాశము) సందిగ్ధము తుల్యప్రాధాన్యము కాక్వాక్షిప్తము అరుచిరము అని యెనిమిది విధములు.

కం. వనితాకుచకుంభముగతి
ధ్వని గూఢం బైనఁ గాని వైదగ్ధ్యములే
మినిఁ దగు మధ్యమకావ్యం:
బెనిమిదివగలకు నొనర్తు నిల అత్యు-బుల్ ౧౪౮

తా. ధ్వన్యర్థము కామినీకుచకలశమువలె గూఢముగా నున్నఁ గాని రమణీయముగా నుండదు. ఆ రామణీయకము దగ్గుటచే మధ్యమకావ్యమగును. ఇట నల్లసాని పెద్దన పద్యము నొకదాని నుదాహరించుచున్నాను.

చ ఘనతర ఘూర్జరీ కుచయుగక్రియ గూఢముగాక ద్రావిడీ
స్తనగతిఁ దేటగాక యఱదాటగు నాంధ్రవధూటి సిబ్బెపుం
జనుఁగవవోలె గూఢమును జాటుధనంబును లేకయుండఁ జె
ప్పిన నదెపో! కవిత్వ మనిపించు, నగిం చటుగాకయుండినన్

కాన ధ్వన్యర్థ మతిగూఢముగా నుండరాదు అతి స్ఫుటముగా నుండరాదు. గూఢాగూఢముగా నుండవలెనని సారాంశము.

అగూఢగుణీభూతవ్యంగ్యము

కం. పరిపతితకవాటము లై
పరిపాటితకనకకూటపటవాటము లై
అరినికరపురప్రకరము
లరుదుగ నరసింహు శౌర్య మంతయుఁ దెలుపున్. ౧౪౯

తా. పడిపోయిన వాఁకిళ్లను, హరింపఁబడిన కనకరాసులును జింపఁబడిన సౌధశృంగముల మీది జెండాలుగల శత్రుపట్టణములు నరసభూపాలుని శౌర్యమును జాటుచున్నది.

కం. "పరిపతిత కవాటము లై
యరిపురములు దెలుపు శౌర్య మంతయు" ననుచో
"నరివరుల గెలిచె విభుఁ" డని
పరగెడి వ్యంగ్యం బగూఢభావము చెందున్. ౧౫౦

పై పద్యముయొక్క వాచ్యార్థమువలన వ్యక్తమగు "నరసభూపాలుఁడు శత్రుల గెలిచె" అను వ్యంగ్యము గూఢముగా లేక రమణీయముగాక యున్నది. ఈ గూఢత చాలదు "ఓ నరసభూపాలా నీ యరిపట్టణములు

పరిపతిత కవాటములు పరిపాటితకనకకూటపటవాటములు" అన్నయెడల "నరసభూపాలా నీవు శత్రువుల గెలిచితివి" అను వ్యంగ్యము రమణీయముగా భాసిల్లినట్లు "అరుదుగ నరసింహు శౌర్యమంతయుఁ దెలుపున్" అన్నపుడు భాసిల్లదు కావునఁ బాఠకు లా భేదము దెలిసికొనవలెను

"కృశాంగ్యాస్సంతాపం వదతి నళినీపత్త్రశయనం" (ఈ నళినీపత్త్ర శయనమాకృశాంగిసంతాపమును జెప్పుచున్నది.) అనుచోఁగూడ నగూఢరూప మగు గుణీభూతవ్యంగ్యమే.

అపరాంగము

రసభావాదులకు రసభావాదులంగములుగా నున్నచో నపరాంగము.

కం. మెడఁగ్రుచ్చి కౌఁగిలించును;
నోడ నెల్లం బారవశ్య మొందించు నరిన్;
వడి మోహనిద్రపుచ్చును
బుడమి నృసింహేంద్రు ఖడ్గపుత్త్రిక యౌరా! ౧౫౧

స్పష్టము.

కం. రంగుగ నీ యెడ ధ్వని యగు
శృంగారము రౌద్రరసవిశేషమునకుఁ దా
నంగంబై విలసిల్లుచు
సంగతి నపరాంగ మనఁగ సన్నుతి కెక్కున్. ౧౫౨

పై పద్యమున శృంగారరసము రౌద్రరసమున కంగమైనది ఏలన నిట నంగి రౌద్రము దానికి శృంగారము పోషకము శృంగార రౌద్రములు విరుద్ధ రసములు గదా వీని కంగాంగిభావ మెట్లు కుదురును? అన్నచోఁ జూడుఁడు.

శ్లో॥ కోపాత్కించిదుపాగతో౽పి రభసా దాకృష్య కేశేష్వలం
నీత్వా మోహనమందిరం దయితయా హారేణ బద్ధ్వా దృఢం
భూయోయాస్యసి తద్గృహా? నితి ముహుః కంఠార్ధరుద్ధాక్షరం
జల్పంత్యశ్రుకణోల్లభేన సుకృతీ కశ్చిద్రహస్తాడ్యతే.

తా॥ ఒక యువతి కినుకతోఁ దనకడకు వచ్చిన ప్రియుని కేశములుపట్టి లాఁగి పడకగదిలోనికిఁ గొనిపోయి హారముతో జెక్కలుగట్టి "దాని యింటికి మఱలఁ బోవుగదా" యనుచు గొంతుకో మాటలడ్డుపడుచుండఁగా వదరుచు, నశ్రువులు గీఱుచు రహస్యముగాఁ గొట్టుచుండెను అతఁడెంత ధన్యుఁడో కదా!

ఇటఁ గేశాకర్షణము బంధనము తాడనము మొదలగునవి రౌద్రరసాను భావములు. అయినను శృంగారమున నారోపింపఁబడినవి రౌద్రము శృంగారమునకుఁ బ్రతికూలమయినను రౌద్రరసానుభావములగు కేశాకర్షణాదులు రూపకబలమువలన శృంగారాంగములుగా నారోపింపఁబడినవి. (కల్పింపఁబడినవి) కాన విరుద్ధరసానుభావము లెచ్చట నారోపింపఁబడునో యచ్చట దోషముగాదు "మెఱుగుచ్చి" అను పద్యమునఁ బైశ్లోకమునవలెఁగాక శృంగారరసానుభావములే రౌద్రమున నారోపింపఁబడినవి అయినను బైవలెనే యిట శృంగారరౌద్రములకు విరోధములేదు.

వాచ్యసిద్ధ్యంగము

కం. ధారుణి శ్రీ నరసింహుని
నీరంధ్రధనుర్విలీనిలనీరదము మిరున్
దారుణతరశరధారా
వారితరిపుశౌర్యసూర్యవైభవమగుచున్. ౧౫౩

తా నరసభూపాలుని ధనుర్మేఘము తన శరధారచేఁ శత్రుశౌర్యరూప సూర్యవైభవమును వారించును

వాచ్యసిద్ధంగ మనఁగా నెచ్చటఁ గావ్యమున నర్థము కుదరకపోయినపుడు వ్యంగ్యార్థమువలన నర్థము కుదురునో యది వాచ్యసిద్ధ్యంగము. వాచ్యార్థసిద్ధికంగమని వ్యుత్పత్త్యర్థము

కం. శరధారయనఁగ ధ్వనియై
పరిణతమగు సలిలధార పార్థివుని ధను
శ్శరద మను వాచ్యమున కు
ర్వరలో నంగంబుగాఁగ వాచ్యాంగమగున్. ౧౫౪

ఇట వాచ్యార్థమున 'శరధార' యనఁగా బాణధారయే ప్రకరణము నరసభూపాలవర్ణనము కాఁబట్టి యా యర్థమే ముఖ్యార్థము ఈ యర్థమును జెప్పుకొన్నచో నీరంధ్రధనుర్విలీనిలనీరదము అను రూపకము కుదురదు రూపకముత్తర పదార్థ ప్రధానమగుట మేఘమునుండి బాణధార వెలువడదుగదా। కాన 'శరధారా' పదము వాచ్యార్థసిద్ధికై జలధార అను నర్థాంతరమును స్వీకరించినది అదియే వ్యంగ్యార్థము ఈ వ్యంగ్యార్థము రూపకసిద్ధికిఁ దోడ్పడుచున్నది. అనఁగా వాచ్యార్థసిద్ధికి వ్యంగ్యమంగమయినది కాన నిది వాచ్యసిద్ధ్యంగము

కావ్యప్రకాశమున నీ క్రింది యుదాహరణ మీయఁబడినది.

శ్లో గచ్ఛామ్యచ్యుత దర్శనేన భవతః కింతృప్తి రుత్పద్యతే ?
కింత్వేవం విజనస్థయోర్హతజనః సంభావయత్యన్యథా
ఇత్యామంత్రణభంగిసూచితవృథావస్థానఖేదాలసాం
ఆశ్లిష్యన్ పులకోత్కరాంచితతనుర్గోపీం హరిః పాతు వః

మ తనివిం బొందను నీదు దర్శనముచేతం జేతమందచ్యుతా !
మనలం గాంచి రహస్థులన్ జనులెదన్ భావింతురన్యంబుగా
నని యాపిల్పునఁ దెల్పుచున్ నిజవృథాయాసంబుఁ జింతిల్లు గో
పినిఁ గౌఁగింటికిఁ దార్చి మోవిగొను గోవిందుండు మిమ్మోముతన్.

అచ్యుతుఁడనఁ గృష్ణుఁ డని వాచ్యార్థము 'అక్షరణశీలుఁడు' అనునది వ్యంగ్యార్థము 'ఆ పిల్పునఁ దెల్పుచున్ నిజవృథాయాసంబు' అను నర్థమీ వ్యంగ్యార్థమును సమకూర్చుచున్నది 'అచ్యుత' శబ్దమునకు వ్యంగ్యార్థమును '(అక్షరణశీలుఁడు) చెప్పుకొనక 'కృష్ణుడు' అను వాచ్యార్థమునే చెప్పుకొన్నచో 'ఆ పిల్పునఁదెల్పుచున్ నిజవృథాయాసంబు' అనుచోట నర్థము కుదరదు. పొసఁగదు కాన నిదియు వాచ్యసిద్ధ్యంగమే ఇట గుణీభూతవ్యంగ్యములుగా నుదాహరింపఁబడిన అపరాంగ వాచ్యసిద్ధ్యంగములు రెండును నుత్తమకావ్యము లనియే జగన్నాథుని మతమైనట్లు వెనుకఁ దెలిపితిమి

అస్ఫుటము

అతి గూఢమైన వ్యంగ్యము (ఘనతరఘూర్జరీ కుచయుగమువంటిది)

కం. శ్రీ నరసింహనృపి భుజప
న్నాగనిశితకౌక్షేయకంబు మహిమండలిలో
నానారిపుభూనాథవి
తానార్జితకీర్తిదుగ్ధధారలు గ్రోలున్. ౧౫౫

తా నరసభూపాలుని చేతికత్తి శత్రురాజుల కీర్తిదుగ్ధములను ద్రాఁగును.

కం. అరికీర్తిదుగ్ధ మానును
ధరణీశ్వరఖడ్గ మనుడు దర్వీకరశే
ఖరముగతిఁ బొల్పు నని యెడి
సరసోపమ కృతులయందుఁ జను నస్ఫుటమై ౧౫౬

తా పై పద్యమునఁ 'గత్తి శత్రుకీర్తిక్షీరము లానును' అనుటవలన 'గత్తి పామువలె నున్నది' అను నుపమాన మస్ఫుటముగా నున్నది మఱొక యుదాహరణము.

కం కనఁబడకుండిన నిన్నుం గనఁగా నువ్విళ్లుగొందుఁ; గనిపించినచోఁ
జనుదువని వెఱతు; నిన్నుం గనకున్నను గన్న నాకుఁ గలుగవు సుఖముల్

'నాకుఁ గనరానివాఁడవు గాకుండునట్లును, వియోగభయము నాకుఁగలుగ కుండునట్లును జేయుము అను నర్థము శ్లిష్టముగా వ్యక్తమగుచున్నది వెనుకటి పద్యమునఁ గ్లిష్టముగా రూపమాలంకారము వ్యక్తమగుచున్నది. ఇటఁ గ్లిష్టముగా వస్తువు వ్యంగ్యమగుచున్నది.

సందిగ్ధము

కం. నరసింహునఖంగురసం
గరమున నెదిరించు రిపులు కడుముందఱగా
నరుగుదు; రాయితపడు దురు;
శరముల విడుతురు సమగ్రసంభ్రమపరులై. ౧౫౪

స్పష్టము

కం. అరివరులాయితపడుదురు;
శరజాలము విడుతు, రనిన సమరంబునకో ?
గిరిగుహాల కరుగనో ? యన
సరివ్యంగ్యము లలరుచుఁడు సందిగ్ధములై. ౧౫౫

తా 'శత్రువులు సిద్ధపడుచున్నారు బాణములు విడుచుచున్నారు' అనఁగా యుద్ధమునకు సిద్ధపడుచున్నారో? గిరిగుహలకుఁ బోవసిద్ధపడుచున్నారో ? అను రెండు వ్యంగ్యార్థములలో నేది యుద్దేశింపఁబడినదో సందిగ్ధముగానున్నది ఏలన రెండును జమత్కారముగానే యున్నవి కావ్యప్రకాశకారాదులు సందిగ్ధ మన వాచ్యార్థవ్యంగ్యార్థములలో దేనికిఁ బ్రాధాన్యము ? అను సందేహమును గలిగించు కావ్యమని చెప్పి యీ క్రిందిశ్లోకము నుదాహరించిరి

హరస్తు కించి త్పరివృత్తధైర్య శ్చంద్రోదయారంభ ఇవాంబురాశిః
ఉమాముఖే బింబఫలాధరోష్ఠే వ్యాపారయామాస విలోచనాని.

తా చంద్రోదయకాలమున సముద్రమువలె హరుఁడు కొంచెము ధైర్యము సడలి దొండపండువంటి కెమ్మోవి గల పార్వతీదేవి మొగమునఁ జూపులు పఱచెను.

ఇటఁ 'గెమ్మోవి ముద్దాడ నభిలషించెను అను వ్యంగ్యము ప్రధానమో 'చూపులు పఱచెను' అను వాచ్యార్థమే ప్రధానమో రెండును జమత్కారావహములే యగుటచే సందిగ్ధము

పై పద్యమున రెండు వ్యంగ్యములలో నేది ప్రధానమో సందేహము. ఇట వాచ్యార్థ వ్యంగ్యార్థములలో నేది ప్రధానమో సందేహము ఇదియే సరియైన దృష్టాంతము

తుల్యప్రాధాన్యము

వాచ్యార్థ వ్యంగ్యార్థములు రెండును ప్రధానములుగా గోచరించుచున్నచో దుల్యప్రాధాన్యము.

కం. నరసింహేంద్రుని చరణం
బరుణంబుగ సంఘటింపుఁ డరులార! భవ
ద్వరమకుటస్ఫురణంబుల;
నరుణంబగు నతనినయనమటుగాకున్నన్. ౧౫౯

తా. ఓ శత్రురాజులారా ; నరసభూపాలుని పాదమును మీ కిరీటములచే నెఱ్ఱగాఁ గావింపుడు లేకున్న నతని కన్నెఱ్ఱపడును

కం. నరసింహేంద్రునకు నమ
స్కరణంబొనరింపకున్నఁ గాంతారంబే
శరణంబగు ననువ్యంగ్యము
నిరవగు వాచ్యంబు సమము లిచ్చటఁ దలఁపన్. ౧౬౦

తా. 'నరసభూపాలునికి నమస్కరింపకున్నచో మీ శరణ్యమేగతి' అను వ్యంగ్యార్థమును, నరసభూపాలుని పాదమును మీ కిరీటములచే నరుణముగాఁ జేయుఁడు' అను వాచ్యార్థమును దుల్యములే. అనఁగా వ్యంగ్యార్థము వాచ్యార్థము కన్న సుందరముగాలేదు. మఱొక యుదాహరణము

"బ్రాహ్మణాతిక్రమత్యాగో భవతామేవ భూతయే
జామదగ్న్యః స్తథామిత్ర మన్యథా దుర్మనాయతే"

పరశురాముఁడు రావణునిమంత్రి యగు మాల్యవంతుని కీ విధమున సందేశమంపుచున్నాఁడు :— "బ్రాహ్మణులయెడ నత్యాచారమును విడుచుట

మీకే మంచిది. అట్లేని(బరశురాముఁడు మీకు మిత్రుఁడు, కాని నాఁడు వాని మనస్సు మాఱును."

ఇటఁ "బరశురాముఁడు క్షత్రియులనువలె రాక్షసులను గూడ నశింపఁ జేయును" అను వ్యంగార్థమును "వాని మనసు మాఱును" అను వాచ్యార్థము సమముగానే యున్నవి.

ధ్వన్యాలోకమతమున నీతుల్య ప్రాధాన్య రూపమగు గుణీభూత వ్యంగ్యము లేదని తోఁచుచున్నది వెనుక నొక వాక్యమునకు వాచ్యార్థ వ్యంగ్యార్థములను రెండర్థములున్న వన్నచో వాక్యభేదము తటస్థించు నని పూర్వమీమాంసకులాక్షేపింపఁగా శబ్దశక్తి మూలధ్వనిలో వాచ్యార్థ వ్యంగార్థముల కుపమానోపమేయభావమును గల్పించి యేకవాక్యతను గూర్చుకొన వలయునని చెప్పియుంటిమి ఇక్కడ ధ్వనికారుఁడు మఱొకవిధముగా సమాధానముఁ జెప్పుచున్నాఁడు "ఒక వాక్యములో రెండర్థములును ప్రధానములే యగుచో వాక్యభేద మేర్పడును. కాని యొకటి ప్రధానమును, మఱొకటి యప్రధానమును నగు నేని వాక్యభేదము రాదు ఏక వాక్యత గుదురును. సర్వత్ర వాచ్యవ్యంగ్యములలో నొకటి ప్రధానముగా మఱొకటి యప్రధానముగా నుండును కాని రెండును ప్రధానములుగా నుండవు"

ఇట్టిస్థితిలో వాచ్యవ్యంగ్యములకుఁ తుల్యప్రాధాన్య మెట్లు పొసఁగును? వాచ్యార్థ వ్యంగ్యార్థములు రెండను ప్రధానములే యగుచో వాక్యభేదదోషము తటస్థించును గదా! కావున దుల్యప్రాధాన్యరూపమగు గుణీభూతవ్యంగ్యముండదని తేలినది కానీ మమ్మట, విశ్వనాథాదులీ "బ్రాహ్మణాతిక్రమత్యాగో" అని శ్లోకమునే దీని కుదాహరించిరి.

కాక్వాక్షిప్తము

కం. ఒసఁగునెడఁ గసరు, గర్జిలు
నొసఁగి యొసఁగి వెల్లఁబాఱు నొగి నీ కరణిన్
విసువక యొసఁగఁగ నేర్చునె?
యసదృశగతినంబువాహ మౌళశనరసా! ౧౬౧

తా. నరసభూపాలా! మేఘము నీవలె దానముసేయునే? అనఁగాఁ 'జేయదు అని వ్యంగ్యార్థము. "భిన్నకంఠధ్వనిర్ధీరైః కాకురిత్యభిధీయతే" శోకక్రోధవిస్మయాదులవలనఁ గలుగు స్వరభేదము 'కాకువు' అనఁబడును.

కం. ఒసఁగునెడఁ గసరు గర్జిలు
నెసఁగఁగ నీలాంబువాహ; మిలనీవలెఁ ధా

నొసఁగఁగ నేర్చునె ? యానవుడు
'నొసఁగఁగలే' దనెడివ్యంగ్యమొగిఁ గాకువగున్. ౧౬౨

పై పద్యమున ఒసఁగదు అను వ్యంగ్యార్థము 'ఒసఁగఁనేర్చునె?' అను వాచ్యార్థముతోడనే యనఁగా సమకాలమందే భాసిల్లును అనఁగాఁ బ్రథమమున వాచ్యార్థము ; దానివలన వ్యంగ్యార్థము భాసిల్లునుగదా ; కాని కాకువుచే నాక్షిప్తమగు వ్యంగ్యము వాచ్యార్థా నంతరము గాక వాచ్యార్థముతోడనే భాసిల్లును కాన నిట వ్యంగ్యచమత్కారము వాచ్యార్థముచే నాక్షిప్తము గావుటలేదు కాన నిట ధ్వనిత్వముగాక గుణీభూతవ్యంగ్యత్వమే కావునఁ గాకుస్థలమం దెల్లెడలను వాచ్యార్థము వ్యంగ్యసంవలితముగానే భాసించును కేవలము వాచ్యార్థము భాసింపనే భాసింపదు. వ్యంగ్యసంవలితము కాక వాచ్యార్థమునకు విశ్రాంతిలేదు.

కాకువు వలనఁగూడ నెచట వాచ్యార్థానంతరమునందే వ్యంగ్యార్థము గోచరించునో యట నుత్తమమగు ధ్వనియేకాని గుణీభూతవ్యంగ్యముగాదు ఎట్లన

తథాభూతాం దృష్ట్వా నృపసదసి పాంచాలతనయాం
వనే వ్యాధై స్సార్థం సుచిరముషితం వల్కలధరైః
విరాటస్యావాసే స్థితమనుచితారంభనిభృతం
గురుః ఖేదం ఖిన్నే మయి భజతి ? నాద్యాపి కురుషు ?

"అన్నగారికి నామీఁదఁ గోపము వచ్చుచున్నది ? ఇప్పటికినిఁ గౌరవుల మీఁదలేదు ?" అని వాచ్యార్థము 'నామీఁద గోపముదగదు కౌరవుల మీఁదఁ దగును అనునది వ్యంగ్యార్థము ఇది 'భజతి అను కేవలకాకువుచేఁ గాక "నాద్యాపికురుషు" అను వాచ్యార్థసామర్థ్యముచే నాక్షిప్తమైన కాకుసాహాయ్యమున వ్యక్తమగుచున్నది కాన వెనుకటి కాకువువంటిది గాదిది కాన నిది యర్థశక్తి మూలధ్వనియే యగును పైది గుణీభూతవ్యంగ్యము

అరుచిరము లేక అసుందరము

మ. బలితంబైన మనోజబాణహతిచేఁ బల్మారు నిల్పోపలే
కలినీలాలక ప్రాణముల్వెడలి నేత్రాంభోజమార్గంబునన్
గలయం బాఁకుచు వచ్చి కన్నెలవునం గన్నీటియేఅడ్డమై
నిలుపన్ నిల్చెనృసింహాభూరమణ! మన్నింపంగఁ బాడింతటన్.

తా మన్మథబాణహతులచే నెంత యత్నించినను ప్రాణములు వెడలి కన్నులలోనికి వచ్చి యచ్చటఁ గన్నీరద్దమై నిలుపఁగా నిలిచెను ఓ నరస భూపాలా! దానిని మన్నింపుము

కం. 'పణాతి రాకయున్నను
ప్రాణంబులు విడుచు' ననెడి వ్యంగ్యంబునకున్
శోణిన్ వాచ్యముకన్నఁ బ్ర
వీణత్వములేమిఁ దనరు వెస నరుచిర మై. ౧౬౪

తా. "ఆమె ప్రాణములను గన్నులలోఁ బెట్టుకొనియున్నది. నీవు రాకున్నచో నా యువతి ప్రాణములు విడుచు"నని వ్యంగ్యార్థము. ఇది వాచ్యార్థముకన్న సుందరముగా లేదు

అయితే కొన్నియెడల సమాసోక్తి ఆక్షేప, అప్రస్తుత ప్రశంసా పర్యాయాదులందు వస్తువ్యంగ్యము గలదు రూపక ఉపమేయోపమా తుల్యయోగితా దీపక నిదర్శనాదులందు నుపమాలంకార వ్యంగ్యము గలదు అతిశయోక్తి సర్వాలంకార సామాన్యమనియు నదిలేని యలంకారమే లేదనియును గొందఱి మతము (మమ్మట మతము) ఉపమాలంకారము సర్వసాధారణాలంకారమనియు నదిలేని యలంకారమే లేదనియు కొందఱిమతము (వామనమతము) "శ్లేషః పుష్టాతి సౌభాగ్యం ప్రాయోవక్రోక్తిషు స్థితం" (శ్లేషాలంకారమెల్ల యలంకారములతోఁ గలసి వాని సౌందర్యమును హెచ్చించును) అనియు నున్నది. ఇట్టి యెడల వస్తువ్యంగ్యమును బట్టియు నలంకార వ్యంగ్యమునుబట్టియుఁ జూచినచో నవి ధ్వనికావ్యములె యగును కాని చిత్రకావ్యము లెట్లగును? అను ప్రశ్న యుదయించుచున్నది. దీనికి సమాధాన మిది —

సమాసోక్త్యాదులందును, రూపకాదులందును వ్యంగ్యముగా భాసిల్లు వస్త్వలంకారములు ప్రధానములు గావు అనఁగా సమాసోక్త్యాదులందును, రూపకాదులందును వాచ్యము లయిన వస్త్వలంకారములచేతనే చారుత్వాతిశయము కాని వ్యంగ్యములయిన వస్త్వలంకారములచేతఁగాదు వీనిలో వ్యంగ్య మప్రధానము. కాన నివి గుణీభూత వ్యంగ్యకావ్యము లగును మఱొకవిషయము

వస్తువుచే వస్తువును నలంకారమును; అలంకారముచే నలంకారమును, వస్తువును వ్యంగ్య మైనపు డచ్చటి వస్త్వలంకారము లగూఢము లగుటచే గుణీభూతవ్యంగ్యమనియు వ్యంగ్యమైన వస్త్వలంకారములనుబట్టి ధ్వనికావ్యమనియు జెప్పవలసి వచ్చుచున్నది అట్లే యపరాంగమునను రస భావ, రసాభాస భావభాస భావోదయ భావసంధి, భావశబలతాదులు వేఱొక రస భావాదుల కంగమగుచో మొదటి దానినిఁ బట్టి ధ్వనికావ్యమనియు రెండవ

దానినిఁబట్టి గుణీభూతవ్యంగ్యమనియును జెప్పవలసివచ్చుచున్నది ఇట్టిచో గతి యేమి? అనుచో నిట్టివి యుత్తమధ్వనికావ్యములే యగును ఏలన, నే యర్థము వలనఁ జమత్కారాతిశయము గలుగునో యది యుత్తమము. ఇట వ్యంగ్యము లగు వస్త్వలంకారరసాదులచేతనే చారుత్వము గలుగుచున్నది కాన నవియే ప్రధానములు ఇవన్నియు నపరాంగములోనే చేరును. జగన్నాథుఁడు వీని నుత్తమకావ్యములుగానే పరిగణించెనని చెప్పితిమి

కావ్యభేదములు

గీ. ఇంకఁ గావ్యప్రభేదంబు లేర్పఱింతు
వరుస నష్టాదశవిశిష్టవర్ణనములు
గలుగవలయు మహాకావ్యతిలకమునకు
నెలమిఁ దన్నామధేయంబు లెట్టి వనిన. ౧౬౫

క. పుర, సింధు నగ, ర్త్వన, శశి
సరసీ, వనమధు, రతిప్రసంగ, విరహముల్,
పరిణయ, తనయోదయ నయ
విరచన, యా, త్రాజి దౌత్య, విభువర్ణనముల్. ౧౬౬

గీ. ఇందు నొకకొన్ని కడమైన నెంచిచూడ
నదియు నవని మహాకావ్య మనఁగఁ బరగు
మఱియు క్షుద్రప్రబంధనిర్మాణ మర్మ
లక్షణము లేర్పఱించెద లలితఫణితి. ౧౬౭

పుర, సముద్ర శైల, ఋతు సూర్యోదయ చంద్రోదయ, సరఃక్రీడా వనక్రీడా, వసంత రతిప్రసంగ విరహ పరిణయ పుత్రోదయ, నయవిరచన (సంధి విగ్రహాదులు) దండయాత్రా, యుద్ధ దౌత్య, ప్రభువర్ణనములు అను నష్టాదశ వర్ణనములు గలది మహాకావ్యము.

ప్రతాపరుద్రీయములో 'దౌత్యము లేదు 'ద్యూత' మున్నది ఇదియే సరియైనది మరియు మధు అనక 'మధుపానము' అని యున్నది. కేవలము 'మధు శబ్దముచే 'వసంతము అనునర్థము వచ్చును వసంతము మధుపానము ననునవి పరస్పరసంబద్ధములే కాన నెట్లు చెప్పుకొన్నను దోషము లేదు. సాహిత్యదర్పణములో నిట్లున్నది.

సంధ్యాసూర్యేందురజనీ ప్రదోషధ్వాంతవాసరాః
ప్రాతర్మధ్యాహ్నమృగయా శైలర్తు వనసాగరాః
సంభోగ విప్రలంభౌచ మునిస్వర్గపురాధ్వరాః
రణప్రయాణోపయమ మంత్రపుత్రోదయాదయః
వర్ణనీయా యథాయోగం సాంగోపాంగా అమీ దశ.

సంభోగము మొదలుకొని పుత్రోదయమువఱకుఁ గల పదియు సాంగోపాంగముగా వర్ణింపవలెను. సంధ్యాప్రభృతి సాగరపర్యంతము యథాయోగము వర్ణింపవలెను అప్పకవీయమున నిట్లున్నది

సీ. పురమును ఋతుషట్కమును బ్రయాణంబును శైలంబు వేఁటయు సాగరంబు
మౌనీంద్రపుణ్యాశ్రమంబును మంత్రంబు ద్యూతంబు విదపనద్భుతరణంబు
విజయంబు మద్యపానజ వికారంబును వనవిహారంబును వారికేళి,
కన్యాంగసౌందర్యకథనంబు హిమకరా భ్యుదయంబు, విప్రలంభోచితంబు

గీ. పద్మమిత్త్రోదయంబును బరిణయంబు
సురతమును దౌహృదంబును సుతజననము
ననఁగ నిరువదిరెండు వర్ణనలు గూర్చి
చెప్పవలయుఁ బ్రబంధంబు శ్రీనివాస!

ఇందిరువదిరెండు వర్ణనము లుండవలెనని యున్నది. ఇందుఁగొన్ని తగ్గినను మహాకావ్యమే యగును

అలంకారశేఖరకారుఁ డీ విధముగాఁ గావ్యవర్ణనీయములను దెలుపుచున్నాఁడు —

వర్ణ్యాశ్చరాజా దేవీ చ దేశో గ్రామః పురీ సరిత్
సరోఽబ్ధ్యరణ్యోద్యానాద్రి ప్రయాణరణవాజినః
హస్త్యర్కచంద్రావృతవో వివాహోఽథ స్వయంవరః
సురాపుష్పాంబుసంభోగా విశ్లేషమృగయాశ్రమాః
కలా ఋతువయస్సంధీ ధాతువృక్షాభిసారికాః

రాజు రాణి, దేశము గ్రామము పురి నది సరస్సు, అబ్ధి అరణ్యము, ఉద్యానము, అద్రి, ప్రయాణము రణము గుఱ్ఱములు ఏనుగులు సూర్యోదయము చంద్రోదయము, ఋతువులు వివాహము స్వయంవరము సురాపానము, పుష్పావచయము జలకేళి సంభోగము విశ్లేషము (విరహము), మృగయ, ఆశ్రమము కళలు ఋతువుల యొక్కయు వయస్సు యొక్కయు సంధులు ధాతు వృక్ష అభిసారికలు అను విషయములు వర్ణ్యములు.

రాజునందు :—కీర్తి ప్రతాప ఆజ్ఞా దుష్టదండన వివేకిత్వ సంగ్రామ, శస్త్రాభ్యాస రాజనీతి క్షమా ప్రజాపాలన శత్రుశైలాధివాస అరిపుర శూన్యత్వ ఔదార్య ధైర్య, గాంభీర్య శౌర్య ఐశ్వర్య, ఉద్యమాదులు వర్ణ్యములు

రాణియందు —సౌభాగ్య, లావణ్య శీల శృంగార మన్మథావస్థా, త్రపా చాతుర్య, దాక్షిణ్య ప్రేమ మానవ్రతాదులు వర్ణ్యములు

దేశమున .—పెక్కుగనులు, ద్రవ్యము, పశుధాన్య సమృద్ధి దుర్గ నదీ మాతృకాదులు వర్ణ్యములు

గ్రామమున —ధాన్య లతా వృక్ష సరసీ పశువృద్ధి క్షేత్ర హట్ట (అంగడి) గ్రామ్య స్త్రీ విభ్రమములు వర్ణ్యములు.

పురమున — అట్ట పరిఖా వప్ర, తోరణ ధ్వజ, ప్రాసాద, మార్గ ప్రపా ఆరామ వాపీ వేశ్యాదులు వర్ణ్యములు

నదియందు —జలప్రవాహ గజ పద్మ షట్పద హంస చక్ర, తీర, ఉద్యాన స్త్రీ పాంథ, కేళులు వర్ణ్యములు

అబ్ధియందు —ద్వీప-అద్రి-రత్న-ఊర్మి-పోత (నౌకలు) జలచరము లును - నదీప్రవేశము - చంద్రునివలనఁ గలుగు వృద్ధి - బడబాగ్ని - మేఘ ములు వ్రాలుట మొదలగునవి వర్ణ్యములు

అరణ్యమున —వరాహ - ఇభయూధ - సింహాదులు (క్రూర జంతువులు) - ద్రుమములు - కాక - ఉలూక - కపోతాదిపక్షులు మొదలగునవి వర్ణ్యములు.

ఉద్యానమున :—మార్గము - ఫలపుష్ప లతాదులు - శుకపికాదులు కేళీహంసాదులు - క్రీడలు - పాంథులు మొదలగు విషయములు వర్ణ్యములు

శైలమున —మహౌషధులు - ధాతువులు - వంశములు (వెదుళ్ళు) కిన్నరులు-నిర్ఝరులు-శృంగ-తట-గుహా-రత్న-వనజంతు-ఉపత్యకలు వర్ణ్యములు

ప్రయాణమున – భేరీఝాంకార, భూకంప, బలధూళి, కరభ, ఉక్ష, గజ-ఛత్ర, వణిక్, శకట వేసరములు వర్ణ్యములు

యుద్ధమున : – సైన్యధూళి, తూర్యధ్వని, శరమండపము, రక్తనదులు, ఛిన్నాతపత్ర రథ చామర కేతు కుంభి యోధులును సురనారీవృతభటు లును, సురపుష్పవృష్టియును వర్ణ్యములు

అశ్వమునందు : – వేగిత్వము ఔన్నత్యము తేజము శుభలక్షణము ఖురోత్థాతరజము, ప్రౌఢి గతివిచిత్రతయును దెలివియును వర్ణ్యములు

గజమునందు :— యోధసహస్రములతో యుద్ధముసేయు ప్రౌఢి ఉచ్చత్వము కర్ణచాపలము శత్రువ్యూహవిభేదకత్వము కుంభములుండుట మదాళులుండుటయును వర్ణ్యములు.

సూర్యునియందు — అరుణత్వము సూర్యకాంతశిలలకుఁ జక్రవాకములకును అంబుజములకును పథికలోచనములకును ప్రీతియు తారా-ఇందు-దీప-ఓషధి-ఘూక-తమ-చోర-కులటాదులకుఁ బీడయును వర్ణ్యములు.

చంద్రునియందు .- కులటా-చక్రవాక అంబుజపీడయును - చకోర - చంద్రకాంత-దంపతి ప్రీతియును వర్ణ్యములు.

(షడృతువులందు నేది వర్ణింపవలెనో దోషప్రకరణమునఁ గవి సమయములలోఁ గలదు. అటఁజూచుకొనవలెను).

వివాహమందు - స్నానము - అంగభూషణములు - తూర్య - వేద ఘోషములను వేదీ-సంగీత-హోమ లాజాదులును వర్ణ్యములు

స్వయంవరమందు — మంచములు (సోఫాలు) మండపములు మొదలగు వానిని సిద్ధముసేయుట - రాజపుత్రి - రాజుల యాకార అన్వయవర్ణనచేష్టలును వర్ణ్యములు.

సురాపానమునందు - వికలత్వము - మాటలలో-నడకలో - స్ఖలనము లజ్జయును మానమును విడుచుట - ప్రేమాధిక్యము - కనులెఱ్ఱవడుట - నేత్రభ్రమణము మొదలగునవి వర్ణ్యములు.

పుష్పాపచయమున . — పూలుగోయుట - ప్రియుడు పూవులందిచ్చుచు గోత్రస్ఖలనము సేయుట - మాలను జాఱవిడుచుట - కోపము - వక్రోక్తులు - సంభ్రమాశ్లేషములు వర్ణ్యములు.

జలకేళియందు : - సరస్సును క్షోభపరచుట - చక్రవాకములు - హంసలు మొదలగునవి తొలఁగిపోవుట - నీళ్ళు చల్లుకొనుట - భూషణచ్యుతి మొదలగునవి వర్ణ్యములు.

సురతమున - సాత్త్వికభావములు-సీత్కారము-కనులు ముడుచుకొనుట కాంచీ-కంకణ-మంజీరరవములు-నఖాధరక్షతములును వర్ణ్యములు

విరహమున :- తాప - నిశ్వాస-చింతా - మౌన - జాగర - కృశాంగత్వములును - క్షణములు సంవత్సరములుగా - రాత్రులు దీర్ఘములుగా - శిశిర ముష్ణముగా వర్ణింపవలెను.

మృగయయందు - సంచారము - వలలు-నీలవేషము-మృగత్రాసము-మృగాధిక్యము-హింస-జంతువులను జంపుట-గతిత్వరయును వర్ణ్యములు

ఆశ్రమమునందు :— అతిథిపూజ-ఏణములకు విశ్వాసము-క్రూర జంతువులు శాంతముగా వసించుట - యజ్ఞధూమము - మునికుమారికలు చేయు వృక్ష సేచనము - వల్కలములు - ద్రుమములును వర్ణ్యములు

ప్రాతఃకాలమున — పద్మములు వికసించుట - కోక దంపతులు ప్రీతి నొందుటయు వర్ణ్యములు

మధ్యాహ్నమున — తాపబాహుళ్యము వర్ణ్యము

సాయంకాలమున :— సూర్యుని యెఱుపు-చక్రవాక-పద్మములకు విప్లవమును వర్ణ్యములు (ఈ మూడు కాలములకుఁ గళలని నామాంతరము)

అంధకారమున — అతికాఠిన్యము-సమస్తలోకములను లోపింపఁజేయు సామర్థ్యము-అభిసారికాసంచారమును వర్ణ్యములు

వృతమున — జహంకాఖావత్త్వము - ఆకులదట్టనతే సూర్యుఁడగపడకుండుట - ఉచ్ఛ్రత - పుష్పసమృద్ధి - పథిక సేవ్యత్వమును వర్ణ్యములు.

అభిసారమున — భయభ్రంశము - మంజీరాదుల తిరస్కారము - సాహసము-అతిమోహము - కాలానుగుణమైన వస్త్రధారణము మొదలగునవి వర్ణ్యములు.

శైశవతారుణ్యసంధులును, ఋతుసంధులును వర్ణ్యములు.

ఇపుడు మహాకావ్యలక్షణము చెప్పఁబడినది. కాని కావ్యవస్తు వెట్లుండవలయునో చెప్పలేదు కొందఱీ వర్ణనములఁబట్టియే కావ్యవస్తువు నిర్ణీతమగుచున్నదనియు ననఁగా నివ్వన్నియుఁ గల కథ గావలయు ననియుఁ జెప్పుదురు ధ్వనికారాదు లెవ్వరును మహాకావ్యమున కీ లక్షణమును దెలుపలేదు ధ్వనికారుఁడు పదవాక్యవ్యంగ్యములను దెలిపి ప్రబంధవ్యంగ్యమును దెలిపెను. ప్రబంధమెట్లున్న రసవ్యంజకమో దానినిఁదెలిపియున్నాఁడు అనఁగాఁ గావ్యవస్తువెట్లుండవలయునో వచించెను

కావ్యవస్తువు

మన కవులు నాటకవస్తువునందుఁ జూపినంత శ్రద్ధను శ్రవ్యకావ్యవస్తువునందు జూపరైరి భరతునిమతమునఁ గావ్యమన దశరూపాత్మకమే (కావ్యంహి దశరూపాత్మకమేవ) కావుననే యతఁడు రూపకవస్తువును, రూపకరసమును గుఱించియే చర్చించెను ; కాని శ్రవ్యకావ్యవస్తువును, శ్రవ్యకావ్యరసమును గుఱించి చర్చింపఁడయ్యె కానీ ధ్వనికారుఁడే ప్రప్రథమమున రూపకమునకు వలెనే శ్రవ్యకావ్యమునకును రసమే ప్రధానమనియు, దాననే రమణీయత్వము గలుగుననియు నిర్వచించెను. (ఏతచ్చ రసాదితాత్పర్యేణ కావ్యనిబంధనం భరతాదావపి సుప్రసిద్ధమేవ - ధ్వన్యాలోకము) ఈ విషయము S.K. De గారి Sanskrit Poetics అను గ్రంథమువలనను స్పష్టమగుచున్నది

'We get the first definite exposition as we shall see of the idea of Rasa and its relation to poetry in the works of Dhwanikara and Ananda Vardhana, and its importance in Poetry, as distinguished from Drama, was probably understood from that time Page 22 Footnote 44.

That the Doctrine of Rasa was originally associated with the Dramaturgy and later on applied to poetics is clear from the tradition which survives even in very late writers and makes them not only discuss the theory directly in connection with the Drama but even borrows the illustrations from dramatic poetry.
Page 23, Footnote 45.

ఈ విధముగా De పెక్కుచోట్లఁ దెలిపెను అభినవగుప్తపాదాచార్యుల వారును దమ లోచనమున "నాట్యాత్ సముదాయరూపాత్ రసః కావ్యేచ నాట్యాయమాన ఇవ రసః కావ్యార్థః" అని తెలిపిరి ఈ యుల్లేఖములను బట్టి ధ్వనికారుని కాలమునుండియే యాలంకారికులు శ్రవ్యకావ్యమునందును, నాటకమునందు వలెనే రసప్రాధాన్యమంగీకరించిరి ధ్వనికారునికిఁ బూర్వులయిన భామహ దండి వామనులు క్రమముగా అలంకార గుణ రీతి ప్రాధాన్యముల నంగీకరించి రసము న ప్రధానముగా నిరూపించిరి ధ్వనికారుఁడట్లుగాక భరతుని రూపకరససిద్ధాంతమును శ్రవ్యకావ్యమునకుఁగూడ సమన్వయించెను. ఆ రస మెట్లాస్వాద్యమానమగునో చక్కఁగా నభినవగుప్తుఁడు నిర్వచించెను ఆ విషయము రసప్రకరణమునఁ జర్చింపఁబడును

ఇటఁ గావ్యవస్తువును గుఱించి ధ్వనికారుఁడేమి వచించెనో చూతము

"విభావ భావానుభావ సంచార్యౌచిత్యచారుణః
విధిః కథాశరీరస్య వృత్తస్యోత్ప్రేక్షితస్య వా
ఇతివృత్తవశాయాతాం త్యక్త్వాఽననుగుణాం స్థితిం
ఉత్ప్రేక్ష్యోఽప్యంతరాభీష్ట రసోచితకథోన్నయః
సంధిసంధ్యంగఘటనం రసాభివ్యక్త్యపేక్షయా
నతు కేవలయా శాస్త్రస్థితిసంపాదనేచ్ఛయా
ఉద్దీపనప్రశమనే యథాఽవసరమంతరా
రసస్యాఽరబ్ధవిశ్రాంతే రనుసంధానమంగినః
అలంకృతీనాం శక్తావప్యానురూప్యేణ యోజనం
ప్రబంధస్య రసాదీనాం వ్యంజకత్వే నిబంధనం

విభావ భావ, అనుభావ సంచారుల యౌచిత్యము గలిగి రమణీయముగానున్న కథాశరీరమును (ప్రఖ్యాతముగాని ఉత్పాద్యముగాని మిశ్రముగాని) గ్రహింపవలయును ఇతివృత్తగతమగు ననౌచిత్యములున్నవానినిఁ దొలఁగించి రసోచితముగా దానిని మార్పవలెను రసాభివ్యక్తి నుద్దేశించి యనఁగాఁ

దదుపస్కారకముగా సంధి, తదంగములను గూర్పవలెను అంతేకాని శాస్త్ర మర్యాదను బాలించుటకై రసోపస్కారకములు గాని సంధి తదంగములను గూర్పరాదు ఆ యా ఘట్టములందు రసోద్దీపనమును రసప్రశమనమును సముచితముగాఁ గావింపవలెను ఆరంభింపఁబడి యాఁగిపోయిన యంగిరసమును మఱల ననుసంధింపవలయును సామర్థ్యమున్నదిగదా యని యలంకారములను గూర్పక యనురూపముగా మాత్రమే కూర్పవలెను ఇది ప్రబంధము రసాది వ్యంజకమగుటలో నిబంధనము

ప్రబంధమనఁ గావ్యము "ఇతివృత్తంతు కావ్యస్య శరీరం పరికీర్తితం" అని భరతమతము కాన నిటఁ గావ్యశరీరమని యర్థము కావ్యవస్తువు రసాది వ్యంజకము గావలయునన్నచో నా వస్తువు పై విధముగానే యుండవలయును అనఁగా రూపకమునందు వలెనే కావ్యమునందును వస్తువు రమణీయముగా, రసోచితముగా నుండవలయును రూపకమునందుఁ గవి కథను "అనఁగనఁగా నొకరాజు" అని ప్రారంభింపక యితివృత్తమునందలి రమణీయ ఘట్టములను ప్రదర్శనీయములగువానిని మాత్రమే తీసికొని యంకములుగా విభాగించి వ్రాయును అట్లే శ్రవ్యకావ్యమునను వస్తువు యొక్క రసవద్ఘట్టములను దీసికొనియే రచింపవలెను ఒక విశేషము గలదు. రూపకము దృశ్యమగుట వలన రంగమునఁ గొన్ని విషయములు నిషిద్ధములై యున్నవి కాని కావ్యము శ్రవ్యమగుటవలనఁ గనుకలిచేఁ గలిగినంత జుగుప్సాదులు వినుకలిచేఁ గలుగవు. కాన దృశ్యకావ్యమున నిషిద్ధములయిన వన్నియు శ్రవ్యకావ్యమున నిషిద్ధములు గానక్కఱలేదు కావునఁ గావ్యవస్తువు రసవ్యంజకము గావలయునన్నచోఁ బై విధమున రచింపవలయును ఇదియే కావ్యశిల్పము. ఈ శిల్పదృష్టియే కవికి ముఖ్యముగా నుండవలయును

"విభావానుభావ" ఇత్యాది విషయమును గేవల రూపకవస్తువును గురించి ధ్వనికారుఁడు వచింపలేదు ఎట్లతఁడు రూపకరసమును గావ్యమునకును బ్రధానముగా రమణీయతాప్రయోజకముగా నుద్దేశించెనో యట్లే రూపకవస్తువు వంటి వస్తువునే శ్రవ్యకావ్యమునందును నుండవలెనని యుద్దేశించి దృశ్యశ్రవ్యోభయ కావ్యసాధారణముగా నీ లక్షణమును వచించెను ఇంతేగాదు గద్యప్రబంధములగు నాఖ్యాయికాదులందును నీ శిల్పదృష్టి యుండవలెను

ఈ శిల్పదృష్టితో మనము చూచినచో మన కవులలో ముప్పాతిక మువ్వీసము కావ్యవస్తువును గుఱించి శ్రద్ధ వహింపలేదనవలయును మహాకవి కాళిదాసకావ్యములగు రఘువంశకుమారసంభవములు గూడ నేతద్దోషదూషితములగును అందలి వస్తువులు పై లక్షణములకు లక్ష్యములుగామి రసవ్యంజకములు గాఁజాలవు ఆంధ్రప్రబంధములలోఁ గళాపూర్ణోదయము. ప్రభావతీ

ప్రద్యుమ్నము మొదలగు కొన్నింటఁ దక్క మిగిలిన పెక్కు కావ్యములందు వస్తువు రసవ్యంజకముగా రచింపఁబడలేదు పింగళిసూరన తన కావ్యవస్తువులను చాలవఱకు రసవ్యంజకములుగానే సృజించెను కానీ, యాతఁడును గతానుగతిక మగు సంప్రదాయములను బాటించి యటనటనావస్తువులను గొంత రసాపకృష్ట ములనే చేసెను ఇంకను వసుచరిత్రమునందును, మహాభారతమునఁ గొన్ని భాగములందును ప్రబంధరసవ్యంజకత గానఁబడును ఇతిహాసములందిది మృగ్యము వాసిమాట నావలనుంతము కాని ప్రబంధములో వస్తువును రస వ్యంజకముగాఁ జేయవలయును ఏలొకో? కవుల కీ విషయమున శ్రద్ధ సన్నగిల్లినది ఈ విషయమునే శిరోమణి వి యస్ సుబ్బరామభట్టర్‌గారు తమ "Studies in Dhwanyaloka' అను గ్రంథమున ౧౧౩-౧౧౪ పుటలలో నిట్లు దెలిపిరి

Bharata says

ఇతివృత్తం తు కావ్యస్య శరీరం పరికీర్తితం
పంచభి స్సంధిభిస్తస్య విభాగాః పరికీర్తితాః

And thus shows the natural divisions of a poetical action in general It may be assumed therefore that according to his view there is no essential distinction between drama and non-dramatic poetry, as far as the construction of plot is concerned In his description of the essential features of a Maha-kavya *Bhamaha* also says "పంచభి స్సంధిభిర్యుక్తం" and appears to hold the same view It seems to be faintly echoed by Dandin also But it was overlooked by latter writers of poetics to the entire neglect of plot-junctures in the criticism of a non-dramatic poetry This truth is borne out by the fact that all the writers of poetics who have ever dealt with the technics of drama have invariably exemplified the rules of plot-building by quotations from dramatic literature and none of them has even attempted to give a single illustration from epic poems. But Ananda makes no distinction between these two species of poetry as far as the construction of the plot is concerned In both of them, it is to subserve the sentiment A plot device is certainly to be condemned, whether it be in a play like Venisamhara, as he observes or in an epic poem, if it does not contribute to the development of Rasa'

కాళిదాసాదిమహాకవులు కావ్యవస్తువు రసవ్యంజకము గాకున్నను దమ ప్రతిభానిష్పన్నమైన కవితాసంపదచే సుదాత్తముగా రమణీయముగా రసపూర్ణ ముగా విరచించిరి దీనికిఁదోడు గావ్యవస్తువు గూడ రమణీయముగానున్నచో బంగారమునకుఁ దావి యబ్బినట్లుండును గదా!

ఆంగ్ల సాహిత్యమునఁ గావ్యమునకును జరిత్రకును గలభేదమేమి ? నీతి (తత్త్వ) శాస్త్రమునకును గావ్యమునకును గల భేదమేమి ? అనియును విచారణ చేసిరి ఈ విచారణ మన సాహిత్యమున లేదు దాని నిటఁ జూపుట యప్రస్తుతము గాదని చూపుచున్నాము

కావ్యమునకును జరిత్రకును గల భేదమేమి ?

చరిత్రరచయిత గద్యములో వ్రాయును. కవి పద్యముల వ్రాయును. ఇదియే భేదమనరాదు ఏలనఁ జరిత్ర జరిగినకథ నున్నదున్నట్లుగాఁ దెలుపును కావ్య "మీ కార్యకారణభావమును బట్టి యిట్లు జరుగును" అని తెలుపును. చరిత్రకథకుఁ గార్యకారణభావమక్కరలేదు కావ్యకథకిది యత్యావశ్యకము కావుననే చరిత్రనుగూడ దృశ్యశ్రవ్యకావ్యములుగా రచించునపుడు గార్యకారణ సామగ్రితో మార్పులు సేయుదురు. మఱియు జరిత్ర యొక వ్యక్తిగతమగు నితివృత్తమును దెలుపును కావ్యముగూడ వ్యక్తిగతమగు నితివృత్తమును దెలుపుచున్నను నా వ్యక్తి సర్వసాధారణమగు వ్యక్తియేకాని ప్రత్యేకవ్యక్తిగాదు. కావ్యమున నా వ్యక్తికిఁ బ్రాధాన్యము గాక యావ్యక్తియొక్క వ్యాపారమునకే ప్రాముఖ్యము వ్యాపారమనునది వ్యక్తి వినాగా నిర్వహింపఁబడదు కావునఁ గావ్య మొక కల్పితనామముతో నా వ్యక్తి నుపయోగించుకొనుచున్నది. ఆ వ్యక్తిపే రేదేనిఁ గావచ్చును చరిత్రమున వ్యక్తివ్యాపారమునకుఁగాక వ్యక్తికే ప్రాముఖ్యము ఉదాహరణమును జూపుదురు. శివాజీ చరిత్రమునఁ గవి శివాజీ పేరును దీసివేసి మఱొక పేరును బెట్టరాదు మేఘసందేశమున యక్షదంపతులు నాయికానాయకులు యక్షదంపతుల పేరినిఁ దీసి గంధర్వదంపతు లన్నను సందేశమునకుఁ గొఱతరాదు ఈ యక్షదంపతులకుఁ గవి నామకరణము సేయలేదు. దాన నే కొఱఁతయురాలేదు చరిత్రమునందువలెనే పురాణకథాకావ్యము లందును వ్యక్తుల నామములే ప్రధానములు. పురాణములనఁబురాతనచరిత్రములేకదా !

ఇఁకఁ గావ్యమునవలెఁ జరిత్రమునఁ బ్రతిభతోఁ (భావనాశక్తి) బనిలేదు. గుణాలంకార రీతు లక్కఱలేదు రస మక్కఱలేదు అది యున్నదున్నట్లు విషయమును జెప్పును కావ్యమున దానియందుఁ బనిలేనివన్నియును కావల యును. చరిత్ర మొకానొకకాలమునకు సంబంధించినది. కావ్యము సర్వకాలమునకును సంబంధించి యుండును మొత్తముమీదఁ గావ్యము సర్వవ్యక్తి సాధారణము ; సర్వకాలసాధారణమును నగును.

నీతిశాస్త్రమునకును గావ్యమునకును గల భేదమేమి ?

కావ్యము నీతిని వాచ్యరూపమునఁగాక వ్యంగ్యరూపమున బోధించును. నీతిశాస్త్రము వాచ్యరూపముగా నీతిని బోధించును. మనవారు కావ్యము కాంతా

సమ్మితమని చెప్పిరిగదా ! ఈ పై యర్థ మీ పదములోనే యిమిడియున్నది

ఆనందవర్ధనుఁడు చెప్పిన కావ్యవస్తులక్షణము చాల రమణీయమైనది. దానిలో నిందలి యష్టాదశవర్ణనలలోఁ గొన్ని చేరును కొన్ని చేరవు చేరిన వానినే గ్రహించి చేరనివానిని విడువవలయును తదనుకూలముగా

"ఇందు నొకకొన్ని కడవైన నెంచిచూడ
నదియు నవని మహాకావ్య మనఁగఁ బరఁగు"

అని యీ కవి చెప్పియేయున్నాఁడు.

ఇందలి యష్టాదశవర్ణనములలో నొకటగు విరహమును (విరహ విప్రలంభము) వర్ణించుచో నాంధ్రప్రబంధములందు మలయానిల చంద్రదూషణాదులు శైత్యోపచారాదులును మితిమీఱి వర్ణింపబడి యున్నవి ఇవి మన్మథావస్థలలో నొకటగు ప్రలాపముయొక్క కార్యములు. ద్రవిడ కర్ణాటాదిభాషలలోఁగూడ నిట్టి వర్ణనలు గలవు

ఇవి యీ విధముగా నిబంధింపఁబడవలెనని యే యలంకార గ్రంథము నందును శాసింపఁబడలేదు ఆంధ్రమున అల్లసాని పెద్దనయే ప్రప్రథమమున మనుచరిత్రమునఁ బవేశపెట్టెను. అది పెద్దనోపజ్ఞమే కట్టమంచి రామలింగారెడ్డిగారు కవిత్వతత్త్వ విచారమున నలంకారశాస్త్ర మన నేమో దెలియక యితరుల నడిగి తెలిసికొనకయు నిదంతయు నలంకారశాస్త్రమునందే కలదని భ్రమపడి మితిమీఱి దానిని దూయఁబట్టిరి అలంకారశాస్త్రమన "Literary Criticism" అని వారర్థము చేసికొన్నచో నీ విధముగా వ్రాసియుండరు పెద్దన వ్రాసినదానినిఁ దరువాతి కవులు గ్రుడ్డిగా ననుసరించిరి. ఈ విషయమున బూర్వకవులౌచిత్యమును మీఱి వర్ణించి రన్నచో దోషములేదు. ఇది కవుల దోషమే కానీ యాలంకారికుల దోషముకాదు రామలింగారెడ్డి గారికన్న మన యాలంకారికులు విమర్శకతములు

ఈ కావ్యము వస్తువునుబట్టి ప్రఖ్యాతము ఉత్పాద్యము మిశ్రము అని మువ్విధములు ప్రఖ్యాత మనఁ బురాణప్రసిద్ధము - రామాయణాదులు : ఉత్పాద్య మనఁ గేవలకవికల్పితములు - కళాపూర్ణోదయాదులు· మిశ్రమనఁ గొంత ప్రఖ్యాతవస్తువును గొంత యుత్పాద్యవస్తువును మిశితమైనది'. మదీయమగు కీరసందేశము - వీనిలో నేది రమణీయముగా నుండు ? నని ప్రశ్నించుకొని రామరాజభూషణుఁడు వసుచరిత్రలో నిట్లు చెప్పెను

ఉ కేవలకల్పనాకథలు కృత్రిమరత్నము, లాద్యసత్కథల్
వావిరిఁ బుట్టురత్నము, లవారిత సత్కవికల్పనా విభూ
షావహపూర్వవృత్తములు సానలఁ దీఱిన జాతిరత్నముల్
కావున నిట్టి మిశ్రకథగా నొనరింపుము నేర్పుపెంపునన్.

దీనిని(బట్టి యుత్పాద్యవస్తువు కృత్రిమరత్నము; ప్రఖ్యాతవస్తువు గనిలోఁ బుట్టిన రత్నము (అనఁగా మెఱుగువెట్టని రత్నము) మిశ్రవస్తువు సానఁదీఱిన జాతిరత్నము అని నిష్కృష్టార్థము

ఇవిగాక 'గద్య పద్య ఉభయభేదములచే గావ్యమెల్లయుఁ ద్రివిధము. గద్యపద్య కావ్యములు ప్రసిద్ధములేగదా ఇక నుభయకావ్యమనగా జంపూ కావ్యము

"గద్యపద్యోభయమయం చంపూ రిత్యభిధీయతే"

మన యాంధ్రకావ్యములలో నిర్వచనోత్తరరామాయణముదక్క మిగిలిన కావ్యములన్నియుఁ జంపూ కావ్యములే వీనికిపుడు 'ప్రబంధము' అని వ్యవహారము వచ్చినది వర్ణనాభూయిష్ఠమగు నీ ప్రబంధమును నన్నెచోడుఁడు వస్తు 'కవిత యనియు లక్షణదీపికాకారుఁడు విస్తరకవిత' యనియు వ్యవహరించిరి చంపూకావ్యమునందు వలెనే యాంధ్రప్రబంధములందును నొక్కొక్క యాశ్వాసమునందును బెక్కువృత్తములను గవులు వాడుదురు. రఘువంశాది సంస్కృత కావ్యములలో సర్గారంభమునుండి సర్గాంతము వఱకు నొకేవృత్తముండును అంతమునమాత్ర మొక భిన్నవృత్తముండును నానావృత్తమయమగు సర్గలును గలవు. (నానావృత్తమయః క్వాఽపి సర్గః కశ్చన దృశ్యతే) ఇప్పటి కవులలోఁ గొందఱు సంస్కృత కావ్యములలో వలె నొక్కటేవృత్తమును దుదిదాఁక వాడుచున్నారు ఇందేది సమీచీనమని ప్రశ్న వచ్చుచున్నది గాయకుఁడు తన పాట కచ్చేరీలో మొదటినుండి తుదిదాఁక నొకేరాగముతోఁ బాటలన్నియును బాడఁడు. కృతి వర్ణము, జావళీ మొదలయినవన్నియు వివిధ రాగములతో వివిధ తాళములతోఁబాడును. అట్లుగానిచో లోకము మెచ్చదు అట్లే కవియును నిర్వచనముగా భిన్నభిన్న వృత్తములలోనే వ్రాసినచో సమంజసమని నా తలంపు

పద్యకవిత్వమును మార్గకవిత్వమనియుఁ బదకవిత్వమును దేశికవిత్వమనియు వ్యవహరింతురు అనఁగా సంస్కృతపదభూయిష్ఠమై సంస్కృతచ్ఛందశ్శాస్త్రసంగతములగు వృత్తములుగల రచన మార్గకవిత దేశీయములగు మాత్రాచ్ఛందస్సునుండి పుట్టిన జాతివృత్తముల రచన దేశికవిత ఈ దేశికవితకు జానుఁదెనుఁగు, పదకవిత, గేయవాఙ్మయము అనియు నామాంతరములు

మఱియు వర్ణ్యవస్తుభేదమునుబట్టి గద్యపద్యాదిభేదములను బాటింపవలయునని సరస్వతీకంఠాభరణ వ్యాఖ్యాతయగు రత్నేశ్వరుఁడిట్లు తెలుపుచున్నాడు.

కశ్చిద్గద్యేన పద్యేన కశ్చిన్మిశ్రేణ శక్యతే
కవితుం కశ్చన ద్వాభ్యాం కావ్యాఽర్థః కశ్చన త్రిభిః

"యథా హి అటవీవర్ణనాదౌ గద్యం ప్రగల్భతే తథా న పద్యం, యథాచ కావ్యశాస్త్రశాసిత్వహాసోచితేఽర్థే పద్యముత్సహతే న తథా గద్యం" ఇత్యాది

"పద్యోపాత్తబంధౌచిత్యద్రష్టవ్యా" అరణ్యవర్ణనమున గద్యము శోభిల్లునట్లు పద్యము శోభిల్లదు. కావ్యశాస్త్రరూపములగు కావ్యములందుఁబద్యము శోభిల్లునట్లు గద్యము శోభిల్లదు. కథా ఆఖ్యాయికాదులందు గద్యమే శోభిల్లును చంపువులందుభయమును నుండవచ్చును దీనినే ధ్వనికారుఁడు ప్రబంధౌచిత్యమని చెప్పెను

కానీ కవులీనియమమును బాటించినట్లు గానము. మహాకావ్యమునఁగానీ ఖండకావ్యమునఁగానీ యొక్కఁడే నాయకుడుండవలెను అతఁడుఁ ధీరోదాత్తుఁడు శృంగారవీరరసములో నొకటి ప్రధానముగా నుండవలెను. సాహిత్యదర్పణకారుడు శృంగారవీరశాంతములతో నొకటి యంగిగా ననఁగా ప్రధానముగా నుండవలెనని నుడివెను సాహిత్యదర్పణమునకు సంపాదకుఁడగు దుర్గాదాస పండితుఁడు భరతుని "శృంగారో వీర ఏవ వా" అను వచనము సముచితరస సూచకమనియుఁ ప్రబోధచంద్రోదయమున శాంతమును, ఉత్తరరామచరితమునఁ గరుణమును గలవని వ్రాసెను అట్లే శక్తిభద్రకృతమగు ఆశ్చర్యచూడామణి, కృత్యారావణము, అద్భుతదర్పణము అనునాటకములందద్భుతరసమంగిగాఁ గలదు కావున నాటకమునందు వలెనే కావ్యమునందును శృంగార, వీర, శాంతి కరుణ అద్భుత, హాస్య రౌద్ర భయానక, భీభత్సములు ప్రధానముగా ననఁగా నంగిరసములుగా నుండును. మఱియును,

> ఆదౌ నమస్క్రియాశీర్వా వస్తునిర్దేశ ఏవ వా
> క్వచిన్నిందా ఖలాదీనాం సతాంచ గుణకీర్తనం
> ....
> సర్గాంతే భావిసర్గస్య కథాయాస్సూచనం భవేత్.

తా. కావ్యారంభమున నిష్టదేవతానమస్కారముగానీ ఆశీర్వాదముగానీ, వస్తునిర్దేశముగానీ యుండవలెను కుకవినిందాసుకవిస్తుతులుండవలెను ఏ కవుల గ్రంథములను జదివి తాము విజ్ఞానమార్జించిరో వారి యెడల గృతజ్ఞతను జూపుట ధర్మముగదా। అదియే సుకవిస్తుతి సర్గాంతమున భావిసర్గకథాసూచన ముండవలెను

ఇఁక క్షుద్రప్రబంధములఁగూర్చి తెలుపుదును

క్షుద్రప్రబంధములు

ఉదాహరణ కావ్యము

కం కళికోత్కళికలుఁ, బద్యము,
లలరారు విభక్తులుం; దదాభాసయుతో
త్కళికలు స జయశీపదమౌ
దల మాలిని మొదలఁదగ నుదాహరణమగున్. ౧౩౮

తా కళికోత్కళికలును, పద్యములును విభక్తులతో నలరారుచుండును ఉత్కళికలు విభక్త్యాభాసముతో నుండును. 'జయతి' అను పదము మొదటఁగల మాలిన్యాదివృత్తము మొదట నుండవలెను ఇట్టిది యుదాహరణమగును. దీని వివరణము ముందు చేయుదము.

కం. అందు విభక్త్యాభాసము
లందుఁ జతుర్థికినిఁ దెనుఁ గుదాహరణము పెం
పొందం గళికోత్కళికల
సందీప్త విభక్తితాలసంప్రాసం బై. ౧౬౯

ఈ పద్యముయొక్క యర్థ మస్పష్టము. ఇట దీనికి మూలమగు ప్రతాపరుద్రీయలక్షణమును జూపుదుము.

"యేన కేనాఽపి తాళేన గద్యపద్య సమన్వితం
జయత్యుపక్రమం మాలిన్యాదిప్రాసవిచిత్రితం
తదుదాహరణం నామ విభక్త్యష్టకసంయుతం.

యత్రాఽదౌ జయత్యుపక్రమం మాలిన్యాదివృత్తం రమ్యం పద్యం నిబధ్యతే॥ అనంతర 'మపిచ' ఇత్యుపక్రమ్య అష్టవాక్యాని సప్రాసాని సతాళాని ప్రతివిభక్తి నిబధ్యంతే అనంతరం విభక్త్యాభాసా స్తదుదాహరణం"

ప్రప్రథమమున 'జయతి' పదముతోఁ బ్రారంభింపఁబడిన 'మాలినీ' ప్రభృతి వృత్తములలో నేదోయొకటి యుండవలయును పిమ్మట 'అపిచ' అని ప్రారంభించి ప్రాసముతోఁ దాళముతోఁ గూడిన యెనిమిది వాక్యములు రచింపవలెను ఇట్లు ప్రతివిభక్తియందును నెనిమిదెనిమిది వాక్యములుండవలెను పిమ్మటఁ బ్రాసములతోఁగూడిన విభక్త్యాభాసచిహ్నితములయిన యెనిమిదివాక్యము లుండవలెను. అనఁగా మొదట 'జయతి' పదసహితమైన మాలిన్యాదివృత్తము; పిమ్మట ప్రథమాది విభక్త్యంత వాక్యము లెనిమిదుండును. దీనికిఁ గళిక యని పేరు పిమ్మట నెనిమిది విభక్త్యాభాసాంకితములగు వాక్యములుండును దీనికి 'ఉత్కళిక' అని పేరు ఇది యుదాహరణ కావ్యము.

ఈ లక్షణము సంస్కృతమున నున్న 'ఉదాహరణ కావ్యము' నకు సరిపోవును. ఆంధ్రమున 'జయతి' పదముతో నారంభింపఁబడిన యుదాహరణములు లేవు. మఱియు విభక్త్యాభాసాంకితములగు వాక్యములుగల యుత్కళికలును లేవు.

ఈ లక్షణమైనను నిస్సందిగ్ధముగా లేదు అప్పకవీయమున నీ క్రింది లక్షణము గలదు

సీ. సప్తవిభక్తులు, సంబోధనంబును గూడ నెన్మిది విభక్తులు గ్రమమునఁ
బతిపేరుదొరలంగఁబద్య మొక్కటిచెప్పి రగడభేదములుమార్గములుగాఁగఁ
గళికలు నెనిమిది దళములు గావించి, దానిలో సగము నుత్కళికఁజేసి,
యదియొక్క సమసనంబయ్యెడు దళములెన్మిదిగూర్చి వానికిఁదుదవిభక్తి

గీ. బయలుపఱచి కట్టకడను బద్యమొకటి
బలుకవలయును సార్వవిభక్తికముగ
నిర్వదాఱు పద్యములందు నిడిన ధాత్రి
నిది యుదాహరణమటఁదురిద్ధచరిత ।

దీనివలనఁ గూడ నుదాహరణలక్షణము సమగ్రముగా నిస్సందిగ్ధముగాఁ దేలకున్నది అప్పకవీయమున నీయఁబడిన 'కృష్ణోదాహరణము' ననుసరించి యుదాహరణ లక్షణము నిట సమగ్రముగా రచించి యాకృష్ణోదాహరణములోని సప్తవిభక్తులందలి ప్రథమపాదముల నుదాహరింతుము. విద్యార్థులద్దానిని సమగ్రముగాఁ జూచి దీని నవగతము సేసికోవలెను

ఇది దేవతాస్తోత్రరూపమగు కావ్యము సంబోధనముతోఁగలిసి యెనిమిది విభక్తులతో నీ యుదాహరణకావ్య మీ క్రిందివిధమున రచింపఁబడును కవి యుద్దేశించిన దేవతానామములోఁ బ్రథమావిభక్తి క్రమమున నొక్కొక్క విభక్తిలో మొదట నొక పద్యమును కళిక ఉత్కళిక యను పేరుగల గేయ రూపమగు గద్యములును రచింపవలెను ఇట్లు సంబోధన విభక్తితోఁ గలిపి యెనిమిది విభక్తులలో రచింపవలెను తుట్టతుదకుఁ బ్రథమావిభక్తి క్రమమున నెనిమిది విభక్తులతోఁ గూడిన దేవతాస్తోత్రపరమగు పద్యమును రచింపవలెను. ఇందుఁ గళికకును ఉత్కళికకును నెనిమిదెనిమిది పాదములుండును. అయితే కళికోత్కళికలన నేమో తెలిసికొనవలయును. (నరసభూపాలీయలక్షణము వలన నింత యర్థము రాదు).

దీర్ఘసమాసములుగల గద్య ముత్కళిక ఈ విషయము గద్యకావ్య లక్షణములలోఁ దెలియును. ఈ యుదాహరణ కావ్యమున నుత్కళిక యొక్క యెనిమిదిపాదములందొకే సమాసముండవలెనను నియమము 'అప్పకవీయ' పద్యమునఁగలదు దీనినిఁబట్టి కళిక సమాసరహితము గాని, యల్పసమాసము గలది కాని కావచ్చును. ఉత్కళిక యొక్క పాదాంతమున సమాసము ముగియును. (ఉత్కళికకువలెఁ గళికకు లక్షణము గానరాదు) మఱియు నిట సంగీతశాస్త్ర విషయ మలఁతిగాఁ దెలిసికొనవలయును. సంగీతశాస్త్రమున ౩ ౪ ౫ ౭ ౯ మాత్రల గతులు గల పంచతాళములుండును. వానికిఁ గ్రమముగా త్రిశ్రగతి, చతురశ్రగతి ఖండగతి మిశ్రగతి సంకీర్ణగతి అని నామములు వీని నొక్కొక్కదానిని ౨ చేఁగాని ౪ చేఁగాని ౮ చేఁగాని యావర్తించి

(హెచ్చించి) యొక్కొక్క పాదమును రచింపవలెను మనము త్రిశ్రగతి తాళ మును దీసికొందము దీనికి మూఁడుమాత్రల గతి దీనిని రెంటిచే హెచ్చించిన నాఱుమాత్రలును నాలుగుచే హెచ్చించినఁ బండ్రెండు మాత్రలును, నెనిమిదిచే హెచ్చించిన నిరువదినాలుగు మాత్రలును వచ్చును కాఁబట్టి కవి తన యిష్టాను సారముగాఁ బాదమునకు ౬ ౧౨, ౨౪ మాత్రలను నియమించుకొని రచింప వలయును. ఇట్లెనిమిదిపాదములు రచింపవలయును. ప్రతిపాదాంతమునందును దత్తద్వితీయావిభక్తిప్రత్యయము లుండవలెను. దీనికిఁ గళిక యని పేరు. ఈ కళిక యొక్క పాదములోనున్న మాత్రలలో సగము మాత్రలతోఁ బ్రతిపాదమును రచింపఁబడిన యెడల నా విధముగా నెనిమిది పాదములు గూర్పఁబడినచో నది యుత్కళిక యనఁబడును అనఁగాఁ గళిక యొక్క పాదమునకు ౨౪ మాత్ర లున్నచో నుత్కళిక యొక్క పాదమునకు ౧౨ మాత్రలే యుండవలెను. ఇట్లే యితర తాళములందుఁ గూడ నూహింపవలెను ఈ కళికోత్కళికలలో రెండేసి పాదములకొక ప్రాస యుండును ప్రతి పాదమునకును గళికలలో మాత్రమే యతి కనఁబడుచున్నది ప్రతాపరుద్రీయలక్షణానుసారముగాఁ గళికాపాదాంతము లందు విభక్తులును, ఉత్కళికాపాదాంతములందు విభక్త్యాభాసములును నుండ వలెను. విభక్తులవలెఁ గనఁబడునవి విభక్త్యాభాసములు, ఎట్లన:

ఆరద మెక్కుక పూని
పురికి వచ్చినవాని

ఇట 'వాని' అను ద్వితీయా-విభక్త్యంతపదమువలెనే 'పూని' అనుపదము నిబంధింపఁబడినది. ఇది విభక్త్యాభాసము అప్పకవి లక్షణమున విభక్త్యా భాసము లుండవలెనని చెప్పలేదు అతని లక్షణమున నుత్కళిక యొక్క యెనిమిది పాదములును నొకటే సమాసముగా నుండవలెనని యున్నది. కానీ లక్ష్యమున నిది కానరాదు సంస్కృతబసవోదాహరణమున నేకసమాసము గలదు లక్షణమున నుత్కళికలో నంత్యప్రాస నియమమును జెప్పలేదు కానీ లక్ష్యములలో నంత్యప్రాసనియమము, ఎనిమిదవ పాదాంతమున నా యా విభక్త్యంత పదమును కానవచ్చుచున్నది ప్రతాపరుద్రీయ లక్షణము ననుస రించిన లక్ష్యము గానరాదు.

ఆంధ్రోదాహరణ కావ్యములకుఁ గృష్ణోదాహరణమే ప్రమాణము.
కాన నప్పకవీయమునందలి కృష్ణోదాహరణము నుదాహరించిచూపుదును

ప్రథమావిభక్త్యంతపద్యము

ఉ శ్రీవనితాసనాథుఁడు వశీకృతభక్తమనోంబుజుండు ...
(నాఱుగు పాదములు గలవు) ... ...

ప్రథమావిభక్త్యంతకళిక

'మఱియు దేవకీశౌరసేనకుమార నిర్మలరత్న రాజము'

(ఇట్లెనిమిదిపాదము లున్నవి ఇది మిశ్రగతి తాళము దీని కేడు మాత్రల గతి. దీనిని నాలుగుచే హెచ్చించి యొక్కొక్క పాదమునకు నిరువదెనిమిది మాత్రలు కవి కూర్చెను; ప్రతి పాదాంతమందును ప్రథమావిభక్త్యంత పదములు గలవు.

ఉత్కళిక

'కమలనేత్రుని రాకరోయుచు'

(ఇట్లెనిమిది పాదము లున్నవి పాదమునకు ౧౪ మాత్రలున్నవి. అనఁగాఁ బైనుదాహృతమగు కళికలో సగమున్నది ఉత్కళిక పాదాంతమందునా యీ విభక్త్యంతపదములక్కఱలేదు కాని యంత్యప్రాసముండును. తుది యెనిమిదవ పాదాంతమున మాత్రమే విభక్త్యంతపదముండును).

ద్వితీయావిభక్త్యంతపద్యము

ఉ మానవులార ... గొల్వుఁడీ పరా
ధీనులుగాక మీరు వసుదేవకుమారకు ముక్తికోసమై

ద్వితీయావిభక్త్యంతకళిక

'మఱియు త్రేతల నెల్ల మరులు గొల్పినవాని'

(ఇట్లెనిమిదిపాదము లుండవలెను. కానీ యప్పకవీయమున నాలుగు పాదములు ముద్రణమున జాఱిపోయినవి ఇది ఖండగతి తాళము దీనికైదు మాత్రల గతి. దీనిని నాలుగుచే హెచ్చించి ప్రతిపాదమును నిరువదిమాత్రలతోఁ గవి నిబంధించెను. ప్రతి పాదాంతమందును ద్వితీయావిభక్త్యంతపదములు గలవు)

ఉత్కళిక

'మందుపావకుఁగొల్చి'

(ఇట్లెనిమిది పాదములు గలవు. పై కళికలో నిది సగము మాత్రమే అనఁగాఁ బదిమాత్రలు మాత్రమే గల పాదము. పాదాంతమున విభక్త్యంత పదములు లేవు. అంత్యప్రాసము గలదు తుదియందు ద్వితీయావిభక్త్యంత పదము గలదు).

తృతీయావిభక్త్యంతపద్యము

చ. పులిసిలనేల ... ... వాంఛితార్థముల్
కలుగు నమేయుచేతఁ గమలాధవుచే వటపత్త్రశాయిచేన్

తృతీయావిభక్త్యంతకళిక

'మఱియు బ్రహ్మమాయ గెల్చి మసలు మంత్రవాదిచేత'

(ఇట్లెనిమిది పాదములు గలవు ఇది త్రిశ్రగతితాళము. దీనికి మూఁడు మాత్రలు దీనిని నెనిమిదింటిచే హెచ్చించిన నిరువదినాల్గు మాత్రలగును ఇందుఁ బాదమున కా విధముగా నిరువదినాల్గుమాత్రలు నిబంధించెను. ప్రతి పాదాంతమందును దృతీయా విభక్త్యంతపదములు గలవు)

ఉత్కళిక

'గట్టిగ శరపంజరంబు'

(ఇట్లెనిమిది పాదములు గలవు పైపాదములో నిది సగము అనఁగా బండ్రెండు మాత్రలు గలవు పాదాంతమున దృతీయావిభక్త్యంతపదములు లేవు. అంత్యప్రాస గలదు. ఎనిమిదవ పాదాంతమున మాత్రమే విభక్త్యంతపదము కలదు)

చతుర్థీవిభక్త్యంతపద్యము

'శా. ఓలంబాసకు .. ..
కేలంబట్టి నిమిడ్చినట్టి హరికై కృష్ణాంబుభృన్మూర్తికై.'

చతుర్థీవిభక్త్యంతకళిక

'మఱియును గౌమోదకియును ఖడ్గముమఱియును శంఖముఁబట్టిన హరికై

(ఇట్లెనిమిది పాదములు గలవు. ఇది చతురశ్రగతి తాళము. దీనికి నాలుగుమాత్ర లుండును. దీనిని నెనిమిదిచే హెచ్చించిన ౩౨ మాత్రలగును. కాన నిందావిధముగాఁ బాదము రచింపఁబడినది. ప్రతిపాదాంతమందును జతుర్థీ విభక్త్యంతపదములు గూర్పఁబడినవి)

ఉత్కళిక

'తొలిపుట్టువు నోముఫలంబుననే'

(ఇ ట్లెనిమిది పాదములు గలవు ఇందుఁ బాదమునకుఁ బదునాఱు మాత్రలు మాత్రమే. ఏలనఁ బై కళికలో నిది సగమే యుండవలెను. పాదాంతమునఁ జతుర్థ్యంతపదములు లేవు. అంత్యప్రాసము గలదు. ఎనిమిదవ పాదాంతమున మాత్రమే విభక్త్యంత పదము గలదు)

పంచమీవిభక్త్యంతపద్యము

మ పురిటింటం బసిబిడ్డచందమున ... ...
... .. నందపుత్త్రీవలనం దార్క్షణ ధర్మస్థితుల్.

పంచమీవిభక్త్యంతకళిక

మఱియు గీతామృతసమగ్రసింధునివలన'

(ఇట్లెనిమిది పాదములు గలవు ఇది ఖండగతి తాళము దీనికైదు మాత్రలగతి. దీనిని నాల్గింటిచే హెచ్చించి పాదమున కిరువదిమాత్రలు కవి కూర్చెను ప్రతిపాదాంతమునందును బంచమీవిభక్త్యంతపదముండును.)

ఉత్కళిక

'తనుఁబిల్వఁ గడుఁగూరఁ'

(ఇట్లెనిమిదిపాదములు గలవు. పాదమునకు ౧౦ మాత్రలు గలవు. పైదానిలో నిది సగము పాదాంతమునఁ బంచమీవిభక్త్యంతపదములేదు. అంత్యప్రాసముగలదు ఎనిమిదవపాదాంతమునమాత్రమే విభక్త్యంతపదము కలదు)

షష్ఠీవిభక్త్యంతపద్యము

శా. కారాగారమునుండి ... ...
... . హరికిన్ వాలార నే మ్రొక్కెదన్

షష్ఠీవిభక్త్యంతకళిక

'మఱియుఁ బెఱయ, నెఱయమరియు మధునిఁగూల్చినట్టి హరికి

(ఇట్లెనిమిదిపాదములు గలవు ఇది త్రిశ్రగతి తాళము దీనికి మూఁడు మాత్రలు. వీని నెనిమిదింటిచే హెచ్చించి ౨౪ మాత్రలతోఁబాదమును బంధించెను ప్రతిపాదమునందును షష్ఠీవిభక్త్యంతపదము గలదు

ఉత్కళిక

'గొల్లలెల్లఁ దల్లడిల్ల'

(ఇట్లెనిమిది పాదము లుండవలయును కాని రెండుపాదములు ముద్రణమున జాఱిపోయినవి ఈ పాదమునకు ౧౨ మాత్రలే పాదాంతమున విభక్త్యంతపదములేదు అంత్యప్రాస గలదు. ఎనిమిదవపాదాంతమున మాత్రమే విభక్త్యంతపదము కలదు)

సప్తమీవిభక్త్యంతపద్యము

మ. పృథులావంతివరస్వయంవరమునన్ ... ...
... ... పెండ్లాడిన కృష్ణునందు నిలిచెన్ దీర్ఘప్రతాపోన్నతుల్.

సప్తమీవిభక్త్యంతకళిక
'మఱి నుగ్రసేనామాత్యునందు'

(ఇట్లెనిమిదిపాదము లుండవలెను ఒక పాదము పోయినది. ఇది చతురశ్రగతి తాళము దీనికి నాలుగు మాత్రలు. దీనిని నాల్గింటిచే హెచ్చించి యొక్కొక్క పాదమును ౧౬ మాత్రలతోఁ గవి రచించెను. ప్రతిపాదాంతము నందును సప్తమీవిభక్త్యంతపదము గలదు.

ఉత్కళిక
'సజ్జరాగంబు'

(ఇట్లెనిమిది పాదములు గలవు ఇందుఁ బాదమున కెనిమిది మాత్రలే కలవు. ప్రతిపాదాంతమందును సప్తమీవిభక్త్యంతపదము లేదు. అంత్య ప్రాసము కలదు. ఎనిమిదవ పాదాంతమున మాత్రమే విభక్త్యంతపదమున్నది

సంబోధనావిభక్త్యంతపద్యము

ఉ ధర్మజుఁడంపినన్ ... ...
... ... తలంతు నాదుమనంబున నందనందనా!

సంబోధనావిభక్త్యంతకళిక
'మఱియుఁ ద్రిజగన్మోహ మాయఁదాల్చినజాల'

(ఇట్లెనిమిది పాదములు గలవు. ఇది ఖండగతి తాళము దీనికైదు మాత్రలుండును దీనిని నాల్గింటిచే హెచ్చించి ౨౦ మాత్రలతో నొక్కొక్క పాదమును రచించెను. ప్రతిపాదాంతమునందును సంబోధనా విభక్త్యంత పదము గలదు)

ఉత్కళిక
'గురుభీష్మ రాధేయ'

(ఇట్లెనిమిది పాదములు గలవు. దీని పాదమునకు ఐదిమాత్రలే కలవు. పాదాంతమున విభక్త్యంతపదము లేదు. అంత్యప్రాస గలదు. ఎనిమిదవ పాదాంతమున మాత్రమే విభక్త్యంతపదము కలదు).

సార్వవిభక్తికపద్యము

శా. నీ వాక్యండవు; నిన్ను నమ్మి కొలుతున్, నీచే సుఖంబబ్బెః నీ
కై వే దండమొనర్తు; నీ వలన నిష్టావాప్తి చేకూఱె, నీ
కే విశ్వాసముఁ జేర్తు నింక మదిలో, హెచ్చయ్యె నీయందు నా
కై వారంబులు· కౌరసేనతనయా! కామేపలీవల్లభా]

ఈ సార్వవిభక్తిక పద్యము పిమ్మటఁ గవి యొక్కయు గ్రంథము యొక్కయు నామములు వచ్చు పద్యమొక్కటి యుండవలెను. కృష్ణోదాహరణమున నది గలదు

ఆంధ్రభాషలో రావిపాటి త్రిపురాంతకకవికృత త్రిపురాంతకోదాహరణము, అప్పకవి వ్రాసిన కృష్ణోదాహరణము, శేషార్యోదాహరణము, వేంకటేశ్వరోదాహరణము (తాళ్ళపాక పెదతిరుమలయ్య) హనుమోదాహరణము, (చిత్రకవి పెద్దన) విశ్వేశ్వరోదాహరణము (ఏనుఁగు లక్ష్మణకవి) ముఖలింగోదాహరణము అను నెనిమిది గలవు

సంస్కృతభాషలోఁ బాల్కుఱికి సోమనాథుని బసవోదాహరణమున్నది. మఱియుఁ గాళిదాసకవి విక్రమోర్వశీయమున "పత్రే నివేశిత ముదాహరణం ప్రియాయాః" అనియు రఘువంశమున "జయోదాహరణం బాహ్వోర్గాపయామాస కిన్నరాన్" అనియును బ్రయోగించియుంటవలనఁ గొన్ని యుదాహరణ గ్రంథములున్నట్లు తెలియుచున్నది మొత్తముమీఁద నిప్పుడాంధ్రముననున్నన్ని యుదాహరణగ్రంథములు సంస్కృతమునఁ గానరావు.

ఈ యుదాహరణములు నాలుగు తెగలుగా నప్పకవి చెప్పుచున్నాఁడు. ఎట్లన,

సీ. సంబుద్ధి మొదలించి సప్తవిభక్తులు పలికిన భక్తి 'సద్దలి' యనంగ
సంబుద్ధితోఁ గూడ సప్తవిభక్తులు బలుక నొప్పారుఁ 'బద్దలి' యనంగ
సంబుద్ధితోడ విషమవిభక్తులతోడఁ బలికినకృతియు 'విద్దలి' యనంగ
గళిక లుత్కళికలు గమకింపఁబలికిన కావ్యంబు 'నుత్ఫుల్లకంబు' ననఁగ

గీ. నవనిఁబాటుప్రబంధంబులందు మిగుల
నాటుకొని యొప్పుచుండు నీ నాల్గుదెగలఁ
గానఁబడు నుదాహరణముల్ గానలోల
కామెపల్లీశ! వల్లపీకామ! కృష్ణ!

* సంబుద్ధిని వదలి యేడు విభక్తులలో నేడు పద్యములు చెప్పినచో నా కావ్యము 'సద్దలి' అనఁబడును. సంబుద్ధియు మిగిలిన యేడు విభక్తులును గలిసి యెనిమిది విభక్తులును నెనిమిది పద్యములలో నిబంధించిన కావ్యము 'పద్దలి' యనఁబడును సంబుద్ధిని మిగిలిన విభక్తులను, గ్రమ మక్కఱలేక పద్యములఁ గూర్చి చెప్పిన 'విద్దలి కావ్యమగును. పద్యములులేని కేవలము కళికోత్కళికలు పై విధమున నెల్లవిభక్తులలోఁ గూర్చినచో ఉత్పల్లకము' అను కావ్యమగును.

కావ్యాలంకారచూడామణిలో సద్దళి పద్దళి విద్దళి, అను భేదములు మాత్రమే కలవు ఎట్లన

కం సంబుద్ధివిడిచి మును గల
సంబంధం బెడలకుండ సప్తవిభక్త్యా
డంబరమడరించిన నొడి
కం బగు 'సద్దలి యనంగఁ గవులకుఁ జెప్పన్

గీ సరివిభక్తుల సంబుద్ధి సహితగాఁగఁ
జెప్ప నొప్పారుఁ 'బద్దళి' సిద్ధమగును ;
ముక్తసంబుద్ధి, విషమవిభక్తి కలిత
యైన కృతిపేరు 'విద్దళి' యంద్రు బుధులు.

ఇట 'విద్దళి' లక్షణము భిన్నముగా నున్నది. పై లక్షణమున "సంబుద్ధి తోఁడ విషమవిభక్తులతోఁడ" అని యున్నది. ఇట "ముక్తసంబుద్ధి విషమ విభక్తికలిత'' అని యున్నది.

ఈ నాలుగుఁ దెగలును నుదాహరణములకు బూర్వరూపము లనియు, గ్రమక్రమముగా నభివృద్ధిచెంది తుదికి నుదాహరణముగాఁ బరిణమించినదనియు 'నిడదవోలు వేంకటరావుగారు' త్రిపురాంతకోదాహరణ పీఠికలో వ్రాసిరి.

ప్రకరణానుసారముగా యక్షగాన వీథీనాటకముల లక్షణమును గూడఁ జెప్పుదుము అప్పకవీయమున యక్షగాన లక్షణ మిట్లున్నది

---

* అప్పకవీయలక్షణముననఁగాని కావ్యాలంకారచూడామణి లక్షణముననఁ గాని సద్దళి మొదలగునవి కేవలపద్యములలో రచింపఁబడవలెనో లేక కళికల వంటి తాళలయాన్వితములగు గద్యములతో రచింపఁబడవలెనో లేక యొక్కొక్క విభక్తి కొక్కొక్క గద్యము చెప్పవలెనో విస్పష్టముగా నవగతము కాకున్నది.

సీ తుద నేడు లఘువులు తొలఁగించి చదివినఁ దిపుటకు వృషభగతిపద యుగము
లిఁ గడపల నొక్క లఘువు మానిన జంపె మను ద్విరదగతి సమపద యుగము
గురు తగు రచ్చేరకుఁ దురగవల్గనా హ్వయమేకతాళి యా మధురగతికి ?
సంప్రమి కీర్వదినాలు గటతాళమున మాత్ర లోలి విశ్రాంతి పద్మాలుగింటఁ

గీ దెలియ నర్థంబు నర్థచంద్రికలు వీట
యక్షగాన ప్రబంధంబు లదుకవచ్చు
రగడ భేదంబు లివి యంద్రు రసఁగపీంద్రు
లలిత నిజసేవకస్తోమ యద్రిధామ

అప్పకవి నవవిధ రగడలను నొడివియున్నాడు. ఆ రగడంలో గొం
కొంత మార్పుజరిపి త్రిపుట జంపె ఏక ఆట, తాళముల కనుకూలముగాఁ జేసి
గేయములను యక్షగానములలోఁ బాడుదురు అప్పకవి పేర్కొన్న యీ
గేయము (రగడభేదములు) లే కాక యక్షగానములలో నింకను ననేకవిధము
లయిన దేశి రచనములు చేరినవి. ఏలలు జోలలు సువ్వాలలు, ఆరతులు ధవళ
ములు, చందమామసుద్దులు, వెన్నెలపదములు విరాళిపదములు, తుమ్మెద పద
ములు గొబ్బిపదములు కోవెల పదములు చిలుకపదములు, అల్లోనేరేళ్లు సీసార్థ
ములు కందార్థములు త్రిభంగులు ద్విపదలు త్రిపదలు, చౌపదులు, షట్పదులు
మంజరులు, జక్కులరేకులు మొదలయినవి

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు సుగ్రీవవిజయ మను యక్షగానమునకు
పీఠికను వ్రాయుచు నందీ యక్షగానాదులు ప్రాచీనులగు లక్షణకర్తలు
దెలిపిన * ఆశు మధుర చిత్ర, విస్తరములను నామముల వర్తిల్లు చతుర్విధ
కవితలలో మధురకవితలోఁ జేరు నని తెలిపిరి. మఱియును వారీ యక్షగాన
ముల యొక్క చరిత్రమును గూడ విరచించిరి గ్రంథవిస్తరభీతిచే వదలితిని,
కావున విద్యార్థులాపీఠికను జదివి దీని విషయమును విపులముగాఁ దెలిసికొన

---

* ఆశుకవిత్వమన ఏకపాద త్రిపాద కరినప్రాస విషమసమస్యా
పూర్తులు వ్యస్తాక్షర, నిషేధాక్షర రచనలు అష్టావధాన శతావధానములు ఘటికా
శత గ్రంథకల్పనలు ఆకాశపురాణము మొదలగు తత్కాలోచిత మగు నతి
త్వరితగతిని రచింపఁబడునది.

మధురకవిత్వ మీ యక్షగానాదులకవిత్వము

చిత్రకవిత్వ మన నొకవృత్తమున మరొకవృత్తము వచ్చునట్లు చెప్పుట ;
అనఁగా కందగర్భసీసము మొ

విస్తర కవిత్వమనఁ బ్రబంధకవిత్వ మని తెలిపితిమి.
(ఇవి లక్షణదీపిక యందలి లక్షణములు)

వచ్చును. ఈ యక్షగానములకు జక్కులపాట యనియును నామాంతరము ఇది సంస్కృతమునందలి యుపరూపకముల తరగతిలోనిది. (ఈ యుపరూపకములకు గేయరూపకములనియు నామాంతరము).

యక్షగానముల వంటివే యగు పెక్కు మధురకావ్యములు గలవు. వానిని నిటఁ జేర్కొందును. ౧ జాజరపాట, ౨ వెన్నెలపాట, ౩. అర్ధచంద్రికలు, ౪ త్రిభంగులు, ౫. మటిమరేకులు ౬ విరాళిపదములు ౭. అల్లోనేరేళ్లు, ౮. గొబ్బిపాటలు, ౯. పాళిరేకులు ౧౦ ధవళములు, ౧౧ ఏలలు, ౧౨ సువాలలు, ౧౩ చిలుకపదాలు ౧౪ తుమ్మెదపదాలు ౧౫ ఏకతాళి (ఎగతాళి), ౧౬ తందానపదాలు, ౧౭. జోలలు ౧౮. జక్కులరేకులు, ౧౯ దరువులు, ౨౦ చందమామపదాలు, ౨౧. నట్టొట్లు, ౨౨ సుద్దులు ౨౩ కూనరాగాలు, ౨౪. చిందులు, ౨౫ జక్కిడి ౨౬ మంగళహారతులు ౨౭ జావళీలు, ౨౮. గీతార్థములు, ౨౯. కందార్థములు ౩౦ సీసార్థములు మొదలయినవి వీని లక్షణలక్ష్యములకు సంగీతచూడామణి మొదలగు గ్రంథములను జూచుకొనవలెను ఈ కావ్యములకుఁ బదకవితలనియు జానుఁదెనుఁగు కావ్యములనియు గేయవాఙ్మయ మనియు వ్యవహారము.

వీథీలక్షణము

వీథ్యామేకో భవేదంకః కశ్చిదేకోఽత్ర కల్ప్యతే
ఆకాశభాషితై రుక్తై శ్చిత్రాం ప్రత్యుక్తి మాశ్రితః
సూచయేద్భూరి శృంగారం కించి దన్యాన్ రసానపి
ముఖనిర్వహణే సంధీ అర్థప్రకృతయోఽఖిలాః (సాహిత్యదర్పణము)

వీధియం దొక్కటే యంకముండును ఒక్కఁడే నాయకుఁడుండును. వాఁడుత్తమ, మధ్యమాధములలో నెవ్వఁడైనను గావచ్చును (కశ్చిత్ ఉత్తమ మధ్యమాధమాన్యతమ; అని సాహిత్యదర్పణ రుచిరవాఖ్య) ఆకాశభాషితములకుఁ బ్రతిభాషణమును నాతఁడు సేయును అనఁగా నాయకుఁడొక్కఁడే కావునఁ దానే మింటివైపు జూచి "నీవేమనచున్నావు. ఓహో! ఇట్లనుచున్నావా? ... అని యెదుటిపాత్ర చెప్పవలసినదంతయుఁ దానే చెప్పి దానికిఁ బ్రత్యుత్తరించుచుండును. (ఒకానొకచో నిరువురు పాత్రలుగూడ నుండవచ్చును.) ముఖ్యముగా శృంగారమును నలఁతిగా నన్యరసములను సూచింపవలెను. ముఖనిర్వహణ సంధులును అర్థప్రకృతు లెల్లయును నుండవలెను (ముఖనిర్వహణ సంధులఁ గూర్చియు నర్థప్రకృతులఁ గూర్చియు నిట దెలుపుట కవకాశము లేమి దశరూపకము వలనఁ దెలిసికొనవలెనని సూచింతుము) 'వీథీవవీథీ' అనఁగా వీధి వంటిది ఈ కావ్యము శృంగారరసమునకు వీధివంటిది. ఉత్తమశృంగారము

వాకిలిదాఁటదు అది యేకాంతమునందే కోరిల్లును వీథీశృంగారము, పచ్చి శృంగారము ఇది పరదారసురాపానాది సుఖలలితమగు కామశృంగారము, కానీ దీనియందుఁ గొన్నిబాణములందున్నంత పచ్చిశృంగారముండదు మధ్యమ శృంగారమే యుండును. దీనియం దుత్తమ నాయకుఁడు గూడ నుండవచ్చునని రుచిరవ్యాఖ్యాత చెప్పియున్నాడు కానీ లక్ష్యమున నుత్తమనాయకుఁడు గాన రాఁడు. మధ్యమ-అధమ, నాయకులే కానవత్తురు ఆంధ్రమునందున్న శ్రీనాథుని వీధినాటకమున కీలక్షణముపట్టదు ఈ వీధినే వీథినాటకమనియు వ్యవహరింతురు.

చక్రవాళము

క౦. ముక్తపదగ్రస్తంబై
సక్తాదిమపద్యమై, ససంబోధనమై
ప్రోక్తమగు జక్రవాకము
ముక్తమహోధీరకబ్ది మోహనమగుచున్. ౧౪౧

తా. మొదట నొకపద్యము గలిగినదియు ముక్తపదగ్రస్తమును సంబోధనసహితమును నగు కావ్యము చక్రవాళము ఇదియు స్తోత్రప్రాయ మగు కావ్యమే మొదట నొకపద్యమనుటచే మిగిలిన కావ్యము గద్యమయము. ఆ గద్యములు కళికలే కళికల నుదాహరణకావ్యమునఁ దెలిపియుంటిమిగదా ! అప్పకవీయమున నీ చక్రవాళ లక్షణమిట్లున్నది

కం ఒకపద్యముఁ బిదప దశా
ష్టక సందర్భాష్టగద్యచతురం బగు ఫ
క్కి-కిఁ బేరు చక్రవాళం
బకట ! చతుర్భద్రమదియె ! యచ్యుత ! మఱియున్

కం తొలి సమసనాంత్యవర్ణయు
గళమే పునరుక్తి గాఁగఁగ్రై కొని సామీ
ప్యలసత్సమాసము మొదల
నలరించినఁ జక్రవాళమగు దాశార్హా !

ఈ పద్యములందు సంబోధనాంతముగా నుండవలయు' నన్న లక్షణము లేదు కాన నరసభూపాలీయాప్పకవీయ లక్షణముల కేకవాక్యతను గల్పించు కొనవలెను ఎట్లన మొదలనొక సంబోధనాంతపద్యము ; పిమ్మట నెనిమిది దళముల గద్య (ఇదియే కలిక). ఇదియు సంబోధనాంతముగానే యుండ వలెను. ఆ పద్యగద్యములు రెండును ముక్తపదగ్రస్తములై సంబోధనాంత ములుగా నుండవలెను ముక్తపదగ్రస్తమనఁ దొలిసమాసముయొక్క

యంతమునం దున్న రెండక్షరములను మాత్రమే గ్రహించి మలి సమాసారంత మున నుంచుట ఎట్లన,

మ. ఫణికుంభద్భుజసార సారసముఖీ పంచాయుధాకార ! కా
రణ సంతత్యవతార ! తారగిరి ధైర్య స్థేమ దుర్వార ! వా
రణ స్వామ్యద్బలభార ! భారవికవి ప్రౌఢోక్తి సంచార ! చా
రణ సంస్తుత్యవిహార ! హారహర విభ్రాజద్యశోవైభవా !

ఇట్టి యొక పద్యముకు దానివెంట నెనిమిది యిట్టి గద్యములును గల కావ్యము చక్రవాళము. దీనికిఁ జతుర్భద్ర మనియు నామాంతరము.

బిరుదావళి

కం. ఆ చక్రవాళలక్షణ
సూచితమై బిరుదభరిత శుభవాఙ్మయమై
ఆ చక్రవాళ విపుల
శ్మాచక్రమునందు బిరుదగద్యము పొల్చున్. ౧౭౧

ప్రతాపరుద్రీయ లక్షణమున "ఆ చక్రవాళలక్షణ సూచితమై" అనునది లేదు ఆ లక్షణ మిట్లున్నది —

వర్ణ్యమానాంకబిరుదవర్ణనప్రచురోజ్జ్వలా
వాక్యాడంబరసంయుక్తా సా మతా బిరుదావళీ

తా వర్ణింపఁబడుచున్న రాజాదుల బిరుదములను గూర్చి వాక్యాడంబర ముతో వ్రాయఁబడినకావ్యము బిరుదావళి నరసభూపాలీయమున బిరుదగద్యము' అని యున్నది. కాన గద్యమయమని తెలియుచున్నది ప్రతాపరుద్రీయలక్షణ మును బట్టి గద్యమయమో పద్యమయమో తెలియరాకున్నది సాహిత్యదర్పణ మున "గద్య పద్యమయీ రాజస్తుతి ర్బిరుదముచ్యతే" అని యుంటచే గద్య పద్యోభయమని తేలుచున్నది మఱియు విశ్వనాథుఁడు 'బిరుదమణిమాలా' అను కావ్యమును లక్ష్యమునుగా నిచ్చెను అప్పకవీయమున నీ క్రింది లక్షణముగలదు

గీ. క్షితి మహారాష్ట్రి భాషచేఁ జెప్పఁబడెడు
టీకరోక్తులు బిరుదులై పెక్కుఁదనరు
వాని బిరుదావళి యొనర్పవలయు నంద్రు
బుధులు సంబుద్ధిపదములు పొసఁగఁ గూర్చి.

త్రింశత్తన ముప్పది పంచాశత్తన నేఁబదియనియే యర్థము. కాన 'అప్పకవి' యిచ్చిన యీ పదము లసాధువులు త్రింశికా, పంచాశికా అనియే యుండవలెను

మఱియు నాతఁడు కొన్నిఁటి నింకను జెప్పలేదు అష్టకము (ఎనిమిదింటి సముదాయము), పంచదశీ (పదునైదింటి సముదాయము) చత్వారింశికా (నలువదింటి సముదాయము) షష్టికా (అరువదింటి సముదాయము) సప్తతికా (డెబ్బదింటి సముదాయము) అశీతికా (ఎనుబదింటి సముదాయము), నవతికా (తొంబదింటి సముదాయము) పంచశతీ (ఐదునూర్ల సముదాయము) సహస్రకము (వేయింటి సమూహము)

శుకసప్తతి' ఇత్యాదులలో 'సప్తతి' అనియే వ్యవహారముగలదు. అట్లే 'పాదుకాసహస్రము' ఇత్యాదులలో సహస్రము అనియే ప్రయోగముగలదు

కావ్యము శాస్త్రము ఇతిహాసము కావ్యశాస్త్రము, కావ్యేతిహాసము శాస్త్రేతిహాసము అని యాఱువిధములగు కావ్యములున్నవని భోజుఁడు సరస్వతీ కంఠాభరణమున వచించెను కావ్యశాస్త్రమును శాస్త్రకావ్యమనియుఁ జెప్పవచ్చును ధ్వన్యాలోకమున "మహాభారతేఽపి శాస్త్రకావ్యరూపచ్ఛాయాన్వయిని" అని యున్నది శాస్త్రకావ్యమనఁగా శాస్త్రమునందువలెఁ బురుషార్థనిరూపణమును గావ్యము నందువలె రస నిరూపణమును గల కావ్యము హేమేంద్రుఁడు శాస్త్రకావ్యమనఁ జతుర్వర్గప్రాయమై సర్వోపదేశకమనియుఁ గావ్యశాస్త్రమన భట్టికావ్యాదులనియుఁ దెలిపెను ధ్వన్యాలోకలక్షణమే యుచితము భోజుఁడీ భేదమును దెలుపలేదు. అట్లే శాస్త్రేతిహాసము కావ్యేతిహాసము అనుచోఁ దదుభయ ధర్మములుగల కావ్యములని యర్థము.

ఖండ కావ్యము

'ఖండకావ్యం భవేత్కావ్యస్యైకదేశానుసారిచ' అని సాహిత్య దర్పణము మహాకావ్యలక్షణములలో నేకదేశమును గ్రహించి వ్రాసిన కావ్యము ; మేఘదూతాదులు మహాకావ్య ఖండకావ్యములకు సంఘాతము లేక సంఘాతకము అనియు నామాంతరము

కరంభకము

'కరంభకంతు భాషాభిర్వివిధాభిర్వినిర్మితం'

ఒకే కావ్యమును పెక్కుభాషలతో నిర్మించినది కరంభకము. అనఁగా ప్రతి పద్యమునందును బెక్కుభాషలుండవలెను ఇట్టిది విశ్వనాథపంచాసన కృతమగు ప్రశస్తి రత్నావళి (షోడశభాషామయము)

ము క్తకము

క్రియాసమా ప్తికై పద్యాంతరముతో నెట్టి సంబంధమును లేక రస భావాదులు గల యేకపద్యము (ముక్తం అన్యేన నాలింగితం; స్వార్థే కన్) అమరుకము ఆర్యాస ప్తశతి మొదలగునవి

ఈ ముక్తకములందు అ కారాది హ' కారాంత వర్ణము లాద్యక్షరము లుగాఁగల పద్యసంగ్రహమునకు 'వ్రజ్య' అని నామము ఆర్యాస ప్తశతిలో నీ వ్రజ్యలు గలవు.

యుగ్మకము

క్రియా సమా ప్తికై పరస్పర సంబంధముగల పద్యముల జంట. అప్పకవి రెండు పద్యముల మొత్తమునకు 'ద్వికమని పేరుపెట్టెను అటఁ క్రియాసమా ప్తికై పరస్పరాపేక్షతోఁబనిలేదు ఇటఁ గావలయును ఈ భేదమును బట్టి నామభేదము.

౧ సందానితకము

క్రియాసమా ప్తికై పరస్పరాపేక్ష గల మూఁడుపద్యముల సమూహము వెనుక మూఁడుపద్యముల మొత్తమునకు అప్పకవి త్రికమని చెప్పెను అటఁ బరస్పరాపేక్ష లేదు ఇట నుండవలెను కాన నామభేదము.

కలాపకము

క్రియాసమా ప్తికై పరస్పరాపేక్షగల నాలుగుపద్యముల మొత్తము

కులకము

క్రియాసమా ప్తికై పరస్పరాపేక్షగల యైదుపద్యముల మొత్తము

చాటుపద్యము లేక శ్లోకము

స్తోత్రప్రాయమగు పద్యము లేక శ్లోకము ఈ 'చాటుపద్యము' అను పదమును నీ కాలమున 'అనిబద్ధకావ్యము' అనునర్థమున వ్యవహరించుచున్నారు ఆంగ్లమున Stray verse అను నర్థమున వ్యవహరించుచున్నారు

చాటుః = pleasing or agreable words sweet or coax-ing words, flattary (espicially of a lover to his sweet heart. (ప్రియః ప్రియాయాః ప్రకరోతి చాటుం) Apte's disctionary.

---

౧. అభినవగుప్తుఁడు లోచనమున మూఁడు పద్యముల సమూహమునకు విశేషక మనియు రెండు పద్యముల మొత్తమునకు సందానితక మనియు వ్యవహరించెను.

కోశము

"కోశః శ్లోకసమూహస్తు స్యాదన్యోన్యానపేక్షకః"
అన్యోన్యాపేక్షలేని శ్లోకసమూహము కోశమనఁబడును

వాకోవాక్యము

ఉక్తిప్రత్యుక్తిమద్వాక్యం వాకోవాక్యం విదుర్బుధాః
ద్వయోర్వక్త్రోస్తదిచ్ఛంతి బహూనామపి సంగమే ॥

"వాక్యంచ ఉపవాక్యంచ వాకోవాక్యం" వాక్యోపవాక్యములెందుండునో యది వాకోవాక్యము. అది యుక్తిప్రత్యుక్తిరూపము. ఈ యుక్తిప్రత్యుక్తి యిరువురకును గూర్పవచ్చును పెక్కండ్రకును గూర్పవచ్చును ఇది ఋజూక్తి, వక్రోక్తి, వైయాత్యోక్తి, ప్రశ్నోత్తరోక్తి చిత్రోక్తి అని పంచవిధములుగా సరస్వతీకంఠాభరణమునఁ గలదు

మ చనుదున్ సుందరి ! పొందుఁడా ! చనుము, నీ స్వాంతంబునన్ శోకముం
గనఁగాఁబోకుము శోకమెందులకు ? కిఁకం గన్నీరు రా త్రేల వే
చనవైతంచునె ! తొందరేల ననుఁబుచ్చన్ నీకు ? నీతోడఁ బో
వనె వాంఛించుచు నిట్లు వేగపడు నా ప్రాణంబు లత్యంతముల్

ఇది ప్రియునియొక్కయుఁ బ్రియురాలియొక్కయు నుక్తిప్రత్యుక్తిరూపమగు వాకోవాక్యము మిగిలినవి యూహ్యములు

ఈ ముక్తకాదులకు అనిబద్ధకావ్యము' లనియు నామాంతరము వామనుఁడు కావ్యమును నిబద్ధము అనిబద్ధము అని రెండుతెగలుగా విభజించెను. మహాకావ్య ఖండకావ్యములు నిబద్ధములు ముక్తక, యుగ్మక సందానితక, కలాపక కులకములును అష్టకవిప్రభృతులు నుడివిన భేదములును 'అనిబద్ధకావ్యములు.' మహాకావ్యముదక్క మిగిలిన వన్నియు క్షుద్రప్రబంధము లని విశ్వనాథుఁడు వ్యవహరించెను వీనికి 'ఉపకావ్యము' లనియు నామాంతరము 'ఉపమితం కావ్యేన ఉపకావ్యం అను వ్యుత్పత్తినిఁ బట్టి కావ్యసదృశము అని యర్థము

ఆఖ్యానము

"స్వయందృష్టార్థకథనం ప్రాహు రాఖ్యానకం బుధాః" కవి తాను స్వయముగాఁ జూచినదానినిఁ జెప్పుట యాఖ్యానము.

ఉపాఖ్యానము

"శ్రుతస్యార్థస్య కథన ముపాఖ్యానం ప్రచక్షతే" ఇతరులవలన విన్నదానినిఁ జెప్పుట యుపాఖ్యానము.

గాథ

'పితృపృథ్వీప్రభృతి గీతయః' తల్లిదండ్రులు లేక పితృదేవతలు, భూమి మొదలగువానినిఁ గూర్చి చేయు స్తోత్రము, మఱియు దాతలయు వీర పురుషులయు కృత్యములఁ దెల్పు గీతము దీనికి నారాశంసి యనియు నామాంతరము.

ఈ మూఁడింటి లక్షణములను విష్ణుపురాణటీకాకారుఁడైన శ్రీధరస్వామి యిచ్చెనని కె వి లక్ష్మణరావుగారు 'ఆంధ్రవిజ్ఞాన సర్వస్వమున వ్రాసిరి.

దండకము

త, న స. హ, గణములలో నొకటి మొదల నిడి, తక్కినవన్నియుఁ దగణములే కూర్చి, తుదినొక గురువు నిడవలెను. యతిప్రాస నియమము లేదు ఇది గద్యకావ్యమా ? పద్యకావ్యమా ? యని సందేహము గలిగించును. కాని గద్యము గణబద్ధముగా నుండదుగదా కానఁ బద్యకావ్యమే సామాన్యముగా దండకములు స్తోత్రరూపములే. అనఁగా భక్తిరసకావ్యములే. ఆంజనేయ దండకము మొదలగునవి కాని పోతనకవి వ్రాసిన శృంగార ప్రధానమగు భోగినీ దండకము గూడఁ గలదు.

మణిప్రవాళము

సంస్కృతాంధ్రములను మేళవించిన పద్యము మణిప్రవాళము. అస లిది మళయాళమునఁ గలదు ఆంధ్రమునను గొందఱు వ్రాసిరి

తండులాని గృహమందు నసంతి
తిండికై తె పదిమంది వసంతి
... ...

ఉ. ఆర్తుల నీవనేర్తు వరయంగఁ ద్రిమూర్తి విలాసవర్తి పెం
గర్తవు భర్తవుందలఁపగాఁ బరిహర్తవు నీవ నీవ చి
న్మూర్తివి ; నీవ పోషణచణుండవు కర్తుమకర్తు మన్యథా
కర్తు ముదారశక్తియు జగంబుల నీవకదా గదాధరా

(రామాభ్యుదయము)

మ. జయ శీతాంశుకులావతంస నిషధస్వామీ

ఇతిహాసము — పురాణము

విద్యారణ్యులవా రైతరేయ బ్రాహ్మణభాష్యోపోద్ఘాతమున నిట్లు వ్రాసియున్నారని కే వి లక్ష్మణరావుగారు ఆంధ్రవిజ్ఞాన సర్వస్వమున నిట్లువ్రాసిరి. "దేవాసురాస్సంయత్తా ఆసన్" ఇత్యాదయ ఇతిహాసాః.

"ఇదం వా అగ్రే నైవకించి దాసీత్" ఇత్యాదికం జగతః ప్రాగవస్థా ముపక్రమ్య సర్గప్రతిపాదకం వాక్యజాతం పురాణం"

అనఁగాఁ బూర్వరాజాదుల కథలను దెలుపునది ఇతిహాసము 'ఇతి-హ-(అనియఁట) అస్మిన్ అస్తీతి ఇతిహాసః అని వ్యుత్పత్తి. ఉదా భారత రామాయణాదులు

సర్గము (ప్రపంచోత్పత్తి) ప్రతిసర్గము (బ్రహ్మాదులు సేసెడు సృష్టి), వంశము (దేవాసురాది విభేదోత్పత్తి) మన్వంతరము (వేలు వేలు మనువుల తరములు) వంశానుచరితము (సూర్యచంద్రవంశముల చరిత్రము అను అయిదు లక్షణములు గలది) పురాణము 'పురాఽపి న నవంపురాణం' అని వ్యుత్పత్తి. పురాణములలో మొదట నీ యేదులక్షణములే కనఁబడినను దరువాతికాలమున వీనిని మించిన వర్ణనములు సేరినవి పోఁగాఁబోఁగా నితిహాసములవలెనే పురాణములును బెక్కు కథలకు నిలయములయ్యెను కావున ఇతిహాసముల వ్యాప్తి చిన్నది. పురాణముల వ్యాప్తి పెద్దదిగాఁ బరిణమించినది ఇప్పు డీ యల్పభేదమును బాటింపక, పురాణపదమునే రెంటికిని వ్యవహరించుచున్నారు.

ఇతిహాసపదమునకు మరొక నిర్వచనము గలదు కౌటిల్య ఆహ పురాణం ఇతివృత్తం ఆఖ్యాయికా ఉదాహరణం, ధర్మశాస్త్రం అర్థశాస్త్రం చేతి ఇతిహాసః అనఁగా నితిహాసమున నివన్నియుఁ గలవని భావము - మరొక లక్షణముగలదు.

శ్లో. అర్థాది బహుధాఖ్యానం దేవర్షిచరితాత్మకం
ఇతిహాసమితిప్రోక్తం భవిష్యద్భూతధర్మయుక్.

పాశ్చాత్యులు ప్రతిపాద్యవస్తువును బట్టి కావ్యము నీ క్రిందివిధమున విభజించిరి.

౧ పురాణకావ్యము (Epic) ౨ ఖండకావ్యము (Lyric), ౩ అధిక్షేప కావ్యము (Satire) ౪ మృతవిషయక కావ్యము (Elegy) ౫. హితోపదేశ కావ్యము (Diadactic Poetry) ౬ పేంపాటలు (Ballads) ౭ గ్రామీణ జీవనకావ్యము (Pastoral Poetry), ౮. వర్ణనాత్మకకావ్యము (Descriptive Poetry), ౯ కథాత్మకకావ్యము (Narrative Poetry)

గద్యకావ్యములు

ప్రతాపరుద్రీయమున గద్య కావ్య ప్రశంస చేయలేదు. కావున నరస భూపాలీయ కర్తయుఁ దెలుపలేదు. గద్యరచన విశేషించి సాఁగుచున్న యీ దినములలో వానినిఁగూర్చి కూడ మనము దెలిసికొనవలెనుగదా! కావున నలఁతిగాఁ దత్ప్రశంస చేయుదుము.

'గద్యం కవీనాం నికషం వదంతి' గద్యము కవులకు సానరాయి అనఁగా బరీక్షాస్థానము ఏలనఁ, బద్యకావ్యమునఁ గవియొక్క ప్రతిభతోపాటు వృత్తముగూడ రసమునకు సహాయపడును. గద్యమున వృత్తము లేమిఁ గవి కేవలప్రతిభాబలముచేతనే రసవంతముగాఁ బద్యకావ్యముతో సమానముగాఁ జేయవలసియున్నది. కాన దీనినిఁ బరీక్షాస్థాన మని చెప్పిరి. కావున గద్యము వ్రాయుట సులభమని తలంపరాదు.

* సంస్కృతమున గద్యకావ్యములు నాలుగు విధములు ౧. ముక్తకము, ౨. వృత్తగంధి, ౩. ఉత్కలికా ప్రాయము ౪. చూర్ణకము లేక చూర్ణము.

౧. ముక్తకము

సమాసరహితమయిన గద్యము. "గురుర్వచసి పృథు రురసి" మొ.

౨. వృత్తగంధి

వృత్తభాగము గలది. "సమరకండూలనిబిడభుజదండకుండలీకృత కోదండశింజినీటంకారోజ్జాగరిత వైరినగర" ఇత్యాదికమగు వాక్యమున "కుండలీకృతకోదండ" అను పదసమూహ మనుష్టుబ్వృత్తముయొక్క పాదము.

౩. ఉత్కలికా ప్రాయము

దీర్ఘ సమాసబహుళము, వృత్తగంధికిని దీనికిని భేదమేమన, రెండును దీర్ఘసమాసబహుళములే యైనను వృత్తగంధిలో వృత్తభాగము కానవచ్చును ఇట నది గానరాదు.

౪. చూర్ణకము

అల్పసమాసములు గలది.

---

* ఆంధ్రభాషలోని గద్యములను గుఱించి ముఖ్యముగాఁ దెలిసికొనవలసియున్నది. అది చాల విస్తరముగా నుంటచే గ్రంథవిస్తరభీతిచే వదలితిని. ఈ విషయమును సమగ్రముగాఁ దెలిసికొనఁగోరువారు శ్రీ గొబ్బూరి వేంకటానందరాఘవరావు బి ఏ బి యల్ గారి (యలమంచిలి) ఆంధ్రగద్యవాఙ్మయ చరిత్రను జదువుకొనవలయును.

మఱియు నితివృత్తమునుబట్టి కథా ఆఖ్యాయికా ఖండకథా, పరికథా, కథాలికా అను నైదు గద్య ప్రబంధభేదములు గలవని కావ్యాదర్శ వ్యాఖ్యాత జీవానందవిద్యాసాగర భట్టాచార్యులు దెలిపిరి కాని వీని లక్షణములను దెలుపలేదు ఈ 'కథాలికా' పదమును గొందఱు 'కథానికా' అని వ్యవహరించుచున్నారు. పృషోదరాది పాఠముచే 'లి' వర్ణము 'ని' వర్ణము గావచ్చును దీనిని (Short story) చిన్నకథ అను నర్థమున నేఁటివారు వాడుచున్నారు ఆనందవర్ధనుఁడు ధ్వన్యాలోకమున కథాలికా కథానికా పదములు రెంటిని వాడలేదు. దీని స్థానమున 'ఖణ్డకథ' 'పర్యాయబంధము' అని వ్యవహరించెను. అతని విభాగములును వాని లక్షణములును నివి:—

ఆఖ్యాయికా

ఉచ్ఛ్వాసాది విభాగములు గలిగి నడుమనడుమ నితరుల పద్యములు గల గద్య ప్రబంధము

కథా

అవాంతర విభాగములు లేకయుఁ బద్యములు లేకయు నున్న గద్య ప్రబంధము.

దండి-కథా ఆఖ్యాయికలకు భేదములేదని "తత్కథాఽఽఖ్యాయికే త్యేషా ఏకా సంజ్ఞాద్వయాంకితా" అని చెప్పెను కాని, యానందవర్ధనుఁడు పైవిధమున భేదమును దెలిపెను. మఱియు శివతత్త్వ రత్నాకరము' న

'కథా కల్పితవృత్తాంతా సత్యార్థాఽఽఖ్యాయికా మతా'

కల్పితవృత్తాంతము గలది కథ యనియు సత్యవృత్తాంతము గలది యాఖ్యాయిక యనియును దెలుపఁబడెను.

మఱియు "వృత్తమాఖ్యాయతే యస్యాం నాయకేన స్వచేష్టితం" నాయకుఁడే స్వయముగా నెందుఁ దన వృత్తాంతమును దెలుపునో యది 'యాఖ్యాయిక' అని మఱొక లక్షణముగూడఁ గన్పట్టుచున్నది దీనినిఁ బట్టి ఆఖ్యాయిక' యన 'ఆత్మకథ' (Auto-Biography) యని సారాంశము. సత్యార్థా ఆఖ్యాయికా అన్నలక్షణము ఇక్కడ సరిపడును.

ఈ విధముగాఁ కథా ఆఖ్యాయికలకు లక్షణభేద విషయమున నభిప్రాయ భేదము గానవచ్చుచున్నది. శివతత్త్వరత్నాకరలక్షణము యుక్తముగా నున్నది.

ఖండకథా

ఏకదేశవర్ణనముగల గద్యప్రబంధము.

పరికథా

ధర్మార్థకామాదులలో నొక్కదాని నవలంబించి విచిత్రప్రకారములతో ననంతముగా వర్ణింపఁబడిన గద్య ప్రబంధము

పర్యాయబంధము

కేవలము వసంతాదులను గానీ మహారాజాదులను గానీ, వారి విజయయాత్రాదులను గానీ వర్ణించు ప్రబంధము

సకలకథా

చతుర్విధ పురుషార్థముల యొక్కయు ఫలములంతమందుఁ గల యితి వృత్తవర్ణనము గల ప్రబంధము

ఉపకథ

పెద్దకథలోని కథ

ఈ తొల్లివిధములగు గద్య ప్రబంధములందును గూడఁ గవి ధ్వనికారుడు దెలిపిన ప్రబంధ రసవ్యంజకతకుఁ గావలసిన శిల్పదృష్టిని వహించి రచింపవల యును పద్యమయ కావ్యమువలెనే గద్యమయ కావ్యము గూడ రసవత్తరముగా నుండవలెను కానఁ బద్యప్రబంధము రసవత్తరముగా నుంటకు వలసిన విధాన మంతయు గద్యప్రబంధమునఁ గూడ నవలంబింపవలెను

వాఙ్మయమునఁ గావ్యస్థభాగ ప్రవిభాగములకుఁ బెక్కునామములు గాన వచ్చుచున్నవి. ౧ సర్గము ౨ ఆశ్వాసము, ౩ ఉచ్ఛ్వాసము, ౪ ఉల్లాసము, ౫. కాండము, ౬ స్కంధము, ౭ పర్వము, ౮ స్తబకము, ౯. అధ్యాయము, ౧౦. అధికరణము ౧౧ ప్రకరణము, ౧౨ లంబకము, ౧౩. దశము, ౧౪ ఉద్ద్యోతము ౧౫ ఉన్మేషము ౧౬. పరిచ్ఛేదము, ౧౭. ఖండము, ౧౮ ఆహ్నికము మొదలగునవి. వీనికి వివరణ మిది :

సర్గము

సర్గమన సృష్టి బ్రహ్మ లోకమును సృష్టించినవిధమునఁ గవి గావ్య మును సృష్టించునుగదా! బ్రహ్మ లోకమునకు వలసిన వివిధములగు సృష్టులమూల మున నానందమును గలిగించువిధమునఁ గవియు రసికులకువలసిన రససంబద్ధము లగు నానావిషయములయొక్క సృష్టులమూలమున నానందము గలిగించును. కాన రససంబద్ధవిషయసృష్టి సర్గము. అది యే భాగమున నుండునో యా భాగమున కౌపచారికముగా సర్గమని వ్యవహారము.

ఆశ్వాసము

"కథాంశానాం వ్యవచ్ఛేద ఆశ్వాస ఇతికథ్యతే" (కథాంశముల యొక్క విభాగ మాశ్వాస మనఁబడును.) మఱియు నాశ్వాసమన నూపిరి పుచ్చుకొనుట. ఉపచారముచేత "నొకతూరి సునాయాసముగా జదువఁదగిన భాగము" లనియు నర్థమును జెప్పుకొనవచ్చును

ఉచ్ఛ్వాసము

పై వివరణమే

ఉల్లాసము

"యస్మిన్ మన ఉల్లసతి స ఉల్లాసః" విషయసౌలభ్యముచే దేనియందు మనస్సుల్లాసమొందునో యా భాగముల్లాసము

కాండము

పెక్కు మొత్తముల యొక్క మొత్తము 'కాండం సమూహః ఖండానాం' అను వచనముగలదు పెక్కుసర్గల మొత్తము కాండముగా వ్యవహరింపబడు చున్నది రామాయణవిభాగములగు కాండములు పెక్కుసర్గల మొత్తములు గదా సర్గమునఁ బెక్కుశ్లోకములుండును

స్కంధము

'స్కంధ ఇవ స్కంధః' స్కంధము (చెట్టుమొదలు) వంటిది స్కంధము. నానాశాఖోపశాఖలతో వర్ధిల్లు జగద్వృక్షమునకు స్కంధము భగవంతుడే కావున భగవన్మాహాత్మ్య వర్ణనైకపరతంత్రమగు భాగము స్కంధము కావుననే భాగవత భాగములకు స్కంధములను పేరు తగియున్నది.

"స్కంధమనఁ బెద్దశాఖ వృక్షప్రకాండము గొంతసాగిన పిమ్మట దానికి నలుదిక్కులందును నాలుగు పెద్దశాఖలు వెడలును. భాగవతగ్రంథమను నది వృక్షప్రకాండము ఈ ప్రకాండమునుండి పండ్రెండుస్కంధములు వెలువడినవి" అనియు జెప్పుదురు

పర్వము

' చెఱకు మొదలగువాని కనుపు ' అని యర్థము మహాభారతమిక్షుఖండము వంటిదని లోకప్రసిద్ధి ఏలన నెచ్చటఁ దిన్నను జెఱకు దియ్యగానుండు నట్లెచ్చటఁ జదివినను భారతము రుచ్యముగానుండును కావున దాని భాగములకు పర్వములను నామముచితమే

స్తబకము

"స్తబక ఇవ స్తబకః" పూలగుత్తివంటిది దీనిచేఁ గావ్యము పుష్ప వృక్షముగా నారోపిత మగుచున్నవి

అధ్యాయము

సామాన్యముగా నిది శాస్త్రభాగములకు మాత్రమే వ్యవహరింతురు. ఏ భాగమువలన నధికమగు నాయము (ఆయము - లాభము ; అనఁగా జ్ఞాన లాభము - శాస్త్రజ్ఞానలాభము) కలుగునో యది యధ్యాయము 'అధీయతేఽస్మి న్నిత్యధ్యాయః' (దీనియం దధికముగా జ్ఞానమును బొందుదురు కాన నధ్యా యము) అని వ్యుత్పత్త్యర్థము. ఈ పదమును శాస్త్రగ్రంథభాగములకేకాక కావ్య భాగములకు వాడినచో నౌపచారికమని గ్రహింపవలెను.

అధికరణము

ఇదియు శాస్త్రవిభాగములకే వ్యవహరింపఁబడును విషయము సందే హము పూర్వపక్షము ఉత్తరపక్షము లేక సిద్ధాంతము, నిర్ణయము, అను నైదు విషయములు గల ఘట్టము. పూర్వమీమాంసాది శాస్త్రములం దీ యధికరణములు గలవు

ప్రకరణము

"ప్రకృష్టం కరణం సాధనం ప్రకరణం" అనఁగా నుద్దేశించిన విషయ సిద్ధికిఁ బ్రకృష్టమగు సాధనము

లంబకము

ఇది యపపాఠము. 'లంభకము' అని శుద్ధపాఠము లంభకమన భాగము ఏ భాగము ఆనందమునొందించునో యది లంభకము కథాసరిత్సాగరమున నీ లంభకములు గలవు

దళము

'దళ మివ దళం' దళమువంటిది కావున దళము కావ్యభాగము దళముగా నారోపింపఁ బడుటవలనఁ గావ్యము శాఖారూపముగా నారోపింపఁబడుచున్నది

ఉద్ద్యోతము

పెద్ద వెలుఁగని యర్థము. గహనమైన శాస్త్రీయవిషయములను దెలుపు భాగమున కుద్ద్యోత మని పేరు వెలుఁగుచేఁ జీఁకటి తొలఁగువిధముననే భాగముచే

దెలియమి దొలఁగునో యనఁగాఁ దెలియని విషయము సుగమ మగునో యది యుద్ద్యోతము

ఉన్మేషము

వెలుఁగు వికాసము నేత్రాద్యుల్మేషము దేనివలనఁ బదువరి కిట్టివి గలుగునో యదే యున్మేషము.

పరిచ్ఛేదము

' పరిచ్ఛిద్యతే అనేన ఇతి పరిచ్ఛేదః దీనిచేఁ (భాగముచే) గొంత విషయము విభక్తమగును కానఁ బరిచ్ఛేదము ఇదియు శాస్త్రవిభాగములకే నామము

ఖండము

'ఖండమివ ఖండం' ఖండమువంటిది. కాన ఖండము

ఆహ్నికము

'అహ్నా నిర్వృత్తం ఆహ్నికం' ఒక దినములో నిర్వర్తింపఁబడినది లేక రచింపఁబడినది లేక చదువఁదగినది ఇది వ్యాకరణమహాభాష్యముయొక్క పాదముల (అష్టాధ్యాయి) భాగమునకు నామము

ఇవిగాక మఱికొన్ని పారిభాషికపదముల కిట వివరణము వ్రాయుదుము.

సూత్రము

శ్లో. అల్పాక్షర మసందిగ్ధం సారవ ద్విశ్వతోముఖం
అస్తోభ మనవద్యంచ సూత్రం సూత్రవిదో విదుః.

కొలఁది యక్షరములు గలిగియుండవలెను. అర్థమసందిగ్ధముగా బోధింపవలెను. సారముగలదై యనఁగా బుద్ధిబలముకొలఁది తెలియఁదగిన యర్థ గాంభీర్యము గలిగియుండవలెను ఎల్ల లక్ష్యములందును సమన్వయించునదిగా నుండవలెను. చూచుటకుఁ జిన్నదిగా నున్నను భావమునుబట్టి గొప్పదిగా నుండవలెను, నిర్దుష్టముగా నుండవలెను. అట్టిదానిని సూత్రమని సూత్రవేత్తలు చెప్పుదురు దారమెట్లు చుట్టఁగాఁ జుట్టఁబడి యున్నపుడల్పముగాఁ గానఁబడి విప్పఁబడినపుడు దీర్ఘముగా గానఁబడి పెక్కింటిని బంధించుటకవకాశము గల్పించునో యట్లే సూత్రము గూడఁ బనిసేయును. 'సూత్ర మివ సూత్రం' అని వ్యుత్పత్తి.

వృత్తి

'సూత్రమాత్రస్య యా వ్యాఖ్యా వృత్తి రిత్యభిధీయతే' సూత్రమాత్రమునకు ననఁగా మిక్కిలి లోఁతునకుఁ బోరకచేసిన వ్యాఖ్య వృత్తి యనఁబడును.

పద్ధతి

సూత్రవృత్తిని లెస్సగా వివేచనము సేయునది పద్ధతి.

భాష్యము

పూర్వపక్షోత్తరపక్షములతో విషయమును జల్లెడ పట్టినట్లు గావించుచు భాషించునది భాష్యము ఇది స్వతంత్ర విమర్శగా నుండును.

శ్లో సూత్రార్థో వర్ణ్యతే యత్ర వాక్యై స్సూత్రానుసారిభిః
స్వపదాని చ వర్ణ్యంతే భాష్యం భాష్యవిదో విదుః

సూత్రానుసారులగు వాక్యములచే సూత్రార్థమును వర్ణించుచు నడుమ నడుమ గ్రంథకర్త తన స్వకీయపదములనుగూడ జతపఱచుచు వ్రాయువ్యాఖ్య భాష్యము.

అనుక్రమణిక

వేదాదులందున్న మండల అష్టక కాండ అధ్యాయ ప్రశ్న, సూక్తములు, వర్గములు శ్లోకములు, పద్యములు మొదలగువాని సంఖ్యలను పైవాని మొదళ్ళను, తత్తద్దేవతా ఋషి, ఛందస్సులు మొదలగువానిని 'అ' కారాది క్రమమునఁ దెలుపు గ్రంథము (Index)

పరిశిష్టము

పూర్వగ్రంథమున వదలిన విషయమును సమగ్రముగాఁ దెలుపుననుబంధ గ్రంథము (Appendix).

సమీక్ష

భాష్యమును లెస్సగా వీక్షించునది సమీక్ష.

టీక

సంభవించినంతవఱకు మూలగ్రంథమునకు నర్థమును సమగ్రముగా వివరించునది టీక (Explanatory notes) 'టీకా నిరంతరవ్యాఖ్యా' అని యాకరము.

టిప్పిక

స్వల్పమగు టీక (Notes) (ఇది పంజికకన్నను జిన్నది)

పంజిక లేక పంచిక

విపులమైన వివరణము (A Detailed Exposition).

కారిక

అర్థమును వివరించు శ్లోకరూపమగు వ్యాఖ్యానమునకుఁ గారిక యనిపేరు.

పరికర శ్లోకము

"పరికరోతి ప్రకృతార్థం అధికాధానేన ఉపకరోతీతి పరికరః; పరికరార్థం కారికార్థస్య అధికాధానంకర్తుం శ్లోకః పరికరశ్లోకః" అనఁగాఁ గారికార్థమును విశదీకరించి విపులీకరించిన శ్లోకము పరికరశ్లోకము.

శాస్త్రకారు లట నట శాస్త్రములందుఁ దాము వచనరూపముల వివరించిన విషయములను విద్యార్థులు కంఠపాఠము సేయుట కనుకూలముగా శ్లోకరూపమున విరచింతురు అట్టివే కారికలును, పరికరశ్లోకములును

వార్తికము

"ఉక్తాఽనుక్త దురుక్త చింతాకరం వార్తికం" చెప్పఁబడినదానిలోఁ జెప్పఁబడనిదానిని గుఱించియు దోషయుక్తముగాఁ జెప్పఁబడినదానిని గుఱించియు విచారించి వివరించి చెప్పునది వార్తికము.

వివేకము

"వివరీతుం క్వచిద్దృష్టం నవం సందర్భితుం క్వచిత్ ..... వివేకః ప్రవితన్యతే" ఇదివఱకుఁ గూర్పఁబడినదానిని వివరించుచుఁ గ్రొత్తదానినిఁ గూర్చుచు రచింపబడినది వివేకము.

వ్యాఖ్య ; వ్యాఖ్యానము

"పరిచ్ఛేదః పదార్థోక్తి ర్విగ్రహో వాక్యయోజనా
ఆక్షేపశ్చ సమాధానం వ్యాఖ్యానం పంచలక్షణం"

పదవిభాగము, పదముల యర్థము సమాసపదములకు విగ్రహ ప్రదర్శనము కావ్యము నందలి యలంకారములను సమన్వయించుట, వ్యాకరణాద్యంశములపై నాక్షేపసమాధానములు ; ఈ యైదులక్షణములును గలది వ్యాఖ్య లేక వ్యాఖ్యానము

ఈ వ్యాఖ్యానమునకు గచ్ఛద్వ్యాఖ్యానము, ధావద్వ్యాఖ్యానము అని రెండవాంతరభేదములు కలవు వీనినిఁ గ్రమముగా టుప్పీక పంజిక అని వ్యవహరింపవచ్చును

ఉపోద్ఘాతము - పస్పశము

శాస్త్రస్యారంభకో గ్రంథ ఉపోద్ఘాత ఇతీరితః
స ఏవ గ్రంథసందర్భః పస్పశః కథితోబుధైః

శాస్త్రమును ప్రారంభించుటకు ముందు వాని విషయములను నలఁతిగా సంగ్రహించు గ్రంథముపోద్ఘాతము, పస్పశము అనఁబడును

పీఠిక - భూమిక

పీఠ ఇవపీఠికా, భూమిరివ భూమికా; పీఠికయు భూమికయు (అంతస్తు) ఉన్నతప్రదేశములుఁగదా, వాని నధిష్ఠించినవారికి క్రిందివస్తువులు విస్పష్టముగా గోచరించు విధమున నీ పీఠికాభూమికలు చదివినచో గ్రంథస్థ విషయము గోచరించును. ఇవి కావ్యారంభకగ్రంథములు (పైవి శాస్త్రారంభక గ్రంథములు).

తొలిపలుకు

ఇది Foreword అను నాంగ్లపదమునకుఁ దెలుఁగు దీనిని 'మున్నుడి' యనియు నందురు గ్రంథకర్తను గుఱించియు గ్రంథమును గుఱించియు నలఁతిగా వ్రాయు పరిచయవాక్యము

అవతారిక-అవతరణిక-ఉపక్రమణిక:- గ్రంథమునకుఁగాని శ్లోకాదులకుఁగాని పూర్వాపరప్రకరణసందర్భమును తెల్పు లఘుపీఠిక మొత్తముమీఁద ఉపోద్ఘాతము పస్పశము పీఠిక భూమిక తొలిపలుకు మున్నుడి అవతారిక, అవతరణిక ఉపక్రమణిక అను పదములన్నియు నీషద్భేదముతోఁ బర్యాయపదములుగానే వ్యవహరింపఁబడును.

ఇటఁ గొన్ని సారస్వత ప్రసిద్ధవైదికపదములకును వివరణమును వ్రాయుదుము.

శ్రుతి

వినుకలిచే నేర్చుకొనునది, అనఁగా వేదము అనాదికాలమునుండి నేఁటిదాఁక వేదమొకరు సంత చెప్పుచుండఁగా మఱొకరద్దాని నట్లే యుచ్చరించుచు నేర్చుకొందురు కాన నొకరి శ్రుతి(చెవి)నుండి మఱొకరి శ్రుతికి వారినుండి వేఱొకరి శ్రుతికిని వచ్చినది

స్మృతి

"శ్రుత్యర్థః స్మర్యతేఽత్ర" శ్రుత్యర్థమిందు స్మరింపఁబడును కాన స్మృతి "శ్రుతేరివార్థం స్మృతి రన్వగచ్ఛత్" (శ్రుత్యర్థమును స్మృతి యనుసరించిన విధమున వెంబడించెను) అని కూడ నుంటవలన శ్రుత్యర్థమును స్మృతి యనుసరించును

ఆగమము

"పరమేశ్వరాదాగత ఏవ ఆగమః" (పరమేశ్వరునుండి వచ్చిన జ్ఞానరాశి - దాని నుపదేశించు గ్రంథ ముపదారముచే నాగమము) శైవ వైష్ణవాదు

లాగమములు గూడఁ బరమేశ్వరప్రోక్తములే యని వానికిఁ బ్రామాణ్య మంగీకరింతురు ఈ 'ఆగమ' పదమునకు శైవులీ క్రిందివిధమున వ్యుత్పత్తినిఁ జెప్పుదురు

"ఆగతం పంచవక్త్రాత్తు గతం చ గిరిజాముఖే
మతంచ వాసుదేవస్య తస్మాదాగమ ఉచ్యతే."

శివునినుండి వచ్చినదియుఁ బార్వతీముఖమును జొచ్చినదియు వాసుదేవునికి సమ్మత మయినదియు నగునది యాగమ మనఁబడును ఇందు ఆ, గ, మ, యను వర్ణత్రయమునకును నీ విధముగా నిర్వచనము చేయఁబడినది.

శాస్త్రము

'శాసనాచ్ఛాస్త్ర ముచ్యతే శాసించునది లేక 'శిష్యతే అనేన ఇతి శాస్త్రం' శాసించుటకు సాధనమైనది కాఁబట్టి శాస్త్రము; మఱియును నజ్ఞాతజ్ఞాపకత్వము శాస్త్రలక్షణము అనఁగా నితరగ్రంథముల వలనఁ దెలియఁబడని విషయములను గూలంకషముగాఁ దెలుపునది శాస్త్రము.

దర్శనము

అతీంద్రియజ్ఞానముచేఁ దత్త్వమును సాక్షాత్కరించుకొనుట దర్శనము అట్టి ఋషులు ద్రష్టలు ఆ యాత్మదర్శనము నిరూపించు గ్రంథ ముపచారముచే దర్శనమనఁబడును లేక దృశ్యతే అనేన దీనిచేఁ దత్త్వమెఱుఁగఁబడును. కాన దర్శనము.

ప్రస్థానము

చతుర్దశసు విద్యాసు మధ్యే ప్రకృష్టం స్థానం యస్యతత్ (పదునాలుగు విద్యలలో దేనిస్థానము ప్రకృష్టమో యది ప్రస్థానము) అనఁగా వేదాంతము. సూత్రభాష్య, గీతాభాష్య, ఉపనిషద్భాష్యములకుఁ బ్రస్థానత్రయమని పేరు.

శిక్ష

వర్ణములయొక్క (అక్షరముల) ఉచ్చారణరీతి, ఉత్పత్తిస్థాన, ప్రయత్న, స్వర, కాలభేదములను గూర్చి శాసించు గ్రంథము

కల్పము

వేదములలో నట నటఁ బఠింపఁబడిన కర్మబోధకమంత్రముల యొక్క వినియోగమును దెలుపు సూత్రగ్రంథము కల్పము.

వ్యాకరణము

"ప్రకృతిప్రత్యయోపాధినిపాతాదివిభాగశః
పదవ్యాఖ్యానకరణం శాస్త్రం వ్యాకరణం విదుః"

ప్రకృతి ప్రత్యయము ఉపాధి నిపాతము మొదలగువానిని వివిక్తముగాఁ జూపి చేయు పదవ్యాఖ్యానము వ్యాకరణము "వ్యాక్రియంతే శబ్దాః అనేన ఇతి వ్యాకరణం" అని వ్యుత్పత్తి.

సంహిత

'పదప్రకృతిస్సంహితా' వేదమునందలి పదపాఠమునకుఁ బ్రకృతి భూతమగు పాఠము.

నిరుక్తము

వైదికశబ్దములయొక్క యర్థమెందు నిర్వచింపఁబడునో యది నిరుక్తము

అర్థవాదము

"అర్థస్య ప్రయోజనస్య వాదః" ప్రయోజనము నుద్దేశించిచేయు ప్రశంసావాక్యము. ఈ యర్థవాదములు వేదమునఁ గలవు. అందముఖ్యములగు విషయములంగూడ నత్యధికముగా బ్రశంసించు వాక్యములుండును వ్రతానా ముత్తమం వ్రతం అన్నట్లు ఏదో ప్రయోజనము నుద్దేశించి 'నీవే మహారాజవు. నీవే సార్వభౌముఁడవు అని పొగడుదురు ఈ పొగడికలు యథార్థములు గాఁజాలవు. ఇవి ప్రయోజనాపేక్షితములు ఇవియే యర్థవాదములు

అన్వీక్షకి (రూ) అన్వీక్షికి

"అన్వీక్షా ప్రయోజనమస్య అన్వీక్షకి" లోకమునందలి పదార్థముల తత్త్వమిందన్వీక్షణము చేయఁబడును అనఁగా లెస్సగాఁ దర్కింపఁబడును దీనికిఁ దర్కశాస్త్ర మనియుఁ బేరు.

"అన్వీక్షక్యాత్మవిద్యా స్యాదీక్షణాత్సుఖదుఃఖయోః
ఈక్షమాణ స్తయా తత్త్వం హర్షశోకౌ వ్యుదస్యతి"

సుఖదుఃఖములను లెస్సగా విచారించి తత్త్వమును దెలిసికొని యీ శాస్త్రమువలన నా సుఖదుఃఖములను విడుచుచున్నాఁడు (మానవుఁడు) కాఁబట్టి అన్వీక్షకి యన నాత్మవిద్య ఆ యా శాస్త్రకారులు తమతమ శాస్త్రములవలననే మోక్షము లభించునని చెప్పుదురు కాన నన్వీక్షకియు నా శాస్త్రకారులమతమున నాత్మవిద్యయే

దండనీతి

ధర్మమును బురస్కరించుకొని యపరాధికి దండమును విధించుశాస్త్రము దీనినే Criminal Law అందురు.

వార్త

పురుషార్థములలో నొకటైన యర్థమును గుఱించి విచారించు శాస్త్రము. కృషి (వ్యవసాయశాస్త్రము) గోరక్షణ (పశుశాస్త్రము) వాణిజ్యాదు (క్రయ విక్రయాది వ్యవహారము) లిందే చేరును.

మీమాంస

న్యాయములచే వేదార్థమును లెస్సఁగా మీమాంసించు (చర్చించు) శాస్త్రము.

ప్రాతిశాఖ్యము

వేదశాఖల ధర్మము (ప్రతిశాఖం భవః) ఉపచారముచే నందలి స్వరసంధి వర్ణోచ్చారణాదికమగు వివిధ విషయములను దెలుపు గ్రంథము. (Phonotics) ఇందు వైదిక వ్యాకరణాంశములు గూడఁగలవు ఇది శిక్షావ్యాకరణముల యొక్క వివరణమే

ఆశ్వాసాంతము

మ. ఫణికుంభద్విజసార! సారసముఖీ పంచాయుధాకార! కా
రణసంతత్యవకార! తారగిరిధైర్యస్థేమదుర్వార! వా
రణసామ్రాడ్భుజభార! భారకవిప్రౌఢోక్తి సంచార! చా
రణసంస్తుత్యవిహార! హారహారవిభ్రాజద్యశోవైభవా! ౧౭౪

కం. భూమిసుమనోఽమరద్రుమ!
వామాప్రద్యుమ్న! భానువంశోద్భవ! భూ
లోమీవిభుశుభవైభవ! ౧౭౫
భీమోపమ! భీమభీమ! పృథుదోర్విభవా!

పంచచామరము

ఘనాఘనాఘనాశనాధిక ప్రధానరంజనా !
జనావనాదినాగతల్ప సత్కవిప్రసాధనా !
ధనాధినాధనందనాబ్జదర్పకాంగవాసనా !
సనాతనాధునాతనాతిశౌర్యధుర్యలంఘనా ! ౧౩౭

గద్యము

ఇది శ్రీ హనుమత్ప్రసాదలబ్ధ కవితాసార సారస్వతాలంకార, నిరంకుశ
ప్రతిభాబంధుర, ప్రబంధపరనరచనాధురంధర ప్రబంధాంక వేంకట
రాయభూషణ సుపుత్ర తిమ్మరాజపౌత్ర, సకలభాషావిశేష
నిరుపమావధానశారదదామూర్తి మూర్తి ప్రణీతంబైన కావ్యా
లంకారసంగ్రహం బను మహాప్రబంధంబు నందు
సర్వరస సాధారణనాయకవర్ణనంబును శృంగార
నాయకాఖ్యానంబును రీతివృత్తి ప్రశంసయుఁ
బాకశయ్యాప్రశంసనంబును గావ్యభేద
ప్రకరణంబును, మహాకావ్య ప్రకట
నంబు క్షుద్రప్రబంధ మార్గ
దర్శనంబు నన్నది.

ద్వి తీ యా శ్వా స ము

కావ్యాలంకారసంగ్రహము

తృతీయాశ్వాసము

కం. శ్రీరమణచరణసేవా
పారాయణ! యుభయవంశపావన! లక్ష్యం
కారచితభాగధేయ; య
పారకృపారసిక! యోబపార్థివునరసా!

గీ. అవధరింపుము లక్ష్మలక్ష్యముల నెల్ల
ననఘ! భవదీయనామధేయాంకితముగ
బహువిభక్తుల నొనరింతుఁ బద్యవితతి
నిచ్చటఁ బ్రబంధజీవితం బెట్లటన్న. ౧

లక్ష్మలక్ష్యములు = లక్షణలక్ష్యములు ; బహువిభక్తులు = పెక్కు విభాగములు

గీ. మహితకవితావిలాసినీమధురతర వి
లాసవిన్యాసములలీల వాసికెక్క
నవరసంబుల నెఱిఁగింతు నవరసార్ద్ర
గుంభగంభీరతరవచోజృంభణముల. ౨

తా. కావ్యకాంత యొక్క యందచందములు స్ఫుటమగుటకై దానికి జీవితభూత మగు రసముయొక్క నవవిధములు అనఁగా నవరసముల నెఱిఁగింతును.

కం. పులకండంబులు గలిపిన
నలువగు సలిలము రసాయనంబగు పగిదిన్
లలితవిభావాదులచే
నలఘుతరస్థాయిభావమమరున్ రసమై. ౩

తా. కండచక్కెర కలుపఁగా జలము పానక మగువిధమున విభావ, అనుభావ సంచారిభావములచేఁ బరిపుష్టమై యధికముగా నాస్వాద్యమైన స్థాయిభావము రసము. జలము తన జలరూపముతో నున్నపు డెక్కువగా

నాస్వాద్యముగా నుండదు. అట్లే సహృదయులహృదయమున వాసనారూప మున నున్న స్థాయిభావము గూడ నాస్వాద్యముగా నుండదు కాని యా జలము కండచక్కెర ఏలకులు మిరియపుపొడి మొదలగువానియొక్క కలయికచేఁ బానకరూపమును బొంది కడుంగడు నాస్వాద్యమానమగుచున్నది అట్లే యా సహృదయుల స్థాయియు విభావ అనుభావ సంచారిభావములచేఁ బరిపుష్టమై మిక్కిలియు నాస్వాద్య మగుచున్నది కాఁబట్టి సహృదయులహృదయమున నున్న స్థాయియే రసమగుచున్నది. దశరూపకమున నిదేవిధముగాఁ గలదు

విభావై రనుభావైశ్చ సాత్త్వికై ర్వ్యభిచారిభిః
ఆనీయమానః స్వాదుత్వం స్థాయిభావో రసః స్మృతః

విభావానుభావ వ్యభిచారిభావములచే నాస్వాద్యమాన మగు స్థాయిభావము రసము ; అని అభిప్రాయము

గీ. గరిమ నదులెన్ని గలిసినఁ గప్పికొనుచు
జలధి గనుపట్టురీతి, సంచారిభావ
సంచయము లెన్నిగలిసిన మించనీక
తాన కనుపట్టు భావంబు స్థాయి దలఁప. ౫

స్థాయియన స్థిరముగా నిలుచునది ఎన్నియాఘాతములు వచ్చినను జలింపక సుస్థిరముగానుండు భావము స్థాయిభావము లవణసముద్రము దనలో మధుర జలములగు నదులెన్ని గలసినను వాని తియ్యదనమును మించనీక, తన క్షారత్వ మును స్థిరముగా నిలుపువిధమునఁ దనలో నెన్ని సంచారిభావములు (విరుద్ధములు గాని యవిరుద్ధములుగాని) గలిసినను వానిని మించనీక తానే స్థిరముగా నిలుచు భావము స్థాయిభావము.

ఇట స్థాయి యనఁ దెలినది భావ మన నేమి ? యన్నచో వినుఁడు. "వికారో మానసో భావః" (మనోవికార మే భావము) దీనినే మఱికొంత వివరింతము. "నిర్వికారాత్మకే చిత్తే భావః ప్రథమవిక్రియా" (ఎట్టి వికారములును లేని చిత్తమున మొదటి వికారము భావమనఁబడును) "భావయతి జ్ఞాపయితి హృదయగతమితి భావః" (హృదయగతమును దెలుపునది) అనియు వ్యుత్పత్త్యర్థములు గలవు కావున స్థాయిభావమనఁ జిరస్థాయి యనగాఁ జిరకాలముదాఁక ననగా రసస్ఫూర్తివఱకును సహృదయహృదయముల నుండుభావము ఈ స్థాయి భావాదులగు రత్యాదు లనుకూలములగు సంచారిభావములచే నొకతూరి యావిర్భావ మును (ప్రకాశము) మరొకతూరి ప్రతికూలసంచారులచేఁ దిరోభావమును

(అప్రకాశమును) బొందుచున్నను సంస్కారరూపమున రసస్ఫూర్తి వఱకును నిలుచును ఇదియే యభిప్రాయము నీ క్రింది శ్లోకము తెలుపుచున్నది

చిరం చిత్తేఽవతిష్ఠంతే సంబధ్యంతేఽనుబంధిభిః
రసత్వం యే ప్రపద్యంతే ప్రసిద్ధాః స్థాయినోఽత్ర తే

చిరకాలముదాఁక సహృదయుల చిత్తమున నిలుచునవియు విభావాదుల సంబంధముఁగలవియు ననఁగా వానివలన వ్యక్తము సేయఁబడినవియు రసత్వమును బొందునవియు నగునవి స్థాయిభావములు.

ఇటఁ బద్యములో "సంచారిభావసంచయము లెన్ని గలిపిన" అనునది పొరపాటు. ఏలన, దశరూపకమున.

"సజాతీయై ర్విజాతీయై రతిరస్కృతమూర్తిమాన్
యావద్రసం వర్తమానః స్థాయిభావ ఉదాహృతః."

సజాతీయవిజాతీయభావములచే భంగపడక రసస్ఫూర్తి పర్యంతము సహృదయహృదయముల నిలుచునది స్థాయిభావమని తెలుపఁబడినది. సజాతీయ విజాతీయభావము లనఁగా ప్రతాపరుద్రీయ వ్యాఖ్యాత "కస్యాం చిన్నాయికాయా మనురాగస్య నాయికాంతరవిషయానురాగఃసజాతీయః తత్ర బీభత్సాది ర్విజాతీయః" అని వ్యాఖ్యానించెను అనఁగా నొక నాయిక యందున్న రతికి మరొక నాయికారతి సజాతీయము రతికి విరుద్ధములయిన జుగుప్సాదులు విజాతీయులు" కావున సజాతీయములయిన విజాతీయములయిన స్థాయిభావములచే నుపమర్దితముగాక తుదిదాఁక రసస్ఫూర్తి కలుగువఱకు నిలుచునది స్థాయిభావము కాఁబట్టి "సంచారిభావ సంచయము లెన్ని గలిపిన మించనీక" అనరాదు. స్థాయిభావములకును స్థాయిభావములకే సజాతీయత్వ విజాతీయత్వము గాని సంచారి (వ్యభిచారి) భావములకును స్థాయిభావములకును గాదు ఈ రత్యాది స్థాయిభావములు గూడ నొకప్పుడు సంచారిభావములు గావచ్చును. ఎట్లన,

రత్యాదయః స్థాయిభావాస్స్యుర్భూయిష్ఠ విభావజాః
స్తోకైర్విభావై రుత్పన్నా స్త ఏవ వ్యభిచారిణః

అధికవిభావములవలన వ్యక్తమయిన రత్యాదులు స్థాయిభావములు. అల్పవిభావములవలన వ్యక్తములయిన రత్యాదులు వ్యభిచారులు మఱియు

యథా నరాణాం నృపతిః శిష్యాణాంచ యథా గురుః
ఏవం హి సర్వభావానాం భావఃస్థాయీ మహానిహ ॥

ఎల్లరును సమానావస్థగలవారయ్యుఁ గులవిద్యాప్రతాపాదులచేఁ గొందఱు రాజు లగుదురు కొంద ఱనుచరులగుదురు. అదేవిధముగా విభావాది ప్రకర్షమున నొకభావము స్థాయిత్వమును బొందును విభావాద్యపకర్షమున నస్థాయిత్వమును బొందును. అస్థాయిత్వ మన వ్యభిచారిత్వమే కదా! అనియుఁ గలదు

స్థాయిభావము రస మగునని చెప్పితిమికదా ఇట ముందు రసపదముగూర్చి చర్చింతము. (చూ. 'The Theories of Rasa and Dhvani' ౨వ పుట)

రసపదము మొట్టమొదట ఋగ్వేదమునఁ గానఁబడుచున్నది ఆ పదమీ కాలమున వ్యవహరింపఁబడు కావ్యరసపరముగాఁగాక భిన్నార్థమున వ్యవహృతమై యున్నది. అది తొలుత సోమరసము జలము క్షీరము సారము అనునర్థము లందు భిన్నభిన్న మండలములలోఁ గానవచ్చునున్నది అథర్వవేదమునందుఁ బై యర్థములందు వ్యవహారము గానరాదు కాని రుచి' అనునర్థమున సర్వసాధారణముగా గానఁబడును ఉపనిషత్కాలమున "ప్రధానసారము" అనునర్థము వచ్చినది ఛాందోగ్యోపనిషత్తులో రుచి ప్రధానసారము అను రెండర్థములును భిన్నభిన్న స్థలములందుఁ గలవు తైత్తిరీయోపనిషత్తులో "రసో వై సః" 'రసగ్ హ్యేవాఽయం లబ్ధ్వానందీ భవతి' అనియు, మైత్రేయోపనిషత్తులో 'తద్వైసత్ త్స్వరూపం తత్సత్యమేవేరితం రసః స సంప్రాస్రవత్" అనియును గలదు వీనిలోని 'రస' పదములకు నీ యుభయార్థమును (రుచి - ప్రధాన సారము) నిమిడియున్నది జగత్తునకుఁ బ్రధానసారభూత మేదిగలదో, యేది యోగులు రుచ్యమానముగఁ దలఁతురో దేనిని సాక్షాత్కరించుకొని శాశ్వతానందమనుభవింతురో యా పరమాత్మయే యీ రసపదమునకర్థము ఆలంకారికు లిట్టి యుభయార్థముగల రసపదమును గ్రహించి దీనినిఁ గావ్యమున వ్యవహరించిరి. కావుననే కావ్యానందము బ్రహ్మానందసహోదర మనియు నుడివిరి

లోకమున శకుంతలా దుష్యంతాదు లనుభవించిన రసమును దద్రసమునకుఁ గారణముగాని సామాజికుఁడెట్లనుభవించి యానందించుచున్నాఁడు? అని ప్రశ్నించుకొని భరతుఁడీ క్రింది సూత్రమును జెప్పుచున్నాఁడు

రసచర్చ

"విభావానుభావ వ్యభిచారి సంయోగాద్రస నిష్పత్తిః" అని భరతుని రస సూత్రము విభావానుభావ వ్యభిచారులయొక్క సంయోగమువలన రసము నిష్పన్న మగునని యర్థము పై పద్యములో "లలితవిభావాదులచే, నలముతర స్థాయిభావ మమరున్ రసమై" అనునదెంతయస్పష్టము గానున్నదో యా వివరణమును నంత యస్పష్టముగానే యున్నది. సంయోగ, నిష్పత్తి పదముల

కర్థభేదమును గల్పించి భట్టలోల్లట శ్రీశంకుక భట్టనాయక అభినవగుప్తులను నలువురు పండితులు నాలుగు విధముల వ్యాఖ్యానించిరి

భట్టలోల్లటమతము

ఆలంబనవిభావములయిన సీతాదులచే నుద్దీపనవిభావములయిన యుద్యానాదులచే, రామాదులందు రత్యాదిస్థాయిభావము జనించును. అది కటాక్షాద్యనుభావములచే గమ్యమానమగును. అనఁగా స్పష్టముగా గోచరించును. పిమ్మట నిర్వేదాదివ్యభిచారులచేఁ బుష్టమగును అట్టి స్థాయిభావము రసమగును. ఆ రస మీవిధముగా ముఖ్యముగా రామాద్యనుకార్యనిష్ఠము. అనఁగా మొదట రామాదులందుండును, అనుకార్యమన ననుకరింపఁదగిన దామాదిపాత్రవిశేషములు (నటులుగారు). రసము ముఖ్యముగా రామాదినాయకనిష్ఠమే. అయినను సర్పము లేకున్నను సర్పాకారముగాఁ గనఁబడు రజ్జుస్థలనను జూపఁకు భీతి పుట్టునట్లు రామాదినాయకరూపము ధరించు నటునియందు సీతాదివిషయకరత్యాదులు లేకున్నను నాట్యనైపుణ్యమున నున్నట్లు భాసిల్లును వానిని సందర్శించు సామాజికుని యందు రత్యాదులు భాసించును దాన నాతనికిఁ జమత్కారము గలిగి యాతఁడానందించును అనఁగా రసము ప్రధానముగా ననుకార్యము లగు రామాదులందే (నాయకులందే) పుట్టును అది రామాదిపాత్రముల ధరించు నటునియందు లేకున్నను నున్నట్లు భాసిల్లును సామాజికుఁడా నటునిఁ జూచుటవలన నాతని హృదయమందు రామాదినాయక నిష్ఠమగురసము స్ఫురించును. దానఁ జమత్కారము గలిగి యానందించును.

ఈ మతమున రసము నాయకనిష్ఠము అదియుత్పాద్యము లేక జన్యము లేక కార్యము (పుట్టునది). విభావము లుత్పాదకములు (జనకములు లేక కారకములు) అనుభావములు గమకములు సంచారిభావములు పోషకములు. అనఁగా విభావములగు సీతాదులవలన రామాదు లందు రసము పుట్టును. అనుభావములచే గమ్యమాన మగును. (ఊహింపఁబడును.) సంచారులచేఁ బుష్టమగును నటుఁడా విభావ అనుభావ వ్యభిచారి భావముల నటించుటచే నాతనియందుఁగూడ రసమున్నట్లు కనఁబడును ఆ నాట్యమును గాంచు సహృదయుని హృదయమున నా రామాది నాయక నిష్ఠమగు రసము భాసించును. అని నిష్కృష్టార్థము.

ఈ మతమున సంయోగపదమునకు ఉత్పాద్య, ఉత్పాదక భావము గమ్యగమక భావము. పోష్యపోషకభావము అని మూఁడర్థములు నిష్పత్తిపదమునకు ఉత్పత్తి, అభివ్యక్తి, పుష్టియని మూఁడర్థములు దీని కుత్పత్తి వాదమని పేరు.

'విభావానుభావవ్యభిచారిసంయోగాద్రసనిష్పత్తిః' అనఁగా నుత్పాదకము లగు విభావములచే రత్యాదిస్థాయిభావముత్పాద్యమై గమకములయిన యనుభావములచే గమ్యమై, పోషకములయిన వ్యభిచారులచేఁ బుష్టమై రసమగును.

ఇందలి దోష మిది :— లౌకికరసమనుకార్య (నాయక) నిష్ఠమే అత్తఱి సామాజికునకుఁ జమత్కార మెట్లు గలుగును? రసము రామాదులకు సంబంధించినది కావున వారికే యానందము గలుగవలెను? తత్సంబంధములేని సామాజికునికెట్లు గలుగును? ఇట సామాజికుఁ డా రసమెట్లనుభవించునో చక్కఁగా నిరూపింపఁబడ లేదు

శ్రీ శంకుక మతము

భట్టలోల్లటమతమున ' రసమనుకార్యనిష్ఠమని నొడివితిమిగదా! శ్రీశంకుకుని మతమున ననుకర్తృనిష్ఠము అనుకర్త యనఁగా రామాదిపాత్రముల నటించు నటుఁడు ఆ రసము నటునియం దుండును దానిని సామాజికుఁ డెట్లనుభవించుచున్నాఁడో యతఁడు తెలుపుచున్నాఁడు.

నటుఁడభినయించు విభావానుభావ వ్యభిచారులయొక్క సంయోగమువలన ననఁగ గమ్యగమకభావమువలన, ననఁగా విభావాదు లెచ్చట నుండునో యచ్చటఁదప్పక రత్యాదు లుండును" అను తార్కికవ్యాప్తివలన (ఎచ్చట ధూమ ముండునో యచ్చట నగ్ని యుండును ఎచ్చట ధూమము లేదో యచ్చట నగ్ని లేదు అనునది వ్యాప్తియని తార్కికులు వ్యవహరింతురు ఈ పదము పారిభాషికము) సామాజికుఁడు నటునియందు రత్యాదుల ననుమానించుచున్నాఁడు. ఎట్లన "ఈ రాముఁడుగా గ్రహింపఁబడిన నటునియందు రత్యాదులు గలవు. కాన వీనియందు రసమున్నది. రసము లేకున్నచో రత్యాదు లుండవు" అను వ్యాప్తి మూలమున నటునియందు రత్యాదులను సామాజికుఁడనుమానించుచున్నాఁడు కాని యీ అనుమానము పై ధూమాగ్న్యనుమానమువలె నీరసము గాక వస్తుసౌందర్యబలమువలన ననఁగా నటగతవేషభాషానాట్యాది నైపుణ్యము వలన సుందరముగా భాసిల్లును ఆ నటగతరత్యాదిస్థాయిభావమే సామాజికుఁ డనుభవించి యానందించుచున్నాఁడు రసము నట నిష్ఠమే పై వ్యాప్తి మూలముననే సామాజికుఁ డనుభవించును

ఈ మతమున సంయోగపదమునకు గమ్యగమకభావము లేక జ్ఞాప్యజ్ఞాపక భావము, అని యర్థము నిష్పత్తి' పదమున కనుమితిలేక జ్ఞప్తియని యర్థము. దీని కనుమితివాదమని పేరు,

జ్ఞాపకము లయిన విభావానుభావ వ్యభిచారులవలన జ్ఞాప్యమైన స్థాయి భావము రసమగును.

ఇందలిదోష మిది :- ప్రత్యక్షజ్ఞానమే చమత్కారజనకము, అనుమాన జ్ఞానము గాదు మఱియు సామాజికునకుఁ బై నుదాహృతమగు వ్యాప్తిజ్ఞానము లేకున్నను రసాస్వాదము గలుగుచున్నది 'రసం సాక్షాత్కరోమి' (రసమును ప్రత్యక్షముగా ననుభవించుచున్నాను) అను వచనము లోకమునఁగలదు రసమును ప్రత్యక్షముగా ననుభవించుచున్నట్లు సహృదయ ప్రమాణముండఁగా ననుమాన జ్ఞానముచే రసమనుభవించుచున్నాననుట యనుభవ విరుద్ధము.

భట్టనాయక మతము

భట్టలోల్లటమతమున రసమనుకార్యనిష్ఠము. శ్రీశంకుకుని మతమున ననుకర్తృనిష్ఠము భట్టనాయకమతమున సామాజికనిష్ఠము

ఈతని సిద్ధాంతమిది — కావ్యరసమనుకార్యనిష్ఠమును గాదు. అనుకర్తృనిష్ఠమును గాదు- అట్లగునేని సామాజికునికి రసాస్వాదము గలుగదు. సరియే రసము సామాజికనిష్ఠమందమా ! అన్నచో విభావాదుల వలనఁగదా రసము పుట్టునని రససూత్రము దెలుపుచున్నది. సీతాదులు సామాజికులకు విభావాదులుగారు గదా! విభావాదులు లేకుండ రసమెట్లు కలుగును ? కారణము లేకయే కార్యము గలుగదుగదా ! అను శంకవచ్చుచున్నది. దీనికి సమాధాన మిది :

రసము లౌకికమనియు నలౌకికమనియు నిఱుదెఱఁగులు లౌకికములగు శృంగారాదిరసములు లౌకిక నాయకాశ్రితములు. కావ్యగత నాయకులు లౌకికులు గారు. వారలౌకికులు తదాశ్రితమగు రసమలౌకికము. ఈ యలౌకికరసమలౌకికనాయకాశ్రితమైనను నాస్వాదించువారు సామాజికులు. ఈ యభిప్రాయముతోడనే రసము సామాజికనిష్ఠ మని చెప్పఁబడుచున్నది. ఈ యలౌకికరసమును సామాజికుఁ డెట్లా స్వాదించు నన శబ్దమునకు అభిధా వ్యాపారము భావకత్వవ్యాపారము, భోజకత్వవ్యాపారము లేక భోగకృత్త్వ వ్యాపారము అను మూఁడు వ్యాపారములు గలవు అభిధావ్యాపారము శబ్దము యొక్క వాచ్యార్థమును మాత్రమే బోధించును. భావకత్వ వ్యాపారము శబ్దముయొక్క రసాదులను బోధించును. భోజకత్వవ్యాపార మా రసాదులను సహృదయునిచే భోగింపఁజేయును "అభిధా భావనాచైవ, తద్భోగీకృతి రేవ చ" అని సిద్ధాంతము అందు మొదటి దగు నభిధావ్యాపారము ముగియఁ గానే భావకత్వవ్యాపారముత్థితమగుచున్నది అది విభావాదులను సాధారణముగాఁ జేయును. దీనినే సాధారణీకరణ మందురు. అనఁగా రామత్వ సీతా

త్వాదులు పోయి సాధారణ నాయకనాయికాత్వాదులు మాత్రమే సామాజికునకు గోచరించును. ఇట్లు ప్రత్యేకరూపము పోయి సామాన్యరూపముగా భాసిల్లుట భావకత్వవ్యాపారమహిమ వలననే ఈ సాధారణీకరణమువలననే సామాజికునకు నాయకునితో నభేదము గలుగును. దీనిపని ముగిసినపిమ్మట భోజకత్వ వ్యాపారము పనిసేయును భావకత్వవ్యాపారముచే సాధారణరూపమును బొందిన రత్యాదులీ వ్యాపారముచే సామాజికునిచే భుజ్యమానములగును అనఁగా ననుభవింపఁబడును అది యెట్లన నా భోజకత్వ వ్యాపారముచే సామాజికుల రజస్తమోగుణములడఁగును సత్త్వగుణమతిశయించును దానిచే ప్రాపంచిక జ్ఞానశూన్యమైన స్వస్వరూపానందముతో సంవలితములైన రత్యాదులు భాసిల్లును ఈ యానందము గలిగినపుడు చిత్తమునకు ద్రుతి విస్తార, వికాస ములను ధర్మములు గలుగును.

ఈ మతమున సంయోగపదమునకు భావకత్వమని యర్థము నిష్పత్తి యనఁగా భుక్తి లేక యాస్వాదము అని యర్థము ఇందు విభావాదులు భోజక ములు(భోగమును గలిగించునవి) రసము భోజ్యము దీనికి భుక్తివాద మని పేరు.

ఇందలి దోషమిది శబ్దమునకు భావకత్వ భోజకత్వ వ్యాపారములు రెండును గల్పితములు. ఇవి ప్రామాణికసమ్మతములు గావు భావకత్వ వ్యాపారముచే విభావాదులు సాధారణీకృతము లయినను సామాజికునియందుఁ బ్రప్రథమమున బీజరూపముగానైన రత్యాదులు లేనిచో నెట్లనుభవింపఁబడును ? నాయకాభేద మెట్లు గలుగును ? ఈ రెండుదోషములును నీ మతమునఁ గలవు

అభినవగుప్తపాద మతము

లోకములో సహృదయుఁడు రతిశోకాదుల ననుభవించుచున్నాఁడు ఆ యనుభవమువలన నాతని హృదయమున నొక సంస్కారముత్పన్నమగును. దానిని 'వాసన' యందురు దీనిని వేదాంతులును నంగీకరించిరి. ఇది రసాస్వాద మునకు ముఖ్యసాధనము. ఇది లేకున్న రసాస్వాదము గలుగదు కావుననే మీమాంసకులకును వైయాకరణులకును రసాస్వాదము గలుగదని యానంద వర్ధనాచార్యులవా రన్నారు. కావున నీతని మతమున 'వాసన ప్రధాన కారణము, ఈ యభిప్రాయమునే తెలుపు ధర్మదత్తుని శ్లోకమును సాహిత్యదర్పణకారుఁ డుదాహరించెను.

సవాసనానాం సభ్యానాం రసస్యాఽస్వాదనం భవేత్
నిర్వాసనాస్తు రంగాంతః కాష్ఠకుడ్యాశ్మసన్నిభాః

"వాసనాసహితులగు సభ్యులకే రసాస్వాదము గలుగును. వాసనలేని

వారు నాటకాదులు చూచుచున్నను రసాస్వాదనమును జేయఁజాలక రంగ మందున్న స్తంభములు, గోడలు రాళ్ళనువలె నుందురు"

భట్టనాయక మతమందీవాసనాప్రసంగములేదు అతఁడు దీని నంగీక రింపలేదు ఈ మతమున నది లేకున్న రసాస్వాదము గలుగదు దీనినే యభి వ్యక్తివాద మందురు అభివ్యక్తి యనఁగా నున్నదానిని వెలువఱచుట సహృద యుని హృదయమున వాసనారూపముగానున్న రత్యాదిస్థాయిభావములను విభావా దులు వ్యక్తముసేయును ఆ వ్యక్తమైన స్థాయిభావమే రసమగును.

ఈతని సిద్ధాంతమది లోకములో రత్యాదులకు శకుంతలాదుష్యంతాదు లాలంబనకారణములు. మలయానిలచంద్రికాదులుద్దీపనకారణములు. అశ్రుపా తాదులు కార్యములు చింతాదులు సహకారులు, *ఇవియే కావ్యపరిభాషలోఁ గారణ కార్యసహకారి నామములనువిడిచి విభావ అనుభావ వ్యభిచారినామములను వహించును అనఁగా గావ్యమునందలి నాయికా నాయకులగు శకుంతలా దుష్యంతాదులాలంబన విభావములు మలయానిలచంద్రికాదులుద్దీపనవిభావములు. అశ్రుపాతాదులనుభావములు చింతాదులు వ్యభిచారి భావములు అని వ్యవహారము.

విభావమనఁగా విభావనవ్యాపారయుక్తము విభావనమన సామాజికుల హృదయమందు వాసనారూపముగా నున్న రత్యాదుల నాస్వాదయోగ్యములుగాఁ జేయు వ్యాపారము నాయికానాయకులేగదా ! ప్రప్రథమమున సహృదయుని రత్యాదులుద్బుద్ధములుగాఁ జేయువారు కావున నీ వ్యాపారము విభావనము. అది గలది విభావము ఆ వాసనారూపరత్యాదుల ననుభవింపఁ జేయుట యను భావనము అదిగలది యనుభావము. కావ్యమునందు రత్యాదులను విశేషముగా నంతటను సంచరింపఁజేయుట (ప్రసరింపఁజేయుట) వ్యభిచారణము. అది గలది వ్యభిచారిభావము. సంచారిభావమనకే వ్యభిచారభావమనియు నామాంతరము.

సహృదయుఁడనగా సమానమైన(కవి నాయకులయొక్క హృదయముతో సమానమైన) హృదయముగలవాఁడని యర్థము అభినవగుప్తపాదులవారు తమ ధ్వన్యాలోకలోచనమున 'సహృదయ' పదమున కిట్లు నిర్వచనము జేసిరి.

"యేషాం కావ్యానుశీలనవశాత్ విశదీభూతే మనోముకురే వర్ణనీయ తన్మయీభవనయోగ్యతా తే హృదయసంవాదభాజః సహృదయాః" అనఁగా దృశ్యశ్రవ్యకావ్యములను బరిశీలించుట వలన హృదయము బాహ్యవిషయజ్ఞానము

---

*భట్టలోల్లటుఁడు లౌకికరత్యాదులకుఁ గారణములగు వానినిఁ గూడ విభావాదులనియే వ్యవహరించెను అభినవగుప్తుఁడు లౌకికములు గారణము లనియు నలౌకికములు (కావ్యగతములు) విభావము లనియు వ్యవహరించెను ఈ భేదమును గమనింపవలెను.

నుండి ముక్తమై శుద్ధమగు నద్దమువలె భాసిల్లును అప్పు డాకావ్యమున వర్ణితము లయిన విభావాదులు చూటిగా నందుఁ బ్రతిఫలించును వానితో నప్పు డా సహృదయునకుఁ గావ్యగతనాయకాదులతోఁ దన్మయత్వము (అభేదప్రతిపత్తి) గలుగును. అట్టివారే సహృదయులు

భట్టతౌతుఁడు తన కావ్యకౌతుకమున నీ క్రింది సిద్ధాంతము దెలిపినట్లు కాణేపండితుఁడు తెలిపెను. Another doctrine that he held was that the poet the hero (of a poem) and the Sympathetic reader pass through the same experience "నాయకస్య కవేః శ్రోతుః సమానోఽనుభవ స్తతః" దీనినిఁబట్టి కవినాయకుల హృదయములతో సమానానుభవము గలవాఁడే సహృదయుఁడు.

భావప్రకాశమున సహృదయ లక్షణ మిట్లు చెప్పబడినది :—

యస్తుష్టౌ తుష్టి మాప్నోతి శోకే శోకముపైతిచ
క్రోధే క్రుద్ధో భయే భీరు స్సశ్రేష్ఠః ప్రేక్షకః స్మృతః

ఎవఁడు నాయకుని తుష్టియందుఁ దాను దుష్టినందునో, శోకమునందు శోకమును జెందునో, క్రోధమునఁ గ్రుద్ధుఁ డగునో, భయమున భయపడునో, వాఁడు శ్రేష్ఠుఁడగు ప్రేక్షకుఁడు అనగా సహృదయుఁడు

కావ్యమునందీ విభావాదులను గాంచఁగానే సహృదయుని సత్త్వగుణ ముద్రిక్త మగును సత్త్వగుణ మనఁగా రజస్తమోగుణముల స్పర్శము లేని యాంతరమగు ధర్మము దాని యుద్రేకమువలన వాని హృదయమందు వాసనా రూపముగా నున్న రత్యాదులుద్బుద్ధము లగును అనఁగా విభావానుభావవ్యభి చారులే సహృదయునిలో వాసనారూపమున నున్న రత్యాదుల నభివ్యక్తము సేయును. తిరిగి తిరిగి భావించుకొనుచుండుటచే నా విభావాదులు సాధారణము లగును.

అనఁగా నా భావనలో నచ్చటి శకుంతలాదుల శకుంతలాత్వాదు లడఁగి సాధారణకాంతలుగా గోచరింతురు సహృదయుని పరిమితత్వమడఁగును అనఁగాఁ దాను ఫలానావాఁడ నను జ్ఞానము దొలఁగిపోవును తన్నుఁ దాను మఱచును. ప్రపంచమును మఱచును ఆ రత్యాదులను దానే యనుభవించు చున్నట్లు గానీ యితరులనుభవించుచున్నట్లు గానీ యనుకొనఁడు, అనిర్వచ నీయమగు నానందమును బొందును ఇట్టి స్థితి యంతయును విభావాదుల భావనా బలమువలననే కలుగును.

ఈ భావనకే సాధారణీకరణమని నామాంతరము ఇది శబ్దగతవ్యాపార మనియు, నభిధావ్యాపారము ముగిసినపిమ్మట నిది పనిసేయు ననియు భట్ట నాయకుఁడనెను. అభినవగుప్తుఁ డీవ్యాపారము విభావాదులదే యనెను భరతుఁడు

"తాఏవ పరిహృతవిశేషా రసహేతవః" (నాయికానాయకులు తమ తమ విశేష ధర్మమును తోఁగొట్టుకొని సామాన్యాకారముగా గోచరించి రసహేతువు లగుదురు) అనియు, విశ్వనాథుఁడు 'వ్యాపారోఽస్తి విభావాదేర్నామ్నా సాధారణీకృతిః (విభావాదులకు సాధారణీకరణమను వ్యాపారము గలదు) అనియును దెలిపిరి. కావుననే భట్టనాయకుఁడు దెలిపిన భావకత్వవ్యాపార మప్రామాణిక మని దూషింపఁబడెను ఈ సాధారణీకరణముచేత సామాజికుఁడు నాయకునితో నభేదమును బొందును నాయకాభేదమును బొందినపుడే వానికి రసానుభవము గలుగును 'తాఏవ పరిహృతవిశేషా రసహేతవః అను భరతముని వాక్యమున కిదియే భావము

ఎంతకాలము సహృదయుఁడు విభావాదుల ననుసంధించుకొని చర్వణము సేయునో యంతకాలమాతఁ డట్లే యానందించును. ఆ చర్వణము ముగియఁగానే యా యానందమును ముగియును ఈ యానందమును రసానందమని పేరు ఇది విభావాదిజీవితావధికము ఈ రసానందము బ్రహ్మానంద సహోదరము బ్రహ్మానందము కేవలానందము ఈ రసానందము విభావాదియుక్తము కావున నిది బ్రహ్మానంద సహోదరము బ్రహ్మానంద మననేమో యిదివఱకుఁ దెలుపఁబడినది

ఆత్మ యానందస్వరూపము దాని నజ్ఞానమావరించియుండును ఆ యజ్ఞానము దొలఁగినచో యానందము స్వస్వరూపముతో భాసిల్లును కావ్యమున విభావాదు లాయజ్ఞానావరణమును దొలఁగించును ; అపుడు దన్నంటి పట్టికొన్న రత్యాదివాసనలతో నాత్మానందము భాసిల్లును. ఆ యానందముతో సంవలితమైన రత్యాదులకు రసములని పేరు

జగన్నాథుఁ డిచ్చట స్థాయిభావముతోఁ గూడిన యానందము రసమా ? లేక యానందవిశిష్టమగు స్థాయిభావము రసమా ? యని శంకించి 'రసోవై సః రసగ్ హ్యేవాఽయంలబ్ధ్వానందీభవతి అను శ్రుతిస్వారస్యముచే స్థాయిభావముతోఁ గూడిన యానందమే రసమని సిద్ధాంతీకరించెను.

ఆ యానందానుభవము విచిత్రము, అదేమో కన్నులయెదుట స్ఫురించుచున్నట్లు హృదయమునఁ బ్రవేశించుచున్నట్లు, సర్వాంగములందును వ్యాపించుచున్నట్లు, బాహ్యప్రపంచమును గనఁబడకుండఁ జేయుచున్నట్లును నుండును.

మఱియు నీ రసమాస్వాదింపఁ బడునపుడు పానక రసమాస్వాదింపఁబడుచున్నట్లుండును పానకమునఁ జక్కెర ఏలకులు మిరియాలు, కర్పూరము, మొదలగునవి చేర్పఁబడుటవలన విలక్షణమైన రుచివచ్చును కావ్యరసము గూడ విభావానుభావ వ్యభిచారుల సంయోగమువలనఁ గడుంగడు విలక్షణమగు రుచి గలిగియుండును

'విభావానుభావవ్యభిచారిసంయోగాద్రసనిష్పత్తిః' అను సూత్రస్థ సంయోగపదమునకు వ్యంగ్యవ్యంజకభావమనియు, నిష్పత్తిపదమున కభివ్యక్తియనియు నభినవగుప్తుని యర్థము. వ్యంజకములగు విభావానుభావసంచారులవలన స్థాయిభావము వ్యంగ్యమై రసమగును—అని సూత్రార్థము "పులకండంబులు గలిసిన" అను పద్యమున నీయభిప్రాయమే సూక్ష్మముగాఁ జెప్పఁబడి యున్నది

లోకమునందలి హర్ష శోకకారణములవలన హర్ష శోకములే కలుగును. సురతకాలమున దంతక్షతాదులవలనను నానందమే కలుగు విధమునఁ గావ్యమునను న్నింటివలననునానందమే కలుగును కావుననే యీ యానందమలౌకికమని చెప్పుదురు

అనఁగా లౌకికములగు హర్ష శోకాదులవలన నరులకు హర్షశోకాదులే కలుగును కావ్యశిల్పమలౌకికమగుటవలన ననఁగాఁ గావ్యగత నాయకాదులు లౌకికులు గాకపోవుటవలన (వారు లౌకికనాయకాదుల యనుకర్తలు గాని లౌకికనాయకులే కారుగదా!) సామాజికునకు నన్నింటివలనను హర్షమే లేక యానందమే కలుగును

ఈ విషయము సాహిత్యదర్పణమున నిట్లు గలదు—

హేతుత్వం శోకహర్షాదేర్గతేభ్యో లోకసంశ్రయాత్
శోకహర్షాదయో లోకే జాయంతాం నామ లౌకికాః
అలౌకికవిభావత్వం ప్రాప్తేభ్యః కావ్యసంశ్రయాత్
సుఖం సంజాయతే తేభ్యః సర్వేభ్యోఽపీతి కా క్షతిః ?

లౌకికశోకహర్షాదికారణములవలన లోకమున శోకహర్షాదులే కలుగును. కాని కావ్యమున నా కారణములే యలౌకిక విభావములను పేర వ్యవహృతములై హర్షమునే కలిగించును కావున Imitation begets pleasure (అనుకరణ మానందమును గూర్చును) అను నాంగ్లోక్తియు సరిపడును కావ్యనాయకాదులు లౌకికనాయకానుకర్తలే కదా! అనుకరణము లగుటచేతనే యెల్ల లలితకళలవలనను నానందమే కలుగును.

నటుఁడు గూడ నొకానొకప్పుడు రసాస్వాదము సేయును "పణ్యస్త్రియో హి ధనలోభేన పరరత్యర్థం రతాది విపంచయంత్యః కదాచిత్ స్వయ మపి పరాం రతి మనుభవంతి! గాయకాశ్చ పరం రంజయంతః కదాచిత్ స్వయమపి రజ్యంతే ఏవ మేవ నటా అపి రసమను భవంతి"

అట్లగుచో హరిశ్చంద్రాదినాటకదర్శనమువలన నేల యశ్రుపాతాదులు గలుగుచున్నవి? అనవచ్చును అవి దుఃఖమువలనఁ గాదు. దుఃఖము కలుగుచో మనమా నాటకములఁ జూడఁబోవుదమా? ఎవఁడేనిఁ గావలెనని దుఃఖమును

గానితెచ్చుకొనునా ? ఇఁకనేమన హృదయము కరిగి కన్నులవెంట నీరై వచ్చును (అశ్రుపాతాదయస్తద్వద్ద్రుతత్వాచ్చేతసో మతాః) ఇవి యానందబాష్పములు. కావునఁ గావ్యమున శోకాదికారణముల వలనను నానందమే కలుగును.

ఆంగ్లసాహిత్య గ్రంథములందివ్విధమున సామాజికుఁడెట్లు రసాస్వాదము చేయునో వర్ణింపఁబడలేదు వారు "సామాజికుఁడు కావ్యగత పాత్రలతో sympathy చూపు' నందురు ఆ sympathy పదమును 'సానుభూతి యని యనువదించి వాడుదురు. మన యాలంకారికుల సిద్ధాంతమున sympathy కాదు పాత్రలతో identity (తాదాత్మ్యము) అగును

భరతుఁడు రూపకరసమును గూర్చియే తెలుపుటచే నా రసము రూపకమున సామాజికులచే నెట్లాస్వాదింపఁబడునో తెలుపఁబడినది ఆనందవర్ధనుఁడీ రూపకరససిద్ధాంతమునే శ్రవ్యకావ్యమునకుఁ గూడ నన్వయింపుటచే శ్రవ్యమున దృశ్యకావ్యమునందువలె నాయకాదులు ప్రత్యక్షముగాఁ గానరారు గదా సామాజికుఁడా నాయకాభేదమును బొంది యెట్లు రసాస్వాదము సేయును ? అని శంక గలుగుచున్నది ఇచ్చట వాక్యపదీయకారుఁడు భర్తృహరి యిట్లనెను

శ్లో॥ శబ్దోపహితరూపాంస్తాన్ బుద్ధేర్విషయతాం గతాన్
ప్రత్యక్షానివ కంసాదీన్ సాధనత్వేన మన్యతే

కావ్యమూలమున రూపమునుబడసి బుద్ధికి విషయములైన కంసాదులగు పాత్రలను ప్రత్యక్షములనువలె సాధనముగాఁ దలంచును (సామాజికుఁడు)

అనఁగా శ్రవ్యకావ్యమున వర్ణితములై కంసాదులు (నాయకులు) తత్తద్వర్ణనములచే రూపమును బొంది హృదయమునఁ బ్రవేశించి ప్రత్యక్షముగా గోచరింతురు. అప్పుడు సామాజికుఁడు తదభేదముతో రసాస్వాదము చేయును

రససిద్ధాంత సంగ్రహము

లోకమున శకుంతలాదుష్యంతాదినాయకు లనుభవించిన రసమును దద్రసమునకు సంబంధములేని సామాజికుఁ డెట్లనుభవించును ? అని ప్రశ్నించుకొని భట్టలోల్లటాదులు పై విధమున సమాధానము నొసఁగిరి దాని సంగ్రహ మిది : భట్టలోల్లటుఁడు రసము దుష్యంతాదినాయకుఁడే యనుభవించును వాని ననుకరించు నటునిఁ గాంచి సామాజికుఁడు చమత్కారమును బొంది యానందించును' అనెను. శ్రీశంకుకుఁడు అనుకర్త యనఁగా నటుఁడు నటించిన విభావ, యనుభావాదులఁ గాంచి వ్యాప్తి జ్ఞానమూలమున సామాజికుఁడానందపడు నని వచించెను భట్టనాయకుఁడు 'సామాజికుఁడు నాయకాభేదమును బొంది సాక్షాన్నాయకరసానుభవమును బొందు నని నుడివెను. అభినవగుప్తుఁడు 'సామాజికుఁడు వాసనచేత నాయకాభేదమును బొంది సాక్షాన్నాయకరసానుభవమును బొందునని

తెలిపెను భట్టలోల్లటుఁడును, శ్రీశంకుకుఁడును సామాజికుఁడానందమును బొందుననిరి భట్టనాయక అభినవగుప్తులు సామాజికుఁడు సాక్షాన్నాయకుఁడు పొందిన రసానుభవమునే సామాజికుఁడును బొందుననిరి అభినవగుప్తుడు భట్టనాయకమతమునతేని వాసన నంగీకరించెను. ఇదియే భేదము భట్టలోల్లట, శ్రీశంకుకుల మతమున సామాజికుఁడు సాక్షాన్నాయక రసానుభవమునే పొందుననుమాటలేదు కేవల మానందపడునని మాత్రమే గలదు.

కం ధర శృంగారము, హాస్యము,
కరుణయు, వీరము, భయానకము భీభత్సం,
బురురౌద్ర మద్భుతము, శాం
తరసంబును రసములనఁగఁ దనరుఁ గృతులన్.

తా శృంగార హాస్య కరుణ వీర భయానక బీభత్స రౌద్ర అద్భుత శాంతము లనునవి తొమ్మిది కావ్యరసములు

ఇందుఁ 'గరుణ' అని యుండఁగూడఁదు రసవాచకము కరుణము (అకారాంత పులింగము), దయావాచకము కరుణ (అకారాంత స్త్రీలింగము)

ఇందుదాహృతములయిన నవరసములలో శాంతము రసముగాదని కొందఱు; శృంగార మొక్కటే రసమని కొందఱు; కరుణమే రసమని యొకరు; అద్భుతమే రసమని యొకరు; తొమ్మిదియే కాదు భక్తిగూడ రసమే యని యొకరు వత్సలమను రసము గ్రాహ్య మని కొందఱు ప్రేయో రసమనునది యున్నదని కొందఱు వ్యభిచారిభావములన్నియు రసములే యగునని యొకరు; ఒక్కటే రసము గాని యిన్నిరసములు లేనేలేవని మఱొకరు ఇట్లు రసములను గూర్చి పెద్ద కోలాహలము గలదు దాని నిట సంగ్రహముగాఁ జూపుదును

శాంతరసము

భరతుఁడు నాట్యశాస్త్రమున నెనిమిది రసములును వాని కెనిమిదింటికిని నెనిమిది స్థాయిభావములను మాత్రమే నిరూపించెను. వానిలో శాంతరసము పేర్కొనఁబడలేదు

శృంగారహాస్యకరుణరౌద్రవీరభయానకాః
భీభత్సాద్భుతసంజ్ఞౌచే త్యష్టౌ నాట్యే రసాః స్మృతాః
రతిర్హాసశ్చ శోకశ్చ క్రోధోత్సాహౌ భయం తథా
జుగుప్సా విస్మయశ్చేతి స్థాయిభావాః ప్రకీర్తితాః (నాట్యశాస్త్రము).

"నాట్యమున (నాటకమున) శృంగార, హాస్య, కరుణ, రౌద్ర, వీర, భయానక బీభత్స అద్భుతము లను నెనిమిది రసములు గలవు వానికిఁ గ్రమముగా రతి హాసము, శోకము క్రోధము, ఉత్సాహము భయము, జుగుప్స, విస్మయము అను నెనిమిదియు స్థాయిభావములు."

ఇందు శాంతరసప్రస్తావమును భరతుఁడు సేయలేదు కానీ ప్రకృతము మనకుపలభ్యమానమగు నాట్యశాస్త్రగ్రంథములలో శాంతరసప్రస్తావము గలదు ఇది భరతుని తర్వాత శాంతరసాభిమానులగు పండితులు తమ యభిప్రాయములను నాట్యశాస్త్రములలోని కెక్కించినట్లు కానఁబడును. కొందఱు 'వాసుకి' యనునాతఁడు ప్రప్రథమమున శాంతరసమును స్థాపించెనందురు. కొందఱు 'కోహలుఁ'డనువాఁడు, మఱొకఁడు శాంతరససిద్ధాంతములను బలపఱచినట్లు చెప్పుదురు. కాని వాసుకి కోహలులయొక్క ప్రమాణవాక్యములు లభింప లేదు. పిమ్మట నీ శాంతరసమును గుఱించి విచారించి నిర్ధారించినవాఁడు భట్టోద్భటుఁడు అతఁడు దన కావ్యాలంకారసారసంగ్రహమునఁ దొమ్మిది రసముల నుదాహరించెను అతఁడు నాట్యశాస్త్రమున కొక వ్యాఖ్యానమును వ్రాసినట్లు కానఁబడును. అది మనకుఁ బ్రకృతకాలమున నుపలభ్యమానము గాదు అతఁడే యీ శాంతమును రసమునుగా నంగీకరించి వానికి వలసిన స్థాయిభావాదులను నిర్ణయించి నాట్యశాస్త్రమునఁ బ్రవేశపెట్టెను.

అతని పాఠ మిది —

శృంగార హాస్య కరుణ రౌద్ర వీర భయానకాః
బీభత్సాద్భుత శాంతాశ్చ నవ నాట్యే రసాః స్మృతాః
రతిర్హాసశ్చ శోకశ్చ క్రోధోత్సాహౌ భయం తథా
జుగుప్సావిస్మయశమాః స్థాయిభావాః ప్రకీర్తితాః

ఈ శ్లోకములలో శాంతము రసముగాను, శమము దానిస్థాయి భావము గాను పేర్కొనబడియున్నది.

కొందఱు విమర్శకులు భరతుఁడు "అష్టౌరసాః" అని నొడువుటచే శాంతరసమును గూర్చి తెలుపలేదనియు నాతని కిది సమ్మతముగాదనియు వచింతురు మఱియు భరతుఁడెనిమిది రసములకును స్వర, లయ గుణ, అలంకార వృత్తి వృత్తముల నిరూపించెను కాని శాంతమునకు నిరూపింపలేదు. కావున శాంతము రసముకాదు——అని పలుకుదురు ఇంతేకాక ధ్వన్యాలోకమున నానందవర్ధనుఁడు శాంతరసమును గూర్చి చర్చించుచుఁ దనవాదమున కవష్టంభకముగా భరతుని వాక్యములను బేర్కొనక తన యుక్తులచేతనే సిద్ధాంతమొనర్చెను. భరతనాట్యశాస్త్రమున నిపుడుపలభ్యమానమగు శాంతరసవాక్యము

లాతనికి యథార్థములే యని తోఁచినచో నాతఁడేల యీవాక్యముల నుదాహరింప కుండును ? అనియును వాదింతురు.

ఈ వాదమునుబట్టి భరతునికి శాంతరసము సమ్మతము గాదనియే తోఁచును. కాని యాతఁడు శాంతరసమును గుఱించి ఋజుమార్గమున (Directly) దెలుపక, వక్రమార్గమున (Indirectly) దెలిపెను. ఎట్లన,

"క్వచిద్ధర్మః క్వచిత్క్రీడా క్వచిదర్థః క్వచిచ్ఛమః
దుఃఖార్తానాం శ్రమార్తానాం శోకార్తానాం తపస్వినాం
విశ్రాంతిజననం కాలే నాట్యమేతద్భవిష్యతి
బ్రహ్మర్షిణాంచ విజ్ఞేయం నాట్యం వృత్తాంతదర్శనం"

దుఃఖార్తులకు ధర్మముపదేశించుచు, శ్రమార్తులకు వినోదముఁ గలిగించుచు, శోకార్తులకర్థోపదేశము సేయుచు దపస్వులకుఁ బ్రశాంతినిఁ గూర్చుచు, నా యా కాలములయందు నాట్యము (నాటకము) విశ్రాంతికారణమగును. అని నిష్కృష్టార్థము ఇందు "క్వచిచ్ఛమః" అనియుంటఁబట్టి యభినవగుప్తుడు శాంతరసమును స్థాపించుచుట్టమున "మునినాఽప్యంగీక్రియతే క్వచిచ్ఛమ ఇతివదతా" (క్వచిచ్ఛమః అని చెప్పుటచే మునియు నీశాంతము నంగీకరించెను) అని వచించెను. మఱియును భరతుడు నాటకమున

"తుష్యంతి తరుణాః కామే విదగ్ధాస్సమయాశ్రితే
అర్థేష్వర్థపరాశ్చైవ మోక్షేష్వథ విరాగిణః"

"విదగ్ధులగు తరుణులు సమయమునఁ గామమున (శృంగారమున) హర్షింతురు అర్థపరులర్థములఁగాంచి సంతసింతురు విరాగులు మోక్షవిషయమున సంతోషింతురు" అనియును నుడివెను దీనినిఁబట్టి విరాగులు శాంతరసాస్వాదకులని సారాంశము.

మఱియును భరతుఁడు శాంతరసము నంగీకరింపకున్నచో నాట్యము త్రైలోక్యానుకరణమని యెట్లు చెప్పఁగలుగును ?

"నానాభావోపసంపన్నం నానావస్థాంతరాత్మకం
లోకవృత్తానుకరణం నాట్యమేతన్మయా కృతం
....
సప్తద్వీపానుకరణం నాట్యేఽస్మిన్ ప్రతిష్ఠితం'
(నాట్యశాస్త్రము)

అనికదా కలదు. ఇంతేకాక నాట్యాంగముకాని దేదియు లేదని యిట్లు తెలిపెను.

"న తత్ జ్ఞానం న తచ్ఛిల్పం న సా విద్యా న సా కళా
న స యోగో న తత్కర్మ నాట్యేఽస్మిన్ య న్న దృశ్యతే"

ఈ కారణములం బట్టి భరతుండు ఋజుమార్గమున శాంతరసము నంగీకరింపకున్నను వక్రమార్గమున నంగీకరించెననుట స్పష్టము భరతుండేల ఋజుమార్గమునం దెలుపలేదో యను ప్రశ్నమున కభినవగుప్తుండు విమ్మటం బ్రత్యుత్తరించును.

దశరూపక వ్యాఖ్యాతయగు ధనికుండు శాంతమును గుఱించిన పరమతము నిట్లు నుడివెను. "అన్యే తు వస్తుత స్తస్య అభావం వర్ణయంతి అనాదికాలప్రవాహాయాతరాగద్వేషయోరుచ్ఛేత్తు మశక్యత్వాత్" (కొందఱు శాంతరసము లేనే లేదందురు ఏలన ననాది కాలప్రవాహమునంబడి వచ్చుచున్న రాగద్వేషములను శమింపంజేయుట యశక్యము) దీని కానందవర్ధనుం డిట్లు సమాధానమిచ్చెను

"యది నామ సర్వజనానుభవగోచరతా తస్య నాస్తి నైతావతా అసౌ అలోకసామాన్యచిత్తవృత్తివత్ ప్రతిక్షేప్తుం శక్యః' (ఇది సర్వజనములకును ననుభవగోచరము కానంతమాత్రమున దీనినిం ద్రోసివేయరాదు) మఱియు నభినవగుప్తుండు —

"యథాచ కామాదిషు సముచితాశ్చిత్తవృత్తయః రత్యాదిశబ్దవాచ్యాః కవినటవ్యాపారేణ ఆస్వాదయోగ్యతాప్రాపణద్వారేణ తథావిధహృదయ సంవాదవతః సామాజికాన్ ప్రతి రసత్వం శృంగారాదితయా నీయతే తథా మోక్షాభిధాన పురుషార్థోచితా చిత్తవృత్తిః కిమితి రసత్వం నానీయతే ? ఇతివక్తవ్యం" (ఎట్లు చిత్తవృత్తివిశేషములగు రత్యాదులు కవినటులవ్యాపారముచే నాస్వాదయోగ్యములై సామాజికులచే శృంగారాది రసములుగా నాస్వాద్యములగుచున్నవో యట్లే మోక్షరూపమగు పురుషార్థమున కుచితమగు చిత్తవృత్తి యేల రసస్వరూపమును బొంది యాస్వాద్యము గాదు?" అని వాదించెను దీనిచే ననాదికాలప్రవాహపతితములగు రాగద్వేషముల నుచ్ఛేదించెడి వీతరాగులుందురనియు వారే మోక్షమునకు నధికారులనియు వారే యీ శాంతరసము నాస్వాదించు సామాజికులనియును సారాంశము

ధశరూపకర్తయగు ధనంజయుండు

"శమ మితి కేచిత్ప్రాహుః పుష్టిర్నాట్యేషు నైతస్య"

కొందఱు శమమును (శాంతము) రసముగాం బేర్కొనిరి కాని దానికి నాట్యమునం బుష్టిలేదు అని చెప్పెను. కాని తద్వ్యాఖ్యాతయగు ధనికుండు మాత్రము నను శాంతస్య అనభినేయత్వాత్ యద్యపి నాట్యేఽనుప్రవేశోనాస్తి తథాపి సూక్ష్మాతీతవస్తూనాం సర్వేషామపి శబ్దప్రతిపాద్యతాయాః విద్యమానత్వాత్ కావ్యవిషయత్వం న వార్యతే (శాంతమభినయింపందగినది కామి

నాట్యమునఁ బ్రవేశము లేకపోవును గాక. అతిసూక్ష్మములగు వస్తువులను గుఱించియు శబ్దముచేఁ జెప్పవచ్చును గాదా కావున శ్రవ్యకావ్యమున శాంతమును నిబంధింపవచ్చును) అని శాంతమును శ్రవ్యకావ్యమున నిబంధింపననుమతించెను. ధనంజయుఁ డీమాత్రపు మాటనుగూడఁ దెలుపలేదు మఱియు నా ధనికుఁడు శాంతరసస్వరూపము నిట్లు తెలిపెను. శాంతో హి తావత్ —

'న యత్ర దుఃఖం న సుఖం న చింతా న ద్వేషరాగౌ న చ కాచిదిచ్ఛా
రసస్తు శాంతః కథితో మునీంద్రైః సర్వేషు భావేషు శమప్రధానః

ఇత్యేవంలక్షణః తదా తస్య మోక్షావస్థాయామేవ ఆత్మస్వరూపాపత్తి లక్షణాయాం ప్రాదుర్భావాత్ తస్య స్వరూపేణ అనిర్వచనీయతా తథాహి శ్రుతరపి స ఏష నేతి నేతి అన్యాపోహరూపేణ ఆహ (శాంత మనఁగా నే దశలో దుఃఖము గానీ ప్రపంచసుఖముగానీ రాగద్వేషములుగానీ యిచ్ఛగానీ లేవో, యాదశయే శాంతము ఎల్ల విషయములందును శమమే ప్రధానమగు రసము శాంతము ఇట్టి శాంతమాత్మస్వరూపప్రాప్తిరూపమగు మోక్షావస్థయందే లభించును దానికి సంచార్యాదులు లేవు మఱియు నా శాంతమును సూటిగా స్వరూపముచేఁ జెప్పఁజాలము. శ్రుతియును బరమాత్మను సూటిగా నిర్వచింపఁజాలక ఇదిగాదు ఇదిగాదు అనియే యన్యాపోహరూపముగఁ దెలిపెను అట్టి స్వరూపముచే నిర్వచింపఁబడని శాంతము నాస్వాదించు సహృదయులు లేరు ఇఁక నిత్యసంతుష్టి మైత్రీ దయా ఉపేక్షా రూపమున వా రస మెట్లఁటే ననుభవింపఁబడును ఆ యాస్వాదము గూడ మిగిలిన రసముల నాస్వాదించునపుడు గలుగు చిత్తద్రుతి వికాస, విస్తార రూపమే అనియు నాతఁడు తెలిపెను.

విశ్వనాథుఁ డీ పైనున్న " అట్టి స్వరూపముచే నిర్వచింపఁ బడని శాంతము మోక్షావస్థయందే కలుగును దానికి సంచార్యాదులు లేవు శాంతమును సూటిగాఁ జెప్పఁజాలము నిత్యసంతుష్ట్యాదుల మూలముననే దాని ననుభవింపవలెను అను నభిప్రాయము నీ విధమున ఖండించెను

''యుక్తవియుక్తదశాయా మవస్థితో య శ్శమ స్స ఏవ యతః
రసతామేతి తదస్మిన్ సంచార్యాదేః స్థితిశ్చ న విరుద్ధా

మోక్షావస్థయందున్న శమమే కాక యుక్తవియుక్తదశయందు ననఁగా నాత్మసాక్షాత్కార దశయందును తదసాక్షాత్కారదశయందును సాధారణముగా నుండు శమము రసత్వమును బొందును. దానికి సంచార్యాదు లుండును.

విశ్వనాథుఁ డీ విధమున శాంతము గావ్యనాటకముల రెంటను నుండునని సమర్థించెను.

ధనంజయుఁడు నాట్యమున శాంతరస ముండదనెను. ధనికుఁడు నాట్యమున లేదని యంగీకరించుచు శ్రవ్యకావ్యమున నుండవచ్చునని చెప్పెను. కాని శాంతరసము స్వస్వరూపముచే నిర్వచింపఁబడదనియు దానికి సంచార్యాదులు లేవనియును దెలిపెను విశ్వనాథుఁడు శాంతము రసమగుననియు దానికి సంచార్యాదు లుండుననియు నది కావ్యనాటకముల రెంటను నుండవచ్చుననియు సిద్ధాంతించెను

మఱి కొందఱు రసమనుకర్తృనిష్ఠమని భావించి యిట్లు వచించిరి.

శాంతస్య శమసాధ్యత్వాత్ నటే చ తదసంభవాత్
అష్టావేవ రసా నాట్యే న శాంత స్తత్ర యుజ్యతే

(శాంతరసము శమసాధ్య మగుటవలనను ఆ శమము నటునియందు సంభవింపదు కావునను నాట్యమున నెనిమిది రసములే. అందు శాంతమునకుఁ దావు లేదు) కాని యభినవగుప్తపాదాచార్యులవారు "రసము నటనిష్ఠము గాదు; సామాజికనిష్ఠము. సామాజికునియందు వాసనారూపముగా నున్న స్థాయి భావములగు రత్యాదులే నటుని నాట్యముచే నభివ్యక్తములై యస్వాదింపఁబడి యలౌకిక చమత్కారమును గలిగించును అదియే రసము" అని తెలిపిరి. దీనిచే రసము సామాజికనిష్ఠము కావున శాంతముఁగూడ రసముగ నుండవచ్చును.

''నటే శమస్యైవాభావాదితి హేతురసంగతః
నటే రసాభివ్యక్తిస్తునైవ స్వీక్రియతే యతః
సామాజికాస్సహృదయాశ్శాంతా స్తత్వ విచక్షణాః
అతస్తేషాం రసోద్భూధే శమవత్త్వా న్న బాధకం.''

"నటునియందు శమములేదు కావున శాంతము రసముగాదు" అను హేతువసంగతము. రసము నటనిష్ఠము గానే కాదుగదా సామాజికులు సహృదయులు శాంతులు; తత్త్వవివేచనాపరులు కావున వారికి రసోదయ మగుటలో విప్రతిపత్తి లేదు కావునఁ గావ్యమునందువలెనే నాట్యమునందునుఁ దొమ్మిది రసములు సిద్ధించును ఈ యభిప్రాయానుసారముగా "శాంతోఽపి నవమో రసః" అని చెప్పఁబడి యున్నది. మఱియు సంగీత రత్నాకరమున

అష్టావేవ రసా నాట్యే ఇతి కేచి దచూచుదన్
తదచారు యతఃకించిన్న రసం స్వదతే నటః"

(నాట్యమున నెనిమిది రసములే యుండునని కొందఱనిరి అది యయుక్తము, నటుఁడు రసాస్వాదనపరుఁడు గాఁడు. అనఁగా రసము నటనిష్ఠము గాదు,) అని యును జెప్పఁబడినది

ధ్వన్యాలోకమునకు వ్యాఖ్యాత యగు చంద్రికాకారుఁడు శాంతరసమును గుఱించి విచారణము సేసెను అతని సిద్ధాంతమిది — శాంతమును రసముగా నంగీకరింపవలెను కాని దానిని కావ్యమునం దంగిరసముగాఁగాక యంగరసముగా మాత్రమే నిర్వహింపవలెను నాగానందమున శాంతరస మంగిగా నిర్వహింపఁబడక యంగరసముగానే నిర్వహింపఁబడినది.

ఈ యభిప్రాయము నభినవగుప్తుఁడిట్లు ఖండించెను. "అధికారికత్వేన తు శాంతో రసో న నిబద్ధవ్య". ఇతి చంద్రికాకారః తచ్చేహాస్మాభి ర్నపర్యాలోచితం" (చంద్రికాకారుఁడు శాంత మాధికారికరసముగా నిబంధింపఁగూడదని నుడివెను. దానిని మేమంగీకరింపము

బౌద్ధజైన కవులు ౫ శతాబ్దిలోనే శాంతరసము నంగిరసముగా నంగీకరించిరి జైనుల అనుయోగాద్వరసూత్రము ప్రశాంతరసము పేరుతో శాంతము నంగిరసముగా గ్రహించెను

కొందఱు శాంతమును దయావీరమున నంతర్భవింపఁజేసిరి అదికూడదు ఏలన శాంతమునకు స్థాయిభావము నిర్వేదము దయావీరమున కుత్సాహము. ఉత్సాహమహంకారరూపము శాంతమహంకారప్రశమరూపము దీని కవష్టంభక ముగా సాహిత్యదర్పణకారుఁ డిట్లు చెప్పుచున్నాఁడు.

'నిరహంకారరూపత్వాద్దయావీరాది రేష నో

శాంతము నిరహంకారరూపమగుటవలన దయావీరముగాదు. మఱియు

సర్వాకారమహంకారరహితత్వం వ్రజంతిచేత్ ।
అత్రాఽంతర్భావమర్హంతి దయావీరాదయస్తదా

దయావీరాదులు సర్వాకారముగా నహంకారరహితములగుచో నవి శాంత రసమందే యంతర్భవించును. అంతేకాని శాంతము వానిలో నంతర్భవింపదు.

హరిపాలుఁడు సంగీతసుధాకరమున శాంతరసమును శాంతరసమనియు, బ్రహ్మరసమనియు విభజించెను.

బ్రహ్మోనామ రసస్సర్వప్రపంచో త్తీర్ణరూపకః
నిత్యస్స్థిరోఽతఏవాయం పార్థక్యేన ప్రకీర్తితః '

బ్రహ్మరసము నిత్యము స్థిరముననియు శాంతరసమనిత్యము అస్థిరము, ననియుఁ దెలిపెను. నిర్వేదస్థాయికమగు శాంతరసము మోక్షమునకుఁ గొని పోవదనియు, ఆనందస్థాయికమగు బ్రహ్మరసము మోక్షమునకుఁ గొనిపోవు ననియు నతని సిద్ధాంతము

ఈ విధముగా భరతుఁడు నిర్దేశింపలేదు కావున శాంతము రసమేకాదని కొందఱు కావ్యమందైననుఁ నాధికారికరసముగాఁగాక ప్రాసంగికరసముగా మాత్రమే గ్రాహ్యమని కొందఱు తుదికిఁ గావ్యమునను నాటకమునను గూడ నంగిరసముగా గ్రాహ్యమే యని యభినవగుప్తపాదులవారు సిద్ధాంతీకరించిరి.

శాంతరసము స్థాపింపఁబడిన పిమ్మట దీనికి స్థాయి యేమి ? అని ప్రశ్న పుట్టుచున్నది ఈ విషయమునఁ బెక్కు మతభేదములు గలవు

కొందఱు 'శమము దీనికి స్థాయిభావమందురు (అథ శాంతో నామ శమ స్థాయిభావాత్మకో మోక్షప్రవర్తకః) భరతుఁడు నలువదితొమ్మిది భావములనే చూపెను. (ఎనిమిది స్థాయిభావములు ఎనిమిది సాత్త్వికభావములు, ముప్పది మూఁడు వ్యభిచారిభావములు.) శమమును గూడ గలిపినచో నేఁబదిభావము లగునుగదా ! మఱియు శమ శాంతిపదములు పర్యాయపదములు. కావున శమ స్థాయికము శాంతమన్నచో శాంతస్థాయికము శాంతరసమని యర్థమువచ్చును. ఇది దోషము కాన శమము స్థాయిభావము గాదని మఱి కొందఱందురు శమ శాంతములు పర్యాయములు గావు. ఏలన భయభయానకములు విస్మయాద్భుతములు హాసహాస్యములును నెట్లు భిన్నములో యివియును భిన్నములే శమ భయ విస్మయ హాసములు లౌకికములు శాంత, భయానక, అద్భుత, హాస్యము లలౌకికములు కాన నవి భిన్నములే కావున నిది పెద్దశంకగాదు. కాని యేఁబదిభావము లగునటుల యొక యాక్షేపమే

రుద్రటుఁడు సమ్యగ్జ్ఞానము స్థాయిభావమనెను (సమ్యగ్జ్ఞానం స్థాయిభావః) ఇతని యుద్దేశమున సమ్యగ్జ్ఞానమన్నను శమమన్న నొక్కటియే

ఆనందవర్ధనుఁడు తృష్ణాక్షయసుఖమే స్థాయిభావమనెను. (శాంతశ్చ తృష్ణాక్షయసుఖస్య యః పరిపోషస్తల్లక్షణో రసః ప్రతీయత ఏవ) ఈ తృష్ణాక్షయ సుఖమనఁగా శమమనియే యీతని యభిప్రాయము ఏలన నితఁడు దయావీరము నుండి శాంతమును వేఱుపఱచుచు "అస్య చ శాంతస్య అహంకారప్రశమైక రూపతయా స్థితేః (ఈ శాంతమహంకారప్రశమైకరూపము) అని నుడివెను.

ఇట నభినవగుప్తుఁడు గూడ నహంకారప్రశమ మనగాఁ నిరీహత్వము' అని వ్యాఖ్యానించెను హేమచంద్రుఁడు గూడఁదృష్ణాక్షయమన శమ మనియే తెలిపెను (తృష్ణాక్షయరూపశ్శమః స్థాయిభావశ్చర్వణాం ప్రాప్తశ్శాంతో రసః) మఱికొందఱు "సర్వచిత్తవృత్తిప్రశమము" స్థాయి యని చెప్పుదురు. సర్వచిత్తవృత్తి ప్రశమమనఁగా సర్వథా చిత్తవృత్తులయొక్క నాశము లేక యభావము" అని యర్థము అట్లగుచో నభావము భావమెట్లగును ? భావము-

చిత్తవృత్తిరూపము కావున నభావము స్థాయిభావము గానేరదు" అని యభినవ గుప్తుఁ డాక్షేపించెను.

ఇఁకఁ గొందఱు నిర్విశేష చిత్తవృత్తి' స్థాయిభావముగాఁ బేర్కొనిరి (అనుపజాతవిశేషాంతరం చిత్తవృత్తిరూపం శాంతస్య స్థాయిభావం మన్యంతే) వీరు శాంతము ప్రకృతిరసమనియు మిగిలిన రసములు వికృతిరసములనియు వికృతిరూపవిశేషములులేని చిత్తవృత్తియే శాంతమునకు స్థాయిభావమనియుఁ దెలుపుదురు. తృష్ణాక్షయసుఖము నిర్విశేషచిత్తవృత్తి యను రెండును దాదాపుగాఁ బర్యాయములే.

భోజుఁడు ధృతిని' శాంతమునకు స్థాయిభావముగాఁ బేర్కొనెను "ధృతిః స్థాయిభావః వస్తుతత్త్వాలోచనాదిభిర్వ్యభిచారిభావైః వాగారంభాదిభిరనుషజ్యమానః నిష్పన్నః శాంతఇత్యభిధీయతే" అన్యే పునరస్య శమం ప్రకృతిమామనంతి. స తు ధృతేరేవ విశేషో భవతి" (సరస్వతీకంఠాభరణము)

ధృతియనఁగా నిత్యసంతుష్టి ఇది శమరూపమగు తృష్ణాక్షయమే. 'అన్యే పునః అను పై మాటలచే శమము ధృతియొక్క విశేషమని తెలియుచున్నది మరల భోజుడు శృంగారప్రకాశమున "అత్ర శమ ప్రకృతిశ్శాంతః" అని శమమునే స్థాయిభావముగాఁ దెలిపెను. కావున ధృతియన్నను శమమన్న' నొక్కటియే యని తేలుచున్నది

కొందఱు నిర్వేదము స్థాయిభావమందురు (తత్త్వజ్ఞానజో నిర్వేదోఽస్య స్థాయీ) వీరు భరతుఁడు నిర్వేదమును స్థాయిభావముగా సూచించె నందురు ఎట్లన స్థాయిభావముల నెనిమిదింటినిఁ దెలిపి వ్యభిచారిభావముల గణించుచుఁ బ్రథమమునే నిర్వేదమును బేర్కొనెను సర్వేదమమంగళప్రాయము వ్యభిచారులను బేర్కొనుచు "మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతాని శాస్త్రాణి ప్రథంతే" అను న్యాయానుసారముగా మంగళప్రాయముగాఁ దెలుప వలసిన భరతముని యమంగళప్రాయమగు నిర్వేదమును ప్రథమమున నేల పేర్కొనెను ? ఇది యమంగళప్రాయమైనను స్థాయిభావముల వెంటనే దీనినిఁ బఠించుటఁబట్టి స్థాయిభావముగను వ్యభిచారిభావముగను గూడ దీని నుద్దేశించెను. అతనికి యుద్దేశమే లేనిచో భరతుఁడు దీనిని స్థాయిభావముల వెంటనే వ్యభిచారి భావముల క్రమమునఁ బఠింపఁడు. ఈ నిర్వేదము దారిద్ర్య వ్యాధి, అవమాన, అధిక్షేప క్రోధ ఇష్టజనవియోగ తత్త్వజ్ఞానాదివిభావముల వలనఁ గలుగును కానీ తత్త్వజ్ఞానముపలనఁ గలిగిన నిర్వేదమే శాంతమునకు స్థాయిభావము

కొందఱుత్సాహము స్థాయిభావమని తెలుపుదురు (ఉత్సాహ ఏవ అస్య స్థాయీత్యన్యే) "ఉత్సాహము వీరమునకు స్థాయిభావము" వీరము, దాన

దయా యుద్ధ ధర్మభేదములచే నలుదెఱఁగులు ఇందు దయావీరమే శాంతము. కాన శాంతమునకుత్సాహమే స్థాయిభావము అంతేకాక మోక్షపదవినిఁ బొందుటకుఁ దీవ్ర ప్రయత్నముగావలెను. ఆ తీవ్రప్రయత్నమే యుత్సాహము" వీరు శాంతము ప్రత్యేకముగాలేదని దయావీరములోనే యంతర్భవింపఁజేసిరి దీని నానందవర్ధనుఁ డిట్లు ఖండించెను

"న తస్య వీరేఽన్తర్భావః కర్తుం యుక్తః తస్య అభిమానమయత్వేన వ్యవస్థాపనాత్ అస్య చ అహంకారప్రశమైకరూపతయా స్థితేః తయోశ్చ ఏవంవిధవిశేషసద్భావేఽపి యద్యైక్యం పరికల్ప్యతే తద్వీరరౌద్రయోరపి తథా ప్రసంగః" (శాంతమును వీరమున నంతర్భవింపఁజేయరాదు వీరమభిమానమయము శాంత మహంకార ప్రశమైకరూపము ఇట్టి భేదమున్నను వీనిరెంటికిని నైక్యము గల్పించినచో వీరరౌద్రములకుఁ గూడ నైక్యమును గల్పింపవచ్చును

కొందఱు శాంతమునకు జుగుప్సను స్థాయిభావముగాఁ దెలిపిరి (జుగుప్సేతి కేచిత్) బీభత్సరసము క్షోభణము శుద్ధము ఉద్వేగి అని మువ్విధములనియు నందు శుద్ధబీభత్సము మోక్షసాధనమనియుఁ దెలిపిరి "బీభత్సస్తావత్ విభావవిశేషాత్ యత్రతు సంసారనాట్యనాయకరాగప్రతిపక్షతయా మోక్షసాధనత్వాత్ శుద్ధః") దశరూపకావలోకమందుఁ గూడ "అన్యేతు వీరబీభత్సాదౌ అంతర్భావం వర్ణయంతి" (ఇతరులీ శాంతమును వీరబీభత్సాదులలో నంతర్భవింపఁజేయుదురు) అని చెప్పఁబడియున్నది దీనికభినవగుప్తుఁడు "జుగుప్స శాంతమునకు వ్యభిచారియగును; కాని స్థాయిభావము గానేర" దని యిట్లు నుడివెను "కేవలం యథావిప్రలంభే ఔత్సుక్యం సంభోగేఽపి వా ప్రేమ అసమాప్తోత్సవం యథా చ రౌద్రే ఔగ్ర్యం యథాచ కరుణ వీర, భయానకాద్భుతేషు నిర్వేద ధృతి త్రాసహర్షాః వ్యభిచారిణోఽపి ప్రాధాన్యేన అవభాసంతే తథా శాంతే జుగుప్సాద్యాః సర్వథైవ రాగప్రతిపక్షత్వాత్ "

కొందఱు "ఆత్మరతి", శాంతస్థాయిభావముగాఁ బలికిరి (తత్రఅనాహతానందమయస్యాత్మవిషయా రతిరేవ మోక్షసాధనమితి సైవ శాంతే స్థాయినీతి) తదనుకూలముగా భగవద్గీతలోని

'యస్త్వాత్మరతి రేవ స్యాదాత్మతృప్తశ్చ మానవః
ఆత్మన్యేవ చ సంతుష్టస్తస్య కార్యం న విద్యతే

(ఎవఁ డాత్మరతుఁడును ఆత్మతృప్తుఁడును ఆత్మసంతుష్టుఁడునో వానికిఁకఁ గర్తవ్యము లేదు) అను శ్లోకము నుదాహరింతురు. అభినవగుప్తుఁడు దీనిని జుగుప్సవలెనే శాంతమునకు వ్యభిచారిగానే పరిగణించెను.

కొందఱు రత్యాదులగు నెనిమిదిస్థాయిభావములలో నేదే నొకటి శాంతమునకు స్థాయిగా నుండవచ్చుననిరి. (అన్యే మన్యంతే రత్యాదయ ఏవ అష్టౌ చిత్తవృత్తివిశేషా ఉక్తాః త ఏవ కథితవిభావవివిక్తతయా శ్రుతాద్యలౌకిక విభావవిశేషసంశ్రయాః విచిత్రా ఏవ తావత్ తతశ్చ తన్మధ్యాదేవ అన్యతమోఽత్రస్థాయీ) అభినవగుప్తుఁడీ వాదమునిట్లు విస్పష్టపఱచెను "సమస్త విషయజాతము వికృతరూపముగాఁ దలఁచి హసించుచు, విశ్వమంతయును శోచ్యముగాఁ దలఁచి దుఃఖించుచు సాంసారికమైన వృత్తమంతయుఁ దనకపకారిగాలేక శత్రువుగానెంచి క్రోధముఁ గన్పఱచుచు విషయవ్యామోహ దూరీకరణ రూపమగు వీర్యము నవలంబించుచు సర్వవిషయ సమూహమునుండి భయపడుచు సర్వలోకరమణీయాకారములుగల ప్రమదాదులఁగాంచి యసహ్యించుకొనుచు, అపూర్వమైన జ్ఞానలాభమునఁ దన్నుఁదూర్చి తాను విస్మయపడుచు నుండెడివానికి మోక్షసిద్ధి యగను. కానఁ గ్రమముగా హాస శోక, క్రోధ, ఉత్సాహ, భయ, జుగుప్సా విస్మయములు శాంతమునకు స్థాయి భావములుగా నుండవచ్చును." అతఁడే యావాదము నిట్లు ఖండించెను. "స్థాయిభేదమును బట్టి రసభేదమేర్పడును. ఒకేరసమునకుఁ బెక్కుస్థాయిభావములుంట రససిద్ధాంతమునకు విరుద్ధము. ఇవన్నియుఁ గలిసియే స్థాయిభావము కాఁగూడదాః అన్నచో నదయు నసంభవమే. ఇవన్నియుఁ జిత్తవృత్తి విశేషములు గదాః ఇన్ని చిత్తవృత్తు లేకకాలమున నెట్లుత్పన్నము లగును? మఱియు నివి పరస్పర విరుద్ధములుగాఁ గూడ నున్నవికదాః కాన నివ్వన్నియుఁ గలిసి కాని ప్రత్యేకముగాఁగాని శాంతమునకు స్థాయిభావములు గాఁజాలవు ఇవన్నియు శాంతరసమునకు వ్యభిచారిభావములేయగును. (తత్త్వజ్ఞానలక్షణస్యచ స్థాయినస్సమస్తోఽయం లౌకికాలౌకికచిత్తవృత్తికలాపో వ్యభిచారితామభ్యేతి) రసమొక్క స్థాయిభావమువలననే యేర్పడును. పెక్కుభావములు గనఁబడిన నవి వ్యభిచారి భావములే యగును

అయితే యిట స్థాయి యేమి? అను ప్రశ్నకు నభినవగుప్తుఁడు తత్త్వజ్ఞానమె స్థాయిభావ మని చెప్పుచున్నాఁడు (ఇహ తత్త్వజ్ఞానమేవ తావన్మోక్షసాధన మితి తస్యైవ మోక్షే స్థాయితా యుక్తా తత్త్వజ్ఞానంచ నామ ఆత్మజ్ఞానమేవ తేన ఆత్మైవ జ్ఞానానందాదివిశుద్ధధర్మయోగీ పరికల్పితవిషయోపభోగరహితోఽత్ర స్థాయీ") (జ్ఞానానందాదివిశుద్ధధర్మములు గలిగివిషయోపభోగశూన్యమైన యాత్మయే స్థాయియని సారాంశము) [illegible]మితరస్థాయిభావముల వంటిదిగాదు ఇది స్థాయితమము, [illegible] న్నింటికిని నిది మూలభూతము. ఏలన, శాంతరసము ప్రకృతి రసము [illegible]నవి వికృతి రసములు.

AC No. 37467

"భావా వికారా రత్యాద్యా శ్శాంతస్తు ప్రకృతిర్మతః
వికారః ప్రకృతేర్జాతః పునస్తత్రైవ లీయతే
స్వంస్వం నిమిత్తమాసాద్య శాంతాద్భావః ప్రవర్తతే
పునర్నిమిత్తాపాయే తు శాంత ఏవ ప్రలీయతే

శాంతము ప్రకృతిరసము రత్యాదిభావములు వికృతులు ప్రకృతివలనఁ బుట్టిన వికృతి ప్రకృతియందే లీనమగును ఆయానిమిత్తమునుబట్టి శాంతము నుండి రత్యాదులు ప్రవర్తిల్లును ఆ నిమిత్త మడఁగఁగానే శాంతమే నిలుచును కావున శాంతము భిత్తివంటిది. రత్యాదులు వానిపై వ్రాయఁబడిన చిత్తరువుల వంటివి భిత్తి స్థిరమైనది చిత్తరువులస్థిరములు ఒక చిత్తరువు జెఱిపి మఱొక చిత్తరువును వ్రాయుచున్నను భిత్తి యేకరూపముగా నిలుచును. కావున శాంతరసమునుండియే నిమిత్తమును బట్టి యితరరసములు వెడలును. నిమిత్త మడఁగఁగానే మఱల శాంతమే నిలుచును మఱియు

"శమార్థం సర్వశాస్త్రాణి నిర్మితాని మనీషిభిః
తస్మాత్స సర్వశాస్త్రజ్ఞః యస్య శాంతం మనస్సదా

(ఎల్లశాస్త్రములను శమముకొఱకే పండితులు నిర్మించిరి కావున నెవని మనస్సు శాంతముగానుండునో వాఁడు సర్వశాస్త్రజ్ఞుడు) అని చెప్పఁబడుటచే శాంతరసము ప్రధానమని తేటపడుచున్నది. దీనికి రత్యాదులన్నియును వ్యభిచారులగును ఈ శాంతమునకు స్థాయిభావము తత్త్వజ్ఞానము లేక యాత్మ జ్ఞానములేక జ్ఞానానందాది ధర్మోపేతమై విషయోపభోగరహితమైన యాత్మయే రత్యాదులన్నియు శాంతమునకు వ్యభిచారులగునట్లే శాంతరసముయొక్క యాత్మ రూపస్థాయిభావమే యితరరసములకును వ్యభిచారి కాఁజాలదు భరతుఁడు వికృతిరసములనే పేర్కొనఁదలచెను ఇది యన్నింటికన్న నుత్కృష్టమగుట చేతను మూలభూతమగుటచేతను ప్రకృతి యగుటచేతను నుక్తప్రాయముగాఁ దలఁచి ఋజుమార్గమున రససంఖ్యాపరిగణమునఁ బేర్కొనఁడయ్యె కాని యభినవగుప్తునికన్నఁగూడఁ బ్రాక్తనములగు నాట్యశాస్త్ర గ్రంథములందుఁ బ్రథమమున శాంతరస ప్రస్తావమే కలదనియుఁ బిమ్మటనే మిగిలిన శృంగారాది రసప్రసంగము గలదనియు నేలాకో యిప్పటి గ్రంథములలో నీ ప్రశంస గానవచ్చుటలేదనియు నభినవగుప్తుని యీ కింది వ్రాఁతవలన నవగతమగు చున్నది (తథా చ చిరంతనపుస్తకేషు స్థాయిభావాన్ రసత్వముపనేష్యామః ఇత్యనంతరం శాంతో నామ, శమస్థాయిభావాత్మకః ఇత్యాదిలక్షణం పఠ్యతే) ఇప్పటి నాట్యశాస్త్రగ్రంథమునందే కాక యభినవగుప్తుని కాలమందున్న నాట్యశాస్త్ర గ్రంథములలోఁ గూడ శాంతరసప్రసంగము లేదు, కాని యాతని కాలమునకుఁ

పూర్వమందున్న యతిప్రాచీనగ్రంథములలో మొట్టమొదటనే శాంతరస ప్రస్తావమున్నట్లు విశదమగుచున్నది ఈ శాంతరస స్థాయియగు శమము స్థాయితమమగుటచేతను శాంతరసము ప్రకృతిరసమగుటచేతను రత్యాదులన్నింటికి నిదియే మూలభూత మగుటచేతను ప్రప్రథమమున నిదియే చర్చింపఁబడినదఁట

నాట్యశాస్త్రములో శాంతరసప్రస్తావము లేదనువారు భరతుఁడు వికృతిరసములనే పేర్కొనఁదలఁచెనని సమాధానింతురు ఆ ప్రశంసగలవను మతమున విప్రతిపత్తియే లేదు

ఆత్మయే స్థాయిభావముగా నభినవగుప్తుఁడు పేర్కొన్నను "శాంతో నామ శమస్థాయిభావాత్మకః" అని శమమే స్థాయిభావమనుపాఠము చిరంతన నాట్యశాస్త్రగ్రంథములలో నున్నట్లతనిచేతనే యుదాహరింపఁబడుటచే స్థాయిభావభేదము గన్నట్టుచున్నదని సంశయింపవచ్చును మఱియు మొదట దెలిపిన విధమున శమమే స్థాయిభావమగునో యం భావము లగునను నాక్షేపము మఱల వచ్చుచున్నది గదా ! అన్నచో నట్లుగాదు శమము నిర్వేదము అనునది యాత్మస్వభావము ఇది వికృతిగాదు ఆత్మయొక్క ప్రకృతిధర్మమే కాన నాత్మయే స్థాయియన్నచో శమ మంతర్గతమే యగుచున్నదిగదా! కాన శమస్థాయికమన్నను దోషములేదు

శాంతరస పధానములగు దృశ్యశ్రవ్య కావ్యములున్నవా ? యనుసందేహమక్కఱలేదు మహాభారతము సౌందరనందకావ్యము బుద్ధచరిత్రము మొదలయిన శ్రవ్యకావ్యములును భర్తృహరి నిర్వేదము ప్రబోధచంద్రోదయము మొదలయిన దృశ్యకావ్యములును రమారమి యేఁబది శాంతరసప్రధానములు గలవు

మఱియు రాజతరంగిణీ వచనము కలదు.

క్షణభంగిని జంతూనాం స్ఫురితే పరిచింతితే
మూర్ధాభిషేకః శాంతస్య రసస్యాత్ర విచార్యతాం
తదమందరసస్యంద సుందరేయం నిపీయతాం
శ్రోత్రశుక్తి పుటైః స్పష్టమంగ ! రాజతరంగిణీ.

జంతువుల క్షణభంగురమైన జీవితమును బరిశీలింపఁగా శాంతరసమే రససార్వభౌమమని తేలుచున్నది ఆ శాంతరసము జాలువాఱు రాజతరంగిణిని శ్రోత్రాంజలులతో ద్రావుము " దీనిచే శాంతరసము రససార్వభౌమ మని తేలినది.

అసలు శాంతరసమే ప్రధానరసమని యానందవర్ధనాభినవగుప్తుల సిద్ధాంతమయినట్లు కొందఱి వ్రాఁతలవలన స్ఫుటమగుచున్నది మఱియు నభినవగుప్తుని

గురువగు భట్టతౌతుఁడు గూడ నిదే యభిప్రాయమును దెలిపినట్లు కాణేపండి తుఁడు తన Introduction to Sahityadarpana లో వ్రాసెను.

We know that Bhattatouta was the Guru of Abhinava Guptha and that he wrote a work called కావ్యకౌతుక on which అభినవ గుప్త wrote a *Vivarana*. One of his doctrines was that *Santa* was at the head of all Rasas as it led on to Moksha.

ప్రేయోరసము

రుద్రటుఁడు 'దశమో రసః ప్రేయాన్' (ప్రేయోరసము పదవది) అని చెప్పి "స్నేహప్రకృతిః ప్రేయాన్' అని దానికి స్నేహము స్థాయిభావముగాఁ జేర్కొనెను మఱియు "అన్యోన్యం ప్రతి సుహృదోర్వ్యవహారోఽయం మత స్తత్ర" స్నేహితుల పరస్పరవ్యవహారమే ప్రేయోరసము అని నుడివెను. ఇంతేకాక రసములు పదియే కాదు ; నిర్వేదాదులు గూడ శృంగారాదులవలనఁ బరిపుష్టములయిన యెడల రసత్వమును బొందును.

రసనాద్రసత్వమేతేషాం మధురాదీనామివోక్తమాచార్యైః
నిర్వేదాదిష్వపి తన్నికామమస్తీతి తేఽపి రసాః

"రస్యమానత్వరూపధర్మమును బురస్కరించుకొని శృంగారాదులకు రసత్వమును నాచార్యులు దెలిపిరి ఆ రస్యమానత్వము నిర్వేదాదులందును గలదు. కావున నివియు రసములే" అని యాతని వాదము. ఈ వాదమును బ్రప్రథమమున భట్టలోల్లటుఁడే లేవఁదీసెను అతఁడు రసములనంతములనియు, లోక పసిద్ధిననుసరించి భరతుఁడు గొన్నింటినే రసములని యుదాహరించెననియు నుడివెను రుద్రటుఁ డా సిద్ధాంతమును బలపఱచెను వ్యభిచారిభావములు గూడ విభావాదిసంయోగమున రసములగునవి నిష్కృష్టార్థము అభినవగుప్తు డీ సిద్ధాంతము నంగీకరింపలేదు.

వత్సలరసము

భరతుఁడు "హాస్యశృంగారయో స్స్వరితోదాత్తైః వీర రౌద్రాద్భుతేషు ఉదాత్తకంపితైః కరుణవాత్సల్యభయానకేషు అనుదాత్తస్వరితకంపితైః వర్ణైః పాఠ్యముపపాదయతి" అని యా యా రసములందు వర్ణముల నెట్లుచ్చరింపవలయునో చెప్పుచు వాత్సల్యమును బేర్కొనెను దీని నెనిమిది రసములలోఁ జెప్పలేదు ఇటనే యీ పదమును వాడెను. దీనినిఁ జూచియే సాహిత్యదర్పణకారుఁడు "అథ మునీంద్రసమ్మతో వత్సలో రసః" అని యారంభించి

స్ఫుటం చమత్కారితయా వత్సలంచ రసం విదుః
స్థాయీ వత్సలతా స్నేహః, పుత్రాద్యాలంబనం మతం
ఉద్దీపనాని తచ్చేష్టావిద్యాశౌర్యదయాదయః
ఆలింగనాఙ్గసంస్పర్శశిరశ్చుంబనమీక్షణం
పులకానందబాష్పాద్యా అనుభావాః ప్రకీర్తితాః
సంచారిణోఽనిష్టశంకాహర్షగర్వాదయో మతాః.

మిక్కిలి చమత్కారిగా నుంటఁబట్టి వత్సలమును గూడ రసముగాఁ దలంతుము దీనిస్థాయి వాత్సల్యము అనఁగా స్నేహము దీనికిఁ బుత్రభ్రాత్రాదు లాలంబనము. వారి చేష్టలను విద్యా శౌర్యదయాదులును నుద్దీపనములు ఆలింగనము, గాత్రసంస్పర్శము శిరశ్చుంబనము ఈక్షణము పులకలు ఆనంద బాష్పములు మొదలగునవి యనుభావములు అనిష్టశంక హర్షము, గర్వము మొదలగునవి వ్యభిచారిభావములు

భ్రాత్రాలంబనము గల వత్సలమున కుదాహరణము
దేశే దేశే కళత్రాణి దేశే దేశే చ బాంధవాః
తం తు దేశం న పశ్యామి యత్ర భ్రాతా సహోదరః

"దేశదేశమునందును గళత్రములు సంభవింతురు, దేశదేశమునను బంధువులు కానవత్తురు కాని తోఁబుట్టువుగల దేశము గానరాదు." ఇది శ్రీరాముని వచనము పుత్రాలంబనము గల వత్సలరసము నూహించుకొనవలెను

జగన్నాథుఁ డీ వత్సలరసమును ముందు చెప్పఁబోవు భక్తిరసమును రసములు గావనియు భావములే యనియు నుడివెను (ఏతేన వాత్సల్యాఖ్యం పుత్రాద్యాలంబనం రసాంతర మితి పరాస్తం)

మఱియుఁ గొందఱు మృగయా అక్షక్రీడా, ప్రీతి శ్రద్ధలును, ఆర్ద్రతా స్థాయికమగు స్నేహమును గర్ధస్థాయికమగు లౌల్యమును ఆసక్తిస్థాయికమగు వ్యసనమును, అరతిస్థాయికమగు దుఃఖమును సంతోషస్థాయికమగు సుఖమును, మతిస్థాయికమగు నుదాత్తమును గర్వస్థాయికమగు నుద్ధతమును స్పృహాస్థాయిక మగు కార్పణ్యమును రసములుగా గణించిరి మొదటి నాల్గింటికిని స్థాయి భావము లెవ్వియో వారు తెలుపరైరి. అభినవగుప్తుఁ డివియన్నియును రసములు గావనియు భావములే యనియుఁ దెలిపెను. అతఁడు రసభావముల కిట్లు భేదము నిరూపించెను

"రసములు సహృదయ హృదయావర్జకములు. పురుషార్థోపయోగులు రంజనాధిక్యము గలవి 'భావములట్లుగావు మఱియు రసమనఁగా నేమి? యని భరతుఁడు శంకించి "యేతి యాస్వాద్యమో యది రసము" అని నిర్వచించెను

రుద్రటుఁడు "నిర్వేదాదులందును నాస్వాద్యత్వమున్నది కాన నవియు రసములే" యనెను భరతుఁడు సహృదయహృదయావర్జకములగుటచే నెనిమిదో తొమ్మిదో మాత్రమే రసములని తెలిపెను అంతేకాని భరతుఁడు నిర్వేదాదు లన్నియును రసములని సిద్ధాంత మొనర్పలేదు అభినవగుప్తుఁడు రత్యాదులగు స్థాయిభావములును విభావానుభావసంచారిభావములచేఁ బరిపుష్టములై శృంగారాది రసస్వరూపమును బొందునట్లు నిర్వేదాది వ్యభిచారిభావములు పొందఁజాలవనియుఁ గావున రసలక్షణమగు నాస్వాద్యత్వము శృంగారాదు లందువలె నిర్వేదాదులందు లేదనియు దానినిఁబట్టి నిర్వేదాదులందుఁ బురుషార్థోపయోగియగు రంజనాధిక్యము లేమిని నవి రసములు గావనియు భావములే యనియును సిద్ధాంత మొనర్చెను

భక్తిరసము

పూర్వాచార్యులు భక్తి రసము గాదనియు "రతిర్దేవాదివిషయా వ్యభిచారీ తథాంజితః భావః ప్రోక్తః" అని యుంటచే దేవతావిషయకమగు రతి భావము గాన భక్తి భావమే యని వ్యవహరించిరి

భక్తిరసముగాదను సిద్ధాంతమును బ్రతిపాదించిన ప్రథముఁడు దశమ శతాబ్దివాఁడగు ధనంజయుఁడు ఆతని యాశయమిది —

ప్రీతిభక్త్యాదయోభావా మృగయాక్షాదయో రసాః
హర్షోత్సాహాదిషు స్పష్ట మంతర్భావాన్న కీర్తితాః

ప్రీతిభక్త్యాదులగు భావములును మృగయ అక్షక్రీడ మొదలగునవియు హర్షోత్సాహాదులలోనే యంతర్భవించును కాన వానినిఁ బ్రత్యేకించి తెలుప మైతిమి దీని యభిప్రాయమిది —విభావానుభావ వ్యభిచారిభావములచే వ్యక్తము చేయఁబడిన స్థాయిభావమే రసమనును కాని యన్యముగాదు అను మునివచ నము ననుసరించి స్థాయిభావమునకే రసత్వము కాంతావిషయకమగు రతి స్థాయిభావములనోఁ బరిగణింపఁబడినది కాని పరమేశ్వరవిషయకమగు రతి పరిగణింపఁబడలేదు కావున నీ పరమేశ్వరవిషయకరతి హర్షోత్సాహాది వ్యభి చారిభావములలోఁ బరిగణింపఁబడుటవలన నిది రసత్వమును బొందదు ఇట్లే హేమచంద్రుఁడును నిరాకరించెను. మమ్మటుఁడు రసముగాదనియు భావమే యనియు దెలిపెను జగన్నాథుఁడు మొట్టమొదట భక్తికి విభావానుభావ వ్యభి చారి సామగ్రిని నిర్దేశించి రసత్వమును బ్రతిపాదింప ననుకూలమగు వాదమును లేవనెత్తి తుట్టతుదకుఁ గ్రిందికిఁ ద్రోసెను ఎట్లన—

అథ కథమేత ఏవ రసాః ? భగవదాలంబనస్య రోమాంచాశ్రుపాతాదిభి రనుభావితస్య హర్షాదిభిః పరిపోషితస్య భాగవతాదిపురాణ శ్రవణసమయే భగవద్భక్తై రనుభూయమానస్య దురపహ్నవత్వాత్ భగవదనురాగరూపా భక్తి

శ్చాత్ర స్థాయిభావః న చాసౌ శాంతరసేఽంతర్భావ మర్హతి అనురాగస్య వైరాగ్యవిరుద్ధత్వాత్ ఉచ్యతే భక్తిర్దేవాది విషయరతిత్వేన భావాంతర్గతతయా రసత్వానుపపత్తేః

రతిర్దేవాదివిషయా వ్యభిచారీ తథాంజితః
భావః ప్రోక్తస్తదాభాసా హ్యనౌచిత్య ప్రవర్తితాః

ఇతి హి ప్రాచాం సిద్ధాంతాత్ న తర్హి కామినీవిషయాయా అపి రతే ర్భావత్వమస్తు రతిత్వాఽవిశేషాత్ అస్తు నామ భగవద్భక్తే రేవ స్థాయిత్వం కామిన్యాదిరతీనాం చ భావత్వం వినిగమకాభావాత్ ఇతి వాచ్యం భరతముని వచనానా మేవ అత్ర రసభావా' వ్యవస్థాపకత్వేన స్వాతంత్ర్యా యోగాత్" (ఇవియే రసములని యేల యనవలెను ? భగవంతుఁ డాలంబన విభావముగా, రోమాంచాశ్రుపాతాదు లను భావములుగా హర్షాదులు వ్యభిచారులుగాఁగలిగి భాగవతాదిపురాణశ్రవణసమయమున ననుభవింపఁబడు భక్తి రసమేల కాదు ? ఇట భగవదనురాగరూపమగు రతి యే స్థాయిభావము. దీనిని శాంతరసమున సంతర్భవింపఁజేయరాదు. ఏలన భక్తిరసమునకు స్థాయిభావ మనురాగరూపమగు రతి, శాంతరసమునకు స్థాయిభావము వైరాగ్యము ఇవి పరస్పర విరుద్ధములు భక్తి దేవతావిషయకమగు రతి యగుట రసము గాదనియు భావమనియుఁ జెప్పఁబడు చున్నది "దేవతావిషయకమగు రతియు వ్యభిచారులును భావమని చెప్పఁబడును" అని ప్రాచీన సిద్ధాంతము అట్లగుచోఁ గామినీవిషయకమగు రతియు భగవద్విషయకమగు రతియు రతియేకావున భగవద్విషయకమగురతి భావమగుచోఁ గామినీ విషయకమగు రతియు భావమే యగుఁగాక ఇది మాత్రమేల రసమని వ్యవహరింపఁబడవలెను ? స్థాయిభావములలో నున్న రతి దేవతా విషయకరతియే యని యేలయనరాదు ? కామినీ విషయకమగు రతియే యని యేల యనవలెను ? అని యనరాదు ? ఏది రసమో ? ఏది భావమో ? వీని వ్యవస్థావిషయమున భరతముని వచనమే ప్రమాణము)

రమారమి యెల్ల సాహిత్య శాస్త్రకారులకును భక్తి రసము గాదనియు భావమే యను సిద్ధాంతమున నైకమత్యమే కలదు కాని సాహిత్యశాస్త్రకారులలో నిరువురు మాత్రమే భక్తికి రసత్వము నంగీకరించి సవిస్తరముగాఁ ప్రతిపాదించిరి వారిలోఁ బ్రథముఁడు "ఉజ్జ్వలనీలమణి" కర్తయగు వంగదేశీయుఁడు రూపగోస్వామి ద్వితీయుఁడు పరివ్రాజకాచార్యుఁడైన మధుసూదన సరస్వతి రూపగోస్వామి "పృథగేవ భక్తిరసరాట్ సవిస్తరోఽత్రోచ్యతే మధురః" అని ప్రతిజ్ఞసేసి మధురము ఉజ్జ్వలము నను పేరితో భక్తిరసమును విస్తరించి తెలిపెను కాని యీ భక్తి శ్రీకృష్ణగోపీ విషయకము ; శృంగారరూపము. దీనికిఁ జిత్తద్రవము స్థాయిభావము ఇతర శృంగార ముపాదేయముగాదు కాని శ్రీకృష్ణ

గోపీవిషయకమగు రతి యుపాదేయమనియు నది భక్తిరసమనియు నాతని మతము ఇది నిజముగా భక్తిగాదు భక్తిలో నేకదేశము కాని "మదుసూదన సరస్వతి" తన హరిభక్తిరసాయనమను గ్రంథమునఁ బ్రతిపాదించిన భక్తి సంపూర్ణమైనది. ఉదాత్తము అతఁడు ప్రమాణ ప్రమేయోపన్యాసపూర్వకముగా, భక్తికి రసత్వమును స్థాపించెను ఎట్లన

"శోకక్రోధభయాదీనాం సాక్షాత్సుఖవిరోధినాం
రసత్వమభ్యుపగతం తథాఽనుభవమాత్రతః
ఇహానుభవసిద్ధేఽపి సహస్రగుణితో రసః
జడేనైవ త్వయా కస్మా దకస్మా దపలప్యతే?
రతిర్దేవాదివిషయా వ్యభిచారీ తథాంజితః
భావః ప్రోక్తో రసో నేతి యదుక్తం రసకోవిదైః.
దేవాంతరేషు జీవత్వా త్పరానందాఽప్రకాశనాత్
తద్యోజ్యం, పరమానందరూపే న పరమాత్మని"

అనుభవమాత్రమువలననే సాక్షాత్సుఖవిరుద్ధములయిన శోకక్రోధభయాదులకు రసత్వ మంగీకృతమైయున్నది. అనుభవసిద్ధమై మిగిలిన రసములకన్న వేయిరెట్లధికముగా రస్యమానమగుచున్న భక్తి రసము గాదనుటయెట్లు? రసకోవిదులు దేవాదివిషయకరతి రసము గాదనియు భావమనియును జెప్పిరి ఇతరదేవతా విషయకమగు రతి భావమే ఏలన వారు జీవులే యగుటచేఁ బరమానందము గలుగదు. పరమాత్మస్వరూప శ్రీకృష్ణరతి పరమానందమునకుఁగొంపోవును మఱియు

కాంతాదివిషయా వా యే రసాద్యాస్తత్ర నేదృశం
రసత్వం పుష్యతే పూర్ణసుఖాస్పర్శిత్వకారణాత్
పరిపూర్ణరసా క్షుద్రరసేభ్యో భగవద్రతిః
ఖద్యోతేభ్య ఇవాదిత్యప్రభేవ బలవత్తరా.

"కాంతాదివిషయకములగు నేరసములందును భగవద్రతియందువలెఁ బూర్ణసుఖము లేక యానందము గలుగదు కాన వానియందుఁ దగిన రసపుష్టి లేదు అవి క్షుద్రరసములు భగవద్రతి పూర్ణరసము మిడుఁగురుపుర్వులకన్న సూర్యకాంతి యెట్లు బలవత్తరమో యట్లే మిగిలిన రసములకన్న నది శ్రేష్ఠతరము బలవత్తరము" అనియును వచించెను ఈ భక్తిరసమునకు నాలంబన విభావము భగవంతుఁడు, తచ్చరిత్రలుద్దీపన విభావములు భగవదాకారచిత్తవృత్తియే స్థాయిభావము, అదియే భగవద్రతి అనుభావములు తత్కాలమునఁబుట్టిన నేత్రాది వికారములు వ్యభిచారులు నిర్వేదశంకాహర్షాదులు ఇది పరమానందస్వరూపమగు భక్తి రసముగాఁ బరిణమించును

మాయారసము

దీనిని రసతరంగిణీ గ్రంథకర్తయగు భానుదత్తుఁడు లేవఁదీసెను. ఎట్లనఁ "జిత్తవృత్తి ప్రవృత్తిరూపమనియు నివృత్తిరూపమనియు ద్వివిధము నివృత్తి యందు శాంతరసము గ్రహింపఁబడిన విధమునఁ బ్రవృత్తియందు మాయారస మంగీకరింపవలెను. రతి హాస శోక, క్రోధ ఉత్సాహ, భయ జుగుప్స, విస్మయములీ ప్రవృత్తియందే మెఱపులవలెఁ బుట్టును అడఁగును. కాన నివ్వి న్నియు మాయారసమునకు వ్యభిచారిభావములు ఈ మాయారసమునకు స్థాయి భావము మిథ్యాజ్ఞానము. సాంసారికభోగము నార్జించు ధర్మాధర్మములు విభావ ములు పుత్త్ర కళత్ర విజయ సామ్రాజ్యాదు లనుభావములు' ఈ మత మును మందారమరందచంపువుగూడ బలపఱచెను.

ఈ మతమును గావ్యవిలాస కర్త యగు చిరంజీవి భట్టాచార్యుఁ డిట్లు ఖండించెను :—

"మాయ యనాది యగుటవలన నది యొకదానివలనఁబుట్టదు కాన రసముగాదు రసములు జన్యములు. మాయయే మిథ్యాజ్ఞానమునకుఁ గారణ మగును. కానీ మిథ్యాజ్ఞానము మాయకుఁ గారణ మెట్లగును? శాస్త్రవిరుద్ధము గదా! మఱియు నాలంకారికమతమున రసము నిత్యము ఆనందరూపము కావున బ్రహ్మస్వరూపము అట్లగుచో మాయకు రసత్వ మెట్లు గలుగును? మాయ తుచ్ఛ వినాశశాలిని. బ్రహ్మకన్న భిన్నము కావుననే ప్రాచీనులు తొమ్మిదే రసములని సిద్ధాంతీకరించిరి."

శృంగారరసము

భోజుఁడు "శృంగార ఏవ ఏకో రసః" (శృంగార మొక్కటే రసము) అని సిద్ధాంతించెను మఱియు నీ శృంగారమునకు అభిమానరసము, అహంకార రసము అనియు నాతని మతమున నామాంతరములు. శాంత మొక్కటియే యహంకార ప్రశమరూపము. మిగిలిన రసములన్నియు నహంకారరూపములే. ఒక శృంగారమునే యాతఁ డంగీకరించుటచే నది యహంకారరసమని చెప్పెను.

శృంగార వీర కరుణాద్భుత రౌద్ర హాస్య
బీభత్సవత్సల భయానక శాంత నామ్నః
ఆమ్నాసిషుర్దశ రసాన్ సుధియో ; వయంతు
శృంగారమేవ రసనా ద్రసమామనామః

పండితులు శృంగారాదిశాంతాంతములగు పది రసములను జెప్పినారు. మే మొక్క శృంగారమే రసమని సిద్ధాంత మొనర్తుము.

వీరాద్భుతాదిషు చ యేహ రస ప్రసిద్ధిః
సిద్ధా కుతోఽపి వటయక్షవదావిభాతి
లోకే గతానుగతికత్వవశాదుపేతా
మేతాం నివర్తయితు మేష పరిశ్రమో నః

వటయక్షన్యాయానుసారముగా వీరాద్భుతాదులందు రసప్రసిద్ధి గలదు. దానిని నివారించుటకే మా యత్నము అనియును నతఁడు దెలిపెను ఈయన సిద్ధాంతమిది - పండితు లెనిమిది స్థాయిభావములను ఎనిమిది సాత్త్వికభావములను, ముప్పదిమూఁడు వ్యభిచారిభావములను వేర్కొనిరి ఈ నామకగణ మయుక్తము ఇవన్నియును భావములే అవస్థావశమున నొక్కొక్కటి యొకానొకప్పుడు స్థాయియు మఱొకపుడు వ్యభిచారియు, నింకొకపుడు సాత్త్వికమును నగును ఇవన్నియు మనస్సునఁ బుట్టినవే కావున భావములే "భవంతి మనసీతి భావాః" అని వ్యుత్పత్తి స్థాయ్యాదిభేదమనుచితము విభావానుభావవ్యభిచారిసంయోగమువలన స్థాయిభావము (రత్యాదులు) రసత్వమును బొందుననుటయుఁ జింత్యము హర్షాది వ్యభిచారులును విభావాద సంయోగమువలన రసత్వమును బొందును కావున నెల్లభావములకును రసత్వము కలుగుచుండఁగాఁ బరప్రకర్షను బొందు రత్యాదులకు శృంగారాదివ్యపదేశ మనుపపన్నము ఆ హర్షాదివ్యభిచారులే కాదు ఆనందము, స్వాతంత్ర్యము, శ్రమము పారవశ్యము సాధ్వసము అనురాగము సంగమము మొదలగున వన్నియును రసములు గావచ్చును కావున రత్యాదులే రసములగును మిగిలినవి కావు అని చెప్పఁదగదు రత్యాదులన్నియును భావములే, శృంగారమే రసము అది రత్యాదులచేఁ బ్రకాశించుచు విశేషముగా నాస్వాదింపఁబడును

కొందఱు "రతిప్రభవః శృంగారః" (రతివలన శృంగారము పుట్టును) అని చెప్పుదురు కానీ యీశృంగారమే రత్యాదులకు జన్మకారణమని చెప్పుదుము శృంగారికే రత్యాదుల గలుగును కాని యశృంగారికిగాదు శృంగారి యగు నతఁడు రమించును, విస్మయపడును ఉత్సహించును ఇవి (రతి విస్మయ ఉత్సాహములు) భావ్యమానములు గాన భావము లనఁబడును. అంతే కాని యివి రసములుగావు రసభావములకు భేద మిది :—

సాధ్యమైనంతవఱకు భావనచే (పునఃపునరనుసంధానము) భావ్యమాన మగునది భావము భావనాపథమునతిక్రమించునది రసము అట్లగుట మనోఽనను కూలములయిన దుఃఖాదులందుఁ దనకుఁగల సుఖానుభవాభిమానమే రసము అది పరంపరాసుఖహేతువగుటవలన రత్యాదులందును రసపద మౌపచారికము. గాన రత్యాదులకు రసత్వములేదు భావనావిషయములగుటవలన భావత్వమే. కావున శృంగారమే రసము. శృంగార మనగా "శృంగారో హి నామ విశిష్ట

ఇష్ట దృష్ట చేష్టాభివ్యంజకానాం ఆత్మగుణసంపదాం ఉత్కర్ష బీజం బుద్ధి సుఖదుఃఖేచ్ఛాద్వేషప్రయత్న సంస్కారాద్యతిశయ హేతురాత్మనోఽహంకార విశేషః" తన యిచ్ఛావిషయమగు విశేషముతోఁ గూడిన చేష్టలచే నభివ్యక్తములును, చేష్టలను వ్యక్తీకరించునవియు నగు నాత్మగుణ సంపదలను (రత్యాదులను) ఇతర వ్యక్తియందు గ్రహించి స్వవిషయములుగా భావించుటవలనఁ దన రత్యాదులకు నతిశయము గలుగును మఱియు బుద్ధి సుఖదుఃఖాదులకును నతిశయము గలుగును ఈ యతిశయమునకు హేతుభూతమహంకారవిశేషము. ఆ యహంకారమే శృంగారము. దీనిని మఱికొంత వివరింతుము. లోకమున నొకానొక నాయికను గాంచినపుడే యొకానొక నాయకునకు రతిగలుగును అట్లే యొకానొక నాయకుని గాంచినపుడే యొకానొక నాయికకును రతి గలుగును. అట్లు గలుగుటకుఁ గారణమేమనఁ దమతమ రతికుద్బోధకములగు చేష్టలు వారియందుఁ గనఁబడుటయే అనఁగా నొకానొక విశేషముతోఁ గూడిన చేష్ట లోకనాయకుని రతికుద్బోధకములగును అపుడు నాయికానాయకులొండొరుల చేష్టలను స్వవిషయములుగా భావించుకొనుట వలనఁ దమతమ రత్యాదుల కతిశయము (ఉద్బోధము) గలుగును. మఱియును బుద్ధి సుఖ దుఃఖ ఇచ్ఛా, ద్వేష, ప్రయత్న, సంస్కారాదులకును నతిశయము (ఉద్బోధము) గలుగును ఈ యతిశయమునకు హేతుభూతమహంకారవిశేషము. ఈ యహంకారమే శృంగారము.

అది యనఁగా నా యహంకారవిశేషము మనస్సుచే రస్యమానమై రసమగును అహంకారమనఁగా లోకములో ననుకొన్నట్లు 'గర్వము' అని యర్థము గాదు 'నేను అను నొక యభిమానవిశేషము; అది గలవాఁడే రసికుఁడు. లేనివాఁడు నీరసుఁడు; ఆ రసావిర్భావములకు హేతువులు దాని నుండి పుట్టిన భావములే. అవి రతి హర్ష రోమాంచాదులు

ఈ శృంగారము ధర్మార్థకామమోక్షభేదములచేఁ జతుర్విధము. ఇది దృశ్యశ్రవ్యములయందు సామాజికులచే నాస్వాదింపఁబడును కానీ శ్రవ్యమునందు దృశ్యమునందువలెఁ బదార్థములు ప్రత్యక్షములు గామి నంతగా నాస్వాద్యమానముగాదు కావున దృశ్యకర్తలగు కవులనే బహుమానింతుము

అద్భుతరసము

ఈ రసమును స్థాపించినవాఁడు నారాయణుఁడు. ఇతఁడు సాహిత్యదర్పణ కర్తయగు విశ్వనాథునికిఁ బూర్వుఁడు అతని సిద్ధాంతమిది :—

సత్త్వగుణాధిక్యము వలన మనకు బాహ్యప్రపంచమును మఱపించు నొక యానందము గలుగును అది బ్రహ్మానంద సదృశము. దీనికి లోకోత్తర చమత్కారమే ప్రాణము. చమత్కార మనఁగా మనస్సు విస్తరించుటయే మనోవిస్తార

మనగాఁ విస్మయమే కదా కావున విస్మయమెల్ల రసములకును మూలకారణము కాఁబట్టి యద్భుతరసముననే మిగిలిన రసము లన్నియును నిమిడియున్నవి

కరుణ రసము

భవభూతి "ఏకో రసః కరుణ ఏవ నిమిత్తభేదాద్భిన్నః పృథక్పృథగి వాశ్రయతే వివర్తాన్ ఆవర్త బుద్బుదతరంగమయాన్ వికారాన్ అంభో యథా సలిలమేవ హి తత్సమస్తం (కరుణరస మొక్కటియే రసము. జలమావర్త బుద్బుదతరంగరూపములతోఁ గానఁబడునట్లు నిమిత్తభేదమువలన నా కరుణమే భిన్నభిన్నముగాఁ గానఁబడును) అని చెప్పినాఁడు అనఁగా లోకమంతయు శోకమయమే కానీ యిదియే నిమిత్తభేదముచే శృంగారాద్యన్యతమముగా గోచరించును. శృంగారాదులు తాత్కాలికములు అవి తుదికి శోకముగానే పరిణమించును. ఆవర్తాదులన్నియును జలరూపములే యయినట్లు శృంగారాదులన్నియుఁ గరుణరూపములే యని వాదము మఱియు రసమనుభవింపఁబడునపుడు చిత్తవిద్రుతి (మనస్సు కరఁగుట) కలుగును. అది ప్రధానముగా విశేషించి కరుణరసమునఁ గలుగును కావునఁ 'గరుణ మొక్కటియే రసము' అని సారాంశము

విశ్వనాథునికిఁ బూర్వుఁడగు నారాయణుఁడు రసానుభవకాలమునఁ జిత్తవిస్తారముగలుగు ననెను. భవభూతి చిత్తద్రుతిగలుగు ననెను భోజుఁడు చిత్తవికాసము గలుగుననెను ఈ భేదముచే వారు క్రమముగా నద్భుతమును గరుణమును శృంగారమును ప్రధానముగాఁ బేర్కొనిరి.

ఒకటే రసము

కవికర్ణపూరగోస్వామి యలంకారకౌస్తుభమున నిట్లు నుడివెను

ఆస్వాదాంకురకందోఽస్తి ధర్మః కశ్చన చేతసః
రజస్తమోభ్యాం హీనస్య శుద్ధ సత్త్వతయా సతః
స స్థాయీ కథ్యతే విజ్ఞైర్విభావస్య పృథక్తయా
పృథగ్విధత్వం యాత్యేవ సామాజికతయా సతాం

రజస్తమోగుణముల స్పర్శయులేని శుద్ధసత్త్వస్వరూపము గల మనస్సునకు ఆస్వాదాంకురకందము లేక యానందము అను ధర్మము గలదు. అదియే స్థాయి ఒక్కటే రస మనియు దానికానందము స్థాయిభావమనియు నతని

---

* ఉత్తరరామచరిత్ర వ్యాఖ్యాతయగు వీరరాఘవపండితు డిట్లు వ్రాసెను ఇద మత్ర కవేర్మతం —యద్యపి శృంగార ఏక ఏవ రస ఇతి శృంగార ప్రకాశకారాదిమతం తథాపి ప్రాచుర్యాత్ రాగివిరాగి సాధారణ్యాత్ కరుణ ఏక ఏవ రసః అన్యేతు తద్వికృతయ ఇతి

సిద్ధాంతము అట్లగుచో భిన్నభిన్నరసములు లేవా? ఉన్నచో వాని కన్నింటికిని, నొక్క యానందమే స్థాయి యెట్లగును? అను ప్రశ్న కతని సమాధానమిది.— స్ఫటికము జపాకుసుమాది నానాపదార్థముల సంయోగమువలన నొకతఱి నెఱ్ఱగా, నొకతూరి పచ్చగా నొకతూరి నల్లగా గనఁబడునట్టులొకటియే యగు స్థాయి యుత్సాహాదిపోషకములగు నానావిధ విభావాదుల సంయోగమువలన వీరమనియు, అద్భుతమనియుఁ గరుణమనియు, నీ విధముగా వివిధాకారమును దాల్చు చున్నది. మఱియు

రసస్యానంద ధర్మత్వా దైకధ్యం భావ ఏవ హి
ఉపాధిభేదాన్నా నాత్వం రత్యాదయ ఉపాధయః

ఘట శరావాది నానావిధ పాత్రములందుఁ బెక్కు ప్రతిబింబములు ప్రతి ఫలించినను సూర్యబింబ మొక్కటియే యైనవిధమున నుపాధిరూపములగు రత్యాదులందు భేదమేకాని యానందమున భేదములేదు. (కాన నొక్కటేరసము)

ఈ సిద్ధాంతము దుష్టముగాదు ఏలన నన్నిరసములవలనఁ గూఁడఁ గలుగు నానంద మొక్కటియే ఆనందములో భేదము లుండవు. కావ్యమున శృంగారము వలనఁ గలుగు నానందమును కరుణమువలనఁ గలుగు నానందమును నేకమే. విభావాదులభేదమును బట్టియే రసభేదము లేర్పడినవి

భోజుని సరస్వతీ కంఠాభరణమునకు నొక వ్యాఖ్యాతయగు భట్ట నరసింహుఁడు గూడ రసాస్వాద మొక్కటే యని చెప్పెను ఎట్లన

"అష్టావేవ స్థాయినః ఇతి కుతః ? తానతామేవ స్వాదాత్మకత్వాత్ ఇతిచేత్ కిమేతేష్వనుస్యూత ఏక ఏవ స్వాదాత్మా ? తర్హ్యనంతరమిదముక్తం "ఏతేషాం కూటస్థ ఏక ఏవ స్వాదాత్మా, ఏతే చ తద్విశేషా" ఇతి

ఎనిమిదే స్థాయిభావములని యేల చెప్పవచ్చును? అవియే స్వాద్యమానము లగు నంచుమేని వీనియందొక్క స్వాదమే యనుస్యూతముగాఁగలదా? అట్లేనిఁ జెప్పఁబడకయే వీనికిఁ గూటస్థమగు నొకటే స్వాదాత్మ గలదని చెప్పఁబడి నట్లయినది. ఈ రసము లన్నియును దద్విశేషములే, కావున నెల్లరసములకును స్వాదాత్మ యొక్కటే

ఈ మతము నభినవగుప్తుఁడు దెలుపలేదు కాని యిది యితని సిద్ధాంత మునకు విరుద్ధము గాదు

రస సమీకరణ (Synthesis) వాదము

మహామహోపాధ్యాయ S Kuppuswamy Sastry M A, I E S గారు ఆశ్చర్యచూడామణినాటకోపోద్ఘాతములో నీ రససమీకరణవాదముం

నిట్లు తెలిపిరి. రస సమీకరణ వాదమున నేదోయొక రసము ప్రకృతిరసమనియు మిగిలిన వన్నియు వికృతిరసము లనియుఁ దెలపు సిద్ధాంతము.

"In the course of the development of philosophy of Rasa" several attempts were nade in the direction of Synthesising the various Rasas The more important results of such attempts were summed up in four kinds of synthesis Firstly there is the Karuna synthesis which originated from Valmiki and found its culmination in Bhavadhuti s ఏకో రసః కరుణ ఏవ on the practical side and in Ananda Vardhana's శోకః శ్లోకత్వ మాగతః on the theoretical side Secondly there is the Santha-synthesis which started perhaps from the Mahabharata found its practical fulfilment in work l ke Aswaghosha s శారీపుత్ర ప్రకరణ Sriharsha's Nagananda and Krishna Misra's Prabodha Chandrodaya and received able advocacy on the theoretical side at the hands of the two great Alankarikas - Ananda Vardhana and Abhinava Gupta Thirdly there is the Sringara-synthesis wh ch firmly rooted in human nature itself s nce the beginning of creation reached its acme of spiritual refinement on the practical side, in the self effacing ideal of love delineated in an inimitable manner by the creative genius of great poets like Kalidasa and Bana and on the theoretical side, in the well-known dictum of the royal polymath, Bhoja రసోఽభిమానోఽహంకారః శృంగార ఇతిగీయతే And fourthly there is Adbhuta synthesis which on the theoreatical side became crystal ized in the views of Narayana and Dharma Datta, referred to by Viswanadha in his Sahitya Darpana and in the views of Bhanudatta as expressed in his Rasatarangini, and which on the practical side led to the production of the wonder-dominated dramatic type represented by the older Ascharyachudamani and the later Adbhuta Darpana of Mahadeva at the end of the

17th century."

రసతత్త్వ చర్చావసరమునఁ బెక్కండ్రు పండితు లొక్కొక్క రసము నభిమానించి యదియొక్కటే రసమని వాదములుచేసిరి. ఆ చర్చల నుండి నాలుగు సిద్ధాంతములు వెలువడినవి మొదటిది కరుణరస సమీకరణము. అనఁగా కరుణము ప్రకృతిరసమనియు మిగిలినవి వికృతి రసములనియుఁ దెలుపుట ప్రప్రథమమున నీ కరుణము వాల్మీకినుండి యుత్పన్నమైనది తదుపరి భవభూతిచే ఏకో రసః కరుణ ఏవ అను విధమున రూపమును బొందెను (లక్ష్యసిద్ధి) పిమ్మట ఆనందవర్ధనునిచే "శోకఃశ్లోకత్వమాగతః" అని సిద్ధాంతము చేయఁబడెను (లక్షణసిద్ధి) రెండవది శాంతరససమీకరణము. ఇది మహాభారతమునుండి యవతరించి యశ్వఘోషుని శారీపుత్రి ప్రకరణము శ్రీహర్షుని నాగానందము కృష్ణమిశ్రుని ప్రబోధచంద్రోదయము అను వానియందు రూపొంది (లక్ష్యసిద్ధి) యానందవర్ధన అభినవగుప్తుల ప్రతిభావంతములగు వాదములచే సిద్ధాంతితమైనది (లక్షణసిద్ధి)మూఁడవది శృంగార రససమీకరణము ఇదిసృష్ట్యాది నుండియు మానవప్రకృతియందు బద్ధమూలమై మహాకవీశ్వరులగు కాళిదాస బాణుల యమోఘ నిర్మాణశక్తిచే ననుకరింపరాని విధమున వ్యక్తీకృతమై (లక్ష్యసిద్ధి) యాధ్యాత్మికోన్నతినిఁ బొందినస్వార్థరహితప్రేమయే లక్ష్యముగాఁగలది. భోజుఁడిద్దానిని "రసోఽభిమానోఽహంకార శ్శృంగార ఇతిగీయతే" అని కీర్తించెను (లక్షణసిద్ధి) నాలవది యద్భుతరససమీకరణము సాహిత్యదర్పణమున నుదాహరింపఁబడినట్లు నారాయణధర్మదత్తులచే మొదట సిద్ధాంతముచేయఁబడినది (లక్షణసిద్ధి) పిమ్మట ఆశ్చర్యచూడామణియందును, అద్భుతదర్పణమునందును రూపొందినది (లక్ష్యసిద్ధి).

కరుణ మొకటియే ప్రకృతిరసము · మిగిలిన వికృతిరసములని కరుణ సమీకరణవాదులవాదము శాంత మొక్కటియే ప్రకృతిరసము మిగిలినవి వికృతి రసములని శాంతరససమీకరణవాదుల మతము శృంగార మొక్కటియే రసము; మిగిలినవన్నియును భావములేయని శృంగారరససమీకరణవాదుల మతము, అద్భుత మొక్కటియే ప్రకృతిరసము · మిగిలినవి వికృతిరసములని యద్భుత సమీకరణవాదుల మతము

భరతమతానుసారముగా నెనిమిదిరసములున్నను నందు ప్రధానరసములు నాలుగుమాత్రమే. అవి శృంగారము రౌద్రము, వీరము, బీభత్సము మిగిలిన నాలుగు రసములును వీనినుండి పుట్టినవే. ఎట్లన శృంగారమునుండి హాస్యమును, రౌద్రమునుండి కరుణమును, వీరమునుండి యద్భుతమును, బీభత్సమునుండి భయానకమును కలిగెను శృంగారతిలకమున నిట్లు చెప్పఁబడినదని విద్యానాథుఁడీ క్రింది శ్లోకము నుదాహరించెను

హాస్యో భవతి శృంగారాత్ కరుణో రౌద్రకర్మణః
అద్భుతశ్చ తథా వీరాద్బీభత్సాచ్చ భయానకః

ఇది ప్రాయోవాదము. శృంగారమునుండి జన్మించినహాస్యమే కాక కేవల హాస్యరసము గూడఁ గలదు చూడుఁడు.

గురోర్గిరః పంచదినాన్యధీత్య(వేదాంతశాస్త్రాణి దినత్రయంచ
అమీ సమాఘ్రాయచ తర్కవాదాన్(సమాగతాః కుక్కుటమిశ్రపాదాః

అయిదుదినములలోఁ బూర్వమీమాంసా శాస్త్రమును జదివి మూఁడు దినములలో వేదాంతము వెలిగించి తర్కశాస్త్రమును మూచూచి కుక్కుటమిశ్రపాదులవారు వచ్చిరి ఇటు శృంగార సంబంధములేదు.

ఇష్టజనస్య వినాశాద్వాపాత్కాశాచ్చ బంధనాద్వ్యసనాత్
ఏతై రర్థవిశేషైః కరుణాఖ్యరసన్సముద్భవతి. (నాట్యశాస్త్రము)

ఇష్టజననాశమువలనను శాపమువలనను క్లేశమువలనను బంధనమువలనను వ్యసనములవలనను గరుణరసముత్పన్నమగును పై శ్లోకమునఁ గరుణము రౌద్రకర్మమువలనఁ బుట్టునని చెప్పబడియున్నది ఈ యిష్టజననాశాదులకు రౌద్రము కారణముగావచ్చును ఇట్లే మిగిలినవానిసిఁగూడఁ జూచుకొనవలెను.

భరతమతానుసారముగాఁ గొందఱిమతమున నెనిమిది రసములున్నను, గొందఱి మతమున దొమ్మిదిరసములున్నను మహాకావ్యమున "శృంగారవీరయో రన్యతరస్య ప్రాధాన్యం" అని ప్రతాపరుద్రీయకర్తయు "శృంగార వీరశాంతానా మేకోఽంగీ రస ఇష్యతే" అని సాహిత్యదర్పణకర్తయు వచించిరి సాహిత్యదర్పణకర్తయే శాంతమును బేర్కొనెను కాని యితర లాక్షణికు లెల్లరును శృంగారవీరములలో నొక్కటియే యంగిరసమనియు, మిగిలిన రసము లంగరసము లనియు వచించిరి. మిగిలిన రసములకన్న వీనికే ప్రాధాన్యమిచ్చుటకుఁ గారణమేమి?

"శృంగారఏవ మధురః పర ప్రహ్లాదనో రసః" అని ధ్వన్యాలోకము. (శృంగారమే మిక్కిలిమధురమును ఆనందజనకమును నగు రసము) ఈ రసము మాధుర్యమును బట్టియేనా యానందజనకము ? కాదు. జగత్తుయొక్క యవిచ్ఛిన్నతకు భోగేచ్ఛ ప్రధానమైనది. "ప్రజాతంతుం మావ్యవచ్ఛేత్సీః" (సంతానరూపమగు సూత్రమును ద్రెంపవలదు) అని వేదము నుడువుచున్నది. 'సంతతి శ్శుద్ధవంశ్యా హి పరత్రేహచ శర్మణే (పరిశుద్ధవంశమునఁ బుట్టిన సంతానమిహపరలోకములఁ గల్యాణముఁగూర్చును) కాన సంసారసాధనమైన సంభోగ ముపాదేయము మఱియు "క్రియాణాం ఖలు ధర్మ్యాణాం సత్పత్న్యో మూలకారణం" (ధర్మబద్ధములైన కర్మల కుత్తమురాండ్రగు నిల్లాండ్రు మూలకారణము). అని కాళిదాసకవి వచించెను ఈ శృంగార రసమునకు శ్రీ మహావిష్ణువే యధిదేవతగాఁ బేర్కొనఁబడియున్నాఁడు దీనినిఁబట్టి దీని ప్రాము

ఖ్యము దెలియఁగలదు. ఈ శృంగారము ధర్మతత్పరులచే నవలంబింపఁబడి లోక కల్యాణహేతువగును. ధర్మావిరుద్ధమగు కామము లేక శృంగారము ముపాదేయమే యగును 'ధర్మావిరుద్ధో భూతానాం కామోస్మి భరతర్షభ" "నేను (శ్రీకృష్ణుఁడు) మనుష్యులయొక్క ధర్మావిరుద్ధమగు కామమును." అనఁగా "గామ స్వరూపుఁడను" అని భగవద్గీతలోఁ జెప్పఁబడియున్నది పురుషార్థములగు ధర్మార్థకామమోక్షములలో నైహికలక్ష్యములగు ధర్మార్థకామములలో ధర్మము ప్రధానమైనది. ధర్మము ధర్మబద్ధమగు నర్థమును, ధర్మార్థబద్ధమగు కామమును లక్ష్యములు అర్థకామముల నణఁచినధర్మమే లోక కల్యాణహేతువగును కావున ధర్మానుబంధియగు శృంగారమే యత్యుత్తమము అదియే యానందజనకము. అట్టి శృంగారమే కావ్యనాటకములో గ్రామ్యమని దానికిఁ బ్రాధాన్యమొసఁగిరి.

ఇట్టి శృంగారము క్షుద్రులచేఁబడినచో నది ధర్మహీనమగును "ఉత్తమప్రకృతిప్రాయః రసశ్శృంగార ఇష్యతే" (శృంగారరసముత్తమనాయకాశ్రితము) అని సాహిత్యదర్పణకారుఁడు లోకోత్తరనాయకాశ్రయేణ శృంగారస్య పరిపోషాతిశయః" (లోకోత్తరనాయకావలంబముచే శృంగారరసము పుష్టమగును) అని ప్రతాపరుద్రీయము దీనిచే ధీరోదాత్తుఁడైన నాయకుఁడే యీ శృంగార రసమున కాలంబనమై యుండి యుత్తమమయిన గార్హస్థ్యమును ప్రదర్శించిననే 'యథారాజా తథాప్రజా' అన్నట్లు లోకమాతని ననుసరించుచుండును ప్రజలు ధర్మపరుఁడగు ప్రభువును సేవించిన ట్లధర్మపరుని సేవింపరు వేనునివలె నట్టి వానినిఁ బదభ్రష్టునిఁ జేయుదురు ప్రాచీనకాలములో మనదేశమున రాజు ధర్మపరుఁడుగా నుండెడివాఁడు ధర్మమభివృద్ధి నొందిన ట్లధర్మము వర్ధిల్లదు ధర్మము నణఁచిన కామమున మునిఁగి యగ్నివర్ణుఁడు తుదకు క్షయరోగముచే మృతినొందెను ధర్మము నణఁచిన యర్థపిపాసతో దుర్యోధనుఁడు సకుటుంబముగా నశించెను ధర్మపరుఁడగు ధర్మరాజునకు లొంగియుండి యర్థపరుఁడయిన భీముఁడీప్సితమును బొందెను. కాఁబట్టి యర్థకామముల నణఁచిన ధర్మము ప్రధానము ఉత్తమసంస్కారము గలవారే యిట్టి ధర్మబద్ధమగు శృంగారమున కాలంబనము కాఁదగినవారు అట్లుగావినాఁ దది క్షుద్రశృంగారమగును సాధారణుల శృంగారమున ననుభావాది సామగ్రి తగినంత లేకపోవుటవలన నచ్చట రసము పుష్టముగాదు కాన నది రసముగాక రసాభాసమే యగును రసాభాసమైనను బరకీయారతిని విడిచి తిర్యఙ్మ్లేచ్ఛగతమగుచో నది యుపాదేయమే యగును అం దాస్వాద్యత గలదు. కాన జగదవిచ్ఛిన్నతకుఁ దన్మూలమున లోకకల్యాణమునకు శృంగారముత్తమమయినదే ; అది పరమపవిత్రముగా నుండవలెను క్షుద్రముగా నుండరాదు.

శాకుంతలమున దుష్యంతుఁడు శకుంతలను దిరస్కరించిన ఘట్టమును జూడుఁడు. మహర్షియగు కణ్వునిచేఁబంపఁబడి పూజ్యురాలగు గౌతమిచేతను శిష్యులచేతను గొనిరాఁబడి స్వయముగా సౌందర్యాధిదేవతవలె నున్న శకుంతలను జూచి నేను నీ భార్యనని చెప్పుచున్నను దుష్యంతుఁడు దిరస్కరించెను. ఏలన, వివాహము సేసికొన్నట్లాతనికి స్మృతిలేదు. పరస్త్రీస్పర్శపాంసులుఁడ నగుదు నేమోయని యాతనికి భయము. ఇట నాతని ధర్మబుద్ధి మెచ్చుకొనఁదగినది గదా! దొరకుటయే తడవుగా దానినిఁ దన యంతఃపురములోనికి గొనిపోలేదు. మఱొకరిఁ జూడుఁడు. శ్రీరాముని కుమారుఁడగు కుశుఁడొక గదిలో నిద్రించుచుండఁగా నాతని యొద్దకొక స్త్రీ (అయోధ్యాపురలక్ష్మి) వచ్చినది. ఆమె యయోధ్యాపురలక్ష్మియని యాతనికిఁ దెలియదు. అప్పుడామెను జూచియాతఁడనుచున్నాఁడు

[కా త్వం శుభే! కస్య పరిగ్రహో వా కింవా మదభ్యాగమకారణం తే

ఆచక్ష్వ మత్వా వశినాం రఘూణాం మనః పరస్త్రీవిముఖప్రవృత్తి

ఓ కల్యాణీ నీ వెవరవు? ఎవని భార్యవు? ఎందులకు వచ్చితివి? రఘువంశస్థులు పరస్త్రీవిముఖులని గ్రహించి యెందులకు వచ్చితివో చెప్పుము

ధర్మప్రవృత్తి యనఁగా నిట్టిదికదా!

ఇట్లే వీరరసము గూడ ధర్మరక్షకత్వమూలమున లోకకళ్యాణహేతువగును. వీరులలో స్వార్థత్యాగము ధర్మపరతంత్రత్వమును ముఖ్యములు. వీరులగు శ్రీరామ యుధిష్ఠిరాదుల స్వార్థత్యాగము ధర్మనిష్ఠతలు వివరింపఁబనిలేదు గదా. కావున వీరరసమునకును నాలంబనము ధీరోదాత్తులే కావలయును. ఏ రసమువలన లోకకళ్యాణము కలుగునో వానికిఁ గావ్యమునఁ బ్రాధాన్య మిచ్చిరి. భరతుఁడు శృంగారవీరములకే ప్రాధాన్యమిచ్చినను దరువాతి విశ్వనాథాదులు శాంతరసమునకుఁ గూడ సమానస్థానమిచ్చిరి. ఈ మూఁడే ధర్మానుబంధము గలిగి లోకకల్యాణ హేతువులగును. * అద్భుతము శృంగార వీరములతో సంకరముగానే యుండును. శృంగారవీరశాంతనాయకులు స్వార్థమును ద్యజించి ధర్మతత్పరత్వమున వర్తించుచోట్ల నద్భుతరసము కనఁబడుచునే యుండును.

---

* కొందరు కావ్యమున వీరశృంగారములే యుండవలెనన్న నియమము భరతుఁడు సేయలేదనియు భరతుని 'శృంగారో వీర ఏవ వా' అను వాక్యమునకు నై యర్థముఁగాదనియు లోకప్రసిద్ధినిఁ బట్టి మాత్రమే శృంగారవీరములను గ్రహించెననియుఁ జెప్పుచుఁ గరుణ రౌద్రాది రసములను గూడ ప్రధానముగా గ్రహించి కావ్యములను రచింపవచ్చుననియు నుత్తరరామచరిత్రమున భవభూతి కరుణమును వేణీసంహారమున భట్టనారాయణుఁడు రౌద్రమును బ్రధానముగాఁ జేసిరనియు నిదేవిధమున నితర రసములను గూడఁ బ్రధానముగాఁజేసి కావ్యముల రచింపవచ్చుననియుఁ దెలుపుదురు.

'వీరస్యైవ చ యత్కర్మ సోఽద్భుతః పరికీర్తితః' (వీరుని కర్మయే యద్భుత మనఁబడును. అనఁగా నద్భుతరసముగఁ బరిణమించును) అని భరతుఁడు. ఇట్టి లోకోత్తర కావ్యమును గుఱించియే 'విశ్వశ్రేయఃకావ్యం' అని నన్నయభట్టు వాకొనినాఁడు కరుణ బీభత్స భయానక హాస్యరసముల కట్టి లోకోత్తర నాయకాశ్రయత్వ మక్కఱలేదు. వీనికున్నంత ధర్మానుబంధము వానికిలేదు ఈ కారణములను బట్టి శృంగారవీరశాంతములకే కావ్యమునఁ బ్రాధాన్యము స్వీకరింపఁబడినది.

స్థాయి భావములు

కం. రతి హాస, శోక, యత్నము,
అతిభీతి జుగుప్స రోష, మచ్చెరువు, శమం,
బతులక్రమమున నవి సాం
ప్రతము రసస్థాయిభావభావనఁ జెందున్. 8

శృంగార, హాస్య, కరుణ వీర భయానక, బీభత్స రౌద్ర, అద్భుత, శాంతములను తొమ్మిది రసములకును గ్రమముగా రతి హాస, శోక యత్న (ఉత్సాహము) భయ, జుగుప్సా క్రోధ విస్మయ శమములు స్థాయిభావములు

స్థాయిభావము లనఁగా వాసనారూపమున సామాజికహృదయమునను్న రత్యాదులు.

"చిరంచిత్తేఽవతిష్ఠంతే సంబధ్యంతేఽనుబంధిభిః
రసత్వం యే ప్రపద్యంతే పసిద్ధాః స్థాయినోఽత్ర తే
సజాతీయైర్విజాతీయై రతిరస్కృతమూర్తిమాన్
యావద్రసం వర్తమానః స్థాయిభావ ఉదాహృతః"

వీని యర్థము వెనుక వివరింపఁబడినది

కం. రసములకుఁ దొమ్మిదింటికిఁ
దొపఁగిన యీ స్థాయిభావములకు నొనర్తున్
రసికత లక్షణ లక్ష్యము
లసదృశ రసశాస్త్రవేత్త లౌ నౌననఁగన్. ౯

స్పష్టము.

రతి లక్షణము

కం. తరుణీమణులకుఁ బురుషుల
కరయఁగ సంభోగవిషయమగు నభిలాష

స్ఫురణము మనములఁ బొడమిన
ధరలో నది రతి యనంగఁ దగు నెట్లన్నన్. ౯

పురుషలకనుటకన్నఁ 'దరుణుల కనటయుకము తరుణీతరుణులకు మనస్సునఁ బొడమిన సంభోగవిషయకమగునభిలాష లేక కామము రతి. "తత్ర సంభోగవిషయక ఇచ్ఛావిశేషో రతిః" (సంభోగవిషయకమగు నిచ్ఛావిశేషమే రతి అనియు, 'యూనోరన్యోన్యవిషయా స్థాయినీచ్ఛా భవేద్రతిః (యువతీ యువకుల యన్యోన్యవిషయకమగునిచ్ఛయే రతి) అనియును రతిలక్షణము కానఁబడుచున్నది. కాని రసగంగాధరకారుఁడు 'తత్ర స్త్రీ పుంసయోరన్యోన్యాలంబనః ప్రేమాఖ్యశ్చిత్తవృత్తివిశేషో రతిః స్థాయిభావః' (స్త్రీపురుషులయొక్క యన్యోన్యాలంబనము గల ప్రేమమను చిత్తవృత్తివిశేషమైన రతి స్థాయిభావము) అని వచించెను ఇట సంభోగేచ్ఛ యనక ప్రేమరూపమగు చిత్తవృత్తి విశేషమే రతియని నిర్వచింపఁబడినది ఈ లక్షణమే సముచితము. రసములును భావములును నిష్పన్నియుఁ జిత్తవృత్తివిశేషములే యని గుర్తించుకొన వలెను విభావాదులచే లెస్సగాఁ బరిపుష్టములయినచో యా చిత్తవృత్తివిశేషములు రసములనియు అపరిపుష్టము లయినచో భావములనియు వ్యవహరింపఁ బడును. ఈ రతియొక్క యవస్థ లీ క్రింది విధమునఁ బెద్దలు దెలిపిరి.

అంకుర పల్లవ కలికా ప్రసూన ఫల భోగభా గియం క్రమశః
ప్రేమా మానః, ప్రణయః, స్నేహో, రాగోఽనురాగశ్చ.

ఈ రతి యంకురావస్థయందుఁ బ్రేమమనియుఁ బల్లవావస్థయందు మానమనియుఁ గలికా (మొగ్గ) వస్థయందుఁ బ్రణయమనియుఁ, బుష్పావస్థయందు స్నేహమనియు, ఫలావస్థయందు రాగమనియు భోగావస్థయందనురాగమనియు జెప్పఁబడును ఇందు "అంకుర ..ఫలాంతమగు పంచావస్థలు గల రతి పూర్వరాగమున ననఁగా సంభోగావస్థకుఁ బూర్వమునను భోగావస్థగలరతి సంభోగమందును నుండును పూర్వరాగమున నీ పంచావస్థలుగల రతివలన నాయికకుఁ గొందఱి మతమున దశావస్థలును మఱికొందఱి మతమున ద్వాదశావస్థలును గలుగును ఆ యవస్థలు ముందు తెలియును.

"ఆదౌ వాచ్యః స్త్రియా రాగః పుంసః పశ్చాత్తదింగితైః"

ఈ రతి ప్రథమమున నాయికకే కలిగినట్లును నా యా యింగితములచేఁ బిమ్మట నాయకునికిఁ గలిగినట్లును గావ్యమునఁ వర్ణింపఁబడవలెను ఒకానొకచోఁ బ్రథమమున నాయకునికే కలిగినను నాయికకే కలిగినట్లు వర్ణించుట హృద్యమార్గము ఏలన నాయకుఁడు పౌరుషోపేతుఁడై యుండవలెను అనఁగా ధైర్యస్థైర్యాదులు గలిగి యుండవలెను. అట్లయిననే యాతఁడు శోభిల్లును. కాన

నాతని మనస్సునఁ బ్రథమమున రతిగలిగినను గావ్యమున సహృదయులు దానిని నట్లు నిబంధింపరు ఈ విషయమును రుద్రటుఁడు గూడ నిట్లు దెలిపెను.

పూర్వం నారీ భవే దక్తా పుమాన్ పశ్చాత్తదింగితైః
తత స్సంభోగలీలేతి స్వభావసుభగా స్థితిః

మొదట నాయిక నాయకునిఁ జూచి యనురక్తురాలు గావలెను: దాని యింగితములచేఁ బిమ్మట నాయకుఁడనురక్తుఁడు కావలెను, పిమ్మట వారి సంభోగలీల, ఇది స్వభావసుందరమగు విధము

ఉ చల్లఁదనంబె చంద్రునకుఁ, జక్కఁదనంబె ప్రసూనధన్వికిన్;
సల్లలితోరుసౌరభమె చైత్రున; కొక్కొకకొక్క మేలిమే
తెల్లముగాక; నాపతి యుదీర్ణగుణాఢ్యుఁడు నారసింహభూ
వల్లభుఁ, డట్లు సర్వగుణవైభవ మెవ్వరికైనఁ గల్గునే? ౧౦

ఒక నాయిక నరసభూపాలుని గుణముల నిట్లు నుతించుచున్నది; చంద్రున కొక్క చల్లఁదనమే కలదు, మన్మథున కొక్క చక్కఁదనమే కలదు. చైత్రున కొక్క సౌరభమే కలదు ఇందొక్కొక్కరి కొక్కొక్క గుణమమాత్రమే కలదు; నా ప్రియుఁడగు నరసభూపాలుఁడు సర్వగుణాఢ్యుఁడు

ఇట నాయికచేసిన నుతివలన నరసభూపాలునియందామెకుఁగల రతి వ్యక్తమగుచున్నది. ఇటఁ దనకు రతి యుదయుంచినట్లు నాయిక నోటిమాటలతోఁ దెలుపలేదు ఆ వర్ణనముచే వ్యక్తమగుచున్నది.

హాసలక్షణము

కం చేకొని యక్రూరములగు
నాకారవికారచేష్ట లాలోకింపన్
గైకొను మనోవికాస
స్వీకారము హాసమయ్యె వినుమెట్లన్నన్ ౧౧

'అక్రూరములగు' నకు 'అతివికృతములగు' అని పాఠాంతరము ఇదియే లెస్స మఱియు వికృతసంభాషణచేఁ గూడ హాసము గలుగును. కావున "కం చేకొని యతివికృతములగు నాకారాలాపచేష్టితాదులు చూడన్" అను పాఠము యుక్తము "అతివికృతములైన యాకారము, ఆలాపములు చేష్టితములు మొదలయినవానినిఁ జూచుటచేఁ గలుగు మనోవికాసమే హాసము" అని యర్థము ఈ యర్థమే యీ క్రింది సాహిత్యదర్పణ రసగంగాధరముల లక్షణములందు గానఁబడుచున్నది.

> వికృతాకారవాగ్వేషచేష్టాదేః కుహకాద్భవేత్
> హాస్యో హాసః స్థాయిభావః - అని సాహిత్యదర్పణము.

వాగంగాదివికారదర్శనజన్మా చిత్తవికాసో ఖ్యో హాసః (వాగ్వికారములను అంగవికారములను జూచుటవలనఁ బుట్టిన చిత్తవికాసరూపమగు వృత్తివిశేషమే హాసము) అని రసగంగాధర లక్షణము

చ. అదె! యిదె? వచ్చెవచ్చెనరసాధిపుఁడాడియటంచుఁ బారెముల్
బెదరి బరీదుఁడేగునెడఁ బెంపరి ఖానులు వెన్కముందుగాఁ
గదిసి హయాళినెక్కి హయకంధరముల్ పొడగాన కప్పుడే
చదిపిరి వాజిమస్తముల శత్రులఁటంచు భ్రమింతురెంతయున్.

తా బరీదుఁ డను నొక ముసల్మాను ప్రభువు నరసాధిపునిదాడి "వచ్చె వచ్చె" నని సేనలు బెదరఁగా దాను బరుగిడెను అతని సేనానాయకులు విభ్రాంతులై గుఱ్ఱములపై వెనుకముందుగాఁ గూర్చుండి గుఱ్ఱపుఁదలలను గానక యప్పుడే నరసభూపాలుని సైన్యములు వచ్చి తమ గుఱ్ఱపుఁ దలలను ద్రుంచినవని భ్రమపడిరి

ఇట ఖానులు వెన్కముందుగాఁ గూర్చుండుట యను వికృతచేష్ట హాసమును వ్యక్తము సేయుచున్నది

ప్రతాపరుద్రీయము నందలి యీ క్రింది శ్లోకము హాసమునకుఁ జక్కని యుదాహరణము.

> బిభ్రాణాన్ కబరీర్ధృతాంజనదృశః కృత్వా కుచౌ కృత్రిమౌ
> స్త్రీవేషాన్నిశి కాకతీంద్రనగరే ప్రచ్ఛన్నరూపాన్ నృపాన్
> దృష్ట్వా క్షౌమమపాస్య వక్షసి కుచావాకృష్య నీవీం ప్రలో
> హీహీకష్ట మితి త్యజంతి విపణిశ్రేణీషు ధూర్తా విటాః.

తా. కొప్పులు పెట్టుకొని కన్నులకుఁ గాటుక పెట్టుకొని, కృత్రిమ స్తనములు ధరించి స్త్రీ వేషములతోఁ బ్రచ్ఛన్నరూపులై కాకతీంద్రనగరవీధులలోఁ జనుచున్న శత్రురాజులనుజూచి దుండగీండ్రగు విటులు వారి దువ్వలువలూడ్చి కుచములులాఁగి నీవినిఁదాఁకి హీహీ యని నవ్వుచు వారిని విడుచుచున్నారు

శోకలక్షణము

కం. హితజనవిరహవ్యథచే
నతిశయమై జనుల మానసాంభోజమునన్

ప్రతిదినము పొడము దుఃఖం
బతిభూమివహింప శోకమగు నెట్లన్నన్. ౧౪

'హితజనవిరహదుఃఖము నఁగలుగు దుఃఖమతిశయించినచో శోకమగును' అనియర్థము ఇట 'వృథచేఁ బొడము దుఃఖము అనుట పొరపాటు మఱియు నొక హితజనవిరహముచేతనే శోకము గలుగదు

ఇష్టజనస్య వినాశాత్ శాపాత్క్లేశాచ్చ బంధనాద్వ్యసనాత్
ఏతైరర్థవిశేషైః కరుణాఖ్యరసస్సముద్భవతి (నాట్యశాస్త్రము)

ఇష్టజనవినాశము శాపము క్లేశము బంధనము వ్యసనము మొదలయిన వానివలన గరుణరసము గలుగును మఱియును రసగంగాధరమున

"పుత్రాదివియోగమరణాదిజన్మా వైక్లబ్యాఖ్యశ్చిత్తవృత్తివిశేషశ్శోకః" (పుత్రుఁడు మొదఁగువారి వియోగములవలనఁగాని మరణాదులవలనఁగాని కలిగిన వైక్లబ్యమను చిత్తవృత్తి విశేషమే శోకము) అని లక్షణము చెప్పఁబడినది. ఈ రెండు లక్షణములును సమగ్రములు కాన గ్రాహ్యములు

మఱియు లక్షణపద్యమున "దుఃఖంబతిభూమి వహింప శోకమగు" నని యున్నది "శోకస్య పరిపోషః కరుణః" (శోకముయొక్క పరిపుష్టావస్థయే కరుణము) అని కలదు అతిభూమిని వహించిన శోకము కరుణమే యగునుగదా ! కాన నది శోకస్థాయిభావలక్షణముగాక కరుణరసలక్షణమగుచున్నది "ఇష్టజనవిరహాదినా ఆత్మని దుఃఖాతిభూమి శ్శోకః" అను ప్రతాపరుద్రీయ శోకస్థాయిభావలక్షణము గూడ నీ దోషగ్రస్త మగుచున్నది

చ. పతుల నృసింహుశౌర్యశిఖిపాలుగఁ జేసిన యట్టి పాపపున్
శతధృతికి దటం జలము జాఱదు, మమ్మును దావపావక
ప్రతతులపాలుచేసె; నని పల్కులు రోదనమందు విద్విష
త్సతులకు బాష్పపూరములె చాలు వనానలమున్ హరింపఁగన్.

శత్రుకాంతలకు భర్తృవిరహకారణమున బాష్పములుదయించినవి ఇట వారి పలుకులును వారి రోదనములును శోకమును వ్యక్తపఱచును

ఉత్సాహలక్షణము

కం. అత్యున్నతలోకోత్తర
కృత్యంబులు సేయవేఁడి కృతకృత్యులిలన్
నిత్యముఁ దలఁచు ప్రయత్నం
బత్యంతోత్సాహమయ్యె నది యెట్లన్నన్ ౧౫

తా లోకోత్తరకార్యముల సాధింపఁజేయు గట్టి యత్న ముత్సాహము. లోకోత్తర కార్యములన నిట దాన ధర్మ, దయా, యుద్ధాదులు

రసగంగాధరమున దీని లక్షణ మిట్లున్నది.

" పరపరాక్రమ హానాది స్మృతిజన్మా ఔన్నత్యాఖ్యశ్చిత్తవృత్తి విశేష ఉత్సాహః" శత్రువులయొక్క పరాక్రమముయొక్క క్షీణత దులను స్మరించుట వలనఁ బుట్టిన యౌన్నత్య ముత్సాహము

మ. అసిఁ జెండాడి విపక్షవృక్షముల శౌర్యాగ్నిచ్ఛటం బేల్చి శ
స్త్ర పరశ్శిరములన్ రణోర్వీతలమున్ సంక్షుణ్ణముం జేసి వై
ర్యసృగార్ద్రంబొనరించి ప్రోడిగొనఁ దత్కీర్తిసస్యౌఘముల్
వెససిద్ధించునె? యంచుఁబల్కు నరసోర్వీనాథు యోధావళుల్.

నరసభూపాలుని యోధులు "శాత్రువులనువృక్షములను గొట్టివేసి శౌర్యాగ్నితోఁగాల్చి, శస్త్రములను నాఁగళ్లతో రణభూమిని క్షుణ్ణముగాఁజేసి శత్రువుల రక్తముచేఁ దడిపినఁగాని కీర్తిసస్యములు పండునే ? యని పలకుదురు.

ఇట యోధావళియొక్క పలుకులు రణోత్సాహమును వ్యక్తముసేయు చున్నవి.

భయలక్షణము

కం క్రూరాకారముఁ జూచిన
నారయ నే జనుని హృదయమందు ననర్థాం
కూరాశంకనమగునది
ధారుణిలో భయమనంగఁ దగు నెట్లన్నన్ ౧౮

'క్రూరాకారాదికమున అని పాఠాంతరము క్రూరాకారాదులను జూచుట వలన నేజనుని హృదయమందు మరణాదిరూపమహానర్థశంక కలుగునో యది భయము

"వ్యాఘ్రదర్శనాదిజన్మా పరమానర్థవిషయకో వైక్లబ్యాఖ్యశ్చిత్తవృత్తి విశేషః భయం" (వ్యాఘ్ర దర్శనము మొదలగు వానివలనఁ బుట్టినట్టి పరమానర్థ విషయకమగు వైక్లబ్యరూపమగు చిత్తవృత్తి విశేషము భయము) అని రసగంగాధర లక్షణము ఇట భయము సర్వప్రాణి సాధారణమైనను "ఏ జనునిహృదయ మందు" అని చెప్పఁబడుటచేఁ బశుపక్ష్యాదులకు గలుగు ననర్థశంక భయము గాదని యర్థమగును కాన నిది ప్రమాదము. జనశబ్దమునకు జంతువని యర్థము చెప్పుకొన్నచో సరిపోవును

స్థాయిభావమగు భయమునకును సంచారిభావమగు త్రాసమునకును భేదమేమి? అన శార్దూలాది దర్శనమువలనఁ గలుగు మరణాదిరూపమహానర్థశంక భయము. ఇతరభయహేతువులవలనఁ గలుగు మరణాదిభిన్నమగు ననర్థశంక త్రాసము. ఈ త్రాసము వ్యభిచారిభావము.

చ. అనఘ! నృసింహ! నీయరి వనావళి కేఁగి గుహాగ్రసుప్తుఁడై
యని మరలంగలం గని భయంపడి పాఱుచు "నాతిగాదు కా"
దని సతి తెల్పినం దెలియఁడొం! నిషాదులఁజాపహస్తులం
గని విపినేభపంక్తిఁగని క్రమ్మఱ నాఁతియకాఁ దలంచుచున్. ౧౮

తా. నిద్రనుండి తటాలునలేచి పరుగెత్తుట భార్యదెలిపినను నమ్మకుండుట, మొదలగునవి శత్రువుయొక్క భయమును వ్యక్తము సేయుచున్నవి ఇది సామాన్యభయముగాక మరణరూపానర్థ శంకగానే గ్రహింపవలెను.

జుగుప్సాలక్షణము

కం. పలలాస్థిశోణితాదులఁ
బలుమాఱును జూడ నరుచిభావము లోనం
దళుకొత్తు నిగర్హణమది
తలపోయ జుగుప్స యనఁగఁదగు నెట్లన్నన్. ౧౯

రక్తమాంసాదులను గాంచుటవలనఁ గలుగు నేవగింపు జుగుప్స. అయితే కొందఱకు మాంసాదులను జూచుటవలన నేవగింపు గలుగదుగదా! కాన నీ లక్షణమసంపూర్ణము ప్రతాపరుద్రీయమున "అర్థానాందోషదర్శనాదిభిర్గర్హణా జుగుప్సా" (ఆ యా పదార్థములందలి దోషదర్శనాదులచేఁ గలుగు రోఁత జుగుప్స) అని చెప్పఁబడినది ఎవనికి దోషము గనఁబడిన వానికే రోఁత, లేని వానికి లేదు. అని యర్థము వచ్చుచున్నది రసగంగాధరమున

" కదర్యవస్తువిలోకనజన్మా విచికిత్సాఖ్యశ్చిత్తవృత్తివిశేషో జుగుప్సా " (ఏవగింపు గొలుపు పురీషాది వస్తువులను జూచుటవలనఁ బుట్టినట్టి విచికిత్సయను చిత్తవృత్తివిశేషము జుగుప్స యనఁబడును) అని చెప్పఁబడియున్నది ఈ లక్షణమే సుందరమైనది ఏలనఁ బురీషాదిదర్శనమున నెల్లరకును రోఁత గలుగును రక్తమాంసాదుల దర్శనమువలనఁ గానీ పదార్థములందలి దోష దర్శనమువలనఁ గానీ, యెల్లరకును రోఁత గలుగదు కొందఱకు మాత్రమే కలుగును కావునఁ గదర్యవస్తువిలోకనమన నెల్లరకును సర్వసాధారణముగా నేవగింపుగొలుపు వస్తువులను జూచుట దీని వలనఁ గలుగు రోఁత జుగుప్స

చ తలలు సరోజముల్ మెదడుతండముక్రొన్నురు వంత్రజాలముల్
జలఫణు, లస్థిఖండములు, శంఖములై తగు నెత్రుటేర్లలోఁ
గలభకపాలనౌచయముఁ గ్రక్కున నెక్కి చరించు సంగర
స్థలుల నృసింహనిర్దళితశత్రువసారసమ త్తభూతముల్. ౨౦

ఇట భూతములు నెత్తుటేర్లలోఁ జరించుచున్నట్లు చెప్పఁబడినవి ఆ నెత్రు టేర్ల వర్ణనము జుగుప్సను వ్యక్తము సేయుచున్నది

క్రోధలక్షణము

కం. అపకారకారులగు నరు
లపరాధమొనర్ప నే మహోఎ హుని మనం
బు పరిజ్వలితంబగు నది
యపరిమితక్రోధమయ్యె నది యెట్లన్నన్. ౨౧

"శత్రుకృతాపదారేణ మనఃప్రజ్వలనం క్రోధః" (శాత్రవులు సేసిన యపచారముచే మనస్సు ప్రజ్వలించుటయే క్రోధము) అని ప్రతాపరుద్రీయము. "గురుబంధువధాదిపరమాపరాధజన్మా ప్రజ్వలనాఖ్యః శ్చిత్తవృత్తివిశేషః క్రోధః అయంచ పరవినాశాదిహేతుః క్షుద్రాపరాధజన్మాతు పరుషవచన అసంభాషణాదిహేతుః అయమేవ అమర్షాఖ్యో వ్యభిచారీతి వివేకః" (గురు బంధువధాదులగు పరమాపరాధములవలనఁ బుట్టిన ప్రజ్వలననామకమగు చిత్తవృత్తి విశేషము క్రోధము ఇది పరవినాశనముసేయును, ఈ క్రోధము మహాపరాధమువలనఁ గాక క్షుద్రాపరాధమువలనఁ బుట్టినచోఁ బరుషవచనములు అసంభాషణము మొదలగువానిని మాత్రమే కలిగించును. ఇదియే యమర్షాఖ్య మగు వ్యభిచారిభావము)

చ స్థిరభుజ విక్రమక్రమన్నృసింహా! నృసింహా! భవత్కరాగ్ర భీ
కరకరవాలసిద్ధుఁడతిగాఢయశోరససిద్ధిఁగోరి బం
ధురహయసింధురావళులతో రణదుర్గశనర్గశోన్నతిన్
నరబలివెట్టు దుర్మదసనాథరిపుక్షితినాథయూధమున్. ౨౨

ఓ నరసభూపాలా! నీచేతికత్తియను సిద్ధుఁడు కీర్తియనురససిద్ధినిఁ గోరి యుద్ధభూమియను కాళికి మదించిన శత్రురాజులను నరబలివెట్టును.

ఇటఁ 'గరవాలము నరబలివెట్టును' అనియుఁటచేఁ గ్రోధము వ్యక్త మగుచున్నదని యభిప్రాయము.

కాని 'కరవాలసిద్ధుఁడు యశోరససిద్ధినిఁగోరి' యని చెప్పుటచే సిద్ధుఁడు రససిద్ధినిఁగోరి పెట్టు నరబలి యుత్సాహయుక్తము కాని క్రోధయుక్తముగాదు ఇందుఁ గ్రోధమేమియుఁ గానరాదు రూపకబలమునఁ గ్రోధమునకుబదులుగా నుత్సాహమే వ్యజ్యమానమగుచున్నది మఱియు సీపద్యమున శత్రుకృతాపచార మేమియును జూపఁబడలేదు. కాని యది యాక్షేపించుకొనవచ్చును. ఇందుఁ గరవాలము కర్తయగుటచే నది యచేతనమగుటచే దానికి మనఃప్రజ్వలన రూపమగు చిత్తవృత్తియుండదు. కాన నీ యుదాహరణము చింత్యము.

ఈ క్రింది కావ్యప్రకాశోదాహరణము గ్రాహ్యము.

కృతమనుకృతం దృష్టం వా యై రిదం గురుపాతకం
మనుజపశుభిర్నిర్మర్యాదై ర్భవద్భి రుదాయుధైః
నరకరిపుణా సార్థం తేషాం సభీమకిరీటినా
మయమహసృఙ్మేదోమాంసైః కరోమి దిశాంబలిమ్

గీ. పితమర్యాదులై గురుపాతకంబు
సలిపి సహియించి చూచిన సకరమనుజ
పశుల నిమ్మెల్ల నేఁ గృష్ణ పార్థ భీమ
యుక్తముగ భూతబలియిత్తు రక్తమునను.

ఇది ద్రోణవధానంతరవర్తునాదులను గూర్చి క్రుద్ధుఁడైన యశ్వత్థామ యన్న పలుకులు ఇట శత్రుకృత మహాపరాధముచేఁ గలిగిన ప్రజ్వలనరూపమగు క్రోధము లెస్సగా వ్యక్తమగుచున్నది

విస్మయలక్షణము

కం. వివిధాపూర్వములగు వ
స్తువులఁ గనుంగొనిన యెడల సుజనుని మదిలోఁ
దవిలిన ప్రమోదవిస్తర
మవిరళవిస్మయమనంగ నగు నెట్లన్నన్. 39

"అపూర్వవస్తుదర్శనా చ్చిత్తవిస్తారో విస్మయో మతః" (అపూర్వములగు వస్తువుల దర్శనమువలనఁగలుగు చిత్తవిస్తారము విస్మయము) అని ప్రతాపరుద్రీయము. పద్యములోని "సుజనుని" పదము వ్యర్థము సుజనునికి మాత్రమే చిత్తవిస్తారము గలుగును. ఇతరునికిఁ గలుగదను నర్థమువచ్చును మఱియు 'ప్రమోదవిస్తరము' అనరాదు 'ప్రమోదవిస్తారము' అనవలెను. ఏలన 'ప్రథనేవావశబ్దే' అను పాణినీయసూత్రము ననుసరించి శబ్దప్రపంచమునందు 'విస్తరము' అనియుఁ దదితరవిషయమున 'విస్తారము' అనియు నుండవలెను.

శబ్దవిస్తరము, చిత్తవిస్తారము మొదలగునవి. కానఁ బ్రమోదవిస్తరమనవలెను
రసగంగాధరమున "అలౌకికవస్తుదర్శనాదిజన్మా ఆశ్చర్యాఖ్యో విస్మయః (అలౌకికమగు వస్తువులను జూచుటవలనఁ బుట్టిన యాశ్చర్యమనెడి చిత్తవృత్తివిశేషము విస్మయము) అని లక్షణము సేయఁబడినది

చ. ధరణి నృసింహభూవరు ప్రతాపమహాతపము బ్రహ్మాండక
ర్పరములు నిండి తీవ్రగతిఁ బర్వ నఖర్వసపర్వవైరిభూ
వరులు వడంకసాఁగుదురు రవార్యనవవ్యజనాతపత్రవై
ఖరులు దొలంగఁ జేయుదురు కన్నులఁ జీకటికప్పుచుండఁగన్.

తా. నరసభూపాలుని ప్రతాపరూపమగు బిట్టెండ బ్రహ్మాండమునఁ దీక్ష్ణముగాఁ గాయుచుండఁగా శత్రురాజులు కన్నులు మిఱుమిట్లుగొని వడఁకుచుఁ దమ ఛత్రచామరాదులను దొలఁగించుకొందురు

నరసభూపాలుని ప్రతాపము బ్రహ్మాండమంతటను గప్పి మిఱుమిట్లు గొలుపుచుండెను ఈయపూర్వ వస్తుదర్శనమువలన శత్రురాజులకు విస్మయము గలుగుచున్నది వారి చేష్టలా విస్మయమును వ్యక్తము సేయుచున్నవి

భూవరులు వడంకసాగుదురు వడఁకుట భయకార్యము మిఱుమిట్లు గొందురు అదే విస్మయము

శమలక్షణము

కం. నిరుపమవైరాగ్యాదుల
చిరవై నిశ్చలతఁబూని హృదయము తిరమై
నరులకుఁ బరిణతిఁ జెందిన
ధరలో నది శమమనంగఁదగు నెట్లన్నన్. ౨౫

తా. వైరాగ్యాదులచే మనస్సు విషయములనుండి నివృత్తమగుట శమము. "వైరాగ్యాదినా నిర్వికారచిత్తత్వం శమః (వైరాగ్యాదులచే జిత్తము నిర్వికారమై యుండుట శమము) అని ప్రతాపరుద్రీయము "నిత్యానిత్యవస్తువిచారజన్మా విషయవిరాగాఖ్యో నిర్వేదశ్శమః" (ఇది నిత్యము ఇది యనిత్యము అను విచారమువలనఁ బుట్టిన విషయవిరాగమను పేరుగల చిత్తవృత్తివిశేషమగు నిర్వేదము శమము) అని రసగంగాధరలక్షణము

ఉ. ఘోరభవాదిదుఃఖములఁ గుందగ నీక నృసింహుఁడౌర! దు
ర్వారఫలప్రదంబగు విరక్తిసుఖం బొనరించెనంచు నీ
వైరులు మౌనులై విపినవాటిని నీవ గురుండవంచు నీ
పేరిటి యక్షరంబులె జపింతురు శ్రీనరసింహభూవరా! ౧౬

తా నరసభూపాలుని శాత్రవులు సంసారపరిత్యాగముచేసి యడవుల నాశ్రయించిరని చెప్పుటచే వారి వైరాగ్యము వ్యక్తమగుచున్నది.

ఇట శత్రురాజులు సంసారపరిత్యాగము సేయుట వాస్తవికమగు వైరాగ్యమునఁగాదు ప్రాణాపాయము దప్పించుకొనుటకై యరణ్యవాసము సేసిరి. అట్టిచో నిది యుక్తమైన యుదాహరణముగాదనవచ్చును కాని మొదటఁ బ్రాణాపాయభయముచేతనే సంసారపరిత్యాగముచేసి యరణ్యముల నాశ్రయించిరి క్రమముగా వారి కచట యథార్థమైన వైరాగ్యము గలిగినది కావుననే వారు నృసింహనామాక్షరముల జపించుచుండిరి. మొదట వారికాసంసారపరిత్యాగము కష్టముగానున్నను దుదకుఁ 'గిల్లను మేళ్ళకే వచ్చు' నను లోకోక్త్యనుసారముగా వారు దానిని మేలుగానే తలఁచిరి కావున వారిది యథార్థమైన వైరాగ్యమే యని గ్రహింపవలెను.

కం. ఈరసముల కుత్పాదన
కారణము విభావమనఁగఁగల, దది ద్వివిధం
బై రంజిలు ; నాలంబన
మారయ నుద్దీపనంబు ననఁగ ధరిత్రిన్. ౨౪

ఇంతవఱకును స్థాయిభావములే చెప్పఁబడియుండఁగా "ఈరసములకు" అని యిటఁ జెప్పుట యనుచితము కావలన నిట నుపచారముచే స్థాయిభావములనియే యర్థమును జెప్పుకొనవలెను "రత్యాద్యుద్బోధకా లోకే విభావాః కావ్యనాట్యయోః" (లోకవ్యవహారమున రత్యాద్యుత్పత్తికిఁ గారణములయిన నాయకాదులు కావ్యములలో విభావములని వ్యవహరింపఁబడుదురు) అని సాహిత్యదర్పణము 'విభావ్యంతే ఆస్వాదాంకురప్రాదుర్భావయోగ్యాః క్రియంతే సామాజికరత్యాదిభావాః'' (సామాజికుల హృదయమున వాసనారూపముగా ననఁగా బీజప్రాయముగా నున్న రత్యాదిభావములు వేనిచే నంకురరూపమున నాస్వాద్యమానములగునో యవి విభావములు) అని వ్యుత్పత్త్యర్థము ఆ విభావమాలంబనవిభావమనియు నుద్దీపనవిభావమనియు నిరుదెఱఁగులు. ఈ గ్రంథమున నొక్క శృంగారమునే కవి ప్రదర్శింపఁదలఁచుటచే శృంగారవిభావములను మాత్రమే చెప్పుచున్నాఁడు.

విభావ స్వరూపము

కం. వనితయుఁ బతియును నాలం
బనమగు ; నుద్దీపనంబు ప్రాయంబును సొ
మ్ములును, చేష్టలు, మదనాదులు
నన దగు ; నేర్పఱతు వీనికగు లక్ష్యంబుల్. ౨౫

శృంగారరసస్థాయిభావమగు రతికి నాయికానాయకు లాలంబనవిభావము. వారి ప్రాయము భూషణము చేష్టలను నుద్దీపనవిభావములు ఆలంబన మన నవలంబనము "ఆలంబనం నాయకాది స్తమాలంబ్య రసోద్గమాత్ (ఏ నాయికా నాయకులవలన రసావిర్భావము గలుగునో యానాయికానాయకులాలంబనవిభావ ములు' అనఁగా రసమునకు సమవాయికారణములు సమవాయికారణమన నేది లేకపోవుటచే నిట రసోదయము గాదో యది సమవాయికారణము. నాయికా నాయకులు లేనిచో రసోదయము గాదుగదా) అని సాహిత్యదర్పణము ఉద్దీపన విభావమన నుద్దీపింపఁజేయు విభావము 'ఉద్దీపనవిభావాస్తే రసముద్దీప యంతి యే ' (రసము నుద్దీపింపఁ జేయునవి యుద్దీపనవిభావములు) యౌవనాదు లా రసము నుద్దీపింపఁజేయునవికదా ఈ యుద్దీపనవిభావము సహజమనియుఁ దటస్థమనియు ద్వివిధము ఈ శృంగారమున నాయికానాయికుల యౌవన, భూషణచేష్టలు మూఁడును సహజములగు ననఁగా నాలంబనముయొక్క గుణము లగు నుద్దీపనవిభావములు నాల్గవ విభావమగు మదనాదులు తటస్థరూపమగు నుద్దీపనవిభావము సహజముగానిది, తటస్థము 'మలయానిల చంద్రాద్యా స్తటస్థాః పరికీర్తితాః అని పతాపరుద్రీయమున నుండఁగా నిటఁ బైపద్యమున మద నాదు' లుద్దీపన విభావములని చెప్పఁబడినది ఉద్దీపన వస్తుకోటిలో మన్మథుని నాలంకారికు లెవ్వరును జేర్పలేదు కాని కవులు తమ పబంధములలో నాయికా విరహవర్ణన ప్రకరణమునం దుద్దీపకవస్తువులగు మలయానిల చంద్రాది దూష ణములతోపాటు మన్మథదూషణమును గూడఁ జేసిరి అందుచే నీ గ్రంథకర్త మన్మథునిఁ గూడ నుద్దీపనవిభావమునుగాఁ బేర్కొనెను.

ఆలంబనవిభావము

చ. అలరురతిన్ రతీశు దమయంతి నలున్ నలువొంద ముందుగా
నలువ సృజించి యందుకతనం దనచేయువు తెల్లఁదీఱ నే
ర్పలవడ నో లతాంగి! నరసాధిపునిన్ నినుఁగూర్చి ప్రేమ సం
కలితముగాఁగ దంపతులుగా నొనరింపఁగఁబోలు నెంతయున్.

ఓ లతాంగీ! రతీమన్మథులను, నలదమయంతులను బ్రహ్మదేవుఁడు ప్రప్రథమమున సృజించి, జంకుదీఱ పిమ్మట నిన్నును నరసభూపాలుని సృజించి ప్రేమపూర్ణులగు దంపతులుగా నొనరించియుండును

ఇట నాయికానాయకులలాలంబనవిభావములు

ఉద్దీపనవిభావము - ప్రాయము

మ. వరవక్త్రేందువిలాసకృన్నవవయోవర్షావసానంబునం
దరుణీశైశవసింధులింకునెడఁ దత్తత్కాలలక్ష్యంబు లౌ
స్వరసాంతఃస్థితగండశైలములనం జందోయి యంతంతకుం
బరగుం, దత్క్రమశోష్యరేఖలనఁగన్పట్టున్ వళీపుంజముల్

ముఖచంద్రునికిఁ జక్కని యందమును గూర్చు యౌవనరూపమగు శరత్కాలమున నా యువతియొక్క బాల్యమనునదు లెండిపోయెను అప్పుడచ్చోఁదేలిన గండశైలములో యనునట్లు చనుదోయి క్రమక్రమముగాఁ గనఁబడెను. నీరు దీసినపుడు గనఁబడు రేఖలో యనునట్లు వళులు గనఁబడెను.

ఇట నాయకుని రతి నుద్దీపింపజేయు నాయికయొక్క జవ్వనము వర్ణింపఁబడినది.

ఉద్దీపనవిభావము - సౌమ్యం

కం వెలఁదికి మణితాటంకము
లలరున్ దిగ్విజయకాంక్ష నతనుఁడు చూపున్
ములుగులు నిశాతములుగా
నలవడ వడిఁదీడుసాణయంత్రము లనఁగన్.

ఆ యువతియొక్క రవలకమ్మలు మన్మథుఁడు దిగ్విజయార్థియై దాని చూపులనుబాణములను నూఱుటకై యుంచిన సానచాళ్ళన వెలుఁగును

ఇట నాయకరతి నుద్దీపింపఁజేయు నాయికయొక్క సౌమ్యం వర్ణింపఁబడినది.

ఉద్దీపనవిభావము చేష్ట

చ. సుదతి నృసింహునిన్ మరలిచూచె విలాసవివర్తితాస్యయై
వదలని ప్రేమ వెన్నవిలివచ్చె ముఖేందుఁడఁటంచు భీతిచేఁ
బెదరి గిరీంద్రదుర్గములఁ జేరిన చీఁకటివోలె వాసనా
స్పదమగు వాలుఁగొప్పు వలిచన్నులపై నసియాడుచుండగన్.

వెన్నవిలి (పా) వెన్దగిలి

ఒక యువతి యొయ్యారముగా మొగమును ద్రిప్పి ప్రేమతో ముఖచంద్రుఁడు దన్ను వెంబడించివచ్చెనన్న భయముతోఁ బర్వతదుర్గముల దాఁగుటకై

చేరిన చీఁకటియో యన్నట్లున్న కేశభారము స్తనములమీఁదఁ జలించుచుండఁగాఁ నరసభూపాలునిఁ జూచెను.

ఇట నాయకరతికుద్దీపకమయిన నాయికాచేష్ట వర్ణింపఁబడినది

తటస్థవిభావము

చ. చిగురుకటారితోఁ జెఱకువిం టితో నలరంపగుంపుతో
నిగనిగమించు చెంగలువ నేజముతో వడిఁజిల్క తేజిపై
మగఁటిమిఁ నెక్కి శూరుఁడయి మారుఁడు కోకిలకంఠకాహళుల్
నెగడ లతాంగిపై వెడలె నేఁడు నృసింహ! యెఱుంగఁ జెప్పితిన్.

ఇట నాయికారతి కుద్దీపనవిభావములుగా మదనుఁడును గోకిలాలాపములును వర్ణితములు.

గీ. ఇరులపయ్యంట జాఱంగ, మరులుగొనుచు
నుదయశైలస్తనాగ్రమం దునిచి కరము
కలువకన్నులు వికసింపఁ జలివెలుంగు
అమరపతిదిఙ్ముఖంబు ముద్దాడుచుండె

ఇట నాయికానాయకుల రతి కుద్దీపకుఁడగు చంద్రుఁడు వర్ణింపఁబడెను. నాయికానాయకాదుల నవలంబించి రత్యాదులావిర్భవించునుగాన నాలంబనవిభావము జనకకారణమనియు నావిర్భూతములయిన రత్యాదులకుఁ బోషకములగుటచే యౌవనాదులు పరిపోషక కారణమనియును గొందఱందురు

అనుభావము

కం. కారణమైన విభావము
చే రసముత్పన్నమైనఁ జెలఁగెడిదానం
భ్రూరూఢకటాక్షాదిక
మారయ ననుభావమయ్యె నదియెట్లన్నన్. 34

తా విభావముచే రసముత్పన్నమయినపిమ్మటఁ గలిగెడు కటాక్షాదు లనుభావములు. ఈ లక్షణముకన్న సాహిత్యదర్పణలక్షణము లెస్సగానున్నది. చూడుఁడు

ఉద్బుద్ధం కారణైః స్వైస్వైర్బహిర్భావం ప్రకాశయన్
లోకే యఃకార్యరూపస్సోఽనుభావః కావ్యనాట్యయోః.

తమ తమ కారణములచే ననఁగా వెనుకటి జనకపోషకరూపములగు నాలంబనోద్దీపన కారణములచే లోకమున సీతారామాదులందుద్బుద్ధమైన రత్యాదికి మగు స్థాయిభావమును వెలుపలికిఁ దెలుపు క్రియావిశేషము కావ్య నాట్యములలో ననుభావమనఁబడును.

"అను — పశ్చాత్, భావః = ఉత్పత్తిః యేషాం తే అనుభావాః" (కారణమగు రతికవ్యవహితముగాఁ దటస్థించు కార్యము) అనియు, 'అనుభావయతి రత్యాదికం' (రత్యాదికమగు స్థాయిభావమును సామాజికునిచే ననుభవింపజేయునది యనుభావము) అనియు వ్యుత్పత్తులు స్వీకరింపఁబడి యున్నవి ఈ యనుభావము లెవ్వియో యిటఁ దెలుపఁబడలేదు సాహిత్య దర్పణమున నిట్లు గలదు·

ఉక్తాః స్త్రీణామలంకారా అంగజాశ్చ స్వభావజాః
తద్రూపాస్సాత్త్వికా భావా స్తథా చేష్టాః పరా అపి

అంగజములయిన (మనోభవములు) భావ హావ హేలలు మూఁడును అయత్నజములయిన శోభ కాంతి దీప్తి మాధుర్యము ప్రగల్భత ఔదార్యము ధైర్యము అను నేఁడును స్వాభావజములయిన లీలా విలాస విచ్ఛిత్తి బిబ్బోక, కిలికించిత మోట్టాయిత కుట్టమిత, విభ్రమ లలిత, మద విహృత తపన మౌగ్ధ్య విక్షేప కుతూహల హసిత, చకిత, కేళులు అను పదునెనిమిదియుఁ, జెప్పబోవు సాత్త్వికభావములెనిమిదియు నింకను సంభావ్యమానములయిన చేష్టలును, శృంగారమున ననుభావములు; మఱొకచో "అనుభావశ్చతుర్థాస్యాన్మనోవాక్కాయబుద్ధిభిః" అని భావములు మనోభవములు, వాగ్భవములు కాయజములు, బుద్ధిజములు అని నాలుగు విధములనియును జెప్పఁబడినది

౯౨, ౯౬ పద్యములలో లీలాదులు పదునైదుమాత్రమే చెప్పఁబడినవి కాని సాహిత్యదర్పణమునఁ బదునెనిమిది యీయఁబడినవి వీని కుదాహరణములు ముందీయఁబడినవి.

విభావములు కారణరూపములు; అనుభావములు కార్యరూపములు, వెనుకఁ జేష్ట యుద్దీపనవిభావముగాఁ బేర్కొనఁబడినది ఇటఁ "ప్రారూఢ కటాక్షాదికమను భావము" అని గ్రంథకర్త చెప్పినాఁడు. కటాక్షాదికము చేష్టగాదా? మఱియు ముందు చెప్పఁబోవు వ్యభిచారుల గూడఁ గార్యరూపములగుట వలన ననుభావములుగావా? అట్లగుచో నీ వ్యవస్థయెట్లు? అను నీ శంకను ప్రతాపరుద్రీయ వ్యాఖ్యాత లేవఁదీసి సమాధానము జెప్పియున్నాఁడు దాని నిట వివరింతుము

"నను చేష్టాలతఃణోద్దీపనవిభావానాం భావహావాదీనాం శృంగారకార్య తయా అనుభావత్వం ప్రతీయతే కటాక్షభ్రూవిక్షేపాదీనా మనుభావానా మనురాగ జనకత్వేన సంభవత్యేవ విభావత్వం ఉక్తానాముభయేషాం కల్లోలాయమానతయా రసపరిపోషణాత్ సంచారితాఽపి సమస్త సంచారిణాఽపి చింతాదీనా మనురాగ కార్యతయా అనుభావత్వం తద్దర్శన శ్రవణాభ్యా మనురాగాతిశయజననా ద్విభావత్వం చానుభూయతే తదుక్తం భావప్రకాశే

"విభావోఽప్యనుభావస్స్యా దనుభావో విభావవత్
తౌ పునశ్చారిణౌ స్యాతాం తే చ తౌ స్యుః పరస్పరం"

అత్ర పరస్పరశబ్దేన సంచారిణామేవ మిథోఽనుభావత్వం చేత్యాది ద్రష్టవ్యం అతః కథంపూర్వోక్తా విభావాదివ్యవస్థా ఇతి చేత్సత్యం కస్యా శ్చిదనురాగవ్యక్తేర్యాని కార్యకారణ సహకారీణి తాని తాం ప్రతి తదైవ నహి కించిదపి సాంకర్యమస్తి వ్యక్త్యంతరాపేక్షయా తస్యా ఏవ ఆకారభేదా పేక్షయా వా అన్యధాభావే కో విరోధః ? యథైకస్య పుత్రాపేక్షయా పితృత్వం పిత్రపేక్షయా పుత్రత్వంచ వ్యవతిష్ఠతే అతో విభావాదీనామపి ప్రతియోగిభేదాదిభిః కల్పితాకారాంతరాణాం సాంకర్యశంకానవకాశాద్విభావ రూపతా నియతైవేతి సిద్ధం"

తా. శృంగారరసమునకు జేష్ట యుద్దీపన విభావమని వెనుకఁజెప్పితిమి. భావహావాదులు చేష్టలు అవి శృంగారకార్యములగుటచే ననుభావము లగు చున్నవి కటాక్షభ్రూవిక్షేపాదు లనుభావములుగదా ? అవి నాయకుని కను రాగ జనకము లగుటచే విభావములును నగుచున్నవి ఈ రెండును గల్లోలాత్మక ములై రసపరిపోషకములగుటచే సంచారులను నగుచున్నవి సమస్త సంచారి భావములును (చింతాదులు) అనురాగకార్యములగుటచే ననుభావములును నగును. వానిని దర్శించుటవలనను వినుటవలనను ననురాగాతిశయము జనించుటచే విభావ ములును నగుచున్నవి భావప్రకాశములో "విభావమనుభావమగును అనుభావము విభావమగును అవి రెండును సంచారులగును ఆ సంచారిభావములు పరస్పర మనుభావములును నగును" అని చెప్పఁబడినది.

ఇఁక విభావాది వ్యవస్థయెట్లు ? అనఁగా నిది విభావము ; ఇది యను భావము ; ఇది వ్యభిచారిభావ మను విభాగమెట్లు ? అన్నచో నిదంతయు సత్యమే ఒకరి యనురాగవ్యక్తిలో నే విభావానుభావసంచారిభావములు గలవో వానిలో సాంకర్యముండదు అనఁగా నాయికాచేష్ట నాయకుని కుద్దీపనవిభావము. మఱియు నా చేష్టయే నాయకున కనుభావముగా నుండదు అది నాయికాశృంగా రమున ననుభావమై యుండవచ్చును ఒకఁడే మనుష్యుఁడు తన పుత్రునికిఁ దండ్రియుఁ దన దండ్రికిఁ దాను బుత్త్రుఁడును గావచ్చును గదా ! కావున విభా

హావులు వ్యక్తిభేదమును బట్టి రూపాంతరమున బొందును. కాన విభావాదివ్యవస్థ నియతమే.

మ. అలసాలోలములై యచంచలములై యానేకరాగ్రంబులై
యలఘువ్రీడములై యనిందితములై యానందపూర్ణంబులై
సులభానూయములై సుతీక్ష్ణరుచులై సువ్యక్తరాగంబులై
చెలువంబొందెడుచూపులింతి నెఱపెన్ శ్రీనారసింహేంద్రుపై.

ఇందు నాయికానురాగముయొక్క కార్యములయిన చూపులు వర్ణింపఁబడెను.

సాత్త్వికభావములు

కం. పరగతి సుఖదుఃఖాదుల
నరయుఁగ భావించి యట్లు యలరుట సత్త్వ
స్ఫురణము; తద్భవభావము
లరయఁగ సాత్త్వికములయ్యె నవియెట్లన్నన్. ౮౬

పరగతములయిన సుఖదుఃఖాదులను భావించి తన్మయత్వమును బొందుట సత్త్వమనబడును. ఈ సత్త్వశబ్దమునకుఁ బెక్కర్థములు గలవు.

"అభినయాదిముఖేన అన్యగత సుఖదుఃఖాదిభావనాయా మంతఃకరణస్య అనుకూలత్వం సత్త్వం" (అభినయాదులమూలమున బరగతసుఖదుఃఖముల యెడ నంతఃకరణము సుముఖమగుట సత్త్వము అనియు "రజస్తమోభ్యా మస్పృష్టం మనఃసత్త్వమిహోచ్యతే' రజస్తమఃస్పర్శలేని మనస్సు సత్త్వము అనియు 'స్వాత్మవిశ్రామప్రకాశకారీ కశ్చన ఆంతరో ధర్మస్సత్త్వం' (తన యాత్మయందు విశ్రమించిన రత్యాదులను బ్రకాశింపఁజేయు నాంతరధర్మము సత్త్వము) అనియు భావాంతరనైరపేక్ష్యేణ రసాపరోక్షీకరణత్వలక్షణో బలవిశేషస్సత్త్వం" భావాంతరములతోఁ బనిలేక రసమును బ్రత్యక్షమొనర్చు బలవిశేషము సత్త్వము) అనియును వివిధలక్షణములు కనఁబడుచున్నవి. ఆ సత్త్వమునఁ బుట్టినవగుట సాత్త్వికభావములని వ్యవహారము. లేక యాసత్త్వదశయందుఁ గలిగిన కార్యములే సాత్త్వికభావములు. ఇవియుఁ గార్యరూపము లగుటచే ననుభావములే యగును. అయినను "సత్త్వైకమూలత్వాత్ సాత్త్వికప్రథా" కేవలము సత్త్వమునుండియే పుట్టినవి కావున సాత్త్వికములు. మిగిలిన యనుభావములు శరీరజములు.

ఉ. స్తంభ మచంచలత్వ ; మవశత్వ మగుం బ్రళయంబు ; దృగ్జలో
జ్జృంభణమశ్రువౌఁ ; జెమట స్వేదము ; గద్గదవాక్యవైఖరీ
గుంభము విస్స్వరత్వము, తగుం బులకంబన రోమహర్షణా
రంభము· కంపమౌ వడఁకు, రామకుఁ బాండురుచుల్ వివర్ణతల్.

ఇం దెనిమిది సాత్త్వికభావములు వాని లక్షణములును జెప్పఁబడినవి ; స్తంభమన' నచంచలత్వము , ప్రళయమన 'అవశత్వము' · అశ్రువనఁగన్నీరు'; స్వేదమనఁ జెమట , వైస్వర్యమన 'గాద్గద్యము' ; రోమాంచమన గగ్గుఱుపాటు ; కంపమన వడఁకు' ; వైవర్ణ్యమనఁ 'బాలిపోవుట

భరతాదు లెల్లరును నెనిమిది సాత్త్వికభావములనే పేర్కొనిరి. కాని భానుదత్తుఁడు రసతరంగిణిలో "జృంభా చ నవమః సాత్త్వికో భావ ఇతి ప్రతిభాతి' (జృంభయనునది తొమ్మిదవ సాత్త్వికభావము) అని తొమ్మిది సాత్త్వికభావములను బేర్కొనెను.

వికారో మానసోభావః నిర్వికారాత్మకే చిత్తే భావః ప్రథమ విక్రియా, అని యితరులు 'భావ లక్షణమును దెలిపిరి భానుదత్తుఁడు "రసానుకూలో వికారో భావః ' (రసానుకూలమగు వికారము భావము) అని లక్షణము చెప్పెను. మఱియు నా భావములాభ్యంతరములు బాహ్యములు అని ద్వివిధము ఆభ్యంతర భావములు స్థాయివ్యభిచారులు బాహ్యములు సాత్త్వికభావములు సాత్త్విక భావములే రసానుకూలవికారములు కటాక్షాదులు మాత్రము రసానుకూల వికారములు గావా ? యని శంకించి కటాక్షాదులు వికారములు గావనియుఁ జేష్టలనియుఁ దెలిపెను. శరీరచేష్టలు పురుషేచ్ఛాధీనములు వానినిఁ జేయవచ్చును; మానవచ్చును. కాని వికారములు స్వతంత్రముగా నుదయించును. కాన రసానుకూలవికారరూపభావములు సాత్త్వికములే యని చెప్పెను.

కం. తలఁపఁగ రసకార్యములై
జలజాతులయందుఁ బొడము సాత్త్వికభావం
బుల నెనిమిదింటి కేర్పడ
నలరింతుం గడఁకతో నుదాహరణంబుల్. ౩౮

కార్యరూపములగు సాత్త్వికభావముల నుదాహరింతును ఈ సాత్త్విక భావములు కేవలము నాయికకేకాక నాయకునకును నుదయించును ఎట్లన,

ఏతత్పరిస్ఫురతి పద్మదృశాం సహస్రం
అక్షిద్వయం కథయ ; కుత్ర నివేశయామి ?
ఇత్యాకలయ్య నయనాంబురుహే నిమీల్య
రోమాంచితేన వపుషా స్థిత మచ్యుతేన.

ఇదిగో యిట సుందరీసహస్రము వెలుఁగుచున్నది. నా కందోయి నెట నుంతును ? అని విచారించి కన్నులుమూసి కృష్ణుఁడు గగుర్పాటుగొన్న మేనితో నిలిచెను. ఇట శ్రీకృష్ణునికి రోమాంచము వర్ణింపఁబడినది

"స్తంభ మచంచలత్వ" మను పద్యముచే స్తంభాది సాత్త్వికభావములకుఁ జెప్పఁబడిన లక్షణములు చక్కఁగాఁగాలేవు. కాన సాహిత్యదర్పణము నందలి లక్షణముల నిటఁ జూపుదును

స్తంభము

"స్తంభశ్చేష్టాప్రతీఘాతో భయహర్షామయాదిభిః" భయమువలన హర్షము వలన అమయాదులవలనను శరీరమునకుఁ గలిగిన చేష్టాప్రతీఘాతము స్తంభము. 'ఆమయాదిభిః అనునెడఁగల 'ఆది పదముచే ఘాత, పాతాదులు గ్రాహ్యములు.

చ. కలికి నృసింహభూవరునిఁ గన్గొనిఁ నిశ్చలగాత్రవల్లియై
అలరె విలాసచేష్టలోలయం గలయంగ నటింపఁజేయు నా
వలపుల సూత్రధారుఁ డనవద్యనృపాకృతిఁజూచి తాను ని
శ్చలత వహింపఁగాఁ గదలఁజాలని జంత్రపుబొమ్మయోయనన్.

తా నాయిక నరసభూపాలునిఁ జూచి నిశ్చలగాత్రవల్లియై పరుల శరీరములపై విలాసచేష్టలను రచించు మన్మథుఁడే యా నరసభూపాలునిఁ జూచి నిశ్చలత్వమును వహించుటచేఁ దదావిష్టయగు నామె కదలఁజాలని జంత్రపుబొమ్మయో యన నలరెను

ఇందు నాయికకు హర్షమువలన స్తంభము గలిగినట్లు వర్ణింపఁబడినది. కాన నిది స్తంభమను సాత్త్వికభావము

ప్రళయము

"ప్రళయస్సుఖదుఃఖాభ్యాం చేష్టా జ్ఞాన నిరాకృతిః" (అత్యధికమయిన సుఖ దుఃఖములచేఁ గలుగు నచేతనత్వము ప్రళయము)

ఉ. ఇత్తటి నీ తలోదరి వహించె నచేతనవృత్తి శారదా
చిత్తముఁ జూఱగొన్న నరసింహుఁడు నేఁడు వియోగపాండువౌ
గుత్తపుగుబ్బలాఁడి పలుకుంజవరాలివలెం దెలంగఁగా
నిత్తరళాక్షి చిత్తము నహీనరసోన్నతిఁ జూఱవెట్టెనో? ౪౦

నరసభూపాలుఁడు సరస్వతీహృదయమును హరించినవాఁడు. అతఁడు తన వియోగముచే దెల్లఁబాఱిన శరీరముగల యువతినిఁగాంచి యది సరస్వతియే యని తలఁచి దాని చిత్తము హరించెనో యేమో ? ఏలన, నా తరుణి యిప్పు డచేతన వృత్తిలో నున్నది

ఇట నచేతన వృత్తిరూపమగు ప్రళయము వర్ణింపఁబడినది. నరసభూపాలుని భావించుటచేఁ గలిగిన సుఖముచే నచేతనత్వము గలిగెను

అ శ్రు వు

"అశు నేత్రోద్భవం వారి క్రోధదుఃఖప్రహర్షజం" (క్రోధము, దుఃఖము హర్షము అనువానివలనఁ గన్నులఁబుట్టిన నీ ర శ్రువు)

చ. మగువకు నంగజానలసముగ్రము లౌ నులివేఁడియూరుపుం
బొగలెగయం జనించుగతి ముత్తెపుఁజిప్పలఁబోలు జెప్పలన్
నెగడునుదశ్రుపూరములు నేత్రసరోరుహనాళచాతురిం
డిగియె నృసింహ! యింకఁ దరుణీమణిఁ గౌఁగిటనాదరింపుమా !

ఇట యువతి కశ్రుపూరములు గలిగినట్లు వర్ణింపఁబడినది. విరహదుఃఖముచే నశ్రువులు జనించినవి.

స్వే ద ము

"వపుర్జలోద్గమస్స్వేదో రతిఘర్మ శ్రమాదిభిః" (రతివలన వేఁడివలన, శ్రమమువలనను గలుగు శరీరజలము స్వేదము. అది పదముచే భయంకరదర్శన, ఆకస్మిక దుర్ఘటనాదులు గ్రాహ్యములు

చ. సతికిఁ జెమర్చె మేను జలజాతదళాక్షి చతుస్సముద్ర ము
ద్రితవసుధాధురంధరుని శ్రీ నరసింహుని భావవీథిలోఁ
బ్రతిదినమున్ వహించు నతిభారమువంకనొ? కాక సంతతా
పతదసమాస్త్రశస్త్ర భవపావక కీలల వేఁడివంకనో? ౪౨

ఇట యువతికి శ్రమవలన స్వేదము గలిగినట్లు వర్ణింపఁబడినది.

వైస్వర్యము

"మదసమ్మదపీడాద్యైర్వైస్వర్యం గద్గదం విదుః" (మదముచే సంతోషముచే బీడాదులచేతను గలుగు గాద్గద్యము వైస్వర్యము అది పదముచే జాగరణము (నిద్రలేమి) ఉచ్చారణాధిక్యము మొదలయినవి గ్రాహ్యములు.

చ అమరఁ బరాంగనానఖముఖాంకితుఁడైన నృసింహభూవరుం
గమలదళాక్షి చూచి తమకమ్మున దూఱెదనన్న గద్గద
త్వమునఁ బొసంగవయ్యెసఖి వాక్యము; లాంతరమైచెలంగు నె
య్యము హృదయేశు దూఱవలదంచు నిరోధ మొనర్చెనోయనన్

ఇట నరసభూపాలుని దూఱ యత్నించినను నోటమాట రాదయ్యెను. ఇట నిరోధరూపమైన పీడచేఁ గలిగిన వైస్వర్యము వర్ణితము.

రోమాంచము

"హర్షాద్భుతభయాదిభ్యో రోమాంచో రోమవిక్రియా" హర్షము అద్భుతము, భయము మొదలగువానివలనఁ గలుగు రోమవికారము రోమాంచము.

చ. కలికి నృసింహునిం దలఁపఁగా నెలమిం బులకప్రకాండముల్
మొలిచె మనోజహాలికుఁడు మోదమెసంగఁ గురంగనాభి పం
కిలమగు నింతిగాత్రమను క్షేత్రమునన్ వెలయంగఁ జేయు న
స్ఖలితమనోమనోరథ విశాయము లిరికలెత్తెనో యనన్. ౭౭

మన్మథుఁడను సేద్యగాఁడు యువతియొక్క కస్తూరిపూఁతఁగల శరీరమను పొలమునఁ జల్లిన మనోరథములు మొలకెత్తెనో యన్నట్లు పులకలు జనించెను.

ఇట నాయిక నృసింహునిఁ దలఁపఁగాఁ గలిగినహర్షముచేఁ బులకలు గలిగినవి

కంపము

"రాగద్వేష శ్రమాదిభ్యః కంపో గాత్రస్య వేపథుః" రాగము ద్వేషము' శ్రమము మొదలగువానిచేఁ గలిగిన గాత్రవేపథువే కంపము. అది పదముచే ఘోరదర్శనాదులు గ్రాహ్యములు.

ఉ. చెన్నగు శ్రీనృసింహవిభుఁ జిత్రపటంబున వ్రాసి వింకవుం
జన్నులమీఁదఁ జేర్చుకొని చాలవడంకఁదొడంగె బాల ; దాఁ
గన్నులవింటివాఁడు త్రిజగంబు జయించెద నంచుఁ గోరి చే
మన్న కృపాణవల్లిక మహోజ్జ్వలతన్ జళిపించెనో యనన్.

ఇట నాయికకు రాగముచేఁ గంపము గలిగినట్లు వర్ణితము

వివర్ణత

"విషాద మద రోషాద్యైర్వర్ణాన్యత్వం వివర్ణతా" విషాదము, మదము, రోషము మొదలగువానిచేఁ గలుగు నన్యవర్ణత వివర్ణత. వివర్ణతయనఁగాఁ బాండురుచి (పాలిపోవుట) అని గ్రంథకర్త వ్రాయుట పొరపాటు శృంగార రసమునఁ బాండురుచి యే కావచ్చును. ఈ సాత్త్వికభావము లితర రసములలోఁ గూడ రావచ్చును అటఁ బాండురుచియే కలుగునని చెప్పలేము అది శబ్దముచే శోక మోహములు గూడ గ్రహింపఁబడును

ఉ మానవతీలలామ యనమానసముజ్జ్వలగాత్రవల్లి పైఁ
గానఁగనయ్యెఁ బాండుతరకాంతి ; నిరంతరమై మనంబునన్
శ్రీనరసింహభూవరు ధరింపఁగఁ దద్వదనేందుమండలీ
మానితచంద్రికారససమూహము పైపయిఁ జర్చెనో యనన్.

నిరంతరమును మనస్సున నరసభూపాలుని ధరించుటచే నాతని వదన చంద్ర చంద్రికాపూరము పైకుబికెనో యన్నట్లాయువతిమేను దెల్లఁబాఱెను. ఇట మోహముచే వివర్ణత గలిగినది

సంచారి భావములు

కం. అహరహము రసోత్పత్తికి
సహాయభావంబు లెలమి సంచారులగున్
మహి నివి ముప్పదిమూఁడై
మహితములగు వీనికిం గ్రమంబేర్పఱతున్. ౪౭

"వ్యభిచార్యంజితో భావః" (అభివ్యక్తమైన భావము వ్యభిచారి యనఁబడును) రసవ్యక్తికి సహాయభూతములగు నీ భావములు సంచారులనఁబడును. సంచారిభావము లన్నను వ్యభిచారిభావము లన్న నొక్కటే. ఈ లక్షణము కన్న సాహిత్యదర్పణలక్షణ ముచితముగా నున్నది. చూడుఁడు.

విశేషాదాభిముఖ్యేన చరంతో వ్యభిచారిణః
స్థాయిన్యున్మగ్న నిర్మగ్నా త్రయస్త్రింశత్ప్రకీర్తితాః

విశేషించి యనఁగా విభావ, అనుభావ సాత్త్వికభావములకన్న నతిశయించి రసానుగుణముగాఁ జరించునవి వ్యభిచారులు. (వి+అభితః+చరంతి=వ్యభిచారిణః) ఇవి స్థాయియగు రత్యాదులందుఁ బ్రాదుర్భావతిరోభావములు పొందుచుఁ జరించును. సంచారులన (సమ్యక్ చారయంతి) లెస్సగా రసము నెల్లెడలను వెదజల్లునవి సంచారిభావములు ఇవి ముప్పదిమూఁడు స్థాయిభావము సముద్రమువంటిది సముద్రమునఁ దరంగము లావిర్భవించును తిరోభావమును బొందును మఱల నావిర్భవించును మఱలఁ దిరోభావమును బొందును. అట్లే వ్యభిచారిభావములు స్థాయిభావమునందు మజ్జనోన్మజ్జనములు సేయుచుండును ఆవిర్భావ తిరోభావసామ్యమును బట్టియే వ్యభిచారులకుఁ దరంగములతో సామ్యము ఈ వ్యభిచారిభావములు స్థాయిభావములను లెస్సగాఁ బోషించి వానిని రస్యమానములుగాఁ జేయును

సంచారిభావ నిరూపణము

శా. నిర్వేదశ్రమదైన్యజాడ్యములు గ్లాని త్రాసశంకార్తిరు
డ్గర్వావేగధృతిస్మృతుల్, చపలతోగ్రత్వావహిత్థాత్రపాం
తర్వైక్లబ్య మదోత్సుకత్వ మతినిద్రా మోహబోధాంతము
త్సర్వాలస్యవితర్కసుప్త్యసహతాధ్యానభ్రమాపస్మృతుల్

౧. నిర్వేదము ౨ శ్రమము, ౩ దైన్యము ౪. జాడ్యము (జడత) ౫. గ్లాని, ౬ త్రాసము ౭ శంక ౮ ఆర్తి (వ్యాధి) ౯ రోషము (అమర్షము) ౧౦ గర్వము ౧౧ ఆవేగము ౧౨. ధృతి ౧౩ స్మృతి ౧౪ చపలత ౧౫. ఉగ్రత్వము (ఔగ్ర్యము) ౧౬ అవహిత్థ, ౧౭ త్రప (లజ్జ) ౧౮. అంతర్వైక్లబ్యము (విషాదము) ౧౯ మదము, ౨౦. ఉత్సుకత్వము, (ఔత్సుక్యము), ౨౧ మతి ౨౨ నిద్ర ౨౩. మోహము ౨౪ బోధము, ౨౫. అంతము (మరణము) ౨౬ మదము (హర్షము), ౨౭ అలస్యము, ౨౮. వితర్కము ౨౯ సుప్తి (స్వప్నము) ౩౦ అసహత (అసూయ), ౩౧ ఆధ్యానము (చింత), ౩౨ భ్రమము (ఉన్మాదము) ౩౩ అపస్మారము, ఇవి సంచారి భావములు.

భరతుఁడెనిమిది స్థాయిభావములనుగూడ నితరరసములందు వ్యభిచారు లగునని చెప్పెను ఆపక్షమున వ్యభిచారిభావములు నలువదొకటగును. శోక స్థాయిభావము వ్యభిచారియైనపు డీ ముప్పదిమూఁడిలోని 'విషాదము' వ్యర్థ

మగుచున్నది. భయస్థాయిభావము వ్యభిచారియైనపుడు 'త్రాసము' వ్యర్థమగుచున్నది. క్రోధస్థాయిభావము వ్యభిచారియైనపుడు (అమర్షము) వ్యర్థమగుచున్నది వ్యభిచారభావములలోని గ్లాని, శ్రమలలో నొక్కటే చాలును. అవియీ విధముగా "ఈషద్వైషమ్య మవివక్షితం" అను లోకోక్తినిఁబట్టి వానికిఁగల యలఁతిభేదమును గణింపక వ్యభిచారిభావములను గొందఱు దగ్గించిరి. భోజుఁడు దన శృంగార ప్రకాశికలో అపస్మార, మరణములను దీసి వేసి 'ఈర్ష్యాశమములు' గ్రహించెను. భానుదత్తుఁడు రసతరంగిణిలో 'ఛలము' అను మఱొక్క వ్యభిచారి భావమును గలిపెను (అత్ర ప్రతిభాతి ఛలమధికో వ్యభిచారిభావ ఇతి) "గురుదేవనృపపుత్రాది విషయా రతిశ్చేతి చతుస్త్రింశత్" (గురునృపపుత్రాది విషయకమగు రతి గూడ భావమే కాన భావములు ముప్పదినాలుఁగు) అని రసగంగాధరకారుఁడు. భామహుఁడు గురుదేవనృపపుత్ర విషయప్రీతి వర్ణనమును ప్రేయోఽలంకారమని నుడివెను. ఉద్భటుఁడు దానిని భావాలంకార మనెను

కం॥ ఈ వరుసఁదగ్గియస్త్రింశ
ద్భావములకు లక్షణము లుదాహరణంబుల్
వావిరినొసర్తు నీయెడఁ
గేవల శృంగారసూత్ర కీలితభంగిన్. ౪౯

స్పష్టము

౧ నిర్వేద లక్షణము

కం. నిరుపమ దుఃఖేర్ష్యాదుల
నిరతము జనియించు నరతి నిర్వేదమగున్. ౫౦

దుఃఖము, ఈర్ష్య మొదలగువానివలనఁ గలుగు నరతియే నిర్వేదము. ఇందు నిర్వేదాదుల కీయఁబడిన లక్షణములసమగ్రములుగా దోషగ్రస్తములుగా నుంటచే రసగంగాధర లక్షణములఁగూడ నిత్తును

"నీచపురుషేషు ఆక్రోశన అధిక్షేప వ్యాధి తాడన దారిద్ర్య ఇష్ట విరహ పరసంపద్దర్శనాదిభిః, ఉత్తమేషు తు అవజ్ఞాదిభిః జనితా విషయ ద్వేషాఖ్యా రోదన దీర్ఘశ్వాస దీనముఖతాదికారిణీ చిత్తవృత్తిర్నిర్వేదః" నిర్వేద మన నీచులకు, ఆక్రోశన, అధిక్షేప వ్యాధి తాడన దారిద్ర్య ఇష్టవిరహ, పర సంపద్దర్శనాదులచేతను ఉత్తములకుఁ బరతిరస్కారాదులవలనను బుట్టిన విషయద్వేష నామాంతరముగల చిత్తవృత్తి ఇది కలిగినపుడు రోదనము దీర్ఘ నిశ్వాసము (నిట్టూర్పు) దీనముఖత్వము మొదలయినవి కలుగును

రసము విభావానుభావములచే వ్యజ్యమానమయిన చందమున భావము గూడ విభావానుభావములచేత వ్యజ్యమానము గావలయును. నిర్వేదమునకు ఆక్రోశనాదులు విభావములు· రోదనాదులనుభావములు. విభావానుభావములచే నిట్లు వ్యజ్యమానమైన వ్యభిచారిభావమును భావధ్వని యందురు అయితే రసములకును భావములకును గల భేదమేమి ? అన్నచో దెలుపుదుము

"రత్యాదయః స్థాయిభావాస్స్యుర్భూయిష్ఠవిభావజాః
స్తోకై ర్విభావై రుత్పన్నా స్త ఏవ వ్యభిచారిణః"

అధికవిభావములవలన వ్యక్తములయిన రత్యాదిస్థాయిభావములు రసములు అల్పవిభావములవలన వ్యక్తములయిన వ్యభిచారిభావములు భావములు. అనఁగా లెస్సగాఁ బరిపుష్టమైనది రసము, అపరిపుష్టమైనది భావము అని సిద్ధాంతము.

ఒక్కొక్కచో నొక వ్యభిచారిభావము వ్యంగ్యమయినపుడు తత్సామగ్రిచే నవినాభావముచే నంతకన్న నల్పముగా మఱొకభావముగూడ ధ్వనింపవచ్చును. ఎట్లన గర్వము ప్రధానముగా వ్యంగ్యమయినపుడమర్ష మల్పముగా ధ్వనించుచుండును అమర్షము ప్రధానముగా వ్యంగ్యమైనపుడు గర్వ మల్పముగా ధ్వనించును ఇట్టిచో నొకటి ప్రధానమును వేఱొకటి గుణీభూతమునుగాదా యని భ్రమింపరాదు ఏలన నివి (గుణీభూతవ్యంగ్యములు) ప్రత్యేకవిభావానుభావములచే వ్యంగ్యములు కావుకదా! ప్రకరణాదవశమున నొకవ్యభిచారిభావము ప్రధానముగా వ్యజ్యమానమయినపుడు దాని సామగ్రిచేతనే మఱొకభావ మల్పముగా వ్యజ్యమానమయినను దోసములేదు. ఏ విభావాదులచేఁ బ్రధానవ్యభిచారిభావము వ్యక్తమగుచున్నదో యా విభావములచేఁ గాక వేఱు విభావాదులచే నపరిపుష్టముగా వ్యజ్యమానమయిన వ్యభిచారిభావము గుణీభూతమగును కాన నిట్టిచో గుణీభూత శంకలేదు.

నిర్వేదోదాహరణము

కం. శిలలు మణిభూషణంబులు
చెలువగు హారములు జలధిఁజిందిన చినుకల్
తలిరాకుఁబోడిఁ గగు
సులభదయానిధి నృసింహుఁ జూడకయున్నన్. ౫౧

తా. నరసభూపాలునిఁ జూడకున్నచో నాకు మణిభూషణములు రాళ్ళే సుమీ ముత్యాలహారములు నీటిచినుకులు సుమీ

ఈ యువతి మణిభూషణములను రాళ్ళుగా, హారములు నీటిచినుకులుగాఁ దలఁచుటచే నిది నిర్వేదము ఇట 'ఇష్టవిరహము' (నృసింహుని యదర్శనము) విభావము దైన్యాదులనుభావము లాక్షేప్యములు (ఊహ్యములు) వీనిచే నిర్వేదము వ్యక్తమగుచున్నది.

౨. శ్రమలక్షణము

కం. సురతగమనాదిసంభవ
సరసస్వేదాంబులహరి శ్రమ ; మెట్లన్నన్'.

తా సురతక్రీడావ్యాపారమువలనను గమనాదివ్యాపారములవలనను బుట్టిన స్వేదము శ్రమము.

"బహుతరశారీరవ్యాపారజన్మా నిశ్శ్వాసాంగసమ్మర్దనిద్రాదికారణీభూతః ఖేదవిశేషః శ్రమః" బహుతరమైన శరీరవ్యాపారముచేతఁ బుట్టినదియు నిట్టూర్పు ఒడలినలుగుడు నిద్ర మొదలగువానినిఁగలిగించు ఖేదవిశేషము శ్రమము ఇట శరీరవ్యాపారము విభావము నిశ్శ్వాస అంగసమ్మర్ద నిద్రాదు లనుభావములు వీనిచే వ్యక్తమగు సంచారిభావము శ్రమము నరసభూపాలీయ శ్రమ లక్షణ పద్యములోని సరసస్వేదాంబులహరి శ్రమము అనునది ప్రామాదికము మఱియు,

> అధ్వవ్యాయామ సేవాద్యైర్విభావై రనుభావకైః
> గాత్రసంవాహనై రాస్యసంకోచై రంగమోటనైః
> నిశ్శ్వాసైర్జృంభితైర్మందైః పాదోత్క్షేపైశ్శ్రమో మతః

"మార్గగమనము వ్యాయామసేవ మొదలగు విభావములవలనను గాత్రసంవాహనము ముఖసంకోచము ఒళ్ళువిఱుపు, నిట్టూర్పులు ఆవలింతలు, యెత్తలేక యెత్తలేక కాళ్లెత్తుచుండుట అనునసుభావములచేతను శ్రమ వ్యక్తమగును" అనియు వేఱొకచోఁ గలదు.

శ్రమోదాహరణము

కం నరసేంద్రుఁజూడ రయమున
నరుదెంచి లతాంగి శ్రమజలాపూరితయై
సరసేందుకిరణపరిణతిఁ
గరఁగిన వెలచట్టుబొమ్మకైవడి నమరున్. ౫౨

తా. నరసభూపాలునిఁ జూడవచ్చి యొక యువతి చెమ్మటచేఁ జెమ్మగిల్లి చంద్రకిరణపాతముచేఁ గరఁగిన చంద్రకాంతశిలాకృతమగు బొమ్మవలె నుండెను లక్షణపద్యములోని "సరసస్వేదాంబులహరి" దుష్టమని తెలిపితిమి ఏ లక్షణ గ్రంథమునందు శ్రమమన 'స్వేదము అని చెప్పఁబడలేదు ప్రతాపరుద్రీయమున జెప్పఁబడిన "శ్రమఃఖేదోఽధ్వరత్యాదేర్జాతః స్వేదాతిభూమికృత్" (మార్గ గమనము సురతము మొదలగువానివలనఁ గలిగిన ఖేదము (బడలిక) శ్రమము, అది మిక్కిలి స్వేదమును గలిగించును) అనునది యుక్తమే. ఏలన శ్రమ కధ్వరత్యాదులు విభావములు స్వేదమనుభావమును నగును ఈ రెంటిచే శ్రమ వ్యక్తమగును అయితే రసగంగాధరలక్షణమునఁగాని మఱొక లక్షణమునఁగాని స్వేదమనుభావముగాఁ జెప్పఁబడలేదు

'నరసేంద్రుఁజూడ రయమున' అను పద్యమున "అరుదెంచుట" విభావము స్వేదమనుభావము ఈ రెంటిచే శ్రమ వ్యక్తమగును సురతశ్రమకీ క్రింది దుదాహరణమగును

చ ''చెదరిన ముంగురుల్ సరిగఁ జేర్పుము చెల్వఁడ బొట్టు దిద్దుమీ ।
నుదుటవిలాసి । కూర్పుము చనుంగవఁ ద్రెస్సిన ముత్తెపున్సరుల్
హృదయసఖుండ " యంచు వచియించి రతాంతమునందు వానితోఁ
కుడలకొరల్ గగుర్పొడుపఁ గోమలి క్రమ్మఱఁబొందె మోహమున్

ఇటు సురతక్రీడ విభావము అవలింతలు నిట్టూర్పులు అంగసమ్మర్దము మొదలగు ననుభావము లాక్షేప్యములు వీనిచే శ్రమ వ్యక్తమగును ("చెదరిన ......హృదయసఖుండ" । అన్నంతవఱకే శ్రమ)

౩. దైన్యలక్షణము

కం. బలమఱి యరికిన్ దయరాఁ
బలుకుట దైన్యంబనంగఁ బరుఁగన్... ౫౪

తా బలముడిగి శత్రునితోఁ గనికరంబు గలుగునట్లు పలుకుట దైన్యము॰ " దుఃఖదారిద్ర్యాపరాధాదిజనితః స్వాపకర్షభాషణాది హేతుశ్చిత్తవృత్తివిశేషో దైన్యం" దుఃఖము దారిద్ర్యము అపరాధము మొదలగువానివలనఁ బుట్టినట్టియు స్వాపకర్షము (తన తక్కువతనము) సూచించు సంభాషణమునకు హేతుభూత మగు చిత్తవృత్తి దైన్యము అరికి దయరాఁబలుకుట అనునది సరికాదు

దుఃఖాదులు విభావములు స్వాపకర్షభాషణాదులనుభావములు వీనిచే దైన్యము వ్యజ్యమానమగును

దైన్యోదాహరణము

కం. మదన! మదిరాక్షి లక్ష్యమె?
మొదలఁ బురాంతకుని నీఱు మోయించిన నీ
కిది మొదలు కరుణఁజూడుము
సుదతిన్ నరసింహుఁ గూర్పు సుకృతము గలుగున్. ౫౪

ఓ మన్మథుఁడా త్రిపురాంతకునంతవానిని నీఱుమోయించిన నీకు స్త్రీ యొక లెక్కయే? కావున దీనినిఁ దయఁదలఁచి నరసభూపాలునితోఁ గూర్పుము.

ఇట నే నాయిక నరసభూపాలుని విరహదుఃఖమనుభవించుచున్నదో దానికే దైన్యమును జూపవలెను రసగంగాధరలక్షణమున "స్వాపకర్ష" ఇత్యాదికముచే "స్వ" యన నాయికయే చెప్పఁబడుచున్నది "మదన! మదిరాక్షి లక్ష్యమె!" అను పద్యము విరహదుఃఖమనుభవించునది యొక నాయిక. దూతి మదనునితో దీనాలాపములాడుచున్నది కాన నిది సరిగాదు. కాని ప్రియురాలి విరహదుఖమును గాంచి దుఃఖించుచున్న దూతి దైన్యము వ్యక్తమగుచున్నదన్నచో యుక్తమేయగును అప్పుడు ప్రియురాలి విరహదుఃఖమే విభావము స్వాపకర్షభాషణము లనుభావములు. వీనిచే దూతిదైన్యము వ్యక్తమగుచున్నది

౪ జాడ్య (జడత) లక్షణము

కం. .... మదిలోఁ
గల కోరిక చేకూఱిన
నలవెఱుఁగక యునికి జాడ్యమగు నెట్లన్నన్

హృదయమనోరథము సిద్ధించినపుడు గలుగు మైమఱపు జాడ్యము

" జాడ్యమప్రతిపత్తిః స్యాదిష్టానిష్టార్థ సిద్ధిము " ఇష్టార్థ సిద్ధివలనను, అనిష్టార్థసిద్ధివలనను, గలిగిన యప్రతిపత్తి జాడ్యము అని ప్రతాపరుద్రీయ లక్షణము ఇట నిష్టార్థసిద్ధి మూలకముగానే జాడ్యము గలుగునని చెప్పఁబడినది. ఇది పొరపాటు

"చింతోత్కంఠా, భయవిరహేష్టానిష్టదర్శనశ్రవణాదిజన్యా, అవశ్యకర్తవ్యార్థ ప్రతిసంధానకరీ చిత్తవృత్తిర్జడతా" చింతా, ఉత్కంఠా, భయ, విరహ ఇష్టానిష్ట దర్శన శ్రవణాదులవలనఁ బుట్టినట్టియు, నవశ్యకర్తవ్యములగు కార్యములందును నితికర్తవ్యతామూఢత్వమును గలిగించునట్టిదియు నగు చిత్తవృత్తి విశేషము జడత.

చింతాదులగు భావములంచే నిజిక ర్తవ్యతామూఢత్వరూపమగు ననుభావముచే జాడ్యము వ్యజ్యమానమగును

జాడ్యోదాహరణము

కం. అదన నృసింహుఁడు వచ్చిన
సుదతి కనుంగొనదు ; చెలులఁ జూడదు ; భాషిం
పదు ; మిగులఁ జలింపదు ; త
ద్వదనామృతపారణావధానయుఁ బోలెన్.

నరసభూపాలుఁడు రాఁగా నాయిక హర్షాతిశయమునఁ బ్రక్కలకుఁ జూడదు ; చెలులను జూడదు ; మాటలాడదు , చలింపదు ; అతని ముఖచంద్రామృతపానమున నేకాగ్రచిత్తయై యున్నట్లు కనబడుచున్నది.

ఇట నిష్టదర్శనము (ప్రియదర్శనము) విభావము చెలులతో భాషింపకుండుట మొదలగునవి యనుభావములు వీనిచే నాయికయొక్క జడత వ్యక్తమగును.

"తద్వదనామృతపారణావధానయుఁ బోలెన్" అనుటచే నిజిక ర్తవ్యతారూపమగు మూఢత్వములేదు కాన నిదిలేకుండుట తెస్స

౫. గ్లాని లక్షణము

కం. కడుశక్తి యొడలి బడలిక
నడలుట యది గ్లానియయ్యె ,
తా బలముతగ్గి బడలికపడుట గ్లాని

"ఆగి వ్యాధిజన్యబలహానిప్రభవో వైవర్ణ్యశిథిలాంగత్వ దృగ్భ్రమణాది హేతుః దుఃఖవిశేషో గ్లానిః" ఆధి (మనోవ్యాధి) వ్యాధుల (శారీరక రోగములు), వలన బలముతగ్గుటచేఁ బుట్టినట్టియు వైవర్ణ్యము శిథిలాంగత్వము దృగ్భ్రమణము మొదలగువానినిఁ గలిగించు దుఃఖవిశేషరూపమగు చిత్తవృత్తి గ్లాని

కొందఱు "వ్యాధ్యాదిప్రభవబలనాశః గ్లానిః" "బలస్యాపచయో గ్లానిరాధివ్యాధిసముద్భవః" వ్యాధ్యాదులవలనఁ గలిగిన బలనాశమే గ్లాని యనిరి. పైని గ్లానిలక్షణ పద్యముయొక్క భావముగూడ నిదియే. ఇది పొరపాటు. ఏలన, భావమనఁగా చిత్తవృత్తి విశేషమని చెప్పితిమి నాశము చిత్తవృత్తి విశేష

మెట్లగును ? కాన బలనాశజన్యదుఃఖవిశేషరూప చిత్తవృత్తియే గ్లాని యని చెప్పఁ గొనవలెను.

ఇట బలహాని విభావము, వైవర్ణ్యము, శిథిలాంగత్వము, దృగ్భ్రమణము మొదలగునవి యనుభావములు.

గ్లాన్యుదాహరణము

కం. నిండదె బడలిక ? మును చను
కుండలబరువాఁగలేని కోమలి మేనం
గొండంత వలపు పుట్టిన ;
గండరగండాంక . యోబఘన నరసింహా ! నఱ

'నిండదె బడలిక ?' అనుటవలన గ్లాని వర్ణింపఁబడినది కాని యిది వ్యక్తముగాక వాచ్యమైనది మఱియు నీబడలికవలపువలనఁ బుట్టినట్లు చెప్పినాఁడు ఇదియు ననుచితమే, కాన నీ యుదాహరణము సరిగాలేదు ఇట రసగంగాధర లక్ష్యము నిత్తురు.

శయితా శైవలశయనే, సుషమాశేషా నవేందులేఖేవ
ప్రియామాగతమపి సవిధే సత్కురుతే మధురవీక్షణై రేవ

"శోభామాత్రము మిగిలిన చంద్రకళవలె శైవాలతల్పమునఁ బండుకొని చెంతకు వచ్చినను ప్రియుని మధురవీక్షణములచేతనే సత్కరించుచున్నది" ఇటఁ ప్రియవిరహజనిత వ్యాధికృత బలహాని విభావము ఎదుర్కొనకుండుట, చరణపాతము సేయకుండుట కౌఁగలింపకుండుట మొదలగునవి యనుభావములు. వీనిచే గ్లాని వ్యక్తమగుచున్నది

౬ త్రాసలక్షణము

కం. ... ... ఆకస్మికమై
పొడము భయంబునఁ జిత్తము
తడఁబడు టది త్రాసమనఁగఁ దగునెట్లన్నన్. నఱ

ఆకస్మికముగాఁ గలిగిన భయముచేఁ జిత్తము దడఁబాటుఁ బొందుట త్రాసము. "భీరోర్ఘోరసత్త్వదర్శనస్ఫూర్జథుశ్రవణాదిజన్మా చిత్తవృత్తివిశేష స్త్రాసః" పిఱికివానికి వ్యాఘ్రాదిఘోరజంతుదర్శనమువలనను ఉఱుములు మొదలగువానిని వినుటవలనను గలుగు చిత్తవృత్తివిశేషము త్రాసము దీనివలన రోమాంచ, కంప స్తంభ భ్రమాదులు గలుగును

"ఆకస్మికభయాచ్చిత్తవిక్షోభస్త్రాసః" అను ప్రతాపరుద్రీయ లక్షణము నకుఁగూడ నింతియే యర్థము. భయస్థాయి భావోదాహరణమున భయత్రాసము లకు భేదము తెలుపఁబడినది.

త్రాసోదాహరణము

కం. మరుఁ జిత్రలిఖితుఁ గని వి
త్తరి వెలవఁ బరాగభూతిఁ దగనిడి చిగురా
కరయఁగ దిగఁదుడిచి యలులకు
విరిబోనమువోయఁ దొలఁగె వెలపు నృసింహా! ౫౯

ఇటఁ జిత్రలిఖితుఁడగు మరుఁడు విభావము. రోమాంచ కంప, స్తంభాదు లాక్షేపములు ఇట ననుభావము లాక్షేప్యము లగుటవలనఁ ద్రాసము లెస్సగా వ్యక్త మగుటలేదు ఈ క్రింది రసగంగాధర లక్ష్య ముచితముగా నున్నది

"మాకురు కశాం కరాబ్జే కరుణావతి ! కంపతే మమ స్వాంతం
ఖేల న్నజాతు గోపై రంబ ! విలంబం కరిష్యామి"

"అమ్మా ! నాచేతిలోఁ గొరడాదెబ్బలు గొట్టకుము నా హృదయము వడఁకు చున్నది గోపబాలురతో నాడుచు నిఁకముందాలస్యము సేయను"

ఇది బాలకృష్ణుని వచనము

ఇట గొరడా విభావము. హృదయకంప మనుభావము. వీనిచేఁ ద్రాసము వ్యక్తమగుచున్నది

౭. శంకా లక్షణము

కం. తనకు ననిష్టంబగునో యని కొదుకుట శంక. ౫౯

"కి మనిష్టం మమ భవిష్యతీత్యాకారశ్చిత్తవృత్తివిశేషశ్శంకా" దీనికిఁ బైయర్థమే. దీనివలన ముఖవివర్ణతా కంపాదులు గలుగును.

శంకోదాహరణము

కం. చిలుకలపలుకో? యని విన
నలుకుం జెలిపలుకుఁ, దలఁకు నద్దముసూడన్
గలువలచెలికాఁడో ? యని
చెలఁవ వియోగంబుకతన శ్రీనరసింహా! ౬౧

అర్థము స్పష్టము ఇట ననిష్టము విభావము ముఖవివర్ణతాకంపాద్యను భావము లాక్షేప్యములు వీనిచే శంక వ్యక్తమగుచున్నది

౮ ఆర్తి (వ్యాధి) లక్షణము

కం. ... ... హృదయమందలి తాపం
బినుమడియై వెలిఁబర్విన
ననయము తనుపీడ యార్తి యగు నెట్లన్నన్.

తా హృదయతాపము ద్విగుణమై వెలికిఁబర్వఁగాఁగలిగిన శరీరపీడ -తాపము చిత్తవృత్తివిశేషమే భావమయినపుడు శరీరపీడ చిత్తవృత్తి విశేషము గాదుగదా కానఁబై లక్షణము దోషగ్రస్తము

"రోగవిరహాదిప్రభవో మనస్తాపో వ్యాధిః" రోగము విరహము, మొదలగు వానివలనఁ బుట్టిన మనస్తాపరూపమగు చిత్తవృత్తివిశేషము వ్యాధి" -రోగవిరహాదులు విభావములు, గాత్రశైథిల్యము శ్వాసము మొదలయిన వను భావములు (ఇట రోగము వ్యాధికాదనియు రోగమువలనఁ బుట్టిన మనస్తాపమే వ్యాధి యనియును గ్రహింపవలెను.)

ఆర్త్యుదాహరణము

కం బెడిదపు మదనజ్వరమున
మిడిసిపడున్ హారలతలు మృగలోచనకున్
వెడవిలుతు వింటికోలల
వడువున ; సతినింక నేఁచవలదు నృసింహా ! ౬౧

'మదనతాపముచే హారలతలు మన్మథబాణములవలె నెగిరెగిరి పడు చున్నవి. ఇఁక నీ యువతి నేఁచవలదు" ఇట శరీరతాపమే వ్యక్తమగుచున్నది ; కానీ మనస్తాపము వ్యక్తమగుటలేదు. రసగంగాధరలక్ష్యమును గనుఁడు

హృదయే కృతశైవలానుషంగా ముహురంగాని యతస్తతః క్షిపంతీ
తదుదంతపరే ముఖే సఖీనా మతిదీనామియ మాదధాతి దృష్టిమ్.

వక్షస్స్థలమునఁ దామరకూండ్లు వహించి మఱిఁ మఱిఁ నంగముఁ నిట్టట్టులు విసరుకొనుచుఁ బ్రియోదంతముకు జెలికత్తె చెప్పఁబోగా నా యువతి దీన దృష్టితోఁ జూచుచున్నది.

ఇట విరహము విభావము అంగశైథిల్యాదు లనుభావములు వీనిచే వ్యాధి వ్యక్తమగుచున్నది

౯. రోషలక్షణము (అమర్షము)

కం. ఎందును గృతాపరాధుల
యందు ఘనం బెరియ రోషమగునది.

ఈ వ్యభిచారిభావమగు నమర్షమునకును నీతఁ డిచ్చిన స్థాయిభావమగు క్రోధమునకు లక్షణ మొకే విధముగా నున్నది క్రోధలక్షణమును జూడుఁడు.

కం. అపకారకారులగు నరు
లపకార మొనర్ప నే మహామహాని మనం
బు పరిజ్వలితం బగు నది
యపరిమితక్రోధమయ్యె నది యెట్లన్నన్.

కాన రసగంగాధరలక్షణమును గ్రహింపవలెను "పరకృతావజ్ఞాది నానాపరాధజన్యః మౌనవాక్యాది పారుష్యాదికారణీభూతశ్చిత్తవృత్తివిశేషో ఽమర్షః" (పరకృతమగు నవజ్ఞారూప నానాపరాధములవలనఁ బుట్టినదియు, మౌన వాక్యములు (మాటలాడకుండుట) వాక్పారుష్యము మొదలయిన దానినిఁ గలిగించు చిత్తవృత్తి విశేషమే యమర్షము స్థాయిభావమగు క్రోధమునకును వ్యభిచారియగు నమర్షమునకును భేదము వెనుకఁ దెలుపఁబడినది.

అవజ్ఞాదులు విభావములు. మౌనవాక్యపారుష్యాదు లనుభావములు వీనిచే రోషము వ్యక్తమగును.

రోషోదాహరణము

కం. నిలునిలు మనంగ! యెచటికిఁ
దొలఁగెదు? నరసింహుఁ డింతితోఁ గూడినఁ జా;
లలరు భవదీయచాపము
కలుగానుగఁ ద్రిప్పి పిప్పిగాఁ గావింతున్. ౬౩

ఇందుఁ దనసఖి కపరాధ మొనర్చిన మన్మథునిపై మనః ప్రజ్వలనము వ్యక్తమగుచున్నది. మన్మథాపరాధము విభావము పరుషవచనము ననుభావము. వీనిచే రోషము (అమర్షము) వ్య[illegible] నాయికకుఁ గాక నాయికా సఖికి రోషము వర్ణితము. …యిక కేశర్ణించుటయు క్రమే…

A C No..... ....

౧౦. గర్వలక్షణము

కం. ... ... ఒరులన్
నిందించి తన్నుఁబొగడు న
మందోన్నతి గర్వమయ్యె మహి నెట్లన్నన్.

పరులను నిందించి తన్నుఁ బొగడుకొనుట గర్వము "రూపధనవిద్యాదిప్రయుక్తాత్మోత్కర్షజ్ఞానాధీనపరావహేలనం గర్వః. (రూపము, ధనము విద్య, మొదలగువానిచేఁ బుట్టిన యాత్మోత్కర్షజ్ఞానమువలన గలిగిన పరావహేళనము గర్వము)

గర్వోదాహరణము

కం. ప్రతియె ? కళంకాంకితునకు
సతియగు రోహిణియు నతనుపతియగురతియుం
బదుగు నృసింహునిఁ జెందిన
యతిధన్యకు నాకు ? ననుచు నంగన నవ్వెన్. ౬౪

నరసభూపాలుని చెట్టఁబట్టిన నాకుఁ గళంకిభార్యయగు రోహిణియు, ననంగుని భార్యయగు రతియును సమానులా ? అని నాయిక నవ్వెను.

ఇట నరసభూపాల ప్రాప్తిప్రయుక్తమగు 'అతిధన్యకు' అను నాత్మోత్కర్షము విభావము అవహేలనము (నవ్వుట) అనుభావము వీనిచే గర్వము వ్యక్తమగుచున్నది

౧౧ ఆవేగ లక్షణము

కం. క్రమమున నిష్టానిష్టా
గమజమనస్సంభ్రమంబు గన నావేగంబు. ౬౫

ఇష్టము అనిష్టము. తటస్థించుటవలనఁ గలిగిన మనస్సుయొక్క తత్తఱపాటు ఆవేగము రసగంగాధరమునఁ గేవలమనిష్టమువలనఁ గలిగిన తత్తఱపాటే యావేగమని చెప్పఁబడినది. కానఁబై లక్షణము పొరపాటు

"అనర్థాతిశయజనితా చిత్తస్యసంభ్రమాఖ్యా వృత్తిరావేగః" అనర్థాతిశయమువలనఁ బుట్టిన మనస్సంభ్రమ మను పేరుగల చిత్తవృత్తి యావేగము.

ఆవేగోదాహరణము

కం॥ సతి హారము నిడనెడ లే
కతనునితనసిద్ధిఁగోరి యలరతి వ్రతసం
గతి నక్షసరముఁ గైకొను
గతిఁ గేలన దాల్చి నృపతిఁ గనుఁగొన నరిగెన్ ౬౬

తా॥ నరసభూపాలుఁడు వీధి నరుగుచుండఁగా నాయిక హారమును మెడలో వేసికొనుట కవకాశములేక చేతనే ధరించి యతనుఁడగు మన్మథునికి దనసిద్ధిఁగోరి వ్రతమునుబూని చేత నక్షసరమును దాల్చిన రతినిఁ దలపించుచు నతనినిఁ జూడ నేఁగెను

ఇట నిష్టాగమజనితమనస్సంభ్రమము చెప్పఁబడినది. కేవలమనిష్టాగమజనితమనస్సంభ్రమమే యావేగమని సిద్ధాంతము కాన నీ యుదాహరణము చింత్యము. ఈ క్రిందిపద్య మనర్థమువలనఁ గలిగిన చిత్తసంభ్రమమున కుదాహరణము.

ఆ॥వె॥ ఇది నపుంసకంబు గద! యంచుఁ బ్రియురాలి
ప్రాంతమునకు మనసుఁ బంపియుంటి
నది రమించుచుండె నటనె హా! పాణిని
పలుకు నమ్మి గోఁతబడితిఁ జెడితి

ఇట మనసు ప్రియురాలితో రమించుట యనర్థము ఇది విభావము అతిత్వరాన్వితములగు వచనాదులనుభావములు వీనిచే నావేగము వ్యక్తమగును

౧౨. ధృతి లక్షణము

కం॥ అమరఁగ మనము కృతార్థ
త్వముఁ జెందిన ధృతియనంగఁ దగునెట్లన్నన్.

తా॥ మనస్సు కృతార్థమగుట ధృతి.

"లోభశోకభయాదిజనితోపప్లవనివారణకారణీభూతశ్చిత్తవృత్తివిశేషో ధృతిః"
లోభము, శోకము భయము, మొదలగువానివలనఁ గలిగిన యుపప్లవమును నివారించుటకుఁ గారణమయిన చిత్తవృత్తివిశేషము ధృతి.

ధృత్యుదాహరణము

కం. నరసేంద్రుడు రాకుండినఁ
బరువడి భావింపఁగలుగు భాగ్యమె చాలుం
బరితార్థనైతి, మరునకు
గిరునకుఁ బ్రియ మేలపల్కఁ గిద్పడివాకున్ ? ౯౭

నరసభూపాలుఁడు నా చెంతకు రాకున్నను వానిని స్మరింపఁగలిగెడు భాగ్యము గలిగినది. అదియే చాలును నేను గిద్పడి మన్మథుని దేబిరింపనేల ?

ఇట నరసభూపాలుని రామిచేఁగలిగెడు నుపద్రవము నామె ధైర్యముతో నివారించుకొన్నది ఇట వివేకము విభావము చాపల్యముచే మన్మథుని దేబిరింప నని చెప్పుట యనుభావము వీనిచే ధృతి వ్యక్తమగుచున్నది

౧౩ స్మృతి లక్షణము

కం. స్మృతియగు పూర్వానుభవ
స్మృతి ౯౮

పూర్వానుభవమును దలఁచుట స్మృతి ఈ లక్షణము సరియైనదికాదు పూర్వానుభవము వలనఁగలిగిన సంస్కారమువలనః గలిగిన జ్ఞానము స్మృతి యని చెప్పవలెను "సంస్కారజన్యం జ్ఞానం స్మృతిః" సంస్కారమువలనఁ గలిగిన జ్ఞానము స్మృతి. లోకములో నొకప్పుడు మనము దేని నేనిఁ జూతుము లేక విందుము ఆ విషయము ప్రత్యక్షమునకు దూరమైనను మన హృదయమునకు హత్తుకొనియుండును అదియే సంస్కారము మరల నెన్నఁడేని నావిషయమును జూచుటగాని వినుటగాని సంభవించినచో వెనుకటి సంగతి మన తలఁపునకు వచ్చును, అట్టి తలఁపు స్మృతి

స్మృత్యుదాహరణము

కం. నాఁటి పరిరంభసౌఖ్యము
నేఁటిబలెం బాయదాత్మనిండి తొలఁకుచున్
బోఁటి ! నృసింహునిఁ బాయని
పాటలసుమగంధులెంత భాగ్యాధికలో . ౯౯

ఇటఁ బరిరంభసౌఖ్యము విభావము ఆనందాశ్రువులు నేత్రనిమీలనము, హాహాకారములు మొదలగునవి యనుభావములాక్షేప్యములు వీనిచే స్మృతి వ్యక్తమగుచున్నది.

౧౪. చాపల లక్షణము

కం. ......రాగద్వేషజనితచేష్టాద్యనవ
స్థితి చాపలము

తా. రాగద్వేషములవలనఁ బుట్టిన చేష్టాదుల యనవస్థ అనగా నిలుకడలేని చేష్టలు సేయుట చాపలము

"అమర్షాదిజన్యా వాక్పారుష్యాదికారణీభూతా చిత్తవృత్తిశ్చపలతా" అమర్షాదుల వలనఁ బుట్టినట్టియు వాక్పారుష్యాదులు గలిగించునట్టియు చిత్తవృత్తి చపలత మఱియు వేఱొకచో నిట్లుగలదు.

> "అమర్షప్రాతికూల్యేర్ష్యారాగద్వేషాశ్చ మత్సరః
> ఇతి యత విభావాస్స్యురనుభావాస్తు భర్త్సనం
> వాక్పారుష్యం ప్రహారశ్చ తాడనం వధబంధనే
> తచ్చాపలమనాలోచ్య కార్యకారిత్వమిష్యతే "

అమర్షము ప్రాతికూల్యము ఈర్ష్య రాగము ద్వేషము మాత్సర్యము అనునవి విభావములు భర్త్సనము, వాక్పారుష్యము ప్రహారము తాడనము వధ బంధనము లెస్సగా నాలోచింపక పనులుసేయుట అనునవి యనుభావములు, వీనిచేఁ జాపలము వ్యజ్యమానమగును

చాపలోదాహరణము

కం. వనిత నృసింహునిఁ గనుఁగొని
చనుగుబ్బలమీఁది వలువ చక్కఁగ దిద్దున్ ?
జనఁజూచు , మరలుఁ , జెలితోఁ
బనిలేమియుఁ బలుకు, నురమునయుఁజెయిసేర్చున్ 30

నరసభూపాలుని మీఁది రాగము విభావము పలువదిద్దుట చనఁజూచుట, ఊరక పనిలేకయుఁ బలుకుట ఉరమునఁ జేయిజేర్చుట యనునవి యాలోచింపక చేయు పను లనుభావములు. వీనిచేఁ జాపలము వ్యక్తమగుచున్నది

౧౫. ఔగ్ర్యలక్షణము

కం. ......ఎగ్గొదవిన
నతిచండత యుగ్రభావమగు నెట్లన్నన్.

ఇతరులవలనఁ దనకుఁ గీడు గలుగఁగాఁ బుట్టిన చండత యౌగ్ర్యము. "అధిక్షేపావమానాదిప్రభవా కిమస్య కరోమీత్యాద్యాకారా చిత్తవృత్తి రుగ్రతా" అధిక్షేపము అవమానము మొదలగువాని వలనఁ బుట్టినట్టియు "నేను వీనికి ప్రతీకారమేమి చేయుదును?" అను ప్రచండమగు చిత్తవృత్తి యౌగ్ర్యము. మఱియు నీ క్రింది లక్షణముగూడఁ గనవచ్చుచున్నది

"నృపాపరాధోఽసద్దోషకీర్తనం చోరధారణం
విభావాః స్యు రథో బంధో వధస్తాడనభర్త్సనే
ఏతే యత్రానుభావా స్తదౌగ్ర్యం నిర్దయతాత్మకం"

నృపాపరాధము లేనిదోషమును దలరుద్దుట, చోరధారణము ఇవి విభావములు. బంధనము వధ తాడనము, భర్త్సనము, ఇవి యనుభావములు. వీనిచే నుగ్రత వ్యక్తమగును.

ఔగ్ర్యోదాహరణము

కం. వలదువలదేఁచ గలువల
చెలికాఁడ . నృసింహుఁగూర్పు చెలిఁ ; గాకున్నన్
బోలఁతుక నిట్టూర్పు పొగల్
వెలువడి నీబింబమెల్ల వెపమాయించున్. ౩౧

ఇటఁ జంద్రతాపము (చంద్రకృతాపరాధము) విభావము 'నీబింబమెల్ల వెసమాయించున్' అనునది భర్త్సన మనుభావము. వీనిచే నౌగ్ర్యము వ్యక్తమగును.

౧౬. అవహిత్థ లక్షణము

కం. భువిలో నాకృతిగోపన
మవహిత్థ ... ౩౨

ఆకారమును దాఁచుకొనుట యవహిత్థ యందురు. "వ్రీడాదిభిర్నిమిత్తైః హర్షాద్యనుభావానాం గోపనాయ జనితో భావవిశేషోఽవహిత్థం" సిగ్గు మొదలగు వానివలన హర్షాద్యనుభావములను దాఁచునట్టి చిత్తవృత్తి యవహిత్థ.

"అనుభావవిధానార్థేఽవహిత్థం భావ ఉచ్యతే
తద్విభావ్యం భయవ్రీడా ధార్ష్ట్యకౌటిల్యగౌరవైః."

భయ వ్రీడా, ధార్ష్ట్య కౌటిల్య, గౌరవములవలనఁ బుట్టినట్టియు నను భావవిధానార్థమగు భావమవహిత్థ అనియు మఱొక లక్షణముగూడఁ గలదు.

అవహిత్థోదాహరణము

కం. హారములు గరఁగ నరస
శ్మారవ ణునిఁ జూడియొక్క సతి పులకలు మై
నీరిక లెత్తినఁ దాఁచును
సారెకు హారాంబుజనిత శైత్యం బనుచున్. 33

ఇట వ్రీడ విభావము పులకలుదాఁచుట యనుభావము వీనిచే నవహిత్థ వ్యక్తమగుచున్నవి.

౧౪. త్రపాలక్షణము

కం. మనంబు ముడుఁగుట త్రప

"స్త్రీణాం పురుషముఖావలోకనాదేః పుంసాంచ ప్రతిజ్ఞాభంగ పరాభవాదే రుత్పన్నో వైవర్ణ్యాధోముఖత్వాదికారణీభూతశ్చిత్తవృత్తివిశేషస్త్రపా" స్త్రీలకుఁ బురుషముఖావలోకనము వలనఁ గలుగునట్టియుఁ బురుషులకుఁ బ్రతిజ్ఞాభంగము, పరాభవము మొదలగువానివలనఁ గలుగునట్టిదియు వైవర్ణ్యము, అధోముఖత్వము మొదలగువానినిఁ గలిగించునట్టిదియు నగు చిత్తవృత్తివిశేషము వ్రీడ అదియే త్రప.

త్రపోదాహరణము

కం. వనిత నృసింహేంద్రుఁ బరా
కునఁ బేర్కొని శిరమువంచుకొనుఁ; జెలి యెదుటన్
గనిపించె భావమని మో
మనయముఁ గుచదుర్గవసతి నాఁగినభంగిన్. 34

ఒక వనిత పొరపాటున నరసభూపాలుని పేరుచ్చరించి తన మొగము తన భావమును దెలిపివేసెనేయని దానినిఁ గుచదుర్గములందు నిలిపెనో యన్నట్లు తలవంచుకొనెను.

ఇట నరసభూపాల నామోచ్చారణము విభావము. తలవంచుకొనుట యనుభావము. వీనిచేఁ త్రప లేక వ్రీడ వ్యక్తమగుచున్నది.

౧౮. విషాదలక్షణము

కం. వివిధోపాయాభావా
ద్వ్యవిరతభంగము విషాదమగు నెట్లన్నన్.

తా వివిధములయిన యుపాయములు లేమిఁ గలిగిన భంగపాటు విషాదము.

"ఇష్టాసిద్ధి, రాజగుర్వాద్యపరాధాదిజన్యోఽనుతాపో విషాదః" ఇష్టము సిద్ధింపకుంటవలనను, రాజ గురు ప్రభృతులయెడఁ జేసిన యపరాధాదులవలనను గలిగిన యనుతాపము విషాదము.

విషాదోదాహరణము

కం. అలరులు మరునమ్ములు; హిమ
జలమిందుకరోదితంబు; శత్రువు దలఁపం
జలిగాడ్పు; శ్రీనృసింహుం
డలిగిననాఁ డెట్లుమాను నలివకుఁ గాఁకల్? 24

ఇట నృసింహుని యలుక (ఇష్టాసిద్ధి) విభావము ''ఎట్లుమాను నలివకుఁ గాఁకల్?' అనునప్పటి ముఖసంకోచాదులనుభావము లాక్షేప్యములు, వీనిచే విషాదము వ్యక్తమగును.

౧౯. మదలక్షణము

కం మదము మదిరాకృత స
మ్మదమోహవ్యతికరంబు 25

తా మద్యపానముచేతఁ గలిగిన సంతోషమోహముల కలయిక మదము.

"మద్యాద్యుపయోగజన్మా ఉల్లాసాఖ్యః శయనహసితాది హేతు శ్చిత్తవృత్తి విశేషో మదః" మద్యపానాదులవలనఁ గలిగినట్టియు శయన హసితాదులను గలిగించునట్టియు నుల్లాసరూపమగు చిత్తవృత్తి మదము. దీనినే యిట్లు గూడఁ జెప్పుదురు "సమ్మోహానంద సందోహో మదో మద్యోపయోగజః' మద్యోపయోగమువలనఁ బుట్టిన సమ్మోహానందముల కలయిక.

ఉత్తమ పురుషాశ్రితమగు నీ మదమునకు నిద్ర యనుభావము. అనఁగా నుత్తముఁడు మదము గలిగినచో నిద్రించును మధ్యముఁడు నవ్వును, పాడును.

సించుఁడు రోదనము పరుషవచనములు మొదలగువానిని నొనర్చును మఱియు నీ మదము ముత్త్రివిధములు. తరుణము, మధ్యమము, అధమము అని. అవ్యక్తములును అసంగతములును నగు వాక్యములచేతను సుకుమారమైన తొట్రుపాటుచేతను నభినయింపఁబడునది తరుణమదము. భుజాక్షేపము, (చేతు లెగుర వేయుట) స్ఖలితము (తొట్రుపాటుతోఁ గూడిన నడక) ఘూర్ణితము. (తిరుగుడు పాటు) మొదలగువానిచే నభినయింపఁదగినది మధ్యమమదము గతిభంగ, స్మృతినాశ, హిక్కా (ఎక్కిళ్ళు) ఛర్దులు (వాంతి) మొదలగువానిచే నభిన యింపఁదగినది యధమమదము

మదోదాహరణము

కం. అమరు నృసింహుని వనమున
నమితాసవరసముతోని యలియోషలుల్
భ్రమియించు నాడు; పాడును,
రమణులతోఁ గూడి సాంద్రరాగప్రౌఢిన్ 86

పెంటితుమ్మెదలు పుష్పాసవమాని గండుతుమ్మెదలతో నాడుచుఁబాడుచు నుండును

ఇటఁ బుష్పాసవమానుట విభావము ఆట పాట లనుభావములు వీనిచే సమ్మోహానందముల కలయిక యను మదము వ్యక్తమగుచున్నది.

౨౦ ఔత్సుక్య లక్షణము

కం. ... మఱి యౌత్సుక్యం
బదన సమయాక్షమత్వము

కాలవిళంబమును సహింపలేకుండుట యౌత్సుక్యము. "అధునైవాస్య లాభో మమాస్త్వితీచ్ఛా ఔత్సుక్యం" (ఇప్పుడే నాకిది లభించుఁగాక యను కోరికయే యౌత్సుక్యము) మఱొకచో నీ క్రింది లక్షణము గలదు

సంజాతమిష్టవిరహా దుద్దీప్తం ప్రియసంస్మృతేః
నిద్రయా తంద్రయాద్గాత్ర గౌరవేణ చ చింతయా
అనుభావిత మాఖ్యాత మౌత్సుక్యం భావకోవిదైః

ఇష్టవిరహాదిరూపమగు నాలంబన విభావముచేతను ప్రియసంస్మృతిరూపమగు నుద్దీపన విభావముచేతను నిద్రా తంద్రా గాత్రగౌరవ (ఒడలుబరువుగాఁ దోఁచుట) చింతలనునను భావములచే వ్యజ్యమానమగునది యౌత్సుక్యము.

ఔత్సుక్యోదాహరణము

కం. వరుఁ డిలువఁబనిచి యెప్పుడెపు
డరుదెంచునో? యనుచుఁదలఁచి యభిముఖయగు వి
త్తరి, యింత పరాకై నను
నరయఁ దదాలోకవిఘ్నమగు ననుకీతిన్.

ప్రియవిరహమాలంబన విభావము ఆశేష్యమగు ప్రియసంస్మృతి యుద్దీపన విభావము. "ఎపు డెపు డరుదెంచునో?" అను చింతయును అభిముఖీ భావమును, అనుభావములు. వీనిచే ఔత్సుక్యము వ్యక్తమగును (తహతహపాటు)

౨౧. మతి లక్షణము

కం. మది నర్థవినిర్ణయంబు మతి యెట్లన్నన్.

తా అర్థనిశ్చయము మతి "శాస్త్రాదివిచారజన్య మర్థనిర్ధారణం మతిః" శాస్త్రాదులను విచారించుటచేఁ గలిగిన కార్యనిశ్చయము మతి అందు నిశ్శంక తదర్థానుష్ఠాన (నిస్సంశయముగా నాకార్యమనుష్ఠించుట) సంశయోచ్ఛేదములు, (సందేహములు దీఱుట) మొదలగునవి యనుభావములు

మత్యుదాహరణము

కం. చెలువరో! (శ్రీ) నరసింహుం
డలనాఁటి నృసింహమూర్తి యగుఁ గాకున్నన్
దలఁచిన తావులనెల్లను
నెలకొని సాన్నిధ్యమొందు నిపుణతగలదే.

నరసభూపాలుఁ డా నరసింహమూర్తియే; కాకున్నచోఁ దలఁచుకొన్న తావుననే ప్రత్యక్షమగునా? ఇట "తలఁచిన తావులనెల్లను...ఇత్యాదికముచేఁ గలిగిన సంశయ విచ్ఛేదముచే నృసింహుఁడే యని యర్థనిర్ధారణము సేయఁబడినది

ఇట శాస్త్రప్రమాణము విభావము. సంశయవిచ్ఛేద మనుభావము వీనిచే మతి వ్యక్తమగుచున్నది

౨౨. నిద్రా లక్షణము

కం. జగతిం జిత్తనిమీలన
మగు నిద్ర యనంగ... ౨౮

మనస్సు మూసికొనిపోవుటయే నిద్ర "శ్రమాది ప్రయోజ్యం చేతస్సమ్మీలనం నిద్రా" శ్రమాదులవలనఁ గలిగిన మనస్సమ్మీలనము నిద్ర. శ్రమాదులు విభావములు నేత్రనిమీలనము గాత్రనిష్క్రియత్వము (ఒడలు కదల్పకుండుట) మొదలగునవి యనుభావములు

కం. కలనైన శ్రీ నృసింహునిఁ
గలయంగలనంచుఁ గలికి కన్నులు మొగిచెన్
జెలి బాహ్యేంద్రియపథమున
వలరు మనంబరుగకుండ నాఁగినభంగిన్. ౨౯

కలలోనైన నరసభూపాలునిఁ గలియుదు ననియెంచి యొకయువతి తన బాహ్యేంద్రియమార్గమున మనస్సు పోకుండ నాఁపినట్లు కన్నులు మూసెను.

ఈ యుదాహరణము సుప్తికిఁ (స్వప్నము) దగినది కాని నిద్రకుఁ దగినది కాదు ఈ మనస్సమ్మీలనాత్మకమగు నిద్ర శ్రమాది ప్రయోజ్యముగాదు ఈ క్రింది పద్య ముదాహరింపఁదగినది.

కం. లలన నృసింహుని కౌఁగిట
నలసియు మవలెల్ల నిద్రనందెకు నెలమిన్
చెలపొందున రే ముద్దులు
గలికి పగల్ నిద్రవోవు కుముదినివోలెన్.

నృసింహుని కౌఁగిట నలయుట విభావము నేత్రనిమీలన గాత్రనిష్క్రియత్వాదులాక్షేప్యములగు ననుభావములు. వీనిచే నిద్ర వ్యక్తమగును.

౨౩. మోహలక్షణము

కం ... మూర్ఛనందుట మోహం
బగు ...

స్పష్టము "భయవియోగాదిప్రయోజ్యా వస్తుతత్త్వానవధారిణీ చిత్తవృత్తిర్మోహః" భయవియోగాదులవలనఁ గలిగినట్టియు వస్తుతత్త్వమును నిశ్చయింపఁ జాలనట్టియు చిత్తవృత్తి మోహము

మోహోదాహరణము

కం. అతనుశరహతుల సొరిగెను
సతి విరహాతపస్సమాధిజనితవ్రతయై
ధృతి శ్రీ నరసింహుఁ దలఁపగఁ
మతి దన్మయమగుచు మేనుమఱచిన భంగిన్. ౮౦

సతి విరహరూపతపోనియమము గలదై నరసభూపాలుఁడను నృసింహమూర్తినిఁ దలఁపఁగా నామెమది తన్మయమైనదో యన్నట్లు మన్మథబాణహతులచే మూర్ఛిల్లెను ఇటఁ బ్రియవియోగము విభావము సొరగుట (వస్తుతత్త్వానవధారణము) అనుభావము వీనిచే మోహము వ్యక్తమగుచున్నది

౨౪ బోధలక్షణము

కం. ...బోధ మెలుకఁ జెందుట

తెలివినిఁ బొందుట బోధము. "నిద్రానాశోత్తరం జాయమానో బోధో విబోధః" నిద్రానాశానంతరముఁ గలుగు మెలఁకువయే విబోధము బోధ విబోధ శబ్దములు పర్యాయపదములే

నిద్రపూర్తియైనపుడును స్వప్నాంతమందును బెద్దశబ్దము వినుటవలనను ఒకరుతాఁకుట వలనను నిద్రానాశనము గలుగును. కాన నివి విభావములు. అక్షిమర్దన గాత్రమర్దనాదు లనుభావములు

బోధోదాహరణము

కం. తరణికులాధీశయశ
స్తరుణి జడత్వంబుమాని సంఫుల్లసితాం
బురుహాక్షియు, జృంభితయై
చిరగతి మేల్కనియె శ్రీ నృసింహుఁడు గలుగన్. ౮౧

సూర్యవంశ్యరాజుల కీర్తి యింతవఱకు నిద్రించి నరసభూపాలుఁడు జనించుటచేతఁ గనులుదెఱచి యావులించి మేలుకొనెను

ఇట నరసభూపాలుని జన్మము విభావము కనులు దెఱచుకొనుట, ఆవులించుటయు ననుభావములు. వీనిచే బోధము వ్యజ్యమానమగుచున్నది.

౨౫. అంతలక్షణము (మరణము)

కం. అగణితమృతియత్న మంతమగు నెట్లన్నన్.

మరణయత్న మంతము. "రోగాదిజన్యా మూర్ఛారూపా మరణప్రాగవస్థా మరణం" రోగాదులవలనఁ బుట్టినట్టియు, మూర్ఛారూపమగునట్టిదియు నగు మరణమునకుఁ బూర్వావస్థ లేక మరణయత్నము మరణము ఇట మరణమనఁగాఁ బ్రాణవియోగమని యర్థమును జెప్పరాదు ఏలన భావమనఁగాఁ జిత్తవృత్తి విశేషమని చెప్పితిమి. ప్రాణవియోగము చిత్తవృత్తిగాదుగదా ఎల్ల చిత్తవృత్తు లగు భావములకును శరీర ప్రాణసంయోగ మవసరముగదా ః

అంతోదాహరణము

కం. వలపెటిఁగి రాఁడు, కౌఁగిట
నలమఁడు నరసావనీంద్రుఁ డని పగవఁ జామీ!
చెలులును జిలుకయు నెవ్వతి
వలనగునో యనుచుఁ గొంతవగచెద నాత్మన్. ౮౨

ఇట నరసభూపాలునిపైఁగల విరహము విభావము "చెలులును జిలుకయు నెవ్వతివలనగునో అను చింత యనుభావము. వీనిచే మరణయత్నము వ్యక్తమగుచున్నది

౨౬ ముదముయొక్క లక్షణము (ముదము హర్షము)

కం. ముద మిష్టలాభభవమ
మ్మోదమగు

ఇష్టము లభించుటవలనఁ గలిగిన సంతోషమను చిత్తవృత్తి ముదము.

దేవ భర్తృ గురు స్వామి ప్రసాదః ప్రియసంగమః
మనోరథా ప్తిరప్రాప్యమనోహరధనాగమః
తథోత్పత్తిశ్చ పుత్రాదేర్విభావో యత్ర జాయతే
నేత్రవక్త్ర ప్రసాదశ్చ ప్రియోక్తిః పులకోద్గమః
అశ్రుస్వేదాదయశ్చానుభావా హర్షం తమాదిశేత్.

దేవ భర్తృ, గురు స్వామి, ప్రభృతుల యనుగ్రహము ప్రియసంగమము, మనోరథలాభము అప్రాప్యుఁడగు మనోహరుఁడు ధనము మొదలగువాని

రాక, పుత్రాద్యుత్పత్తి మొదలగునవి విభావములు నేత్రప్రసన్నత ముఖప్రసన్నత, ప్రియభాషణము, పులకోద్గమము, అశ్రూదయము స్వేదోదయము మొదలగునవనుభావములు. వీనిచే ముదము వ్యక్తమగును.

ముదుదాహరణము

కం. అలుఁలై కింశుకశిఖలోఁ
    దెలఁగుచు మున్నెంత తపముఁజేసెనొ? చెలివే
    నలి; నరసింహుని యురమునఁ
    దెలువగు చెంగల్వదండ చేరువగలిగెన్. రా॥

చెలియొక్క కొప్పు పూర్వజన్మమునఁ దుమ్మెదలై మోదుగపూవుటగ్గిలోఁ దపము సేసినదానికి ఫలముగా నీజన్మమున నరసభూపాలుని వక్షఃస్థలమున నున్న చెంగల్వదండ సాన్నిధ్యమును బొందెను.

ఇట దేవతానుగ్రహము విభావము. వేనలి యచేతనమగుటచేఁ దానికిఁ జిత్తవృత్తి రూపమగు ముదమెట్లుండును? కావుననే నేత్రప్రసన్నతాద్యనుభావములును లేవు కావునఁ జేతనకర్తృకమగు నుదాహరణము నీయవలెను చూడుఁడు.

కం నిలబడి నీముందెవ్వఁడు
    కలికి కలిగించెఁ గనులఁగళుకుల్ బెళుకుల్?
    కలికించెను గనుబొమలను?
    బులకింపఁగఁ జేసె గాత్రము మనోజ్ఞముగన్

ఇటఁ బ్రియసన్నిధి విభావము కనులయందుఁ గళుకులు తళుకులు, కనుబొమ్మలయందుఁ గులుకులు గాత్రము పులకించుటయు ననుభావములు. వీనిచే హర్షము వ్యజ్యమానమగుచున్నది

౨౭ ఆలస్య లక్షణము

కం. ... కర్తవ్యకార్యమందోద్యోగం
    బది యలసత

చేయవలసిన పనులయందుఁ జురుకుదనములేమి యాలస్యము

"అతితృప్తి గర్భ, వ్యాధి శ్రమాదిజన్యా చేతసః క్రియానున్ముఖతా ఆలస్యం" అతితృప్తి గర్భ వ్యాధి శ్రమాదులవలనఁ బుట్టినట్టియు మనస్సునకుఁ గార్యమై ముఖ్యమును గలిగించునట్టియుఁ జిత్తవృత్తి యాలస్యము

అసమర్థత యాలస్యమని యెంచరాదు కార్యాకార్యవివేకశూన్యత్వ మాలస్యముగాదు గ్లానియందసామర్థ్యము జాడ్యమందుఁ గార్యాకార్య వివేక శూన్యత్వమును గలవు ఆలస్యమున గార్యవైముఖ్యము కాన నీ భేదమును గ్రహింపవలెను.

ఆలస్యోదాహరణము

కం. చెలులాహారాదులకుం
    బిలిచిన నఱుగంటఁ జూచుఁ బ్రియుఁడు నృసింహుం
    డలఘునృపకుంజరుండని
    యలికుంతల కుంభినీత్వమందెనొ కానన్. ౭౫

నరసభూపాలుఁడు నృపకుంజరుఁడుగాన నా యువతియుఁ గుంభిని (ఆడ యేనుఁగు) గానయ్యెనో యన్నట్లు చెలులాహారాదులకుం బిలిచిన నఱగంటఁ జూచును. (ఆడయేనుఁగు గూడ నఱగంటనే చూచును)

ఇట విరహశ్రమ విభావము. అఱకంటఁ జూచుట (కార్యవైముఖ్యము) అనుభావము వీనిచే నాలస్యము వ్యజ్యమానమగును.

౨౮ వితర్క లక్షణము

కం, ... సందేహా
    ద్యుదయబహుత్వము వితర్కమొగి నెట్లన్నన్.

అనేక సందేహములు గలుగుట వితర్కము "సందేహాద్యనంతరం జాయమాన ఊహో వితర్కః" సందేహాదులు గలిగినపిమ్మటఁ బుట్టిన యూహ వితర్కము నరసభూపాలీయ లక్షణములో నీ యర్థము కానరాదు. కేవలము పెక్కు సందేహములు గలుగుటకాక సందేహానంతరమునఁ గలిగిన యూహయే వితర్కము అదియు నిశ్చయానుకూలముగా నుండవలెను. అనఁగా దుది కా వితర్కము నిశ్చయమునకుఁ దోడ్పడవలయును

వితర్కోదాహరణము

కం. చెలుల తెలుఁగరాదు భావము;
    చెలు తెలుఁగకయున్న మరునిచే రాయిడియౌఁ,
    జెలులును మనసౌకలైనను
    వల పెటిఁగి నృసింహవిభుఁడు వచ్చునొ? రాఁడో? ౭౬

ఇట సందేహమే కాని నిశ్చయానుకూలమగు నూహలేదు కాన నిది దోషగ్రస్తము. రసగంగాధరలక్ష్య మిత్తును

యది సా మిథిలేంద్రనందినీ నితరామేవ న విద్యతే భువి
అథ మే కథమస్తి జీవితం న వినాలంబనమాశ్రితస్థితిః

ఆ సీత భూలోకమున నుండకయేపోయినచో నా జీవిత మెట్లు నిలిచి యుండును ? ఆమె లేకున్నచో నా జీవితము పోయియేయుండును ఏలన నాలంబనము లేకుండ దదాశ్రితవస్తువుండదు గదా !

సీత కలదా ? లేదా ? యను సందేహము విభావము కనుబొమ్మ తెగుర వేయుట శిరస్సు నాడించుట వ్రేళ్ళనాడించుట మొదలగు ననుభావము లాక్షేప్యములు. ఇది చింత యని భ్రమింపరాదు. ఏలన, చింత నిశ్చయాంతముగా నుండదు. ఏమగును ? ఎట్లగును ? అను చిత్తవృత్తి చింత 'ఇది యిట్లగును' అను నిశ్చయగర్భమగు చిత్తవృత్తి వితర్కము

౨౯. సుప్తిలక్షణము

కం. అతినిద్ర సుప్తి. ౮౭

ఈ లక్షణము దుష్టము. ఏలన సుప్తి యనఁగా స్వప్నము. గాఢ నిద్రయు స్వప్నమును నొక్కటిగావు 'నిద్రావిభావోత్థజ్ఞానం సుప్తం' నిద్ర వలనఁ గలిగిన జ్ఞానము స్వప్నము దీని కనుభావములు ప్రలాపాదులు నిద్రకు నేత్రనిమీలన గాత్రనిష్క్రియత్వాదు లనుభావములని చెప్పితిమి

సుప్త్యుదాహరణము

కం లలన నృసింహుని కౌఁగిట
నలసియొ సవలెల్ల నిద్రనందెడు నెలమిన్
నెలపొందున రే ముద్దులు
గులికి పగల్ నిద్రవోవు కుముదినివోలెన్. ౮౮

ఇది స్వప్నమున కుదాహరణార్హముగాదు నిద్రకు దీని నుదాహరించితిమి. ఈ క్రిందిపద్య ముదాహరణీయము

గీ నిన్నపగటిపూట నిద్రలో నినుఁగూర్చి
పాపమానెంత పలవరింప
సవతి నవ్వె నత్త దివులొందె బావ వెత్తి
మూసిరంత దాని మొగముఁ జెలులు.

ఇట నిద్ర విభావము ప్రలాపమనుభావము. (పలవరించుట) వీనిచే స్వప్నము వ్యక్తమగుచున్నది

౩౦. అసూయాలక్షణము

కం. ... ఇతరుల యతిశయము సహింపకుండుటది యీర్ష్యయగున్

"పరోత్కర్షదర్శనాదిజన్యః పరనిందాదికారణీభూతశ్చిత్తవృత్తివిశేషః అసూయా" పరులయుత్కర్షమును జూచుట మొదలగువానివలనఁ బుట్టినట్టి చిత్తవృత్తివిశేష మసూయ

అసూయోదాహరణము

కం. ఈవికోలఁ దంతె తనమే
లేవేళను బాఁడుశోభ, యెనయే నాకున్
వావిరిఁ గీర్త్యంగన? యని
శ్రీ వెలయ నృసింహునొద్దఁ జిరతరలీలన్.

లక్ష్మీదేవి నరసభూపాలుని కీర్తి విభవమును జూచి సహింపక దాని నిందించుచు నాతనినిఁ దాన్నాశ్రయించు కొనియున్నది ఇటఁ గీర్తియొక్క యుత్కర్షము విభావము. ఈవికోలఁదంతెతనమేలు ఏవేళను బాండుశోభ; (ఒకానొక రోగము) ఇట్టి నిందావచనములనుభావములు వీనిచే నసూయ వ్యజ్యమానమగును.

౩౧. ఆధ్యాన (చింతా) లక్షణము

కం. హితవస్తువు చేకూఱమి
నతులాధ్యానంబు చింతయగు నెట్లన్నన్.

ఇష్టము సిద్ధింపకుండుటవలనఁ గలుగు నాధ్యానము (పునఃపునరాలోచన) చింత యనఁబడును.

"ఇష్టాప్రాప్త్యనిష్టప్రాప్త్యాదిజనితాఽధ్యానాపరపర్యాయా వైవర్ణ్య, భూలేఖన అధోముఖత్వాదిహేతుశ్చిత్తవృత్తివిశేషశ్చింతా" ఇష్టము లభింప కుండుట అనిష్టము వచ్చిపడుట మొదలగువానివలనఁ బుట్టినట్టియు, ఆధ్యానమను నామాంతరము గలిగినట్టియు వైవర్ణ్యము భూలేఖనము అధోముఖత్వము మొదలగు వానినిఁ గలిగించునట్టియు చిత్తవృత్తివిశేషము చింత మఱియు నిట్లు గలదు

"విభావా యత్ర దారిద్ర్యమైశ్వర్య భ్రంశనం తథా
ఇష్టార్థాపహృతిః శశ్వద్భ్యాసోచ్ఛ్వాసావధోముఖం
సంతాపః స్మరణంచైవ కార్శ్యం దేహానుపస్కృతిః
అధృతిశ్చానుభావాస్స్యుః స్సా చింతా పరికీర్తితా
వితర్కోఽస్యాః క్షణే పూర్వే పశ్చాత్యే వోపజాయతే"

దారిద్ర్యము, ఐశ్వర్య భ్రంశనము ఇష్టార్థము సిద్ధింపకుండుట మొదలగునవి విభావములు నిట్టూర్పులు, తలవాల్చుట సంతాపము స్మరణము కృశించుట దేహసంస్కారము లేకుండుట. అధైర్యము అనునవి యనుభావములు ఈ చింతకు ముందువెనుకలలో వితర్కముగూడ జనించును

అధ్యానోదాహరణము

కం. సతి చెక్కిటఁ జెయిసేర్పఁగ
నతులకరాంగుళులు సాంజనాశ్రుయుతములై
రతిపతి కానట మించిన
శితపంచశరమ్ములనఁగఁ జెలఁగు నృసింహా! ౮౯

నాయిక చెక్కిటికైఁ జేయిసేర్పఁగా దాని చేతివ్రేళ్ళు మన్మథునకు సాహాయ్యము సేయుటకు నతిశయించిన యైదు వాఁడిబాణము లన్నట్లుండెను.

ప్రియాప్రాప్తి విభావము చెక్కిటఁ జెయిసేర్చుట యనుభావము వీనిచేఁ జింత వ్యక్తమగును.

౩౨. ఉన్మాద లక్షణము

కం అనయంబు చేతనాచే
తనసదృశమనోభ్రమంబు ధర నున్మాదం
బనఁబొల్చు...... ౯౦

చేతనాచేతనవస్తువులయందు సమానమగు చిత్తవిభ్రాంతి యున్మాదము.

"విప్రలంభ మహావిపత్తి పరమానందాదిజన్మా అన్యస్మిన్నన్యావభాసః ఉన్మాదః" విప్రలంభము మహాపద పరమానందము మొదలగువానివలనఁ బుట్టినట్టియు నొకదానిని మఱొకదానినిఁగా భ్రమింపఁ జేయునట్టియు చిత్తవృత్తి విశేష మున్మాదము.

ఉన్మాదోదాహరణము

కం. నినుఁ బ్రార్థించెద భ్రమరమ
చని నరసింహేంద్రుఁ దెమ్ము. చనవలదో హా!
చనిన నృపాలుముఖాంబుజ
ఘనవాసనఁదగిలి నీవు క్రమ్మఱవుగదా! 80

ఇట భ్రమరమునకు నరసభూపాలునిఁ గొనివచ్చు సామర్థ్యము లేదని తెలియక యున్నట్లుగా భావించి నాయిక సంబోధించినది, పై యున్మాదలక్షణ మిటఁబట్టదు. ఈ క్రింది పద్యము తగినది

గీ అన్న ! భృంగంబ ! భ్రమియింతువఖిలదిశల
నాదు వలపురాణి కన్పట్టెనోయి
'ఔ' వటందువు సఖ ! తెల్పు మాలసింప
కెచటఁగల ? దేమి గావించు ? నెట్టిదామె ?

ఇట ప్రియావిప్రలంభము విభావము ఇట్టి యసంబద్ధప్రలాపమనుభావము. వీనిచే నున్మాదము వ్యక్తమగుచున్నది

"ఉన్మాదస్తుల్యవర్తిత్వం చేతనాచేతనేష్వపి" (చేతనాచేతనములందుఁ దుల్యముగా వర్తించుట యున్మాదము) అని ప్రతాపరుద్రీయ లక్షణము అట్టిచోఁ జేతనములయందచేతన వ్యవహారము సేయుట అచేతనములందుఁ జేతన వ్యవహారము సేయుటయే యున్మాదమని యర్థము వచ్చును అట్టిచో "అన్న భృంగంబ " ఇత్యాదు లున్మాదోదాహరణములు గాకపోవును విక్రమోర్వశీయములో నాల్గవయంకమందీ యున్మాదమెంతో హృద్యముగా వర్ణింపఁబడినది. అచ్చటఁ గూడఁ గేవలము చేతనములందచేతన వ్యవహారము అచేతనములందుఁ జేతన వ్యవహారము మాత్రమే లేదు కాన రసగంగాధరమునందలి "అన్యస్మిన్నన్యావభాసః" అను లక్షణమే యుచితము.

ఉన్మాదము గూడ నొక వ్యాధియేకదా దీనిని వ్యాధిలో నేల యంతర్భవింపఁజేయరాదు ? అన్నచో మిగిలిన వ్యాధులకన్న నిది విచిత్రమైన దగుటచే బ్రత్యేకముగా గ్రహింపఁబడినది.

33. అపస్మార లక్షణము

కం. ...ధాతుచలనము
దనర నపస్మారమనఁగఁదగు నెట్లన్నన్.

ధాతువులగు వాత, పిత్త, శ్లేష్మములయొక్క సంచలనమువలన నపస్మారము గలుగును.

"వియోగ, శోక, భయ జుగుప్సాదీనామతిశయాత్ గ్రహావేశాదేశ్చ, ఉత్పన్నో వ్యాధివిశేషోఽపస్మారః" వియోగ భయ జుగుప్సాదులతిశయించుట వలనను బుట్టిన వ్యాధివిశేష మపస్మారము

ఇది వ్యాధిలో నంతర్భవించును కాని విశేషాకారముగాఁ జెప్పుటవలన బీభత్స భయానక రసములలో నీ యపస్మారమే వ్యభిచారియగును కానీ కేవల వ్యాధి వ్యభిచారి కాఁజాలదు అని తోఁపింపఁజేయును దీనికి వియోగ శోకాదుల యతిశయము విభావము. కంప, ఫేన నిశ్శ్వాస, భూపాత, విపర్యాస, జిహ్వా లోలనాదు లనుభావములు.

కం. మదనగ్రహంబు సోఁకెను
సుదతీమణి దీర్ఘదృష్టిఁ జూచెడుఁ జెలులన్
ముద మొదవ రతుఁగట్టుఁడు;
మదవతికి నృసింహనామమంత్రము శతనన్. ౯౨

మదనావేశము విభావము దీర్ఘదృష్టి యనుభావము. వీనిచే నపస్మారము వ్యక్తమగును. (ఇందు నరసభూపాలీయ లక్షణము పట్టదు. గ్రహావేశాదేశ్చ' యిత్యాదికమగు రసగంగాధర లక్షణము పట్టును)

వ్యభిచారిభావములు ముప్పదిమూఁడు మాత్రమే యని సంఖ్యానియమమేల చేయవలెను? మాత్సర్య, ఉద్వేగ, దంభ ఈర్ష్యా వివేక నిర్ణయ క్లైబ్య క్షమా కుతక ఉత్కంఠా వినయ, సంశయ ధార్ష్ట్యాదులగు భావములు లక్ష్యము లందటనటఁ గానవచ్చుచున్నవే అన్నచో నట్లుగాదు. ఈ మాత్సర్యాదు లుదాహృతములయిన ముప్పదిమూఁడు భావములలోనే యంతర్భవించును. ఎట్లన, నసూయలో మాత్సర్యము, త్రాసమున నుద్వేగము, అవహిత్థమున దంభము, అమర్షమున నీర్ష్య మతియందు వివేకనిర్ణయములు, దైన్యమునందుఁ గ్లైబ్యము ధృతియందు క్షమ ఔత్సుక్యమునందుఁ గుతుకోత్కంఠలు, లజ్జయందు వినయము, తర్కమునందు సంశయము చాపల్యమునందు ధార్ష్ట్యమును, నంతర్భవింపఁజేయుదుము అలఁతిభేదము వీనికున్నను మొదటివగు నసూయాదులు లేకున్నచో మాత్సర్యాదులు గలుగవు అనఁగా వానికిఁ బరస్పరమవినాభావ సంబంధము గలదు కావున మాత్సర్యాదులకుఁ బ్రత్యేక గణనము చేయఁబడదు. ఈ వ్యభిచారి భావములలోఁ గొన్ని వానికి విభావములగును. కొన్ని యనుభావ ములగును ఎట్లన ఈర్ష్య నిర్వేదమునకు విభావమును అసూయకనుభావమును

నగును చింత నిద్రకు విభావమును ఔత్సుక్యమున కనుభావమును నగును. ఇట్టి వూహ్యములు

"రత్యాదయోఽప్యనియతే రసే స్యుర్వ్యభిచారిణః" (రత్యాదిస్థాయి భావములు గూడ నితర రసములందు వ్యభిచారులగును) అని భరతమతమని చెప్పితిమి. ఈ రత్యాదులే యే రసములలో వ్యభిచారులగునో తెలుపఁబడును అసలు రత్యాదిభావములు శృంగారాదులలో ననుచ్ఛిద్యమానములుగా ననఁగా నవిచ్ఛిన్నముగా రసస్ఫూర్తివఱకు నుండును. కాన నవి యచ్చట స్థాయిభావములు మరొకరసమందవి రసస్ఫూర్తివఱకు నుండవు కాన నవి యచ్చట స్థాయిభావములుగావు కాన వ్యభిచారులగును

శృంగారవీరయోర్హాసో వీరే క్రోధస్తథా మతః
శాంతే జుగుప్సా కథితా వ్యభిచారితయా పునః
ఇత్యాద్యన్యత్సమున్నేయం తథాభావితబుద్ధిభిః (సాహిత్యదర్పణము)

శృంగార వీర రసములలో హాసస్థాయిభావమును వీరమునఁ గ్రోధస్థాయిభావమును, శాంతమున జుగుప్సాస్థాయిభావమును వ్యభిచారులగును, మిగిలినవాని నూహించుకొనవలెను. ఇంకను హాస మద్భుతమందును గ్రోధము శృంగారమందును శోకము శాంతమునందును గూడ వ్యభిచారులుగా నుండ వచ్చును అని రుచిరవ్యాఖ్య

'రతిర్దేవాదివిషయా వ్యభిచారీ తథాంజితః భావః ప్రోక్తః" దేవాది విషయకరతియు వ్యంజితమైన భావమును వ్యభిచారి యని చెప్పఁబడును. సాహిత్యశాస్త్రకారులు నాయికానాయకుల రతి స్థాయిభావమనియు దేవతా విషయకరతి వ్యభిచారిభావ మనియును బేర్కొనిరి. 'తత్ర స్త్రీపుంసయో రన్యోన్యాలంబనః ప్రేమాఖ్యశ్చిత్తవృత్తివిశేషో రతిః స్థాయిభావః, గురుదేవతా పుత్త్రాద్యాలంబనస్తు వ్యభిచారీ' స్త్రీ పురుష లన్యోన్యాలంబనముగాఁగల ప్రేమ మను పేరుగల చిత్తవృత్తివిశేషమగు రతి స్థాయిభావ మనియు గురు, నృప, ముని దేవ పుత్త్రాద్యాలంబనముగల ప్రేమమను పేరుగల చిత్తవృత్తివిశేషమగు రతి భావమనియుఁ జెప్పఁబడును. నాయికానాయకులయందును దేవాదులందును గలది ప్రేమరూపచిత్తవృత్తివిశేషమగు రతి యొక్కటియే కాని మొదటిది స్థాయిభావమనియు, రెండవది వ్యభిచారిభావమనియను బేర్కొనిరి. కావుననే జగన్నాథుఁడు దేవాదిరతినిఁ గూడఁ గలపి వ్యభిచారిభావములు ముప్పదినాలుగని చెప్పెను ('గురుదేవ నృపపుత్రాదివిషయారతిశ్చేతి చతుస్త్రింశత్ '')

కం. అరవుగ సిభావంబులు
 బరగెడు ననుభావములు విభావంబులు న
 న్యరసంబులకుం గలవవి
 విరచింపఁగనొల్ల నిందు విస్తరభీతిన్. ౯౩

గ్రంథవిస్తరభీతిచే మిగిలిన రసములయొక్క విభావానుభావములను జెప్పుట మానివేసితినని గ్రంథకర్త తెలుపుట యనుచితము. ముఖ్యముగాఁ జెప్ప వలసిన వానినిఁ జెప్పుట గ్రంథవిస్తరము కాఁజాలదు.

గీ. ఇంక శృంగారచేష్టల నేర్పరింతు
 నవియు నష్టాదశాఖ్యలై యలరుచుండు
 లలితగతి వీని నామముల్ లక్షణములు
 క్రమముతోఁ దెల్పి వీని లక్ష్యములొనర్తు. ౯౪

వెనుక శృంగారరసమునకుద్దీపనవిభావములుగాఁ బేర్కొనఁబడిన నాల్గిం టిలోఁ జేష్ట యొకటి ఇచ్చట నాచేష్టలను గ్రంథకర్త యుదాహరించుచున్నాఁడు. ఈ చేష్టలు నాయకునకుద్దీపనవిభావములును నాయికకుననుభావములును నగును. ఈ చేష్టలు శృంగారమునకేకాక యితరరసములకుఁగూడ భిన్నభిన్న ములుగాఁ గలవు. కాని యిట శృంగారచేష్టలుమాత్రమే చూపఁబడినవి. ఏలన, గ్రంథకర్త శృంగారరసము నొకదానినే నిరూపించెను. మిగిలిన రసములను వాని స్థాయివ్యభిచార్యాదిభావములను సాహిత్యదర్పణమునుండి ముందు మేముదాహ రించి చూపఁగలము.

కం. ఇల భావ, హావ, హేలా,
 విలాస, మాధుర్య, ధైర్య, విభ్రమ, లీలా,
 కిలికించిత, మోట్టాయిత,
 లలితా, దులు చేష్టలగుఁ దలంపఁగ మఱియున్. ౯౫

గీ. వెలయు బిబ్బోక, విచ్ఛిత్తి, విహృత, చకిత,
 హసిత, కుట్టమిత, కుతూహ, లాదు లనఁగ
 గలవు...... .... ౯౬

భావము, హావము, హేల విలాసము, మాధుర్యము ధైర్యము, విభ్ర మము, లీల, కిలికించితము మోట్టాయితము, లలితము బిబ్బోకము, విచ్ఛిత్తి, విహృతము, చకితము, హసితము, కుట్టమితము, కుతూహలము, అని శృంగార

చేష్టలు పదునెనిమిది. ప్రతాపరుద్రీయమునఁ గూడ నీ విధముగనే యున్నవి కాని సాహిత్యదర్పణమున నివి యిఱువది యెనిమిది గలవు. అవి యివి :

యౌవనే సత్త్వజాస్తాసామష్టావింశతిసంఖ్యకాః
అలంకారాస్తత్ర భావహావహేలాస్త్రయోఽంగజాః
శోభా కాంతిశ్చ దీప్తిశ్చ మాధుర్యం చ ప్రగల్భతా
ఔదార్యం ధైర్యమిత్యేతే సప్తైవ స్యురయత్నజాః
లీలా విలాసో విచ్ఛిత్తి ర్బిబ్బోకః కిలికించితం,
మోట్టాయితం కుట్టమితం, విభ్రమో, లలితం మదః,
విహృతం, తపనం మౌగ్ధ్యం విక్షేపశ్చ, కుతూహలం,
హసితం చకితం కేళి రిత్యష్టాదశసంఖ్యకాః
స్వభావజాశ్చ ; భావా ద్యాదశ పుంసాం భవంత్యపి

యౌవనము వచ్చినపుడు చెప్పఁబోవు నిఱువదియెనిమిది యలంకారములును, సత్త్వమువలనఁ బుట్టును సత్త్వమనఁ బెక్కర్థములను వెనుకఁ జూపి యుంటిమి అందలి 'స్వాత్మవిశ్రామరత్యాది ప్రకాశకారికశ్చన అంతరో ధర్మస్సత్త్వం (తనయాత్మయందు విశ్రమించిన రత్యాదులను ప్రకాశింపఁజేయు నొక యాంతర ధర్మము) అనునర్థమిట గ్రాహ్యము అవియేవన భావము, హావము హేల, యివి మూఁడును మనస్సువలనఁ బుట్టును శోభ కాంతి, దీప్తి, మాధుర్యము ప్రగల్భత నౌదార్యము ధైర్యము, ఇవి యేడును నయత్నముగాఁ బుట్టినవి పైనుదాహృతములగు మూఁడును నీ యేడును గలిపి పదియు స్త్రీ-పురుషులు కిరువురకునుఁ గలుగును లీల విలాసము విచ్ఛిత్తి, బిబ్బోకము, కిలికించితము మోట్టాయితము కుట్టమితము విభ్రమము లలితము, మదము, విహృతము, తపనము, మౌగ్ధ్యము కుతూహలము హసితము చకితము, కేళి, యనునవి పదునెనిమిదియు స్వభావజములు స్వభావమనఁ దన మనోవికార విశేషము భావాదిధైర్యాంతమగు పదియుఁ బురుషులకుఁ గూడ గలుగునని చెప్పినను నివ్వన్నియు నాయికాశ్రితములయి యున్నపుడే రమణీయములుగా నుండును.

ప్రతాపరుద్రీయకర్తయు, వాని ననుసరించి నరసభూపాలీయకర్తయు వీని నన్నింటిని శృంగార చేష్టలనియే యనిరి సాహిత్యదర్పణకర్త వీని నలంకారములని వ్యవహరించెను ఇందు మూఁడు మనోభవములగు నలంకారములు, ఏఁడయత్నజములయిన యలంకారములు పదునెనిమిది స్వభావములయిన యలంకారములు.

నరసభూపాలీయకర్త శోభ కాంతి, దీప్తి ప్రగల్భత, ఔదార్యము, మదము తపనము మాధుర్యము విక్షేపము కేళి అను పదింటిని వర్ణింపలేదు.

ప్రతాపరుద్రీయకర్త అంగజ అయత్నజ స్వభావజ, భేదములనుగూడ దెలుపలేదు. విద్యానాథుఁ డిరువది యెనిమిదింటిలో నీపదునెనిమిదియే ముఖ్యమని తలఁచెనేమో। ఇందలి భావాదుల లక్షణములును, లక్ష్యములును దోషగ్రస్తములుగా నుంటచే సాహిత్యదర్పణ లక్షణములును గూడఁ జూపుదుము

౧. భావలక్షణము

గీ. ...మటి యందు భావంబు వెలయుచుండు
మహి రసజ్ఞానయోగ్యతామాత్రమగుచు

భావమనఁగా రసజ్ఞానయోగ్యత యని లక్షణము కాని రసజ్ఞానయోగ్యత కాదు. రసజ్ఞానయోగ్యమగు మనోవికారము అని చెప్పవలయును బాల్య యౌవన సంధియం దుత్పన్నమయిన శృంగారవిషయకమగు మొదటి యంతఃకరణవికారము భావమనఁబడును యౌవనము రాకముందు శృంగారరసమును దెలిసికొను యోగ్యత యుండదు అది రాఁగానే దాని నెఱుఁగజాలు నొక మనోవికారము గలుగును. 'భావయతిరిరంసామితి' భావః (రమించుకోర్కెనుఁ దెలుపునది మనోవికారము) దీనినే సాహిత్యదర్పణకర్త 'నిర్వికారాత్మకే చిత్తే భావః ప్రథమవిక్రియా" (నిర్వికారాత్మమగు చిత్తమునఁ బ్రప్రథమమునఁ గలిగిన వికారము) అని నుడివెను

భావోదాహరణము

చ. వరుఁడని పేర్కొనన్ శిరమువాంచుఁ దలోదరి సాలభంజికా
పరిణయవేళ; నెచ్చెలులఁ బాయక యెప్పటియట్ల కేళికాం
తరమొనరింపఁబోదు, చనెనా యెదఁ బయ్యెదఁ జేర్చిసిగ్గునం
బరగుఁ బ్రియాంగనానుకృతిభావనకేళికిఁగాఁ గనిచ్చలున్. ౭౬

బొమ్మలపెండ్లివేళ నొక మగబొమ్మను నరసభూపాలుఁడనియు నొకయాఁడుబొమ్మను దన్నుగాఁ జెలికత్తెలు పేర్కొన నొక యువతి శిరము వంచుకొనెను పిమ్మట వారితోఁ గలిసి యామె కేళికాంతరమునకు (ఆ బొమ్మల సంయోగ (సంభోగ రూపక్రీడకు) పోదయ్యెను ఒకవేళ వెళ్ళినచోఁ దన్నుతని ప్రియాంగనగా (నిజమునకుఁగాకున్నను) భావించుకొనుచు సిగ్గున నుండును.

ఇట శిరము వాంచుటచేత మనోవికారమలఁతిగాఁ దెలియుచున్నది ఈ లక్ష్యము సరిగాదు. ఏలన నీవికారముయొక్క యనుభావము శరీరమునఁ గానఁబడఁగూడదు ఇట శిరస్సువంచుటయను ననుభావము శరీరమునఁ గనఁబడు

చున్నది. కావున నిది భావమున కుదాహరణార్హముగాదు సాహిత్యదర్పణమున

స ఏవ సురభిః కాలస్స ఏవ మలయానిలః
సై వేయమబలా ; కింతు మనోఽన్యదివ దృశ్యతే

తా॥ ఆ వసంతకాలమే యిది , ఆ మలయానిలమే యిది ; ఆ యబలయే యిది ; కాని మనస్సుమాత్ర మది కానట్లున్నది ఇట శరీరమున నెట్టి యనుభావములును జెప్పఁబడలేదు.

౨ హావ లక్షణము

కం. అది యీషద్వ్యక్తముగా
సుదతులయెడ హావమయ్యె ;

ఆ భావమే కొంచెముగా వ్యక్తమగుచో హావమనఁబడును
" భ్రూనేత్రాది వికారైస్తు సంభోగేచ్ఛాప్రకాశకః ।
భావ ఏవాల్పసంలక్ష్యవికారో హావ ఉచ్యతే

భ్రూనేత్రాదివికారములచే సంభోగేచ్ఛను దెలుపు నాయల్పముగాఁ గైకొఁ గనఁబడు వికారమే హావము

హావోదాహరణము

చ. పడఁతి నృసింహుగీతములు పాడెడివేళ నృసింహునామమున్
నుడువదుసిగ్గుతో ; గురుజనుల్ నరనాథు గుణప్రశంస లే
ర్పడ నొనరించుచో నుచితభక్తి మెయిన్ గురుసేవ సేయు నై
వడి వడినాలకించుఁ; దలవాంచుఁ; బరాకగుఁగొంత వింతగన్.

తా॥ ఇట నృసింహుని నామమును నుడువకుండుట పెద్దలాతని గుణప్రశంస సేయునపుడాలకించుచుండుట పరాకును వహించుట మొదలగువాని వలన నా యువతి భావ మీషద్వ్యక్తమగుచున్నది. కావున నిది హావము.

౩. హేలా లక్షణము

కం. ......సువ్యక్తంబై
పొదలిన ననవరతంబును
నది మిక్కిలి హేలయయ్యె నది యెట్లన్నన్.
ఆ మనోవికారము సువ్యక్తమయినచో 'హేల' యనఁబడును

హేలోదాహరణము

ఉ. మేలములాడుచుం గడు సమేళములై చెలులెల్లఁగూడి యో
"బాలిక! శ్రీనృసింహనరపాలు వరించెదవే" యటన్న నీ
లాలక యంగవల్లిఁ బులకాంకురముల్ ననలొత్త నేమనం
జాలక యూరకుండె ననిశంబు త్రపావృతయై నశైవడిన్ ౯౯

ఇటఁ గన్యకకు సర్వాంగీణమగు గగ్గుఱుపాటు గలిగినది. ఇట మనోవికారమత్యంతము వ్యక్తముగా నున్నది కాన నిది హేల.

ఈ భావ, హావ హేలల లక్షణములు జాగ్రత్తగాఁ దెలిసికొనవలెను. భావమలక్ష్యవికారము (పైకెట్టి వికారమును గానరానిది.) హావ మల్పలక్ష్య వికారము (అల్పముగాఁ గనఁబడు వికారము గలది) హేల యత్యంతలక్ష్య వికారము (మిక్కిలియును గనఁబడు వికారము గలది)

౨. విలాస లక్షణము

కం. పతిఁ గనఁ దాత్కాలికమగు నతులవికారము విలాసమగు. ౧౦౦

పతి కనఁబడఁగానే యా సమయమునఁ గలిగిన వికారము విలాసము.

"యానస్థానాసనాదీనాం ముఖనేత్రాది కర్మణాం
విశేషస్తు విలాసస్స్యా దిష్టసందర్శనాదినా"

ఇష్టునిఁ జూచుట మొదలగువానిచేఁ నడకలో, ఉనికిలో కూర్చుండుటలో మాటలాడుటలోఁ, జూచుట మొదలగు కార్యములలోఁ గనఁబడు విశేషము విలాసమనఁబడును. దీనినే యొయ్యారమందురు.

విలాసోదాహరణము

కం. ఇరుగడల వెడలి సుడిగొని
తరళములై వెలికి బెళికి తళతళమనుచున్
బరగు రువారపుఁజూపుల
హరిణాక్షి నృసింహవిభునికారతిసేసెన్. ౧౦౧

ఆ సుడిగొన్నట్టియు తరళములయినట్టియుఁ దళతళలాడుచున్నట్టియుఁ జూపులచే నొకయువతి నరసభూపాలుని కారతిసేసెను. ఇట బెక్కువిధములగు చూపులు వర్ణింపఁబడినవి ఇది విలాసము.

౫. మాధుర్య లక్షణము

కం. ......సొమ్ములు లే
కతిరమ్యత్వము దలఁపఁగ
నతివలకున్ మధురభావమగు నెట్లున్నన్.

నగలులేకయు నతిరమణీయముగాఁ గనఁబడుట మాధుర్య మనఁబడును. "సర్వావస్థావిశేషేషు మాధుర్యం రమణీయతా." ఎల్ల యవస్థలందును నవఁగా నెట్లున్నను రమణీయముగాఁ గానఁబడుట మాధుర్యము

మాధుర్యోదాహరణము

చ. కనుఁగవ కెంపు నార్ద్రనఖగౌరతయుం జెలువొందనొక్కయం
గన రతివేగశీర్ణమణికంకణనూపురహారవల్లియై
మునుపటికన్నఁబొల్పగు సముజ్జ్వలతం దగెఁ బాండుపత్త్రియై
కొనలనిగిర్చియున్న యతికోమలపల్లిమతల్లి యో యనన్

రతికేళియందు మణికంకణాదులు జారిపోయినను గనుఁగవకెంపుచేతను ఆర్ద్రనఖగౌరతచే (తెలుపు) తను మునుపటికన్న సముజ్జ్వలాకృతితోఁ గనఁబడినది. ఇట మణికంకణనూపురములకు బదులుగాఁ గనుఁగవకెంపును, హారవల్లికలకు బదులుగా నార్ద్రనఖముల తెల్లకాంతులును నమరినవి ఇట భూషణములు లేకున్నను సముజ్జ్వలత యున్నది కాన మాధుర్యము.

౬ ధైర్య లక్షణము

కం కులశీలాద్యవిలంఘన మిల ధైర్యంబు... ౧౦౪

కులమర్యాదలను దాఁటకుండుట ధైర్యము "ముక్తాత్మశ్లాఘనా ధైర్యం మనోవృత్తి రచంచలా" ఆత్మశ్లాఘ లేనట్టియు నచంచలమైనట్టియు మనోవృత్తి ధైర్యము.

ధైర్యోదాహరణము

మ. అతులైశ్వర్య సమగ్రుఁడైన నరసింహాధీశ్వరుం డేడ ? నీ
పితృవాచాపరతంత్రతన్ వ్రతతతిం బెంపొందు వేవేడ ? నా
క్షితిపాలాగ్రణికైఁ బ్రసక్తమగు నాచిత్తంబు సంధించినాఁ
డతనుండక్కట! నేఁటి నుండి విషమాస్త్రశ్రీఖుఁడై
నెంతయున్.

తా. నరసభూపాలుఁడేడ? తల్లిదండ్రుల చాటుదాననగు నేనేడ? మన్మథుఁడు వానిపై నా హృదయమును దగిలించినాఁడు

ఇటఁ దన సౌందర్యశీలాద్యాత్మశ్లాఘనములేదు మన్మథుఁడు దన హృదయమాతనిపైఁ దగిల్చినను దలితండ్రులచాటున నుంటచే సాహసించి యతని నభిసరించుట కిష్టపడకున్నది ఈ యువతి తాను 'పితృవాచాపరతంత్రురాల' నని చెప్పుటచే నచంచలమగు మనోవృత్తి వ్యక్తమగుచున్నది.

౭. విభ్రమలక్షణము

కం. ... ఒడలఁదొడవులిడఁ దడఁబడినన్

వెలయఁగ విభ్రమము ...

గాత్రమున భూషణముల దారుమాఱుగా ధరించుట విభ్రమము.

"త్వరయా హర్షరాగాదేర్దయితాగమనాదిషు
అస్థానభూషణాదీనాం విన్యాసో విభ్రమో మతః"

ప్రియునిరాకవలనఁ గలిగిన హర్షరాగాదులవలనఁద్వరచేత భూషణాదులను దాఱుమాఱుగా ధరించుట విభ్రమము.

విభ్రమోదాహరణము

చ. అదన నృసింహభూమిరమణాగ్రణి వచ్చిన సంభ్రమంబుతో
సుదతి నభోఽవలగ్నమునఁ జుక్కలపేరిటి కంఠమాలయుం,
బొదలుకుచాచలంబుల సముజ్జ్వలమేఖలయున్, ధరింపఁగా
నదిక్రమమయ్యె; దొయ్యలికనక్రమమయ్యె విలాసవైఖరిన్.

తా. నరసభూపాలుఁడు హఠాత్తుగా రాఁగాఁ ద్వరపాటున నొక సుదతి నక్షత్రమాల (౨౭ రత్నములు గలహారము) యను కంఠహారమును నాకాశము వంటి నడుమున దాల్చెను. మేఖల (ఒడ్డాణము) పర్వతమువంటి కుచములపై ధరించెను. నక్షత్రమాల నాకాశమున మేఖల (కొండనడిమి ప్రదేశము) పర్వతమునందుంట క్రమమే యనఁగా నుచితమే కాని యా యువతి సౌందర్యమునకు మాత్రమాక్రమముచితముగాదు

ఇట యువతి ప్రియాగమనము వలనఁ గలిగిన హర్షముచే భూషణములను దప్పిదముగాఁ దాల్చినది కాన విభ్రమము ఇట్టిదే మఱొక పద్యము.

క. తన ప్రియుఁడు వచ్చెవాఁకిటి
కని సొగసుం జేసికొనుచు నంగన విని యం
జనమును నొసటను, లత్తుకఁ
గనులను దిలకంబుఁబెట్టె గండస్థలిపై.

౮. లీలా లక్షణము

కం. ... అధిపుని యలఘుగుణానుకృతి లీలయగు నెట్లన్నన్.

ప్రియుని గుణానుకరణము లీల గుణానుకరణమే కాదు, చేష్టా, భూషణా ద్యనుకరణము గూడ లీలయే

"అంగైర్వేషై రలంకారైః ప్రేమిభిర్వచనై రపి ।
ప్రీతిప్రయోజితై ర్లీలాం ప్రియస్యానుకృతిం విదుః"

(చేష్టలచే వేషములచే, భూషణములచే, ప్రేమవచనములచేఁ ప్రియుని ననుకరించుట లీల యనఁబడును)

లీలోదాహరణము

చ. ధరనకలంకభావమునఁ దామరసాహితునిం జయించు, నా
హరిపదసక్తయై వెలుఁగు ; నారయఁ బ్రాజ్ఞులకున్ వసుంధరన్
సురతరునూతనాభ్యుదయశోభయొనర్చు యశఃపురంధ్రిః యా
వరుఁడగు శ్రీ నృసింహగుణవాసనఁ దాను దెలంగు కైవడిన్.

తా. నరసభూపాలుఁడు తన నిష్కళంక భావమునఁ గళంకియగు చంద్రుని జయించెను. మఱియు నతఁడు హరిపద (విష్ణుపద) సక్తుఁడు, ప్రాజ్ఞులకుఁ గల్పవృక్షమువంటివాఁడు అతని ప్రియురాలగు కీర్తికాంతయు నాతనిగుణముల ననుకరింపఁదలచి యకళంకభావమునఁ జంద్రుని జయించెను తానును హరిపద (ఆకాశ) సక్తయయ్యెను. కల్పవృక్ష శోభను (తెల్లదనమును) వహించెను. ఇటఁ బ్రియుని గుణానుకరణముగలదు కాన నిది లీల వేషానుకరణ మీ క్రింది పద్యమునఁ గలదు

ఆ. వె పరఁగఁ దమ్మికూఁటి పాఁపకడెంబులు
వరల వేణి యను కపర్దకంబు
హరుని ననుకరించు యా పార్వతీదేవి
లీలతోఁగ లోకమేలుఁగాక

౯. కిలికించితలక్షణము

క౦. అలుకు, కలక, ముదము, నశ్రువు
గలిసినఁ గిలికించితంబు... ౧౦౭

"స్మిత శుష్క రుదిత హసిత త్రాస క్రోధ, శ్రమాదీనాం
సాంకర్యం కిలికించిత మభీష్టతమసంగమాదిజాద్ధర్షాత్

ప్రియసంగమమువలనఁ గలిగిన హర్షముచేఁగలిగిన స్మిత, శుష్క రుదిత హసిత, త్రాస, క్రోధ, శ్రమాదుల సాంకర్యము కిలికించితము. పై లక్షణమునఁ బ్రియసంగమము వలన గలిగిన యనుమాటలేదు.

కిలికించితోదాహరణము

చ. పతి రచితాగసుం డదరిపాటునవచ్చి దృఢోపగూహన
స్థితి నధరప్రవాళము గ్రసింప ససంభ్రమలోలహస్తయై
'మతకరి! చాలుఁజాలు; నిఁక మాదెసరాకు' మటంచు నల్కతోఁ.
నలివ కోమల్ ముడించె నయనాంబువు లొప్పలనప్పళించుచున్.

తా అపరాధియగు ప్రియుఁడు హఠాత్తుగావచ్చి కౌఁగిలించి మోవికొఱకఁగాఁ జేతులతో విదిలించుచుఁ జాలుఁజాలు! నా కడకురాకుము అని కోపముతో నశ్రువులనాఁపుకొనుచు బొమలుముడిఁచెను.

ఇక 'మతకరి' ఇత్యాదివచనములును, బొమలముడుపును అశ్రువులును ప్రియసంగమాదిజహర్షముచేఁ గలిగినవికావు ప్రియాపరాధముచేఁ గలిగినవి కాన నిది యుదాహరణార్హముగాదు ఈ క్రింది దుదాహరణార్హము.

క స్వమనోరథంబులకు భం
గమురానట్లడ్డగించుఁ; గలికి నవులయం
దముతోఁ దర్జించును బ్రియు
సుమాంగి కల్లేద్పులేద్పు సుఖమగ్నయునై .

ఇచ్చటి యడ్డగింపు తర్జింపులు కల్లేద్పులును, బ్రియసందర్శనహర్ష కృతములు. ఇది కిలికించితము.

౧౦. మోట్టాయిత లక్షణము

కం. ...కడునిష్టకథా
దుల నింగితమెఱిఁగించుట
దలఁపఁగ మోట్టాయితంబు దగు నెట్లన్నన్

ప్రియుని గుఱించివచ్చు ప్రసంగములందుఁ దనయింగితమును (మనోభావమును) జేష్టలమూలమునఁ దెలుపుట మోట్టాయితము

"తద్భావభావితే చిత్తే వల్లభస్య కథాదిషు
మోట్టాయితమితి ప్రాహుః కర్ణకండూయనాదికం"

ప్రియునితో రతిక్రీడలఁ దేలవలెనని మనస్సు కలుగఁగా నాతని కథలు వినఁగానే చేయు కర్ణకండూయనాదికమగు చేష్ట మోట్టాయితము.

మోట్టాయితోదాహరణము

చ. చెలులు నృసింహుగీతమును జేరికగా నపరంజివీణెలో
పలఁ బలికింప నూర్చుచును బాలిక యూర్పులచేత దీపికా
కళిక చలింప "నెచ్చెలులు కంటిరె మీ మృదుగానలక్ష్మికిం
దెలియఁగ మెచ్చుచున్నయది దీవియ" యంచుహసించు
నెంతయున్.

తా. చెలికత్తెలు నరసభూపాలునిపై వీణెమీఁద గీతములు పాడుచుండఁగా నొక కన్యవిని నిట్టూర్చుచు నా నిట్టూర్పులకు దీపము చలింపఁగాఁ దన యింగితమును వారు దెలియకుండునట్లు "చెలులారా చూచితిరా ? మీ గానమునకు మెచ్చుకొని దీపము దలయూఁచుచున్నది" అని నవ్వుచుఁ బలికెను.

ఇట లక్షణమున "ఇష్టకథాదుల నింగిత మెఱిఁగించుట" అని చెప్పియు గ్రంథకర్త నాయిక తన యింగితమును దెలుపకుండ నేదో కల్లలాడుచున్నట్లు వర్ణించినాఁడు. కాన నిది యుచితోదాహరణముగాదు. ఈ క్రింది పద్యము చక్కని యుదాహరణము.

ఆ వె. మోహనాంగ ! నీదు ముచ్చట లెత్తఁగఁ
గోమలాంగి చెవులు గోఁకికొనుచు
నావులించుకొనుచు హర్షాశ్రువులురాల
నొడలు విఱచుకొనుచు నుండు సుమ్ము !

ఇటఁ జెవులు గోఁకికొనుట అవులించుట హర్షాశ్రువులు విడుచుట, ఒడలివిఱుపు మొదలగు చేష్ట లింగితమును దెలుపుచున్నవి.

౧౧. లలిత లక్షణము

కం. భాసురతనువల్లీ వి న్యాసము లలితమ్ము ...

ప్రకాశించుచున్న (చక్కని) శరీరముయొక్క విన్యాసము లలితము. దీనివలన నర్థము స్ఫుటముగా భాసించుటలేదు. "సుకుమారతయాంగానాం విన్యాసో లలితం భవేత్" (కరచరణాద్యవయవములను సుకుమారముగా ననఁగా నొయ్యారముగా నుంచుట లలితము

లలితోదాహరణము

చ వడియు శ్రమాంబులోడుభుజవల్లి మృదంగముమీఁదఁ జేర్చి కీ
లెడలిన నూపురంబు ఘటియింపఁగ దూఱి కరారవిందమం
దడుగిడి, కంపిత స్తనరయంబున నూర్పులుదోఁప నింతి య
య్యెడ నటియించి నిల్చె సభయెల్ల ననంగునిపాలుసేయుచున్.

శ్రమ చెమ్మగిల్లిన చేతిని మృదంగముమీఁదఁజేర్చి, కీలూఁడిన నూపురము సంధించుటకై యొకపాదమును దూఱిచేతనిడి స్తనకంపముచేత సూచింపఁబడిన వేగముగల నిట్టూర్పులు విడుచుచు (స్తనకంపము నిట్టూర్పుల వేగమును సూచించుచున్నది) నొక యింతి నటించి నిలిచెను ఇది సింగభూపాలీయము లోని యీ క్రింది శ్లోకమున కనువాదము.

> శ్లో స్వేదక్లేదితకంకణాం భుజలతాం కృత్వా మృదంగాశ్రయాం
> చేటీహస్తసమర్పితైకచరణా మంజీరసంధిత్సయా
> సా భూయ స్తనకంపసూచితరయం నిశ్వాసమాముంచతీ
> రంగస్థానమనంగసాత్కృతవతీ తాళావధౌ తస్థుషీ

ఇందలి "స్తనకంప సూచితరయం" అనుదానికి "కంపిత స్తనరయం" అన్నది సరియైన తర్జుమాకాదు ' తాళావధౌ తస్థుషీ" అను మాటకుఁ దర్జుమాలేదు

ఈ పద్యమున నింతి సుకుమారముగా నిలిచినది. కాన లలితము.

౧౨. విచ్ఛిత్తి లక్షణము

కం. ... సొమ్ములల్పములయ్యున్
భాసిల్లెడు శృంగారవి
కాసము విచ్ఛిత్తియయ్యెఁ గన నెట్లన్నన్. ౧౧౨

భూషణము లల్పముగానున్నను శృంగారముగాఁ గానవచ్చుట విచ్ఛిత్తి. "స్తోకాప్యాకల్పరచనా విచ్ఛిత్తిఃకాంతిపోషకృత్" భూషణరచన కొలఁదిగా నున్నను గాంతినిఁ బోషించినచో నది విచ్ఛిత్తి

చ. పరిమితభూషణంబులును ఫాలముపై నెలవంకనామముం
బరగనొయారియై నయనపర్వ మొనర్చె వధూలలామ తా
విరళగణేయతారలు నవీనతరేందుకళావిలాసముల్
వరుసవెలుంగఁగా విదియనాటివిభావరివోల్పుకై వడిన్.

తా కొలఁది నగలును నుదుటఁ జంద్రవంకబొట్టును ధరించి యొక యువతి కొలఁది చుక్కలును జంద్రరేఖను వహించిన విదియనాఁటి రాత్రివలె శోభిల్లెను ఇటఁగొలఁది భూషణములతోఁ గూడ యువతి శోభిల్లుటచే విచ్ఛిత్తి యను నలంకారము ఈ క్రిందిపద్య మింతకన్న మనోహరమైనది.

ఆ. వె తానమునఁ గడిందితళతళమను మేను
దమ్మలమునఁ గెంపుఁ దాల్చుమోవి,
జిలుఁగువలువ యివియె చాలును వగలాఁడి
కలరువిల్తుఁ దెడఁద మొలిచియుంద

౧౩. బిబ్బోక లక్షణము

కం. వరునికథయందనాదర మరయఁగ బిబ్బోకమయ్యె. ౧౧౩

"బిబ్బోక స్త్వతిగర్వేణ వస్తునీష్టేఽప్యనాదరః" (అతిగర్వముచే నిష్ట వస్తువునందుఁ గూడ ననాదరము చూపుట బిబ్బోకము) పై లక్షణమున 'అతి గర్వముచే' అని లేదు వరునికథ యన్నఁజాలదు

విబ్బోకోదాహరణము

చ. అతడు గుణాభిరాముఁ; డతఁడంగజసన్నిభుఁ; డంచు నెచ్చెలుల్
పతియగు శ్రీనృసింహనరపాలు నుతింప లతాంగి నీటుతో
శ్రుతుల గరాంగుళుల్ సొనిపె; శోభనతచ్చరితాభిపూర్ణమై
యతిశయమందు కర్ణయుగమం దవకాశమొనర్చు కైవడిన్.

తా చెలికత్తెలు నరసభూపాలుని నుతింపఁగా లతాంగి యాతనిచరిత్రలచే నిండిన తన చెవులలో సందుచేయుటకో యన్నట్లు చెవులలో వ్రేళ్ళఁ జొనిపెను. ఈ యుదాహరణము బాగుగాలేదు గర్వముచే నేర్పడిన యనాదరమేమియు లేదు. ఈ క్రింది పద్య ముదాహరణీయము

చ. ప్రియుఁడు సతంబుఁ దమ్మనుసరించినఁ దప్పులువట్టుచుండ్రు, నె
మ్మెయినిదనెంత్రుగాని ప్రియుమీఁద నిగుడ్చరు నిందుచూడ్కి నె
మ్మెయినిఁ బొనర్తురిపో నిజసమీహితమందు నిషేధ; మీ జగ
త్త్రయిని విలక్షణప్రకృతిఁదాల్చిన వామలు నాకుఁగూర్చుతన్.

ఇటఁ గర్వముచేఁ బ్రియునియందనాదరముఁ జూపుట గలదు

౧౪. విహృతలక్షణము

౬౦. ... అనుమతిఁ బలుకం
దరమగు తగువేళల ను
త్తర మొసఁగమి విహృతమనఁదగు నెట్లన్నన్.

పలుకవలసిన సమయమునఁ బలుకకుండుట విహృతము.

"వక్తవ్యకాలేఽప్యవచో వ్రీడయా విహృతం మతం" (సిగ్గుచేఁ బలుక వలసిన కాలమునఁ బలుకకుండుట విహృతము) పై లక్షణమున 'సిగ్గుచే' అను నదిలేదు.

విహృతోదాహరణము

ఉ. బాలిక యల్కతో మటిలిపల్కకయుండియుఁ బ్రాణనాథుఁడ
వ్వేళ నుతంబొనర్పఁ గడువేగఁ శిరాయుమటంచుఁ బల్కఁగాఁ
జాలక రోషమును బ్రణయసంభ్రమమున్ మది దొమ్ములాడ నీ
లాలక కుండలద్వయ ముదగ్రగతిన్ ఘటియించె వీనులన్. ౧౧౬

ఒక యువతి ప్రణయకోపముతో మాటాడకుండియుఁ దన ప్రియుఁడు తుమ్ము తుమ్మఁగా నమంగళశాంతికై తప్పక 'చిరంజీవ' యనవలసియున్నను ననక చెవులకుఁ గమ్మలు దొడుగుకొనెను కమ్మలు దొడుగుకొనుట యమంగళ పరిహారార్థము అంతకుముందు నిరాభరణురాలై యున్నది నిరాభరణురాలై యుండుట స్త్రీ కయుక్తము భర్తృశ్రేయముఁ గోరిన స్త్రీ సాభరణురాలై యుండవలెను ఇట భార్య భర్తపైఁ గోపించియున్నను నతని చిరంజీవిత్వము నభిలషించియున్నది కాన నిదివఱకుఁ గోపముదే ధరింపకున్న కమ్మలు వాని శ్రేయమునకై ధరించినది

తుమ్మినపుడు తప్పక చిరంజీవ' యని పలుకవలసియున్నను నలుకచేఁ బలుకలేదు కాన విహృతము. అయితే యీ పలుకకుండుట లక్షణమునఁ దెలిపిన విధమున సిగ్గుచేఁ గాక యలుకచే నని చెప్పఁబడినది అలుకచేఁ బలుకకుండుటకన్న సిగ్గుచేఁ బలుకకుండుటయే రసవత్తరము. (వ్రీడయా విహృతం మతం) ఈ క్రింది దుదాహరణీయము

అవ-ప్రవాసమునాఁటి నాయికయొక్క చేష్టను నాయకుఁడు చెప్పుచున్నాఁడు.

ఆ వె నెపముతోడఁ గాలనేలను రాయుచుఁ
దరుణి నన్నుఁగనుచు మఱల మఱల
బలుకఁదలఁచి యెదియొ వాఁతెఱంగదిపియుఁ
బలుకదయ్యె లజ్జ బలిసియుంట

ఇట సిగ్గుచేఁ బలుకకుంటయే నిబంధింపబడినది ఇది విహృతము

౧౫ చకితలక్షణము

౯౦. అఱుకుట చకితము ౧౧

భయపడుట చకితము "కుతోఽపి దయితస్యాగ్రే చకితం భయవిభ్రమః ప్రియునియెదుట నేదో హేతువుచే భయపడి తొట్రుపాటు నొందుట చకితము అనఁగా భయపడఁదగినంత పెద్ద హేతువు లేకున్నను ప్రియునియెదుట భయపడుట శృంగారచేష్టగదా!

చకితోదాహరణము

చ. అడుగిడి నిల్చు, నిల్చి చెలికానలువెట్టు నదల్చు, సిగ్గునం
దడఁబడుఁ, గాంతుఁడున్న మణిధామమొగిం జొరజాలకెంతయున్

వడఁకు, గృహాంబుసొచ్చియుఁ గవాటముదాఁపున నిల్చు;
నెచ్చెలుల్
వడిఁజనఁజూచినం బెనఁగు వారిజలోచన మౌగ్ధ్యసంపదన్.

ఈ పద్యమున 'సిగ్గునం దడఁబడు ' నియుంటచే భయవిభ్రమము గాన రాదు. కాన నిది యుదాహరణార్హముగాదు. ఈ క్రింది పద్య ముదాహర ణీయము

ఆ వె. తొడలమీఁదఁ గడుఁ దత్తఱించుచు
వింత హాయఁ జూపె నింతియొకతె
చెలుల హేతువుగనె చేయుచుం దు విలాస
ములను హేతువున్నఁ దెలుపవలెనె!

జలక్రీడ లాడుచుండు నొక యువతి చేఁపలు తన తొడలందాఁకఁగాఁ దొట్రుపడెను దానిచే నొక క్రొత్త హాయలు గలిగెను. ఇట భయపడుటకుఁ దగినంత పెద్దకారణము లేకున్నను భయపడి తొట్రుపడుట వర్ణింపఁబడినది. కానఁ జకితము.

హసితలక్షణము

కం. ...నవ్వుచు నలరుట హసితంబు —

ఇంతమాత్రమే కాదు. "హసితం తు వృథాహాసో యౌవనోద్భేద సంభ్రమః" యౌవనోదయముచే నకారణముగానే నవ్వుట హసితము స్థాయి భావమగు హాసము వేఱు. అది వికృతాకార చేష్టాదులవలన వ్యక్తమగును. ఇది యౌవనోద్గమమున నకారణముగానే కలుగును.

హసితోదాహరణము

చ. వదనసరోజవాసనకు వచ్చినతేఁటి నదల్చి చూడఁగా,
నది యసితోత్పలంబులని యక్షుల వ్రాఁలగఁ, జే విదుర్పఁగా
నది మఱలం బయోజమని హస్తయుగంబున వ్రాల, నవ్వెన
మ్మదవతి 'యేమిసేసినను మానదిదేమి' యటంచునెంతయున్.

ఒక యువతి తన ముఖపద్మగంధమునకై వచ్చిన తుమ్మెదనదలించి చూచుచుండఁగా నా తుమ్మెద దానికన్నులు నల్లగలువలని వానిపై వ్రాలెను. ఆపెయుఁ జేతులతో విదిలింపఁగా మఱల నా తుమ్మెద యా హస్తములను పద్మము లనుకొని వానిపైని వ్రాలెను దీనినిఁ జూచి యేమిచేసినను నిది మానదని నవ్వెను.

ఇట యౌవనోద్భేదముచే వృథగాఁగలిగిన హసితముగాదు. తుమ్మెదకుఁ గలిగిన భ్రాంతిచేఁ దాఁజేసిన చేష్టాపరంపరచే గలిగిన హసితము. ఇది యుదాహరణీయముగాదు

కం. తలపనితలఁపుగ నవ్వెం
దలిరుఁబోఁడి యిదియేల నా? నిక్కముగా
నలరులవిల్తుండెక్కెను
చెలిమేననురాజ్యమందు సింహాసనమున్.

ఇట యౌవనోద్భేదజమగు హసితము వర్ణింపఁబడినది. కాన హసితము

౧౭ కుట్టమితము

కం. — రతుల నతిసమ్మర్దో జ్జ్వలసౌఖ్యము కుట్టమితము

రతులలోఁ గలిగిన తద్దయు నలుగుడులచే మిక్కిలి సౌఖ్యమునుగొనుట కుట్టమితము. ఇంతకన్న సాహిత్యదర్పణ లక్షణము మేలైనది.

"కేశస్తనాధరాదీనాం గ్రహే హర్షేఽపి సంభ్రమాత్
ఆహుః కుట్టమితం నామ శిరఃకరవిధూననం

ప్రియుడు దన కేశస్తనాధరాదులను గ్రహింపఁగా లోలో హర్షించుచుఁ గూడఁ దత్తఱపడుచు శిరస్సును గరములను విదల్చుట కుట్టమితము.

కుట్టమితోదాహరణము

చ. తెరలి ప్రియుండు మోవిపయిఁ గెంపులనింపుటఁ బారవశ్యత
త్పరత నెఱుంగ లేక పిదప న్నిలుపద్దము చూచి సిగ్గునం
దరుణి చెలుల్ గనుంగొనినఁ దారిఁక నేమనియాడుకొందురో
వరుని? నటంచుఁ జిల్కకు నవారణముద్దులు వెట్టు సారెకున్.

ఇట నాయిక ప్రియుఁడు రతులయందు మోవిపయిఁ గెంపులు నింపుటఁ బారవశ్యతత్పరత నెఱుఁగలేకపోయినది ఇది రతిసమ్మర్దసౌఖ్యము కానఁ గుట్టమితము కాని యిది సరిగాలేదు ఈ క్రిందిపద్య ముదాహరణీయము.

కం తలిరాకుచుట్టమగునా
చెలికెమ్మోవిని గ్రసింపఁ జెలువుండు, కరం
బుల నున్న కంకణంబులు
గలగలమనె నేదొ బెదఁదకలిగిన కరణిన్.

ఇట నధరపానకృత సౌఖ్యముచేఁ గరవిధూననము గలిగినట్లు వర్ణింపఁబడినది. కానఁ గుట్టమితము

౧౮ కుతూహలలక్షణము

కం. లలనకుఁ జపలత కుతూహలం బెట్లన్నన్

చాపల్యము కుతూహలమని యర్థము "రమ్యవస్తుసమాలోకే లోలతా స్యాత్కుతూహలం" సుందరమైన వస్తువును సందర్శించుటయందుఁ జూపు చాపలము (ఉబలాటము) కుతూహల మనఁబడును.

కుతూహలోదాహరణము

చ. కలికి నృసింహభూవిభునిఁ గాంచి నవప్రణయాభిరామయై
లలితకరాబ్జకేళి కమలంబు భ్రమింపగఁ జేసె విభ్రమం
బలవడఁ "ప్రాణనాథ. హృదయాబ్జమునిన్నెడఁబాయలేక యి
ట్లెలమి భ్రమించుచున్న" దని యేర్పడఁ జెప్పెడిచందమందఁగన్

ఒక యువతి నరసభూపాలునిఁ జూచి నూతనప్రణయము గలిగినదై తన చేత నున్న లీలాకమలమును "ఓ ప్రియుఁడా నా హృదయకమలము నిన్నెడఁ బాయలేక యీ విధముగాఁ దిరుగుచున్నది." అని చెప్పుచున్న చందమునఁ ద్రిప్పఁదొడగెను

ఇట రమ్యవస్తువగు నరసభూపాలుని సందర్శించుటవలనఁ గలిగిన చాపలము వర్ణింపబడినది. ఈ క్రింద మనుచరిత్ర పద్యముగూడ నుదాహరణీయము.

చ తెలుఁగులఁ బెట్టుచుఁ దొరలఁ జెంద్రికపావడయంట మైతడిం
బెళపెళలేనిచీరఁగటి బింకపుఁ జన్నులఁ జేర్చుకొంచునే
జలకములాడియాడి యొక చాన కరస్థితకేశయై నృపున్
వెలువడిచూచె లోఁబడితి నీకని బాసకు నిల్చెనో యనన్

ఇట నారాజును వీధివెంటఁ జనుచున్న వానిని దర్శింప నాయిక చాపలము గనఁబఱచుచున్నది.

నరసభూపాలీయకర్త యిచ్చిన పదునెనిమిది శృంగార చేష్టల నిటఁ జూపితిమి సాహిత్యదర్పణమున నిరువదెనిమిదింటిని నిచ్చెనని చెప్పితిమి. వానినిఁ గూడ నిటఁ జూపుచున్నాము.

౧౯. శోభాలక్షణము

"రూప యౌవన లాలిత్య భోగాద్యై రంగభూషణం శోభా" రూపము, యౌవనము, సుకుమారత్వము భోగము (స్రక్చందన తాంబూలాది సేవనము) మొదలగువానివలన నంగములకుఁ గలిగిన యందము శోభ మొత్తముమీఁద నయత్నకృతమగు నందము శోభ

శోభోదాహరణము

అసంభృతం మండనమంగయష్టే, రనాసవాఖ్యం కరణం మదస్య
కామస్య పుష్పవ్యతిరిక్తమస్త్రం బాల్యాత్పరంసాఽథ వయః ప్రపేదే

శరీరమునకయత్నసిద్ధమగు నలంకారమును ఆసవరూపముగాని మద కారణమగు నొక సాధనమును మన్మథునికిఁ బుష్పముగాని యొక బాణమును నగు యౌవనము నా పార్వతి పొందెను ఇట యౌవనశోభ వర్ణింపఁబడినది. భోగకృతమగు శోభ కీ క్రింది పద్య ముదాహరణము

కం. కనుదోయిఁగజ్జలంబును,
దనూలతకు దువ్వలువయుఁ దములపుదెబ్బం
దనమును మోవికి నిదె భూ
షణ మితరము దూషణంబు జవరాలి కిలన్.

భోగమన స్రక్చందనతాంబూలాదిసేవనమని తెలిపితిమి. అయితే భోగ కృతమైన శోభ యయత్నకృత మెట్లగును? అని ప్రశ్న యుదయించును స్వభావసిద్ధమగు శోభయున్ననే భూషణాదులశోభయు మెరయును స్వభావశోభ లేని భూషణశోభ మెరయదుగదా ఇట భోగకృతశోభయన స్వభావశోభలేని కేవలభోగకృతశోభ యని భ్రమింపరాదు మిగిలిన రూపాదుల శోభయూహ్యము

౨౦. కాంతిలక్షణము

"సైవ కాంతిర్మన్మథాప్యాయితద్యుతిః" మన్మథునిచే వర్ధిల్లఁజేయఁబడిన యా శోభయే కాంతి యనఁబడును మన్మథోన్మేషము గలుగకముందున్న యంద చందములు మన్మథోన్మేషము గలిగినపిమ్మట మఱింత లెస్సగాశోభిల్లును.

కాంత్యుదాహరణము

కం తొలుప్రాయపు మగకొదమల
తలఁపులతమకములు మిగులఁ దను నెదురుకొనం
జలజాక్షి జవ్వనము గడు
వెలసెఁ బ్రతిక్షణము వింత వింతగ నంతన్

ఇట యౌవనమున యౌవనశోభ ప్రతిక్షణమును వింతవింతగాఁ గనఁబడుట మదనోన్మేషముచేతనేకదా ; కాన నిది కాంతి.

౨౧ దీప్తిలక్షణము

"కాంతిరేవాతివిస్తీర్ణా దీప్తిరిత్యభిధీయతే" అత్యంతమైన కాంతియే దీప్తి యనఁబడును.

దీప్త్యుదాహరణము

కం. ఎలజవ్వన మెలయింపఁగ
విలాసముల నొదలిపైని, విరివిల్తుండున్
ఇలు ద్రొక్కి యెసరువెట్టఁగఁ
గలఁపదె చెలి తపసినేనిఁ గనుమూపులచేన్ ?

ఇట నాకాంతి మదనుఁడెసరువెట్టుటచే మఱింత వర్ధిల్లినది. కావుననే కనుచూపులచేతనే తపసి నేనిఁ గలఁచును కాన నిది దీప్తి

౨౨ ప్రగల్భతా లక్షణము

"నిస్సాధ్వసత్వం ప్రాగల్భ్యం" ప్రియుఁడు ప్రియురాలితోఁగాని ప్రియురాలు ప్రియునితోఁగాని రమించుపట్ల నప్రతిబంధకముగా వర్తిల్లుట.

ప్రగల్భతోదాహరణము

ఆ. కౌగిలింపఁ దమ్ముఁ గౌఁగిలించుచు బిగ్గ
ముద్దులాడఁ దమ్ము ముద్దుగొనుచు
మోవి గఱవ రేఁగి మోవినిం గఱచుచుఁ
జెలులు ప్రియుని దాసుఁజేసికొంద్రు.

ఇందు నాయిక యప్రతిబంధముగాఁ బ్రగల్భముగా నాయకునితోఁ గ్రీడించుచున్నది.

౨౩. ఔదార్యలక్షణము

"ఔదార్యం వినయస్సదా" ఔదార్యమన వినయము వినయమనఁ బ్రియుని యపరాధము దెలిసినను గోపమును వహింపకుండుట.

ఔదార్యోదాహరణము

గీ. చిలుతయలుకను వహియించి చిగురుఁబోఁడి
యలఁతి నవ్వులు సిగ్గులుఁ గొలఁది యూర్పు,
లలరఁ దాకఁకు తాఁకకు మనుచు జరిగి
పోయి మెలమెల్లఁగ గవాక్షమును విగించె.

ఇట సాపరాధుఁడగు ప్రియునియందలఁతికోపమును మాత్రము పూని యాతఁడు చరణపాతమొనర్పరాఁగా ననుఁ దాఁకకుమని జరిగిపోయి కిటికీ మూసెను. (కేశికై)

అతని నమస్కార మక్కఱలేకయే నాయిక ప్రసన్నురాలైనందున నౌదార్యము చూపఁబడినది

౨౪. మదలక్షణము

''మదో వికారస్సౌభాగ్యయౌవనాద్యవలేపజః సౌభాగ్యము యౌవనము మొదలగువానియొక్క గర్వమువలనఁ గలిగిన వికారము మదము

మదోదాహరణము

గీ నాదు నునుజెక్కు ఖులపై ని నాయకుండు
స్వయముగా వ్రాసెఁ బుష్పమంజరి నటంచు
మురిసిపో; కిట్టి వన్యయుం బొందకున్నె?
పాడువడఁ కట్టిచో విష్ణుపజపకున్న.

ఇట సౌభాగ్యగర్వమువలనఁ గలిగిన మదము స్పష్టము.

౨౫. తపనలక్షణము

'తపనం ప్రియవిచ్ఛేదే స్మరావేగోత్థచేష్టితం'' ప్రియవిరహసమయమున మోహాతిరేకముచేఁ గలుగు చేష్ట

తపనోదాహరణము

మ కదునిట్టూర్పులుపుచ్చు; నేలఁబొరలున్ · గాంచున్ భవన్మార్గ మె
ప్పుడు; బిట్టేడ్చు; గృశీభవించిన కరంబుల్ వేయు నట్టిట్టులన్
జదయంగాఁ గలనైన నీకలయికన్ వాంఛించు నిద్రింపఁగా
విడఁదద్దానినిఁగూడఁ బాడువిధి; యోయీ! యెంత దౌర్భాగ్యమో?

౨౮. మౌగ్ధ్యలక్షణము

అజ్ఞానాదివ యా పృచ్ఛా ప్రతీతస్యాపి వస్తునః
వల్లభస్య పురఃప్రోక్తం మౌగ్ధ్యం తత్తత్త్వవేదిభిః

తెలిసియున్న వస్తువును గుఱించియుఁ దెలియనివిధమునఁ బ్రియసన్నిధినిఁ బ్రశ్నించుట మౌగ్ధ్యము.

మౌగ్ధ్యోదాహరణము

కం. చెలికాఁడ ! నాదు కంకణ
ముల ముద్దులుమూటగట్టు ముక్తాఫలముల్
గల వేవృక్షంబుల ? చె
న్గలంబునను ? నాఁటిరెవరు ? సరిగఁ దెలుపవే

౨౯. విక్షేపలక్షణము

భూషాణామర్ధరచనా మిథ్యా విష్వగవేక్షణం
రహస్యాఖ్యానమీషచ్చ విక్షేపో దయితాంతికే.

ప్రియునియెదుట భూషణములు సగము దాల్చుట యూఱక యే యటునిటు చూచుట రహస్యముగా భాషించుట మొదలగు చేష్ట విక్షేపము

విక్షేపోదాహరణము

కం. అఱవిరిసినవేనలితో
నఱదీర్చిన బొట్టుతోఁ నళుకునుగొన్న
ట్లరయుచు దెసలం బ్రియుతో
జరుపును గోమలి రహస్య సంభాషణముల్

౩౦. కేళిలక్షణము

"విహారే సహకాంతేన క్రీడితం కేళిరుచ్యతే' కాంతునితో విహరించునపు డొనర్చు చుంబనాలింగనాదిక్రీడ కేళి.

కేళ్యుదాహరణము

కం. కనులన్ రాలిన పుప్పొడిఁ
దనవదనానిలముచేతఁ దలఁగింపఁగఁజా
లని ప్రియునిఁబొడిచెఁ బీన
స్తని యొకతె పయోధరమునఁ దద్వక్షమునన్.

తన ముఖవాయువుచేఁ బ్రియుఁడు ప్రియురాలి కనులూఁదుచుండఁగా నా ప్రియురాలు కనులలోని పుప్పొడి పోయినను బోలేదని మఱల మఱల నూఁదించుకొనుటకై మఱింత దగ్గఱకు వచ్చుచుఁ దన స్తనాగ్రముల నాతనిఁ దాఁకుచున్నది

గీ. మఱియు శృంగార మంగనామణులయందు
నంకురిత, పల్లవిత పుష్పితాదిభేద
వర్ణితాకృతియై దశావస్థలయ్యె
వీని నామక్రమంబులు విస్తరింతు. ౧౨౨

స్త్రీలయందు శృంగార మంకురావస్థ, పల్లవావస్థ కోరకావస్థ, పుష్పావస్థ, ఫలావస్థ యను పంచావస్థలును గ్రమముగాఁ బొందును ఈ పంచావస్థాత్మక మగు శృంగారము దశావస్థలను బొందును. వీనినిఁ గ్రమముగా నెఱిఁగింతును.

ఇట శృంగారమన విప్రలంభ శృంగారము ఈ విప్రలంభము సంభోగావస్థకు ముందును పిమ్మటను గూడ సంభవించును. సంభోగావస్థకు ముందున్న విప్రలంభమునకుఁ బూర్వరాగమని పేరు ఆ పూర్వరాగరూప విప్రలంభశృంగారమేకదా యంకురాద్యవస్థలను బొందును అనఁగాఁ గ్రమాభివృద్ధినిఁ బడసి సంభోగముగఁ బర్యవసించును మఱియు శృంగారమన శృంగారరసమని కాక దాని స్థాయిభావమగు రతియే యిట నుద్దిష్టము ఆ రతి దశావస్థలను బొందు ననుటయు దోషమే ఇఁకేమనఁ బూర్వరాగరూప విప్రలంభశృంగారముయొక్క స్థాయిభావమగు రతివలన దశావస్థలు గలుగును రతియే దశావస్థలను బొందదు అట్టి రతివలన దశావస్థలు గలుగును పై పద్యమునఁ బల్లవితకుఁ బిమ్మట కోరకిత అని యుండవలెను దానినిఁ జేర్పక తదనంతరావస్థ యగు పుష్పితత్వమును దెలుపుట దోషమగును

మొత్తముమీఁదఁ బూర్వరాగ రూపవిప్రలంభమునందే(అభిలాషరూప విప్రలంభమునందే) దశావస్థలు గలుగును. సంభోగావస్థ పిమ్మట సంభవించిన విప్రలంభమునందుఁ గూడ నీ దశావస్థలలోఁ గొన్ని సంభవించును అట నే యవస్థలు గలుగునో ముందు చెప్పుదుము.

దశావస్థలు

కం. ఇలఁజూచుట, చింతించుట
తలఁచుట, గుణవినుతి, యరతి, తాపము, లజ్జా

స్ఖలనము, గమనము, మూర్ఛయు
నల ధన్యత యన నవస్థలగు నెట్లన్నన్. ౧౨౭

చూచుట చింతించుట తలఁచుట గుణవినుతి యరతి, తాపము, లజ్జా త్యాగము గమనము, మూర్ఛ, ధన్యత అనునవి దశావస్థలని గ్రంథకర్త యుద్దేశము దీని కాకర మిది:—

దృఙ్మనస్సంగసంకల్పౌ జాగరః కృశతాఽరతిః
హ్రీత్యాగోన్మాద మూర్ఛాంతా ఇత్యనంగదశా దశ.

దృక్కు (దర్శనము లేక చక్షుఃప్రీతి) మనస్సంగము సంకల్పము, జాగరము కృశత అరతి హ్రీత్యాగము, ఉన్మాదము మూర్ఛ, అంతము (మరణము) అనునవి పది మన్మథావస్థలు నాయికకు నాయకునిఁ జూచినంతనే 'చక్షుఃప్రీతి' యను ప్రథమావస్థ గలుగును. పిమ్మట మనస్సు వానిపైఁబడును ఇదియే మనస్సంగము. పిమ్మట నతని సంగమునింత ఇది సంకల్పము, ఆ సంకల్పముచే నిదురలేకుండుట తటస్థించును ఇదే జాగరము దానిచే శరీరము కృశించును ఇది కృశత, దానివలన దేనియందును ప్రీతిలేకుండుట. ఇదియే యరతి, పిమ్మట లజ్జాత్యాగముసేసి మాటలాడుట - ఇదియే హ్రీత్యాగము. తదుపరి యున్మాదము తుదికి మరణయత్నము (మరణముగాదు)

ప్రతాపరుద్రీయమున నీ దశావస్థలకుఁ దోడుగా ప్రలాపము, సంజ్వరము అను మఱి రెండవస్థలు చెప్పఁబడినవి భావప్రకాశమున నీ యవస్థలు భిన్నములుగా నున్నవి ఎట్లన —

దశధా మన్మథావస్థా భవేద్ద్వాదశధాఽపి వా
ఇచ్ఛోత్కంఠాభిలాషశ్చ చింతా స్మృతిగుణస్తుతీ
ఉద్వేగోఽథః ప్రలాపస్స్యాదున్మాదో వ్యాధిరేవ చ
జాడ్యం మరణ మిత్యాద్యే ద్వే కైశ్చిద్వర్జితే బుధైః

ఇచ్ఛ, ఉత్కంఠ, అభిలాష చింత స్మృతి, గుణస్తుతి ఉద్వేగము ప్రలాపము ఉన్మాదము వ్యాధి జాడ్యము మరణము అను పండ్రెంటిలో మొదటి రెంటిని, ఇచ్ఛ, ఉత్కంఠ గొందఱు విడిచిరి

నరసభూపాలీయ పద్యమునందలి 'గమనము ధన్యత' యనునవి పైవేని యందును గానరావు గుణవినుతి' భావప్రకాశలక్షమునఁ గలదు 'తాపము' సంజ్వరనామముతోఁ ప్రతాపరుద్రీయమునఁ గలదు

ప్రలాప సంజ్వరములు గలిపికొని దృఙ్మనస్సంగ సంకల్పాదులగు పదియును స్వీకరించి మొత్తము పండ్రెండవస్థలు స్వీకరించుట యుచితమగును

ఆంధ్రకావ్యములో నాయికచేయు చంద్రాదిదూషణములీప్రలాపకార్యములే ఈ ద్వాదశావస్థాత్మకమగు శృంగారమునకుఁ బూర్వరాగమని పేరు. అనఁగా సంభోగశృంగారమునకుఁ బూర్వావస్థ

క్రమముగా నరసభూపాలీయదశావస్థలకు లక్షణలక్ష్యములను జూపుదుము

౧ చూచుట (చక్షుఃప్రీతి)

"ఆదరాద్దర్శనం చక్షుఃప్రీతి రిత్యభిధీయతే" నాయిక నాయకుని నాదరముతోఁ జూచుట చక్షుఃప్రీతి యనఁబడును

మ అనురాగాంబుధి యుబ్బివెల్వడినయట్లాపూర్ణఘర్మాంబువుల్
దనువల్లిం దిగజాఱఁ గన్నుఁగవ లేఁదళ్కుల్ పిసాళించుచున్
ననవిల్కాని పురఃప్రవేశకలనా నాళీకదామంబులై
తనరం గోమలి నిన్నుఁజూచె నరసేంద్రా! సాంద్రతేజోనిధీ!

అనురాగసముద్ర ముబ్బినవిధమునఁ జెమటలు శరీరమునుండి దిగజాఱఁగా మన్మథుని పురఃప్రవేశసమయమునఁ గట్టిన తామరపువ్వులదండలైన చూపులతో నా యువతి నరసభూపాలా నిన్నుఁజూచెను

ఇట నాయికయాదరముతో నాయకునిఁ జూచినట్లు చెప్పఁబడినది కావునఁ జక్షుఃప్రీతి

నాయిక నాయకునిఁ బ్రత్యక్షముగా దర్శించుటచేతనే కాక వానినిఁగూర్చి వినుటవలనను జిత్రమునఁ గాంచుటవలననుగూడఁ రతిగలుగునని యాలంకారిక మతము "శ్రవణాద్దర్శనాద్వాఽపి"

౨ చింతించుట (సంకల్పము)

మ అరవిందంబు విలాసమందిరము, నీహారాంశుఁ డేకోదరుం;
డరయన్ గోత్రవిరోధ మేమిటికి నర్హాం? బంచు నూహించి యి
ర్వురఁబొందించు పయోధికన్యక్రియఁ జేర్చుం గేలుగండస్థలిం
దరుణీరత్నము చింతచేత, నరసేంద్రా! సాంద్రతేజోనిధీ. ౧౨౫

పద్మము నాగృహము. చంద్రుఁ డేకసోదరుఁడు వీరిరువురకును విరోధమేల? వీరిరువురకును బొత్తును గూర్చెదనని లక్ష్మీదేవి తనహస్తమునఁ జెక్కిలి చేర్చియున్న విధమున నిటఁ బ్రియుని జింతించుచు నాయిక చెక్కిలిపైఁ

జేయి చేర్చియున్నది ఇట్లుగాదు నాయికానాయకలు పరస్పరసంగమోపాయమును చింతించుచున్నట్లు చూపవలయును ఎట్లన

కథమీక్షే కురంగాక్షీం? సాక్షాల్లక్ష్మీం మనోభువః
ఇతి చింతాకులః కాంతో నిద్రాం నైతి నిశీథినీం

మన్మథుని లక్ష్మివలెనున్న యా కాంతను నే నెట్లు చూడఁగలనని చింతాకులుఁడై కాంతుఁడు రేల నిద్రింపఁడు — ఇట సంగమోపాయచింతగలదు పైపద్యమున నవ్విధము లేదుగదా!

౩. తలఁచుట—స్మృతి అనఁగా సంస్కారజన్యమగుజ్ఞానము

మ. వరభూషాదులపై మనంబిడక దృగ్వ్యాపార మొంతేఁ బర
స్పరసందర్శననాతిభిన్నమయి చూపట్టంగఁ గార్యాంతర
స్మరణం బేమియులేక నిశ్చలత నీ సాంగత్యముం గోరి మా
హరిణీలోచన యాత్మయందు నరసేంద్రా! నిన్ను భావించెరా!

ఓ నరసభూపాలా భూషణములమీఁద మనస్సుపోనీక దృగ్వ్యాపార మొకరి నొకరు చూచుకొనుటకన్న భిన్నముగానిదిగా సనఁగా నిన్నదియు దానిని నీవును జూచుచున్నట్లుగానే చూపట్టఁగా దేనినిఁ గూడఁ దలంపక నీ సాంగత్యమునుగోరి యాత్మయం దా యువతి నిన్నే స్మరించినది ఇందు సంస్కారజన్యజ్ఞానములేదు ఇది ఉదాహరణార్హముగాదు. ఈ క్రింది పద్యముదాహరణార్హము.

కం స్మరియించును నీ నామమె స్మరియించును నీదుగీతమాధుర్యంబే
స్మరియించుఁ బ్రియుడు నీసుం దరరూపవిలాససంపదలె లలితాంగీ

ఉత్తరవిప్రలంభమునందలి స్మృతికుదాహరణము.

కం అలకలు సెదరఁగఁ జెమటే
నలి విరియఁగ, నూర్పులకు స్తనద్వయ మెగయన్
వలువ ప్రిదుల, నెదఁ గేలిడి
చెలి రతివివశతఁ బరున్న చెలువముఁ దలఁతున్

౪. గుణవినుతి

మ. పలుకుందొడగు వీణెతోఁ జెలియ నీపై గీతముల్ మీటఁ దొ
య్యలిమైనీడ మెఱుంగుఁగాయనిరవై యవ్వీణలోవాణి "యో

లలితాంగి మన చిత్తముం బియుఁడు గొల్లల్వెట్టెఁగా !"
యంచు వె
ల్పలికిం దా నుబుసాడవచ్చె ననఁ గన్పట్టున్ నృసింహాధిపా !

నాయికవీణపై నరసభూపాలునిపై గీతములు మీటుచుండెను అప్పుడు నాయికయొక్క బింబమా వీణయొక్క కాయలోఁ బ్రతిఫలించెను. ఆ ప్రతిబింబమావీణలోనున్న సరస్వతీదేవి నాయికతో "నరసభూపాలుఁడు మన చిత్తమును గొల్లఁబెట్టెగదా !" యని యుబుసాడుటకై వచ్చినట్లున్నది.

ఇట గుణములేమియు నుతింపఁబడలేదు గుణకథనము చేసినఁగాని గుణవినుతి కాదుగదా ఈ క్రింది యుదాహరణీయము.

కం. ఆయందంబాచందం
బా యా నెఱజాణతనము లామాటతనం,
బేయెడఁ గన మా సుందరి
యా యుబు సామాన్యసృష్టి యగునే తలఁపన్

జాగరము కృశత, అను రెండవస్థలును దృఙ్మనస్సంగశ్లోకమున గలవు వాని కుదాహరణము లివి .—

నాయకుని జాగరావస్థ కిది యుదాహరణము —

కం ఏ కదయం దే చెట్టున
నే కొమ్మను గూరుచుండి యె ట్లెత్తి మెదన్
శ్రీకరసుధాంశులేఖ వి
లోకించెఁ జకోర మట్టులు నిశం గడపెన్.

కృశత

గీ. వంపుగొని పెల్లువలకాఁక నలుగుడువడి
పాప మాబాలయొదలు సాఁబాలుమాత్ర.
మిగిలియున్నది నీకయి మిత్తిగొంగ
వేల్పుకయి గట్టరాయనిబిడ్డవోలె

౫. అరతి (విషయ నివృత్తి)

మ. నిరతం బాత్మకరాంఘ్రిబాహునఖకాంతిస్ఫూర్తికిం దిగ్గఁడై
శరణంబొందు ప్రవాళపద్మబిసపుష్పశ్రేణినిం గ్రమ్మఱన్,

శరణం బందుట హీనమంచునో ! మదిన్ శైత్యోపచార క్రియా
గరిమం బొల్లదు మానినీమణి కడం కన్ శ్రీనృసింహాధిపా !

తన చేతులు కాళులు బాహువులు గోళ్లు వీనియొక్క కాంతికోడి శరణుం బొందిన చిగురాకులను దామరపూలను దామం తూండ్లను బూలను దాను శరణు గోరుట హీనకృత్యమని కాబోలు నాయిక శైత్యోపచార మొల్ల కున్నది.

ఇట శైత్యోపచారమందరతి చూపంబడినది. కాని యరతి యన విషయ నివృత్తి యని చెప్పితిమి ఆహారాదులందుం బ్రీతిలేకుంట యరతి యనంబడును కాన నిది యుదాహరణార్హము గాదు ఈ క్రింది పద్య ముదాహరణీయము.

శా. ఆహారంబును మాని పూని విషయవ్యావృత్తినిం జిత్తమున్
'సోఽహం వృత్తికిం ద్రిప్పి నిల్పంబడ నాసాగ్రంబునం జూపు వా
గ్రాహిత్యంబు వహించి శూన్యముగ లోకంబెల్ల భావించు వో
హోహో యోగినివో ! వియోగినివొ ? నా కోసి చెలీ ! చెప్పవే

ఇందు విషయవ్యావృత్తిగలదు కాన నరతి

౬. తాపము

మ. ధనళాక్షీమణి మేను హేమలతయన్ తత్త్వంబు మున్నెల్లం ద
త్కవిలోకోక్తియటంచునుంటి నది తథ్యంబయ్యె · నెట్లన్న న
వ్యవియోగానలతప్తమై నిబిడబాష్పాసిక్తమై డస్సియున్,
నవశోభాతిశయంబుం జెందె నరసేంద్రా ! సాంద్రతేజోనిధీ !

ఓ నరసభూపాలా ! 'ఆయువతిమేను బంగారుతీంగ' యనుమాటలను గవి ప్రౌఢోక్తిగాం దలంచితిని కాని యది వియోగాగ్ని తప్తమై బాష్పాసిక్తమై కృశించియు నూతనశోభను వహించినది కాన నిజమని యిప్పుడు గ్రహించితిని. బంగారుతీగను గాచి నీళ్ళముంచి తీయుదురు అప్పుడది శోభాయమానముగా నుండును.

ఇందు నాయికయొక్క తాపము వర్ణింపంబడినది కాని తాపమువలన నామె దేహమునం గలిగినకార్యములు వర్ణింపంబడవలెను అప్పుడది హృద్యముగా నుండును ఎట్లన,

చ అలచెలి మేనియందుఁ గల యచ్చపుఁ దామరతూఁడ్లు తేంట్లబా
రులవలె నయ్యె ; నింద్రమణిరూపువహించెను నత్తుముత్తె మూ
ర్పులకుఁ, దటాన బుస్సు మని పొంగెఁ జనుంగవ నిద్ద కపమ
క్కల ! మెఱఁబద్ద నీర్మఱగెఁ గ్రాఁగిన యిక్మపయఃంజలంబటుల్.

ఇటఁ దాపముయొక్క కార్యములు వర్ణింపఁబడినవి

౭. లజ్జాత్యాగము

మ చెలి నీమూర్తి లిఖించి చిత్రఫలకం బెన్నొండు బాష్పాంబుపి
చ్ఛిలమౌ పయ్యెదమీఁదఁ జేర్చుకొన నాచిత్రం బలతంబుగా
బళిరే! కట్టినచీరయుం బగ యటఁ జాటించె దైవంబటం
చలినీలాలక యార్తిఁ జెందు నరసింహా ! యింకఁ బాలింపుమా !

ఓ నరసభూపాలా ! నాయిక చిత్తరువున నీమూర్తిని వ్రాసి దానినిఁ గన్నీటఁ దడసిన పైఁటపైఁ బెట్టుకొన నా తడిచే నా చిత్తరువు కరిగి కనఁబడక పోయెను అప్పుడది నాచీరమే నాకుఁబగగా దైవము సేసెనే యని యార్తినిఁ జెందెను.

చిత్తరువునఁ బ్రియునివ్రాయుట. నాచీరయే నాకుఁ బగయయ్యెనని విలపించుటయు లజ్జాత్యాగ కార్యములని కవి తలంచెను చిత్తరువును వ్రాయుట చిత్తవినోదార్థము ఇది లజ్జాత్యాగోదాహరణము కాఁజాలదు ఈ క్రింది పద్యమును గనుఁడు

మ [అని చింతించుచు మీనకేతన ధనుర్జ్యాముక్తనారాచ దు
ర్దిన సమ్మూర్ఛితమానసాంబురుహయై దీపించు పెందత్తరం
బునఁ బేటెత్తినలజ్జ నంఘ్రికటకంబుల్ మ్రోయనద్దంబు ని
ల్చిన నయ్యచ్చరఁజూచి చేరఁజనిపల్కెన్ వాఁడు విభ్రాంతుఁడై]

ఇట వరూధిని లజ్జాత్యాగము నేసి (పేటెత్తినలజ్జ) ప్రవరుని మార్గమున కడ్డము నిల్చినది. మఱియు నాయకుని గోత్రస్ఖలనములు మొదలయినవియు లజ్జాత్యాగకార్యములే యగును

౮. గమనము

మ. చెలులన్ వంచనచేసియొకకృతయ తాఁ జెన్నొందనీయొద్దకున్
నలినాక్షీమణి రాఁదలంచి నవరత్నప్రోతసౌధాంగణ

స్థలులన్ వెన్నునివచ్చు నిర్మలతనుచ్ఛాయన్ నిరీక్షించి నె
చ్చెలి యేతెంచె నెఱుఁగఁబోలునని నిల్చెన్ శ్రీనృసింహాధిపా!

చెలికత్తెలను వంచించి తా నొక్కతయే నీ వద్దకు రాఁదలఁచి రత్న సౌధాంగణమునఁ దన్ను వెంబడించివచ్చు నీడను గని తన్నెఱుగటకై చెలికత్తె వచ్చుచున్నదని భ్రమపడి నిలిచెను.

ఈ గమనము నే యలంకారికులును దెలుపలేదు. దీని స్థానమున ఉన్మాదము గలదు

ఉన్మాదము

గీ. అన్న భృంగంబ! భ్రమియింతు వఖిలదిశల
నాదు వలపులరాణి గన్పట్టెనోయి
'ఔ' నటందువు సఖ తెల్పు మాలపింప
కెచటఁగల? దేమి గావించు? నెట్టిదామె?

భృంగమును గుఱించి యిట్టి ప్రశ్న యున్మాదకృతముగాక కింకృతము?

౬ మూర్ఛ

మ. బలితంబైన యనంగవేదనలచేఁ బల్మాఱు నిట్టూర్పు లే
కలికినీలాలక ప్రాణముల్ వెడలి నేత్రాంభోజమార్గంబునం
గలయం గ్రాఁకుచువచ్చి యన్నెలవునం గన్నీటి యేఱడ్డమై
నిలుపన్నిల్చె, నృసింహభూరమణ! మన్నింపంగఁ బోఁడింతటన్.

మన్మథవేదన సహింపలేని నాయికయొక్క ప్రాణములు కన్నులమార్గమున వెడలిపోఁబూని యచటఁ గన్నీటి ప్రవాహ మడ్డగింపఁగా, నాఁగెను.

ప్రాణములు కన్నులలోనికి వచ్చుట మూర్ఛాకార్యముగాఁ దెలుపఁబడినది. ఇదియు హృద్యముగా లేదు ఈ క్రింది పద్యముఁ గనుఁడు

కం. పిలిచినను బలుక, దంగం
బుల నట్టిట్టులు కదల్పఁబోవదు, కనుచ
మ్ములఁ దెఱవదు రొఁజుచుఁ గడు
వలవంతలఁజిక్కి బాల పాన్పున సోలెన్.

పిలిచినను బలుకకుండుట, అట్టిట్టు కదలకుండుట, కనుదమ్ములు దెఱవకుండుట రొఁజుట, అనునవి మూర్ఛాకార్యములు. వీనిచే మూర్ఛ వ్యక్తమగును

౧౦. ధన్యత

మ. శుకవర్గం బొకమాటలో మెలఁగె; నాసూనాయుధుం డాంతరం
గికుఁడై యుండె, మరాళ మొక్కనడకం గ్రేళ్లుబ్బి వర్తించెఁ; జా
యక వేడ్కన్ సుముఖత్వమొందె శశి మా యజ్ఞాతి సేమంబుతో
వకలంకస్థితి నీవుగూడ నరసింహా! రాజకంఠీరవా! ౧౪౪

నీవు మా యువతినిఁ గలియగాఁ జిలుకలు దానిమాటలో మెలఁగెను (ఆమె మాటలు చిలుకమాటలు - పూర్వవైరము మానెను) మన్మథుఁడాంతరంగికుఁడై ఎర్తిల్లెను (మన్మథుఁడంతరంగస్థుఁడు – ఏఁచుటమానెను) హంసలనుకూలముగా వర్తిల్లెను (ఆమెది హంసనడక-విరోధముమానెను) చంద్రుఁడు సుముఖత్వమొందెను (ఆమెది చంద్రముఖము – అతడు వెనుక బాధించెను ఇప్పు డనుకూలుఁడయ్యెను)

ధన్యతను నే యాలంకారికులును దెలుపలేదు ధన్యత సంభోగశృంగార లక్షణము. దశావస్థలును విప్రలంభముననే కలుగునని చెప్పితిమి దానిలో ధన్యత యెట్లుండును? కాన నిది దోషము పదియవ యవస్థ మరణోద్యోగముగా నాలంకారికులు తెలిపిరి

గీ. ముసరఁగానిమ్ము ! ఝుమ్మని దెసలఁదేంట్లు ;
మలయఁగానిమ్ము ! మెల మెల్ల మారుతంబు ,
పాడఁగానిమ్ము ! కోయిలల్ పంచమంబు
నరుగఁగానిమ్ము ! నా యసుప్రాణములును.

ఇది మరణోద్యోగము

"రసవిచ్ఛేదహేతుత్వాన్మరణం నైవ వర్ణ్యతే
జాతప్రాయం తు తద్వాచ్యం చేతసాఽకాంక్షితం తథా
వర్ణ్యతేఽపి యది ప్రత్యుజ్జీవనం స్యాదదూరతః"

కావ్యములందు రసవిచ్ఛేదము గలిగించును కాన మరణమును వర్ణింప రాదు. ౧. మరణము సంభవించినట్లుకాక, ౨. నాయికాదులు మరణమును గాంక్షించుచున్నట్లు గాని వర్ణింపవలెను. ౩. ఒకవేళ నిశ్చితముగా మరణము సంభవించినట్లు వర్ణించినను ద్వరలోనే మఱల జీవించినట్లు వర్ణింపవలెను లేకున్న రసభంగమగును మొదటిదాని కుదాహరణము

కం. విరియంబాఱఁగ వావిలిఁ
బరికించియు నెట్టొ పట్టి ప్రాణమునిలిపెం
దరుణీమణి , యా పిమ్మట
నెఱుఁగము విని కోఁడికూఁత నేమగునొ కటా !

ఇటఁ గోఁడికూఁత విన్నపిమ్మట మరణము సంభవించుచున్నట్లు వర్ణింపఁబడెను రెండవదానికి "ముసరఁగానిమ్మ" అను పై పద్యము లక్ష్యము. అందు నాయిక మరణమును గాంక్షించుచున్నది. మూఁడవదాని కుదాహరణము కాదంబరిలో మహాశ్వేతా పుండరీకవృత్తాంతము. అందుఁ బుండరీకుఁడు విరహతాపముచే మరణించును పిమ్మటఁ గొంత కాలమునకు జీవించును.

ఈ దశావస్థలకును మొత్తముమీఁద నీ గ్రంథకర్త యిచ్చిన లక్ష్యము లన్నియు దోషగ్రస్తములే

గీ. తెలియ శృంగార మిదియును ద్వివిధమగుచుఁ
బరగు సంభోగవిప్రలంభంబులనఁగ
నందు బహుభేదముల నగణ్యంబుగాన
నేకవిధమయ్యె సంభోగ; మెట్లటన్న ౧౩౪

శృంగారము సంభోగశృంగారము కేవలము సురతరూపమేకాక పరస్పరావలోకన చుంబన ఆలింగన, జలక్రీడాద్యనంత ప్రకారముల నుండును. ఆ ప్రకారములు లెక్కింప సాధ్యముగామి నేకవిధమనియే యాలంకారికులు వాక్రుచ్చిరి

సంభోగశృంగారము

మ. మరుఁ డాచార్యుఁడుగా, విశీర్ణకబరీమాల్యాళి పుష్పాంజలి
స్ఫురణల్ గాఁ; దదుపేతభృంగనినదస్తోమంబు గానంబుగా
వరమంజీరరవంబు తాళగతిగా వర్ధిల్లు శాతోదరీ
సురతవ్యత్యయవేగతాండవమొనర్చుం జింతితాభీష్టముల్.

విప్రలంభశృంగారము

కం. పురుషులకుఁ దలోదరులకు
నరయంగా విప్రలంభమభిలాషేర్ష్యా
విరహప్రవాసకారణ
పరిణతిచే నాల్గుగతులఁ బరగుచు నుండున్. ౧౩౫

నాయికానాయకుల విప్రలంభశృంగారము అభిలాష ఈర్ష్యా విరహ, ప్రవాస భేదములచే నాలుగు విధములు. (అభిలాషవిప్రలంభము ; ఈర్ష్యా విప్రలంభము ; విరహవిప్రలంభము ; ప్రవాసవిప్రలంభము)

అభిలాషవిప్రలంభమునకే పూర్వరాగమని పేరు వెనుకటి మన్మథావస్థలు దీనియందుఁ గలుగును.

౧ అభిలాషవిప్రలంభము (పూర్వరాగ విప్రలంభము)

కం. కలియుటకు మున్ను కోరిక యిల నభిలాషంబు

నాయిక నాయకునిఁ గలిసికొనుటకు ముందుగలిగిన కోరికయే యభిలాష మనఁబడును.

చ అనయము శ్రీనృసింహులలితాలకతలంబున నుండవచ్చు ; నా
యనఘునఖాంకసంగతుల నందగవచ్చు ; నృపాలమౌళితో
ననవునఁ గుల్కవచ్చు ; గుణసంగతి మెచ్చులుచూపవచ్చునో
వనజదళాక్షి! యాకనకవల్లిక నైనను ధన్యవౌదుగా. ౧౩౮

ఇట నాయిక నరసభూపాలుని కూటమి నభిలషించుచున్నది కాన నభిలాష ఈ పూర్వరాగము త్రివిధములని సాహిత్యదర్పణకారుఁ డిట్లు తెలుపుచున్నాడు.

'నీలీకుసుంభమంజిష్ఠా ః పూర్వరాగోఽపి చ త్రిధా
న చాతిశోభతే యన్నాపైతిప్రేమ మనోగతం
తన్నీలీరాగమాఖ్యాంతి యథా శ్రీరామసీతయోః,
కుసుంభరాగం తత్ప్రాహుర్యదపైతి చ శోభతే
దేవహూత్యా సమం యద్వత్కర్దమస్య తపస్వినః ;
మంజిష్ఠారాగమాహుస్త ద్యన్నాపైత్యతిశోభతే
ఇందుమత్యా యథాజస్య దమయంత్యా నలస్య చ."

నీలీరాగము కుసుంభరాగము మంజిష్ఠారాగము, అని పూర్వరాగము త్రివిధము. నీలీరాగమనఁ బైకి మిక్కిలిగాఁ గానరాక యెన్నిటికినిఁ దొలఁగక మనోగతమైయుండు ప్రేమ. సీతారాముల రాగము నీలీరాగము కుసుంభ రాగమనఁ బైకిఁ గనఁబడు ప్రేమ కానీ కాలాంతరమునఁ దొలఁగిపోవును. దేవహూతికర్దముల రాగము కుసుంభరాగము మంజిష్ఠారాగమనఁబై కధికముగాఁ గానవచ్చును ఎన్నటికినిఁ దొలఁగదు ఇందుమత్యజులయు, నలదమయంతులయు రాగము మంజిష్ఠారాగము

౨. ఈర్ష్యావిప్రలంభము

కం. ...మాన మీర్ష్య...

ఈర్ష్య యన 'మానము' అని అర్థము ఈ లక్షణము సరిగాలేదు ఏలన మానమును నీర్ష్యయు నొకటికావు మానమనఁ గోపము. ఈమానము ద్వివిధము ప్రణయమానము, ఈర్ష్యామానము

ఈ ప్రణయమానము నాయికానాయకులిరువురకునుఁ గలుగవచ్చును కారణము లేకయే ప్రేమాతిశయమునఁ గలుగు కోపము ప్రణయమానము లేక ప్రణయకోపము "ప్రేమ్ణఃకుటిలగామిత్వా త్కోపో యః కారణం వినా" నాయకుని ప్రణయమానమున కిది యుదాహరణము.

ఆ వె కన్నుదోయి మూసి కపటనిద్రఁబోవు
సొగసుకాఁడ ! నాకుఁ జోటునిమ్ము
పులకరించె నాదు ముద్దులచే నీదు
చెక్కు, లింక నాలసింపలెమ్ము

ఇట నాయకుఁడు ప్రణయకోపమును వహింపఁగా నాయిక యనునయించు చున్నది. నాయికా ప్రణయకోపమునకు బెక్కులక్ష్యములు గలవు.

కం ఒదయని మ్రోలన్ నిలఁబడి
విడియంబందించుచుండె విరిఁబోఁడి యతం
డొడికముగ దానిచంటిని
దుడుకుమెయిం గోటమీటఁ దొయ్యలియంతన్

గీ పఱచి రుసరుస లాడుచావలకుఁ ద్రిప్పి
నెమ్మొగమ్మువదమ్మి వైచియు బొమ్మముడిని
మూతి బిగియించి పొలయల్కఁ బూనియుండ
నవ్విభుం డివ్విధంబున ననునయించె

మఱియు నాయకునిచే ననునయింపఁబడకయే నాయిక ప్రసన్నురాలయిన యెడల నది విప్రలంభభేదముగాక సంభోగశృంగారముయొక్క సంచారిభావమే యగును. ఎట్లన

గీ. నెమ్మొగమ్మువదమ్మి వాంచి నానీడమాత్రఁ
దగిలి కనుచుండియును ధైర్య మెగయఁజేసి
యుల్లమును జించివేసెను యువకుఁడొకఁడు
అమ్మొగచి క్రీడి మీనయంత్రమ్ముఁబోలె.

నాయిక 'నా ప్రియుఁడు నా నీడసుమాత్రము దగిలి కనుచుండియును ధైర్య మెగయఁజేసి నా యుల్లమును జించివేసెను' అని చెప్పుటచే నను ఖంపఁ బడకయే ప్రసన్నురాలయినట్లు గోచరించుచున్నది

ఈర్ష్యా విప్రలంభోదాహరణము

మ. వదనాగ్రంబున వాణియున్నది; మమున్ వాక్రువ్వనీ; దిందిరా
మదిరాక్షీమణి యున్నదఱుల; మగున్ మన్నించి వీక్షింపనీ;
దదియుంగాక నృసింహ నీ విపులబాహాశ్లేషమే నొందనో
ర్వదు భూదేవి బహుప్రియావర! నినుం బ్రార్థింప నింకేటికిన్ ?

ఇందు వాణీ లక్ష్మీ సరస్వతులు తమ ప్రియుఁడగు నరసభూపాలుని యొక్క పరకాంతలతోడి సంగమము సహింపకున్నారు. ఈ వాణ్యాదులు సాహచర్యమును రోసి యొక నాయిక నరసభూపాలునిపై నీర్ష్యవహించియున్నది

ఇట నాయిక యన్యకాంతాసక్తుఁడగు ప్రియునిపై నీర్ష్య వహించినది. పతి యన్యకాంతాసక్తుఁడై యుండుటను జూచినను విన్నను అనుమానించినను స్త్రీల కీర్ష్యామానముగలుగును. తమప్రియునితోడి సౌఖ్యమును దానొక్కతెయే యనుభవింపవలెను కాని మఱొకతె కావగింజంతేని నిచ్చుట కుత్తమకాంత లంగీకరింపరు వీనిలో మూఁడవది నను మానము మూఁడువిధములు ఉత్స్వప్నాయితము (పలవరింపు) భోగాంకము (సంభోగచిహ్నము) గోత్రస్థలనము (ప్రియురాలి నామోచ్చారణము) వీనివలన భర్తయొక్క పరకాంతాసంగమమును స్త్రీ యనుమానించును

నాయిక ప్రత్యక్షముగాఁ దనప్రియుఁడు పరకాంతాసక్తుఁడై యుంటను జూచుట కుదాహరణము

ఆ వె నిజముఖానిలమున నెయ్యుఁ డూఁదుచునుండఁ
బొలఁతికనులఁబడిన పూరజంబు
నచటఁగాంచు యువతి యక్షియుగ్మమునందుఁ
గోపరజము నిండెఁ గొలఁదిమీఱి

నాయిక తన ప్రియుఁడు పరనాయికకంటిలో నూఁదుచుంటను ప్రత్యక్షముగాఁ జూచినది. కావ దానికనులఁ గోపరజము నిండెను ఈర్ష్యామానము గలిగెను నాయిక ప్రియుని పరకాంతాసక్తిని విన్నందుల కుదాహరణమిది

గీ తన్ను వంచించి చని వేఱుతన్విఁ గూడి
కేళికాకుంజమందు నుయ్యాలలూఁగెఁ
దనప్రియుండంచుఁ జెలిచెప్ప విని వెలంది
యాత్మ రుసరుసలాడుః నాస్యము ముడుంచు.

సంభోగ చిహ్నములఁజూచి నాయిక నాయకునిఁ బరకాంతాప్రణయము ననుమానించినందుల కుదాహరణ మిది

గీ క్రొత్తరీయంబుఁ గప్పి గోరొత్తు దాఁచి
మోవిపల్లొత్తు దాఁతువు మూసి కేల,
కాని యన్యాంగనాసంగకథలఁ జాటు
కమ్మవాసన లెట్లింకఁ గప్పఁగలవు?

ఇట నఖక్షతదంతక్షతములవలనను, గమ్మవాసనలవలనను నాయకుని పరకాంతాసంభోగమును నాయిక యనుమానించినది

ఉత్స్వప్నాయిత గోత్రస్ఖలనముల కుదాహరణము లూహ్యములు ఈ మానము నందలి భేదములు ద్వితీయాశ్వాసములోని "కం ధీర, యధీరయు ధీరాధీరయు" అను పద్యమున వ్రాయఁబడెను.

సామ, దాన భేదములచేతను నమస్కార, ఉపేక్షా, రసాంతరముల చేతను నీర్ష్యామానముగల నాయికను నాయకుఁడు ప్రసన్నురాలినిఁ జేసికొన వలెను సామమనఁగా ప్రియవచనము; బుజ్జగింపు, దానమన వస్త్రభూషణాదు లిచ్చుట భేదమన నాయికచెలికత్తెలను దానినుండి విడఁదీసి తనపక్షమునకుఁ దెచ్చుట. నమస్కారమనఁ ప్రియురాలి పాదములపైఁబడుట. ఉపేక్షయన సామాదులన్నియును ప్రియురాలియెడ ఫలింపనిచో నేమియుఁ జేయక యూరక వెడలిపోవుట రసాంతరమన హాస్యముచేఁగాని భయానకాదిరసములచేఁగాని దానినిఁ బ్రసన్నురాలిని జేసికొనుట దండమునుమాత్ర మెన్నఁడును బ్రయోగింప రాదు. నాయకుఁడు తా నెన్ని ప్రియురాలి చరణప్రహారములు దిన్నను దాని మీఁదమాత్రమట్టివి ప్రయోగింపరాదు.

౩. విరహ విప్రలంభము

కం. ...విరహమౌఁ గలిసి యెడంబాయ హృదయోత్కలిక.

నాయికానాయకులు సంభోగసుఖమును బొందినపిమ్మట నే కారణమున నేనిఁ దటస్థించిన యెడఁబాటు విరహము

ఉ. వెచ్చెలులీనృసింహధరణీవరుఁ డెచ్చెదమంచుఁబోయి రా
రిచ్చటి కీపునుం గరుణయించుకలే కలరంప గుంపులం
గ్రుచ్చెదవేల? మత్ప్రియునిఁగూర్పుము మన్మథ నీకుఁ దద్విభుం
దెచ్చుటకై యొసంగెద మదీయకటాక్షముల న్నయాస్త్రముల్.

ఒకతూరి నరసభూపాలునితో సంభోగసుఖమును బొంది కారణాంతరమున నెడఁబాటు వహించుచున్న యొకనాయికయొక్క వచనమిది

౪ ప్రవాసవిప్రలంభము

కం. ... ప్రవాసము విదేశగతి యెట్లన్నన్

నాయికానాయకులేదేనిఁ గార్యవిశేషముచేఁగాని శాపముచేఁ గాని సంభ్రమమువలనఁ గాని భిన్నదేశములనుంటఁ దటస్థించినచో నా యవస్థావిశేషము ప్రవాసవిప్రలంభము ప్రవాసమనఁ గొన్నియామడల దూరముగల దేశమని భ్రమింపరాదు స్వేచ్ఛగాఁ గలిసికొనుట కవకాశములేని ప్రతిబంధకభూయిష్ఠమగు దేశమని యర్థము. కావుననే సాహిత్యదర్పణకారుఁడు విరహవిప్రలంభమును ప్రత్యేకముగాఁ బేర్కొనక ప్రవాసవిప్రలంభముననే చేర్చివేసెను

చ. చిరయశ! యోబభూవర! నృసింహ! భవద్రిపుకాంత కాననాం
తరమున కేఁగి యందు నిజనాథునిఁ గానక మన్మథార్తయై
వరుని సరోజపత్రమున వ్రాయునెడం గరముల్ సెమర్పఁగా
వరయ నిజాంగకంబె పగయయ్యె నటంచుఁ దలంచు దైవమున్.

ఓ నరసభూపాలా నీ శత్రుకాంత యడవికిఁబోయి తనభర్తనటఁగానక మదనార్తయై సరోజపత్రమునఁ దన ప్రియుని వ్రాయుచుండఁగాఁ జేయి చెమ్మగిల్లి యా వ్రాఁతకనఁబడకపోఁగాఁ దన హస్తమే తనకు శత్రువయ్యెనని దైవమును దలంచెను

ఇందు నాయికానాయకులకు భిన్నదేశస్థితి తటస్థించినది కావఁ బ్రవాస విప్రలంభము.

ప్రతాపరుద్రీయకారుఁడుగూడ అభిలాష, ఈర్ష్యా, విరహ ప్రవాసభేదములచే విప్రలంభమును నాలుఁగుభేదములుగాఁ జెప్పెను సాహిత్యదర్పణకారుఁడు పూర్వరాగ (అభిలాష) విప్రలంభము, మాన (ప్రణయ ఈర్ష్యా) విప్రలంభము ప్రవాసవిప్రలంభము కరుణవిప్రలంభము అనుభేదములను

దెలిపెను ఇతఁడు విరహవిప్రలంభమును ప్రవాసవిప్రలంభములోనే చేర్చివేసెను సాహిత్యదర్పణానుసారముగా మానవిప్రలంభముయొక్క భేదద్వయమును జూపితిమి. కరుణవిప్రలంభమును బిమ్మట నుదాహరింతుము

ఈ ప్రవాస విప్రలంభము భావి విప్రలంభము భవద్విప్రలంభము, భూత విప్రలంభము అని మువ్విధములు కార్యము బుద్ధిపూర్వకము. అనఁగా జ్ఞానపూర్వకము. కాఁబట్టి కార్యమునుబట్టి యీ మూఁడుభేదములు వచ్చినవి

భావివిప్రలంభము (భవిష్యద్విప్రలంభము)

మ. చనుదున్ సుందరి! పాంథుఁడా! చనుము! నీ స్వాంతంబునన్ శోకముం
గనఁగాఁబోకుము! శోకమెందుల? కిఁకం గన్నీరురాత్తేల? వే
చనవైతంచునె; తొందరేల ననుఁబుచ్చన్ నీకు? నీ తోడఁబో
వనె వాంఛించుచు నిట్లు వేగపడు నా ప్రాణంబు లత్యంతమున్.

విప్రలంభము ముందు తటస్థించుచున్నదని యిప్పుడే నాయిక దుఃఖించుచున్నది.

భవద్విప్రలంభము (వర్తమానవిప్రలంభము)

"ప్రస్థానం వలయైః కృతం" దీనియర్థము ద్వితీయాశ్వాసమ్మునఁ బ్రవత్స్యత్పతికయను శీర్షికక్రింద వ్రాయఁబడినది. (చూ. పుట ౧౪)

భూతవిప్రలంభము

చ. స్తిమితత నొందెఁ జింతలకుఁ జిత్తము: చెక్కిలి కేల వ్రాలెఁ నా
స్యము కళ దప్పె నౌషసమృగాంకునిరీతిని బుండువాఱె శ్వా
సములకు మోవి; చల్లఁబడఁజాలదు తాపము శీతలోపచా
రముల; కెవండు దీని దశఁ బ్రార్థితదుర్లభుఁడై సహించెనో?

మఱొక పద్యమునుగూడఁ జూపుదుము.

గీ. సఖుఁడ పరదేశమునకు నీ చన్న మొదలు
దివసములు లెక్కపెట్టుచు దినదినంబు
గీయు సున్నంపుగీఁతల గేహభిత్తి
తెలవచెక్కలి వడపుఁ దెల్లఁబాఱె.

ఈ మూఁడు లక్ష్యములును గార్యమువలనఁ గలిగిన ప్రవాస విప్రలంభమున కుదాహరణములు

శాపమువలనఁ గలిగిన ప్రవాస విప్రలంభమునకు మేఘదూతమునందలి

కం. కూరిమి సహచరుఁ డెడగా
నారటపడు చక్రవాకి యటులొంటి నటన్
దీ రెడలియుండు తత్సతి
నా రెండవ ప్రాణమని మనమున నెఱుఁగుమీ

అనునది యుదాహరణమగును

ఇఁక సంభ్రమమువలనఁ గలిగిన ప్రవాసవిప్రలంభము మువ్విధములు, సంభ్రమమన నలజడి ఇది యుత్పాతమువలనఁ గలుగును ఈ యుత్పాతము దివ్య నాభస (ఆకాశభవము) మానుషభేదములచేఁ ద్రివిధము

దివ్యసంభ్రమము వలన గలిగిన ప్రవాసవిప్రలంభమున కుదాహరణము విక్రమోర్వశీయ నాటకమునందలి యూర్వశీ పురూరవుల విప్రలంభము అందుఁ బురూరవుఁ డూర్వశితో విహరించుచు నొక విద్యాధరకన్యను జూచెను దానిచే నూర్వశికిఁగోపము గలిగి తొంటిశాపవశమున వివేకము గోల్పోయి యొకవనమునఁ బ్రవేశించెను. అట లతగా మాఱిపోయెను అప్పుడు పురూరవుఁడు ప్రలపించెను ఇది దివ్యమునఁగా దైవికమగు సంభ్రమమువలనఁ గలిగిన ప్రవాస విప్రలంభము.

నాభస సంభ్రమకృతమగు ప్రవాస విప్రలంభమునకు ఉదాహరణము :—

ఆ వె దౌలనుండివచ్చు తరుణుఁ గందోయితోఁ
దనివిఁదీఱ బాల త్రావుచచట
బెడిదమైన పెద్దపిడుగుచప్పుడు విని
మెఱుఁగుదీఁగ మించి పరుగువాఱె

మానవసంభ్రమకృత ప్రవాస విప్రలంభమున కుదాహరణము.

కం. తరసి చనుదెంచు నప్పుం
బరంతి త్రేగంటఁ బొడిచి పాదానతు నన్
గదుఁద్రొబ్బి లేవి యెవరో
వడి నట కరుదెంచ లేడివలె నెటొ పఱచెన్.

ఈ ప్రవాసవిప్రలంభమున నాయికకు గాత్రమాలిన్య వస్త్రమాలిన్యములు ఏకవేణీధారణము నిశ్శ్వాస ఉచ్ఛ్వాస రుదిత భూమిపాతాదులును గలుగును. ఈ ప్రవాసవిప్రలంభమున నీ క్రింది మన్మథావస్థలు గలుగును

అంగములం దసౌష్ఠవము (అంగమాలిన్యము) తాపము, పాండుత్వము (పాలిపోవుట) కృశత్వము అరుచి, అధైర్యము, అనాలంబము (మతిమాలి

యుండుట లేక శూన్యమనస్కత) తన్మయత్వము (బాహ్యాభ్యంతరములయందు దన ప్రియుఁడే కానఁబడుట) ఉన్మాదము, మూర్ఛ, మృతి యను మన్మథావస్థలు గలుగును

కరుణ విప్రలంభము

యూనోరేకతరస్మిన్ గతవతి లోకాంతరం పునర్లభ్యే
విమనాయితే యదైక స్తదా రసః కరుణవిప్రలంభాఖ్యః.

నాయికానాయికులలో నొకరు లోకాంతరమును బొందియుఁ గాలాంతరమున నా శరీరముతోడనే మఱల బ్రతికిరేని నా యవస్థ కరుణవిప్రలంభము కాదంబరిలోని మహాశ్వేతా పుండరీకుల వృత్తాంత ముదాహరణము. అందుఁ బుండరీకుఁడు విరహోద్రేకముచే మరణించును కాలాంతరమున నా శరీరముతోడనే బ్రదికివచ్చి మహాశ్వేతతో సుఖించును ఆ యవస్థ కరుణవిప్రలంభము

తిరిగి జీవింపకపోయినప్పు శరీరాంతరముతో వచ్చినప్పు గరుణరసమే పుండరీక మహాశ్వేతా వృత్తాంతమందుఁ గూడ నాకాశవాణి దుఃఖించుచున్న మహాశ్వేతతో 'నీ భర్త తిరిగి జీవించునని చెప్పెను ఆ విధముగా నాకాశవాణి చెప్పిన పిమ్మటనే యామెకు మఱలఁ బుండరీకునియందు సంగమప్రత్యాశచే 'రతి యుద్భవించును. కాన నప్పుడే కరుణవిప్రలంభము ఆకాశవాణి శ్రవణమునకు ముందు సంగమప్రత్యాశలేమిఁ గరుణమే యని యభియుక్తులందురు

ఈ విధముగా విప్రలంభము చతుర్విధమగుటచే సంభోగశృంగారము గూడఁ జతుర్విధమని కొందఱి మతము. "న వినా విప్రలంభేన సంభోగః పుష్టిమశ్నుతే" (విప్రలంభము లేనిచో సంభోగమునకు బుష్టిలేదు) అని యుంటచే నీ చతుర్విధ విప్రలంభములయు ననంతరమునఁ గలిగిన సంభోగము గూడ నాలుగు విధములు ఎట్లనఁ పూర్వ రాగానంతర సంభోగము మానానంతర సంభోగము ఈర్ష్యానంతర సంభోగము ప్రవాసానంతర సంభోగము.

వెనుక మానవిప్రలంభము ప్రణయ ఈర్ష్యాభేదములచే ద్వివిధమని చెప్పితిమి మానానంతర సంభోగమున మానము శాంతించిన పిమ్మటనగు సంభోగము కొన్నియెడల మానము శాంతింపకున్నను సంభోగము గలుగుచున్నది

గీ. మరుని తూపులపిండు దగ్గఱకుఁ దార్ప
వదలకయు మౌనదీక్షను మదనకేళిఁ
దేలుచుండిరి దంపతుల్ ; త్రెస్సిపోక
ప్రిదులకయు మానపుంగ్రంథి పొదలునట్లె

ఇట మౌనగ్రంధి యెప్పటివలెనే బిగువుగానే యున్నది. సంభోగము జరిగినది ఇదియొక విచిత్రము ఇట్టి వసంతభేదములు గలవు

ఉత్తరరామచరిత్రలోఁ గరుణరసమా? కరుణవిప్రలంభమా? అనునొక చర్చగలదు. భవభూతి "ఏకో రసః కరుణ ఏవ" అని చెప్పుటచేఁ గరుణమే కవికభిప్రేతమగు రసమని కొందఱు ఉత్తరరామచరిత్రవ్యాఖ్యాత యగు వీరరాఘవపండితుఁడు గూడ నీయభిప్రాయమునే తెలిపెను ఉత్తర రామచరిత్రలోఁ దుదిని నాయికానాయకులగు సీతారాములు రామాయణము నందువలెఁ గాక కలియుదురు. శ్రీరాముడు వాల్మీక్యాదుల యుపదేశానుసారముగా సీతను స్వీకరించును. కావున సీతారాములకుఁ గాలాంతరమునఁ బునస్సంగమము గలుగుటచే శృంగారభేదమగు కరుణవిప్రలంభమే యని మఱి కొందఱందురు. మఱియు నాటకమున శృంగారవీరములే ప్రధానములుగా నుండవలెనను నాలంకారికుల ప్రమాణమునుబట్టి కరుణరసమునకు నాటకమునఁ బ్రాధాన్యము లేనేలేదు. కావున నిట శృంగారభేదమగు కరుణవిప్రలంభమే యనియును వారు నొడువుదురు శ్రీనివాసవ్యాఖ్యలో "బీభత్సభయానకయోః ప్రతినాయకాశ్రితత్వేన వర్ణనీయత్వాత్ హాస్య రౌద్ర కరుణాద్భుతానాం మహా ప్రబంధరసత్వే చమత్కారాభావాత్" (బీభత్సభయానకములు ప్రతినాయకాశ్రితములుగా వర్ణింపవలసి యుంటచేతను, హాస్య, రౌద్ర, కరుణ అద్భుతములు మహాప్రబంధరసములుగాఁ జమత్కారముఁ గలిగింపవుకావునను శృంగారవీరములే ప్రబంధరసములుగా నిబంధింపవలయును) అనియుఁగలదు కావున శ్రీనివాసవ్యాఖ్య కరుణవిప్రలంభమునే సమర్థించుచున్నది ఈ విధముగా నాలంకారికులెల్లరును గరుణవిప్రలంభమనియే సిద్ధాంతీకరించిరి. కాని రామునికి సీతావిషయకప్రత్యాశ లేకపోవుటచే రతిపుట్టదు. పునస్సంగమము గలిగినంత మాత్రమున శృంగారభేదమని నొడువరాదు. సాపేక్షభావము (ప్రత్యాశ) న్నచో శృంగారభేదమగు కరుణవిప్రలంభమును నిరపేక్ష భావమున్నచో గరుణమనియు సిద్ధాంతము. సీతారాములును దాము పరస్పరమును దిరిగి కలియుదుమని యనుకొనలేదు కాన నిరపేక్షభావముతోనే యుండిరి ఆ నిరపేక్షభావమును బురస్కరించుకొని ప్రవృత్తమైన శోకస్థాయికమగు కరుణము సంపూర్ణతను బొందినది తుదికిఁ దలవనితలంపుగా సీతారాములు కలిసిరి అంతమాత్రమున నంతకుమున్ను పరిపూర్ణస్థితినిఁ బొందిన కరుణము రతిస్థాయికశృంగారభేదమగు కరుణవిప్రలంభమెట్లగును? కాన శృంగారభేదమగు కరుణవిప్రలంభము గాదనియుఁ గరుణమే యనియును మహావిద్వాంసులు వచింతురు సాహిత్యదర్పణ వ్యాఖ్యయగు రుచిరలో నిట్లుగలదు "ఇదమవధేయం ఏక ఏవేత్యభిధానముత్కర్షాధానాయ శృంగారో వీర ఏవేతి పునః హాస్య భీభత్సభయానక రౌద్రమాత్ర వ్యవచ్ఛేదాయ తేన ప్రబోధ, చంద్రోదయే శాంతస్య ఉత్తరచరితే కరుణస్య చ ప్రాధాన్యం సంగచ్ఛతే" (ఈ విషయము దెలియవలెను ఒక్కడే యని చెప్పుట యుత్కర్షముకొఱకే. శృంగారమేకానీ వీరమేకానీ యని చెప్పుట హాస్య, బీభత్స

భయానక, రౌద్రములను మాత్రమే వ్యవచ్ఛేదించుటకు. కావున దీనిచేఁ బ్రబోధ చంద్రోదయమున శాంతమును ఉత్తరచరితమునఁ గరుణమును బ్రధానత్వము వహించుట పొసఁగును) ఇట్లే దుర్గాప్రసాద పండితుఁడును "శృంగారో వీర ఏవేతి కథనం సముచితరససూచకం తేన ఉత్తరరామచరితే కరుణస్య ప్రబోధ చంద్రోదయే శాంతస్య చ అంగిత్వ మవ్యాహతం" (శృంగారముగానీ వీరముగానీ యని నొడువుట సముచితరససూచకము కాన నుత్తరరామచరిత్రమునఁ గరుణమును ప్రబోధ చంద్రోదయమున శాంతమును అంగిరసములనుటలో విప్రతిపత్తి లేదు) అవి కరుణరసమునే స్వీకరించెను. మఱియు,

రామాయణము ననుసరించి యుత్తరరామచరిత్రము వ్రాయఁబడుట వలన రామాయణమునందలి కరుణరసమే యుత్తరరామచరిత్రమున నుండ వలెను ఏలనఁ గవి రసాననుకూలఘట్టములను రసానుకూలముగా మార్చుకొన వలెను కాని రసమునే మార్చుకొనరాదు ధ్వన్యాలోకమున

"సంతి సిద్ధరసప్రఖ్యా యే చ రామాయణాదయః
కథాశ్రయా న తైర్యోజ్యా స్వేచ్ఛా రసవిరోధినీ"

(సిద్ధరసప్రఖ్యాతములగు రామాయణాదులు గలవు వానిలో రసవిరోధి యగు స్వేచ్ఛను జూపరాదు) అని కలదు కాన రామాయణరసమే యుత్తర రామచరిత్రమునను నుండవలెను.

దీనినిఁబట్టి కరుణవిప్రలంభమనునది లేనేలేదనియుఁ గేవలకరుణమో కేవలవిప్రలంభమో యుండును. కాని కరుణవిప్రలంభమనునదియే యుండ దని సిద్ధాంతము. లోచనమునఁగల * కరుణ విప్రలంభాది' పదము నొక్కుటిగా

* లోచనమునఁ దాపసవత్సరాజమను నాటకమున రసవిచారము చేయు ఘట్టమున "కరుణ విప్రలంభాది భూమికాం గృహ్ణాన్" అని యున్నది ఆ నాటక మున యౌగంధరాయణుఁడు వత్సరాజునకుఁ జక్రవర్తిత్వము నాకాంక్షించి వాసవ దత్తతో నాలోచించియే యామెనుదాఁచి యగ్నిదగ్ధయైనదని వత్సరాజునకు నమ్మకమును బుట్టించి పద్మావతినిఁ బెండ్లిసేయించును. అట వత్సరాజునకు వాసవదత్త మరణించినదనియే నమ్మకముంటచే నాతనికిఁ బ్రత్యాశలేదు ఆమెకు వత్సరాజు పొత్తు మఱలఁ దనకు లభించుననియే నమ్మకముంటచేఁ బ్రత్యాశగలదు. కావున నాయకునియందుఁ గరుణమును నాయికయందు విప్రలంభమును గలవు. అటఁ గరుణమునకు విప్రలంభ మంగమైనది ఉత్తరరామచరిత్రమున నిరువురకును సంగమప్రత్యాశలేకుంటచేఁ గరుణమే కాని యట విప్రలంభమునకుఁ దావేలేదు. తాపసవత్సరాజమునఁ గూడఁ గరుణమే దానికి విప్రలంభమంగము. ఉత్తర రామచరితలోఁ గేవలకరుణమే

గ్రహించి పండితులు తొట్రుపాటుపడిరి. అట కరుణ, విప్రలంభాది అని పద విభాగమును జేసికొనవలెను. ధ్వన్యాలోకమున శృంగారభేదములలోఁ గరుణ విప్రలంభమును జెప్పనేలేదు. సాహిత్యదర్పణకారుడే దీనిని లేవదీసెను.

రసాభాసము

సాహిత్యదర్పణమున నీ లక్షణముగలదు "అనౌచిత్య ప్రవృత్తత్వే త్వాభాసో రసభావయోః (రసభావములనౌచిత్యమునఁ బ్రవర్తిల్లినచోఁ (క్రమముగా రసాభాసము భావాభాసమగను) అనౌచిత్యమన లోకమర్యాదాతిక్రమణము అనఁగా లోకమర్యాద నతిక్రమించి ప్రవర్తిల్లిన నాయికానాయకాదుల రసము.

రసగంగాధరమున "అనుచితవిభావాలంబనత్వం రసాభాసత్వం" అను చితమైన విభావమాలంబనముగఁ గలిగియుంట రసాభాసము) అని లక్షణముచేయఁ బడినది మఱియు దీనినిఁ బరిష్కరించి "ఏవిభావమున ననుచితరత్యాదులు గలుగునో యది రసాభాస" మని సిద్ధాంతీకరించెను. ఇటఁగేవలము శృంగార రసాభాసమే యుదాహరింపఁబడినది. యీ రసముల కింద నాయా రసాభావములు గూడఁ జూపఁబడును

కం. పలువురకొక భామినిపైఁ
దలఁపును, నొక వారసతికిఁ దగఁబల్వురిపై
వలపును, మృగవిహగాదుల
తెలవు రసాభాసమయ్యె ధీరినెట్లన్నన్ ౧౪౨

తా. పెక్కుమంది పురుషులకొక యువతిపైఁ బ్రేమయుంటయు, నొక వారాంగనకుఁ బలువురిమీఁదిఁ బ్రేమయుండుటయును మృగవిహగాదుల ప్రేమయును రసాభాసమగును

ఈ లక్షణ మసమగ్రము 'పలువురికొక భామినిపైఁ దలఁపును' అనుమాట దోషజుష్టము. కావునఁ బ్రతాపరుద్రీయ లక్షణమును మఱొక ప్రాచీన లక్షణమును జూపింతురు. దాననీ లక్షణమునందలి దోషాదులు దెలియఁగలవు

ఏకత్రైవానురాగ శ్చేత్తిర్యక్ మ్లేచ్ఛగతోఽపి వా
యోషితో బహుసక్తిశ్చేద్రసాభాసస్త్రిధా మతః

నాయికానాయకులలో నొక్కరికి మాత్రమే యనురాగమున్నను, పశు, పక్షి మ్లేచ్ఛగతమై (అనురాగము) యున్నను, బహునాయకానురాగమున్నను దానిని రసాభాసమందురు. ఇట్టిది ముప్విధములు

మనుచరిత్రలో వరూధినీ ప్రవరులలో వరూధినికి మాత్రమే యనురాగమున్నది. కాన నాశృంగారము రసాభాసము. పశు పక్షి, మ్లేచ్ఛాదుల

శృంగారము రసాభాసమన నేల? అది రసమే యనఁగూడదా ? అట ననురాగ ముభయనిష్ఠమేకదా ఇచ్చట ననౌచిత్యమేమిగలదు? అని ప్రశ్నవచ్చుచున్నది. విద్యావివేకములు తుల్యానురాగమును గల నాయికానాయకులందెట్లు శృంగారము రాణించునో యుక్తాయుక్త వివేకములేని పశుపక్షులు అనాగరకులగు మ్లేచ్ఛులు మొదలగువారి శృంగారము రాణింపదు శృంగారము త్తమప్రకృతిప్రాయమనియు, ధర్మానుబద్ధమైనచో లోకాభ్యుదయహేతువగుననియుఁ దెలిపితిమి. అట్టి శృంగారముపదేశకముగా నుండఁగలదు తిర్యగాదులందంతగా నుచితముగా నుండదు అయినను దిర్యగాదుల శృంగారమనుచితము గాదు. కాన నుపాదేయమే యగునని యాలంకారికులు కావ్యమునఁ గొంతస్థానమునిచ్చిరి స్త్రీ కొకరిమీఁదఁ బ్రేమయుఁట యుచితము అట్లుగాక పెక్కండ్రపై ననురాగముంట రసాభాసమే యగును. సాహిత్య దర్పణలక్షణమును గనుఁడు'

"ఉపనాయకసంస్థాయాం మునిగురుపత్నీగతాయాం చ
బహునాయకవిషయాయాం రతౌ తథానుభయనిష్ఠాయాం"
ప్రతినాయకనిష్ఠాయాం తద్వదధమపాత్రతిర్యగాదిగతే
శృంగారేఽనౌచిత్యం..."

తా ఉపపతివిషయకమగు రతియు, ముని గురుపత్నీగతమగు రతియు, బహునాయకవిషయకమగు రతియు, ననుభయనిష్ఠమగురతియు ప్రతినాయక నిష్ఠమగు రతియు నధమపాత్రగత రతియు పశుపక్ష్యాది రతియు ననుచితము. కాన శృంగారరసాభాసము

ప్రతాపరుద్రీయ లక్షణమున నుపపతి విషయకరతియు, ప్రతినాయక రతియు గ్రహింపఁబడలేదు కాన నీ లక్షణమే సమగ్రమైనది

ఉపనాయకరతి

మ పనిమీఁదంబనె నామగండు ; సవతాల్ ప్రాంతానికేన్ రాదు , కై
ట ననున్ ముట్టుతయంచు వీడి గురులింటందూటి ; రాబానిపల్
నను సేవింపక కూర్కుచుండిరి యలంతన్ , రేయి శయ్యాసహా
యిని నన్నాగమలాలనీయ ; యిట రావే కావ లక్ష్మీపతీ ;

(ఆగమలాలనీయ రాకచే లాలింపఁదగినవాఁడా!)ఇట నాయిక లక్ష్మీపతి యను నుపనాయకునియం దనురక్తమై యున్నది ఇది రసాభాసము.

మునుగురుపత్నీగతరతి :- ఉపలక్షణచే నగమ్యలగు నెల్లకాంతల రతియు గ్రహింపవలెను. తారాశశాంకమునందుఁ జంద్రునికి గురుపత్నియైన తారయందుఁ గలిగిన యనురాగము రసాభాసము.

బహునాయకరతి

కులకాంతకుఁ బెక్కండ్రు నాయకులమీఁదఁ బ్రీతియుండదు అట్టి నాయిక కులట లేక వేశ్య వేశ్యగూడ నొక్కచో ననురక్తగానుండును. ఎట్లన, వసంతసేన కాన ననురక్తురాలగు వేశ్యయుఁ గులటయు బహునాయకులందు రక్తిఁగనఁబఱతురు

ఉ. ఒక్కని చెట్టవట్టి మఱియొక్కనికిన్ విడెమిచ్చి ముద్దు వే
ఱొక్కనికిచ్చి చల్లని మృదూక్తుల వేఱొకనిన్ నగించి, యిం
కొక్కని చెక్కుకొట్టి పొలుపొందె నొకచ్చరలేమ; యొక్కనిం
జిక్కుట సున్నగాదె వెలచేడెలు స్వర్గముపొంత పోయినన్.

ఇట నొకయువతికిఁ బెక్కండ్రఁమీద ననురాగము చూపఁబడినది

వ్యానమ్రా శ్చలితాశ్చైవ స్ఫారితాః పరమాకులాః
పాండుపుత్త్రేషు పాంచాల్యాః పతంతి ప్రథమా దృశః.

తా. విశేషించి నమ్రములును, జలించుచున్నవియు విచ్చుకొన్నవియు వ్యాకులములయినవియు నగు ద్రౌపదియొక్క తొలిచూపులు క్రమముగా ధర్మజ, భీమ, అర్జున నకుల సహదేవులందుఁ బడుచున్నవి.

యుధిష్ఠిరుఁడు ధర్మపరుఁడు గాన వానియందు నమ్రములై పడుచున్నవి. ఈ నమ్రతచే భక్తి వ్యంగ్యమగుచున్నది భీముని స్థూలాకారమునుగాంచి వానియందుఁ జలించుచున్నవి చలనముచేఁ ద్రాసము వ్యంగ్యము అర్జునుని లోకోత్తర వీరత్వమును వినియుంటచే వానియందు విచ్చుకొని పడుచున్నవి. విచ్చుకొనుటచే హర్షము వ్యంగ్యము. నకుల, సహదేవుల సౌందర్యమునుగాంచి వారియందు వ్యాకులములై పడుచున్నవి వ్యాకులత్వమౌత్సుక్యమును వ్యంగ్యమొనర్చుచున్నది. కానఁ బాంచాలికి యైదుగురియందును ననురాగము గలిగినది ఇటఁగూడ నొకతెకుఁ బెక్కురునాయకులపై రతిగలిగినది కాన రసాభాసమేయని నవ్యులు చెప్పుదురు ప్రాచీనులు వివాహమాడని బహునాయకులందలి రతియే రసాభాసము; ఇది వివాహితబహునాయకవిషయరతిగాన రసమేయని వచింతురు ఈ శ్లోకము వంటిదే వేఱొక శ్లోకమును రుచిరవ్యాఖ్యాత యుదాహరించెను.

"యుధిష్ఠిరం మోదయతిస్మ సుస్మితైః కలేన భీమం. పరిరంభతేఽర్జునం
భ్రువా ప్రణీతైర్నకులంచ సాంత్వనైః పదైశ్చతైస్సా సహదేవమంచితైః"
ఇత్యత్ర ద్రౌపద్యాఅనురాగః పతివిషయకోఽపి న శృంగారవ్యపదేశార్హః"

పరివిషయకమయినను నేకకాలమున నిందఱియందుఁ బ్రేమనుఱాపుట రసాభాసమే. ఇట్లేకకాలమునఁగాక ద్రౌపది యొక్కొక్కరితో యొక్కొక్కయేఁడు కాపురముసేసెనుగదా ? అప్పుడితర భర్తలతో నామె సంభోగమును బొందలేదు అట్టిచో నొక్కరితోడనే యామె పొందిన సంభోగము రసాభాసముగాక రసమే యగును

ఇట నొక శంక పొడముచున్నది. బహునాయకవిషయకరతి రసాభాస మైనట్లే బహునాయికావిషయకరతియు రసాభాసమేల కాదు ? ఈ విషయమును బ్రతాపరుద్రీయ వ్యాఖ్యాత యీ విధముగాఁ దెలిపెను.

'పుంసోఽప్యనేకనాయికానురాగే రసాభాసత్వ మితి కేచిత్" తర్హి తన్మతే దక్షిణనాయికానురాగస్య సర్వసంప్రతిపన్న రసభావస్య ఆభాసత్వప్రసంగ ఇతి చేన్నైవం తస్యాప్యేకస్యామేవ గాఢానురాగత్వాత్ అన్యత్ర తు క్వచిన్మధ్యత్వం క్వచిన్మందత్వమితి నిశ్చితం "తుల్యోఽనేకత్ర దక్షిణః" ఇతిలక్షణం పునరనేకాసు అనువృత్తిమాత్రపరత్వేన తుల్యత్వపరమితి ద్రష్టవ్యం" (కొందఱు పురుషునియొక్కయు బహునాయికావిషయకరతిని రసాభాసమని చెప్పుదురు అట్లేని నెల్ల యాలంకారికులును రసమని సమ్మతించిన దక్షిణనాయకాను రాగము రసాభాసమగుచున్నది లోకపూజ్యుఁడగు శ్రీకృష్ణుడు దక్షిణ నాయకుఁడుగదా ? అన్నచో దక్షిణనాయకానురాగము రసాభాసము గాదు ఏలన దక్షిణనాయకునికిఁ గూడ నొకతెయందే గాఢానురాగమును, వేఱొకతెపై మధ్యమానురాగమును, మఱొకతెపై మందానురాగమును నుండును అట్లయినచో "అనేకనాయికలందుఁ దుల్యుఁడు దక్షిణుఁడు" అను లక్షణమసంగతము గాదా (అన్నచో ననేక నాయికలయందనువృత్తితుల్యత్వమే కాని యనురాగతుల్యత్వము గాదు") సారాంశ మేమనఁగా స్త్రీ యొక్క బహునాయకవిషయకరతి రసాభాసమగును, కాని పురుషునియొక్క బహునాయికావిషయకరతి రసాభాసము గాదనియు రసమే యనియు నాలంకారికమతము

అనుభయనిష్ఠరతికుదాహరణముగా వరూథినీ ప్రవరుల శృంగారమును దెలిపితిమి ఏమ్మట నుభయనిష్ఠమైనను మొదట నేకతరనిష్ఠముగానే రతి యున్నచో నదియు రసాభాసమనియే సిద్ధాంతము. ఎట్లన, వివాహమునకు ముందు పరస్పరసందర్శనాదులకు ముందు నాయికానాయకులలో నేయొక్కరేనిఁ దద్గుణశ్రవణమాత్రమున మోహించియున్నచో నా శృంగారమేకతర నిష్ఠమేకదా పరస్పరసందర్శనానంతర ముభయులకును మోహము గలుగును కాన నది రసమగును. పరస్పరసందర్శనమునకుఁ బరస్పరగుణశ్రవణమునకును ముందేయొకరికేని నేదో కాలమున రతి గలిగినచో నది యేకతరనిష్ఠమగుటచేఁ బిమ్మట నుభయనిష్ఠమైనను నంతవఱకు రసాభాసమే. ఎట్లన రత్నావళిలో

సాగరికావత్సరాజులకుఁ బరస్పర సందర్శనము గలుగకమున్నే సాగరికకు వత్సరాజుపైఁ బ్రేమ గలిగినది. ఇట సాగరికమాత్రమే వత్సరాజును జూచినది కానీ వత్సరాజు సాగరికను జూడలేదు. పిమ్మట వేఱొక ప్రకరణమున వత్సరాజు సాగరికనుజూచి ప్రేమించును కావునఁ బిమ్మట నుభయనిష్ఠమయ్యును మొదట నేకతరనిష్ఠము కావున నది రసాభాసము. "పశ్చాదుభయనిష్ఠత్వేఽపి ప్రథమ మేకనిష్ఠత్వే రతేరాభాసత్వ మితి లోచనకారాః" అని సాహిత్యదర్పణము.

ప్రతినాయకనిష్ఠమగు రతికుదాహరణము హయగ్రీవవధమను మహాకావ్యమున నాయకప్రతినాయకులు విష్ణుహయగ్రీవులు. అందుఁ బ్రతినాయకుఁడగు హయగ్రీవుఁడు శ్రీమహావిష్ణువు తన్నుఁ జంపరాఁగా రౌద్రమును బ్రదర్శింపవలసిన సమయమున సుందరీబృందముతో జలక్రీడలాడుచున్నట్లు కవి వర్ణించెను ఇచ్చటి ప్రతినాయకనిష్ఠరతి రసాభాసము ఇట వర్ణింపఁబడినను లలనారతి శృంగారము కాదు.

అధమపాత్రగతరతి —

గీ. పిన్నలేఁగౌను నాకుఁదీవియ బిగించి
కొండమల్లియక్రొవ్విరుల్ కోసితెచ్చి
కోయజవరాలు గూర్చుండి కొండపైనిఁ
గురులు ముడిపించుకొనెఁ దన తరుణచేత

ఇట కోయపడుచువాం డ్రధమపాత్రలు

అన్యోన్యప్రేమగల నాయికానాయకుల (వారు పరకాంతా పరపురుషులైనను) శృంగారము రసాభాసముగాక రసమే యగుననియు ననుభయనిష్ఠమగు రతియున్నచో రసాభాసమనియు నొక సిద్ధాంతము దీనిచేఁ దారాశశాంకుల శృంగారము రసమే వరూథినీ ప్రవరుల శృంగారము రసాభాసము.

తిర్యగ్రతి

చ. అలఘు విశీర్ణపక్షయుగమై యమితోన్నమితోర్ధ్వకాయమై
గళరవముల్ దలిర్పఁ బ్రియకాంతకుముద్దులు వెట్టి యుబ్బునం
బలుమఱు మేడపై నెగసి పక్షముఁద్రిప్పుచుఁ గుంచితాస్యమై
పొలఁతుకఁ బిల్చువిభ్రమకపోతము హుంకృతనాదమాధురిన్.

ఇటఁ గపోతదంపతుల శృంగారము వర్ణింపఁబడినది. కాన రసాభాసము. ఈక్రింది మనుచరిత్ర పద్యమునందును గల రసాభాసమును గనుఁడు

చ. నునుఁజిగురాకు మేయుతఱి నోరికెలంకులఁ దేఁటి కుట్టినన్
వనతరుశాఖలం గుహకుహధ్వనిఁ బాఱు పికాంగనం బికం
బనునయ మొప్ప నాన్పుగతి నాత్మముఖంబు ముఖంబుఁజేర్చి చుం
బన మొనరించె సందునుడిమాయలుగా మగవారికృత్యముల్

ఏకావళీకారుఁడగు విద్యాధరుఁ డీతిర్యగ్గతిని రసమనియే వచించెను "విభావాదిసంభవోఽపి రసం ప్రతి ప్రయోజకః న విభావాదిజ్ఞానం తతశ్చ తిరశ్చామప్యస్త్యేవ రసః" (తిర్యగాదులకుఁ గలాకౌశలము లేమిచే వాని శృంగారము విభావాది పరిపూర్ణముగాదు కాన రసాభాసమని యనుట యుక్తము గాదు. విభావాదులుంటయే రసమునకుఁ బ్రయోజకము పాత్రలకు విభావాదిజ్ఞాన మక్కఱలేదు కావునఁ దిర్యగ్గతియు రసమే.)

'తిర్యగాదిరతేః' అనుచోటనున్న ఆది' పదముచేఁ దాపసులు మొదలయిన పూజ్యపాదులయొక్కయు రతి రసాభాసమే యగును. ఇదియే కావ్యప్రకాశములో "ఉత్తమదేవతావిషయకత్వేన వర్ణ్యమానా రతిరనుచితా తద్వర్ణనం హి మాతాపిత్రోః రతివర్ణనమివ అత్యంతమనుచితం" అని మమ్మటాచార్యుఁడు వచించెను

ప్రప్రథమమున రసాభాసము రసమగునా ? కాదా ? అను ప్రశ్నయొకటి వచ్చుచున్నది. ఏలన నిట రసముయొక్క యాభాసమే కాని రసముండదు కదా రసము రసాభాసమును నొక్కచో నుండునా? అనౌచిత్యమున్నచోఁ గదా రసాభాసమగును "అనౌచిత్యాదృతే నాన్యద్రసభంగస్యకారణం" అనుటచే రసాభాసమన రసభంగమే కదా। రసమును రసభంగమునునొక్కచో నుండవు అన్నచో నట్లుగాదు! దోషయుక్తమైనంతమాత్రమునఁ గావ్యత్వమునకు భంగము రానివిధమునఁ గీటానువిద్ధత్వమున్నంతమాత్రమున రత్నత్వమునకు భంగమురాని విధమున ననౌచిత్య మను దోషమున్నంతమాత్రమున రసముగాక పోదు రసత్వమును రసాభాసత్వము నుంటలో దొసఁగులేదు మఱియు రసాభాసము వర్ణింపరాదను దోషమును గానరాదు. మనుచరిత్రలో రసాభాసము వర్ణితము.

ఈ శృంగారాభాసము (రసాభాసము) సంభోగాభాసము, విప్రలంభాభాసమునని ద్వివిధము.

సంభోగాభాసము

మ. మగఁడా మోటుమనుష్యుఁ, డీవనము నిర్మానుష్య మేబాల ; నొం
డెగ నుందిన్; బహుళాంధకారములు నిండెన్ నల్దెసల్ మూసికొ
న్నగతిన్ గావున దారి పీడు వెసఁ గృష్ణా మోహనాకార యం
చొగిఁబల్కాడు వ్రజాంగనం గలియు శ్రీయుక్తుండు మిమ్మోమితన్

ఇట నాయిక పరకీయ; శ్రీకృష్ణుఁడుపపతి కాన సంభోగాభాసము.

ఆ. వె తడికసందునుండి తమినిచ్చుపూఁబోఁడి
యధరబింబ మానునట్టి నన్ను
వేయకనులవేల్పు వేడుకపడిచూచు
నమృతరసముఁ గ్రోలు చవలఁ బెట్టి.

ఇట నాయిక పరకీయ, 'నన్ను' పదముచే నుద్దిష్టుఁడుపపతి ఇదియు సంభోగాభాసమే.

విప్రలంభాభాసము

సీ. మనసార పంకమొక్క లతాంగి దెచ్చిన ముట్టివ్రేలనె చుక్కబొట్టుపెట్టి
ఇంతి యొక్కతె పూవుదెత్తులె త్తినఁ జూచి విసువుతో నొకకొన్ని విరులుదుఱిమి
పడఁతి యొక్కతె రత్నపాదుకలిడనిల్చి తొడుగకవ్వలికిఁ బో నడుగు పెట్టి
బాగాలు వెసనొక పద్మాక్షియొసఁగిన వెగ్గలంబని కొన్ని వెదల నుమిసి.

గీ సగముగొఱికిన యాకులు, సఖులుపిలువ
సగమొసఁగు నుత్తరముఁ దెల్విసగము మఱపు
సగమునయి చింతచే సగమగుచు నరిగె
నవ్వరూధిని యంతికోద్యానమునకు.

ఇట వరూధిని ప్రవరునిపై మరులుగొనియున్నది ఇది విప్రలంభాభాసము. ఇంతవఱకు రసాభాసము తెలుపఁబడినది ఇఁకననౌచిత్యమునఁ బ్రవర్తిల్లిన భావము భావాభాసమని చెప్పితిమి దాని కుదాహరణము :—

ఆ వె కౌఁగిలించినట్లు కాంచుచునున్నట్లు
ముద్దులాడునట్లు ముట్టునట్లు
సలుపుచున్నయట్లు చక్కిలిగింతలు
కలికికదిసెఁ గలల గాంతురేల.

ఇట నాయిక పరకీయ నాయకుఁడుపపతి. ఇట స్వప్నమనునది వ్యభిచారి భావము కావున భావాభాసము. ఇట్లెల్ల సంచారిభావముల యొక్కయు నాభాసములను గ్రహింపవలెను.

కం. భావింప భావశాంతియు
భావోదయ భావసంధి భావశబలతల్
భావంబడఁగుట పుట్టుట,
ద్వైవిధ్యము, బహుళత, యనఁగఁ దగునెట్లన్నన్. ౧౪౪

ఆ భావమడఁగుట భావశాంతి; భావము పుట్టుట భావోదయము; పరస్పరోపమర్దకముగా భావద్వయముండుట భావసంధి; పెక్కుభావము లొక్కచో సమకూర్చుట భావశబలత యనఁబడును. ఇట భావములన వ్యభిచారి భావములనియే గ్రహింపవలెను

భావశాంతి

చ. తలఁపఁగ రాజశేఖరుఁ డతండు; తలోదరి! సర్వమంగళా
కలితవు నీవు, మీర లొకగాత్రము కై వడిఁ గూడి యాడుచుం
జెలఁగుటయొప్పుగా కలుగఁజెల్లునె మీ? కని బోటి మ్రొక్కఁ గా
లలనకుఁదోఁచెఁ బాష్పసలిలంబు నివారితమానపంకమై ౧౪౫

ఇట నాయికకు సఖీప్రార్థనముచే మానశాంతి గలిగినది. న్యాయముగా నాయకప్రార్థనముచే మానశాంతి గలిగినట్లు వర్ణింపవలయును. మానమన రోషము అది నిర్వేదాదిభావములలో నొకటి బాష్పసలిలము' అను ననుభావమే మానశాంతిని వ్యంగ్యమొనర్చుచుండ "నివారిత మానపంకమై" అని చెప్పుటచే నది వాచ్యమగుచున్నది ఇది దోషము అనుభావాదులచే రసభావాదులు వ్యజ్యమానములు కావలయును కాని స్వశబ్దవాచ్యములు గాఁకూడదు ఈ క్రింది పద్యముదాహరణార్హము.

గీ. నెమ్మొగముఁ దమ్మివాంచి నా నీడమాత్రఁ
దగిలి కనుచుండియును ధైర్య మెగయఁజేసి
యుల్లమును జించివేసెను యువకుఁడొకఁడు
అమ్మొగచి క్రీడి మీనయంత్రమ్ము వోలె.

ఇట ధృతియను వ్యభిచారిభావము శాంతిల్లినది. భావశాంతివలెనే రసశాంతియు నుండును. ఎట్లన

'ఏకస్మిన్ శయనే పరాఙ్ముఖతయా వీతోత్తరం తామ్యతో
రన్యోన్యస్య హృది స్థితేఽప్యనునయే సంరక్షతోర్గౌరవం
దంపత్యోశ్శనకైరపాంగవలనాన్మిశ్రీభవచ్చక్షుషో
ర్భగ్నో మానకలిస్సహాసరభసవ్యాసక్తకంఠగ్రహః'

(ఏకశయ్యయందుఁ బ్రణయకోపముతో దంపతు లిరువురును బరాఙ్ముఖులయి పరుండిరి ఒకరినొకరనునయింపవలెనను నిచ్ఛ హృదయమునందున్నను వారాత్మగౌరవమునకై పెనఁగులాడుచుండిరి కొంతతడవునకు పరస్పర దృష్టులు

గలియుటవలన వారి మానము భగ్నమయ్యెను సహాసముగా వారొం డొరులఁ గౌఁగిలించుకొనిరి) ఇట వ్యభిచారియగు మానమునకుఁ (కోపము లేక రోషము) ప్రశమావస్థ చెప్పఁబడినది, కాన భావశాంతి కానీ యభినవగుప్తుఁడిట నీర్ష్యావిప్రలంభమునకుఁ బ్రశమమనియుఁ జెప్పవచ్చునని చెప్పుచున్నాడు. (అత్ర చ ఈర్ష్యావిప్రలంభస్య రసస్యాపి ప్రశమః ఇతి శక్యం యోజయితుం - లోచనము)

భావోదయము

ఉ. మేలములాడు వేళల సమేలములై చెలులెల్లఁ గూడి యో
బాలిక శ్రీనృసింహనరపాలు వరించెదవే యటన్న నీ
లాలకయంగవల్లిఁ బులకాంకురముల్ వనలొత్త నేమనం
జాలక యూరకుండె ననిశంబు* త్రపావృతయైన వైపడిన్.

ఇట నాయికకు లజ్జ యుదయించినది ఇదియు 'త్రపావృత' అనుటచే వాచ్యమైనది. ఈ క్రింది పద్యముదాహరణీయము.

గీ కుంచెఁగొని వ్రాయఁగాఁ బూని గోడలవయిఁ
జెక్కు చిత్తరువుబొమ్మలా పోలఁతిమిన్న
చిత్తమక్కాలమునఁ బరాయత్తమగుడు
వ్రాసియున్నది నీదు రూపములె యెల్ల

ఇట నాయికకు 'స్మరణము' అను భావముదయించినది.

భావసంధి

మ. హరి కానంగశరాళిరై యరిక వేలాభీలదివ్యాకుగో
త్కరమై, శౌరికిఁ బాటలాబ్జకళికాదామంబులై వైరికిన్
విరశాగ్నిప్రభలై వెలుంగు నరకానీకాధికోల్లాసభా
సురసత్యారమణీ కటాక్షములు ప్రోచున్ శ్రీనృసింహాధిపున్.

సత్యభామాకటాక్షములు హరికి శృంగారకృతమగు హర్షమును, నరకాసురునకు వీరరసకృతమగు హర్షమును గలిగించుచున్నవి కాన భావసంధియని గ్రంథకర్తయొక్క యాశయము కాని యిదిగాదు. భావద్వయమును బరస్పరోపమర్దకముగా నొక్కరికే కలుగవలయును. ఎట్లన

---

* పాఠాంతరము :— వినమ్రముఖాంబుజాతయై.

కం॥ 'చనుదు' నని 'చన' ననియున్
మనఃప్రియుండాడ రెండుమాటలపుడు జా
ణను మునుముంగటి గాజులు ;
వెనుకటి వట గుత్తమగుట ప్రీలె వెంటదికిన్.

ఇటఁ గార్శ్యహర్షముల సంధి ఈ రెండును నిచట నొక్కనాయికకే కలిగినవి. పై పద్యమున నట్లు గానరాదు.

కం. కనఁబడకుండిన నిన్నుం
గనఁగా నువ్విళ్ళు గొందుఁ ; గనిపించినచోఁ
జనుదువని వెఱతు · నిన్నుం
గనకున్నను గన్ననాకుఁ గలుగవు సుఖముల్

ఇట నౌత్సుక్యశంకలయొక్క సంధి.

ఈ పై యుదాహరణములలో భావసంధియందు మొదటిభావ ముప మర్ద్యముగా రెండవది యుపమర్దకముగా నున్నది. అట్లున్న నే యనఁగా విరుద్ధభావములకు సమావేశమున్న నే సుందరముగా నుండును. ఈ క్రింది ప్రతాపరు దీయ శ్లోకమును గనుఁడు

ప్రతాపరుద్రస్య దిగంతజైత్రయాత్రా ప్రభూతైః పటహప్రణాదైః
ప్రియానులాపైశ్చ తదా భటానాం రోమాంచ వర్మావృత మంగమాసీత్.

ప్రతాపరుద్రుని జైత్రయాత్రాసమయభేరీభాంకారములను వినియుఁ బ్రియురాండ్రప్రియభాషణములను వినియు వీరభటుల గాత్రము రోమాంచిత మయ్యెను.

ఇట వ్యాఖ్యాత "అత్ర పరస్పరవిరుద్ధవీరశృంగారాశ్రితయోః హర్షయోః స్పర్ధయా సంబంధకథనాత్ భావసంధిః" ఇటఁ బరస్పరవిరుద్ధములగు వీర శృంగారముల యొక్క వ్యభిచారులగు హర్షములకు స్పర్ధచే సంబంధము చెప్పుట వలన భావసంధి యనెను అనఁగా వీరులను వీరాశ్రితమగు హర్షమును శృంగా రాశ్రితమగు హర్షమును బరస్పర స్పర్ధతో (పోటీతో) నాశ్రయించినవి

పరస్పరస్పర్ధతో నాశ్రయించినను రెండవదానిచే మొదటిది యుపమర్ద్యము గాలేదు పరస్పర స్పర్ధతోనున్న రెంటికిని ననుభావములు భిన్నముగానుండ వలెను. రెండింటకిని నొక్కటే యనుభావము (రోమాంచము) చెప్పఁబడినది 'చనుదునని చననని యున్ కనబడకుండిన నిన్నున్' అను పద్యములలో వ్యభి చారుల యనుభావములు భిన్న భిన్నములుగా నున్నవి కావున భిన్నవ్యభిచారుల సంధియే యుపమర్ద్య ఉపమర్దకభావము గలిగియున్నచో రమణీయముగానుండును,

(భావశబలత)

చెలులేమందురొ! భావవీధి నకటా! శ్రీనారసింహేంద్రుకౌఁ
గిలినాకెన్నఁడు గల్గునో! నృపతితోఁ గ్రీడింపఁగా బోవు చం
చలపుంజిత్తము నేమి సేయుదు; గురున్ సద్భక్తిఁ బ్రార్థింతునో?
యలప్రాణేశ్వరుఁ జూడకున్నఁ బరితాపాటోపముల్ మానునే!

'చెలులేమందురొ భావవీథి అన్నచో శంకయు, శ్రీనారసింహేంద్రు కౌఁగిలి నా కెన్నఁడు గల్గునో యనుచోట నౌత్సుక్యమును 'నృపతితోఁ గ్రీడింపఁగాఁ బోవు చంచలపుంజిత్తము నేమి సేయుదు' అనుచో దైన్యము, 'గురున్ సద్భక్తిఁ బ్రార్థింతునో అనుచో మతియు, "అలప్రాణేశ్వరు...మానునే" అనుచో వితర్కమును గలవు ఇట్లు పెక్కు భావములా నాయికకుంటచే భావశబలత యగును.

భావశబలతలో నుపమర్ద్యోపమర్దక భావము నియతముగాదు కామచారము, (కవి స్వేచ్ఛానుసారము)

ఈ తెలుపఁబడిన రస భావ రసాభాస భావాభాస భావశాంతి, భావోదయ' భావసంధి భావశబలతలు కావ్యమునఁ బ్రధానములుగాక యన్యాంగములుగా నయ్యేనేని రసవదాద్యలంకారమగును ఎట్లన నొకభావమునకుఁగాని రసమునకుఁ గాని మఱొకరస మంగమయ్యేనేని రసవదలంకారము.

మునిర్జయతి యోగీంద్రో మహాత్మా కుంభసంభవః
యేనైకచులుకే దృష్టౌ దివ్యౌ తౌ మత్స్యకచ్ఛపౌ.

తా ఎవని పుడిసిటియం దా దివ్యమత్స్యకచ్ఛపములు గానబడెనో యా యోగీందుడును, మహాత్ముడును నగు నగస్త్యముని సర్వోత్కర్షముగా వర్తిల్లును.

ఇట మునివర్ణనము ప్రకృతము కానఁ గవియొక్క మునివిషయరతి రూపభావమునకు నద్భుతరస మంగము ఇట భావమునకు రసమంగము ఈ క్రింది పద్యము గూడ నుదాహరణీయము

చ' జలనిధిరాజకన్య కనుసన్న మెలంగుచునుండు; వాణియున్
మెలఁగును మాటలోన; నెలమిం జెయిసన్నఁ జరించుఁగీర్తి, నీ
లలితభుజోపగూహనవిలాసముమానదు ధాత్రి; సద్గుణో
జ్జ్వల నరసింహ మంత్రబలవంతుల కింతులు చిక్కుటబ్రమే

నరసభూపాలవిషయకకవిరతిరూపభావమునకు శృంగారరసమంగము

అయం స రశనోత్కర్షీ పీనస్తనవిమర్దనః
నాభ్యూరుజఘనస్పర్శీ నీవీవిస్రంసనః కరః

యుద్ధభూమియందుఁ జచ్చిపడియున్న భూరిశ్రవసుని హస్తమునుగాంచి యతని భార్య విలపించుచున్నది.

"ఈ హస్తము నా మొలనూలిని లాఁగివేసెడిది ఇది నాజలిసిన చన్నుల నదిమెడిది. ఇది నా నాభినిఁ దొడలను జఘనమును దడుముచుండెడిది ఇది నా పోఁకముడిని విప్పుచుండెడిది."

ఇటఁ గరుణమునకు శృంగారమంగము (రసదోష ప్రకరణమున దీనినిఁ జూచునది) అనఁగా నొకరసమునకు వేఱొకరస మంగము ఈ రెంటను రసవదలంకారము. దీనినే ధ్వనికారుఁడు

ప్రధానేఽన్యత్ర వాక్యార్థే యత్రాంగం తు రసాదయః
కావ్యే తస్మిన్నలంకారో రసాది రితి మే మతిః.

"ఏ కావ్యమున రస, భావాదులు ప్రధానములో ననఁగా నంగిభూతములో నచ్చట రస, భావాదినామముల చేతనే వ్యవహారము, ఏ కావ్యమున రసభావాదులప్రధానములో యనగా నంగభూతములో నవి రసవదాద్యలంకారములని నా యాశయము" అని వచించెను కాన రసాదులకును రసవదాద్యలంకారములకును భేదమును లెస్సగా దెలియవలెను

ఒక రసమునకు భావముగానీ యొక భావమునకు మఱొక భావముగానీ యంగ మయ్యేనేని ప్రేయోఽలంకారము. దీనికి భావాలంకార మనియు నామాంతరము.

కదా వారాణస్యా మమరతటినీరోధసి వసన్
వసానః కౌపీనం శిరసి నిదధానోఽంజలిపుటం
అయే ! గౌరీనాథ ! త్రిపురహర ! శంభో త్రినయన !
ప్రసీదేతి క్రోశన్ నిమిషమివ నేష్యామి దివసాన్.

ఎప్పుడు నేను గంగాతీరమున వసించుచుఁ గౌపీనముదాల్చి శిరస్సున నంజలిని వహించి "ఓ గౌరీనాథ ! ఒ శంభో ! ఓ త్రినేత్ర అనుగ్రహింపుము" అని యఱచుచు దినములను నిమిషముగాఁ గడపఁగలనో !

ఇచ్చట శాంతరసమునకు కదా (ఎప్పుడు) అను పదముచే వ్యక్తమైన 'చింత' అను వ్యభిచారిభావ మంగము అనఁగా రసమునగు భావ మంగము

రసగంగాధరకారుఁ డిట భావమునకే రస మంగమని చెప్పెను

అత్యుచ్చాః పరితః స్ఫురంతి గిరయః స్ఫారా స్తథాంభోధయః
తానేతానపి బిభ్రతీ కిమపి న శ్రాంతాసి తుభ్యం నమః
ఆశ్చర్యేణ ముహుర్ముహుస్తుతిమితి ప్రస్తౌమి యావద్భువ
స్తావద్బిభ్రదిమాం స్మృత స్తవ భుజో వాచ స్తతో ముద్రితాః.

ఓ భూదేవీ నీపైమిక్కిలి యెత్తైన పర్వతములంతటనువ్యాపించియున్నవి, విశాలమైన సముద్రములు నిండియున్నవి. వీని నన్నింటిని వహించుచు నెంత మాత్రమును నలసట వహింపకున్నావు నీకు నమస్కారము" అని యాశ్చర్యముతో తిరిగి తిరిగి భూమిని స్తోత్రము చేయుచుండఁగా నో రాజా ! ఆ భూమిని వహించు నీ భుజము నా స్మృతికి వచ్చినది అంతటితో నామాటలుకట్టువడినవి " ఇటఁ గవిసేయు ప్రభువర్ణనము ప్రకృతము కానఁ బ్రభువిషయకకవిరతిరూప భావమునకు భూవిషయకరతిరూపభావ మంగము అనఁగా నొక భావమునకు వేఱొక భావమంగమయ్యెను

భావమునకు రసాభాసభావాభాసము లంగమయ్యేనేని యూర్జస్విదలంకారము

త్వద్రిపుత్వద్భిపసుంధరేశతరుణీః సంత్రాసతస్సత్వరం
యాంతీర్వీరః విలుంఠితుం సరభసం యాతాఃకిరాతా వనే
తిష్ఠంతి స్తిమితాః ప్రరూఢపులకాస్తే విస్మృతోప క్రమా
స్తాసాము త్తరళైః స్తనైరతితరాం లోలైరపాంగైరపి

ఓ వీరుఁడా నీ భయమున వేవేగఁ బరుగిడుచున్న నీ శత్రురాజకాంతలను వనములందలి కిరాతులు దోఁచుకొనుటకై పోయినవారై యా కాంతల యుబుకు చున్న చన్నులనుగాంచియు వారిలోలాపాంగములను జూచియు గగ్గుఱపాటు గొని తమ పూనికను మఱచి స్తిమితులై నిలిచిరి.

ఇటఁ గవిసేయు వర్ణనము ప్రకృతము. కావున రాజవిషయక రతిరూప భావమునకు శృంగారరసాభాసము (కిరాతులు రాజకాంతలను మోహించుట యనుచితము గాన రసాభాసము) అంగము. ఈ క్రిందిదిగూడ నుదాహరణీయము.

ఉ. అలకలుముట్టిముట్టి జఘనాంబరపంక్తిఁ గిట్టికిట్టి గు
బ్బలురతిఁ బట్టిపట్టి కరపల్లవముల్ నులివెట్టి పెట్టియుం
జెలువగు హారహారములఁ జిక్కులువెట్టు నృసింహ ! నీ ద్విష
ల్లలన వనాళికేఁగ విటలంపటలక్ష్యములై మహీజముల్.

నరసభూపాల విషయకరతిరూపభావమునకు శృంగారరసాభాసమంగము.

త్వయి లోచనగోచరం గతే సఫలం జన్మ నృసింహభూపతే
అజనిష్ట మమేతిసాదరం యుధి విజ్ఞాపయితి ద్విషాంగణః.

ఓ నృసింహభూపతీ నీవు మాకన్నులఁ బడఁగానే మా జన్మ సఫలమయ్యెను. అని శత్రుగణము సాదరముగా యుద్ధమున విజ్ఞాపనము చేయుచున్నది.

ఇట శత్రువులు తమశత్రురాజును గుఱించి యీ విధముగా స్తోత్రము చేయుట యనుచితము రాజవిషయకశత్రుస్తుతి కాన భావము

ఇది యనౌచిత్యదోషగ్రస్తమగుటచే భావాభాసము. ఇది కవిసేయువర్ణనమగుట రాజవిషయకరతి కంగమయ్యెను

రసమునకు భావశాంతి యంగమగునేని సమాహితాలంకారము.

పశ్యామః కిమియం ప్రపద్యత ఇతి స్థైర్యం మయాలంబితం
కిం మాం నాలపతీత్యయం ఖలు శఠఃకోప స్తయాప్యాశ్రితః
ఇత్యన్యోన్య విలక్ష్యదృష్టిచతురే తస్మిన్నవస్థాంతరే
సవ్యాజం హసితం మయా ధృతిహరో ముక్తస్తు బాష్ప స్తయా

ఒక నాయకుఁడు తనమిత్రునితో ననుచున్నాఁడు ఈమె యేమిచేయునో చూతము" అని నేనను ధైర్యమవలంబించితిని. "ఈతఁడు తానైనాతో నేల మాటలాడఁడు' అని యామెయు శరించియున్నది. ఇట్లుండఁ బరధ్యానములో నెటువైపో చూచుచున్న యా సమయమున నేను మిషవెట్టి నవ్వితిని ఆమెయు నా ధైర్యమును హరించుబాష్పము విడిచినది"

ఇట శృంగారరసమునకు నంగమగు కోపరూపమగు భావమునకు శాంతి గలిగినది. భావోదయ, భావసంధి భావశబలత లిట్లన్యాంగములయినచో వీనికి నామాంతరములు లేవు. భావోదయాలంకారము భావసంధ్యలంకారము, భావశబలతాలంకారము, అనియే వ్యవహారము ఈ రసవదాద్యలంకారరూపమగు కావ్య మపరాంగ రూపమగు గుణీభూతవ్యంగ్యములోఁ జేరును. అదియుఁ బండితరాయమతానుసారముగా నుత్తమకావ్యములోనే చేరును.

నవరససంకరము

మ. జయలక్ష్మీరతమై ప్రతాపయుతమై; శత్రుచ్ఛిదాధుర్యమై,
ప్రియతార్తావనమై, కపీంద్రగతియై, రక్తార్ధ్రమై, నిర్ఘనో

దయవిద్యున్నిభమై సకంపమయి, వందారుస్పృహాశూన్యమై
వయమొప్ప న్నరసింహుఖడ్గమమరున్ నానారసప్రక్రియన్.

నరసభూపాలుని ఖడ్గము జయలక్ష్మియందు రతిగలదై శౌర్యముగలదై, శత్రువులను ఛేదించుటయందును సమర్థమై ఆర్తులను రక్షించునదై, చంచలమై, రక్తముతోఁ దడిసినదై మేఘము లేకయే వచ్చిన మెఱపువంటిదై, కంపముగలదై ప్రణతులను సంహరించు కోర్కెలేనిదై నానారసప్రకారములతో విలసిల్లుచున్నది.

ఇందుఁ గ్రమముగా నరసభూపాలుని ఖడ్గము శృంగార వీర, రౌద్ర, కరుణ, హాస్య బీభత్స అద్భుత, భయానక శాంతిరసములకు నాశ్రయమయి నది. కావున నవరస సంకరమని భావము

ఇట నచేతనమగు ఖడ్గము రసాశ్రయమెట్లగును? తిర్యగాదులకు విభావాది జ్ఞానములేమి వాని శృంగారమే రసాభాసమగుచుండ నచేతనమగు ఖడ్గమునకు విభావాది జ్ఞానమెట్లుండును ? రసాశ్రయమెట్లగును ? 'శృంగారీ గిరిజాననే' అనునోటఁ జేతనుఁడగు హరుఁడు నవరసాశ్రయుఁడైన ట్లిచ్చటఁగాదు. కాన నీపద్యమున నవరససంకరము పొసఁగదు మఱియు శోకస్థాయిభావకమగు రసము కరుణము. కరుణ (అకారాంత పుంలింగము) కరుణా (ఆకారాంత స్త్రీలింగము) రసపర మైన కరుణ శబ్దమునకును దయాపరమైన 'కరుణా శబ్దమునకును భేదము దెలియక 'ప్రయతార్తావనమై అని ప్రయోగించుట దోషము. మఱియుఁ జెప్పకయే నానారస సంకరమని తెలియుచుండఁగా "నానారసప్రక్రియన్" అని వాచ్యముగా జెప్పుటయు ననుచితమే. ఇట్టి సంకరము నే యాలంకారికులును నుదాహరింపలేదు.

రసాధిదేవతా నిరూపణము

సీ. హరికి శృంగారలీలాధిపత్య మొనర్చు
గణనాథు హాస్యసంగతునిఁ జేయు
నలికలోచనునిపై నధికరౌద్రము నిల్పు
శక్రుపై వీరరసంబు నెఱపు
యమునిపై ని దయామయత్వంబు ఘటియించు
జగతి మహాకాలు సభయుఁ జేయు
శర్వరీంద్రుని జుగుప్సారసాన్వితుఁ జేయు
శతధృతి నద్భుతాన్వితు నొనర్చు

గీ. శాంతి బ్రహ్మంబుఁ జేర్చు నిచ్చలు నృసింహ
భువనభరణంబు, వరవిఘ్ననివహహరణ,
మీశతయు. భోగము ననేక నృపతిహృతియు,
ననియు, యశమును, మదియు బోధాతిశయము. ౧౪౮

తా నరసభూపాలుని భూభరణము హరిని శృంగారాస్పదునిఁ జేయును అతని విఘ్నహరణ శక్తి విఘ్నేశ్వరుని నవ్వులపాలు సేయును అతని యీశత్వము ఫాలాక్షుని రౌద్రయుక్తునిఁ జేయును అతనిభోగ మింద్రునికి వీరత్వము గలిగించును అతని శత్రురాజ సంహారము యముని దయావంతునిఁ జేయును అతని యుద్ధము కాలరుద్రుని భయాస్పదునిఁజేయును. అతని కీర్తి చంద్రుని జుగుప్సావంతునిఁ (రోఁతపుట్టించువానినిఁ) గావించును. అతనిబుద్ధి బ్రహ్మదేవుని నద్భుతవంతునిఁ జేయును. అతని జ్ఞానము బ్రహ్మమును (పరమాత్మను) శాంతినిఁ బొందించును

ఇందు శ్రీమహావిష్ణువు శృంగార రసాధిదేవత. గణపతి హాస్యరసాధి దేవత, ఫాలాక్షుడు రౌద్రరసాధిదేవత; ఇంద్రుఁడు వీరరసాధిదేవత · యముఁడు కరుణరసాధిదేవత కాలరుద్రుడు భయానకరసాధిదేవత చంద్రుఁడు బీభత్స రసాధిదేవత, బ్రహ్మ యద్భుతరసాధిదేవత పరబ్రహ్మము శాంతరసాధిదేవత యని చెప్పఁబడినది సాహిత్యదర్పణమున నీ యధిదేవతలు భిన్నముగాఁ జెప్పఁ బడియున్నారు. రసగంగాధరమున నీ విషయ మేలేదు

ఇందు "యమునిపై దయామయత్వంబు ఘటియించు" అనుచోటఁ గరుణ రసమునకు దయాపదమును వాడుట చింత్యము.

సీ. మరకతానీకదంభమున శృంగారంబు,
హాస్యంబు ముక్తాఫలౌఘరుచులఁ
గరుణ విద్రుమవర్ణ గౌరవచ్ఛలమున
రౌద్రంబు కురువిందరత్నకలన
వీరంబు గోమేధికారోపితస్ఫూర్తి
భయము వైదూర్యశోభామిషమున
బీభత్స మింద్రనీలాభాగుణంబున
శాంతి నిర్మలహీరకాంతిగతుల

గీ. నద్భుతము పుష్యరాగరాగాఃదేశ
విలసితంబున సాకారవృత్తిఁ గాంచి

నవరసంబులు వొల్చు నీ భవనవీథిఁ
బ్రబల సుబల! నృసింహా! యోబయనృసింహా! ౧౫౦

కవిసమయములందుఁ గీర్తి తెల్లనిదని వర్ణించువిధముననే నవరసములును గవిసమయమున నీ క్రింది వర్ణములు గలిగియుండును శృంగారమునకు మరకత వర్ణము. హాస్యమునకు ముక్తాఫలవర్ణము కరుణమునకు విద్రుమ వర్ణము. రౌద్రమునకుఁ గురువింద రత్నవర్ణము వీరమునకు గోమేధికవర్ణము భయానకమునకు వైడూర్యవర్ణము. బీభత్సమునకు నింద్రనీలవర్ణము. శాంత మునకు వజ్రవర్ణము అద్భుతమునకుఁ బుష్యరాగవర్ణము. అనఁగా నీ రసములా యారత్నరూపమున రాజసౌధమునఁ గలవని భావము

కం. కరుణా భయ బీభత్సము
ఖరసంబులు శోక భీతి గాఢ జుగుప్సా
కరములు గాన రసములై
తిరమగు నెట్లన్న దీనిఁ దెలిపెద వరుసన్

ఉ. భావములం క్రియా గుణ విభాసితమై వికసద్రసోదయ
శ్రీ వినివారితేతరవిశేషనివేదనమై యెలర్చు నీ
వావిరి దుఃఖమైన సుఖమై భవమైన విటీవిటాళి యం
దావలఁ బూర్ణమై సహృదయాత్మలఁ గేవల హర్షమై తగున్.

భావము (రత్యాది స్థాయిభావము) అలంకారగుణములచే (ఇది యుప లక్షణము కాన వృత్తి రీతి శయ్యా, పాకములచేతను అనియును జెప్పుకొన వలెను) విభాసితమై యనఁగాఁ గావ్యమునందుఁ బ్రతిపాదింపఁ బడిన విభా వాదులచే నభివ్యక్తమై (విభావాదులను గుణాలంకారాదులేకదా రమణీయముగా శోభింపఁజేయును. అట్టి రమణీయములయిన విభావములచే రసము వ్యక్త మగును) రసముగా నగుచున్నది ఆ సశ్రీచేత సహృదయుల హృదయమున నున్న జ్ఞానాంతరములు నివర్తిల్లుచున్నవి ఈ క్రమమునఁ బ్రప్రథమమున ననుకార్యులగు విటీవిటులయందు దుఃఖమైనను సుఖమైనను సహృదయులకుఁ బూర్ణమగు నానందమే కలుగును.

'విటీవిటు' లనరాదు. ఏలన, నెల్లరసములందును విటీవిటు లుండరుగదా. శృంగారమునందయినను దరుణీతరుణులు నాయికానాయకులుగా నుందురు. కాని విటీవిటులు గారుగదా కాన విటీవిటులనుట తప్పు

ఇట గ్రంథకర్త యుద్దేశ మేమనఁగా ననుకార్యమునందు దుఃఖమున్నను సుఖమున్నను దానిని దృశ్య శ్రవ్య కావ్యములలోఁ జూచుచున్నట్టిదియు విను

చున్నట్టియు సహృదయుల కానందమే కలుగుచున్నది. ఈ రసచర్చ విపులముగాఁ జేసియుంటిమి.

గీ. అల పదార్థంబులగు విభావానుభావ
సాత్త్వికాదులఁ గూడి రసత్వమొందు
నవని భావంబు వాక్యార్థమనఁగ నెగడి
తంతువులుగూడి పటమనఁ దనరుకరణి.

రత్యాది స్థాయిభావము పదార్థభూతములగు విభావాదులఁగూడి తంతువులు దమలోఁదాము గూడి పటమగువిధమున వాక్యార్థరూపమగు రసముగాఁ బరిణమించును విభావాదులు పదార్థములనియు రసము వాక్యార్థమనియు సిద్ధాంతము పదార్థములకును వాక్యార్థమందే కదా విశ్రాంతి; విభావాదులకు రసమునందే విశ్రాంతి. స్థాయిభావము లావిభావాదులను గూడి వానిచేఁ బుష్టమై రసమగును

దీని కాకర మిది :—

యథా హి తంతవో వేమతుర్యాది క్రియయాన్వితాః
పటాత్మతాపరిణతాః పటవాచ్యా భవంతి తే
తథైవ స్థాయినో భావా విభావాదిభిరన్వితాః
రసాత్మతాపరిణతా రసవాచ్యా భవంతి తే.

మ రమణీయోల్బణతాసమేతమగు నీరత్యాదిభావాబ్ధిలో
నమరం బుట్టుచు మున్గుచుం దగుఁ దరంగాకూాధ సంచారి సం
ఘము, లేతత్ప్రతిపన్నమౌ రసము తత్కాలంబునందైన స
త్యమురామాదులయంద, నాట్యమున సభ్యావాసమై భాసిలున్.

నిర్వేదాదిసంచారిభావబృందములీరత్యాదిస్థాయిభావములనుసముద్రములోఁ దరంగములనఁ బుట్టుచు నడఁగుచుండును వీనిచేఁ బరిపుష్టమైన రసము ప్రథమమున రామాద్యనుకార్యమునందే యున్నను గావ్యనాట్యములందారసము సామాజికాశ్రయమైయుండును ఇది యలౌకికరసము దీని కాకరమిది.

ఉన్మజ్జంతో నిమజ్జంతః కల్లోలాస్తే యథార్ణవే
తస్యోత్కర్షం వితన్వంతి యాంతి తద్రూపతామపి
తథా స్థాయిని నిర్మగ్నాహ్యున్మగ్నా వ్యభిచారిణః
పుష్ణంతి స్థాయినం స్వాంశ్చ తం నయంతి రసాత్మతాం

శా. లేఖేశప్రతిమానవైభవ భవాశ్లిష్టస్రవంతీమరు
చ్ఛాఖస్పర్థియశఃపరంపర పరక్ష్మాపాలకప్రాజ్యరా
జ్యాభిఖ్యస్మయపుంజభంజనకృపాణాకల్ప! కల్పాంతవే
లాఖేలత్ప్రిబలార్కకర్కశమహోలంఘిప్రతాపోదయా!

అచల జిహ్వము—ఈ పద్యాక్షరములను జదువునపుడు జిహ్వ చలింపదు.

కం భోగాంబువాహవాహవి
భాగేహోభావుకాంగ! భావభవమహో
భాగమహీభాగమహో
భోగావహాభావుభోగిపుంగవ భోగా! ౧౫౫

కవిరాజ విరాజితము

నిరుపమరూప! దిలీపమనూపమనీతికలాప! కలాపధర
స్మరణ భవానుభవానిశమానితమానసపద్మసపద్మరట
త్కరివరఘోటకకోటికరంభితకాంత నిశాంత నిశాంతమహో
హరిహయదిక్తరణి స్ఫురణైకవిభాధికలాభ కలాభవనా!

గద్యము

ఇది శ్రీ హనుమత్ప్రసాదలబ్ధ కవితాసారసారస్వతాలంకార నిరంకుశ ప్రతిభా
బంధుర ప్రబంధ పరన రచనాధురంధర ప్రబంధాంక వేంకటరాయభూషణ
సుపుత్త్ర తిమ్మరాజపౌత్ర సకలభాషావిశేష నిరుపమావధానశారదా
మూర్తి మూర్తి ప్రణీతంబైన కావ్యాలంకారసంగ్రహంబను
మహాప్రబంధంబునందు రస స్థాయి సామాన్యలక్షణంబును
దద్వ్యహారాకరణంబును విభావానుభావ సంచారిభావ
ప్రపంచంబును, శృంగార చేష్టా ప్రకరణంబును
నవస్థా నిర్ణయంబును సంభోగ విప్రలంభ
భేదంబును రసాభాస, భావశాంతి, భావో
దయ భావసంధి భావశబలతా
సంకరతలును రసవర్ణాధిదేవతా
విశేషంబును నన్నది
తృతీయాశ్వాసము

అనుబంధము

ప్రప్రథమమునఁ దొమ్మిది రసములకును గ్రంథకర్త స్థాయిభావములను మాత్రముఁ జూపి శృంగారరసమును మాత్రమే విభావానుభావసంచారిసామగ్రితో వివరించెను గ్రంథవిస్తరభీతిచే మిగిలిన రసములను వదలితిననెను మిగిలిన రసములను వాని విభావాదిసామగ్రిని నిటఁ జూపుదుము

హాస్యరసము

వికృతాకార వాగ్వేష చేష్టాదేః కుహకాద్భవేత్
హాస్యో హాసస్థాయిభావశ్శ్వేతః ప్రమథదైవతః
వికృతాకారవాగ్వేషం యమాలోక్య హసేజ్జనః
స త్వత్రాలంబనం ప్రోక్తం తచ్చేష్టోద్దీపనం మతం
అనుభావోఽక్షిసంకోచవదనస్మేరతాదికః
హర్షావహిత్థచాపల్యావేగాశ్చ వ్యభిచారిణః.

వికృతమైన యాకారము, వికృతమైన భాష వికృతమైన వేషము వికృతమైన చేష్టలు మొదలగునవిగల నర్తకుని (కుహకాత్) వలన హాసము స్థాయిభావముగాఁగల హాస్యరసము గలుగును దీని వర్ణము శ్వేతము దీని కధిదేవత ప్రమథుఁడు (నరసభూపాలీయ కర్త గణనాథుఁడని చెప్పెను.) జనుఁడు (సామాజికుఁడు) వికృతాకారవాగ్వేషచేష్టాదులు గల యెవనినిఁ జూచి నవ్వునో యతఁ డాలంబనవిభావము. వాని చేష్ట యుద్దీపనవిభావము అక్షిసంకోచము, వదనస్మేరత మొదలగునవి యనుభావములు, హర్షము అవహిత్థ, చాపల్యము, ఆవేగము వ్యభిచారిభావములు.

ఈ హాస్యరస మనుభావమునుబట్టి యాఱువిధములు, ఎట్లన
జ్యేష్ఠానాం స్మితహసితే మధ్యానాం విహసితావహసితే చ
నీచానా మపహసితం తథాతిహసితం తదేష షడ్భేదః

ఉత్తములకు స్మితహసితములు మధ్యములకు విహసిత, అవహసితములు, నీచులకు అపహసిత, అతిహసితములు అనునవి గలుగును.

ఈషత్ఫుల్లకపోలాభ్యాం కటాక్షైరప్యనుల్బణైః
అదృశ్యదశనో హాసో మధురఃస్మిత ముచ్యతే
వక్త్ర నేత్ర కపోలైశ్చే దుత్ఫుల్లైరుపలక్షితః
కించిల్లక్షితదంతశ్చ తదా హసిత మిష్యతే
సశబ్దం మధురం కంఠగతం వదనరాగవత్.

ఆకంపితాక్షిమంద్రం చ విదుర్విహసితం బుధాః
వికుంచితాంసశీర్షశ్చ జిహ్మదృష్టివిలోకనః
ఉత్ఫుల్లనాసికో హాసో నామ్నావహసితం మతం
అస్థానజః సాశ్రుదృష్టిరాకంపస్కంధమూర్ధజః
శార్ఙ్గదేవేన గదితో హాసోఽపహసితాహ్వయః
స్థూలకర్ణకటుధ్వానో బాష్పపూరప్లుతేక్షణః
కరోపగూఢపార్శ్వశ్చ హాసోఽతిహసితం మతం."

కొంచెముగా చెక్కిళ్లు వికసింపఁజేసి మృదువుగా కటాక్షములను విగుడ్చుచు, దంతములు వెలికిఁగనరానిచందమున నవ్విన నది మధురమైన హాసము. దీనికి స్మితమని పేరు. లెస్సగా మొగము కన్నులు, చెక్కిళ్లను వికసింపఁజేసి కొంచెముగా దంతములు గనవచ్చునట్లు నవ్విన నది హసిత మనఁబడును. కంఠగతముగానే (వెలుపలికి రానీయక) మధురస్వరమును జేయుచు ముఖరాగమును జూపుచు నోరగంటఁ జూచుచు మంద్రముగా నవ్విన నది విహసిత మనఁబడును భుజములును శిరస్సును గదలునట్లును నోరమూపుఁజూచుచు ముక్కుపుటమును లెస్సగా వికసింపఁజేయుచు నవ్విన నది యవహసిత మనఁబడును తగినంత కారణములేక యుఁ గలిగినదియు గన్నీరు వెలువరించుచు భుజములును వెండ్రుకలును నదరిపోవునట్లు చేయునదియు నగు నవ్వపహసిత మనఁబడును. స్థూలమైనదియుఁ గన్నులనుండి బాష్పపూరమును బ్రవహింపజేయునదియు డొక్కలదరునట్లు చేయునదియు నగు నవ్వతిహసిత మనఁబడును.

ఉదాహరణము

గురోర్గిరః పంచదినాన్యధీత్య వేదాంతశాస్త్రాణి దినత్రయం చ
అమీ సమాఘ్రాయ చ తర్కవాదాన్ సమాగతాః కుక్కుటమిశ్రపాదాః

అయిదు దినాలలో మీమాంసాశాస్త్రమును మిడికి మూఁడుదినాలలో వేదాంతశాస్త్రమును వెలిఁగించి తర్కవాదములను మూచూచి కుక్కుటమిశ్రపాదులవారు దయచేసినారు

ఆ వె ౹ దాకివానితోడ జగడాలు పడలేక
సిరిగలాఁడు పట్టుచీరగట్టె;
శివుఁడు తోలుగప్పె సీయని మదిరోసి
భైరవుండు చీర పాఱవైచె.

ఈ హాస్యరసము ప్రహసనములలో నంగిగా నుండును అందు మన మీ యాఱుభేదములను జూడఁగలము.

ఇట నొక శంక గలుగుచున్నది. సామాజికుఁడు నాయకునితో నభేదమును బొందినపుడుగదా రసోదయమగుచున్నది. ఇందులకే సాధారణీకరణమను వ్యాపారముండుననియు నది నాయకసామాజికులకు విభావాదులను సాధారణముగాఁ జేయుననియును రసచర్చావసరమునఁ దెలిపితిమి. అట్టియెడఁ నాయకుఁడు గావ్యములందు సాక్షాత్తుగా నిబద్ధుడై యుండవలెను కానిచో రసాస్వాదము గలుగదు ఎట్లు సామాజికుఁడు శకుంతలాదుష్యంతాదుల శృంగారమును సాక్షాత్తుగాఁ జూచి తదభేదముతో రసాస్వాదమును జేయుచున్నాఁడో హాస్యరసముననునట్లే నవ్వుచున్న నాయకునిఁజూచి తదభేదముతో హాస్యరసాస్వాదమును జేయవలసియున్నది. కాని హాస్యాదులగు కొన్ని రసములలో నట్టి నాయకాదులు నిబంధింపఁబడుటలేదు అట్టిచో రసోదయ మెట్లగును ?

> యస్య హాసః స చేత్క్వాపి సాక్షాన్నైవ నిబధ్యతే
> తథాప్యేష విభావాది సామర్థ్యా దుపలభ్యతే.
> అభేదేన విభావాదిసాధారణ్యాత్ప్రతీయతే
> సామాజికై స్తతో హాస్యరసోఽయ మనుభూయతే.

నాటకాదులయందు నవ్వుచున్న నాయకుఁడు సాక్షాత్తుగా నిబంధింపఁబడుట లేదు అయినను నా నాయకుఁడు విభావాదుల సామర్థ్యముచేఁ దోఁచును అనఁగాఁ బ్రత్యక్షముగాఁ గానరాకున్నను సామాజికుల యాంతరదృష్టికి నవ్వుచున్న నాయకుఁడు గానఁబడును వానితో సామాజికు లభేదమునుబొంది రసాస్వాదమును జేయుదురు. బీభత్సమునందుఁ గూడ నిదేవిధముగా సామాజికులు రసమనుభవింతురు

హాస్యాభాసము

అపహసింపఁదగని గురువులు మొదలగు పెద్దల, నాలంబనముగాఁ జేసికొని ప్రవృత్తమైన హాసము హాస్యాభాసము ఉత్తరరామచరిత్రమున వాల్మీక్యాశ్రమమునకు వసిష్ఠమహర్షి వచ్చినపుడు శిష్యుల సంభాషణమును గనుఁడు.

సౌధాతకి ,....ఏమి ? వసిష్ఠుఁడా ! నేనేదో వ్యాఘ్రమనుకొంటిని. ఏలన సతఁడురాగాఁనే పాప మాపుపెయ్యను నంతమొనర్చిరి.

ఇటఁ బూజ్యపాదుఁడగు వసిష్ఠమహర్షినిఁ బరిహసించుట హాస్యాభాసము

కరుణరసము

ఇష్టనాశాదనిష్టాప్తేః కరుణాఖ్యో రసో భవేత్
ధీరైః కపోతవర్ణోఽయం కథితో యమదైవతః
శోకోఽత్ర స్థాయిభావఃస్యాచ్ఛోచ్యమాలంబనం మతం
తస్య దాహాదికావస్థా భవేదుద్దీపనం పునః
అనుభావా దైవనిందాభూపాతక్రందితాదయః
వైవర్ణ్యోచ్ఛ్వాసనిశ్శ్వాస స్తంభప్రలపనాని చ
నిర్వేదమోహాపస్మారవ్యాధిగ్లానిస్మృతిశ్రమాః
విషాదజడతోన్మాదచింతాద్యా వ్యభిచారిణః

ఇష్టబంధువులు మొదలగువారి నాశమువలనను అనిష్టము ప్రాప్తించుట వలనను గరుణరసము గలుగును ఇష్టనాశము అన నిష్టులగువారి మరణమనియే యర్థముగాదు, మరణముగావచ్చును లేక వారి వార్త కొత్తుగాఁ దెలియకపోవుటచే మరణించిరనియు వారి సంగమము దిరిగి తటస్థింపనే తటస్థింపదనియు నమ్మకము గలుగుటచే సంభవించిన నిరపేక్షభావము దీని వర్ణము కపోతవర్ణము (నరసభూపాలీయమున విద్రుమవర్ణమని చెప్పఁబడియున్నది) దీని కధిదేవత యముఁడు స్థాయిభావము శోకము. శోచ్యులగు బంధుమిత్రాదులాలంబనము, ఆ శోచ్యులగు వారి దాహావస్థయుఁ దత్సంబంధి గృహ, తురగాభరణ దర్శనాదులును నుద్దీపనవిభావములు దైవనింద భూపాతము ఆక్రందనము, మొదలగునవి యనుభావములు వైవర్ణ్యము ఉచ్ఛ్వాస నిశ్వాసములు స్తంభము, ప్రలాపము నిర్వేదము మోహము అపస్మారము వ్యాధి గ్లాని, స్మృతి శ్రమ, విషాదము జడత ఉన్మాదము చింత మొదలగునవి వ్యభిచారిభావములు

ఉదాహరణము

ఆ వె లోకదీప మాఱె, లోకేశ్వరుఁడడంగె,
గల్పవృక్షకంబు కాలిపోయెఁ
బాలకదలి యెండె, భాండారము హరించె,
వ్యర్థమైన బ్రదుకు బ్రదుకవలసె

ఈ పద్యము నా జాతకకథాగుచ్ఛములోనిది. ఇట వ్యాఘ్రముచే భక్షితుఁడైన బోధిసత్త్వునిఁ గాంచి యతని శిష్యులు విలపించుచున్నారు బోధిసత్త్వుఁడాలంబనము అతని యెముకలప్రోవుద్దీపనవిభావము రోదనము అనుభావము నిర్వేద విషాదములు వ్యభిచారులు వీనిచే స్థాయిభావమగు శోకము పుష్టమై కరుణరసమయ్యెను ఈ కరుణరసము నా ద్వంద్వయుద్ధమున లెస్సగాఁబుష్టమైయున్నది.

భట్టలోల్లటుఁడు కరుణరసమున 'ధృతి' గూడ వ్యభిచారిగా నుండునని చెప్పినట్లేదో సందర్భములో నొకానొక వాఖ్యానమున నొకరు వ్రాసిరఁట. దానికిఁ దగినట్లు పాండురంగ మాహాత్మ్యములోని నిగమశర్మోపాఖ్యానమున నీ క్రింది పద్యమున 'ధృతి' యను వ్యభిచారము గన్పట్టుచున్నది

ఉ. ఎల్లరు నెల్లచో ధనము లిచ్చి మృగాక్షులఁ గొంద్రుగాన్కియో
పల్లవపాణి యేఁ బరమపావనవంశము నిచ్చికొంటి నీ
నల్లనిరూపు నిక్కమని నమ్మి, ధ్రువంబదిగాక నేఁడు వి
ద్యుల్లతికాధికాభినయధూర్వహమౌట యెఱుంగ నింతయున్.

'నల్లనిరూపు నిక్కమని నమ్ముట ధృతిచేతనేకదా (ధైర్యముచేతనే) కరుణరసమునకును గరుణవిప్రలంభమునకును గల భేదమేమి?

"శోకస్థాయితయా భిన్నో విప్రలంభాదయం రసః
విప్రలంభే రతిః స్థాయీ పునస్సంభోగహేతుకః,"

కరుణరసమునకు స్థాయిభావము శోకము కరుణవిప్రలంభమునకుఁ బున సంభోగకారణమగు రతి స్థాయిభావము. కరుణరసమునఁ బునస్సంభోగ ముండదు. అసలు కేవలకరుణమో కేవలవిప్రలంభమో యుండును, కాని కరుణవిప్రలంభమనునది లేనేలేదని వెనుకఁ దెలిపితిమి పు

సాపేక్షభావమున్నచో విప్రలంభమనియు నిరపేక్షభావమున్నచోఁ గరుణమనియు సిద్ధాంతము అంతేకాని నాయికానాయకులలో నొకరు మరణించి తిరిగి జీవించినచోఁగాని శరీరాంతరముతో వచ్చినఁగాని కరుణవిప్రలంభ మనియు మరణించినచోఁ గరుణమనియు సాహిత్యదర్పణకారుఁడు దెలిపిన సిద్ధాంతము సరిగాదు మరణించినను జీవించినను నిరపేక్షభావమున్నచోఁ గరుణమనియు, సాపేక్షభావమున్నచో విప్రలంభమనియు సిద్ధాంతము కరుణవిప్రలంభమనునది లేనేలేదు.

కరుణాభాసము

ధీరోద్ధతుఁడు తనచేఁ జంపఁబడిన శత్రువును గుఱించి చేయు రోదనము కరుణాభాసమగును

కం. గదచే దుర్యోధను తొడ
బదయస్యాంతమున విఱిచి హతుఁడగు నతనిం
బదపడి కని భీముండం
గదగాని విద్లేడ్చెనంచు గథకుఁడు దెలిపెన్.

రౌద్రరసము

రౌద్రః క్రోధస్థాయిభావో రక్తో రక్తాధిదైవతః
ఆలంబనమరిస్తత్ర తచ్చేష్టోద్దీపనం మతం
ముష్టిప్రహారపాతనవికృతచ్ఛేదావదారణైశ్చైవం
సంగ్రామసంభ్రమాద్యైరస్యోద్దీప్తిర్భవేత్ప్రౌఢా
భ్రూవిభంగౌష్ఠనిర్దంశ బాహుస్ఫోటనతర్జనాః
ఆత్మావదానకథనమాయుధోత్క్షేపణాని చ
ఉగ్రతావేగరోమాంచస్వేదవేపథవో మదః
అనుభావాస్తథాక్షేపక్రూరసందర్శనాదయః
మోహామర్షాదయస్తత్ర భావాస్స్యుర్వ్యభిచారిణః

రౌద్రమునకుఁ, గ్రోధము స్థాయిభావము రక్తవర్ణము, రక్తమధిదేవత (నరసభూపాలీయమున ఫాలాక్షుఁడనెను) ఆలంబనవిభావము శత్రువు వాని యపకారాదిచేష్ట లుద్దీపనవిభావములు పిడికిటఁబొడుచుట నేలమీఁదఁ బడవేయుట వికృతముగాఁ జీల్చుట సంగ్రామమున సంభ్రమించుట మొదలగువానిచే నీ రౌద్రము లెస్సగా నుద్దీప్తమగును భ్రూభంగము ఓష్ఠనిర్దంశము బాహుస్ఫోటనము తర్జనము ఆత్మావదానకథనము ఆయుధోత్క్షేణము ఉగ్రత్వము ఆవేగము రోమాంచము స్వేదము వేపథువు మదము ఆక్షేపము, క్రూర సందర్శనము అనునవి యనుభావములు మోహము, అమర్షము ఉగ్రత ఆవేగము మొదలగునవి వ్యభిచారభావములు.

శా. చిందుల్ ద్రొక్కుచు రక్తపున్ మడుఁగులం జెండాడుచున్ శత్రురా
ట్సందోహంబును సింహనాదములతోడన్ మాఱుమ్రోఁగం దెసల్
అందున్నిందును నెందుఁజూచినను నేనై, యుద్ధరంగంబు నె
ల్లం దర్పంబున గుత్తకుంగొనినలీలం బెద్ద క్రీడించితిన్.

ఇందు రుస్తుము నాయకుఁడు సొహ్రాబు ప్రతినాయకుఁడు. సొహ్రాబు యొక్క ప్రతాపశ్రవణముద్దీపనవిభావము భ్రూభంగము ఓష్ఠనిర్దంశనము, ఆత్మావధానకథనము అనునవి యనుభావములు అమర్షము ఉగ్రత్వము అనునవి వ్యభిచారులు.

రౌద్రరసమునకును వీరరస భేదమగు యుద్ధవీరమునకును భేదమేమి ?
"రక్తాస్యనేత్రతా చాత్ర భేదినీ యుద్ధవీరతః"

రౌద్రరసమున కనుభావములు రక్తాస్యత్వము రక్తనేత్రత్వమును యుద్ధవీరమున కివి యనుభావములుగావు ఈ రెంటికిని నాలంబనోద్దీపన విభావములు సాధారణములే మఱియు ననుభావవ్యభిచారులు గూడఁ బెక్కు సాధారణములే.

అయినను రౌద్రమునకు స్థాయిభావము క్రోధము, రక్తాస్యత్వ రక్తనేత్రత్వము లనుభావములు యుద్ధవీరమునకు స్థాయిభావముత్సాహము మఱియు రౌద్రరసనాయకుఁడు ధీరోద్ధతుఁడు వీరరసనాయకుఁడు ధీరోధాత్తుఁడు.

రౌద్రాభాసము

'రౌద్రే గుర్వాదిగతకోపే' గురువులగు పితృ భ్రాతృ, ముని, సుర, ఆచార్యాదులపైఁ గోపమును జూపించినచో రౌద్రాభాసమగును

మ. కనులన్ నిప్పులు రాల, గాత్రము వడంకన్ దద్దయున్, వీడి క
ర్జుని, సంకోచముఁబాసి వింట ములికిన్ మోపెట్టి, వీక్షించు కృ
ష్ణుని లెక్కింపక వాని ప్రల్లదములన్ రోషించి పెద్దన్నఁ బం
పనిగో! కవ్వడి కాలరుద్రునిగతిం బైపైకి నేతెంచెడిన్

వీరరసము

ఉత్తమప్రకృతిర్వీర ఉత్సాహస్థాయిభావకః
మహేంద్రదైవతో హేమవర్ణోఽయం సముదాహృతః
ప్రతినేతృ తదుత్కర్షాలంబనోద్దీపనాన్విత।
చాతుర్యామంత్రణస్థైర్య ప్రసాదాద్యనుభావభూః
క్రోధాభిమానహాస ప్రముఖవ్యభిచారిభిః పుష్టః
న చ దానధర్మయుద్ధైర్దయయా చ సమన్వితశ్చతుర్ధా స్యాత్.

వీరరస ముత్తమనాయకము. దీనికి స్థాయిభావముత్సాహము దీని కధి దేవత యింద్రుఁడు. వర్ణము హేమవర్ణము (గోమేధికవర్ణమని నరసభూపా లీయము.) ప్రతినాయకుఁ డాలంబన విభావము వాని యుత్కర్ష యుద్దీపన విభావము. చాతుర్యము ఆమంత్రణము (శత్రువు పట్టుబడుట) స్థైర్యము ప్రసాదము (ప్రసన్నత యనఁగా నలఁజడినిఁ బొందకుండుట) మొదలగునవి యనుభావములు క్రోధము అభిమానము, హాసము మొదలగునవి వ్యభిచారి భావములు. (ఈ వీరమున రౌద్రస్థాయి యగు క్రోధము, హాస్యస్థాయి యగు హాసమును వ్యభిచారులగును) ఈ వీరము దానవీరము ధర్మవీరము, యుద్ధ వీరము, దయావీరము, అని నాలుగు విధములు.

దానవీరము

కం. అనవుడు భూవరుఁ డిట్లనె:
మునులారా! నా శరీరమునఁ గల్గునెడన్
జనములకు మేలు, గావల
సిన దున్నదె! యింతకన్న శ్రేయముగలదే?

కం. మున్ను దధీచి యొసంగెను
వెన్నెముక నటంచు నేను విన్నదిమొదలా
తెన్నునఁ బోనుండిని నా
పున్నెము ఫలియించె; మనసు మునిఁగెం బ్రీతిన్

కం. అని యపుడు పిలిచి వైద్యులఁ
దనయొదలినిఁ గోసి రక్తధారలు మాంసం
బును వలసినంత యిమ్మని
యనవద్యచరిత్రుఁడాతఁ డాభాషించెన్.

మైత్రీబలుఁడను రాజు దన యొదలిని౯ గోసి మాంసమును దానముచేసెను. ఇట స్థాయిభావము దానమునకుత్సాహము దధీచ్యాదుల దానము లుద్దీపన విభావములు. స్థైర్యము, ప్రసాదము మొదలగునవి యనుభావములు, వీనిచే నుత్సాహము పుష్టమై దానవీరమయ్యెను.

ధర్మవీరము

స్నేహం దయాం చ కీర్తిం చ యది వా జానకీమపి
ఆరాధనాయ లోకస్య ముంచతో నాస్తి మే వ్యథా

స్నేహముగానీ దయనుగానీ కీర్తినిఁగానీ యవసరపడినచో జానకినిఁగాని లోకారాధనకై విడుచుటకు వెనుదీయను. ఇట శ్రీరాముఁడు ధర్మవీరుఁడు

యుద్ధవీరము

శా. మీరల్ విప్రుల; రేము శూదులము స్వామీ! మీ పవిత్రాంఘ్రులన్
నీరంధ్రమ్మగు భక్తిఁగొల్తుముగదా నిత్యంబు, చాలింపుఁడీ
పోరాటంబును మాకుఁ జుట్టుకొనునేమో? బ్రహ్మహత్యాఘ, మీ
వీరుల్ కొండలఁబిండిఁగొట్టఁగను బృథ్వింజుట్టఁగా దిట్టరుల్

ఇది నా 'ఖడ్గతిక్కన'లోని పద్యము ఇందుఁ బిన్నమనాయుఁడు యుద్ధవీరుఁడు.

దయావీరము

కం. తనివొంది నా కృశాంగం
బున నాఁకలిదీఱ శాబములఁ బులి తినమా
ను? నా? లేదో యని పొగులును
ముని; తన బాధకు దపంబుఁ బొగులఁ డెరందన్

కం. తనయొక్కొక్కవయవమును
దినఁ బులికండించుచుండెఁ దిని యదియును ద్రే

న్చెను లెస్సగ ; నదివిని యమి
యును గన్నులుమూసెఁ బెద్దయూర్చుచు నెలమిన్.

ఇందు బోధిసత్త్వుఁడు దయావీరుఁడు

రసగంగాధరకారుఁడు శృంగారమునకువలెనే వీరరసమునకును బెక్కు భేదములు నిరూపింపవచ్చునని సత్యవీరము (హరిశ్చంద్రనాటకము) అను మఱొక భేదమును జూపెను. సత్యము ధర్మభేదముగాదా ? ధర్మవీరములోనే సత్యవీరము చేరదా ? అని శంకించి "యట్లేవి దానదయావీరములుగూడ ధర్మవీరాంతర్గతములే యగును వానికిఁ బృథగ్గణనమేల ? అని సత్యవీరమును స్థాపించెను ఇట్లే పాండిత్యవీరుఁడు క్షమావీరుఁడు బలవీరుఁడు మొదలగు వారును గలరు " అనియును దెలిపెను.

వీరాభాసము

"బ్రహ్మవధాద్యుత్సాహేఽధమపాత్రగతే తథా వీరే"

బ్రహ్మహత్యాదులగు మహాపాతకములను జేయుటయందుత్సాహమును జూపుటయు, నధమపాత్రగతముగా వీరమును జూపించుటయు వీరాభాసమగును

గీ దైవతారాధనంబుల ధ్వంసపఱచి
సరవి విప్రుల దుంపనాశంబొనర్తుఁ
గాలుదండంబునకు రుద్రుశూలమునకు
నింద్రువజ్రాయుధమునకు నేను వెఱవ

ఇందు దేవబ్రాహ్మణ వధోత్సాహము గాన వీరాభాసము.

భయానకరసము

భయానకో భయస్థాయిభావః కాలాధిదైవతః
స్త్రీనీచప్రకృతిః కృష్ణో మత స్తత్త్వవిశారదైః
యస్మా దుత్పద్యతే భీతి స్తదత్రాలంబనం మతం
చేష్టా ఘోరతరా స్తస్య భవేదుద్దీపనం పునః
అనుభావస్తు వైవర్ణ్య గద్గదస్వరభాషణం
ప్రళయస్వేదరోమాంచకంపదిక్ప్రేక్షణాదయః
జుగుప్సావేగసమ్మోహ సంత్రాస గ్లాని దీనతాః
శంకాపస్మారసంభ్రాంతి మృత్యాద్యా వ్యభిచారిణః

భయానకమునకు భయము స్థాయిభావము. కాలుఁ డధిదేవత. స్త్రీలును, నీచపాత్రులును దీనికి నాయకులు. దీనివర్ణము కృష్ణము (వైడూర్యవర్ణమని నరసభూపాలీయము). దేనివలన భయ ముత్పన్నమగునో యది యాలంబన విభా

వము దానియొక్క ఘోరతరమగు చేష్టలుద్దీపన విభావములు వైవర్ణ్యము, స్వేదము రోమాంచము కంపము దిక్కులుచూచుట అనునవి యనుభావములు జుగుప్స ఆవేగము, సమ్మోహము సంత్రాసము గ్లాని దీనత, శంక అపస్మారము, భ్రాంతి మృత్యువు మొదలయినవి వ్యభిచారిభావములు

సీ. వీడిన మొలనూలు పెనుకాలిబంధమై పఱచుచుం బఱచుచుం బడెడివారు
చంకలో నిడుకొన్న చంటిబిడ్డలతోడ దిగ్భ్రాంతి నట్టిట్టు తిరుగువారు
ఎదురైనతఱినెట్లొ యెగిరి గోడలుదాఁటి పరులయిండ్లం జొరంబడెడివారు
దవ్వులఁగాంచియుఁ గెవ్వన నఱచుచుఁ బసుమజాఱున జెట్లఁ బ్రాకువారు

గీ. సగము సడలిన చీరలు సరుదుకొనుచు
నొకట నాఁగుచు నాఁగుచు నూర్చుకొనుచు
బలముఱుటఁ గాళ్ళ మెలమెల్లఁ బఱచువారు
నైరి పురకాంత లత్తఱి నాత్మఁగలఁగి

ఇది నా వాసవదత్తలోని పద్యము. నరగిరి యను నేనుఁగు మదించి పట్టణముపైఁ బడినది. అప్పటి ప్రజల యలజడి యిది ఇట నరగిరి యాలంబన విభావము దానిచేష్ట లుద్దీపన విభావములు వైవర్ణ్యము స్వేదము, రోమాంనము. కంపము మొదలగు ననుభావము లాక్షేప్యములు సంత్రాసము, శంక, భ్రాంతి, ఆవేగము మొదలగునవి వ్యభిచారులు వీనిచే భయానకము పుష్టమై రస మయినది

భయానకాభాసము

'ఉత్తమపాత్రగతత్వే భయానకే

భయానకమునకు స్త్రీలును నీచపాత్రులును నాయకులని తెలిపితిమి. అట్లుగాక యా భయానక ముత్తమపాత్రగతమగుచో భయానకాభాసము.

గీ. క్షత్త్రివంశాటవిం గాల్చు కారుచిచ్చు
దండిమగఁడైన పరశురాముండు రాఁగ
గుండెచెదరంగఁ దడఁబాటుగొనుచుఁ గాళ్ళ
దశరథుఁడు చొచ్చె వెఱచి యంతఃపురంబు.

ఇట నుత్తమనాయకుఁడగు దశరథుఁడంతఃపురమునఁ జొచ్చె ననుటచేఁ దన్నిష్ఠమగు భయానకము భయానకాభాసమగును.

బీభత్సరసము

జుగుప్సాస్థాయిభావశ్చ బీభత్సః కథ్యతే రసః
నీలవర్ణో మహాకాలదైవతోఽయముదాహృతః

దుర్గంధ మాంస రుధిర మేదాంస్యాలంబనం మతం
తత్రైవక్రిమిపాతాద్యముద్దీపనముదాహృతం
నిష్ఠీవనాస్యవలననేత్రసంకోచనాదయః
అనుభావాశ్చ మోహాద్యాస్తథా స్స్యుర్వ్యభిచారిణః

బీభత్సమునకు స్థాయిభావము జుగుప్స నీలవర్ణము (ఇంద్రనీలవర్ణమని నరసభూపాలీయము) అధిదేవత మహాకాలుఁడు (చంద్రుఁడని నరసభూపాలీయము) దుర్గంధము మాంసము రక్తము క్రొవ్వు మొదలగునవి యాలంబన విభావము. అచ్చటి క్రిములుద్దీపనవిభావము నిష్ఠీవనము ముఖసంకోచము కనులుముడుఁచుకొనుట మొదలగునవి యనుభావములు మోహము, అపస్మారము, ఆవేగము, వ్యాధి, మరణము మొదలగునవి వ్యభిచారులు.

కం విఱిగినకాళులఁ బగిలిన
శిరములఁ దెగిపడినయట్టి చేతుల, బహుథా
తరగినయొడళ్ల నా సం
గరభువి సూనాంగణంబు కరణిం బొలిచెన్.

విఱిగిన కాళులు పగిలిన శిరములు దెగినచేతులు, తరగిన యొడళ్లను గల సమరాంగణ మాలంబనవిభావము ఉద్దీపన విభావము లచటిక్రిములు· నిష్ఠీవనాద్యనుభావము లాక్షేప్యములు. దీనిచే బీభత్సము పుష్టమై రసమయ్యెను

బీభత్సాభాసము

సుందరవస్తువులను గుఱించియు జుగుప్సవహించుట బీభత్సాభాసమగును.

ఆ వె. ఆవకాయయూట నాతండు నేత్రంచుఁ
బాయసమును జీముగా యటంచుఁ
బులుసు మూత్రమంచుఁ బొరిపప్పుఁ గ్రొవ్వంచు
మూతిముడిచి యతఁడు పోవుచుండు

అద్భుతరసము

అద్భుతో విస్మయస్థాయిభావో గంధర్వదైవతః
పీతవర్ణో వస్తు లోకాతిగమాలంబనం మతం
గుణానాం తస్య మహిమా భవేదుద్దీపనం పునః
స్తంభః స్వేదోఽథ రోమాంచగద్గదస్వరసంభ్రమాః
తథా నేత్రవికాసాద్యా అనుభావాః ప్రకీర్తితాః
వితర్కావేగవిభ్రాంతిహర్షాద్యా వ్యభిచారిణః.

అద్భుతరసమునకు విస్మయము స్థాయిభావము. గంధర్వుఁ డధిదేవత, (బ్రహ్మయని నరసభూపాలీయము,) పీతవర్ణము (పుష్యరాగమని నరస

భూపాలీయము. లోకోత్తరమైన లేక లోకవిలక్షణమైన వస్తువాలంబన విభావము దాని గుణము లుద్దీపనవిభావము స్తంభము స్వేదము రోమాంచము గాద్గద్యము, త్వరపాటు నేత్రవికాసము మొదలయిన వనుభావములు. వితర్కము, ఆవేగము ఉన్మాదము సంభ్రాంతి) హర్షము ఔత్సుక్యము మొదలయినవి వ్యభిచారిభావములు

శా. ఇంతింతై వటుఁడింతయై మఱియు దానింతై నభోవీథిపై
నంతై తోయదమండలాగమున కల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రునికంతయై ధ్రువునిపై నంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంతసంవర్ధియై

మ. రవిబింబం బుపమింపఁ బాత్రమగు ఛత్రంబై శిరోరత్నమై
శ్రవణాలంకృతియై గళాభరణమై సౌవర్ణకేయూరమై
ఛవిమత్కంకణమై కటిస్థలి నుదంచద్ఘంటయై నూపుర
ప్రవరంబై పదపీఠమై వటుఁడు దా బ్రహ్మాండమున్ నిండుచోన్

లోకవిలక్షణుఁడగు వటువు ఆలంబనవిభావము వాని గుణములుద్దీపనములు. రోమాంచ గాద్గద్యాదు లనుభావము లాక్షేప్యములు. వీనిచే నద్భుతరసము పుష్టమగుచున్నది

అద్భుతాభాసము

అలోకోత్తర వస్తువులను జూచియు విస్మయపడుట యద్భుతాభాసము.

గీ. అతివ బిడ్డఁగనియెనన్న "నెట్టులుగనె"
నంచుఁ జెట్టుపండెనన్న "నెట్టు
పండె" నంచువాఁడు పరమాద్భుతము నొందుఁ
గనులు పెద్దవిప్ప గగుఱుకొనును

స్త్రీ శిశువును గనుటయుఁ జెట్టుపండుటయు లోకోత్తరవిషయములు గావు. వానినిఁ గాంచి పెద్దగాఁ గనులువిప్పి గగుఱుపాటును గొని యొక్కఁ డక్కజపడినాఁడు

శాంతరసము

శాంతశ్శమస్థాయిభావ ఉత్తమప్రకృతిర్మతః
కుందేందుసుందరచ్ఛాయ శ్శ్రీనారాయణ దైవతః
అనిత్యత్వాదినా శేషవస్తునిస్సారతా తు యా
పరమాత్మస్వరూపం వా తస్యాలంబనమిష్యతే.

పుణ్యాశ్రమ హరిక్షేత్ర తీర్థరమ్యవనాదయః
మహాపురుషసంగాద్యా స్తథోద్దీపనరూపిణః
అనుభావాశ్చరోమాంచతోషభూతదయాదయః
నిర్వేదహర్ష స్మృతయ స్తథా స్యుర్వ్యభిచారిణః

శాంతమునకు శమము స్థాయిభావము అది యుత్తమనాయకము శ్వేత వర్ణము అధిదేవత శ్రీమన్నారాయణుఁడు (బ్రహ్మమని నరసభూపాలీయము) జగత్తనిత్యమని తెలియుటచే సంభవించిన యశేషవస్తునిస్సారతకానీ "సర్వం ఖల్విదం బ్రహ్మ" "సత్యంజ్ఞాన మనంతం బ్రహ్మ" ఇత్యాదికమగు బ్రహ్మస్వరూపముగానీ దీనికాలంబన విభావము పుణ్యాశ్రమ హరిక్షేత్ర తీర్థ రమ్య వనాదులును మహాపురుష సాంగత్యాదులును నుద్దీపనవిభావములు. రోమాంచ సంతోష, భూతదయాదులనుభావములు. నిర్వేద, హర్ష, స్మృతి, మతి మొదలయినవి వ్యభిచారిభావములు.

కం. విడిచి నికుంజాంతరములఁ
బడక శిలాతలములందుఁ, బ్రాశము బిసముల్
మడుఁగులు నారలుగాఁగా
గడుఁగిరి తపమునకు నియతగతి నాభ్రాతల్.

అశేషవస్తునిస్సారత యాలంబనవిభావము పుణ్యాశ్రమవనముద్దీపన విభావము రోమాంచాదులనుభావములాక్షేప్యములు. వీనిచే నిట స్థాయిభావమగు నిర్వేదము పుష్టమై శాంతరసమగుచున్నది

శాంతాభాసము

'శాంతే చ హీననిష్ఠే' హీననిష్ఠమగు శాంతము శాంతాభాసము. శాంతము త్తమనాయకమని చెప్పితిమి అట్టిదికానిచో శాంతాభాసము.

కం. అనుఁ డిచ్చవచ్చినట్టులు
నను నంత్యజుఁడంచుఁ జూచి నా దేహంబున్
వినుఁ, దే వచింతు శుద్ధుఁడ
ననుపముఁడను నొకఁడ సచ్చిదానందుండన్.

ఇట శాంతము చండాలనిష్ఠమగుట శాంతాభాసము

కావ్యాలంకారసంగ్రహము

చతుర్థాశ్వాసము

కం. శ్రీకర! గభీరగుణర
త్నాకర. కటకాధిరాజహాయతతిసేనా
భీకర! భుజప్రతాప
స్వీకృత జయసాంద్ర నారసింహనరేంద్రా! ౧

దోషప్రకరణము

గీ. అవధరింపుము దోషంబులను వచింతు
నవియు శబ్దార్థగతములై ద్వివిధములగు
నందుఁ బదవాక్యగతములౌ నరయ శబ్ద
దోషములు, వీనిలోఁ బదదోషతతులు. ౨

దోషములు శబ్దదోషములనియు అర్థదోషములనియు రెండువిధములు అందు శబ్దదోషములు, పదగతములు, వాక్యగతములు అని ద్వివిధము అందు పదదోషము లెవ్వనిన ౩

సీ. అప్రయుక్తం బపుష్టార్థంబు, నేయార్థ
మనమర్థకంబు, నిరర్థకంబు
గ్రామ్యంబు, విగతసంస్కారంబు, గూఢార్థ
మన్యార్థ, మశ్లీల, మప్రతీత,
మప్రయోజకము, క్లిష్టార్థబంధంబు సం
దిగ్ధంబు, విపరీతధీప్రదాయి,
యవిమృష్టతర విధేయాంశంబు, పరుషంబు,
వనఁగఁ గావ్యంబులందరసిమాడఁ

గీ. పదగతంబులు వెలయు సప్తదశసంఖ్య
గడలుకొన వీని లక్ష్యలక్షణములెల్ల
విస్తరించెదఁ గవితాప్రవీణసుకవి
నివహనిరతోపకారనిర్నిద్రఫణితి. ౪

౧ అప్రయుక్తము, ౨ అపుష్టము ౩ నేయార్థము, ౪. అసమర్థము ౫ నిరర్థకము ౬ గ్రామ్యము ౭ చ్యుతసంస్కారము, ౮. గూఢార్థము ౯. అన్యార్థము, ౧౦ అశ్లీలము ౧౧ అప్రతీతికము ౧౨ అప్రయోజకము ౧౩ క్లిష్టము ౧౪ సందిగ్ధము ౧౫ విరుద్ధమతికృత్తు ౧౬. అవిమృష్టవిధేయాంశము ౧౭ పరుషము (శ్రుతికటువు) అని పదునేడు

ఈ గ్రంథకర్త ప్రథమమున దోషమననేమో తెలుపలేదు సాహిత్య దర్పణమున 'రసాపకర్ష కా దోషాః (రసమును దగ్గించునని దోషములు) అని దోషలక్షణముగలదు గ్రుడ్డితనము కుంటితనము మొదలగునవి శరీరమును వికృతముగాఁజేసి దానిమూలమున సౌందర్యమున కపకర్షము గలిగించువిధమున నెల్లవిధములగు దోషములును గావ్యశరీరమును వికృతముగాఁజేసి దాని ద్వార మున నాత్మభూతమగు రసమును న్యూనపఱచును.

దండి కావ్యాదర్శమున నీ దోషమును గూర్చి చాలఁ గఠోరముగా విమర్శించెను

'తదల్పమపి నోపేక్ష్యం కావ్యే దుష్టం కథంచన ।
స్యాద్వపుస్సుందరమపి శ్విత్రేణైకేన దుర్భగం"

(కావ్యమున నల్పమగు దోషమును గూడ నుపేక్షింపరాదు శరీరమెంత సుందరముగానున్నను చిన్న బొల్లిమచ్చ (శ్వేతకుష్ఠమున్నచో నసహ్యముగా నుండును) ఇదిచాలఁ గఠోరమగు విమర్శయే ఏలన నేష్వల్పమగు దోషముగూడ లేని కావ్యము వాఙ్మయమున లేదు మహాకవియగు కాళిదాస గ్రంథములందును దోషములు గలవు ఈ దోషప్రకరణమును ముందుంచుకొని గ్రంథములను విమర్శింపఁబూనినచో లోకములో నిర్దుష్టమగు కావ్య ముండనే యుండదు కాళిదాసాది మహాకవుల కావ్యములందు దోషములున్నను దోషములను మించిన గుణములున్నవి దోషములను మఱపించు రససంపద గలదు "ఏకో హి దోషో గుణసన్నిపాతే నిమజ్జతీందోః కిరణేష్వివాంకః" చంద్రకిరణములలోఁ గళంకము నిమగ్నమైన విధమున నొకదోషము గుణబృందమున నిమగ్నమగును" అని కాళిదాసమహాకవియే చెప్పెను. అతఁడొకవేళఁ దనకావ్యములలో నెవరేని దోషములు చూపింపఁగా నీ సూక్తిని వ్యంగ్యముగాఁ దెలిపెనేమో యని నాకు శంక గలుగుచున్నది కావున ముఖ్యముగా రసభంజకములయిన దోషములను విడనాడవలయును అలఁతిదోషములున్నను నాదోషములను సరకుసేయనీయని రసవత్త్వమున్నచోఁ గావ్యము రమణీయముగా నుపాదేయముగానే యుండును. 'న్యక్కారోఽహ్యయమేవ అను శ్లోకమున నవిమృష్టవిధేయాంశరూపమగు దోష మున్నను నందలి ధ్వనినిఁబట్టి యది యుత్తమకావ్యమని వెనుకఁ దెలిపి యుంటినిగదా ।

వామనుఁడు "గుణవిపర్యయాత్మానో దోషాః" (గుణములు గానివి దోషములు) అని లక్షణమును జెప్పెను మొదట నతఁడు గుణములను దెలిపి వాని కన్న భిన్నములు దోషములని దెలిపెను కానీ గుణవిరుద్ధములే కాక కేవల దోషములును గలవు అప్రయుక్తాదులు గుణవిపర్యయరూపములు గావుగదా కాన సాహిత్యదర్పణ లక్షణమే యుక్తమైనది.

పై పద్యమున దోషములు శబ్దదోషములనియు నర్థదోషములనియు ద్వివిధముగాఁ జెప్పఁబడినవి శబ్దదోషమన శబ్దపరివృత్తిని సహింపని దోషము అనఁగా నిందు శబ్దమే దుష్టము తదర్థబోధకమగు మఱియొక శబ్దము నుంచినచో నాదోషము దొలఁగును అర్థదోషమన శబ్దపరివృత్తిని సహించినదోషము అనఁగా నాశబ్దమును దీసి తదర్థబోధకమగు శబ్దాంతరము నుంచినను నాదోషము దొలఁగదు. ఇట నర్థమే దుష్టము.

పై పద్యమున శబ్దదోషములు పదగతములు వాక్యగతములు అని విభజించెను ఈవిధముగా పద వాక్య అర్థగతములని దోషములు మూఁడు విధములుగా నీగ్రంథకర్త తెలిపెను సాహిత్యదర్పణమున "పదే తదంశే వాక్యేఽర్థే సంభవంతి రసేఽపి యత్" (పదమునఁ బదాంశమున వాక్యమున నర్థమున, రసమునను నాదోషములు సంభవించును) అని విభజింపఁబడియున్నవి. ప్రతాపరుద్రీయకర్తయుఁ బదాంశ రస దోషములను దెలుపలేదు వానినిఁబట్టి నరసభూపాలీయకర్తయుఁ దెలుపలేదు.

ఇవిగాక యెల్లదోషములును నిత్యదోషములనియు, ననిత్యదోషములనియును ద్వివిధము నిత్యదోషములన నెల్లపుడును దోషములుగానే యుండును. అనిత్యదోషములనఁ గొన్ని యెడలనే దోషములు కొన్నియెడల నవి గుణములే యగును ఎట్లన 'పరుషము' అను దోషము శృంగారాదిరసములందే దోషము. రౌద్రాది రసములలో గుణమే యగును ఈ విషయమునే కావ్యప్రకాశకారుఁ డిట్లు తెలిపెను. "వక్త్రాద్యౌచిత్యవశాద్దోషోఽపి గుణః క్వచిత్ ; క్వచిన్నోభౌ" (వక్తృ, వాచ్య ప్రబంధములయొక్క యౌచిత్యము ననుసరించి యొకచో దోషము గుణమే యగును ఒకచో దోషమును గాదు గుణమునుగాదు) దీనినిఁ బట్టియే నిత్యానిత్యవ్యవస్థ యేర్పడుచున్నది ఈ దోషములలోఁ జాలదోషములనిత్యదోషములే యగును ముఖ్యములయిన యనిత్యదోషములు చూపఁబడును.

కం. ఈ కవితా దోషోత్కర
మేకడ నీవొసఁగుమాడ్కి నియ్యక ఖలుతా
నాకులకులదాతలకును
నాకుకవులొనర్చు కృతులయందు వసించున్.

స్పష్టము.

౧. అప్రయుక్తము

కం. కవులు ప్రయోగింపని పద
మవలిం దగ నప్రయుక్త మగు నెట్లన్నన్
ద్రవిణైలబిలుం, డల దు
శ్చ్యవనమహాభోగి, ఖేటసంస్తుతుఁ డనఁగన్. ౫

సుప్రసిద్ధములగు పదములనే వాడవలయును ఎవ్వరును ప్రయోగింపనివియుఁ బ్రయోగించినను ఝుడిత్యర్థస్ఫూర్తినిఁ గలిగింపనివియు నగు పదములను కావ్యముల వాడరాదు ఏలన నట్టిపదములు విలంబముగాఁగాని యర్థస్ఫూర్తినిఁ గలిగింపవు ఆయాలస్యము రసప్రతిబంధకమగును కావ్యమునకు రసము ప్రధానము, కావున రసప్రతిబంధకములగు దోషములను బరిత్యజింప వలెను. ఈ యప్రయుక్తదోషములు 'ఆముక్తమాల్యద' యందుఁ బెక్కుగలవు కావుననే యా గ్రంథమితరగ్రంథములవలెఁ ద్వరగా బోధపడదు

ఈ పద్యమున ఐలబిల దుశ్చ్యవన ఖేట శబ్దము లప్రయుక్తదోషములుగాఁ జెప్పఁబడినవి ఇట్లే 'లక్ష్య మను నర్థమున లక్ష' శబ్దమప్రయుక్తమే. కాన లక్ష్యీభూత మనవలెఁగాని లక్షీభూతమనరాదు

ఇది యనిత్యదోషము ఎట్లన శ్లేషాదులందప్రయుక్తదోషము దోషము గాదు

౨ అపుష్టార్థము

కం. ఎనయఁ బ్రకృతోపయోగం
బును జెందకయున్న పదమపుష్టార్థం బౌఁ
దునిమెను వింశత్యర్ధా
నను, వింశత్యర్ధరథునినందనుఁ డనఁగన్. ౬

ప్రకృతమున కుపయోగింపని పదమపుష్టము. "దశాననుఁ" డనుటకు 'వింశత్యర్ధాననుఁడనియు' 'దశరథుఁడ'నుటకు 'వింశత్యర్ధరథుఁడు'అనుటయు నపుష్టదోషములు అర్థపుష్టిలేని పదములపుష్టార్థములు.

దర్పణకార ప్రకాశకారులు దీని నర్థదోషముగాఁ బరిగణించిరి అదియే న్యాయము.

౩. నేయార్థము

కం. ఇలఁ దనసంకేతంబున
నిలిపినపదమెంచిచూడ నేయార్థం బౌఁ;

బలుతేనెదిండిగమి వగు

నలసాగరకర్ణయాన యలక లనంగన్. ౭

సుప్రసిద్ధమగు సంకేతార్థమునందుఁగాక కవి కల్పించుకొన్న సంకేతము నందుఁ బ్రయుక్తమైన శబ్దము నేయార్థకము 'సాగరకర్ణయాన' అనునెడ సాగర(ఏనుఁగు చెవియందలి మదము) కర్ణ (చెవులలోఁగల) యనఁగా గజము. దానియొక్క యానమువంటి యానముగల(స్త్రీ) "సాగరకర్ణ" శబ్దమునకుఁ గవి 'గజ' మని సంకేతము గల్పించుకొనెను ఇది సుప్రసిద్ధముగాదు కావున నేయార్థకమని గ్రంథకర్త యుద్దేశము తేనెదిండిగమి-తుమ్మెదల మొత్తము

ఇట లక్ష్య లక్షణములు రెండును సరిగావు ఏలన నేయార్థమన "రూఢి ప్రయోజనములు లేకయుఁ గవి స్వేచ్ఛగాఁ గల్పించుకొన్న లక్ష్యార్థము" రూఢియో ప్రయోజనమో యున్నఁగాని లక్షణ వర్తిల్లదని మును దెలిపితిని అట్టి రూఢి ప్రయోజనములను లెక్కింపక కవి స్వతంత్రముగాఁ గల్పించుకొన్న లక్ష్యార్థము నేయార్థము ఎట్లన "చంద్రమామఁ దన్ను సతిమొగంబు" అనునెడఁ 'దన్ను' నన జయించునని లక్ష్యార్థము మొగమెట్లు తన్నును? కావున ముఖ్యార్థ బాధ గలిగినది అప్పుడు లక్షణ చెప్పుకొనవలెను లక్షణ చెప్పుకొనవలయు నన్న రూఢిప్రయోజనము లుండవలెను 'తన్ను' ధాతువు 'జయించు' నను నర్థమున రూఢముగాదు ఇఁకఁ బ్రయోజనమును గానరాదు లెస్సగా జయించునని ప్రయోజనము చెప్పుకొనగూడదా? అందురేని నుపమానమగుటవలన నుత్తమ గుణములు గల చంద్రుని నుపమేయమగుటచే న్యూనగుణములు గల మొగము దన్ను ననుటచే మర్యాద యెఱుఁగనిదని యర్థమువచ్చి వర్జ్యమగు మొగమున కపకర్షమే గలుగును, కాన రూఢిప్రయోజనములు లేవు కాన నిది నేయార్థకము. సాగరకర్ణయాన'అనుచో సాగరకర్ణ పదమునేయార్థముగాదు.'సాగరము కర్ణమునఁగలది అను వ్యుత్పత్త్యర్థముచే గజ మను నర్థమున నాపదము రూఢమే యగుచున్నదిగదా. అయితే యిది సుప్రయుక్తము గాదు కావున నప్రయుక్త దోషమగును. కావున లక్ష్య లక్షణములు రెండును దుష్టములే తేనె దిండిగమి= తుమ్మెదల మొత్తము-ఇది నేయార్థము గాదు

౮ అసమర్థము

కం. ధర నప్రసిద్ధయోగం

బరసి ప్రయోగించు పదము యసమర్థంబౌ ;

శరధరరాజనికేతను

గురుపంకజచక్రహస్తుఁ గొలుతు నటన్నన్. ౮

యౌగికార్థమును నఁగా వ్యుత్పత్త్యర్థమును బట్టి రెండర్థములున్నను బదమును బ్రసిద్ధార్థమునందే యుపయోగింపవలెను అట్లుగాక యప్రసిద్ధార్థమున బ్రయోగించుట యసమర్థదోషము పంకజాది బదములు యోగరూఢములని చెప్పితిమి యౌగికార్థమున్నను బద్మరూపార్థమునందే రూఢి కావున నా యర్థమునఁ గాక యితరార్థమునఁ బ్రయోగించినచో నసమర్థదోషమగును ఈ పద్యమునఁ "శరధర" పదము సముద్రార్థమునను బంకజపదము శంఖరూపార్థమునను బ్రయోగింపఁబడినవి ఇవి దోషములు. ఇది నిత్యదోషము

౫ నిరర్థకము లేక అనర్థకము

కం. ఇలఁ బదపూరణమాత్రం
బలవడినపదంబు కృతి నిరర్థకమయ్యెన్
దలఁపగ, వెలయుచు, లలి, ను
జ్జ్వలమగు నీతని విలాససౌష్ఠవ మనఁగన్. ౯

పాదపూరణార్థము ప్రయోగింపఁబడు పదము నిరర్థకము వెలయుచు లలి ఉజ్జ్వలము మొదలగునవి నిరర్థకములు. ఆంధ్ర ప్రబంధములలో యతి ప్రాసల స్థలమందుఁ బెద్దపెద్ద కవులుగూడ నీ నిరర్థకపదదోషములను జేయుదురు

వామనుఁడు వాక్యాలంకారార్థము ప్రయుక్తమైనచో నీ నిరర్థకపదము దోషముగాదనెను. ఎట్లన,

చ. తెలియని వన్ని తప్పులని దిట్టతనాన సభాస్థలంబులం
బలుకకరాకురోరి ! పలుమాఱు పిశాచపుఁ బాదకట్ట ! నీ
పలికినచోట దుమ్ముపడ ! కావ్యమెఱుంగక పెద్దలైన వా
రిల నిరసింతురా ! ప్రగడరాణ్ణరసా ! విరసా తుసా ! బుసా !

ఇట తుసా బుసా శబ్దములు నిరర్థకములే యయినను వాక్యాలంకారమునకై ప్రయుక్తములయినవి. కాన దోషముగాదు. గుణమేయగును

"భూతేంద్ర భారతేశాత్ప్రాఙ్మహచ్ఛబ్దో నిరర్థకః
దురర్థో బ్రాహ్మణే వృష్టిభోజ్యాషధపథాదిషు"

మహాభూతము మహేంద్రుఁడు మహాభారతము, మహేశుఁడు అను శబ్దములలోనున్న మొదటి మహచ్ఛబ్దము నిరర్థకము (గొప్పయనునర్థములేదు) మహాబ్రాహ్మణ, మహావృష్టి మహాభోజం, మహాపథ ప్రభృతులలోనున్న మహచ్ఛబ్దము దురర్థకము అనఁగా నిందార్థకము (మహాబ్రాహ్మణుడు—నింద్యుఁడగు బ్రాహ్మణుఁడుమ్మి) అని యుంటవలన మహాభూతాదులలో మహచ్ఛబ్దము

నిరర్థక దోషదూషిత మగునా? అన్నచోఁగాదు పాదపూరణమాత్ర ప్రయోజకము లైననే నిరర్థకములగును. ఇది యట్టిది గాదు. ఇది వాక్యాలంకారమువలెఁ బదాలంకారముగా గ్రహింపవచ్చును.

> శంఖే తైలే తథా మాంసే వైద్యే జ్యోతిషికే ద్విజే
> యాత్రాయాం పథి నిద్రాయాం మహచ్ఛబ్దో న దీయతే.

మహాశంఖము, మహాతైలము, మహామాంసము మహావైద్యుఁడు, మహాజ్యోతిషికుఁడు మహాద్విజుఁడు మహాయాత్ర మహాపథము, మహానిద్ర యీ పదములలోని మహచ్ఛబ్దము గూడ నింద్యార్థమునే యిచ్చును.

ఇట్లే భీమసేన బలసేన బలదేవ శబ్దములోని సేన, దేవ పదములు వ్యర్థములే. వసుంధరా, ధరాధరాది పదములలోని మొదటి పదములును వ్యర్థములే చూతవృక్షాది శబ్దములలో ద్వితీయపదములును వ్యర్థములే. ఇవన్నియు నిరర్థకదోషములుగా గణింపరాదు. ఇవియుఁ బదాలంకారములుగా గ్రహింపవచ్చును కాన నిది యనిత్యదోషము

౬. గ్రామ్యము

> ౪౦. పామరుల భాష గ్రామ్యము
> భామిని కటిగల్లములు విభాసిల్లు ననన్
> గోమలి చన్నులఁ, గన్నులఁ
> గామునివిండువు లొనర్చెఁ గడువడి ననఁగన్. ౧౦

నాగరికవ్యవహారము దెలియక వినువారికి వైరస్యము గలుగునట్లు మాటలాడు భాష గ్రామ్యము అసభ్యభాషయని తాత్పర్యము నాటకాదులందు విదూషకాదు లీ భాషనుప్రయోగించిరన నవును అట నిది యౌచిత్యమునే కూర్చును పాత్రౌచిత్యమెఱుఁగక దీనినిఁ బ్రయోగించినచో దోషమే యగును అధమప్రకృతులు నాయికానాయకులగుచో నట గుణమే యగును. కాన ననిత్యదోషము. కటి, గల్ల, శబ్దములు ప్రాచీనకాలమున విద్వద్గోష్ఠులందు వ్యవహరింపఁబడెడివిగావు వానిని వట్టిపామరులే వాడెడివారు చన్నులు, కన్నులుగూడ నిట్టివేయని గ్రంథకర్తచెప్పెను. అప్పకవి కాళ్ళు పదము గ్రామ్యమనెను కాని సామాన్యముగా నెల్ల కవులును గావ్యములందుఁ గటి, గల్లాదిశబ్దములును చన్నులు, కన్నులు కాళ్ళు మొదలయిన శబ్దములను బ్రయోగించుచునే యున్నారు కొందఱు చన్నులోనగు [illegible] గ్రామ్యమన వచ్చునందురు కాని యవియే కొన్నియెడల నుచితముగా నుండును.

౭. చ్యుతసంస్కారము

కం. వ్యాకరణదుష్టమగు పద
మేకడఁ జ్యుతసంస్కృతాఖ్యఁ; మిది యెట్లన్నన్
శ్రీకమలకాంతపదసే
వాకర్మరుఁ డనఁగఁ గరుణవారిధి యనఁగన్ ౧౧

వ్యాకరణసంస్కారహీనమైనది చ్యుతసంస్కారము. 'కమలాకాంత' గరుణావారిధి యని యనవలసియున్నది వామనుఁడు దీని నసాధుదోష మనెను.

"చిరసమేళనకాంక్షవిచిత్రరక్తి" సమ్మేళన మనవలయును. "పావన దీవనాచయము" అచ్చికమైన దీవనా' పదమును సిద్ధసమాసమధ్యమున బిగించుట దోషము యౌవనుఁడు' యువకుఁడనవలెను "సాంధ్య కాంతా వియోగబాష్పములు" సంధ్యాకాంత' అని యుండవలెను. ఇవన్నియు కవిభూషణ సాహిత్యస్థాపక, ఉస్మానియా విశ్వవిద్యాలయ, ప్రధానాంధ్రా చార్యులు రాయప్రోలు సుబ్బారావుగారివి వ్యాకరణశిరోమణి చలమచర్ల రంగా చార్యుల వారు 'హాలికుఁడు' అనునాటకమున ఆధ్వర్యము నాయకీ అని ప్రయోగించిరి. ఆధ్వర్యవము నాయికా అనవలయునుగదా !

ఈ వ్యాకరణ శిరోమణులే యింకనుగొన్ని వ్యాకరణ విరుద్ధప్రయోగము లొనర్చిరి (చూ హాలికుఁడు 17, 20 80 పుటలు) త్రి+ఈక్షణ = త్ర్యక్షణ అని దుస్సంధిఁజేసిరి 'లలాటికా' అనవలసియుండ 'లాలాటికా అని ప్రయోగించిరి. కుకురు' దేశస్త్రీ 'కుకరీ' అనిరి ఇక్కడ తప్పురాదు కు' వర్ణము 'క' వర్ణముగాదు, కుహాళీ (కుహాళదేశ స్త్రీ) అనిరి అసలు కుహాళ దేశమనునది స్వర్గమర్త్య పాతాళములలో లేదు 'సౌగంధికము' అనవలసి యుండ సౌగంధి అని కవర్ణలోపముఁజేసిరి కిన్నరి "కుత్సితా + నరీ" అను నర్థమున బ్రయోగించిరి నరశబ్దము స్త్రీవాచకమగుచో నారీ అగును. నరీ కాదు కావున 'కిన్నారీ' యగును ముదితాంగన అనిరి. పేరణార్థము' గాన మోదితాంగన అనవలయును 'కుతుకబంటఁగ్రోలి అనిరి. 'బంటి' దఘ్నార్థమునవచ్చు ప్రత్యయము ఔపవిభక్తికముగాదు. కాన 'బంటన్ అనియుండదు 'కుతుకబంటిగ్రోలి' అనవలెను.

౮. అన్యార్థము (అవాచకము)

కం. కృతి నఖ్యాతము గూఢం
బతిశయరూఢివ్యపేత మన్యార్థం బై

ఊతిఁ దగు, శోణితనయనుం
డితఁ డనఁగ సమానుఁ డితఁ డహిధ్వజుఁ డనఁగన్. ౧౨

గూఢార్థమనఁ గావ్యములం దప్రసిద్ధమగు నర్థముగల పదము రెండర్థములు గల పదమునకు ప్రసిద్ధమగు నర్థమునఁ బ్రయోగము గూఢార్థము లేక నిహతార్థము అసమర్థమునకును దీనికిని భేదమేమన యోగరూఢపదములలో యౌగికార్థమునుబట్టి పెక్కర్థములు వచ్చుచున్నను బొత్తుగా నప్రసిద్ధమైన యర్థమునఁ బ్రయోగించుట యసమర్థము. అటఁ బదమునకుఁ బ్రసిద్ధార్థమునఁదప్ప, నప్రసిద్ధార్థమును బోధింప సామర్థ్యమే లేదు ఇట శోణిత నయనుడు అనుచో శోణిత పదము పంకజాది పదములవలె యోగరూఢపదముగాదు ఇది వాచక పదమే దీనికి నెత్తురు ఎఱుపు అను రెండర్థములు బోధించుటకు సామర్థ్యమున్నది. ఉన్నదిగదాయని 'ఎఱుపు' అను నర్థమునఁ బ్రయోగింపరాదు ఏలన నాయర్థమప్రసిద్ధము రక్తమను నర్థముననే ప్రయోగింపవలెను ఇదియే గూఢార్థము లేక నిహతార్థము ఇది యనిత్యదోషము, శ్లేషాదులం దిది దోషము గాదు అసమర్థదోషము నిత్యదోషము.

అన్యార్థమన రూఢిచ్యుతము అనఁగా రూఢిలేనిది ఇదియే అవాచక దోషమనియుఁ జెప్పఁబడును పై పద్యమున 'సమానుఁడు' మానసహితుఁడు అని యర్థము. ఈ యర్థమున సమాన' పదమవాచకము, లేక రూఢిచ్యుతము.

అసమర్థమునకును దీనికిని భేదమేమనఁ బంకజాదిపదములు యోగరూఢములు "సమాన" పద మట్లు యోగరూఢముగాదు అది తుల్యార్థమునందే రూఢము. మానసహితుఁడు అను నర్థమున రూఢముగాదు.

కవిభూషణ రాయప్రోలు సుబ్బారావుగారు "తారాసహస్రమండిత। నారాచము పగిది" అని యాకాశార్థమున నారాచపదమును బ్రయోగించిరి ఇది యవాచక దోషము.

౧౦. అశ్లీలము

కం ప్రీడ, జుగుప్సాఽమంగళ
శీలము లగు పదము లొకటఁ జేర్చిన యవి య
శ్లీలములగుఁ గృతి, నేత
న్మూలములగు త్రివిధభేదముల నెఱిఁగింతున్. ౧౩

వ్రీడాకరము జుగుప్సాకరము, అమంగళశంకాకరము, అని యశ్లీలము త్రివిధము అయితే యశ్లీలమననేమో లక్షణము చెప్పఁబడలేదు వామనుఁడు "అసభ్యార్థాంతర మసభ్యస్మృతిహేతుశ్చాశ్లీలం" ఒకపదమున కనేకార్థములుండ

నొక యర్థమసభ్యముగా నుండినను సభ్యార్థవాచకమైనను నేకదేశద్వారమున నసభ్యార్థమును స్మరింపఁజేయుచున్నను నట్టిదోష మశ్లీలమనెను "అశ్రీః అస్య అస్తి" (దీనిని ననఁగా దీనిని వినుటచే అశ్రీ లేక యశోభనము గలుగున) అను వ్యుత్పత్త్యర్థమున "కందూరస్య అస్తీతి కందూలః" అన్న చోటునవలె మత్వర్థీయ "ల" ప్రత్యయమును బృషోదరాది పాఠముచే 'శ్రీ' యొక్క రేఫమునకు 'ల' కారమును వచ్చి 'అశ్లీల' పద మేర్పడినది

'వర్చః' అను పదమునకుఁ 'దేజము' విష్ఠ (మలము) అనియు నర్థద్వయము గలదు. ఇందొక యర్థమసభ్యము ఇట్లే బుల్లి' పదమున కాంధ్రభాషలో చిన్న' అనునర్థమును 'పురుషచిహ్నము' అను నర్థమును గలవు. ఇందు రెండవయర్థమసభ్యము 'కృకాటికా' ఇందేకదేశము 'కాటి' పదము శ్మశానార్థమును బోధించుచు నసభ్యస్మృతిహేతువగుచున్నది. ఇట్లే 'గుద్దలి' పదములోని 'గుద్ద' పద మసభ్యస్మృతిహేతువగుచున్నది

క౦. వసుదేవయోని గోపీ,
విసరమహాపీనకుచ నవీనాశ్లేషో
ల్లసితుం డనఁ గాలిందీ
రసవిహారణకరణనిత్యరసికుం డనఁగన్. ౧౮

ఇట యోని, మహాపీన కాలింది అను పదములు క్రమముగా వ్రీడా, జుగుప్సా అమంగళశంకాకరములు మఱియు నిట పీ' అను వర్ణము 'పీయి' అను జుగుప్సార్థమును స్మరింపఁజేయుచున్నది కాన నిదియు నశ్లీల దోషమే ఇట్టిచో 'పీయి' అనుపదమే యుండ నక్కఱలేదు శబ్దములు తత్సజాతీయవర్ణములుగల శబ్దాంతరమును స్మరింపఁజేయుచుఁ దన్మూలమున నర్థాంతరమును వ్యంగ్య మొనర్చునని చెప్పియుంటిమిగదా ! ఇట్లే 'చకాశే పనస ప్రాయైః అనుచో 'శేప' అను నక్షరద్వయము 'శేఫ అను పదమును స్మరింప జేసి వ్రీడాకరమగుచున్నదిగదా మఱియుఁ గొన్నియెడల సంధివశమున నశ్లీలార్థము దోఁచును ఎట్లన నీచుల్లిపాయ (నీచు+ఉల్లిపాయ) మోమర్ధంబు గదల్చె (మోము+అర్ధము) ఇవియును వ్రీడాకరములే కాన నివియును త్యాజ్యములే

వామనుఁడు అశ్లీలదోషమున కపవాదముగా "న గుప్తలక్షితసంవృతాని (గుప్తము, లక్షితము సంవృతము నగునది యశ్లీలమయినను దోషము గాదు) అని చెప్పెను గుప్తమనఁగా నసభ్యార్థము దోఁచుచున్నను నది యప్రసిద్ధముగా నున్నచో దోషము గానేరదు ఎట్లన "సంబాధ" పదమునకు సంకటము స్త్రీ యోని అను నర్థద్వయ మున్నను నసభ్యార్థమునఁ బ్రసిద్ధిలేదు. ఇట్లే 'బెల్లము పదమునకుఁ బురుష చిహ్నము, గుడము అను నర్థద్వయ

మన్నను నసభ్యార్థమునఁ బ్రసిద్ధిలేదు. కాన నిది దోషదుష్టము గాదు లక్షిత మన నొక పదమునకు ముఖ్యార్థముచేఁగాక లక్ష్యార్థముచే నశ్లీలత దోఁచినను నది దోషముగాదు 'జన్మభూమి' పదము లక్షణచే గుహ్యార్థమును బోధించును గాని ముఖ్యార్థముచే గాదు. అట్లే యబ్జయోని కమలయోన్యాది పదములును నశ్లీలములుగావు (కేవల యోనిపద మశ్లీలమే) సంవృతమన లోకముచే నాదృతమైనది అనఁగా స్వీకృతమైనది సుభగా భగినీ, భగవతీ ఉపస్థానము అభిప్రేతము కుమారి దోహదము శివలింగము పుంలింగము, స్త్రీలింగము, త్రికోణము ప్రజాపతి చాముండ కమలము, విమలము అమలము, పూఁబోఁడి (విరిఁబోఁడి మొ) మొదలగు పదములు లోకాదృతములగుటచే నిం దశ్లీలశంకాలేశమును గానరాదు కావున లోకాదృతమైన శబ్దమసభ్యముగాదు

> సంవీతస్య హి లోకేన న దోషాన్వేషణం క్షమం
>
> శివలింగస్య సంస్థానే కస్యాఽసభ్యత్వవాసనా.

లోకసమ్మతమగు పదము దుష్టముగాదు. 'శివలింగము' అను పదమున నెవని కసభ్యతాభావన గలుగును ?

కొన్ని పదములొకకాలమున నశ్లీలార్థమును బోధించును మఱొక కాలమున బోధింపవు. పూర్వకాలమున 'కుడుచు' పదమశ్లీలార్థమున లేదు ఇక్కాలమునఁ గలదు కాన నిది పరిత్యాజ్యమే. కేవలము 'కుడుచు' పద మశ్లీలము కాని 'విందుగుడుచు మొదలగునెడఁ బదాంతర సంయోగమున నశ్లీలార్థము దోఁచదు అట్లే బొక్క తెడ్డు నాకు, పీకు, దీఁకు పానము మొదలగునవియు బదాంతరసంయోగమున నశ్లీలార్థకములుగా లేవు ఎట్లన, నక్కలు బొక్కలు వెదకును, కుండకుఁ దగినతెడ్డు మందునాకెను చెట్టు పీఁకెను పిల్లవాఁడు తిత్తిఁ జీఁకుచున్నాఁడు వాఁడు సురాపానము చేసెను ఇత్యాదులు లోకాదృతములై యున్నవి. కాన నీ యశ్లీలవిషయమున ముఖ్యముగా లోకాదృతత్వమును గమనింపవలెను

అశ్లీల మసిత్యదోషము సురతారంభాదులందును, శాంతరసకథల యందును నది దోషముగాదు. గుణమే యగును

కం. భగము వికసింపఁజేయుచు
బిగఁబట్టుచు లోనఁ జొర నభేద్యంబుగఁ ద
ప్పగఁ ద్రోయుచు బెదికించుచు
దిగితొడలం జుట్టిపట్టి బిట్టలరించెన్

ఇది సురతగోష్ఠిలో గుణమే యగును

కం. బలిసిన నడిమికిఁ జీలిన,
వెలికిలఁబడు కప్పకడుపు విధమునఁ దడి యై
యలరెడు యోనిం గనుఁగొన
నలరనె ? కృమిదక్క నన్య మగు జంతువిలన్

కం తగ మేహనంబుపై స
వ్యగుల్ఫ మిడి దానిపైఁ దదన్యం బిడి గ
ట్టిగఁ గూర్చుండుట యో భ
వ్యగుణా ! ముక్తాసనాఖ్య మై పెంపొందున్

ఇది శాంతకథ కావున నిట్టియెడ గుణమే యగును.

౧౧. అప్రతీతికము

కం. అల శాస్త్రపురాణములనె
కల శబ్దం బప్రతీతికం బగుఁ గృతులన్ ;
దలఁతు వృషాకపిఁ ద్రిజగము
నెలమి నజావృతముఁ జేయు నీశ్వరుఁ డనఁగన్. ౧౫

శాస్త్రపురాణములలో మాత్రమే ప్రసిద్ధమై లోకవ్యవహారమునఁ గాన్పింపని శబ్దమప్రతీతికము వృషాకపి (శివుడు-విష్ణువు) అజా (మాయ - అజా మేకాం లోహిత కృష్ణశుక్లాం బహ్వీః ప్రజాః జనయంతీః సరూపాః అను శబ్దములు వైదిక శబ్దములు ఇవి లోకవ్యవహారమునఁ గానరావు. శాస్త్ర పురాణ ప్రసిద్ధము లని చెప్పి వైదికపదముల నేల యుదాహరించె ననవచ్చును వేదము గూడ శాస్త్రమువంటిదే. రెండును ప్రభుసమ్మితములే కాన రెండును దుల్యములే ఇఁటఁబురాణ ప్రసిద్ధములను గూడ నప్రతీతికములనుట యుక్తముగాదు ఏలన భాషలోఁగల శబ్దములలో ముక్కాలు మువ్వీసము పుప్పరక యన్నియుఁ బురాణ ప్రసిద్ధములే కదా! అవి యప్రతీతికము లగుచో గత్యంతర మేమి ? కావ్య ప్రకాశ, సాహిత్యదర్పణ, కావ్యాలంకారసూత్రాది గ్రంథములలో శాస్త్రమాత్ర ప్రసిద్ధ మగు పదమునే యప్రతీతికముగాఁ దద్గ్రంథకర్తలు పేర్కొనిరి. వారి యుద్దేశము శాస్త్ర పారిభాషికపదమే యప్రతీతికమని "యత్కించిచ్ఛాస్త్రపారిభాషికమిత్యర్థః-ఇతి సారబోధిన్యాం స్పష్టం" అని వామనాచార్యపండితుఁడు తెలిపెను మఱియు వారిచ్చిన యుదాహరణములలో రూపస్కంధ, నాంతరీయక, ప్రభృతి పారిభాషిక పదములే కలవు కావున వృషాకపి అజాశబ్దములు రెండునుగూడఁ బారిభాషిక పదములుగావు కాన నవి యప్రతీతికదోషములుగావు వృషాకపి అజాశబ్దముల ప్రయుక్తములనుట తగును ప్రతాపరుద్రీయకర్త 'మను' శబ్దమును నప్రతీతిక దోషముగా నుదాహరించెను అదియును బారిభాషికముగాదు. కావున దానినిఁ

గూడ నప్రయుక్తమనుటయే లెస్స రూపస్కంథపదము బౌద్ధుల తత్త్వశాస్త్రము నందును నాంతరీయకపదము తర్కశాస్త్రమునందును బ్రసిద్ధములు

ఇది యనిత్యదోషము. వక్తయు బోద్ధయుఁ (ఇరువురును) దత్తచ్ఛాస్త్ర విషయజ్ఞాతలగుచో నప్రతీతికము దోషముగాదు. ఎట్లన

శా. ప్రాతఃకాలము వాయసంబు పణినాపత్యోక్త శాస్త్రంబులోఁ
దాతజ్‌స్థానులు చెప్పఁదెవ్వియను చందంబొప్పఁ గౌకాయనం
జాతుర్యం బలరార నుత్తరము విస్పష్టంబుగాఁ గోకిల
వ్రాతంబిచ్చెఁ దుహీ తుహీ యని గృహారామప్రదేశంబునన్

'తుహ్యోస్తాతఙ్ఙన్యతరస్యాం' అను సూత్రమును దెలిసినవారు వక్తయు బోద్ధయు నగుచో నిట దోషములేదు. కేవల వక్తయే వైయాకరణుఁడగుచో దోషమే ఇట్లే యితర శాస్త్రములందలి యిట్టి విషయముల కుదాహరణములను దెలిసికొనవలయును.

౧౨ అప్రయోజకము

కం. అవిశేషవిధాయకమై
కవిసినపద మప్రయోజకము; భూతివిభా
ధవళితహారసుతుఁ గొలుతును
నవనళినహారద్విపాస్య నయముగననఁగన్ ౧౬

ప్రయోజనములేని విశేషణ మప్రయోజకమగును ఇట హార శబ్దమునకు 'భూతివిభాధవళిత' అను విశేషణమును ద్విప శబ్దమునకు 'నవనళినహార' అను విశేషణమును బ్రయోజనరహితములు ఇవి యప్రయోజక దోషములు దర్పణకార కావ్యప్రకాశకారులు దీనిని అపుష్టార్థము అను నర్థదోషముగాఁ బరిగణించిరి ఈ విశేషణముల వలన నర్థపుష్టిలేదు కాన నపుష్టార్థమనుటయే లెస్స వెనుకటి వింశత్యర్ధాననుఁడు మొదలయిన విశేషణములు కూడ నపుష్టార్థములే యని తెలిపితిమి

౧౩. క్లిష్టము

కం. దూరార్థము క్లిష్టంబగు
ధారుణిఁ బవనాశనేంద్రధరమకుటాలం
కారమణి జనకవరపు
త్రీరమణకుమారరూపదీపితుఁ డనఁగన్.

క్లిష్టమనఁ గ్లేశయుక్తము తాత్పర్యము నిర్ణయించు సామగ్రిలేమి విలంబముగా నర్థము ప్రతీతమగుటచేఁ గ్లేశయుక్తము పవనాశనేంద్రధర = శివుని

యొక్క, మకుటాలంకారమణి = మకుటభూషణమగు చంద్రునియొక్క జనక = తండ్రియగు సముద్రునియొక్క వరపుత్త్రి = శ్రేష్ఠపుత్త్రికయగు లక్ష్మీదేవి యొక్క రమణ = భర్తయగు విష్ణువుయొక్క; కుమార = పుత్త్రుఁడగు మన్మథుని యొక్క; రూప = రూపమునంటి రూపముతో; దీపితుఁడు = శోభిల్లువాఁడు.

ఈ యర్థమెంతయుఁ గ్లిష్టముగా నున్నది? ఈ దోషము సమాసగతమే యగు పదదోషము.

౧౪. సందిగ్ధము

కం. సందిగ్ధమనఁగఁ దెలుఁగును
సందేహాస్పదపదంబు సమరధరిత్రీ
సందీపితజయశాలి పు
రందరనుతవిక్రముఁడు రామునం డనఁగన్ ౧౯

అర్థనిర్ణయమున సందేహమునకుఁ దావిచ్చుపదము సందిగ్ధము రాముఁ డనఁగా శ్రీరాముఁడా? పరశురాముఁడా? యను సందేహము గలుగుచున్నది కాన సందిగ్ధము

ఇది యొక ప్రకరణాంతర్గత మగుచో నా ప్రకరణమునుబట్టి నిస్సందిగ్ధముగా నర్థనిర్ణయమగును. కాన నట్టిచో దోషము గానేరదు ఇట్టిదిగాక ప్రకరణమధ్యమున నున్నను నర్థనిర్ణయమున సందేహమునకుఁ దావిచ్చినచో నది సందిగ్ధము. ఎట్లన, నీ క్రింది ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రథానాంధ్రాచార్యుని పద్యరత్నమును గనుఁడు.

గీ నిమ్మచెట్టులేఁగొమ్మపందిళ్ళక్రిందఁ
బుస్తకపుఁబేటికలను నా హస్తగదిత
చిత్రసూత్రమునందు వసించియున్న
దోయి యిందాఁక మన ప్రేమయును సఖుండ

(తృణకంకణము)

పుస్తకపుఁబేటి యనఁగాఁ 'బుస్తకముల పెట్టె' యనియా? లేక పుస్తకమను పెట్టెయని రూపకమా? హస్తగదితచిత్రసూత్ర మనఁగా హస్తముచేత వ్రాసిన చిత్తరువనియా? లేక చిత్రమైన త్రాడనియా? లేక చిత్రమగు సూత్రమని రూపకమా? అని సందేహము ఇటఁ బ్రకరణము గూడ నీ సందిగ్ధార్థమును నిర్ణయింపఁజాలదు.

౧౫. విపరీతధీప్రదము

('విరుద్ధమతికృత్తు' అని దర్పణకారకావ్యప్రకాశకారాదులు)

కం జగతిన్ విరుద్ధమతికర
మగునది విపరీతధీప్రదాఖ్యం బనఁగాఁ
దగుఁ గృత ల; నకులహీనుం
డగు నితఁ డన నంబికావిటాసక్తుఁ డనన్. ౧౯

విరుద్ధాభిప్రాయమును అనఁగా ననుకొన్న యర్థమునకు విరుద్ధమైన యర్థమును గలిగించు పదము విపరీతధీప్రదము అకులహీనుఁడు (కులహీనుఁడు గాని వాఁడు) అంబికావిటాసక్తుఁడు (అంబికకు విటుఁ డగు (పతియగు) శివునియం దాసక్తుఁడు) అను పదములు గ్రమముగాఁ గులములేని హీనుఁడనియు (నవిద్యతే కులం యస్యసః అకులః సచాసౌ హీనః అను విగ్రహముచే నీయర్థము వచ్చును) తల్లికి మిండఁడగు వానియం దాసక్తుఁ డనియు విరుద్ధార్థముల నిచ్చుచున్నవి ఇది సమాసగతమే యగు పదదోషము

(చూ హాలికుఁడు 54 పుట)

ఈమంత్రపున్ బ్రాలంబోల్పఁగఁబోలు
దివ్యసుధనాభాగ్యంబునం బొందితిన్

పోతన తారకమంత్రోపదేశమును బొందినపిమ్మట ననుకొన్నమాట యిది. మంత్రాక్షరములతోఁ బోల్పఁదగినదివ్యసుధను బొందితిననియా ? దివ్యసుధతోఁ బోల్పఁదగిన మంత్రాక్షరములను బొందితిననియా ? పొందినది సుధయా ? మంత్రాక్షరములా ? పొందినవి మంత్రాక్షరములు ఇటవిపరీతము. ఇదియు వ్యాకరణశిరోమణి చెలమచర్ల రంగాచార్యులవారిది

౧౬ అవిమృష్ట విధేయాంశము

కం అవిమృష్టవిధేయం బగుఁ
దవిలిన వర్ణ్యాంశ మప్రధానం బైనన్
నవనవసంఫుల్లలతాం
తవసంతము వచ్చె నిపుడు ధరణి కనంగన్ ౨౦

"అనువాద్యమనుక్త్వైవ నవిధేయ ముదీరయేత్' (అనువాద్యాంశమును జెప్పకయే విధేయాంశమును జెప్పరాదు.) అని న్యాయము ప్రధానభూతమగు వర్ణ్యాంశమప్రధానముగా వర్ణింపఁబడినచో నవిమృష్టవిధేయము (అవిమృష్టము—

ప్రధానముగా నపేక్షింపఁబడని లేక ప్రధానముగా విమర్శింపఁబడని విధేయము=విధేయాంశము గలది. అని వ్యుత్పత్త్యర్థము) 'వాఁడు మూర్ఖుఁడు' అనుచో 'వాఁడు అనువాద్యము లేక ఉద్దేశ్యము 'మూర్ఖుఁడు విధేయాంశము ఇట మొదట ననువాద్యమును బిమ్మట విధేయమును గలదు అట్లుగాక 'మూర్ఖుఁడు వాఁడు' అన్నచో విధేయాంశము మొదటను అనువాద్యాంశము తరువాతను వచ్చినవి. ఇది యవిమృష్ట విధేయాంశము అట్లే ' వసంతము నవనవ సంఫుల్లలతాంతము" అన్నచో వసంత మనువాద్యమును నవ... లతాంతము విధేయమునగును ఇట నట్లుగాక "నవనవ .. లతాంతము వసంతము'' అని యున్నది. విధేయము ముందును ననువాద్యము తరువాతను వచ్చినవి కాన నవిమృష్ట విధేయాంశము.

"స్వర్గగ్రామటికావిలుంఠనవృథోచ్ఛూనైః కిమేభిర్భుజైః" (స్వర్గమను నొక చిన్న పల్లెను గొల్లఁగొట్టుటచే వృథగా బలిసిన యీ చేతులుండియేమి ప్రయోజనము ?) అనుచో భుజముల బలుపు వ్యర్థము' అని తేలినది ఇట పై యర్థము విధేయము 'బలుపు' అనువాద్యము లేక ఉద్దేశ్యము అనువాద్యము ముందును విధేయము పిమ్మటను నుండవలసి యుండఁగాఁ గవి తారుమారుగా బ్రయోగించెను ఇది దోషము

ఇట్లే వారు పాపులు, అనవలసియుండ "పాపులువారు అన్నచో నిదే దోషము ఇది వాక్యగతము గాదనియుఁ బదగతమేకాని సమాసగతమనియుఁ గొందఱి యభిప్రాయము. సమాసగతమే యన్నచో 'పాపులువారు మూర్ఖుఁడు వాఁడు మొదలగు తావులందో సమాసములేదు కావున సమాసగతమే యని నియమింప వీలులేదు.

౧౭ పరుషము (దుశ్శ్రవము లేక శ్రుతికటువు)

శ౦. శ్రుతికటువులైన పదములు
కృతిఁబరుషములనఁగఁ జెలఁగు నిలఁ గుద్రేడ్జా
పతి మూర్ధధృతార్ధోద్వధి
పతిఁ గొల్తు నభీష్టసిద్ధిఫలమున కనఁగన్ ౨౧

చెవులకుఁ గఠినముగాఁ దాఁకు పదము పరుషము 'కుద్రేడ్జా ఇత్యాది కము పరుషము.

శ్రుతిదుష్టాదయో దోషా అనిత్యా యే చ దర్శితాః
ధ్వన్యాత్మన్యేవ శృంగారే తే హేయా ఇత్యుదాహృతాః

'అనిత్యములగు శ్రుతిదుష్టాదిదోషములు ధ్వన్యాత్మభూత మగు శృంగారముననే హేయములు అని ధ్వనికారుఁడు చెప్పుటచే నీ పరుషరూపదోష మనిత్యము కోమలపదరచన గల శృంగార, కరుణ శాంతములలో నిది దోష మగును కాని రౌద్ర, వీర, భయానక అద్భుతరసములలో నిది దోషముగాదు. మఱియు నట గుణమేయగును

ఈ గ్రంథకర్త దర్పణకార ప్రకాశకారాదులు తెలిపిన 'అనుచితార్థ' దోషమును దెలుపలేదు. దాని నిటఁ జూపుదుము

"శూరా అమరతాం యాంతి పశుభూతా రణాధ్వరే" (రణయజ్ఞమునఁ బశువులై శూరులు దేవత్వమును బొందుచున్నారు) అనుచో "పశు" శబ్దము పిఱికితనమును వ్యక్తపఱచుచున్నది ఏలనఁ బశువు (మేఁక) యజ్ఞమున బలాత్కారముగాఁ గట్టి వధింపఁబడుచున్నది అది కట్టఁబడునపుడు కాని వధింపఁబడునపుడుగాని తన విక్రమాదులను ప్రదర్శించుట లేదు పైఁగాఁ బాఱి పోవ యత్నించును శూరులు శత్రువులు దమ్ముఁ బట్టవచ్చినపుడు తుదివఱకును బోరాడి వీరమరణము నొందవలెను. అట్లుగాక పాఱిపోవుట వీరధర్మముగాదు ఇటఁ బశుత్వారోపణముచే శూరులు పిఱికిపందలను ననుచిత మగు నర్థము వచ్చుచున్నది. కాన నిది యనుచితార్థరూపదోషము.

దర్పణకార, కావ్యప్రకాశకారులు 'అపుష్టము'ను అర్థదోషముగాఁ బరి గణించిరి. ఇతఁడు పదదోషముగా గణించెను. వారప్రయోజకదోషమును దెలుపలేదు అది యపుష్టార్థముగానే వారు గణించిరి

దర్పణకార ప్రకాశకారులు బదదోషములు పదునాఱే తెలిపిరి ప్రతాప రుద్రీయకర్తయు బట్టుమూర్తియుఁ బదునేఁడు దెలిపిరి ఈ పదునేఁడింటిలో వారిచ్చిన అనుచితదోషము లేదు వారీయని అపుష్టదోషమును" వీరిచ్చిరి మఱియు నధికముగా అప్రయోజకదోషము' నిచ్చిరి

దర్పణకారుఁడు నిరర్థకము, అసమర్థము చ్యుతసంస్కారము అను మూఁడును గేవల పదదోషములనియు దుశ్శ్రవ త్రివిధాశ్లీల, అనుచితార్థ అప్రయుక్త, గ్రామ్య, అప్రతీతిక సందిగ్ధ నేయార్థ నిహతార్థ అవాచక, క్లిష్ట విరుద్ధమతికృత్తు అవిమృష్ట విధేయాంశము లను పదమూఁడును బద వాక్యోభయదోషము లనియు మఱల వీనిలో దుశ్శ్రవ త్రివిధాశ్లీల నేయార్థ నిహతార్థ అవాచకదోషములు పదాంశమునఁ గూడ సంభవించు ననియును జెప్పెను క్లిష్ట, అవిమృష్టవిధేయాంశ, విరుద్ధమతికృద్దోషములు సమాసము వందే సంభవించునని కావ్యప్రకాశకారాదులు దెలిపిరి

దర్పణకారుఁడిచ్చిన పదాంశదోషముల కుదాహరణములను జూపుదుము.

౧ పదాంశదుశ్శ్రవదోషము

"తద్గచ్ఛ సిద్ధ్యై కురు దేవకార్యం" ఇట సిద్ధ్యై పదముయొక్క యంశమైన 'ద్ధ్యై' వర్ణము శ్రుతికటువుగా నున్నది

పద పదాంశరూప దుశ్శ్రవదోషమునకు భేదమేమి? యన్నచో వర్ణద్వయము దుశ్శ్రవముగా నున్నచోఁ బదదోష మనియు నేకవర్ణము దుశ్శ్రవముగా నున్నచోఁ బదాంశదోష మనియును బండితుల యభిప్రాయము.

౨. పదాంశాశ్లీల దోషము

"పాణిఃపల్లవపేలవః" అనుచో 'పేలవ' పదాంశమగు 'పేల' అను వర్ణద్వయము లాట భాషయందు వృషణార్థకమై యశ్లీల రూపదోషమగుచున్నది లాట భాష తెలిసినవారికే యిందలి యశ్లీలత గోచరించును. ఇతరులకుఁగాదు ఒక భాషలోని యొకపదము మఱొకభాషలో నశ్లీలార్థక మయినంతమాత్రమున దానినిఁ బ్రయోగింపరా దనుట యెట్లు పొసఁగును? అరవభాషలో 'అతు అన గృహమని యర్థము ఆంధ్రభాషలో నా పద మశ్లీలార్థకము కావున నరవభాషలో నీ పదమును బ్రయోగింపరాదనుట యెట్లు? అరవవారి కందలి యశ్లీలత యెట్లు గోచరించును? కావున సంస్కృతభాషలోనే యీ పదాంశ మశ్లీలార్థమును దెలుపుచున్నచో నది దోషమగును కాన నిట "పేలవ" పదములోని పదాంశమగు 'పేల' యనునది యశ్లీలార్థకముగా మనము గ్రహింపనక్కఱలేదు. ఇఁక దీని కుదాహరణము 'గుద్దలి' అను పదములోని పదాంశమగు 'గుద్ద' అనునది. ఇది యాంధ్రభాషలో నశ్లీలార్థకమే "గుద్దంటఁ ద్రవ్వి త్రవ్వి" ఇత్యాది ప్రయోగములను గలవు బహుశః ఆ కాలమున నది యశ్లీలార్థమున లోక వ్యవహారమునఁ గానరాకయుండవచ్చును. ఈ కాలమున నది యశ్లీలమే 'గుద్ద' శబ్దము గుదశబ్దభవమైనను యోన్యర్థమున రూఢమైయున్నది.

౩ పదాంశనేయార్థక దోషము

"సంగ్రామే నిహతాశ్శూరా వచోబాణత్వమాగతాః" (సంగ్రామమున మరణించిన శూరులు వచోబాణత్వమును (గీర్వాణత్వమును - దేవత్వమును బొందిరి ఇట 'వచోబాణ, శబ్దము గీర్వాణార్థకముగా గల్పింపఁబడినది కాని యీ యర్థమును బోధింప నాశబ్దమునకు సామర్థ్యము లేదు ఏలన, సమస్తమగు 'గీర్వాణ' శబ్దద్వయమే యీ యర్థమునందు రూఢము. వచోబాణ శబ్దమునందలి యేకదేశ మగు వచశ్శబ్దముచే గీ' శబ్దమును లక్షింపఁజేయుట నేయార్థము రూఢి ప్రయోజనములలో నేదేని నొకదానిని

ఇట్టి లక్ష్యార్థము వచ్చును ఇట వచోవాణైకదేశమగు వచశ్శబ్దమునకు 'గీ' శబ్దమును బోధింప రూఢిప్రయోజనములు రెండును లేవు. నేయార్థమనఁ గవికల్పితార్థము గదా!

४. పదాంశనిహతార్థకదోషము

"ధాతుమత్తాం గిరిర్ధత్తే (పర్వతము రజతాదిధాతువులను గలిగియుంటను వహించుచున్నది.) మత్తా' శబ్దము 'మదిరాపానమత్తురాలు అను నర్థముననే ప్రసిద్ధము కాని ధాతువులను గలిగియుండుట' "ధాతవః అస్మిన్ సంతీతి ధాతుమాన్ తస్య భావః ధాతుమత్తా" అనునర్థమున నప్రసిద్ధము. ఇటఁ బదైకదేశమగు 'మత్తా' యను వర్ణద్వయమును నప్రసిద్ధమైన యర్థమునఁ బ్రయుక్తమైనది

५. పదాంశావాచకదోషము

"వర్ణ్యతే కిం మహాసేనో విజేయో యస్య తారకః" (ఎవరిచేఁదారకాసురుఁడు విజితుఁడయ్యెనో యా మహాసేనుని వర్ణింపవలసిన పని యేమున్నది?)అనుచోట 'విజిత అనుభూతకాలిక 'క్త' ప్రత్యయార్థమున నర్హశక్యాద్యర్థబోధకమగు 'య' ప్రత్యయ (జేయ) ముపయోగింపఁబడినది. య ప్రత్యయము క్త' ప్రత్యయార్థవాచకము గాదు

వాక్యదోషములు

సీ. అక్రమంబు, విసంధి, ప్రక్రమభంగంబు,
పునరుక్తియుత మసంపూర్ణతరము;
వాక్యసంకీర్ణంబు, వ్యాకీర్ణ, మధికప
దంబు వాచ్యవివర్జితం, బరీతి,
న్యూనోపమం, బధికోపమఁబు సమాప్త
పునరాత్త, మస్థానఘనసమాస,
మనియతచ్ఛందంబు, యతిభంగము, పతత్ప్ర
కర్షంబు, భిన్నలింగంబు భిన్న

గీ వచన, మక్రియ సంబంధవర్జితములు
వాక్యగర్భితమును, నన వాక్యదోష
వితతు లిరువది రెండయి వినుతిఁగాంచు
వీని లక్షణలక్ష్యముల్ విస్తరింతు. ౨౨

౧ అక్రమము ౨ విసంధి ౩ ప్రక్రమభంగము. ౪ షనరుక్తి ౫ అసంపూర్ణము ౬ వాక్యసంకీర్ణము ౭ వ్యాకీర్ణము ౮ అధికపదము ౯ వాచ్యవివర్జితము. ౧౦ అరీతికము ౧౧ న్యూనోపమము ౧౨ అధికోపమము ౧౩. సమాప్త పునరాత్తము ౧౪ అస్థానసమాసము ౧౫. అనియతచ్ఛందము ౧౬ యతిభంగము. ౧౭ పతత్ప్రకర్షము ౧౮. భిన్నలింగము. ౧౯ భిన్నవచనము ౨౦ అక్రియము ౨౧ సంబంధవర్జితము. ౨౨. వాక్యగర్భితము అని వాక్యదోషము లిరువదిరెండు ప్రతాపరుద్రీయకారుఁడు 'శబ్దహీనము విసర్గలుప్తము' అను మఱి రెండు దోషములను గలిపి యిరువదినాల్గు గణించెను

దర్పణకారుఁడు దుశ్శ్రవత్వాదులగు పదుమూఁడు దోషములు పదవాక్యోభయసాధారణము లని చెప్పినట్లు తెలిపియుంటిమి. ఈ దోషములు కేవల వాక్యమునందే సంభవించును

౧ అక్రమము

దీనిని విద్యానాథుఁడు క్రమభ్రష్టమనియు, వామనుఁ డపక్రమమనియును వ్యవహరించిరి

కం. క్రమహీన మక్రమం బగు,
సమధికమగు నితనికీర్తి శౌర్యచ్ఛాయా
సముదయము నకున్ దినకర
హిమకరకిరణోత్కరంబులెనయే ? యనగన్. ౨౩

క్రమమును విడుచుట యక్రమదోషము. "వీనికీర్తిశౌర్యకాంతులకు సూర్యచంద్రకిరణములు సాటియా ?" అనుచోఁ గీర్తికాంతి చంద్రకాంతితో శౌర్యకాంతి సూర్యకాంతితో సాటియా ? యని చెప్పవలసియున్నది. చంద్రసూర్యకిరణము లనవలసియుండ సూర్యచంద్రకిరణములనుట యక్రమదోషము. ఈ యక్రమదోషము శబ్దార్థభేదములచే ద్వివిధము. ఇది శబ్దాక్రమము

"తురంగ మథ మాతంగం ప్రయాచ్ఛాస్మై మదాలసం" (తురంగమును గానీ మాతంగమును గానీ వీనికిమ్ము) అనుచోఁ బ్రధానార్థమైన మాతంగమును బ్రథమమునఁ దురంగమును బిమ్మటను నిర్దేశింపవలసి యుంట నాక్రమము విడువఁబడినది. ఇది యర్థాక్రమము

దర్పణకార, ప్రకాశకారాదులీ యక్రమదోషము నీ విధముగా శబ్దాక్రమ, అర్థాక్రమరూపమునఁ దెలుపక "శబ్దము సముచితస్థానమునఁ బ్రయో

గింపఁబడక భిన్నస్థానమునఁ బ్రయోగింపఁబడుట" యక్రమదోష మని తెలిపిరి. ఎట్లన.

ద్వయం గతం సంప్రతి శోచనీయతాం సమాగమప్రార్థనయా కపాలినః
కలా చ సా కాంతిమతీ కలావత స్త్వ మస్య లోకస్య చ నేత్రకౌముదీ.

అవ. ఇది కుమారసంభవములోనిది. వటువు పార్వతీదేవితో ననుచున్నాఁడు

"శివసమాగమును బ్రార్థించుటవలన రెండువస్తువులు శోచనీయ స్థితినిఁ బొందుచున్నవి. కలావంతుఁ డగు చంద్రుని కాంతిమంత మగు కళయు, లోక నేత్రములకుఁ జంద్రికవగు నీవును (శోచనీయ లగుచున్నారు)

ఇట శ్లోకమున "కలా చ త్వం చ" అని 'త్వం' పిమ్మటనే యుండ వలసిన 'చ' కారము 'లోకస్య' పిమ్మట నుండుట యక్రమదోషము. అక్రమ దోష మన నిట్టిదియే.

౨. విసంధి

కం. అపగతలక్షణమును, గ్రా
మ్యపుసంధియుఁ దగ విసంధియనఁ దగు "నరిగె
న్నపరగిరి కినుఁ డనంగా
నృపు లొప్పరు రథికగుణవినిద్రతనంగన్. ౨౪

లక్షణహీనమగు సంధియు ననఁగా విరుద్ధసంధియు, అపండితుల ప్రయోగించిన సంధియు విసంధి 'అరిగెన్ + అపరగిరి = అరిగెన్నపరగిరి' అని నకారము నకు ద్విత్వము వచ్చుటకు లక్షణము గానరాదు సంస్కృతమున నిట్టి సంధి 'సన్నచ్యుతః అనుచోట్ల సాధువే కాని యాంధ్రమున "లుప్తం శ్లేషో నాచి ద్రుతస్య" అని యాంధ్రశబ్దచింతామణి సంశ్లేషమును నిషేధించెను కాన నిది దోషము కాని నన్నయభట్టారకుఁడే "అన్ని ష్టసఖి" (అన్ + ఇష్టసఖి) అనియు "సర్వమున్నతని" అని పోతనగారును పింగళి సూరనాదులును నీ సంధినిఁ బ్రయోగించిరి.

వినిద్రతన్ + అనంగన్ = వినిద్రతనంగ అని సంధిచేయుట దోషము. ఇఁకారులకుఁ దప్ప ద్రుత ప్రకృతికములకు సంధిలేదని శాస్త్రము గాన నిది గ్రామ్యపుసంధి గ్రామ్యమనఁ బామరులు పామరులుచేయు సంధియని యర్థము

ఇట గ్రంథకర్త "అపగతలక్షణమును గ్రామ్యపు సంధియు" అని విసంధిదోషమును ద్వివిధముగాఁ జెప్పిన ట్లుదాహరణ ద్వయము వలనఁ గాన

నగును కాని గ్రామ్యపుసంధి యన్నను నపగతలక్షణ సంధియన్నను విరుద్ధ సంధియేగదా "విసంధి యన విరుద్ధసంధి" (వ్యాకరణ విరుద్ధసంధి) యన్నఁ జాలునుగదా! పైఁజూపిన రెండుసంధులును విరుద్ధసంధులేకదా కావున నీ లక్షణము బాగుగాలేదు

ప్రతాపరుద్రీయము నందలి విసంహితో విరూపోవా సంధిర్యస్య విసంధియత్' సంధిచేయకుంటగాని, విరూపసంధి (కర్ణకఠోరమగు సంధి చేయుటగాన విసంధి) అను లక్షణము దీనికన్న మేలైనది. ఏలన నిట విరూపసంధియన్నఁ గర్ణకఠోరముగాఁ జేయుసంధి అని యర్థము నాతఁడిచ్చెను. ప్రతాపరుద్రీయ లక్షణమున కుదాహరణములివి. 'శౌర్యాణి ఈ దృశాన్యాసన్ ఇట సంధిచేయఁ బడలేదు "పృథ్వ్యైశ్వర్యం క్వ వా గతం" ఇట పృథ్వ్యైశ్వర్య మనుచోటఁ గర్ణకఠోరమగు సంధి చేయఁబడినది

వామనుఁడు "పదసంధేర్వైరూప్యం విశ్లేషోఽశ్లీలత్వం, కష్టత్వంచ" (సంధియొక్క వైరూప్యమనఁగా విసంధి అనఁగా) విశ్లేషము అశ్లీలత్వము కష్టత్వము అని లక్షణము నుడివెను విశ్లేష మన సంధి చేయకుండుటయే ఉదా. రాముడు ఏగుదెంచె అశ్లీల సంధియన నశ్లీలార్థమును సూచించు సంధి ఉదా నీచు+ఉల్లిపాయ=నీచుల్లిపాయ. కష్టత్వ మన దుశ్శ్రవత్వము అదియే కర్ణకఠోరముగా నుండు సంధి ఉదా పృథ్వైశ్వర్యము మొ సాహిత్యదర్పణ కావ్యప్రకాశకారాదు లీ వామనుని భేదములనే స్వీకరించిరి

౩. ప్రక్రమభంగము

ఆ. వె. ప్రక్రమంబు విడువఁ బ్రక్రమభంగంబు
శౌరి దానవారిఁ, జక్రధారి,
నభవు, నమితవిభవు ననవద్యచారిత్రు,
విష్ణుఁగొల్తు జిష్ణుఁ, గృష్ణు ననఁగ.

ప్రారంభించిన మార్గమును విడిచినచోఁ బ్రక్రమభంగము రెండవ పాదమున 'శౌరి దానవారిఁ జక్రధారి' అని 'రి' వర్ణాంతముగా మూఁడు పదములను జెప్పి మూఁడవపాదమున అభవు అమితవిభవు అని 'వు' వర్ణాంతముతో నారంభించి రెండుపదములను మాత్రమే చెప్పి పిమ్మట ననవద్యచారిత్రు అని నొడివి నాల్గవ పాదమున 'విష్ణుఁగొల్తుఁ జిష్ణుఁ గృష్ణుఁననఁగ' అని విశేషణముల నడుమ 'గొల్తు' పదమునఁ జేర్చుటచే రెండవపాదమున నారంభించిన మార్గము విడువఁబడినది. ఇవ్విధము ప్రక్రమభంగము

'ఏవ ముక్తో మంత్రిముఖ్యై రావణః ప్రత్యభాషత' మంత్రులచే నీ విధముగాఁ జెప్పఁబడిన రావణుఁడు ప్రత్యుత్తరించెను.) 'ఉక్తః' అని

వచధాతువుతో నారంభింపఁబడినపుడు ప్రతివచనము గూడ నా ధాతువుతోడనే చెప్పవలెను. ఎట్లన రావణః ప్రత్యవోచత అని యుండవలెను.

కాని యిట్టి ప్రక్రమభంగ దోషములు చేయని కవియే యుండఁడు. కావునఁ బై పద్యమున నున్నట్టి దోషములవంటి దోషములు చేయరాదు.

౪. పునరుక్తి

కం. ఎనయఁగ శబ్దార్థంబులు
పునరుక్తములైన నదియె పునరుక్తియుతం
బనఁ దగు, జక్రాంచలమున
దనుజావళిఁ ద్రుంచుఁ జక్రధరుఁ డితఁ డనఁగన్. ౨౬

శబ్దమును అర్థమును మఱల నదేవిధమునఁ ప్రయోగింపఁ బడినచోఁ బునరుక్తిదోషము దీనిని దర్పణకారాదులు కథితపదము అనిరి "చక్రాంచలమునఁ జక్రధరుఁడు దనుజావళినిఁ ద్రుంచును" అన్నచోట 'చక్ర' పదమదే యర్థమునఁ బునరుక్తమైనది

ఒకానొకచో నీ పునరుక్తి దోషము గుణమే యగును. ఎట్లన,

ఉదేతి సవితా తామ్రస్తామ్ర ఏవాస్తమేతి చ (తామ్రరూపుఁడై సూర్యుఁ డుదయించుచున్నాఁడు. తామ్రరూపుఁడు గానే యస్తమించుచున్నాఁడు) ఇట నొకే యర్థముగల తామ్రశబ్దము పునరుక్తమైనది అయినను దోషముగాదు ఏలన నిట నుద్దేశ్య ప్రతినిర్దేశ్యములు గాన దోషములేదు ఇట్టిచో 'రక్త ఏవాస్తమేతిచ' అని రెండవపాదమును మార్చితిమేని నర్థాంతరముగాకున్నను నర్థాంతరమువలె భాసించుచుఁ బ్రతినిర్దేశ్యప్రతీతినిఁ గప్పివేయును. కావున నుద్దేశ్యప్రతినిర్దేశ్యవిషయమునఁ బునరుక్తి దోషముగాదు గుణమే యగును. మఱియు నర్థాంతరసంక్రమిత వాచ్యమునకు (కమలాక్షు నర్చించు కరములు కరములు) బునరుక్తి దోషముగాదు మఱియు,

విషాదే విస్మయే హర్షే దైన్యే కోపేఽవధారణే
ప్రసాదనేఽనుకంపాయాం ద్విస్త్రిరుక్తం న దుష్యతి

విషాద విస్మయ హర్ష దైన్య కోప అవధారణ, ప్రసాదన, అనుకంపలయందుఁ బునరుక్తి దోషముగాదు గుణమే యగును

అయ్యో అయ్యో (విషాదము) ఔరౌర! (విస్మయము) బళి బళి (హర్షము) కట కటా (దైన్యము) పో పో! (కోపము) వాఁడే! వాఁడే

(అవధారణము) రమ్ము ! రమ్ము ! (ప్రసాదనము) పాపము పాపము (అను కంప). ఇట్టియెడఁ బునరుక్తి దోషముగాదు ఏలన, నా పునరుక్తి విషాదాది వ్యంజక మగుచున్నది. కాన గుణమే యగును.

౫ అపూర్ణము

కం ధరలోఁ గ్రియాన్వయంబుల
సరిపోనిదపూర్ణ మనఁగ సన్నుతి కెక్కున్
నరపతి* యొసంగ ద్రవ్యము
బరగఁగ నౌదార్యశాలి బహుళము ననఁగన్. ౨౪

సంపూర్ణమగు క్రియాన్వయము లేనిది 'అపూర్ణము' "నరపతి బహుళముగా ద్రవ్య మొసఁగఁగా నౌదార్యశాలి" అన్నచోఁ గ్రియలేదు. 'అనఁబడును లేక 'యగును' అని క్రియాపద ముండవలయును అది లేకున్నచో వాక్య మసంపూర్ణము ప్రతాపరుద్రీయోదాహరణ మింతకన్న మేలుగానున్నది. దీనిని దర్పణకార ప్రకాశకారులు దెలుపలేదు.

శైలేష్వస్మాకమావాసో వన్యైస్సోచ్ఛ్వసితా వయం
మృగైర్బంధుమతశ్చాస్మాన్ పశ్యన్ ధాతా ప్రమోదతాం.

"మా నివాసములు శైలములు; వన్యాహారముతో మే మూపిరిగొని యున్నాము మృగ బాంధవుల మగు మమ్ముఁ జూచుచు విధి ప్రమోదపడనిమ్ము"

ఇట శైలవాసులమును వన్యవృత్తులమును మృగబాంధవులమును నగు మమ్ముఁ జూచి విధి ప్రమోద మొంద నిమ్ము అని యుద్దిష్టార్థము. 'పశ్యన్' అను శతృంతము పై శ్లోకవాక్యములో నీ విధముగా నన్వయించుటలేదు. 'మృగైర్బంధుమతశ్చాస్మాన్' అనుదానితోనే యన్వయించుచున్నది మిగిలిన రెండు వాక్యములతో నన్వయింపకున్నది కాన నసంపూర్ణము. ఈ నరస భూపాలీయోదాహరణమున నిట్టి యసంపూర్ణత కానరాదు.

౬ వాక్యసంకీర్ణము

కం. ఏకడ వాక్యాంతరిత ప
దాకీర్ణము వాక్యకీర్ణ మగుఁ "బొగడుదు రీ
భూకాంతుఁడు జను లెల్ల న
నేకగుణాన్వితుఁ డ టంచు నిలలో" ననఁగన్. ౨౫

*నరపతి యొసఁగును

వాక్యాంతరపదములతో వాక్యాంతరపదములు సంకీర్ణములగుట వాక్య సంకీర్ణము ఈభూకాంతుఁ డనేకగుణాన్వితుఁడనుచు నిలలోఁ జనులెల్లఁ బొగడుదురు. ఇట నీ రెండువాక్యములలోని పదములును సంకీర్ణత నొందినవి. దీనిని దర్పణకారాదులు 'సంకీర్ణ' మనిరి.

౭. వ్యాకీర్ణము

కం. భ్రాంతికరంబగు నన్వయ
మెంతయు వ్యాకీర్ణ మయ్యె "నిడుఁడు తిలకముం
గుంతలములఁ గాంతకును ల
లాంతంబులు సెరువుఁ డివ్వ డలరు ననంగన్. ౨౯

'తిలకమిడుఁడు; కాంతకుఁగుంతలముల లలాంతములు సెరువుఁడు' అని యన్వయము 'తిలకమును గుంతలముల నిడుఁడు అను భ్రాంతికరమగు నన్వయము గలుగుచున్నది. దర్పణకారాదులు దీనిని 'అస్థానపదదోషము' అని పేర్కొనిరి (స్థానముగాని స్థానమునఁ బదము నుంచుట.)

౮. అధికపదము

కం. తలఁపగ మిక్కిలిపదములు
గలిగినయది యధికపదము "కమలారికళా
కలితవిలాసనముల్లస
దలఘుయశోవిభవశాలి యగు నితఁడనఁగన్. ౩౦

అర్థమునుబోధింపవలసిన పదములకన్న నధికపదములుండుట యధికపద దోషము. ఇందు "కమలారి-యశశ్శాలి" అన్నఁ జాలును. బోధింపవలసిన యర్థమువచ్చును. కళాకలితవిలాస అలఘు విభవ పదము లధికములు.

'ఆ మృదుశీలపాణి' ఇట శీలపద మధికము 'పల్లవాకృతి రక్తోష్ఠి' ఇట నా కృతిపద మధికము 'పల్లవరక్తోష్ఠి' అన్నఁజాలును వాఁడొకపలుకుఁ బలికెను' ఇటఁ 'బలికెను' అను క్రియాపదముచేతనే గతార్థమగుచుండ మఱల 'పలుకు' అని వాడుట యధికము ఒకానొకచో విశేషణము నుపయోగించుటకై యట్లు ప్రయోగించవచ్చును ఎట్లన "వాఁడొక మధురమగు పలుకును బలికెను". ఇట 'మధురము'అను విశేషణము పలుకునకు వేయఁబడినది ఇది దోషముకాదు. విశేషణములేక యిట్లు ప్రయోగించుటదోషమే మఱియుఁ బ్రబంధములయందుఁ జెప్పఁదగిన విషయమును సంగ్రహముగాఁ జెప్పవలయును దీని నాంగ్లమున

brevity అందురు. కానీ యతివిస్తారముగాఁ జెప్పుటయు నీ యధికపద దోషమే యగును కొలఁది పదములతో నధికమగు నర్థమును దెలుపవలయును అట్లు తెలుపుట యొక్క ప్రతిభాలక్షణము దాననే రమణీయత్వము గలుగును తిక్కనయందీ సంగ్రహరూపప్రతిభ కాననగును "రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యం" అను లక్షణమునందలి రమణీయపదముచేతనే యీ యర్థము స్ఫురించును. కొలఁదిపదములతో నధికార్థమును జెప్పుట రమణీయముకాని యతివిస్తారముగాఁజెప్పుట రమణీయము గాదుగదా భోజుఁడిద్దానిని 'సంక్షేపము' అను గుణమని చెప్పెను భట్టుమూర్తి పీఠికాపద్యములలోని ౭౧వ పద్యమున "చోరుని యర్థసంగ్రహము" అని యీ గుణము చోరునియందు గలదని నుడివెను

విషాదే విస్మయే, హర్షే, దైన్యే కోపేఽవధారణే
ప్రసాదనేఽనుకంపాయాం ద్విస్త్రిరుక్తం న దుష్యతి

విషాదమున, విస్మయమున హర్షమున, దైన్యమునఁ గోపమున, అవధారణమునఁ బ్రసాదమున, అనుకంపయందును అధికపదము దోషముగాదు గుణమే యగును అనఁగా వక్త విషాదాదులతో మాటలాడునపు డధికపదము దోషము గాదు.

విషాదమున 'అయ్యో! అక్కటా! కటకటా!' అని ప్రయోగింతురు. ఇందు విషాదము సూచింప నొక్కటేచాలును మిగిలిన వధిక పదములే. కాని యిట దోషము గాదు. ఇట్లే మిగిలిన విస్మయాదులందును గ్రహింపవలెను మఱియు నీ విషాదులందుఁ బునరుక్తియును దోషముగాదని తెలిపితిమి.

౯. వాచ్యావివర్జితము

ఆ. వె. వాచ్యముజ్జగింప వాచ్యావివర్జితం
బనఁగ నెగడు "నాజి నభవునైనఁ
దెగడు నతని బాహుదీప్తాసి" యనునెడ
నాజి నభవుఁ దెగడు ననుచుఁబలుక. ౩౧

తప్పక చెప్పవలసినదానిని విడిచివేయుట వాచ్యవివర్జితదోషము "ఇతని బాహుదీప్తాసి యాజి నభవునైనఁ దెగడు" అనవలసియుండ 'ఐన' అనుదానిని విడిచి "ఆజి నభవుఁ దెగడు" అని చెప్పినచో దోషము తప్పక 'ఐన' అను దానినిఁ జెప్పవలయును ఈదోషమును వాచ్యానభిధానమని దర్పణకారుఁడును అనభిహితవాచ్యమని ప్రకాశకారుఁడును వాకొనిరి.

౧౦. అరీతి

కం. రసమున కనుచిత మగు పద
విసర 'మరీతి' యనఁబోల్చు; విటజనహృదయ
గ్రసనాగ్రహాగ్రహిళ దృ
ష్టిసమగ్రోదగ్ర మతివ శృంగారమునన్. ౬౨

రసమున కనుచితమగు రీతియున్నచో నరీతిదోషమగును ఆ యువతి యందము విటజనహృదయములను గ్రసించుటయందుఁ బట్టుదలగల చూపులతో సమగ్రమైనది.

ఇట నీ రీతి శృంగారమున కనుకూలముగాదు. శృంగారమునకుఁ గోమల పదబంధమును, అసమాసగాని యల్పసమాసగాని యగు రచనయును ననుకూలములు.

మ తనకున్ నేర్పుచు వీణెపారమును జెంతన్ప్రాజ్ఞ గూర్చుండి దీ
నిని వాయింపుము ! దీనిమీటుము ! ననున్ మెచ్చెంతువేన్ నీ కుపా
యనమిత్తున్నని మీటుచున్న తను ముద్దాడంగ మేల్ మేల్ లభిం
చెను మాదొడ్డగురుండు నాకనుచు ముంచెన్ శిష్య చిర్నవ్వులన్.

ఇట్టి యసమాసమును గోమలబంధమును నగు రచన శృంగారమున కనుకూలము దీర్ఘసమాసమువలన నర్థము స్ఫుటముగా నవిలంబముగా గోచరింపక రసానుభవమునకుఁ బ్రతిబంధక మగును శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారి శృంగారవీధిలో ముప్పాతిక మువ్వీసము పద్యము లీ దోషదూషితము లగును. అందలి పద్యము లన్నియు దీర్ఘ సమాసభూయిష్ఠములై శృంగారమునకుఁ బ్రతిబంధకములై యున్నవి ఇట్లే రౌద్రరసమునకు దీర్ఘసమాసత్వమును, వికటవర్ణత్వమును సముచితములు. ఎట్లన

శా. దుర్వారోద్యమ బాహువిక్రమ రసాస్తోక ప్రతాపస్ఫుర
ద్గర్వాంధ ప్రతివీరనిర్మథనవిద్యాపారగుల్ మత్ప్రతుల్
గీర్వాణాకృతులేవురిప్డు నిను దోర్లీలన్ వెసంగిట్టి గం
ధర్వుల్ మానముఁ బ్రాణముంగొనుట తథ్యంబెమ్మెయిం గీచకా !

ఈరీతి రౌద్రరసానుకూలము. అసమాసమగు రచన దీని కనుచితము

చ. ఖలు లయి నాఁడు లక్కయిలుగాల్చి, విషాన్నముఁ బెట్టి జూదపుం
గొలువుఁ బ్రవేశపెట్టి మముఁ గ్రూరత జీవధనంబు లందుఁ బే
దల నొనరించి చాలకది ద్రౌపదిఁగొప్పును బట్టి యీడ్చి చీ
రల సభ నొల్చినట్టి ధృతరాష్ట్రజు లేఁ గలుగంగ స్వస్థులే !

ఇట్టి శిథిలమగు రచన రౌద్రమునకుఁ దగదు మిగిలిన రసములయందు గూడఁ బ్రతికూలరచన నూహింపవలెను ఈ దోషమును దర్పణకారాదులు వర్ణప్రతికూలతాదోష మనిరి.

౧౧. న్యూనోపమము—౧౨. అధికోపమము

ఆ. వె. ఉపమ చాలకున్న న్యూనోపమం; బధి
కోపమాఖ్య మధికముపమ యైన;
హైమవసనుఁ డైన హరి మేఘునిభుఁ డన
నతివ పల్లవితలతాభ యనఁగ. ౪౩

ఉపమానకోటిలోఁ గొఱఁతయున్నచో న్యూనోపమము అధికమున్నచో నధికోపమము అను దోషములు. "బంగారుచేల గట్టిన కృష్ణుఁడు మెఱుఁగు దీఁగతోఁ గూడిన మేఘునితోఁ దుల్యుఁడు" అన్నచో నుపమానము సరిపడును కేవలము మేఘనిభుఁడన్నచో నుపమేయకోటిలోని 'బంగారుచేల'కుఁ దగిన ట్లుపమానకోటిలోఁ బదములేమిఁగొఱఁత యేర్పడును కావున న్యూనోపమగును. "అతివ చిగిరించిన తీఁగవలె నున్నది" అనుచోట 'భూషణములు ధరించిన యతివ' అని యున్నచో నుపమానము సరిపడును. అదిలేమి నుపమానకోటిలోని "పల్లవిత" పద మధికము కాన నధికోపమము. దర్పణకారాదు లీ రెంటిని నధిక పదత్వ, న్యూనపదత్వ దోషములలోనే చేర్చిరి

౧౩. సమాప్త పునరాత్తము

కం. క్రమముడిగి మగుడఁ బూనిన
సమాప్తపునరాత్తమయ్యె; శాశ్వతు నభవుం
గమలాక్షుఁ, గమలనాభుం,
గమలాపతిఁగొల్తు ముక్తికై విభు నసఁగాన్. ౪౪

సమాప్తమయినదానినిఁ దిరిగి పూనుట సమాప్తపునరాత్తదోషము. 'కమలాక్షు...ముక్తికై' అనుచోట వాక్యము సమాప్తమైనది. మఱల 'విభున్' అని వేఱొకటి దానికి విశేషణాంతరము చేయఁబడినది ఇది దోషము ఈ విధముగా వాక్యము సమాప్తమైన పిమ్మట విశేషణాంతరము ప్రయుక్తమైన చోటనే సమాప్తపునరాత్తదోషము భిన్నమగు వాక్యాంతరమును బ్రయోగించినచో దోషములేదు దీనికుదాహరణమును బతత్ప్రకర్షదోషమునఁజూపుదుము.

౧౪. అస్థానసమాసము

కం. అపదసమాసం బస్థా
నపటుసమాసంబు; "రిపుల ననిఁదునిమెద నే
నిపు" డని వికటభ్రుకుటీ
విపులక్రోధాంధుఁ డయ్యె వీరుం డనఁగన్. ౩౫

'రిపులఁ దునిమెద నేను' అనునది వీరుని భాషణము వాని మాటల యందుఁ గ్రోధము వ్యక్తము గావలయును 'శత్రువులను గాలను నేలనురాచెదను. వారిని ఖండించి కాకులకును గద్దలకును వేసెదను' అను నభిప్రాయము దెలుపు సమాసము నుపయోగింపవలెను. కాన సముచితసమాసము. అట సమాసమును వారక కవియొక్క భాషణమున (వికటభ్రుకుటీ విపుల క్రోధాంధుఁడు) సమాసము ప్రయుక్తమైనది ఇది యస్థానసమాసము· స్థానముగాని స్థానమున సమాసమును వేయుట ఈ దోషమొకానొకచో గుణమేయగును

రక్తాశోక కృశోదరీ క్వనుగతా త్యక్త్వానురక్తం జనం ?
నోదృష్టేతి ముధైవ చాలయసి కిం వాతావధూతం శిరః ?
ఉత్కంఠాఘటమానషట్పదఘటాసంఘట్టదష్టచ్ఛద
స్తత్పాదాహతిమంతరేణ భవతః పుష్పోద్గమోఽయం కుతః?

రక్తాశోకమా అనురక్తుఁడగు నన్ను విడిచి నా ప్రియురాలెటుపోయెను ? నేను జూడలేదని యేల యూరక (తెలిసియు) వాతావధూతమగు శిరస్సు నాడింతువు ? ఔత్సుక్యముచే (నీ కడకు) వచ్చిన తేంట్ల మొత్తము యొక్క వలుగుదులచేఁ గొఱికివేయఁబడిన చిగురాకులు గలదానవై దాని (నా ప్రియురాలి) పాదతాడనము లేక నీ వెట్లు చిగురువెట్టుదువు ?

ఇట విప్రలంభమున విరహివాక్యమున దీర్ఘ సమాసమనుచితము కాని తానడిగిన దానినిఁ దెలిసియుఁ జెప్పక యారక్తాశోకము తల నాడించుచున్నదని విరహి కుపితుఁడైనాఁడు కావున నా కోపమును వ్యక్తముసేయుటకు దీర్ఘసమాసత్వమును గఢత్వమును గుణములే యగును ఈ దీర్ఘ సమాసముచే వ్యక్తమైన యంగభూతమగు కోపప్రకర్షముచే నంగియగు విప్రలంభమునకుత్కర్షమే కలుగును.

మఱియు నదీపర్వతాదివర్ణములందు సమాసముచితముగానే యుండును. ఎట్లన.

శా. ఆ కాంచీనగరంబు వెల్వడి సముద్యత్పూగ పున్నాగ రం
భాకంకేళిరసాలసాలసుమనఃపాళీజధూళీమధూ

శిశిర వరగంధవాహ పృథుకాళిచంక్రమాలంకృత
ష్మాక ప్రాంగణ చోళమండల మహాగ్రామంబు లీక్షించుచున్

శా. ఆపీనాధరుఁడేగి కన్గానియెఁ బుణ్యఖ్యాత దర్పోల్లస
ద్దైవ ద్వీపవతీసమత్సర వివాదప్రౌఢిమానర్గళ
వ్యావల్గత్కరభావభృల్లహరికావర్గావృతవ్యోమముం
గావేరీతటినీలలామము నఘౌఘుషాళనోద్దామమున్

మ. బహురత్నద్యుతి మేదురోదరరీభాగంబులం బొల్చు ని
మ్నహికాహార్యమునం జరింతు మెపుడుం బ్రేమన్నభోవాహినీ
లహరీశీతలగంధవాహపరిఖేలన్మంజరీసౌరభ
గ్రహణేందిందిరతుందిలంబులివి మత్కాంతారసంతానముల్.

ఈ సమాసరచనను గూర్చి చతుర్థాశ్వాసములోని గుణప్రకరణము యొక్క తుదియందుఁ జూడవలెను

౧౫. ఛందోభంగము - ౧౬. యతిభంగము

కం. ఛందము యతియుం దప్పిన
ఛందోయతిభంగములగు సంగతి నితఁడు
కుందేందువిశదయశుఁడై
ముందుగఁ బూజించినాఁడు నరహరి ననఁగన్. ౩౬

ఇట రెండవపాదమున ఛందోభంగము కందమున ద్వితీయపాదాంత వర్ణము గురువై యుండవలయును ఇట లఘువుగానే యున్నది. నాల్గవపాదమున యతిభంగము దీనిని దర్పణకార ప్రకాశకారులు దెలుపలేదు. వామనుఁడు దెలిపెను.

సామాన్యముగాఁ గవులు ఛందోభంగదోషమును జేయరు. వ్యాకరణ శిరోమణి చలమచర్ల రంగాచార్యులవారు అంధ్రప్రతాపరుద్ర యశోభూషణమున నీ క్రింది పద్యమున ఛందోభంగమును జేసిరి

గీ. విశ్వవిఖ్యాత కాకతి వీరరుద్ర
నిరతిశయమైన భూమిపాణిగ్రహోత్స
వంబు విని పొటనప్రేళ్ళఁ బాదపీఠి
ధరణిపతులెల్ల గీటిరి తలలువాల్చి.

ఇట మూఁడవపాదమున ఛందోభంగమయినది

సీ వాల్మీకివ్యాసుల వన్నెలఁ దెలుగవే రామభారతసభారామసీమ? ఇట వాల్మీకివ్యాసులన్నచో 'కి' గురువై ఛందోభంగమయినది ఇట్టి దోషము లనఁగాఁ దెలుఁగుపదములలో సంయుక్తాక్షరమునకుఁ బూర్వాక్షరమును గురువు సేయుటయు సంస్కృతపదములలో సంయుక్తాక్షరమునకుఁ బూర్వాక్షరమును లఘువు సేయుటయు వీరి కవిత్వమునఁ దండోపతండములుగాఁ గానవచ్చును

సంస్కృతభాషలో వ్యస్తపదములలో రేఫ సంయోగమునకుఁ బూర్వాక్షరము క్వాచిత్కముగా లఘువుగా గనఁబడుచున్నది ఏకపదమున మాత్రము గాదు ఎట్లన, 'అనువ్రజ్య చక్రము' మొదలగుచోట్ల ను చ వర్ణములు గురువులే 'అల్పవ్యయేన సుందరి గ్రామ్యజనో మృష్టమశ్నాతి' అనుచో 'గ్రా'కుఁ బూర్వాక్షరమగు 'రి' వర్ణము లఘువు ఇట్టి లఘుత్వము క్వాచిత్కము అంతే కాని యీ యాచార్యులవారి వలె నాంధ్రపదమధ్య సంయుక్తాక్షరమునకుఁ బూర్వాక్షరమును గురువును, సంస్కృతపదమధ్య లఘువును జేసినవారు గానరారు

౧౮. పతత్ప్రకర్షము

కం. ఉతి నుత్కర్షము తక్కినఁ
బతత్ప్రకర్షంబు, గవయభల్లూకమృగీ
వితతివిభేదనగర్వా
యతసింహోభిలమీమహాటవి యనఁగన్.

ప్రారంభమునందలి యెత్తుగడ క్రమముగాఁ బడిపోవుట ఈ పద్యమునఁ బతత్ప్రకర్షదోషములేదు. ఈ క్రింది పద్యములుదాహరణీయములు.

సీ. ముంగాల సింగారముం గాల మేలు బంగారు రంగారు లంగా ధరించి
దబ్బకాయలఁ బూచి యబ్బగారనిపించు గబ్బిగుబ్బలఁ గంచుకంబుఁ దొడిగి

... ...

సీ కమనీయకింకిణీ ఘంటికాసాహస్రఘణఘణధ్వనిచేత గగన మగల
నన్యజనాలోకనాభీలతరళోగ్రకాంచనధ్వజపతాకలు వెలుంగఁ
బృథునేమిఘట్టనఁబృథివిఁ గంపింపంగ వలనొప్పఁబటుజవాశ్వములఁబూన్చి
నట్టి యున్నతరథం బ్రత్యుగ్రగతి నెక్కి కరసహస్రమున భీకరతరాసి.

ఈ పద్యములలోని మొదటి పద్యములోని మొదటి పాదమునందలి యెత్తుగడ రెండవపాదమున లేదు రెండవపద్యమునఁ గ్రమక్రమముగా మూఁడు నాలుగు పాదములలో మఱియును బడిపోయినది కొన్నియెడలఁ బతత్ప్రకర్షము గుణమే యగును.

ఎట్లన,

ప్రాగప్రాప్తనిశుంభశాంభవధనుర్ద్వేధావిధావిర్భవ
త్క్రోధప్రేరితభీమభార్గవ భుజస్తంభాపవిద్ధః క్షణాత్
ఉజ్జ్వాలః పరశుర్భవత్వశిథిలస్త్వత్కంఠపీఠాతిథిః
యేనానేన జగత్సు ఖండపరశుర్దేవో హరః ఖ్యాప్యతే

(మహావీరచరిత్రము)

శివధనుర్భంగముఁ జేసిన శ్రీరామునితోఁ బరశురాముఁడు క్రుద్ధుఁడై యిట్లనుచున్నాఁడు పూర్వ మెప్పుడును భంగమునొందని శివధనుస్సును (నీవు) రెండు తునియలు గావించుటచేఁ బైకుబికిన కోపముచేతఁ బ్రేరితమైన భయంకరుఁడగు భార్గవుని భుజాస్తంభమునుండి చలించిన యీ పరశువు మంటలు గ్రక్కుచు నీ కంఠపీఠమున కతిథియగుగాక. ఈ పరశువుచేత హరుఁడు లోకములలో 'ఖండపరశుఁడు అను పేరు వహించెను (హరుఁడు తన పరశువు యొక్క ఖండమును (అవయవమును) దనశిష్యుఁడగు పరశురాముని కిచ్చెనని పురాణ ప్రసిద్ధి.

ఇటఁ గుపితుఁడగు పరశురాముని వచనమున దీర్ఘసమాసమును బరుష వర్ణాడంబరత్వమును దగియున్నవి ఇందు మొదటి మూఁడు పాదములందును మొదటి యెత్తుగడకు భంగమురాలేదు నాల్గవపాదమున నా దీర్ఘ సమాస పరుష వర్ణాడంబరత్వములు లేమినిఁ బతత్ప్రకర్షము సంభవించినది. అయితే నాల్గవ పాదమునకు వచ్చునప్పటికిఁ బరశురామునికిఁ దన గురువగు హరుని స్మృతి గలుగుటచేఁ గ్రోధము శాంతిల్లినది కాన నట మసృణవర్ణబంధమే ప్రయుక్తమైనది. ఈ విధము దోషముగాక గుణమే యగును

ఇట నాల్గవపాదమున సమాప్తపునరాత్తరూపమగు దోషములేదా ? యని శంకింపఁ బనిలేదు. వాక్యము సమాప్తమైన పిమ్మట విశేషణాంతరము మాత్రము వేయఁబడినచో సమాప్తపునరాత్తదోషమగును. భిన్నవాక్యమే ప్రయుక్తమగుచో నీ దోషములేదు. ఇట నాల్గవపాదమున భిన్నవాక్యమే ప్రయుక్తమైనదికదా! కాన దోషముకాదు

౧౮. భిన్నలింగము, ౧౮. భిన్నవచనము

ఆ. వె. ఉవిదఁ బురుషుఁ బోల్ప, నొకనిఁ బల్వురఁ బోల్ప
భిన్నలింగమనఁగ భిన్నవచన
మనఁగఁ జెలఁగు; నింతి వనజారివలె నన
ఖడ్గమురగవరుల కరణి ననఁగ.

స్త్రీనిఁ బురుషునితోఁ బోల్చినచో భిన్నలింగదోషము, ఒకరినిఁ బలుమందితో బోల్చినచో భిన్నవచన దోషము ఇట్లుగాదు చెప్పవలసిన విధము.

ఉపమానోపమేయములు భిన్నలింగములలోనున్న భిన్నలింగదోషము భిన్నవచనములలోనున్న భిన్నవచనదోషమును సంభవించునని చెప్పవలయును ఎట్లన "తరుణి చంద్రునివలె నున్నది" ఇట నుపమేయమగు తరుణి స్త్రీలింగము. ఉపమానమగు చంద్రుఁడు పుంలింగము ఇది దోషము 'తరుణి చంద్రకళవలె నున్నది' అన్నచో దోషము నివృత్తమగును. "ఖడ్గము సర్పములవలె నున్నది" ఉపమేయమగు 'ఖడ్గము' ఏకవచనమున నున్నది ఉపమానమగు 'సర్పములు' అనుపదము బహువచనమున నున్నది (ఖడ్గము సర్పమువలె నున్నదన్నచో దోషము తొలఁగును) ఇది దోషము.

కొన్నియెడల నీ దోషములు దోషములుగావు. ఈ విషయమును దండి యిట్లు చెప్పుచున్నాఁడు

"న లింగవచనే భిన్నే న హీనాధికతే అపి
ఉపమాదూషణాయాలం యత్రోద్వేగో న ధీమతాం
స్త్రీవ గచ్ఛతి షండోఽయం వక్త్యేషా స్త్రీ పుమానివ ।
ప్రాణా ఇవ ప్రియోఽయం మే విద్యా ధన మివార్జితా
భవానివ మహీపాల దేవరాజో విరాజతే
అలమంశుమతః కక్షా మారోఢుం తేజసా నృపః
ఇత్యేవమాదిసౌభాగ్యం న జహాత్యేవ జాతుచిత్
అస్తి చ క్వచిదుద్వేగః ప్రయోగే వాగ్విదాం యథా
హంసీవ ధవళశ్చంద్ర స్సరాంసీవామలం నభః
భర్తృభక్తో భటశ్శ్వేవ ఖద్యోతో భాతి భానువత్
ఈదృశం వర్జ్యతే సద్భిః కారణం తత్ర చింత్యతాం"

ఏ యుపమానము విన్నచోఁ బండితులకు వెగటు గలుగదో యట లింగవచనభేద మున్నను న్యూనత్వాధిక్యాదు లున్నను దోషముగాదు ఎట్లన "ఈ కొజ్జావాఁడు స్త్రీవలె నడుచును (లింగభేదము) ఈ స్త్రీ పురుషునివలెమాటలాడును. (లింగభేదము) నా కితఁడు ప్రాణములవలెఁ బ్రియుఁడు (వచనభేదము) సంస్కృతమునఁ బ్రాణశబ్దము నిత్యబహువచనము) విద్య ధనమువలె నార్జింపఁ బడినది (లింగభేదము) ఓరాజా నీవలె నింద్రుఁడు వెలుఁగును (ఉపమానగత న్యూనత్వము అనఁగా న్యూనోపమానము) ఈ రాజు తన తేజస్సుచే సూర్యుని చంకలోని కెక్కుట కర్హుఁడు-అనగా సూర్యునితోఁ దుల్యుఁడు (ఉపమానగతాధిక్యము) ఇత్యాదులందు సౌభాగ్య మావంతయుఁ దగ్గకున్నది కొన్నియెడల నున్న యుపమానములు విన్నచోఁ బండితులకు వెగటు దోఁచుచున్నది. ఎట్లనఁ జంద్రుఁడు హంసివలెఁ దెల్లనివాఁడు (లింగభేదము) ఆకాశము సరస్సులవలె నిర్మలము (వచనభేదము) భటుఁడు శ్వానమువలె భర్తృభక్తుడు (ఉపమానగత

న్యూనత్వము) మిడుఁగురుపుర్వు సూర్యునివలె వెలుఁగును. (ఉపమాన గతాధిక్యము) ఇట్టిచో సౌభాగ్య మావంతయును లేదు కాన లోకప్రసిద్ధియున్నచో లింగవచనాదిభేద మున్నను దోషములేదు కావుననే యశస్సును గాంతగా నుపమించినను బండితుల కుద్వేగము గలుగ కున్నది లోకప్రసిద్ధి లేకున్నచో దోషమేయగును.

౨౦. అక్రియము లేక అశరీరము

కం. తుదలఁ గ్రియాశూన్యములగు
పదంబులశరీరమనఁగఁ బరగున్ విభవా
స్పదమగు మధుమాసంబున
బొదలుతరూత్కరము కుసుమపూర్ణమయి యనన్. ౭౯

క్రియాపదములేని వాక్యమశరీరము 'పొదలు' అను పద మిటఁగ్రియ కాదు తద్ధర్మార్థక విశేషణము. పొదలుచున్న తరూత్కరము' అని యర్థము. 'భాసిలును అను సమాపక క్రియ లుప్తమైనది దీనిని దర్పణకారాదులు "సాకాంక్షము" అనిరి.

గ్రంథకర్త వెనుకటి అపూర్ణము' అను దోషమును, ఈ యశరీరదోష ముల్యముగానే యుదాహరించెను అపూర్ణదోషమునకుఁ బ్రతాపరుద్రీయోదాహరణమే సరియైనదని చూపితిమి

౨౧. సంబంధవర్జితము

కం. సంబంధవర్జితంబగు
సంబంధము విడువఁ; గరులు శైలములు; తురం
గంబులు, భంగంబులు; సమ
రాంబుధివరతరణి యితని యసిలతయనఁగన్. ౮౦

ఇష్టమైన సంబంధము లేనిది సంబంధవర్జితము. 'సమరాంబుధివరతరణి అను సమాసమున గుణీభూతమైన 'సమరాంబుధి తో కరులుశైలములు తురంగములు, భంగములు అనువానికి సంబంధముండవలెను అనఁగా సమరమనునంబుధిలోఁ గరులు శైలములు ; తురంగములు తరంగములు; అసిలత తరణి అనునన్వయ మిష్టము. ఇట సమరాంబుధివరతరణి అను సమాసములో 'సమరాంబుధి' గుణీభూతమగుటచే వానితో సంబంధము సంభవింపకున్నది దీనినే దర్పకాదులు 'అభవన్మత యోగము' అనిరి 'ఇష్టసంబంధములేనిది' అని యీ పేరి కర్థము.

'సమరాంబుధివరతరణి' అని సమాసమును జేయక 'సమరాంబుధిన్' అని సప్తమ్యంతమును జేసినచో నీ దోషము రాదు.

౨౨. వాక్యగర్భితము

కం॥ నడుమనొక వాక్యపద్ధతి
తొడరిన నది వాక్య గర్భదోషము "ఖలులౌ
వెడమతులతోడి సంగతి
"కడుహిత మిది నీ" కొనర్పఁగావలదనఁగన్. ౪౧

ఒక వాక్యమున వేఱొక వాక్యమును దూర్చి చెప్పుట వాక్యగర్భిత దోషము. ఇట "ఖలులౌ వెడమతులతోడి సంగతి నొనర్పఁగావలదు" అను వాక్యమధ్యమున 'నీకిది కడుహితము' అను వాక్యాంతరము ప్రవేశించినది. ఇది దోషము. దీనిని దర్పణకార ప్రకాశకారాదులు గర్భితమనిరి.

ఈ వాక్యగర్భితదోష మొకానొకచో గుణమే యగును ఎట్లన,

"భవాన్యపహస్తితరేఖో నిరంకుశోఽథ వివేకరహితోఽపి
స్వప్నేఽపి త్వయి పునః "ప్రతీహి" భక్తిం న ప్రస్మరామి"

ఇది యొక భక్తుని ప్రార్థనము ఓ స్వామీ నే నపహస్తితరేఖుఁడను (మర్యాదను ద్యజించినవాఁడను) నిరంకుశుఁడను (ఉచ్ఛృంఖలుఁడను) వివేకరహితుఁడను (ధర్మాధర్మ శూన్యుఁగను) స్వప్నమునఁగూడ నీయందు "సత్యముగా నమ్ముము" భక్తిని మఱువను

ఇటఁగూడ 'ప్రతీహి'(సత్యముగా నమ్ముము) అను వాక్యము "స్వప్నమునఁ గూడ నీయందు భక్తిని మఱువను" అను వాక్యమునఁ జొచ్చినది అయినను నిట దోషముగాదు ఏలన, శపథముచేసి చెప్పుచున్నట్లు దృఢమైన నమ్మకము గలుగుటకై యీ వాక్యాంతర ముద్దేశింపఁబడినది అంతకుమున్ను మర్యాద లేక యుచ్ఛృంఖలుఁడై వివేకరహితుఁడై ప్రవర్తించినవాఁడు భగవంతునికి దృఢప్రత్యయము గలిగింపవలసియున్నదిగదా। కావున శపథముచేసి చెప్పుచున్నట్లు తనమాట ముమ్మాటికిని సత్యమని నమ్మించుటకు 'ప్రతీహి' అను వాక్యాంతరమును నడుమఁ బ్రయోగించెను కావున నిది యిట గుణమే కాని దోషముగాదు అయితే పై నరసభూపాలీయోదాహరణ మగు "ఖలులౌ। వెడమతుల తోటి సంగతి కడు హితమిది నీ కొనర్పఁగావలదనఁగన్" అను చోట మాత్ర మిట్లే సమాధాన మేల చెప్పుకొనరాదు? అని శంకింపవచ్చును ఇట నట్లు పొసఁగదు ఏలన నిటఁ బ్రసిద్ధమగు నర్థమునే యుపదేశించుచున్నాఁడు ప్రసిద్ధార్థము నుపదేశించునపుడు దాని కుపపత్తులతోఁ బనిలేదు.

'భవామ్యపహ స్తితరేఖః' అను శ్లోకమున నుచ్ఛృంఖలుఁడుగాఁ బ్రవర్తిల్లినవాఁ "డిఁకముందు నీ భక్తిని విస్మరింపను" అని చెప్పునపుడు స్వామికి నమ్మకము పుట్టించుటకై చెప్పవలసిన విధమున నిటఁ జెప్పఁబనిలేదు గదా! కాన నరస భూపాలీయ పద్యమున దోషమే. ఇట్లే

ఉ. అతఁడు మొన్న నున్నతమదాంధత మాపురికేగుదెంచి యా
పోతరమేమి చెప్ప? ననుఁబూరికిఁ గైకొనక పస్రరోవధూ
వ్రాతనిశాతపాణిరుహవారసలాలన నవ్యపల్లవం
బై తనరారు నందనమహావనిలో విడియించె సేనలన్
—ప్రభావతీ ప్రద్యుమ్నము

మాపురికేగుదెంచి ననుఁ బూరికి గైకొనక — అను వాక్యమధ్యమున "ఆపోతర మేమి చెప్ప!" అను వాక్యము చొచ్చినది. ఇది గుణమే. ఏలనఁ దెలియని కృష్ణునికి వజ్రనాభుని దర్పాతిశయమున నింద్రుఁడు బోధించుచున్నాఁడు.

వాక్యసంకీర్ణదోషమున వాక్యమున వాక్యాంతరపదములు ప్రవేశించినవి ఇట వాక్యమున వాక్యాంతరమే ప్రవేశించెను.

ప్రతాపరుద్రీయమున 'శబ్దహీనము, విసర్గలుప్తము' అని మఱి రెండు దోషములు గలవు ఆంధ్రమున వాక్యమున విసర్గలుప్తదోషము సంభవింపదు కాన దానిని విడువవచ్చును శబ్దహీనమున శబ్దశాస్త్రవిరుద్ధమైనది. చ్యుత సంస్కారము పదదోషము శబ్దహీనదోషము వాక్యదోషము "ఈరాజసింహుఁడు శూరుఁడు" ఉపమితసమాసమున సామాన్యధర్మవాచకపదమును ప్రయోగింప రాదు. 'రాజా సింహ ఇవ (శూరః) రాజసింహః-రాజసింహుఁడు. ఇది యుపమిత సమాసము. ఈ రాజసింహుఁడు శూరుఁడు' అనుచో సాధారణ ధర్మవాచకమగు 'శూర' పదము ప్రయోగింపఁబడినది సాధారణధర్మవాచకమును బ్రయోగిం చినచో సమాసమును జేయక వ్యస్తముగానే యుంచవలెను ఎట్లన, "ఈ రాజ సింహమువలె శూరుఁడు" కానఁ బై వాక్యము (రాజసింహుఁడు శూరుఁడు) శబ్దహీన దోషగ్రస్తము

ఆంధ్ర ప్రతాపరుద్ర యశోభూషణమున వ్యాకరణశిరోమణి కిలమదిర్ల రంగాచార్యులవారిశబ్దహీనదోషమునకు 'మేము అడవులంపాలై చెడిరి' అనుదాని నుదాహరించిరి 'మేము చెడిరి' అని చిన్నపిల్లలు గూడ మాటలాడరు. ఆచార్యులవారికిదోషతత్త్వమర్థము కాలేదు సంస్కృత ప్రతాపరుద్రీయమున 'న సంశృణుమహే హంత! హితమాప్తైర్నిమంత్రితం' అని 'సం' పూర్వక 'శ్రు' ధాతువాత్మనేపదమగుననియు నతతి కర్మవాచక ముపయోగింపఁబడుటచే దోషమనియు నుదాహరింపఁ బడినది. దీనివలన నిది సామాన్యజ్ఞానమునకు గోచరించు దోషము గాదనియు విశేషజ్ఞానమునకు

గోచరించు దోషమనియు గుర్తెఱుంగవలెను. కాన 'న సంశృణుమహే' ఇత్యాది వంటిదిగాదు 'మేము చెడితి' అనునది. కావున వ్యాకరణశిరోమణిగారి వ్యాకరణ దోషప్రయోగము ప్రామాదికము.

సాహిత్యదర్పణమున ౨౩ దోషములను గావ్యప్రకాశమున ౨౧ దోషములును నిర్ణయింపబడినవి. సాహిత్యదర్పణమున విసంధిదోషభేదములను మూఁటినిఁ బ్రత్యేకముగా గణించెను. ప్రకాశకారుఁ డొక్కటిగానే గణించెను.

ఇందు లేనివియు దర్పణ ప్రకాశములలో నున్నవియునగు మఱిమూఁడు వాక్యదోషములను గూడఁ జూపుదుము.

౧ హతవృత్తము

రసానుకూలముగాని వృత్తమును స్వీకరించుట యెట్లన.

శ్లో॥ హా నృప హా బుధ। హా కవిబంధో। విప్రసహస్రసమాశ్రయ। దేవ।
ముగ్ధవిదగ్ధసభాంధవరత్న క్వాసి గతః క్వ వయం చ తవైతే॥

అయ్యో రాజా। హా పండితా। హా కవిబాంధవ। హా దేవ। నీ వెట నున్నావు? నీ వారమగు మే మెట నున్నారము?

ఒకరాజు మరణింపఁగా నాతని బంధుజాలము దుఃఖించుచున్నమట్టము ఇటఁ గరుణరసము. ఈ దోధకవృత్తము హాస్యరస వ్యంజకము. కరుణమునకుఁ దగిన వృత్తములు వియోగినీమందాక్రాంతా పుష్పితాగ్రిమలు. శృంగారమునకుఁ జంపక, మత్తేభ కంద గీతాదులు రౌద్ర వీరములకు శార్దూలములు మొ.

ఆంధ్రమునఁ బూర్వకవు లెవ్వరును నీవృత్తములకును రసములకును సంబంధమును గలుపలేదు. సామాన్యముగా వీర రౌద్రములకు మత్తేభ శార్దూలములు వాడిరి. కానీ శృంగారాదులకుఁగూడ నావృత్తములను వాడిరి. మొత్తముమీఁద నాంధ్రమున రసనియమము లేకుండనే వృత్తములను వాడిరి. కాని పై యుదాహరణమున వలెఁ గరుణాదులలో హాస్యాదివిరుద్ధ రసవ్యంజకములగు వృత్తములను వాడి రసదోషమును జేయలేదు. ఏలనఁ గవులెల్లరును గ్వాచిత్కముగా తురంగప్రయాతము, పృథ్వీవృత్తము మొదలగువానిని వాడినను నత్యధికముగా ఉత్పలమాల చంపకమాల మత్తేభము శార్దూలము కందము గీతము, ఆటవెలఁది సీసము అను నీ యెనిమిది వృత్తములనే వాడిరి. ఏయే రసముల కేయే వృత్తములను వాడవలెనో క్షేమేంద్రుని సువృత్తతిలకము సూచించును.

౨ ప్రసిద్ధిత్యాగము (ప్రసిద్ధిహతము)

"మంజీరాదిషు రణితప్రాయం పక్షిషు చ కూజితప్రభృతి
స్తనితమణితాది సురతే మేఘాదిషు చ గర్జిత ప్రముఖం"

మంజీరవలయాదిభూషణధ్వనికి రణిత మనియు, పక్షుల ధ్వనికిఁ గూజిత మనియు సురతధ్వనికి స్తనితమణితము లనియు మేఘసింహధ్వనికి గర్జితమని యను లోక ప్రసిద్ధి ఇట్లే రశనావీణాదిధ్వనికిఁ గ్వణితము ఘంటానూపురాది ధ్వనికి శింజితము, భ్రమరధ్వనికి గుంజితము మండూకధ్వనికి రవము సముద్ర ధ్వనికి ఘోషము మృదంగాదులధ్వనికి ధ్వనితము గజధ్వనికి ఘీంకారము, బృంహితము తురగధ్వనికి హేషితము, పటహధ్వనికారవము వృషభధ్వనికి డేక్కారము సర్పధ్వనికి ఫూత్కారము కపిధ్వనికి బూత్కారము, ఘూక ధ్వనికి ఘూత్కారము, అగ్నిస్ఫులింగధ్వనికి చటత్కారము, భంగధ్వనికి (చెట్లు మొదలగువాని విఱుగు నప్పటి చప్పుడు) కటత్కారము, బాణధ్వనికి సూత్కారము మురజధ్వనికి ఘుమఘుమారవము భేరీధ్వనికి భాంకారము, మయూరధ్వనికిఁగేకారవము క్రేంకారము కామినీధ్వనికి సీత్కారము కింకిణీ ధ్వనికి ఝుంకారము మౌర్వీధ్వనికి టంకారము నదీతరంగ ధ్వనికి ఘోషము అని ప్రసిద్ధి. ఈ ప్రసిద్ధినిఁ బరిత్యజించుట ప్రసిద్ధిత్యాగము

కాని లోకమునఁ గోకిలారవము నూపురరవము మొదలగుచోటుల మండూకధ్వనియందుఁ బ్రసిద్ధమగు రవశబ్దము ప్రయుక్తమై యున్నది. స్తనితశబ్దము "స్తనితం గర్జితం మేఘనిర్ఘోషో రసితాది చ" అనుచో మేఘ ధ్వనిగాఁ బ్రయుక్తమైయున్నది. అట్లే భ్రమరధ్వనికి ఝుంకార మనియు వ్యవహారముగలదు ఈ ప్రసిద్ధి త్యాగరూపమగు దోషము సార్వత్రికముగా కవులు గణింపలేదు మణిత గర్జిత గుంజితాదులను మాత్రము ప్రసిద్ధమగు నరముననే వాడిరి

ఇట్లే యాంధ్రభాషలోఁ గూడఁ బశుపక్ష్యాది ధ్వనులకుఁ బ్రసిద్ధమగు ననుకరణశబ్దములు గలవు వానినిఁ గూడ నిటఁ జూపుదును

౧ కప్పలు బెకబెకలాడును, గరరవరట్, కురరవరట్ అనును.

౨. పంది గుఱుపెట్టును, ముర్గరించును.

౩ సింహము బొబ్బరించును; గర్జించును.

౪. పులి గాండ్రించును.

౫. గుఱ్ఱము సకిలించును

౬ ఏనుఁగు ఘీంకరించును

౭. ఎద్దు ఱంకెవేయును

౮. గాడిద యోండ్రపెట్టును.

౯ పిల్లి మ్యావనును

౧౦. కుక్క మొఱుగును

౧౧. కోళ్ళు కేరును · కొక్కొ-రొకో యనును.

౧౨ కొంగలు కొంగొంగురనును

౧౩ పాములు బుసకొట్టును

౧౪ మేఁకలఱచును.

౧౫. ఎలుకలు కిచకిచలాడును, గురగురలాడును.

౧౬ తుమ్మెదలు ఝుమ్మనును.

౧౭ చీము చిటుక్కు-మనును

౧౮ కోయిల కో కో యనును.

౧౯ చిలుకలు కూయును

౨౦ గుడ్లగూబ కుహూకుహూ యనును

ఇంకను గొన్ని క్రియలకుఁగూడ ననుకరణశబ్దములు కలవు. చూడుఁడు

నవ్వుట-కిశాకిశ నవ్వుట కవకవ నవ్వుట పకపక నవ్వుట కిలకిల నవ్వుట, కలకల నవ్వుట ముసిముసి నవ్వుట కిచకిచ నవ్వుట, వికవిక, వికావిక నవ్వుట (విరుద్ధముగా నవ్వుటకు)

అల్లుట-అల్లిబిల్లి నల్లుకొనుట చీకిలిమాకిలిగానల్లుట

ఆడుట-అల్లలనాడుట అల్లలాడుట జవజవలాడుట చెంది చెకవికలాడుట.

సుర్రుక్కు-ట-సురసురసుర్రుక్కు-ట.

మాఁడుట-మలమలమాఁడుట

వేఁగుట-చిటపిటవేఁగుట పెటపెటవేఁగుట.

మండుట-భగ్గునమండుట,

మ్రోఁగుట-గల్లున మ్రోఁగుట గలగల మ్రోగుట గుభగుభ మ్రోఁగుట గణగణ మ్రోఁగుట

ఏడ్చుట-హోరున నేడ్చుట బావురని యేడ్చుట, కావుకావురని యేడ్చుట, గొల్లున నేడ్చుట వలవల యేడ్చుట

చొచ్చుట-దురదురని చొచ్చుట, దడదడ చొచ్చుట.

పొక్కు-ట-పురపుర పొక్కు-ట,

కాఱుట-జోటజోట కాఱుట

చినుకు పడుట-చిటపట చినుకులు పడుట,

రాలుట-జలజల రాలుట గులగుల రాలుట

ఉడుకుట-తుకతుక, కుతకుత తెకతెక యుడుకుట,

కూయుట-కలకల, కొలకల కూయుట,
తెల్లవాఱుట-బల్లన తెల్లవాఱుట, బలబలమని తెల్లవాఱుట,
కొఱుకుట-పటపట కొఱుకుట, పెటపెట కొఱుకుట,
పడుట-గభాలున పడుట
చూచుట-చురచుర చూచుట,
చుట్టుకొనుట-ముసముసమని చుట్టుకొనుట,
కొట్టుకొనుట-తటతట కొట్టుకొనుట పటపట కొట్టుకొనుట, పెటపెట కొట్టు
కొనుట,
మెఱయుట-ధగధగ మెఱయుట,
ఝల్లుమనుట-గుండెలు ఝల్లుమనుట
త్రిప్పుట-గిరగిర త్రిప్పుట
మరగుట-నీరు కళపెళ మరుగుట
పొంగుట-బుసబుస పొంగుట
ద్రాఁగుట-సలసల ద్రాఁగుట
జాఱుట-జరజర జాఱుట మొ

మఱి కొన్ని శబ్దము లనుకరణములవలె నుండి యర్థవిశేషమును బోధించును. ఎట్లన-

సొంపు సొటసొటవోవు = అందము తఱుగు,
చిత్తము వకావక లగు = మనస్సు వెదరు
మేను నకనకలాడు = మేను కృశించు.
మాటలు తొకతొక లై వెడలుట-మాటలు ఆఁగి ఆఁగి వచ్చుట

కొన్ని యెడల నా యా వస్తువ్యాపారము లనుకరణముచేఁ జెప్పఁబడును.
కస్తూరి ఘుగఘుగలు బంగారు నిగనిగలు, మెఱుపుల తళతళలు;
గర్వపు మిటమిటలు, మేని చకచకలు, మొ

౬. అమతపరార్థము

ప్రకృతవిరుద్ధమగు పరార్థము గల దోషము.

రామమన్మథశరేణ తాడితా దుస్సహేన హృదయే నిశాచరీ
గంధవద్రుధిరచందనోక్షితా జీవితేశవసతిం జగామ సా.

ఆ నిశాచరి (తాటక) దుస్సహమైన శ్రీరాముఁ డను మన్మథుని యొక్క బాణముచే హృదయమునఁ గొట్టఁబడినదై వాసనగల రక్తము వంటి చందనముచే దడిసినదై జీవితేశప౯తికి (యమసదనమునకు-ప్రియుని గృహమునకు) వెళ్ళెను.

'తాటక రామబాణముచేఁ గొట్టఁబడినదై యమలోకమునకుఁ బోయెను. అనునది ప్రాకరణికార్థము. అభిసారికారూపార్థము ప్రాకరణికము ఇందుఁ బ్రకృతరసమగు బీభత్సమునకు విరుద్ధమగు శృంగారముతో సమావేశము చేయఁబడినది ఇది దోషము (విరుద్ధరస సమావేశఘట్టమున నున్న దీని వివరణమును జూడవలెను.)

శృంగారబీభత్సములు వీరభయానకములు రౌద్రాద్భుతములు హాస్యకరుణములును విరుద్ధరసములు. వీనికి సమావేశము గూడదు.

అర్థదోషములు.

కం. క్రమమున నిఁక నర్థజదో
షముల నెఱింగింతు సుకవిజనులకు హీనో
పమ, మధికోపమ, మసమో
పమ, మఖ్యాతోపమంబు, పరుషము, మఱియున్. ౪౨

గీ. వ్యర్థ, మేకార్థము, ససంశయం, బపక్ర
మము, విరుద్ధంబు, విరసా, తిమాత్ర, హేతు
రహిత, నిరలంకృ, తాశ్లీల, సహచరచ్యు
తములు, భిన్నంబు నన వీని క్రమమొనర్తు ౪౩

౧. హీనోపమము ౨ అధికోపమము ౩ అసమోపమము ౪ అఖ్యాతోపమము, ౫ పరుషము ౬. వ్యర్థము, ౭. ఏకార్థము ౮. ససంశయము, ౯ అపక్రమము, ౧౦ విరుద్ధము ౧౧ విరసము ౧౨. అతిమాత్రము, ౧౩ హేతురహితము ౧౪ నిరలంకృతము ౧౫. అశ్లీలము, ౧౬. సహచరచ్యుతము, ౧౭ భిన్నము — అని యర్థదోషములు పదునేఁడు

౧. హీనోపమము- ౨. అధికోపమము

గీ. ఉర్వి ఘను నల్పుఁ బోల్ప హీనోపమంబు;
శ్వానమునుబోలె నితఁడు విశ్వాసి యనఁగ,
వరయ నధికోపమం బల్పు నధికుఁబోల్పఁ
బునకపట్టిన పేనికుఁ బోలు ననఁగ, ౪౪

ఘనుని నల్పుతోఁ బోల్చిన హీనోపమము అల్పుని నధికునితోఁ బోల్చిన నధికోపమము ఇట్లుకాదు అనల్పవస్తువు నల్పవస్తువుతోఁ బోల్చిన

హీనోపమము, అల్పవస్తువు ననల్పవస్తువుతోఁ బోల్చిన నధికోపమము అని చెప్పుకొనవలెను.

'ఇతఁడు శ్వానమువలె విశ్వాసి' శ్వాన మల్పవస్తువు ఇతఁడు' అనల్ప వస్తువు ఇది హీనోపమము "ఫనకపట్టిన పేను ఈశ్వరునిఁ బోలును." అనుచోఁ 'పేను' అల్పవస్తువు 'ఈశ్వరుడు' అనల్పవస్తువు ఇది యధికోపమము

౭. అసమోపమము-౮. అఖ్యాతోపమము

గీ. ఉపమ సరిపోని దిల ననసమోపమంబు
హాలధరుఁడు మేరుగిరివోలె నలరు ననఁగ
విను ప్రసిద్ధంబుగాని దవిశ్రుతోప
మంబు వదనంబు కుముదంబుమాడ్కి యనఁగ. ౪౫

పొత్తిగాఁ బోలిక కుదరనిదసమోపమము. హాలధరునకు (బలరామునకు) మేరుగిరితో సామ్యము పొత్తుగా లేదు ఏలన బలరాముఁడు దెల్లనివాఁడు. నల్లని వలువలు దాల్చువాఁడు మేరుపర్వతము బంగారపుఁ గొండ పచ్చనిరంగు గలది కావునఁ బోలికయే లేదు. కాన నిది యసమోపమము అప్రసిద్ధమైన యుపమ యఖ్యాతోపమము "మొగము కుముదమువలెనున్నది." ముఖ కమలములకు సామ్యము గలదు అది ప్రసిద్ధము ముఖకుముదముల కప్ర సిద్ధము. ఇది యఖ్యాతోపమము ఇట్టిదే "గ్రథ్నామి కావ్యశశినం వితతార్థరశ్మిం" అర్థములను కిరణములు గల కావ్యమను చంద్రునిఁ గూర్తును (వ్రాయుదును.) అనుచోటఁ గావ్యచంద్రులకును అర్థకిరణములకును సామ్యమప్రసిద్ధము.

౯. పరుషార్థము

కం. పరుషార్థంబులు గల యది
పరుషంబను దోషమయ్యెఁ; బరగెడు నీ భూ
వరుసౌందర్యమునకుఁ వే
మఱు సరియౌ మంటఁబడ్డ మదనుం డనఁగన్. ౪౬

అతిపరుషమైన యనఁగా రూక్షమైన యర్థముగలది పరుషదోషమనఁ బడును. ఈరాజుయొక్క సౌందర్యమునకు మదనుఁడు వేమాఱులు మంటఁ బడినచో సరియగును బంగారమును బుటము వెట్టినకొలఁదియు దానికి వన్నె హెచ్చువిధమున వేమాఱులు మంటఁబడినచో మన్మథుఁడు మిక్కిలి సౌందర్య మును వహించును. అప్పుడీ రాజును బోలును అని భావము ఇట భావము

బాగుగా నున్నను 'మంటఁబడ్డ' అను పదము రూక్షముగా ననఁగా శ్రుతి కటువుగా నున్నది. ఇట శబ్దమే శ్రుతికటువుగా నున్నది. ఇది శబ్దదోషమే యనుట లెస్స.

౬. వ్యర్థము. ౭. ఏకార్థము

ఆ. వె. అప్రయోజనంబు వ్యర్థమౌ; ఫేనిలం
బైన జలధిదాఁటె ననిలతనయుఁ
డన; నభిన్నవాక్యమరయ నేకార్థమౌ
సుగుణఖని చరిత్రశోభియనఁగ. ౫౭

ప్రయోజనములేని యర్థము వ్యర్థము "అనిలతనయుఁడు ఫేనిలమగు (నురుగుగల) జలధిని దాఁటెను" అనుచో 'ఫేనిలము' అను విశేషణము వ్యర్థము ఇట్లే,

గీ. త్రిక్కిఱియు కొమ్మలాశల కెక్కఁ చలువ దట్టమగు నీడపందిళ్లు గట్టుచుండ.

చలువపందిళ్లన్నఁ జాలును. మిగిలినది వ్యర్థము. ఇది మహాకవి ప్రొఫెసరు రాయప్రోలు సుబ్బారావుగారి ప్రయోగరత్నము

ఒకే యర్థముగల వాక్యమునుగానీ పదమునుగానీ మఱలఁ బ్రయోగించుట యేకార్థము 'సుగుణఖని' అన్నను 'చరిత్రశోభి' అన్నను నేకార్థకమే.

గీ పదియునాల్గు వసంతముల్ వదలనట్టి
వయసు సొగసుందనం బామెపయి నెసంగ
బాల్యమెడలిన గదియు జవ్వనపుఁబసలు
ఒదలియం దందముగ నుట్టిపడుచు నుండె

ఇటఁ బూర్వోత్తరార్థములేకార్థములే. ఇదియు సాహిత్యస్థాపక ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారిదే. ఈ వ్యర్థదోషమును దర్పణకార ప్రకాశకారాదు లపుష్టమనియును ఏకార్థమును బునరుక్తమనియును వ్యవహరించిరి.

వామనుఁడీ క్రిందిస్థలములందీ దీ యేకార్థ వ్యర్థదోషములు దోషములు గావని తెలుపుచున్నాఁడు. వీని నెల్లరును స్వీకరించిరి ఎట్లన,

'ధనుర్జ్యాధ్వని' అనుచోట 'జ్యా' శబ్దముచేతనే 'ధను' శ్శబ్దార్థము గతార్థ మగుచుండ మఱల ధనుశ్శబ్దము ప్రయోగించుటవలన, 'ధనుస్సునెక్కిడిన యల్లెత్రాడు" అని యర్థవిశేషము దోఁచును

కర్ణావతంస, శ్రవణకుండల, శిరశ్శేఖరాది పదములలో "అవతం" సాది పదములచేతనే తత్తదలంకారములని యర్థము దోఁచుచుండఁగాఁ గర్ణాది శబ్ద

ప్రయోగము తత్సాన్నిధ్య రూపవిశేషార్థమును దెలుపును అనఁగా గర్ణాదులందు నిబద్ధములై యున్న యవతంసాదులని యర్థమగును

'ముక్తాహారం' శబ్దమున హారశబ్దముచేతనే గతార్థమగుచుండఁగా 'ముక్తా' శబ్దము శుద్ధములైన ముత్యములు అను నర్థవిశేషమును దోఁపించును.

'పుష్పమాలా' పదమున 'మాలా పదముచేతనే గతార్థమగుచుండఁ బుష్పశబ్దము శ్రేష్ఠములైన పుష్పములు అని యరవిశేషమును దెలుపుచున్నది

'కరికలభ శబ్దమునఁ గలభ శబ్దముచేతనే గతార్థమగుచుండఁ గరిశబ్దము 'తన రూపమువంటి రూపముగల' అను విశేషార్థమును బోధించును (కరి= ప్రౌఢకుంజరము ; తద్రూపమగు కలభము కరికలభము) అయితే యీవిధముగా నెల్లయెడలను యత్కించిద్విశేషమును జెప్పుకొనవచ్చునుగదా అప్పుడేదియు దోషమే కాదనవలసివచ్చుచున్నది కానఁ గావ్య ప్రకాశకారుఁడు "స్థితే ష్వేతత్స మర్థనం" (పూర్వప్రయోగము లుండఁగా నిట్లు సమర్థింతుము కాని యెల్లయెడల నిట్లు చెప్పుకొనరాదు.) "న ఖలు కర్ణావతంసాదివత్ జఘనకాంచీ ఇత్యాది క్రియతే" (కర్ణావతంసమన్నట్లు జఘనకాంచీ ఇత్యాది ప్రయోగములు ప్రయో గింపరాదు) అని నూతన ప్రయోగములకు ననుజ్ఞ నీయక తిరస్కరించెను

౮ ససంశయము.

కం. క్రమమతి పదములు సంది
గ్ధములైన ససంశయంబు; ధరణీవరు ధై
ర్యము నగము గెల్చు ననఁగా
నమరెడు సతిమేను మించు హసియించు ననన్. ౪౮

వాక్యము నందలి కర్తృకర్మములయందు సంశయము గలిగి తన్మూలమున నర్థమున సంశయముగలుగుట దోషము. "ధరణీవరు ధైర్యము నగము గెల్చు" "సతిమేను మించు హసియించు" అను వాక్యములలో ధైర్యనగములు' అను చోటను, 'మేనుమించులు అనుచోటను గర్తయేదో, కర్మయేదో నిర్ణయింప రాకున్నది, కాన సంశయము దీనిని దర్పణకార ప్రకాశకారులు సందిగ్ధమనిరి.

కాని యిట్టియెడలఁ బ్రకరణమువలన సంశయము దొలఁగును రాజవర్ణన ప్రకరణమున "ధరణీవరు ధైర్యము నగముగెల్చు" అని యున్నచో ధైర్యము కర్తయు నగము' కర్మ యని తెలును. స్త్రీవర్ణనప్రకరణమున 'సతిమేను' కర్తయనియు మించు' కర్మ యనియు నిస్సంశయముగాఁ దెలును ప్రకరణము లేనపుడే యిది దోషము ప్రకరణమున్నచో దోషముగాదు.

౯ అపక్రమము

వాక్యదోషములలో 'అక్రమ' దోషము శబ్దార్థభేదముచే ద్వివిధమని చెప్పి యర్థాక్రమమును నుదాహరించియుంటిమి "తురంగ మథ మాతంగం ప్రయచ్ఛాస్మై మదాలసం" అనుదానినిఁ జూచుకొనవలెను

ఈ యపక్రమ దోషము శాస్త్రవిరుద్ధరూపముగాఁ గూడ నుండును ఎట్లన,

'కారయిత్వా క్షౌరం గ్రామవృద్ధో మంక్త్వా భుక్త్వా చ
నక్షత్రం తిథివారౌ జ్యోతిషికం ప్రష్టుం చలితః"

గ్రామవృద్ధుడు క్షౌరమును జేయించుకొని స్నానమాడి భుజించి తిథివార నక్షత్రములు దెలిసికొనుటకై జ్యోతిషికునికడకు బయలువెడలెను.

ఇటుఁ దిథివారాదులు దెలిసికొని క్షౌరమును జేయించుకొనుట శాస్త్ర సంప్రదాయము విపరీతముగాఁ జేయుట యపక్రమము

౧౦ విరుద్ధము

కం. క్రమమెడలి దేశకాలా
సముచితము విరుద్ధమయ్యెఁ, ''సమదవిలోల
భ్రమరము చంపకవన'' మన
'సముదంచితకైతకంబు చైత్రం' బనఁగన్ ౪౯

దేశకాలాదుల కుచితముగానిది యనఁగా లోకవిరుద్ధమైనది విరుద్ధదోషము. దర్పణకార ప్రకాశకారులు దీనినిఁ బ్రసిద్ధివిరుద్ధమనిరి చంపకమువకును భ్రమరమునకును విరోధము ప్రసిద్ధము. కానఁ జంపకవనమున భ్రమరము చరించుచున్నదన్నచో దోషము ఇది కవిసమయవిరుద్ధము కైతకము (మొగిలి) చైత్రమాసమున నుండదు ఇది కాలవిరుద్ధము దేశవిరుద్ధమన "దక్షిణదేశమున హస్తినాపుర మను పట్టణము గలదు" అనునది "వయసు మొగ్గలుదొడిగిన వయసుటనఁటి" ఇది స్వభావవిరుద్ధము (ఇది కవిభూషణ రాయప్రోలు సుబ్బారావుగారి ప్రయోగము) అరఁటి మొగ్గలు దొడఁగదు. 'అరఁటి పువ్వు వేసె ననవలెను ఇట్లే ధర్మ అర్థ,కామ, మోక్షశాస్త్రవిరుద్ధములగు దోషములను దెలిసికొనవలెను

లోకవిరుద్ధములయినను గవిసమయప్రసిద్ధములయినచో నుపాదేయములే యగును. ఎట్లనఁ గీర్తి తెల్లఁగానుండుట లోకప్రసిద్ధము గాకున్నను గవిసమయ

ప్రసిద్ధము కాన నుపాదేయమే యగును. * కవిసమయముల నీ క్రింద నుదాహరింతుము. చూచుకొనుఁడు

---

*కవిసమయములు

సమయ మనఁగా సంప్రదాయము. అనగా నాచారము లేక మర్యాద ఈ సంప్రదాయములు దేశాచారములవలె నెప్పుడో యేర్పడినవి సంఘముతో సంబంధమున్నంతవఱకు దేశాచారములను జనులు పాటింపవలసిన విధమునఁ గవులును నౌచిత్యముతో సంబంధము గలిగియుండవలసినపుడు వీనినిఁ బాటింప వలసినదే. నేఁడు వీనిని మార్పవీలులేదు మార్చినచో భాషయే తలక్రిందు లగును. ఔచిత్యదృష్టితోఁ గ్రొత్తవాసని సృష్టించుకొనవచ్చును.

ఈ సమయములు మూఁడు విధములు ౧ ఉన్న ధర్మమును నిబంధింప కుండుట ౨. లేని ధర్మమును నిబంధించుట, ౩ నియతముగాఁ గొన్నింటికిఁ గొన్నియెడలనే యునికిని నిబంధించుట.

ఈ క్రింది వస్తువులందున్నను నాయా ధర్మములను నిబంధింపరాదు.

౧ మాలతీలత వసంతమునఁ బుష్పించుచున్నట్లు వర్ణింపరాదు.
౨. చందనద్రుమములకు ఫల పుష్పములున్నట్లు ,,
౩. అశోకమునకు ఫలమున్నట్లు ,
౪ కృష్ణపక్షమున వెన్నెల యున్నట్లు ,
౫. శుక్లపక్షమున నంధకారమున్నట్లు ,
౬. మల్లెమొగ్గలకును గాముకుల దంతములకును (తాంబూల చర్వణముచే నెఱ్ఱఁదనమున్నను) వర్ణింపరాదు.
౭. కమల ముకుళములకుఁ బచ్చఁదనమున్నను ,,
౮ ప్రియంగు పుష్పములకుఁ ,,
౯. పగటిపూట నీలోత్పలవికాసమును ,,
౧౦ పగటిపూట వావిలిచెట్టు పూలు రాలిపోయినట్లు ,
౧౧ స్త్రీలకు నల్లఁదనమును స్తనపాతమును ,

ఈ క్రింది వస్తువులందు లేని ధర్మమును నిబంధింపవచ్చును

౧. నదులయందుఁ బంకజనీలోత్పలాదులు లేకున్నను వర్ణింపవచ్చును.
౨. ప్రతితటాకమునందును హంసల లేకున్నను ,,
౩. ప్రతిపర్వతమునందును బంగారము, రత్నములు, గజములు లేకున్నను వర్ణింపవచ్చును
౪. చీకటిని ముష్టిగ్రాహ్యమనియు (పిడికటితోఁబట్టఁదగినది) సూచీభేద్యమనియు (సూదులచేఁ భేదింపఁదగినది.) వర్ణింపవచ్చును.

౫ ఆకాశగంగలో దిగ్గజములు స్నానమాడుచున్నట్లు వర్ణింపవచ్చును.
౬. ప్రతాపమున రక్తత్వము ఉష్ణత్వమును
౭. వెన్నెలనునంజలి గ్రాహ్యముగాఁ (దోసిళ్ళతోఁదీసి యెత్తఁదగినది) గుంభోప వాహ్యముగా (కడవలతోఁ ముంచుకొని పోఁదగినది) వర్ణింపవచ్చును.
౮. పురాతనుఁడైనను శివుని శిరశ్చంద్రుని బాలునిగా ,,
౯. కీర్తిని పుణ్యమును, హాసమును దెల్లగా ,,
౧౦ అపకీర్తిని పాపమును నల్లగా ,,
౧౧. కోపమును అనురాగమును నెఱ్ఱగా ,,
౧౨. స్త్రీకి రోమావళి త్రివళులు (లేకున్నను) ,,
౧౩. చక్రవాక దంపతులకు రాత్రి వియోగము గలుగునట్లు ,,
౧౪. చంపకభ్రమరములకు విరోధమున్నట్లు ,,

ఈ క్రిందియెడల నాయా ధర్మములు నియతములుగా నుండును.

౧. సముద్రమునందే మొసళ్ళను వర్ణింపవలెను
౨. తామ్రపర్ణీనదియందే ముత్యములు లభించునట్లు వర్ణింపవలెను
౩ హేమంతశిశిరములను విడిచి సర్వదా కమలములుండునట్లు వర్ణింపవలెను
౪. ధ్వజ చామర హంస హార బక భస్మములకుఁ దెల్లఁదనమే వర్ణింపవలెను.
౫. శైల వృక్షాది మేఘ, సముద్ర లతలకును, రాక్షస ధూప పంక, కేశ ములకును నల్లఁదనమే వర్ణింపవలెను
౬. మలయ పర్వతమునందే చందనవృక్షముల యుత్పత్తిని వర్ణింపవలెను.
౭. హిమవత్పర్వతమునందే భూర్జవృక్షముల యుత్పత్తిని ,,
౮. వసంతముననే కోకిల ధ్వనిని ,,
౯. వర్షాకాలమునందే మయూర నృత్యమును, వాని కేకలును ,,
౧౦. విశేషించి చెప్పుకున్నచోఁ బుష్పములకును, జలములకు, ఛత్రమునకు, వస్త్రములకును దెల్లఁదనమే వర్ణింపవలెను
౧౧. గాలి మండూక, వల్కల పరాగములకుఁ శీతత్వమునే వర్ణింపవలెను
౧౨. విశేషించి చెప్పుకున్నచో మాణిక్య జపాపుష్ప, రత్న సూర్య పద్మ, పల్లవ బంధూక (మంకెన) దాడిమ నఖములకు శోణవర్ణమే వర్ణింపవలెను.

ఈ క్రిందివానికైక్యమును వర్ణింపవచ్చును (భేదమును పాటింప నక్కఱలేదు)

౧. కృష్ణ (నలుపు) నీల (ఆకాశవర్ణము) హరిత (ఆకుపచ్చ) శ్యామ (ముదురుపచ్చ) వర్ణముల కైక్యము చెప్పవచ్చును. భేదమును పాటింప నక్కఱలేదు
౨. స్వర్ణ, పరాగ, అగ్నిశిఖాదులందున్న పీత (పసుపుపచ్చని) రక్తము (ఎఱుపు) లకు నైక్యము వర్ణింపవచ్చును.

౩. శుక్ల (అచ్చ తెలుపు) గౌరములకు (బూడిదరంగు) నైక్యము వర్ణింపవచ్చును
౪. చంద్రునియందు శశ, మృగముల కైక్యమును వర్ణింపవచ్చును.
౫ మదనకేతనమున మకర మత్స్యముల కైక్యమును ,,
౬ సముద్రమునుండియు నత్రి నేత్రమునుండియుఁ బుట్టిన చంద్రుల కైక్యము వర్ణింపవచ్చును
౭. ద్వాదశాదిత్యులకు నైక్యమును వర్ణింపవచ్చును.
౮ క్షీర లవణ సముద్రములకు ,, ,,
౯. నాగసర్పములకు ,, ,,
౧౦. దైత్య, దానవ, అసురులకు ,, ,,
౧౧ మన్మథుని మూర్తత్వ (శరీరముండుట) అమూర్తత్వములకు నైక్యము
౧౨. నేత్రములకుఁ దెలుపు, నలుపు ఎఱుపులు ప్రత్యేకముగాను, గలసి యున్నట్లు వర్ణింపవచ్చును
౧౩. కమలాసంపదల కైక్యము వర్ణింపవచ్చును
౧౪ శబ్దముచేఁ బర్వతములు బ్రద్దలగునట్లు వర్ణింపవచ్చును
౧౫. వెన్నెలను చకోరములు పానము చేయుచున్నట్లు వర్ణింపవచ్చును
౧౬. వర్షాకాలమున హంసలు మానససరస్సునకుఁ బోవునట్లు వర్ణింపవచ్చును.
౧౭. మానవులను శిరస్సు మొదలుకొనియు దేవతలను పాదములు మొదలుకొనియు వర్ణింపవచ్చును, (దేవతలు పూజ్యులుగానఁ బాదములనుండి వర్ణింపవలెను).
౧౮. భువనములను ౩ ౭, ౧౪ అనియును వర్ణింపవచ్చును.
౧౯. దిక్కులు ౪, ౮ ౧౦ అనియును వర్ణింపవచ్చును
౨౦. సముద్రము ౪, ౭ అనియును ,,
౨౧. విద్యలు ౪ ౧౪, ౧౮, అనియును ,,
౨౨. స్థలమందున్న జీవులు జలమునందును గలవని వర్ణింపవచ్చును.
౨౩ రణహతులు సూర్యమండలమును భేదించుకొని పోవుదురని వర్ణింపవచ్చును.
౨౪. శివుని శూలి యనవచ్చును. (శూలముగలవాఁడు) సర్పి (సర్పములుగలవాఁడు) అనరాదు.
౨౫. చంద్రుని 'శశి' (శశముగలవాఁడు) అనవచ్చును. కాని మృగి, హరిణి, అనరాదు
౨౬ శంకరుని వృషభవాహనుఁడు వృషాంకుఁడు, వృషధ్వజుఁడు, అని యీయా యుపాధినిఁబట్టి చెప్పవచ్చును.
౨౭. శివుని 'ఇందుమౌళి' యనవచ్చును కాని 'గంగామౌళి' యనరాదు.
౨౮. పద్మినీజాతి స్త్రీల తాఁకులవలన. ప్రియంగువృక్షము వారి పుక్కిటిమద్యము మియుటచేఁ బొగడచెట్టు వారి కౌఁగిలిచే గోరింట, వారి కాలితన్నులచే

నశోకవృక్షము వారిచూపులచే బొట్టగుచెట్టు వారినర్మవాక్యములచే మందారము వారి హాసముచే సంపెంగ వారి ముఖానిలముచే మామిడిచెట్టు వారి సంగీతముచే సురపొన్న వారి నర్తనముచేఁ గొండగోఁగుచెట్టును వికసించును (ఇది మల్లినాథుని యుదాహరణముల ననుసరించి వ్రాయఁబడినది వసుచరిత్ర వ్యాఖ్యాత యీపద్యభేదముతో నుదాహరించెను భేదించినవి మాత్రము చూపుదుము) మాకందము కరస్పర్శచేతను సంపెంగ ముఖరాగముచేతను గొండగోఁగు సల్లాపముచేతను, వావిలి ముఖానిలముచేతను ప్రియాళువు సంగీతముచేతను వికసించును.

కావ్యమార్గమున నే యే వస్తువు లేయేవర్ణములుగా వర్ణింపఁబడునో తెలుపుదుము.

చంద్ర ఉచ్చైశ్శ్రవ శంకర నారద, భార్గవ బలరామ, శేషసర్ప, ఐరావత, సింహ, సౌధ, శారదమేఘ ఇందుకాంత, నిర్మోక (కుబుసము) మందార, హిమాద్రి, హిమ, హాస మృణాళ, స్వర్గంగా గజదంత అభ్రక, సికతా (కలకండ) అమృత లోధ్ర, గుణ కైరవ శర్కరల్లు, శ్వేతములు.

కృష్ణ చంద్రాంక-వ్యాస-రామ- ధనంజయ- శని-ద్రౌపదీ- కాళీ- విష-ఆకాశ-అమావాస్యా- శస్త్ర-అగురు- పాప-అంధకార- నిశలును, మద-తమాల, రాహువులును-అద్భుత శృంగారములును నీలములు.

క్షాత్రధర్మములు- త్రేతాయుగము- రౌద్రరసము-చకోర -కోకిలా-పారావత నేత్రములును వానరముఖము- తేజస్సు అంగారకుఁడు-కుంకుమము-తపకుఁడును, జిహ్వా-ఇంద్రగోప-ఖద్యోత-విద్యుత్-కుంజరబిందువులును (ఏనుఁగు నొసలి మీఁది బిందువులు) శోణములు.

దీప-జీవ- ఇంద్ర- గరుడ- హరలోచనములును హరజటాజూటమును, బ్రహ్మయును- వీరరసమున - స్వర్ణము-కపి- ద్వాపరయుగము- గోరోచనలును, కింజల్కము-చక్రవాక-హరితాళము-మనశ్శిల యివి పీతములు.

రజస్సు - సాలెపురుగు - ఒంటె -బల్లి - కపోతము - మూషకము-దుర్గ-కాకకంఠస్వరము మొ ధూసరములు.

సూర్యతురగములు హరితములు

ఋతు వర్ణనము

కవులు కాలౌచిత్యమును బాటింపవలెను వారు దమ కావ్యములయం దాయా ఋతువులను వర్ణింపవలయును ఆ వర్ణనములందు వారు ప్రమాదపడకుండుటకై ఋతువర్ణనము ను జూపుదుము జ్యౌతిషికులు సంవత్సరముచైత్రమాసముతో

నారంభించుననియు లోకయాత్రావేత్తలు శ్రావణమాసముతో నారంభించు ననియు జెప్పుదురు

వర్షర్తువు

శ్రావణ భాద్రపద మాసములు వర్షర్తువు ఈ ఋతువున అందుగు వరి పుట్టగొడుగు అడవిమొల్లలు, తఱిగొట్టు గిరిమల్లిక కడిమి మద్ది ఏఱుమద్ది మొగలి మొదలగు చెట్లు పుష్పించును. ఆర్ద్రపురుగులు- వెన్నెలపులుఁగులు- చాతకములు- లేళ్ళు- గోదురుకప్పలు - నెమిళ్ళు- నీరుకాకులు- గ్రద్దలు- పీనికిఁ గ్రొవ్వుపట్టును. బలాకాపక్షులు (బెగ్గురుపిట్టలు) గర్భము ధరించును (గర్భాధానక్షణపరిచయాత్త్వే భవంతం బలాకా అని మేఘసందేశము) రజస్సు (ధూళి) శమించును రాజులు యాత్రలనుండి నివర్తిల్లుదురు వనభూములు శ్యామలములై యుండును జలాసారమువలనఁ బర్వతములు గడుఁగఁబడినట్లు రమ్యముగా నుండును నదు లొడ్డులొరసి ప్రవహించుచు నొక్కొక్కచో గట్లు దెగుట లోకోపద్రవము గలిగించును. యతులును చారులును దిరిగి వత్తురు. ప్రోషితభర్తృకలు భర్తలకై దారులు చూచుచుందురు పాంథులు గృహములకు మఱలుదురు మేఘబృందముచే నాకాశమునఁ జీఁకట్లు గ్రమ్మును దిఙ్ముఖముల మెఱుఁగుఁదీఁగలు పరుగిడుచుండును. మేఘగర్జనములచే వైడూర్యభూములందు రత్నాంకురములు పొటమరించును కామినీకాముకులుద్యానయాత్రలను జేయుదురు. సౌధోపరిభాగముల శయ్యలఁ గల్పింతురు కస్తూరీమిశ్రమగు చతుస్సమవిలేపనమును (చందన కుంకుమ కర్పూర అగురు మిశ్రితమగు మైపూఁత) బూసికొందురు. కృషీవల కుటుంబినీ బృందములు రాసక్రీడలాడుదురు. కడిమిపూల వాసనగల పడమటిగాలి గాని తూరుపు గాలి గాని వీచును

శరదృతువు

ఆశ్వయుజ కార్తిక మాసములు శరదృతువు ఈ ఋతువులో లకుముకిపిట్టలకు-తుమ్మెదలకు -కన్నెలేళ్ళకు- హంసలకు -కాటుకపిట్టలకు- చక్రవాకములకు- బెగ్గురుపిట్టలకు - కొక్కెరలకు - వృషభములకు - ఏనుగులకు- తాఁబేళ్ళకు కొంగలకు - బేడిసచేఁపలకును గ్రొవ్వువట్టును తామరలు - తెల్లకలువలు - నల్లకలువలు - ఎఱ్ఱ కలువలు - మంకెనలు - కుంకుమవృక్షములు - వావిలి - ఏఁడాకులరఁటి - రెల్లు - మాలతీలతలును బుష్పించును. మయూరముల క్రొవ్వడఁగును హంసలు మానససరస్సునుండి మరలివచ్చును. అగస్త్యోదయముచే జలములు కలఁకదేఱును ముత్తెపుచిప్పలు గర్భముఁదాల్చును మింటఁ దెల్లని మబ్బులుండును. మహానవమియందు శస్త్రపూజలు జరుగును గుఱ్ఱములకును ఏనుఁగులకును నీరాజనములు సేయుదురు రాజులు యుద్ధయాత్రలకు వెడలుదురు. తోటలయందు బురదయుండును సూర్యకిరణములు

దుస్సహములుగా నుండును శ్రీమహావిష్ణువు నిద్రనుండి మేలుకొనును పొలములలో వరిపండును. గోపికలు గీతములు పాడుదురు ఈ ఋతువున నియతముగా వాయువొక దిక్కునుండి వెడలక యన్ని దిక్కులనుండియునువీచును.

హేమంతర్తువు

మార్గశీర్ష పౌషమాసములు హేమంతర్తువు ఈ ఋతువున మల్లె-ముచుకుందము - లవలి - ప్రేంకణము - లొద్దుగ-పురపొన్నలు పుష్పించును. తుమ్మెదలకుఁ బావురములకు - మయూరములకు గ్రొవ్వడఁగును. కామినులు కుంకుమపువ్వును-గంధతైలములను సేవింతురు పెరుగు రుచ్యముగా నుండును కామినీకుచములు నులివెచ్చగా నుండును జనులు నులివెచ్చని జలముల స్నానమాడుదురు స్త్రీలకు గాఢాలింగనసౌఖ్యమబ్బును అడవులులు ప్రసవించును కూపజలములు గోరువెచ్చగా నుండును. రేఁగులు నారింజలును బాగుగా ఫలించును. చెఱకున రసము చిప్పిలుచుండును మందరగర్భములందు శయనము, సరసులు గబ్బిగుబ్బలుగల ప్రియురాండ్ర భుజపంజరముల శయనింతురు. పగటి ప్రమాణము తగ్గును. ఈ ఋతువునఁ బడమటి గాలిగాని యుత్తరపుగాలి గాని వీఁచును

శిశిరర్తువు

మాఘ ఫాల్గునములు శిశిరర్తువు ఈ ఋతువు హేమంతమువలెనే యుండును. విశేషించి యేనుఁగులకు లేళ్ళకు, పందులకు, దున్నలకుఁ గ్రొవ్వు పట్టును కామినులు విచిత్రసురతోపభోగయోగ్యలుగానుందురు చందనము నందరుచి గలుగును జలములకు మిక్కిలి శైత్యము గలుగును మరువకములును గుందములను బుష్పించును. కేళాకూళులయందనాదర మేర్పడును. ఎల్లరును వెచ్చవెచ్చగాఁ గుంపట్లవద్దఁగూర్చుండ నభిలషింతురు ప్రచండవాయువు వీఁచును కుంకుమపూఁతను బూసికొని యా చలినిఁ గామినులు సహింతురు.

వసంతర్తువు

చైత్ర వైశాఖమాసములు వసంతర్తువు ఈ ఋతువునఁ జిలుకలు, గోరువంకలు, తుమ్మెదలు గండుగోయిలలును లెస్సగాఁ గ్రొవ్వును. దాదాఁపన్నివృక్షములును జిగిరించును ఎల్ల యుద్యానములందును, నుయ్యాలలూఁగుట, పుష్పాపచయము, మధుపానము, మన్మథపూజ గౌరీచరిత్రగానము, చంపకపుష్పాభరణము కోకిలనాదములును బిక్కటిల్లుచుండును. దక్షిణవాయువు వీఁచును

గ్రీష్మర్తువు

జ్యేష్ఠాషాఢములు గ్రీష్మర్తువు ఈ ఋతువున నవమాలికలు శిరీషములు చంపకములు, గేదంగులును బుష్పించును ఖర్జూరములు నేరేళ్ళు, పనసలు

మామిళ్ళు, పోఁకలును బండును బంటెలు శరభమృగములు, కంచర గాడిదలును ద్రావ్యమ నదీసరఃకూపాదులెండిపోవును. చలిపందిరులందు బాటసారులు మూఁగియుందురు. పందిళ్ళలో మధ్యాహ్ననిద్ర సేయుదురు, దివసావసానమున స్నానము చేయుదురు వేళవళామున సురతక్రీడలు సేయుదురు చందనాది శీతలద్రవ్యములను సేవింతురు రాత్రులందుఁ జంద్రికాసేవనము సేయుదురు శరీరములకుఁ జందన మలఁదికొని భోగింతురు భూతము లుడుకుచున్నట్లు, జలముల సెగలు లేచుచున్నట్లు, దుమ్ము కాలుచున్నట్లు పర్వతములు మండుచున్నట్లును నుండును.

సంఖ్యా నియమము

ఏ యే వస్తువుల కేసంఖ్య నియతమో యా సంఖ్యానియమమును దెలుపుదుము.

ఏకసంఖ్యాకములు ఇంద్రగజము. ఇంద్రాశ్వము, గజాననదంతము, శుక్రాచార్యుని నేత్రము.

ద్విసంఖ్యాకములు .— పక్షములు, నదీతీరములు, నరుని కర్ణములు భుజములు, నేత్రములును

త్రిసంఖ్యాకములు — కాలములు, అగ్నులు భువనములు, గంగా మార్గములు హరుని నేత్రములు గుణములు, కంఠరేఖలు మహికోణములు, శూలముయొక్క శిఖలు సంధ్యలు పురములు రాములు, (బలరామ పరశురామ శ్రీరాములు) విష్ణుత్వరమునియొక్క పాదములు.

చతుస్సంఖ్యాకములు — వేదములు బ్రహ్మముఖములు, వర్ణములు (జాతులు) సముద్రములు, విష్ణుహస్తములు ఐరావతదంతములు, సేనాంగములు ఉపాయములు శాములు యుగములు ఆశ్రమములు.

పంచసంఖ్యాకములు .— పాండవులు, హరునిముఖములు ఇంద్రియములు దేవతరువులు పంచతంత్రములు, పంచాగ్నులు. పంచభూతములు పంచమహాపాతకములు. పంచకావ్యములు పంచయజ్ఞములు పంచప్రాణములు.

షట్సంఖ్యాకములు —వజ్రకోణములు షట్తర్కములు షడంగములు, షడ్దర్శనములు అరిషడ్వర్గము షట్చక్రవర్తులు, షడ్గుణములు షడ్రసములు, షట్కృత్తికలు.

సప్తసంఖ్యాకములు — సప్తపాతాళములు సప్తభువనములు, సప్తమునులు సప్తద్వీపములు-సప్తాశ్వములు (సూర్యునివి) సప్తవారములు. సప్తస్వరములు సప్తరాజ్యములు సప్తజిహ్వలు (అగ్నివి) సప్తకులపర్వతములు,

౧౧ విరసము

కం. ధర ననుచితరసభావము
గీరసంబగు, నితని సమదవిద్వేషితలో
దరులు దరులందుఁ గుందఁగ
సరసములాడుదురు ప్రేమ శబరులటన్నన్. ౫౦

అనుచితమగు రసభావములుగల యర్థము విరసము ఇతని శత్రుకాంతలు గుహలలోఁ గుందుచుండఁగా గిరాతులు వారితో సరసము లాడుచున్నారు

అష్టసంఖ్యాకములు, - యోగాంగములు. వసువులు అష్టమూర్తులు దిక్కులు సిద్ధులు అష్టదిక్పాలురు

నవసంఖ్యాకములు :— నవరంధ్రములు నవఖండములు వ్యాఘ్రి స్తనములు, సుధాఖండములు, నవనిధులు నవరసములు, నవాంకములు (పుట్టుమచ్చలు) నవగ్రహములు.

దశసంఖ్యాకములు .—హస్తాంగుళులు-శివహస్తములు-రావణశిరస్సులు-అవతారములు-దశదిక్కులు-విశ్వేదేవతలు-దశమన్మథావస్థలు.

ఏకాదశసంఖ్యాకములు — ఏకాదశరుద్రులు-ఏకాదశాక్షౌహిణులు

ద్వాదశ సంఖ్యాకములు : — సూర్యులు-రాసులు-మాసములు-కుమారస్వామి హస్తములు నేత్రములును

త్రయోదశసంఖ్యాకములు — తాంబూలగుణములు.

చతుర్దశసంఖ్యాకములు — విద్యలు - అప్సరసల వంశములు-మనువులు-చతుర్దశభువనములు-ధ్రువతారలు

పంచదశసంఖ్యాకములు - తిథులు.

షోడశసంఖ్యాకములు - ఇందుకళలు - అంబికలు

అష్టాదశసంఖ్యాకములు - ద్వీపములు - విద్యలు - పురాణములు - స్మృతులు - ధాన్యములు.

వింశతిసంఖ్యాకములు - రావణభుజములు - రావణనేత్రములు.

శతసంఖ్యాకములు - ధార్తరాష్ట్రులు - శతభిషక్తారలు - పురుషాయుషము - రావణాంగుళులు - శతపత్త్రదళములు-శతయజ్ఞములు- సముద్రము యొక్క యోజనములు, (హనుమంతుఁడు నూరామడలుగల సముద్రమును దాఁటెను)

సహస్ర సంఖ్యాకములు - గంగాముఖములు - శేషుని శీర్షములు - సహస్రపత్త్రములు — సూర్యకిరణములు - బాణాసురకార్తవీర్యార్జునుల హస్తములు - వేదశాఖలు - ఇంద్రనేత్రములు.

'మగఁడుచచ్చి యేడ్చుచుండ రంకుమగఁడు రొమ్మునద్టె' నన్నట్లు కిరాతులు రాజకాంతలతో నందును వారు దుఃఖించుచుండ సరసములులాడుట యనౌచిత్య గ్రస్తము ఔచిత్యము లేకుండుటయే యిట దోషము. ధ్వనికారుఁడు.

'అనౌచిత్యాదృతే నాన్యద్రసభంగస్య కారణం
ప్రసిద్ధౌచిత్యబంధ స్తు రసస్యోపనిషత్పరా'

'అనౌచిత్యముకన్న రసభంగకారణము మఱొకటిలేదు. ఔచిత్యబంధముగల కావ్యము రసోపనిష త్తే' అని నుడివెను.

ఈ విరసదోషము రసాభాసముననే చేరును. రాజకాంతలెల్లరకును దల్లుల వంటివారు అట్టి యగమ్యలగు కాంతలతో సరసము లాడుట యనుచితముగదా?

౧౨. అతిమాత్రము— ౧౩. హేతురహితము

కం. అతిలో లోకాతీతం
అతిమాత్రము ; నింగినిండె నబ్జాక్షికుచ
ద్వితయమన ; హేతుశూన్యము
పతిఁ గనుఁగొని భృంగపంక్తి చనుదెంచెననన్. ౫౧

లోకాతీతమగు నర్థము 'అతిమాత్రదోషము' ఆ యువతి స్తనద్వయము నింగి నిండెను. ఇట్టిదే యీ క్రింది శ్లోకము

పాతాలమివ నాభిస్తే పర్వతావివ చ స్తనౌ
వేణీదండః పునరయం కాళిందీపాతసన్నిభః

నీ నాభి పాతాళమువలె నున్నది నీ స్తనములు పర్వతములవలెనున్నవి. నీ వేణీదండము కాళిందీప్రవాహమువలె నున్నది. (ఆంధ్రప్రబంధములలో 'చనుగొండలు' అని పెక్కండ్రు ప్రయోగించిరి.)

దీని ననుచితదోషమని దర్పణకార ప్రకాశకారులు దెలిపిరి

హేతువును జెప్పకుండుట హేతుశూన్యము దీనినే యితరులు నిర్హేతు వనిరి భృంగపంక్తి వచ్చుటకు హేతువు "తదాననపరిమళాభిలాష" అని చెప్పఁబడలేదు.

ప్రఖ్యాతార్థమున హేతురహితదోషము లేదు. ఎట్లన,

శ్లో॥ చంద్రం గతా పద్మగుణాన్నభుంక్తే పద్మాశ్రితా చాంద్రమసీమభిఖ్యాం
ఉమాముఖంతు ప్రతిపద్య లోలా ద్విసంశ్రయాం ప్రీతి మవాప లక్ష్మీః

చంచలురాలగు లక్ష్మి చంద్రుని నాశ్రయించి పద్మగుణములను (సౌర భాదులను) ననుభవింపదయ్యెను పద్మము నాశ్రయించి చంద్రశోభను ననుభ వింపదయ్యెను కాని యుమాముఖము నాశ్రయించి చంద్రపద్మోభయగతమగు శోభ ననుభవించి ప్రీతినిఁ బొందెను

ఇట లక్ష్మి 'చంద్రుని నాశ్రయించి పద్మగుణమును ననుభవింపదయ్యెను' అన్నపుడేల యనుభవింపదయ్యెనో హేతువు చెప్పఁబడలేదు కాన దోషమన వచ్చును. కాని యిట హేతువు ప్రసిద్ధము రాత్రి పద్మము ముకుళించును కావునఁ బద్మగుణములగు సౌరభాదుల ననుభవింపదయ్యెను రాత్రియందుఁ బద్మముకుళనము ప్రసిద్ధము కావునఁ గవి యాహేతువును బేర్కొనలేదు "పద్మము నాశ్రయించి పగటఁ జంద్రశోభ ననుభవింపదయ్యెను" అనుచో నేల చంద్రశోభ ననుభవింప దయ్యెనో హేతువు చెప్పఁబడలేదు ఇట హేతువగు చంద్రుని నిష్ప్రభత్వము ప్రసిద్ధము. పగటఁ జంద్రుఁడు వెలవెల పోవు చుండును గదా

ఇట్లే సతిఁగనుగొని భృంగపంక్తి చనుదెంచె ననన్' అనుచోఁగూడ సమాధానమును జెప్పుకొనవచ్చును భృంగములు పరిమళార్థ మేగుదెంచుట ప్రసిద్ధముగదా కాన నిట దోషము లేదు

౧౪. నిరలంకృతి-౧౫. అశ్లీలము

కం. ధర జాతిమాత్రశూన్యము
నిరలంకృతి, బాహుయుతుఁడు నృపుఁ డన; లజ్జా
కరమశ్లీలము; పద్మిని
పరపాంగజగృహము పద్మసౌరభమనఁగన్. ౫౨

నిరలంకృతి యనఁగా నలంకార రహితము రమణీయతాశూన్యమని భావము జాతిమాత్రశూన్యమన స్వభావోక్త్యలంకారముగూడ లేనిది. (స్వభా వోక్తికి జాత్యలంకార మని పేరు) 'ఈ రాజు బాహుయుతుఁడు ఇందేయలం కారమును లేదు. ఇది స్వభావోక్తిగదా? అన్నచో శ్లాఘ్యమగు విశేషణము లున్నచో స్వభావోక్తి యగును జాతి మాత్రశూన్యమన శ్లాఘ్యమగు విశేషణము లేని వట్టి స్వభావోక్తియని మూర్తి యభిప్రాయము ఈ క్రిందిది స్వభావోక్తిగాదు.

దీర్ఘపుచ్ఛశ్చతుష్పాదః కకుద్మాన్ లంబకంబలః
గోరపత్యం బలీవర్ద స్తృణమత్తి ముఖేన సః

"పొడవైన తోఁకయు నాలుగు కాళ్ళును, మూఁపురమును వ్రేలాడు చున్న గంగడోలును గల యావుబిడ్డ యగు నెద్దు మూఁతితో గడ్డి తినుచున్నది." ఇఁక శ్లాఘ్యమగు విశేషణమున కీ క్రింది పద్యమును గనుఁడు.

సీ. యమదండములఁబోని హస్తదండముల భీతినిఁగొల్పు జగజెట్టి "తిప్పరాజు"
వ్రణకిణాంకంబైన వక్షశ్శిలావేదిఁ గత్తులనూఱు "శ్రీకంఠరాజు"
భుజవిక్రమముఁ పైకిఁ బొంగినచందాన నిక్కుమూఁపుల "పెద్దచొక్కరాజు"
బిరుగుమేనికి జిల్గువలువయే కవచంబుగాఁదాల్చు "గయికొండగంగరాజు"

గీ. తనదు దాచేతినిం గేడెమునుగఁ జేసి
యాలములయందు మార్కొను "అచ్చిరాజు"
వాఁడిగోరుల నరసింహు పగిదిఁజీల్చు
"బసవరాజును" వచ్చిరి బవరమునకు.

'హస్తదండములు గల తిప్పరాజు' అన్నచో స్వభావోక్తిగాదు 'యమదండములఁబోని' అనుశ్లాఘ్యమగు విశేషణము వేయఁబడియున్నది మిగిలిన యెడల నిట్లే యూహించుకొనవలెను.

శ్లాఘ్యమగు క్రియావిశేషణమునకు క్రింది పద్య ముదాహరణము.

కం. కలియఁబడ రదనకాంతులు,
మెలివడఁ గ్రేఁగనులు పెనయ మెయిదోయియు మో
ములు క్రిందుమీఁదులంబడ,
విలాసిమిథునంబు వెలసె విరిపాన్పుపయిన్

అశ్లీలమన లజ్జాకరమగు నర్థము పద్మినియొక్క (తామరతూఁడియొక్క) సరసాంగజగృహము (తన సరసమైన యంగము పుట్టినచోటు - (అంగం జాయతేయస్మాత్ అని విగ్రహము) అనఁగా సరస్సు. పద్మసౌరభము (పద్మములయొక్క పరిమళము గలది). తామరతూఁటియొక్క జన్మస్థానమగు సరస్సు పద్మపరిమళముగలది అని తాత్పర్యము "పద్మినీజాతి స్త్రీయొక్క సరసమైన (ద్రవించు) మన్మథగృహము తామరపూవు పరిమళమువంటి పరిమళము గలది" అనియు నశ్లీలార్థము తోఁచుచున్నది. ఇది దోషము.

౧౬ సహచరచ్యుతము

కం పరిగా సరిగానిది యు
ర్వరపైఁ బొందింప సహచరభ్రష్టంబౌఁ;
బరగునెలచేత గగనం,
బరుదుగ ఫేనంబుచేత నంబుధియనఁగన్. ౫౩

అతుల్యములగువాని ననఁగా నుత్కృష్టాపకృష్టంబులను నిబంధించినచో సహచరచ్యుతము లేక సహచర భ్రష్టము. చంద్రునిచే నాకాశము (ఉత్కృష్టము) ఫేనముచే సముద్రుఁడును వెలుఁగును. (అపకృష్టము).

ఆకాశము చంద్రునిచే శోభిల్లువిధమున ఫేనముచే సముద్రుఁడు శోభిల్లఁడు ఇట నీ వాక్యద్వయమునకు సాహచర్యము బాగుగా లేదు

౧౭ భిన్నము

కం భిన్నంబగు సంబంధవి
భిన్నం ; బితని విరోధి పృథివీశ్వరుఁ డా
పన్నుండై తన నుదురున
నన్నలినజు వ్రాఁత శూన్యమని పల్కుననన్. ౫౪

సంబంధవర్జితమైన యర్థము భిన్నము. ఇతని శత్రురాజాపన్నుఁడై తన నుదుట బ్రహ్మ వ్రాఁత లేదని తలఁచును బ్రహ్మవ్రాఁత లేమికిని నాపన్నత్వము నకును సంబంధము లేదు. (బ్రహ్మయొక్క చెడువ్రాఁతకును నాపన్నతకును సంబంధ ముండును

ప్రతాపరు దీయమున 'అపార్థము' అను దోష మీయఁబడినది. "సముదా యార్థశూన్యంతు యదపార్థం తదుచ్యతే" సముదాయార్థములేనిదపార్థము.

కుతః శుష్యదపో నద్యః కా వార్తా చోళమండలే ?
ఫణాసహస్రం శేషస్య భారః కతి కులాచలాః ?

నదులలో నీరేల యెండెను ? చోళమండలవిశేషములేమి ? శేషునికి వేయి తలలు భారము కులశైలము లెన్ని ? ఇట వాక్యార్థము స్ఫురింపదు.

(చూ పాలికుఁడు – ౯వ పుట)

'కళాంతలకుఁ గల్పరసాలము.' కళాంతలకు వృక్షమన్నఁ జాలును. అది అర్థవంతము కల్పరసాలమేమి ? ఏలోకమందైనను గలదా ? కల్పరసాల పదము అర్థహీనము శ్రీనాథ పోతనలనుగూర్చి శిష్యుఁ డొకఁడన్నమాట. "ఒకనిని రాజసకిరణములకు రంజిల్లు సూర్యకిరణమన వేరొకనిని సత్త్వరశ్మికి ద్రవించు చంద్రకాంత మనవచ్చును ఈ వాక్యమునకు అర్థములేదు.

ఈ ప్రయోగము శ్రీమాన్ వ్యాకరణ శిరోమణి రంగాచార్యుల వారిది

నరసభూపాలీయమునఁ జెప్పఁబడనివియు దర్పణకార, ప్రకాశకారులు పేర్కొన్నవియునగు పదుమూఁడు దోషములుగలవు వానినిఁగూడ నుదాహ రింతును

౧. వ్యాహతము

ఉత్కర్షో వాపకర్షో వా ప్రాగ్యస్యైవ నిగద్యతే
తస్యైవాథ తదన్యశ్చే ద్వ్యాహతో౽[illegible]భవేత్

ప్రథమమున నొకదా[illegible] కుత్కర్షముగాని యపకర్షముగాని [illegible]ప్పి మఱల దానిని భిన్నముగాఁ జెప్పి[illegible] వ్యాహతారమను దోషమగును[illegible]

A C No.....

కం .... కుందనపుటొడల్
కసుగందిన కందుకమన వసివాళ్వాడెన్ నిదాఘపరిపీడనచేన్
అని చెప్పి

గీ కన్నెగేదంగిచెందునాఁ గళుకులొలయు నా వెలందియొడల్ ......
అని వర్ణించెను

మొదటఁ గసుగందిన కందుకమన వసివాళ్వాడిన శరీరము (అపకర్షము) కన్నెగేదంగిచెందునాఁ గళుకులొలయుచున్నదఁట. (ఉత్కర్షము) ఇట వ్యాహతార్థము స్పష్టము. ఇది మహాకవి రాయప్రోలు సుబ్బారావుగారిది.

౨. గ్రామ్యము

"స గ్రామ్యోఽర్థో రిరంసాదిః పామరైర్యత్ర కథ్యతే
వైదగ్ధ్యవక్రిమబలం హిత్వైవ వనితాదిషు"

పామరులాడు రిరంసాద్యర్థము. వైదగ్ధ్యముగల వక్రోక్తులతో వనితలతో మాటలాడవలయును వారలును నట్లే ముచ్చటింపవలయును. అట్లుగాక గ్రామ్యోక్తులతోడనే చేయు సంభాషణము గ్రామ్యము.

కం. సుదతీ! నీ కుచగిరులిటు
గదిలివడిం గూలినట్టి కారణ మేమే?
చెదరి గిరులైనఁ గూలవె?
కదలి వడిం గ్రిందఁ ద్రవ్వఁగాఁ జెలువుండా?

ఇట నాయికానాయకు లిరువురును నవిదగ్ధులు ఇది సురతగోష్ఠిలో గుణమే యగును.

కం కలగలుపుగ నలు పెఱుపులు
వెలయఁగఁ గ్రొమ్మావిచిగురు వెలువడి చెంకన్
గొలుపునిదె కనులు పండువు
వెలఁదీ! తామేటిచిప్ప వెడలుతలవలెన్.

ఇట నాయకుఁడు వ్యంగ్యముగా గుహ్యాంగవర్ణనము సేయుచున్నాఁడు. వీఁడు విదగ్ధుఁడు కాన నిది గ్రామ్యముగాదు.

౩. అనవీకృతము

ప్రకారాంతరముచే నూతనత్వము వహింపని యర్థము
ప్రాప్తాశ్శ్రియస్సకలకామదుఘా స్తతః కిం
దత్తం పదం శిరసి విద్విషతాం తతః కిమ్

సంతర్పితాః ప్రణయినో విభవై స్తతః కిం ;
కల్పం స్థితం తనుభృతాం తనుభి స్తతః కిం ?

ఎల్లకామములను బిండు సిరులుఁ బిండినవి దాన నేమగును? శత్రుశిరస్సులపైఁ గాలుమోపితిని దాన నేమగును ? యాచకులు ధనములచేఁ దృప్తులయిరి. దాన నేమగును ? ప్రాణులు కల్పాంతముదాఁక జీవింతురు. దాన నేమగును ?

ఇట 'తతః కిం' అనుదానినిఁ బ్రకారాంతమునఁ జెప్పక దానినే పలుసారులు చెప్పినాఁడు ఇది పునరుక్తి కాజాలదు. ఏలన నిట 'తతః కిం' అను శబ్దమును మార్చి తదర్థమును బోధించు నితర శబ్దములను ననఁగా 'కిం తస్మాత్' 'ఏకస్మాత్ కిం 'ఇతః కిం అని చెప్పినను దోషము దొలఁగదు. అనఁగా నర్థమునఁ బ్రౌ త్రఁదనములేదు. ఇట్లే

గీ చక్కఁదనమున కొకవింత చక్కఁదము
జవ్వనంబున కొకవింత జవ్వనంబు
విభ్రమంబున కొకవింత విభ్రమంబు
గలిగె నద్దివ్యకుసుమంబు కతనఁ జెలికి (పారిజాతాపహరణము)

ఇట 'ఒక వింత' అను పదము నవీకృతముగా లేదు కాన ననవీకృత దోషజుష్టము పునరుక్తిదోషమున నా శబ్దమును దొలఁగించినచో దోషమును దొలఁగును కావున నీక్రింది శ్లోకమున నున్నవిధమున నవీకృతత్వ ముండవలెను.

యది దహత్యనలోఽత్ర కి మద్భుతం ? యది చ గౌరవమద్రిషుకిం తతః?
లవణమంబు సదైవ మహోదధేః ప్రకృతిరేవ సతామవికారితా

అగ్ని కాల్చునన్న నద్భుతమేమి ? పర్వతములు బరువుగా నుండునన్న విశేషమేమి ? సముద్రోదక మెప్పుడును లవణమే సజ్జనుల కెప్పుడును నవికారిత్వమే (సంకటములలో దుఃఖింపకుండుటయే) ప్రకృతి (అగ్నియుఁ బర్వతములును సముద్రములును నెప్పుడును వికారమును బొందనివిధమున సజ్జనులును వికారమును బొందరు)

ఈ శ్లోకమున కి మద్భుతం కిం తతః సదైవ అనువానిచే నర్థము నవీకృతమైనది. ఇట్లే

చ. సురపతినొంచితిన్ , జముని చొప్పడఁగించితి శ్రీదునూఁచితిన్ ;
వరుణునిగెల్చితిన్ శశిదివాకరులం బనిగొంటి , నాకు నీ
నరుఁడొకలెక్కయే ? యొక యనంగుని కోఁపఁగఁజాల నింక నీ
చరణములాన యింతదయసల్పఁగరాదె ? త్రిలోకసుందరీ !

ఇట నొంచితిన్ చొప్పడఁగించితిని నూఁచితిన్ గెల్చితిన్, పనిఁగొంటి అనువానిచే నవీకృతమైనది.

౪. సనియమపరివృత్తము.

సనియమముగాఁ జెప్పవలసినచోట ననియమముగాఁ జెప్పుట

"అపాతసరసే భోగే నిమగ్నాః కిన్న కుర్వతే ?" అపాతముగానే సరసమైన భోగమున మగ్నులగువా రేమి సేయరు ?

ఇట అపాతసరసే అనుచో 'అపాతమేవసరసే' అను నియమమును జెప్పవలెను అపాతముగానే సరసము గాని యనఁగాఁ బరిణామమున విరసము' అను నర్థము రావలయును అప్పుడు నియమమును జెప్పకొనవలయును

౫. అనియమపరివృత్తము

అనియమమును జెప్పకొనవలసియుండఁగా నియమముఁ జెప్పుటదోషము

అవర్త ఏవ నాభి స్తే నేత్రే నీలసరోరుహే
తరంగాశ్చవళయ స్తేన త్వం లావణ్యాంబువాపికా

నీనాభి యావర్తమే నీ నేత్రములు నల్లకలువలు, నీవళులు తరంగములు, నీవు లావణ్యనదివి.

ఇట నీనాభి యావర్తమే ! అను నియమము గూడదు.

చ ... తన్మయయోగ్యమైన మా
నుషదశయే కృతార్థమ యనున్

ఇట 'కృతార్థమ' అను సాధారణవాచకప్రయుక్తమగు నియమము గూడదు ఇది కవిభూషణ రాయప్రోలు సుబ్బారావుగారి పద్యము

౬. సవిశేష పరివృత్తము

సవిశేషముగాఁ జెప్పవలసియుండఁగా నవిశేషముగాఁ జెప్పుటదోషము

"యాంతి నీలనిచోలిన్యో రజనీష్వభిసారికాః" రాత్రులయం దభిసారికలు నల్లనితొడుగులు దాల్చి పోవుచున్నారు.

ఇట 'రజనీషు' యని యవిశేషముగా గాక 'తమిస్రాసు' (చీకటి రాత్రులందు) అని చెప్పవలెను అప్పుడు నల్లదొడుగులకుఁ బ్రయోజనము సంఘటిల్లును.

౭ సవిశేష పరివృత్తము

అవిశేషముగాఁ జెప్పవలసినయెడల సవిశేషముగాఁ జెప్పుట

"హీరకాణాం నిధే రస్య సింధోః కిం వర్ణయామహే ?" వజ్రములకు నిధియగు నీ సముద్రమును నేమి వర్ణింపఁగలము ?

ఇట సముద్రము రత్నాకరము. కాన 'రత్ననిధి యని "రత్నానాం నిధిః" యని యవిశిష్టముగాఁ జెప్పవలెను. కాని రత్నవిశేషమగు "వజ్రముల నిధి" అని చెప్పరాదు.

౮. సాకాంక్షము

ఆకాంక్షతోఁ గూడినది.

చ. క్రమమని యక్రమంబని పరస్పరభిన్నమనోవికార సం
భ్రమములఁ గొన్నినాళ్ళు వలవంతలఁ జిక్కితి దేశకాలపా
త్రములని కొన్నినాళ్ళు నిశితవ్యథనొందయుఁ దాళుకొంటి నా
కమలదలాక్షిపై మమత......

(కవిభూషణ రాయప్రోలు సుబ్బారావుగారి తృణకంకణము)

"దేశకాలపాత్రములు" అనునది యాకాంక్షను గోరుచున్నది దేశకాలముల యానుకూల్యమునకై యను నర్థము కావలయును మఱియు నిటఁ బాత్రపద మనవసరము

౯. ఉపదయుక్తము

అస్థానసంబంధమైన యర్థము ప్రకృతార్థమునకు విరుద్ధమైన యర్థము గలిగి యుండుట యపదయుక్తము

సీ ఎవనియాజ్ఞాపనం బెల్లవేల్పుల నేలు దేవేంద్రు తలమీఁది పూవుదండ,
ఎవ్వాని కాపురం బివ్వసుంధర సాటిచూపఁగారాని లంకాపురంబు;
ఎవని భక్తిపరత్వ మీశ్వరేశ్వరునందుఁ బార్వతీపతియందుఁ బాయకుండు
ఎవని కొంగన్నులు వివిధశాస్త్రంబు, లుత్పత్తి వేనికి బ్రహ్మవంశమందు,

గీ వాఁడు వరుఁడౌట మెచ్చఁగావలయు, నదియ,
కాని రావణుఁడనుమాట కానిమాట
యుర్విలో నెందునే కాని సర్వగుణము
లొక్కచోఁ గూడియుండుట చిక్కదుగద.

(బాలరామాయణ నాటకము)

సీతాస్వయంవరమునకు రావణుఁడు గూడ వచ్చుచున్నాఁడని తెలిసి జనక శతానందులు మాటలాడుకొనుచున్నారు

శతానందుఁడు :— "అహాహ ఆశ్చర్యము! ఒక్కటైనను గొప్పతప్పిదము గుణసముదాయమును బాడుచేయును అంతేకదా! అని నుడివి యీ పై సీస పద్యమును జదువుచున్నాఁడు అతఁడు "కాని రావణుఁడనుమాట కానిమాట" (స్యాచ్చేదేష న రావణః) అన్నంతవఱకే సమాప్తిచేసి యుండవలసినది 'ఉర్విలో నెందునే కాని' ఇత్యాది వచనము సమాధానముగాఁ బర్యవసించుచు రావణోపేక్షాప్రతీతినిఁ గప్పివేయుచున్నది 'ఇతడు రావణుఁడు మాత్రము గాకున్నచో బాగుగానుండెడిది మిగిలిన వరణీయగుణము లన్నియునుగలవు' అన్నఁజాలును. 'ఎవరికి లోకములో సర్వగుణములు నుండును?' అను వచనము రావణునకు కన్య నీయవచ్చుననియే తోఁపింపఁ జేయుచున్నది. అంత

వఱకే సమాప్తిచేసినచో నీ గుణములున్నను వీఁడు రావణుఁడుగానఁ గన్య నీయఁగూడదు యను నర్థము వచ్చును.

(చూ 561 పుట 'హాలికుడు' శ్రీమాన్ వ్యాకరణ శిరోమణి చలమచర్ల రంగాచార్యులవారు)

"లేకున్న బావగారి పని మిడతంభొట్లు కథకు వచ్చెడిది" ఇది ప్రకృతార్థమునకు విరుద్ధమైనది మిడతఁభొట్లు కథ యిది ఒకరాజు నొద్ద 'మిడతంభొట్లు అను పేరి జ్యోతిషికుఁడుండెను అతడుఁ చెప్పిన జోస్యము లొకటి రెండు కాకతాళీయముగా ఫలించుటచే రాజసమ్మాన మొందియుండెను ఒక నాఁడు రాజు చేతిలో మిడతను బట్టుకొని తన చేతిలోని వస్తువేదో చెప్పుమని జోస్యులవారినిఁ గోరెను అతదేమియుఁ దోఁచక తానిఁకఁ జిక్కి పోయితినని తలఁచి 'చిక్కెర మిడతఁభొట్లు అనెనఁట. తేని చేతిలోనిది మిడతయే కావున ఆతని జోస్యము సరిపడుటచే సంతోషించి సమ్మానించెనఁట. ఈ కథ యిచ్చట సరిపడదు మఱియు నా క్రిందనే "ఓహో! శిరశ్ఛేదమై యుండెడిదికాఁబోలు" అని కలదు మిడతంభొట్లుగారికి శిరశ్ఛేదమయినట్లు యుక్తార్థము వచ్చుచున్నది. ఆతనికి సమ్మానమే జరిగెను.

౧౦. ప్రకాశిత విరుద్ధము

ఏ వాక్యముచేఁ బ్రతిపాదింపఁబడినట్టియు వివక్షితమైనట్టియు నర్థమునకు బ్రతికూలమగు నర్థము గోచరించునో యది ప్రకాశిత విరుద్ధము

"కుమారస్తే ! నరాధీశ ! శ్రియం సమధిగచ్ఛతు" ఓ రాజా! నీపుత్రుఁడు నీ సిరినిఁ బొందుఁగాక !

ఇట 'నీవు మరణింపుము' అని విరుద్ధార్థము ప్రకాశించుటవలనఁ బ్రకాశితవిరుద్ధము.

౧౧ విధ్యయుక్తము

విధింపవలసినదానిని విధింపకుండుట, అయుక్తమగు విధినిఁజేయుట.

"ఆనందితస్వపక్షోఽసౌ పరపక్షాన్ హనిష్యతి" ఆనందింపఁజేయబడిన స్వపక్షముగల యితఁడు పరపక్షములను జంపును

ఇట పరపక్షములను జంపి స్వపక్షము నానందపఱచును' అని విధింపవలయును.

౧౨. అనువాదాయుక్తము

విధి కననుగుణమగు ననువాద్యమును జెప్పుట అయుక్తమగు ననువాదము సేయుట.

అరే రామాహస్తాభరణ! భసల శ్రేణిశరణ!
స్మరక్రీడాపీడాశమన విరహిప్రాణదమన!
సరోహంసోత్తంస ప్రచలదల నీలోత్పల! సఖే
సఖేదోఽహం మోహం శ్లథయ కథయ క్వేందువదనా

ఓ మిత్రమా! నీలోత్పలమా! నేను భిన్నుఁడనై యున్నాను నా మోహమును సడలింపుము నా ప్రియురా లెటనున్నది?

విరహియగువాఁడు స్వమోహశ్లథనమునకై చేయు ప్రార్థనారూపవిధిలో విరహిప్రాణదమనత్వరూపానువాదము యుక్తముగాదు ఏలన విరహిప్రాణదమనమును జేయునది విరహిమోహశ్లథన మెట్లు చేయఁగలదు?

౧౩. త్యక్తపునస్స్వీకృతము (నిర్ముక్తపునరుక్తము)

లగ్నం రాగావృతాంగ్యా సుదృఢ మిహ యయైవాసియష్ట్యాఽరికంఠే
మాతంగానామపీహోపరి పరపురుషై ర్యా చ దృష్టా పతంతీ
తత్సక్తోఽయం నకించిద్గణయతి విదితం తేఽస్తు తేనాస్మిదత్తా
భృత్యేభ్యశ్శ్రీనియోగాద్గదితుమితి గతేవ్యంబుధిం యస్య కీర్తిః.

రాజ్యలక్ష్మి తన తండ్రియగు సముద్రునితోఁ దన జామాతయొక్క కథను దెలుపుమని కీర్తినిఁ బంపుచున్నది "ఖడ్గలత రాగావృతాంగియై యరికంఠము నాలింగనము సేసికొనుచున్నది విమ్మట నది మాతంగతతిమీఁదఁ బడుచుండఁగా నెల్ల పరపురుషులును జూచుచునే యున్నారు అట్టి (యసతి యగు) దానియందాసక్తుఁడై యుక్తాయుక్తవిచారము లేక వర్తిల్లుచున్నాఁడు నీకి సంగతి తెలియుఁగాక మఱియు నాతఁడు నన్నుఁ దన భృత్యుల కిచ్చివేసెను" అని లక్ష్మి చెప్పిన సందేశమును గొని కీర్తి సముద్రునికడకు వెళ్ళెను.

ఇట 'విదితంతేఽస్తు అనుచోటనే వాక్యము నిరాకాంక్షముగా సమాప్తమైనది. మఱల తేనాస్మిదత్తా' అని కారకాంతరముచేఁ జెప్పుట దోషము

రసదోషములు

౩౦. రసములు వాచ్యములైనను
వెస నదియును దోషమయ్యె. విపులోగ్రరణాం
బనదృశబీభత్సరసో
ల్లసితము, శృంగారసహిత లలన యనంగన్. ౫౫

రసములు విభావానుభావ వ్యభిచారిభావములచే వ్యంగ్యములు గావలయును. కేవలము శృంగారాదిశబ్దములు వాడినమాత్రమున నాస్వాద్యత్వము

గలుగదు రణరంగము బీభత్సరసోల్లసితము; తరుణి శృంగారసహితురాలు; అన్నచో బీభత్స శృంగార పదములను మాత్రము ప్రయోగించిన నారసములు స్ఫురింపకున్నవిగదా కాన నీవిధము దోషము. దీనిని స్వశబ్దవాచ్యదోష మందురు.

ఇటఁ బెక్కు విధములైన రసదోషములను జూపుదుము

వ్యభిచారి రస స్థాయిభావానాం, శబ్దవాచ్యతా,
కష్టకల్పనయా వ్యక్తి రనుభావవిభావయోః,
ప్రతికూలవిభావాదిగ్రహో, దీప్తిః పునః పునః,
అకాండే ప్రథనచ్ఛేదా వంగస్యాప్యతివిస్తృతిః
అంగినోఽననుసంధానం, ప్రకృతీనాం విపర్యయః
అనంగస్యాభిధానం చ, రసే దోషాస్స్యురీదృశాః.

వ్యభిచారిభావములను, రసములను స్థాయిభావములను స్వశబ్దముతోఁ దెలుపుటయు అనుభావవిభావములు గష్టముగా గుర్తింపఁబడుటయుఁ బ్రకృత రసవిరుద్ధములయిన విభావాదులను గ్రహించుటయుఁ, దిరిగి తిరిగి రసమునకు దీప్తి గలిగించుటయు అసమయమున రసమును వర్ణించుటయు, నసమయమున రసవిచ్ఛేదము సేయుటయు, అంగభూతముగానున్న రసమును మిక్కిలియు విస్తరించుటయు అంగిరసమును బోషింపకుంటయు స్వభావమును సముచితముగా వర్ణింపకుండుటయు రసానుపకారకమైనదానిని వర్ణించుటయు నీ మొదలయినవి రసదోషములు. వీనినిఁ గ్రమముగా నుదాహరింతుము

౧. వ్యభిచారి భావమును స్వశబ్దముతోఁ దెలుపుట
సవ్రీడా దయితాననే, సకరుణా మాతంగచర్మాంబరే,
సత్రాసా భుజగే సవిస్మయరసా చంద్రేఽమృతస్యందిని
సేర్ష్యా జహ్నుసుతావలోకనవిధౌ, దీనా కపాలోదరే
పార్వత్యా నవసంగమప్రణయినీ దృష్టి శ్శివాయాస్తు వః

భర్తృముఖమును గాంచి (తన్నతఁడు గాంచుటచే) సిగ్గుగొన్నట్టియు, గజచర్మాంబరమును గాంచి (విభవము లేనివాఁడని) వెతనుఁ గొన్నట్టియు, సర్పమును గాంచి భయపడినట్టియు అమృతము జాలువాఱు చంద్రునిఁ గాంచి (ఆకాశమున నుండువాఁ డిట నెట్లున్నాఁడని) విస్మయపడినట్టియు శిరసునం దున్న గంగను గాంచి (అన్యాంగనాసక్తుఁడని) యీర్ష్యను వహించినట్టియు (మణిహారస్థానమున) కపాలములను గాంచి చిన్నఁబుచ్చుకొన్నట్టియు పార్వతీదేవి యొక్క నవసంగమకాలమునందలి ప్రణయదృష్టి మీకు మంగళములిడుఁగాక.

ఇట వ్రీడా, కరుణ త్రాస, విస్మయ, ఈర్ష్యా, దైన్యములు తమతమ యనుభావములచే వ్యంగ్యములు గావలయును ఎట్లన, నిట వ్రీడ వ్రీడాశబ్దము చేతనే వాచ్యమైనది అనఁగా స్వశబ్దముచేత వాచ్యమైనది అట్లుగాక వ్రీడ యొక్క యనుభావములైన (కార్యములయిన) 'తలను వంచుట ను ప్రయోగించి దానిచే సిగ్గును వ్యక్తము సేయవలెను అనఁగా 'నామె సిగ్గుపడినది అని చెప్ప వలసిన యెడ 'ఆమె తల వంచుకొన్నది' అని ప్రయోగింపవలెను. తల వంచు కొనుట సిగ్గుయొక్క కార్యము లేక యనుభావము 'తల వంచుకొన్నది అను ననుభావముచే సిగ్గు వ్యక్తమగుచున్నది 'ఆమె సిగ్గుపడినది'. 'ఆమె తల వంచుకొన్నది' అను వాక్యములలో నేది సుందరముగా నుండునో చూడుఁడు. మొదటిచోట 'సిగ్గు స్వశబ్దముచే గ్రహింపబడుటచే సుందరముగా లేదు. ఎప్పుడును జెప్పవలసినదానిని విస్పష్టముగా విప్పి చెప్పక దానిని వ్యంగ్యముగా బోధించిన యెడలనే రమణీయముగా నుండును కావున రెండవచోట హృద్యముగా నున్నది. ఇట్లే కరుణ త్రాస విస్మయ, ఈర్ష్యా, దైన్యములను, వాని వాని యనుభావములచేతనే వ్యక్తము చేయవలెను ఎట్లన,

వ్యాసమ్రా దయితాననే ముకుళితా మాతంగచర్మాంబరే,
సోత్కంపా భుజగే నిమేషరహితా చంద్రేఽమృతస్యందిని
మీలద్భ్రూస్సురసింధుదర్శనవిధౌ మ్లానా కపాలోదరే
పార్వత్యా నవసంగమప్రణయినీ దృష్టిశ్శివాయాస్తు వః

ఇట వ్రీడా, కరుణ త్రాస విస్మయ, ఈర్ష్యా దైన్య రూప వ్యభిచారులు స్వశబ్దముచే గ్రహింపఁబడక వాని వాని యనుభావములగు వ్యానమ్రత ముకుళనము, ఉత్కంపము నిమేషరహితత్వము భ్రూనిమీలనము మ్లానత అను వానిచే వ్యక్తము సేయఁబడుచున్నవి ; ఇట్లనుభావములచే వ్యక్తపఱపక వ్రీడాది పదములచేతనే యనఁగా స్వశబ్దముచేతనే వ్రీడాదులను జెప్పుట స్వశబ్దవాచ్యత యను రసదోషము. కాని,

"న దోష స్స్వపదేనోక్తా వపి సంచారిణః క్వచిత్"

ఒకానొకచో సంచారిభావమును స్వశబ్దముతో గ్రహించినను దోషము గాదు. చూడుఁడు

ఔత్సుక్యేన కృతత్వరా, సహభువా వ్యావర్తమానా హ్రియా
తై స్తైర్బంధువధూజనస్య వచనై ర్నీతాభిముఖ్యం పునః
దృష్ట్వాఽగ్రే వరమాత్తసాధ్వసరసా గౌరీ నవే సంగమే
సంరోహత్పులకా హరేణ హసతా శ్లిష్టా శివాయాస్తు వః

ఔత్సుక్యముచేఁ ద్వరపడియు సిగ్గుచే వెనుకకువచ్చుచు నా యా బంధువధూజనవచనములచే మఱల నభిముఖియై యెదుటఁదన ప్రియునిఁగాంచి

సాధ్వసమును బొందుచుఁ బార్వతీదేవి నవసంగమకాలమున గగ్గురుపాటును బొందఁగా హరుఁడు నవ్వుచు నామె నాలింగనము జేసికొనెను. అట్టి పార్వతి మీకు శుభమిడుఁగాక

ఇట నౌత్సుక్యము సిగ్గు అను వ్యభిచారిభావములు స్వశబ్దోపాత్తము లయినవి; అయినను దోషముగాదు. ఏలన నెచ్చట స్వశబ్దముచేత నయినంత ప్రతీతి తదనుభావముచేతఁగాదో యచ్చట వ్యభిచారభావమును స్వశబ్దముచేఁ జెప్పుట దోషముగాదు. ఇట ఔత్సుక్యమను వ్యభిచారిభావమున కనుభావము సహసాప్రసరణము అదియే 'కృతత్వరా యని గ్రహింపబడినది 'కృతత్వరా అను ననుభావముచే నౌత్సుక్యము స్పష్టముగా వ్యక్తముగానందున ఔత్సుక్య మను వ్యభిచారిభావము స్వశబ్దోపాత్తమై ప్రయోగింపఁబడినది. అట్లే సిగ్గున కనుభావముగా వ్యావర్తమానా అని యున్నది కాని యీ వ్యావర్తమానత్వము చేత సిగ్గు విస్పష్టముగా వ్యక్తముగానందున హ్రియా యని ప్రయోగింపఁ బడినది కావున నెచ్చట ననుభావముచే వ్యభిచారిభావము లెస్సగా వ్యక్తమగునో యచ్చట స్వశబ్దమును గ్రహించుట దోషము ఎచ్చట ననుభావముచే వ్యభిచార భావము లెస్సగా వ్యక్తముగాదో యట స్వశబ్దమును బ్రయోగించుట దోషము గాదు

ఒకప్పుడు వ్యభిచారభావము స్వశబ్దోపాత్తమయినను విభావాదిప్రతిపాద నము గూడ నున్నచో నదఁగా నా వ్యభిచారిభావము విభావాదులచే వ్యక్తము సేయఁబడుచున్నచో నది దోషముగాదు. అట వ్యభిచారిభావము విభావాదులచేతనే వ్యక్తమగును అట్టిచో స్వశబ్దోపాదానము గేవల మనువాదమాత్ర పరమని గ్రహింపవలెను

యాతే ద్వారవతీం తదా మధురిపౌ తద్దత్తఝంపానతాం
కాళిందీతటరూఢవంజులలతామాలింగ్య సోత్కంఠయా
తద్గీతం గురుబాష్పగద్గదలసత్తారస్వరం రాధయా
యేనాంతర్జలచారిభిర్జలచరైరప్యుత్కముత్కూజితం.

తన్ను విడిచి శ్రీకృష్ణుఁడు ద్వారవతికి వెళ్ళఁగానే యాతనిచే వంపఁబడిన (కోతికొమ్మచ్చి మొదలగు నాటలయందు వంపఁబడిన) కాళిందీతీరము నందలి వంజులలత నాలింగనము సేసికొని రాధ సోత్కంఠయై యాయమునాజలమునందలి జలచరములు గూడ జాలిపడి రుదించునట్లు బాష్పగద్గదమై బిగ్గరగా నేడ్చెను

ఇట విభావానుభావబలముచేత రాధయొక్క యుత్కంఠ వ్యక్తమగు చున్నది అట్లయ్యు 'సోత్కంఠయా' యని యుత్కంఠ స్వశబ్దోపాత్తమయినది అయినను దోషముగాదు ఉత్కంఠాశబ్దము విభావాదులచే వ్యంగ్యమైన తన్నే యనువదించుకొనుచున్నది

౨ రసమును స్వశబ్దముచేతఁ గాని (రసశబ్దముచేఁ గాని) శృంగారాది శబ్దముచేఁ గాని (శృంగార, కరుణాది పదములచేఁగాని) తెలుపుట అనఁగా నాయా పదములను బ్రయోగించుట దోషము రసము విభావానుభావ వ్యభిచారులచే వ్యక్తము గావలెను కాని రస, శృంగారాది పదములను వాడిన మాత్రమున రసస్ఫూర్తి గలుగదు.

తామనంగ జయమంగళ శ్రియం
కించిదుచ్ఛ్రభుజమూలలోకితాం
నేత్రయోః కృతవతోఽస్యగోచరే
కోఽప్యజాయత రసో నిరంతరః

"జనులచేఁ జూడబడుచున్న కక్షమూలములుగల యా మన్మథుని జయలక్ష్మి నేత్రములకు గోచరింపఁగా నతని కొకానొక రసము పుట్టెను."

ఇట రసము పుట్టెను అని రసపదమే ప్రయోగింపఁబడినది

విభావాదులచే రసము వ్యక్తము గావలయును వానిచే రసము వ్యక్తమైనట్లు రసపదమును ప్రయోగించిన మాత్రమున వ్యక్తముగాదు.

ఆలోక్య కోమలకపోలతలాభిషిక్త
వ్యక్తానురాగసులభామభిరామరూపాం
పశ్యైష బాల్య మతివృత్త్య వివర్తమానః
శృంగారసీమని తరంగిత మాతనోతి

కోమలకపోలతలము పులకించుటచేఁ దనయం దనురాగ మున్నట్లు వ్యక్తముసేయుచున్న యా సుందరినిఁ గాంచి యా యువకుఁడు శృంగారమున నోలలాడుచున్నాఁడు

ఇట శృంగారపదము సాక్షాత్తుగాఁ బ్రయోగింపబడినది. పై శ్లోకమునందును దీనియందును రసము వ్యక్తముగాక వాచ్యమైనది. ఇట్లే

శృంగారీ గిరిజాననే సకరుణో రత్యాం, ప్రవీరః స్మరే
బీభత్సోఽస్థిభిరుత్ఫణీ చ భయకృన్మూర్త్యాఽద్భుతస్తుంగయా
రౌద్రో దక్షవిమర్దనే చ హాసకృన్నగ్నః ప్రశాంతశ్చిరా
దిత్థం సర్వరసాత్మకః పశుపతి ర్భూయాత్సతాం భూతయే

శివుఁడు పార్వతీముఖమును గాంచి శృంగారి యయ్యెను రతినిఁగాంచి కరుణరసము (జాలి) గలవాఁడయ్యెను మన్మథుని యెడల వీర రసాస్పదుఁడయ్యెను అస్థులను దాల్చి బీభత్సరసాశ్రయుఁడయ్యెను. పాములను వహించి భయానకరసమునకుఁ బట్టయ్యెను పెద్దమూర్తినిఁ దాల్చి యద్భుతరసమును వహించెను. దక్షధ్వంసవావపరమున రౌద్రరసమును వహించెను దిగంబర వేషమును బూని హాస్యరసమునకు నెలవయ్యెను బహుకాలానంతరమునఁ

బ్రిజాంతరసాశ్రయుఁడయ్యేను ఇట్టి సర్వరసాశ్రయుఁడగు పశుపతి సత్పురుషులకు సంపదలను గూర్చుఁగాక.

ఇచ్చట గూడ 'శృంగారీ సకరుణః' ఇత్యాది పదములచే రసము వాచ్యమే యైనది ఇందలి 'రసములు వాచ్యములైనను' అను పద్యమున 'రణరంగము బీభత్సరసోల్లసితము తరుణి శృంగారసహితురాలు అను దోషములు నిట్టివియే. కావున నివి దోషములు.

ఒకానొకచో రసపదము గాని శృంగారరసపదము గాని ప్రయోగింపఁబడినను విభావాదులచేఁగూడ నది యభివ్యక్తమగుచున్నచో నట రసస్ఫూర్తి గలుగును. కాన నట్టిచో దోషముగాదు ఎట్లన

"నయననలినీలీలాకృష్టం పిబంతి రసం ప్రియాః" ప్రియరాండ్రయొక్క చూపులను తామరతూండ్లనుండి విలాసముగాఁ బీల్చఁబడిన రసమును బ్రియులు త్రాగుచున్నారు.

'శృంగారస్యోపనత మధునా రాజ్య మేకాతపత్రం' ఇపుడు శృంగార రసమున కేకచ్ఛత్రాధిపత్యము లభించినది

ఈ లక్ష్యములందుఁ గ్రమముగా రస శృంగార శబ్దములు ప్రయోగింపఁబడినను విభావాదులచే లెస్సగా నభివ్యక్తములయి యున్నవానికే కేవల మనువాదము సేయఁబడినది కాన నియ్యెడల స్వశబ్దవాచ్యత దోషముగాదు.

౩ స్వశబ్దముచే స్థాయినిఁ దెలుపుటయు స్వశబ్దవాచ్యదోషమే

సంప్రహారే ప్రహరణైః ర్భటానాంతు పరస్పరం
రణత్కారైః శ్రుతిగతై రుత్సాహ స్తస్య కోఽప్యభూత్

యుద్ధమందు భటుల పరస్పరప్రహారములచే రణగుణధ్వనులచే వాని కుత్సాహము పుట్టెను.

ఇట వీరరసస్థాయిభావమగు నుత్సాహము స్వశబ్దోపాత్తమైనది. ఇది దోషము

రూపనిర్జితకందర్పే నయనానందదాయిని
అభూత్తస్యా రతిః కాఽపి ప్రియే చాటువిధాయిని

రూపముచే మన్మథుని జయించినట్టియు నయనానందము గలిగించుచున్నట్టియుఁ బ్రియుఁడు చాటూక్తులు పలుకుచుండఁగా నామెకు రతి జనించెను.

ఇట 'రతి యను స్థాయిభావము స్వశబ్దోపాత్తమైనది ఈ విధముగా వ్యభిచారి రస స్థాయిభావములను స్వశబ్దోపాత్తములు సేయుట స్వశబ్దవాచ్యమను దోషము

౪ అనుభావ విభావములు కష్టముగా గుర్తింపఁబడుటయు దోషము.

కష్టముగా గుర్తింపఁబడుట యనఁగా నొకప్పుడు బొత్తుగా గుర్తింపఁబడ కుండుటయు, నొకప్పుడు గష్టముగా గుర్తింపఁబడుటయు నగును.

> కర్పూరధూళిధవళద్యుతిపూరధౌత
> దిఙ్మండలే శిశిరరోచిషి తస్య యూనః
> లీలాశిరోఽంశుక నివేశవిశేషక్లృప్తి
> వ్యక్తస్తనోన్నతి రభూన్నయనావనౌ సా.

చంద్రుఁడు కర్పూరధూళివలెఁ దెల్లనైన కాంతిపూరమును దిఙ్మండలమున వ్యాపింపఁజేయఁగా నా యువకున కా యువతి మేలిముసుఁగు సర్దుకొను నెపమునఁ దన స్తనోన్నతిని వ్యక్తము సేయుచుఁ గనఁబడెను

ఇట యువతీయువకులాలంబనవిభావములు. శశికాంతి యుద్దీపన విభావము ఈ శ్లోకమున యువకనిష్ఠమైన శృంగారమే కవి కుద్దిష్టమైనది ఏలన "తస్య యూనః నయనావనౌ సా అభూత్" ఆ యువకుని నేత్రభూమి యందామె గోచరించెను అని యున్నది ఆమె యతనికిఁ గనఁబడినదన్నపు డాతనియం దనుభావమును గవి చెప్పియుండవలెను కాని యట్టి యనుభావము చెప్పఁబడ లేదు పోనిమ్ము విభావముచే దానినాక్షేపించుటకును వీలులేదు కావున నిట విభావ మనుభావమునఁ బర్యవసింపక నిలిచిపోయినది కావున నిట శృంగారముపరిపుష్టము గాలేదు

స్త్రీనిష్ఠమగుశృంగారమన్ననో పరిపుష్టముగానేయున్నవి ఎట్లన నా యువతి యువకునిఁ జూడఁగానే తన లీలాశిరోంశుకమును సర్దుకొనుచుఁదన స్తనోన్నతిఁ జూపుచున్నది అనునర్థమువలన వానిఁజూడఁగానే యాపెకు శిరోంశుకనివేశము స్తనోన్నతి ప్రకటనము అను ననుభావములు గలిగినవి వీనిచే నాపె రతి పరిపుష్టమై రసముగాఁ బరిణమించుచున్నది. కాని యీశ్లోకమునఁ గవికిఁ బురుష నిష్ఠ శృంగారమే యుద్దిష్టమని తెలుపఁబడెను అది యపరిపుష్టముగానేయున్నది.

> పరిహరతి రతిం, మతిం లునీతే స్ఖలతి భృశం, పరివర్తతే చ భూయః,
> ఇతి బత ! విషమా దశాస్య దేహం పరిభవతి ప్రసభం కిం మత్ర కుర్మః ?

రతినిఁ బరిహరించుచున్నాఁడు ; మతినిఁ గోల్పోవుచున్నాఁడు ; మిక్కిలి తొట్రుపడుచున్నాఁడు · మిక్కిలియుఁ బొరలాడుచున్నాఁడు ; అకటా , వీనిదేహ మును విషమదశ పరిభవించుచున్నది.

ఇటనున్న రతిపరిహారాద్యనుభావములు కరుణమునందును సంభవించును. ఇట విప్రలంభశృంగారము కవి కుద్దిష్టము ఈయువకునికిఁ గలిగిన యీ యను భావములు శృంగారకార్యములో కరుణకార్యములో తెలిసికొనుట కష్టముగా

యున్నది ఇందనుభావములు మాత్రమే కలవు; కాని విభావములు చెప్పఁబడలేదు కామినీరూపవిభావమును జెప్పవలెను అట్లు చెప్పఁబడబోవుటచేఁ గష్టము మీఁద దాని నూహింపవలసి వచ్చుచున్నది. ఈ విళంబమువలన నాస్వాదమున కంతరాయము గలుగుచున్నది

౫ ప్రతికూలరసముయొక్క విభావ, అనుభావ, వ్యభిచారులను గ్రహించుట దోషము.

ఏయే రసమున కేయే విభావానుభావములుండవలెనో తెలిపితిమి మఱియు నే యే రసములు విరుద్ధములో యేవి యవిరుద్ధములో ముందుతెలియును. అట్టిచో ప్రతికూలరసముయొక్క విభావాదులను గ్రహించుట దోషమేకదా . దాని వలన రసభంగ మగును

(క) ప్రతికూలరసము యొక్క విభావగ్రహణము,

ప్రసాదే వర్తస్వ ః ప్రకటయ ముదం , సంత్యజ రుషం ;
ప్రియే ః శుష్యంత్యంగా ; న్యమృతమివ తే సించతు వచః ।
నిధానం సౌఖ్యానాం క్షణమభిముఖం స్థాపయ ముఖం ;
న ముగ్ధే ప్రత్యేతుం ప్రభవతి గతః కాలహరిణః

ఓ ప్రియురాలా ప్రసన్నురాలవుగమ్ము సమ్మోదము ప్రకటింపుము పొలయలుకను వదలుము నా యవయవములు శుష్కించుచున్నవి. నీయమృత వచనములచేఁ దడుపుము సుఖములకు నిధియైన నీ ముఖము నభిముఖముగా నుంచుము ఓ ముద్దరాలా ! లేడిపిల్లవలెఁ గాలము పరువెత్తిపోవును తిరిగిరాదు సుమా

మానం మాకురు తన్వంగి జ్ఞాత్వా యౌవనమస్థిరం" ఓ తన్వంగీ యౌవనమస్థిరమని యెఱిఁగి ప్రణయకోపమును మానుము

ఇటఁ బ్రియుఁడు పొలయలుక వహించిన ప్రియురాలి ననునయించుచున్నాఁడు, కావున శృంగారరసము. దీనికి సర్వథా శాంతరసము ప్రతికూలమైనది కావున శృంగారమున శాంతమును గాని దాని విభావాదులను గానీ ప్రవేశపెట్టరాదు ఇటఁ బ్రథమశ్లోకమున నాల్గవపాదమునఁ బోయినకాలముతిరిగి రాదనియుఁ గ్రిందిశ్లోకమున యౌవనమస్థిరమనియును వైరాగ్యకథలుపదేశింపఁ బడినవి. కాలముయొక్కయు, యౌవనము యొక్కయు నస్థిరత్వములు శాంత రసభావములు, శృంగారమున వానికిఁ బ్రవేశమనుచితము కావున నిదిదోషము

(ఞ) ప్రతికూలరసముయొక్క యనుభావగ్రహణము.

నిభృతరమణే లోచనపథే పతితే గురుజనమధ్యే
సకలపరిహారహృదయా వనగమనమేవేచ్ఛతి వధూః

తాను పెద్దలకోఁ గూర్చుండియుండఁగాఁ దన మిండఁడు గంటఁబడఁగానే సకలమును బరిహరించి యాతరుణి వనగమనమును నిచ్ఛయించుచున్నది

సకలపరిహారము వనగమనము అనునవి శాంతరసానుభావములు. ఇవి శృంగారరసప్రతికూలములు ఇంధనాదులను దెచ్చు నెపమున నామె సకల పరిహారమును వనగమనమును సేయఁ గోరుచున్నదన్నచో దోషములేదు.

ప్రతికూలరసముయొక్క యనుభావములను గ్రహించుట దోషమని చెప్పితిమి. కాని

పాండు క్షామం వదనం హృదయం సరసం తవాలసం చ వపుః
ఆవేదయతి నితాంతం క్షేత్రియరోగం సఖి ! హృదంతః

ఓ సఖీ ! నీ మొగము పాలిపోయినది; కృశించినది, నీ హృదయము ద్రవించినది , నీ శరీరమలసమై యున్నదఁ; నీకేదో కుదరని రోగము వచ్చి నట్లున్నది

ఇందలి పాండిమము, క్షామత్వము సరసత్వము, అలసత్వము అను నను భావములు కరుణమునకు సంబంధించినవి ఇట విప్రలంభరసము కరుణ విప్ర లంభ శృంగారములు విరుద్ధములు కరుణరసోచితములగు పాండుత్వాదివ్యాధ్యను భావములు విప్రలంభ శృంగారమున సమావేశపఱుపఁబడినవి. కావున దోష మన్నచోఁ గాదు ఏలన నిటఁ గరుణరసానుభావములు విప్రలంభమున నారో పింపఁబడినవి. అనఁగా నిట విప్రలంభశృంగారమున కంగముగానే తద్విరోధి కరుణారంగములగు పాండుత్వాదు లారోపింపఁబడినవి కాన దోషములేదు కరుణమునవలెనే విప్రలంభమునను వ్యాధ్యాదులుచితములే కాన నిట దోషమే లేదని కొందఱు ఇట్లే

కోపాత్కించిదుపాగతోఽపి రభసాదాకృష్య కేశేష్వలం
నీత్వా మోహనమందిరం దయితయా హారేణ బద్ధ్వా దృఢం
భూయో యాస్యసి తద్గృహాన్ ? నితిముహుః కంఠార్థరుద్ధాక్షరం
జల్పంత్యశ్రుకణోల్లభేన (?) సుకృతీ కశ్చిద్రిహస్తాద్యతే.

ఒక యువతి కినుకతోఁదనకడకు వచ్చిన ప్రియునిఁ గేశములఁబట్టి లాఁగి పడకగదిలోనికిఁ గొంపోయి హారముతో తెక్కలుగట్టి "దాని యింటికి మరలఁ

బోవుగదా!" యనుచు గొంతులో మాటలడ్డుపడుచుండఁగా వదరుచుఁగన్నీళ్ళు గిఱుకొనుచు రహస్యముగాఁ గొట్టుచుండెను వాఁడెంత ధన్యుఁడో కదా"

ఇటఁ గేశాకర్షణము, బంధనము, తాడనము, మొదలగునవి రౌద్ర రసానుభావములు. అయినను శృంగారమున నారోపింపఁబడినవి రౌద్ర శృంగారములు ప్రతికూలరసములయినను రౌద్రరసానుభావములు రూపకబలము వలన శృంగారాంగముగా నారోపింపఁబడినవి కావున విరుద్ధరసానుభావము లెచ్చట నారోపింపఁబడునో యనఁగాఁ దదంగముగాఁ జేయఁబడునో యచ్చట దోషముగాదు ఇట్లే

గీ. గోట బుక్కఁచుఁ గడుఁ బంటికొనలనొక్కఁ
జూఁపుచు భుజంబులంబట్టి సైఁపరాని
కౌఁగిలింతల నలుపుచుఁ గాంత్రు శాంతి
రమణు నపరాధమును జూపి రాగవతులు.

రౌద్రరసానుభావములు శృంగారమున నారోపింపఁబడినవి కొన్ని మొదలఁ బ్రతికూలరసముయొక్క వ్యభిచారిభావములను గ్రహించినను దోషము లేదు. ఎట్లన.

'సంచార్యాదే ర్విరుద్ధస్య బాధ్యస్యోక్తి ర్గుణావహా' ప్రతికూలరసము యొక్క సంచారిభావములను బాధ్యబాధక భావముతో నిరూపించినచో నది గుణమే యగును. కాని దోషముగాదు ఎట్లన,

క్వాకార్యం శశలక్ష్మణః? క్వచకులం? భూయోఽపి దృశ్యేత సా;
దోషాణాం ప్రశమాయ మే శ్రుతమహో కోపేఽపి కాంతం ముఖం;
కిం వక్ష్యంత్యపకల్మషాః కృతధియః ? స్వప్నేఽపి సా దుర్లభా;
చేతః స్వాస్థ్యముపైహి కః ఖలు యువా ధన్యోఽధరం పాస్యతి ?

అకార్యమెక్కడ చంద్రవంశ మెక్కడ? మఱల నా ప్రియురాలు (ఊర్వశి) కనఁబడునా! నాచదువు దోషప్రశమమునకుఁ గాని దోషకరణము నకుఁ గాదు ఓహో! దాని మొగము కోపమునందును మనోహరమే కలుష దూరులగు విజ్ఞులు నన్నుఁజూచి యేమందురో? స్వప్నమందును నాపె నాకిఁక దుర్లభము, ఓమనసా! స్వస్థతను బొందుము ఏ ధన్యుఁడగు యువకుఁడా యధరమును గ్రోలునో?

ఇది విక్రమోర్వశీయమ్ము నందలి పురూరవుని వచనము ఇందు 'అకార్య మెక్కడ? చంద్రవంశ మెక్కడ?' అనుచో వితర్క మను శాంతరస వ్యభిచారి భావము గలదు. 'మఱల నాప్రియురాలు కనఁబడునా?'అనుచోట శృంగార

రస వ్యభిచారి యగునౌత్సుక్యము ; "నా చదువు దోషప్రశమమునకుఁ గాని దోషకరణమునకుఁ గాదు" అనుచో శాంతరసవ్యభిచారి యగు మతి, "దాని మొగము కోపమునందును మనోహరమే" యనుచో స్మృతి ; "కలుషదూరులగు విజ్ఞులు నన్నుఁజూచి యేమందురో" అనునది శంక. "స్వప్నమందును నాకాపె దుర్లభము" అనునెడ శృంగారరస వ్యభిచారి యగు దైన్యము, "ఓ మనసా స్వస్థతను బొందుము" అనుచో శాంతర వ్యభిచారి యగు ధృతి "ఏ ధన్యుఁడగు యువకుఁడా యధరమును గ్రోలునో" అనుచో శృంగార వ్యభిచారియగు చింతయుఁ గలవు.

ఇందు వితర్కమును నౌత్సుక్యము బాధించుచున్నది కాన వితర్కము బాధ్యము ఔత్సుక్యము బాధకము. మఱల నౌత్సుక్యము బాధ్యము. మతి బాధకము, తిరిగి మతి బాధ్యము స్మరణము బాధకము పిమ్మట స్మరణము బాధ్యము శంక బాధకము తరువాత శంక బాధ్యము. దైన్యము బాధకము క్రమ్మఱ దైన్యము బాధ్యము ధృతి బాధకము అంతమున ధృతి బాధ్యము చింత బాధకము ఈ విధముగాఁ బరస్పర విరుద్ధములగు శాంత శృంగార రసములయొక్క వ్యభిచారులు బాధ్యబాధక భావములతో నిరూపింపఁబడినవి. శాంతశృంగారములు పరస్పర విరుద్ధములయినను వాని వ్యభిచారు లీ విధముగా బాధ్యబాధకభావములతో నుండి శృంగారమును బోషించుచునే యున్నవి. అనఁగాఁ దుదికి శృంగారవ్యభిచారియగు చింతయందే పర్యవసించును ఇట్లే

> స్నిగ్ధశ్యామలకాంతిలిప్తవియతో వేల్లద్బలాకా ఘనాః
> వాతాశ్శీకరిణః పయోదసుహృదా మానందకేకాః కళాః
> కామం సంతు దృఢం కఠోరహృదయో రామోఽస్మి సర్వంసహే
> వైదేహీ తు కథం భవిష్యతి ? హ హా హా దేవి ! ధీరా భవ !

మేఘములు దమ చక్కని నల్లని కాంతులచే నాకాశము నలికినవి. బలాకలు వానినిఁ జుట్టుకొనియున్నవి. వాయువులు చల్లఁగా వీచుచున్నవి. ఆ మబ్బులకు మిత్రములయిన నెమిళ్ళు కేఁకరించుచున్నవి మంచిది ఇవన్నియును నుండనిమ్ము నేను రాముఁడనుగదా సర్వమును సహించుకొందును కాని నా సీత యెట్లు భరించును ? అయ్యో దేవీ ధైర్యము వహింపుము.

ఇట 'రామోఽస్మి సర్వంసహే' అనుచోట వీరరసవ్యభిచారి యగు ధైర్యము. 'హహాహాదేవి' అనుచోట విప్రలంభవ్యభిచారియగు నపస్మారమును బాధ్యబాధకభావముతో నిరూపింపఁబడినవి వీరశృంగారవిప్రలంభములు విరుద్ధములయినను వాని వ్యభిచారులు బాధ్యబాధకములుగా నిరూపింపఁబడి విప్రలంభమును తెప్పుగా బోషించుచున్నది

౬. రసముయొక్క పునఃపునర్దీప్తి.

నిరూపింపఁదగినదానికన్న రసమునకు దీప్తినిఁగలిగించి నిరూపించుట మితిదాఁటినచో వెక్కసమగును. కుమారసంభవమున రతివిలాసమునఁ గవి తిరిగి తిరిగి కరుణమునకు దీప్తిఁ గలిగించెను ఇది వెక్కసముగానున్నది.

౭ అసమయమున రసమును బ్రకాశింపఁజేయుట

మహాభయంకరముగా యుద్ధము జరుగుచుండఁగా నాయకుఁడటకుఁ బోక యంతఃపురములో శృంగారమున నోలలాడుచున్నట్లు వర్ణించుట మొదలగునది దోషము. ఇట ననవసరమగుచోట శృంగారరసము వర్ణింపఁబడుట దోషము. ఇట్టియెడల నాయకుఁడు దైవవ్యామోహితుఁడై యట్లు ప్రవర్తించెననుట యుచితముగాదు. ఏలన నితివృత్తమున నిట్టిదోషములున్నచో గవి వానినిఁ దొలఁగించి యితివృత్తమును రసవ్యంజకముగాఁ జేయవలెను కావున వేణీసంహారమున ననేకవీరసంక్షయముగల మహాయుద్ధము జరుగుచుండఁగా భానుమతితో దుర్యోధనుఁడు శృంగారరసమున నోలలాడుచుండుట దోషము.

౮. అసమయమున రసమును విరమించుట.

ఒక నాయికపొత్తు నభిలషించి పరస్పరానురాగము పరాకాష్ఠనుబొంది యుండఁగా నాయకుఁడు సమాగమోపాయమును జింతింపక వ్యాపారాంతర నిమగ్నుఁడై యున్నట్లు వర్ణించుట మొదలగునది వ్యాపారాంతర నిమగ్నతచే రసము విచ్ఛిన్నమగును

౯ అంగభూతమగు రసమును విస్తరించుట

హయగ్రీవ వధమను నాటకమున నాయకుఁడు శ్రీమహావిష్ణువు ప్రతినాయకుఁడు హయగ్రీవుడు ఇందంగిభూతమగు రసము వీరము. అంగభూతమగు రసము రౌద్రము. ఇందంగికన్న నంగమధికముగా వర్ణింపఁబడినది. కాన నిది దోషము కాని యొకవిధముగా నిది దోషముగాదు ఏలన.

అథవా ప్రతిపక్షస్య వర్ణయిత్వా బహూన్ గుణాన్
తజ్జయాన్నాయకోత్కర్షవర్ణనం చ మతం క్వచిత్

ప్రతినాయకుని గుణముల నధికముగా వర్ణించి నాయకుఁడు వానిని జయించినట్లు వర్ణించుటయు సమ్మతమే కావునఁ బ్రతినాయకుఁడైన హయగ్రీవునియందు రౌద్రరసమును విస్తరించి వర్ణించుట దోషముగాదు ఇట్టిచో నీ యుదాహరణము దగదు. శిశుపాలవధయందు నాయకప్రతినాయకులు శ్రీకృష్ణ శిశుపాలురు. ఇందుఁ బ్రధానరసము వీరము శృంగార రౌద్రాదులంగరసములు. అందు శృంగారాంగభూతమగు ఋతు, వనవిహారపుష్పాపచయ, జలకేళ్యాదివర్ణనము సేయఁబడినది. ప్రధానరసముకన్న నంగభూత

మగురసము విస్తరింపఁబడినది. కాన దోషము ఇక్లేకిరాతార్జునీయమునను గలదు.

౧౦. అంగిరసము ననుసంధింపకుండుట

కావ్యనాటకాదులందు నంగభూతముగా నితరరసములు వర్ణింపఁబడు చున్నను గవి ప్రధానరసము ననుసంధింపవలసినచోట్ల ననుసంధింపవలయును. తాపసవత్సరాజమున నాలంకములందును వాసవదత్తావిషయకమగు ప్రేమ సంబంధము కథావశమున విచ్ఛిన్నమగుచున్నట్లు శంకింపఁ బడుచున్నను ననుసంధింపఁబడినది.

౧౧ ప్రకృతి విపర్యయము-స్వభావమును సముచితముగా వర్ణింపకుండుట

ఈ ప్రకృతి దివ్యప్రకృతి అదివ్యప్రకృతి దివ్యాదివ్యప్రకృతి యని ముర్విధములు ఈ ప్రకృతులను జిత్రించుటలోఁ గవి చాల జాగరూకుఁడై యుండవలెను లేకున్న ననౌచిత్య దోషముగలిగ రసభంగమగును ఎట్లన,

క్రోధం ప్రభో సంహర సంహరేతి యావద్గిరః ఖే మరుతాం చరంతి
తావత్స వహ్నిర్భవనేత్రజన్మా భస్మావశేషం మదనం చకార

'ఓ ప్రభూ కోప ముపసంహరింపుము' అను దేవతల నోటిమాట నోటి యందుండఁగనే హరనేత్రాగ్ని యా మదనుని భస్మావశేషునిఁ జేసెను

ఇట్టి కోపము దివ్యులకే యుచితముగాని యదివ్యులకుఁ గాదు. అట్లే స్వర్గ పాతాళ గమన సముద్రోల్లంఘనాదులు దివ్యులకే యుచితముగాని యదివ్యులకుఁ గాదు అదివ్యుల కెంతవఱ కుచితమో యంతవఱకు నిబంధింప వచ్చును దివ్యాదివ్య ప్రకృతులయందు రెంటిని నుపనిబంధింపవచ్చును వీర, రౌద్ర శృంగార శాంత రసప్రధానులగు ధీరోదాత్త ధీరోద్ధత, ధీరలలిత, ధీరశాంతులను వర్ణించునపు డదివ్యులనువలెనే దివ్యులను వర్ణింపవచ్చును. అదివ్యులందలి ధీరోదాత్తాదులును దివ్యులందలి ధీరోదాత్తాదులును సములుగానే యుందురు కాని యొక విశేషము గలదు. అదివ్యులగు నుత్తమనాయకుల రతి వర్ణనము సేయువిధమున దివ్యనాయకుల రతి వర్ణనము సేయరాదు. ఆ వర్ణనము తలిదండ్రుల రతి వర్ణనమువలె మిక్కిలి యనుచితమైయుండును కాళిదాస మహాకవి కుమారసంభవమునఁ బార్వతీపరమేశ్వరుల రతి వర్ణించెనని విమర్శకు లెల్లరును దూసిపోసిరి మఱియు నాటకాదులం దెవరెవరెవరి నెట్లు సంబోధింప వలయునో యా మర్యాదను దప్పుటయు ననౌచిత్యమే ఇట్లే దేశ, కాల, వయో, జాత్యాదులకు సముచిత వ్యవహారము నుపనిబంధింపవలయును.

౧౨. రసానుపకారకమైనదానిని వర్ణించుట

ప్రధానభూతమగు రసమునకు నుపకారముగానివిషయమును వర్ణించుట కర్పూరమంజరి యను నాటికయందు రాజనాయికలు మొదట వసంత వర్ణనము

సేయుదురు. పిమ్మట వందిమాగధులు సేయుదురు. రాజు తన నాయికలు వేసిన వర్ణనము ననాదరించి వందిమాగధులు సేసినదానినిఁ బ్రశంసించును. ఇట వందిమాగధుల ప్రశంస రసానుపకారము.

ఇంకను నిట్టివి గలవు అనఁగా నాయికాపాద ప్రహరణముచే నాయకునకుఁ గోపమువచ్చినట్లు వర్ణించుట మొదలగునవి రసదోషములే. సహృదయులగు కవులు వానిని స్వయముగా నూహించుకొనవలెను ఇట్లే యితరరసముల లోని దోషములను గూడ నూహించుకొనవలెను.

ఈ రసదోషములలో నటనట విరుద్ధరసములనుగూర్చి ముచ్చటించి యుంటిమి విరుద్ధరసము లేవియో వానికిఁ గావ్యములలో సమావేశము నెట్లు చేయవలెనో ప్రసక్తానుప్రసక్తిచే నిట చూపఁబడును.

పరస్పర విరుద్ధరసములు

శృంగారమునకుఁ గరుణ వీర రౌద్ర బీభత్స భయానకములు విరుద్ధములు ; హాస్యమునకుఁ గరుణభయానకములు విరుద్ధములు ; కరుణమునకు హాస్యశృంగారములు విరుద్ధములు , రౌద్రమునకు హాస్య శృంగార భయానకములు విరుద్ధములు వీరమునకు భయానకశాంతములు విరుద్ధములు ; భయానకమునకు శృంగార వీర, రౌద్ర హాస్య శాంతములు విరుద్ధములు ; శాంతమునకు వీర, శృంగార రౌద్ర, హాస్య భయానకములు విరుద్ధములు. బీభత్సమునకు శృంగారము విరుద్ధము వీనికి సమావేశవిధము చెప్పఁబడుచున్నది.

ఆశ్రయైక్యే విరుద్ధో యస్స కార్యో భిన్నసంశ్రయః
రసాంతరేణాంతరితో నైరంతర్యేణ యో రసః

ఈ పరస్పరవిరుద్ధరసములను నేకనాయకాశ్రయములుగాఁ జేసినచో విరోధము. కాని భిన్ననాయకాశ్రయములను జేసినచో దోషమురాదు. ఎట్లన, వీర, భయానకములును, బీభత్స హాస్యాదులును నేకనాయకుని యం దుండరాదు అట్టిచో నా రెండు రసములను నాయక ప్రతినాయకులయందు నివేశపఱపవలెను

ఈ క్రింది శ్లోకమున బీభత్స, హాస్యములు భిన్ననాయకాశ్రయము లై యున్నవి చూడుడు.

స్నాయువ్యాసనిబద్ధకీకసతనుం నృత్యంత మాలోక్య మాం
చాముండాకరతాలఘట్టితలయం వృత్తే వివాహోత్సవే
హ్రీముద్రామపనుద్య యద్విహసితం చిత్రం సమం శంభునా
తేనాద్యాపి మయి ప్రభుస్సజగతామాస్తే ప్రసాదోన్ముఖః

"చిన్న నరములచే విరివిగాఁ జుట్టఁబడిన యెముకలమేను గలిగి, చాముండ కరతాళములచే లయవేయ నృత్యమాడుచున్న నన్నుఁ జూచి వివాహ మహోత్సవమున లజ్జాముద్రను బోనాడి శంభుఁడు చిత్రముగా నవ్వెను. దానిచే నాజగత్ప్రభువు నాయం దిప్పటికినిఁ బ్రసాదోన్ముఖుడై యున్నాడు."

ఇట బీభత్సరసము నాట్యమాడుచున్న సేవకునియందును హాస్యరసము శంభుని యందును గలదు.

మఱియు నొకప్పుడు విరుద్ధరసములను నేకనాయకాశ్రయములుగాఁ జే నిబంధింపవచ్చును ఎట్లన నా విరుద్ధరసముల నడుమ వేరొక రసమును సమావేశపఱుపవలయును. ఎట్లన శాంత శృంగారరసములు పరస్పర విరుద్ధములు ఏక నాయకాశ్రయములుగాఁ జేయవలసివచ్చినప్పుడు నడుమ నద్భుతరసమును బ్రవేశ పెట్టవలయును నాగానందమునఁ బ్రథమమున జీమూతవాహనుఁడను నాయకుఁడు శాంతరసాశ్రయుఁడుగా నిబంధింపఁబడెను. అతఁడే పిమ్మట మలయవతి యను నాయికను జూచి వరించి శృంగారాశ్రయుఁడయ్యెను అట్టియెడలఁ గవి జీమూతవాహనుఁడు మలయవతీగానము నాలకించి "అహో గీతము, అహో వాదిత్రము" అని యద్భుతమొందినట్లు వర్ణించి నాయకుని నద్భుతరసాశ్రయునిఁ జేసెను. పిమ్మట మలయవత్యనురాగాదులను వర్ణించి యాతని శృంగార నాయకునిగా వర్ణించెను ఇట శాంతశృంగారరసముల నడుమ నద్భుతము ప్రవేశ పెట్టబడినది కావున నేకనాయకాశ్రయములుగా విరుద్ధరసములను సమావేశపఱుప వలసినచోట్ల నడుమ రసాంతరమును బ్రవేశపెట్టవలెను. అట్లయినచో దోషము నివర్తిల్లును. ఇట్లు రసాంతర సమావేశము ప్రబంధమునందే కాదు. ఏకవాక్యము నందును రసాంతర వ్యవధానముచే దోషము నివర్తిల్లును. ప్రబంధమన సంఘటితనానావాక్యసముదాయము అది గ్రంథరూపముగాఁ గాని తదవాంతరప్రకరణ రూపముగాఁగాని యుండవచ్చును. కనుఁడు

(క్రూరేణుదిగ్ధాన్నవపారిజాత మాలారజోవాసితబాహుమధ్యాః
గాఢం శివాభిః పరిరభ్యమాణాన్ సురాంగనాశ్లిష్టభుజాంతరాళాః
సశోణితైః క్రవ్యభుజాంస్ఫురద్భిః పక్షైః ఖగానాముపవీజ్యమానాన్
సంవీజితాశ్చందనవారిసేకైస్సుగంధిభిః పుష్పలతాదుకూలైః
విమానపర్యంకతలే నిషణ్ణాః కుతూహలావిష్టతయా తదానీం
నిర్దిశ్యమానాన్ లలనాంగులీభిర్వీరాః స్వదేహాన్ పతితానపశ్యన్.)

యుద్ధమున వీరులు మరణించి వీరస్వర్గమునకుఁ బోవుచున్నారు వారికి దివ్యదేహములు వచ్చినవి. ఆ దివ్యదేహములతో విమానములందుఁ గూర్చుండి యుద్ధభూమియందుఁ బడియున్న పూర్వదేహములను జూచుచున్నారని వర్ణింపఁ బడినది. ఎట్లనఁ, దామిపుడు నవపారిజాతమాలలయొక్క పుప్పొడితోఁ బరిమ

శించు వక్షః ప్రదేశము గలవారై యుద్ధభూమియందు దుమ్ములోఁ బొరలాడుచున్నట్టియు వేలుపు పూఁబోండ్ల కౌఁగిలింతలఁ జొక్కుచున్నవారై యాఁడునక్కల కౌఁగిలిఁబొందుచున్నట్టియుఁ, జందనోదకములచేఁ బరిమళించు నావేల్పుఁబోండ్ల కల్పలతాదులచే విసరఁబడుచున్నవారై, మాంసమును భక్షించుచున్న పక్షులయొక్క రక్తసిక్తపక్షములచే వీవఁబడుచున్నట్టియు, నేలఁబడిన స్వదేహములను వీరులు విమానములందుఁ గూర్చుండి సురాంగనలు వ్రేలితో నిర్దేశించి చూపుచుండఁగాఁ గుతూహలావిష్టులై చూచిరి

ఇట బీభత్స శృంగారరసములు గలవు ఇవి రెండును విరుద్ధరసములు కాని నడుమ "వీరాస్స్వదేహాన్" అని వీరరసమును గవి ప్రవేశపెట్టినాఁడు 'వీరాః' అను పదముచేతనే ఇట వీరరస మెట్లు సమావిష్టమైనదని యెఱుగవచ్చును. ఈ 'వీర పదముచేత దాని స్థాయి యగు నుత్సాహ మభివ్యక్తమగును. పూర్ణరసముండదు. దాని స్పర్శ యలఁతిగానున్నను జాలును

"స్మర్యమాణో విరుద్ధోఽపి సామ్యేనాథ వివక్షితః
అంగిన్యంగత్వమాప్తౌ యౌ తౌ న దుష్టౌ పరస్పరమ్

౧. విరుద్ధరసమైనను స్మర్యమాణముగా నిబద్ధమగుచో (జ్ఞప్తికిఁదెచ్చుకొని విచారపడుచున్నపుడు) దోషముగాదు ౨ మఱియు విరుద్ధరసములు సామ్యముచే వివక్షింపఁబడినపుడును దోషములేదు. ౩ మఱియొక ప్రధానరసమునకుఁ (అంగి) గాని భావమునకుఁగాని యంగములుగా విరుద్ధరసముల నిబంధించినను దోషములేదు.

౧. విరుద్ధరసమైనను స్మర్యమాణముగా నిబద్ధమగుచో దోషములేదు.

అయం స రశనోత్కర్షీ పీనస్తనవిమర్దనః
నాభ్యూరుజఘనస్పర్శీ నీవీవిస్రంసనః కరః.

ఈ హస్తము నా మొలనూలి నూడఁదీసి వేసెడిది నా బలిసిన చన్నుంగదిమెడిది. నా నాభిని, తొడలను జఘనమును దడిమెడెడి. నా పోఁకముడిని విప్పెడిది

ఇది యుద్ధభూమియందుఁ దెగిపడిన భూరిశ్రవసుని హస్తమును గాంచి యతని భార్య విలపించిన విధము అతని భార్య యాహస్తమును గాంచి పూర్వావస్థను స్మరించినది. ఇది కరుణరసఘట్టము. దీనికి శృంగారము విరుద్ధము. అయినను శృంగారము స్మర్యమాణముగా నిబంధింపఁబడి కరుణమును బోషించుచున్నది. ప్రకృతి రమణీయములగు పదార్థములు శోచనీయములై తొల్లింటివాని యందచందములును విలాసములును దలఁపునకురాఁగా మిక్కి-

శోకావేగమును గలిగించును. ఈ విధమగు శృంగారము కరుణమును బోషించును. కాన నిట దోషాశంక లేదు.

౨ విరుద్ధరసములు సామ్యముచే వివక్షింపఁబడినపుడును దోషములేదు.

దంతక్షతాని కరజైశ్చ విపాటితాని
ప్రోద్భిన్నసాంద్రపులకే భవతశ్శరీరే
దత్తాని రక్తమనసా మృగరాజవధ్వా
జాతస్పృహైర్మునిభిరప్యవలోకితాని

రక్తమనస్కయగు సింహిక నీ పులకితగాత్రమున నొనర్చిన దంతక్షతములను, నఖక్షతములను గాంచి మునులును జాతస్పృహులయిరి

బుద్ధుఁ డొక జన్మమున మునియై శిష్యులతోడ నరణ్యమునఁ దిరుగుచుండ నొక్కెడ నొక యాఁడుపులి ప్రసవించి కన్నులు గానరాక యాఁకటికి దాళఁ జాలక తన కన్నబిడ్డలనే తాను భక్షించుచుండెను దానినిఁ గాంచి యా బుద్ధుఁడు కరుణాళువు గాన భక్షింపఁబడుచున్న యా శిశువును లాఁగి తన దేహము నా పులికి సమర్పించి మరణించెను ఈ కథను బోధించుచున్న దీ శ్లోకము (ఈకథను నేను వ్యాఘ్రజాతక మను పేరితోఁ బద్యరూపమున వ్రాసితిని జాతక కథా గుచ్ఛములోఁ గలదు.)

ఇందు శృంగార దయావీరములకు సామ్యము వివక్షితమై యున్నది ఇట రెండు విధములగు వ్యాఖ్యానములు గలవు. మొదటిది యిది :—

“తనప్రియురాలొసఁగిన దంతక్షతములను నఖక్షతములను బ్రియుఁడెట్లనురాగాతిశయముతో స్వీకరించునో యట్లే వ్యాఘ్రీదత్తములయిన దంతక్షత నఖక్షతములను జినుఁడును (బుద్ధుఁడు) స్వీకరించెను.” అను నర్థము వచ్చుట వలన దంతక్షతాదిధారణరూపమగు ననుభావములకు సామ్యము వివక్షింపఁబడినది. అనుభావములు రసమున కంగములు గదా ! కావున నిట నంగములకు సామ్యము వివక్షింపఁబడినది. అంగసామ్యముచే నంగిభూతములగు జిననిష్ఠకాముకనిష్ఠములగు దయావీరశృంగారములకు సామ్యము వివక్షింపఁబడెను ఇట నంగి దయావీరము. అంగము శృంగారము, పైనిఁగల ‘తన ప్రియురాలొసఁగిన’ ఇత్యాదికమందు “ఎట్లు స్వీకరించునో యట్లు” ఇత్యాదికము గలదు అందు మొదటిదగు శృంగార ముపమానముగా గ్రహింపఁబడినది కాన నది దయావీరమున కంగము

రెండవ వ్యాఖ్యానము :— “ఒకానొక శృంగారి యొకానొక కాముకుని యొక్క ప్రియాదత్తదంతక్షతాదులను గాంచి నేను గూడ నీ విధముగాఁ బ్రియాదత్తదంతక్షతాది యుక్తుఁడ నగుదునా ? యని యభిలషించునట్లు

జినుని శరీరమందలి వ్యాఘ్రీదత్తదంతక్షతాదులను విలోకించి మునులు మేము గూడ నిట్లు దయాళువుల మగుదుమా ? యని యభిలషించిరి" అను నర్థము వచ్చును. ఇందు జినశరీరస్థములగు దంతక్షతాదులు మునులకుద్దీపన విభావములుగానయ్యెను వ్యాఘ్రీదత్తదంతక్షతాదులు ప్రియాదత్తదంతక్షతములవలె నున్నవనుటచే సామ్యము వివక్షితమైనది కావున నిట నుద్దీపనవిభావములకు ననఁగా నంగములకు సామ్యము పేర్కొనఁబడినది. అంగముల యొక్క సామ్యముచే నంగిభూతములగు మునినిష్ఠపరశృంగారినిష్ఠ దయావీరశృంగారములకుఁ గూడ సామ్యము వివక్షింపఁబడినది

పూర్వ వ్యాఖ్యానమున దంతక్షతాదిరూపమగు ననుభావములకు సామ్య వివక్ష. ఉత్తర వ్యాఖ్యానమున దంతక్షతాదిరూపమగు నుద్దీపనవిభావములకు సామ్యవివక్ష. మొత్తముమీఁద రెండును నంగములే. అంగసామ్యమునుబట్టి యంగిసామ్యము వివక్షింపఁబడినవి

విరుద్ధరసములకు సామ్యమున్నను నెచ్చట నంగరసముచే నంగిరసమునకుఁ బుష్టి గలుగదో యట దోషమే అనఁగా సామ్యము వివక్షింపఁబడినపు డంగరసముచే నంగిరసమునకుఁ బుష్టి గలుగవలయును పైని శృంగారముచే దయావీరమునకుఁ బుష్టి గలిగినది. అట్టి బుష్టి లేనిచో దోషమే. చూడుఁడు

> రామమన్మథశరేణతాడితా దుస్సహేన హృదయే నిశాచరీ
> గంధవద్రుధిరచందనోక్షితా జీవితేశవసతిం జగామ సా

ఆ రాక్షసి (తాటక) మన్మథునివంటి రామునియొక్క బాణముచే హృదయమునఁ గొట్టఁబడినదై గంధముగల చందనముపంటి రక్తమునఁ దోఁగుచు యముని యింటికిఁ బోయెను.

అ నిశాచరి (అభిసారిక) అభిరాముఁడగు మన్మథునియొక్క బాణముచే గొట్టఁబడినదై గంధముగల రక్తచందనమునఁ (ఎఱ్ఱచందనమున) దోఁగుచుఁ బ్రియుని యింట కేఁగెను.

ఇట బీభత్సశృంగారములకు సామ్యము వివక్షితమైనది. అభిసారిక జీవితేశుని గృహమునకుఁ బోయినట్లు తాటకయు జీవితేశుని గృహమునకుఁ బోయెనని సామ్యము వివక్షింపఁబడినది. కాని పైని శృంగారము దయావీరమును బోషించుచున్న ట్లిచ్చట శృంగారము బీభత్సమును బోషించుటలేదు. కాన నిట సామ్యమున్నను రసపోషకత్వము లేమి నిది దోషమే. కావుననే యిది యమతపదార్థమనుదోషముగా నర్థదోషములలో గణింపఁబడినది.

౩. విరుద్ధములయినను ప్రధానభూతమగు భావమునకుఁగాని మఱొకరసమునకుఁ గాని యంగములుగా వివక్షితములయినచో దోషములేదు.

క్రామంత్యః క్షతకోమలాంగుళిగళద్రక్తైస్సదర్భాస్స్థలీః
పాదైః పాతితయావకైరివ పతద్బాష్పాంబుధౌతాననాః
భీతా భర్తృకరావలంబితకరాస్త్వచ్ఛత్రునార్యోఽధునా
దావాగ్నిం పరితో భ్రమంతి పునరప్యుద్యద్వివాహా ఇవ.

లత్తుక జాఱిపోవుచున్నట్లు కంటకక్షతులచేఁ గోమలాంగుళుల నుండి రక్తము స్రవించుచుండఁగా దర్భాంకురములుగల ప్రదేశములందు సంచరించుచుఁ, గన్నుల నీరు గాఱుచుండఁగా భయపడుచు భర్తలచేయి పట్టుకొని నీ శత్రుస్త్రీలు మఱల వివాహప్రవృత్తలయిరో యన్నట్లు దావాగ్నిచుట్టును దిరుగుచున్నారు

ఈ చాటుశ్లోకమున రాజవిషయకమగు రతికిఁ బ్రాధాన్యము. అనఁగా గవి రాజుయొక్క ప్రతాపాతిశయమును వర్ణింపఁబూనెను. కాన రాజవిషయక కవి రతి ప్రధానము కాళ్ళనుండి రక్తము స్రవించుచుండఁగాఁ గన్నీరు విడుచుచు భీతలై దావాగ్ని చుట్టును బరిభ్రమించుచున్నారని చెప్పుటచేఁ గరుణరసము వ్యక్తమగుచున్నది అటనే "ఉద్యద్వివాహా ఇవ" అనియు నుంటచే శృంగారమును వ్యక్తమగుచున్నది మఱియును గరుణరసవ్యంజకములగు విశేషణములే శృంగారరసవ్యంజకములుగా నిలిచినవి కావునఁ బ్రధానమగు రాజవిషయకకవి రతికిఁ గరుణమును శృంగారమును నంగములై యున్నవి. శృంగార కరుణములు పరస్పర విరుద్ధరసములే అయినను నంగియగు రాజరతికి నవి రెండును నంగములై యున్నవి. పరస్పర విరోధులగు నిరువురు సేనాధిపతులొక రాజువద్ద నడఁగి తాము విరోధులయ్యును రాజున కిరువురు ననుకూలభావముతో వర్తిల్లునట్లిచ్చటను రాజరతికి సాక్షాదంగములై తత్పోషణమున జాగరూకములై యున్నవి, ఇట్లే

క్షిప్తో హస్తావలగ్నః ప్రసభమభిహతోఽప్యాదదానోంఽశుకాంతం
గృహ్ణన్ కేశేష్వపాస్తశ్చరణనిపతితో నేక్షితస్సంభ్రమేణ
ఆలింగన్ యోఽవధూతస్త్రిపురయువతిభిస్సాశ్రునేత్రోత్పలాభిః
కామీవార్ద్రాపరాధస్స దహతు దురితం శాంభవో వశ్శరాగ్నిః

ఆర్ద్రాపరాధుఁడగు (నూతనముగా నపరాధమొనర్చిన) కాముకుఁడు తన ప్రియురాలి ననునయింపఁదలఁచి యామె హస్తమును బట్టుకొనెను ఆమె పొం యలుకగలదగుటచే వానిని విదిలించెను. అతఁడును మఱల నామె చీర చెఱఁగును బట్టెను. ఆమె బలిమితోఁ గొట్టెను అతఁడును నామె కేశములను గ్రహించెను. ఆమె వానినిఁ దొలఁగఁ ద్రోసెను వాఁడును జరణములపైఁ ద్రాలెను. ఆమె తొట్రుపాటున (నిర్లక్ష్యభావముతో) వానినిఁ జూడలేదు. అతఁడు తుదికి నామెను గౌఁగిలించెను ఆమెయు వానిని నెట్టివేసెను.

శంభుశరాగ్నియు నిట్టియార్ద్రాపరాధుఁడగు కాముకునివలె నా త్రిపుర యువతులచేతుల నంటెను. వారు విదిలించిరి చీరకొంగులను దాఁకెను వారు దానినిఁ గొట్టిరి. (కొట్టి యార్పుకొనిరి) శిరోజములను ముట్టెను. వారును దొలఁగించుకొనిరి. కాళ్ళపయిఁ బడెను. తడఁబాటున వారు దానిసిఁ జూడక పోయిరి వారి శరీరముల నంటెను, వారును నెట్టివైచిరి.

ఇటఁ త్రిపురరిపువైన శంభుని గుఱించిన కవిరతి ప్రధానము దీనికిఁ గరుణమంగము కరుణమునకు శృంగార మంగము ఏలన, "ఆర్ద్రాపరాధుఁడగు కాముకునివలె" అని శృంగారము కరుణమున కంగముగానే గ్రహింపఁబడినది కరుణ శృంగారములు పరస్పర విరుద్ధములే అయినను త్రిపుర రిపు విషయకరతికి రెండును నంగములే వెనుకటి శ్లోకమున రాజవిషయకరతికి రెండును సాక్షాదంగములు ఇటఁ త్రిపురవిషయకరతికిఁ గరుణమును దానికి శృంగారమును నంగములు ఇదియే భేదము. ఈ భేద ప్రదర్శనార్థమే యీ యుదాహరణము స్వీకరింపఁబడినది ఇందు శృంగారాపేక్షచే గరుణము ప్రధానమయినను త్రిపురవిషయకరతిలో నంగమే.

లేక "తొల్లి కాముకుఁడగు తమ ప్రియుఁడెట్లు వ్యవహరించెనో నేఁడు శరాగ్నియు నా విధముగానే వ్యవహరించుచున్నది" అని తొల్లింటి శృంగారము స్మర్యమాణమై ప్రధానమగు కరుణరసమును బోషించుచున్నది. అనియును జెప్పవచ్చునని కొందఱి మతము

"వినేయానున్ముఖీకర్తుం కావ్యశోభార్థ మేవ వా
తద్విరుద్ధరసస్పర్శ స్తదంగానాం న దుష్యతి."

వినేయులనఁ బామరులు. వారిని సుముఖులనుగాఁ జేసికొనుటకును, గావ్యశోభకును విరుద్ధరసస్పర్శ దోషముగాదు. ఎట్లన,

"సత్యం మనోరమా రామా స్సత్యం రమ్యా విభూతయః
కిం తు మత్తాంగనాపాంగభంగలోలం హి జీవితం"

నిజముగాఁ గాంతలు మనోహారిణులు, సంపదలును రమ్యములే కాని యీ జీవితము మదించిన యువతుల కటాక్షములవలెనే చంచలము.

ఇట "జీవితము చంచలము" అనుచో శాంతరసముగలదు శాంతరసము పరిపక్వ బుద్ధులకే కాని పామరులకాస్వాద్యముగాదు. కానఁ బామరులను గూడ శాంతరసమునకు సుముఖులనుగాఁ జేయుటకై శృంగారాంగమగు మత్తాంగనా కటాక్ష ముపమానముగాఁ గ్రహింపఁబడినది శృంగార మెల్లరికిని ననుభూతమే కాన దాని యుపమానమునఁ బామరులుగూడ శాంతరసమును సులభముగా నాస్వాదింపఁగలుగుదురు. ఇట్టి యెడల నీ విరుద్ధరస సమావేశము దోషముగాదు.

వెనుక ('ప్రసాదే వర్తస్వ') అనుచోటఁ బ్రతికూలవిభావాదిగ్రహణము దోషమని చెప్పితిమి కాని యిట్టిచోట్ల దోషముగాదు.

పైని శృంగారము శాంతరసాంగముగాఁ గూర్పఁబడినది ఒకానొకచో శాంతమే శృంగారాంగముగాఁ గూర్పఁ బడినది. ఎట్లన,

మ. ఎలదోఁటల్ వనముల్ పయోధరము లద్రీంద్రంబు; లాకంటికిన్
ఫలముల్ వాతెఱ; లంగజాంగ మకరాబంధంబు లిచ్చాసనం
బులు; కోపంబునఁ బాయుటల్ తపము, కైవల్యంబు, సంభోగమం
దుల యిచ్చారతి నుండుమానవుల కెందుంగానమీ చిత్రముల్
మరొకటి

చ అలరు విలాసమందిరగుహన్ సుమతల్పకుశాసనంబుపైఁ
గొలుచుచు మేనఁ జందనవిభూతినలంది సుమస్రజంబుఁ దా
పళముగఁ బూని దాల్చివలిపంబనుకావినిఁ గల్కిబంతిఁ బ
న్నిలుతుగుణించి తద్దయుఁ దపించు నిరంతరభోగలబ్ధికై

దోషప్రకరణము సమాప్తము.

గుణప్రకరణము

గీ. ఇంక గుణములు వివరింతు నివియుఁ గృతుల
దొరసి శ్లేష, ప్రసాద, మాధుర్య, సౌకు
మార్య, సమతార్థదీప, నౌదార్య, కాంతు
లనఁగనోజ స్సమాధులు, ననఁ దెలంగు. ౫౬

శ్లేష ప్రసాద, మాధుర్య సౌకుమార్య, సమతా, అర్థదీపన (అర్థవ్యక్తి) ఉదారతా కాంతి, ఓజస్సమాధు లనునవి పది గుణములు మనుష్యునికి గుణము లెట్టివో కావ్యమునకు గుణము లట్టివి "నీతిలేనివాని నింద్రింతు లోకులు! లేదు సేఁగి లాఁతిలేకయున్న" అన్నట్లు మనుష్యుని నీతికిసంబంధించిన గుణముల వంటి గుణములు కావ్యమున లేనిచోఁ గావ్యము నీరసమే యగును. అలంకారములు లేకున్నను లోపము లేదు కాని గుణములు సముచితముగా నిబంధింపఁబడకున్నచోఁ గావ్యమునకు లోపము గలుగును కావుననే వామనుఁడు కావ్యశోభయాః కర్తారో గుణాః తదతిశయహేతవస్త్వలంకారాః పూర్వే నిత్యాః (గుణములు కావ్యశోభను గూర్చునవి అలంకారములు తదతిశయమును గలిగించును. ఇందు మొదటివి (గుణములు) నిత్యములు అని చెప్పెను గుణములు నిత్యమనుటచే నలంకారము లనిత్యములని సారాంశము మఱియు నాతఁడే యిట్లు తెలిపెను

యువతే రివ రూపమంగ కావ్యం స్వదతే శుద్ధగుణం తదప్యతీవ
విహితప్రణయం నిరంతరాభిస్సదలంకారవికల్పకల్పనాభిః
యది భవతి వచశ్చ్యుతం గుణేభ్యో వపురివ యౌవనవంధ్యమంగనాయాః
అపి జనదయితాని దుర్భగత్వం నియతమలంకరణాని సంశ్రయంతే."

యువతియొక్క రూపము వలెనే శుద్ధగుణములు గల (సముచిత గుణములుగల) కావ్యమలంకారములచే మిక్కిలియు నాస్వాద్యమాన మగును గుణహీనమైన కావ్యము యౌవనహీనమైన యువతియొక్క శరీరము వలెనే యలంకారములున్నను దుర్భగముగానే యుండును

౧. శ్లేషము

కం. ఇల సంధిఁగూడి పదములు
వెలఁగొని యొకపదమురీతి నిలిచిన శ్లేషం । బలరు ౫౭

సంధినిఁగూడి పదములొక్క పదమువలె భాసిల్లినచో నది శ్లేషము. మఱియును గేవలము సంధినిఁగూడి పదములేకపదాకారముగాఁ గానిపించుటయే కాక యేకస్థానీయములగు శబ్దములు బహుళముగా నుండుటవలనను నేకాకారముగా భాసిల్లినచో శ్లేషము. దీనినే మసృణత్వమని వామనుఁ డనెను

శా. ఆ లావణ్య మగణ్యా; మా గుణగణం బవ్యాజ; మా తేజము
ద్వేలం; బావినయం బమేయతర; మావీర్యం బనిర్వాచ్య; మా
యాలాపం బతిసత్య; మా వితరణం బాశాంతవిక్రాంత, మా
శీలం బార్జవమూల మెన్నఁదరమే శ్రీనారసింహాధిపున్. ౫౮

ఇట సంధి (ఉకారసంధి) వశమున నేకపదాకారముగాఁ బదములు భాసిల్లినవి. అ ఇ, ఉ కారాంతశబ్దములకు అచ్చుతోడి నిత్యసంధి వచ్చినపుడే యీ యేకాకారత గోచరించును. ఈ క్రింది పద్యము లుదాహరణములుగావు.

కం. భీకర దానవుఁడొక్కఁడు
నా కొమరుం బాడుకొనుచు నాశ్రమముకడన్
భూకాంతా । యుండం గని
కై కొనిపోయెన్ వచింపఁగలదే యింకన్ ?

గీ. సత్పురాణాశి కావ్యముల్సరసరీతి.

ఇందలి మొదటిపద్యమున నేకాకారత గొంతగోచరించినను 'దాక్కఁడు', 'రుండాడు' 'యుండం' ఇత్యాదులచే నా యందము తిరోహిత మగుచున్నది. రెండవ పద్యమున సత్పుల్సరస, ఇత్యాదిచేఁ దిరోహిత మగుచున్నది.

౨. ప్రసాదము

కం ......ప్రసిద్ధపదంబుల
నలఘూక్తి ప్రసాదమయ్యె నది యెట్లన్నన్.

ప్రసిద్ధపదములను వాడుట ప్రసాదము

ఉ ముంగిటి పెన్నిధాన; మిలుము దటి కల్పక, మర్థికోటిముం
గొంగుఁబసిండి, చెంగటనకూడిన బంగరుకొండ, దొడ్డితో
వంగల కామధేను; వదనం బెఱయీఁగలు లేని చొక్కపుం
దంగెటిజున్ను నీ వితరణంబు నృసింహ నృపాలశేఖరా! ౫౯

ఇందన్నియుఁ బ్రసిద్ధపదములే. వామనుఁడు "శైథిల్యం ప్రసాదః" (బంధముయొక్క శిథిలత్వము ప్రసాదము) అని లక్షణము చెప్పి "ఇదియోజో గుణమునకు విపర్యయరూపమనియు గుణవిపర్యయములు దోషములు గాన ప్రసాదము దోషమగునుగదా యని శంకించి కేవలబంధశైథిల్యము దోషమే యనియు నోజోగుణ మిశ్రితమగు ప్రసాదమే గుణమనియు సిద్ధాంతించెను. ఓజోగుణమును ముందుఁ దెలుపఁబడును

తేజస్తిమిరములవలెఁ బరస్పరవిరుద్ధములగు నోజఃప్రసాదములకుఁ గలయిక యెట్లు సిద్ధించునన్న నది యనుభవైకవేద్యము ఎట్లు కరుణరసప్రధానము లగు నాటకములతోఁ బరస్పరవిరుద్ధములగు సుఖదుఃఖములు గలుగుచున్నవో యెట్లది యనుభవైకవేద్యమో యోజఃప్రసాదముల కలయికయు ననుభవసిద్ధమే. ఈయోజఃప్రసాదముల కలయిక త్రివిధముగా నుండును ఒక్కచో నోజః ప్రసాదములు సమానముగానుండును ఒకచో నోజస్సధికముగా నుండును. వేఱొకచోఁ బ్రసాద మధికముగానుండును ఈ క్రింది లక్ష్యములయందీ మువ్విధములను గనుఁడు

౧. ఓజఃప్రసాద సామ్యము

శా కామోత్కంఠిత గోపికల్ భయమునన్ గంసుండు, వైరిక్రియా
సామగ్రిన్ శిశుపాలముఖ్యనృపతుల్ సంబంధులై వృష్ణులున్,
ప్రేమన్ మీరలు భక్తినేము నిదె చక్రింగంటి మెట్లైన ను
ద్దామధ్యానగరిష్ఠుఁడైన హరిఁ జెందన్ వచ్చు ధాత్రీశ్వరా

౨. ప్రసాదముకన్న నోజస్సుయొక్క యాధిక్యము

ఉ. ధారుణిరాజ్యసంపదమదంబునఁ గోమలిఁ కృష్ణఁజూచి రం
భోరు నిజోరుదేశమున నుండఁగఁ బంచిన యిద్దురాత్ము దు
ర్వారమదీయబాహుపరివర్తితచండగదాభిఘాతభ
గ్నోరుతరోరుఁజేసెద సుయోధను నుగ్రరణాంతరంబునన్

౩ ఓజస్సుకన్నఁ బ్రసాద మధికముగా నుండుట

మ కురువృద్ధుల్ గురువృద్ధబాంధవు లనేకుల్ సూచుచుండన్ మదో
ద్ధురుఁడై ద్రౌపది నిట్లుసేసిన ఖలున్ దుశ్శాసనున్ లోక భీ
కరలీలన్ వధియించి తద్విపుల వక్షశ్శైల రక్తౌఘ ని
ర్ఝరముర్వీపతి సూచుచుండ నని నాస్వాదింతు నుగ్రాకృతిన్

౨. మాధుర్యము

కం. సరసములగు వాక్యంబులు
వరుసను వేర్వేఱమించు వగ మాధుర్యంబు.

విడివిడిగా ననఁగా దీర్ఘసమాసములు లేక సరసములగు పదములు గూర్చినచో నది మాధుర్యగుణము 'పృథక్పదత్వం మాధుర్యం' అను వామనుని లక్షణమున కిదియే యర్థము, 'సరసములగు వాక్యంబులు' అనుచో వాక్యమనఁ బదమనియే లక్షణార్థమును జెప్పుకొనవలెను

చ అనయము మత్స్యయంత్రమునొకమ్మున శ్రీనరసింహుఁడేయఁగా
వెనుకకుఁబాఱె పుల్గఱచి, వేషముమార్చి బిలంబుదూఱె, కా
ననమునకేగి, సిగ్గున నణంగి, భరంపడి, వీఁగి తా విషం
బెనసి నతిన్ భజించి, నడులీఁది భ్రమించెను రాసులన్నియున్.

నరసభూపాలుఁడు మత్స్యయంత్రమును గొట్టఁగా మిగిలినరాసులలో నున్న మేషము వెనుకకుఁ బరుగిడెను; వృషభము గర్జిక ఱచెను; మిథునము వేషము మార్చుకొనెను, కర్కటకము బిలము దూరెను; సింహము కానన మున కేఁగెను, కన్య సిగ్గుపడెను తుల బరువెక్కి వంగెను; వృశ్చికము విషము బొందెను (తినెను) ధనుస్సు నతిని బొందెను (వంగెను); మకరము నదులలోఁబడి యీఁదెను, కుంభము భ్రమించెను ఇట్లు మిగిలిన రాసులన్నియు నలఁబడి వహించెనని భావము. (వాని వాని స్వాభావిక వ్యాపారమును గవి ప్రౌఢోక్తిచే నలఁబడిగాఁ జెప్పినాఁడు.)

మనుచరిత్రమునందలి "తరుణీ ! రేపును మాపు" మొదలగు సమాసములు లేనివియు దీర్ఘసమాసములు లేనివియు నగు పెక్కు పద్యము లీ మాధుర్యగుణమున కుదాహరణము లగును ఈ క్రింది పద్యము దీర్ఘసమాసము గలదగుట మాధుర్యోదాహరణము కాఁజాలదు.

చ కలఁడుల్లోకమహోమహోగ్రహుతభుగ్జ్వాలావళీనిర్గల
న్నలదంభోనిధిలక్ష్యహైమవతపతుశ్లోదదక్షోరుది
గ్వలభీదుర్భరభేరికాళయదఖాంకారైకసంప్రాణితా
చలవైరిస్తుతకీర్తిసాంద్రుఁడు వసుష్మాపాలచంద్రుం డిలన్

వెనుకటి "అనయము మత్స్యయంత్రమును" "తరుణీ ! రేపును మాపు" మొదలగు పద్యములందలి మాధుర్యము శబ్దగతము. అర్థగతమాధుర్యమన సూక్తి వైచిత్ర్యము "తెలిసిన మూర్ఖుఁడు" "పామరులలోఁ పండితుఁడు" మొదలగునవి యుదాహరణములు దీని నాంగ్లమున Oxymoron అందురు.

౪. సౌకుమార్యము

కం. అరయఁగ బొట్లు పిఱుందల
నరుదగు నది సౌకుమార్యమగు నెట్లన్నన్. ౬౧

సున్నలు ముందుగల యక్షరములు గలిగియున్న బంధము సౌకుమార్యము.

ఉ చెందొవవిందు మందువలెఁ జిందు రుచిందగఁ; బందనంబు వె
చ్చందన మొందు; నిందుముఖ చందము డెందమునం దలంప నీ
యందమునందె నందనమునందు మిళిందముపొందు పొందికం
జెందెన్నృసింహ ! కౌఁగిటను జేర్పుము ! ముందుగమందగామినిన్.

ఇందు బిందుపూర్వక 'ద' కార బంధము బహుళముగా నున్నది. కాని వామనుఁడు "అపారుష్యం సౌకుమార్యం" అని లక్షణము చెప్పెను కావున బిందుపూర్వాక్షరబంధమే యని నియమము లేదు పరుషత్వములేని బంధము సౌకుమార్యము. కావున

ఉ. ఎక్కడియూరు కాల్నిలువకింటికిఁ బోయెదనంచుఁ బల్కెదీ
వక్కట మీ కుటీరనిలయంబులకున్ సరికాకపోయెనే ?
ఇక్కడి రత్నకందరము; లిక్కడి నందనచందనోత్కరం
బిక్కడి గాంగసైకతము లిక్కడి యీ లవలీనికుంజముల్.

ఈ బంధము సౌకుమార్యమే యగును ఈ క్రిందిది విపరీతోదాహరణమగును.

మ. కలఁ దత్యుత్కటధాటికాతురగరింఖాజాతభూక్షోద క
జ్జలదిక్క్షిప్త మహఃప్రదీపహృతతీక్ష్ణధ్వాంతవేలాకుట్య
ద్బలగేహప్రతిమాయితామితసమిద్వైరికులధ్వానమం
డలనిర్విణ్ణరిపుక్షితీంద్రుడుఁ సుచం దక్ష్మాపచంద్రుం డిలన్

అర్థమునఁ బారుష్యము లేకుంటయు సౌకుమార్యమే; మృతునిఁ గూర్చి కీర్తిశేషుఁడనుట మొదలగునవి దీని నాంగ్లమున 'Euphemism' అందురు దీనిని మన యాలంకారికులు గుణమనిరి ఆంగ్లేయు లలంకారముగా గణించిరి

౫ సమత

కం. లలితార్థభంగిఁ బాదం
బులు నాల్గిట నేకసరణిఁ బొదువ సమతయౌ. ౬౨

లలితమగు నర్థము నాలుగుపాదములలో నొకేవిధముగా నిబంధించుట సమత.

ఇట అర్థభంగి' అని చెప్పఁబడినది. కేవల మర్థమేకాదు. శబ్దబంధము యొక్క సమతయు గ్రాహ్యమే వామనుఁడు "మార్గాభేదస్సమతా" ఏమార్గమున నుపక్రమింపఁబడునో యా మార్గమును విడువకుండుట సమత అని లక్షణమును నుడివెను. కావ్యముయొక్క ఆది, మధ్య, అవసానములం దొకేవిధమగుమార్గము సమత యనఁబడును.

సీ. కరవేగములు లేవె! కలయంత్రపాతీన
పాటనక్రియకు నేర్పడవుగాక
చాతుర్యములు లేవె? కారదాభండార
చోరకారశ్రీకిఁ జొరవుగాక
వితరణంబులు లేవె? వివిధయాచకనృపా
లకకంఠదఘ్నముల్ కావుగాక
సామర్థ్యములు లేవె? సరిదన్యపథయాన
శాసనప్రౌఢికిఁ జనవుగాక

గీ. తొలుత గడిదుర్గములనున్న దొరలు లేరె?
మహిమ నీ మాడ్కిఁ గదనదుర్మదసపాద
సారసప్తాంగహరణులు లేరుగాక,
నరసుతాటోప! యోబయనరసభూప!

ఇట 'శరమార్గములులేవె?' అని ప్రారంభింపఁబడినమార్గమే నాలుగు పాదములందును గలదు ఈ సమత యొక పద్యమునందును ప్రబంధమునందును గూడ నుండవలయును ఇది పలువిధములుగా నుండును. అంత్యానుప్రాసము మొదలిడినచో నామార్గము తుదిదాఁక నిర్వహింపవలెను ఇట్టులే యూహింపఁ గానవలెను దీనికి విపర్యయ మీ క్రిందివిధమున నుండును.

కం శ్రీకంఠ చాపఖండన!
పాకారి ప్రముఖవినుతభండన! విలస
త్కాకుత్స్థవంశభూషణ
రాకేందుయశోవిశాల! రామమహీపా

'వంశమండన'కు 'వంశభూషణ' అనియు 'రామనృపాలా' అనుటకు "రామమహీపా" అనియుఁ జెప్పినచో మొదలు సేసిన యంత్యప్రాస నియమ మంతర్ధానమైపోయినది.

౬. అర్థవ్యక్తి (అర్థదీపనము)

కం. ఇల నర్థము వ్యక్తంబై
నలువొందిన నర్థదీపనం బెట్లన్నన్

అర్థము స్ఫుటముగా గోచరించినచో నర్థవ్యక్తి

సీ. నలువొందు నమరేంద్రునాగంబుసాటిగా
సామజంబుల నెల్ల సంతరించి
విఖ్యాతికెక్కిన వెలిమావుసాటిగా
సైంధవముల నెల్ల సవరణించి
మహిమమించిన మింటి మ్రాఁకులసాటిగా
జాదవంబుల నెల్ల జాదుకొలిపి
వన్నెకెక్కిన దేవవాహినిసాటిగా
నిల నెల్ల నేఱుల నిరవుకొలిపి

గీ. స్వర్గసృష్టికిఁ బ్రతిసృష్టి సలుపుకీర్తి
వసుధఁ గౌశికగోత్రపావనుఁడవైన
నీకు దగుఁగాక మఱి యన్యనృపులకగునె?
సరసగుణహార! తొయిజయ నరసధీర.

ఈ పద్యమున నర్థస్ఫురణము గలదు. అనఁగా నర్థము స్ఫుటముగా గోచరించును దీనికి విపరీతోదాహరణము గనుఁడు

మ కలఁడుశ్లోక......వసుష్మాపాల చంద్రుం డిలన్

౭ ఔదార్యము

కం. కతిపయసంయుక్తాక్షర
వితతం బౌదార్యమయ్యె... ౬౫

కొన్ని సంయుక్తాక్షరములు గల బంధమౌదార్యము.

చ. ఎదిరిన యోబళారి నరసేంద్రునికీర్తి నిజాంగుపంక్తికి
మదనవిరోధి భీతుఁడయి మార్గొనకేఁగినఁ దద్రథంబుఁద
త్పదనము నాక్రమించి రథసంబున నావృషభాధిపధ్వజున్
వెదకఁజుమీ! యజాండముల వే వెడలెంగడిలేనియాసునన్.

ఇందుఁగొన్ని సంయుక్తాక్షరములు గలవు వామనుఁడు 'వికటత్వ ముదారతా' కూర్పునందలి వికటత్వ ముదారత (ఔదార్యము) అని లక్షణముచెప్పెను. ఏకూర్పునందు వర్ణములు నర్తించునట్లు వినువారికి గోచరించునో యాకూర్పు ఔదార్యము. నరసభూపాలీయలక్షణముకన్న నీ క్రిందిపద్యముమేలైనది ఎట్లన,

చ. అటఁజని కాంచె భూమిసురుఁ డంబరచుంబిశిరస్సరజ్ఝరీ
పటలముహుర్ముహుర్లురదభంగతరంగమృదంగనిస్వన
స్ఫుటనటనానురూపపరిపుల్లకలాపికలాపజాలముం
గటకచరత్కరేణుకరకంపితసాలము శీతశైలమున్.

ఇటఁ జుంబనవ్యాపారమున కనుకూలముగా బిందుపూర్వక బకారబంధము, మృదంగధ్వనికి స్ఫోరకముగా బిందుపూర్వక గకారబంధము, నటనానురూపముగా టకారబంధమును గలదు ఇదియే వికటత్వము ఇటఁ గేవలము వర్ణములు నర్తించుచున్నట్లేకాక యా యా యర్థములను స్ఫురింపఁ జేయుచున్నట్లును గూర్పఁబడినవి. ఇట్టి బంధమే వికటత్వము. ఈ వికటత్వము గల కూర్పు ఔదార్యము

ఈ పద్యముఁ గొలఁదిగా నీ క్రిందివిధమున మార్చినచో వికటత్వము గూడ భ్రష్టమగును ఎట్లన,

అటఁటని కాంచె భూమిసురుఁడాకసమంటు శిరస్సరజ్ఝరీ
పటలముహార్ముహార్లరదవారిత వీచి మృదంగ నిస్వన
స్ఫుట రమణానురూప పరిమూర్ఛితబర్హి మయూరజాలమున్
గటక ... ... శీతశైలమున్.

పై పద్యములోని యందమిందు లేదని సుగమముగాఁ దెలియును. దీని నాంగ్లమున Onomatopocia అందురు. దీని నిట్లు వారు వివరించిరి The sound must seem an echo the sense (శబ్దము అర్థమునకుఁ బ్రతి ధ్వనిగా నుండవలెను.) దీనిని మన యాలంకారికులు కావ్యగుణముగా గణించిరి ఆంగ్లేయులలంకారముగా నుడివిరి.

౮. కాంతి

కం. ... ... విమలవిచిత్రా
యతవర్ణావృత్తులు గల
యతిమృదుబంధంబు కాంతి యగు నెట్లన్నన్,

విచిత్రముగా నక్షరావృత్తులు అనఁగా వచ్చిన వర్ణమే మఱల వచ్చుట గల బంధము కాంతి

సీ. వెలవంకతోఁడివెన్నెలవంక గల మేటి,
నెలవంకరహితాంకునియతిఁ దెగడి
వనయమ్ముఁ వానిఁగన్న నయమ్ముఁగల యింతి
వనయమ్ముఁ దాల్పువానన్నఁ జెనకి
కడలేక తరిగొండకడలేకడలఁద్రోయు
కడలేకమైన మీఁగడల గెలచి
కపురాలవన్నెచొక్కపురాలనగు మేని
కపురాలపోతుబింకంబు నణఁచి

గీ. తనరుచుల లోకములునిండఁ దనరుచుండు
లాటకరవోటలలనాలలాటఫలక
మలయజములైన నీదు నిర్మలయశంబు
లమితగుణసాంద్ర! నారసింహక్షితీంద్ర! ౬౭

ఇట నాలుగుపాదములందును వర్ణావృత్తులు స్పష్టము. ఈ పద్యమును జదువునపుడు ముక్తాయింపు స్ఫురించును అట్లు స్ఫురించిననే కాంతియగును.

ఇది యనుప్రాసముగాదు. రెండక్షరములు దగ్గఱగానుండి యావృత్తి యేర్పడినచో ననుప్రాసము సమానములగు నచ్చులు సముచితస్థలమున వినఁబడినచో నేర్పడునది కాంతి ఇది యమక భేద మగును

ఈ క్రింది పద్యము విపరీతోదాహరణ మగును

శా. జ్యాఘోషంబతిభీషణంబయి దిశాచక్రంబునిండన్శర
వ్యాఘాతంబున శాత్రవుఁడు వికలస్వాంతుండుగా నారద
శ్లాఘాపాత్రముగా నిరర్గళభుజాసంరంభతన్ రౌద్ర రే
ఖాఘోరాకృతియేన చూపెదఁ గదంకం జూడుఁడీ ! యేర్పడన్.

ఇందు, ఓజస్సు ప్రసాదము కొంతశ్లేషమును గలవు కాని కాంతిలేదు.

౬ ఓజస్సు

కం. విలసితసమాసభరితో
జ్జ్వలబంధంబోజమయ్యె సరి...... ౬౮

దీర్ఘసమాసమగు బంధ మోజము వామనుఁడు 'గాఢబంధత్వమోజః (గాఢబంధము గలిగియుంట యోజస్సు) అని లక్షణము చెప్పెను ఈ గాఢత్వ మెట్లు గలుగును? సంయుక్తాక్షరములు గలిగియుండుట, రేఫయుక్తమయిన వర్గప్రథమ ద్వితీయాక్షరముల యొక్క సంయోగము (ర్క ర్ఖ క్రి ఖ్రి) వర్గముల తృతీయ చతుర్థవర్ణముల సంయోగము (గ్ఘ జ్ఝ మొ.) వర్గ ప్రథమ వర్ణసంయోగము (క్క చ్చ మొ) వర్గతృతీయ వర్ణసంయోగము (గ్గ మొ) విసర్గనీయ జిహ్వామూలీయ ఉపధ్మానీయముల ప్రయోగము, తుదియందు గురు వుండుట, సమాసములు గలిగియుండుట వీనిచే గాఢత్వము గలుగును. కానఁ గేవల సమాసములు గలిగి యుండుటయే యోజస్సుగాదు.

సీ. మందారవిపకందకుందాదినిధిబృంద
బృందారకాస్తశోభితయశుండు
హేలావిజితహాలహాలాశనోత్తాల
తాలాంకభుజదండతాండవుండు
దీనావననిదానదానాంబుజనదీన
దీనాథపరిణయస్థితివిధాయి
భీమాసురవిరామరామాతిశయధామ
ధామాంబకనిభాసిదారితారి
గీ. రాజమాత్రుండె వసుధాధిరాజమకుట
నికటవికటమహానీలనికరసుకర

మధుకరకరంబితాంఘ్రి పద్మద్వయుండు
సరసగుణహారి యోబయనరసశౌరి.

ఈ పద్యమున సమాసభూయిష్ఠత్వము గలదు. కాని బంధమందలి గాఢత్వము లేదు

ఈ క్రింది పద్యమున గాఢబంధత్వము గలదు

శా. దుర్వారోద్యమ బాహావిక్రమరసాస్తోక ప్రతాపస్ఫుర
ద్గర్వాంధప్రతివీరనిర్మథనవిద్యాపారగుల్ మత్ప్రభుల్
గీర్వాణాకృతులేవురిప్డు నిను దోర్లీలన్ వెసంగిట్టి గం
ధర్వుల్ మానముఁ బ్రాణముంగొనుట తథ్యం బెమ్మెయిం గీచకా!

౧౦. సమాధి

కం. ......అన్యగుణం
బులు మఱివేఱొక్కటిపై
నలరింప సమాధియయ్యె నదియెట్లన్నన్.

ఒకదాని ధర్మములు మఱొక్కదానికంటఁగట్టుట యనఁగా నారోపించుట సమాధి.

సీ. అల బలీంద్రునిచేత నడుగ వెట్టఁగనేర్చి
ధారాధరముచేత నీరు మోసి
కానీనుచేఁ గంచుకముఁ బూనఁగా నేర్చి
యెలమి దధీచిచే నెమ్ముఁబలిసి
క్షీరాంబురాశి దెచ్చినవెన్న నీడేలి
నైలింపగవి చన్నుఁబాలఁ బెరిగి
కల్పపాదపఫలోత్కరములఁ బదిఁగాంచి
వనజారినెమ్మేన నవఁగి పెనఁగి

గీ. ధరణిఁ ద్రోదివహించిన దానకన్య
సకలయాచకబాంధవుల్ సంతసిల్ల
నీ కరగ్రహణావాప్తి నెరసెనౌర!
వైతిగబసింహ! యోబయనారసింహ?

ఇందలి యడుగుపెట్టుట, నీరుమోయుట, కంచుకముఁ బూనుట, ఎముక బలియుట అను ధర్మములు బలి, ధారాధర, కానీన దధీచిమునులకు సంబంధించినవి. దానకన్యయం దారోపింపఁబడినవి.

వామనుఁడు "ఆరోహావరోహక్రమస్సమాధిః" అని లక్షణము నుడివెను దీర్ఘాదిగుర్వక్షరము లధికముగా నుండుట యారోహము, లఘ్వక్షరము లధికముగా నుండుట యవరోహము క్రమముగా నారోహమును గ్రమముగా నవరోహమును గల బంధము సమాధి.

కం. కరుణించి యిందు నాకుం
బురోహితునిఁగాఁగ మీ సుపుత్రుఁ బవిత్రున్
బరమతపోనైష్ఠికు భా
సురయమనియమాభిరాము సోమశ్రవసున్.

పూర్వార్థమునఁ గ్రమముగా నారోహమును ద్వితీయార్థమునఁ గ్రమముగా నవరోహమును గలవు

గుణవిమర్శనము

భరతుఁడు నాట్యశాస్త్రమున నీదశగుణములను పేర్కొని వాని లక్షణములను దెలిపెను. కాని యీ గుణములయొక్క యుపయోగమేమియో తెలుపఁడయ్యెను పిమ్మట భామహుఁడీ దశగుణములను జూచి వీనిలో మాధుర్య ఓజః ప్రసాదములను మూఁడుగుణములే ముఖ్యములని వచించెను దండి యీ దశగుణములను జూచి కొన్నింటితో వైదర్భీరీతియుఁ గొన్నింటితో గౌడీరీతియు, నేర్పడునని చెప్పెను వామనుఁ డీదశగుణములనే శబ్దగుణములు అర్థగుణములు, అని రెండువిధములుగా విభజించి వానికిఁ బ్రత్యేకముగా లక్షణనిర్వచనము చేసెను. అతఁడును గుణములతో రీతి యేర్పడునని వచించెను భరత, దండి, వామనులు గ్రహించిన గుణములొకటే కాని లక్షణనిర్వచనమున నెల్లరును భేదించిరి ఒకరి మతమున నొక గుణము మఱొకరి మతమున వేఱొక గుణముగా నయ్యెను ఆనందవర్ధనుఁడు భామహునివలెనే మాధుర్య ఓజః ప్రసాదములు అను మూఁడు గుణములే గ్రహించెను. అతఁడీ గుణములను రసధర్మములుగా నిర్ణయించెను. అతనివిమ్మటివారగు మమ్మటాదు లందఱును నా మూఁడు గుణములనే గ్రహించిరి ఈ విషయమున మమ్మటుని నిర్వచన మిది.

"మాధుర్యౌజః ప్రసాదాఖ్యాస్త్రయస్తే న పునర్దశ
కేచి దంతర్భవం త్యేషు దోషత్యాగా త్పరే శ్రితాః
అన్యే భజంతి దోషత్వం కుత్రచి న్న తతో దశ"

మాధుర్యము ఓజస్సు ప్రసాదము అనునవి మూఁడే గుణములు కాని పదికావు. ఇతరగుణములు కొన్ని వీనిలోనే యంతర్భవించును కొన్ని

తత్తద్దోషములను బరిహరించుటవలననే సరిపడును. కొన్ని (గుణములు) దోషములే యగును కానఁ బదిగుణములుండవు.

“పెక్కుపదములేకపదాకారముగా భాసిల్లుట” యను శ్లేషగుణమును ఆరోహావరోహక్రమరూపమగు సమాధియు, వికటత్వరూపమగు నుదారతయు, ఓజస్సుతోఁగూడిన శైథిల్యమను ధర్మముగల ప్రసాదమును, ఓజస్సులో నంతర్భవించును. పృథక్పదత్వమను పేరుగల మాధుర్యగుణము వామన లక్షణము కన్న భిన్నలక్షణముతో నదే సాక్షాత్తుగా స్వీకృతమై యున్నది అర్థదీపనము (అర్థవ్యక్తి) ప్రసాదగుణమున నంతర్భవించును మార్గాభేదరూపమగు సమత యొకానొకచో దోషమే. ఎట్లన,

శా. సింగంబాఁకటితో గుహాంతరమునం జేట్పాటుమైనుండి మా
తంగస్ఫూర్జితయూథదర్శనసముద్యత్క్రోధమై వచ్చునో
జం గాంతారనివాసఖిన్నమతి నస్మత్సేనపై వీఁడె వ
చ్చెం గుంతీసుత మధ్యముండు సమర స్థేమాభిరామాకృతిన్.

ఇట రెండవయర్థమున మసృణమార్గత్యాగము గుణమే

చ. కనుఁగొని కోపవేగమునఁ గన్నులు నిప్పులురాల నంగముల్
దనరఁగ సాంద్రఘర్మసలిలంబులు గ్రమ్మ నితాంతదంతపీ
డనరటదాస్యరంగ వికటభ్రుకుటీచటులప్రవృత్తన
ర్తనఘటనాప్రకారభయదస్ఫురణాపరిణద్ధమూర్తియై

ఇటను మూఁడు నాలుగు పాదములలో మసృణమార్గత్యాగము గుణమే.

కష్టత్వ, గ్రామ్యత్వములు దోషము లగుటవలన వానిని నిరాకరించినచో అపారుష్యరూపమగు సౌకుమార్యము,ఔజ్జ్వల్యరూపమగు కాంతియును గ్రహింపఁ బడవలసిన పనియుండదు కావునఁ బది శబ్దగుణములు లేవు”

ఇట మాధుర్యౌజః ప్రసాదములలో నితరగుణముల నంతర్భవింపఁజేసి చూపెను మఱియును తత్తద్దోషపరిహారమును జూపి కొన్నిగుణము లక్కఱ లేదనియును జూపెను

(నరసభూపాలీయ కర్త యర్థగుణవిభాగమును జూపలేదు.) మమ్మటుఁ డర్థగుణవిభాగమును గూడఁ బైవిధముగనే ఖండించెను ఇందర్థగుణప్రసంగములేదు. కావున నా ఖండనము చూపఁబడలేదు

జగన్నాథుఁడును వామనమతానుసారముగా శబ్దగుణ అర్థగుణవిభాగములను జర్చించి చూపి తుదకు మమ్మటునివలెనే మాధుర్యౌజః ప్రసాదములను

మూఁడుగుణములనే యంగీకరించెను సామాజికుని చిత్తమందుఁ గలుగు ద్రుతి, దీప్తి, వికాసములు, అను ధర్మములను బట్టి క్రమముగా మాధుర్యౌజః ప్రసాదములనే గుణములనుగా స్వీకరించెను అతని నిర్వచనమిది —

"గుణానాం చైషాం ద్రుతిదీప్తి వికాసాఖ్యా స్త్రిస్రశ్చిత్తవృత్తయః క్రమేణ ప్రయోజ్యాః తత్తద్గుణ విశిష్టరసచర్వణాజన్యా ఇతియావత్" ఈ గుణమువలన ద్రుతి, దీప్తి వికాసము అనుమూఁడు చిత్తవృత్తులు గలుగును. అనఁగా నాయా గుణములతోఁ గూడిన రసమును జర్వణము చేయుటవలన నా చిత్తవృత్తులు గలుగును.

మూఁడుగుణములే స్థిరపడినను ప్రతాపరుద్రీయకర్త సామాన్యముగా నెల్ల విషయములలో మమ్మటుని ననుసరించినను గుణములలో భోజుని, అలంకారములలో రుయ్యకుని ననుసరించి భోజమతానుసారముగా * ౨౪ గుణముల నిచ్చెను బట్టుమూర్తి సర్వదా ప్రతాపరుద్రీయము ననుసరించినను గుణములలో దాని ననుసరింపక వామను ననుసరించెను కాని లక్షణనిర్వచనమునమాత్రము వామనుని ననుసరింపలేదు. ఏ లక్షణము గూడ సమగ్రముగా నిర్దుష్టముగాలేదు.

ప్రథమాశ్వాసములోని పీఠికాపద్యములలో పదునైదవదియగు 'సీ. బాణువేగంబును భవభూతి సుకుమారతయు అను పద్యమున వేగము, సుకుమారత సువర్ణకలన అర్థసంగ్రహము శయ్యనేర్పు ప్రసాదము నియమము, సన్మార్గఘటన ధారాశుద్ధి సహస్రముఖస్పృష్టి అను తత్తత్కవుల గుణములును నిచ్చటి గుణములును జాలభిన్నములు సుకుమారత, ప్రసాదము అను రెండు మాత్రమే యీ దశగుణములలో నున్నవి ఈ గుణములు భోజరాజోదాహృత గుణములును గావు. ఇవి శాస్త్రదృష్టితోఁ జెప్పఁబడినవికాక లోకదృష్టితోఁ జెప్పఁబడినవి.

ఈ గుణములు రసధర్మములనియు ననఁగా "రస మెచ్చటనుండునో గుణము లచ్చటనుండును గుణము లెచ్చటనుండునో రసమచ్చట నుండును" అనియును స్పష్టముగా నింతకుముందే నిర్వచింప బడియున్నది ఇదియే సిద్ధాంతము ఈ సిద్ధాంతమునే యానందవర్ధన, అభినవగుప్త, మమ్మట జగన్నాథాదులగు వాలంకారికసార్వభౌము లందఱును సమ్మతించిరి

* భోజుని గుణములివి .— శ్లేష ప్రసాదము, సమత, మాధుర్యము, సుకుమారత, అర్థవ్యక్తి ఉదారత్వము కాంతి ఉదాత్తత ఓజస్సు, సుశబ్దత, ప్రేయను, ఔర్జిత్యము విస్తరము, సమాధి సౌక్ష్మ్యము, గాంభీర్యము, సంక్షేపము, భావికము సమ్మితత్వము ప్రౌఢి రీతి ఉక్తి, గతి అనునవి. భోజుఁడీ యిరువదినాల్గును శబ్దగుణములుగా అర్థగుణములుగా మొత్తము ౪౮ గుణములుగా విభాగించి యుదాహరించెను

ఈ మాధుర్య ఓజః ప్రసాదగుణముల లక్ష్యలక్షణముల నిట్లు మమ్మటుఁడు నిర్వచించెను

మూర్ధ్ని వర్గాంత్యగాః స్పర్శా అటవర్గా రణౌ లఘూ
అవృత్తి ర్మధ్యవృత్తిర్వా మాధుర్యే రచనా తథా

ట ఠ డ ఢ తక్క మిగిలిన కకారాదిమకారాంతవర్ణములును ంగ,ంత, ంద యను ననునాసికాక్షరములతోఁ గూడిన వర్గాక్షరములును, హ్రస్వములగు ర ణ, వర్ణములును అసమాసమును మధ్యమసమాసమును (అల్పసమాసము) గలిగియున్న రచన మాధుర్యగుణమును దెలుపును ఎట్లన

అనంగరంగప్రతిమం తదంగం భంగీభిరంగీకృతమానతాంగ్యాః
కుర్వంతి యూనాం సహసా యథైతాస్స్వాంతాని శాంతాపరచింతితాని.

ఆ యువతియొక్క విలాసములు గలిగి మన్మథరంగమువలెనున్న శరీరము యువకుల మానసములను సమస్తములగు నితరచింతలను మానివేసిన వానినిఁగాఁ జేయుచున్నది

ఈ శ్లోకము ంగ ంత వర్ణములు గలిగియున్నది ఈ గుణప్రకరణమున సౌకుమార్యమున కిచ్చిన సరసభూపాలీయోదాహరణమగు (బెండొత వెందు) అనుపద్యముగూడ మాధుర్యవ్యంజకమే (మమ్మటమతానుసారముగా నందలి గుణము మాధుర్యమే కాని సౌకుమార్యము గాదు)

మఱియు టవర్గహీనమగు కకారాది మకారాంతవర్ణములుగల రచన కుదాహరణము.

సీ బంగారుగొలుసులుఁ బవడంపుఁ దరవణికోళ్లను వింతబాగులబొగడలు,
రత్నపుఁజిలుకలు, రాయంచపతిమలుఁ బసిఁడిపువ్వుల వ్రాఁతపనుల సొబగు,
వివిధంబులగు చిత్రవిరచనలును, దసిలీనూలిపట్టయల్లిక బెడంగుఁ
బలుతెఱంగుల పట్టుతలగడబిల్లలు, మవ్వంపుఁ గుంకుమపువ్వు పఱపు

గీ. గలిగి మెఱుఁగులు దిక్కులఁ గడలుకొనఁగ
మించు దంతపుటుయ్యాల మంచమునను
బొలుపుమీఱుచుఁ దన యంతిపురము సతుల
యూడిగంబులు గైకొంచు నున్న శౌరి (కళాపూర్ణోదయము)

ఈ మాధుర్యము సంభోగశృంగారమునందును గరుణమునందును విప్రలంభములందును శాంతమునందును దరతమాధిక్యముతోఁ బ్రయోగింపవలయును. ఈ రసమునందు సమాసరచనము దగదు ఏలన సమాసము త్వరగా నర్థముగామి నర్థబోధమున కాటంకము గలుగును అర్థము లెస్సగాఁ దెలిసినఁగాని రసానుభవము గలుగదు కావున నీరసములందు మాధుర్య గుణమునే కవి యుపయోగింపవలయును ఏలన మాధుర్యము చిత్తద్రుతికిఁ గారణమనిచెప్పితిమి

యోగ ఆద్యతృతీయాభ్యామంత్యయో రేణ తుల్యయోః
టాదిశ్శషౌ వృత్తిదైర్ఘ్యం గుంఫ ఉద్ధత ఓజసి

వర్గములలోని ప్రథమతృతీయవర్గములకుఁ గ్రమముగా ద్వితీయచతుర్థములతో యోగమున్న యెడలను(అనఁగా చ్ఛ ట్ఠ త్థ ప్ఫ జ్ఝ ఇత్యాదికము) రేఫ యోగమున్నను, (క్రి, ర్క, ఇత్యాది రూపము) తుల్యాక్షరయోగమున్నను, (క్క, చ్చ ట్ట త్త ప్ప ఇత్యాదిరూపము) టవర్గము శ ష, వర్ణములున్నను, దీర్ఘసమాసములున్నను నా రచన యోజోగుణమును దెలుపును ఇదియే గాఢబంధము.

మూర్ధ్నాముద్వృత్త కృత్తావిరళగళగళద్రక్తసంసక్తధారా
ధౌతేశాంఘ్రిప్రసాదోపనతజయజగజ్జాతమిథ్యామహిమ్నామ్
కైలాసోల్లాసనేచ్ఛావ్యతికరపిశునోత్సర్పిదర్పోద్ధురాణాం
దోష్ణాంచైషాం కిమేతత్ఫలమిహ నగరీరక్షణే యత్ప్రయాసః

ఉద్ధతవృత్తిచే ఖండింపఁబడిన కంఠములనుండి యవిచ్ఛిన్నముగా జాలువాఱు రక్తధారలచే నీశ్వరుని పాదములు కడిగి యాతని ప్రసాదమున లభించిన జయపరంపరలచే జగజ్జాలమున మిథ్యామహిమనుగొన్న నా శిరస్సులకును, కైలాసమున నెత్తుటచేత దర్పోద్ధురములయిన నా హస్తములకును, నీ నగరీరక్షణమునకుఁ బ్రయాసపడుటయా ఫలము? (రావణుఁడు వానరసేన లంకాపట్టణమును ముట్టడించినదని తెలిసికొని యనుకొన్న వచనము)

ఇందు ర్ధ్నా, త్త ద్ర క్త ఘ్రి జ్జా, మ్నా, చ్ఛా, ర్పి, ర్పో, ష్ణాం, ఇత్యాద్యక్షరము లోజస్సును వ్యక్తముఁ జేయుచున్నవి

వెనుక నిచ్చిన 'దుర్వారోద్యమ' పద్యమునందుఁ గూడ నిట్టి సంయుక్తాక్షరములు గలవు దానిని నట నోజస్సునకే యుదాహరించితిమి.

ఈ యోజస్సు వీర బీభత్స రౌద్రములందుఁ గ్రమక్రమముగా నధికముగా నుండవలయును మాధుర్యము చిత్తద్రుతి కారణమైనట్లోజస్సు చిత్తదీప్తి కారణము రౌద్రమునను బీభత్సమునను దీర్ఘసమాసరచన యుక్తమే యగును. కాని యొకానొకచో నసమాసయు నల్పసమాసయు నగు రచనయు నుండవచ్చును "రౌద్రాదౌ మధ్యమసమాసా సంఘటనా, కదాచిద్ధీరోద్ధతనాయకసంబంధవ్యాపారాశ్రయేణ దీర్ఘసమాసాపి వా" రౌద్రాదులం దొక్కొక్కపుడు మధ్యమసమాసముగల యనఁగా నల్ప సమాసముగల రచనయు, ధీరోద్ధత నాయకసంబంధవ్యాపారమునుబట్టి దీర్ఘసమాస గల రచనయు నుండును అని ధ్వన్యాలోక కర్త తెలుపుచున్నాడు.

శ్రుతిమాత్రేణ శబ్దాత్తు యేనార్థప్రత్యయో భవేత్
సాధారణ స్సమగ్రాణాం స ప్రసాదో గుణో మతః.

విన్నంతమాత్రముననే సామాజికునకేరచనవలన నర్థము దెలియునో యారచన ప్రసాదగుణమును దెలుపును ఈ ప్రసాదము సర్వరససాధారణము.

[పరిమ్లానం పీన స్తనజఘనసంగాదుభయత:
తనోర్మధ్యస్యాంత: పరిమిళన మప్రాప్య హరితం
ఇదం వ్యస్తన్యాసం శ్లథభుజలతాక్షేపవలనై:
కృశాంగ్యాస్సంతాపం వదతి బిసినీపత్త్రశయనమ్]

బలసిన చనులయొక్కయు జఘనముయొక్కయు నొత్తిళ్లచే నిరువైపుల వాడినట్టియు సన్నని నడుముయొక్క యొత్తిడిలేమి నడుమ పచ్చగానున్నట్టియు, (వాడకుంటచే, శిథిలములైన భుజలతలటునిటు వేసికొనుటచేఁ దార్మారుగాఁ జెదరినట్టియు, నీ తామరాకుసెజ్జ యాకృశాంగియొక్క సంతాపమును దెలుపు చున్నది

ఇందలి పదములు పిక్కిలి మృదువుగానుండి వినఁబడఁగానే యర్థ ప్రతీతినిఁ గలిగించుచున్నవి కాన నిందలి వర్ణములు ప్రసాదవ్యంజకములు. ఇట్లే

శా. ఆనాకంబున నప్సరశ్శతముతో నా నందనోద్యాన మం
దానర్తించుచుఁ బుష్పకుంజమృదుపర్యంకంబులన్ సీధుపా
నానందంబున సంప్రవర్ధితరతివ్యామోహముగ్ధాత్మతన్
నానాక్రీడలఁ దేలుచుంట బుధగణ్యంబైన కార్యంబొకో ?
అనుచోఁగూడఁ బ్రసాదము గలదు.

శుష్కేంధనాగ్నివలెను. స్వచ్ఛజలమువలెను చిత్తమును వెంటనే వ్యాపించునది ప్రసాదము. ఇది సర్వరసములందును నుండును.

మొత్తముమీఁద వర్ణములు గుణవ్యంజకములు గుణములవలన రీతులేర్పడును. గుణములు రసధర్మములు గాన గుణములవలన నేర్పడిన రీతులును రసధర్మములే యగును. మాధుర్యగుణము వైదర్భీరీతియందును, ఓజస్సు గౌడీరీతి యందును, ప్రసాదము పాంచాలీరీతియందును నుండును.

వెనుక నేరసమున కెట్టి రచన యుండవలయునో తెలిపితిమి. కాని కొన్ని యెడల నీ నియమమునకు నన్యథాత్వము గానిపించుచున్నది. ఎట్లన,

వక్తృ వాచ్య ప్రబంధానా మౌచిత్యేన క్వచిత్క్వచిత్
రచనావృత్తివర్ణానా మన్యథాత్వ మపీష్యతే.

వక్తృ, వాచ్య (వర్ణనీయ విషయము) ప్రబంధములయొక్క యౌచిత్యమునుబట్టి రచనా, వృత్తి వర్ణములకన్యథాత్వముగూడ నొక్కొక్కచో సమ్మతమే యగును. వక్తయనఁ గావ్యమందలి నాయకుఁడు నాయకునిఁబట్టి రచనయుండ

వలెను. * నాయకుఁడే రసాశ్రయుఁడైన రచన తదనుకూలముగా నుండవలెను అతఁడు శృంగార రసాశ్రయుఁడగుచో వైదర్భిరీతియు రౌద్రాశ్రయుఁ డగుచో గౌడీరీతియు నుండవలెను. ఇట్లే మిగిలిన రసములనుబట్టియు రచననుజేయవలెను

అట్లే 'వాచ్యము' అనఁగా వర్ణనీయమగు విషయమునుబట్టియు రచన సాఁగవలెను. వర్ణనీయవిషయమొకపుష్పోద్యానమగుచో మృదురచనయు యుద్ధాది భయంకర ఘట్టములగుచో దీర్ఘసమాస రచనయు నుండవలెను అనఁగా రచనను బట్టియే యాయా విషయములు స్ఫురింపవలెను మఱియుఁ 'ప్రబంధము అనఁగాఁ గావ్యభేదమునుబట్టియు రచన యుండవలెను. కావ్యభేదములను వెనుకఁ దెలిపియుంటిమిగదా!

అయితే యొకచో వాచ్యమునుబట్టియుఁ ప్రబంధమునుబట్టియుఁగాక కేవలము వక్తను (కావ్యనాయకుని) బట్టియే రచన సాఁగును. ఎట్లన,

మంథాయస్తార్ణవాంభఃప్లుతికుహరచలన్మందరధ్వానధీరః
కోణాఘాతేషు గర్జత్ప్రళయఘనఘటాన్యోన్యసంఘట్టచండః
కృష్ణాక్రోధాగ్రదూతః కురుకులనిధనోత్పాతనిర్ఘాతవాతః
కేనాస్మత్సింహనాదప్రతిరసితసఖో దుందుభిస్తాడితోఽయమ్

మ. తతమూర్ణద్భటవార్ధిమధ్యవిలుఠన్మంథాచలధ్వానధీ
రత గోణాహతమై రణత్ప్రళయగర్జన్మేఘసంఘట్టచం
డతఁ గృష్ణోగ్రరుషాగ్రదూత కురురాణ్ణాంశంకరోత్పాతమై
సతి మత్సింహరవానుకారి రణనిస్సాణంబిదే మ్రోఁగెడిన్
(—వేణీసంయుక్తా

ఇట వక్త భీమసేనుఁడు విషయము రౌద్రవ్యంజకము గాకున్న ధము నాటకమైనను దీర్ఘసమాసరచన చేయఁబడినది.

ఒక్కెడ నాయకునిఁబట్టియుఁ ప్రబంధమునుబట్టియుఁ గాక కేవలము వాచ్యమునుబట్టియే రచన యుండును వాచ్యమన వర్ణనీయవిషయము.

---

* వెనుక రసప్రకరణమున రసము సామాజికనిష్ఠమనికదా చెప్పితిమి ఇట నాయకుఁడే రసాశ్రయుఁడైన...ఇత్యాదికమగు వ్రాఁత యెట్లు పొసఁగును? అన్నచో లౌకికరసము నాయకాశ్రయమే సామాజికుఁ డాస్వాదకుఁడు పట్టలోల్లటాదు లందఱును లౌకికరసము నాయకాశ్రయమే యని నొడివి నాయకాశ్రయరసమును సామాజికుఁడెట్లాస్వాదించునో యా విధానమును దెలిపిరి కాన రసము సామాజిక నిష్ఠమన నలౌకికరసము సామాజికనిష్ఠమని భావము లౌకిక రసము నాయకాశ్రయము. అలౌకికరసము సామాజికాశ్రయము అనిసిద్ధాంతము.

ప్రౌఢచ్ఛేదానురూపోచ్ఛలనరయభవత్త్రైంహికేయోపఘాత
త్రాసాకృష్టాశ్వతిర్యగ్వలితరవిరథేనారుణేనేక్ష్యమాణం
కుర్వత్కాకుత్స్థవీర్యస్తుతిమివ మరుతాం కంధరారంధ్రభాజాం
భాంకారై ర్భీమమేత న్నిపతతి వియతః కుంభకర్ణోత్తమాంగమ్.

బలిష్ఠమైన ఖడ్గాఘాతమునకుఁ దగినట్లు పైకెగురుటచే రాహువు దమ్ముఁ బట్టవచ్చుచున్నాఁడని భయపడి యరుణుఁడు సూర్యాశ్వములఁ గుఱించి తేరు ప్రక్కకుఁ ద్రిప్పి చూచుచుండఁగా, వాయుపూర్ణములయిన కంధరారంధ్రముల భాంకారధ్వనులు శ్రీరాముని వీర్యమును స్తోత్రించుచున్నట్లుండగాఁ నాకాశమునుండి కుంభకర్ణుని భయంకరమైన శిరస్సు నేలమీఁదఁ బడుచున్నది.

ఇట విషయము భయంకరమగు దృశ్యము (కుంభకర్ణ శిరము), కాన దీర్ఘ సమాస రచన సేయఁబడినది ఒక్కొక్కెడ వక్తృవాచ్యములనుబట్టి గాక కేవల ప్రబంధమును బట్టియే రచన సాఁగును ఎట్లన, న్యాఖ్యాయికయందు శృంగార రసమునఁ గూడ నాయకుఁ డుద్ధతుఁడు గాకున్నను మృదురచన గూడదు. సమాసభూయిష్ఠమగు రచనయే కాదంబరియందువలె నుండవలెను నాటకాదు లందు రౌద్రమునందును నతిగా దీర్ఘసమాసము గూడదు. ఏలన సామాజికుల కర్థప్రతీతిగామి రసానుభవము గలుగదు. కాన నల్పసమాసముగా నుండవలెను. ముక్తకాదులు రసప్రధానములగుటఁ దత్తద్రసానుకూలముగా రచన యుండవలెను అనఁగా శృంగారరసమయినఁ గోమలవర్ణబంధము రౌద్రమైనచో సమాసజటిలతయు నుండవలెను. రసదృష్టియే లేనిచో నిచ్చవచ్చిన రచన సేయవచ్చును. సందానితకాదులందు సమీప సంబంధ ముండదుగాన దీర్ఘ వ్యాపించు రచనయే యుండవలెను. పర్యాయబంధమున నసమాస, మధ్యమ సమాసములుగల రచన యుండవలెను పరికథలో నితివృత్తమాత్రోపన్యాసమే యుండును కానఁ గామచారము సర్గబంధమగు కావ్యమునఁ దాను నిబంధింపఁ దలఁచిన రసానుకూలముగానే రచనయుండును

ఆంధ్రప్రబంధములలో నదీ, పర్వత పత్తనరాజాది వర్ణనఘట్టము లందుఁ జాలభాగము సమాసభూయిష్ఠమగు రచనయే యున్నది. ఇట వక్తృ, వాచ్య, ప్రబంధౌచిత్యములం దేదియుఁ గానరాదు.

ఆ కాంచీనగరంబుఁ గాంచె — పత్తనవర్ణనము
ఆ వీణాధరుఁ డేగె...... దేశవర్ణనము

ఈ రెండు పద్యములను దోషప్రకరణమునందలి 'అస్థానసమాసము' అను దోషముక్రింద నుదాహరించితిమి.

ఉ. ఆ పురిబాయకుండు...	నాయకవర్ణనము	(మనుచరిత్రము)
మ. కలఁడుర్లోక...	,,	(వసుచరిత్రము)

ఇట్లే మిగిలినవాని నూహించునది.

కొన్నియెడల విషయము రౌద్రరసాశ్రయమైనను నసమానరచనయే కలదు.

సీ. నేలయు నింగియుఁ దాళముల్ గాఁ జేసి యేపునరేఁగి వాయించియాడ,
కులపర్వతంబులు గూల్చి యొండొంటితోఁ దాఁకంగవీఁకమైఁ దన్నియాడ
నేఁడుసాగరములు నిక్కడక్కడఁజెట్టి పలుచనిరొంపి మైనలఁదికొనఁగ
దిక్కులు నాలుగు నొక్కచోటికిఁదెచ్చి పిసికి పిండలినేసి పిడుచకొనఁగ

గీ. మిగిలి బ్రహ్మాండభాండంబు పగులవ్రేయ
నప్పళించుచుఁ బ్రళయకాలానలమున
గండరించిన రూపంబుకరణి భీముఁ
డతిభయంకరాకారత నతిశయిల్లె

ఇట ద్రౌపదీపరాభవమును (కీచకకృతము) గాంచిన భీమసేనుని వర్ణనము, ఇట సమాసభూయిష్ఠమగు రచనముండవలెను. కాని లేదు. ఇట్లు లేకుంట దోషమే. ఈ క్రింది పద్యమున విషయౌచిత్యము వాచ్యౌచిత్యము పాటింపబడినది. చూడుఁడు.

శా. భీష్మద్రోణకృపాదిధన్వినికరాభీలంబు దుర్యోధన
గ్రీష్మాదిత్యపటుప్రతాపవిసరాకీర్ణంబు శస్త్రాస్త్రజా
లోష్మస్ఫారచతుర్విధోజ్జ్వలబలాత్యుగ్రంబుదగ్రధ్వజా
ర్చిష్మద్వ్యాకలితంబు సైన్యమిదియేఁ జేరంగ శక్తుండనే ?

ఉత్తరుఁ డర్జునితోఁ గౌరవసైన్యమును జూచి యన్న పలుకులు, ఇందలి విషయమునుబట్టి దీర్ఘసమాసము యుక్తమే

ఆంధ్రప్రబంధములందు వక్తృ వాచ్య, ప్రబంధౌచిత్యములంత తెన్నగాఁ బాటింపఁబడలేదు

గుణప్రకరణము సమాప్తము.

శబ్దాలంకారప్రకరణము

గీ. ఇఁక నలంకార నికరంబు లేర్పఱింతు
నవియుఁగవితాలతాంగికి హారకటక
కంకణాదులక్రియ నలంకరణకరణ
పరిణతులచే నలంకారభావ మొందు.

కావ్యకన్యకు హారకటకకంకణాదులవంటివగుట నలంకారపదము సార్థకము వాని నిట వివరింతుము

కం. అవియును శబ్దార్థంబుల
ద్వివిధములై క్రమముతోడ వెలయు ననుప్రా
సవిశేషంబుల, నుపమా
దివిశేషమ్ములను గావ్యదీపిత సరణిన్, ౮౨

ఆ యలంకారములు శబ్దార్థభేదములచే ద్వివిధము అందనుప్రాసాదులు శబ్దాలంకారములు; ఉపమాదులర్థాలంకారములు.

శబ్దార్థాలంకారవిభాగ మెట్లన, నర్థము నపేక్షింపక శబ్దమాత్రము నాశ్రయించిన శబ్దాలంకారమనియు, శబ్దము నపేక్షింపక యర్థమాత్రము నాశ్రయించిన నర్థాలంకారమనియు రుయ్యకుఁడు లక్షణము నుడివెను మమ్మటుఁడు శబ్దపరివృత్తిని సహింపనిచో శబ్దాలంకారమనియు, సహించినచో నర్థాలంకార మనియును లక్షణము సేసెను పరిణతిలో రెంటికిని నొకటే యర్థము. మఱియుఁ గొందఱు శబ్ద అర్థ ఉభయాలంకారములని యలంకారములు ముత్త్రివిధముగా విభజించిరి పునరుక్తవదాభాస పరంపరితరూపక, లాటానుప్రాసము లుభయాలంకారములనియు అనుప్రాసాదులు శబ్దాలంకారములనియు, నుపమాదులర్థాలంకారములనియు వారు విభజించిరి

అనుప్రాసము - ఛేకానుప్రాసము

గీ. అందనుప్రాసభేదంబులైన శబ్ద
భవదలంకారములు మున్ను ప్రస్తుతింతు
నదర నెడలేక రెండు రెండక్షరంబు
లెనయునియమంబు ఛేకమౌ నెట్లటన్న, ౮౩

అనలనుప్రాసమనఁగాఁ

"ప్రకృష్టో వర్ణవిన్యాసో రసాద్యనుగతో హి యః
సోఽనుప్రాస స్స చ చ్ఛేకవృత్త్యుపాధిగతో ద్విధా"

రసానుగతమగు ప్రకృష్టమగు వర్ణవిన్యాసము 'అనుప్రాసము'. రసము విభావాదులచేతనే వ్యజ్యమానమగుచున్నను, కొన్ని వర్ణములు కొన్ని రసములను వ్యక్తము సేయుననియుఁ దెలిపితిమి. కాన నట్టి యా యా రసపోషకములయిన వర్ణముల విన్యాసము' అని యభిప్రాయము ఈ యనుప్రాసము ఛేకానుప్రాసమనియు వృత్త్యనుప్రాసమనియు ద్వివిధము. ఛేకుఁడన విదగ్ధుఁడు. విదగ్ధులగువారు వ్యవహరించు ననుప్రాసము, ఛేకానుప్రాసమన నవ్యవధానముగా రెండు రెండక్షరములు నొాడువుట. రెండక్షరము లన రెండు హల్లులని యర్థము అవ్యవధానముగా రెండేసి హల్లుల జంటలను, అనేక పర్యాయము (ఒకసారికన్న నధికముగా) పద్యమున నొాడువుట ఛేకానుప్రాసము ఈ రెం హల్లుల జంటలలో స్వరసాదృశ్యనియమములేదు. అది యానుషంగికము.

స్ఫురత్కృపా బలప్రతాప భూతి ధైర్యభూభరా
ర్చిరంగదానబుద్ధివై ఖరిన్ హరిన్, సుధా
హరున్ హరున్, గిరిన్ గిరిన్, మహానలున్, రమా
గురున్ గురున్, జయింతువోఁ దగున్ నృసింహభూవరా! ౨౪

హరిన్ హరిన్ హరున్ హరున్, గిరిన్ గిరిన్, నలున్ నలున్, గురున్ గురున్ అను పెక్కు రెండేసిహల్లుల జంటలు వచ్చినవి. ఇట స్వరసాదృశ్య నియమము లేకున్నను స్వరసాదృశ్యముగూడఁ గవి కనఁబఱచెను. దీనికిఁ బదానుప్రాసమనియుఁ బేరు.

నరసభూపాలీయలక్షణము "భేదేదవ్యవధానేనద్వయోర్వ్యంజనయుగ్మయోరావృత్తిః" అను ప్రతాపరుద్రీయ లక్షణము ననుసరించి యున్నది. సాహిత్యదర్పణమున దీని లక్షణము భిన్నముగా నున్నది. ఎట్లన

"ఛేకో వ్యంజనసంఘస్య సకృత్సామ్యమనేకథా" స్వరూపముతోడను, గ్రమముతోడను వ్యంజనసంఘము నొకతూరిమాత్రమే యావృత్తిసేయుట ఛేకానుప్రాసము. ప్రతాపరుద్రీయలక్షణమున రెండేసి యక్షరములకుమాత్రమే యావృత్తి చెప్పఁబడినది ఇట వ్యంజనసంఘమునకావృత్తి. అదియు స్వరూపమును గ్రమమును విడనాడకుండవలెను. అనఁగా 'సర' అనుదానిని 'రస' అని యావృత్తిచేసినను స్వరూపము తొలఁగదు. కాని 'సర' అను నక్షరక్రమము తప్పును కావున స్వరూప క్రమము లుభయమునుండవలెను.

ఆదాయ కమలగంధా నందీకుర్వన్ పదేపదే భ్రమరాన్
అయమేతి మందమందం కావేరీవారిపావనః పవనః

'గంధా వంధీ' అనుచో 'ంధ' అను సంయుక్తాక్షర ద్వయమునకును, 'మందంమందం' అనుచోఁగూడ 'ంద' అను సంయుక్తాక్షర ద్వయమునకును, 'వేరీవారి' అనుచో నసంయుక్తాక్షరద్వయమునకును పావనః పవనః అనుచో బహువ్యంజనములకును నొక్కొక్క యావృత్తిమాత్రమే చేయఁబడినది ంధాన్-ంధీన్; వేరీ-వారి, 'పావనః' - పవనః అనునెడల వ్యంజనసాదృశ్యమేకాని స్వరసాదృశ్యములేదు. స్వరసాదృశ్య నియమము లేదనియు నిది యానుషంగికమనియును జెప్పితిమి.

(వృత్త్యనుప్రాసము)

గీ. ఒక్కవర్ణంబు కడదాఁక నుద్ధరింపఁ
బరగుజృంభణ వృత్త్యనుప్రాసమయ్యెఁ 83

ఒక్కవర్ణమునే తుదిదాఁక ననఁగాఁ బెక్కుపర్యాయములావృత్తి సేసినచో వృత్త్యనుప్రాసమగును. ప్రతాపరుద్రీయమున

ఏక, ద్వి ప్రభృతీనాం తు వ్యంజనానాం యదా భవేత్
పునరుక్తి రసౌ నామ్నావృత్త్యనుప్రాస ఇష్యతే ౘ౦

(ఒకటి, రెండు, మూఁడు, నాలుగు మొదలయిన వ్యంజనములనుబెక్కు పర్యాయము లావృత్తిసేయుట వృత్త్యనుప్రాసము) అని చెప్పెను.

ఇందేకవ్యంజనము నొకసారిమాత్ర మావృత్తిసేసిన వైచిత్ర్యములేమినిఁ బెక్కుపర్యాయము లావృత్తినిఁ జేయవలెను. వ్యంజనద్వయమున నొకతూరియే యావృత్తిసేయవలెను దీనినిఁగూడఁ బెక్కుపర్యాయము లావృత్తి సేసితిమేని ఛేకానుప్రాసమే యగును వ్యంజనత్రయమును వ్యంజనచతుష్టయమును నొకతూరి గాని పెక్కుతూరులు గాని వ్యవధానముగాఁ గానీ యవ్యవధానముగాఁగాని యావృత్తిసేయవచ్చును అని సోమపీఠి వ్యాఖ్యానమునఁ గలదు.

వృత్త్యనుప్రాసోదాహరణము

చ. సమదవిపక్షశిక్షణవిచక్షణ దక్షిణదోరనుక్షణ
క్షమదసిదుర్నిరీక్ష! సమరక్షపితక్షితిపక్షతక్షర
త్సమధికశోణితక్షురక్షతక్షణరక్షితపక్షిలోక! నిన్
గమలదలాక్షుఁడేలు బలగౌరవసింహ! నృసింహభూవరా! 84

ఇందు 'క్ష' కారము పెక్కుపర్యాయములావృత్తి సేయఁబడినది కాన వృత్త్యనుప్రాసము. ఇట్లే ద్వి, త్రి, చతురాద్యక్షరావృత్తు లూహ్యములు.

లాటానుప్రాసము

గీ. తలఁపఁ బునరుక్తియయ్యుఁ దాత్పర్యభేద
మెనయు నియమంబు లాటమౌ నెట్లటన్న.

"శబ్దార్థయోః పౌనరుక్త్యం యత్ర తాత్పర్యభేదవత్
స కావ్యతాత్పర్యవిదాం లాటానుప్రాస ఇష్యతే."

శబ్దార్థముల యొక్క పౌనరుక్త్యమున్నను దాత్పర్యభేదమున్నచో నది లాటానుప్రాసము.

చ. ఘనత నృసింహుఁజూడఁగల కన్నులు కన్నులు; వానికౌఁగిటం
బనుపున నేపుసూపఁగల చన్నులు చన్నులు; వానిమోవికిం
బొనిపిన పాటలాధరము జున్నులు జున్నులు; వానిమేనఁ జే
ర్చిన సరసాంగవల్లికల చెన్నులు చెన్నులు వో! తలోదరి ౩౩

కన్నులు కన్నులు చన్నులు చన్నులు, జున్నులు జున్నులు, చెన్నులు చెన్నులు అనుచో శబ్దమును, అర్థమును సమానమే. కానఁ బౌనరుక్త్యము సంభవించుచున్నది కాని తాత్పర్యము మాత్రము భిన్నము ఎట్లన, నృసింహుఁ జూడఁగల కన్నులు శ్రేష్ఠములైన కన్నులు, చన్నులు శ్రేష్ఠములైన చన్నులు. ఇట్లే మిగిలినవియును. ఈ విధముగాఁ దాత్పర్యమునుబట్టి మొదటిపదములకన్న రెండవపదములు భిన్నములు ఇట్టిది లాటానుప్రాసము.

ఈ లాటానుప్రాసము నుభయాలంకారముగా మమ్మటాదులు తెలిపిరని వచించితిమి.

సాహిత్యదర్పణకారుని మతమున ననుప్రాసము ఛేక, వృత్తి శ్రుతి అంత్య లాటానుప్రాసభేదములచే నైదువిధములు సరస్వతీ కంఠాభరణకారుని మతమున శ్రుతి వృత్తి, వర్ణ పద, నామ (ప్రాతిపదిక) లాటభేదములచే నాఱువిధములు. ఈ లాటానుప్రాసమును మమ్మటాదులు పదావృత్త్యనుప్రాసమనియుఁ, బ్రాతిపదికావృత్త్యనుప్రాసమనియును ద్విధమమున రెండు విధములుగా విభజించిరి. మఱియుఁ బదావృత్త్యనుప్రాసమును బహుపదావృత్త్యనుప్రాసము ఏకపదావృత్త్యనుప్రాసము అని ద్వివిధములుగా భాగించిరి. ప్రాతిపదికావృత్త్యనుప్రాసమును ఏకసమాసవృత్త్యనుప్రాసము (రెండు పదములును నేకసమాసమందుండుట) భిన్నసమాసవృత్త్యనుప్రాసము (పద ద్వయమును భిన్నభిన్న సమాసములయందుండుట) సమాసాసమాసవృత్త్యను ప్రాసము (ఒకపదము సమాసమునందును మఱొకపదమసమాసమునను నుంచుట) అని మూఁడుగులుగా విభజించిరి. మొత్తమైదువిధములు.

(యమకము)

కం. సమవర్ణయుగాధికమై
యమరిన నియమంబు యమకమగుఁ గృతులందా
యమకం బనేకవిధమగుఁ
గ్రమమున నొక రెండుమూఁడు గతు లెఱిఁగింతున్. ౩౮

సమానమైన వర్ణములయొక్క జంటనుగానీ సమూహమును (అధికము) గానీ యావృత్తిచేయుట యమకము ఇది యనేకవిధములు, రెండు మూఁడు విధములు మాత్ర మెఱిఁగింతును. ఒకేవిధమైన క్రమమున నసమానమగు నర్థముగల (సమానార్థకములుగాని) సమానవర్ణములయొక్క జంటయొక్క కానీ పెక్కిండియొక్క గానీ యావృత్తి యమకము (సమానార్థకత్వాభావవత్సమానానుపూర్వికానేకవర్ణావృత్తిర్యమకం) ఇట సమానవర్ణములు స్వరవ్యంజనోభయ సాదృశ్యము గలవిగానే యుండవలెను. "యమ ఏవ ప్రకృతిర్యస్యతత్ యమకం" జంటయే యనఁగా స్వరవ్యంజనములయొక్క జంటయే ప్రకృతిగాఁ గలది యమకమని వ్యుత్పత్తి.

అయితే ఛేకానుప్రాసమున వెనుకటినరసభూపాలీయపద్యమున 'హరిన్, హరిన్ ప్రభృతులయందు యమకమని యేల చెప్పకొనఁగూడదు? సమానారకత్వాభావవత్సమానానుపూర్వికానేకావృత్తి గలదుగదా ? అన్నచో నిజమే. 'హరిన్ హరిన్' అను నుదాహరణము యమకోదాహరణమే యనఁజెల్లును ఛేకానుప్రాసమున కది యుదాహరింపఁదగదు 'గంధానంధీకుర్వన్' అను సాహిత్యదర్పణో దాహరణమే యర్హము. ఛేకానుప్రాసమున స్వరావృత్తి యానుషంగికము' అనుట దోషమే. ఏలన, స్వరావృత్తియున్నచోట్ల నెల్లనిదేవిధముగా యమకమా? ఛేకమా ? అను శంక యుత్థితమగుచునే యుండును. కాన స్వరవ్యంజన పౌనరుక్త్యమున్నచోట యమకమనియుఁ గేవల వ్యంజన యుగ్మమున కావృత్తి యున్నచో ఛేకానుప్రాసమనియుఁ జెప్పుట లెస్స, కావున సాహిత్య దర్పణ ఛేకానుప్రాసమే యుచితమైనది.

ఈ యమకము పాదయమకమనియుఁ బాదభాగయమకమనియును ద్వివిధము. పాదయమకము మఱలఁ బదునొకండు విధములు. ౧ ప్రథమపాద ద్వితీయపాదములు తుల్యములయిన ముఖయమకము ౨ ప్రథమతృతీయ పాదములు తుల్యములయిన సందంశయమకము ౩ ప్రథమ చతుర్థపాదములు తుల్యమయిన నావృత్తియమకము ౪ ద్వితీయ తృతీయములు తుల్యములైన గర్భయమకము ౫ ద్వితీయ చతుర్థములు తుల్యములయిన సందష్టయమకము, ౬. తృతీయ చతుర్థములు తుల్యములయిన పుచ్ఛయమకము ౭ నాలుగు పాద

(A C No... ...

ములు తుల్యముగానున్నచోఁ బంక్తియమకము ౯ ప్రథమ చతుర్థములును, ద్వితీయ తృతీయములును దుల్యములయినచోఁ బరివృత్తియమకము ౯ ప్రథమ ద్వితీయములును, తృతీయచతుర్థములును దుల్యములయినచో యుగ్మక యమకము. ౧౦ అర్థావృత్తియనఁగా బూర్వార్థమును నుత్తరార్థమును దుల్యముగా నున్నచో సముద్గకము లేక సంపుటము. ౧౧. శ్లోకావృత్తియనఁగా శ్లోకద్వయము తుల్యముగా నున్నచో మహాయమకము

ఇఁకఁ బాదభాగయమకము లసంఖ్యాకములు. ఎట్లనఁ బాదమును రెండు భాగములుగా భాగింతము. పాదయమకమునఁ జూపఁబడిన విధమున నీ పాద ప్రథమభాగములు దుల్యముగా నుండెనేని, ద్వితీయభాగములును దుల్యముగా నుండెనేని నిరువది భేదములువచ్చును. (పాదభాగయమకములలో శ్లోకావృత్తియమకముండదు. కానఁ బాదభాగయమక భేదములు పదిమాత్రమే ఈ పదిభేదములును రెండు భాగములలో నుండును గాన నిరువది భేదము లగును) పాదమును మూఁడు భాగములుగా భాగించినచోఁ బై విధమున యమకములు గూర్చినచో ముప్పది భేదములగును పాదమును నాలుగు ఖండములుగాఁ జేసినచో నలువది భేదములు వచ్చును మఱియును ప్రథమ పాదాదులయొక్క యంతభాగమును ద్వితీయాది పాదాదులయొక్క యాదియందుఁ గూర్చినచో నంతాదికయమకము ప్రథమపాదాదుల యాదిభాగమును ద్వితీయాది పాదాదుల యంతమందుఁ గూర్చినచో నాద్యంతికయమకము ఇట్లే మధ్యాదిక యమకము. ఆదిమధ్యయమకము, అంతమధ్యయమకము, మధ్యాంతికయమకము వీనికిఁ బరస్పర సముచ్చయము మఱియు నాయాభాగముల నియతస్థానమున గూర్చుచున్నచో ననంతమగు భేదములేర్పడును. ఈ విధమునఁ బాదభాగ యమకము లనంతములు.

మఱియు ప్రతిలోమయమకమను మఱొక భేదముగూడఁ గలదు. వీని నన్నింటిని దండి కావ్యాదర్శమున మూఁడవ పరిచ్ఛేదమున వివరించియున్నాఁడు. అక్కూరి సుబ్రహ్మణ్యశాస్త్రిగారి ఆంధ్రకావ్యాదర్శమునను జూపఁబడియున్నవి. ఇవి కావ్యమున గడుభూతములగుటచే ననఁగా నీరసములగుటచే విస్తరింపలేదు. ఇవిగాక యప్పకవీయమున (చతుర్థాశ్వాసమున) అనులోమ విలోమాది శబ్దాలంకారములును గలవు కావలసినవారు వానిని నట స్వీకరింపవలెను.

పాదయమకము

కం. మేలిమి రెండవపాదము

నాలవపాదంబు నొక్కనలుపునఁ దనరం

జాలిన యమకము కృతులం
దాలింపఁగ బాదయమకమగు వెట్లన్నన్, ౭౮

కం. ఔరా ! ఓబన్నృపాలకు
మారా ! మను మదనసమ ! రమాధుర్యుఁడవై ;
ధీరా ! నృసింహా ! కూడితి
మారామను మదనసమరమాధుర్యుఁడు వై . ౭౦

ఇందు ద్వితీయ చతుర్థ పాదములు తుల్యములు. దీనిని సందష్టయమకమందురు.

ము క్తపద గ్ర స్తము

కం. ప్రస్తుతమగు ము క్తపద
గ్రస్తంబన ; నదియుఁ గృతులఁబరగుఁ బదాంతో
ద స్తము పాదాద్యంత సు
వి స్తృతము ; పదాంతసింహావీక్షణమనఁగన్. ౭౧

ఇది పాదభాగ యమకభేదము, ఇది ద్వివిధము. వీనిని దండి సందష్ట యమకమనెను ప్రకాశకారాదులు 'అంతాదియమకము ఆద్యంతయమకము' అనిరి వీని నీ గ్రంథకర్త పాదాంతపాదాదిముక్తపదగ్రస్తమనియు, సింహావలోకన ముక్తపదగ్రస్తమనియును పేరిడెను.

పాదాంతపాదాదిముక్తపదగ్రస్తము (అంతాదికము)

కం. సుదతీనూతనమదనా !
మదనాగతురంగపూర్ణమణిమయసదనా !
సదనామయగజరదనా !
రదనాగేంద్రనిభకీర్తిరసనరసింహా ! ౭౨

ప్రథమపాదాంతస్థమగు 'మదనా' అను పదమే ద్వితీయపాదాది యందును, ద్వితీయపాదాంతస్థమగు 'సదనా' అను పదమే తృతీయపాదాది యందును, తృతీయ పాదాంతస్థమగు 'రదనా' అను పదమే చతుర్థపాదాది యందును గూర్పఁబడియున్నవి

సింహావలోకనముక్తపదగ్రస్తము

కం. మనవేటికి నూతనమా!
దనమానినిఁ; బ్రేమఁ దనకుఁ దక్కితినసుమా!
వను మానక దయదనరం
దనరంతులు మాని నరసధవు రమ్మనవే! ౮౩

ఇందు వెనుకటి పద్యమునందువలెనే అంతాదియమకముంటయేకాక యాద్యంతయమకముగూడఁగలదు. ఎట్లనఁ బ్రథమపాదాదిస్థమగు 'మనవే' అను పదమే 'రమ్మనవే' అని పద్యాంతమునకు వచ్చినది. దీనిని సింహావలోకనముక్తపదగ్రస్తమనియు నందురు

యమకాదౌ భవేదైక్యం డలయో రలయోర్బవోః
శషయోర్నణయో గ్చాంతే సవిసర్గావిసర్గయోః
సబిందుకాబిందుకయోస్స్యాదభేదప్రకల్పనం.

యమకాదులందు (యమకము శ్లేషము) డకార లకారములకును, రేఫ లకారములకును, బకార వకారములకును శకార షకారములకును, నకార ణకారములకును, సవిసర్గ, అవిసర్గ పదములకును, సబిందుకాబిందుక పదములకును నైక్యము సేయవచ్చును. ఎట్లన "భుజలతాం జడతామబలాజనః" ఇట డకార లకారములకు భేదమున్నను యమకమే.

'యమకంతు విధాతవ్యం న కదాచిదపి త్రిపాత్' యమకమొక పద్యమున నొకపాదమునఁ గానీ పాదద్వయమునఁ గానీ పాదచతుష్టయమున గానీ కూర్పవచ్చును పాదత్రయమునఁ గూర్పరాదు. ఎట్లన,
భుజంగమస్యేవ మణిస్సదంభా గ్రాహావకీర్ణేవ నదీ సదంభాః
దురంతతాం నిర్దయతోఽపి జంతోః కర్షంతి చేతః ప్రసభం సదంభాః

ఈ శ్లోకమున 'సదంభాః' అను పదము మూఁడు పాదములలో నావృత్తమయినది ఇట్లుండుట దోషము కాన నిట్టి పాదత్రయ యమకమును రచింపరాదు.[౨] కాని కావ్యాలంకారచూడామణికర్త త్రిపాద్యమకము నుదాహరించెను.

గీ. శస్త్రోద్దంచితుఁడై న యవ్విభు విపక్షశ్రేణికిన్ విభ్రమ
త్కృత్తిశస్ఫుటకంకణధ్వని రణస్థానంబునన్ విభ్రమ
త్కృత్తిశస్ఫుటకంకణధ్వని మరుత్సౌధంబులన్, విభ్రమ
త్కృత్తిశస్ఫుటకంకణధ్వని సరిత్సంగంబులన్ జేకుఱున్.

పునరుక్తవదాభాసము

యత్రార్థః ప్రముఖే కించిద్భాసతే పునరుక్తవత్
పునరుక్తవదాభాసోఽలంకార స్స సతాం మతః.

ఆపాతముగా నెందర్థము పునరుక్తమువలె నాభాసించునో (పరమార్థము విచారింపఁగాఁ బునరుక్తముగాదు) యది పునరుక్తవదాభాసము. ఇది యర్థాలంకారమైనను శబ్దపౌనరుక్త్యమునుబట్టి శబ్దాలంకారమే

(జిష్ణురింద్రః క్షితిభుజాం శ్రీపతిః పురుషోత్తమః
భాస్వాన్ సూర్యః స్ఫురత్తేజాః । కాకతీంద్రో విరాజతే.)

ఈ కాకతీంద్రుఁడు జిష్ణువు (జయశీలుఁడు) రాజలకింద్రుఁడు శ్రీపతి; పురుషోత్తముఁడు (పురుష శ్రేష్ఠుఁడు); ప్రకాశమానుఁడు; సూర్యునివలె శం ర తేజస్కుఁడు.

ఇట జిష్ణు ఇంద్రపదములు శ్రీపతి, పురుషోత్తమపదములు భాస్వాన్ సూర్యపదములును పునరుక్తములవలె నున్నవి పరమార్థమున భిన్నార్థములే.

ఇందలి యనుప్రాస యమకాదులను గావ్యమునఁ బ్రయోగించు విషయంబున ధ్వనికారుఁడీ క్రిందివిధమునఁ దెలుపుచున్నాడు.

శృంగారస్యాంగినో యత్నాదేకరూపానుబంధనాత్
సర్వేష్వేవ ప్రభేదేషు నానుప్రాసః ప్రకాశకః
ధ్వన్యాత్మభూతే శృంగారే యమకాదినిబంధనం
శక్తావపి ప్రమాదిత్వం విప్రలంభే విశేషతః.

అంగిరసమగు శృంగారమునఁ బ్రయత్నసాధ్యమగు ననుప్రాసము గూడదు. అయత్నకృతమగు ననుప్రాసముండవచ్చును అంగిరసమగు శృంగారమున యమకాది నిబంధనము గూడదు. (కోపాది మిశ్రితమగు శృంగారమున ననుప్రాస యమకములు వాడవచ్చును.)

మరియు విద్యాధరుఁడు "ప్రాయశో యమకే చిత్రే రసపుష్టిర్నదృశ్యతే" తలచుగా యమకమున రసపుష్టి లేదని తెలిపెను.

బంధకవిత్వము (పద్మబంధము)

చ. కనుఁగొన రేకులెన్మిదియుఁ గర్ణిక చుట్టిడి స్రగ్ధరాంఘ్రులన్
మునుపటి యేడువర్ణములునుం గడయేడుఁ బ్రవేశనిర్గతుల్

వనుడగడ నాల్గుదిగ్దళములన్ లిఖయించి విదిగ్దళంబులం
దెనయఁగఁబాదమధ్యగము లేడుమ వ్రాయఁగఁబద్మబంధమౌ.

ప్రథమమునఁ గర్ణికను వ్రాసి దాని కెనిమిది దిక్కులందును నెనిమిది దళములనుపఱచి యందలి నాలుగు దిగ్దళములందును స్రగ్ధరావృత్తముయొక్క పాదాదులందున్న యేడు వర్ణములును బాదాంతములందున్న యేడువర్ణములను ప్రవేశ నిర్గమవిధమున వ్రాయవలెను. విదిగ్దళములందుఁ బాదమధ్యముననున్న యేడు వర్ణములను లిఖింపవలెను.

పటములోని యుత్తరదిగ్దళమునందున్న పాదాదియందలి యేడు వర్ణములను గర్ణికనుండి చదివి (ఇదియే నిర్గమము) అనఁగా గర్ణికలోనుండి వెలుపటికిఁ బోవుట; దానివెంటనే విదిగ్దళము నందలి (ఈశాన్యము) వర్ణ సప్తకమును గ్రిందినుండియే చదివి మరలఁ బ్రాగ్దిగ్దళమునందలి పాదాంత వర్ణ సప్తకమును దళాగ్రము మొదలికి కర్ణికాక్షరముతో ముగియునట్లు జదువవలెను. (ఇదియే ప్రవేశము) బయటనుండి కర్ణికలోనికిఁ బోవుట, ఇట్లే దక్షిణ, పశ్చిమ దిగ్విదిగ్దళము లందలి వర్ణములను నిర్గమ ప్రవేశములతోఁ జదువవలెను. ఇది పద్మబంధము ప్రకాశకారదర్పణకారుల పద్మబంధలక్షణములు భిన్నములుగా నున్నవి. అప్పకవీయమున మరొకవిధముగా నున్నది స్రగ్ధరావృత్తమే పద్మబంధమున నుండవలెనను నియమములేదు. వానిలో ననుష్టుబ్వృత్తమునే పద్మబంధమున నిబంధించి చూపితి. వివరముల కా గ్రంథములను జూచుకొనవలెను

చక్రబంధము

కం. పదిచుట్లు, నాలు రేకులుఁ,
బదిలపఱచి సుకవిపేరుఁ బతిపేరును లోఁ
బొదలఁగ నేవంవిధగుణ
విదితంబగు చక్రబంధవిధమౌ నెటనన్. లా

ఒక పెద్దసున్నయు దానిలో మరొకటి యందులో నింకొకటి యిట్లుపది సున్నలుచుట్టి యన్నిటికన్న చిన్నదగు సున్ననుండి పెద్దసున్న రేకువఱకు నాలు రేకులు వ్రాసి నడుమ కవిపేరును రచించినఁ జక్రబంధము. ఇది విస్పష్టముగా లేదు.

ఒకదానిలో నొకటిచొప్పునఁ బదిసున్నలువ్రాసి యాలు రేకులు రచించి యారేకులలో స్రగ్ధరాది వృత్తములలో మూఁడుపాదములు వ్రాసి నాల్గవ పాదమును బెద్దసున్న (చక్రము)లో వ్రాసి రేకులలోని మూఁడవయక్షరములను

పద్మబంధము

రామాకశ్రీ సమగ్రారణకృత శయముద్రానసక్తారమారా
రామారక్తాసనద్రాష్ట్రిశరణ వటిమాత్రాస శుంఠీకుమారా!
రామాశుంఠీకుసత్రా ప్రకటతరవిచిత్రా పవిత్రాసమారా!
రామాసద్రావిపత్రాశ్రయ నరసరుచిగ్రామసశ్రీకమారా! ౮౫



వాఱవ యక్షరములును గలిపినచోఁ గవి కృతిపతుల నామములు వచ్చునట్లు రచించినచోఁ జక్రబంధ మగును. (అప్పకవీయ లక్షణము.) ఈ యుదాహరణ పద్యము నందలి మొదటి మూఁడుపాదములలో మూఁడవ యక్షరములును, నా పాదాంతమందలి యక్షర త్రయములో మొదటి యక్షరములను గలిపి చదివిన 'నారసింహాంకితం' అని వచ్చును మఱల మొదటిమూఁడు పాదములలోని యాఱవ యక్షరములును నా పాదాంతమందలి యక్షరములలో మొదటి యక్షరములును గలిపి చదివినచో 'మూర్తి (ర్తి) కవి కృతి' అనియును వచ్చును.

(చక్రబంధము)

శా. రక్షానాకపమూర్తి భాసుర గభీరా విక్రమోహాస్పదా!
దక్షారమ్యమతిస్థిరాభరణ విద్యాక్లృత్యశంకిస్వనా!
వక్షస్సింధుపకన్యకా సరసభవ్యాతిగ్మధీతంత్రదా !
దాక్షిణ్యారతవాదవైభవవినోదా హేమనాగాశ్వదా!



ఇదిగాక గోమూత్రికా, ఛత్ర, గుచ్ఛ, కుండలి, నాగ, కంకణ, మురజ, ఖడ్గ, సర్వతోభద్ర, మాలికా క్షురికా శరయంత్ర, వ్యోమ, వివిడిత, ద్విశృంగాటక, అర్ధభ్రమక బాణ, ముసల, శూల, అంకుశ శక్తి, హల, ఉరశ్చక్ర, స్వస్తిక, నంది ఆవర్త శృంగార, చామర, ఘంటా, సప్తచక్రిక ప్రభృతులగు బంధములు గలవు.

పద్మబంధములో అష్టదళ, ద్వాదశదళ, షోడశదళ, భేదములుగలవు.

ఈ బంధములలోఁ గొన్ని గిడుగు వెంకటరామమూర్తిగారిచే ప్రకటింపఁబడిన యప్పకవీయములో ౨౮౧ పుట మొదలుకొని యున్న పుటలలోఁ జిత్రింపఁబడియున్నవి. వానిని జూచుకొనవలెను.

గర్భకవిత్వము

ఒక వృత్తమునఁ గొన్ని యక్షరములను విడిచి చదివినచో మరొక వృత్తమేర్పడును. ఇట్లొక వృత్తముననే రెండు మూఁడితరవృత్తములు గర్భితములై యుండును. ఎట్లన,

సీ. మ'హిత విద్వజ్జన మండలీవినుత సా
హిత్య ప్రియంభావుకా'త్యుదార!
వి'తత భీమాహవ విక్రమక్రమ సము
ద్యద్వైరి నిర్భేదనా'భిరామ!
వి'నుత విశ్రాణన విభ్రమావహసితా
మానామరక్ష్మారుహా'! నృపేంద్ర!
వి'నత భూపాలకవిస్ఫురన్మకుట ర
త్నద్యోతితాంచత్పదా'! మహాత్మ!

పాశ్చాత్యసాహిత్యమునఁగూడ నొకానొక కాలమున బంధవిలోమాది కావ్యములున్నట్లు 'బెరిడెల్ కీత్' పండితుఁ డిట్లు వ్రాయుచున్నాడు.

"No doubt we hear in the Alexandrian age as in the latter Roman Poetry (Martial 1186) of such things as Sotadean Verses to be read backwards of simmias making poems, technopaignia, in the form of an axe, or a nightingale s egg of Dosiada's similar feet with an altar, so on It may be that these tricks arose from the practice of writing inscriptions on swords and leaves.

History of Sanskrit Literature, page 127.

గీ. 'నిరుపమదయాపయోనిధి నిరతభరిత
చారుచరిత ! నిర్మలతర ! సత్యరుచిర !
తరణికులమణీ ! నరసింహా ! ధరణీరమణ !
ఘనతరగుణనిధీ !' యను జనులు వొగడ.

ఈ సీసపద్యమున నాల్గు పాదములందలి ప్రథమ వర్ణములును పాదాంతము నందలి మూఁడువర్ణములును దొలఁగించి చదివినచో మత్తేభవృత్తము వచ్చును మరియు గీతపద్యమున నాల్గవపాదమునందలి 'గుణనిధీ !' అన్నంత దనుకఁ గందము వచ్చును. ఇట్టిది గర్భకవిత్వము. ఈ భేదములు 'అప్పకవీయము నందలి చతుర్థాశ్వాసమునఁ దుదిభాగమునఁ గలవు చూచుకొనునది.

ఈ శబ్దాలంకార, బంధ గర్భకావ్యములు చిత్రకావ్యములనియుఁ జిత్ర కవిత్వమనియును వ్యవహరింపఁబడును ఈ కావ్యములు రసహీనములగుట నధమకావ్యములుగాఁ బేర్కొనఁబడినవి. ఇంకను వీనివిషయమును గూలంకషముగా దెలిసికొనఁదలఁచినవారు సాహిత్యదర్పణమునకు 'రుచిర' యను వ్యాఖ్యను వ్రాసిన శివదత్తపండితుని 'చిత్రరహస్యము' అను గ్రంథమును జూచునది.

ప్రహేళికలు

"ప్రహేళయతి సూచయతి భావమ్ నతు స్వరూపార్థమితి ప్రహేళికా"

స్వరూపార్థము ననఁగా వర్ణస్వరూపమును దెలుపక భావమునుమాత్రము సూచించునది ప్రహేళిక. ఇది పొడుపుకథవంటిది. "రసస్య పరిపంథిత్వాన్నాలంకారః ప్రహేళికా" ఇది కావ్యజీవితభూతమగు రసమునకు శత్రువగుటవలన నలంకారముగాదు. క్రీడాగోష్ఠివినోదములందును రహస్యసంభాషణములందును (పెక్కండ్రున్నచోట) బరవ్యామోహమునకై యివి యుపయోగపడును. ఇది పదునాఱు భేదములని దండి చెప్పెను వీని లక్షణలక్ష్యసంజ్ఞాభేదము కావ్యాదర్శమునఁ జూచునది. సాహిత్యదర్పణమున చ్యుతాక్షరా, దత్తాక్షరా, చ్యుతదత్తాక్షరా, అక్షరముష్టి, బిందుమతి, అర్థమతి అని యాఱుభేదములు దెలిపెను.

సాహిత్యదర్పణమున చ్యుతాక్షరా, దత్తాక్షరా, చ్యుతదత్తాక్షరా అను ప్రహేళికలకుదాహరణ మిచ్చెను. వాని నిటఁ జూపుదును.

"కూజంతి కోకిలాస్సాలే" సాలమునఁ గోకిలలు కూయుచున్నవి. ఇట 'ర' అను నక్షరము చ్యుతము చేయఁబడినది. రసాలమని యభిప్రాయము. (చ్యుతాక్షరా ప్రహేళికా).

"యౌవనే పుల్లమంబుజం" యౌవనమునఁ దామరపువ్వు వికసించినది. ఇట 'యౌ' అనునక్షరమధికముగా నీయఁబడినది (దత్తాక్షరా ప్రహేళికా)

'కిం కరోతు కురంగాక్షీ వదనేన నిపీడితా' వదనముచే మిక్కిలి పీడితురాలయిన యువతి యేమిచేయును? ఇట 'మ' వర్ణమును చ్యుతము సేసి 'వ' వర్ణము నొసంగెను 'మదనేన' అని భావము (చ్యుత దత్తాక్షరా ప్రహేళికా)

ఇందొకచో నొకవర్ణమును దీసివేసియు నొకచో నధికముగా నిచ్చియు నొకచో నొకవర్ణమును దీసివేసి మఱొకవర్ణమును బెట్టియు నుంటచే నర్థము పొసఁగకున్నది ఆయావర్ణముల దెలిసికొని యర్థమును పొసఁగునట్లుచేయవలెను.

బిందుమతి' యను ప్రహేళిక కాదంబరీవ్యాఖ్యాత చూపినదాని నిట నుదాహరింతును. ఈ క్రిందివిధమున బిందువులు (సున్నల) ఇచ్చినచో నా పద్యమును గనుఁగొనవలెను. అది బిందుమతి.



త్రిభువనచూడారత్నం
మిత్రం సింధోః కుముద్వతీబంధుః
అయముదయతి ఘుసృణారుణ
రమణీవదనోపమశ్చంద్రః

ఇతరముల లక్ష్యలక్షణములు ఆంధ్రసాహిత్యదర్పణమునఁగలవు గ్రంథవిస్తరభీతిచే వానిని వదలితిని.

బంధ, గర్భకావ్యములును ప్రహేళికలును గావ్యాంతర్గతభూతములే కాన విస్తరించి తెలుపఁదలఁపలేదు.

శా. భూనాథోత్తమ. జంభభంజనమహాభోగాభిరామక్రియా
దానోజ్జృంభితవారిపూరభరితోద్యద్వార్ధివీచివ్రజా
మానామేయ సుధాబ్ధినిర్మలగుణా మాద్యన్మహాయాదవ
శ్రీనూత్నప్రథమానభాగ్య వరవైరివ్రాత భేదివ్రతా! ౮౬

కం. నీహారశిఖరిశిఖర
వ్యూహామితతుహినకణమహామహిమ! మహా
మోహావహావిమతవరా
రోహామణిహారినయన! రూఢవిహారా! ౮౭

లయగాహి

మిత్రకులభూషణ! యమిత్రకులభీషణ! విచిత్రమృదుభాషణ
చరిత్రమణిహారా
జైత్రవిశిఖాసన! బలిత్రిపురశాసన! పవిత్రగుణభావన.
సగోత్రభృతిధీరా
క్షాత్రకులలక్షణ సుపాత్రజనరక్షణ! కుశాగ్రవిశిక్షణ
యకృత్రిమవిహారా.
గోత్రసమసింధుర కళత్రితవసుంధర! పతత్త్రిరథబంధుర!
తనుత్రభుజసారా!

గద్యము

ఇది శ్రీహనుమత్ప్రసాదలబ్ధ కవితాసార సారస్వతాలంకార, నిరంకుశప్రతిభా
బంధుర, ప్రబంధపరనరచనాధురంధర, ప్రబంధాంక వేంకటరాయ
భూషణసుపుత్త్రి తిమ్మరాజపౌత్త్ర సకల భాషావిశేషనిరుప
మావధాన శారదామూర్తి మూర్తిప్రణీతంబైన కావ్యా
లంకార సంగ్రహంబను మహాప్రబంధంబునందు
ద్రివిధదోషనిర్ణయంబును గుణప్రకరణం
బును శబ్దాలంకార సంగ్రహంబు
నన్నది చతుర్థాశ్వాసము.

కావ్యాలంకారసంగ్రహము

పంచమాశ్వాసము

కం. శ్రీనందనసౌందర్య బు
ధానందన కీర్తివిజితహరిచందన మే
ధానయనిధాన! దానే
దానీంతనకర్ణ! నరసధరణీశమణీ! ౧

గీ. అవధరింపుము లక్ష్మలక్ష్యముల నెల్ల
ననఘ! భవదీయనామధేయాంకితముగ
బహువిధక్తుల నొనరింతుఁ బద్యవితతి
నింకఁ జతురార్థభవదలంకృతులు వరుస. ౨

ఉపమా - అనన్వయ - ఉపమేయోపమా - స్మరణ - రూపక - పరిణామ-సందేహ - భ్రాంతిమత్ - అపహ్నవ - ఉల్లేఖ - ఉత్ప్రేక్షా - అతిశయోక్తి - సహోక్తి సమాసోక్తి - వినోక్తి - వక్రోక్తి - స్వభావోక్తి - వ్యాజోక్తి-మీలన - సామాన్య - తద్గుణ - అతద్గుణ - విరోధాభాస - విశేష - అధిక - విభావనా - విశేషోక్తి - అసంగత - విచిత్ర - అన్యోన్య - విషమ - సమ - తుల్యయోగితా-దీపక - ప్రతివస్తూపమా-దృష్టాంత- నిదర్శనా- వ్యతిరేక- శ్లేష- పరికర - ఆక్షేప - వ్యాజస్తుతి అప్రస్తుతప్రశంసా - పర్యాయోక్తి - ప్రతీప - అనుమాన - కావ్యలింగ - అర్థాంతరన్యాస - యథాసంఖ్య - అర్థాపత్తి - పరిసంఖ్యా - ఉత్తర - వికల్ప -సముచ్చయ- సమాధి- భావిక - ప్రత్యనీక - వ్యాఘాత-పర్యాయ-సూక్ష్మ - ఉదాత్త - పరివృత్తి - కారణమాలా -ఏకావళీ - మాలాదీపక -సార - రసవత్ - ప్రేయస్-ఊర్జస్విత్-సమాహితంబులన డెబ్బది యలంకారములు.

అందు రూపక - పరిణామ - సందేహ - భ్రాంతిమత్ - ఉల్లేఖ అపహ్నవ- ఉత్ప్రేక్షా- స్మరణ- తుల్యయోగితా - దీపక - ప్రతివస్తూపమా-దృష్టాంత- సహోక్తి - వ్యతిరేక- నిదర్శనా - శ్లేషంబులు పదియాఱును ప్రతీయమానౌపమ్యంబులు (వీనిలో సామ్యము వాచ్యముగాఁగాక వ్యంగ్యముగాఁ దోఁచుచుండును.)

సమాసోక్తి - పర్యాయోక్తి - ఆక్షేప - వ్యాజస్తుతి - ఉపమేయోపమా - అనన్వయ - అతిశయోక్తి - పరికర - అప్రస్తుత ప్రశంసా - అనుక్త నిమిత్తవిశేషోక్తులు పదియును ప్రతీయమాన వస్తుకంబులు. (వీనిలో వస్తువు వ్యంగ్యముగా గోచరించును)

రసవత్ - ప్రేయస్ - ఊర్జస్విత్ -సమాహితములు నాలుగును ప్రతీయమానరసభావంబులగు. (వీనిలో రసభావంబులు, వ్యంగ్యముగా గోచరించును.)

కడమ, ఉక్తనిమిత్తవిశేషోక్తి సహితంబులగు నుపమాద్యలంకారంబులు (అనఁగా ఉపమా - వినోక్తి - అర్థాంతరన్యాస - విరోధ - విభావనా-ఉక్తనిమిత్తవిశేషోక్తి - విషమ - సమ - చిత్ర- అధిక - అన్యోన్య -కారణమాలా - ఏకావళీ - వ్యాఘాత - మాలా దీపక - కావ్యలింగ - అనుమాన - సార-యథాసంఖ్య - అర్థాపత్తి - పర్యాయ-పరివృత్తి -పరిసంఖ్యా - వికల్ప - సముచ్చయ - సమాధి పత్యనీక - ప్రతీప-విశేష -మీలన -సామాన్య - అసంగతి -తద్గుణ - అతద్గుణ -వ్యాజోక్తి -వక్రోక్తి - స్వభావోక్తి - భావిక -ఉదాత్త - సారములు.) నలువదియు నస్ఫుటప్రతీయమానౌపమ్యరసభావంబులగు. (అనఁగా వీనియందేదియుఁ బ్రతీయమానముగాదు)

ప్రతీయమానౌపమ్యములు ౧౬, ప్రతీయమానవస్తుకములు ౧౦ కడమయుపమాదులు ౪౦, రసవత్ ప్రేయస్ ఊర్జస్విత్ సమాహితమును ౪, మొత్తము ౭౦ అలంకారములు.

రసవదాద్యలంకారములు వినాగా ౬౬ అలంకారములు. ప్రతాపరుద్రీయపారానుసారము రసవదాదులు ౭. (రసవత్ ప్రేయస్ ఊర్జస్విత్ సమాహిత, భావోదయ భావసంధి భావశబలతలు.) మొత్తము ౭౩ అలంకారములు నరసభూపాలీయమున దెల్పుది.

సీ. అవని సాధర్మ్యంబు త్రివిధమౌ భేదప్ర
ధాన, మభేదప్రధాన, మరయ
నుభయప్రధానమై, యొగిదీపకము, తుల్య
యోగితయుఁ, బ్రతివస్తూపమయును,

దృష్టాంతమును సహోక్తియు, నిదర్శన,
ప్రతీపము వ్యతిరేకంబుఁ, బ్రబలు భిన్న
సామ్యముల్ ; రూపక సందేహ పరిణామ
ములు భ్రాంతిమదపహ్నుతులు నభిన్న

గీ. సామ్యధర్మంబు లుల్లేఖసంగతముగ ,
నుపమ, యుపమేయకోపమయును, ననన్వ
యంబు, స్మరణంబుఁ దలఁప భేదావిభేద
సహిత సాధర్మ్యగుణవిశిష్టములు మఱియు. ౪

భేదప్రధానము అభేదప్రధానము భేదాభేదప్రధానము, అని సామ్యము (సాదృశ్యము) మూఁడువిధములు దీపకము తుల్యయోగిత ప్రతివస్తూపమ దృష్టాంతము సహోక్తి నిదర్శన ప్రతీపము వ్యతిరేకము అను నెనిమిదియు భేదప్రధానమగు సాదృశ్యముగల యలంకారములు. భేదప్రధానమగు సాదృశ్యమన నుపమానోపమేయములకు భేదమును సామ్యమును గోచరించును. రూపక, సందేహ, పరిణామ భ్రాంతిమత్ అపహ్నవ ఉల్లేఖాలంకారములభేదప్రధానమగు సాదృశ్యముగల యలంకారములు. అభేదప్రధానమున నుపమానోపమేయములకు అభేదమున్నట్లు గనఁబడును. ఉపమ ఉపమేయోపమ, అనన్వయము స్మరణము అనునవి భేదాభేద ప్రధానమగు సాదృశ్యముగల యలంకారములు. భేదాభేదసామ్యమన నుపమానోపమేయములకుఁ గొంత భేదమును గొంత యభేదమును గోచరించును (సామాన్య ధర్మమును బట్టి యభేదభావము)

సీ. అతిశయోక్త్యుత్ప్రేక్షలధ్యవసితమూల ,
[illegible]గి విభావన, విశేషోక్తి, విషమ
ములు నసంగతి, చిత్రము, లతద్గుణాన్యోన్య
ములు, భావికవిశేషములు, విరోధ
జన్యముల్ వ్యాఘాత సహితంబుగాఁగ ; స
ముచ్చయంబు, వికల్పముఁ, బరిసంఖ్య
మలయథాసంఖ్య 'మర్థాపత్తియును వాక్య
భవములు ; పరివృత్తి, ప్రత్యనీక

గీ. తద్గుణసమాధులు, వినోక్త్యుదాత్తసమము
లును, స్వభావోక్తి, లోకవర్తనభవములు ;

గరిమ ననుమానకావ్యలింగములు తర్క
జంబు లర్థాంతరన్యాస సంగతముగ.

అతిశయోక్తి ఉత్ప్రేక్ష- ఈ రెండును నధ్యవసాయమూలకములు అధ్యవసాయమున నుపమేయమును నధఃకరించి యుపమానమునుగానే చెప్పట (దీనివివరణముత్ప్రేక్షాలంకారమునఁ గలదు) విభావన విశేషోక్తి, విషమ అసంగతి చిత్ర అతద్గుణ అన్యోన్య భావిక, విశేష వ్యాఘాతములు విరోధమూలకములు కారణములేకున్నను గార్యముగలిగినట్లు చెప్పట ఇదియే విరోధము సముచ్చయ వికల్ప పరిసంఖ్యా యథాసంఖ్య అర్థాపత్త్యలంకారములు వాక్యన్యాయమూలకములు వాక్యన్యాయములన మీమాంసాశాస్త్రన్యాయములు పరివృత్తి, ప్రత్యనీక, తద్గుణ సమాధి వినోక్తి ఉదాత్త సమ. స్వభావోక్తులు లోకవ్యవహారమూలకములు లోకవ్యవహారమన లోకన్యాయము, అనుమాన, కావ్యలింగ అర్థాంతరన్యాసములు తర్కన్యాయమూలకములు

సీ. కారణమాలికైకావళీసారమా
లాదీపకంబు లుల్లసితశృంఖ
లావిచిత్రత్వమూలములు; వ్యాజోక్తి వ
క్రోక్తి మీలన మపహ్నుతిభవములు;
పరగు సమాసోక్తిపరికరంబులు విశే
షణజాతిచాతుర్యసంభవములు
కడమ శ్లేషాద్యలంకారముల్ పూర్వోదిత
న్యాయనిరపేక్షతాయుతంబు

గీ. లీయలంకారములనెల్ల నేఁ బ్రధాన
మైన యుపమయ ముందుగా ననువుగొలిపి
యొకటకొకటికి భేదముల్ ప్రకటములుగ
సరవి నెఱిఁగింతు లక్ష్మలక్ష్యమ్ము లెలమి.

కారణమాలా, ఏకావళీ, సార, మాలాదీపకాలంకారములు శృంఖలావైచిత్ర్యమూలములు. (శృంఖల - గొలుసు: దానివలెఁ బూర్వాపరపదములకు లంకెగల యలంకారములు) వ్యాజోక్తి వక్రోక్తి మీలనము లపహ్నవమూలకములు. అపహ్నవము కప్పిపుచ్చుట, అది ప్రధానముగాఁగలది సమాసోక్తి, పరికరములు విశేషణవైచిత్ర్యమూలకములు. మిగిలిన శ్లేషాద్యలంకారములు కేవలములు. అనఁగా నెట్టి న్యాయమును నపేక్షింపనివి. ఈయలం

కారములలోఁ బ్రధానమైనది యుపమాలంకారము దానిని ముందుగాఁ దెలిపెదను మఱియుఁ బరస్పరభేదము స్పష్టముగాఁ దెలియునట్లు మిగిలిన యలంకారములకు లక్ష్యలక్షణములను దెలిపెదను

౧ ఉపమాలంకారము

"ఉపమైకా శైలూషీ సంప్రాప్తా చిత్రభూమికాభేదాన్
రంజయతి కావ్యరంగే నృత్యంతీ తద్విదాంచేతః

'ఉపమ' (అలంకారము) ఒక నటి అది చిత్రవిచిత్రములయిన వేష భేదములను ధరించి కావ్యరంగమున లాస్యమాడుచు నా కావ్యవేత్తల మనస్సును రంజిల్లఁజేయుచున్నది అనఁగా నీ యుపమాలంకారమలఁతిగా మార్చినచో మఱొక యలంకారమగును ఎట్లన,

ముఖము చంద్రునివలె నున్నది' అని సాదృశ్యము వర్ణించినచో నుపమ, అదియు నుక్తిభేదముచే ననేకాలంకారములగుచున్నది "ముఖము చంద్రునివలె నున్నది చంద్రుఁడు ముఖమువలె నున్నాఁడు" అన్నచో నుపమేయోపమ "ముఖము ముఖమువలె నున్నది" అన్నచో ననన్వయము "చంద్రుఁడు ముఖము వలె నున్నాఁడు" అన్నచోఁ బ్రతీపము 'చంద్రునిఁజూచి ప్రియాముఖమును స్మరింతును" అన్నచో స్మరణాలంకారము "ముఖమే చంద్రుఁడు" అన్నచో రూపకము. "ముఖచంద్రునిచేఁ దాపము శమించును" అన్నచో బరిణామాలంకారము "ఇది ముఖమా? చంద్రుఁడా?" అన్నచో సందేహము "చంద్రుఁడని చకోరములు నీముఖముగూర్చి పరుగిడుచున్నవి" అన్నచో భ్రాంతిమంతము. "చంద్రుఁడని చకోరములును కమలమని తేంట్లును నీముఖమును జూచి మోదించుచున్నవి" అన్నచో నుల్లేఖము "ఇది ముఖముగాదు చంద్రుఁడు" అన్నచో నపహ్నవము "ఇది చంద్రుఁడు కాఁబోలు" అన్నచో నుత్ప్రేక్ష ఇది చంద్రుఁడే అన్నచో నతిశయోక్తి "ముఖము చంద్రపద్మములను జయించినది" అన్నచోఁ దుల్యయోగిత "చంద్రుఁడును నీ ముఖమును రాత్రిపూట శోభిల్లును" అన్నచో దీపకము "నీ ముఖమునందే నేను ప్రమోద మనుభవింతును చంద్రునియందే చకోరములు ప్రమోదపడును" అన్నచోఁ బ్రతివస్తూపమ "ఆకాశమునఁ చంద్రుఁడు, భూమియందు నీముఖము" అన్నచో దృష్టాంతము. "ముఖము చంద్రశ్రీని ధరించుచున్నది" అన్నచో నిదర్శన "నిష్కళంకమగు ముఖము చంద్రు నతిక్రమించుచున్నది" అన్నచో వ్యతిరేకము. "నీ ముఖముతోఁ గూడఁ జంద్రుఁడు రాత్రి శోభిల్లుచున్నాఁడు" అన్నచో సహోక్తి "ముఖము స్మితచంద్రికలతోఁ దిలకకళంకముతో శోభిల్లుచున్నది" అన్నచో సమాసోక్తి. "అఖేన సదృశం వక్త్రం హరిణాహితసక్తినా" అన్నచో శ్లేష "ముఖము ముందు చంద్రుఁడు నిష్ప్రభుఁడు" అన్నచో నప్రస్తుతప్రశంస.

ఆట్లనేకాలంకారరూపములను గ్రహించును బ్రహ్మజ్ఞానమువలన సమస్త విశ్వము దెలియఁబడిన విధమున నుపమాజ్ఞానమువలన సమస్తాలంకార జ్ఞానమును లభించును కావున దానినే మొదటఁ జెప్పుచున్నాఁడు

ఉపమ సర్వాలంకారబీజభూతమని వామనమతము అతఁ డన్నియు నౌపమ్యగర్భముగల యలంకారములనే యుదాహరించెను అతిశయోక్తి సర్వాలంకారబీజభూతమని మమ్మట మతము

ఉపమాలంకార లక్షణము

* సీ. ఉత్ప్రేక్షవలె ననిర్ధోపమకా, కన
న్వయము కై వడి నభిన్నంబు గాక,
హీనోపమయుఁబోలె నిల నహృద్యము గాక
యుపమానమనఘమై యుండెనేని,
శ్లేషంబువలెఁ బదశ్లిష్టమాత్రము గాక,
సార్థమై యల రూపకాదులక్రియ
వ్యంగ్యంబుగాక సామ్యమగు నేని,
నౌపమ్యము ప్రతీపమట్లు తలఁపఁ

---

*ఇది ప్రతాపరుద్రీయలక్షణమున కనువాదము ఆ లక్షణ మిది

"స్వతస్సిద్ధేన భిన్నేన' సమ్మతేన చ ధర్మతః
సామ్యమన్యేన వర్ణ్యస్య వాచ్యంచేదేకదోపమా"

వర్ణ్యమునకు (ప్రకృతమగు నుపమేయమునకు) స్వతస్సిద్ధమైనట్టియు ననఁగాఁ బ్రసిద్ధమైనట్టియు నుపమేయముకన్న భిన్నమైనట్టియు సమ్మతమైనట్టియు ననఁగా హృద్యమైనట్టియు న ప్రకృతముతో ధర్మమునుబట్టి సాదృశ్యము వాచ్యముగాఁ జెప్పినచో నుపమాలంకారమగును స్వతస్సిద్ధేన అను దానిచే హీనోపమావ్యావృత్తియు 'ధర్మతః' అనుటచే శ్లేషవ్యావృత్తియు 'వాచ్యం' అనుటచే రూపకాదివ్యావృత్తియు 'ఏకదా' అనుటచే నుపమేయోపమా వ్యావృత్తియుఁ జేయఁబడినది ఈ శ్లోకమునకుఁ బై పద్యము వివరణముగా నున్నది.

ఈ విద్యానాథ లక్షణమును అప్పయ్యదీక్షితులవారు చిత్రమీమాంసలో బ్రతిపదమును ఖండించి,యవ్యాప్త్యతివ్యాప్తులు సూపి

"వ్యాపార ఉపమానాఖ్యో భవేద్యది వివక్షితః
ఉపమానివృత్తిపర్యంతముపమాలంకృతిస్తు సః"

గీ. క్రమవిపర్యాససహితంబు గాకయున్న,
నలయ నుపమేయకోపమ యట్లు సామ్య
ధర్మ మినుమాఱుపరుపఁ దడవకున్న,
నుపమ యగు; దీని భేదంబు లుగ్గడింతు

ఉత్ప్రేక్షయం దుపమానము ప్రసిద్ధముగా నుండదు. (ఉత్ప్రేక్షయందుపమానము సాధ్యము) ఉపమాలంకారమునఁ బ్రసిద్ధము అనన్వయాలంకారమున నుపమానోపమేయములభిన్నములు ఇందు భిన్నములు. ఉపమేయముకన్న నుపమానముత్కృష్టముగా నుండవలయును అప్పుడే యది హృద్యము. హీనోపమ యందది హృద్యముగా నుండదు (హీనోపమాపదముచే నెల్ల దుష్టోపమలను గ్రహింపవలెను) శ్లేషయందు శబ్దసామ్యమే గాని యర్థసామ్యముండదు ఉపమయం దర్థసామ్యముండును (శబ్దసామ్యమున్నను ఉపమాలంకారమే యని మమ్మట మతము ఎట్లన "సకలకలంపురమేతజ్జాతం సంప్రతి సుధాంశుబింబమివ" (ఈ పురము చంద్రబింబమువలె సకలకలమయ్యెను అనుచోఁ జంద్రమండలమునకును బురమునకును సకలకలత్వము అను శబ్దము చేతనే సామ్యము అలంకారసర్వస్వకారుఁడీ శబ్దసామ్యము నంగీకరింపలేదు శబ్దసామ్యమున్నచో శ్లేషయే యుచిత యనిమతము విద్యానాథుఁడును వారి ననుసరించెను) రూపక సందేహ భ్రాంతిమత్ ఉల్లేఖ అపహ్నవ, తుల్యయోగితా, దీపక ప్రతివస్తూపమా దృష్టాంత సహోక్తి వ్యతిరేక నిదర్శనలలో సామ్యము వ్యంగ్యముగా భాసించును ఉపమయందు వాచ్యముగా భాసిల్లును ప్రతీపమునఁ గ్రమవిపర్యాసమగు నౌపమ్యముండును అనఁగా నుపమానము నుపమేయముతోఁ బోల్తురు. ఉపమాలంకారమున నుపమేయమును నుపమానముతోఁ బోల్తురు ఉపమేయోపమ యందు సామ్యము రెండుతూరులు వచ్చును. (ధర్మ మర్థమువలెను నర్థము ధర్మమువలెను నీయందుఁ గలవు) ఉపమాలంకారమున నొక్కతడవ మాత్రమే యుండును కాఁబట్టి యుపమాలంకార ముత్ప్రేక్షాదులకన్న విలక్షణము

వర్ణ్యము ప్రకృతము విషయము, ఉపమేయము ఇవి పర్యాయపదములు. అప్రకృతము, అవర్ణ్యము, విషయి ఉపమానము ఇవి పర్యాయపదములు

ఉపమానవ్యాపార మనఁగా సాదృశ్యవర్ణనముపమితిక్రియానిష్పత్తి పర్యంతము అనఁగా నుపమానము సిద్ధించువఱకు వివక్షింపఁబడినచో నుపమాలంకారము అని సిద్ధాంతించెను. ఆ ఖండనము నిచ్చట గ్రంథవిస్తరభీతిచే వదలితిని. అందుఁ గావలసినవారు చూచుకొనవలెను

గీ. ఒనరునది పూర్ణయును లుప్తయును ననంగ
నందు నుపమాన, ముపమేయమలరు సమత
సామ్యవాచకమును గూర్పఁజాలుఁ బూర్ణ;
కొన్ని కడమైన లుప్తయై కొమరు మిగులు.

ఈ యుపమాలంకారము పూర్ణోపమా లుప్తోపమా భేదములచే ద్వివిధము. పూర్ణోపమ యనఁగా, ఉపమానము ఉపమేయము సామాన్యధర్మము (సమత). సామ్యవాచకము, అను నాలుగంశములు గలది. ఈ నాల్గింటిలో నేది లోపించినను లుప్తోపమ.

గీ. అందు నుభయాఖ్య యగుఁ బూర్ణ యార్థి, శ్రౌతి,
యనఁగ రఘురామసన్నిభుఁడనెడి చోట
నార్థి; కందర్పుఁడనుబోలె నలరుచుండు
నధిపుఁడనుచోట శ్రౌతియై యతిశయిల్లు.

పూర్ణోపమ ఆర్థీ శ్రౌతీ భేదములచే ద్వివిధము ఆంధ్రమున సాక్షాత్సా దృశ్యమును దెలుపు (సంస్కృతమున యథా ఇవాది శబ్దములవలె) వలెన్ పోలెన్ ఓయనన్, ఓయన్నట్లు, అనఁగాన్, అనువాని ప్రయోగమున శ్రౌతి యనియు నీషద్వ్యవధానముచే సాదృశ్యమును దెలుపు *సదృశ సంకాశ,

---

* ఈ సాదృశ్యమును దెలుపు పదముల నీ క్రిందఁ దెలుపుచున్నాను ఈపద్యము కీ. శే. అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారిది. వా రాంధ్రకావ్యాదర్శమున నిచ్చిరి

సీ మాదిరి-కైవడి-మాడ్కిఁ-బగిదిఁ-బోల్కిఁ-
దెఱఁగున-విధమునఁ-దీరునఁ-గ్రియ
గతి-ఖాతి-చందముగా-రీతి-రహి-రేవ-
కరణి-జాడ-రీవి-దంబు
వలె-నట్టు-లటు-లట్లు-బలె-పోలె-వరుసను
బోణి-వంటి-యొరయు-పోసి-యట్టి
పోలు మున్నగు శబ్దములు, సప్రతి-యుద్ది-
యెన-జోడు-పోటియు-నీడు-సూడు,
సవతు-తరము దీటు-సాటువ-సాటియు-
పురు-డచ్చునన్-సరిపోవును-సరి-
తూఁగుచునుండు-వంతులకు వచ్చుచునుండుఁ-
బ్రతి-మాఱు-తరబడి-బదులు-సాటి
నిభ-సన్నిభ-సమాన-నీకాశ-సంకాశ-

నీకాశ, ప్రతీకాశ సన్నిభ ఉపమాప్రభృతి శబ్దముల ప్రయోగముచే నార్థి యనియుఁ జెప్పఁబడును "అతఁడు రఘురామసన్నిభుఁడు" అనుచో 'సన్నిభ' పదప్రయోగముచే నార్థియు "అధిపుఁడు కందర్పుఁడునుబోలె నలరుచుండు" అనుచోఁ 'బోలెన్' పదప్రయోగముచే శ్రౌతియు నగును.

కం. ధరయం దార్థియుఁ ద్రివిధాం
తరమయ్యె సమాస, వాక్య తద్ధితగతమై,
తిరముగ వాక్యసమాసా
చరణంబుల ద్వివిధయగుచు శ్రౌతియుఁ దనరున్. ౧౦

తుల్య-ప్రతికాశ-తులిత-సదృశ
సంవాది-సమ్మిత-సమ-సదృక్ష ప్రతి
పక్ష-సపక్ష-సలక్ష-ణోప
మోపమి-తాభ-సరూప-సజాతీయ-
వైరి-సవ-ర్ణానువాది-ప్రఖ్య
ప్రతినిధి-ప్రతిబింబ-ప్రత్యనీక-ప్రతి
ద్వంద్వి- ప్రతిచ్ఛందపదములు- ప్రతి
రూపపదం బనురూపపదంబు-న
సూనార్థక పదసమూహ-దేశ్య
కల్ప-దేశీయాదిక ప్రత్యయంబులు-
నబ్జాననాదిశబ్దాళియందు
వెలయుచుండెడి బహువ్రీహి సమాసంబు-
స్పర్థఁబూనె-జయించె-వైరమూనె
ద్రోహ మొనర్చె-నాక్రోశించె-నెదిరించె-
గర్జించెఁ-బీడించె-గర్హ సలిపె
నవ్వె-నసూయఁ గనంబఱచెను-సంధి
సేసె-నీసువహించెఁ-జిన్న చూపు
చూచె-విడఁబించె-శోభగొల్ల గొనియె-
దాని సౌభాగ్యసంతతి హరించె
గీ దానితో విరోధించెను దానితోడఁ
దులను సరితూఁగెఁ, దత్పదముఁబడమిడెఁ
దదనుబంధి తచ్ఛీలంబు దానిననుక
రించె నను నిట్టి నుడులు సదృశతఁ దెల్పు

కావ్యాదర్శమున శ్రౌతీ ఆర్థీభేదములేమి 'బలె పోలె అనునవిగూడా నీ జాబితాలో గలవు ఈ రెంటినిఁ దీసివేసి మిగిలినవి ప్రయోగించినచో నార్థియని గ్రహింపవలెను

ఆర్థి సమాసగత, వాక్యగత తద్ధితగత యని ముప్విధములు. శ్రౌతి వాక్యగత, సమాసగత యని యాంధ్రమున ద్వివిధమే (సంస్కృతమున నార్థి వలెనే శ్రౌతియు త్రివిధమే తద్ధితగతశ్రౌతి యేల యాంధ్రమున లేదో తెలుపు చున్నాఁడు

కం. అల తద్ధితములయందుం
దెలియ 'వతి' ప్రత్యయంబు తెలుఁగున లేమిం
గలిగిన కల్పప్రత్యయ
మలరుచు నయ్యార్థియంద యది గనుపట్టున్. ౧౧

తద్ధితములందున్న 'వతి ప్రత్యయము (హరివత్) ఆంధ్రమునఁ బ్రయుక్తము గామిఁ దద్ధితగత శ్రౌతి యాంధ్రమున లేదు (సంస్కృతమున "తేన తుల్యంక్రియా చేద్వతిః" అను పాణిని సూత్రముచే "హరిణాతుల్యమధీతే హరివత్ అధీతే" అని యగును) హరివత్' అని యాంధ్రమున నుండదు సంస్కృతమునఁ గలదు. కావునఁ దత్ప్రయోగమున సంస్కృతమున శ్రౌతి యుండును 'మృతకల్పుఁడు' ఇత్యాదులందున్న తద్ధిత కల్ప ప్రత్యయ ప్రయోగమున నార్థియే యగును కాని శ్రౌతిగాదు (కల్పబాదిప్రయోగేత్వార్థ్యేవ) కల్పబాది ప్రత్యయములు ప్రయోగించినచో నార్థియే కానఁ దద్ధితగతశ్రౌతి యాంధ్రమున లేదు

చ. కావునఁ బూర్ణ పంచవిధ, కన్గొన లుప్తయు సామ్యధర్మమి
చ్ఛావిధిఁగూర్పకున్న యెడ శ్రౌతియు నార్థియునై యథోక్త సం
భావన వాక్యయుక్తయు, సమస్తయు, వాక్యసమాస తద్ధిత
శ్రీవివశాత్మయై ధరణిఁజెన్నగు సాయకసంఖ్య నెట్లనన్. ౧౨

వెనుక నడిచిన విధముగఁ బూర్ణోపమ యైదువిధములు లుప్తోపమయు సాధారణ ధర్మమును ప్రయోగించునపుడు (అనగా ధర్మలుప్తలో) శ్రౌతీ, ఆర్థీ భేదములచే ద్వివిధమై తగును అందు శ్రౌతి వాక్యగత సమాసగత భేదములచే నిఱుదెఱఁగులు ఆర్థి వాక్యగత సమాస తద్ధితగత భేదములచేఁ ద్రివిధము మొత్తము లుప్తోపమయు నైదువిధములు (సాయకసంఖ్య)

సమాసగత - పూర్ణ - ఆర్థి

కం. ఈవియుఁ జల్లదనంబును
గేవలసౌందర్యగుణము గిరికొనఁగ గళా
భావుకుఁడైన నృసింహ
క్ష్మావల్లభుఁడమరుఁ బూర్ణచంద్రోపముఁడై. ౧౩

నృసింహభూపాలుఁడుపమేయము పూర్ణచంద్రుఁడుపమానము, 'ఉపమ' యనుపదముపమావాచకము 'కళాభావుకత్వము' సాధారణధర్మము ; ఈ నాలుగంశములును ప్రయుక్తములై యుంటఁ బూర్ణోపమ అందు నిది యార్థి. ఏలన సాక్షాత్సాదృశ్య పతిపాదకములగు వలెన్ పోలెన్, ప్రభృతి పదములుగాక 'ఉపమ' అను పదము ప్రయుక్తమై యున్నది మఱియు నుపమానమగు పూర్ణచంద్రపదము 'పూర్ణచంద్రోపముఁడై' అను సమాసమున నున్నది కాన సమాసగత.

వాక్యగత - పూర్ణ - ఆర్థి

కం. వెలయు బవరాంధ్ర తలఁపుల
వలపును నిలుపంగఁజాలు వరరూపమునం
తెలఁగుచు నృసింహుఁడలరుల
విలుకానికి సాటియయ్యె విశ్రుతలీలన్. ౧౪

నృసింహుఁడు రూపమున "అలరులవిలుకానికి సాటియయ్యె" అను వాక్యమున నుపమాన, ఉపమేయ, సాధారణధర్మ (బవరాంధ్ర...రూపము) ఉపమావాచకములు (సాటి) గలవు కానఁ బూర్ణోపమ ఇది వాక్యగతము. 'సాటి' పదముంటనార్థి.

తద్ధితగత - పూర్ణ - ఆర్థి

కం. ఏయెడల నియ్యనియ్యం
గాయలుగాచిన నృసింహుకరమర్థులకుం
బాయని వేడ్క ఫలించుచు
వాయతగతిఁ గల్పకల్పమై విలసిల్లున్ ౧౫

నృసింహునికరముపమేయము, కల్పము (కల్పవృక్షము) ఉపమానము; కల్పప్రత్యయ ముపమావాచకము 'ఏయెడల నియ్య నియ్యం గాయలు గాయుట' సాధారణధర్మము ఇటఁ 'గల్పకల్పము' అనుచో "కల్పేన ఈషదూనః కల్పకల్పః అని యగును. ఇటఁ దద్ధితగతపూర్ణార్థి

అయితే యిట నొక దోషముగలదు ఉపమాలంకారమున శబ్దసామ్యము గాక యర్థసామ్యమే యుండవలెనని మున్ను గ్రంథకర్తయే తెలిపెను కాని యిట "ఇయ్యనియ్యం గాయలు గాయుట అను సాధారణధర్మము హస్తముతో నన్వయించినపుడు "నియ్యఁగా ఇయ్యఁగా గాయలు (కిణములు) కాసె" ననియు, గల్పవృక్షముతో నన్వయించినపుడు 'ఇచ్చుటకై యిచ్చుటకై యనగా మిక్కిలిగా నిచ్చుటకై కాయలు పండ్లు కాసె ననియును భిన్నార్థములను

వహించుచున్నది కాన నిట శబ్దసామ్యమేకాని యర్థసామ్యము లేదు మమ్మట మతానుసారముగా నిట్టియెడలఁ గూడ (సకలకలం పుర మేతజ్జాతం సుధాంశు బింబమివ' అనుచోటియందువలె నుపమాలంకారమే యగును (శబ్దసామ్య మున్నను) పతాపరుద్రీయ మతానుసారముగా శ్లేషంబువలెఁ బద్ధశ్లిష్టమాత్రము గాక) నరసభూపాలీయకర్తయు శబ్దసామ్యము గూడదని తెలిసి తాను శబ్ద సామ్యమునే యుదాహరించెను

వాక్యగత - పూర్ణ - శ్రౌతి

కం. దివియును భువియు భుజంగమ
భువనంబును నిండ విమలభూరిప్రభతో
దివిజేంద్రతటిని యోయన
నవిరళగతిఁ బొల్చు నీదు యశము నృసింహా ! ౧౨

కీర్తియుపమేయము. దివిజేంద్రతటిని యుపమానము 'దివియు... నిండుటయు, భూరిప్రభగలిగియుండుటయు సాధారణధర్మము తటినియో యన అనుచో 'ఓయన' ఉపమావాచకము కానఁ బూర్ణోపమ ఇది వాక్య గతము ఓయనన్ అను నుపమావాచకము వలెన్ పోలెన్ శబ్దములవలె సాక్షాత్సాదృశ్యమును బోధింపదు కాని యీ గ్రంథకర్త ఓయనన్-అనఁగన్ అనువాని ప్రయోగమునందును శ్రౌతి-ఉపమనే యంగీకరించెను

న్యాయముగా ఓయన అనునది యుత్ప్రేక్షావాచకము. కాన నీ యలంకారముత్ప్రేక్షయే కావలయును తటిని పోలెన్ అని యున్నచో లెస్సగా నుండును

* సమాసగత పూర్ణ శ్రౌతి

కం. కరముల శంఖము, చక్రము,
నిరవుగ నురమందుఁ జెంది యిందిరదనరన్
హరివలె వెలయుదువౌరా.
నరసాహస యోబరాజనరసింహనృపా ! ౧౪

---

* సంస్కృతమున 'ఇవ' శబ్దముతో 'ఇవేన సమాసో విభక్త్యలోపశ్చ పూర్వపదప్రకృతిస్వరత్వం చ' అను సూత్రముచే సమాసము గానవచ్చు చున్నది అట నీ సమాసమున విభక్తి లోపింపకపోవుటచే "జీమూతస్యేవ భవతి ప్రతీకం' మొదలగు స్థలములందు వ్యస్త సమస్తపదము లకు భేద మేమి ? అను శంక గలుగుచున్నది వేదమందయినచో సమాసమగుచో నొక స్వరమును, సమాసము గాకున్నచో మఱొక స్వరమును వచ్చును ఇటఁ

నరసింహుం డుపమేయము హరి యుపమానము పూర్వార్థము సాధారణ ధర్మము—(ఇటఁగూడ శబ్దసామ్యమే. ఏలన హరి దాల్చిన శంఖ, చక్ర, ఇందిరలు వేఱు. నరసభూపాలుఁడు ధరించిన శంఖ చక్ర (రేఖలు), ఇందిర (శోభలు) వేఱు. 'హరివలె' అనునది సమాసము కాన సమాసగతపూర్ణ

పంచవిధానుపాత్తధర్మలుప్తలు

ధర్మము లోపించిన యుపమలు శ్రౌతియందు రెండును, ఆర్థియందు మూఁడును నుండును

శా. నీదోఃఖడ్గమహీంద్రుఁడో యనఁదగున్; నీ దివ్యతేజోభరం
బాదిత్యుండును బోలెఁ బొల్చు, భవదీయాలాపముల్ వల్లకీ
నాదబ్రహ్మముసాటి; నీ కరము మందారోపమానంబు; నీ
ప్రాదుర్భావము మాధవాభ్యుదయకల్పంబౌ నృసింహాధిపా!

౧ వాక్యగత - శ్రౌతీ - అనుపాత్తధర్మలుప్త

దోఃఖడ్గ ముపమేయము; అహీంద్రుఁ డుపమానము; 'ఓయనన్' ఉపమావాచకము సాధారణ ధర్మము (భయంకరత్వాదులు) లుప్తము. (ఓయనన్ అనునది ఉత్ప్రేక్షావాచకమని చెప్పితిమి. కాన నీ యలంకార ముత్ప్రేక్షయే కావలయును).

౨ సమాసగత - శ్రౌతీ - అనుపాత్తధర్మలుప్త

తేజస్సు ఉపమేయము: 'ఆదిత్యుండునుబోలె అనునెడ వెనుకటి 'హరివలె' అను నెడవలెనే సమాసము. అందలి ఆదిత్యుండును అను పదముపమానముగుట సమాసగతమగు నుపమానము ఇందుఁగూడ ధర్మవాచకములేదు.

౩. వాక్యగత - ఆర్థీ - అనుపాత్తధర్మలుప్త

ఆలాపముపమేయము వల్లకీనాదబ్రహ్మ ముపమానము సాటి' యుపమావాచకము. ఇందును సాధారణధర్మము లేదు ఇది వాక్యగతయని గ్రంథకర్త

లోకప్రయోగమున నేమి ప్రయోజనము? అన్నచో "అగ్నిరివరాజః" (అగ్ని వంటి రాజు) అనుచోట అగ్నిరివ అనునది సమస్తపదము అది 'రాజన్' శబ్దముతో సమసించి "రాజాహస్సఖిభ్యష్టచ్' అనుసూత్రముచే 'అగ్నిరివరాజః' అని 'అ' కారాంతమగును అగ్నిరివ అన్నది వ్యస్తమగుచో 'అగ్నిరివ రాజా' అనియే యుండును లోకప్రయోగమున స్వరములేదు కాన నిట్టి ఇవ శబ్దముచే నేర్పడిన సమాసముతో మఱొకపదము సమసించి సమాసాంత కార్యమును బొందును.' ఆంధ్రమున 'హరివలె ఇత్యాదులు వ్యస్తసమస్తము లోకవిధము గానే యుండును. ఇట సమస్తముగా గ్రహింపవలెను.

నుడివెను కాని యది ప్రమాదము ఏలన 'నాదబ్రహ్మము సాటి' అనునెడ నుపమానము వాక్యగతముగా లేదు 'నాదబ్రహ్మము సాటి' అనునది సమాసమే. బ్రహ్మముతోడ లేక యొక్కసాటి యని తృతీయ షష్ఠీసమాస ములలో నొకటి కావున 'నాదబ్రహ్మముతోడ సాటి' అన్నచో వాక్యగత యగును

౪. సమాసగత - ఆర్థీ - అనుపాత్తధర్మలుప్త

కరము ఉపమేయము మందారముపమానము; ఉపమానపద ముపమా వాచకము · సాధారణధర్మము లేదు. 'మందారోపమానంబు' అనుచో మందార' పదము సమాసగతమై యున్నది

౫. తద్ధితగత - ఆర్థీ - అనుపాత్తధర్మలుప్త

ప్రౌఢర్వావ, ముపమేయము మాధవాభ్యుదయ ముపమానము, 'కల్ప' ప్రత్యయ ముపవాచకము. ఇటను ధర్మము గ్రహింపఁ బడలేదు

ఉపమానలుప్త

సీ. జలదంబుగతి నిచ్చి వెలవెలఁబాఱక
కలశాంబునిధిరీతిఁ గసరుకొనక
ఈఁగి మ్రానువలె ఫలంబిడి జిగిదప్పక
సురభికైవడిఁ గొలువరని యీక
కమలారివలె నిచ్చి క్రమ్మఱఁ గైకొనక
బలిమాడ్కి నర్థిచే భంగపడక
చండాంశుసుతుపోల్కిఁ గుండమార్పులు గాక
వాసవమణిభాతిఁ బ్రాసమంద

గీ. ఒసఁగనేర్తువు యాచకవ్యూహమునకు
భూనుతానూనదానవిద్యానిరూఢిఁ
బొసఁగ నీతోడ నెవ్వానిఁబోల్పవచ్చు?
సరసగుణహార! యోబయనరస ధీర!

కుండమార్పులు=వినిమయము, నరసభూపాలుఁ డుపమేయము. 'ఒసఁగ నేర్చుట' సాధారణధర్మము 'పోల్పవచ్చు' ఉపమావాచకము ఎవ్వానిఁ బోల్పవచ్చును?, అను ప్రశ్నచేఁ బోల్పఁదగినవాఁడు లేఁడని తెలిసినది. కాన నుపమానము లుప్తమైనది

(వాచకలుప్త)

సీ. దర్పితాహిత నృపోత్తములు నిన్నెదిరింపఁ
గలరె? ధీరోత్తమగండబిరుద!
వినుతకీర్తిప్రతాపములు నీచే సమ
కట్టునే? యుభయరగండబిరుద
అరివధూతాటంకగరిమంబు నీచేతఁ
గలుగునే? గండరగండబిరుద!
పరిపంథిగంధసింధురపంక్తి నీ మ్రోల
నుండునే? గండభేరుండబిరుద

గీ. అరుణపరిణతధామ! రామాభిరామ!
రామణీయకనిర్జితప్రసవబాణ!
బాణసాహిత్యపరిపాక పాకవైరి
విభవసౌభాగ్య! యోబభూవిభునృసింహ! ౨౧

నరసభూపాలుఁడుపమేయము, 'అరుణపరిణతధామ' 'రామాభిరామ' అనుచోట్ల నున్న అరుణుఁడు, రాముఁడు. ఉపమానములు పరిణతధామత్వము, అభిరామత్వము అనునవి రెండుపమానములకును ప్రత్యేకములయిన సాధారణ ధర్మములు 'అరుణ ఇవ పరిణత' అనియు రామ ఇవ అభిరామ' అనియును విగ్రహవాక్యము లుండును. ఇందలి ఇవ' ఉపమావాచకము లుప్తమైనది కాన వాచకలుప్త ఈ అభిప్రాయమునే గ్రంథకర్త యీ క్రింది పద్యమునఁ జెప్పుచున్నాడు

గీ. అరుణపరిణతధామ! రామాభిరామ!
అనెడుచో భానుభైవసి నలరుకాంతి
పంక్తిగలవాఁడు, రామునిపగిదిఁబొల్పు
వాఁడు నను వాచకంబు వివక్షితంబు, ౨౧

ఈ సీసపద్యము పరికరాలంకారమునకుఁ గూడ నుదాహరింపఁబడినది ఆ పరికరము పెద్దపాదములందున్నది.

ధర్మోపమానలుప్త

సీ. ఇటు వేసితేజీల నెనయు మిన్నులతేరి
జోడుపుట్టినకొండఁ జూచినాఁడ
ఇటు నేలజేజేల కెలుకైన చెంగావి
సుదసుఁజదగుకొండఁ జూచినాఁడ
ఇటు కోడెరాతు మైనిడ్డసొమ్ములమేఁత
సొంపులీనెడుకొండఁ జూచినాఁడ
ఇటు నల్లదేవరయింటనంటివ తెల్ల
కోటినాయనికొండఁ జూచినాఁడ

గీ. నిందునందును నీతోటి యీడువానిఁ
గడఁకతోఁ గాన; గానను; గాన, ననుచు
నిక్క మేబాసకైనను నిలుచువాఁడ.
నరనుతాటోప! యోబయనరసభూప! ౨౨

వరుసగా నుదయాద్రినిఁ బశ్చిమాద్రిని మలయాద్రిని హిమాద్రినిఁ జూచితిని. నీతో సమానులు లేరు.

నరసభూపాలుఁ డుపమేయము ఉపమానము లుప్తము. ధర్మవాచకము లుప్తము "ఈడువాఁడు" ఉపమావాచకము ధర్మోపమానములు లేమిని ధర్మోపమానలుప్త

ధర్మోపమానవాచకలుప్త

మ. మహితప్రాభవమానధుర్య! మితవాఙ్మర్యాద! మీనాంకవి
గ్రహ! ముఖ్యాన్వయ! మూర్తశౌర్యరస! మేఘత్యాగ! మైత్రీరఘూ
ద్వహ! మేధాన్విత మౌక్తికాభరణ! మంత్రప్రౌఢ మస్తాంగన
క్తహరిశ్రీచరణాబ్జ వర్ధిలు గుణాధారా! నృసింహాధిపా! ౨౩

మీనాంకవిగ్రహుఁడనుచో మీనాంకుని యొక్క విగ్రహమువంటి విగ్రహము గలవాఁడు. అని యర్థము విగ్రహవాక్యమునందలి ఉపమాన

వాచకమగు మొదటి విగ్రహపదమును, వంటి అను నుపమావాచకపదమును సాధారణధర్మమును లోపించియున్నవి.

వ్యధికరణ బహువ్రీహియందుఁ బూర్వపదమైన యుపమానపదమునకు నుత్తరపదమైన యుపమేయపదము పరమైనపుడు ఉపమానపదమునకును లోపము వచ్చును.

గీ. అలర మీనాంకవిగ్రహుఁడనెడిచోట
నిందు మీనాంకుమైవలె నింపుమీఱు
విగ్రహముగల్గువాఁడన వెలయుసామ్య
వాచకోపమానంబులు సూచితములు ౨౪

పై యర్థమే ఈ లుప్తావిభాగమును చిత్రమీమాంసాకర్తయుఁ కావ్యప్రకాశకారుఁడును బెక్కువిధములఁజూపిరి ఈ లుప్తావిభాగము వ్యాకరణపాండిత్యముపై నాధారపడి యున్నది ఇందుఁ జారుత్వమేమియుఁ గానరాదు ఈ విషయము నుద్ద్యోతకారుఁ డిట్లు తెలిపెను "వస్తుతోఽయం పూర్ణాలుప్తావిభాగో వాక్యసమాస క్యచ్ క్యఙాది ప్రత్యయ విశేషగోచరతయా శబ్దశాస్త్రవ్యుత్పత్తి కౌశలపరత్వాత్ అత్రశాస్త్రే న వ్యుత్పాద్యతా మర్హతీత్యాహుః"

కం. ద్వివిధంబగు సాధర్మ్యము
భువి నుపమానోపమేయముల కొక్కటియై
తవుటయు, రెంటికి గల ద్వివిధం
బవుటయన ద్వితీయగతియు నలరు ద్వివిధమై ౨౫

ఈ యుపమాలంకారమున సాధారణధర్మ మ్ముపమానోపమేయముల కొక్కటే యుండుట ఉపమానోపమేయములకు రెంటికిని రెండుండుటయని ద్వివిధము. రెండవ విధము మఱల ద్వివిధము.

కం. ఉతి నేకార్థము శబ్ద
ద్వితయంబున సంఘటింప వెలయును వస్తు
ప్రతివస్తుత, యగు బింబ
ప్రతిబింబత యర్థశబ్దపార్థక్యమునన్. ౨౬

ఆ సాధారణధర్మము శబ్దద్వయముచే నేకార్థమే చెప్పఁబడినచో వస్తుప్రతివస్తు భావమనియును అర్థ శబ్దభేదముచేఁ జెప్పఁబడినచో బింబప్రతిబింబ భావమనియును జెప్పఁబడును

"వస్తుతః భిన్నయోరపి ఉపమానోపమేయధర్మయోః పరస్పరసాదృశ్యాదభిన్నయోః పృథగుపాదానం బింబప్రతిబింబభావ ఇత్యాలంకారికసమయః" వస్తుస్థితిచే భిన్నములయ్యును ఉపమానోపమేయధర్మములు పరస్పరసాదృశ్యముచే నభిన్నముగా నధ్యవసింపఁబడి (అభేదముగా నిశ్చయింపఁబడి) భిన్న భిన్న శబ్దముచేఁ జెప్పఁబడుట బింబప్రతిబింబభావమని యాలంకారికసంప్రదాయము (ఉపమాలంకారము భేదాభేదప్రధానమన నిదియే)

వస్తుప్రతివస్తూపము

కం. అవనిఁ బరిష్కృతమయ్యెన్
రవివంశం బోబశౌరి నరసింహునిచే ;
దివి సురతరుభూషితమై
నవనవగతిఁ బొల్చు నందనవనంబనఁగన్. ౨౭

రవివంశ ముపమేయము నందనవన ముపమానము. పరిష్కృతము, భూషితము అను నేకార్థకమగు శబ్దద్వయముచే సామాన్యధర్మము చెప్పఁబడినది "ముఖము చంద్రునివలె మనోహరముగా నున్నది" ఇత్యాదికమగు పూర్ణోపమలో 'మనోహరము' అను సాధారణ ధర్మవాచక మొకటియే గ్రహింపఁబడినది. ఇట రెండు గ్రహింపఁబడి యున్నవి

వస్తుప్రతివస్తూపమాలంకారమునకుఁ బ్రతివస్తూపమాలంకారమునకును భేదమేమన వస్తుప్రతిస్తూపమాలంకార మేకవాక్యగతమై యుండును ప్రతివస్తూపమాలంకారము వాక్యద్వయగతమై యుండును. ఇదియే భేదము.

బింబప్రతిబింబోపమ

కం. గురుశౌర్యయుతము, నాయత
కరవాలము నగు నృసింహు ఘనభుజమమరున్
దరళఫణామణికిరణ
స్ఫురణము, జిహ్వాలమైన భోగియుఁబోలెన్. ౨౮

శౌర్యయుతము అయతకరవాలమును నగు నృసింహుని హస్తము ఫణామణికాంతియుతమును, దీర్ఘజిహ్వాయుతమును నగు సర్పమువలె నున్నది. ఇట నుపమేయమునకు గురుశౌర్యయుతత్వము ఆయతకరవాలత్వము అను ధర్మములును, ఉపమానమునకు ఫణామణికిరణస్ఫురణము జిహ్వాలత్వము అను ధర్మములను భిన్నశబ్దములచే భిన్నార్థకములుగా గ్రహింపఁబడినవి శౌర్యమునకును ఫణామణికిరణములకును గరవాలమునకును జిహ్వకును సాదృశ్యము గలదు.

ఈ ధర్మములకుఁ బరస్పర సాదృశ్యముచే నభేదాధ్యవసాయము చేయవలెను. అభేదాధ్యవసాయమన నభేదమని నిశ్చయపఱచుకొనుట. ఇట్టిది బింబ ప్రతిబింబోపమ దృష్టాంతముననుు బింబప్రతిబింబభావముండును. కాని యట వాక్యద్వయముండును ఇట నొకవాక్యమే.

ఈ భేదము లేకాక మఱికొన్ని విధములగు నుపమాభేదములును గలవు. వానిలోఁ గొన్నింటి నుదాహరింతును.

సమస్తవస్తువిషయోపమ

ఆ. వె. తమ్మితీవభాతిఁ దనరు నా జవరాలి
తమ్మిఁబోని నెమ్మొగమ్ముఁ గమ్మ
గండుతేఁటి కరణిఁ గమ్మని తేనియల్
గ్రోలిగ్రోలి తనివిఁగొంటి లెస్స.

ఇట 'జవరాలు తమ్మితీవవలె, దాని మొగము దమ్మివలెను' దాని ప్రియుఁడు 'గండుతేఁటివలె నుండె'నని చెప్పుటచే నుపమాలంకారము సర్వావయవ (సమస్తవస్తు) వ్యాప్తమై యున్నది

ఏకదేశవివర్తినీ - ఉపమ

గీ. క్రాల్గనులఁబోని నల్లని కలువపిండు
మోముగమిఁబోలు నెత్తమ్మి పూలచాలు
గబ్బిగుబ్బలకరణిఁ జక్కవలు గాల
నలసరశ్రీలు పదపదంబందు నలరు

మొదటి మూఁడుపాదములందలి యుపమలచే 'సరస్సులు స్త్రీలవలెనున్నవి యను నుపమ స్ఫురించును సరస్సులను స్త్రీలుగా నుపమించి చెప్పక పోవుటచే నుపమాలంకారము సర్వావయవవ్యాప్తముగాలేదు

మాలోపమ

కం. కలిగించుచుండు వెన్నెల
వలెఁ గన్నులకెలమిఁ, గల్లువలె మత్తునిడున్
గెలనికి నాకర్షించును
బలువుర నాపువ్వుఁబోడి ప్రభుతవడుపునన్ ;

ఇటఁ 'బువ్వుఁబోఁడి అను నొక యుపమేయమునకు మూఁడుపమానములుగలవు. ఉపమానమాలగలదు. కాన మాలోపము.

రశనోపమ

గీ. సతతకాంచనవితరణజలలవముల
నర్థికరములఁ దడుపుచున్నట్టి పతికి
ఁ జెఱివలెమఱి ; యమ్మరిభాతిఁ జేఁత
చేఁతవలెఁ గీర్తి స్వచ్ఛమై చెలఁగుచుండు.

రశనయన నొడ్డాణము. ఇట నొడ్డాణమున గజ్జెలువలెనే యొకదానితో నొకటి సంబంధించిన యుపమానములు గలవు ఒక యుపమలోని యుపమానము రెండవ యుపమలో నుపమేయమగును దానిలోని యుపమానము మఱొక యుపమలో నుపమేయమగును ఇదేవిధముగా సాఁగిన యుపమ రశనోపమ.

ఉపమాలంకారమున నుపమానము సుప్రసిద్ధముగా నుండవలెనని మున్ను లక్షణమున నిర్వచింపఁబడినది కాని అభూతోపమ లోఁ గవికల్పితమగు నుపమానముగలదు ఎట్లన

గీ. 'ఒక్కచోఁ బ్రోవుగఁ జేసి యుంచఁబడిన
నిఖిల నీరజప్రభలోని నిగ్గువోలె
నీదు నెమ్మొగమెంతయు నెగడెడి నన
నది యభూతోపమగఁ దెలియంగఁబడును.

నిఖిల నీరజప్రభలోని నిగ్గుప్రోగు సేసియుంట ప్రసిద్ధముగాదు ఇది కవికల్పితము.

ఉదా యది వ్యోమ్ని పృథక్ప్రవాహావాకాశగంగాపయసః పతేతాం
తేనోపమీయేత తమాలనీలమాముక్తముక్తాలత మస్య వక్షః

ఆకాశమునందు రెండు వ్యోమగంగాప్రవాహములు విడివిడిగాఁ బడిన యెడల దానితోఁ దమాలనీలమును ముత్యాలహారములచే నలంకృతమును నగు (హరి) వక్షమును బోల్పవచ్చును

మఱియు దండి కావ్యాదర్శమున ధర్మోపమ వస్తూపమ విపర్యాసోపమ అన్యోన్యోపమ నియమోపమ అనియమోపమ సముచ్చయోపమ, అతిశయోపమ ఉత్ప్రేక్షితోపమ, అద్భుతోపమ మోహోపమ సంశయోపమ నిర్ణయోపమ శ్లేషోపమ సమానోపమ, నిందోపమ ప్రశంసోపమ ఆచిఖ్యాసోపమ విరోధోపమ ప్రతిషేధోపమ చటూపమ తత్త్వాఖ్యానోపమ అసాధారణోపమ అభూతోపమ, అసంభావితోపమ బహూపమ విక్రియోపమ మాలోపమ వాక్యార్థోపమ ప్రతివస్తూపమ తుల్యయోగితోపమ హేతూపమ అను ముప్పదిరెండు భేదములు సూపెను వీని లక్షణలక్ష్యములను నాంధ్రకావ్యాదర్శమునఁగానీ ఆంధ్ర విజ్ఞాన సర్వస్వములోని 'అలంకారములు' అను శబ్దముక్రిందఁగానీ చూడవలెను ఈ భేదములను దరువాతివారు దెలుపరైరి.

ఆంగ్లమున నుపమాలంకారమును 'Simile' అందురు ఆసాహిత్యమున మన యాలంకారికులు చేసినంత విమర్శను పాశ్చాత్యులు చేయలేదు పైఁగా మనవారు చూపినన్ని యలంకారములను వారు చూపలేదు.

ఉపమాదోషములు

న్యూనత్వము అధికత్వము లింగభేదము వచనభేదము, అసాదృశ్యము అసంభవము అని యుపమాదోషము లాఱువిధములు. దోషప్రకరణమున హీనోపమ అధికోపమ, లింగభేదము వచనభేదము అను నాలుగుదోషములు చెప్పఁబడియున్నవి ఇట వానిలోని యవాంతర భేదములును, నితర భేదములును దెలుపుదుము

న్యూనత్వమన నుపమేయముకన్న నుపమానమున నపకృష్టత్వము అనఁగాఁ దక్కువతనము ; అధికత్వమన నుపమేయముకన్న నుపమానమున నుత్కృష్టత్వము అనఁగా నెక్కువతనము ఈ న్యూనత్వాధిక్యములు జాతి, ప్రమాణ ధర్మములంబట్టి ప్రత్యేకముగా మువ్విధములు

౧ జాతిగత న్యూనతము

"చండాలైరివ యుష్మాభిస్సాహసం పరమంకృతం" మీరు చండాలుర వలె బహుసాహసమొనర్చితిరి ఇట మీరు ఉపమేయము 'చండాలురు' ఉపమానము చండాలురధమజాతీయులు కాన నుత్తమజాతీయుల నధమ జాతీయులతో బోల్చుట యుచితముగాదు చండాల' పదము జాతివాచకము. కాన నిట జాతిగతన్యూనత్వము గలదు

౨. జాతిగతాధిక్యము

'అయం పద్మాసనాసీనశ్చక్రవాకో విరాజతే
యుగాదౌ భగవాన్ వేధా వినిర్మిత్సురివ ప్రజాః

యుగాదియందుఁ బ్రజలను సృజించు బ్రహ్మదేవునివలెఁ బద్మాసనమున నాసీనమైయున్న చక్రవాకము విరాజిల్లెడు

ఇటఁ 'చక్రవాక' ముపమేయము 'బ్రహ్మదేవుఁ' డుపమానము అల్పమగు నొక పక్షికి జగత్కర్తయగు బ్రహ్మ నుపమానముగాఁ జేయుట యనుచితమగు నాధిక్యము బ్రహ్మ జాతివాచకము ఇది జాతిగతాధిక్యము

౩. ప్రమాణగతన్యూనత్వము

"వహ్నిస్ఫులింగ ఇవ భానురయం చకాస్తి"

ఈ సూర్యుఁడు నిప్పుకణమువలె వెలుగుచున్నాఁడు ప్రమాణమనఁగాఁ బరిమాణము. పరిమాణమునుబట్టి సూర్యుఁడు పెద్దవాఁడు నిప్పుకణము చిన్నది.

ఇట నుపమేయమగు సూర్యునియందుకన్న నుపమానమగు వహ్నిస్ఫులింగమునఁ బ్రమాణగత న్యూనత్వము గోచరించుచున్నది

౪. ప్రమాణగతాధిక్యము

పాతాళ మివ నాభిస్తే పర్వతా ఏవ చ స్తనౌ
వేణీదండః పునరయం కాళిందీపాతసన్నిభః.

నీ నాభి పాతాళమువలె నున్నది. నీ స్తనములు కొండలవలె నున్నవి నీ వేణీదండము కాళిందీప్రవాహమువలె నున్నది.

ఇట నాభి చన్నులు జడ అనునవి యుపమేయములు వరుసగా వీనికిఁ బాతాళము కొండలు, కాళిందీప్రవాహము. అనునవి యుపమానములు ఉపమేయ పదార్థములకన్న నీ యుపమాన పదార్థములు పరిమాణమును బట్టి పెద్దవి. ఇట సాదృశ్య ముచితముగాలేదు దోషప్రకరణములో ననుచితమను దోషముగలదు ఈ న్యూనత్వాధిక్యదోషమునందే చేరును స్పష్టప్రతీతికై యిటఁజూపితిని

కవిసమయప్రసిద్ధియున్నచో జాతి, ప్రమాణగత న్యూనత్వాధిక్యములు దోషములు గావు ఎట్లన

"తవాననసమశ్చంద్ర శ్చంద్రతుల్యం త్వదాననం
ద్వ్యణుకం మధ్యసదృశం మధ్యం ద్వ్యణుకసన్నిభం

చంద్రుఁడు నీ ముఖసదృశుఁడు. నీ ముఖము చంద్రతుల్యము ద్వ్యణుకము నీ నడిమితో సమానము నీ నడుము ద్వ్యణుకసమము

ఇటఁ "చంద్రుఁడు నీ ముఖసదృశుఁడు" అనుచోట వాస్తవముగా నుపమానమున జాతిగతన్యూనత్వము "నీ ముఖము చంద్రతుల్యము" అనుచో నుపమానమున జాతిగతాధిక్యములును గలవు అట్లే 'ద్వ్యణుకము నీ నడిమితో సమానము అనుచో నుపమానమునఁ బ్రమాణగత న్యూనత్వమును "నీ నడుము ద్వ్యణుకసమము" అనుచో నుపమానమునఁ బ్రమాణగతాధిక్యమును గలవు అయినను ముఖచంద్రులకును ద్వ్యణుకమధ్యములకును సామ్యము కవిసమయ ప్రసిద్ధము కాన నిట దోషములు గావు

౫. ధర్మగత న్యూనత్వము

స మునిర్లాంఛితో మౌంజ్యా కృష్ణాజినపటం వహన్
వ్యరాజన్నీలజీమూతభాగాశ్లిష్ట ఇవాంశుమాన్

మౌంజిత్రాటిని ధరించి కృష్ణాజినమును వహించియున్న యా ముని నల్లని మబ్బును దాఁకుచున్న సూర్యునివలె భాసిల్లును

ఇట ముని ఉపమేయము, సూర్యుఁడుపమానము; "ముంజెత్రాదిని ధరించి కృష్ణాజినమును వహించియున్న" యనునది బింబప్రతిబింబభావరూప సాధారణధర్మమున బింబముగా గ్రహింపఁబడినది 'నల్లని మబ్బును దాఁకుచున్న' అనునది ప్రతిబింబముగాఁ గ్రహింపఁబడిన సాధారణ ధర్మము. బింబమునఁగల 'ముంజెత్రాదిని' అనుదానికిఁ బ్రతిబింబమున నేదియు నులేదు ప్రతిబింబముకూడ బింబ మంత యుండనుగదా! ఇట బింబమధికముగను ప్రతిబింబము న్యూనముగను నున్నది కాన బింబప్రతిబింబభావరూపసాధారణ ధర్మగత న్యూనత్వదోషము ఇది 'న్యూనోపమ' యని దోషప్రకరణమున నుదాహృతమై యున్నది 'మెఱుపుతోఁ గూడిన నల్లని మబ్బును దాఁకుచున్న' అని ప్రతిబింబమున్నచో సరిపడును.

౬. ధర్మగతాధిక్య దోషము

స పీతవాసాః ప్రగృహీతశార్ఙ్గో మనోజ్ఞ భీమం వపు రాప కృష్ణః
శతహ్రదేంద్రాయుధవాన్నిశాయాం సంసృజ్యమానశ్శశినేవ మేఘః.

మెఱుఁగుఁదీఁగయు నింద్రచాపమును జంద్రబింబమునుగల మేఘునివలెఁ బచ్చవలువయు శార్ఙ్గధనుస్సును గల శ్రీకృష్ణుఁడు మనోజ్ఞమును, భయంకరము నగు రూపమును బొందెను

ఇటు గృష్ణుఁ డుపమేయము మేఘుఁ డుపమానము బింబప్రతిబింబ భావరూపసాధారణధర్మమున బింబరూపముగా స్వీకరింపఁబడిన 'పచ్చవలువయు శార్ఙ్గధనుస్సు' అనుదానికన్నఁ ప్రతిబింబముగా గ్రహింపఁబడిన "మెఁఱుగుఁ దీఁగయు, నింద్రచాపమును జంద్రబింబమును" నను దానిలో జంద్రబింబము అధికము కాన నిది ధర్మగతాధిక్యదోషము దీనినే 'యధికోపమ' యను పేరితో దోష ప్రకరణమున నీ గ్రంథకర్త యుదాహరించెను

౭. లింగభేదము

"భాగ్యాభావాత్కరస్థోఽపి చింతారత్న మివ చ్యుతః" దురదృష్టమువలన నాచేతఁజిక్కియుఁ (చిక్కినదయ్యు) జింతారత్నమువలె జాఱిపోయినది.

ఇట నాంధ్రభాషలో నెట్టి దోషమును గానరాదు కాని సంస్కృతమున 'చింతారత్నం నపుంసకము 'చ్యుతః అనునది పుంలింగము విశేషణవాచకమైన 'చ్యుతః' పదము విశేష్యమైన 'చింతారత్నం' పదముతో నెట్లన్వయించును? కాన నిట లింగభేద దోషము ఇద చూపఁబడినది

౮. వచనభేదము

సక్తవో భక్షితాః దేవ! శుద్ధాః కులవధూరివ

ఓ దేవ! సక్తువులు శుద్ధమగు కులవధువువలె భక్షింపఁబడినవి. (అనుభ వింపఁబడినవి)

ఇట సక్తువులుపమేయము. కులవధువుపమానము. ఉపమేయము బహు వచనమునను ఉపమానమేకవచనమునను గలవు. ఇది వచనభేదదోషము

౯. అసాదృశ్య దోషము

"గ్రథ్నామి కావ్యశశినం వితతార్థరశ్మిం" విపులమగు నర్థములను కిరణములుగల కావ్యమును చంద్రునిఁ గూర్తును

లోకమున నర్థములకును గిరణములకును సాదృశ్యమప్రసిద్ధము అట్లే కావ్యశశిబింబములకును సామ్యమప్రసిద్ధమే దీనినిఁ గవికల్పితోపమగా నేల గణింపరాదు? అనవచ్చును రామణీయకమున్నయెడలనే కవి కల్పితోపమ స్వీకరింపఁబడును ఇట రామణీయకములేమిఁ కవికల్పితోపమగాదు.

కానీ కవిసమయప్రసిద్ధి యున్నచో నసాదృశ్యము దోషముగాదు ఎట్లన

'చంద్రధవళాకీర్తిః' 'కీర్తి చంద్రునివలెఁ దెల్లనిది "

ఇటఁ గీర్తికిఁ దెల్లఁదనము కవిసమయప్రసిద్ధము దోష ప్రకరణమునఁ గవిసమయములను జూపితిమి చంద్రునకునుఁ గీర్తికిని సాదృశ్యము లేకున్నను గవి సమయ ప్రసిద్ధమగుట దోషముగాదు

(చూ హాలికుడు 22 పుట) ముత్తెముల కోవవలె సుందరమై రస బంధురమగు ఈ కవుల కవితకు మా హృదయము త్తరంగితమైనది

చక్కని లిఖితాక్షరములకు ముత్తెములకోవను నుపమానముగాఁ జెప్పుట సంప్రదాయము ఇటఁ గవితకుపమానముగాఁ జెప్పిరి ఇందు సాదృశ్యము శూన్యము.

ఈ ప్రయోగము వ్యాకరణ శిరోమణి ఉస్మానియా యూనివర్సిటీ ఆంధ్ర భాషాధ్యాపకుల్లు

౧౦ అసంభవదోషము

నిపేతురాస్యాదివ తస్య దీప్తాశ్శరా ధనుర్మండలమధ్యభాజః
జాజ్వల్యమానా ఇవ వారిధారా దినార్ధభాజః పరివేషిణోఽర్కాత్

మట్టమధ్యాహ్నమునఁ బరివేషము చుట్టుకొనియున్న సూర్యునినుండి వేఁడి నీటిధారలవలె ధనుర్మండలమధ్యగతుఁడగు నతనినుండి బాణములు పడెను

ఇట సూర్యమండలమునుండి వేఁడినీటిధారలు పడుట యసంభవము

ఉపమేయగతమగు 'నసంభావితత్వము'ను వివక్షించునపుడు అసంభవము దోషముగాదు ఎట్లన

చంద్రబింబాదివ విషం చందనాదివదానలః
పరుషా వాగితో వక్త్రాత్.. ...

చంద్రబింబమునుండి విషమువలెఁ జందనమునుండి యగ్నివలె నతని మొగమునుండి పరుషవాక్కు (బొత్తిగా వెలువడదు) ఇట నుపమేయమగు పరుషవాక్కునకు "చంద్రబింబమునుండి విషమెట్లసంభవమో చందనమునుండి యగ్ని యెట్లసంభవమో" యని యసంభావితములగు నుపమానములు గ్రహింపఁబడినవి. వీనిచే నుపమేయగతమగు నసంభావితత్వము వ్యక్తమగును కానదోషముగాదు

కాలపురుషభేదమునుగూడ దోషముగాఁ గొందఱు గణించిరి కాని భాషలోఁ బెక్కుదాహరణములు గలవు దోషప్రకరణమునందలి భిన్నలింగ, భిన్న వచనదోషమునఁ గల "నలింగ వచనే భిన్నే" ఇత్యాదికము జూచునది

౨ అనన్వయము

కం. సరసంబగు నొక్కటికే
ధరనుపమానోపమేయధర్మము తిరమై
పరఁగిన ననన్వయంబగు
నరయంగా దీనిలక్ష్య మాపాదితున్.

ఒకేవస్తువుపమానముగను, ఉపమేయముగను జెప్పినచో ననన్వయాలంకారము

కం. నీదయకు నీడుజోడగు
నీదయు , నీజయము సాటి నీజయమిలలో;
నీ దానమునకు నెనయగు
నీ దానము ; నీకుసాటి నీవె , నృసింహా ! ౮౦

నీ దయ నీ దయ వంటిది నీ జయము నీ జయము వంటిది నీ దానము నీ దానము వంటిది నీకు సాటి నీవే

ఇట నొకే వస్తువుపమానముగను నుపమేయముగను నున్నది ఇట్లే

గగనం గగనాకారం సాగరస్సాగరోపమః
రామరావణయోర్యుద్ధం రామరావణయోరివ

గగనము గగనాకారము , సాగరము సాగరమువలె నున్నది. రామరావణయుద్ధము రామరావణయుద్ధమువలె నున్నది

దీనివలన సదృశమైన ద్వితీయవస్తువు లేదని స్ఫురించును

ఈ యనన్వయాలంకారమున శబ్ద అర్థ పౌనరుక్త్యము గలదు. కాన లాటానుప్రాసము (కరములు కరములు) గాదా ? యని శంక పొడముచున్నది. అయితే యనన్వయాలంకారమున నర్థపౌనరుక్త్యమే ప్రధానము గాని శబ్ద పౌనరుక్త్యము ప్రధానము గాదు 'గగనము గగనమువలె నున్నది' అనియే చెప్పనక్కఱలేదు గగనమాకాశమువలె నున్నదన్నను ననన్వయాలంకారమే. కాని యుద్దేశ్యప్రతినిర్దేశ్యములందైకరూప్యము లేకున్నచోఁ బ్రక్రమదోష భంగము వచ్చును కాన శబ్దపౌనరుక్త్యమానుషంగికమే లాటానుప్రాసమున శబ్దార్థోభయ పౌనరుక్త్య మవశ్యము

౩ ఉపమేయోపమ

కం. నిపుణస్థితి నుపమేయం
బుపమానముఁ బోల, మఱియు నుపమానంబా
యుపమేయముఁ బోలఁగఁదగు
నుపమేయోపమ యనంగ నొగి నెట్లన్నన్ ౩౧

ఉపమేయ ముపమానమును, ఉపమాన ముపమేయమును బోలినట్లు పర్యాయమునఁ జెప్పినచో నుపమేయోపమ యగును. దీనికి సదృశమైన తృతీయ వస్తువు లేదని సారాంశము తేలును దీని కన్యోన్యోపమ యనియుఁ బర్యాయోపమ యనియును నామాంతరములు

కం. శరణాగత భరణంబున
నరసింహునిసాటివచ్చు నరసాహసుఁడీ
నరసింహుఁ డితని కెనయా
నరసింహుఁడె కాక యితరసరులకు వశమే ? ౩౨

ఈ నరసింహుఁ డా నరసింహుని సాటి ఆ నరసింహునకీనరసింహుఁడు సాటి. ఇటఁ దృతీయమగు సదృశవస్తువు లేదని నిష్కర్షము. ఈ యుపమా అనన్వయ, ఉపమేయోపమలందు సాదృశ్యము వాచ్యము

౪. స్మరణము

కం. ధర నొకవస్తువుఁ గనుఁగొని
వరుసం దత్సదృశమైన వస్తువుఁ దలఁపన్
స్మరణంబని పాటింపుదు
రరయ నలంకారవేత్త లది యెట్లన్నన్. ౩౩

ఒక వస్తువును గాంచి దానివంటి మఱొకవస్తువును స్మరించినచో స్మరణాలంకారము

కం. ఇల మత్స్యయంత్రమేయను
విలుపూనిన శ్రీనృసింహవిభుఁగాంచి జనుల్
దలఁపుదురు ద్రుపదకన్యా
కలితకరగ్రహణనిమిత్తకార్ముకుఁ బార్థున్. ౩౪

మత్స్యయంత్రము నేయుటకై విల్లెత్తిన నరసభూపాలునిఁ జూచి ద్రౌపదిని బెండ్లాడుటకై మత్స్యయంత్ర మేయఁజూచిన యర్జునునిఁ దలంతురు

ఇట విషయము స్పష్టము.

కేవల సదృశవస్తుస్మరణమేకాక యా వస్తుసంబంధిస్మరణముగూడ స్మరణాలంకారమే యెట్లన,

సౌమిత్రే! నను సేవ్యతాం తరుతలం చండాంశురుజ్జృంభతే ;
చండాంశోర్నిశి కా కథా ? రఘుపతే! చంద్రోఽయ మున్మీలతి
వత్సైతద్విదితం కథం ను భవతా ? ధత్తే కురంగం యతః
క్వాసి ప్రేయసి ! హా! కురంగనయనే! చంద్రాననే జానకి!

శ్రీరాముఁడు లక్ష్మణునితో ననుచున్నాఁడు "లక్ష్మణా ఎండ గాయుచున్నదే. చెట్టునీడకుఁ బద! (లక్ష్మణుఁడు) శ్రీరామా! రాత్రి సూర్యుఁడెక్కడ? చంద్రుఁడు వెన్నెలగాయుచున్నాఁడు (రాముఁడు) నీకు చంద్రుఁడని యెట్లు తెలిసినది? (లక్ష్మణుఁడు) అందుఁ గురంగ మున్నది (రాముఁడు) హా కురంగనయనా సీతా ఎటనుంటివి?

ఇట గురంగపదశ్రవణముచేఁ దత్సంబంధినయనస్మరణమును దానిచే సీతాస్మరణమును గలిగినది.

౫. రూపకము

మం. అలసందేహము మాడ్కిఁగాకయుపమేయంబెన్ననచ్ఛన్నమై
యలఘూత్ప్రేక్షయునానభిన్నమతిజంబై యుండ, కారోపమిం
పలరంగాఁ బ్రకృతోపయోగి పరిణామారోపతుల్యంబుగా.
కలయారోపితమందు రంజనము సేయున్ రూపకంబై తగున్

అన్యత్ర అన్యధర్మారోపమారోపమనఁబడును. ఎట్లనఁ జంద్రత్వము చంద్రధర్మము. దానిని ముఖమునం దారోపించుట యారోపము, సందేహాం

కారమున నుపమేయము ఛన్నమై యనఁగాఁ దిరోహితమై యుండును. ఎట్లన "ఇది ముఖమా? చంద్రుఁడా?" అనుచో నుపమేయమగు ముఖము సందేహ విషయ మగుటవలన నుపమానమగు చంద్రునిచేఁ దిరోహితమగును రూపకమున నట్లుపమానముచేఁ దిరోహితముగాదు. ఉత్ప్రేక్షయధ్యవసాయగర్భము అనగాఁ బైకభేదము దోఁపకున్నను లోపల నభేద మిమిడియేయున్నది రూపకమున నభేదమే కాని యధ్యవసాయములేదు అధ్యవసాయమన నభేదప్రతిపత్తి ప్రకృతాప్రకృతములకభేదజ్ఞానము పరిణామమునన నారోపము ప్రకృతోపయోగి యగును అనఁగా నప్రకృతము ప్రకృతస్వరూపముతో నుపయోగపడును (అన్వయించును) రూపకమున నట్లు ప్రకృతాత్మముగాఁ బరిణమింపదు. రూపకమున నారోపము రంజనమాత్రమే. రంజనమనరంగు వేయుటయని వ్యుత్పత్త్యర్థము. రంగువేసినపుడు మొదటిదగు తెల్లరంగుమాత్రమే రెండవరంగుచేఁ గప్పివేయఁబడును. వస్తువే కప్పివేయఁబడదు అట్లే రూపకమునఁ బ్రకృత వస్తువునం దప్రకృతవస్తువు యొక్క ధర్మారోపము చేయఁబడును ఆయా యలంకారములు వచ్చినపుడు దృష్టాంతములఁ మీఁదఁ జూపఁబడిన భేదములు విస్పష్టముగాఁ దెలియును

రూప ఏవ రూపకం రూపముయొక్క యారోపణమే రూపకము దీని కాంగ్లమున Metaphor అని వ్యవహారము

క౦. అరయ రసజ్ఞులమతమున
నరుదగు నీరూపకంబు సావయవంబున్
నిరవయవంబును వరుసం
బరంపరితమనఁగఁ ద్రివిధభావమునొందున్. 31

ఈ రూపకము సావయవము (అవయవములు గలది) నిరవయవము (అవయవములు లేనిది) పరంపరితము అవి ముత్త్రివిధములు

చ అరయ సమస్తవస్తువిషయంబును, నేకతలప్రవర్తియై
యరుదుఁగఁబొల్చుసావయవ; మవ్వలఁ గేవలఁ, మాలికాఖ్యమౌ
నిరవయవంబు శ్లిష్టమును, నేర్పున శ్లేషవిహీనమౌఁ, బరం
పరితము, తత్ప్రభేదములఁ బాయక కేవలమాలికాఖ్యయౌన్ 32

సావయవరూపకము సమస్తవస్తువిషయరూపకము ఏకతల (దేశ) వివర్తి రూపకము అనియు నిరవయవము కేవలరూపకము మాలారూపకమనియుఁ బరంపరితము కేవలశ్లిష్టపరంపరితము కేవలాశ్లిష్టపరంపరితము శ్లిష్టమాలా పరంపరితము అశ్లిష్టమాలాపరంపరితము అనియు మొత్త మెనిమిది విధములు.

కం. కావున రూపక మష్టవి
ధావహామగు ! లక్షణంబు లల లక్ష్యంబుల్
వావిరి నొనర్తు వీనికి
భావజధనురసమరసవిభాసితఫణితిన్. ౩౮

స్పష్టము

కం అవయవియు నవయవంబులు
వివరింప సమస్తవస్తువిషయం; బిలలో
నవయవి యవయవగమ్యం
బవునదియేకతలవర్తియగు నెట్లన్నన్. ౩౯

అవయవియు దాని యవయవములును సమగ్రముగా రూపింపఁబడినచో సమస్తవస్తువిషయసావయవరూపకము. అవయవరూపణచేనవయవి గమ్యమానమగుచో నేకదేశవివర్తిరూపకము

౧ సమస్తవస్తువిషయసావయవరూపకము

హిమశైలద్వీపదీప్తం, దినమణిమహితం, బిందుశంఖాభిరామం,
బమరాంభోమత్స్యయుక్తం బహిపలహారికం, బభ్రశైవాలజాలం
బమితాశాకుంభినక్రం, బజహాదుడుకణం, బాత్తసంధ్యాప్రవాళం
బమరున్ శ్రీనారసింహోద్యతవిశదయశోహారిదుగ్ధాబ్ధి వేడ్కన్.

హిమవంతమను ద్వీపముతో, సూర్యుఁడను మణితో చంద్రుఁడను శంఖముతో, గంగానది యను మత్స్యముతో నాదిశేషుఁడను తరంగముతో, మేఘమను శైవాలముతో దిగ్గజములను నక్రములతో నక్షత్రములను కణములతో సంధ్యాకాలమను పగడముతో, నరసభూపాలుని కీర్తియను పాలసముద్ర మమరును పాలసముద్ర మవయవి దాని సమస్తావయవములును రూపింపఁబడినవి. ఇట రూపకము సమస్తావయవ వ్యాప్తమైయున్నది

౨. ఏకదేశవివర్తి సావయవరూపకము

కం. ధర నొఱయను వల్మీకము
సరభసగతి వెడలి నీదు చటులాసి మదో
ద్ధురచరదరిధరణిధురం
ధరజీవానిలముఁ గ్రోలు నరసింహనృపా ! ౪౧

నీ ఖడ్గ 'మొఱ' యను పుట్టనుండి వెడలి మదమత్తులగు శత్రురాజుల ప్రాణానిలములను గ్రోలును

అవయవియగు ఖడ్గము సర్పరూపమని యవయవములచేఁ గమ్యమగుచున్నది ఎట్లన నిట ఖడ్గము సర్పముగా వాగ్రూపమున రూపింపఁబడలేదు ఒఱ యను పుట్ట, జీవానిలములు, అను నవయవరూపకల్పనలచే నవయవి యగు ఖడ్గము సర్పరూప మని గమ్యమగుచున్నది.

కం॥ అవయవి మాత్రంబుననే
కవిమతివిశ్రాంతమైనఁ గన నిరవయవం ;
బవని నిది కేవలంబును
ద్వివిధత మాలికయునయ్యె విను మెట్లన్నన్. ౪౨

అవయవరూపణము చేయక యవయవి మాత్రమునే కవి రూపించినచో నిరవయవరూపకము అది కేవలనిరవయవము మాలానిరవయవము అని ద్వివిధము.

౧. కేవలనిరవయవము

కం. ఇల నీదు కీర్తిచంద్రిక
యలఘుతరస్ఫూర్తి నళినజాండకరండం
బులు నిండి వెల్లివిరిసె
న్నలనహుషసమానశీల నరసన్నృపాలా ! ౪౩

కీర్తియనునది యవయవి. అదిమాత్రమే చంద్రికగా నారోపింపఁబడినది. కానఁ గేవల నిరవయవరూపకము.

౨. మాలానిరవయవరూపకము

కం. హరశిఖరిదరుల, భాషా
తరుణీకుచగిరుల, నమరతరులం దెలఁగున్
ఝరులై, సరులై, విరులై
నరనుతమగు నీదుగీర్తి నరసింహనృపా ! ౪౪

కైలాసగుహలందు సరస్వతీదేవి స్తనములందుఁ, గల్పవృక్షములందుఁ నీకీర్తి ప్రవాహములై, ముత్యాలసరులై పువ్వులై చెలఁగును.

ఇటఁ గిర్తి యను నవయవి ఝురులుగా సరులుగా, విరులుగా నారోపింపఁబడినది వెనుకటిపద్యమున నొక్కఁడే నిరవయవరూపకము ఇటఁ బెక్కు నిరవయవరూపకములు. ఇదే మాలా నిరవయవరూపకము లేక మాలారూపకము.

ఇట యథాసంఖ్యము లేక క్రమము' అను నలంకారము గూడఁగలదు. "ప్రాధాన్యేన వ్యపదేశా భవంతి" అను న్యాయముచే నిట రూపకముచేతనే విచ్ఛిత్తి విశేషము కాన రూపకమనియే వ్యవహారము.

౫ శ్లిష్టకేవలపరంపరితరూపకము

కం. రూపకకారణమై తగు
రూపకము పరంపరితము, రూపింపఁగ నిం
దేవగు నాల్గువిభేదము
లాపాదించెద నుదంచితాయతభణితిన్. ౮౫

ఒక రూపకమునకుఁ గారణముగా మఱొక రూపకము నిబద్ధమయ్యె నేని నది పరంపరితరూపకము. (పరంపరా+ఇత = పరంపరితము పరంపరగలది— తారకలుగలది 'తారకితము అనువిధమున సిద్ధము) ఇది నాలుగు భేదములుగలది.

కం. నిరతంబు రాజహంసలఁ
బరువెత్తఁగఁజేయు నౌర! పటుచటులభవ
త్కరకరవాలకరాళ
స్ఫురితాంభోదము నృసింహభూపాలమణీ! ౮౬

నీచేతి ఖడ్గమను మేఘము రాజశ్రేష్ఠులనురాజహంసలనో బరుగెత్తించును. ఇట రాజహంసపదము శ్లిష్టరూపకము 'రాజహంసలు అను శ్లిష్టరూపకమునకు గారణముగాఁ "గరవాలకరాళస్ఫురితాంభోదము" అను రూపకము నిబద్ధమై యున్నది ఇది నిరవయవము 'రాజహంస' పదము శ్లిష్టము కాన నిరవయవ శ్లిష్టపరంపరితము

౬. శ్లిష్టమాలాపరంపరితము

కం. కువలయవిలసనహిమకరుఁ;
డవిగళదానాంబుదిగ్గజాగ్రణి: పదో
త్సవసౌభాగ్యదివాకరుఁ;
డవనిని నరసింహుఁ డితని కన్యులు సరియే? ౮౭

నరసభూపాలుఁడు కువలయ (భూవలయము) మనుకువలయమును (కలువను) వికసిల్లఁజేయు చంద్రుఁడు. దాన (ఈవి) జలమను దాన (మద)

జలమునకు దిగ్గజము. పద్మోత్సవ (పద్మా+ఉత్సవ=రాజ్యలక్ష్మీసౌభాగ్యము) మను పద్మోత్సవమునకు (పద్మ+ఉత్సవ) సూర్యుఁడు.

నరసభూపాలుఁడు హిమకరుడు' అన్నచో 'హిమకరుఁడు అను రూపకమునకుఁ గారణము 'కువలయమను కువలయము అను శ్లిష్టరూపకము 'నరసభూలుఁడు దిగ్గజాగ్రణి' అన్న రూపకమునకుఁ గారణము 'దానాంబువులు అను దానాంబువులు అను శ్లిష్టరూపకము 'నరసభూపాలుఁడు దివాకరుఁడు అను రూపకమునకుఁ గారణము 'పద్మోత్సవమను పద్మోత్సవము' అను శ్లిష్ట రూపకము. ఇవి పెక్కు రూపకములు. కాన శ్లిష్టమాలాపరంపరితము

౩ అశ్లిష్టకేవలపరంపరితరూపకము

కం. కాతరతరవిమతధ్వజి
నీతతకాంతారతతికి నీ చేతిమహో
హేతి దవజ్వలనోజ్జ్వల
హేతిసుమీ యోబధారుణీశ్వరనరసా ! ౪౮

పిఱికిపందలైన నీశత్రుసేనయనుకాంతారమునకు నీచేతిఖడ్గము దావాగ్ని శిఖ ఇట 'ఖడ్గ మగ్నిశిఖ' అను రూపకమునకు సేనాకాంతారము అను రూపకము హేతువు వెనుకటివానియందువలె నిందు శ్లేషలేదు. కాన నశ్లిష్టము

౪. అశ్లిష్టమూలాపరంపరితరూపకము

మ. వనితానేత్రచకోరచంద్రిక ; యశోవల్లీవసంతోదయం;
బనిదంపూర్వకథాసుధాబ్ధి ; భుజగర్వాదిత్యపూర్వాచలం
బనఘోద్యద్గుణరత్నరోహణము , నీయాకారమెవ్వారికిన్
వినుతింపన్ వశమే? నృసింహ . కరుణావిన్యాస . ధన్యాత్మకా

నీ యాకారము చంద్రిక అనురూపకము 'నేత్రచకోరము అను రూపకమునకు హేతువు. ఇట్లే మిగిలిన గీటులుంచినయెడలను దెలిసికొనవలెను

ఇవియే కాక రశనారూపకాది పెక్కుభేదములును గలవు

కిశలయకరైర్లతానాం కరకమలైః కామినీనాం జగజ్జయతి
నళినీనాం కమలముఖైర్ముఖేందుభిర్యోషితాం మదనః

లతలయొక్క చిగురాకులనుహస్తములచేతను, యువతుల కరములను కమలములచేతను, తామరతీఁగలయొక్క కమలములనుముఖములచేతను, తరుణుల ముఖములనుచంద్రులచేతను మన్మథుఁడు జగమును జయించుచున్నాఁడు.

ఇటఁ గిసలయములు కరములుగాఁ కరములు కమలములుగాఁ గమలములు ముఖములుగా ముఖములు చంద్రులుగా నారోపింపబడినవి. ఇది రశనా రూపకము రశనాకారమున రూపకములు గూర్పఁబడినవగుట నామము సార్థకము.

మఱియు సమస్తరూపకము వ్యస్తరూపకము అని రూపకమెల్ల ద్వివిధము. ముఖచంద్రుఁడు సమస్తరూపకము (సమాసమునను న్న రూపకము) 'ముఖము చంద్రుడు వ్యస్తరూపకము (విడిగానున్న రూపకము)

సిద్ధాంతమున వ్యస్తరూపకమేకానీ సమస్తరూపక మనునది లేదు. సమస్తరూపకమనినపుడు చెప్పుకొను నలంకారము 'ఉపమాలంకారమే. 'ముఖచంద్రాదీనాంతు ఉపమానసమాసాత్ న రూపకత్వం యుక్తం"అని వామనుఁడు అనఁగా ముఖచంద్రాదిపదములందు 'చంద్ర ఇవ ముఖం అనియుపమానసమాసమునే చేయవలెను రూపకం చేసినచో నుత్తరపదార్థప్రాధాన్యముచే వర్ణనీయమగు ముఖాదులకు గౌణత్వము వచ్చును కాన నుపమానసమాసమునే చేసి యుపమాలంకారమునే చెప్పుకొనవలెను ఇదిగాక "చతుర్దశలోకవల్లికందః" ఇత్యాదికమగు పరంపరితరూపకమును నుపమారూపకమనియు వామనుఁ డుదాహరించెను. 'చతుర్దశలోకవల్లికందః వల్లులవంటి పదునాలుగులోకములకును గంధభూతుఁడు అని యర్థము అంతేకానీ "చతుర్దశలోకములు అను వల్లులకుఁ గందము అనికాదు శ్లిష్టపరంపరితమునఁ దక్క అశ్లిష్ట పరంపరితమున నెల్లెడ నుపమాపమాసమునే చెప్పుకొనవనెను మొదట నుపమయుఁ బిమ్మట రూపకమును నుంట నుపమారూపకము

౬. పరిణామము

కం ధరలో నుపమేయమును
నరుదుగ నారోప్యమాణమగు నుపమానం
బరయఁ బ్రకృతోపయోగా
కరముగఁ బరిణామమయ్యెఁ గనుమెట్లన్నన్. ౫౦

ఉపమేయమం దారోపింపఁబడిన యుపమానము ప్రకృతరూపమున ననఁగా నుపమేయరూపముగానే పరిణమించి యుపయోగించుచో (నన్వయించుచో నది పరిమాణాలంకారము.

కం. నైలింపపతులకౌఁగిటఁ
దేలుటకై దివికినేగు దృప్తారులకున్
నీలాలనిచ్చెనాయెను
నీలాలితహేతి యోబనృపనరసింహా! ౫౧

దేవతా స్త్రీల ననుభవించుటకై దివికేగు నీ శత్రురాజులకు నీ ఖడ్గము నీలమణిమయమైన 'నిచ్చెన యయ్యెను

ఇట నుపమేయమగు ఖడ్గము మొదట నిచ్చెనగా నారోపింపఁబడినది ఆ యారోప్యమాణమగు నిచ్చెన స్వతంత్రముగా స్వర్గారోహణ సాధనము కాఁజాలదు. ఏలన, స్వర్గమునకు నిచ్చెనతో వెళ్ళుటెట్లు ? కాన ప్రకృత స్వరూపమున ననఁగా ఖడ్గస్వరూపముననే సాధనమగును (అనగా నిశ్రేణి ఖడ్గస్వరూపముగా (పరిణమించును) ఖడ్గహతులయినవారు స్వర్గమునకుఁ బోవుదురుగదా కాన నిచ్చెన ఖడ్గరూపమునఁ బరిణమించినచో నపుడు స్వర్గారోహణసాధనమగుచున్నది ఇట నారోప్యమాణము ప్రకృతాత్మకముగాఁబరిణమించుటచేఁ బరిణామాలంకారము

చంద్రాలోకమున "ప్రసన్నేన దృగబ్జేన వీక్షతే మదిరేక్షణా" అబ్జ మచేతన మగుటచే వీక్షణ క్రియపొసగదు కానఁదద్రూపమునఁ బరిణమించును" అని యుదాహరింపఁబడినది. దృగబ్జమనుచో అబ్జమువంటి దృక్కుతో అని యుపమితసమాసమును జెప్పియుపమాలంకార మేల చెప్పరాదు ? అన్నచో ఉపమితసమాసము చెప్పినపుడు "ఉపమితం వ్యాఘ్రాదిభిః సామాన్యాప్రయోగే" అను సూత్రముచే సామాన్యధర్మమును బ్రయోగింపరాదు ఇట "ప్రసన్నేన" అని సాధారణధర్మముపాత్తమైనది. "పురుషవ్యాఘ్రః శూరః" అనియుండదుగదా!

ఈ యలంకారము సామానాధికరణ్యవైయధికరణ్యభేదములచే ద్వివిధము సామానాధికరణ్యమన నుపమానోపమేయములు సమానవిభక్తి యందుండుట 'నీహేతి నీలాలనిచ్చెన అనుచో నుపమానోపమేయములు సమాన విభక్తికములు కాన సామానాధికరణ్యము గలదు. వైయధికరణ్యోదాహరణములును గనుఁడు

పున్నాగజాలకైర్హారాన్ కాంచీః కేసరదామభిః
కర్ణికాః కర్ణికారైశ్చ విహర్తుం విదధుర్వనే

ఆ యువతులు (వనదేవతలవలె) వనమున విహరించుటకుఁ బున్నాగ జాలకములచే (సురపొన్న మొగ్గలు) హారములను కేసరదామకములచే (పొగడ దండలు) మొలనూలులను కర్ణికారములచే (కొండగోఁగుపూలు) కర్ణికలను (చెవికమ్మలు) జేసికొనిరి.

ఇట హారాదులు స్వతంత్రముగా వనవిహారణోపయోగులుగాక పున్నాగ జాలకాది రూపమున నుపయోగపడుచున్నవి హారాదు లేల స్వతంత్రముగా విహరణోపయోగులుగావు ? అన్నచో నవి రతికేళి యందుపయోగపడును కాని యిట యువతుల వనదేవతాస్వరూపముతోడి వనవిహరణమున కవి యుపయోగ పడవు. కాన నిట నారోప్యమాణములగు హారాదులు జాలకాదిరూపమునఁ బరిణమించి యుపయోగించుచున్నవి. పున్నాగజాలకాద్యుపమేయములును

(తృతీయాంతములు) హారాద్యుపమానములును (ద్వితీయాంతములు) భిన్న విభక్తికములు. కాన వైయధికరణ్య పరిణామము.

రూపకమునందును వైయధికరణ్యము గలదు.

తారానాయకశేఖరాయ జగదాధారాయ, ధారాధర
ఛ్ఛాయాధారకకంధరాయ గిరిజాసంగైక శృంగారిణే
నద్యాశేఖరిణే దృశాతిలకినే నారాయణేనాస్త్రిణే,
నాగైః కంకణినే, నగేన గృహిణే, నాథాయ సేయం నతిః

చంద్రశేఖరుఁడును జగదాధారుఁడును నీలకంఠుఁడును, గిరిజాసంగతిచే శృంగారియు,నదిచే శేఖరియు (శేఖరముగలవాఁడు) కంటిచేఁ దిలకియు (తిలకము గలవాఁడు) నారాయణునిచే నస్త్రియు (అస్త్రముగలవాఁడు) సర్పములచేఁ గంకణియు (కంకణములు గలవాఁడు) నగముచే గృహియు (గృహము గలవాఁడు) నగు నాథునకు నమస్కారము.

ఇట నుత్తరార్థమున 'నద్యాశేఖరిణే' ఇత్యాదులు నదీరూపశేఖరము గలవాఁడు నేత్రరూప తిలకము గలవాఁడు నారాయణ రూపాస్త్రముగలవాఁడు. నాగరూపకంకణములు గలవాఁడు నగరూపగృహము గలవాఁడు" అని రూపకములు నదీ దృక్, నారాయణ నాగ నగశబ్దము లుపమేయములు శేఖర తిలక అస్త్ర కంకణ, గృహశబ్దము లుపమానములు ఉపమేయములు తృతీయాంతములు ఉపమానములు చతుర్థ్యంతములు ఇవి భిన్న విభక్తికములు. కాన వైయధికరణ్యరూపకము.

ఈ పరిణామాలంకారమును మమ్మటుఁ డుదాహరింపలేదు. దీనిని రూపకమునందే యంతర్భావము సేసినట్లగపడును

౭. సందేహము

గీ. విషయి, విషయంబుఁ, గవినుతివిహితసామ్య
దీప్తసందేహ మొంద సందేహ; మదియు
గరిమ శుద్ధంబు, నిశ్చయగర్భితంబు,
నిశ్చయాంతంబు నగు, దీని నిశ్చయింతు. ౫౨

ఉపమానోపమేయంబులు రెండును గవి ప్రతిభోత్థాపితమగు సాదృశ్యముచే సందేహింపఁబడినచో సందేహాలంకారము. వర్ణ్యమానమగు నుపమేయముయొక్క యుత్కర్షార్థమే యీ సందేహము పర్యవసన్నమగును ఈ కనఁబడునది స్థాణువా? పురుషుఁడా? అనుచోటనున్న సందేహము వర్ణ్యోత్కర్షార్థము పర్యవసింపలేదు. కాన నిది సందేహాలంకారము కాదు.

ఈ సందేహాలంకారము శుద్ధము, నిశ్చయగర్భము, నిశ్చయాంతము అని ముత్తెఱఁగులుగా నుండును

౧. శుద్ధసందేహము

ఉ. ఇంద్రుఁడో ? యా యుపేంద్రుఁడో ? బలీంద్రుఁడో ?
పార్వణ చంద్రుఁడో ? హరి
శ్చంద్రుఁడో ? రామచంద్రుఁడో ? రసాభరణ
ప్రవణాత్ముఁడైన నా
గేంద్రుఁడో ? యానగేంద్రుఁడో మృగేంద్రుఁడో ? యంచు
దలంతు రార్యు లీ
సాంద్రభుజప్రతాపరణసాహసు నోబయనారసింహునిన్. ౫౭

పై సందేహాలంకారలక్షణమునఁ గవి ప్రతిభోత్థాపితమగు సాదృశ్యముచే నుపమానోపమేయములు సందేహింపఁబడవలెనని చెప్పితిమి నరసభూపాలునిఁ జూచి 'ఇంద్రుఁడా ? ఉపేంద్రుఁడా ?' మొదలగు విధమునఁ జేయఁబడిన సందేహమున సాదృశ్యము చెప్పఁబడలేదు కొన్నియెడల జెప్పఁబడినది (నాగేంద్రుఁడా ? ఇత్యాదులందు రసాభరణ ప్రవణత్వాదులు సాదృశ్యము) కాన వేనికి సాదృశ్యము చెప్పఁబడలేదో వానికి సాదృశ్యమూహ్యము ఎట్లన భోగమున నింద్రుఁడో; కరుణయం దుపేంద్రుఁడో ఇట్లు మిగిలిన వూహ్యములు ఇది శుద్ధ సందేహము

౨. నిశ్చయగర్భసందేహము

మ. హరుఁడో యీఘనుఁ? డైన మౌళిధృతతోయం బెద్ది? దైతేయసం
హరుఁడో యీనృపుఁ? డైన నవ్విహగవాహం బెద్ది? వాణీమనో
హరుఁడో యివ్విభుఁ? డైన సారసనివాసాధ్యాసనం బెద్ది యం
చు రసజ్ఞుల్ వినుతింతు రాత్మ నరసక్షోణీశు వీక్షించుచున్

ఈ నరసభూపాలుఁడు హరుఁడా ? అయినచో శిరస్సున గంగయేది ? శ్రీమహావిష్ణువా ? అగుచో గరుడవాహనమేది ? బ్రహ్మయా పద్మాసనమేది ? అనుచోట్ల నరసభూపాలుఁడు హరాదిరూపమున మొదట సందేహింపఁబడి గంగాదులు లేమిఁగాఁదని నిశ్చయింపఁబడినను నరసభూపాలుఁడే యనియును వాగ్రూపమున నిశ్చయింపఁబడలేదు కాన నిది నిశ్చయగర్భసందేహము.

౩. నిశ్చయాంతసందేహము

సీ. తలపోయ వల్లిమతల్లి కేగతిఁగల్గె
నలసాలసానూనయానకలన?
భావింప మణిసాలభంజిక కెటులబ్బె
లాలితాలాపలీలాకలాప ?
యూహింప విమల విద్యుల్లేఖ కేలీల
నొదవె ధాత్రీభాగయోగగరిమ?
మరయంగ మదనమంత్రాధిదేవతకు నే
గతిఁ గల్గె నంగసంగప్రసంగ?

గీ. మనుచు శబరులు సందియంబందియంది
తెలియుదురు తోనె నీధాటి కలికిదలఁకి
యహితవనితలు వనధాటి నడలుచునికి
నరసుతాటోప యోబయనరసభూప ౫౫

శబరులు వనవాసినులగు నీ శత్రుకాంతలను గాంచి "లత లెట్లు నడవ నేర్చినవి? సాలభంజిక లెట్లు మాట్లాడుచున్నవి? మెఱుపుఁదీఁగె లెట్లు నేలపైకి వచ్చినవి? మదనమంత్రాధిదేవతలు శరీరము నెట్లు ధరించినవి? అని సంశయించి సంశయించి తుదకి నీ ధాటికి భయపడి తిరుగుచున్న శత్రుకాంతలని నిశ్చయించిరి. మొదట సందేహింపఁబడిన విషయము తుదకి నిశ్చయింపఁబడినది. కాన నిశ్చయాంత సందేహము

ఈ సందేహాలంకారమునకు ససందేహమనియు నామాంతరము.

౮. భ్రాంతిమంతము

కం. అల యుపమేయము ఛన్నత
నలరఁగ నారోప్యమాణమగు నుపమానం
బిల నెఱుకపడఁగ భ్రాంతిమ
దలంకరణమయ్యె, దీని నాపాదింతున్. ౫౬

కవిసమ్మతమగు సాదృశ్యముచే నుపమేయము ఛన్నమై యుపమానము యొక్క యనుభవము గలిగినచో (ఉపమానఁబిల నెఱుకపడఁగ) నది భ్రాంతిమంతము.

శా. చూడంజూడ నృసింహకీర్తిచయ మీక్షోణీనభోమధ్యమం
దేడంజూచినఁ దానయై నెగడఁగా నీక్షించి మిన్నేట నీ
రాడంబోయిన బేసితాపసులు మేలౌ; మ్రోల సిద్ధించెఁగా
నాడంబోయిన తీర్థమంచు మదిలో హర్షింతురశ్రాంతమున్.

నరసనభూపాలుని కీర్తినిఁ జూచి యాకాశగంగలో స్నానమాడఁబోవుచున్న సప్తర్షులు ఆకాశగంగగానే తలంచి హర్ష పడిరి. ఇటఁ గీర్తి యుపమేయము; ఆకాశగంగ యుపమానము దానిఁగాంచి హర్షపడుట యుపమానానుభవము.

స్మరణాలంకారమున స్మరణమే కాని యనుభవములేదు ఇందు భ్రాంతిచేఁ గలుగు ననుభవముగూడ నిబద్ధమై యుండవలెను.

" ఉ. అంకముఁజేరి శైలతనయా స్తనదుగ్ధము " అనుచోటఁగూడ భ్రాంతిమంతమే అన్యోన్య విషయక భ్రాంతిమదలంకారము ఉత్తరోత్తర భ్రాంతిమదలంకారము అని దీనిలో నవాంతర భేదములు గలవు.

పలాశముకుళభ్రాంత్యా శుకతుండే పతత్యలిః
సోఽపి జంబూఫలభ్రాంత్యా తమళిం ధర్తుమిచ్ఛతి

తేఁటి మోదుగుపువ్వని భ్రమించి చిలుకముక్కుమీఁదఁ బడుచున్నది అదియు నేరేడుపండని భ్రమించి యా తేఁటిని పట్ట సంకించుచున్నది ఇటఁ బరస్పరభ్రాంతి

చ వదనసరోజవాసనకు వచ్చిన తేఁటి నగల్చి చూడఁగా
నది యసితోత్పలంబులని యక్షులవ్రాలఁగఁ, జేవిదుర్పఁగా
నది మరలంబుజోజమని హస్తయుగంబున వ్రాల నవ్వె న
మ్మృదవతి యేమిసేసినను మానదిదేమియటంచు నెంతయున్

ఒక జవరాలు తన ముఖగంధమునకై వచ్చిన తేఁటి నదలించిచూచెను ఆ తేఁటి యా చూపులు నల్లగలువలని కన్నులమీఁద వ్రాలెను మరల నామె చేయి విదిలింపఁగా నది యా చేతినిఁ దామరపువ్వని భ్రమసి దానిపై వ్రాలెను అంత నామె యేమిచేసినను నిది మానదని నవ్వెను.

ఇట నుత్తరోత్తర భ్రాంతి నిబద్ధము. ఈ రెంటనుగూడ భ్రాంతిచేఁ గలిగిన యనుభవము నిబద్ధమైయున్నది.

౯ అపహ్నుతి

కం. ఉపమేయము గాదని యిది
యుపమానమె యనఁగ నెంతయు నపహ్నవమౌ,
నపుడిది ప్రాగారోపము,
నపహ్నవారోపమును, ఛలాదియు, నయ్యెన్. ౫౮

ఇది యుపమేయము (ముఖాదులు) గాదు ఉపమానమే (చంద్రాదులే) అని చెప్పినచో నది యపహ్నవాలంకారము అది ప్రాగారోపము - అనగా నారోపించి యపహ్నవించుట ; అపహ్నవారోపము - అనగా నపహ్నవించి యారోపించుట ; ఆకృతి, ఛల మిష, కైతవాది పదప్రయోగము సేయుట అని యీ విధముగాఁ ద్రివిధము.

మ. గురుచక్రప్రభఁగాని శౌర్యసుషమాంకూరంబుగా; దిందుభా
స్వరకీర్తిద్యుతిపంక్తిగాదు నిబిడాంచత్పాంచజన్యప్రభా
భరమౌఁగా, నటుగాన విశ్వభరణ ప్రారంభముంగోరి యీ
నరసేంద్రాకృతి నుద్భవించెఁ గమలానాథుండు విశ్వంభరన్.

శౌర్యసుషమాంకూరమును గాంచి "యిది చక్రప్రభగాని శౌర్యసుషమాంకూరంబుగాదు" అని శౌర్యసుషమాంకూరమునందు మొదటఁ జక్రప్రభ నారోపించి పిమ్మట "శౌర్యసుషమాంకూరంబు గాదు" అని యపహ్నవింపఁ బడినది. ఇది ప్రాగారోపము

'ఇది కీర్తిద్యుతిగాదు పాంచజన్యప్రభ అనుచో ముందపహ్నవమును, పిమ్మట నారోపమును జెప్పఁబడినది ఇది యపహ్నవారోపము

'నరసేంద్రాకృతి ఆకృతి పదము ప్రయుక్తమై యున్నది ఈ త్రివిధములందును నుపమేయ మపహ్నవింపఁబడి యది యుపమానమే యని తెలుపఁబడినది

౧౦ ఉల్లేఖము

కం. అలరఁగ గ్రహీతృభేదం
బులనొకటియె పెక్కురూపములనెడనెడలం
దలపోయఁగ నుల్లేఖం
బలంకరణరాజ... నదియొప్పున్ ౬౦

గ్రహీతృభేదమ... ...గ్రహింపఁబడినచో నుల్లేఖము.

A C No...... ....

కం. బాణుఁడని కవులు, మురజి
ద్బాణుఁడని విమతభూమిపాలురు సుమనో
బాణుఁడని సతులు, దలఁతురు
రేణాంకసమాను నోబళేంద్రునృసింహున్. ౬౧

ఒకే నరసభూపాలుఁ డిటఁ బెక్కండ్రచేఁ బెక్కువిధములు గ్రహింపఁబడెను

"గ్రహీతృభేదాభావేఽపి విషయాశ్రయభేదతః
ఏకస్యానేకథోల్లేఖ మప్యుల్లేఖం ప్రచక్షతే"

గ్రహీతృభేదము లేకున్నను విషయభేదమునఁబట్టి యొకవస్తువనేక విధములుగా వర్ణింపఁబడినను నుల్లేఖమే

మ. రవిబింబం బుపమింపఁ బాత్రమగు ఛత్రంబై శిరోరత్నమై
శ్రవణాలంకృతియై గళాభరణమై సౌవర్ణకేయూరమై
ఛవిమత్కంకణమై, కటిస్థలి నుదంచద్ఘంటయై నూపుర
ప్రవరంబై పదపీఠమై వటుఁడు దా బ్రహ్మాండమున్ నిండుచోన్.

ఇట గ్రహీతృభేదము లేదు ఒకే రవిబింబము వటుడు క్రమక్రమముగాఁ బెరుగుచుండగాఁ నాయాశరీరాంగముల కడకు వచ్చినపుడట్లుండెను ఇట విషయాశ్రయభేదము

౧౧. ఉత్ప్రేక్ష

కం. ఉపమేయమునకుఁ గలిగిన
యుపమానగుణక్రియాదియోగముచే నా
యుపమానమెయని తలఁచిన
నపుడది యుత్ప్రేక్షయయ్యె; నదియును ధరణిన్ ౬౨

"యత్రాఽన్యధర్మసంబంధా దన్యత్వేనోపతర్కితం
ప్రకృతం హి భవేత్ప్రాజ్ఞాస్తాముత్ప్రేక్షాం ప్రచక్షతే."

అనుదానికిఁ బైపద్య మాంధ్రీకరణము ఉపమానముయొక్క (అప్రకృతము లేక అన్యము) గుణము క్రియ మొదలగువాని సంబంధముచే నుపమేయము (ప్రకృతము) ఉపమానముగానే (అప్రకృతముగానే లేక యన్యముగానే) తర్కింపఁబడినచో (ఊహింపఁబడినచో) నది యుత్ప్రేక్ష యనఁబడును. ఉత్ప్రేక్ష యధ్యవసాయగర్భము. అధ్యవసాయమన నభేదప్రతి

పత్తి అనఁగాఁ బ్రకృతాప్రకృతములకు నభేదజ్ఞానము కాఁబట్టి యిటఁ బ్రకృతమునకప్రకృతతాదాత్మ్యసంభావన (ఊహ) సేయఁబడును అన గాఁ బ్రకృత మప్రకృతము గానే తర్కింపఁబడును ఉత్ప్రేక్షయందుఁ బ్రకృతమున కప్రకృతతాదాత్మ్యసంభావనయుండునన్నమాట స్మృతియందుంచుకొనవలెను తాదాత్మ్యమన్నను నధ్యవసాయమన్న నొకటియే.

కం. క్రమమున వాచ్యయును బ్రతీ
యమానయుననగుచు ద్వివిధయగు; వాచక శ
బ్దముగలుగ వాచ్యయనఁదగు
నమరఁగ లేనియెడ గమ్యయనఁదగువరుసన్. ౬౩

ఆ యుత్ప్రేక్ష వాచ్య, గమ్యయని ద్వివిధము సంభావనాప్రతిపాదకము లైన (ఊహను లేక వితర్కమును దెలుపు పదములు) నూనము, ధ్రువము ప్రాయము అనన్ శంకించు కాఁబోలు, ఊహించు భావించు అనుమానించు మొదలగు పదములను బ్రయోగించుటచే వాచ్య యనియు నట్టి పదములు లేనిచో గమ్యయనియుఁ జెప్పఁబడును

సీ. అలరెడు నీరెంటియందు జాతిగుణక్రి
యాద్రవ్యముల వాచ్య యట్లిసంఖ్య;
అవినాల్గు వరుస భావాభావమునఁ జెంద
నిల వసుసంఖ్య, యా యెనిమిదియును
విలువదినాలుగా హేతు, ఫల, స్వరూ
పముల వేర్వేఱఁ ద్రిభంగిఁ జెంద
నందు నెన్మిదియొన్మిదగు హేతువు, ఫలంబు
నలరువాచ్య గుణక్రియానిమిత్త

గీ. ములఁ బదాఱుపదాఱునౌ, నలస్వరూప
గతనిమిత్తంబులకు వాచ్యగమ్యగతులు
గానఁ బదియాఱునగు వ్యాచ్యగస్వరూప;
మరయ గమ్యస్వరూప మష్టాఖ్యయయ్యె. ౬౪

ఈ వాచ్యా గమ్యాభేదములలో వాచ్య ఉపమానపదము జాతివాచకమని గుణవాచకమని క్రియావాచకమని ద్రవ్యవాచకమనియు భేదములు వహించి

యుంట నాలుగు విధములు (అనఁగా జాత్యుత్ప్రేక్ష, గుణోత్ప్రేక్ష క్రియోత్ప్రేక్ష ద్రవ్యోత్ప్రేక్ష) శబ్దము జాతిగుణ క్రియా ద్రవ్య వాచక భేదముచేఁ జతుర్విధమని తెలిపితిమి ఈ చతుర్విధోత్ప్రేక్షయు భావము అభావము అను భేదములనుబట్టి యెనిమిది భేదములు (జాతిభావోత్ప్రేక్ష జాత్యభావోత్ప్రేక్ష మొ) ఈ యెనిమిది భేదములలో నొక్కొక్కటియు హేతువుగా ఫలముగా స్వరూపముగా నుత్ప్రేక్షింపఁబడినచో నిఱువదినాలుగు భేదములగును. (జాతి హేతూత్ప్రేక్ష, జాత్యభావ హేతూత్ప్రేక్ష మొ.) ఇందు హేతూత్ప్రేక్ష లెనిమిదియు ఫలోత్ప్రేక్ష లెనిమిదియు గుణ క్రియా నిమిత్త భేదములనుబట్టి యొక్కొక్కటియు బదునాఱు భేదములు గాన మొత్తము ముప్పదిరెండు భేదములగును. ఇఁక స్వరూపోత్ప్రేక్షలో నిమిత్తములు (గుణ క్రియలు) వాచ్యమనియును గమ్యమనియును ద్వివిధము అనఁగా స్వరూపోత్ప్రేక్ష యుపాత్త నిమిత్తయనియు ననుపాత్త నిమిత్తయనియును ద్వివిధము, ఉపాత్త నిమిత్తయగు నష్టవిధ స్వరూపోత్ప్రేక్ష గుణ, క్రియా నిమిత్త ద్వయభేదమును బట్టి పదునాఱు భేదములగును అనుపాత్త నిమిత్త యెనిమిది భేదములే యగును ఏలన ననుపాత్త నిమిత్తలో గుణ, క్రియాభేదము లుండవు అనఁగా ననుపాత్తగుణనిమిత్త అనుపాత్తక్రియానిమిత్త అను భేదములుండవు. అట్లు భేదమునూపుట పుట్టనివానికిఁ బేరుపెట్టుటవంటిది. మొత్తము వాచ్యోత్ప్రేక్ష ౫౬ విధములు (హేతూత్ప్రేక్ష ౧౬ విధములు; ఫలోత్ప్రేక్ష ౧౬ విధములు ఉపాత్తనిమిత్తస్వరూపోత్ప్రేక్ష ౧౬ విధములు; అనుపాత్తనిమిత్తస్వరూపోత్ప్రేక్ష ౮ విధములు.)

కం. అల హేతు ఫల, నిమిత్తం
బులకున్ గమ్యత్వమైన భువి హేతుఫలం
బులు లేకరుచిరమగునని
యలవడ గమ్యత్వమిందు నగదితమయ్యెన్. ౬౫

(లేక+అరుచిరము) పై వివరణమున స్వరూపోత్ప్రేక్షకే యనుపాత్త నిమిత్త (గమ్యనిమిత్త) ఉపాత్తనిమిత్త (వాచ్యనిమిత్త) యను భేదములు దెలిపితిమి కాని హేతు ఫలోత్ప్రేక్షలకీ భేదము దెలుపలేదు ఏలయన హేతూత్ప్రేక్షలో నిమిత్తము ఫలము, ఫలోత్ప్రేక్షలో నిమిత్తము హేతువు; ఇవి చెప్పఁబడకున్నచో నుత్ప్రేక్ష యసుందరము కాన హేతుఫలోత్ప్రేక్షలలో ననుపాత్తనిమిత్తభేదములేదు కానఁ జెప్పఁబడలేదు

కం. కావున నేఁబదియాఱగు
నావాచ్యోత్ప్రేక్ష, గమ్యయటువలెనే భే

దావహమగును ; నిమిత్త
ద్వైవిధ్యమునందు గమ్యతాస్థితి లేమిన్. ౬౬

కం. హేతుస్వరూపఫలములు
నాతతగతి నెన్మిదెన్మిదయి యవియు నిమి
త్తాతివ్యాప్తిం బాఱుగ
నేతఱిగమ్యయును నల్వదెనిమిదియయ్యెన్ ౬౭

కావున వాచ్యోత్ప్రేక్ష డెబ్బదియాఱు భేదములు గలది. గమ్యోత్ప్రేక్ష నలుబదెనిమిది భేదములు మాత్రమే గలది ఎట్లన, వాచ్యోత్ప్రేక్ష వలెనే గమ్యోత్ప్రేక్షయు జాతి గుణ, క్రియా, ద్రవ్య, భేదములచేఁ దొలుత నాలుగు భేదములు. అవి భావాభావములచే నెనిమిది భేదములు వానిని హేతువుగా ఫలముగా స్వరూపముగా నుత్ప్రేక్షించినచో మూఁడెనిమిదు లిరువదినాలుగు భేదములగును. అనియు గుణక్రియానిమిత్తద్వైవిధ్యముచే నలువదెనిమిది భేదములగును

వాచ్యమగు స్వరూపోత్ప్రేక్షలోనే కాని గమ్యమగు స్వరూపోత్ప్రేక్షలో ననుపాత్తనిమిత్తయుండదు ఏలన గమ్యోత్ప్రేక్షయందు సంభావనా ప్రతిపాదక పదము ప్రయోగింపఁబడదని చెప్పియుంటిమి సంభావనావాచకమును బ్రయోగింపకయు నిమిత్తమును బ్రయోగింకయు నున్నచో నుత్ప్రేక్షయే యసంభవము, కాన గమ్యోత్ప్రేక్షలో ననుపాత్తనిమిత్తయుండదు

వాచ్యోత్ప్రేక్షా గమ్యోత్ప్రేక్షలు వెరసి నూటయిరువదినాలుగు

వ ఇందు నేఁబదియాఱు భేదంబులంబొల్చు వాచ్యోత్ప్రేక్షకుం గొన్ని నామధేయంబు లెఱింగించెద,

౧. ఉపాత్తగుణనిమిత్తజాతిభావస్వరూపోత్ప్రేక్షయు, ౨. ఉపాత్తక్రియానిమిత్తజాతిభావస్వరూపోత్ప్రేక్షయు ౩ ఉపాత్తగుణనిమిత్తజాత్యభావస్వరూపోత్ప్రేక్షయు, ౪. ఉపాత్తక్రియానిమిత్తజాత్యభావస్వరూపోత్ప్రేక్షయు, ౫. అనుపాత్తనిమిత్తజాతిభావస్వరూపోత్ప్రేక్షయు, ౬. అనుపాత్తనిమిత్తజాత్యభావస్వరూపోత్ప్రేక్షయు, ౭ ఉపాత్తగుణనిమిత్తజాతిభావహేతూత్ప్రేక్షయు, ౮ ఉపాత్తక్రియానిమిత్తజాతిభావహేతూత్ప్రేక్షయు, ౯. ఉపాత్తగుణనిమిత్తజాత్యభావహేతూత్ప్రేక్షయు, ౧౦ ఉపాత్తక్రియానిమిత్తజాత్యభావ

హేతూత్ప్రేక్షయు, ౧౧ ఉపాత్తగుణనిమిత్తజాతిభావఫలోత్ప్రేక్షయు, ౧౨. ఉపాత్తక్రియానిమిత్తజాతిభావఫలోత్ప్రేక్షయు ౧౩ ఉపాత్తగుణనిమిత్తజాత్యభావఫలోత్ప్రేక్షయు ౧౪. ఉపాత్తక్రియానిమిత్తజాత్యభావఫలోత్ప్రేక్షయు, నన చతుర్దశభేదంబులం బొల్పు జాత్యుత్ప్రేక్ష. ఇట్లు గుణోత్ప్రేక్షయుఁ, క్రియోత్ప్రేక్షయు ద్రవ్యోత్ప్రేక్షయు, బరస్పరచతుర్దశభేదంబులఁ బొంద వాచ్యోత్ప్రేక్ష యేఁబదియాఱగు జాతియనఁగ సముదాయంబును, క్రియయనఁగఁ గృత్యంబును, గుణంబనఁగ రూపాదియు, ద్రవ్యంబనఁగ నొకవస్తువనగు. (జాతి, గుణ, క్రియా ద్రవ్య, వాచకములను గూర్చి వెనుక వివరింపఁబడినది) ఏతదవధ్యాధ్యవసాయమూలంబులగు నేఁబదియాఱు భేదంబులకు నుదాహరణంబు లొనరించినఁ జాలపెగునను భయంబున దిఙ్మాత్రంబుగ లక్ష్యంబులు నిరూపించెద. ఎట్లనిన,

ఉపాత్తగుణనిమిత్త జాతిభావస్వరూపోత్ప్రేక్ష

కం భవదీయబాహుపీఠిం
దవిలిన భూదేవి యుచితధవలాభమహో
త్సవకృతకుంకుమరుచివై
భవమన నీ శౌర్యశోభ పరగు నృసింహా!

శౌర్యమనఁ బ్రతాపము అది యెఱ్ఱగా నుండునని కవి సంప్రదాయము నీ శౌర్యశోభ నీబాహుపీఠమునఁ దవిలిన భూదేవి తన కుచితుఁడగు పతి లభించుట యను మహోత్సవముచేఁ (సంతోషముచే) దాల్చిన కుంకుమకాంత్యతిశయమనఁ బరగును శౌర్యశోభయుపమేయము కుంకుమకాంత్యతిశయ ముపమానము రుచిపదము. జాతివాచకము అదియు భావరూపము. ఇట నుపమేయ ముపమానముగాఁ దర్కింపఁబడినది నిమిత్తము ఎఱుపు. 'అనన్' ఉత్ప్రేక్షా లేక సంభావనావాచకము.

'శౌర్యము కుంకుమ మన బరగును' అన్నచాలును ఉపమేయమున 'శోభా' పదము, ఉపమానమున 'వైభవము' అనునవి వ్యర్థములే.

౨. ఉపాత్తక్రియానిమిత్తజాతిభావస్వరూపోత్ప్రేక్ష

కం. నిరుపమరణదీక్షావ్రత
విరచితమగు విజయలక్ష్మి వేణియుఁబోలెన్
బరగుఁ గరాళభవత్కర
కరవాలమతల్లి యోబఘునరసింహా ?

నరసభూపాలా ! నీచేతి భయంకరఖడ్గము రణదీక్షావ్రతాచరణమున విప్పుకొనిన విజయలక్ష్మి వేణియనఁ బరగుచున్నది

ఉపమేయము ఖడ్గము ఉపమానము వేణి ఇది జాతివాచకము మరియు భావరూపము, ఉపమేయ ముపమానముగాఁ దర్కింపఁబడుచున్నది. నిమిత్తము 'వ్రతాచరణము' అను క్రియారూపము

౩ అనుపాత్తనిమిత్తజాతిభావస్వరూపోత్ప్రేక్ష

కం నీచరణకమలనఖరుచి
వీచికలు నతారివీరవిభవము మగుడం
ద్రోచుసమీచీనసుధా
వీచికలనఁబోల్చు యోబవిభు నరసింహా ! ౩౧

నరసభూపాలా ! నీ కాలిగోళ్లకాంతితరంగములు ప్రణతులగు శత్రువీరులను దిరిగి ద్రోచు నమృతతరంగములనఁ బొలుచును.

నఖరుచివీచికలుపమేయము ; సుధావీచికలుపమానము , ఇది జాతి వాచకములు భావరూపములు. ఇందు నిమిత్తము చెప్పఁబడలేదు.

౪. అనుపాత్తనిమిత్తజాత్యభావస్వరూపోత్ప్రేక్ష

కం. ఇల నసముద్రమువలె నీ
బలధూళియొనర్చి సమదపరిపంథివధూ
విలులితబాష్పోదకముల
జలనిధిశతకము ఘటించు జగతి నృసింహా! ౩౨

నరసభూపాలా నీ సైన్యధూళి మొదట భూమిని నసముద్రముగాఁ (సముద్రము లేనిదిగా) జేసి పిమ్మట శత్రురాజుల భార్యల బాష్పోదకములచేఁ బెక్కు సముద్రములను దానియందు గూర్చుచున్నది.

'ఇల యుపమేయము; అసముద్రము' ఉపమానము సముద్రశబ్దము జాతివాచకము అసముద్రము' అనుటచే నది యభావరూపమున నున్నది. ఇట గుణక్రియారూపనిమిత్తము చెప్పఁబడలేదు.

ఇట 'అసముద్రమువలె అనుచోటను బూర్వపద్యమున వేణియుఁ బోలెన్' అనుచోటను వలెన్ పోలెన్ పదములుంటవలన నుపమాలంకారము గాదా? యని భ్రమింపరాదు ఏలన,

> యదాఽయ ముపమానాంశో లోకత స్సిద్ధి మృచ్ఛతి
> తదోపమైవ యేనేవ శబ్దః సాధర్మ్యసూచకః
> యధా పునరయం లోకాఽసిద్ధః కవికల్పితః
> తదోత్ప్రేక్షైవ యేనేవ శబ్దః సంభావనాపరః

ఎచ్చట ఉపమానము లోకసిద్ధమో యది యుపమాలంకారము అచ్చట 'ఇవ' (వలెన్ పోలెన్ ప్రభృతులు) శబ్దము సాదృశ్యవాచకము. ఎచ్చట యుపమానము లోకసిద్ధముగాక కవికల్పితమో యది యుత్ప్రేక్షయే. అచ్చట 'ఇవ శబ్దము (వలెన్ పోలెన్ ప్రభృతులు) సంభావనాపరము అనియున్నది

ఇట 'అసముద్రమువలె అనునది (ఉపమానము) లోకసిద్ధముగాదు ఇల సముద్రములు లేని దెట్లగును? కానఁ గవికల్పితము కాన నిచ్చట వలె పదము వెనుకటి పోలెన్ పదమును సంభావనా వాచకములే.

౫. జాతిహేతూత్ప్రేక్ష

కం. పొందిన నృసింహనృపసం
క్రందను సత్కీర్తిచేతఁ గడఁగి త్రిలోకీ
మందస్మితంబుచేబలె
నిందొవచెలి యంకరుచివిశేషమడంగెన్. 23

నరసభూపాలుని కీర్తిచేఁ త్రిలోకీమందస్మితంబుచేవలెఁ జంద్రుని యొక్క కళంక మడఁగెను.

హేతువుగానిదానిని హేతువుగా నుత్ప్రేక్షించుట హేతూత్ప్రేక్ష. నరసరాజు కీర్తిచేఁ గళంకమడఁగఁగా దానికి హేతువుగాని ముల్లోకముల మందస్మితమును హేతువుగాఁ గవి యుత్ప్రేక్షించినాఁడు. స్మితము జాతి వాచకము. అదియు భావరూపము. ఇట నిమిత్తము కళంకమడఁగుట యను క్రియారూపము ఇది ఫలము హేతూత్ప్రేక్షలో నిమిత్తము ఫలము ఫలోత్ప్రేక్షలో నిమిత్తము హేతువు

౬. జాత్యభావహేతూత్ప్రేక్ష

కం. రేల రవిలేమి నిరులౌ
దై త్రిలోక్యంబనియుఁబోలె ధాత సృజించెన్
లాలితనిరుపమతేజో
వాలికవనాప్తుఁడైన నరసింహేంద్రున్. ౨౪

"రాత్రులందు సూర్యుఁడు లేమిచే ముల్లోకములును నంధకారమయ మగును" అని కాఁబోలును బ్రహ్మ తేజస్సూర్యుఁడగు నరసభూపాలుని సృజించెను. బ్రహ్మ తేజస్సూర్యుఁడగు నరసభూపాలుని సృజించుటకు హేతువుగాని రాత్రులందలి రవిలేమిని హేతువుగాఁ జెప్పుటచే హేతూత్ప్రేక్ష. రవి జాతివాచకము 'రవిలేమి' జాత్యభావరూపము జాత్యభావమే యిట హేతువుగాఁ దర్కింపఁబడినది. నరసభూపాలసృష్టి ఫలము.

౭. జాతిభావఫలోత్ప్రేక్ష

కం. ప్రమదమునఁ జెలఁగుజయమయ
కమలకు రంగస్థలంబు గావలసినుమీ!
క్రమమున నరసింహేంద్రుని
సమధికభుజమధ్యమతివిశాలంబయ్యెన్. ౨౫

సంతోషమునఁ జెలఁగు జయలక్ష్మికి రంగస్థలము కావలసి కాఁబోలు నరసభూపాలుని భుజమధ్యము విశాలమయ్యెను.

ఇట భుజమధ్యము విశాలమగుటకు ఫలము 'జయలక్ష్మికి రంగస్థలము గావలసి కాబోలు అని ఫలముగాని రంగస్థలమగుటను ఫలమునుగా నుత్ప్రేక్షించుటచే నిది ఫలోత్ప్రేక్ష. రంగస్థలము జాతివాచకము. ఇది భావరూపము. ఈ జాతివాచకమే యిట ఫలముగా నుత్ప్రేక్షింపఁబడినది.

౮. జాత్యభావఫలోత్ప్రేక్ష

కం. తగవరులు జగతి మగువలఁ
దెగటార్పరు, కాన నీదు దృప్తారాతుల్
మగఁటిమి డిగవలసినుమీ
తగభీరువులగుట యోజధరణిపువరసా! ౨౬

ఉత్తములగు వీరలు స్త్రీలను జంపరు కావున నీ శాత్రవులు తమ మగతనమును దించుకొనుటకు సుమీ భీరువులగుచున్నారు

ఇట భీరువులగుటకు ఫలముగాని 'మగతనమును దించుకొనుట' ఫలముగా నుత్ప్రేక్షింపఁబడినది. 'మగఁటిమి డిగవలసిసుమీ అన అపురుషత్వము సిద్ధించుటకై' అని యర్థము. 'అపురుష అనునది జాత్యభావరూపము ఇదియే యిట ఫలము 'అపురుషత్వము' అని ప్రయోగించుటయే తెన్ను 'జాత్యభావము స్పష్టముగా గోచరించును

౯. క్రియాస్వరూపోత్ప్రేక్ష

చ. అనఘ! నృసింహ! నీఘనజయానకజాతభయానకాధిక
ధ్వనులు గుహాగృహాగ్రములఁ బ్రాలఁ బ్రతిధ్వనిమేదురంబులై
తనరె దిగంతశైలములు తమ్మునెదుర్కొను వైరికోటికిన్
నిను శరణంబు వేఁడుమని నేర్పిన బుద్ధులు నేర్పుకైవడిన్ ౭౭

ఓ నరసభూపాలా నీ జయదుందుభులయొక్క భయంకర ధ్వనులు తమ గుహలయందుఁ బ్రతిధ్వనింపఁగా దిగంతపర్వతములు తమలో డాఁగవచ్చు శత్రుకోటికిఁగని మీరు నరసభూపాలునే శరణు వేఁడుడఁని బుద్ధులునేర్పువిధమునఁ దనరెను.

దిగంతశైలము లుపమేయము, 'బుద్ధులు నేర్పుచున్నవో యన' అనుక్రియా స్వరూపముపమానముగా నుత్ప్రేక్షింపఁబడినది. ఇది భావరూపము. నిమిత్తము ధ్వని

౧౦. క్రియాఽభావస్వరూపోత్ప్రేక్ష

చ భవదరిభూమిపాలకులపాలిక చెంచెతకాత్మ దుర్దశల్
వివరముగా వచింప వనవీధి దయామతిఁబల్కనీనియ
ట్లవిరళమందమారుతచలాచలచారుపలాశహస్తముల్
తవిలివిదుర్చు శౌర్యగుణధామ నృసింహనృపాలశేఖరా ౭౮

నరసభూపాలా, నీ శత్రుకాంత యడవిలోఁ జెంచెతకుఁ దనదుర్దశను దెలుపుచుండఁ (తెలిపి వాపోవుచుండ) గా విని వనవీధి కనికరించి "పలుక కుండఁ జేయుటకో" యనఁ దన చిగురాకుచేతులను విదిలించుచున్నది (పలుక వలదని మోదార్పు చున్నది.)

ఇట వనవీధి యుపమేయము, 'పఱాకకుండఁ జేయుటకో యన' నను క్రియాఽభావరూపమగు నుపమాన ముత్ప్రేక్షింపఁబడినది. చాలనము నిమిత్తము

౧౧. క్రియాహేతూత్ప్రేక్ష

చ. మొగముముడించెఁ గచ్ఛపము; మోమఱవాంచె భుజంగపుంగవుం
డగముచలింపఁగా వెఱచె; నాదివరాహము మోరత్రోపునం
దెగువఁబయోధిఁ జొచ్చె, సుదతీమకరాంక! నృసింహభూప! నీ
జగదభినంద్య భూభరణశక్తికృతాభిభవంబుచేఁబలెన్. ౭౯

నీ భూభరణశక్తిచేఁ గలిగిన పరాభవముచేఁ గాఁబోలు నాదికూర్మము మొగము ముడుఁచుకొనెను. ఆదిశేషుఁడు మోము నలఁతిగా వంచెను కులపర్వతము కదలలేకపోయెను ఆదివరాహము ముట్టెతోఁ ద్రోసికొనుచు సముద్రముఁ దూఱెను.

ఇట నాదికూర్మాదులు ముఖసంకోచాదులు పొందుటకు హేతువుగాని పరాభవక్రియ హేతువుగా నుత్ప్రేక్షింపఁ బడినది

౧౨. క్రియాఽభావహేతూత్ప్రేక్ష

చ. సరసనృసింహ! నీయశముఁ జంద్రునిఁ ద్రాసున ధాత దూఁచినన్
సరభసవృత్తి నెత్తుడిగి సామ్యనిరూఢి వహింపలేమినో
యరయ గురుత్వహేతుమలినాంకనిరంకుశలోహటంకసం
కరమును జెందెఁ జంద్రుఁడు జగంబు మృగంబని చూచు
చుండఁగన్. ౮౦

బ్రహ్మ నీ కీర్తినిఁ జంద్రునిఁ ద్రాసునఁబెట్టి తూఁచఁగాఁ జంద్రుఁడు సామ్యము వహింపలేమిఁ గాఁబోలు నెత్తుడిగి యనఁగాఁ ద్రాసునుండి క్రిందికి దిగి (ఆకాశమునుండి దిగి) బరువువహించి సరివచ్చుటకై తన యంకరూపమగు నినుపగుండును దాల్చియుండెను దీనిని లోకము మృగమని తలంచును

చంద్రుఁడంకమును ధరించుటకు హేతువుగాని సామ్యనిరూఢి వహింప లేమినో' అను క్రియాఽభావము హేతువుగా నుత్ప్రేక్షింపఁబడినది ఇది 'అంకటంక' అను రూపకానుప్రాణితమై యున్నది

౧౩. క్రియాఫలోత్ప్రేక్ష

చ. నరనుతశౌర్య వైభవసనాథ! నృసింహధరాధినాథ! నీ
వరజయభేరి భాంకృతిరవంబు దివిం బరిపూర్ణమయ్యె నా
సురగణికాపరంపరకుఁ జోద్యముగా ననురూపనాయక
స్థిరపరిరంభసంభ్రమవిశేషముఁ దెల్పఁగ నేగు కైవడిన్. ౮౧

నీ జయభేరీధ్వని దేవతాస్త్రీల కనురూపనాయకపరిరంభవిశేషముఁ దెల్పుటకు నేఁగుచున్నదో యన్నట్లాకాశమున నిండెను

భేరీధ్వని యాకాశమున నిండుటకు ఫలముగాని 'అనురూప...విశేషము దెల్పుటకు నేఁగుట' ఫలముగా నుత్ప్రేక్షింపఁబడినది అనఁగా గ్రియయే ఫలముగా నుత్ప్రేక్షింపఁబడినది

౧౪. క్రియాఽభావ ఫలోత్ప్రేక్ష

ఉ. గంధపుఁగొండపై నివముఁ గ్రమ్మెడి మౌక్తికనిర్ఝరీతటీ
చందనవాటిలోఁ గనకసైకతసాంద్రగుహాగృహావళిం
జెంది ఫణీంద్రకన్యలు నృసింహునమందయశోమరందని
ష్యందముఁ గ్రోలుచుందురు విషాగ్నివహింపఁగ
లేమికిం బలెన్ ౮౨

నాగకన్యలు మలయపర్వతమునందలి తామ్రపర్ణినదీతీరచందనవాటికలో గనకసైకతసాంద్రగుహాలయందు విషాగ్ని సహింపలేక కాఁబోలు నరస భూపాలుని కీర్తిమరందమును గ్రోలుచుందురు యశోమరందపానమునకు ఫలముగాని 'విషాగ్నిని వహింపలేమి ఫలముగా నుత్ప్రేక్షింపఁబడినది విషాగ్ని వహింపలేమి అనునది క్రియాఽభావరూపము

౧౫ గుణస్వరూపోత్ప్రేక్ష

కం. నరసింహుభాగ్యసూచక
సురుచిరదృక్కోణశోణశోభ చెలంగెన్
శరణాగతభరణాయతి
కరుదుగ సాకారమగుదయారసమనఁగన్. ౮౩

నరసభూపాలుని దృక్కోణశోణశోభ యుపమేయము అది సాకారమగు దయారసము. గుణస్వరూపమగు నుపమానముగా నుత్ప్రేక్షింపఁబడినది శరణాగతభరణ మను క్రియ నిమిత్తము

౧౬. గుణాభావస్వరూపోత్ప్రేక్ష

కం. బలశశిహరభాషలకును

బోలుపుగ మితిలేనిమాడ్కి మొలబంటై తో

మ్ములబంటై, మెడబంటై

తలమునకలునయ్యె నరసధరణిపుకీర్తుల్. ౬౪

నరసభూపాలుని కీర్తులు బలరామునకు మొలబంటిగాఁ (వాని నల్లని వస్త్రమును గప్పుచున్నది) ఇంద్రునికి రొమ్ములబంటిగా (వాని కళంకమును మాపుచున్నది.) హరునకు మెడబంటిగాఁ (కంఠమునందలి నలుపును నడఁచు చున్నది) సరస్వతికిఁ దలమునకలుగా నయ్యెను.

కీర్తులు మితిలేనివి ఇటఁ గీర్తులుపమేయము 'మితిలేనివి' అని మితిరూప గుణాభావముపమానముగా నుత్ప్రేక్షింపఁబడినది. ఇట నిమిత్తమనుపాత్తము.

౧౭. గుణహేతూత్ప్రేక్ష

మ. అరయన్ శ్రీనరసింహకీర్తిచయముద్యన్ముఖ్యవర్ణోదయా

కరసామ్యంబున ధాతపైఁగినిసియే కాబోలుఁ దత్తేజోంధవో

త్కరసౌభాగ్యముఁ, దన్మహాసనరుచింగారించి భాషావర

స్థిరరూపంబయి తా సృజించె నరులన్ శ్రీకంఠసంకాశులన్.

నరసభూపాలుని కీర్తి ముఖ్యవర్ణోదయాకరసామ్యముచేఁ (ముఖమునఁ బుట్టిన వర్ణము బ్రాహ్మణవర్ణము - బ్రాహ్మణవర్ణముయొక్క పుట్టుకకుఁ గారణమైనవాఁడు బ్రహ్మ 'ముఖ్యవర్ణము' అనఁ దెలుపు కీర్తి శ్వేతవర్ణోదయమునకుఁ గారణమైనది కాన బ్రహ్మయుఁ గీర్తియు ముఖ్యవర్ణోదయాకరములు) బ్రహ్మపై, గినిసి కాఁబోలు నాతని వాహనములగు హంసల సౌభాగ్యమును అతని యాసన మగు శ్వేతపద్మముయొక్క కాంతిని బాధించి బ్రహ్మత్వమును వహించి శివసన్నిభు లగు నరులను సృజించెను. అనఁగా నెల్లరనుదెల్లఁగాఁజేసెను

ఇటఁ గీర్తిహంసల సౌభాగ్యమును, శ్వేతపద్మద్యుతినిఁ గారించుటకు నరు లను శివసన్నిభులను జేయుటకును హేతువుగాని కినియుట (కినిసియే కాఁబోలు) కినుక అను గుణము హేతువుగా నుత్ప్రేక్షింపబడినది.

౧౮. గుణాభావహేతూత్ప్రేక్ష

కం. హరిగరిమ దెగడి సత్పథ
పరిచయలంఘన మొనర్చి భ్రమియించుఁ జుమీ!
నరసింహభూమిపాలుని
యదదగుసత్కీర్తి యవినయంబునఁ బోలెన్. ౮౬

నరసభూపాలుని కీర్తి యవినయముచేతఁ గాఁబోలు విష్ణుదేవుని గౌరవమును (వైల్యము) దెగడి సత్పథము (ఆకాశము - సన్మార్గము) నతిక్రమించి తిరుగును.

ఇటఁ గీర్తి హరిగరిమను దెగడుటకును, సత్పథలంఘనమునకును హేతువుగాని 'అవినయము' హేతువుగా నుత్ప్రేక్షింపఁబడినది 'అవినయము' అన వినయాభావము. కాన గుణాభావహేతూత్ప్రేక్ష.

౧౯. గుణఫలోత్ప్రేక్ష

కం. వడి నీకీర్తులఁ బోలెడి
కడిమిం దనకందు దెలుపుగావలసి చుమీ!
కడకడలి యెడలఁ గ్రుంకును
వెడవిల్తు నిమామ యోజవిభు నరసింహా!

చంద్రుఁడు నీ కీర్తినిఁ బోలవలయునని తన మచ్చను దెలుపుఁజేసికొనుటకు సుమీ పడమటి సముద్రమున మునుఁగుచున్నాఁడు

చంద్రుఁడు పడమటి సముద్రమునఁ బడుటకు ఫలముగాని 'తన మచ్చను దెలుపుఁ జేసికొనుట' ఫలముగా నుత్ప్రేక్షింపఁబడినది ఇట 'తెలుపు గుణము. అది క్రుంకుటకు ఫలముగా నుత్ప్రేక్షింపఁబడినది.

౨౦. గుణాభావఫలోత్ప్రేక్ష

చ. తెగువరియై చెలంగు భవదీయకృపాణము వైరికోటియం
దగణితదానకేళిరతమయ్యెను జీవనమీదటన్నలో
భగుణము లేమికిం బలె విపక్షనృపాలురకెల్ల జీవనం
బొగిఁ దృణవృత్తి నిచ్చు విజయోన్నత! శ్రీనరసింహభూవరా

రణసాహసియగు నీఖడ్గము వైరులయెడ దానకేళి (వితరణకేళి - ఖండనక్రియ) రతమయ్యెను, జీవనమును (ప్రాణమును) నీయదన్న లోభగుణము

లేకుండుటకుఁ (ఈతని ఖడ్గము దానకేళిరతమే కాని జీవనమునుమాత్రమీయదు దీనికి లోభగుణము కలదు అని లోకులనుచున్నారు. ఆ యప్రతిష్ఠ లేకుంటకు) గాఁబోలు శత్రురాజులకుఁ దృణరూపమున జీవనము నిచ్చుచున్నది (గడ్డికఱచిన వారినిఁ జంపరు).

ఇట శత్రురాజులకుఁ దృణవృత్తితో జీవనమిచ్చుటకు ఫలముగాని లోభగుణాభావము ఫలముగా నుత్ప్రేక్షింపఁబడినది

౨౧. ద్రవ్యస్వరూపోత్ప్రేక్ష

సీ. పటులేకానొకకొంత చాలదు పౌరుషం,
శాయుధప్రౌఢి యింతైనలేదు;
జననమెంచినఁ బ్రదోషంబు పాలౌట, మా
టికిఁబుట్టినట్టి చోటికినిఁ జేటు
నెఱిఁజిన్న వాని కెన్నికగానితన బల్మి;
ద్వేషిగన్నను నోఱుదెఱచుకొనుట;
పాటింప నోరి బొబ్బాటమేవడిగాని
ఘోరాజిలో బుసకొట్టుచుంట;
గీ. కొదువ దనకంచుఁ గ్రమ్మఱ నుదితుఁడైన
యల్ల నరసింహుఁడునబోలె నసమసమర
స్మరఘోరప్రతాపుఁడై చెలఁగుదోర
సరసగుణహార. యోబయనరస ధీర! ౮౯

"తొంటి నరసింహావతారమునఁ దనకుఁ గలిగిన పై కొదువలను దీర్చు కొనుటకుదయించిన యా నరసింహుఁడవో యన్నట్లున్నావు"

ఇట నరసభూపాలుఁడు 'నరసింహుఁడో యన్నట్లు' అనుచోట ద్రవ్యస్వరూపోత్ప్రేక్ష నరసింహపదము ద్రవ్యవాచకము.నిమిత్తము ప్రతాపగుణము;

౨౨. ద్రవ్యాభావస్వరూపోత్ప్రేక్ష

సీ. పొగడొందుచదలేటి పొందామరలఁ గోసి
శిరసుల నొఱపుగాఁ జెరువువారు
చవిదేల్చు కల్పకాసవరసంబులకుఁ దీ
[illegible]

వేల్పుఁగన్నియల నేవేళ దేశియంపు
బిట్టుచేఁతలఁ గాసిపెట్టువారు
అమరునేజాజల్లులగునని కేసితా
పసుల కూర్చము లూడ్వఁబఱచువారు

గీ నగుచు భవదసివిదళితయవననృపతు
లహరహము రాయిడియొనర్ప నమరపురము
వాసవుఁడు లేక్కై వడి వఱలుచుండు
నరనుతాటోప. యోబయనరసభూప!]

'స్వర్గము అవాసవముగా (వాసవుఁడు లేనిదిగా) నున్నది. అనుచోట ద్రవ్యాభావస్వరూపోత్ప్రేక్ష 'రాయిడి అను క్రియ నిమిత్తము

౨౬. ద్రవ్యహేతూత్ప్రేక్ష

కం. నరసింహా! యోబభూవరు
నరసింహ భవద్భుజాగ్రనటదసిచే భూ
పరిచితరాహువుచేఁబలె
నరితేజోబింబ మపహృతమయ్యెన్. ౬౦

నరసభూపాలా! నీ చేతికత్తిచే భూమికిదిగిన రాహువుచేతవలె శత్రు తేజోరూపమగు సూర్యబింబ మపహృతమైనది

ఇట శత్రుతేజోరూపమగు సూర్యబింబాపహరణమునకు హేతువుగాని రాహువు హేతువుగా నుత్ప్రేక్షింపఁబడెను తేజోఽపహరణము నిమిత్తము రాహువు ద్రవ్యవాచకము.

౨౮. ద్రవ్యాభావహేతూత్ప్రేక్ష

చ. స్థిరబల! యోవభూవరున్నృసింహా! భవన్నవకీర్తి భూనభోం
తరములనిండఁ దద్రుచివితానములోన విలీనమౌ సుధా
కరనిధిలేమిచేబలెఁ బ్రశాంత నిరంతరతావకాశయాం
తరసుఖవాసమంతె మురదానవభంజనుఁ డెల్లకాలమున్.

నరసభూపాలా నీకీర్తి భూమ్యాకాశముల నిండఁగా నా కాంతిసమూహములో దాఁగిననదగుటచే నమృతసముద్రము లేకుండటచేఁ గాఁబోలు శ్రీమహావిష్ణువు నీ హృదయమున వసించెను

శ్రీ మహావిష్ణువు నరసభూపాలుని హృదయమున వసించుటకు హేతువు గాని యమృతసముద్రాభావము హేతువుగా నుత్ప్రేక్షింపబడినది. అమృత సముద్రము ద్రవ్యము.

౨౫. ద్రవ్యఫలోత్ప్రేక్ష

సీ. సురేంద్రుండవయి రంజిలు నీ కుచితంబుగాఁగ నీ
రాజితకీర్తి యభ్రగజరాజయి యున్కిఁగాదె తారకా
రాజకరాంబుశీకరపరంపరలుం దెలిమబ్బుజల్లులుం
దేజముతో ధరించె సుదతీమకరాంక నృసింహభూవరా!

నీవు రాజేంద్రుఁడవు నీ కీర్తి నీ యింద్రత్వమున కుచితముగా నైరావతమగుటకుఁ గాఁబోలు నక్షత్రరూపశీకరసమూహమును దెల్లమబ్బులరూపమగు చామరములను ధరించెను.

కీర్తి తారకశీకరసమూహమును దెలిమబ్బుచామరములను వహించుటకు ఫలముగాని 'యైరావతమగుట' ఫలముగా నుత్ప్రేక్షింపఁబడినది ఐరావతము ద్రవ్యము

౨౬. ద్రవ్యాభావ ఫలోత్ప్రేక్ష

చ. తనరు నసంఖ్యవాజిగజదారుణమై తగు నాదుమ్రోల నేఁ
డెనిమిది సైంధవేభముల నీడుగఁ దాల్చుట యెట్లటంచు నా
కినుక నభంబు లేకునికికిన్ బలె శ్రీ నరసింహు జైత్రవా
హిని యనిలోన నింగికెగయించు నుదంచితరేణుపుంజముల్.

నరసభూపాలుని సైన్య మసంఖ్యవాజిగణములు గలిగియుండుటచే నాకాశము నాముందేఁడుగుఱ్ఱములను, (సూర్యాశ్వములు) ఎనిమిది యేనుఁగులను (దిగ్గజములు) దాల్చుట యెట్లు? అని యా యాకాశమును లేకుండఁ జేయుటకుఁ గాఁబోలు ధూళిని నింగికి విసరుచున్నది.

ఇట సైన్యము ధూళిని నాకాశమున కెగయఁజేయుటకు ఫలముగాని నభోఽభావము ఫలముగా నుత్ప్రేక్షింపఁబడినది. ఇది ద్రవ్యాభావము

ఇచ్చట నీ విమర్శమును దెలియవలెను – ఉత్ప్రేక్షయందుఁ బ్రకృత మప్రకృతధర్మసంబంధమును బట్టి యప్రకృతముగాఁ దాదాత్మ్యసంభావన చేయఁబడునని చెప్పితిమి స్వరూపోత్ప్రేక్షయందు మాత్రమే ప్రకృతాప్రకృతములు వివిక్తముగా నగపడును ఎట్లన "నీవా నరసింహుఁడవో" అన్నట్లున్నావు నీవు ప్రకృతము నరసింహుఁడు అప్రకృతము, కాని హేతుఫలోత్ప్రేక్షలలో హేతువుగాని దానిని హేతువుగా ఫలముగాని దానిని ఫలముగా, నుత్ప్రేక్షించుచున్నాము అట నప్రకృతమనఁగా, నుపమానముండనే యుండదు ఎట్లనఁ బై లక్ష్యములలోని జాతిహేతూత్ప్రేక్షోదాహరణమున "కళంకకాంతి నరసభూపాలుని కీర్తిచే నడఁగఁగా ముల్లోకముల మందస్మితమును హేతువుగాఁ జెప్పినాఁడు."

ఇటఁ బ్రకృతము కళంకమడఁగుట; అప్రకృతములేదు. అనఁగా నుపమానములేదు జాతిఫలోత్ప్రేక్షోదాహరణమగు "భుజమధ్యము విశాలమగుట ఫలము జయలక్ష్మికి రంగస్థలము కావలసి కాఁబోలు" ననఁగా ఫలముగాని దాని ఫలమునుగాఁ జెప్పెను భుజమధ్యము విశాలమగుట ప్రకృతము అప్రకృతము చెప్పఁబడలేదు కాన "బకృతమున కప్రకృతతాదాత్మ్యసంభావన ముత్ప్రేక్ష" అను లక్షణ మెట్లు సరిపోవును? అన్నచో వినుఁడు హేతుఫలోత్ప్రేక్షోదాహరణములలో, గూడఁదాదాత్మ్య సంభావనమే యుండవలెను ఎట్లన సరసభూపాలుని కీర్తిచే నడఁగిన కళంకమును త్రిలోకీమందస్మితముచే నడఁగిన కళంకముగాఁ దాదాత్మ్యసంభావన చేయవలెను ఇట్లే స్వభావసిద్ధముగా విశాలతను బొందిన భుజమధ్యమును జయలక్ష్మీరంగస్థలార్థముగా విశాలతను బొందిన భుజమధ్యముగాఁ దాదాత్మ్య సంభావన సేయవలెను ఈ హేతుఫలోత్ప్రేక్షోదాహరణములలోఁ గూడఁ బైవిధముగా ననఁగా స్వరూపోత్ప్రేక్షలోవలె రెండు విధములగు కళంకములకును రెండు విధములగు విశాలతలకును దప్పక తాదాత్మ్యము చెప్పుకొనవలెను ఇంద ప్రకృతమాక్షేప్యము

లింపతీవ తమోఽంగాని వర్షతీవాంజనం నభః (తమస్సు శరీరములను బూయుచున్నట్లున్నది, ఆకాశము చీఁకటిని వర్షించుచున్నట్లున్నది)

ఇటఁ దమోవ్యాపనరూపమగు ధర్మము తమోలేపనముగా నుత్ప్రేక్షింపఁబడుచున్నది ఇట్లే

పినష్టీవ తరంగాగ్రైస్సముద్రః ఫేనచందనం
తదాదాయ కరైరిందు ర్లింపతీవ దిగంగనాః

సముద్రుఁడు ఫేనచందనమును తరంగాగ్రములచే నూఁఱుచున్నట్లున్నాఁడు. చంద్రుదు దానినిఁగొని దిగంగనలకుఁ బూయుచున్నట్లున్నాఁడు

ఇటఁ బ్రేరణమే (ఫేనప్రేరణము) పేషణముగాఁగరవ్యాపనమే దిగంగనా లేపనముగా నుత్ప్రేక్షింపఁబడుచున్నది. అయితే వ్యాపన ప్రేరణాది పదములు లేవే యనవచ్చును ఉత్ప్రేక్ష యధ్యవసాయగర్భము గాన నతిశయోక్తియందు వలెనే విషయనిగరణము (ఉపమేయము గానరాకుంట) సంభవించునని గ్రహింప వలెను

మరియు నుత్ప్రేక్షాలక్షణపద్యమున "గుణక్రియాదియోగముచే" అని ప్రకృతమున కప్రకృత తాదాత్మ్యసంభావన సేయుటలో గుణక్రియాది నిమిత్తము లుండవలెనని చెప్పితిమి ఉదాహరణములందు గుణక్రియానిమిత్తములు మాత్రమే చూపితిమి ఆదిశబ్దముచే గ్రాహ్యమగునదేమి? అని శంక గలుగుచున్నదిగదా! గుణక్రియానిమిత్తము మాత్రమేకాక గుణాభావనిమిత్తము క్రియాఽభావ నిమిత్తముగూడ నొక్కొక్కచోట నుండును ఎట్లన

మనసి సంతమివ ప్రియమీక్షితుంనయనయోః స్పృహయాంతరుపేతయోః
గ్రహణశక్తిరభూదిదమీయయోరపి స సమ్ముఖవస్తుని వాస్తుని

(దమయంతికి) తనహృదయగత ప్రియునిఁ జూచుటకో యన్నట్లు మనస్సునఁ బ్రవేశించిన కన్నులకు సమ్ముఖమునందలి వస్తువుయొక్క గ్రహణ శక్తి నశించెను.

ఇట హృదయగతప్రియునిఁ జూచుటకు నేత్రములు లోపలఁ బ్రవేశించి నట్లుత్ప్రేక్షించుటకు బాహ్యవస్తుగ్రహణశక్త్యభావము నిమిత్తము (గుణాభావము నిమిత్తము)

వతంసనీలాంబురుహేణ కిం దృశా వికోకమానే వినమీఅభూవతుః
అపి శ్రుతీ దర్శనసక్తచేతసాం న తేన తే శుశ్రువతుర్మృగీదృశాం.

కర్ణావతంసమగు నల్లకలువ యను కంటితోఁ జూచుచున్నవేమో! చెవులు గూడా విమనస్కములు (మనస్సులేనివి) అయినవి కావుననే దర్శనాసక్తలగు నాయువతులకు నేమియు వినఁబడలేదు

ఇట శ్రోత్రేంద్రియగతమగు విలోకనైకాగ్రతను నుత్ప్రేక్షించుటయందు శ్రవణక్రియాఽభావము నిమిత్తము

ఇంకను నీ నిమిత్త మొక్కొక్కటియేకాక సముచ్చయముగాఁగూడా ననఁగాఁ బెక్కునిమిత్తములొక్కయెడలనే కానఁబడును ఎట్లన,

అవైమి హంసావళయో వలక్షాః త్వత్కీర్తి మూర్తేశ్చపలాః పులాకాః
ఉడ్డీయ యుక్తం పతితాస్స్రవంతీవేశంతభూతం చరితః ప్లవంతే.

తెల్లని హంసలను నీ కీర్తిపులాకలుగాఁ (శకలములు) దలఁతును, ఏలన, నవి గిరినదులందుఁబడి తేలియాడుచున్నవి.

హంసలను గీర్తిపులాకలుగాఁ దలఁచుటలో ధావళ్యగుణమును నీటిపైఁ దేలియాడుట యను క్రియయును (గుణక్రియలు రెండును) నిమిత్తములయ్యెను. ఇట్లే గుణాభావ క్రియాభావములును నొక్కొక్కచో నిమిత్తములు గావచ్చును

ఒక్కొక్కచో జాతి ద్రవ్యములును గూడ నిమిత్తములగును ఎట్లన ద్రోణస్సత్ర వితరిష్యతి భాగ్యలభ్యసౌభాగ్యకార్మణమయీముపదాంగిరిస్తే తద్వీపదీప ఇవ దీప్తిభిరోషధీనాం చూడామిళజ్జలదకజ్జలవర్మనీయః

ఇట ద్రోణాచలమును దీపముగా నుత్ప్రేక్షించుటలోఁ దత్ప్రరూఢములైన యోషధిదీప్తులును దానిపైఁగల జలదకజ్జలమును నిమిత్తము దీప్తికజ్జల పదములు జాతివాచకములు కావున జాతివాచకముగూడా నిమిత్తము గావచ్చును

నిశాసు మూర్ధ్ని స్ఫురతా యత్సౌధో రాజతీందునా
శ్రీకంఠో భక్తరక్షార్థం సన్నిధానం భజన్నివ.

రాత్రులందు శిరస్సున వెలుఁగుచున్న చంద్రునితో నా (బాణాసురుని) సౌధము భక్తరక్షణార్థము శ్రీకంఠుఁడు సన్నిధియం దున్నట్లున్నది.

ఇట బాణాసురసౌధమును శివుఁడుగా నుత్ప్రేక్షించుటకు శిరస్సున వెలుగు చున్న " చంద్రుడు ' నిమిత్తము చంద్రుఁడు ద్రవ్యవాచకము.

కావున గుణ క్రియలేకాక గుణాభావ, క్రియాభావములును నిమిత్తములుగాఁ నుండవచ్చును అవి సముచ్చయరూపమునఁగూడ నుండవచ్చును మరియు నిమిత్తము గుణక్రియారూపమునసేకాక జాతి ద్రవ్య రూపమున గూడ నుండవచ్చును.

ఇదంతయు ' ఆది ' పదముచే గ్రాహ్యము.

కం. ధర వాచ్యోత్ప్రేక్ష కుదా
హరణము లివి గొన్ని కడమ యన్యకృతులయం
దరయఁగఁదగు; గమ్యోత్ప్రే
క్ష రచింపఁగలేదు నేర్పుచాలమి నిందున్. ౬౪

గమ్యోత్ప్రేక్ష కుదాహరణము నిత్తుము ; కనుఁడు

కం. చెలికాఁడ నీదు డెందము
నెలవగుటం జెక్కుమంది నెలఁతలకందా
చెలి తన్నిముద్దుకొనని-
చ్చలుఁ దనలేమేని నతికృశంబొనరించున్.

"తన్నిముద్దుపెట్టుకోయన" అని యన్నచో వాచ్యమగును అది లేమిని గమ్య. కావ్యప్రకాశకారుఁడు దీనిని వ్యంగ్యోత్ప్రేక్షగానే యుదాహరించెను

గమ్యోత్ప్రేక్షా, వ్యంగ్యోత్ప్రేక్షల భేదమును చిత్రమీమాంసాకారుఁడు దెలిపిన దానిని ద్వితీయాశ్వాసమున ౧౨౪ పద్యముక్రింద వ్రాయఁబడినది. చూచుకొనవలెను.

౧౭. అతిశయోక్తి

కం॰ ఉపమేయ మింత తడవక
యుపమానమె నుడువ నతిశయోక్తి కవిమహో
నిపుణోక్తి మూలమై తగు
నపరిమితప్రౌఢి నదియు నైదువిధములై. ౯౬

ఉపమేయము నధఃకరించి యనఁగా విషయనిగరణముసేసి యుపమానమును మాత్రమే చెప్పుట నతిశయోక్తి అది కవిప్రౌఢోక్తిప్రధానము. (కవిమహానిపుణోక్తి మూలము). అది పంచవిధము

విషయనిగరణమన విషయమును జెప్పకుండుటగాదు విషయమును నధఃకరించుట మాత్రమే "విషయస్యాఽనుపాదానేఽప్యుపాదానేఽపిసూరయః అధఃకరణమాత్రేణ నిగీర్ణత్వం ప్రచక్షతే" (విషయమును జెప్పినను జెప్పకున్నను ననఁగా బ్రయోగించినను బ్రయోగింపకున్నను నధఃకరించుటవలననే నిగీర్ణత్వము (నిగరణము) సిద్ధించును అనఁగా విషయనిగరణమన విషయమునకు (ఉపమేయమునకు) విషయిచే (ఉపమానముచే) అపకర్షమును దోఁపజేయుట. ఇట్టి విషయనిగరణముత్ప్రేక్షయందును, నతిశయోక్తియందునుగూడ నుండును. ఎట్లన, " ముఖమునకు జంద్రుఁడని శంకించుచున్నాను." అనుచో విషయమగు (సాటిలేని ముఖమునకు విషయియగు చంద్రునిచే న్యూనత్వ తోఁచుచున్నది ఈ న్యూనత్వము 'శంకించుచున్నాను అనుదానిచేఁ గలుగుచున్నది చంద్రుఁడిది' అన్నపు డతిశయోక్తిలోఁగూడ విషయమగు ముఖమునకు విషయియగుచంద్రునిచే న్యూనత్వము తోఁచుచున్నది ఎట్లన విషయిని మాత్రమే గ్రహించి విషయమును గ్రహింపకధఃకరించెను పైని విషయము గ్రహింపఁబడినను 'శంకించుచున్నాను అను పదముచే న్యూనత్వము సంభవించుచున్నది.

కావున నుత్ప్రేక్షయందును నతిశయోక్తియందును విషయాధఃకరణము సమానమే. రెండును నధ్యవసాయగర్భములే ప్రకృతితో నప్రకృతమున కభేదప్రతిపత్తియే రెంటియందును గలుగును. అట్లయినచో భేదమేమనవచ్చును. వినుఁడు ఉత్ప్రేక్షలో నధ్యవసాయము సాధ్యము అతిశయోక్తిలో నధ్యవసాయము సిద్ధము అనఁగా నుత్ప్రేక్షయందు ముఖమునుజూచి 'నూనంచంద్రః'

(బహుశః చంద్రుఁడే యయియుండును.) అనుచో విషయి (ఉపమానము) అని శ్చితముగా నిర్దేశింపఁబడుటచే నధ్యవసాయము సాధ్యము. అనఁగా నిట విషయము విషయిగా నిశ్చయింపఁబడలేదు అతిశయోక్తిలో (చంద్రోఽయం) విషయము విషయిగా నిశ్చయింపఁబడుటవలన నధ్యవసాయము సిద్ధము.

గీ పరఁగ సంబంధమందసంబంధమనఁగ
మఱి యసంబంధమందు సంబంధమనఁగ
భేదమందు నభేద; మభేదభేద
భావమును; గార్యహేతువిపర్యయమును ౯౪

సంబంధమున్నను లేకున్నట్లు చెప్పుట, సంబంధములేకున్న చెప్పుట, భేదమున్నను లేనట్లుచెప్పుట, భేదములేకున్నను నున్నట్లుచెప్పుట కార్యకారణ భావముయొక్క విపర్యయము (తలక్రిందులు) చెప్పుటయని యతిశయోక్తి పంచవిధము.

౧. సంబంధాసంబంధాతిశయోక్తి

మ. అలఘుప్రౌఢిమ్ము నీదు దానవిభవం బాలించి యాలించి ని
చ్చలు దానస్ఫురణంబడంగె సురభూజశ్రేణికిం; గల్గెనా
బలభిద్వారణగండకాషకలనప్రత్యగ్రలగ్నాధిక
జ్వలదానంబొకవేళఁగల్గు, నరసత్క్ష్మాపాలచూడామణీ ౯౫

నీ దానవైభవమును విని కల్పవృక్షములకు దానవైభవ మడఁగెను ఒక వేళఁ గలిగినను నైరావతము దన గండస్థలమును దాచుకొనుటచే నంటుకొన్న దానమే (మదము) కలుగును

కల్పవృక్షములకు దానసంబంధమున్నను (దానముగలిగియున్నను) నసంబంధము వర్ణింపఁబడినది

కం సుదతీ! అనుక్షణంబును
నెదుగుకొనుచువచ్చు నీదు నీ చన్గవ కె
య్యది చాలినంత దేశము
త్వదీయకరలతల నడిమిభాగమునందున్ ?

చనుఁగవకు వలసినంత పదేశమున్నను లేనట్లు వర్ణింపబడినది ఇదియు సంబంధాసంబంధాతిశయోక్తియే.

౨ అసంబంధసంబంధాతిశయోక్తి

ఉ. చందనశైలసానువులఁ జాలఁ దెలుంగు భుజంగబాలికా
బృందము శ్రీనరసింహవిభుఁ బేర్కొనిపాడఁ దదీయగానని
ష్యందములాను వేడ్కఁ బెరయంగఁ గురంగతురంగ మేఁగమిన్
మందగతిప్రసంగములు మానవు దక్షిణగంధవాహముల్.

మలయపర్వతసానువులందు నాగకన్యలు నరసభూపాలునిఁ గూర్చిపాడు చుండఁగా నా గానరసము ద్రాగు కోరికతోఁ దన వాహనమైన కురంగము నడవ కుండుటవలన దక్షిణమారుతము మెల్లఁగా నడచుచుండెను.

కురంగములకు నాగకన్యల గానరసము ద్రాగుకోరిక లేకున్నను నున్నట్లు చెప్పఁబడినది. కాన నసంబంధసంబంధాతిశయోక్తి

౩. భేదాభేదాతిశయోక్తి

కం అగునొకటి కర్ణభూషణ
మగునొక్కటి కర్ణవైరి; హరిచందనపుం
జిగురును నీచేఁజిగురును
బొగడొందుట కిదియె భేదము, నృసింహనృపా? ౧౦౦

హరిచందనపల్లవము కర్ణభూషణము నీ హస్తపల్లవము కర్ణవైరి ఇదియే భేదము అనిభావము, ఇట గర్ణద్వయమునకు భేదమున్నను నభేదము చెప్పఁబడినది (శ్లేషచే) దీనికి మూలమిది

పల్లవతః కల్పతరోరేష విశేషః కరస్య తే వీర।
భూషయతి కర్ణమేకం పరస్తు కర్ణం తిరస్కురుతే॥

అను శ్లోకమునకుఁ బైపద్య మనువాదము. ఈశ్లోకమును వ్యతిరేకాలంకారమున కుదాహరణముగాఁ గువలయానందకర్త యిచ్చియున్నాఁడు ఇది యిట నుదాహరణార్హము గాదు ఈ క్రిందిపద్య ముదాహరణీయము

చ. విలసిలు బావియొండు వినువీధిని, నాపయిఁ బైఁడిమెట్లలో
మలఁచిన యింద్రనీలమయమార్గముగ్రాలుఁ, దదగ్రమందు వ
ర్తిలును గిరిద్వయం; బది సుకృజ్జనగమ్యము చందనాంక; మా
స్థలనము కేగ లక్ష్మి మమృతంబు సుధానిధియుంటఁ జెంగటన్.

మధ్యభాగమందలినాభి,వళులు,వానిలోనున్న నూఁగారు స్తనములు చందన లేపము అధరామృతము, ముఖము అను ప్రకృతములు చెప్పఁబడక వానితో సంబంధించిన యప్రకృతములు మాత్రమే చెప్పఁబడినవి. వాస్తవముగాఁ బ్రకృతాప్రకృతములకు భేదమున్నను గవిప్రౌఢోక్తిచేఁ బ్రకృతము చెప్పఁబడక తద భేదముగా నప్రకృతమే చెప్పఁబడినది. దీనినిఁ గువలయానందకారుడు రూప కాంతిశయోక్తియనెను ఈ భేదమున విషయనిగరణము చేయఁబడును టీని నాంగ్లమున 'Antonomasia అందురు.

౪. అభేదభేదాతిశయోక్తి

సీ. అమృతమూర్తికిఁ గళంకావాప్తియెట్లని
మిహికాంశునిఁ గళంకరహితుఁజేయ
లోకబాంధవునకుగ్రాకారమెట్లని
భానుఁబార్వణశీతభానుఁజేయఁ
మృత్యుంజయునకేల మెడచుట్టు విసమని
గరళకంఠుని సితకంఠుఁజేయఁ
దలపోయ నఱవైన దాతకిమాలివ్య
మనుచితంబని ఘనునమలుఁజేయ

గీ మహితభవదీయసత్కీర్తి మధురవిధుర
వక్రమగు బ్రహ్మసృష్టి నతిక్రమించి
కమలజాండకరండంబుఁ గడచి వెడలె
వైరిగజసింహ! యోబయనారసింహ! ౧౦౧

అభేదమున్నను భేదము చెప్పినచో నది అభేదభేదాతిశయోక్తి యనఁ బడును. నరసరాజు కీర్తి బ్రహ్మసృష్టి కన్న భిన్నముగాకున్నను భిన్నమైు నట్లు (అతిక్రమించి...కడచివెడలె) వర్ణింపబడినది. కానీ క్లిష్టముగానున్నది)

ఈ కింది పద్య ముదాహరణీయము.

కం. ఆ యందం బా చందం
బా యా నెఱజాణతనము లామాటతనం
బేయడఁగన మా సుందరి
యాయజు సామాన్యసృష్టి యగునే తలఁవన్ ?

లోకములోని యితర స్త్రీల సృష్టికిని ఆ సుందరి సృష్టికిని భేదము లేకున్నను భేదమున్నట్లు చెప్పఁబడినది.

మనము లోకములోఁ గొంచెము విలక్షణముగా నున్నవానినిఁ గూర్చి 'వాని తరహా వేఱు వాని కథ వేఱు అని యీ విధముగా వేఱు వేఱు అని చెప్పుదుము ఈ భేదములో నానిధముగాఁ జెప్పవలెను. ప్రకాశకారుఁడు 'ప్రకృతస్య యదన్యత్వం' అని యీ భేదమునకు లక్షణము చెప్పెను

పై పద్యమున 'ప్రకృతస్య యదన్యత్వం' అను లక్షణము క్లిష్టముగాఁ బట్టును

౫. కార్యకారణవిపర్యయరూపాతిశయోక్తి

సీ. వెస నీప్రతాపాగ్ని దెసలఁబర్వకమున్నె
పొరయు శాత్రవరాజపురవరంబు
లలపురంబుల ధూమమగ్గలింపకమున్నె
ప్రబలు వైరికళత్రబాష్పవితతు
లలజలంబులు ధాత్రినవఘళింపకమున్నె
క్రేళ్ళుబ్బు వారి యకీర్తిపంక
మాపంకసంకరంబంకురింపకమున్నె
పొడమునసత్కీర్తిపుండరీక

గీ. మవ్వుర! కవిబుధశుకపికనినవానిరత
ఫలితసురుచిరసురతరుపటిమఘటన
కలితకరతలకుసుమితకరజనికర
గరిమ మనుబోచిరాతోబఘునృసింహా! ౧౦౨

నీ ప్రతాపాగ్ని దెసలఁ బ్రాఁకకమున్నే శత్రురాజపత్తనములు పొగ లెత్తును ఆ ధూమమతిశయింపకమున్నే శత్రురాజుల భార్యలకుఁ గన్నీళ్ళూరును. ఆ నీరు నేలపైఁ బడకముందే నేల (వారి) యపకీర్తి బురదతో నిండును బురద యేర్పడకముందే నీ కీర్తి పుండరీకము మొలచును.

అగ్న్యాదులు కారణములు, ధూమాదులు కార్యములు. కారణము పూర్వభావి కార్యము తరభావి. కాని యిటఁ గారణములకన్నఁ గార్యములు ముందు జరిగినట్లు కవి ప్రౌఢోక్తిచే వర్ణింపఁబడినది.

అతిశయోక్త్యలంకారమునకు 'వక్రోక్తి యనియు వేరొకపేరు. ఇదిలేని యలంకారముండదు ఉపమాలంకారమునఁ గూడ నతిశయోక్తి యుండును. "ముఖము చంద్రునివలె నున్నది" అన్నపుడు చంద్రునివలె నిజముగానున్నదా? లేదు అతిశయము సేసి చెప్పుచున్నాము. కాన నతిశయోక్తి గర్భితమైయున్నది.

ఎల్లయలంకారములకును నతిశయోక్తిమూలమని మమ్మటాదులును ఉపమాలంకారము మూలమని వామనాదులును చెప్పుదురు. ఇది సర్వాలంకార బీజభూతము. మఱియును 'శ్లేషః పుష్ణాతి సౌభాగ్యం ప్రాయో వక్రోక్తిషు స్థితం' తలచుగా సర్వాలంకారములందును నున్న సౌభాగ్యమును శ్లేష పోషించును అని యున్నది కాన శ్లేషస్పర్శచే సర్వాలంకారములకును సౌందర్యము హెచ్చును. దీనికాంగ్లమున 'Hyperbole' అని పేరు

౧౩. సహోక్తి

క. నిపుణత ముఖ్యాన్వితమౌ
నుపమేయంబును సహార్థయోగాన్వితమౌ
నుపమానంబును బెరసినఁ
బ్రపంచితంబగు సహోక్తి రహినెట్లన్నన్ ౧౦౩

ఉపమేయమునకు (క్రియతో) ముఖ్యాన్వయమును (శబ్దాన్వయము) ఉపమానమునకు సహార్థసంబంధముతో నముఖ్యాన్వయమును (అర్థాన్వయము) గలిగినయెడల సహోక్తి మఱియు నుపమాలంకారమున నుపమేయోపమానములు ప్రాకరణికాప్రాకరణికములు మఱియు నందలి యౌపమ్యము ప్రసిద్ధము సహోక్త్యలంకారమున నుపమానోపమేయములు రెండును బ్రాకరణికములే అందలి యౌపమ్యము కల్పితము ఈ సహోక్తి కార్యకారణవిపర్యయరూపమగు నతిశయోక్తియే మూలముగాఁ గలది. అప్పుడే యది చారుత్వహేతువు

సీ. నానారిభూనాథసేనాతతులతో నె
కటకముల్ దూఱు నీపటహారవము
శీతారిజాతాసువాతావళులతో నె
దివికేగు నీచమూభవరజంబు
వీరాళివీరారిఘోరాంగములతో నె
వడఁకు నీకరతలోజ్జ్వలకృపాణ
మస్తారిమస్తాగ్రవిస్తారములతో నె
నఱిఁ జెందుఁ బావకోన్నతశరాస

గీ. మహితనృపరాజ్యలక్ష్మీమృగాక్షితో నె
వేడ్కనినుఁ జెందు సంగ్రామవిజయలక్ష్మి
అనఘశిరపోచిరాజవంశాబ్ధిచంద్ర.
వరనుతాటోప యోబయనరసభూప!

పటహరవము కారణము సేనాపతులు కటకముల దూఱుట కార్యము ; చమూరజము కారణము, అసువాతములు దివికేగుట కార్యము. కృపాణము కారణము శాత్రవాంగములు కంపించుట కార్యము శరాసనము కారణము; అరి మస్తకనతి కార్యము, కారణకార్యములకుఁ బౌర్వాపర్యము లోకమునఁ బ్రసిద్ధము, అయినను నిట నతిశయోక్తిచే సమకాలికత్వము చెప్పఁబడినది ఇటఁ బ్రథమాంతములగు పటహరవాదులు క్రియలతో ముఖ్యాన్వయమును (సాక్షాద్భావాన్వయము) సేనాపతులు మొదలగు పదములు (తృతీయాంతములు)సహార్థ సంబంధముతో నార్థాన్వయమును బొందుచున్నవి.

శ్లేషభిత్తికాభేదాధ్యవసాయమూలకమగు సహోక్తియుఁ గలదు ఎట్లన

"కుముదదళై స్సహ విఘటంతే చక్రవాకమిథునాని", చక్రవాక మిథునములు కుముదదళములతో విఘటనమును (వియోగము-విచ్చుటను) బొందుచున్నవి. ఇట విఘటనము' అను పదము శ్లిష్టము. రెండర్థములకును నభేదాధ్యవసాయము శ్లేషభిత్తిక యన శ్లేషమూలముగాఁ గలది

ఈ సహోక్తి మాలారూపముగఁ గూడఁ గలదు.

ఉత్క్షిప్తం సహ కౌశికస్యపులకైః ; స్సార్ధం ముఖైర్నామితం
భూపానాం జనకస్య సంశయధియా సార్థం సమాస్ఫాలితం
వైదేహ్యా మనసా సమం తదధునాకృష్టం తతోభార్గవ
ప్రౌఢాహంకృతికందళేన చ సమం భగ్నంతదైశం ధనుః.

విశ్వామిత్రుని పులకలతోఁగూడ నెత్తఁబడినట్టియు, రాజుల ముఖములతోఁ గూడ వంపఁబడినట్టియు జనకుని సంశయబుద్ధితోఁ గూడ నాస్ఫాలితమైనట్టియు సీతాదేవి మనస్సుతోఁగూడ నాకర్షింపబడినట్టియు పరశురాముని యహంకారాంకురముతోఁ గూడ నా శివధనుస్సు భగ్నమయ్యెను.

౧౪ వినోక్తి

కం. సంబంధిఁబాసి మఱియొక
సంబంధికిఁజారుతయునచారుతయుం, బ్రా
ప్తంబుగఁ బ్రజ్ఞాధికుల మ
తంబున నదియగు వినోక్తి ధర నెట్లన్నన్. ౧౦౫

ఒకదానినిఁ ద్యజించుటవలన వేఱొకటి సుందరముగాఁగాని యసుందరముగాఁ గాని యుండునట్లు చెప్పిన చో వినోక్తి.

ఉ. క్రూరత లేనిచూపు, నెలకొన్న వికారములేనిరూపసం
కారము లేనియేపు, కలకాలము వేసటలేనిప్రాపు, సం
ప్రేరితయంత్రమీనతనుభేదమునన్ సరిలేని తూపు, ని
ద్దారుణిని కెపొల్చుగుణధామ! నృసింహనృపాల శేఖరా! ౧౦౬

క్రూరత్వాదులులేని చూపు మొదలగునవి సుందరములుగా వర్ణింపబడినవి.

కం. కవిలేని రాజకీర్తియు,
రవిలేనినభంబు, రూపరసభావములం
జవిలేని భామపొందును,
రవలేని విభూషణంబురహి నరసింహా! ౧౦౭

కవి మొదలగు లేని రాజు కీర్తి మొదలగునవి యసుందరములు
ఈ వినోక్తి సహోక్తికిఁ బ్రతిద్వంద్వి.

౧౫. సమాసోక్తి

కం. ప్రకృతము విశేషణంబులు
సకలంబును సామ్యధర్మసహితములై య
ప్రకృతముఁ దలఁపింపఁగనది
యకృతిసమాసోక్తియయ్యె నదియెట్లన్నన్. ౧౦౮

ప్రకృతముయొక్క విశేషణముల సామ్యమునుబట్టి యప్రకృతార్థము దోఁచునేని నది సమాసోక్తి.

కం. కలకంఠరుతులఁబిలుచును,
ఫలములఁ జవిఁజూడుఁడనుచుఁ బదములఁబెనఁగున్,
బలమఱిపఱచుభవద్రిపు
లలనాతతిఁగాంచి వింధ్యలతలు నృసింహా? ౧౦౯

వింధ్యపర్వతమునందున్న లతలు పరుగిడుచున్న నీ శత్రుకాంతలను జూచి కలకంఠరుతులఁ బిలుచును (తమపైఁ గూర్చున్న కలకంఠములయొక్క రుతములతోఁ బిలుచును.) తమ ఫలములను జవిఁజూడుఁడనుచుఁ బదములకడ్డము పడి పెనఁగులాడును."

ఇట "కలకంఠరుతులఁ బిలుచును; ఫలములఁ జవిఁజూడుఁడనుచుఁ బదములఁ బెనఁగున్" అను నెడ నచేతనములగు లతలయందుఁ జేతనధర్మ మారో

పింపఁబడినది దానిచే నప్రకృతమగు పుత్త్రజనములాతిథ్యమిచ్చుటకై త్రిమ్మ మాలుచున్న వృత్తాంతము దోఁచుచున్నది.

ఈ సమాసోక్తిలో నప్రస్తుత వృత్తాంత (వ్యవహార) సమారోపముండును అదియే జీవితము అనఁగాఁ జారుతా హేతువు అదిలేకున్న సమాసోక్తియేలేదు.

సమాసోక్తియం దప్రస్తుతవ్యవహారసమారోపమును రూపకమున నప్రస్తుతరూప సమారోపమును నుండును ఎట్లన, 'కలకంఠరుతుల' అను పై పద్యమున నప్రస్తుత వ్యవహార సమారోపమును జూపితిమి. ఇది సమాసోక్తి. 'ముఖము చంద్రబింబము అను రూపకమున ముఖమునఁ జంద్రబింబత్వమే యారోపింపఁబడుచున్నది పైదానియందువలె వ్యవహారసమారోపము లేదు. అప్రస్తుతరూపమే యారోపింపఁబడినది.

ఈవిశేషణము శ్లిష్టముగా సాధారణముగా (ప్రస్తుతాప్రస్తుతసాధారణము) నుండవచ్చును. 'కలకంఠరుతుల' ఇత్యాదిస్థలమున శ్లిష్టము. సాధారణమున క్రింది దుదాహరణము

చ. చనుఁగవ తాండవింప జడ సళ్ళఁగ, నూఁగఁగ ముత్తెపున్సరుల్,
కనకపుఁగమ్మలాడఁ జెవులన్ మిఱుమిట్లుగఁ, జెమ్మగిల్ల నా
ననముఁ, గరప్రహారము లొనర్చుచు మిక్కిలి యూర్చుకొంచు ని
వ్వనిత కరంగుఁ; గందుకమ భాగ్యమనంగను నీదెపో! భువిన్

ఇట విశేషణములచేఁ బురుషాయితప్రసక్తయగు నాయికావృత్తాంతము దోఁచుచున్నది.

ఈ సమారోపము నాలుగు విధములు. ౧ లౌకికవస్తువునందు లౌకిక వస్తుసమారోపము ౨ లౌకికవస్తువునందు శాస్త్రీయవస్తుసమారోపము ౩ శాస్త్రీయవస్తువునందు శాస్త్రీయవస్తుసమారోపము. ౪ శాస్త్రీయవస్తువునందు లౌకికవస్తుసమారోపము కావ్యములందు లౌకికవస్తువునందు లౌకికవస్తు సమారోపమే హృద్యమగుట మిగిలినవి కామి నని యుదాహరింపఁబడవయ్యెను. వలసినచోఁ బ్రతాపరుద్రీయమునఁ జూచుకొనవలెను.

సమాసోక్తిదోషము

సమాసోక్తియందు శ్లిష్ట సాధారణ, విశేషణములవలననే వాగ్రూపముగాఁ జెప్పఁబడకున్నను నౌపమ్యము స్ఫురించును. అట్టిచో వాగ్రూపముగా నౌపమ్యమును వచించుట యపుష్టి లేక పునరుక్తియను దోషమగును. ఎట్లన

స్పృశతి తిగ్మరుచౌ కకుభః కరైర్దయితయేవ విజృంభితతాపయా
అతనుమానపరిగ్రహయా స్థితం రుచిరయా చిరయాయిదినశ్రియా.

సూర్యుఁడు దన కరములచే దిక్కులను స్పృశింపఁగా గ్రీష్మదివసశ్రీ తాపము విజృంభింప నధికమైన మానమును గ్రహించిన దయితవలెనయ్యెను.

ఇట తిగ్మరుచి' శబ్దముచే నాయకత్వమును 'దిక్కులు' అను శబ్దముచే నాయికాత్వమున గోచరించినట్లు 'గ్రీష్మదివస శ్రీ' శబ్దముచేఁ బ్రతినాయికాత్వము గోచరించుచునే యున్నది అనఁగా గ్రీష్మదివసశ్రీ ప్రతినాయికవలె నున్నదని వ్యక్తమగుచున్నది అట్టిచో దయితయేవ' అని వాగ్రూపమగు నౌపమ్యమును వచించుట యపుష్టి లేక పునరుక్తి

౧౯. వక్రోక్తి

క. వేఱొక వివక్షఁబలికిన
చారూక్తిశ్లేషకాకు సంబంధముచే
వేఱొక యోజనదెచ్చిన
నారయ వక్రోక్తియయ్యె నదియెట్లన్నన్ ౧ ౧

ఒక యభిప్రాయముతోఁ బలికిన వాక్యమునకు శ్లేషసంబంధముచేఁగాని కాకుస్వరసంబంధముచేఁగాని మఱొక యభిప్రాయమును × లిగించుట వక్రోక్తి వక్రోక్తియన నుక్తివక్రత వక్రత యన వైచిత్ర్యము. ఉక్తివైచిత్ర్యము వక్రోక్తి ఎల్ల యలంకారములందును నుక్తివైచిత్ర్యముండునుగదా దీని యందుఁ గల విశేషమేమి ? అన్నచో మిగిలిన యలంకారములలో నిట్టి వైచిత్ర్యములేదు ఇది విలక్షణము ఈ వక్రోక్తి శ్లేషవక్రోక్తి. కాకువక్రోక్తి యని యిఱుఁదెఱఁగులు.

శ్లేషవక్రోక్తి

ఉ ఇంతి! భవన్మనోబ్జగతుఁడెవ్వ? డినుం; డినుఁడైనఁ బద్మినీ
కాంతుఁడొ? రాజశేఖరుఁడుగా నితఁడాతఁడుగాఁడు ; రుద్రుఁడో
కాంత లలాటలోచనుఁడుగాఁడు నృసింహుఁడు,మాధవుండొ? ని
న్నింతట మెచ్చితింజెలి! నిజేశుఁడుమాధవుడొ శుభాకృతిన్.

చెలికత్తె నాయికను "ఇంతి ... ఎవ్వఁడు ?" అని ప్రశ్నించినది నాయిక "ఇనుఁడు" అని ప్రత్యుత్తరించినది. 'రాజు' అని నాయిక యభిప్రాయము. చెలికత్తె ఇన శబ్దమునకు శ్లేషను దీసి 'సూర్యుఁడా ? అని యడిగినది. ఇట్లే రాజశేఖర (రాజేంద్రుఁడు - శివుడు) నరసింహ (నరసభూపాలుడు - శ్రీవిష్ణువు) పదములకును భిన్నార్థయోజనము దెలియవలెను.

ఈ శ్లేషవక్రోక్తి ప్రశ్నోత్తరరూపముగా నుంటయే సౌందర్యావహము. ఇట్లే.

చ.॥ అపరిమితానురాగసుమనోఽలసయై చికురాకుచేతులం
దపసినిఁ గౌఁగిలించె వనితా యిదె రంభ; దలంప రంభ తా
నపరిమితానురాగసుమనోఽలసయై చిగురాకుచేతులం
దపసినిఁ గౌఁగిలించు టుచితంబెగదా యని నవ్వె రంభయున్

ఇందును ప్రశ్నోత్తరరూపముననే శ్లేష వక్రోక్తి నిబద్ధమయ్యెను.
కాకువక్రోక్తికిం దుదాహరణములేదు చూపుదుము.

గురుజనపరతంత్రతయా దూరతరం దేశముద్యతో గంతుం
అలికులకోకిలలలితే నైష్యతి సఖి ః సురభిసమయేఽసౌ

గురుజనపరతంత్రుఁడగుటచే దూరదేశమునకుఁజనఁబూనియున్న యీ నా ప్రియుఁ డలికులకోకిలలలితమైన వసంతమున సఖీ రాఁడు.

నాయకుఁడు ప్రవాసమునకుఁ జనుచుండ నాయికయొక్కయు దాని సఖి యొక్కయు వచనప్రతివచనములు నాయిక యీ పద్యమున "రాఁడు"(నైష్యతి) అను నర్థమును దెలుపఁగా సఖి 'రాఁడు ?' అను కాకుస్వరముచే రాఁడా అనగా "వచ్చును" అను నర్థమును యోజించుచున్నది ఇట 'నైష్యతి' అను నాకే పదము నాయిక యొక యర్థమునఁ బ్రయోగింప సఖి యన్యార్థమున దానినే ప్రయోగించెను

ఈ శ్లోకమే నాయికావచనమును సఖీప్రతివచనము నగును
ప్రకాశకారుఁ డీ వక్రోక్తిని శబ్దాలంకారముగాఁ బరిగణించెను

౧౭. స్వభావోక్తి

కం సహృదయహృదయంగమమై
మహినున్నది యున్నయట్లు మాటలచేతల్
బహుళంబులుగాఁ జెప్పిన
మహితోక్తియె జాతియయ్యె మహినెట్లన్నన్. ౧౧౨

కేవల మున్నదున్నట్లుగా వర్ణించినచో స్వభావోక్తిగాదు. అది సహృదయ హృదయంగమముగా నుండవలెను. హృదయంగమత్వము ప్రతిభాలభ్యము. కావుననే

దీర్ఘపుచ్ఛశ్చతుష్పాదః కకుద్మాన్ లంబకంబలః
గోరపత్యం బలీవర్దస్తృణమత్తి ముఖేన సః.

అనునది స్వభావోక్తి గాదని తెలిపితిమి.

బాలకాదులయొక్క క్రియలను రూపములను నున్నవున్నట్లుగా వర్ణించుట స్వభావోక్తి క్రియ యనఁగా చేష్ట రూపమనఁగా నీలపీతాది వర్ణమును ఆకారమునునగును. కావున బాల, యువతి, ముగ్ధ, కాతర తిర్యగ్గ్రాంత హీనపాత్రాదులయొక్కచేష్టలును రూపమును ఆకారమును హృదయంగమముగా నున్నవున్నట్లుగా వర్ణించుట స్వభావోక్తి మొత్తముమీఁద దేనియొక్క కాని యసాధారణధర్మ వర్ణనము స్వభావోక్తి యని నిష్కృష్టార్థము దీనిని జాత్య లంకారమని ప్రాచీనులు వ్యవహరించిరి

సీ. తలచూపి మోసులై త్రాసులై తలకెక్కి
నిక్కి నక్కులవలె నెరసి బెరసి
గెఱకట్టి కళుకులై కెరలి పోఁకంతలై
వింతలై చెంతల విరివిఁజెంది
తగి దొట్టి మిట్టలై బిగువులై బుడగలై
మొగడలై నిగనిగ న్నిగలనెగడి
కొనలుబ్బి గబ్బులై గుబ్బలై యపరంజి
కుండలై కొండలై దండనించి

గీ. దొరసి యొండొంటినొరసి క్రిక్కిఱిసి మెఱసి
యగణితస్ఫూర్తి మొగమునకెగయు నీదు
వలుఁదవలిగుబ్బచన్నులో వలపులాఁడి!
నేఁడు నరసింహు కౌఁగిట నెఱపఁగలిగె. ౧౧౪

ఇందుఁ గ్రమమైన స్తనముల యెదుగు వర్ణింపఁబడినది. ఇది క్రియ

భామహుఁడీ స్వభావోక్తి నలంకారముగా గణింపలేదు అతఁడువక్రోక్తి లేకున్న నలంకారత్వమే లేదనెను. స్వభావోక్తియందు వక్రోక్తిలేదు కాన నలంకారము కాఁదట కాని దండి దీని నలంకార పరిచ్ఛేదమునఁ బ్రథమ ముననే గణించెను మఱియు దీనిని జాతి గుణ, క్రియా ద్రవ్యభేదములచే చతుర్విధముగా వర్ణించెను ఎట్లన

జాతిస్వభావోక్తి

గీ. హరితకోమలపత్రంబులగుచుఁ దుండ
పంక్తి యాతామ్రకుటిలమై భాసిలంగఁ
మెడలు మువ్వన్నెబాఱల మెరయుచుండ
శుకము లవి మంజులోక్తులై శోభిలెడిని.
ఇట శుకజాతి వర్ణితము.

క్రియాస్వభావోక్తి

గీ. కన్నులాఘూర్ణితంబులై క్రాలఁగాఁ, గ
లక్వణిత గర్భమైన గళంబుతోడఁ
బ్రీతిఁ బారావతంబు పరిభ్రమించి
ప్రణయినిన్ ముద్దిడుకొనె రిరంసతోడ.

పారావతముయొక్క చుంబనక్రియ వర్ణితము. మఱొక యుదాహరణము

శా. మోఁకాలొత్తి, పిఱుందులన్ మడమలన్ మోపించి, ముందద్ద మా
లోకంబుఁ బొనరించుచుం గుచగిరుల్ త్రుళ్ళాడఁ గేలెత్తుచుం
బైకిన్ వ్రాల్చుచు మ్రోఁగ గాజులు గురుల్ నానాగతిం దువ్వుచున్
ఆ కన్యామణి కట్టుచుండె ముడియో? అస్మచ్చలచిత్తమో

నా అమృతకణములు

గుణస్వభావోక్తి

గీ అంగములయందు బద్ధరోమాంచమగుచుఁ
జిత్తమునయందు నిర్వృతిఁ జేయుచుండి
నయనయుగమునకామీలనంబుఁ గూర్చి
వర్తిలుచునుండెఁ బ్రేయసీస్పర్శ మహహ

ఇట స్పర్శరూప గుణస్వభావము వర్ణితము.

ద్రవ్యస్వభావోక్తి

కం గరళము గళమునఁ దనరఁగఁ
గరమందుఁ గపాల మొప్పఁగా శశధరశే
ఖరుఁడగు వృషధ్వజుం డిదె
యరుణస్నిగ్ధజటలఁ జెలువై పొడగట్టెన్

ఇట వృషభధ్వజ రూప ద్రవ్య స్వభావవర్ణనము చేయఁబడినది

ఈ నాల్గింటిలోఁ గ్రియాస్వభావోక్తి వర్ణనమే హృదయంగమము. మిగిలినవి తరువాతివి ఇతరాలంకారికులు క్రియా రూప వర్ణనము స్వభావోక్తి యనిరని తెలిపితిమి. దండిభేదములును నీ భేదములును సమానమే. ఇరువురకును గ్రియావర్ణనముగలదు రూపమును నీలపీతాదిరూపము ఆకారము, అని ప్రాచీనాలంకారికులు విభజించిరికదా! నీలపీతాదిరూప వర్ణనము గుణస్వభావోక్తియే యగును. ఆకారవర్ణనము, జాతి, ద్రవ్యస్వభావోక్తు లగును

ఈ స్వభావోక్తి కుదాహరించిన పద్యములు 'అవ్వారి సుబ్రహ్మణ్య శాస్త్రి' గారి యాంధ్రకావ్యాదర్శములోనివి.

౧౮. వ్యాజోక్తి

క॥ తేఱిరిలు వేడ్కతో న
వ్యాజసముద్భూతమైన వస్తువు నెలమిన్
వ్యాజంబుసేసి దాఁచిన
వ్యాజోక్తి యనంగబొల్చు నది యెట్లన్నన్. ౧౧౪

ఉద్భిన్నమైన (పై కుబికిన లేక ప్రకటితమైన) వస్తువును వ్యాజముచే దాఁచి చెప్పినచో వ్యాజోక్తి యగును. వ్యాజముచే నుక్తి యని సార్థకనామము.

కం. బాలామణి నరసింహాన్వ
పాలాగ్రణిఁ జూచి ప్రమదబాష్పావృతయై
లీలాసౌధసముత్థిత
కాలాగరుధూపమెంతఘన ? మని పల్కన్. ౧౧౫

నాయిక నరసభూపాలునిఁ జూచుటవలనఁ దనకుఁగలిగిన యానంద బాష్పములను గాలాగరుధూపమువలన' గలిగిన బాష్పములుగా నిగూహనము సేసినది

సామ్యమున్ననే యీ నిగూహనము సేయ వీలగును. కావున సామ్య నిబంధన ముండవలెను.

కం. హారములు గరఁగ నరస
క్ష్మారమణుసిఁ బాడి యొక్కసతి పులకలు మై
నీరికలెత్తినఁ దాఁచును
సారెకు హారాంబుజనిత శైత్యంబనుచున్.

నరసభూపాలునిఁగూర్చి గానముసేయఁగా నొక యువతికి గగుఱుపాటు గలిగెను అది హారజల శైత్యముచే గలిగినట్లు దాఁచెను. ఇదియు వ్యాజోక్తియే కానీ 'దాఁచును' అని వాగ్రూపముగాఁ జెప్పుట యసుందరము.

౧౯. మీలనము

కం. అవనిం బ్రబలంబగు వ
స్తువుచే వస్త్వంతరంబు సోరిది నడఁగినన్
గవులమతంబున మీలన
మవునది యన్వర్థమగుచు నది యెట్లన్నన్. ౧౧౬

ప్రబలమగువస్తువుచే వస్త్వంతరము (అల్పవస్తువు) అడఁగినచో నది మీలనము మీలనమన వ్యుత్పత్త్యర్థమునుబట్టి యుత్కృష్టవస్తువుచే నికృష్టవస్తు నిగూహనము.

శా. నీధాటీ విచలద్బలోద్భటభటానీకోదయద్భీతిచే
బాధాహేతు వనోగ్రజంతుభయముం బాటింపకాత్మన్ రిపు
క్ష్మాధీశాంగనలద్రికందరల వెల్గంచున్ భుజంగస్ఫటా
సాధూద్యన్మణిపంక్తిఁ గప్పుదురు దోశ్శక్తిన్ నృసింహాధిపా!

నీ సైన్యమువలనఁ గలిగిన భయముచేఁ గ్రూరజంతుభయమును బాటింపక నీ శత్రుకాంతలు పర్వతగుహలలోఁ బ్రవేశించి యటనున్న సర్పముల పడగల మీఁది మణుల కాంతులచే వెలుఁగు గనఁబడఁగా వారా మణులను గప్పుచున్నారు.

వర సైన్యభయముచేఁ గ్రూరసర్పభయము కప్పఁబడినది కాన మీలనమని గ్రంథకర్త యభిప్రాయము ఇది సరిగాదు భయముంబాటింపక అని యుంటచే వారు సర్పభయమను లెక్కింపకున్నారనియు సైనికుల హస్తములలోఁబడుట కన్న సర్పముఃవలన మరణించుటయే మేలనియుఁ దాత్పర్యము వచ్చును. ఈ పద్య ముదాహరణార్హము గాదు.

అపాంగతరళే దృశౌ మధురవక్రవర్ణా గిరో
విలాసభరమంథరా గతి రతీవ కాంతం ముఖం
ఇతి స్ఫురిత మంగకే మృగదృశస్స్వతోలీలయా
తదత్ర న మదోదయః కృతపదోఽపి సంలక్ష్యతే.

ఆ యువతి దృక్కు లతిచంచలములు; వాక్కులు మధురములును వక్రములును; గమనము విలాసభరమందరము; ముఖము కాంతిమంతము, ఇవన్నియు స్వభావముచేతనే సిద్ధించియున్నవి ఇపుఁడు మదిరామదము ప్రవేశించినను వివిక్తముగాఁ గనరాకున్నది

స్వభావసిద్ధములయిన ప్రబలములయిన దృక్చాంచల్యాదులచే నల్పములయిన మదిరాకృతదృక్చాంచల్యాదులు కప్పఁబడినవి.

ఈ మీలమునకు మీలితమనియు నామాంతరము. ఇది ద్వివిధము. సహజతిరోధానముచేతను నాగంతుకతిరోధానముచేతను, వస్తునిగూహనము. 'అపాంగతరళే అనుచో సహజమగు తిరోధానము అనఁగా సహజమగు దృక్చాంచల్యాదులచేఁ దిరోధానము జరిగినది.

యే కందరాసు నివసంతి సదా హిమాద్రే
స్త్వత్పాతశంకితధియో వివశా ద్విష స్తే
అప్యంగముత్పులక ముద్వహతాం సకంపం
తేషామహో ! బత ! భియాం న బుధోఽప్యభిజ్ఞః.

నీ భయమున హిమశైలగుహలయందు వసించువారి శరీరములందుఁ గంపమును బులకలను గాంచి విద్వాంసుఁడును నివి భయకార్యములుగాఁ గ్రహింపఁ జాలఁడు అనఁగా వారి కంపమును బులకలను శైత్యకార్యములుగా గ్రహించును గాని భయకార్యములుగా గ్రహింపఁడు.

శైత్యమాగంతుకము దానివలనఁగలిగిన కంపపులకలును నాగంతుకములే వానిచే భయకార్యములగు కంపపులకలకుఁ దిరోధానము గలిగినది కావున నిట నాగంతుకతిరోధానము. ఆగంతుకములచేఁ దిరోధానము జరిగినది.

౨౦. సామాన్యము

కం॥ అవిరళగుణసామ్యంబున
నవనిన్ వస్త్వంతరంబునందేకంబై
ప్రవిమలవస్తువు మెఱసిన
నవు నది సామాన్యమనఁగ నది యెట్లన్నన్. ౧౧౭

సమానగుణములు గల రెండు వస్తువులు గుణసాదృశ్యమునుబట్టి యేకాకారముగా భాసించినచో నది సామాన్యాలంకారము

మీలనాలంకారమున నుత్కృష్టవస్తువుచే నికృష్టవస్తువునకుఁ దిరోధానము సామాన్యాలంకారమున సమాన వస్తువులు గుణసామ్యముచే నేకాకారముగా భాసించుట

కం. నీ కీర్తి కాంతిలోపల
శ్రీకంఠుం డేకమైన శివుఁగానక యా
నాకనది జలధి కేఁగుం
బాకారిసమాన ! యోబపార్థివునరపా ! ౧౧౮

కీర్తిశ్రీకంఠులు శ్వేతగుణసామ్యముచే నేకాకారముగా భాసించుచున్నారు

ఇట నాకనది జలధికేఁగుటగు హేతువుగాని శివునిఁ గానకుండుటను హేతువుగా నుత్ప్రేక్షించుటచే గమ్య హేతూత్ప్రేక్షయుఁ గలదు. ఇట నీ యుత్ప్రేక్షను సామాన్యాలంకార మనుగ్రహించుచున్నది. మఱొకయుదాహరణము.

గీ. మల్లెదండలు గైసేసి, మలయజంబుఁ
బూసి యొదలికిఁ, దొడి పట్టు పుట్టములను
బండు వెన్నెల నడిరేలఁ బరువులిడుచుఁ
గానఁబడదయ్యె నభిసారికాగణంబు.

చంద్రికా అభిసారికలు శ్వేతకాంతిసామ్యమున నేకమై ప్రత్యేకముగా భాసింపకున్నారు

౨౧. తద్గుణము

కం. తనగుణము విడిచి యన్యము
నసఘగుణముఁగొనుట తద్గుణాఖ్యము... ౧౨౦

స్వగుణమును విడిచి యితర వస్తువుయొక్క యుత్కృష్టగుణమును స్వీకరించినచోఁ దద్గుణాలంకారము.

మీలనమున నుత్కృష్టవస్తువుచే నికృష్టవస్తువునకుఁ దిరోధానమే. కాని స్వగుణ త్యాగములేదు. సామాన్యముననుు స్వగుణత్యాగము లేదు. కానఁ దద్గుణమేతద్భిన్నము

ఉ. కానలకేగి నీ విమతకాతరలోచన ప్రాణనాథుఁడుం
దాను భుజింపఁగా ఫలవితానముఁ గోసెదనంచుఁబోయి నా
నా నిరవద్యకోకనద నర్మసఖాంగుళిపాటలాంశురే
ఖానిబిడంబులైన కసుగాయలెకోయునృసింహభూవరా! ౧౨౧

నీ శత్రుకాంత పండ్లుగోయఁబోయి తన వ్రేళ్ళకాంతులచే నెఱ్ఱఁబారిన కసుగాయలు గోయుచున్నది.

ఉత్కృష్టమగు వ్రేళ్ళకాంతిచేఁ గసుగాయలు తమ గుణమగు పచ్చఁదనమును విడిచి యెఱ్ఱని పండ్లవలెఁ గనఁబడినవి.

"తస్య అప్రకృతస్య గుణః అత్ర అస్తీతితద్గుణః" అప్రకృతవస్తువు యొక్క గుణములు (అంగుళికాంత్యాదులు) ఇందున్నవి కానఁ దద్గుణము అని వ్యుత్పత్తి

౨౨. అతద్గుణము

కం. ....
......................ఒరుగుణం
బనయము హేతువుగలిగియు
నెనయమియ యతద్గుణాఖ్య మిది యెట్లన్నన్.

తగినంత కారణమున్నను నితరవస్తువుయొక్క గుణమును స్వీకరింపకున్నచో నతద్గుణము 'తస్యగుణః న అత్ర అస్తీతి అతద్గుణః అని' వ్యుత్పత్తి (దాని గుణ మిందులేదు కాన నతద్గుణము)

చ. బలరిపుభోగ ! యో జనరపాలనృసింహ ! భవద్యశంబుచేఁ
దెలుపగు నిందులాంఛనము; దెల్పగుఁ బ్రాక్తనభోగిభోగముల్
తెలుపగు రుద్రకంధరము; తెల్పగు భారతికొప్పు, కాని త్వ
ద్బలరిపుదుర్యశోరుచివితానము తెల్పయి యుండదెన్నఁడున్.

నీ కీర్తిచే నెల్లవస్తువులును దెల్లఁబడుచున్నను నీ శత్రువుల యపకీర్తి మాత్రము దెల్లఁబడకున్నది

తగిన కారణమున్నను నపకీర్తి నీ కీర్తి గుణమును స్వీకరింపకున్నది కాన నతద్గుణము

౨౩. విరోధాభాసము

కం. అమర విరోధం బాభా
సముఁగాగ విరోధమయ్యె జగతి నదియునుం
గ్రమమున జాత్యాది విభే
దముల బహుత్వంబుఁ జెంది తగు నెట్లన్నన్. ౧౨౩

పైకి మాత్రము విరోధము గనఁబడుచుఁ బరమార్థమున విరోధము లేకున్నచో విరోధాభాసాలంకారము దీనికి విరోధాలంకారమనియు నామాంతరము ఇది జాతి, గుణ, క్రియా ద్రవ్యభేదములచే బహువిధము.

విరోధమన నుద్ద్యోతకారుఁడిట్లు తెలిపెను. "విరోధశ్చ ఏకాధికరణసంబద్ధత్వేన ప్రసిద్ధయోరర్థయోర్వ్యాసమానైకాధికరణాసంబద్ధత్వం ఏకాధికరణాసంబద్ధత్వేన ప్రసిద్ధయోరేకాధికరణసంబద్ధత్వేన ప్రతిపాదనం వా"

విరోధమన నొక్కచోట సంబద్ధములుగా స్థిరపడియున్న రెండు ధర్మములు పైకి సంబద్ధములు గానట్లు తెలుపుటకానీ యొక్కచోట సంబద్ధములుగాని రెండు ధర్మములు పైకి సంబద్ధములవలెఁ దెలుపుటకానీ యగును ఈ విషయము లక్ష్యముమీఁద లెస్సగా నవగతమగును.

గీ. జాతి జాత్యాదికములతోడ, జగతిఁ గ్రియ క్రి
యాదికములతోడ, గుణము గుణాదితోడ,

ద్రవ్యమును ద్రవ్యమును విరోధంబుఁ జెందఁ,
బదివిరోధంబులగు ; వీనిఁ బదిలపఱతు. ౧౨౪

జాతి జాతిగుణద్రవ్య క్రియలతోను, గుణము గుణక్రియాద్రవ్యములతోను, క్రియ క్రియాద్రవ్యములతోడను ద్రవ్యము ద్రవ్యముతోడను విరోధమును జెందును ఈ విధముగా నీ యలంకారము పది భేదములగును.

సీ. ధారాధరంబయ్యుఁ దనరు నీ కౌక్షేయ
మహితవాహినిక జీవనదమయ్యెఁ
గమలాకరంబయ్యు నమరు నీ శౌర్యంబు
ఘనరాజహంసభీకరతఁ దాల్చె
నీరంధ్రగతి మహావారణంబయ్యు నీ
సత్కీర్తి హరిఘటాసఖ్యమొందె
నవనిఁ బ్రభానిధియయ్యు నీ నెమ్మేను
జైవాతృకత్వంబు సంఘటించె

గీ. ధర్మధరమయ్యుఁ బ్రతిపక్షవర్మభేది,
సరసుతవిహారమయ్యుఁ గర్ణప్రమోద
శీల, మురుగోత్రభృతియయ్యు జిష్ణువగుచుఁ
జెలఁగు నీ బాహుయుగము నృసింహభూప ! ౧౨౫

౧ లోకమున ధారాధరము (మేఘము) జీవనదము (జలమునిచ్చునది), కాని యిట జీవనదము కాకున్నది ధారాధరత్వజాతికిని జీవనదానక్రియాభావమునకును విరోధము. కాన విరోధమును బరిహరింపవలెను ఎట్లన నీకౌక్షేయకము (కత్తి) ధారాధరమును (వాదరనువహించునది) అహితులగు శత్రువుల వాహినికిఁ బ్రాణమీయనిదియు అనఁగాఁ బ్రదుకునీయనిది, వారిని వధించునది. అనునర్థముచే విరోధము పరిహరణీయము

ఇట జాతిక్రియా విరోధము.

౨ కమలాకరము (సరస్సు) లోకమున రాజహంసలకు నాహ్లాదకరము కాని యిట భీకరమగుచున్నది. కమలాకరత్వజాతికిని భయరూపగుణమునకు విరోధము. విరోధమును బరిహరింపవలెను. కమలా+కరము = (విజయ) లక్ష్మినిఁ జేయునది, రాజహంసలు = రాజశ్రేష్ఠులు; అనునర్థమును స్వీకరించి నీ శౌర్యము విజయలక్ష్మినిఁ గూర్చును రాజశ్రేష్ఠ (శత్రురాజులు) లకు భయము గలిగించును అన్నచో విరోధము తొలఁగును. ఇట జాతిగుణవిరోధము.

౩ మహావారణమునకు (గజము) హరిఘటా (సింహబృంద) సఖ్యమెట్లు పొసఁగును? వారణత్వజాతికిని హరిత్వజాతికిని విరోధము మహావారణము = పెద్దపెద్ద యావరణములు గలది. ఇట ఆవారణశబ్ద మావరణవాచకము (స్వార్థణిజంతమగు 'వృ' ధాతువుయొక్క రూపము). మహావారణమన నీరంధ్రమగు విధమునఁ అనఁగా దట్టముగా నన్నింటిని లెస్సగాఁ గప్పివేయునది యని యర్థము నీ కీర్తి లెస్సగా దట్టముగా నన్నింటిని, గప్పునదియు సింహబృందమును (తెలుపు గలిగించుటచే) పోలునదియుననునర్థముచే విరోధము పరిహరణీయము.

ఇట జాతిద్వయమునకు విరోధము.

౪. ప్రభానిధి యన సూర్యుఁడు. ప్రభానిధిత్వజాతికిని జైవాతృక (చంద్రుడు) రూపద్రవ్యమునకు విరోధము. ప్రభానిధి యనఁ గాంతినిధానము జైవాతృకుఁడన దీర్ఘాయుష్మంతుఁడు. నెమ్మనుగాంతిమంతమును దీర్ఘకాలము జీవించునదియును నను నర్థముచే విరోధము పరిహరణీయము

ఇట జాతిద్రవ్యములకు విరోధము. ప్రభానిధియన సూర్యుడు "ఈశబ్దము ద్రవ్యవాచకమగును కాని జాతివాచకమె"ట్లని శంకింపవచ్చును. ద్వాదశార్కులు గలరు కానఁ ప్రభానిధి శబ్దము జాతివాచకమగును దీనికి మఱొక యుదాహరణము

సృజతి చ జగ దిద మవతి చ సంహరత్యేవ యో నియతం
అవసరవశత శ్శఫరో జనార్దన స్సోఽపి చిత్రమిదం

ఎవఁడు తన లీలచే జగములను సృజించునో రక్షించునో సంహరించునో యాజనార్దనుఁ డవసరమునుబట్టి చేపఁగా నయ్యెను. ఇది చిత్రము

ఇట శఫరత్వజాతికిని జనార్దనరూపద్రవ్యమునకును విరోధము. అనగా జనార్దనుఁడు శఫర మెట్లగును? అని విరోధము. భగవంతుఁడు సర్వసమర్థుఁ డగుటచే శఫరరూపధారణము సాధ్యమే యను నర్థముచే విరోధము పరిహరణీయము

౫ ధర్మధరణ రూపక్రియకును ధర్మభేదన రూపక్రియకును విరోధము ధర్మమన విల్లు 'తాను ధర్మమును ధరించువాఁడును బరుల ధర్మమును (విల్లును) భేదించువాడును' అనునర్థముచే విరోధము పరిహరణీయము

ఇటఁ గ్రియాద్వయ విరోధము

౬. నరనుతవిహారము (అర్జునునియొక్క పొగడఁబడిన విహారము) కర్ణప్రమోదశీలము (కర్ణునికిఁ బ్రమోదముగలిగించు స్వభావముగలది) ఎట్లగును?

కాన నరనుతవిహారము = నరులచేఁ బొగడఁబడిన విహరణక్రియగలదియుఁ, గర్తములకుఁ బ్రమోదముగలిగించు స్వభావముగలదియు (నీ బాహుయుగము) అను నర్థముచే విరోధ పరిహారము

ఇట గుణక్రియా విరోధము (ప్రమోదము గుణము విహరణముక్రియ) కాని యీ యుదాహరణ మంత బాగుగాదు. ఏలన, విహరణ ప్రమోదముల విరోధము ప్రసిద్ధము గాదు. కాన మఱొకటిచ్చుచున్నాము.

'పేశల మపి ఖలవచనం దహతితరాం మానసం సతత్త్వవిదాం'
ఖలవచనము పేశలమయ్యును మహాత్ముల మానసమును గాల్చును.
ఇటఁ బేశలత్వగుణమునకును దహనరూపక్రియకును విరోధము

మృదువైనను నది ఖలవచనమగుగాన జనులకు సంతాపముగూర్చును. అని విరోధపరిహారము

౭ గోత్రభృతి యన గోత్రభరణముగలది అనఁగా గోత్రములను (పర్వతములను) భరించునది గోత్రములను భరించువాఁడు జిష్ణువు (ఇంద్రుఁడు) ఎట్లగును ? ఇంద్రుఁడు గోత్రభేదిగదా ? కాన నిట క్రియాద్రవ్యవిరోధము. కాన గోత్రభరణము = బ్రాహ్మణ క్షత్రియాది వంశములను భరించునది. అనఁగాఁ గాపాడునది యనియు జిష్ణువు = జయశీలము (బాహుయుగము) అనియు నర్థమును గ్రహించినచో విరోధము పరిహృతమగును.

మ. తలిరుంబోఁడి సరాగయయ్యు ధవళత్వంబొందు; నుచ్చైస్స్తనా
చలభారాసహయయ్యుఁదానచలయౌఁ, జర్చింపఁగానార్యయై
చెలువంబందియు నన్యభాషయగు , నీచేతోజశస్త్రాహతిన్
నలినాక్షీమణి నేలుమింక నరసేంద్రా! సాంద్రతేజోనిధీ! ౧౨౬

౮ 'సరాగయయ్యు ధవళత్వమును బొందును' అన్నచో నిట రక్తత్వ, ధవళత్వ రూపగుణములకు విరోధము సరాగ = అనురాగవతి అను నర్థముచే ననురక్తురాలును (కనుకనే) ధవళత్వమును (పాలిపోవుటకు) బొంది నదియు నను నర్థముచే విరోధపరిహారము

౯ 'స్తనాచలభారాసహయయ్యు' అనుచో అచల (భూమి) అచల భారాసహ యెట్లగును? భూమి పర్వతములను మోయునుగదా ఇట అచల = కదలనిది' అనునర్థము చే నాయువతి స్తంభరూపసాత్త్వికభావమును బొందిన దనియు స్తనభారమును వహింపలేకున్నదనియు నర్థముచే విరోధపరిహారము ఇట గుణ ద్రవ్య విరోధము ('అచల' ద్రవ్యవాచకము భారము గుణము)

౧౦ ఆర్య (పార్వతి అన్యభాష (అపరసరస్వతి) యెట్లగును ? ఇట ద్రవ్యద్రవ్య విరోధము ఆర్యురాలును నన్యభాష = పరాయత్తమైన లేక మఱి

మాలిన (పర్యాలాపరూప మన్మథావస్థచే) మాటలుగలదియనను నర్థముచే విరోధము పరిహారము.

మొత్తముమీఁద నీ విరోధాలంకారము శ్లేషమూలకము ఉద్ద్యోతకారుఁడు తెలిపిన విరోధలక్షణము నిట ననుసంధింపకొనవలెను.

దీని నాంగ్లమున (Paradox) అందురు.

౨౪. విశేషము

కం. ధారుణి నాధేయమనా
ధారముగా నొకటి నేకతలకలితముగా
సారెకు, నశక్యకరణం
బారూఢముగా విశేషమగు నెట్లన్నన్. ౧౨౭

ఆధారరహితముగా నాధేయమును నిబంధించుట ఒకేవస్తువనేకస్థలముల నున్నట్లుగా నిబంధించుట (ఏకానేకగోచరము) అశక్యవస్తువును జేయుట. అని విశేషాలంకారము ముత్త్రివిధములు.

౧. ఆధారరహితాధేయము

చ. దురమున శ్రీనృసింహుఁ డతిదుర్మద వీరవిరోధి పంక్తిపై
సరభసవృత్తి న త్తలముసాఁపఁ బ్రదీప్తములయ్యెఁ దన్మహా
మరకతపుష్యరాగనవమౌక్తికవిద్రుమనీలకాంతిచే
సురపదవీధిపై జనులచూడ్కికభిత్తికచిత్రకర్మముల్. ౧౨౮

నరసభూపాలుఁడు దన ఖల్గమును లేక ఖడ్గమును శత్రురాజులపైఁ కెత్తగా దానియందుదాఁపిన మరకత పుష్యరాగాదుల కాంతిచే నాకాశమున నభిత్తికమైన చిత్రములు జనులు కగపడినవి

భిత్తియాధారము చిత్రకర్మ యాధేయము అభిత్తిక చిత్రకర్మ లనుచోట నాధారరహితాధేయము గనఁబడుచున్నది. కాని దీనియందు వైచిత్ర్యము తక్కువగా నున్నది ఈ క్రింది పద్యము సుందరమైనది.

గీ మొలిచెఁ గమలంబు నిర్జలస్థలములందుఁ;
గలువలుదయించె దానిపైఁ; గాసిపించెఁ
గనకలతపైనివెల్ల, నా కనకలతయు
లేఁతయట; యేమి యీ మహోత్పాత వితతి ?

ఇటఁ బ్రసిద్ధాధారము లేకున్నను గమలము లుదయించెను. దానిపైఁ గలువ లుదయించెను. ఇవెల్లయుఁ గనకలతపై నిలిచెను.

౨. ఏకానేకగోచరము

కం. కలఁడు కలఁడన్న చోటం
గలుగు నృసింహుఁడవు కానఁ గానలఁ, గిరులం,
గలలోన, ముంగలఁ బిమ్మట
వలఘుస్థితి నీవ యగుదువరకి నృసింహా! ౧౭౯

ఒక నరసభూపాలుడే శత్రువునకుఁ గానలలో, గిరులలోఁ, గలలో, ముందు, వెనుకలను గానఁబడుచున్నాఁడు. ఇట్టిదే

సా వసతి తవ హృదయ్మే సైవాక్షిషు సా చ వచనేషు
అస్మాదృశీనాం సుందర అవకాశః కుత్ర పాపానాం॥

ఆ యువతియే నీ హృదయమున నీ నేత్రములయందు నీ వచనము లందును వసించుచున్నది పాపాత్ములగు మావంటివారి కవకాశమెక్కడ?

౩. అశక్యవస్తుకరణము

సీ. దారుణాఖండమార్తాండమండలము ను-
ప్పొంగి గుటుక్కున మ్రింగవచ్చు;
గంభీరఘుమఘుమారంభపంరంభదు
గ్ధపయోధిఁ జంగున దాటవచ్చుఁ;
బండిశాజానేయగండప్రకాండముల్
పీఁకఁ బరాలున వ్రేయవచ్చుఁ;
గుటిలోగ్రశతకోటికోటిసంఘాటముల్
కినిసి ఘణిల్లునఁ దునుమవచ్చుఁ;

గీ. గాని వశ్యదరిగణభీకరదృగగ్ర
జాగ్రదనలోజ్జ్వలజ్వాలజాలకుటిల
గురుభుజాశౌర్యుఁ నినుఁ జెనకఁ దరమె యరుల?
కాళకేంద్రుని నారసింహక్షితీంద్ర! ౧౮౦

సూర్యుని మ్రింగుట మొదలగు నశక్యకార్యములను జేయుట విశేషాలంకారముగాఁ జెప్పఁబడినది. కాని ప్రకాశకారామల లక్షణము భిన్నముగా నున్నది.

"అన్యత్రప్రకుర్వతః కార్య మశక్యస్యాన్యవస్తునః
తథైవ కరణంచేతి విశేషస్త్రివిధః స్మృతః"

హడావడిగా నొక కార్యమును జేయఁబూని యదేయత్నముతో నశక్యమైన మఱొక కార్యమును జేయుట విశేషము 'హడావడిగా' అనుటచే 'నేక ప్రయత్నముతోనే రెండు కార్యములను జేయఁగలను' అను పట్టుదల లేదని తెలియవలెను. ఎట్లన,

స్ఫురదద్భుతరూపముత్ప్రతాప జ్వలనం త్వాం సృజతాఽనవద్యవిద్యం
విధినా ససృజే నవో మనోభూర్భువి సత్యం సవితా బృహస్పతిశ్చ.

అద్భుతమగు రూపమును, మహాప్రతాపమును అనవద్యమగు విద్యయును గల నిన్ను సృజింప నారంభించిన యత్నముతోడనే యశక్యవస్తువులగు మన్మథ సూర్య, బృహస్పతులు సృజింపఁబడిరి అనఁగా నీయొక్క సృష్టితోనే ముగ్గురు సృష్టింపబడినట్లైనది అని భావము ఇట ససృజే అను క్రియలోనికి 'మనోభూ' సవితా, బృహస్పతి' అను శబ్దములు సాక్షాత్తుగా నన్వయించుటచే శాబ్దమగు కార్యాంతరకరణము

బ్రహ్మ మొదట నినుఁబోలె విధముగాఁ సృష్టింపబూనెను. అనుకొనకయే మన్మథాదులు ముగ్గురునుగూడ సృష్టింపఁబడినట్లయిరి.

వ్యంగ్యమగు నీ తృతీయభేదమున కుదాహరణము

గృహిణీ సచివస్సఖీ మిథః ప్రియశిష్యా లలితే కలావిధౌ
కరుణావిముఖేన మృత్యునా హరతా త్వాం బత కిం న మే హృతం ?

నీవు నా గృహిణివి, సచివుఁడవు సఖివి, లలితకళాభ్యాసమునఁ బ్రియశిష్యురాలవు అట్టి నిన్ను హరించిన కరుణావిముఖమగు మృత్యువుచే నేమి హరింపబడలేదు ?

ఇట నిందుమతీహరణరూపమగు నొక కార్యమును జేయఁబూనిన మృత్యువుచే నా ప్రయత్నముచేతనే గృహిణ్యాదిహరణరూపకార్యాంతరము గూడఁ జేయఁబడినది ఇటఁ గార్యాంతరకరణము వెనుకటి యుదాహరణము నందువలె శాబ్దముగాక వ్యంగ్యము. ఏలన వెనుక 'మనోభూః' ఇత్యాదులు 'ససృజే' అను క్రియలోకి సాక్షాత్తుగా నన్వయించినవి ఇట "కిం న మే హృతం" అను హరణక్రియలలోనికి గృహిణ్యాది శబ్దములు వ్యంగ్యముగా నన్వయించుచున్నవి.

౨౫. అధికము

కం. ఆధారం బల్పంబై
యాధేయం బధికమైన, నదియల్పంబై

యాధారంబును నధికం
బై ధర రంజిల్ల, నధికమగు నెట్లన్నన్. ౧౫౧

ఆధారము చిన్నదియు నాధేయము పెద్దదియు నైనయెడలను, ఆధేయ మల్పమును నాధారమధికమును నైనయెడలను నధికాలంకారము. ఇది యిట్లు ద్వివిధము.

౧. అధికాధేయము

కం. ఘనరోమకూపవాతా
యనముల కణుపంక్తులగు నజాండంబులచేఁ
దనరు హరికుక్షి నడఁగక
యనఘాబ్జత వెడలె నీదు యశము నృసింహా! ౧౫౨

తన రోమకూపములనువాతాయనములలో నణువులుగాఁ దేలియాడు బ్రహ్మాండములతోఁ గూడిన శ్రీమహావిష్ణువుయొక్క యుదరమున నీ కీర్తి యిముడక నాభికమలరూపమున బయటికి వెడలెను

ఆధారమగు నుదరముకన్న నాధేయమగు కీర్తి యధికముగా వర్ణింపఁ బడినది.

౨. అధికాధారము

కం. నీదు నిరవద్యకీర్తిమ
హాదుగ్ధపయోధిలోన నాదిమరాజ
ప్రాదుర్భూతయశంబులు
ప్రోదిం బుద్బుదములట్లు పొలుచు నృసింహా! ౧౫౩

నీ కీర్తియనుపాలసంద్రమునఁ బూర్వరాజుల కీర్తి బుద్బుదములవలె నడఁగెను. ఇట నాధేయమగు పూర్వరాజుల కీర్తికన్న నాధారమగు నరసభూపాల కీర్తిసముద్రము పెద్దదిగా వర్ణింపఁబడినది 'కీర్తిమహాదుగ్ధపయోధి' అన్నచో రూపకముగూడఁ గలదు కాని ప్రాధాన్యేన వ్యపదేశా భవంతి అను న్యాయాన్ను సారముగా దేనివలన విచ్ఛిత్తి విశేషము గలుగునో యా యలంకారము ప్రధానము.

౨౬. విభావన

కం. కారణము లేక కార్యము
ప్రారూఢంబైన నది విభావన... ౧౫౪

లోకమునఁ గారణములేక కార్యము పుట్టదు. కవిప్రౌఢోక్తిచే నట్లు పుట్టినట్లు చెప్పినచో విభావనాలంకారము.

సీ. నలినారిలేని వెన్నెలలు, రాత్రులులేని
తారలు, లతలేని కోరకములు,
కొలములేని సితాబ్జములు, స్వాతిచిన్కులు
లేని ముత్తెము, లేఱులేని నురువు
లరుదెల్తురు లేని వెలిమబ్బులు, హిమాద్రి
లేని మంచులు, వార్ధిలేని సుధలు,
గనిలేని వజ్రముల్, గంధాద్రిలేని గం
ధములు, దారములేని హారవితతు

గీ. తార! నీకీర్తిరుచులు మహానుభావ!
భావజాకార! కారుణ్యభాసమాన
మానకురురాజ! రాజన్యమకుటనిహిత
చరణరాజీవ! యోబళభూవరు నృసింహ ౧౪౩

వెన్నెల వచ్చుట తార లుదయించుట మొదలగు కార్యములకుఁ జంద్రుఁడు, రాత్రులు మొదలగునవి కారణములు. ఆ కారణములు లేకయే యా యా కార్యములు గలిగినట్లు వర్ణింపఁబడుటచే విభావన. "విభావ్యతే విశార్యతే కారణమస్యాం" (ఇందుఁ గారణము విచారింపఁబడును. కాన విభావన అని వ్యుత్పత్తి)

విషోక్త్యలంకారమునకు కుదాహరణముగా నీయఁబడిన 'క్రూరతలేని చూపు' అనుదానికిని దీనికిని భేదమేమనవచ్చును "క్రూరతలేని చూపు" ఇత్యాదు లందు "నలినారిలేని వెన్నెలలు" ఇత్యాదులందువలెఁ గారణకార్య భావము లేదుగదా

౨౪. విశేషోక్తి

కం. ....
......................పెక్కుల్
కారణములయ్యుఁ గార్యము
చేరకయుండుట మహిన్ విశేషోక్తియగున్.

పెక్కు కారణములున్నను గార్యము పుట్టకున్నట్లు వర్ణించుట విశేషోక్తి

కం. అని నీ చాపఘనాఘన
ఘనము శరోత్కరముఁ గురియఁగం ద్వదహితరా
డ్వనితలకు నెట్టి చోద్యమొ ?
యనువొందవు కంకణంబు లౌరౌశనరసా! ౧౪౬

నీ చాపరూపమగు వర్షాకాలమేఘము శరజాలమును (జలధారలు - బాణధారలు) గురియఁగా నీశత్రుకాంతలకుఁ గంకణంబులు (జలకణములు-గాజులు) అనువుపడకున్నవి.

ఇటఁ గంకణములు (జలకణములు) అనువుపడుటకుఁ దగినంత కారణమైన వర్షాకాలమేఘములయొక్క జలధారలున్నను అనువుపడకున్నవి. అనుటచేఁ గారణమున్నను గార్యము పుట్టలేదు కాన విశేషోక్తి

ఇట శ్లేషచేతనే (కంకణశబ్దము) విశేషోక్తి యుక్తమగుచున్నది శ్లేషలేకున్నచో విశేషోక్తి లేదు

అతద్గుణాలంకారమునఁ దగినంత కారణమున్నను నితరవస్తువుయొక్క గుణము స్వీకరింపఁబడుటలేదు అనఁగాఁ గార్యము పుట్టలేదనియేకదాయర్థము అట్లుచో దానికిని భేదమేమి ? అనవచ్చును కారణగుణములు కార్యమునఁ బ్రవేశింపకున్నచో నతద్గుణము కారణమున్నను గార్యమే పుట్టకుండుట విశేషోక్తి, అతద్గుణమునఁ గార్యము పుట్టును కాని కారణగుణములు కార్యమునఁ బ్రవేశింపవు.

౨౮. అసంగతి

కం. వేరుపుతోఁ గార్యంబును
గారణమును భిన్న దేశగతములుగా ని
ద్ధారుణిలోన నసంగతి
యై రాజిలునండ్రు సుకవులదియెట్లన్నన్. ౧౪౭

కార్యకారణములు రెండును నేకదేశస్థములుగా నుండుట మర్యాద. అటుగాక భిన్నదేశస్థములుగాఁ గవిప్రతిభచే వర్ణింపఁబడినచో నసంగతి.

కం. అనిలోన నీ భుజాగ్రం
బనుపమతరవారిధార నందిననేలా
యనయంబుఁ దాము వడఁకుదు
[illegible]వతారులు ? శ్రీ నృసింహా! యతిబలసింహా! ౧౪౮

నీ భుజము కత్తిని (తరవారిధార) బట్టఁగానే నీ శత్రువులు వడఁకుదురు. కారణమగు ఖడ్గ మొకచోటను గార్యమగు వడఁకుట మఱొకచోటను వర్ణింపఁ బడినది.

౭౯. విచిత్రము

కం. స్వవిరుద్ధఫలంబునకై
యవిరళయత్నము విచిత్రము......... ౧౩౯

విరుద్ధఫలమును గాంక్షించి ప్రయత్న మొనర్చుట విచిత్రాలంకారము. ఇది విరోధమూలకము

కం. నతిఁ జెందుదు రున్నతికై
ప్రతిపక్షభూపతులు నీదు భవనాగ్రబహిః
స్థితిఁ జెందుదురు గృహాంతః
స్థితికై నరసింహ! కార్యజితనరసింహా! ౧౪౦

నీ శత్రురాజులు దమ యున్నతికై నతిఁ జెందుదురు తమ గృహాంతః స్థితికై నీ సౌధాగ్రబహిఃస్థితిని వహింతురు.

ఇట విరుద్ధఫలయత్నము నిబద్ధమైనది. విరోధపరిహారము సుగమము.

౮౦. అన్యోన్యము

కం. ... ...
... ... అన్యోన్యము భూ
ష్యవిభూషణభావంబునఁ
దవులుట యన్యోన్యమయ్యె ధర నెట్లన్నన్.

పరస్పరము రెండు వస్తువులు భూష్యభూషణభావమును బొందినట్లు వర్ణించినచో నన్యోన్యాలంకారము

కం లలన నృసింహునిఁ జెందెడి
తలఁపున మైఁదొడవులిడఁగ, దనుతత నెలఁగెన్
గలితవిభూషణములచేఁ,
లలితవిభూషణములంగలతచేఁ జెలఁగెన్. ౧౪౧

నరసభూపాలుని కూటమికై యువతి ధరించిన భూషణములచే దాని శరీరము విలసిల్లెను దాని శరీరముచే భూషణములు విలసిల్లెను ఇట భూష్య భూషణభావము నిబద్ధము

౩ విషమము

కం. అవిరళవిరుద్ధకార్యో
ద్భవము, ననర్థాంకురాభిపతనవిధానం
బు, విరూపఘటన, మనగా
నవనిం ద్రివిధంబు విషమ,మది యెట్లన్నన్. ౧౪౨

సమముగానిది విషమము ఇది విరోధమూలకము. కారణమువలన విరుద్ధకార్యము పుట్టినచో నొక విషమభేదము కారణమువలనఁ గార్యముగాక యనర్థము సంభవించినచో నది యొక విషమభేదము ; విరుద్ధములగు రెండు వస్తువుల నొకచో సమకూర్చినచో మఱొక విషమభేదము

౧

కం. కాలాహినీలమగు నీ
వాలాహవభూమియందు వరలుచు రిపుభూ
పాలాననవైవర్ణ్యవి
శాలాత మొనర్చు నోబపార్థివ నరసా ! ౧౪౩

కాలసర్పమువలె నల్లనైన నీ ఖడ్గము శత్రురాజుల మొగమునకు వెల్లఁబాటును గూర్చుచున్నది.

నల్లని కత్తియను కారణమువలన 'వెల్లబాటు' అను విరుద్ధకార్యము కలుగుచున్నట్లు నిబద్ధమైనది. ఇది విరుద్ధ కార్యోత్పత్తి

౨

చ. అమరు భవత్ప్రతాపతపనాతపమంబరవీథిఁ బర్వఁగా
సమదవిరోధిభూరమణచంద్రముఖీవదనారవిందముల్
క్రమమున హర్ష మొందమియకా;దనయంబుదృగంబునిర్ఝరీ
హిమజలదూషితంబులగు నెంతయు శ్రీనరసింహభూవరా!

లోకమున సూర్యాతపమునకుఁ దామరపూలు వికసించును కాని నీ ప్రతాపసూర్యాతపమునకు శాత్రవభార్యల ముఖారవిందములు వికసింపకున్నవి. అంతయేకాదు. శోకబాష్పరూపమగు హిమజలముచే దూషితము లగుచున్నవి.

ఇట ముఖారవిందములు వికసింపకపోఁగా దృగంబుహిమదూషితములై చెడుచున్నవి. ఇట్టిదే—

"భక్ష్యాశయాఽహిమంజూషాం దష్ట్వాఖుస్తేన భక్షితః" ఎలుక తిను బండారమున్నదని యాశించి పాములబుట్టను బ్రవేశించి దానిచే భక్షింపఁబడినది

ఈ రెండును గారణమువలనఁ గార్యము పుట్టక యనర్థము గలిగినది

౩

సీ. హయగజారూఢులై యలరు రాజన్యపుం
గవు లేడఁ? గవులేడఁ? గంబుకంఠి?
ఘనభోగభాగ్యసంగతులైన మంత్రికే
సరులేడ? సరులేడఁ? యింద్రవదన!
సౌధవీథికలలోఁ జరియించు పుష్పకో
మలు లేడఁ? మలలేడఁ? దళిరుఁబోడి?
చీనిచీనాంబర శ్రీఁజెందు బాలికా
వలులేడ? వలులేడ? వామనయన!

గీ. అనుచు నీ దాడి కోడి కాఱడవిఁబడిన
వైరిభూపాలకుల దురవస్థఁ జూచి
కాంతతోఁబలుక్రు వింధ్యపక్కణ కిరాతుఁ
డరిజయాటోప తొరగంటి నరసభూప! ౧౪౫

రాజన్యపుంగవులేడ? గవులేడ? (గుహలేద) ఇత్యాదిరూపమున విరుద్ధ వస్తువుల సంఘటనము నిబద్ధమై యున్నది.

౩౨ సమాలంకారము

కం. అనురూపములగు వస్తువు
లనయము నెనయంగ నది సమాలంకృతియై
ఘనత రసజ్ఞుల మతమునఁ
దనరుఁం గావ్యంబులందు ధర నెట్లన్నన్. ౧౪౬

పరస్పరానుకూలవస్తువుల సంబంధము వర్ణింపఁబడినచో సమాలంకారము.

చం. అలరురతిన్ రతీశు, దమయంతినలున్, నలువొందముందుగా
నలువ సృజించి యందుకతనం దనచే యశు కెల్లఁదీఱి నే
ర్పలవడ కో లతాంగి! నరసాధిపు నిన్నునుగూర్చి ప్రేమనం
కలితముగాఁగదంపతులుఁగా నొనరింపఁగఁబోలు; మెచ్చితిన్

అనురూపదంపతులగు రతిమన్మథాదులను సృజించి గడిదేఱినవాఁడై బ్రహ్మ నరసాధిపుని నిన్నును సృజించి దంపతులుగాఁ జేసినాఁడు

ఇట ననుకూలదంపతులను సృష్టించినట్లు వర్ణించుటచే సమాలంకారము.

౩౩. తుల్యయోగిత

కం. ప్రకృతంబులకై నను, న
ప్రకృతంబులకై నఁ దుల్యభావము గలుగం
బ్రకటమగుఁ దుల్యయోగిత
యకలంకౌపమ్యగమ్యమై యెట్లన్నన్. ౧౪౭

కేవలప్రకృతములకును, కేవలాప్రకృతములకును గమ్యమానమగు నౌపమ్యముచేఁ దుల్యభావము చెప్పినచోఁ దుల్యయోగిత.

౧. కేవలప్రకృతతుల్యయోగిత

కం. నరసింహా! రాజశేఖర!
వరనుతమగు నీదు వితరణంబును, రణమున్,
నిరతస్వాస్థ్యంబుగఁ గ్ర
మ్మఱ 'దేహి' యనంగ నీక మనుచుం బరులన్. ౧౪౮

స్వాస్థ్యము = సౌఖ్యము · స్వర్గస్థితి

ఇది నరసభూపాల వర్ణన మగుటచే నాతని వితరణము, రణము అను రెండును ప్రకృతములే నీ వితరణమును రణమును "నిరతస్వాస్థ్యంబుగ ... మనుచుంబరులన్" అనుటచేఁ బ్రకృతములగు రెంటికిని ధర్మైక్యము చెప్పఁ బడినది. కాన 'వితరణము రణముతో సమానము' అను నౌపమ్యము వాచ్యముగాఁగాక గమ్యముగా భాసిల్లుచున్నది.

౨. కేవలాప్రక[ృతతుల్యయోగిత]

కం. కొండలు, రంభాదుల [చన్నుఁ]దోయి [...]
గొండలు, వడి న[...]ఘోరాజుల [...]

A C No.......

చండజయపటహారవము ల
జాండంబులు నిండ నోలయ ప్రభునరసా. ౧౫౦

నీ జయపటహారవము బ్రహ్మాండము నిండఁగానే కొండలును రంభాదుల చనుఁగొండలును నదరుచుండెను. ఇటఁ 'గొండలు, చనుఁగొండలు' అనునవి యప్రకృతములు. పటహధ్వనిచేఁ గొండ లదరుచున్నవి. శత్రురాజులు మరణించి తమ సమీపమునకు వత్తురనుశుభమును సూచింప రంభాదుల చనుఁగొండలదరుచున్నవి.

'అదరుట' అను ధర్మైక్యముచే రెంటికిని (కొండలకు చనుగొండలకు) నౌపమ్యము గమ్యము.

౨౪ దీపకము

కం. ప్రకృతము లప్రకృతంబులు
ప్రకటంబుగఁ గూడి తుల్యభావముఁ జెందన్
సుకవీంద్రుల మతమున దీ
పకమగు, నిది గమ్యసామ్యపర మెట్లన్నన్. ౧౫౧

కేవలప్రకృతములకును గేవలాప్రకృతములకునుధర్మైక్యముచేనౌపమ్యము గమ్యమయ్యె నేనిఁ దుల్యయోగిత యని చెప్పఁబడినది. ఇట ప్రకృతాప్రకృతములకు రెంటికిని సమానధర్మసంబంధముచే నౌపమ్యము గమ్యమయ్యెనేని దీపకాలంకారము. దీప ఇవ దీపకం; ప్రాసాదమునఁ బెట్టిన దీపము వీధిలోనికిఁ గనఁబడును. కావున నది ప్రాసాదమునకును వీధికిని నుపకరించు విధమునఁ బ్రకృతాప్రకృతములకుఁ దుల్యముగా నెందు ధర్మమన్వయించునో యది దీపకాలంకారము. ఈ సమానధర్మము క్రియారూపముగాఁ గానీ గుణరూపముగాఁ గానీ యుండును. దీనిచేఁ గ్రియాదీపకమనియుఁ గుణదీపకమనియు సమాన ధర్మభేదమును బట్టి ప్రథమమున దీపకము ద్వివిధము.

కం. ధారిణి సదాళిసన్నుత
సారస్యం బగుచు విమలజలజము, రాకా
నీరేజవైరిబింబము,
నీరమ్యయశంబుఁ, బొల్చు నెమ్మి నృసింహా! ౧౫౨

తెల్లఁదామరయుఁ, బున్నమచందురుఁడును, నీ కీర్తియు సదాళిసన్నుతసారస్యమగుచుఁ బొలుచును (సదా+అళి సన్నుతము = తామరపువ్వు;

నక్+ఆళి సన్నుతము=నక్షత్రముల పంక్తిచే సన్నుతము చంద్రబింబము; సత్+ఆళి=విద్వత్సమూహముచే సన్నుతము కీర్తి)

ఇటఁ బ్రకృతము కీర్తి; తెల్లఁ దామరయుఁ జంద్రబింబమును నప్రకృతములు. ఈ ప్రకృతాప్రకృతములకు 'సదాళిసన్నుతసారస్యత్వము' సమానధర్మము దీనిచే నౌపమ్యము గమ్యమగుచున్నది.

ఇట సమానధర్మము గుణక్రియారూపమున నుండవలెనని చెప్పియుంటిమి. ఇట సమానధర్మమగు 'సదాళిసన్నుత సారస్యము' గుణము, కాని యీ క్రింది యుదాహరణములందువలె దీనియందు సొగసులేదు.

భాగీరథ్యా జలనిధీ రాజతే జ్యోత్స్నయా పూర్ణిమాచంద్రః
శ్రుత్యా కమలభవః కీర్త్యా ప్రతాపరుద్రోఽపి.

భాగీరథిచే సముద్రమును వెన్నెలచేఁ బూర్ణిమాచంద్రుఁడును, వేదముచే బ్రహ్మదేవుఁడును గీర్తిచేఁ బ్రతాపరుద్రుఁడును రాజిల్లుచున్నారు

ఇట 'రాజతే' అను క్రియయే ప్రకృతాప్రకృతములకు సమానధర్మముగా స్వీకరింపఁబడినది.

శ్యామలాః ప్రావృషేణ్యాభిర్దిశో జీమూతపంక్తిభిః
భువశ్చ సుకుమారాభిర్నవశాద్వలరాజిభిః

వర్షాకాలమేఘములచే దిక్కులును, సుకుమారములైన నవశాద్వలపంక్తిచే భూములును శ్యామలములు

ఇట 'శ్యామలములు' అనునది గుణవాచకము శ్యామలత్వరూపగుణమే సమానధర్మముగా స్వీకరింపఁబడినది.

ఈ గుణక్రియారూప సమానధర్మము వాక్యముయొక్క యాది మధ్య అంత స్థితులనుబట్టి మువ్విధములు. మొదటి 'భాగీరథ్యా' అను నుదాహరణమున 'రాజతే' అను క్రియారూప సమానధర్మము వాక్యమధ్యస్థము గాన మధ్యదీపకము 'శ్యామలాః' అను నుదాహరణమున నా ధర్మము వాక్యాదియందుంటచే నాదిదీపకము. అంత దీపకము నిట్లే యూహించుకొనవలెను.

మొదటి క్రియారూపసమానధర్మభేదము గల దీపకములో నొక్క క్రియతోఁ బెక్కు కారకము లన్వయించుచున్నవి అనేకక్రియలతో నేకకారక మన్వయించు విభేదము గూడఁ గలదు

సాధూనా ముపకర్తుం లక్ష్మీం ద్రష్టుం విహాయసా గంతుం,
నకుతూహలి కస్య మనః చరితం చ మహాత్మనాం శ్రోతుం?

సాధువుల కుపకారము సేయుటకును లక్ష్మిని జూచుటకును (గడించుట కును) ఆకాశగమనము సేయుటకును, మహాత్ముల చరితమును వినుటకును నెవని మనస్సు కుతూహలిగాదు ? (కుతూహలపడదు ?)

ఇట 'కుతూహలి' అను నేకకారకమే ఉపకర్తుం, ద్రష్టుం' గంతుం, శ్రోతుం, అను ననేకక్రియలతో నన్వయించుచున్నది ఇట గ్రియల నసమాపకక్రియలు.

౪౫. ప్రతివస్తూపమ

కం. వేర్వేఱ వాక్యయుగమున
బర్విన సాధర్మ్య మమరఁ బ్రఖ్యాతం బై
యుర్విం బ్రతివస్తూపమ
సర్వజనుల మతమునందుఁ జను నెట్లన్నన్ ౧౫౪

ప్రతివస్తు=ప్రతివాక్యం ఉపమా=సామ్యం యస్యాంసా ప్రతివస్తూపమా ప్రతివాక్యమునందును బ్రత్యేకముగా నొకే సమానధర్మమును నిబంధించినచోఁ బ్రతివస్తూపమాలంకారము ఇందుపమావాచకము ప్రయోగింపఁబడదు కాని నౌపమ్యము గమ్యమానమై యుండును.

ఉపమాలంకారమున 'వస్తుప్రతివస్తూపమ' అను భేదము చూపఁబడినది. దానికిని దీనికిని భేదమేమన: అందొక్క వాక్యమే యుండును ఇందు వాక్య ద్వయ ముండును అందుపమావాచకము ప్రయుక్తమగును. ఇందుఁబ్రయుక్తము గాదు ఈ ప్రతివస్తూపమ సాధర్మ్య భేదముచే ద్వివిధము.

కం. రవియొకఁడె ధురంధరుఁడౌ
కవిసి తమోవితతినడఁపఁ; గవిదైన్యతమో
నివహంబు నడఁప నీవే
యవనిని ధూర్వహుఁడవో బయప్రభునరసా! ౧౫౫

చీకటి నడఁచుటకు సూర్యుఁడొకఁడే ధురంధరుడు కవిదైన్యతమస్సు నడఁప నీవే ధూర్వహుఁడవు ఈ రెండు వాక్యములలోఁ ధురంధరుఁడు, ధూర్వహుఁడు అను సామాన్య ధర్మవాచకములు భిన్నభిన్నముగా గ్రహింపఁ బడినవి. ఇది సాధర్మ్యరూపము.

విద్వానేవ విజానాతి విద్వజ్జన పరిశ్రమం
నహి వంధ్యా విజానాతి గుర్వీం ప్రసవవేదనాం,

విద్వాంసుఁడే విద్వజ్జనపరిశ్రమ నెఱుఁగును వంధ్య ప్రసవవేదన నెఱుఁగదు గదా!

ప్రథమవాక్యమున 'ఎఱుఁగును' ద్వితీయవాక్యమున 'ఎఱుఁగదు' అను విరుద్ధధర్మములు సమానధర్మముగా స్వీకరింపఁబడినది ఇది వైధర్మ్యరూపము.

౩౬ దృష్టాంతము

కం. బింబప్రతిబింబత్వము
నం బరగిన వాక్యయుగమునం గల సాధ
ర్మ్యంబు చెలంగిన దృష్టాం
తంబగు నది కృతులయందు ధర నెట్లన్నన్. ౧౫౫

రెండు వాక్యములందు సామాన్యధర్మము బింబప్రతిబింబరూపమునఁ జెప్పఁబడినచో దృష్టాంతము. బింబప్రతిబింబోపమయందొక్కటే వాక్యము. ఇట వాక్యద్వయముండును.

కం. అసదసురవిసరవిశసన
రసవిస్ఫురసాహసుండు రాముఁడె ధరలో,
నసమసమరతలసముదా
రిసమూహవిభేది వీవె (శ్రీ) నరసింహా! ౧౫౬

రాక్షస సంహార సాహసుఁడు రాముఁడే యుద్ధములందు శత్రుసమూహవిభేదివి నీవే

ఇట నౌపమ్యము గమ్యము (రామునకు నరసింహునకును) అసదసుర...సాహసత్వము అసమసమర...విభేదిత్వము అనుచో సాధర్మ్యములు బింబప్రతిబింబరూపమున నిబద్ధములై యున్నవి ప్రతివస్తూపమయందు సాధర్మ్యమొక్కటియే భిన్న భిన్న పదములతో నిబద్ధమగును. ఇట భిన్నధర్మములు బింబప్రతిబింబరూపమున నిబద్ధములై యున్నవి.

ఈ దృష్టాంతము గూడ సాధర్మ్య వైధర్మ్య భేదములచే ద్వివిధము. పై యుదాహరణము సాధర్మ్య దృష్టాంతము ఈ క్రింది శ్లోకమున వైధర్మ్య దృష్టాంతము.

కృతం చ గర్వాభిముఖం మనస్త్వయా కిమన్యదేవం నిహతాశ్చ నో ద్విషః
తమాంసి తిష్ఠంతి హి తావదంశుమాన్ న యావదాయాత్యుదయాద్రిమౌళితాం.

నీవు నీ మనస్సు గర్వాభిముఖమును జేసితివి ఇఁకేమున్నది ? శత్రువులు నశించిరి సూర్యుఁ డుదయాద్రిమౌళిమీఁదికి వచ్చువఱకే చీఁకట్లుండును

ఇట 'శత్రువులు నశించిరి' అనుదానికిఁ 'జీఁకట్లు నశించినవి' అను వాక్యమున్నచో సాధర్మ్యముండును కాని యిటఁ జీఁకట్లుండును అనియుంటచే వైధర్మ్యము నిబద్ధము.

౮౩. నిదర్శనాలంకారము

కం. ధర నన్వయంబు గూడక
గరిమన్ సామ్యంబు నెచట గమ్యముఁ జేయం
బరగునది నిదర్శన యన
నిరవొందును గృతులయందు నిది యెట్లన్నన్. ౧౫౮

ఉపమానధర్మముపమేయగతముగా, నుపమేయధర్మముపమానగతముగా వర్ణింపఁబడి సరియైన యన్వయము సంభవింపకపోవుటచే నెచట బింబప్రతిబింబభావ మాక్షేప్యమగునో యది నిదర్శన లేక

ఉపమేయవాక్యార్థమం దుపమానవాక్యార్థముయొక్క యభేదారోపము కానీ ఉపమానవాక్యార్థమందుపమేయవాక్యార్థముయొక్క యభేదారోపము కానీ నిదర్శన యనఁబడును

ఈ నిదర్శనాలంకారము పదార్థవృత్తి నిదర్శనయనియు వాక్యార్థవృత్తి నిదర్శనయనియును ద్వివిధము.

కం బలవదరిరాజసేనా
జలధిన్ జీవనముఁద్రోలి జలధరశోభా
విలసనముఁదాల్చె నీ యసి
యలఘురణోత్సాహసరస! యాబలనరసా! ౧౫౯

నీ ఖడ్గము శత్రురాజసేనాజలధియందు జీవనముఁ (ప్రాణములను జలమును) ద్రావి మేఘశోభావిలాసమును దాల్చెను

కత్తి యుపమేయము మేఘముపమానము. కత్తి మేఘముయొక్క శోభావిలాస మెట్లు వహించును ? కత్తి మేఘశోభను వహించెనన్నచో నుపమానధర్మమును నుపమేయము వహించెనని యర్థమగును. ఒకదాని శోభను మఱొకటెట్లు వహించును? కావున నన్వయము సంభవింపదు. అట్లగుట 'మేఘశోభవంటి శోభను వహించె' నని బింబప్రతిబింబభావము నాక్షేపించుకొన

వలెను. దానివలన సామ్యము గమ్యమగుచున్నది 'జలధరశోభావిలాసము అనునది యేకపదము గానఁ బదార్థవృత్తి నిదర్శన

౨. వాక్యార్థవృత్తినిదర్శన

అరణ్యరుదితం కృతం శవశరీరముద్వర్తితం
స్థలేఽబ్జ మవరోపితం. సుచిరమూషరే వర్షితం,
శ్వపుచ్ఛ మవనామితం బధిరకర్ణజాపః కృతో
ధృతోఽంధముఖదర్పణో, యదబుధో జన స్సేవితః.

మూర్ఖజనము సేవింపఁబడిన దన నరణ్యరోదన చేయఁబడినదన్న మాట. శవశరీరము నలుగు పెట్టఁబడినదన్న మాట నేలమీఁదఁ దామర పాతఁబడినదన్న మాట; చవిటినేల వర్షము పడినదన్న మాట కుక్కతోఁక వంపఁబడినదన్న మాట; చెవిటివాని చెవిలో రహస్యము చెప్పఁబడినదన్న మాట, అనఁగావ్యర్థము

ఇట 'మూర్ఖజనము సేవింపబడినదన నరణ్యరోదనము చేయఁబడినది' మొదలగు నెడల నుపమేయమునందు నుపమాన మారోపింపఁబడినది.

పదార్థవృత్తి వాక్యార్థవృత్తి నిదర్శనలకు భేదమేమనఁ గేవల ముపమానోపమేయ ధర్మము లొకదానియందొకటి యారోపింపబడినచోఁ బదార్థవృత్తి నిదర్శన. ఉదా జలధరశోభ విలాసము విశిష్టధర్మములనఁగా బింబప్రతిబింబ భావాపన్న ధర్మములకు నైక్యారోపము సేసినచో వాక్యార్థవృత్తి నిదర్శనయని భేదమును గ్రహింపవలెను. ఎట్లన 'మూర్ఖజనము సేవింపఁబడినదన నరణ్యరోదనము చేయబడిన౽ అనుచో విశిష్టధర్మమున కారోపము సేయఁబడినది.

ఈ భేదమును గువలయానందకర్త యిచ్చినాఁడు ప్రతాపరుద్రీయకర్త యీ భేదమును దెలుపలేదు ఎల్లయెడల బింబప్రతిబింబభావాక్షేపముండు నని యాశయమును దెలిపెను

'కత్తి మేఘశోభను వహించెను 'మూర్ఖజనము సేవింపఁబడినదన నరణ్యరోదనము చేయబడిన౽ అను తావులం దుపమానధర్మ ముపమేయమున నారోపింపఁబడినది.

ఇఁక నుపమేయధర్మ ముపమానమున నారోపింపఁబడుట కీ క్రింది శ్లోకముదాహరణము,

వియోగే గౌరనారీణాం యో గండతలపాండిమా .
అదృశ్యత స ఖర్జూరమంజరీగర్భరేణుషు.

వియోగినులగు గౌరస్త్రీల గండపాండిమము ఖర్జూరమంజరీరేణువులందు గనఁబడుచున్నది.

ఇట నుపమానమగు ఖర్జూరమంజరీరేణువులందు నుపమేయమగు గండములయొక్క ధర్మమగు పాండిమ మారోపింపఁబడినది.

ఈ యన్ని యెడలను నన్యధర్మ మన్యస్థలమున సంభవింపదు కాన బింబ ప్రతిబింబభావరూపమునఁ దత్సదృశధర్మాక్షేపము సేయవలెను ఈ యుదాహృతభేదములు గాక మఱొక భేదముఁగలదు చూడుఁడు

శ్లో॥ అపరాం బోధనం ప్రాహుః క్రియయాఽసత్సదర్థయోః
నశ్యేద్రాజవిరోధీతి క్షీణం చంద్రోదయే తమః
ఉదయన్నేవ సవితా పద్మేష్వర్పయతి శ్రియం
విభావయన్ సమృద్ధీనాం ఫలం సుహృదనుగ్రహః

ఒకానొక వస్తువు తన క్రియచేఁ బరుల కసదర్థమును గానీ సదర్థమును గానీ బోధించినయెడల నది యొక నిదర్శనాభేదము.

'రాజవిరోధి నశించును' అని బోధించుచుఁ జంద్రోదయమునఁ దమస్సు క్షీణించుచున్నది. ఇటఁ దమస్సు తన క్రియ యగు క్షయముచే 'రాజవిరోధి క్షయించును' అని యసదర్థమును బోధించుచున్నది. (ఇట రాజశబ్దము శ్లిష్టము)

"సూర్యుఁడు దా నుదయించుచునే పద్మములయందు శ్రీ (శోభ) సమృద్ధిని నర్పించుచున్నాఁడు" ఇట నర్పణమను క్రియచే సమృద్ధులకు ఫలము (సంపద లున్నందులకు ఫలము) సుహృదనుగ్రహమే (మిత్రుల ననుగ్రహించుటయే) అనుసదర్థమును (సూర్యుఁడు) బోధించుచున్నాఁడు.

౭౮. వ్యతిరేకము

కం. ధర నుపమానముకన్నను
నరుదగు నుపమేయమధికమౌనన సామ్యం
బురుభేదకారణంబై
యిరవుగ వ్యతిరేకమయ్యె నిది యెట్లన్నన్. ౧౩౯

లోకమున నుపమేయముకన్న నుపమానమధికముగా నుండును. కానీ యెచ్చట నుపమానముకన్న నుపమేయమధికమై భేదప్రధానమగు సాధర్మ్యము గమ్యమానమగునో యది వ్యతిరేకము. 'సామ్యంబురుభేదకారణము' అనరాదు. 'భేదప్రధానమగు సామ్యము' అని చెప్పవలె. ఇం దుపమేయాధిక్యమే వ్యతిరేక లక్షణమని చెప్పఁబడినది. ఉపమేయన్యూనత్వము, అనుభయరూపము అనియును మఱి రెండు భేదములు గలవు అవియు నుదాహరింపఁబడును.

సీ. బహుళతరాశాక్రాంతి బయలుప్రాఁకకయున్నఁ
గువలయ ద్వేషంబుఁ గోరకున్న
మీటి తమ్ములవిరిపోటు సేయకయున్న
దోషాళిభూతుఁడై తొలఁగకున్న
జగతి నందఱకును బగ లొనర్పకయున్న
వారుణీసక్తినిఁ బాఱకున్న
ద్విజరాజపరిభవోద్వృత్తిఁ జేకొనకున్న
సరసుల నీఁకింపఁజాలకున్న
గీ. సాటియగు విశ్వవినుత శశ్వత్ప్రతాప
వైభవధ్వస్త దుర్వారవైరివీరుఁ
డైన యోబయవరసింహు నమితభువన
భవనభృతతేజమున కబ్జబాంధవుండు

ఈ పద్యమును ప్రథమాశ్వాసమునఁ (౧౧౭) దేజస్వితకుదాహరింపఁ బడినది అక్కడ వివరణము వ్రాయఁబడినది. చూచుకొనునది.

ఇట సూర్యునికన్న నరసభూపాలుని తేజ మధికతరమని చెప్పఁబడుటచే వ్యతిరేకాలంకారము సామాన్యముగా నీ వ్యతిరేకాలంకారము శ్లేషగర్భముగా నుండును. ఇది యుపమేయాధిక్య పర్యవసాయి

ఉ. నీవు చిగుళ్ళజొంపముల నేఁబ్రియురాలిగువాలిరక్తుఁడన్
నీవయిపట్లు నావయిపు నిచ్చశిలీముఖపంక్తివచ్చుఁ గాం
తావరపాదఘాతము ముదంబిడు నీకటునా · కశోకమా !
నీవును నేను దుల్యులము ; నేనె సశోకుఁడనైతి దుర్విధిన్.

ఓ యశోకమా నీ వశోకమవు నేను సశోకుఁడను ఇట నుపమేయ మగు 'నేను' (విరహి) సశోకుఁడగుటచే నుపమానముకన్న న్యూనత్వము చెప్పఁబడినది.

దృఢతరనిబద్ధముష్టేః కోశనిషణ్ణస్య కన్యచిన్మలినస్య
కృపణస్య కృపాణస్య చ కేవలమాకారతో భేదః.

గట్టిపిడికిలి గలిగినట్టియుఁ గోశమున (ధనాగారమున - ఒఱయందు) నిద్రించునట్టియు, మలినస్వరూపము గలిగినట్టియుఁ గృపణ కృపాణములకుఁ గేవలము ఆకారము ('ఆ' యను వర్ణము) చేతనే భేదము 'కృపణ శబ్దము ప' కారమున 'అ' కారమును కృపాణ' శబ్దము 'ప కారముపై 'ఆ' కారమును గలవు. ఇదియే భేదము.

ఇట నుపమేయమగు కృపణునకుఁ గానీ యుపమానమగు కృపాణము నకుఁగానీ యాధిక్యము వర్ణింపఁబడమి "ననుభయరూపము" అను భేదము.

౪౯. శ్లేషము

కం. ప్రకృతము, లప్రకృతంబులుఁ,
ప్రకృతాప్రకృతములు, శబ్దపాటవమాత్ర
ప్రకటితసామ్యము, జెందిన
నకలంకత శ్లేషమయ్యె నదియును వరుసన్. ౧౬౧

కం. నిరతము శ్లిష్టవిశేష్యము
నరుదందును బ్రకృతములు; నప్రకృతములున్;
ధర నశ్లిష్టవిశేష్యము
లరయం బ్రకృతాప్రకృతము; లవి యెట్లన్నన్. ౧౬౨

ప్రకృతములు గానీ యప్రకృతములుగానీ ప్రకృతాప్రకృతములుగానీ యెచ్చట శ్లేషించునో యట శ్లేషాలంకారము. 'శబ్దపాటవమాత్ర ప్రకటిత సామ్యముఁ జెందిన అనఁగా అర్థమునకు శబ్దమాత్రసామ్య మున్నచో ననఁగా శబ్దసమత్వ మున్నచో ననఁగా నొకశబ్దముచే రెండర్థములు చెప్పఁబడగా' అని యర్థము. ఇందు రెండర్థములకును నేకశబ్దబోధ్యత్వరూప సామ్యముగలదు

అందు రెండర్థములును బ్రకృతములయినచోఁ బ్రకృత శ్లేషము; రెండును నప్రకృతము లయినచో నప్రకృత శ్లేషము; రెంటిలో నొకటి ప్రకృతమును, వేఱొకటి యప్రకృతమును నయ్యెనేనిఁ బ్రకృతాప్రకృతశ్లేష.

ప్రకృతశ్లేషయందును, నప్రకృతశ్లేషయందును విశేషణవిశేష్యములు రెండును శ్లేషించును. ప్రకృతాప్రకృతశ్లేషలో విశేష్యము శ్లేషింపరాదు. విశేషణమే శ్లేషించును.

"యమకాదౌ భవేదైక్యం డలయో ర్బవయోర్లయోః
శషయోర్నణయోశ్చాంతే సవిసర్గావిసర్గయోః
సబిందుకాబిందుకయోస్స్యా దభేదప్రకల్పనం"

యమకశ్లేషాదులందు డకార లకారములకును, రేఫ లకారములకును బకార వకారమునకును, శకార షకారములకును, నకార ణకారములకును సవిసర్గ, అవిసర్గపదములకును, సబిందుకాబిందుకపదములకును నైక్యము సేయ వచ్చును అను నియమము నీ శ్లేషలోఁ బాటించుకొనవచ్చును. ఆంధ్రభాషలో నర్థానుస్వారములుగల పదములకును లేనివానికిని రేఫ, శకటరేఫములకును నైక్యము జేసికొనవచ్చును.

౧ ప్రకృతశ్లేషము

కం. పరిణతగుణభరితములై
నిరుపమతరశాస్త్రకలన నిర్నిద్రములై
యిరవగు నీ ధర్మంబులు
నరనుత! రెయోబళుతీం దు నరసింహనృపా! ౧౬౮

నరసభూపాలా నీ ధర్మములు (విండ్లు) గుణభరితములై (సజ్యములై శాస్త్రకలన నిర్నిద్రములై (శస్త్రసమూహసంబంధమువలన నిర్నిద్రములై) యున్నవి.

నరసభూపాలా! నీ ధర్మములు (రాజధర్మములు) గుణభరితములై (సంధి విగ్రహయానాది షడ్గుణములతోఁ బూర్ణములై) శాస్త్రకలననిర్నిద్రములై రాజధర్మశాస్త్ర సంబంధముచే నిర్నిద్రములై) యున్నవి

రాజవర్ణనము ప్రకృతముగాన నీ రెండర్థములును బ్రకృతములే. ఇట విశేషణవిశేష్యములు రెండును శ్లేషించినవి

౨. అప్రకృతశ్లేషము

కం. అసదృశకాష్ఠాశ్లేషో
ల్లసితుల, నుగ్రకరయోగలలితుల, విభా
వసులనగు నీదు తేజో
విసరము నరసింహ! యోబవిభునరసింహా! ౧౬౯

ఓ నరసభూపాలా నీ తేజము దిక్కుల నాలింగనము సేసికొనునట్టియుఁ, దీక్ష్ణమగు కిరణములు గలిగినట్టియు సూర్యుని నవ్వును.

ఓ నరసభూపాలా నీ తేజము కట్టె నాలింగనము సేసికొనునట్టియు, నుగ్రమైన కిరణములు గలిగినట్టియు నగ్నిని నవ్వును.

ఇటఁ బ్రకృతము తేజము సూర్యాగ్నులప్రకృతములు. ఈ యప్రకృతములకు శ్లేష ఇటఁగూడ విశేషణవిశేష్యములు రెండును శ్లేషించినవి.

ఈ ప్రకృత, అప్రకృత శ్లేషలలో విశేషణవిశేష్యములు శ్లేషింపవలెనని పైనిఁ జెప్పఁబడినది కానీ రసగంగాధరకారుఁ డీ విశేష్యశ్లిష్టత కామచారమని చెప్పెను. కామచారము = ఇచ్ఛవచ్చినవిధము.

కరకలితచక్రఘటనో నిత్యం పీతాంబర స్తమోఽరాతిః
నిజసేవిజాడ్యహరణో, విష్ణుస్సూర్యశ్చనః పాతు.

కరకలితమైన పాంచజన్య చక్రయోగము గలవాఁడును, పీతాంబరుఁడును (తమః) రాహువునకు శత్రువును తన సేవకుల జాడ్యమును (అజ్ఞానమును) హరించువాఁడును నగు విష్ణువు మిమ్ము రక్షించుఁగాక.

తన కిరణములయొక్క ప్రసరణములచేతఁ జక్రవాకపక్షులను గూర్చు వాఁడును, ఆకాశమును దాఁగినవాఁడును (ఆక్రమించినవాఁడును) చీఁకటికి శత్రువును, తన్ను సేవించినవారి జాడ్యమును (మాంద్యమును) హరించు వాఁడునునగు సూర్యుఁడు మిమ్ము రక్షించుఁగాక

ఇటఁ బ్రకృతములగు విశేష్యములు (విష్ణు సూర్యపదములు) శ్లేషింపలేదు.

హరికరసంగాదధికం రమణీయాప్యతులరాగసంకలితా
కమలాయాః కమలస్య చ। శోభా గలితా తవాఽననస్యాగ్రే

స్వభావముచే మిక్కిలి రమణీయురాలును, హరికరసంగమువలన (విష్ణు హస్తసంగము) నసమానమైన రాగముగల కమల (లక్ష్మి) యొక్క శోభ సుందరీ! నీ ముఖము ముందు వివర్ణమయ్యెను

స్వభావముచే మిక్కిలి రమణీయమయ్యును సూర్యకిరణ సంపర్కముచే నసమానమైన రాగముగల కమలముయొక్క శోభ సుందరీ నీ మొగముముందు వివర్ణమయ్యెను

ఇట నప్రకృతములగు విశేష్యములు (కమలా కమల శబ్దములు) శ్లేషింపలేదు.

౮. ప్రకృతాప్రకృత శ్లేష

కం. అరిదరకరుఁడై సుమనో
వరభరణధురీణుఁడై యవారితలక్ష్మి
స్థిరవాసభాసురుండై
నరసింహుఁడు వొల్చు నాదినరసింహుఁడనన్. ౧౬౩

అరి = శత్రువు — చక్రము; దరము = భయము; శంఖము ; సుమనో వరులు = దేవతలు — పండితులు

నరసభూపాలుఁ డాదినరసింహునివలె "అరిదరకరుఁడై సుమనోవరభరణ ధురీణుఁడై యవారితలక్ష్మి స్థిరవాసభాసురుఁడై పొలుచును.

ఇట నరసభూపాలుఁడు ప్రకృతము· ఆదినరసింహుఁ డప్రకృతము. ఇట అరిదరకరు'ఁడు సుమనోవరభరణధురీణుఁడు' ఇత్యాది విశేషణములే శ్లేషించి నవి కాని విశేష్యమగు నరసింహ శబ్దము శ్లేషింపలేదు.

ఈ ప్రకృతాప్రకృత శ్లేష యెల్లయెడల నుపమచే సంకీర్ణమైయుండును. ఉపమచే శ్లేష యుత్థాపితమగును. ఇట శ్లేషయే ప్రధానము

విశేషణములు మాత్రమే యీ ప్రకృతాప్రకృతశ్లేషలో శ్లేషింపవలెనని చెప్పితిమి విశేషణములు మాత్రము శ్లేషించినను ప్రకృతాప్రకృతధర్ములు రెండును గ్రహింపఁబడవలెను (నరసింహుండాదినరసింహుఁడనన్ అనుచోటి యంమవలెనే) ప్రకృతధర్మినిమాత్రమే గ్రహించినచో నది సమాసోక్తియే యగును సమాసోక్తిలో విశేషణములు మాత్రమే శ్లేషించును.

ఈ ప్రకృతాప్రకృతశ్లేషకును శబ్దశక్తి మూలవ్యంగ్యమునకును గల భేద మేమి ? అన్నచో 'ఆదినరసింహుఁడనన్ అను నుపమానము వాచ్యమైనది. దానినిఁ దీసివేసి 'త్రిభువనస్తుతమహిమన్' అని యున్నచో నుపమాలంకారము వ్యంగ్యమగును.

ఇఁక నీ శ్లేషలో శబ్దములు విఱుగకున్నచో అభంగశ్లేష విఱిగినచో సభంగశ్లేష యనఁబడును

'స్వయంచ పల్లవాతామ్రభాస్వత్కరవిరాజితా
ప్రభాతసంధ్యేవాస్వాపఫలలుబ్ధే హితప్రదా.

ఇది పార్వతీవర్ణనము. పార్వతీదేవి ప్రభాతసంధ్యవలెఁ బల్లవాతామ్ర భాస్వత్కరవిరాజిత. పార్వతీపక్షమునఁ బల్లవములవలె నాతామ్రములయిన (మిక్కిలి యెఱ్ఱని) ప్రకాశించు హస్తములతో విరాజిల్లుచున్నది ప్రభాత సంధ్యాపక్షమునఁ బల్లవములవలె నాతామ్రములయిన సూర్యకిరణములచే విరా జిల్లుచున్నది. 'పల్లవాతామ్రభాస్వత్కర విరాజితా' అనుచో శబ్దములు విఱుగలేదు. కాన 'అభంగశ్లేష.'

పార్వతి 'అస్వాపఫలలుబ్ధేహితప్రదా' యనఁ దేలికగాఁ బొందరాని ఫలము; అనఁగా మోక్షము దానియందు లుబ్ధుఁడగువానియందు "హితప్రదా" హితమును నిచ్చునది అనఁగా దుర్లభమైన మోక్షము నొసఁగునది.

ప్రభాతసంధ్య అస్వాప ఫలలుబ్ధ + ఈహితప్రదా అస్వాపమన నిద్రాఽభావము ; దానికి ఫలమైన స్నానసంధ్యావందనాదులు వాని యందా సక్తులకు నీహితము నిచ్చునది.

ఇట హితప్రదా, ఈహితప్రదా అని పదములు విఱువఁబడినవి. కాన సభంగ శ్లేష.

రాఘవపాండవీయమున సంస్కృతాంధ్రపదముల కీసభంగాభంగ శ్లేషలు నిర్వహింపఁబడినవి.

మఱియు నీ సభంగశ్లేష వర్ణ, పద, లింగ, భాషా, ప్రకృతి, ప్రత్యయ విభక్తి, వచన భేదములచే నెనిమిది విధములని ప్రకాశకార దర్పణకారులు తెలిపిరి. వాని లక్షణములకు నాంధ్రసాహిత్యదర్పణమును జూచునది. గ్రంథవిస్తరభీతిచే వదలితిని. ఈ శ్లేష శబ్దాలంకారమని వారి మతము. కావున వారు శబ్దాలంకారములలోనే చేర్చిరి. దీనిని వారు శబ్దశ్లేష యనిరి.

భాషాశ్లేషకుదాహరణము

మంజులమణిమంజీరే కలగంభీరే విహారసరసీతీరే
విరసాసి కేళికీరే కిమాళి! ధీరే చ గంధసారసమీరే

ఓ చెలీ! మనోహరమైన గంభీరమైన నాదముగల మణినూపురమునందును, క్రీడాసరస్తీరమునందును, కేళీకీరమునందును, మలయమారుతమునందును విరసవైతివేల ?

ఈ శ్లోకము సంస్కృత, ప్రాకృత, శౌరసేనీ, అవంతీ, నాగర, అపభ్రంశభాషలలో నొకేవిధముగా నున్నది. దీనికి భాషాసమమనియు నామాంతరము.

సంస్కృతాంధ్రభాషాశ్లేష

మాయమ్మానసునీవే రాయలవై కావదేవరా ఖే ఖే ఖే
మాయాతుములానినయది। పాయక సంతోషమున్న ఫలమిలసాపీ.

సంస్కృతపదవిభాగము

మా, ఆయం, మానస, సునీవే రాయలవా, ఏకా, అవత్ ఏవ, రాజే. అఖేఖే మాయాతు, మలాని, న, యది, పాయక, సంతః, అసమున్, న, ఫల, మిల, సా, అపి.

ఆంధ్రపదవిభాగము

మాయమ్మ, అన, సు, నీవు, ఏ, రాయలవు; ఐ, కావన్, దేవరా। ఖేఖేఖే మాయాతుములు (మాయాత్మలు) అనినయది, పాయక, సంతోషము, ఉన్న ఫలము (సిద్ధఫలము) ఇలసాపీ.

ఇవిగాక వేరొక భేదముగలదు. అనులోమముగాఁ జదివినచో నాంధ్రభాషాపద్యము, ప్రతిలోమముగాఁ జదివినచో సంస్కృతభాషాపద్యము వచ్చును. చూడుఁడు.

కం. తావినువారికి సరవిగ
భావనతో నానునతి విభావిసుతేజా
దేవర గౌరవ మహిమన
మా వలసిన కవితమరగి మాకునధీశా

ఆంధ్రపదవిభాగము

"అతి విభావిసుతేజా!, అధీశా , దేవర గౌరవ మహిమన, మా వలసిన కవిత, తాన్, వినువారికి, సరవిగన్, భావనతోన్, మాకు, మరిగి, అనున్"

సంస్కృతము

(ప్రతిలోమము అనగా వెనుకనుండి చదువవలెను).

"శాధి, ఇన, కుం, అగిరి, మత వికనసి, లవమాన, మహిమ వరగౌర వదే, జాతే, సువిభా, వితి, నను, నా, అతః, ననభాః, గవి, రసకిరి, వా, విసుతా" ఈ రెండు పద్యములకును అర్థతాత్పర్యములకై కళాపూర్ణోదయము (శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారి పరిష్కృతము) 464, 472 పుటలు చూడవలెను.

అర్థశ్లేషముఁ గలదు శబ్దపరివృత్తిని సహింపనిచో శబ్దశ్లేష ; శబ్ద పరివృత్తిని సహించినచో నర్థశ్లేష. పై 'పల్లవాతామ్ర' ఇత్యాది సభంగా భంగ శ్లేషలు శబ్దశ్లేషలే

స్తోకేనోన్నతిమాయాతి । స్తోకేనాయాత్యధోగతిం
అహో సుసదృశీ వృత్తి ! స్తులాకోటేః ఖలస్య చ.

'కొలఁదిమాత్రముననే పైకిఁబోవును. కొలఁది మాత్రముననే క్రిందికిఁ బోవును. త్రాసుయొక్కయు, ఖలునియొక్కయు వృత్తము సమానమే.'

ఇట 'స్తోకేన, ఉన్నతి, అధోగతి' శబ్దములు పరివృత్తిసేసినను శ్లేష నిర్వహింపఁబడుచునే యున్నది కాన నిది యర్థశ్లేష

శ్లేష నాంగ్లమున **Paranomasia** అందురు.

౪౦. పరికరము

కం. సాకూతములై సఫలతఁ
దేకొన్న విశేషణములు చెలఁగఁ బరికరం
బై కృతుల వెలయుచుండు మ
హాకవి సంస్తుత్యమగుచు నది యెట్లన్నన్. ౧౬౬

ఎచ్చట విశేషణములు సాభిప్రాయములుగా నిబద్ధములగునో యది పరిక రాలంకారము.

సీ. దర్పితాహితనృపోత్తములు నిన్నెదిరింపఁ
గలరె! ధీరోత్తమగండబిరుద!
విమతకీర్తి ప్రతాపములు నీచే సమ
కట్టునే? యుభయరగండబిరుద!
అరివధూతాటంక గరిమంబు నీచేతఁ
గలుగునే? గండరగండబిరుద!
పరిపంథిగంధసింధురపంక్తి నీమ్రోల
నుండునే? గండభేరుండబిరుద!

గీ. అరుణపరిణామ! రామాభిరామ!
రామణీయకనిర్జితప్రసవబాణ!
బాణసాహిత్య పరిపాక! పాకవైరి
విభవసౌభాగ్య! యోబభూవిభునృసింహ! ౧౬౮

నాలుగు పెద్దపాదములందున్న ధీరోత్తమ, ఉభయరగండ, గండరగండ గండభేరుండ పదములు దర్పితాహితనృపోత్తములు. విమతకీర్తి ప్రతాపములు, అరివధూతాటంకగరిమలు పరసంధిగంధసింధురపంక్తి అనువానికిఁ బ్రతిద్వంద్వులుగా నిలిచి 'నరసభూపాలు నెదిరింపఁజాలరు' అను నభిప్రాయము గలిగి యున్నవి. ఇట్లే,

'సర్వమంగళ మంగళజాలమిచ్చు' అనుచోట సర్వమంగళాపద మభిప్రాయగర్భము.

౭౧. ఆక్షేపము

కం. ధర నిష్టమపరమార
స్ఫురణంగాతన, ననిష్టము నపరమార్ధ
స్ఫురణ విధింపఁగ, రెండై
యరయఁగ నాక్షేపమమరు నది యెట్లన్నన్. ౧౬౯

ఇష్టమును నాభాసముగా (అపరమారస్ఫురణ) నిషేధించిన నిష్టనిషేధాభాసమనియు, అనిష్టమును నాభాసరూపముగా విధించిన ననిష్టవిధ్యాభాసమనియు నాక్షేపము ద్వివిధము. ఇందలి ఇష్టనిషేధాభాసము మఱల ద్వివిధము. ఎకౌ ధాభాసము; వక్ష్యమాణనిషేధాభాసము; ఉక్తనిషేధాభాసము

కథనరూపమనియు, వస్తురూపమనియు మఱల ద్వివిధము. వక్ష్యమాణ నిషేధాభాసము కథనరూపముగా మాత్రమే యుండును. ప్రతాపరుద్రీయాదుల ఇష్టనిషేధాభాసము అనిష్టవిధ్యాభాసము అను పదముల నుపయోగింపక ఉక్తనిషేధాభాసము, వక్ష్యమాణనిషేధాభాసము అని తెలిపిరి. ఈ యుక్త, వక్ష్యమాణ నిషేధాభాసములకుఁ బ్రతాపరుద్రీయ లక్షణము లిట్టులు.

> విశేషబోధాయోక్తస్య వక్ష్యమాణస్య వా భవేత్
> నిషేధాభాసకథన మాక్షేప స్స ఉదాహృతః.

ప్రాకరణికముగాఁ జెప్పినదానినిఁ (ఉక్తము) జెప్పఁదలఁచినదానినిఁ (వక్ష్యమాణము) గాని విశేషార్థబోధనముకై నిషేధించినట్లు చెప్పిన నాక్షేపాలంకారము.

౧. ఇష్టనిషేధాభాసము

సీ. మదిలోనఁ బాయకుండుదునన్నఁ బునరుక్తి;
నీ సొమ్మునన్న గాణిక్యవృత్తి
నినుఁ బాసి నిలువలేనన నసంభావ్యంబు;
పతివివవఁగ నభఃప్రసవవాంఛ;
యతనుఁడు గారించునన నసాక్షికసూక్తి;
చలిగాలి వేఁడన్న జనవిరుద్ధ;
మెలమి నిచ్చటికి రావలయునన్న మదోక్తి;
చనుదెంతునేనన్నఁ జాపలంబు;

గీ. వెలయు త్వదధీన యగు నన్ను వేఁచు నలక
లాధరుండన్న భవదుపాలంభసరణి;
గాన నేయుక్తులు నెఱుంగఁ గరుణఁజూడు
పరసగుణహార! యోబయనరస ధీర! ౧౬౮

పునరుక్త్యాదులచే 'మదిలోనఁ బాయకుండుదు' మొదలగు చెప్పిన వానినే నిషేధించినట్లాభాసముగాఁ దోఁచుచున్నది. పరమార్థమున నిది నిషేధముగాదు "నన్నవశ్యము కరుణఁజూడుము" అను విశేషార్థమును బోధించుటకే యీ నిషేధ ముద్దేశింపఁబడినది. అయితే యీ విశేషమగు 'కరుణఁజూడుము' అనునది వ్యంగ్యముగా భాసింపవలెను. కాని వాచ్యమైనది. ఇది యిష్టనిషేధాభాసరూపము (చెప్పినదాని నాభాసరూపమున నిషేధించుట) అని తెలిపితిమి.

ఈ యుక్తనిషేధాభాసము ద్వివిధము వస్తురూపము, కథనరూపము ఇది కథన నిషేధము. వస్తురూప నిషేధ మెట్లన,

'నాహం దూతీ తనోస్తాప స్తస్యాః కాలానలోపమః'

"నేను దూతినిఁగాను, దాని తనుతాపము కాలానలోపమము." దూతి 'నేను దూతినిఁగాను' అని చెప్పిన వాక్యమునందలి నిషేధము బాధితమై యాభాస రూపమును బొంది సంఘటన కాలోచిత కైతవ వచనములు లేని యథార్థవాదిని సుమా' అను వస్తురూపమునఁ బర్యవసించుచు 'నిప్పుడే వచ్చి నాయికను బ్రదికింపుము' అను విశేషార్థమును నాక్షేపించుచున్నది.

వక్ష్యమాణ నిషేధాభాసము

విజ్ఞాపయామస్తే కించిత్ కాకతీయకులోద్వహ !
విజ్ఞాప్యతే కి మథవా సర్వజ్ఞే రక్షకే త్వయి

ఓ కాకతీయప్రభూ ! నీకుఁ గొంచెగా విజ్ఞాపన మొనర్తుము. ఎందుకు లెమ్ము ! సర్వమును దెలిసిన రక్షకుఁడవగు నీకుఁ దెలుపునదేమి ?

ఇటఁ జెప్పఁదలఁచిన దానిని నిషేధించుకొన్నట్లు వర్ణింపఁబడినది. ఇటఁ గథననిషేధము.

౨. అనిష్టవిధ్యాభాసము

చ. అలుగఁగనేల ? మీరు వసుధాధిపులెన్న స్వతంత్రులై మమున్
వలదనవచ్చు ; మీ మనసు వచ్చినచోటికి నేగుఁ, డేగినన్
వెలకొని నీ ప్రియాంగనకు నీకును మార్గోన లేకయుండ న
ర్మిలి సుకరంబుగాఁగ నొనరించెదఁగాక నృసింహభూవరా !

ఇట 'మీ మనసువచ్చినచోటి కేఁగుడు' అని తన కిష్టములేని దానిని విధిరూపమున నాయిక పలుకుచున్నది. ఈ విధి విధ్యాభాసము ఏలన, నాయిక తన నాయకుని నిచ్చవచ్చినచోటికిఁ బొమ్మనదు. ఈ విధ్యాభాసము నీవు పరాంగనల వద్దకుఁ బోవలదను విశేషార్థమును బోధించుచున్నది. ఇట్టిదే యాక్రిందిపద్యమును గూడ గనుఁడు

ఆ. వె ప్రియుఁడ ! నీదుయాత్ర పెద్దకాలం బింక
ననుఁ దపింపఁబోదు నమ్ము . నిజము;
వెడలవలసియున్న వెడలుము తడయక
కంఠ లెల్ల నొక్కవంకఁ ద్రోసి.

౪౨. వ్యాజస్తుతి

కం. సతతంబు నిందచేతను
స్తుతియున్, స్తుతిచేత నింద చొప్పడ వ్యాజ
స్తుతియై చెలువగుఁ గృతులం
దతులితకవివినుతమగుచు నది యెట్లన్నన్. ౧౪౧

నిందావ్యాజముచే స్తుతియు, స్తోత్రవ్యాజముచే నిందయును జేయుట వ్యాజస్తుతి

సీ. నెఱిజీవనము లేక నింగిపైఁ భ్రమియించు
మత్స్యంబుఁ దునుము జేపాటి వాసి?
త్రిజగతీమాత వాగ్దేవి భండారంబు
చూఱఁగాఁగొనుట యే సుగుణితనము?
వేఁడినవారికి వెండియు నొకమాఱు
విత్తమీకుంట యే వితరణంబు?
అల యనాదిప్రవాహములైన యేర్ల వం
కలుదిద్దు టేవివేకంబు కలిమి?
గీ. వఱలు నీ కీర్తి ద్విజరాజ వైభవంబు
లపహరింపంగ నీ యాజ్ఞ యలరు టెంత?
పోచిరాజాన్వయాంభోధి పూర్ణచంద్ర!
వరనుతాటోప! తోరగంటి వరసభూప! ౧౪౨

ఇది నిందావ్యాజమునఁ జేయఁబడిన స్తోత్రము. ఇందలి నింద స్తోత్ర పర్యవసాయి.

కం. అసమరణరంగముల నీ
యసినటి నటియింపఁ గరుల, హరులన్, గిరులన్
వెసనొసఁగు వైర యెంతటి
రసికుఁడు నీ వైరి? యోబరాజ నృసింహా! ౧౪౪

ఇట "ఎంతటి రసికుఁడు?" అను స్తోత్రవ్యాజముచే శత్రునింద చేయఁబడు చున్నది. ఆంగ్లమున స్తుతిరూపమునఁ జేయఁబడిన నిందను Irony అందురు.

౫౩౪ అప్రస్తుతప్రశంస

కం. ఊరి నప్రస్తుతమునఁ బ్ర
స్తుతవస్తువు గమ్యమగుచు సొంపొందిన నీ
శ్రుతులందలపోయ నప్ర
స్తుతప్రశంసాఖ్యమయ్యెఁ దుది యెట్లన్నన్. ౧౭౪

ఈ శ్రుతులన్ = ఈ శాస్త్రములందు

అప్రస్తుతవస్తు వర్ణనముచేఁ బ్రస్తుతవస్తువు గమ్యమానమయినచో నప్రస్తుత ప్రశంసాలంకారము.

ఈ యప్రస్తుత ప్రశంస పంచవిధము.

కార్యే నిమిత్తే సామాన్యే విశేషే ప్రస్తుతే సతి
తదన్యస్య వచస్తుల్యే తుల్యస్యేతి చ పంచధా.

కార్యము ప్రస్తుతమైనపుడు కార్యమును వర్ణింపక దాని కారణమును వర్ణించుట; కారణము ప్రస్తుతమైనపుడు దానిని వర్ణింపక కార్యమును వర్ణించుట; సామాన్యము ప్రస్తుతమైనపుడు దానిని వర్ణింపక దాని విశేషమును వర్ణించుట; విశేషము ప్రస్తుతమైనపుడు దానిని వర్ణింపక సామాన్యమును వర్ణించుట; ప్రస్తుతము వర్ణింపవలసియుండఁగాదానిని వర్ణింపక దానికిఁ దుల్యమైన యనఁగా సారూప్యము గల వస్తువును వర్ణించుట అని యైదువిధములు. ఇట నైదవ విధమగు సారూప్యనిబంధనా-అప్రస్తుత ప్రశంసను మాత్రమే కవి యుదాహరించెను.

కం నసలు మొనలెత్తెఁ; దేనెను
చినికెం ; జిగురాకుగందెఁ; జెదరె నలితతుల్ ;
చనవున నీ పూఁదీఁగకు
ఘనమైన నృసింహుపొందు గలుగఁగఁబోలున్. ౧౭౫

ఇట నప్రస్తుతమగు పూఁదీఁగ వర్ణింపఁబడుటచేఁ దత్సారూప్యయగు సురతోపభుక్తయగు యువతీరూపమగు వస్తువు గోచరించుచున్నది. ఇది సారూప్యనిబంధనా ప్రస్తుత ప్రశంస (కానీ యొకదోషము గలదు. 'నృసింహుపొందు' అను పద మప్రస్తుతమున నన్వయింపకున్నది. 'వసంతుపొందు' అని యున్నచో సరిపోవును). మిగిలినవాని యుదాహరణము లిత్తుము చూడుఁడు.-

౧. కార్యము ప్రస్తుతమైనపుడు దాని కారణమును వర్ణించుట.

యాతాః కిం న మిళంతి సుందరి ! పునశ్చింతా త్వయా మత్కృతే
నో కార్యా; నితరాం కృశాసి; కథయత్యేవం సబాష్పే మయి
లజ్జామంథరతారకేణ నిపతత్పీతాశ్రుణా చక్షుషా
దృష్ట్వా మాం హసితేన భావిమరణోత్సాహ స్తయా సూచితః

ఓ సుందరీ ! వెళ్ళినవారు మఱల రారా ? నాకొఱ కేల చింతింతువు ? చింతింపకుము. చాల కృశించితివి" అని నేను గన్నీటితోఁ బలుకఁగా లజ్జచే నిష్క్రియమైన కనీనికలు గల కన్నులతో వచ్చుచున్న కన్నీటి నాఁపుకొనుచు నన్నుఁజూచి నవ్వుచు భావిమరణోత్సాహమును సూచించినది.

నాయకుఁడు తన ప్రయాణసమయమున జరిగిన నాయికయొక్క ముచ్చటను దన మిత్రునితోఁ దెలుపుచున్నాడు. అతఁడు నీ వేల ప్రయాణ కార్యము మానితివి ! అని యడుగఁగాఁ బై విధముగాఁ గారణరూపమున సమాధాన మిచ్చెను. కావునఁ గార్యము ప్రస్తుతముకాఁగా కారణము వర్ణింపఁబడినది. దీనినిఁ గారణ నిబంధనాఽప్రస్తుత ప్రశంస యందురు.

౨. కారణము ప్రస్తుతముకాఁగాఁ గార్యము వర్ణింపఁబడుట.

ఉ. అంచల గర్వభంగమగు నాసతియానవిలాసముం గనన్
గాంచును మౌనవృత్తినిఁ బికంబులు ముచ్చటలాలపించినన్
గాంచిన మేనిమార్దవముఁ గన్నదు జాజియు రాయివోలె ; వీ
క్షించిన నంగశోభ సిరి సిగ్గిలితాల్పదె కావిపుట్టమున్ ;

ఇట నాయికయొక్క నడకలు, ముచ్చటలు, మార్దవము, అంగశోభ మొదలగునవి వర్ణనీయములగుటచేఁ బ్రస్తుతములు ; కాని వాని వర్ణనమేమియు లేదు ; "హంసలకు గర్వభంగమగును , పికములు మౌనము వహించును ; జాజి రాయి యట్లగును ; సిరి కావిపుట్టమును ధరించును ;" అని యప్రస్తుత కార్యములు వర్ణింపఁబడినవి. నాయిక యొక్క నడకలు మొదలగునవి కారణములు. ఇది కార్యనిబంధనాఽప్రస్తుత ప్రశంస.

౩. విశేషము ప్రస్తుతముకాఁగా సామాన్యము వర్ణింపఁబడుట.

పాదాహతం యదుత్థాయ మూర్ధాన మధిరోహతి
స్వస్థాదేవావమానేఽపి దేహిన స్తద్వరం రజః.

ఏది పాదాహతమై లేచి తలపైకెక్కునో యాధూళి యవమానమొందియును స్వస్థుఁడుఁగా నున్న వానికంటె మేలు

'శిశుపాలునివలన నవమానమును బొందియు స్వస్థులముగా నున్న మనకంటె దుమ్ము మేలు' అని బలరాముడు శ్రీకృష్ణాదులతోఁ దెలుపుచున్నాఁడు.

ఇట "మనకన్న దుమ్ము మేలు" అనునది ప్రస్తుతము. అది విశేషరూపము దానినిఁ దెలుపక యప్రస్తుతమగు 'పాదాహతం' ఇత్యాదిరూపమున సామాన్యము వర్ణింపఁబడినది. ఇది సామాన్యనిబంధనాఽప్రస్తుత ప్రశంస.

౨. సామాన్యము ప్రస్తుతముకాఁగా విశేషమును వర్ణించుట.

అంకాధిరోపితమృగశ్చంద్రమా మృగలాంఛనః
కేసరీ నిష్ఠురాక్షిప్తమృగయూథో మృగాధిపః.

తన యొడిలో మృగము నారోపించుకొన్న చంద్రుడు మృగలాంఛనుఁ డయ్యెను. క్రూరముగా మృగయూథమును హింసించెడు సింహము మృగరాజయ్యెను.

'మెత్తనివారినిఁ జూచి మొత్తు క్రూరుఁడే కీర్తిమంతుడగును. మెత్తనివాఁడు కీర్తిమంతుఁడుగాఁడు' అను సామాన్యము ప్రస్తుతముకాఁగా నప్రస్తుతమగు విశేషము వర్ణింపఁబడినది. దీనిని విశేషనిబంధనాఽప్రస్తుత ప్రశంస యందురు.

సామాన్య నిబంధనాఽప్రస్తుత ప్రశంసను నరసభూపాలీయ గ్రంథ కర్తయే యిచ్చెను.

అప్రస్తుత ప్రశంసాదోషము॥

అహరాతేమ విహంగమేమ మశకో నాయాన్ పురోవార్యతే
మధ్యేవారిధి వావసం స్తృణమణిర్ధత్తే మణీనాం రుచం
ఖద్యోతోఽపి నకంపతే ప్రచలితుం మధ్యేఽపి తేజస్వినాం
ధిక్సామాన్యమచేతసం ప్రభుమివానామృష్టతత్త్వాంతరః.

తా॥ పక్షులను బిలువఁగా దోమ దాను గూడఁ బక్షిననుకొని వచ్చుచున్నది. కాని యెవ్వరును దాని నాటంకపఱపకున్నారు సముద్రమధ్యమున రత్నములతో పాటు వసించుచు తృణమణి (గాజు)కూడా మణిగా వ్యవహరింపఁబడుచున్నది. మిణుఁగురుపురుగును తేజస్వుల నడుమఁదిరుగుటకు వెనుదీయదు. ఛీ! స్వరూప తారతమ్య జ్ఞానములేని బుద్ధిహీనుఁడగు ప్రభువువంటి యవివేకినిఁ గూర్చియేమి చెప్పవలెను?

ఇట మొదటి మూఁడుపాదములందలి సామాన్యరూపమైన యప్రస్తుత వృత్తాంతవర్ణనములచే నాల్గవపాదముయొక్క యర్థము విశేషరూపముగాఁ బ్రస్తుతముగా స్ఫురించుచునేయున్నది కావున దానిని మఱలఁ జెప్పుట పునరుక్తి లేక యపుష్టమను దోషమగును.

౪౪. పర్యాయోక్తము లేక పర్యాయోక్తి

క౦. ప్రస్తుతకార్యస్తుతిచే
ప్రస్తుతకారణముదోఁపఁ బర్యాయోక్తం
బస్తోకసుకవికావ్య
ప్రస్తుతమై చెలఁగుచుండు రహినెట్లన్నన్. ౧౭౬

ప్రస్తుతమగు కార్యవర్ణనముచేఁ ప్రస్తుతమేయైన కారణము తోఁచెనేనిఁ బర్యాయోక్తాలంకారము.

అప్రస్తుతప్రశంసలోనప్రస్తుతము తోఁచును. ఇటఁ బ్రస్తుతకార్యముచేఁ బ్రస్తుతకారణము తోచును

ఉ. "చక్కెఱపెట్టవే వికచసారసలోచన! మాటనేర్పవే
చొక్కపుగుబ్బలాఁడి! ననుఁజొప్పడఁ బాణితలంబుఁ జేర్పవే!
చెక్కులనిగ్గులాఁడి!" యని చిల్కలు వల్కు; నృసింహ! పూర్వపున్
మక్కువ నీ విరోధినృపమందిరచిత్రవధూపరంపరన్. ౧౭౭

చక్కెఱపెట్టవే ఇత్యాదికమగు శుకప్రార్థనారూపకార్యముచే "నీ శత్రు రాజులును వారితో వారి భార్యలును రాజధానులను విడిచి పాఱిపోయిరి" అను కారణము గమ్యమగుచున్నది రాజభార్యలు రాజధానులు విడిచి పాఱిపోవుటచేఁ చిలుకలు పోయి యంతఃపురచిత్రములలోనున్న యా రాజకాంతలను రాణులను గానే భ్రమించి పైవిధమునఁ బ్రార్థించుచున్నవి కాన శుక ప్రార్థనారూప కార్యమునకు రాణులు రాజధానులు విడిచి పారిపోవుట కారణము ఇది గమ్యము. ప్రకాశకారదర్పణకారాదులు దీని లక్షణమును వివిధముగా నిచ్చియున్నారు. ఎట్లనఁగా.

"పర్యాయోక్తం తు గమ్యస్య వచోభంగ్యంతరాశ్రయం" — చంద్రాలోకము. గమ్యమును భంగ్యంతరమునఁ జెప్పుట పర్యాయోక్తము.

"పర్యాయోక్తం వినా వాచ్యవాచకత్వేన యద్వచః"—కావ్యప్రకాశము. వాచ్యవాచక స్వరూపముతోఁగాక వేఱువిధమున జెప్పుట.

" పర్యాయోక్తం యదా భంగ్యా గమ్యమేవాభిధీయతే " — సాహిత్య దర్పణము. గమ్యమే భంగ్యంతరమునఁ జెప్పఁబడినచోఁ బర్యాయోక్తము

"వివక్షితస్యార్థస్య భంగ్యంతరేణ ప్రతిపాదనం పర్యాయోక్తం—"రస గంగాధరము వివక్షితమగు నర్థమును నేరుగాఁ జెప్పఁదలఁచిన యర్థమును భంగ్యంతరముచేఁ జెప్పుట పర్యాయోక్తము.

ఈ లక్షణములయం దెల్లయెడలను గమ్యమగు లేక వ్యంగ్యమగు నర్థమునే వైచిత్ర్యార్థము భంగ్యంతరమునఁ దెలిపినచోఁ బర్యాయోక్తము అని తేలును. పర్యాయేణ భంగ్యంతరేణ ఉక్తమేవ ఉక్తిః పర్యాయోక్తం అని వ్యుత్పత్త్యర్థము

యం ప్రేక్ష్య చిరరూఢాపి నివాసప్రీతి రుజ్ఝితా
మదేనైరావణముఖే మానేన హృదయే హరేః.

రావణునిఁగాంచి మదము (కర్త) ఐరావతముఖమునందును. మానము (కర్త) ఇంద్రుని హృదయమందను దమ చిరరూఢమైన నివాసప్రీతిని వదలినవి.

ఇట "నైరావతశక్రులు మదమానముక్తులయిరి" అనునది వ్యంగ్యార్థము. ఈ వ్యంగ్యార్థము వైచిత్ర్యార్థము వ్యంగ్యార్థమేవిధముగాఁ బ్రతిపాదింపఁబడ వలయునో యావిధముగాఁ బ్రతిపాదింపఁబడక భంగ్యంతరమునఁ (మద మైరావతముఖమునందును, మాన మింద్రుని హృదయమునందును దమ చిర రూఢమైన నివాసప్రీతిని వదలినవి అను విధమున) బ్రతిపాదింపఁబడినవి. ఎట్లన 'జనోగచ్ఛతి అనునెడ "జనేన గమ్యతే" అనియు, 'అగమ్యతాం' అనునెడ 'అగమనేన అలంక్రియతాం'అనియుఁబ్రకారాంతమున నొకేయర్థము వైచిత్ర్యార్థము చెప్పఁబడును. ఆ విధముగనే వ్యంగ్యమగు నర్థమే యిట భంగ్యంతరముచేఁ బ్రతిపాదింపఁబడును. ఇట్లే,

"చక్రాభిఘాతప్రసభాజ్ఞయైవ చకార యో రాహువధూజనస్య
ఆలింగనోద్దామవిలాసవంధ్యం రతోత్సవం చుంబనమాత్రశేషం."

ఏ విష్ణువు చక్రాభిఘాతరూపమగు నాజ్ఞచేతనే రాహువధూరతోత్సవమును ఆలింగనవిలాసహీనమునుగాఁ, జుంబనమాత్రశేషమునుగాఁ జేసెనో.

'శ్రీ విష్ణువు తన చక్రాయుధముచే రాహుశిరశ్ఛేదమును జేసెను' అను వ్యంగ్యార్థమే పై విధమున భంగ్యంతరమునఁ జెప్పఁబడినది

పై నరసభూపాలీయ లక్షణమునఁ 'ప్రస్తుతమగు కార్యముచేఁ బ్రస్తుతమగు కారణము గమ్యమగుచోఁ బర్యాయోక్తము' అనియున్నది. ఈ లక్షణములకును దానికిని నేకవాక్యత యెట్లు ? అన్నచో వినుఁడు. ఎల్లయెడలను గమ్యమగు కారణరూపార్థమే భంగ్యంతరమునఁ (గార్యరూపమున) జెప్పఁబడుచున్నది. కావున నరసభూపాలీయలక్షణము నిర్దుష్టమే

ఇందలి వ్యంగ్యము వాచ్యసిద్ధ్యంగము కావున జగన్నాథ మతమున నుత్తమకావ్యమును నితర మతమున గుణీభూతవ్యంగ్యమును నగును.

౭౫. ప్రతీపము

కం॥ ఉపమేయమె చాలును ధర
నుపమానం బేల ? యనఁగ నొనరుఁ బ్రతీపం

బపరిమితసుకవికృతులం
దపారవిస్ఫూర్తిఁ జెంది యదియెట్లన్నన్. ౧౪౮

ఉపమానముయొక్క పని యుపమేయమే చేయుచుంటచే నుపమానమేల? అని వర్ణింపఁబడినచోఁ బ్రతీపము.

సీ. [సత్పథక్రమకళాచాతురి నెఱపదో ?
కమలాకరామోదకరముగాదో ?
వివిధచక్రానందవిభవంబొనర్పదో ?
సతతంబు నుదయసంగతముగాదో ?
ఇల మహోగ్రగహరాజ జృంభణంబలమదో ?
యమితదోషోన్మేషహరముగాదో ?
మహితగాంగేయధామస్ఫూర్తిఁ జెలఁగదో ?
యచ్యుతోగ్రాకారహారి గాదో ?

గీ. నీప్రతాపంబు దనవలె నిఖలతమము,
నడఁపఁగాలేదొ ? తానేల యరుగుదెంచుఁ
గుంటిసారథితో నల్లకుముదవైరి ?
నరనుతాటోప! యోబయనరసభూప ౧౪౯

ఉపమానమగు సూర్యుఁడు చేయు కార్యమును నుపమేయమగు ప్రతాపమే చేయుచుండఁగా నతఁడేల ? (ఉపమానమేం?) అని చెప్పుటచేఁ బ్రతీపము.

ఉపమేయమున కుపమానత్వముఁ గల్పించినను బ్రతీపమే యగును. ప్రతీపమన విపరీతము. ఉపమాలంకారమునకు విపరీతాలంకారము ప్రతీపము.

"త్వల్లోచన సమం పద్మం త్వద్వక్త్ర సదృశో విధుః"

పద్మము నీ కన్నులతో సమానము చంద్రుడు నీ ముఖముతో సమానము. ఇట నుపమేయములగు నేత్ర ముఖము లుపమానము లయినవి.

౪౬. (అనుమానము)

కం. భువి సాధనసంపదచే
నవిరళవిస్ఫూర్తి సాధ్య మనుమేయముగా
వివిధశ్లేషవిశేషా
ద్యవియుత మనుమానమయ్యె నది యెట్లన్నన్. ౧౫౦

సాధ్య సాధన నిర్దేశ నిబంధనము గలది యనుమానాలంకారము. సాధన సంపదచే సాధ్యమనుమానింపఁబడవలెను. తర్క శాస్త్రమున ననుమాన ప్రమాణమను నొక ప్రమాణముగలదు. పర్వతమునఁ బొగనుజూచి నిప్పున్న దని యొకఁ డూహించును. ఇది యనుమానప్రమాణముయొక్క నిరూపణము. "పర్వతమున నిప్పున్నది ఏల? పొగ యుండుటవలన. ఎటనెటఁ బొగయుండునో యటనటఁ దప్పకనిప్పుండును. వంటయింట పొగయున్నది; నిప్పున్నది. కావునఁబొగయున్న చోటఁ దప్పక నిప్పుండును నిప్పులేనిచోఁ బొగ లేదు. మడుగున నిప్పులేదు కానఁ బొగలేదు" కాఁబట్టి పొగ యను సాధనముచే సాధ్యమగు నిప్పు పర్వతమున ననుమానింపఁబడుచున్నది అదేవిధమునఁ జమత్కారవిశేషముచే సాధనముచే నియతసాహచర్యముగల సాధ్యమును ననుమానించుట యనుమానాలంకారము.

వివిధశ్లేషవిశేషాద్యవియుతమన శ్లేషవిశేషాదులచేఁ దప్పక కూడినది. (యుతము=కూడినది; వియుతము=కూడనిది అవియుతము=తప్పకకూడినది) అనఁగా నీయనుమానాలంకారము శ్లేష, రూపక, ఉత్ప్రేక్షాదిగర్భమై సుందరముగా శోభిల్లును.

సీ. కమలాక్షుఁ డీ మేటికాఁబోలుఁ గాకున్నఁ
గరముల శంఖచక్రములు గలవె?
కమలారి యీ రాజు గాఁబోలుఁ గాకున్న
సకలకళావిలాసములు గలవె?
కమలా ప్తుఁడీ ప్రోడ గాఁబోలుఁ గాకున్న
నధిగతమండలవ్యాప్తి గలదె?
కమలజుండీ స్వామి కాఁబోలుఁ గాకున్నఁ
జతురాననవచఃప్రశస్తిగలదె?

గీ. అనుచుఁ గొనియాడుదురు నిన్ను వంగవంగ
మాళవావంతిగౌళనేపాళచోళ
కుకురుకురుపాండ్యశకముఖక్షోణిపతులు
నరనుతాటోప? ఓబయనరసభూప! ౧౮౧

శంఖచక్రములు = శంఖచక్రాయుధములు, శంఖచక్రరూపరేఖలు; కలావిలాసము=షోడశకళలవిలాసము, విద్యావిలాసము; మండలము=బింబము రాష్ట్రము; చతురానన=బ్రహ్మ; చతురమైన ముఖము.

ఇట శంఖచక్రాది సాధనములచేఁ గమలాఘాదులగు సాధ్యములు సాధింపఁబడినట్లు వర్ణింపఁబడినది. శంఖచక్రాదులకును గమలాఘాదులకును నియత సాహచర్యము గలదుగదా ! ఇట శ్లేషగర్భమగు ననుమానము.

జానీమహేఽస్యా హృది సారసాక్ష్యా
విరాజతేఽంతః ప్రియవక్త్రచంద్రః
యత్కాంతిజాలైః ప్రసృతైస్తదంగే
ష్వాపాండుతా కుట్మలతాక్షిపద్మే

ఈ యువతి హృదయమునఁ బ్రియముఖచంద్రుఁడు శోభిల్లుచున్నాఁడు. (సాధ్యము) ఏలన బ్రియముఖచంద్రకాంతిజాలముచేఁ దానిమేనిపై నుబికిన దెల్లఁదనము గనవచ్చుచున్నది; మఱియు దానికనుదామరలు మూసికొన్నవి. (సాధనము)

ఇట వక్త్రచంద్రుఁడనుచో రూపకము. కాన నిది రూపకగర్భమగు ననుమానము

యత్ర పతత్యబలానాం దృష్టిర్నిశితాః పతంతి తత్రశరాః
తచ్చాపరోపితశరో ధావత్యాసాంపురః స్మరో మన్యే

ఎచట యువతుల చూపు పడుచున్నదో యచట వాఁడిములుకులు పడుచున్నవి. (సాధనము) దీనినిఁబట్టి యధిజ్యశరాసనుఁడై (విల్లెక్కు పెట్టినవాఁడై) మదనుఁడు వారి ముందు పరుగువాఱుచున్నాఁడని యూహింతుము. (ఇట సాధ్యముత్రేక్షింపఁబడుచున్నది) ఇట నుత్ప్రేక్షాగర్భమగు ననుమానము.

అలంకారాంతర రహితమగు నుదాహరణములుగూడఁ గలవు. ఎట్లన,

యత్రైతా లహరీచలాచలదృశో వ్యాపారయంతి భ్రువః
యత్తత్రైవ పతంతి సంతతమమీ మర్మస్పృశో మార్గణాః
తచ్చక్రీకృతచాపమంచితశర ప్రేంఖత్కరః, క్రోధనో
ధావత్యగ్రత ఏవ శాసనధర స్తత్యం తదాసాం స్మరః

ఎచ్చటఁ దరంగములవలెఁ జంచలములగు చూడ్కులను యువతులు తమ కనుబొమ్మనుండి ప్రసరింపఁజేయుచున్నారో యచ్చటనే మర్మభేదులగు బాణము లెడతెగకుండఁ బడుచున్నవి (సాధ్యము) దీనిచే మదనుఁడు దన విల్లెక్కువెట్టి వారి శాసనమును బాలింప నుంకించి వారి పురోభాగమునఁ బరుగు వాఱుచున్నాఁడు. (సాధనము) ఇది సత్యము.

ఇందితరాలంకారమేమియు లేదు.

౮౭. కావ్యలింగము

కం. హేతువు వాక్యార్థంబై
యాతతవిస్ఫూర్తితోఁ బదార్థంబునునై

ఖ్యాతిగనఁ గావ్యలింగం
బై తగు సత్కృతులయందు నదిరొుట్లన్నన్. ౧౮౨

ఒక కార్యమునకు వాక్యార్థమైనను బదార్థమైనను హేతువుగా నిర్దేశింపఁ బడినచో గావ్యలింగము

౧. వాక్యార్థహేతుకము

మ. అరుదై పొల్పగు 'పోచిరాజు నరసింహా' యన్న యష్టాక్షరీ
వరమంత్రం బది యెల్లకాలము నరుల్ వాక్రువ్వసిద్ధించుఁబో!
కరు, లాందోళిక; లశ్వముల్, విభవముల్; గ్రామంబు, లత్యుజ్జ్వలాం
బరముల్ సొమ్ములుఁబల్లకీల్, పరిణయప్రారంభసంరంభముల్.

గజాదులు లభించుటకు హేతువుగా "పోచిరాజు నరసింహా! యన్న యష్టాక్షరీవరమంత్రం బది యెల్లకాలము నరుల్ వాక్రువ్వ" అను వాక్యము కూర్పఁబడినది.

౨. పదార్థహేతుకము

కం. గురునఖదళితప్రతిమా
కరిచిత్రితభిత్తిగళిత ఘనమణిపీఠా
పరితోషయుతములై నీ
యరిపురములఁ గినుకమాను హరులు నృసింహా! ౧౮౪

సింహములు గినుక మానుటకు హేతువుగా 'మణిపీఠ' అను పదార్థము కూర్పఁబడినది. (నరసరాజుశత్రువులు దమపట్టణములను విడిచిపోయిరి. వారి మేడలలోని గోడలపైఁ జిత్రింపఁబడిన యేనుఁగులను గాంచి సింహములు నిజమైన యేనుఁగులే యని వాని కుంభములను జీల్పఁగా మణులు రాలుచున్నవి. వానినిఁజూచి సింహములు కినుకను మానుచున్నవి.)

దీనినిఁ గొందఱు హేత్వలంకారమనిరి రసగంగాధరకారుఁడు "కావ్యలింగం నాలంకారః వైచిత్ర్యాత్మనో విశేషస్య అభావాత్" కావ్యలింగ మలంకారముగాదు. అలంకారమునకుఁ గావలసిన వైచిత్ర్యవిశేష మిందు లేదు అని యలంకారత్వమును నిషేధించెను.

౭౮. అర్థాంతరన్యాసము

గీ. మహి విశేషంబుచేత సామాన్యమును, బ్ర
సక్తసామాన్యమున విశేషము, సమర్థి
తముగ నర్థాంతరన్యాసమమరుచుండు
నెలమి రెండువిధంబులై యెట్లటన్న. ౧౮౫

విశేషముచేత సామాన్యమును, సామాన్యముచేత విశేషమును సమర్థింపఁబడినచో నర్థాంతర న్యాసమగును.

అనుపపద్యమానముగా (పొసఁగనివిధమున) భావింపఁబడుచున్న యర్థమును నుపపద్యమానముగాఁ జేయుటకై యనఁగా సమర్థించుటకై యర్థాంతరమును దెచ్చియుంచుట యర్థాంతరన్యాసము.

౧. విశేషముచే సామాన్యము సమర్థింపఁబడుట–

కం. విమలాత్ముఁ డెచటనుండిన
విమలుండగు; నెట్లటన్న వినుము! సురాగా
రమునఁ జరించియు నీ యశ
మమలస్థితిగాదె ? యోబయప్రభు నరసా! ౧౮౬

విమలుఁ డెచ్చటఁ జరించినను విమలుఁడే । నీ కీర్తి నీలాకాశమునఁ జరించినను విమలమే. 'విమలుఁడు విమలుఁడే' అనునది సామాన్యము. నీ కీర్తి యిత్యాదికము విశేషము. ఈ విశేషముచే సామాన్యము సమర్థింపఁబడుచున్నది. 'విమలుఁడు విమలుఁడే' అనఁగానే యేల విమలుఁడు మలసహితుఁడుగాఁడో యది యనుభవపూర్వకముగాఁ దెలియదు. నీ కీర్తి మలినమైన యాకాశమునఁ జరియించియు 'విమలము' అనుటచే నది యుపపద్యమానముగా నిస్సందిగ్ధముగా రూఢిపడును.

౨. సామాన్యముచే విశేషము సమర్థింపఁబడుట

చ. జలనిధి రాజకన్య కనుసన్న మెలంగుచునుండు; వాణియున్
మెలఁగునుమాటలోన ; నెలమిం జెయిసన్న జరించు కీర్తి; నీ
లలితభుజోపగూహన విలాసము మానదు ధాత్రి; సద్గుణో
జ్జ్వల ! నరసింహా! మంత్రబలవంతుల కింతులుచిక్కు టబ్రమే!

లక్ష్మి సరస్వతి కీర్తి, భూదేవులు నీ వశంవదలై యున్నారు. అనునది విశేషార్థము. ఇది యనుపపద్యమానముగాఁ దోఁచుచున్నది. మంత్రబలవంతుల కింతులు చిక్కుటబ్రమే? అను సామాన్యార్థముచే నుపపద్యమానమగుచున్నది.

అర్థాంతరన్యాసదోషము

దివాకరాద్రక్షతి యో గుహాసు లీనం దివాభీతమివాంధకారం
క్షుద్రేఽపినూనం శరణం ప్రపన్నే మమత్వముచ్చైశ్శిరసామతీవ.

ఇది హిమవత్పర్వత వర్ణనము. హిమవంతము తన గుహలయందు దివాభీతమట్లు (పగటికి జడిసినదివలె · గుడ్లగూబయో యన అని రెండర్థములు) దాఁగిన యంధకారమును సూర్యునినుండి కాపాడుచున్నది. తన్ను శరణుఁ జొచ్చిన క్షుద్రునియందును మహోన్నతులకు మమత్వ ముండునుగదా!

ఇట నచేతనమగు చీఁకటి సూర్యునివలన భయపడినట్లుత్ప్రేక్షింపఁబడినది. అచేతనపదార్థమునకు భయముండదుగదా! కవిప్రౌఢోక్తిచే నట్లుత్ప్రేక్షింప వచ్చును. దాని కనుపపత్తిలేదు అనుపపత్తి యున్నచో నర్థాంతరన్యాస మవసరము. ఇట ననుపపత్తిలేమి దత్సమర్థనార్థమర్థాంతరన్యాసమనవసరము.

౪౯. యథాసంఖ్యము

కం. సమముగ నేవరుసఁబదా
 ర్థములుద్దిష్టంబులయ్యెఁ దగనాపర్యా
 యమున ననూద్దిష్టములై
 యమర యథాసంఖ్యమయ్యె నది యెట్లన్నన్. ౧౫౮

ఏ క్రమమునఁ బదార్థములుద్దేశింపఁబడినవో పర్యాయమునఁగూడ నాక్రమమునే యనుసరించి వచింపబడినచో యథాసంఖ్యాలంకారము. దీనికి సంఖ్యానమనియుఁ గ్రమాలంకారమనియు నామాంతరములు.

చ. వరకరుణా, ధరాభరణ, వైభవ సద్గుణ, బుద్ధిచాతురీ,
 పరమవిభుత్వ, పావనవిభా, బల ధైర్యవిజృంభణంబులన్
 వరుస హరిన్, గిరిన్, గళశవార్నిధి, గీర్నిధి, శూలిఁ, గీలినా
 కరిఁగిరి గెల్తువౌరః త్రిజగన్నుత! శ్రీ నరసింహాభూవరా!

క్రమముగాఁ గరుణయందుహరిని ధరాభరణమునగిరిని వైభవసద్గుణమున గళశవార్నిధిని, బుద్ధిచాతురిని గీర్నిధిని, పరమవిభుత్వమున శూలిని, పావనవిభయందుఁ గీలిని (అగ్నిని), బలమునఁ గరిని, ధైర్యమున గిరినిఁగెల్తువు.

ఉద్దిష్టములకు యథాక్రమముననే యనూదిష్టములును వచింపఁబడినవి. విచ్ఛిత్తివిశేషములేమి దీనినిఁగూడ నలంకారము గాదని రసగంగాధరుఁడు వచించెను.

౫౦. అర్థాపత్తి

కం. వరుస నొకానొక వస్తువు
గిరికొన వస్త్వంతరంబు కిముతన్యాయ
స్ఫురితంబై చనుదేరఁగ
ధర నర్థాపత్తియయ్యెఁ దగ నెట్లన్నన్. ౧౯౦

ఒక యర్థముయొక్క నివృత్తిచేతనే వేరొక యర్థము కైముతికన్యాయముచే సిద్ధించుచున్నట్లు వర్ణించిన నది యర్థాపత్తి. దండాపూపన్యాయమని యొక న్యాయము గలదు. 'ఎలుకలు దండమును భక్షించినవి' అనఁగానే దండభక్షణము చేతనే దండమునందున్న యపూపభక్షణమర్థాత్తుగాఁ జెప్పఁబడినట్లే యగును అట్లే యిటను గ్రహింపవలెను (కైముతికన్యాయము — కిముత — వేఱు మాట చెప్పనేల? యనునర్థ మొసఁగు న్యాయము)

సీ. అమరశైలము చిన్నమంతగాఁ దలపోసి
యాశాచలము దారమెత్తుఁ జేసి
వెలయు మంధానాద్రి వేళ్ళతోఁ బెకలించి
మైనాకమబ్ధిలో మ్రగ్గఁజేసి
యనుపమావంధ్యవింధ్యస్ఫూర్తి నిలఁ గ్రామి
మలయాగమున్వికి వెలి యొనర్చి
యల క్రౌంచగిరికి రంధ్రాన్వేష మొనరించి
నలిగుబ్బలికి వింతపడఁకుఁ గూర్చి

గీ. అదరు నీధైర్య; మనినచో నపరగిరులు
సాటిరావని మఱి వేఱె చాటనేల?
పోచిరాజాన్వయాంభోధి పూర్ణచంద్ర!
వైరిగజసింహ! యోబయనారసింహ! ౧౯౧

ఇట నీధైర్యమమరశైలాదుల నల్పముగాఁ జేసెనను నర్థోపన్యాసము చేతనే వస్త్వంతరములయొక్క స్వల్పత్వము వేఱె యడుగనేల? అను నర్థము కైముత్యన్యాయముచే వర్ణింపఁబడినది.

ఇట 'అపరగిరులమాట దాటనేల?' అనినఁ జాలు 'అపరగిరులు సాటిరావని' అనునది యసుందరము.

కం. తన హృదయంబును జీలిచి
కొనివచ్చిన కలికి కటికగుబ్బలకవకుం
గనికరమనునది లేశం
బును గలదే లాఁతిహృదయమును జీల్పంగన్?

పై పద్యమున శాబ్దమగు కైముత్యము (దాటనేల?) ఇట నార్థము. (తన హృదయమునే చీల్చుకొని వచ్చెను ఇఁక లాఁతిహృదయమును గూర్చి చెప్పనేల? యని భావము)

౫౧ పరిసంఖ్య

కం. తలఁపగ నొకటి యనేక
స్థలముల సంబంధసంగతంబగు నెడలన్
బలిమి నొకయెడనె నిలుపుట
వెలయుం బరిసంఖ్యయగుచు వినుమెట్లన్నన్. ౧౯౩

పరితః వర్జనేన కస్యచిద్వర్జనేన కుత్రచిత్సంఖ్యానం వర్జనీయత్వేన గణనం పరిసంఖ్యా అని వ్యుత్పత్తి. ఒక వస్తువనేక స్థలములం దేకకాలమున సంభవించు చుండఁగా నేకస్థలమునందే నియమించుట పరిసంఖ్య.

సీ. అందమై త్రిభువనానందమై జితకుంద
బృందమై నభమున బెరయునెద్ది?
పొంకమై భృతరక్తపంకమై నమరని
శ్శంకమై విమతింపఁజాలునెద్ది?
తోరమై దానైకధీరమై సజ్జనా
ధారమై ధారుణిఁ దనరునెద్ది?
తండమై చండిమాఖండమై సంభృతా
ఖండమై దండిమై నలరునెద్ది?

గీ. వినుము నీకీర్తి; నీభుజాన్వితకృపాణి;
నీకరము; నీరుచియకాని నెలయఁగాదు
విధుపొడుపు; గాదు పవి; గాదు వేల్పుమ్రాను;
గాదు రవిబింబ మోబయ కాంతునరస! ౧౯౪

అందమై నభమున బెరయునెద్ది ? అనునెడ నా వస్తువు విధుపాదువు, కీర్తియను రెండును గావచ్చును. అట్టిచో విధుపాదుపును గంఠోక్తిచే విసర్జించి కీర్తిగానే సిబంధింపఁబడినది. మిగిలిన పాదములందును నిదేవిధముగా గ్రహింప వలెను.

ఈ లక్షణలక్ష్యములు ప్రతాపరుద్రీయానుసారముగా నున్నవి. కావ్య ప్రకాశ సాహిత్యదర్పణములందు దీని లక్షణ మిట్లున్నది.

> కించిత్పృష్టమపృష్టం వాకథితం యత్ప్రకల్ప్యతే
> తాదృగన్యవ్యపోహాయ పరిసంఖ్యా తు సా స్మృతా.

ప్రశ్నపూర్వకముగాఁ గానీ యప్రశ్నపూర్వకముగాఁ గానీ ప్రతిపాదిత మైనది. యన్యవ్యపోహార్థము గల్పింపఁబడినచో నది పరిసంఖ్య.

> కిం భూషణం సుదృఢ మత్ర యశో ; న రత్నం
> కిం కార్యమార్యచరితం సుకృతం ; న దోషః
> కిం చక్షురప్రతిహతం ధిషణా ; న నేత్రం
> జానాతి కస్త్వ దపరస్సదసద్వివేకం.

ఈ లోకమున సుదృఢమగు భూషణమేమి ? యశస్సు ; అంతేకాని రత్నముగాదు ; చేయఁదగినదేమి ? ఆర్యచరితమగు సుకృతము ; దోషముగాదు; అప్రతిహతమగు చక్షువేమి ? బుద్ధి , నేత్రముగాదు , నీ కంటె నెవఁడు సద సద్వివేకమును తెలిసినవాఁడు గలఁడు ?

ఇట 'కిం భూషణం సుదృఢ మత్ర' అనునది ప్రశ్న సమాధానముగా, ప్రతిపాదితమైనది. "యశః న రత్నం" అనునది ఇది. యన్యవ్యపోహార్థము అనగా స్వసదృశవస్తువ్యావృత్తియందుఁ బర్యవసించును. (కీర్తియే భూషణముగాని రత్నముగాదు అనునర్థమునఁ బర్యవసించును.) ఇది ప్రశ్నపూర్వకము.

పైనరసభూపాలీయ లక్షణమునకును దీనికిని నేకవాక్యత యెట్లని ప్రశ్న వచ్చుచున్నది. నరసభూపాలీయలక్షణమగు "ఒక వస్తువనేకస్థలములం దేక కాలమున సంభవించుచుండఁగా నేకస్థలమునందే నియమించుట" అను లక్షణ మిటఁ గూడఁబట్టును. ఎట్లన "కిం భూషణం" ఇత్యాది స్థలమున భూషణత్వము కీర్తి, రత్నములందుఁ బ్రసక్తించుచుండఁగా రత్నము భూషణము గాదని కంఠోక్తిచే వర్జించి కీర్తియే భూషణమని నియమింపఁబడినది. ఇదేవిధమున మిగిలిన యెడలను గ్రహింపవలెను. లక్షణములందుఁ గథనభేద మున్నను సమా నార్థకములే. లక్షణద్వయమునందును నన్యవ్యపోహము ప్రధానము

ఈ పరిసంఖ్యాలంకారము చతుర్విధము. ఇది ప్రశ్నపూర్వకము. ఇందుఁ బ్రశ్నమును, శాబ్దమగు పరివర్జనమును గలదు.

కి మాసేవ్యం పుంసాం? సవిధమనవద్యం ద్యుసరితః
కి మేకాంతే ధ్యేయం? చరణయుగళం కౌస్తుభభృతః
కి మారాధ్యం? పుణ్యం; కి మభిలషణీయం? చ కరుణా
యదాసక్త్యా చేతో నిరవధివిముక్త్యై ప్రభవతి.

పురుషులకు సేవింపఁదగిన (వసింపఁదగిన) స్థలమేది? పవిత్రమగు గంగా తీరము. ఏకాంతమున ధ్యానము చేయఁదగినదేది? శ్రీహరియొక్క చరణ యుగళము. ఆరాధింపఁదగినది, (గడింపఁదగినది) ఏది? పుణ్యము. అభిలషింపఁ దగినదేది? కరుణ; తదాసక్తిచే హృదయము పునరావృత్తిరహితమైనముక్తిని బొందఁజాలును. ఇందుఁ బ్రశ్నమే కాని "యశో న రత్నం" అన్నట్లు శాబ్దమగు వర్ణనములేదు. అర్థమగు వర్ణనము కలదు.

భక్తిర్భవే; న విభవే వ్యసనం శాస్త్రే, న యువతికామాస్త్రే
చింతా యశసి న వపుషి: ప్రాయః పరిదృశ్యతే మహతాం.

భవునియందే భక్తి విభవమునఁ గాదు శాస్త్రమునందే వ్యసనము. యువతిరూపమగు కామాస్త్రమునఁగాదు (కామాస్త్రరూపమగు యువతి యనియు నర్థమును జెప్పుకొనవచ్చును,) యశస్సంపాదనమునందే చింత; శరీర పోషణమునఁ గాదు. మహాత్ములకుఁ దఱచుగా నివ్విధమునఁ గనఁబడును.

ఇటఁ బ్రశ్నములేని శాబ్దమగు వర్ణనముగలదు.

కౌటిల్యం కచనిచయే కరచరణాధరదళేషు రాగస్తే,
కాఠిన్యం కుచయుగళే, తరళత్వం నయనయోర్వసతి.

నీ కచబృందమునఁ గౌటిల్యమును, కరచరణాధరములందు రాగమును కుచయుగమునఁ గాఠిన్యమును, నయనములందు దరళత్వమును వసించు చున్నవి.

ఇటఁ బ్రశ్నములేని యర్థపరివర్జనము గలదు.

౫౨. ఉత్తరము

కం. ఎత్తఱినున్నేయంశె
యుత్తరమునఁ బ్రశ్న; మఱియు, నుత్తరము వెసన్
మొత్తమయిపొల్చు నెత్తఱి
నత్తఱి నుత్తరమునెగడు నదియెట్లన్నన్ ౧౯౬

ప్రతివచనమాత్రముచే నెచ్చటఁ బ్రశ్నరూపమూహింపఁబడునో యది యొక యుత్తరాలంకారభేదము. ఈ ప్రశ్నోత్తరములు మొత్తమైయున్నచో ననఁగా మాలారూపముగా నున్నచో నది మఱొక యుత్తరాలంకారభేదము.

ఈ రెండవభేదమునకుఁ బ్రకాశకారుఁడీ క్రిందివిధమున లక్షణముఁ జెప్పెను.

"అసకృద్యదసంభావ్య ముత్తరం స్యాత్తదుత్తరం"

పెక్కుసారులు ప్రశ్నలును లోకోత్తరముగా ననఁగా సామాన్యులూహింప రాని విధమునఁ బ్రతివచనములును వర్ణింపఁబడినచో నదియు నుత్తరాలంకార భేదము. ఈ ప్రశ్నోత్తరము లొక్కమారు వర్ణించినచో విచ్ఛిత్తి విశేషములేమి మాలారూపముననే యుండవలెను.

౧

సీ. అలరారు పూఁదీవయని తలంచితిఁగాని
యబల! నీ తనువల్లియగుట యెఱుఁగ
వాలోలపల్లవంబని భ్రమించితిఁగాని
చెలువ! నీ చేసన్న సేయుటెఱుఁగ
అలిజాలికాజాలమనుచుఁ జూచితిఁగాని
సుదతి! నీ చికురముల్ సెదరుటెఱుఁగ
వలకోకిలాలాపమనుచు నుండితిఁగాని
పడఁతి! నీ వెలుఁగెత్తి పలుకుటెఱుఁగ

గీ. అలుకఁ జాలింపుమనుచు నీ యహితనృపతి
భావకోద్భటభాటికిఁ దల్లడిల్లి
యడవులకునేఁగి కులకాంత నాదరించు
నరునుతాటోప! యోబయనరసభూప! ౧౯౫

పతియొక్క యీ ప్రతివచనములచేత భార్యచేసిన "అగపడుచున్నను నన్నుఁజూడవేమి? చేసన్న జేయుచున్ననురావేమి? ఎలుగెత్తి పిలిచినను బలుక వేమి?" అను ప్రశ్న లూహింపఁబడుచున్నవి. అట్టిప్రశ్నలే లేకున్నచో నిట్టిసమాధానములే పొసఁగవు. అసంగతములే యగును. ఇందలి మూఁడవ పాదమున నున్న "అలిజాలికా" ఇత్యాదికముఁ బ్రతివచనరూపముగా లేదు కావున నిటఁ బ్రశ్నమున్నేయముగాదు లేక యతికష్టముగాఁ బ్రశ్న నూహింపవచ్చును. ఎట్లన "నా చికురములు సెదరు టెఱుఁగవా?" అని. తత్సమాధానము 'అలిజాలికా' ఇత్యాదికము అని.

౨

సీ. ఎవ్వఁడు దేవతాగురుఁ? డహీనశయానుఁ; డవక్రవిక్రముం
డెవ్వఁడు? రామభద్రుఁడు; మహీవలయైకధురాధురంధరుం

దెవ్వఁడు ? భోగిభర్త ! జగదేకవిజృంభితదానదీక్షితుం
డెవ్వఁడు ? పోచిరాజు నరసేంద్రుఁడె వార్ధిపరీతమేదినిన్. ౧౯౬

ఇచటఁ బ్రశ్నములును సమాధానములు మాలారూపమునఁ గలవు. సమాధానములు లోకాతిక్రాంతగోచరమగు నసంభావ్యరూపమున నిబంధింపఁ బడినవి. ప్రథమభేదమునఁ బ్రశ్నము వ్యంగ్యరూపము. సమాధానము వాచ్యము ఈ ప్రభేదమునఁ బ్రశ్నోత్తరములు రెండు వాచ్యరూపముననే యున్నవి. ప్రథమభేదమున వ్యంగ్యము వాచ్యసిద్ధి కంగము గాన గుణీభూత వ్యంగ్యభేదమగును.

౫౪. వికల్పము

కం. సమబలయుతవస్తువులకు
నమితవికల్పంబొనర్ప ననఘాలంకా
రమతజ్ఞుల మతమున నది
యమరు వికల్పంబనంగ నదియెట్లన్నన్. ౧౯౭

తుల్యబలముగల రెండువస్తువులకు వికల్పము వర్ణింపఁబడినచో వికల్పాలంకారము. అలంకారమున విచ్ఛిత్తివిశేష ముండవలెనుగదా ! ఇట విచ్ఛిత్తియేమి ? అన్నచో నా రెండువస్తువులకు నౌపమ్యమూలకమగు విచ్ఛిత్తి యుండవలయును.

సీ. అలఘుకాంచనమయస్థలనివాసము మేలో ?
కాంచనస్థలవాసకలన మేలో ?
పుండరీకంబుల దండనుండుట మేలో ?
పుండరీకంబుల దండ మేలో ?
మహనీయవాహినీమధ్యసంస్థితి మేలో
వాహినీశ్వరమధ్యవసతి మేలో ?
మహిషీసహావాసవిహరణంబులు మేలో ?
మహిషీసహావాసమహిమ మేలో ?

గీ. శైలకటకాశ్రయంబులు మేలో ? యతని
యంఘ్రికటకాశ్రయము మేలో ? యధిపులార !
అనుచు నీశాత్రవుల మంత్రులనునయింతు
రరిజయాటోప ! తొరగంటినరసభూప ! ౧౯౮

కాంచనము=బంగారము ; ఉమ్మెత్తచెట్టు; పుండరీకము=తామర ; పులి; వాహిని=సేన ; నది=మహిషి=రాణి , గేదె.

ఇట వికల్పము స్పష్టముగా గోచరించుచున్నది. శబ్దసాధర్మ్యమూలక మగు నౌపమ్యముచేఁ జారుత్వము భాసించుచున్నది.

౫౪. సముచ్చయము

కం. మిగులఁగుణక్రియలెయ్యెడ
యుగపత్ప్రాప్తంబులుగ సముచ్చయము కృతిం
బొగడఁదగుం ద్వివిధంబై
యగణితకవివినుతమగుచు నదియెట్లన్నన్. ౧౯౯

గుణములును, క్రియలును యుగపత్ప్రాప్తములుగ(ఒకే తూరి సంభవించినవి) నెచ్చట వర్ణింపఁబడునో యది సముచ్చయము

కం. నరసింహశౌర్యశోభా
స్ఫురణంబున జగములెల్ల శోణములయ్యెన్
బరరాజవదనవితతులు
హరినీలనిభంబులయ్యె నదియెట్లన్నన్. ౨౦౦

ఇట గుణములగు శోణత్వ నీలత్వములకు యౌగపద్యము చెప్పఁబడినది.

చ. అలకలుముట్టిముట్టి జఘనాంబరపంక్తికిఁగిట్టి కిట్టి గు
బ్బలు రతిఁబట్టి పట్టి, కరపల్లవముల్ నులివెట్టి పెట్టియుం
దెలువగు తారహారములఁ జిక్కులువెట్టు నృసింహ! నీద్విష
ల్లలన వనాలికేఁగ విటలక్షణలక్ష్యములై మహీజముల్ ౨౦౧

ఇట ముట్టుట, కిట్టుట, పట్టుట, నులివెట్టుట, చిక్కులువెట్టుట, మొదలగు క్రియలకు యౌగపద్యము చెప్పఁబడినది

గుణక్రియలు రెంటికినిఁగూడ యౌగపద్యమున్నను సముచ్చయమే. ఎట్లన.

క్లుషం చ తవాహితేష్వకస్మాత్సితపంకేరుహసోదరశ్రి చక్షుః
పతితం చ మహీపతీంద్ర తేషాం వపుషి ప్రస్ఫుటమాపదాం కటాక్షైః

ఓ రాజా! తెల్లతామరవలె నున్న నీ నేత్రము శత్రువులయందాకస్మికముగాఁ గలుషమైనది. వారి శరీరములపై నాపద్రూపలగు నాయికల కటాక్షములు పడినవి.

ఇటఁ గాలుష్యరూపగుణము. పతనరూపక్రియ అను రెంటియొక్క సముచ్చయము.

కం. పాయక "ఖలేకపోత
న్యాయము"న ననేకకారణము లొకకార్యం
బేరొడ సాధింపఁగ మత
మై యపరసముచ్చయాఖ్యమగు నెట్లన్నన్. ౨౦౨

ఖలేకపోతన్యాయానుసారముగా నహమహమికతో నొక కార్యమును సాధింపఁ బెక్కు కారణములు గూడినచో సముచ్చయము. ఇదియు నొక భేదము.

కం. శూరతయును, ధీరతయు, ను
దారతయు గభీరతయును, ధార్మికతయు, నీ
కారణజన్మస్ఫురదవ
తారముసూచించె నోబధరణిపునరసా! ౨౦౩

కారణజన్మస్ఫురదవతారము కార్యము దీనికి ఖలేకపోతన్యాయమున (కళ్లమునందేకకాలమునఁ గపోతములన్నియు వ్రాలిన విధమున లేక కళ్ళము నుండి కపోతములన్నియు నేకకాలమున నెగిరిన విధమున—పంచతంత్రములోని కథ ననుసంధించుకొనునది.) శూరతా, ధీరతా, ఉదారతా, గభీరతలు, అను పెక్కు కారణములు వర్ణింపఁబడినవి.

౫౫. సమాధి

కం. కారణ మొక్కటి కార్యము
ధారుణి సాధింపఁ గాకతాళనయమునన్
గారణము వేఱొకటిరా
వారూఢి సమాధియయ్యె నదియెట్లన్నన్. ౨౦౪

ఒక కార్యమును సాధించుటకొక కారణము ప్రవృత్తమయి యుండఁగా గాకతాళీయన్యాయానుసారముగా మఱొక కారణము వచ్చి యా కార్యమును సుకరముగాఁ జేసినట్లు వర్ణించినచో సమాధి.

చ. అనిమొన శ్రీనృసింహవసుధాధిపు తీవ్రచమూసమూహముం
గనుఁగొని యద్భుతంబొదవ ఖానువజీరులు వ్రేళ్ళు నోళ్ళకుం

కానుపఁగఁ గాకతాళనయశోభఁ దదీయముఖాంగుళీనివే
శనములు ప్రాణరక్షణవిచారధురీణములయ్యె వారికిన్. ౨౦౫

నరసభూపాలుని సైన్యములను జూచి శానువఱీరు లక్కుఱవడి తమ వ్రేళ్ళు నోటిపైఁ బెట్టుకొనఁగాఁ (అనఁగా నోళ్ళుమూసికొనఁగా) గాకతాళీయముగాఁ నా వ్రేళ్ళు పోవుచున్నవారి ప్రాణముల రక్షించుటయను వ్యాపారమున ధురీణములు (వ్యాపృతములు) అయ్యెను.

ఆశ్చర్యముతో నోటిపైఁ బెట్టుకొన్న వ్రేళ్ళు రక్షణకార్యోపయుక్తము లయినవి. ఈ లక్ష్యమున లక్షణము పట్టదు. ఏలన, నే కార్యమును సాధించుటకు నేకారణము ప్రకృతమైనది? ఆశ్చర్యమను కారణము 'నోటిపై (వేళ్ళు పెట్టుకొనుట' అను కార్యసిద్ధికిఁ బ్రవృత్తమైనది. ఈ కార్యము ప్రాణరక్షణ కార్యమునకుఁ దోడ్పడినది. శత్రువులు నోరుమూసికొని ప్రాణరక్షణ చేసికొనవలెనని యనుకొనుచుండఁగా దలవని తలంపుగా వారి నోళ్ళమీఁద వ్రేళ్ళు పడెను. ఇచ్చటఁ గార్యసౌకర్యమేమి? ఏమియులేదు; కాన నీ లక్ష్యము సరియైనదికాదు. ఈ క్రింది యుదాహరణమును గనుఁడు.

కం. పొలయలుకను దొలఁగింపఁగ
చెలియడుగులయందు వ్రాలఁ జేరెదు నాకుం
గలిగింపఁగ నుపకారము
బలముగ, గ్రమ్మొగిలదృష్టవశమున నుఱిమెన్.

ప్రణయకోపశాంతి కార్యము 'చెలియడుగులయందు వ్రాలుట' అను కారణముచే సాధ్యము కాకతాళీయముగాఁ గ్రొమ్మొగిలుఱుముట యను కారణాంతరముచే నా కార్యము సుకరమైనది. అనఁగా నా కారణముతోఁ బని లేకయే పోయినది ప్రణయకోపము చరణపాత మక్కఱలేకయే శాంతిల్లినది.

౫౯ భావికము

కం. మతిలోన నతీత, మనా
గతమును, బ్రత్యక్షమువలెఁ గనుపట్టుట న
ద్భుతనిరుపమార్థకథనం
బతిరయముగ భావికాఖ్యమగు నెట్లన్నన్. ౨౦౬

అద్భుతమగు వర్ణనాచాతుర్యముచే నతీతానాగతవృత్తాంతములు ప్రత్యక్షాయమాణములుగా వర్ణింపఁబడినచో భావికాలంకారము భూతభవిష్యద్వృత్తాంతములను బ్రత్యక్షముగా భాసించుచున్నట్లు వర్ణించుట దోషముగాదా? అన్నచోఁ గాదు. అత్యద్భుతవర్ణనముచే సహృదయుల హృదయమున భావనయుదయించును

ఆ భావనచే సహృదయహృదయమునందావిషయము నిలిచి ప్రత్యక్షమువలె భాసిల్లును. ఎట్లనఁ బాంథుడు తన ప్రియురాలినిఁ బదింబదిగా ధ్యానించుచు నది ప్రత్యక్షమునం దున్నట్లుగా భావించుచున్నాఁడుగదా! అట్లే యిచ్చటఁ గూడ గ్రహింపవలెను.

మ. వరవల్గావిభవంబు దుష్టభుజగవ్రాతంబుగా, సింగిణుల్
గురుపక్షద్వితయంబుగాఁగ నరపక్షోణీశ్వరారూఢమౌ
తురగోత్తంసము, నిందిరాహృదయనాథుందాల్పు ప్రత్యక్షబం
ధురపక్షీంద్రునిలీలఁజూచు నహితస్తోమంబు భీమంబుగన్.

కళ్లెమును ధనుస్సులను ధరించిన నరసభూపాలుఁడధిష్ఠించిన, గుఱ్ఱమును నోట సర్పములును, నిఱువంకలను రెక్కలనుదాల్చిన, శ్రీమహావిష్ణువును వహించిన గరుత్మంతునిగాఁ బ్రత్యక్షముగా శత్రువులు చూతురు.

ఇట శ్రీ మహావిష్ణువును ధరించిన గరుత్మంతుఁడు ప్రత్యక్షముగాఁ జూడఁబడుచున్నట్లు వర్ణింపఁబడుటచే భావికము ఇది భూతభావికము.

పద్యమునఁ 'ప్రత్యక్షబంధురపక్షీంద్రుని' అనుచోఁ బ్రత్యక్షపదము సమాసగ్రస్తమై గుణీభూతమై 'చూచు' అను క్రియాపదముతో నన్వయింప కున్నది. అది క్రియలోని కన్వయించినఁ గాని ప్రత్యక్షముగా దర్శించుచున్నట్లు వర్ణింపబడదు.

మ. తొలి వజ్రాయుధముం ధరించి, పురుహూతుం డద్రులంబట్టి తె
క్కలు ఛేదించినఘట్టముల్ గిరుల సంఘంబున్ ఘరట్టాభమై
జలధిందుర్మిన మందరాద్రి కథలున్ సాక్షాత్తుగాఁజూపె ను
జ్జ్వలతేజోనిధి పెక్కురంగముల నా సంగ్రామమధ్యంబునన్.

ఇట 'సాక్షాత్తుగాఁ జూపె' అని సాక్షాత్పదము క్రియాపదముతోడనే యన్వయించుచున్నది. పై పద్యమున నిట్లిదముగా లేదు.

"భావిభూషణసంభారాం సాక్షాత్కుర్వే తవాకృతిం"

ముందు (భావి) భూషణసంభారమును దాల్చు నీ యాకారమును సాక్షాత్కరించు కొనుచున్నాను ఇది భావిభావికము.

౫౭. ప్రత్యనీకము

కం. పగవాఁడు సమర్థుఁడుగా
మగఁటిమి వెస నతనిమీఁద మార్కొన కిల నా

పగవానిహితుల నొంచుట
యగుఁ గృతులం బ్రత్యనీకమది యెట్లనన్. ౨౦౭

బలవంతుఁడగు శత్రువును మార్కొనలేక యాశత్రువుయొక్క మిత్రుని బాధించునట్లు వర్ణించినచోఁ బ్రత్యనీకాలంకారము.

కం. నీ దురవగాహ శౌర్యము
భేదింపఁగ లేక వినుతపృథివీశుఁడనిన్
భేదించు నృసింహ! భవ
న్మేదురభయదప్రతాపమిత్రునిమిత్రుల్. ౨౦౮

శత్రురాజు నీ శౌర్యమును భేదింపలేక నీ శౌర్యమునకు మిత్రుఁడగు మిత్రుని (సూర్యుని) భేదించుచున్నాఁడు (యుద్ధమున మృతులయిన వారు సూర్యమండలమును భేదించుకొని పోవుదురని ప్రతీతి.) ఇది శ్లేషతో సంకరమైనది.

౫౮. వ్యాఘాతము

కం. ఒకఁడొకటిచేత నొకపని
నకలంకంతఁ జేయు దాని నా హేతువుచే
నొకఁడు మఱివేఱ చేయఁగఁ
బ్రకటవ్యాఘాత మెన్నఁబడు నెట్లన్నన్ ౨౦౯

ఒకఁ డొక సాధనముచే నొక కార్యమును సాధింపఁగా మఱొకఁ డా సాధనముచేతనే దానికి విరుద్ధమగు కార్యమును సాధించినట్లు వర్ణించినచో వ్యాఘాతము.

కం. రాజీవబాంధవుఁడు నిజ
తేజమున నొనర్చుఁ ద్రిజగతీతాపము; న
వ్యాజవిరాజితతేజో
రాజిన్ హరియింతు వోబరాజనృసింహా! ౨౧౦

సూర్యుఁడు దనతేజముచే ముల్లోకములకును దాపమును గూర్చుచున్నాఁడు. నీ వా తేజముచేతనే ముల్లోకముల తాపమును హరించుచున్నావు.

సూర్యుఁ డే సాధనముచే నొక కార్యమును సాధించుచున్నాఁడో నరసభూపాలుఁ డా సాధనముతోడనే తద్విరుద్ధకార్యమును జేయుచున్నట్లు వర్ణింపఁబడినది. ఈ క్రింది పద్యముగూడ నుదాహరణీయము

ఆ. వె. కంటఁ గ్రాఁగినట్టి తుంటవిల్కానినిఁ
గంట బ్రదుకఁజేయఁగలుగుదంట
లాత్రినేత్రుగెలుచు నాటోపము వహించు
వామనేత్రలకు నివాళులిత్తు.

ఏ నేత్రములతో మన్మథుఁడు గాల్పఁబడెనో యా నేత్రములతోడనే యువతులు వానిని బ్రదికింతురు.

౫౯. (పర్యాయము)

కం. ఏకాధేయంబరయ న
నేకాధారంబులందు నిరవై క్రమముం
జేకొనఁ బర్యాయంబు మ
హాశ్రవిపంస్తుత్యమయ్యె నది యెట్లన్నన్. ౨౧౨

ఏకవస్తు వనేకాధారములందుఁ గ్రమముగా లేక కాలభేదమున నున్నట్లు వర్ణింపఁబడినచో బర్యాయాలంకారము

సీ. కందర్పహరునందుఁ గనువిప్పఁగా నేర్చి
శరవణోద్భవునందు శక్తి యెఱిఁగి
రామునందచలాంబరముగట్టఁగా నేర్చి
జలధిలంఘనునందుఁ జంగ యెఱిఁగి
ఘటజునం దుభయపక్షములఁ బోర్లగ నేర్చి
వెస ద్రోణియెడఁ జాలువేడ నెఱిఁగి
మొగి వృకోదరునందు ముష్టిపూనఁగ నేర్చి
విజయునియెడఁ గర్ణ వేధ యెఱిఁగి

గీ. యనుదినంబును నభివృద్ధిఁదనరు శౌర్య
శిశువు భవదీయ దోః స్తంభజృంభమాణ
ఖురళిఁ గౌక్షేయచాలన స్ఫురణమెఱిఁగె
వైరిగజసింహా! యోబయనారసింహా! ౨౧౩

ఒకే శౌర్యశిశువు అను వస్తువు (ఆధేయము) క్రమముగా ననేకములగు నాధారములందున్నట్లు వర్ణింపఁబడినది. ఇందు విచ్ఛిత్తిగానరాదు. ఈ క్రింది పద్యముదాహరణీయము.

కం. కనఁబడుచువచ్చె రాగము
మును నీ కెమ్మోవియందె ముఖ్యంబుగఁ గ్రొ
న్నన్నఁబోఁడీ యిప్పు డయ్యది
కనఁబడు నీ హృదయమునను గాఢతరంబై.

రాగమను వస్తువు మొదటఁ గెమ్మోవియందును బిమ్మట హృదయము నను గాలభేదమునఁ గనఁబడినట్లు వర్ణింపఁబడినది ఇట రాగశబ్దము శ్లిష్టము.

ఈ లక్ష్యములో నొకే వస్తువు పెక్కాధారములలో నున్నట్లు వర్ణింపఁబడినది. దీనికి విపరీతముగా ననేకవస్తువులు కాలభేదమున నొకే యాధారమున నున్నట్లు వర్ణింపఁబడినను బర్యాయమే. ఎట్లన,

మధురిమరుచిరం వచః ఖలానా మమృతమహో ప్రథమం పృథువ్యనక్తి, అథ కథయతి మోహహేతు మంతర్గతమివ హాలహాలం తదేవ.

ఖలవచనము మొదట నమృతముగా నుండును అదియే మోహహేతువై హాలాహల విషమగును.

ఇట నొక ఖలవచనమునందే యమృత విషము లున్నట్లు (కాలభేదమున) వర్ణింపఁబడినది. అనఁగా నొకే యాధారమున ననేక వస్తువులు వర్ణింపఁబడినవి.

౮౦. (సూక్ష్మము)

కం. ఈక్షితిఁ దలపోయ నసం
లక్షితసూక్ష్మార్థకౌశలప్రకటనవై
చక్షణ్యము సూక్ష్మంబగు
నక్షీణకవిప్రశస్త మది యెట్లన్నన్. ౨౧౪

సామాన్యులకుఁ దెలియఁబడనిదియు, విదగ్ధులకు మాత్రము దెలియఁ దగినదియునగు సూక్ష్మార్థమును, ఆకారముచేఁ గానీ యింగితముచేఁ గానీ ప్రకాశింపఁజేయుచున్నట్లు వర్ణించుట సూక్ష్మాలంకారము

ఉ. ప్రాణమువంటి నాకు నిజభావముఁ దాఁపగఁ జెల్లునమ్మ! నీ
ప్రాణవిభుం బ్రభూతగుణబంధుఁ దెల్పగదమ్మ!యంచు వి
న్నాణముగా సఖీజనము నల్గడలం గదియంగ నైకత
శ్రోణి యురంబుమీఁద నఖసూచిక సేర్చె నృసింహభూవరా!

'ఉరంబుమీఁద నఖసూచికను జేర్చెను' అను వ్యాపారముచే 'నృసింహుఁడు' అను నర్థము వ్యక్తము సేయఁబడుచున్నది తన యురయమునఁ గుచ

కుంభములున్నవి. అవి కుంభికుంభములవలె నున్నవి. కుంభికుంభములను గోళ్ళతోఁ జీల్చునది సింహముగదా! లేక నృసింహావతారమున హిరణ్యకశిపుని వక్షమును జీల్చిన వృత్తాంతముచే నృసింహుఁడు అనునర్థము వ్యక్తము సేయఁబడును.

ఈ క్రిందిదియు నుదాహార్యము

కం. ఒక జాణకత్తె సంకే
తకాలమెఱుఁగందలంచు తన మిండనికిన్
సకులకడఁ గనులనవ్వులఁ
బ్రకటించెను; గరవిలాసపద్మము మూసెన్.

నవ్వులచే వెన్నెలయుఁ బద్మనిమీలనముచే సంధ్యాకాలమనియు వ్యక్తము సేయఁబడినది.

గీ. ఉష్ణ, శీతాన్నకబళంబులొకఁడు సూపఁ
బవలొ? రాత్రియొ? కెడఁగూడ నవసరమని
దాని కుత్తర మొక లతాతన్వి యిచ్చె
నధరబింబంబు విఱిచి సంధ్యాగమమని.

నైషధము నందలి బువ్వపుబంతి వర్ణించు ఘట్టము నందలి దీ పద్యము' ఇదియు నుదాహరణీయమే.

౫౧. (ఉదాత్తము)

కం. విశ్వోన్నతమై చెలఁగెడు
నైశ్వర్యము గలుగు వస్తువభినుతిసేయన్
శాశ్వతమగుచు నుదాత్తము
విశ్వంభరలోనఁ బొల్చు వినుమెట్లన్నన్. ౨౧౬

అత్యంతసమృద్ధమగు వస్తువర్ణనముదాత్తము.

మ. నృపులర్పించినఁ. జేడెలూడ్చి వెలిఁజేర్పొప్పఁగాఁగుప్పగా
నెపుడుం బల్లిన మ్రుగ్గుముత్తెములు, ధాత్రీశాంగదస్వర్ణచూ
ర్ణపుఁ బ్రోవుల్, దగు నీ గృహాంగణములం, దారాద్రి ధాత్రీవరా
ధిపముల్ స్వవ్యయభీతి నిగ్గొలుచు రీతిన్ శ్రీ నృసింహాధిపా!

సామంతరాజు లర్పింపఁగా, దాసీజనము లూడ్చి బయటఁ గుప్పవేసిన ముత్తెముల రాసులును, సామంతరాజు లహమహమికతో రాచకొనుచు నిన్ను సేవింపవచ్చినపుడు రాలిన బంగారు చూర్ణముయొక్క పోవలును, నీ గృహాంగణమునఁ గైలాస మేరుపర్వతములు దమ్ముఁ వ్యయము సేయుదువో యనుభీతితో నిన్నుఁ గొలువవచ్చిన విధమున నలరారుచున్నవి.

ఇట నుత్ప్రేక్షయుఁ గలదు కానీ యుదాత్తమే ప్రధానము.

౬౨. (పరివృత్తి)

కం. సమమిచ్చి సమముగొన న
ల్పమునిచ్చి యనల్పముగొన, భావింప నన
ల్పమునిచ్చి యల్పముంగొన
నమరుం బరివృత్తి త్రివిధమై యెట్లన్నన్. ౨౧౮

న్యూనాధ్యధికములకుఁ బరస్పర వినిమయము పరివృత్తి. ఇది త్రివిధము. ౧. సమపరివృత్తి (సమము నిచ్చి సమమునుగొనుట) ౨ న్యూన పరివృత్తి (అధికమునిచ్చి యల్పమునుగొనుట) ౩. అధికపరివృత్తి (అల్పము నిచ్చి యధికమును గొనుట.)

కం. శ్రుతిహృదయరత్నభూషా
కృతులు కృతుల్ నీకు నొసఁగి కృతులు నృసింహా
క్షితివర! నీచేఁ గాంతురు
శ్రుతిహృదయాభరణములు విశోభితలీలన్. ౨౧౯

నిపుణులగు కవులు శ్రుతులకును, హృదయములకును రత్నభూషణముల వంటి తమ కావ్యముల నీ కిచ్చి నీనుండి శ్రుతిహృదయాభరణములను గొందురు.

ఇట శ్రుతిహృదయరత్నభూషాకృతులగు కృతులిచ్చి శ్రుతిహృదయరత్నభూషలు వారు గ్రహించుచున్నారు కాన సమపరివృత్తి.

కం. నరసింహా! నీదు వైరులు
కరిసింహాలులాయభల్లగవయాహివరం
పరకుఁ దమ గృహము లొసఁగుచు
వరుస భజింతురు తదీయ వనమందిరముల్. ౨౨౦

ఇట శత్రువులు దమ గృహములను గజసింహాదుల కిచ్చి వాని గుహలను దాము గొనుచున్నారు' అనుటచే నధికము నిచ్చి యల్పముఁ గొనుచున్నట్లు వర్ణింపఁబడినది. కాన న్యూనపరివృత్తి.

కం. నరతనువు నీ కరాసికి
నరి యొసఁగి నృసింహభూప! యనుపమరంభా
పరిరంభగుంభసంభ్రమ
భరితామరతాశుభప్రభావముఁ జెందున్. ౨౨౧

శత్రువు నీ కత్తి కి మనుష్యశరీరమిచ్చి యసదృశమగు రంభాపరిరంభ యోగ్యమగు దేవశరీరమును బొందుచున్నాఁడు.

ఇట నల్పమిచ్చి యధికముఁ గొనుచున్నట్లు వర్ణింపఁబడినది ఇది యధిక పరివృత్తి.

౬౭. కారణమాల

కం. ఇల నుత్తరోత్తరములకు
బొలుపొందఁగఁ బూర్వపూర్వములు హేతువులై
యలరఁగఁ గారణమాలిక
యలంకరణరాజమయ్యె నది యెట్లన్నన్. ౨౨౨

పూర్వపూర్వము లుత్తరోత్తరములకుఁ గారణములయ్యెనేనిఁ గారణమాల.

మ. హరిపాదాంబుజపూజనాభిరతిచే నైశ్వర్య, మైశ్వర్య చా
తురిచే సజ్జనరక్షణంబు, సుజనస్తోమావనస్ఫూర్తిచేఁ
జిరపుణ్యంబులుఁ, బుణ్యవాసనలచేఁ జెన్నొందు సత్కీర్తియున్
నరసింహాధిప! నీకెపొల్చు బుధసంతానైకచింతామణీ! ౨౨౩

హరిపాదాంబుజ...రతి యైశ్వర్యమునకుఁ గారణము; ఐశ్వర్యము సజ్జన రక్షణమునకుఁ గారణము. సజ్జన రక్షణము పుణ్యమునకుఁ గారణము. పుణ్యము కీర్తికిఁ గారణము.

కారణవాచకములగు పూర్వపూర్వపదములే యుత్తరోత్తరమున నుండ వలెను. అట్లుగాక దదర్థబోధకమగు పదాంతరమును బ్రయోగించినచోఁ దత్త్వ ప్రతిభానము లేక వివక్షితార్థసిద్ధి గలుగదు. ఇట 'సజ్జనరక్షణంబు, సుజనస్తోమా వనస్ఫూర్తిచే' అను నెడ సజ్జనరక్షణ పదము విడువఁబడి 'సుజనస్తోమావన పదము' ప్రయుక్తమైనది. ఇది యుక్తముగాదు.

పూర్వపూర్వము లుత్తరోత్తరములకుఁ గారణమగుటయేకాక యుత్తరోత్తరములు పూర్వపూర్వములకుఁ గూడఁ గారణములగును. ఎట్లన,

భవంతి నరకాః పాపాత్ । పాపం దారిద్ర్య సంభవం
దారిద్ర్య మప్రదానేన । తస్మాద్దానపరో భవ .

నరకములు పాపమువలన వచ్చును. పాపము దారిద్ర్యమువలనఁగలుగును. దారిద్ర్య మప్రదానముచేతఁ (దానము చేసియుండని కారణమున) గలుగును. కావున దానపరుఁడవు గమ్ము ?

ఇటఁ బూర్వపూర్వములగు నరకాదులకు నుత్తరోత్తరములగు పాపాదులు కారణములుగా నిరూపింపఁబడినవి

అయితే యీ యలంకారమున విచ్ఛిత్తి యేమున్నది ? అని యడుగ వచ్చును. ఉత్తరోత్తరవస్తువులు కారణములగుటచే నివ్వన్నియు నుపాదేయములే యను జ్ఞానము చమత్కారకారణమగును.

౬౮. (ఏకావళి)

కం. ధరఁ బూర్వపూర్వమున కు
త్తరోత్తరము క్రమసమగ్రత విశేషణమై
సరగిన నేకావళి యన
నరుదగు సత్కృతులయందు నది యెట్లన్నన్. ౨౨౪

పూర్వపూర్వమున కుత్తరోత్తరము విధిరూపమున విశేషణముగా నిబంధించినచో నేకావళి.

కం. అవనిధవాస్థానంబులు
కవియుతములు; కవులు రచితకావ్యులు; కావ్య
వ్యవహారము లమితభవ
న్నవనవగుణభూషితములు నరసింహనృపా! ౨౨౫

విధిరూపముననేకాక నిషేధరూపమున నిబంధించినను నేకావళియే. ఎట్లన
న తజ్జలం యన్న సుచారుపంకజం న పంకజం తద్ యదలీనషట్పదం
న షట్పదోఽసౌ కలగుంజితో న యో న గుంజితం తన్న జహార యన్మనః.

దేనియందుఁ జక్కనితామరలు లేవో యది జలముగాదు. దేనియందుఁ దుమ్మెదలులేవో యది తామరగాదు ఏది కలరుతము సేయదో యది తుమ్మెద గాదు. ఏది మనస్సును హరింపదో యది కలరుతముగాదు.

సంస్కృతశ్లోకమునఁ బూర్వపూర్వములగు జలాదుల కుత్తరోత్తరములగు సుదారుపంకజాదులు నిషేధరూపమున నిబంధింపఁబడినది.

౬౫. మాలాదీపకము

కం. మహిఁ బూర్వపూర్వములచే
రహిమీఱఁగను త్తరోత్తరము రమ్యగుణా
వహముగ మాలాదీపక
మహానవిఖ్యాతిఁ జెందు నదియెట్లన్నన్. ౨౨౬

పూర్వపూర్వములచే నుత్తరోత్తర ముత్కర్షమును వహించినట్లుగా నిబంధింపఁబడినచో మాలాదీపకము.

కం. గురుచాపముచే శరతతి,
శరతతిచే శత్రుశిరము, శత్రుశిరముచే
ధర, ధరచే నీబాహువు
పరిలబ్ధంబయ్యె నోబపార్థివునరసా! ౨౨౭

చాపముచే శరతతి యుత్కర్షమును (సంధానమువలన) వహించెను. శరతతిచే శత్రుశిరస్సు (యుద్ధమున మరణించుటచే) ఉత్కృష్టత వహించెను. శత్రుశిరముచే ధర (శత్రునాశముచే) యుత్కర్షము వహించెను. ధరచే నీ బాహువు (ధరాభారము వహించుటచే) ఉత్కర్షమును వహించెను

౬౬. సారము

కం. నిరవధికము త్తరోత్తర
నిరతోత్కర్షంబుఁ దెలుప నఖిలకృతులయం
దరుదై తగుసారాలం
కరణము కవివినుతమగుచుఁ గడునెట్లన్నన్. ౨౨౮

సీ. స్థావరజంగమాధారముల్ త్రిజగంబు
లలజగంబులజాండములఁ జెలంగు
నాయజాండములుండు హరిరోమకూపమం
దాశౌరియును భోగిపై శయించు

నాభోగి జలధికోణావాసమొందు నా
కడలి కుంభజుఁ జులుకంబుఁ జెడదు
నాకుంభజుఁడు నింగి కేకఖద్యోతాఖు
డానింగి కబరియై యతిశయిల్లు

గీ. నీయశోలక్ష్మి కక్షణనీతిచతుర!
చతురదధిమేఖలావృతక్షితిధురీణ!
చటులభుజదండదండితోత్కటమదారి!
వీరపరివార! యోబభూవిభునృసింహ! ౨౨౯

ఇట నుత్తరోత్కర్షము హృద్యముగాలేదు కాన నిది యుదాహరణార్హము గాదు. ఈ క్రింది శ్లోక ముదాహార్యము.

[రాజ్యే సారం వసుధా ; వసుధాయం పురం ; పురే సౌధం ;
సౌధే తల్పం ; తల్పే వరాంగనాఽనంగసర్వస్వం.]

రాజ్యమునందు వసుధ సారరూపము ; వసుధయందుఁ బురము సారము; పురమున సౌధము సారము సౌధమున శయ్య సారము; శయ్యయందు ననంగ సర్వస్వమగు చక్కని జవరాలు సారము.

ఇట నుత్తరోత్తరమగు నుత్కర్షము నిబద్ధమైయున్నది. ఇది శ్లాఘ్య గుణోత్కర్షముగలది ఇట్టి యుత్కర్షముపై పద్యమునఁ గానరాదు

[తృణా ల్లఘుతర స్తూల స్తూలాదపి చ యాచకః
వాయునా కిం న నీతోఽసౌ మామయం ప్రార్థయే దితి]

గడ్డిపఱకకన్న దూది తేలికయైనది. దూదికన్న యాచకుడు తేలిక అయితే వీనిని వాయువేల చెదరఁగొట్టఁడు? అన్నచో వీఁడు నన్నేమి యాచించునో యని వాయుదేవుఁడు వాని చెంతకుఁరాడు

ఇది యశ్లాఘ్య గుణోత్కర్షము గలది.
దీని నాంగ్లమున Climax అందురు.

కం. రసవ, త్ప్రేయము, లూర్జ
స్వి, సమాహితములు నిచట వివరంపఁగలే
దసమరసప్రకరణమున
రసభావాద్యుపనిబద్ధరసములుగావన్ ౨౩౦

రసవదలంకారము, ప్రేయోఽలంకారము, ఊర్జస్వి, సమాహితాలంకారము లనునవి రసప్రకరణమునఁ జెప్పఁబడిన రసభావాదులచే నుపనిబద్ధములగు రసములేకాన నిట వివరింపఁదలఁపలేదు. మా వ్యాఖ్యలో వీనినిఁగూర్చి లెస్సగా వివరించితిమి. ఈ విధమునఁ బై నుపమాద్యలంకారములును రసవదాదులు నాలుఁగును వెరసి డెబ్బది యలంకారములు నిర్వచింపఁబడినవి.

ఉ. సొమ్ములు సొమ్ములుంగలియ సొంపులుపుట్టెడురీతిఁ గావ్యజా
లమ్ములయందలంకృతులలంకృతులుంగలియంగ శోభమై
నిమ్మహిఁదోఁచుఁ; దద్ఘటనమెన్నికతోఁ దిలతండులాప్తిరూ
పమ్మునఁ బాలునీరెనయుభాతిఁదగున్ ద్వివిధత్వమొందుచున్.

కం. తిలతండులరూపమ్మగ
నలరున్ సంసృష్టి; సంకరాఖ్యము పాల్నీ
రిల సేకమైనకైవడిఁ;
దెలుపుదుఁ దత్సంకరంబు త్రివిధముకృతులన్ ౨౬౨

లోకమున భిన్నభిన్నములయిన భూషణముల సంయోగమున నూతన సౌందర్యము ప్రభవించువిధమునఁ గావ్యములందుఁ బృథక్సౌందర్య హేతువులగు రూపకాద్యలంకారములు పరస్పరమును సంయుక్తములై సౌందర్యాతిశయమును గలిగించును. ఈ యలంకారములయొక్క పరస్పరసంబంధము రెండు విధములు నుండును. ఒకటి సంయోగరూపము. ఇది తిలతండులరూపము. తిలతండులములు పరస్పరము గలిసియున్నను వివిక్తముగా ననఁగాఁ బరస్పర నిరపేక్షములుగా గోచరించువిధమున నెచ్చట నలంకారము పరస్పర సంయుక్తము లయియున్నను వివిక్తముగా (పరస్పర నిరపేక్షముగా) గోచరించునో యా సంయోగము సంసృష్టి యనఁబడును. రెండవది సమవాయరూపము. ఇది నీరక్షీర రూపము నీరక్షీరములు గలిసినపుడు ప్రత్యేకింపరాని విధమునఁ బరస్పర సాపేక్షములుగా నెచ్చట నలంకారములు భాసిల్లునో యది సమవాయ సంకరము లేక నీరక్షీర సంకరము ఈ సంకరము త్రివిధము. ఎట్లన,

గీ. ఎనయ నంగాంగిభావంబు నేకవాచ
కానుబంధంబు, సందేహ, మనఁగ; నట్లు
పొలుచు సంసృష్టి సంకరంబులకు వరుస
లక్ష్యముల నేర్పఱించెద లలితఫణితి. ౨౬౩

అంగాంగిభావసంకరము ; ఏకవాచకానుప్రవేశసంకరము ; సందేహ సంకరము అని సంకరము త్రివిధము ఈ విధములయిన సంసృష్టిసంకరములకు లక్ష్యముల నిత్తును.

సంకరమువలెనే సంసృష్టియుఁ గేవలశబ్దాలంకారసంసృష్టి. కేవలా ర్థాలంకారసంసృష్టి, ఉభయాలంకారసంసృష్టి యని మువ్విధములు.

౧. అర్థాలంకారసంసృష్టి

కం. హరిదబలాకులగిరికుచ
వరచందనరజములగు భవత్కీర్తిరుచుల్
నిరవద్యసుధాంబోధి
స్ఫురణంబువహించె నోబభూవరు వరసా!

కం. హరిదబలాచందనమయి
యనువగు ననురూపకంబు, నమృతాంభోధి
స్ఫురణంబుఁ దాల్చెననియెడు
సరసనిదర్శనయుఁ బొల్చు సంసృష్టియనన్. ౨౭౫

'హరిత్తులు అను అబలలు' అనుచో రూపకాలంకారము 'సుధాంబోధి స్ఫురణము' అనుచో సుధాంబోధిస్ఫురణమువంటి స్ఫురణము అని నిదర్శన. ఈవి రెండును బరస్పర నిరపేక్షములు. కాన సంసృష్టి.

౨. శబ్దాలంకారసంసృష్టి

వదనసౌరభలోభపరిభ్రమద్భ్రమరసంభ్రమసంభృతశోభయా
చలితయా విదధే కలమేఖలాకలకలోఽలకలోలదృశాఽన్యయా.

తన వదనసౌరభమునందలి లోభముచేఁ బరిభ్రమించుచున్న భ్రమరము యొక్క తిరుగుళ్ళచేత నొక శోభను వహించుచున్న, యలకలు పైనిఁ బడు చుండుటచే లోలమైన దృక్కులు గల, యొక యువతి చలించుచు మేఖలాకల కలమును జేసెను.

పూర్వార్థమున 'భ' కారవృత్త్యనుప్రాసమును, ద్వితీయచరణమున 'ల' కార వృత్త్యనుప్రాసమును జతుర్థచరణమున 'లకలో, లకలో' అనునెడ యమకమును గలవు ఈ యనుప్రాస యమకములు పరస్పర నిరపేక్షములై యున్నవి. కాన సంసృష్టి

౩. ఉభయాలంకార సంసృష్టి

ప్రతాపరుద్రదోర్దండో మండలాగ్రేణ మండితః
దృశ్యతే సమరే వీరై రుత్ఫణః ఫణవా నివ.

మండలాగ్రముచే (ఖడ్గము) మండితమైన ప్రతాపరుద్రుని దోర్దండము యుద్ధమునఁ బడగెత్తిన పాముపలెఁ గనఁబడుచున్నది.

ఇందుఁ బూర్వార్థమున వృత్త్యనుప్రాసమును, నుత్తరార్థమున నుపమాలంకారమును గలవు. ఇవి పరస్పర నిరపేక్షములు కాన సంసృష్టి.

౧. సంకరము-అంగాంగిభావము

కం. అసిజిహ్వాభయదంబై
యసమమహాబలవిశేషహారియునై యి
వ్వసుధ భవద్భుజదండము
పొసగున్ ఫణిమాడ్కి నోబభూవరునరసా! ౨౦౬

కం. అసిజిహ్వాకయను రూపక
మసమమహాబల విశేషహారిశ్లేషం
బెసఁగుఫణిమాడ్కి భుజమను
దెస నంగాంగిత్వమొందెఁ దెలియ నుపముతోన్. ౨౦౭

ఓ నరసభూపాలా! నీ భుజదండము పామువలె నసిజిహ్వాచే భయదమై శత్రువుల మహాబలవిశేషములను హరించునదై (మహాబలుఁడు – గాలి! దానిని హరించునది. అనఁగా నాహరించునది) యెసఁగును ఇట 'ఫణిమాడ్కి' అనుచో నుపమాలంకారము, 'అసిజిహ్వా' అనుచో రూపకము' 'మహాబల' అనుచో శ్లేషయును గలవు ఇది యంగాంగిభావ సంకరము. అంగాంగిభావమన అనుగ్రాహ్య. అనుగ్రాహకభావము ఇందలి (అసిజిహ్వారూపకాలంకార ముపమాశ్లేషం ననుగ్రహించుచున్నది. ఇటనున్న యలంకారము లన్నియుఁ బ్రత్యేకముగాఁ గాక పరస్పర సాపేక్షములై సౌందర్యాతిశయమును బెంచు చున్నవి

౨. ఏకవాచకానుప్రవేశసంకరము

కం. విశ్వామిత్రమదాపహ
శాశ్వతసౌభాగ్యమగుచు నతతోన్నతమై

విశ్వనుత! శ్రీనృసింహామ
హేశ్వర! నీయసి వసిష్ఠునీడున(బోల్పున్. ౨౪౭

నీ ఖడ్గము వశిష్ఠునివలె విశ్వామిత్ర (విశ్వ+అమిత్ర) మదమును సహింపని శాశ్వత సౌభాగ్యము గలదై యెల్లపుడును నెత్త(బడినదై పొలుచును. (వసిష్ఠు(డు విశ్వామిత్రమహర్షి యొక్క మదమును సహింపనివా(డు.)

కం. నీవాలు వసిష్ఠునివలె
నేవేళ(దెలంగునన్న నేకపదవిచే
పావిర్భూతములగుచున్
శ్రీవెలయన్ శ్లేష, ముపమ, చెల(గును నిచటన్, ౨౪౮

'వసిష్ఠునివలె' (వసిష్ఠునీడు) అనుచో నేకవాచకమునందు శ్లేషోపమలు ప్రవేశించినవి. అన(గా 'ఈడు' అను వాచక (పదము) ముపమాశ్లేషల నను గ్రహించుచున్నది. అది తీసివేయ(బడినచో రెండలంకారములును నశించును.

ఇది యేకవాచకానుప్రవేశ సంకరమని యలంకారసర్వస్వకారమతాను సారముగా విద్యానాథుడు వచించినవిధమున నీ గ్రంథకర్తయును దెలిపెను. అప్పయ దీక్షితులవారు కువలయానందమున నేకవాచకానుప్రవేశ సంకరాలంకారమును నిట్లు తెలిపిరి

సత్పుష్కరద్యోతితరంగశోభిన్యమందమారబ్ధమృదంగవాద్యే
ఉద్యానవాపీపయసీవ యస్యామేణీదృశో నాట్యగృహే రమంతే.

ఏ పట్టణమున (ఆ పట్టణమున) యువతులు సత్పుష్కర ద్యోతితరంగ శోభియు (చక్కని తామరపూలతో విలసిల్లు తరంగములతో శోభిల్లుచున్న - చక్కని పుష్కరములను వాద్యవిశేషములతో విలసిల్లు రంగస్థలముతో శోభిల్లుచున్న) అమందముగా నారబ్ధమృదంగవాద్యయు (నారంభింప(బడిన మృదంగ వాద్యములవంటి వాద్యములు అన(గా(దరంగధ్వనులుగల - ఆరంభింప(బడిన మృదంగవాద్యములుగల) నగు నుద్యానసరోజలమునందువలెనే నాట్యగృహమున(గ్రీడించుచున్నారు.

ఇట 'ఇవ' శబ్దముపమాశ్లేషల ననుగ్రహించుచుండుటచే నేకవాచకానుప్రవేశ సంకరమనరాదు శబ్దసామ్యమున్న మాత్రమున శ్లేషయనరాదు. 'సత్పుష్కర' అను విశేషణమున్నను శ్లేషభిత్తికాఽభేదాధ్యవసాయరూపమగు నతిశయోక్తిచే లభ్యమైన ధర్మసామ్యమే 'ఇవ' శబ్దముచే(జెప్ప(బడుచున్నది. అంతేకాని 'ఇవ' శబ్దమువే శబ్దసామ్యము చెప్ప(బడుటలేదు ఒకవేళ ధర్మసామ్యము

గాదు; శబ్దసామ్యమే యున్నదన్నను గవిసమ్మతమైన శబ్దసామ్యమున్నను, అర్థసామ్యమున్నను నుపమాలంకారమే ఎట్లన,

"యథా ప్రహ్లాదనాచ్చంద్రః ప్రతాపాత్తపనో యథా
తథైవ సోఽభూ దన్వర్థో రాజా ప్రకృతిరంజనాత్"

ప్రహ్లాదమును గూర్చుటచేఁ జంద్రుఁడు ప్రతాపమును గూర్చుటచేఁ దపనుఁడు. అట్లే ప్రకృతిరంజనముచే రాజపదము సార్థకము.

ఇట నన్వర్థనామరూప శబ్దసామ్యము దప్ప నర్థసామ్యము చెప్పఁబడలేదు. కాన శబ్దసామ్యమున్నను నుపమాలంకారమే యగును కావున నీ లక్ష్యమున నేకవాచకానుప్రవేశ సంకరము లేదు. ఇందుపమాలంకారమే కలదు.

ఇదేవిధమున "విశ్వామిత్ర" పద్యమునను "వసిష్ఠుసీఁడు" అనుచో 'సీఁడు, శబ్దము 'విశ్వామిత్ర' అనుచోట శ్లేషభిత్తికా (విశ్వ+అమిత్ర ఏవ విశ్వామిత్ర) ఉభేదాధ్యవసాయరూపమగు నతిశయోక్తిచే లభ్యమైన ధర్మసామ్యమునే (విశ్వామిత్ర మదాసహశాశ్వత సౌభాగ్యత్వము, సతతోన్నతత్వము) చెప్పుచున్నది. శబ్దసామ్యమే యున్నదన్నను "సకలకలంపుర మేతజ్జాతం సుధాంశ బింబ మివ" అను నెడల నుపమాలంకారమే స్వీకృతమైన ట్లిటఁగూడ నుపమాలంకారమే.

ఇఁక నేకవాచకానుప్రవేశ సంకరోదాహరణ మేమని ప్రశ్న మిగిలినది. అప్పయ్యదీక్షితులవారిట్లు దెలిపిరి "ఎచ్చట నొకే యర్థమున నలంకారద్వయము సంభవించునో యది యేకవాచకానుప్రవేశ సంకరము. ఎట్లన.

విధుకరపరిరంభాదాత్త నిష్యందపూర్ణైః
శశిదృషదుపక్లప్తైరాలవాలైస్తరూణాం
విఫలితజలసేకప్రక్రియాగౌరవేణ
వ్యరచి స హృతచిత్తస్తత్ర భైమీవనేన

దమయంతీదేవి వనమునఁ జంద్రకిరణస్పర్శచేఁ జంద్రకాంతశిలారచితము లయిన యాలవాలములందుఁ గరఁగి నిండిన జలపూరములచే వృక్షసేచనము విఫలమగుచున్నది. దానినిఁ జూచి నలుఁడు హృష్టుడయ్యెను.

ఇట సమృద్ధమగు వస్తువర్ణనముంటచే నుదాత్తాలంకారమును, సంబంధము లేకున్నను సంబంధమున్నట్లు చెప్పుటచే నతిశయోక్త్యలంకారమును నీ రెండును నొకేయర్థమునఁ బ్రవిష్టములై యున్నవి. అయితే యెల్లయెడలను నుదాత్తాలంకారమున నసంబంధసంబంధరూపాతిశయోక్తి మిశ్రితమై యున్న ట్లెంచరాదు. దివ్యలోకగతసమృద్ధివర్ణనమున నతిశయోక్తి స్పర్శలేని యుదాత్తాలంకారమును, శౌర్యము, ఔదార్యము, దారిద్ర్యము, మొదలగు వానిని వర్ణించు నెడల నుదాత్తస్పర్శలేని యతిశయోక్తియును పరస్పరవివిక్తముగా

మందవచ్చును. పై శ్లోకమున నర్థద్వయమున రెంటికిని సమావేశము సంభవించును. ఇట నొకటి యంగముగాని మఱొకటి యంగిగాని కానేరదు ఏలన నొకదానిచే నొకటి యుత్థాపితము కావుటలేదు. ఒకటి స్వతంత్రమును మఱొకటి పరతంత్రమును గాదు. రెండును స్వతంత్రములే.

ఏకవాచకానుప్రవేశసంకరము శబ్దార్థాలంకారోభయమునకు మాత్రమే యుండుననియు నర్థాలంకారముల కుండదనియుఁ బ్రకాశకారుఁడు చెప్పెను. కాని యప్పయదీక్షితులవా రర్థాలంకారములకును నుండునని పైవిధమునఁదెలిపిరి.

౩. సందేహసంకరము

కం. పాకారితురగ, రాకా
కోకారి, కళానుకారికోమలరుచియై
యేకాలము రంజిల్లును
నీ కీర్తిమరాళి యోబనృపునరసింహా! ౨౪౦

కీర్తిమరాళి పాకారితురగమును (ఉచ్చైశ్శ్రవము) రాకాకోకారి (చంద్రుఁడు) కళలను ననుకరించు కోమలకాంతి గలదై రంజిల్లును.

కం. ఇలఁ గీర్తిహంసి యనుచో
సలలితగతి హంసివంటి సత్కీర్తియొ, కా
కిలఁ గీర్తియనెడు హంసియొ?
తెలియ దుపమ, రూపకంబు తేటగ నిచటన్. ౨౪౧

పై పద్యమునఁ 'గీర్తిమరాళి' అని కలదు. 'కీర్తియను మరాళి' అని రూపకమా? 'మరాళివంటి కీర్తి' అను నుపమితసమాసముచే నుపమాలంకారమా?

ఇట దేనిని సాధించుటకును దగిన ప్రమాణములు లేమి సందేహము. కాన సందేహసంకరము ఈ విధముగా సందేహము గలిగినపు డొక యలంకారమును సాధించుటకుఁ గానీ బాధించుటకుఁ గానీ ప్రమాణములు లభించినచో సందేహసంకరము గాదు ఎట్లన

('వక్త్రేందౌ తవ సత్యయం యదపరశ్శీతాంశురుజ్జృంభతే')

"నీ వక్త్రేందువుండఁగా నీ యపరచంద్రుఁ డుదయించుచున్నాఁడనుట యేది గలదో"

ఇట "వక్త్రేందుః" అనుచో 'వక్త్రమేవ ఇందుః' అని రూపకమా? 'వక్త్రమిందు రివ' అని యుపమయా? అని సందేహము కలుగఁగా 'అపర' పదము రూపకమేయనిసాధించుచున్నది. ఎట్లన, రూపకమున నుత్తరపదార్థమగు 'ఇందు' శబ్దమునకుఁ బ్రాధాన్యము వచ్చును ఉపమానమునఁ బూర్వపదార్థమగు వక్త్రమునకుఁ బ్రాధాన్యము వచ్చును. 'వక్త్రేందు' అనుచో రూపకమును

జెప్పుకొన్న యెడలనే 'అపరశ్రీతాంశుః' అనుచోనున్న 'అపర' శబ్దము సరిపోవును. వక్త్రేందువుండగా నపరేందుఎల? (వక్త్రచంద్రుఁడుండగా నపర చంద్రుఁడేల?) అని యర్థమువచ్చును. కావున 'అపర' శబ్దము రూపకసాధకము.

రాజనారాయణం లక్ష్మీస్త్వామాలింగతి నిర్భరం'

రాజనారాయణుఁడవగు నిన్ను లక్ష్మి లెస్సగాఁ గౌఁగిలించుకొన్నది

ఇట 'రాజనారాయణ' అనుచో వెనుకవలె 'రాజా ఏవ నారాయణః' అని రూపకమును 'రాజా నారాయణ ఇవ' అని యుపమయును జెప్పకొనవచ్చును. కాని యిట నుపమాలంకారమును జెప్పుకొనుటకు బాధయున్నది. ఏమన, 'రాజా నారాయణ ఇవ' అను నుపమాలంకారమునఁ బూర్వపదమగు రాజశబ్దమునకుఁ బ్రాధాన్యము వచ్చును. వచ్చునేని 'లక్ష్మి నారాయణుని వంటి రాజు నాలింగనముఁ జేసికొనుచున్నది' అను నర్థమువచ్చును. లక్ష్మి నారాయణుని నాలింగనముఁ జేసికొనునుగాని నారాయణునివంటి రాజును నాలింగనము సేసికొనదు. కాన రూపకమే చెప్పుకొనవలెను. కావున లక్ష్మ్యాలింగన ముపమకు బాధకము. ఉపమాబాధకమగుచో రూపకసాధక మనఁగూడదా? అని ప్రశ్నింపవచ్చును. లక్ష్మ్యాలింగనముపమాబాధక మయినట్లు రూపకసాధకము గాదు. ఉపమాబాధకముగానే విచ్ఛిత్తి విశేషముండును. కాన సాధకబాధకప్రమాణములలో దేనిచే విచ్ఛిత్తి కలుగునో దానినే యటఁ బ్రధానముగా గ్రహింపవలెను.

కం. ఈ రీతిం గొన్ని యలం
కారము లేర్పఱచినాఁడఁ గడమఁదడవ; నే
నేరక వర్ణించుటగా;
దారయ విస్తారభీతి నాపాదింపన్. ౨౪౨

విస్తారభీతి = గ్రంథవిస్తరభీతిచే; ఆపాదింపను = దెలుపను.

'విస్తరభీతి అని యుండవలెను. ఈ విషయమును వెనుక నొకచోఁ దెలిపితిమి. ఈ మూడువిధములగు సంకరములనేకాక యప్పయ్య దీక్షితుల వారు కువలయానందమున సమప్రాధాన్యసంకరము, సంకరసంకరము' అని మరి రెండు సంకరములను దెలిపిరి. వానినిఁగూడ నిట నుదాహరింతుము.

సమప్రాధాన్య సంకరము

గీ. అంగుళులచేతఁ గచసమూహంబు నట్లు
కిరణములచేతఁ దిమిరంబుఁ గెదకుఁద్రోఁచి
ముదుగఁ దామరకన్నులు మోహకలనఁ
జందురుఁడు ముద్దులాడు నిశాముఖంబు

'అంగుళులచేఁ గచసమూహంబు నట్లు' అను వాక్యోక్తమగు నుపమయు 'మోహకలన' అను సాధకప్రమాణముచే లభించిన 'తామరకన్నులు' అను

చోటి యుపమయును, 'ఇందురుఁడు నిశాముఖంబును ముద్దులాఁడు, (ముద్దులాడు చున్నట్లున్నాఁడు) అను గమ్యోత్ప్రేక్షను లేవఁదీయుచున్నవి ఇట సంభావనా ప్రతిపాదకపదము లేమి గమ్యోత్ప్రేక్ష. ఉపమలు రెండును నంగభూతములు ; ఉత్ప్రేక్షయంగి చంద్రకర్తృకనిశాముఖచుంబనోత్ప్రేక్షయు నిశాచంద్రులకు దాంపత్యవ్యవహారసమారోపరూపమగు సమాసోక్తిగర్భముగానే యుత్థితమగు చున్నది. ఇట రెండుపమాలంకారములును నుత్ప్రేక్షాసమాసోక్తులను సమకాలము ననే లేవఁదీయుచున్నవి. కానఁ బౌర్వాపర్యమును జూపుటలేదు కావున నిట నుత్ప్రేక్షా సమాసోక్తులకు సమప్రాధాన్యసంకరము.

సంకరసంకరము

ముక్తాః కేళివిసూత్రహారగళితాః సమ్మార్జనీభిర్హృతాః
ప్రాతః ప్రాంగణసీమ్ని మంథరచలద్బాలాంఘ్రిలాక్షారుణాః
దూరాద్దాడిమబీజశంకితధియః కర్షంతి కేళీశుకాః
యద్విద్వద్భవనేషు భోజనృపతేస్తత్త్యాగలీలాయితం.

భోజమహారాజుయొక్క త్యాగలీల పండితభవనములం దిట్లున్నది. రతిక్రీడలందుఁ దెగిన హారములనుండి జారిపడిన ముత్యాలను (దాసీజనము) ప్రాతఃకాలమున శృంగారకట్టలచే వెలుపలకుఁ జిమ్మఁగా నవి బాలికల త్రొక్కుటచే వారి పారాణిచే నెఱ్ఱబాఱినవి కేళీశుకములు వానిని దూరఁగాంచి దానిమ్మ పండ్లవిత్తులని భ్రమపడి ముక్కులతోఁ బొడుచుచున్నవి.

ఇట విద్వాంసుల యొక్క సమృద్ధివర్ణనము గాన నుదాత్తాలంకారము. ముత్యములు 'బాలాంఘ్రిలాక్షారుణములయినవి' అనుచో ముత్యములు స్వగుణ త్యాగము చేయుటచేఁ దద్గుణాలంకారము ఇందే దాడిమబీజభ్రాంతినిఁ గలిగించుటచే కావ్యలింగాలంకారమును గలదు మొదటి యుదాత్తాలంకారమే యీ తద్గుణ కావ్యలింగములకు మూలము.

'ముత్యములు బాలాంఘ్రిలాక్షారుణములు' అనునొకే యర్థమునఁ దద్గుణ కావ్యలింగములుండుటచే నీ రెంటికిని నేకవాచకానుప్రవేశసంకరము.

చిమ్మటఁ గేళీశుకములు దానిమ్మపండ్లవిత్తులని భ్రమయుటచే నట భ్రాంతిమదలంకారము. దీనికిఁ బైనున్న యేకవాచకానుప్రవేశసంకరమే కారణము. ఈ యేకవాచకానుప్రవేశ, భ్రాంతిమదలంకారముచే నుదాత్తాలంకారము సౌందర్యాతిశయమును వహించుచున్నది

కాన నేకవాచకానుప్రవేశసంకర భ్రాంతిమదలంకారములకు రెంటికిని నుదాత్తాలంకారమంగము (అను గ్రాహకము) గాన వీని కంగాంగిభావసంకరము.

మఱియు హేతుమంతమగు విద్వద్గృహవైభవమును హేతుభూతమగు రాజవితరణమును నభిన్నముగాఁ జెప్పుటచే (హేతుహేతుమతోరైక్యం హేతుం కేచిత్ప్రచక్షతే) హేత్వలంకారము, ఆ హేత్వలంకారము రాజవితరణముయొక్క

నిరతిశయోత్కర్షమును దెలుపుటలోఁ బర్యవసించును కవిసంరంభము (ఉద్దేశము) ఇంతమాత్రమే యగుచోఁ బూర్వోక్తమైన యుదాత్తాలంకారభూషితమైన హేత్వలంకారమని సిద్ధించును అట్లుగాక "భోజరాజపండితుల సంపద యెట్టిది ?" అను ప్రశ్నకీ పద్య ముత్తరముగా గ్రహించినచో నిరతి యైశ్వర్యరూపమగు ప్రస్తుతకార్యమున వారి సంపదను బ్రశంసించినట్లు కవి యుద్దేశించినయెడఁ గార్యనిబంధనాప్రస్తుతప్రశంసాలంకార మగును. కార్యముగూడ వర్ణనీయము గానే యనఁగాఁ బ్రస్తుతముగానే తలఁచినచోఁ బ్రస్తుతాంకురాలంకారమగును ఈ యప్రస్తుత ప్రశంసా, ప్రస్తుతాంకురములలో విశేషించి యొకదాని నిట నిరూపించుటకు సాధకబాధకములు లేమి సందేహ సంకరము. మరియు విద్వద్గృహ వైభవ వర్ణనమసంబంధరూపమగుటచే నతిశయోక్తియునగును. ఇది యుదాత్తముతోఁ గూడి యేకవాచకాను ప్రవేశసంకరమగును.

ఇంతేకాక నిరతిశయవితరణోత్కర్షమునఁ బర్యవసించు హేత్వలంకారమును, అత్యద్భుతమగు నతథ్యమైన యౌదార్యమును వర్ణించుటయే లక్షణముగాఁగల అత్యుక్త్యలంకారమును, (అత్యుక్తి రద్భుతాతథ్యశౌర్యౌదార్యాదివర్ణనం) ఒకే యర్థమున సమావిష్టములగుటచే నీ రెంటికిని నేకవాచకాను ప్రవేశసంకరము.

ఈ సంకరము గారణముఁగాగల యప్రస్తుతప్రశంసకుఁ గానీ ప్రస్తుతాంకురమునకుఁ గానీ రాజసంపత్సమృద్ధివర్ణనాత్మకమగు నుదాత్తాలంకారముతో నేకవాచకానుప్రవేశసంకరము

ఇట విద్వద్గేహసంపదచే రాజవితరణమును దానిచే రాజసంపత్సమృద్ధియు వ్యంగ్యమగుచున్నది. కాన నిట నుదాత్తాలంకారము వ్యంగ్యముగాని వాచ్యాలంకారము గాదుగదా! అట్లేని వాచ్యాలంకారములగు నప్రస్తుతప్రశంసతోఁ గానీ ప్రస్తుతాంకురముతోఁ గానీ వాచ్యాలంకారముగాని యుదాత్తాలంకారమున కేకవాచకానుప్రవేశసంకర మెట్లని ప్రశ్న వచ్చుచున్నది. అపుడు 'ఏకవాచకానుప్రవేశసంకర' పదములోని వాచకమనఁ బ్రతిపాదకము (తెలుపునది) అని యర్థముఁ జెప్పుకొనవలెను. అపుడు వాచకమన వ్యంజకమనియు నర్థమువచ్చును కాన నొకటి వాచ్యాలంకారమైనను మరొకటి వ్యంగ్యాలంకారమైనను వానికి సంకరము సంభవించును.

ఈ మూఁడు 'ఏకవాచకానుప్రవేశ సంకరములును' సమములే యగుటచే సమప్రాధాన్యసంకరము. ఇది సంకరాలంకారముల సంకరము.

సంసృష్టి అంగాంగిభావ సంకర, ఏకవాచకానుప్రవేశ సంకర, సందేహ సంకర, సమప్రాధాన్య సంకరములకు నరసింహసంకరమని నామము. నర + సింహమూర్తి విగ్రహమున నరత్వ సింహత్వములకు సమావేశమున్న విధమున భిన్నాలంకారముల కేకత్ర సమావేశముంటచే 'నరసింహ సంకరము' అని పేరు పెట్టిరి సంకరసంకరము నరసింహసంకరముగాదు.

జగన్నాథ పండితుఁడు రసగంగాధరమున మూఁడు క్రొత్త యలంకారము లిచ్చెను వానినిఁ గూడా యిటఁజూపుదుము.

అసమము - సర్వధా ఉపమానముగా నిషేధించినచో నది యసమము

సత్యభాషణమున హరిశ్చంద్రునిఁబోలిన వాడు లేడు; భూతదయయందు బుద్ధునిఁ బోలినవాఁడు లేఁడు.

ఇక్కడఁ బోలినవాడుఁ లేడు అనియుపమానము నిషేధింపఁబడినది.

ఉదాహరణము - ఇది యర్థాంతరన్యాసాలంకారమును బోలియుండును. అర్థాంతరన్యాసమునవలె సామాన్యమును సమర్థించుటకు విశేషముఁడును. ఆ విశేషమును జూపుచు ఇందుకు నిదర్శనము లేక దృష్టాంతము అను పదములుపయోగింపఁబడును. అర్థాంతరన్యాసమున ఆపదములుండవు.

గుణవంతుఁడు ఆపదలోనున్నను లోకమునకుపకారమే చేయును. మూర్ఛచెందినదియుఁ జచ్చినదియునగు పాదరసమే దీనికి నిదర్శనము.

తిరస్కారము - గుణము గల వస్తువునుగూడా దోషభయముచేఁ దిరస్కరించుట

"శ్రీహరి పాదసేవకు దూరస్థుఁడనగుదునను భయముచే రాజ్యమునొల్లను"

ఇట రాజ్యపాలనము గుణమే శ్రీహరిపాదసేవాదూరుఁడగుట దోషము దానిచే రాజ్యపాలన దిరస్కరింపఁబడినది.

(అలంకార విమర్శ)

భరతుఁడు నాట్యశాస్త్రమున యమకమను నొకశబ్దాలంకారమును ఉపమా, దీపక, రూపకములను మూఁడర్థాలంకారములనే పేర్కొనెను. దండి ముప్పదినాలుగును, మమ్మటుఁ డేఁబదితొమ్మిదియు విద్యానాథుఁ డఱువదాఱును, చంద్రాలోకకర్త నూటొకటియు అప్పయదీక్షితులవారు కువలయానందమున నూటిరువదినాలుగును దెలిపిరి. ఇట్టుమూర్తి విద్యానాథు ననుసరించి యఱువదాఱింటినే యుదాహరించెను.

ఆంగ్లమున Simile (ఉపమా) Metaphor (రూపకము) Hyperbole (అతిశయోక్తి) Vision (భావికము) Irony (వ్యాజస్తుతి) Allegory (అప్రస్తుతప్రశంస) Personfication Epithet, Synecdoche, Metonomy, Euphemism, Paradox, (విరోధాలంకారము) Paramanisia (శ్లేష) Climax (సారము) అను నలంకారములు మాత్రము గలవు ఇందలి కొన్నింటిని వారలంకారములుగా గ్రహింపరు. లక్షణగా గ్రహింతురు.

ఈ శబ్ద, అర్థ, అలంకారములలో నర్థాలంకారములకే ప్రాముఖ్యమిచ్చిరి.

అగ్నిపురాణము :

"అలంకరణమర్థానా మర్థాలంకార ఇష్యతే ।
తం వినా శబ్దసౌందర్య మపి నాస్తి మనోహరం ।
అర్థాలంకారరహితా విధవేవ సరస్వతీ."

అర్థాలంకారములేని శబ్దసౌందర్యము మనోహరముగాదు అర్థాలంకారములు లేని సరస్వతి (కావ్యము) విధవవంటిది. అని యర్థాలంకార విశిష్టతను దెలిపెను

అలంకారమన నేమి? వామనుఁడు "సౌందర్యమలంకారః" అలంకారమన సౌందర్యము , అని నిర్వచించి వేనివలన నా సౌందర్యము కావ్యమునఁ గలుగునో యవియు నలంకారములే యని నుడివెను దండి

"కావ్యశోభాకరాన్ ధర్మానలంకారాన్ ప్రచక్షతే"

కావ్యశోభాకరములగు ధర్మములను నలంకారములని చెప్పుదురు అని వచించెను. భామహుఁ డలంకారము లన్నింటని వక్రోక్తు లనెను. వక్రముగా ననఁగా వికటముగా స్వభావవిరుద్ధముగాఁ జెప్పిన యుక్తి కావున స్వభావోక్తి నాతఁ డంగీకరింపలేదు.

ఈ యలంకారములలో నుపమాలంకారము సర్వాలంకారబీజభూతమని వామనమతము. కావుననే యాతఁ డుపమాగర్భములగు నలంకారములనే యుదాహరించెను "ఉపమా కాళిదాసస్య" అని మహాకవి కాళిదాసే యుపమాలంకారమును బరాకాష్ఠ నొందించెను. మమ్మటుఁ డతిశయోక్తియే సర్వాలంకారబీజమని యీ క్రింది విధమున వచించెను

ఏషా సర్వైవ వక్రోక్తి రనయార్థో విభావ్యతే
యత్నోఽస్యాం కవినా కార్యః కోఽలంకారోఽనయా వినా

ఇట వక్రోక్తియన సుందరమైనయుక్తి. ఆ సౌందర్య మతిశయముచే లభించును. కాన వక్రోక్తియన నతిశయోక్తి దీనిచే నర్థము విశేషముగా భావింపఁబడును. అస్వాద్యమగును. కావునఁ గవి దీని విషయమున యత్నము సేయవలెను. ఇది లేని యలంకారమే మున్నది?

కాని వామనుని పిమ్మట వచ్చిన సర్వాలంకారికులును వామనమతమునే స్వీకరించి తమ గ్రంథములలో నలంకారప్రకరణమునఁ బ్రథమమున నుపమాలంకారమునే వివరించిరి. మఱియు దండి చూపినన్ని యుపమాభేదముల నెవరును చూపలేదు. అప్పయ్యదీక్షితులవారు

"ఉపమైకా శైలూషీ సంప్రాప్తా చిత్రభూమికాభేదాన్
రంజయతి కావ్యరంగే నృత్యంతీ తద్విదాం చేతః"

అని తెలిపిరి. (దీని వివరణము వెనుక నుపమాలంకార ప్రకరణమునఁ జేయఁబడినది.) ఎల్లయలంకారములను శ్లేషస్పర్శచే సౌందర్యాతిశయమును వహించునని యను గొందఱు పలికిరి "శ్లేషః పుష్ణాతి సౌభాగ్యం ప్రాయోవక్రోక్తిమస్థితం"

ఈ యలంకారములన్నియుఁ గావ్యజీవితమగు త్రివిధమగు ధ్వన్యుపస్కారకములుగానే నిబద్ధము గావలయును. అట్లు గానిచో నవి కేవలముగా నర్థచిత్రములే యగును. అలంకారశబ్ద మయ్యెడ సార్థకముగాదు ఎట్లన,

స చ్ఛిన్నమూలః క్షతజేన రేణు స్తస్యోపరిష్టా త్పవనావధూతః
అంగారశేషస్య హుతాశనస్య పూర్వోత్థితో ధూమ ఇవాబభాసే.

రక్తపాతముచే ఛిన్నమూలముగలదై, వాయుధూతమై యాకాశమున నిగిడినరేణువు ఇంగలముమాత్రమే మిగిలిన యగ్నియొక్క (ఆలుటకు) ముందు లేచిన ధూమమువలె భాసిలెను కాలుచున్న కట్టెపై నీరుపడఁగా నింగలము మిగులును. పొగ పైకిఁబోవును. అట్లే రక్తపాతముచే నేలతడియఁగా రేణువు పై కెగసిపోయెను ఇచ్చటి యుపమాలంకారము ధ్వన్యుపస్కారము గాక కేవలౌపమ్యమాత్రపరముగా నున్నది. ఇందర్థవైచిత్రియేకాని యాస్వాద్యత లేదు కాన నలంకారము లిట్లుగాక త్రివిధమగుధ్వని పర్యవసాయములుగా నుండవలెను. ఎట్లన, "ఓ సుందరీ ! నీ ముఖము చంద్రునివలె నున్నది" అనుచోట నున్న యుపమాలంకారము వక్తయొక్క రతిని (శృంగారరసమును) బోషించుచున్నది. అర్థశక్తిమూలవ్యంగ్యములలో నుపమాద్యలంకారములచే వస్తువ్యంగ్యములను, అలంకారవ్యంగ్యములను మున్నుదాహరించి యుంటిమి. ఈ విధముగా నీ యలంకారములు కేవలార్థవైచిత్ర్యమాత్రపరములు గాక త్రివిధములగు ధ్వనులకును నుపస్కారములై యుండవలెను.

సాధారణముగా నర్థాలంకారము లన్నియును త్రివిధధ్వని పర్యవసాయులగానే యుండును. సమాసోక్తి, అప్రస్తుతప్రశంస, దీపకము, పర్యాయోక్తము, ఉత్తరాలంకారము, పరికరము, అర్థాంతరన్యాసము మొదలగునవి ధ్వనిపర్యవసాయులే. ఇందు సమాసోక్త్యాదులు గుణీభూతవ్యంగ్యములుగా నుదాహరింపఁబడినవి ఏవోకొన్ని మాత్రము 'స ఛిన్నమూలః' అనుశ్లోకము నందువలె ధ్వన్యుపస్కారములుకావు. కావునఁ గవులు వానిని ధ్వని పర్యవసాయులుగానే చేయుటకు యత్నింపవలెను.

ఈ యలంకారములలో నుపమాదులగు కొన్ని యలంకారము లప్రత్యక్షముగాన ననుభూతముగాకున్న వస్తువును ప్రత్యక్షముసేసి యనుభవమునకుఁ దెచ్చును ఎట్లన, 'ముఖము చంద్రునివలె నున్నది' అను నుపమ పరోక్షముగా నున్న ముఖమునందు మనకుఁ బ్రత్యక్షముగాని సౌందర్యమును బ్రత్యక్షము సేయుచున్నది. ఈ యభియుక్తినిఁ గనుఁడు

అతథార్థా నపి తథాసంస్థితానివ హృదయే యా నాతయతి
అర్థవిశేషే సా జయతి వికటకవిగోచరా వాణీ.

'అట్లు కాని వానిని నట్టివానివలె హృదయమునకు సూచించునట్టి కవివాణి జయించును.' కవి యా యలంకారములచేతనే కదా యీ విధముగా సూచించును.

భాషతోఁగూడ నలంకారములు పుట్టినని, మనుష్యులాబాలవృద్ధముగా నలంకారయుక్తముగా భాషింతురు. "ఆ దంపతులు చిలుకా గోరింకలలాగా ఉన్నారు" "భాగ్యం ఉంటే బంగారం తింటారా ?" 'ఆ యిల్లు సీత లేని

పద్యశాల '' పిల్లవాఁడు దూసినట్లయినాఁడు.'' 'వాఁడు తాడిచెట్టు' అని యీ విధముగాఁ బ్రతిమాటలోను నలంకారము లే. అందును నావేశమువచ్చినచో విశేషించియు నవి వెలువడును. అలంకారమన నేమో తెలియకయే యాబాల గోపాలమును నలంకారయుక్తముగా సంభాషింతురు. అలంకారయుక్తమగు భాష జీవద్భాష, శౌర్యాదులవలె గుణము లాత్మభూత రసధర్మములు, అలంకారములు హారాదులవంటివగుటచే గుణములవలె సాక్షాద్రసోపస్కారకములు గాక పరంపరారసోపస్కారకము లగును

వామనుఁడు 'కావ్యశోభాయాః కర్తారో గుణాః తదతిశయహేతవ స్త్వలంకారాః పూర్వే నిత్యాః' (కావ్యశోభను గూర్చునవి గుణములు, తదతిశయ హేతువులలంకారములు. ఇందు మొదటివి (గుణములు) నిత్యములు అని చెప్పెను గుణములు నిత్యమనుటచే నలంకారము లనిత్యములు, అని చెప్పినట్లయినది మఱియు "యువతేరివ రూపమంగ కావ్యం" "యది భవతి వచశ్చ్యుతం గుణేభ్యః" (చూ గుణప్రకరణారంభము) అనువానిచే గుణములు ప్రధానములనియు ననఁగా సాక్షాద్రసోపస్కారములనియు నలంకారములప్రధానములనియు ననఁగా బరంపరారసోపస్కారములనియును దెలిపెను.

శా. మక్కామండపపండువాళయద దోర్మాహాత్మ్య! ధాటీమహా
తుక్కారప్రతిరుద్ధ భూభువన! హిందూరాజ్యసంస్థాపనా.
ప్రాక్ప్రద్యోతకులోత్థిత ధ్వజపటప్రాయప్రసర్పద్యశ
స్స్రక్ఛ్రీవీకృత శర్వకంకణ! సమస్యాజాలకోలాహలా! ౨౪౩

కం. సాహిత్యభోజ! భూజన
సౌహిత్యనిదాన! దాన సంతాన! మహో
బాహావదానవాహా
రోహణరేవంత! లలితరూప జయంతా! ౨౪౪

వర్గపంచకరహితసుగంధివృత్తము

హారహీరసారసారిహారశైలవాసవా
శ్వీరుహా,హిహార, శేషవేషహాసలాలస
శ్రీరసోరుయాశసాంశుశీల! వైరి వీరసం
హార! సారశౌర్య సూర్య! హార్యవార్యసాహసా! ౨౪౫

గద్యము

ఇది శ్రీహనుమత్ప్రసాదలబ్ధ.........కావ్యాలంకారసంగ్రహం బను ప్రబంధంబునం దర్థాలంకారవిభాగంబును సంకరసంసృష్టినిర్ణయంబు నన్నది సర్వంబును బంచమాశ్వాసము

సంపూర్ణము

37467